
కవులు
ఆచార్యులు-రచనలు,జీవిత చరిత్ర
కందుకూరి వీరేశలింగ కవి కృత గ్రంథములు-4


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020010005651

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్థం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

కందుకూరి వీరేశలింగకృత గ్రంథములు.

నాలుగవ సంపుటము

(వచన ప్రబంధములు : పద్యకావ్యములు)

ప్రకాశకులు:

హితకారిణీసమాజము,

రాజమండ్రి.

వెల రు. 6-0-0.

ఈ సంపుటంలో ఉన్న పదెనిమిది పద్యమూర్తుల్లోనూ, నాలుగు పెద్దకావ్యాలు, ఒకటి ప్రబంధానుకరణం, మూడు ఆంగ్లకావ్యానువాదాలు, అయిదు హేళనలు, రెండు మతప్రమేయాలు, రెండు మహావ్యక్తి ప్రశంసలు, ఒకటి నీతిబోధ. పెద్ద కావ్యాలు నాలుగింటిలో మొదటిది 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్యనిర్వచననైషధము.' ఇది మూడు ఆశ్వాసాలు. పెదవీ పెదవీ తగలకుండా (అనగా—ప, ఫ, బ, భ, మ అనే అక్షరాలు వాడకుండా), ఎక్కడా గద్యం రానియ్యకుండా, సంస్కృతపదం దొర్లనియ్యకుండా అందరూ ఎరుగున్న నలచరిత్ర లలితంగా సుగమంగా ధారాళంగా ఇందులో చెప్పబడింది. దమయంతి అనే మాటలో 'మ' ఉంది గనక, ఋతుపర్ణుడులో 'ప' ఉంది గనక ఆ శబ్దాలు లేకుండా నలకథ నడిచిపోవడం చూచి తగ్గదే కదా! రెండో కావ్యం 'రసికజనమనోరంజనము' ఇది నాలుగాశ్వాసములు. ఇది మూడుమూర్తులా ప్రబంధము—'ప్రబంధరత్నము' ఆదికాలంనించీ ఆంధ్రంలో ఉండే మహాప్రబంధాల మేలుజాడల మేళగింపు ఇందులో స్ఫురిస్తుంది. దీనికుండే మరో విశిష్టత ఏమంటే, ఇది కేవలం అచ్చతెలుగేగాని, సంస్కృతభాషా పటాటోపం కాదు. సంపర్కంగాని స్పర్శగాని ఇందులో మాదం. మూడోది 'శుద్ధాంధ్ర భారత సంగ్రహము' అచ్చతెనుగులో మంచిసీసప్రాయంగా పద్యరూపంలో ప్రసంగం వడిచి మహాభారతకథ పూర్తిగా మూడాశ్వాసాలలో ముగియడమేకాదు, ఆంధ్రమహాభారతంలోలాగే అపరూపఛందస్సులూ చివరకి మధ్యాక్కరా కూడా ఇందులో పనిచేశాయి. నాలుగోది 'శుద్ధాంధ్రోత్తరరామాయణము' ఇది ఒకే ఆశ్వాసము, అదేనా అసంపూర్ణం.

మొత్తంమీద నూట పదిహేడు గద్యపద్యాలు గల ఏకాశ్వాసప్రబంధము, 'అభాగ్యోపాఖ్యానము' ఇది సంస్కృతసమాసభూయిష్ఠమై, పదప్రయోగంలోనూ వృత్తగమనంలోనూ పూర్వప్రబంధస్మారకమై, ఆంధ్రప్రబంధసామాన్యమైనా అది కేవలం విడ్డోరుగా ఉండే ఉపమానాలతో కూడినదై తద్వారా హాస్యప్రధానమై ఒప్పే పద్యరచన.

'పథికవిలాసము' గోల్డ్‌స్మిత్ అనే ఆంగ్లకవియొక్క ట్రావెలర్ అనే కావ్యానికి అనువాదం. యూరప్‌లోని వేర్వేరు ప్రాంతాల స్థితిగతులు అందులో వర్ణింపబడ్డాయి. అనువాదం ఎంతో ప్రౌఢంగా ఉన్నది 'జాన్‌గిల్పిన్' కౌపర్ అనే ఆంగ్లకవి కావ్యానికి పరివర్తనం. ఇది హాస్యప్రధానం. దీనిలో శైలి సుగమం. 'కామెడీ ఆఫ్ ఎర్రర్సు' అనేది షేక్స్పియర్ నాటకానికి ద్విపదరూపంలో అను

సరణం, ఇది రెండో అంక ప్రారంభం ఆగిపోయింది. ఆంగ్లవచనానికి మిక్కిలి చేరువైన బ్లాన్క్‌వర్సులో ఆనాటకం పుట్టి ఉండడంవల్ల, తెలుగు వచనానికి మిక్కిలి చేరువుగా ఉండే ద్విపదలోకి దాన్ని దింపడం కర్తవ్యం అని కర్త ఊహించి ఉండవచ్చును. ఈనాటకమూ, మర్చెంట్ ఆఫ్ వెనీస్ అనే నాటకమూ, విక్టోరియారాణి చరిత్రా—ఇవి కర్తకు చాలా ఇష్టం. ఈవిషయాల్ని ఆయన రెండు మూడు విధాల రూపించడమే అందుకు నిదర్శనం.

తక్కిన పద్యరచనలలో అయిదు పేళనలు. 'సరస్వతీ నారద విలాపము' లో కవులంతా తనకి అలంకారాలు చేయించాం అంటూ మొదలెట్టి తనని సకలహింసా పెడుతున్నారని సరస్వతి అడివిలోకివెళ్ళి అరణ్యరోదనం చేస్తూంటే నారదుడు గానం అంతా వేశ్యల పాలైందని విచారిస్తూ అక్కడికే వెళ్ళి దైవాద్వా ఆవిణ్ణి కలుసుగుని తనెంత దుఃఖంలో ఉన్నా ఆవిడ తనతల్లి గనక ఆవిణ్ణి ఎత్తుగుని అడివి దాటిస్తానంటాడు. 'శ్రీపునర్వివాహ సభానాటకము' లో వీరభద్రుడు గారు పెద్దల్ని సభకి రప్పించే నిమిత్తం స్నేహితుడితో ప్రసంగిస్తాడు. 'వీర' పదం పేరులో ఉన్న ఆపాత్ర, కర్తే: చివరకు ఇద్దరూ కలిసి ఒక కీర్తనలో ఈశ్వర ప్రార్థన చేస్తారు. 'శ్రీవిద్య' అనే పద్య సంపుటి ఏమిటంటే, శ్రీవిద్య కూడదనే వారు పద్యరూపంలో వాదనచెయ్యగా, గర్భసీసాలలోనూ బంధకందాలలోనూ వ్యవహరిస్తూ ప్రమాణంకూడా చూపించి శ్రీవిద్య శాస్త్రసమ్మతం అని 'గద్య తిక్కన' తక్షణం పంపిన సమాధానం: వితంతువివాహాలు జరిగిపోయి, సంఘంలో వితంతువులు దొరక్కుండా పోతే తమరికి చాలా విషయాల్లో తంతునడవక బాధ కలుగుతుంది గదా అని వాపోయేవాళ్ళ వేసబబులు 'కులాచారపూర్వనాగరిక పంచరత్నములు' అనే పద్యసంపుటిలో ఉన్నాయి. 'హితబోధ' అనేది పద్య త్రయం. విమర్శకి ఆగలేక, కాబులు ప్రయోగిస్తూ, చాలామందిచేత పొగిడించు కుంటే మాత్రం ఎవడేనా కవి కాగలడా? లక్షమంది పొగిడినా కునకం సింహం కాగలదా? అని దానిలో బోధ. వీరేశలింగ రచనల్లో ఒకే ఒక విమర్శ ఉండడం నించి ఇది ఎవర్ని ఉద్దేశించి పుట్టిందో తెలుస్తూనే ఉంది.

'చెన్నపురి బ్రహ్మోపాసనమందిర ప్రతిష్ఠాపనము' అనేది బ్రహ్మసమాజ మతస్థాపక పోషక సంస్కర్తల ప్రశంస. తమరి పత్రికని వర్ధిల్ల చెయ్యడానికి సర్వరక్షకుణ్ణి వేడుకుంటూ రచించుచున్న పద్యావళి 'దైవప్రార్థన' కర్తకి మిక్కిలి ఇష్టవిషయమైన 'విక్టోరియారాణి' గురించిన మెప్పు—'శ్రీవిక్టోరియాజూబిలీ నవ

రత్నములు.' అప్పట్లో హిందూదేశబంధువైన రిపన్‌ప్రభువు గురించిన పొగడ్త—'శ్రీ రిపన్‌ప్రభు స్వాగతము' అందులో కర్త రిపన్‌నీ ఆయన్ని పంపినవారినీకూడా కీర్తన చేశారు. దేవుడు-తనవారు-మంచి బాలుడు-విద్య-అడకువ-గర్వము-తృప్తి-ధైర్యము-సత్యము-జీవహింస-సర్వజనసమాదరము-పాటుపడుట-శరీరారోగ్యము-స్వతంత్రజీవనము-ధనము-ముఖస్తుతి-పనిబనుచుట-చౌర్యము - పరోపకారము—వివిధ ధర్మములు-అనే ఉపశీర్షికల క్రింద నూఱు గీతాలలో ప్రకాశిస్తూ బాల కంఠాల్లో మెరసిపోవాలని వీక్షిస్తూండే రచన 'నీతిదీపిక.'

రాజమండ్రి,
25-6-1950.

ఖమిడిపాటి కామేశ్వరరావు.

విషయసూచిక

కీర్తిశేషులు కందుకూరి వీరేశలింగం పంతులుగారు



కీ. శే. కందుకూరి వీరేశలింగం పంతులుగారు

శ్రీ

వి వే క చం ద్రి క

అను

రా జ శే ఖ ర చ రి త్ర ము

మొదటి ప్రకరణము.

ధవళగిరి - దేవాలయవర్ణనము - గోదావరియొడ్డున నున్న ధర్మశాల మీఁద ప్రాతఃకాలమున రాజశేఖరుఁడుగారు వచ్చి కూర్చుండుట - అప్పు డచ్చటికి వచ్చిన సిద్ధాంతి మొదలగువారి స్తుతివచనములు - అందఱును గలిసి రామపాదములయొద్దకు బైరాగిని చూడఁబోవుట.

శ్రీ నాసికాత్ర్యంబకమునకడ కడుదూరమున నెక్కడనో పశ్చిమమున నొక్కయున్నతగోత్రమున జననమొంది యూర్మికాకంకణాదుల మెఱుంగులు తుఱంగలింపఁ దనజననమునకు స్థానమైన భూభృద్వర పురోభాగముననే పల్లములంబడి జాఱుచు లేచుచుఁ గొంతకాలముండి యక్కడనుండి మెల్లమెల్లగా ముందుముందుకు బ్రాఁకనేర్చి యెల్లవారల చూడ్కులకు వేడ్కలు నింపుచు, పిదప నవ్యక్తమధురస్వరంబులతో ముద్దులు గులుకు శరవేగమునఁ బరుగిడుచు, అపిమ్మట ఘనతరుల చెంతఁజేరి తల్లివేళ్ళనువిడిచి తక్కినవేళ్ళనంటుచు బాఱి జమ్ములోనడఁగి దాఁగుడుమూఁత లాడుచు, వెలువడి విదర్భాదిదేశములగుండఁ బ్రయాణములుచేసి త్రోవపొడుగునను వచ్చి పుచ్చుకొనని వా[illegible] ప్రాకారము స్నానపానంబులకు వలయునంత నిర్మలజలంబు[illegible]స్తంభ మొకటి యున్నది. మందటి నానంద మొందిం[illegible]గంటలు గాలికిఁగదలుచు సదా శ్రీవ్య లకును ఫలవృక్షములక్రు[illegible]లను దనుపుచుండును. ఆ స్తంభమునకు మొదట

చుచు తన చల్లదనము వ్యాపించినంతవఱకు నిరుపార్శ్వములందు భూమి నంతను బచ్చని లేఁబచ్చికతో నలంకరించి పశుగణంబుల కాహారంబు కల్పించుచు, తనరాక విని దూరమునుండి బయలుదేఱి యడవిపండ్లును నెమలికన్నులును వహించి పొంగి నానాముఖములఁ దన్నుఁ గానవచ్చు వరద, మంజీర, పిన్నగంగ మొదలగువారి నాదరించి లోఁగొనుచు, అంత కంతకుఁ దనగంభీరత గానుపింప నాథుని వెదకికొనుచు వచ్చివచ్చి, యే గిరిని దూరమునుండి విలోకించి గోదావరి రసోత్తరంగముగా ఘోషించుచు పాదమునంబడి శిఖరంబున నధివసించు జనార్దనస్వామి దర్శనము చేసికొని తోడనే యచ్చటనుండి తనశాఖారూపములయిన రెండుచేతులనుజాచి సరసతమీఱ నాథునింగలియు భాగ్యము గాంచెనో యాధవళగిరి, యాంధ్రదేశమున కలంకారభూతమయి రాజమహేంద్రవరపుర సమీపమున మిక్కిలి వన్నెకెక్కి యుండెను.

ఆపర్వత మంతయున్నతమయినది కాకపోయినను, తెల్లనిపిండిరాళ్ళతో నిండి యుండుటచేఁ జూచుట కెంతయు వింతగా మాత్రముండును; ఆరాళ్లనుబట్టియే దానికి ధవళగిరియను నామము కలిగియుండును. దక్షిణపువైపునఁ గ్రిందినుండి పర్వతాగ్రమువఱకును నల్లరాళ్లతోఁ జక్కనిసోపానములు కట్టబడియున్నవి. ఆసోపానముల కిరుప్రక్కలను కొండపొడుగున నర్చకులయుఁ దదితరులగు వైష్ణవస్వాములయు గృహములు చాలుగానుండి కన్నులపండువు చేయుచుండును. ఆసోపానముల వెంబడిని పైకిఁ జనినచో గొండమీఁద నల్లరాళ్లతోఁ గట్టఁబడిన సుందరమైన చిన్నదేవాలయమొక్కటి కానఁబడును. దానిచుట్టును ...చెడెత్తు ప్రాకారము మూఁడుప్రక్కలను బలిసి ...ను బదులుగా పర్వతశృం...శయింప వానిని మించి

యాలయశిఖరమును నిక్కి చూచుచుండును. ప్రాకారముకోవల నె
యుత్తరమున నొక చిన్నగుహ కలదు. అందులోఁ గూర్చుండి పాండ
వులు పూర్వమరణ్యవాసము చేయునప్పుడు తపస్సు చేసిరని పెద్దలు
చెప్పుదురు. అందులో నిప్పుడు చిన్న రాతివిగ్రహ మొక్కటి యుండెను.
సంవత్సరము పొడుగునను పూజాపునస్కారములు లేక బూజుపట్టియున్న
యీ దేవర నుత్సవదినములలో నర్చకుండొకఁడు పైకిఁ పులికాపుచేసి,
ఆ స్వామి సన్నిధానమున దీపము నొకదానిని వెలిగించి గుహాముఖంబునఁ
దాను నిలుచుండి పల్లెలనుండి యాత్రార్థమువచ్చిన మూకలవలనం తల
[illegible]కడబ్బునంతునఁ బుచ్చుకొని లోపలికిం గొనిపోయి దేవతాదర్శనము
చేయించి వారిపెద్దలు ధన్యులయిరని జెప్పి పంపుచుండును. జనార్దన
స్వామి కళ్యాణ దినములు నాలుగును వెళ్ళినతోడనే యెప్పటియట్ల
స్వామిరథము రొక్కపగ్గముల నందుంచి వాని కాచిన్నదేవరను గావలి
యుంచి జీవబంధములు లేకపోయినను రాత్రిందివములు కాలుగదలపక
స్థిరవృత్తినొఁ గాచుచుండు నాపిన్నదేవరయెడంగల విశ్వాసముచేత
పూజారులు మఱుచటిసంవత్సర మాత్రాల్ల పని మఱలవచ్చువఱకును
ఆగుహాప్రక్కి చూడనక్కఱ లేక నిర్విచారముగా నుందురు. ఈప్రకా
రముగ మనుష్యులు భక్తిహీనులయి దేవతాసందర్శనము చేసికొకపోయి
నను పర్వతమును కనిపెట్టుకొనియున్న చిన్న చతుష్పాద జంతువులు
మాత్రము మిక్కిలి భక్తికలవై నిత్యము నాస్వామిని సందర్శించు
కొనుచు ఉత్సవదినములలో మనుష్యులువచ్చి తమ్ముఁ దఱిమివేయునం
తటిపాపముం గట్టుకొన్నదాఁక రాత్రులు దేవతాసన్నిధానమున గుహాలో
వట్టిభూతలముననే శయనించుచుండును. తూర్పువయిపునఁ బ్రాకారము
లోనే జనార్దనస్వామి కెదురుగా గొప్పధ్వజస్తంభ మొకటి యున్నది.
దానిశిఖరమున నున్న చిఱుగంటలు గాలికిఁగదలుచు సదా శ్రావ్య
మయిననాదముతోఁ జెవులను దనుపుచుండును. ఆ స్తంభమునకు మొదట

నాంజనేయ విగ్రహ మొకటి చేతులు జోడించుకొని స్వామి కభి ముఖమయి నిలిచి యుండును. ఈ శిలావిగ్రహమునకును ధ్వజ స్తంభము నకును ఉత్తరముగాఁ గళ్యాణమంటప మొకటియుండెను. స్వామి కళ్యాణ దినములలో నుత్సవవిగ్రహములు నందు వేంచేయింపఁజేసి యథావిధిగా వివాహతంత్రమునంతయు మహోవైభవముతో నడిపింతురు.

ప్రతిమాసమును రెండుపక్షములయందును ముఖమంటపము మీఁద ఏకాదశినాఁడురాత్రి హరిభజనము జరుగుచుండును. హరి భక్తులు తులసిపూసలతావళములను ధరించుకొని ద్వాదశోర్ధ్వపుండ్ర ములను స్ఫుటముగాఁ బెట్టుకొని కరతాళములును మృదంగములును మ్రోగుచుండఁగాఁ దంబురలు మీటులు, బిగ్గఱగాఁ దమ యావచ్ఛ క్తిని "నవనీతచోరా" "గోపికాజారా" "రాధికాలోలా" "గోపాలబాలా" మొదలగు నామములచే నిష్టదేవతలను సంబో ధించుచు మధ్యమధ్య గొంతుకలు బొంగుపోయినప్పుడు మిరియములను బెల్లపుముక్కలను నములుచు కృష్ణలీలలను పాడుచుందురు. తలలు త్రిప్పుచు భక్తులు తమ సత్తువంతయుఁ జూపి చేతికోలఁదిని వాయిం చుటచే నొకానొకప్పుడు మద్దెలలును తాళములును పగిలిపోవుటయు సంభవించుచుండును. దేవతావేశముచేత తఱుచుగా భక్తులలో నొక రిద్దఱు దేహములు పరవశమయి రెండుమూడు నిముషములవఱకు వెనుకకు స్తంభముమీఁద కొఱగుచుండుటయుఁ గలదు. ఇట్టి భక్తి మార్గమును బొత్తిగా గుఱ్తెఱుఁగని యన్యదేశీయులకు మాత్రము వారి యప్పటిచేష్టలు పిచ్చిచేష్టలవలెఁ గనఁబడునుగాని, వేడుకచూడ వచ్చినజనులు వారెంతవికృతముగా కేకలువేయుచు భజనచేయుదురో యంత పరమభాగవతోత్తము లని తలఁతురు.

కొంచెము శ్రమపడి యెవ్వరైన మధ్యాహ్నవేళ నొక్కసారి కొండమీఁది కెక్కి నలుఁగడలఁ జూడ్కి నిగిడించినచో, వన్నెవన్నెల

పిల్లలు చెంగుచెంగునఁ దుముకుచుండఁ దుముకులాడుచుండఁ గొండ పాదుగునను ముంగాళ్ళు మీఁది కెత్తి పొదలపయి యాకులను మేయు మేఁకలును, పూర్వపక్షిణములఁ గుప్ప వోసినట్లున్న తాటాకుల యిండ్లనడుమ వానిని వెక్కిరించున ట్లెక్కడఁజూచిన నెత్తుగా నొక్కొక్క పెంపుటిల్లును ఉత్తరమున మంచెలపైనుండి పొలముకాపులు కో యని కూఁత లిడుచు నొడిసెలలు ద్రిప్పుచు బెదరింపఁ జేరువ తోఁపులలో నుండి వెలువడి మధురరుతములు చేయుచు ఆకాశమున కెగయుచు నందయినప్పుడు కంకులనువిఱుచుకొని పఱచి పలువిధములయిన పక్షులు చెట్లకొమ్మలమీఁదఁ బెట్టుకొని తినుచుండ ముచ్చటగా నుండుపలువిధములపచ్చనిపయిరులును, ఆపయిని వృక్షములమీఁదను గూర్చుండి కర్ణరసాయనముగాఁ బిల్లనగ్రోవిని మోవినిబూని పాడెడి గోపబాలకుల గానములకు హృదయములు కరఁగి మేపులు చాలించి క్రేపులతోఁ జంగూడఁ జెవులు నిక్కించి యఱ్ఱులుచాచి యాలింపుచు నడుమనడుమ గడ్డిపఱకలు కొఱుకుచు బయిళ్ళయందు నిలుచున్న పశుగణములును, పడమటను నీలములవలెనున్న తేఁటనీటిపై సూర్యకిరణములు పడి యెల్లెడలను వజ్రపుతళుకులను బుట్టింపఁ బలుతెఱంగుల జలవిహంగంబులు పుట్టచెండ్లవలె మీలఁ బట్టుకొనుటకయి నీటం బడుచు లేచుచుఁ బ్రవాహంబుతోడం బఱచుచుండ నఖండ గౌతమియు నేత్రోత్సవము చేయుచుండును.

ఆ పర్వతపాదమునకు సమీపమున గోదావరియొడ్డుననల్లరాతి బండమీఁదఁ జక్కఁగా మలఁచిన రామపాదములు వెలసి యున్నవి. శ్రీరాములవారు పూర్వకాలమున సీతాలక్ష్మణులతోడఁగూడఁ బర్ణశాలకుఁ బోవుచు త్రోవలో ఈ పర్వతసమీపమున నడచిననాటి పాదములచిహ్నాలే యవి యని యెల్లవారును నమ్ముదురు. కాఁబట్టి

యీ రామపాదములను సందర్శింపవలె ననుసభిలాషతో దూరదేశముల నుండి సహితము యాత్రికులు వచ్చి రామపాదక్షేత్రమున సఖండ గౌతమీస్నానము చేసికొని, కొండమీఁది యొక్క శ్రీరామలింగస్వామి వారిదర్శనము చేసికొని, స్వశక్త్యనుసారముగా దక్షిణతాంబూలము లను సమర్పించి కలిగినవారైన స్వామికి భోగముసహితము చేయించి మరలి పోవుచుందురు. అది దివ్యక్షేత్రముగుటచేత జాతిభేదము లేక యెల్లవారును పులిహోరయు దధ్యోదనము మొదలుగాఁ గల స్వామిప్రసాదమును స్వీకరించి కన్నుల కద్దుకొని సుప్రీతిగా నార గించి చేతుల నంటుకొన్నదానిని కడుగుకొన్న నపచారమగునని గరతలములు పయికెత్తి చేతుల కందినంతవఱకు దేవాలయస్తంభ ములకును గోడలకును వస్త్రము వేయుచుండి కాక యుచ్ఛిష్టముతోఁ దముమీఁది జేతులకును బట్టలకును తుడుచుకొనుచుందురు.

ఈకొండకు దక్షిణమునను పూర్వనను కొంతదూరమువఱకు గ్రామము వ్యాపించి యున్నది. పర్వతముపేరే పూర్వము గ్రామ మునకుం గూడఁ గలిగియుండెను. కాని యిప్పుడిప్పుడు గ్రామమును ధవళేశ్వరమని వ్యవహరించుచున్నారు. కొండమీఁదినుండి సోపాన ములు దిగివచ్చినతోడనే రాజవీథియొక్క యావలిప్రక్కను శ్రీఅగ స్త్యేశ్వరస్వామివారి దేవాలయ మొక్కటి లోచనగోచరం బగును. తొల్లి వింధ్యపర్వతముయొక్క గర్వము నణఁచి దక్షిణాభిముఖుఁడయి చనుచు అగస్త్యుఁ డాస్వామిని అచట ప్రతిష్ఠచేసెనని స్థలపురాణము చెప్పుచున్నది. ఈ దేవాలయమునకును పర్వతమునకును మధ్యను తూర్పుననుండి పడమటకు గోదావరివఱకును విశాలమయిన రాజవీథి యొకటి గలదు. ఆవీథిచివరను నల్లరాళ్ళతో నీటివఱకును సోపాన ములు కట్టఁబడి యున్నవి. సోపానములకు సమీపమున వీథికిఁ

చూర్పుప్రక్కను "ధర్మచావడి" అని యొకటి యుండెను. అది పరదేశ బ్రాహ్మణులును మార్గస్థులును రాత్రులు పరుండుటకై మొట్టమొదట కట్టఁబడినది కాని, ఆకాలమం దది యుబుసు పోవుటకై గ్రామము లోని పెద్దమనుష్యులు ప్రతిదినమును ఉదయాస్తమయములయందు ప్రోగై యిష్టకథాగోష్ఠిం గొంతప్రొద్దుపుచ్చి పోవుచుండుటకుమాత్రము వినియోగపడుచుండెను.

ఒకానొకదినమున సూర్యుఁ డుదయించి ప్రాచీముఖంబునఁ గుంకుమబొట్టు నందంబు వహించి వృక్షాగ్రములను బంగారునీరు పూసినట్టు ప్రకాశింపఁజేయుచుండెను; చెట్లమీఁది గూళ్ళనుండి కలకల ధ్వనులతో వెలువడి పక్షులు నానాముఖముల ఎరకయి వెడలు చుండెను; పసులకాపరిబాలురు చలుదులు మూటగట్టుకొని పశువుల మందలను దోలుకొని పచ్చికపట్లు కరుగుచుండ, వెనుక "వెల్లావు కడి నాది" "దోరగేదె కడి నాది" యని గంపలు చేతఁబట్టుకొని, పడుచు లొండొరుల మీఁటి పరుగులిడుచుండిరి. కాపులు ములుకోలలు బుజములమీఁదఁ బెట్టుకొని, కోశేరులను దోలుకొని తమతమ పొల ములకుం బోవుచుండిరి; అప్పుడు కాయశరీరముగల యొక పెద్దమను ష్యుఁడు జందెము పేరుగా వేసికొని యెడమచేతిలో నిత్తడిచెంబు నొక దానిం బట్టుకొని, గోదావరిలోఁ గాళ్ళును చేతులును గడుగుకొని, ఒడ్డునకు వచ్చి పుక్కిలించివైచి యజ్ఞోపవీతమును సవ్యముగా వేసికొని వచ్చి, ధర్మశాలమీఁద నొడ్డున గూర్చుండి, వచ్చినప్పుడు చెంబులో వేసి తెచ్చుకొన్న తుమ్మపుడకతో దంతధావనము చేసికొనుచుండెను. ఆయనకు వయస్సు నలువదిసంవత్సరము లుండును; మొగముమీఁద స్ఫోటకపుమచ్చలే లేకపోయెనేని, మొగము సుందరమయిన దనుటకు సందేహింప నక్కఱయుండదు; అట్టని, యీముఖ మాయనను నిత్య

మును దర్శింపవచ్చు. ప్రవర్తకలస్తోత్రములకు మాత్ర మతఁడును పాత్రము కాకపోలేదు; శరీరచ్ఛాయ ఎఱ్ఱనిది; విగ్రహము కొంచెము స్థూలముగాను పొట్టిగాను ఉండును; నుదురు విశాలమయి చూచువారి కాతఁడు పండితుఁ డని తోఁపఁజేయుచున్నది; అప్పుడు కట్టుకొన్నది గోరంచు నీరుకావి దోవతి; సరిగంచుల చలువ వస్త్ర మొకటి శిరస్సునకు వదులుగా చుట్టఁబడి కొంగు కొంత వ్రేలాడ వేయఁబడి యున్నది; చెవుల నున్న గవలయుంగరములును, కర్మిష్ఠుఁ డనుటకు సాక్ష్య మిచ్చుచున్న కుడిచేతి యనామికయందలి బంగారుదర్భముడి యుంగరమును తర్జనియందలి వెండిబటువులు రెండును దప్ప శరీరమున నాభరణము లేవియు లేవు; ఆయన పేరు రాజశేఖరుఁడు; ఆయన ముఖప్రక్షాళన మగునప్పటికి గ్రామములోని గృహస్థులు నలువురును అక్కడకు వచ్చి, ఆయన వారివారి తారతమ్యముల క్రమముగాఁ దగిన మర్యాదలు చేసి కూర్చుండుఁ డని చేయిచూపఁ, 'చిత్తము' 'చిత్తము' 'మీరు దయచేయుండి' అనుచుఁ జావడినిండఁ గిటగిటలాడుచుఁ గూరుచుండిరి.

అప్పుడు రాజశేఖరుఁడుగారు "సిద్ధాంతిగారూ! మీరు నాలుగు దినములనుండి బొత్తిగా దర్శన మిచ్చుట మానివేసినారు! మీయింటఁ జిన్నపెద్ద లందఱును మఱేమియు లేకుండా సుఖముగా నున్నారుగదా?"

సిద్ధాంతి—"చిత్తము, చిత్తము. తమ యనుగ్రహమువల్ల మేమం దఱము సుఖముగానే యున్నాము. ఎన్ని కుటుంబములకైన నన్న వస్త్రాదు లిచ్చి కాపాడఁగల ప్రభురత్నములు తమరు గ్రామములో నుండఁగా మావంటివారి కేమికొదువ? మా గ్రామము చేసికొన్న భాగ్యముచేతను, మా పురాకృతపుణ్యముచేతను, తమవంటి దాన

ర్థులు మా గ్రామమునకు విజయం చేసినారుగాని మఱియొకటికాదు." అని రామశాస్త్రిగారివంకకుఁ దిరిగి, "మనము వారి ముఖముముందఱ స్తుతింపవలసినది కాదు గాని రాజశేఖరుఁడుగారు కేవలము ఈశ్వరాంశ సంభూతులు సుండీ."

ఆమాటల కాదరమును సూచించెడి మందహాసము చేసి రామశాస్త్రి "అందునకు సందేహమేమి? ఈసంగతి మీరు నాతోఁ జెప్పవలెనా? వారిగ్రామమున నుండఁబట్టి మన మందఱము వారి యండను నిలువఁగలిగినాముగాని, లేకుండిన నిల్లును వాకిళ్ళును విడిచిపెట్టి మనమీపాటికి దేశములపాలయి లేచిపోవలసినవారము కామా? వారితండ్రిగా రిక్కడకు వచ్చినప్పటినుండి యిది యొక గ్రామముగాఁ గనఁబడుచున్నదిగాని యింతకుఁబూర్వము దీనికి నామరూపము లున్నవా?"

అని, మంత్రశాస్త్రము మము తటస్థించినప్పుడు అను పాండిత్యమును దాఁచిపెట్టక, అందుకొని సిద్ధాంతిగారి స్తోత్రపాఠములకు సాయముగాఁ దనవికూడ నాలుగు కలిపెను.

అప్పుడు రాజశేఖరుఁడుగారు మనసులో మిక్కిలి సంతోషించి సన్న పయి కాసంతోషము కానరాకుండ నడఁచికొని "సిద్ధాంతిగారూ! మొన్న మీ రెండవచిన్నదాని కేమో గ్రహబాధ కనఁబడినట్టు విన్నాను. కొంచెము నిమ్మళముగా నున్నదా?"

అని యడిగినతోడనే సిద్ధాంతిగారు మోమున దీనభావము గానిపింపఁ గొంచెమాలోచించి తలయూఁచి "జోస్యుల రామావధానులగారిచేత విభూతి పెట్టించుచున్నాను. కాని దానివల్ల నిప్పటి కేమియు గుణమే కనఁబడదు. జాతకరీతిచే దానికిప్పుడు శని చాలదు. ఎందుకైనను మంచిదని నాతమ్మునిచేత నవగ్రహ జపము

చేయించుచున్నాను. అంతలో నూరకుండక కామావధానులుగారినే "పంచముఖ వీరహనుమంతము" పునశ్చరణ చేయవలసినదనియు, జపశాంతి కేమయినఁ గావలసియున్న శ్రీరాజశేఖరుఁడుగారినైన కాళ్ళా కడుపో పట్టుకొని తెచ్చి నాలుగురూపాయిలసొమ్మిచ్చుకోనైన నిచ్చు కొనియెద మంచి విభూతి పెట్టమనియు ఆయన ననుసరించి బతిమాలుచున్నాను, అందుచేతనే యీ నాలుగుదినములనుండి దర్శనము చేయ లేదుగాని లేకపోయిన నేఁ డెట్లయినను నేను తమ దర్శనము మానుదునా ?"

రాజ—"శాస్త్రిగారూ ! మీరు రూపాయలనిమిత్తము సంశయపడ నక్కరలేదు. కావలసియున్న ఆ నాలుగురూపాయలను నే నిచ్చెదను. మఱి నాలుగురూపాయలు పోయినను మంచివైద్యుని విచారింపవలెను. మనగ్రామములో శాస్త్రులుగారికన్న—" అని యన్నవాఁడు రాజశేఖరుఁడు యేమో యాలోచించుచుండెను. సిద్ధాంతిగారు చేసినస్తుతి యమోఘముగాఁ బట్టుకొని కొంచెముగానో గొప్పగానో ధనరూపమైనప్రతిఫలమును దెచ్చుచునే వచ్చుచున్నదిగాని యీవఱ కెన్నఁడును రాజశేఖరుఁడుగారివద్ద వ్యర్థముగాఁ బోలేదు.

ధవళేశ్వరమునందును చుట్టుపట్టుల గ్రామములయందును వేఱు సిద్ధాంతి లేఁడు గనుక, ఆయనయింటికి వచ్చి వర్జ్య మెప్పుడని కాని, ప్రయాణమునకు ముహూర్తము పెట్టుమని కాని, క్రొత్తబట్ట చించి కట్టుకొనుట కేదినము మంచిదని కాని, ఇల్లుకట్టుకొన నారంభించుట కేమాస మనుకూల మైనదని కాని, క్షౌరము చేయించుకొనుట కేవారము మంచిదని కాని, వివాహమునకు లగ్నము పెట్టుమని కాని రజస్వల యయినప్పుడు నక్షత్రము చెప్పుమని కాని, సదా యెవ్వరో యొక రాయన నడిగి పోవుచునే యుందురు. దూరబంధువులు పోయి

నప్పుడు మైల యెంతకాలము పట్టవలెనో తెలిసికోవలె నన్నను, జబ్బు నక్షత్రమున నెవ్వరైన మృతినొందినప్పుడు ఇల్లువదలి యెంతకాలము లేచిపోవలెనో కనుఁగొనవలెనన్నను, రోహిణ్యాది నక్షత్రములయందు బిడ్డను గన్నప్పు డేమిశాంతి తగులునో యెఱుఁగవలెనన్నను, సిద్ధాంతి యొద్దకు రాక సరిపడదు. ఏకాపువానిపశువు తప్పిపోయినను, ఎవని యింట నేవస్తువు పోయినను వచ్చి సిద్ధాంతిగారి నడుగక పోరు. ఇటువంటి సమయములయం దెల్లను, అతఁడు వీథనడవలో నేలమీఁద ఇసుక పోసి దానిలో పూచికపుడకతో ఏమేమో బీజాక్షరములును అంకెలును వ్రాసి మీఁదివంక చూచి యాలోచించి వచ్చినకార్య మిది యనియు, కార్య మీ ప్రకారముగా నగుననియు చెప్పి పంపుచుండును. అతఁడు బల్లిపాటు మొదలైనవాని ఫలములును, శకునములు చూచి సంతానము కలుగు కాలమును కూడ చెప్పుచుండును. వేయేల? సిద్ధాంతి యాలోచన లేక యాచేరువగ్రామములో ఏశుభకార్యము కాని యశుభకార్యముకాని జరుగదు. అతఁడు చెప్పెడిజ్యోతిషము తఱుచుగా అబద్ధమే యగుచు వచ్చినను, అప్పుడప్పుడు కాకతాళీయముగా కొన్ని సంగతులు నిజ మగుటయుఁ గలదు గనుక జను లాతనిమాట యమోఘ మని నమ్ముచునే యుండిరి.

అప్పు డాచావడిలో నున్నవారిలో నెవరో "వైరాగులు భూతవైద్యమునకు గట్టివా" రని మెల్లగా ననిరి. అంతలో రాజశేఖరుఁడుగారు సిద్ధాంతిగారివంకఁ జూపు త్రిప్పి "ఔను. వైరాగు లన్నతోడనే జ్ఞప్తికివచ్చినది. పదిదినముల క్రిందట ఈగ్రామమున కెవ్వఁడో యొక వైరాగి వచ్చినాఁడట! అతనికిఁ జూపింపరాదా? గోసాయీలకుఁ బరమహంసక్రియలును వనమూలికలును విశేషముగాఁ దెలిసి యుండును. వాండ్రెట్టియసాధ్యమైనపీడలనైనను చిటికెలోఁ బోఁగొట్టుదురు" అనినతోడనే చావడి యంతయు 'చిత్తము' 'వాస్తవము'

"ఆలాగున నవశ్యము చేయవలసినదే" యను ధ్వనులతో నిండిపోయెను. మాటలాడువారు ధనవంతులైనచో, వ్యర్థవచనము సహితము సూక్తియోగ్యము కాకపోదుసుండీ. ఆమాటలవలన నుత్సాహము కలిగి, రాజశేఖరుఁడుగా రాబైరాగిని తాము గూడకపోయినను బ్రహ్మవర్చస్సు కలవాఁ డని శ్లాఘించిరి.

అంత సిద్ధాంతి యుల్లములో లేని సంతోషమును మోమున దెచ్చిపెట్టుకొని యొక్కచిఱునవ్వు నవ్వి, వినయముతోఁ జేతులు జోడించి రాజశేఖరుఁడుగారి ముఖమున దృష్టి నిలిపి, "తమమాట చేతనే మాచిన్నదానిబాధ నివారణ మయినది. దానియదృష్టము బాగుండబట్టియే దేవరివారిముఖమునుండి యీమాట వచ్చినది. ఇప్పుడే తమసెలవుప్రకారము బైరాగియొద్దకు వెళ్ళెదను." అని మనవిచేసి, ప్రయాణోన్ముఖుఁ డయి లేచి నిలువఁబడెను. రాజశేఖరుఁడుగారి యభిప్రాయము కొంచెము తెలిసినతోడనే బైరాగిమహానుభావుఁ డనువారును మహామంత్రవేత్త యనువారును, వాయుభక్షణము చేయుననువారును, మండువేసవిని పంచాగ్నిమధ్యమునఁ దపస్సు చేయు ననువారును అయి సభ యంతయు అతనివిషయమైన స్తుతిపాఠములలో మునిఁగిపోయెను. ఒక్క గొప్పవాఁ డొకనిని మంచివాఁ డన్నచో, ఎవ్వనివాక్కు భిన్నముగా లేచును? ఎవ్వనినోరు స్తుతివాక్యముల కొరకు తడవుకొనును?

అప్పుడు రాజశేఖరుఁడుగారు వీధివంకఁజూచి: "ఎవ్వరో స్త్రీలు నీళ్ళకువచ్చి మనలఁజూచి సిగ్గుపడి వెనుకకు నాలుగడుగులు పెట్టి నిలుచుండి యొండొరులమొగములవంకఁ జూచుకొను చున్నారు. మన మందఱమును లేచి బైరాగిని జూచివత్తము రండి." అను మాటతోడనే యెల్లరును లేచి ప్రయాణోన్ముఖు లయి నిలుచుండిరి. వెంటనే యందఱును గలిసి యుత్తరముఖముగా రామపాదములపై పునః నడవ నారంభించిరి.

రెండవ ప్రకరణము

రాజశేఖరుడుగారికూతురు రుక్మిణి స్నానమునకు వచ్చుట-నదీతీర వర్ణనము - రుక్మిణికిని సిద్ధాంతిగారి భార్యకును జరిగిన సంభాషణ-నీళ్లకు వచ్చిన యమ్మలక్కల ప్రసంగముః - పంచాంగపుబ్రాహ్మణుడువచ్చి సంకల్పము చెప్పుట - రుక్మిణి స్నానముచేసి బయలు దేఱుట.

రాజశేఖరుడుగారు పౌరబృందముతో నాలు గడుగులు ముందుకు సాగినతోడనె యొకసుందరి సుందరగమనముతో సోపానముల యందలి యందియలమ్రోత మట్టియలమ్రోతతో జెలిమి సేయ, మొలనున్న వెండియొడ్డాణము యొక్కయు, ముంజేతుల పసిడికంకణముల యొక్కయు, గాజులయొక్కయు కాంతులు ప్రతిఫలించి కుడిచేతిలోని తళతళ లాడుచున్న రాగిచెంబునకు జిత్రవర్ణ మొసంగ, మోమున లజ్జాభయములు నటియింప, పయ్యెద చక్కజేర్చుకొనుచు తిన్నగా దలవంచుకొని మెట్లు దిగివచ్చి చెంబును నీటియొడ్డున నుంచి చెంబుమూతి కంటించియున్న పసుపుముద్దను దీసి కొంత రాచుకొని మొదుగాకులో జుట్టితెచ్చుకొన్న కుంకుమపొట్లము నొకబట్టయుతుకు రాతిపయిం బెట్టి, మోకాలిబంటి నీటిలో నిలుచుండెను. ఆమె రాజశేఖరుడుగారి పెద్దకూతు రగురుక్మిణి—అహా ! ఆమె సౌందర్యమును బ్రత్యక్షమునం జూడ నోచినవారికన్నులే కన్నులు. ఆకాలమున హిందూదేశమునందలి సుందరులలోనెల్ల దెనుగుదేశములోనివారే రూపరేఖవిలాసములచేత నసమానలుగా నుండిరి ; వారిలోను బ్రాహ్మణజాతినాతులు మిక్కిలి చక్కనివారు. కాని రుక్మిణిరూపమును దలంచినప్పుడు మాత్రము, ఆ సుందరు లోకసౌందర్యవతు లని చెప్పుట కెల్లవారును సంకోచ పడుచుందురు. జనులందఱును మిక్కిలి

సౌందర్యవతు లని యెప్పుకొన్నవారిలోఁ జక్కనివారి నేఱి యామె సం
చెంత నిలిపినచో గురూపురాం డ్రనిపించెడి యామెను మనోజ్ఞత యేమని
పిలువవలెనో తెలియకున్నది. అపూర్వవర్ణనాసామర్థ్యము గల కాళి
దాసాదికవులలో నొకరినైనను బోలఁ జాలని నేను, ఉన్నంతసౌందర్య
మును బోధించుపదములు లేనిభాషతోను, పదములు బోధించు
నంతవట్టుకైనఁ బూర్ణముగాఁ దెలుపలేని బుద్ధితోను వర్ణింపఁ
బూనుట యామె చక్కఁదనముయొక్క గౌరవమునకుఁ గొఱంత
కలుగఁజేయుటయేగదా! అయినను యోగ్యవస్తువు [illegible]
వర్ణింపక మానుట యుచితము కాదు గాఁబట్టి, యీసృష్టిలోని వస్తు
వుల్లో వేనింకొన్నైనను పోల్చి యీపుస్తకమునం జెప్పువాఁడ నామె
యవయవములయొక్క రూపము నెంచుక మనస్సునఁ బుట్టించుచున్నను
ఆమె యంగముల నెంచి యావస్తువులపేరు చెప్పుటకై సిగ్గు వొడము
చున్నది. వేయేల? చతుర్ముఖుఁడును ఘుణాక్షరన్యాయమునఁ బడిన
యీమె రూపమునకుఁ దలయూఁచి, తన యపూర్వవస్తునిర్మాణ
చాతురిని మెచ్చుకొనకపోఁ డని యామెం జూచినవా రెల్లరు నెంచు
చుందురు. ఆమె శరీరచ్ఛాయం జూచిన, ఇఁక నీభూమిమీఁద
బంగారమున కేమిచాయయెక్కువ గలదని తోఁచును; నల్లగానుండు
నేని, విండ్లామెకనుబొమలంగొంచెము పోలియున్నవని చెప్పవచ్చును;
నేత్రములను జూచినభాగ్యదేవత వానియందే కాపురము కుదిరినట్టు
కనిపించును; కాని, నిపుణముగాఁ బరిశీలించినచో నేదో స్థిర
విచారమొకటి యామె హృదయపీఠమున నెలకొనియున్నట్టు
ముఖలక్షణములు కొంచెము సూచించుచున్నవి. ఆవిచారమునకుఁ
గారణము లేకపోలేదు. ఆమె పెనిమిటి సహవాసదోషముచేత
నాలుగునెలలక్రిందటఁ దలిదండ్రులతోఁ జెప్పక దేశాంతరము లేచి
పోయినాఁడు.

ఇప్పు డామెకుఁ బరిమళ మబ్బినట్లు, ఇప్పు డిప్పుడే యౌవనము తలచూపి యామె మేనిసోయగమునకు మెఱుఁగు దెచ్చుచున్నది. పచ్చని దేహముమీఁద అప్పుడు కట్టుకొన్న తెల్లనిబట్టయు బంగారమునకు పటిక పూసినట్లు లోకవిధమయినయందమునే కలిగించుచుండెను. సుందరాంగుల యంగముం జేరినప్పు డేది యందముగా నుండదు ? ముక్కున నడ్డబాసయు, చెవుల నీలాలబావిలీలును, చేతుల కంకణములును, మెడలో పట్టెడయును, మొలను వెండివడ్డాణమును, కాళ్ళ నందెలును, మట్టెలును, ఆమె యప్పుడు ధరించుకొన్నది. కంకణములకు సాహాయ్యముగా రంగురంగులగాజులును లక్కపట్టెలును ముంజేతుల నలంకరించుచుండెను. ఈ నగలచే నామె యవయవముల కేమైన శోభ కలిగినదో లేదోకాని యవయవములచే నగలు కొంత శోభగాంచుటమాత్రము కరతలామలకముగాఁ గనఁబడుచున్నది.

సృష్టిలోని యేపదార్థమునకును బరిపూర్ణత్వమును దయచేయనిరీతినే, సర్వసముఁడగు భగవంతుఁడు రుక్మిణిసౌందర్యమందును గొంతకొఱంతను గలిగించినాఁడు కాని బొత్తిగాఁ గలిగింపక మానినవాఁడు కాఁడు. నిజముగా అది యొకకొఱంతయే యయ్యెనేని యామెకుం గలలోప మెల్లను మెడ మిక్కిలి పొడుగుగా నుండుట. అయినను ముష్టిసర్వశాస్త్రి యాయవారమునకు వచ్చినప్పుడెల్ల నామెమెడను జూచి సంతోషించి, "మిక్కిలి పొడుదగుమెడకామిని ! కులవర్ధని దాని నెఱుఁగికొం డనిరి బుధుల్ ॥" అను సాముద్రిక గ్రంథములోని పద్యమును జదివి పోవుచుండును.

అప్పుడొక్క విధవ మొలలోఁతునీళ్ళలో దూరముగా నిలుచుండి నోటిలో నేమేమో జపించుకొనుచు నడుమనడుమ దలయెత్తి సూర్యుని వంకఁజూచి దండములుపెట్టుచు, దోసిటిలోనీళ్లుపట్టి సూర్యునకర్ఘ్యము

విడుచుచు, అప్పుడప్పుడు ప్రదక్షిణములు చేయుచుండెను. ఆవల నే వచ్చియున్న కొందఱుస్త్రీలు తమయి త్తడిబిందెలను నీళ్ళతో బెట్టి గోప్ర నకు సమీపముగానున్న రాళ్ళపయిని నిలుచుండి మొక్కొక్క పెట్టు వేయుచు మధ్యమధ్య నొక్కొక్కమాట చెప్పుకొనుచు బట్టల నుతుకు కొనుచుండిరి; ఒకవృద్ధాంగన సగముబట్ట కట్టుకొని తక్కినసగము నుతుకుకొన్న తరువాత, ఉతికినభాగమును మార్చికట్టుకొని మిగిలి యున్నభాగము నుదుకుకొనుచుండెను; కొందఱు వయసులోనున్న స్త్రీలును గోప్యముగా నుంచదగిన తమ యవయవములు స్నానము చేయుచున్నట్టియు గట్టున నున్నట్టియు పురుషులకుఁ గనఁబడునట్లు సిగ్గువిడిచి తోముకొన్న రవికలనుదీసి యుదుకుటకయి తామ కట్టు కొన్న వస్త్రముల నక్కడనే విప్పి యావల నుదికిన చీరలు తడిబట్టలను చుట్టబెట్టుకొనుచుండిరి. ఆవల పదిబారలదూరమున దాసీజనములు క్రిందఁబడిన మెతుకులకై కావుకావని మూఁగిన కాకులను చేయెత్తి యదలించుచు అంటుతప్పెలలను ఒడ్డునఁ బెట్టుకొని తోముకొనుచుం డిరి. ఆపయిని బెస్తలు పుట్టగోచులతో మోఁకాటిలోఁతునీటిలో నిలు చుండి వలత్రాడు మొలత్రాడునం దోపుకొని రెండుచేతులతోను వలను త్రిప్పి లోఁతునీళ్ళలో విసరవైచి మెల్లమెల్లగా లాగుచుండిరి. మఱికొందఱు లాగినవలలను నీళ్ళలోఁ బలుమాఱు జాడించి యంటు కొనియున్న బురద పోయినతరువాత గట్టునకుఁ దీసికొనివచ్చి చివరఁ దగిలించియున్న యినుపగుండ్లు గలగలలాడ వలలను విప్పి రాయిరప్ప క్రిందఁ బారవైచుచు నడుమనడుమ వలకన్నులసందున నుండి మిట్టి మిట్టిపడు చిఱుచేపలను చేతులతో నదిమిపట్టి మీలపుట్టికలను చేతఁ బట్టుకొని నిలుచున్న పిన్నవాండ్రచేతి కందిచ్చుచుండిరి. ఆపయిని నాలుగడుగులు నడచినతరువాత దినమున కాఱణాలపాటు పడఁగలిగిన యొక సోమరిపోతు నీళ్ళలోనున్న నడదోనెమీఁది కెక్కి నల్ల యునఁ

బను చేరినవెత్తురుముద్దను త్రాటిచివనున్న గాలమునకు గ్రుచ్చి, లేచి నిలువఁబడి కుడిచేతిలోని సత్తునకొలఁదిని త్రాడు గిరగిరత్రిప్పి లోతు నీళ్ళ న్విసరివైచి మరలఁ గూర్చుండి చే. యొక్కపుడు నిక్కునాయని తదేకధ్యానముతో త్రాడునంకనే చూచుచు త్రాడు కదలినప్పుడెల్ల నులికిపడుచు దైవవశమున చేప గాలమును మ్రింగి కొట్టుకొనుచుండ మెల్లమెల్లగా లాగుచు, త్రాడు తెంపుకొని పాఱిపోవునో యను భయమునఁ గుడిచేతిలోని త్రాడు వదలుచు మరల లాఁగి యుంచఁగాఁ జుట్టుచు, చేప కలసట వచ్చినతరువాత నొడ్డునకు లాఁగి పెన్నిధిగన్న పేదవలెఁ బరమానందము నొందుచు, ఒడ్డుదాఁక వచ్చిన తరువాత గ్రహచారము చాలక మత్స్యము త్రాడుతెంపుకొని పఱచిన చేతిలోఁబడ్డసొమ్ము పోఁగొట్టుకొన్న వానివలె నిర్వేదించు చేఁప రాకపోఁగా రెండుగాలగాలముకూడఁ బోయెనని విచారించుచు వట్టి చేతులతో నింటికి బోయెను. ఆసమీపముననే యొడ్డునఁ జేరి కట్టె వాండ్రను వెదురుచువ్వ కొకదారమును గట్టి దానికొననున్న చిన్న గాలమునకు ఎఱ్ఱలను గ్రుచ్చి నీళ్ళలో వైచుచుఁ దటాలునఁ దీయుచు జిన్నచేపలను బట్టుకొను మఱియొక దారమునకు గుదిగ్రుచ్చి 'నాకు బదిజెల్లలు దొరికినవి' 'నాకు నాలుగుపరిగెలు దొరికిన' వని యొండొరులతోఁ జెప్పుకొనుచు సంతోషించుచుండిరి. అక్కడి జువ్విచెట్టు మీఁదఁ గూర్చుండి చూచుచున్న చెరుగ్రద్దయొకటి యకస్మాత్తుగా వచ్చి యొకటిరెండు పర్యాయములు పిల్లవాండ్రు త్రాడునకు గ్రుచ్చుటకయి చేతఁబట్టుకొన్న చేపఁ నెగరఁదన్నుకొని పోయెను.

అప్పు డొక్క పెద్దముత్తయిదువ మొగమంతయు నొక్కచే బొట్టుపెట్టుకొని, బట్టలతోనున్న బుజముమీఁది బిందెను తీసి చేతఁ బట్టుకొని రుక్మిణియున్న తావునకువచ్చి గౌరవముతోఁప "అమ్మాయి గారూ ! ఏమి? విూరీవేళ స్నానమునకు దయచేసినారు".

రుక్మిణి—“కార్తికసోమవారము కాదా ? నిన్నటి సోమవారము గనుక ప్రదోషవేళ మా అమ్మతోఁగూడ శివాలయమునకు వెళ్ళవలెనని గోదావరిస్నానము చేయ వచ్చినాను”.

పెద్దముత్తైదువ—మీారు రాత్రిదాక భోజనము లేకుండ నుండఁగలరా ?

రు—“ఒక్కదినమున కేమి ? ఏలాగునైన నుందును. మొన్న మీా రెండవచిన్నదానికి శరీరములో నిమ్మళముగా లేదని చెప్పినావు. ఇప్పుడు కొంచెము నిమ్మళముగా నున్నదా ?”

పె—“ఏమినిమ్మళమో నాకు తెలియదు. మావారు రేవళ్ళఁ బట్టి కామావధానులచేత విభూతి పెట్టించుచున్నారు. రాత్రి తెల్లవారినదాఁక నిద్రలేక బాధపడినాము”.

రు—“గ్రహబాధా యేమి?”

పె—“అవునమ్మాయీ ! ఏమి చెప్పుకోను ? మగఁడు”—అని ‘యిక్కడ నెవరునులేరుగదా’ యని నాలుగు ప్రక్కలనుజూచి మఱింతదగ్గరగా జరిగి చెవిలో మెల్లగా “మగఁడు పట్టుకొని పీకుకొని తింటున్నాఁడు. మీా కెఱుఁగుదురుగదా దానికి పెండ్లియయి మూఁడేండ్లు కాలేదు. అప్పుడే దానిమగఁడు పోయి యాఱునెల లయినది. అప్పటినుండియు దానికి కొన్నాళ్ళు కలలోను కొన్నాళ్ళు రాత్రివేళ ఒంటరిగా నున్నప్పుడును కనఁబడుచునే యున్నాఁడు. పిల్లకి సిగ్గుచేత ఎవ్వరితోను చెప్పక దాఁచినది. నెలదినముల నుండి రాత్రిగా ఎప్పుడును విడువక రేయింబగళ్ళు వెంటవెంటనే యెక్కడికి వెళ్ళిన నక్కడి కెల్లఁ దిరుగుచున్నాఁడు. ఏమిపాపమోకాని మూఁడుదినముల నుండి మఱింత పీకుకొని తింటున్నాఁడు. ఈమూఁడునాళ్ళలోను పిల్లది సగమయిపోయినది. ఇంతేగదా ? మగనితో”—అని కడుపులో

నుండి దుఃఖము బయలుదేఱఁగాఁ గొంచె మాపుకొనుచుఁ గన్నీరు పైటచెఱఁగుతో తుడుచుకొనుచుఁ గొంచెము తాళి గద్గదస్వరముతో, "మగనితో సౌఖ్య మనుభవింపనా? కాపురము చేయునా?" అని కొంచెము బిగ్గరగా నేడ్వఁజొచ్చెను.

రు—(ఆమాటలు మనసుకు నాఁటి రోమములు పులకరింపఁ గొంత తాళి ధైర్యము తెచ్చుకొని) "పెద్దముత్తైదువవు. అలాగుఁగ గంట తడి పెట్టరాదు. ఊరుకో ఊరుకో రోగము మనుష్యులకు రాక మ్రాఁకులకు వచ్చునా?"

పె—ఏడుపు చాలించి—'అమ్మాయీ! దాని కేసౌఖ్యము నక్కఱలేదు. ఈలాగునైన నుండి బ్రతికి బట్టకట్టినఁజాలును. మా ముసలిప్రాణములు రెండును బ్రతికి బాగున్నంతవఱకు దానికి యన్న, వస్త్రముల కేమియు లోపము రాదు.'

రు—కొంచెముసేపేమేమో యాలోచించి—'సోమిదేవమ్మా? మీవారు గ్రామములో పెద్దసిద్ధాంతులుగదా? తెలిసికూడ చిన్న దానిని అంత యర్థాయుష్మంతున—'

పె—మాట కడ్డమువచ్చి—"ఔనౌను! నీ వడుగఁబోవునది నేను గ్రహించినాను. ఎవరియదృష్టమున కెవరు కర్తలు? దానికి ముండమోయవలసిన వ్రాఁత యుండఁగా నెవరు తప్పింపగలరు? ఎవరైన జాతకము మంచిదిగాఁ జూచి వివాహము జేయుదురుగాని పెండ్లికుమారునకు లేనియాయువును తెచ్చి పోయఁగలరా?"

రు—"అవును. జాతకములో మీయల్లునకు పూర్ణాయుస్సే యున్నది కాఁబోలు!"

పె—కొంచె మనుమానించి— "పూర్ణాయుస్సా!—అవును పూర్ణాయుసే యున్నది. జాతకప్రకారము జరగదా అందు వేమో,

వేళ తిన్నగా కట్టి జాతకము వ్రాసినయెడల, అందులో నున్న యోగ ఫలము లున్నచో అన్నియు యథార్థములును జరుగును. శాస్త్రము చక్కఁగా తెలియనివారు తిన్నగా వేళ కట్టలేక పాడుచేయుదురు. మావారు ఇన్ని ముహూర్తములు పెట్టినారుగదా? నీ వెఱిఁగినంతవఱకును మందు నొకవిధముగా నెక్కడనైన జరిగినదేమో చెప్పు"

రు—"కన్నమ్మగారి బుచ్చమ్మ వివాహముహూర్తము మా నావడిలో మన సిద్ధాంతిగారే పెట్టినారుగాని దాని మగని జాతకము కూడ సిద్ధాంతిగారే వ్రాసి—"

పె—"అవును ఒకానొకటి తప్పిపోవుటయుఁ గలదు. జ్యోతి షమునకుఁ బార్వతీశాప మున్నదఁట! మావా రెప్పుడును ఈసంగతినే చెప్పుచుందురు. గట్టుమీఁద మట్టెలచప్పు డగుచున్నది. ఎవ్వరో వచ్చుచున్న ట్లున్నారు. ఈపాటికి మన మీసంగతి చాలింతము" అని వెనుక తిరిగి చూచి బిందె యొడ్డుననుంచి స్నానమునకు నీళ్ళలో దిగుచున్నది.

ఇంతలోఁ గొందఱు పుణ్యస్త్రీలును విధవలును మెట్టుదిగుచు ముందున్నవారు వంగి కాళ్ళ వెండిపావడములను కొంచెము పయికిఁ దీసికొనుచు వెనుకఁ దిరిగి దూరముననున్నవారు వచ్చువఱకు దగ్గఱ వారితో మాటలాడుచు మెల్లమెల్లగా నీటిసమీపమునకు వచ్చి గృహ కృత్యములనుగుఱించి మాటాడుకొనుచు బిందెల నొడ్డునఁ బెట్టిరి. అందఱును నొక్కచోట సమావేశమయి సావకాశముగా మాటాడు కొనుటకు నీళ్ళకు వచ్చినప్పటికన్న మంచిసమయము స్త్రీల కెప్పుడును దొరకదుగదా? అందుచేతనే వారు సాధారణముగా కొంచెము తీఱుబడిచేసికొని మాటాడవలసిన నాలుగు మాటలను నీళ్ళకు వచ్చి నప్పుడే మాటాడుకొనిపోవుదురు. అప్పుడు ముప్పదియేండ్ల యీడు

గలపోట్టి దొరకతే ముందుకు వచ్చి ముక్కుమీఁద వ్రేలు వైచికొని "ఓసీ! వెంకమ్మా! రాత్రి శేషమ్మను మగఁడు కొట్టినాఁడట! విన్నావా ?"

వెంకమ్మ—"దానిని మగఁ డెప్పుడును అలాగుననే కొట్టు చుండును. నెలదినముల క్రింద కఱ్ఱపుచ్చుకొని కొట్టినప్పుడు చేతిగాజు లన్నియు పగిలిపోయినవి."

పోట్టి—"దానిని మగఁడు తిన్నగా ఒల్లఁడట." అని బుగ్గను చేయిపెట్టుకొని "ఓసీ! ఓసీ! అతఁడు ముండ నుంచుకొన్నాఁడఁట సుమీ."

బట్టతల ముత్తైదువ యొకతె చేతులు త్రిప్పుకొనుచు ముందుకు వచ్చి "సరి సరి! దాని గుణముమాత్రము తిన్ననిదా? మొన్న సుబ్బా వధానుల కొడుకుతో మాటాడుచుండఁగా మగనికంటనే పడ్డదఁట! మగవాఁ డేలాగున నున్నను దోషము లేదు. ఆఁడుదాని గుణము తిన్నగా నుండనక్కఱ లేదా?"

పోట్టి—"దాని కేమిగాని, పాపము! చిన్నమ్మను అత్తగారు లోకములో లేని కోడంత్రికము పెట్టుచున్నది. అంతేకాకుండ మగఁ డింటికి వచ్చునప్పటి కేవో నాలుగు లేనిపోని నేరములు కల్పించి చెప్పును. దానిమీఁద అతఁడు ప్రతిదినమును దానిని చావఁగొట్టు చుండును."

పదియాఱుసంవత్సరముల వయస్సుగల యొక చామనచాయది కన్నుల నీరుపెట్టుకొనుచు—"అత్తగారు బ్రతికియున్న చోట్ల నెల్ల నదేకర్మము. లోకములో అత్తలెల్ల ఒకసారి చచ్చిరా"—

పోట్టిది—"శేషమ్మా! నీ అత్తగారుకూడ నిన్ను చాలా బాధ పెట్టు నని విన్నాను. నిజమా?"

శేష—"బాధ నీకేమి తెలియును. కోఁత పడవలెనే చచ్చి పోవుచున్నాను. జాము తెల్లవారక లేచి యింటిప్రాచి యంతయుఁ జేసి, అంట్లు తోమి, యింటికి కావలసిన నీళ్ళన్నియు తోడి, మడిబట్ట లుదికి, ఆమె లేచువఱకు పనులన్నియు జేయుచున్నాను. అప్పుడు నాలుగు గడియల ప్రొద్దెక్కి లేచి కన్నులు నలుపుకొనుచు వచ్చి గరిటెనంటను వదలలేదని, వాకిటలోఁ బెంట యట్టేయున్నదని తిట్ట మొదలుపెట్టును. తరువాత పేడచేసి గోడమీఁద పిడకలు చఱిచి తెక్కలు విఱుచుకొని జాము ప్రొద్దెక్కి చలిదిభోజనమునకు వచ్చు వఱకు, "ఒకమూల తెల్లవారకమునుపే తిండికి సిద్ధపడుదువు. పని మాత్రము ముట్టుకో" వని వంట చేసికొనుచు సాధించుచుండును. పగలు మగనితో మాటాడితేఁ దప్పుగదా? రాత్రి యందఱిభోజనములు అయినతరువాత, అత్తగారికి కాళ్లుపిసికి యామె నిద్ర పోయిన తరువాత వెళ్ళి పడుకోఁబోవు నప్పటికి రాత్రి రెండుయామములగును. పడుకొన్నది మొదలుకొని యెప్పుడు తెల్లవారి పోవునో, వేళకు బనిగాకున్న అత్తగా రెక్కడకోపపడునో అని నిద్రలోసహిత ములికి పడుచుందును; ఎట్లుచేసినను నాకు తిట్లును దెబ్బలును తప్పవుగదా?" అని మొగమునకు కొంగడ్డముపెట్టుకొని నేత్రముల నీరు కార్పఁ జొచ్చెను.

రుక్మి—"అత్తగారికి కోపము తెప్పించకుండ జేసెడుపనిని నీవు తిన్నగానే చేయరాదా?"

శేష—"అయ్యో! రుక్మిణమ్మా! నీకత్తగారు లేదుగనుక నీ కీసంగతు లేమియుఁ దెలియవు. ఎంతపని చేసినను అత్తగారి కెప్పుడును మెప్పు లేదు. కలయంపి చల్లునప్పుడు చిక్కగాఁ జల్లిన, "ఇల్లంతయు సముద్రము చేసినావు జారిపడిచచ్చిపోనా?" యని

తిట్టును. పలచగాఁజల్లిన "నీళ్ళకు కఱవువచ్చినట్లు వేణ్ణీళ్ళేచల్లినావు కా"వని తిట్టును. అడిగినమాటలకు మాఱు చెప్పిన "నామాట కెదురు చెప్పుచున్నావా" యని కోసీ పెట్టును. బదులు చెప్పక యూరకున్న "ముద్దులాగున మాటాడవే" యని తిట్టును. ఆమెముందఱ ఏమి చేసినను తప్పిదమే. "ఆఁ" అన్న అపరాధము? "నారాయణా" అన్న బూతుమాట. నేను కాపురమునకువచ్చిన నాలుగు సంవత్సరముల నుండియు వాడుకొనుచున్న ఓటికుండ నాలుగుదినములక్రింద పగిలి పోయినప్పుడు రాయివంటి క్రొత్తకుండ పగులఁగొట్టినా వని నేటివరకు తిట్టుచున్నది."

పొట్టి—"అత్త పోగొట్టినది అదు గోటికుండ, కోడలు పోఁ గొట్టినది క్రొత్తకుండ" యన్నసామెతవినలేదా?

శేష—నేను పడుబాధ యిప్పు డేమిచూచినారు? నా విధవ వదినెగారు బ్రతికియున్నప్పుడు చూడవలెను. నిరుడు అమ్మవారి జాడ్యములో—దైవము కడుపుచల్లగా—ఆవిడ పోయినప్పటినుండి మూఁడుపూఁటలును కడుపునకింత తిన్నగా అన్నము నైన దిను చున్నాను. ఆఁడబిడ్డ జీవించియున్నప్పు డదియునులేదు. ఉన్నమాట చెప్పవలెను. ఎన్నియన్నను ఇప్పుడు నాఅత్తగారు అన్నము తిన్నగా తినవైతివని తిట్టునుగాని తినిపోతివని తిట్టదు.

పొట్టిది—"లోకములో నెటువంటివారును లేకున్న—పిండి బొమ్మను జేసి పీటమీఁదఁబెట్టిన, ఆఁడుబిడ్డతనమున కదిరదరిపడ్డది— అన్నసామెత యూరకేపుట్టినదా?"

ఇంతలో జపము చేసికొనుచున్న ముసలామె కొంతదూరము వచ్చి చెంబులోనీళ్ళు పాఱఁబోసి "మీకు మాటలసందడిలో కన్నులు కనఁబడునా? ఈవల స్నానముచేసినవా రున్నారని యయిన

లేదు. ఊరికే నీళ్లు విడలుపుకొనఁగరు. మీఁద మయిలనీళ్ళు పడి స్నానము చేసినముంతను వచ్చినట్టు చలిలో మునల మునుఁగుచున్నాను" అని గొణుఁగుకొనుచు లోతు నీళ్ళలోనికి నడిచి మునుఁగుబుడుఁగున నాలుగు మునకలు వేసి బయలుదేఱి, మాటాడుకొనుచున్న వారివంక కన్ను ఱెప్పచేసి చూచుచు "అమ్మలక్కలు క్రిందను మీఁదను తెలియక పొంగిపడుదురు. ఈకాలములో నున్న కోడండ్రికములో ఇప్పుడు సహస్రాంశము లేదు. అత్తమంచియు, నేమి తీపును లేదు. ఎక్కడను అత్తలేని కోడలు ఉత్తమురాలు. కోడలులేని యత్త గుణవంతురాలు" అని సణుఁగుకొనుచు, దోసిళ్లతో నదిలోని నీళ్ళు మూఁడుసారులు గట్టునఁబోసి, కొంచెము దూరము పోయిన తరువాత మరల మూఁడుమాఱు లాత్మప్రదక్షిణములు చేసి స్నానక్రి యదృశ్యురా లయ్యెను.

శేషమ్మ—నాలుగువంకలుఁ జూచి వడవడ వడఁకుచు "అమ్మలారా! నే నీలాగున అన్నానని మీ రెవ్వరితోనైన ననెదరుసుండీ! మా అత్తగారు విన్న నన్ను చంపివేసిపోవును. ఈవఱకే నాకు గతులు లేకుండ నున్నవి. ఇది విన్న బొత్తిగానే యుండవు. వెంకమ్మ తల్లీ! ఈబ్రతుకు బ్రతుకుటకంటె గోదావరిలో పడితేబాగుండు నని తోఁచుచున్నది." అని వలవల నేడ్వఁజొచ్చెను.

వెంకమ్మ—"ఊరుకో! ఊరుకో! అటువంటి అవాచ్యము లెప్పుడును పలుకరాదు. పడ్డవాండ్రెప్పుడును చెడ్డవాండ్రుకారు." అని యూరడించుచున్నది.

శేషమ్మ—ఆమాటలతో దుఃఖము మాని "గోదావరికి వచ్చి చాలసే పయినదమ్మా! ఇంతసే పేమిచేయుచున్నావని అత్తగారు చంపివేయును. వేగిరము పోవలెను." అని వేగముగా నీళ్ళుముంచుకొని బిందె బుజముమీఁద నెత్తుకొని గట్టునకు నడుచుచున్నది.

అప్పుడే నీళ్ళకు వచ్చినవారిలో ఇరువదియేండ్లప్రాయముగల యొకతె చేరువ నున్న మఱియొకతె మెడదగ్గఱకు చేయి పోనిచ్చి "కాంతమ్మా ! ఈపట్టెడ క్రొత్తగా చేయించుకొన్నావా ? నీ కేమి ? నీవు అదృష్టవంతురాలవు. గనుక తల మొదలుకొని పాదములవఱకు నీమగఁడు నీకు నగలు దిగవేయుచున్నాఁడు."

కాంత—నిన్న నే కంసాలిసుబ్బయ్య చేసి తెచ్చినాఁడు. నాలుగు పేటల పలకసరులు కూడ చేయుచున్నాఁడు. పేరమ్మా ! నీ మగనికి నీమీఁద బహుదయ అని విన్నాను. నిజమేకదా !

పేర—ఎందుకువచ్చినదయ ? సంవత్సరమున కొకపర్యాయ మయినను పట్టుమని పదివరహాలనగ చేయించిపెట్టుట లేదుగదా ? పూర్వజన్మమునందు చేసికొన్న పాపముచేత నా కీజన్మమందు ఇటువంటి—

అప్పుడు ప్రక్కనునిలుచున్న మఱియొకతె—పేరమ్మా ! నీవు వృథాగా లేనిపోనివ్యసనము తెచ్చిపెట్టుకొనుచున్నావు. నీ కేమయిన అన్నమునకు తక్కువయినదా ? బట్టకు తక్కువయినదా ? మహారాజు వలె మగఁడు తిన్నగా చూచుచున్నప్పుడు నగలు లేకపోయిన నేమి ! మగనికి ప్రేమ లేకపోయినతరువాత, దిక్కుమాలిన నగ లెందుకు వట్టి మోతచేటు. చూడు మనగ్రామములో బంగారమ్మకు శరీరము నిండ సన్నినగ లున్నవో ! అనగలపేర్లె కొన్ని నేను వినలేదు. దీపములు పెట్టఁగానే వెళ్ళి దానిమగఁడు భోగముదానియింటిలోఁ గూరుచుండును. దాని కేమిసుఖ మున్నది ? నీ మగఁడెప్పుడును చీఁకటి పడ్డతరువాత వీధిగుమ్మము దాఁటఁడు.

పేర—నీవు చదువుకొన్నదానవు గనుక, కావలసినన్ని శ్రీరంగ నీతులు చెప్పఁగలవు. నీకువలె నా కెవ్వరికిని ఇటువంటి వేదాంతము

తెలియదు. నలుగురును నగలు పెట్టుకొనివచ్చినప్పుడు, వట్టి మోడు లాగున ఎక్కడికయినను పేరంటమునకు వెళ్ళుటకు నాకు సిగ్గగు చున్నది. జానకమ్మా! నీకు నామగనివంటి బీదవాడు—

జాన—పేరమ్మతల్లీ! నే నేమో తెలియక అన్నాను కోపపడకు అని బిందె ముంచుకొని వెళ్ళిపోవుచున్నది.

తక్కినవా రందఱును నీళ్ళు ముంచుకొని వెనుక నే బయలు దేఱి, "ఓసీ పూజారిపాపమ్మ చెంపకొప్పు పెట్టుచున్నది" "కరణము పెండ్లా మెంతయొయ్యారముగానడుచునో చూచినా నా" "అవ్వ్యాగారి గామమ్మ కేమిగర్వమో కాని మనుష్యులతో మాటాడనే మాటాడదే" "పుల్లమ్మ పట్టపగలే మగనితో మాటాడునఁట!" 'కన్నమ్మదగ్గఱ కొంచెము మెల్లగన్ను సుమీ' కరణముగారి సీతమ్మకునగ లేవో అని పరులమీఁది దోషముల నెన్నుకొనుచు మెల్లఁగ యిండ్లకు నడిచిరి. విద్యాగంధమేమియునెఱుఁగని మూఢవనితలకు మాటాడుకొనుట కంతకన్న మంచివిషయము లేమి దొరకును? అక్కడకు వచ్చెడిస్త్రీలు సాధారణముగా సంభాషించెడి యితర విషయములు సవతుల పోట్లాటలును, మామఱతల్లుల దుర్మార్గములును, మగల యనాదరణమును, మొదలైనవి తప్ప మఱియేమియు నుండవు.

అప్పుడు కుడిచేతిలో తాటాకులమీఁద వ్రాసిన పంచాంగమును బట్టుకొని, నీర్కావిదోవతి కట్టుకొని, మడత పెట్టిన చిన్న యంగవస్త్ర మొకటి బుజముమీఁద వేసికొని, మొగమునను దేహమునను విభూతిపెండెకట్లు స్పష్టముగా గానుపింప, నిమ్మకాయ లంతలేసి రుద్రాక్షలుగల కంఠమాలప్రకాశింప, రొండిని బెట్టుకొన్న పొడుముకాయ చిన్నకంటివలెఁ గనఁబడ, గట్టుమీఁదినుండిపోవుచు గోదావరిలో స్నానము చేయువారెవ్వరోయని కనులకుచేయి యడ్డముపెట్టుకొని నిదానించిచూచి, గిరుకున్న మళ్ళి యొక బ్రాహ్మణుఁడు మెట్లుదిగివచ్చెను.

బ్రాహ్మణుడు—"రుక్మిణమ్మగారూ! సంకల్పముచెప్పెదను స్నానము చేయండి"

రుక్మి—'నేను డబ్బు తీసుకొనిరాలేదే'

బ్రా—డబ్బుకేమి? మధ్యాహ్న మింటివద్ద నిత్తురుగానిలెండి; (అని వంగి నిలుచుండి) ఆచమనము చేయండి. కేశవా—నారాయణా—మాధవా—గోవిందా—పూర్వ మొగముగా తిరుగుండి. సూర్యునికేసి.

రుక్మి—స్నానము చేయవలెనా?

బ్రా—'సంకల్పము చెప్పెనిండి' అని పోడుముబుఱ్ఱను రొంటి నుండి తీసి, మూతతీసి రెండుమూఱులు నేలమీద మెల్లగా గొట్టి యెడమచేతిలో కొంత పొడుము వేసికొని మరల నెప్పటియట్ల మూతవేసి దానిను రొండిని దోవతిలో దోపుకొని యెడమచేతిలో నున్న పొడుమును బొటనవ్రేలితోను చూపుడు వ్రేలితోను పట్టుగలిగి నంత పెద్దపట్టును పట్టి బుఱ్ఱన పీల్చి రెండుముక్కులలోను ఎక్కించి, మిగిలినదానిని రెండవపట్టు పట్టి చేతిలో నుంచుకొని, ఎడమచేతిని కట్టుకొన్న బట్టకు రాచి ముక్కు నలుపుకొని, 'శుభేశోభనముహూర్తే శ్రీమహావిష్ణువరాజ్ఞయా — ప్రవర్తమానస్య — ఆద్యబ్రహ్మణః— ద్వితీయ ప్రహారార్థే — శ్వేతవరాహకల్పే — వైవస్వతమన్వంతరే — కలియుగే-ప్రథమపాదే- జంబూద్వీపే- భరతవర్షే — భరతఖండే — అస్మిన్ వర్తమానే వ్యావహారిక చాంద్రమానేన — కాళయుక్తి నామసంవత్సరే— దక్షిణాయనే — శరదృతౌ - కార్తీకమాసే — కృష్ణపక్షే-ద్వాదశ్యాం. ఇందువాసరే - శుభనక్షత్ర శుభయోగ శుభకరణాద్యనేకగుణ విశిష్టాయాం మాస్యాంశుభతిథౌ — క్షేమస్థైర్యవిజయాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థం - అఖండగౌతమీస్నానమహం కరిష్యే—మూడుమాఱులు స్నానము చేయుండి'.

రుక్మిణి, తఱుచుగా స్నానము చేయునది కానందున లోఁతు నీళ్ళలోనికి వెళ్ళుటకు భయపడి, మునుఁగుటకు చేతఁగాక మోఁకాటి లోఁతు నీళ్ళలోఁ గూర్చుండి కొప్పువిప్పుకొని దోసిలితోఁ దలమీఁద నీళ్ళు పోసికొనుచుండెను. అప్పుడు సంకల్పము చెప్పిన బ్రాహ్మణుఁడు డబ్బునిమిత్తము తరువాత వచ్చెద నని చెప్పి వెడలిపోయెను. అంతట రుక్మిణి బట్టకొంగుతోఁ దలతుడుచుకొని, శిరోజములు చివర ముడి వైచుకొని గట్టువంకఁ జూచి దూరమునుండి వచ్చుచున్న తండ్రిగారిని జూచి వేగిరము వేగిరము బయలుదేఱి, రాతిమీఁద బెట్టిన కుంకుమ పొట్లమును దీసి నొసట బొట్టుపెట్టుకొని, రెండుమాఱులు చేతితో నీళ్ళు చెంబుమీఁద పోసి తీసికొని, రెండడుగులు నదిలోనికిఁ బోయి నీళ్ళు ముంచుకొని, బట్టతిన్నగా సవరించుకొని, ఉతికిన బట్టలు భుజముమీఁదను వానిపయిని నీళ్ళతో నున్న బిందెయును పెట్టుకొని తనకొఱకయి కనిపెట్టుకొని యున్న సిద్ధాంతిగారి భార్యతోఁ గూడ గృహమునకుఁ బోవ బయలుదేఱెను.

మూడవ ప్రకరణము

రుక్మిణి యింటికిఁ బోవుట—గృహవర్ణనము—రాజశేఖరుఁడుగారు వచ్చి కచేరిచావడిలోఁ గూర్చుండుట—బంధుదర్శనము—స్వహస్తపాకియైన వైశ్వదేవపరుఁడు.

సిద్ధాంతిగారిభార్యయు రుక్మిణియు బయలుదేఱి సోపానము లెక్కి వీధిపొడుగునను దేవాలయముదాఁక తిన్నగా నడిచి, అక్కడ నుండి కుడిచేతివంక నున్నవీధిలోనికి మళ్ళి కొంతదూరము పోయిన తరువాత, రుక్మిణి తూర్పువైపు సందులోనికి రెండడుగులు పెట్టి నిలుచుండి వెనుక తిరిగి రెండుమాఱులు మెల్లగా దగ్గెను. ఆదగ్గుతో సిద్ధాంతిగారి భార్యకూడ నిలుచుండి 'అమ్మాయీ! నేనుండునా?' అని వెనుక తిరిగి పలికెను.

రుక్మి—'మంచిది. సోమిదేవమ్మగారూ! నాకొఱకయి మీరు చుట్టుతిరిగి యింటికి వెళ్ళవలసి వచ్చినదిగదా?'

సోమి—ఎంతచుట్టు? నిమిషములో వెళ్ళెదను.

రుక్మి—'పోయిరండి'

సోమి—బీదవాండ్రము మామీఁద దయయుంచవలెనుజుండీ.

రుక్మి—'దానికేమి? వెళ్ళిరండి' అని నాలు గడుగులు నడచి మరల వెనుక తిరిగి 'సోమిదేవమ్మగారూ! చెప్ప మఱచిపోయినాను. సాయంకాలము దేవాలయములోనికి వెళ్ళునప్పుడు మీ రొక్కపర్యాయము వచ్చెదరుకాదా?'

సోమి—అవశ్యము, ఆలాగుననే వచ్చెదను. నేను పోయి వస్తునా?

అని సోమిదేవమ్మ నడచినది. సిద్ధాంతిగారు గాని, ఆయన పెద్దలుగాని యెప్పుడును యజ్ఞము చేసినవారు కాకపోయినను, సోమి

దేవమ్మ పుట్టినింటి వంక వారిలో నొక్కరును యజ్ఞము చేసినవారు బొత్తిగా లేకపోలేదు. సాక్షాత్తుగా ఆమె పితామహుఁడే యజ్ఞము చేసి యేఁటేట నొక్కొక్కటిచొప్పున మూఁడుపదులమీఁద నాలుగు శ్రావణపశువులను బట్టి మఱి రంభాదులతో స్వర్గసుఖ మనుభవింపఁ బోయెను. సోమిదేవమ్మ తండ్రి యజ్ఞము చేయకపోయినను, తండ్రి యెంతో ధనవ్యయము చేసి సంపాదించుకొన్న పేళ్ళనుమాత్రము పోఁగొట్ట నిష్టము లేనివాఁడయి తన కుమారునకు సోమయాజు లనియు, కుమార్తెకు సోమిదేవమ్మ యనియు, నామకరణములు చేసెను. రుక్మిణియు సందులో నూఱుబారలు నడచి, అక్కడనుండి దక్షిణముగా తిరిగి, ఆసందులో రెండుగుమ్మములు దాఁటి పెరటి దారిని మూఁడవయిల్లు ప్రవేశించెను.

రాజశేఖరుఁడుగారి యిల్లు ఆకాలపుటిండ్లలో మిక్కిలి సుందర మైనది. వీధిగుమ్మమునకు రెండుప్రక్కలను రెండు గొప్ప అరుగులు కలవు. ఆ రెండుఅరుగులకును మధ్యనుపల్లముగా లోపలికిఁ బోవునడవ యున్నది. ఆనడవ మొగమున సింహద్వార మున్నది. ద్వారబంధపు పట్టెలకు గడపదాపున ఏనుఁగుతలమీఁద సింహము గూర్చుండి కుంభస్థలములను బద్దలు చేయుచున్నట్టు చిత్రముగా చెక్కఁబడి యున్నది. ఇరుప్రక్కలనుండు నాసింహములయొక్క శిరోభాగములు మొదలుకొని గొడుగుబల్లవఱకును పువ్వులును కాయలును గల లత చెక్కఁబడి యున్నది. ఈకమ్ములకు పయిగా రెండుప్రక్కలను కఱ్ఱగుఱ్ఱములు వీధిపై పునకు ముందటికాళ్ళు చాచి చూచువారిమీఁద దుముకవచ్చునట్లుగాఁ గానిపించును. ఈగుఱ్ఱముల కాళ్ళకే శుభదినములందు మామిడాకులతోరణములు గట్టుచుందురు. గుఱ్ఱముల రెంటికిని నడుమనుండు గొడుగుబల్లమీఁదఁ నడుమను

పద్మమును పద్మముల కిరుపార్శ్వములను గుత్తములవంటివి చిత్రము లయిన యానులును పువ్వులునుగల తీఁగెయును చెక్కఁబడియున్నవి. ఆతీఁగపైని కాళ్లు మోపి ఫలములను ముక్కుతో పొడుచుచున్నట్టు నడుమనడుమ చిలుకలు చిత్రింపఁబడి యున్నవి. వీధితలుపులకు బల మయినగ్రంధులు చేయఁబడి వానికంబడిసహిత మొకవిధ మయిన పుష్పలత మలఁచఁబడి యున్నది.

గుమ్మము దాటి లోపలికి వెళ్ళినతోడనే చావడి యుండెను. ఆచావడి కెదురుగా పెద్ద కుండు ఒకటియుండెను. వర్షము కురియు నప్పుడు నాలుగు వైపులనుండియు చూరు నీళ్ళాకుండులోఁ బడి వీధి చావడి క్రింద నుండు తూముగుండ వీధిలోనికిఁ బోవును. ఆకుండు కుత్తరపువైపునను దక్షిణపువైపునను ఒకదానికొకటియెదురుగా రెండు చావళ్ళుండును. అందు దక్షిణపుది కచేరిచావడి. దానిలో వివాహాదులయందు తాంబూలములకు పిలిచినబంధువులును పెద్దమనుష్యులును సభచేసి కూర్చుండఁగా, క్రింద భోగముమేళము జరుగుచుండును. ఇతరసమయములలో పెద్దమనుష్యులు చూడ వచ్చినప్పుడును, మధ్యాహ్నభోజన మయినతరువాత పురాణకాలక్షేపము జరుగునప్పుడును, శిష్యులవ్వడప్పుడు చదువుకోవచ్చినప్పుడును రాజశేఖరుఁడుగా రందుకూర్చుండురు. ఆచావడికి రెండుప్రక్కలను రెండు గదులు గలవు. ఆచావడి దక్షిణపువైపుగోడకు పొడుగునను చెక్కల తలుపు లుండి, తీసినప్పు డెల్లను సభవారిచెమట లార్పు మలయమారుతమును లోపలికిఁ బంపుచుండును. ఆతలుపులకు వెనుక పంచపాళియు, దానివెనుక పలువిధము లయినపూలమొక్కలతో నేత్రములకు విందుకొలుపు చిన్నదొడ్డి యుండెను. ఆచావడిలో మూఁడు గోడలకును నిలువెడెత్తునకుపయిని మేకులకు గొప్పపటములు

వేయఁబడియున్నవి. అందు దశావతారములును మాత్రమే కాక, కృష్ణుఁడు గోపికల వలువలు నెత్తికొనివచ్చి పొన్నచెట్టుమీఁదఁ గూర్చుండి వారిచేఁ జేతు లెత్తి మ్రొక్కించుకొనుచున్నట్టును, వెన్నలు దొంగిలినందు కయి తల్లి రోటను గట్టిపెట్టి దాని నీడ్చుకొని పోయి మద్దులఁ గూలఁద్రోచినట్టును, మఱియు ననేకవిధముల కృష్ణ లీలలుగల పటములును, కుమారస్వామి తారకాసురుని జంపుచున్నట్టును, పార్వతి మహిషాసురుని వధించుచున్నట్టును, శివుఁడు త్రిపురసంహారమును చేయుచున్నట్టును నున్న శివసంబంధము లయిన పటములును, విఘ్నేశ్వరుఁడు, సరస్వతి, గజలక్ష్మి, చతుర్ముఖుఁడు మొదలుగాఁగల మఱికొన్ని పటములును, గోడల నలంకరించుచుండును. ఉత్తరపుప్రక్కచావడియు నీవిధముగానే యుండును. గాని గోడ కొక్కగుమ్మము మాత్రమే యుండి, అది తరుచుగా మూయఁబడి యుండును. ఈచావడిలో రెండుమూఁడు పాతసవారీ లెప్పుడును వ్రేలాడఁ గట్టఁబడి యుండును. రాజశేఖరుఁడుగా రప్పుడప్పుడు గ్రామాంతరములకుఁ బోవునప్పుడును పెద్దమనుష్యు లెవ్వరయినఁ దఱుచుగా నెరు వడుగునప్పుడును ఉపయోగపడుచుండు క్రొత్తసవారిమాత్రము బురకా వేయఁబడి చావడిలో క్రిందనే పడమటిగోడదగ్గఱఁ జేర్పఁబడి యుండును. ఈచావడిగోడ కున్న తలుపు తీసి యుత్తరపు పంచపాళిలోనికి పోయినతోడనే దొడ్డిలో నుయ్యియొకటి కనఁబడును. అనూతిపయి నుండుగిలకలు కీచుధ్వని చేయుచుండ నిరుగుపొరుగులవారు సదా నీళ్ళుతోడుకొని పోవుచుందురు. అనూతికి పడమటివైపున ధాన్యము నిలువచేయు గాదెలు రెండు లోగిలిని చేరక ప్రత్యేకముగాఁ గట్టింపఁబడియున్నవి. నూతికి సమీపముగా వీధిలోనికి పాణిద్వార మొకటి యున్నది ఇంతవఱకు మునుపురుక్మిణివచ్చినదాద్వారముననే. ఆదారినే యిరుగుపొరుగువారు

వచ్చి నీళ్ళుతోడుకొని పోవుచుందురు. మఱియు మధ్యాహ్నసమయమున చుట్టుప్రక్కల నుండుస్త్రీలు వారిని చూడవచ్చునప్పుడును, రాజశేఖరుఁడుగారు కచేరీసావడిలోఁ గూర్చున్నకాలమున లోపలి యాఁడువారు వెలుపలికి వెళ్ళవలసినపుడును, అత్రోవనే వచ్చుచుఁ బోవుచుందురు.

లోపలికుండునకు నాలుగుప్రక్కలను పనసకాయలు చెక్కిన నాలుగు స్తంభము లున్నవి. వీధిచావడి కెదురుగానుండు పడమటి చావడిలో లోపలికిపోవు నడిమిగుమ్మ మొకటి యున్నది. ఆ గుమ్మమున లోపలికిఁ బోవఁగానే చావడియొకటి కనిపించును. ఆచావడికి దక్షిణపువైపున గుమ్మ మొకటి యున్నది. ఆద్వారమున లోపలికివెళ్ళిన రాజశేఖరుఁడుగారు బరుండుగదిలోఁ బ్రవేశింతుము. గదిలో నుత్తరపుగోడపొడుగునను దూర్పునుండి పడమటకు పందిరిపట్టెమంచము రాతిదిమ్మలమీఁద నాలుగుగాళ్ళకుమోపి వేయఁబడి యున్నది. మంచమునకుచుట్టును దోమతెరయును జాలరును దిగవేయఁబడి యున్నది. పందిరి స్తంభములకు నడుమను లక్కపూసిన కొయ్యపళ్ళెములును బరిణెలు నుండెను. పందిరికిమధ్యగా లక్కకాయలును పువ్వులునుగల చిలుకలపందిరియొక్కటి వ్రేలాడుచుండును. గోడలకు సున్నము వెల్లవేయఁబడియుండెను. గోడలపొడుగునను రుక్మిణియు తల్లియు నోపికచేసికుట్టిన గోడసంచులు తగిలింపఁబడి యుండెను. ఆ గోడసంచులకు కొంచెముమీఁదుగా గుడ్డచిలుకలు దారములతో త్రాళ్ళకు కట్టఁబడి గాలికి సుందరముగా కదలుచుండును. గోడకు పెద్దమేకులు కొట్టి వానిమీఁదఁబెట్టిన బల్లమీఁద కొండపల్లిబొమ్మలును లక్కపిడతలును గది కలంకారభూతముగా నుండెను. గోడ

పంచులు కొట్టిన మేకులకు దశావతారములు మొదలయిన పటములు చిన్నవి వేయఁబడియున్నవి. దక్షిణపుగోడకు శ్రీరాములవారి పట్టాభిషేకము తగిలింపఁబడి యున్నది. దానినే రాజశేఖరుఁడుగారు నిద్రలేచినతోడనే చూచి, ఆవల మఱియొకవస్తువును జూతురు. గదికిఁ బయిని అందమయిన బల్లకూర్పుకూర్పఁబడియుండెను. మంచమున కెదురుగా దక్షిణపుగోడపొడుగునను గడమంచెమీఁద వరుసగా కావడిపెట్టెలు పెట్టఁబడి యున్నవి. ఆ పెట్టెలలో సాధారణముగా ధరించుకొను వస్త్రములును నాగరలిపితో బంగారుకాకితములమీఁద వ్రాయఁబడిన రాజశేఖరుఁడుగారి సంస్కృతపుస్తకములును వేయఁబడియుండెను. గదిలో పడమటిగోడతట్టున పెద్దమంచస మొకటి గట్టితాళము వేయఁబడి యుండెను. ఆమంచసములోపలనున్న చిన్న తాళపుపెట్టెలలో నగలును పండుగుదినములలో ధరించుకొను విలువబట్టలును రొక్కమును ఉండును. చీఁకటిరాత్రులలో దొంగల భయము విశేషముగా నుండునప్పుడు రాజశేఖరుఁడుగారు ఆమంచసముమీఁదనే పఱపు వేయించుకొని పరుందురు. మంచసమునకును కావడిపెట్టెలున్న గడమంచెకును మధ్యను దక్షిణపువైపున గదినుండి దొడ్డిలోనికిఁ బోవుమార్గ మొకటి కలదు. ఆమార్గమున దొడ్డిలో ప్రవేశించినతోడనే విశాలమయిన చేమంతిమడి యొకటి పచ్చని పూవులతోను మొగ్గలతోను నేత్రోత్సవము జేయుచుండెను. దాని కొసను ప్రక్కను కొంచెముదూరమున మల్లెతీఁగెలు పందిరిమీఁద నల్లుకొని యకాలమగుటచే నప్పుడు పుష్పింపకపోయినను పచ్చనికాంతుల నీనుచు మనోహరముగా నుండెను.

రాజశేఖరుఁడుగారి పడకగది ముందటిచావడిలో దూలమునకుఁ జిలుకపంజర మొకటి వ్రేలాడఁగట్టఁబడియుండెను. అందులోనున్న చిలుక సదా "ఎవరువ్వారు" "ఎవరువారు" "పిల్లివచ్చె కొట్టు

కొట్టు" "కూర్చోయి తోటకూర" మొదలగు మాటలను సహజమధుర స్వరముతో పలుకుచుండును. ఆ దూలముననే మఱికొంత దూరమున రామాయణము మొదలయిన తాటాకులపుస్తకములు త్రాళ్ళతో వ్రేలాడఁ గట్టఁబడి యుండెను. ప్రొద్దుననే నిద్రలేచి రుక్మిణి చిలుకను పంజరమునుండి తీసి చేతిమీఁద నెక్కించుకొని "చేతిలో వెన్న ముద్ద" మొదలుగాఁ గల పద్యములను సహితము నిత్యమును నేర్పుచుండును. ఆకాలములోఁ దఱుచుగా స్త్రీలు చదువుకొను నాచారము లేకపోయినను, రాజశేఖరుఁడుగారు తన కుమార్తెమీఁది ముద్దుచేత దాని రుక్మిణికి గ్రొత్తపుస్తకము నక్షరాభ్యాసము చేయించి నర్థముచేసికొను శక్తిగలుగునంతవఱకు విద్యను చెప్పెను. ఆమె స్వభావముచేతనే తెలివిగల దగుటచే విద్యకూడ దానికి సాయమయి చిన్నతనములోనే యుక్తాయుక్తవివేకమును జ్ఞానమును గలదియాయెను. తండ్రి యామెకు చదువుచెప్పుటచూచి యసూయచేత నిరుగుపొరుగులవారు చాటున గుసగుసలాడుకొనిరి గాని, రాజశేఖరుఁడుగారు ధనికు లగుటవలన నేమియుఁ బలుక సాహసింపక పోయిరి. అట్లని వారు బొత్తిగా నూరకున్నవారుకారు. పెద్దవాఁడని రాజశేఖరుఁడుగారు గౌరవముతోఁ జూచుచుండెడి యొక యాప్తబంధుని మెల్లఁగా ప్రేరేపించి, ఆయనచేత అందఱును సభలోఁ గూర్చుండియుండఁగా "నాయనా! మనయింట నాఁడుపిల్లలను జదివించు సంప్రదాయము లేదే, మన రుక్మిణి నేలచదివించెదవు?" అనిపించిరి. రాజశేఖరుఁడుగారు విద్యవలని లాభముల నెఱిఁగిన వాఁ డగుటవలనను, స్త్రీవిద్య యేశాస్త్రమునందును నిషేధింపఁబడి యుండకపోవుటయు పూర్వపు పతివ్రత లందఱు విద్యావతు లయి యుండుటయు నెఱిఁగిన వాఁ డగుటవలనను ఆవృద్ధునివాక్యములను లక్ష్యము చేయక స్త్రీవిద్యాభ్యాసమున కనుకూలముగాఁ గొన్ని స్మృతివాక్యములను జదివి మీఁ

యభిప్రాయ మేమని సభలోనున్నవారి నడిగెను. వారందఱును మనసులో స్త్రీవిద్యయన్న నేవగించువారే యయినను రాజశేఖరుఁడు గారి యభిప్రాయము తెలిసినపిమ్మట దానికివ్యతిరిక్తముగా నేమియు జెప్ప నలవాటుపడినవారు కారు గావున స్త్రీవిద్యాభ్యాసమువలన గణనాతీతము లయిన లాభములు గలవని పొగడి రుక్మిణికి విద్యనేర్పుచున్నందున కయి రాజశేఖరుఁడుగారిని శ్లాఘించిరి.

చిలుకపంజర మున్నతావునుండి నాలుగుబారలు నడచిన తరువాత వడమటింటిద్వార మున్నది. వడమటియిల్లు విశాలమయి యేఁబదిమంది బ్రాహ్మణులు భోజనములు చేయుటకుఁ జాలియుండును. ఇఁకఁ గొంచెముసేపునకు భోజనములకు లేతు రనఁగా వెళ్ళి చూచినయెడల, మూరెడు మూరె డెడముగా రెండుగోడల పొడుగునను . పీటలును పీటలకుముందఱ పిండిముగ్గులతో పెట్టిన పట్లును చాలుగా నుండును. వడమటింటి యీశాన్యమూలను గచ్చుతోఁగట్టిన దేవునరుగు కలదు. ఆయరుగుపయిని 'భువనేశ్వర' మను దేవతార్చన సామానులును సాలగ్రామాదులును పెట్టు పెట్టె యుండును. ఆపెట్టె మీఁదనే రాజశేఖరుఁడుగారు మడితో నిత్యమును పారాయణచేయు శ్రీమద్రామాయణము సుందరకాండము పెట్టఁబడియుండెను. రాజశేఖరుఁడుగారు స్నానముచేసి వచ్చి దేవునరుగుముందఱ పీటవేసికొని కూర్చుండి రామాయణమును పంచపూజయు చేసికొందురు. దేవునరుగున కెదురుగా నున్నతలుపుతీసికొని యావలకు వెళ్ళినచో నొక పెరటిలోనికిఁబోవుదుము. అక్కడసున్నముతోను ఇటికలతోను కట్టిన తులసికోటయొకటి నాలుగైదడుగులయెత్తున నందమై యుండెను. ఆకోటలోపల లక్ష్మీతులసియు కృష్ణతులసియు శ్రద్ధాభక్తులతోఁ బెంపఁబడుచుండెను. ఆసమీపముననే కొంచెముదూరమున తులసివనమును

ఆవల నిత్తెమల్లిచెట్లును వాని చేరువనున్న నందివర్ధనపుచెట్టుమీఁద నల్లుకొన్న కాశీరత్నములును రాజశేఖరుఁడుగారికి నిత్యమును దేవతార్చన కయి పుష్పపత్త్రాదులను సమకూర్చుచుండును. ఆపైని రుక్మిణియుఁ జెల్లెలును బ్రేమతోఁ బెంచుకొనుచున్న బంతిచెట్లును, బొగడబంతిచెట్లును, చంద్రకాంతపుచెట్లును గోడ పొడుగునను వరుసగా నుండును. పడమటింటి నంటియే దక్షిణపువైపున నున్న వంటయింటి దొడ్డిలోపల నరఁటిబోదెలు పిలకలతో నిండియుండి చూపుపండువుగా నుండును. రాజశేఖరుఁడుగారు ప్రత్యహమును ఆబోదె మొదలనె స్నానము చేయుదురు.

వెనుక చెప్పినచొప్పున రుక్మిణి స్నానముచేసి వచ్చి గోదావరి నుండి చెంబుతోఁ దెచ్చిననీళ్ళను తులసికోటలోఁ బోసి మ్రొక్కి, తడిబట్టలతోనే చుట్టును మూఁడు ప్రదక్షిణములుచేసి, లోపలికిఁ బోయి తడిబట్ట వదలి పట్టుబట్ట కట్టుకొని యొకచేతిలోఁ గుంకుమబరిణియుఁ రెండవచేతిలో నక్షతలును బసపును బియ్యపుపిండియును గల గదుల పెట్టెయును బట్టుకొని వచ్చి, తులసికోటలో నంటియున్న ముందరివేదిక మీఁద నీళ్ళు చల్లి చేతితో శుభ్రముచేసి బియ్యపుపిండితో పద్మములు మొదలయిన వింతవింతల ముగ్గులను బెట్టుచు నడుమనడుమఁ జిత్రముగాఁ గుంకుమతోను పసపుతోను నలంకరించుచుఁ గూర్చుండి, మధురస్వరముతో మెల్లగా, 'లంకాయోగము'ను పాడుకొనుచుండెను.

ఈలోపుగా రాజశేఖరుఁడుగారు వెంట నున్న వారితో నానా విషయములను ముచ్చటించుచు నడుమనడుమ వారి కిర్రుచెప్పుల జోళ్ళ చప్పుడులలో నడఁగిపోయిన మాటలను మరల నడుగుచుఁ బలువురతోఁ గలసి యింటికి వచ్చి, పాదరక్షలను నడవలో విడిచి యొకరొకరేవచ్చి కచేరిచావడిలో రత్నకంబళములమీఁదఁ గూర్చుం

పగాఁ దామును దక్షిణపుగోడ కానుకొని యెంపలోనుండి నడిచి వచ్చినఁ బడలికచేఁ బట్టిన చెమ్మటపోవ నుత్తరీయముతో విసరు కొనుచునుఁ గూరుచుండిరి. అప్పుడు నంబిరాఘవాచార్యుఁడు నామముల తిరుమణి బెత్తికలు లేవ నెడమచేతిత్తో నస్దుకొని చేతులు నలుపు కొనుచు రాజశేఖరుఁడుగారి మొగముమీఁద జూడ్కి నిగిడించి, 'దేవరవారి కీనడుమ స్వామిమీఁద కొంచె మనుగ్రహము తక్కువగా నున్నది.' అని యొకచిఱునవ్వు నవ్వి లేచి నిలువఁబడి బట్టలోనున్న గన్నేరుపూలతో మాలెను దీసి చేతిలోఁ బట్టుకొని 'స్వామివారియందు బరిపూర్ణకటాక్ష ముంచవలెను' అని వినయముతోడఁ బలుకుచు మెల్లగా హస్తమునం దుంచెను.

రాజశేఖరుఁడుగారు భక్తితోఁ బుచ్చుకొని, 'యీనుధ్య మన జనార్దనస్వామివారికి జరగవలసిన యుత్సవము లేమయిన నున్నవా?' అని యడిగిరి.

రాఘ—పదిహేను దినములలో మార్గశిరశుద్ధ చతుర్దశినాఁడును, పూర్ణిమనాఁడును వరుసగా తిరుమంగయాళ్వారియొక్కయు, తిరుప్పాణాళ్వారియొక్కయు తిరునక్షత్రములు వచ్చుచున్నవి. అప్పుడు విశేషోత్సవములు జరగవలసి యున్నవి. నెలదినములలో ధనుర్మాసము వచ్చుచున్నది. ఆనెలదినములును స్వామికి నిత్యోత్సవములు సంక్రాంతి దినములలో నధ్యయనోత్సవమును జరగవలసి యున్నవి. ధనస్సులోనే పుష్యబహుళ ద్వాదశినాఁడు తొండరడిప్పొడియాళ్వారితిరునక్షత్రము వచ్చుచున్నది. ఆదినమున స్వామి యుత్సవముకన్నను విశేషముగా జరగవలెను.

రాజ—నిత్యమును స్వామికి బాలభోగమును నందాదీపమును క్రమముగా జరుగుచున్నవా?

రాఘు—తమరు ప్రతిమాసమును దయచేయించెడి రెండు రూపాయలును బాలభోగమునకు చాలకున్నవి. ఇప్పుడు స్వాము లధికముగా వచ్చుచున్నారు. నందాదీపముక్రిందఁ దమరు దయచేయు రూపాయతో మఱియొక రూపాయను జేర్చి యొకరీతిగా జరుపుకొని వచ్చుచున్నారు కాని నందాదీపములో మఱియొకరికి భాగముంచుట నాకిష్టము లేదు. స్వామికి బొత్తిగా వాహనములు లేవు; పొన్నవాహన మొక్కటి యుండెనా రేపటి యధ్యయనోత్సవములో నెంతయైన నిండుగా నుండును. అది యీ యేటికిఁ గాకపోయిన మీఁదటికైనను మీకే మాట దక్కవలెను. ముందుగా చెవిని వేసియుండిన నెందునకయినను మంచిదని మీతో మనవిచేసినాను.

రాజ—మొన్న దేవాలయములో స్వాములలో స్వాములేమో పోట్లాడినారఁట.

రాఘు—ద్వారకాతిరుమల నుండి వచ్చినస్వామి సాపాటుచేసి కూర్చుండి యుండఁగా, పెంటపాడునుండి వేంచేసినస్వామి పెరుమాళ్ళ సేవ చేసి వచ్చి కూర్చున్నారు. వారిద్దరిలో నొకరు తెంగలెవారును ఒకరు వడగలెవారును గనుక, నామముక్రింద పాద ముంచవచ్చును కూడదని మాటపట్టింపులు పట్టుకొన్నారు.

రాజ—ఊరకే మాటలతో సరిపోయినదా ?

రాఘు—తరువాతఁ గొంచెము చేయిచేయి కలసినదిగాని ముదర నీయక నేనును నాతమ్ముడును అడ్డమువెళ్ళి నివారించినాము.

రాజ—మన జనార్దనస్వామివారి క్షేమాత్రము మాన్యమున్నది?

రాఘు—ఏడుపుట్ల మాన్య మున్నదందురుగాని, అయిదుపుట్లు మాత్రము భోగమువాండ్రక్రింద జరుగుచున్నది. తక్కిన రెండుపుట్లు భూమియు అర్చకులదిగాని స్వామిది కాదు.

రాజ — మొన్న జరిగిన స్వామి యుత్సవములో భోగము మేళము రాలేదే.

రాఘు — వారన్ని యుత్సవములలోను రారు. రాజమహేంద్ర వరములో గాపుర మున్నారుగనుక చిల్లరవుత్సవముల కెల్ల బందోబస్తు చేసికొనివచ్చుట బహుప్రయాసము. ఒక్క స్వామి కళ్యాణదినములలో రథోత్సవమునాడు మాత్రము వత్తురు. అప్పుడు వారి బసత్తముక్రింద స్వామి ద్రవ్యములోనుండి నాలుగు రూపాయిలు మాత్ర మిచ్చుట యాచారము.

ఇంతలో నెవ్వరో ముప్పది సంవత్సరముల వయస్సుగల చామన చాయ గృహస్థు తెల్లబట్టలు కట్టుకొని కుడిచేతిలో నున్న పొన్నుకఱ్ఱ నాడించుచు, ముందఱ నొక కూలివాడు బట్టలమూటను నెత్తిమీఁదఁ బెట్టుకొని నడువ, నడవలోనుండి చావడిలోనికి చొరవగా నడచివచ్చి అచ్చట నిలువఁబడి, "ఓరీ! రామిగా! మూటఁ గోవలికిఁ దీసికొని పోయి యెవరినైనఁ బిలచి రాజశేఖరుఁడుగారు పరుండుగదిలోఁ బెట్టి రా" అని కూలివానిని నియమించి, కూరుచున్నవారి నందఱిని త్రోచుకొనుచు నడుమనుండి వచ్చి మున్నెంతో పరిచయము గలవాని వలెనే తాను రాజశేఖరుఁడుగారి ముందఱ తివాచిమీఁదఁ గూర్చుండెను. రాజశేఖరుఁడుగా రావఱకెన్నఁడును అతని మొగమే యెఱుఁగకపోయినను పెద్దమనుష్యుఁ డింటికివచ్చినప్పుడు మర్యాదచేయక పోయిన బాగుండదని, కొంచెము లేచి 'దయచేయుఁడ'ని చేయిచూపి తాను గొంచెము వెనుకకు జరిగి చోటిచ్చి "యింటివద్ద నందఱును సుఖముగా నున్నారా?" యని కుశలప్రశ్నమునుజేసి "మీరెవర"ని యడిగినఁ దప్పుపట్టుకొందురేమోయని సంశయించుచు నూరకుండిరి. అప్పుడావచ్చినాతఁడు తనపొడుముకాయను రాఘవాచార్యులవంక

చొర్లించి యాతని పొడుముబుర్రను పుచ్చుకొని, మునుపు చేతిలో నున్నపట్టును బారవైచి క్రొత్తపట్టు పట్టి నగమువీర్చి రాజశేఖరుఁడు గారివంకఁ దిరిగి "రాజశేఖరుఁడుగారు నను మఱచిపోయినట్టున్నారు!" అనెను.

రాజ—"లేదు లేదు." అని మొగమువంకఁ బాఱఁజూచిరి.

క్రొత్త—ఇంకను నానవాలుపట్టలేదు. మీరు నన్ను పది సంవత్సరముల క్రిందట రాజమహేంద్రవరములో రామమూర్తిగారి లోపలఁ జూచినారు. నేను వామరాజుభైరవమూర్తిని. మనమందర మును దగ్గఱబంధువులము. మీతల్లిగారి మేనత్తయల్లుఁడు మామేన మామగారికి సాక్షాత్తుగా నొకవేలువిడిచిన మేనత్తకొడుకు. మొన్న మాఅన్నగారు సాంబయ్యగారు మీయింట నెలదినములుండివచ్చినతరు వాత మీరుచేసిన యాదరణనే నిత్యమును సెలవిచ్చుచు వచ్చిరి. వెళ్ళునపుడు మీరుపెట్టిన బట్టలనుసహితము పెట్టెతీసి చూపినారు. దానిని జూచి మనబంధువులలో నొకరు మీ రింతయనుకూలమయిన స్థితిలోనున్నారని పరమానందభరితుఁడ నయినాను.

ఆమాటలు విని లోపలిగదిలోఁ బండుకొనియున్న యొక ముస లాయన దగ్గుచు లేచివచ్చి "ఓరీ భైరవమూర్తీ! నీ వెప్పుడు వచ్చి నావు?"

భైర—ఓహోహో! ప్రసాదరావుగారా? మీరు విజయం చేసి యెన్నాళ్ళయినది?

ప్రసా—"రెండుమాసములనుండి యిక్కడనే యున్నాను. బంధువని రాజశేఖరుని జూచిపోదమని వచ్చి యితనిబలవంతమునకు మాఱు చెప్పలేక యిక్కడఁ జిక్కుపడ్డాను. మన బంధువులలో రాజశేఖరుఁడు బహుయోగ్యుఁడు సుమీ" అని కూర్చుండెను.

రాఘ — తాతగారూ! మీకు రాజశేఖరుఁడుగా రెటువంటి బంధువులు?

ప్రసా — ఇప్పుడు మావాని బంధుత్వము విన్నారుగదా? వీని మేనమామ బావమఱఁది నాకుమార్తెయత్తగారి సవతితమ్ముఁడు.

ఈ ప్రకారముగా సంభాషణము జరుగుచుండఁగా లోపలినుండి స్త్రీకంఠముతో "సీతా! సీతా!" అని రెండుమూఁడు పిలుపులు వినఁబడినవి. అప్పుడు రాఘవాచార్యు లందుకొని, "అమ్మాయీ సీతమ్మా" అని పిలిచి లోపల అమ్మగా రెందుకో పిలుచుచున్నారు. అని చెప్పెను. అప్పుడు నూతివైపు పంచపాళిలోఁ దన యీడుపడుచులతోఁ గూడి గవ్వలాడుచున్న యేడుసంవత్సరముల యీడు గల చామనచాయపిల్ల పరికిణి కట్టుకొని కుడిచేతిలో సందెము వేయు గవ్వలను ఎడమచేతిలో గిళ్ళుగీచినసుద్దకొమ్మును బట్టుకొని 'వచ్చె వచ్చె' నని కేకలు వేయుచు కాళ్ళగజ్జెలు గల్లుగల్లుమన చావడిలోనుండి నడుమటింటి గుమ్మమువైపునకుఁ బరిగెత్తుకొని వెళ్ళెను. ఆ చిన్నది రాజశేఖరుఁడుగారి రెండవకుమార్తె. అట్లువెళ్ళి గుమ్మమున కీవలనే నిలుచుండి సీత — 'అమ్మా! ఎందుకుపిలిచినావు?'

మాణిక్యాంబ — నాన్నగారితో వంటయినదని స్నానమునకు లేవచ్చునని చెప్పు.

మాణిక్యాంబ రాజశేఖరుఁడుగారి భార్య. ఆమె రుక్మిణితో సమానమయిన తెలివి గలదియు విద్య నేర్చినదియుఁ గాకపోయినను, గృహకృత్యములను జక్కఁబెట్టుటయందును పాకము చేయుటయందును నిరుపమాన మయిన ప్రజ్ఞ కలది; రూపమున చాలవఱకు పెద్దకుమార్తెను పోలియుండునుగాని మొగము కొంచెము ముదురుదిగాను దేహచ్ఛాయ యొకవాసి నలుపుగాను కనఁబడును. ఆమె

ముప్పదినాలుగేండ్ల వయస్సు కల దయ్యును దూరమున నుండి చూచు టకు చిన్నదానివలెనే యుండును.

అంతట సీత మరలఁ జావడిలోనికిఁ బరుగెత్తుకొని వచ్చి, 'నాన్నగారూ! వంట అయినదఁట! అమ్మ స్నానమునకు లెమ్మను చున్నది' అని చెప్పి, యెప్పటియట్లు గవ్వలాడుట కయి నూతి పంచ పాళిలోనికిఁ బోయెను.

రాజ—ప్రసాదరావుగారూ! మీరుస్నానము చేయుదురేమో నూతిదగ్గఱకుఁ బొండి. భైరవమూర్తిగారూ! గోదావరికి వెళ్లెదరా? లేక నూతియొద్దనే నీళ్ళు పోసుకొనెదరా?

భైర—కార్తికసోమవారము గనుక గోదావరికే వెళ్ళెదను.

అప్పుడక్కడ నున్నవా రందఱును లేచి, రాజశేఖరుఁడుగారి యొద్ద సెలవు పుచ్చుకొని యెవరియిండ్లకు వారు వెళ్ళిరి. రాజ శేఖరుఁడుగారును పడమటింటిలోనికి నడచిరి. లోపల సానమీఁద గంధము తీయుచున్న మాణిక్యాంబ మట్టియలచప్పుడుతో పడమ టింటి దొడ్డి తలుపుకడకు నడచి, యొకకాలు గడప కీవలను రెండవ కాలు పంచపాళిలోను బెట్టి, కుడిచేతితో ద్వారబంధమును బట్టుకొని నిలువఁబడి 'రుక్మిణీ! బాబయ్యగారు స్నానమునకు వచ్చినారు; వేగిరము వచ్చి నీళ్ళందిమ్ము' అని కేకవేసెను. ఆ పిలుపు విని, దేవతార్చనకుఁ బూలు గోయుచున్న రుక్మిణి "వచ్చుచున్నాను" అని పలికి తొందరగా రాగిహరివాణముతో నిత్యమల్లెపుష్పములను తులసిదళములను దెచ్చి దేవున కరుగుమీఁద బెట్టి తండ్రిగారికి నీళ్ళిచ్చుటకయి వంటయింటి దొడ్డిలోనికిఁ బోయెను. మాణిక్యాంబ కంచుగిన్నెలలో గంధాక్షతలును గూటిలోనున్న యద్దమును విభూతి పెట్టెయు గొనివచ్చి దేవు నరుగువద్ద నున్న పీటదగ్గఱఁ బెట్టినది.

తోడనే లోపలినుండి నలువదియేండ్లు దాటిన విధవయొకతె పిడికిటి కట్టుకొనిన తడిబట్టచెఱఁగు నెత్తిమీఁదినుండి రానిచ్చి ముసుఁగు వేసికొని, పొయిలోనిబూడిద నొసటను బొట్టు పెట్టుకొని వెండి చెంబులజోటితో మడినీళ్లను దెచ్చి పీటయొద్ద నుంచెను. తరువాత రాజశేఖరుఁడుగారు స్నానముచేసి, జుట్టు తుడుచుకొని కొనలు ముడి వైచుకొని, అప్పుడాఱవేసినమడిబట్టను గట్టుకొని వచ్చి, దేవు నరుగుముందఱనున్న పీటమీఁదఁ గూరుచుండి యాచమనము చేసి, విభూతిపండు కొంచెము చిదిపి నీళ్లతోఁ దడిపి చేతి యంగుష్ఠమును కనిష్ఠికయుఁ దప్ప తక్కిన మూఁడువ్రేళ్లతోను నొసటను భుజములను కంఠమునను కడుపునను ఱొమ్మునను రేఖలను తీర్చి, భువనేశ్వరము తాళము తీసి విగ్రహములను సాలగ్రామములను పళ్లెములో నిడి మంత్రములు చదువుచు దేవతార్చనము నారంభించెను. ఇంతలో తక్కినవా రందఱును స్నానముచేసివచ్చి గోడల పొడుగునను పీటల మీఁదఁ గూరుచుండిరి.

భోజనమునకు రావలసినవా రందఱును లోపలికి వెళ్ళిన తరువాత మాణిక్యాంబ మడి విడిచి నడిమితలుపు వేసివచ్చి పడక గదిలో గూరుచుండి తమలపాకులు చుట్టుచుండెను. ఇంతలో వీధి తలుపువద్ద "రాజశేఖరుఁడుగారూ!" అని పిలుపుమీఁద పిలుపుగా పాలముకేకలు వలె నిరువది కేకలు వినఁబడెను. "వచ్చె వచ్చె" నని లోపలినుండి పలుకుచు మాణిక్యాంబ వచ్చులోపలనె, కేకలతోఁ గూడ తలుపుమీఁద దబదబ గుద్దులు వినఁబడెను. ఆమె వెళ్ళి తలుపుగడియ తీయునప్పటికి, నుదుట దట్టముగాఁ బెట్టినవిభూతి చెమ్మటతోఁ గలిసి చప్పిదౌడలకు వెల్లవేయఁ జెవులకుండలము లుయ్యాలలూఁగ ముడుతలు పడియున్న ముసలిమొగమును, అంగ

వస్త్రముతోఁ జేర్చి చుట్టినబట్టలసందునుండి కనఁబడు తెల్లని జుట్టు గలతలయును, లోపలి నీరుకావిగోవతులపై నున్న దర్భాసనముచే లావుగాఁగనఁబడు కృష్ణాజినపుచుట్టగల మూపులును, వీపునుండి కుడిభుజముమీఁదుగా వచ్చిన కృష్ణాసనపుత్రాడుకొనను గట్టఁబడ్డ రాగిజారీయును వారసంచియు గల యెండుఁబొమ్మునుగల నల్లని పొడుగయిన విగ్రహ మొకటి ద్వారబంధముపొడుగునను నిలువఁబడి యుండెను. తలుపుతీయఁగానే యావిగ్రహము తిన్నగా పడమటింటివైపునకు నడచి లోపల రాజశేఖరుఁడుగారి కెదురుగా నిలువఁబడెను.

రాజ——శాస్త్రులుగారూ! మీ దేయూరు?

శాస్త్రి——మాది కానూరగ్రహారము. మా యింటిపేరు బులుసువారు; నాపేరు పేరయ్యసోమయాజులు. మీకీర్తి జగద్విఖ్యాత మయినది. పదిమందిబ్రాహ్మణుల కింతయన్నము పెట్టినను సంభావన యిచ్చినను భూమిమీఁద సార్థకజన్మము మీదికాని నావంటి వ్యర్థుని బ్రతు కెందుకు?

రాజ——కార్తికసోమవారము మీరు రాత్రిదాక నుండెదరా?

సోమ——పెద్దవాఁడ నయినాను. ఇప్పు డుండలేను.

రాజ——సోమయాజులుగా రెండఁబడినట్టున్నారు. అట్లయిన వేగిరము నూతిదగ్గఱ నాలుగుచేదలనీళ్లు పోసికొనిరండి. వడ్డన యవుచున్నది.

సోమ——మీ భోజనములు కానిండి. నాదొక్కమనవియున్నది. నాకు స్వహస్తపాకము కావలెను. పొయ్యి కొంచెము గోమయముతో శుద్ధిచేసి నాలుగువస్తువులును అమర్చినయెడల స్నానముచేసి వచ్చి పాకము చేసికొనెదను.

రాజ—వేఱే పొయ్యిలేదు. మీరు దయచేసి మా పాకములోనికే రావలెను.

సోమ—నాకు స్త్రీపాకము పుచ్చుకోనని నియమము. మీ యింట వంటచేయువారు పురుషులేకదా?

రాజ—మా పినతల్లికుమార్తె వంటచేసినది. మాయింట నెప్పుడును స్త్రీలే వంటచేయుదురు.

సోమ—అయ్యో! స్త్రీపాకమే కాకుండ నియోగిపాకము గూడ నే నెట్లు పుచ్చుకొందును? కొంచెము త్రైసరు పెట్టించిన నేను వచ్చి దింపుకొనెదను.

రాజ—నేను సందర్భపడను. ఈపూట మీరు వేరేయొక్కడి కయిన విజయంచేయవలెను.

సోమ—(కొంచెముసేపనుమానించి) నే నెఱుఁగుదును. మీది మొదటినుండియు శిష్టసంప్రదాయము—మీతాతగా రెంతో కర్మిష్ఠులు; మీతండ్రిగారు కేవలము బ్రహ్మవేత్త. మీయింట నాకభ్యంతరము లేదుగాని యొకచోట భోజనముచేసినానన్న మఱియొకచోటనుగూడ నాలాగున నేచేయుమందురు. నే నిక్కడభోజనము చేసినమాటను మీరు రహస్యముగా నుంచవలెను. కార్తికసోమవారముగనుక గోదావరికిఁబోయి నిమిషములో స్నానముచేసి వచ్చెదను. ఇంతలో వడ్డనకానిండి.

అని పేరయ్యసోమయాజులు కృష్ణాజినమును నారసంచియు నట్టింటఁబెట్టి గోదావరికిఁ బోయి స్నానముచేసివచ్చి, కృష్ణాజినమును చావడిలో క్రిందఁబఱచి దానిమీఁద దర్భాసనము వేసికొని కూర్చుండి, గోముఖములోఁ జేయిదూర్చి లోపల రుద్రాక్షమాలను త్రిప్పుచు కన్నులుమూసికొని జపముచేయ నారంభించెను. ప్రసాదరావు నల్లమందువాఁడ నని తొందరపడుటను వడ్డించి యున్న యన్నమును

కూరలును చల్లారిపోవుటను జూచి లోపల విస్తళ్ళముందటఁ గసిపెట్టు కొనియున్నవారు లేచివచ్చి పలుమాఱు పిలువఁగాఁబిలువఁగా, సోమయాజులు రెండుగడియలకు మౌనముచాలించి లేచివచ్చి విస్తరి ముందటఁ గూరుచుండెను. అప్పు డందఱును పరిషేచనములుచేసి భోజనముచేయ మొదలుపెట్టిరి.

రాజ—రాజమహేంద్రవరమునుండి శుభలేఖ తీసికొనివచ్చిన నీళ్ళకావడి వెంకయ్యజాడ లేదు. ఎక్కడఁ గూర్చున్నాఁడు?

వెంక—అయ్యా! అయ్యా! ఇదిగో సోమయాజులుగారి వెనుక మూల విస్తరివద్దఁ గూరుచున్నాను.

సోమ—ఈపాకము దివ్యముగా నున్నది. దీనిముందఱ నల భీమపాకము లెందుకు?

వెంక—సోమయాజులుగారూ! నిన్న సత్రములో వండిన నీరకాయి యింతరుచిగా లేకు నుండీ!

రాజ—ఏసత్రము?

వెంక—నిన్న రాజమహేంద్రవరములో నొకకోమటియింట గృహప్రవేశమునకు సంతర్పణ జరగినది. బొల్లిపేరయ్యగాఁడు వంటచేసి నాఁడు. అక్కడ సోమయాజులుగారును నేనును ఏకపఙ్క్తినే కూరు చున్నాము.

ఈ ప్రకారముగా నన్యోన్యసంభాషణములు గావించుకొనుచు భోజనముచేసి యందఱును పడమటింటి దొడ్డిలో చేతులు కడుకొని తేన్చుచు బొజ్జలు నిమురుకొనుచు వచ్చి చావడిలోఁ గూర్చుండిరి. సోమయాజులుగారు మొట్టమొదట నాలుగుదినము లుండఁదలఁచు కొనియే వచ్చినను, భోజనసమయమున జరగిన ప్రసంగమునుబట్టి నిలువ మనసొప్పక సంభావనను సహిత మడగకయే వెంటనే తాంబూలము బుచ్చుకొని నడచిరి.

నాల్గవ ప్రకరణము

పురాణకాలక్షేపము - రాజశేఖరుఁడుగారి స్థితి - ఆయన బావమఱఁది దామోదరయ్య చరిత్రము-మిత్రుఁడు నారాయణమూర్తి కథ-ఎఱుక యడుగుట.

రాజశేఖరుఁడుగారు భోజనము చేసిన తరువాత ఒక్క నిద్ర పోయి లేచి, తాంబూలము వేసికొని కచేరిచావడిలోనికి వచ్చి కూర్చుండిరి. అంతకుమునుపే గ్రామమునఁ గల పెద్దమనుష్యులు పలువురు వచ్చి తగినస్థలములలోఁ గూర్చుండి యుండిరి. అప్పుడు రాజశేఖరుఁడుగారు 'సుబ్రహ్మణ్యా!' అని పిలిచినతోడనే 'అయ్యా' అని పలికి లోపలినుండి పదియాఱు సంవత్సరముల వయసుగల యొక చిన్నవాఁడొకఁడు వచ్చి యెదుర నిలుచఁబడెను. అతఁడు రాజశేఖరుఁడుగారి జ్యేష్ఠపుత్రుఁడు; సీత పుట్టిన తరువాత రెండు సంవత్సరములకు మఱియొక పిల్లవాఁడు కలిగెనుగాని యా చిన్నవాఁడు పురుటిలోనే సంధుగొట్టి పోయెను. ఆవెనుక మాణిక్యాంబకు కానుపు లేదు. సుబ్రహ్మణ్యముయొక్క మొగ మందమైనదేకాని మూఁడేండ్ల ప్రాయమున బాలరోగము వచ్చినప్పుడు పసపుకొమ్ములతోఁ గాల్చిన మచ్చమాత్రము నొసటను గొంచెము వికారముగానుండెను; కన్నులు పెద్దవి; నుదురు మిట్టగా నుండెను; తలవెండ్రుకలు నిడుపుగాను నల్లగాను ఉండెను. చేతుల బంగారు మురుగులును చెవులను రవల యంటుజోడును అనామికను పచ్చదాపిన కుందనంపుపని యుంగరమును ఉండెను.

శివ

రాజ—సుబ్రహ్మణ్యా! ఇంతవఱకుఁగూడ నీవు మధ్యాహ్నము భోజనమునకు వచ్చినావుకావేమి?

సుబ్ర—కార్తీకసోమవారము గనుక, ఈదినము రాత్రిదాక నుండి మఱి భోజనము చేయవలెననుకున్నాను.

రాజ—లోపలఁ బల్లమీఁదఁ ఆదిపర్వ మున్నది తీసికొని వచ్చి శాస్త్రులుగారిని వెళ్లి పిలుచుకొని రా.

తండ్రి యాజ్ఞ ప్రకారము సుబ్రహ్మణ్యము లోపలికి వెళ్ళి పుస్తకమును దీసికొనివచ్చి తండ్రిచేతి కిచ్చి, నడవలో నుండి నడచి వీథిగుమ్మము మెట్లు దిగుచు, దూరమునుండి వచ్చుచున్న యొక నల్లని విగ్రహమును జూచి 'వేగిరము రండి' అని కేక వేసి, తాను మరల వచ్చి శాస్త్రులుగారు వచ్చుచున్నారని చెప్పి చావడిలో నడుముగా పుస్తకమును ముందఱఁ బెట్టుకొని కూర్చుండెను. ఇంతలో శాస్త్రులును బుజముమీఁద చినిగిపోయిన ప్రాఁతశాలువను మడతపెట్టి వేసికొని, బంగారము తాకెత్తుటచే నడుమునడుమ లోపలి లక్క కనఁబడుచున్న కుండలములతో చెవుల నల్లలనాడుచుండ వచ్చి సభలోఁ గూర్చుండెను. రాజశేఖరుఁడుగారు సాహిత్యపరులయ్యును, ఆకాలము నందు పెద్ద పుస్తకమును జదివి మఱియొక పండితునిచే అర్థము చెప్పించుట గొప్ప గౌరవముగా నెంచబడుచుండును గనుక, ఆశాస్త్రులు వచ్చువరకును పుస్తకమును జదువక గనిపెట్టుకొని యుండిరి.

రాజ—మీ రీవేళ నింత యాలస్యముగా వచ్చినారేమండీ ?

శాస్త్రి—ఇంతకుమును పాకపర్యాయమువచ్చి చూచిపోయి నాను. తమరు లేవలేదని చెప్పినందున, పేటయొక పెద్దమనుష్యునితోఁ గొంచెము మాటాడవలసిన పనియుండఁగా మీరు లేచుచున్నప్పటికి మరల వత్తమని వెళ్ళినాను. ఆయనతో మాటాడుట కొంచె మాలస్యమయినది. క్షమించవలెను—నాయనా! సుబ్రహ్మణ్యమూ పుస్తకము విప్పు.

సుబ్రహ్మణ్యము పుస్తకమును విప్పుచు, 'తుంగవము నేనెంత మును దోరపుణ్యయు' యను విశ్వేశ్వర స్తవపద్యమును ప్రారంభించి చదువుచుండఁగా శాస్త్రులందుకొని యాపద్యము కడపటను సలుపుట తరువాత, 'అంజలిఁజేసి మ్రొక్కెద మదంబకు' మొదలుగాఁగల సరస్వతీ ప్రార్థనమును, పిమ్మట 'ప్రాంశుపయోదనీలతను భాసితు' మొదలుగాఁగల వ్యాసస్తోత్రములను, పిదప మఱికొన్ని పద్యములను తానుగూడ కలిపి చదివెను. ఈలోపల సుబ్రహ్మణ్యము గతదినమున విడిచిపెట్టిన భాగమును దీసి, అర్జునుఁడు ద్వారకానగరమునకు వెళ్ళిన భాగమునందలి

"ద్వాదశ మాసికవ్రతము ధర్మవిధిం జరపంగ నేగి గం
గాదిమహానదీ హిమవదాది మహాగిరిదర్శనంబు నీ
పాదపయోజదర్శనము సన్నగఁజేయుటఁ జేసి పూర్వసం
పాదితసర్వపాపములు వాసె భృశంబుగ నాకు నచ్యుతా!"

అను పద్యమును జదివెను. అప్పుడు శాస్త్రులు పద్యములో నున్నవి కొన్నియు లేనివి కొన్నియుఁ గల్పించి దీర్ఘములు తీయుచు నర్థముచెప్ప మొదలుపెట్టెను. అర్థము చెప్పుచున్న కాలములో సుబ్రహ్మణ్యము పుస్తకముయొక్క సూత్రమునకుఁ గట్టియున్న పుడకను జేతిలోఁ బట్టుకొని త్రిప్పుచుండెను. అదిచూచి శాస్త్రులు ఉలికిపడి ముక్కుమీఁద వ్రేలు వైచుకొని 'పుస్తకము చదువుచుండఁగా దాని నాప్రకారము ముట్టుకోవచ్చునా? వ్యాసులవారు దానిమీఁదఁ గూరుచుందురే' యని దగ్గఱ నున్నవారి కావిషయ మయినకథ నొకదానిని జెప్పెను. ఆమాటమీఁద నందులో నెవ్వరో యడిగినదానికిఁ బ్రత్యుత్తరముగా, 'వ్యాసులవారు దగ్గఱనుండి వెళ్లుచుండినంగాని వారు స్మరణకు రారసియు, వారప్పు డామూర్ఖ

మునసే యాకాశముమీఁద దివ్యవిమాన మెక్కి వెళ్ళుచున్నారనియు చెప్పి ఆకాశమువంకఁజూచి కన్నులు మూసికొని మూఁడునమస్కార ములు చేసెను. ఈప్రకారముగా సంజవేళకు ఆదిపర్వము ముగిసి నందున నాటికిఁ బురాణకాలక్షేపమును జాలించి "స్వస్తిప్రజాభ్యః" మొదలుగాఁ గల శ్లోకమును జదివి యెవరియిండ్లకు వారు వెళ్లి పోయిరి.

రాజశేఖరుడుగారి యింటికి నిత్యమును బంధువులు నలువది తరములు గడచిపోయినను వంశవృక్షములుసహితము చూచుకో నక్కఱలేకయే తమబంధుత్వము జ్ఞాపకముంచుకొని రాజశేఖరుఁగారి మీఁదిప్రేమచేత నాతనినిచూచి యాదరించిపోవలెనను నుద్దేశముతో వచ్చి నెలలకొలఁదినుండి తినిపోవుచు వస్త్రములు మొదలగువానిని బహుమానములు నొసయు నొందుదురు. ఊరనుండు పెద్దమనుష్యులు అపరిచితులయినవారును గూడ రాజశేఖరుఁడుగారియింట వంట దివ్య ముగా జేయుదు రని శ్లాఘించుచు నెలకు నగముదినము లచ్చటనే భోజనములు చేయుచుందురు; వారు చేయుస్తోత్రపాఠముల కుబ్బి రాజశేఖరుఁడుగారును వారువచ్చినప్పుడెల్ల పిండివంటలును క్షీరాన్న మును మొదలగువానిని చేయించి వారిచేత మెప్పువడయఁ జూచు చుందురు. అన్న ముడుకకపోయినను, పులుసు కాగకపోయినను, పప్పు వేగకపోయిననుకూడ వారివంట బాగుండలేదని యెవ్వరును జెప్పలేదు——ఊరకే వచ్చినపదార్థమునం దెప్పుడును రుచి యధిక ముగా నుండునుగదా? కొందఱు బంధువులు తాము వెళ్ళునప్పుడు కొంత సొమ్మును బదులుపుచ్చుకొని అదివఱకుఁ దఱచుగా వచ్చుచుఁ బోవుచు నుండువారేయైనను అంతటినుండి తీరికలేక బదులుతీర్చుట కయి మరల నెప్పుడును వచ్చెడివారుకారు. ధనవంతుఁడు గనుక

ఆయన కెల్లవారును మిత్రులుగా నుండిరి—ఆ మిత్రసహస్రములలో నొకఁడైనను నిజమైనయాప్తుఁ డున్నాఁడో లేఁడో యన్న సంగతిని మాత్ర మాయనకు ధనలక్ష్మి తెలియనిచ్చినదికాదు. అట్టి మిత్రోత్తములందరును రాజశేఖరుఁడుగారికి స్తుతిపాఠములతో భూమిమీఁదనే స్వర్గసుఖమునుగలిగించి యాయన నానందింపఁ జేయుచుండఁగా నాయన యిచ్చెడి ధనకనకవస్తువాహనముల నాతని ప్రీతికై యంగీకరించుచుండిరి. నిత్యమును యాచకు లసంఖ్యముగావచ్చి తమ కష్టకథలను గాథలుగాఁ జెప్పి చినబుకుఁ దమ కేసుయునను ఇష్మాని తెల్పుచుందురు—అట్టివారు నటించెడి యాచనల నన్నిటిని ఆతఁడు నిజమయినవానినిగానే భావించి సాహాయ్యము చేయుచుండును. కొందఱు బ్రాహ్మణులు పిల్లవానికి వివాహము చేసికొనెద మనియు, ఉపనయనము చేసికొనెద మనియు, తాము యజ్ఞములు చేసెద మనియు, సత్రములు సమారాధనలు చేయించెద మనియు, చెప్పి యాయనవద్ద ధనమార్జించుకొని పోవుచుందురు. మిత్రుల వేషముల కయి రాజశేఖరుఁడుగారియింట రాత్రులు తరుచుగా గానవినోదములును నాట్యవిశేషములును జారిపోతాది నాటకగోష్ఠులును జరుగుచుండును. మోసగాండ్రు కొందరు తమకమ్ముడుపోని యుంగరములు మొదలగు వస్తువులను దెచ్చి, వానిలోఁ జెక్కినరాళ్ళు వెలయొత్తఁగి కొనఁగలిగిన సరసులు రాజశేఖరుఁడుగారు తప్ప మఱియొకరు లేరని ముఖప్రీతిగా మాటలుచెప్పి వస్తువు లంత వెల చేయకపోయినను మాటలనే యెక్కువవెలకు విక్రయించి పోవుచుందురు. గ్రామములోని వైదికబృందముయొక్క ప్రేరణచేత సప్తసంతానములలో నొకటైన దేవాలయనిర్మాణముఁ జేయ నిశ్చయించుకొని, రాజవరపుకొండనుండి నల్లరాళ్ళు తెప్పించి రాజశేఖరుడుగారు రామపాదక్షేత్రమునకు సమీపమున నాంజనేయునకు గుడికట్టింప నారంభించి నాలుగు

సంవత్సరములనుండి పనిచేయుచుండెను. కాని పని సగముకంటె నెక్కువ కాకపోయినను పనివాండ్రచే పనిచేయింపఁ దిరుగుచుండెడి యాశ్రితులును మాత్రము కొంతవరకు భాగ్యవంతులయిరి. ఈప్రకారముగాఁ దన్ననాదరము చేసి యితరులపాలు చేయుచువచ్చుచున్నందున, ధనదేవత కాతనియం దాగ్రహమువచ్చి లేచిపోవుటకు బ్రయత్నము చేయుచుండెను గాని చిరపరిచయమునుబట్టి యొక్కసారిగా విడువలేక సంకోచించుచుండెను. ఈసంగతిని దెలిసికొని దారిద్ర్యదేవత యప్పుడప్పుడువచ్చి వెలుపలనుండియే తొంగిచూచుచు, భాగ్యదేవత యాతనిగృహము చోటుచేసినతోడనే తాను బ్రవేశింపవలెనని చూచుచుండెను. రుక్మిణి వివాహములో నిచ్చిన సంభావననిమిత్తమై రాజశేఖరుఁడుగారికి మాన్యములమీఁదఁ గొంతఋణమైనందున దానిమీఁద వడ్డి పెరుగుచుండెనేకాని మఱియొకతొందర యేమియును గలుగుచుండలేదు.

రాజశేఖరుఁడుగారివలన బాగుపడినవారు పలువు రున్నను వారిలోనెల్ల దామోదరయ్యయు, నారాయణమూర్తియు ముఖ్యులు. ఆయిద్దరిలో దామోదరయ్య రాజశేఖరుఁడుగారి బావమఱఁది; రాజశేఖరుఁడుగారి తోడఁబుట్టిన పడుచునే యాతని కిచ్చిరి. కాని యామె ఒక్కకుమారునిమాత్రము గని కాలము చేసెను. ఆకుమారున కిప్పుడు పదియేనువత్సరము లున్నవి; అతనిపేరు శంకరయ్య. అతని కెనిమిది సంవత్సరములు దాటకముందే తల్లి పోయినందున, అతఁడు చిన్నప్పటినుండియు మేనమామగారియింటనే పెరిగినాడు. అతనికే సీతనిచ్చి వివాహముచేయవలయునని తల్లిదండ్రుల కిద్దరికిని నుండెను. భార్యపోయినతరువాత దామోదరయ్య రాజశేఖరుఁడుగారి సాయముచేతనే రెండవవివాహము చేసికొనెనుగాని యాచిన్నది

పెండ్లినాటికి తొమ్మిదిసంవత్సరములలోపు వయస్సుగలది. గనుక, ఈపె కాపురమునకు వచ్చి రెండుసంవత్సరములుమాత్రమే యయినది. ఆతనికి ద్వితీయకళత్రమువలన సంతానమింకను కలుగలేదు. దామోదరయ్య మొదటినుండియు మిక్కిలి బీదవాఁడు; ఆతనికి రాజశేఖరుఁడుగారి చెల్లెలి నిచ్చునప్పటికి రాజశేఖరుఁడుగారి తండ్రియు ధనవంతుఁడు కాఁడు. వారిది పూర్వము వసంతవాడ నివాసస్థలము. రాజశేఖరుఁడుగారి తండ్రి తనయింటికి గోడలు పెట్టించుట కయి పునాదులు త్రవ్వించుచుండఁగా నొకచోట నిక్షిప్తమైయుండిన ధనము దొరకినది. ధనము దొరకినతరువాత స్వప్నములో నున్న నిక్షేపగాఁగన ముంచెనని యాచించినదో, లోకుల యోర్వలేనితనమునకు జడిసియో రాజశేఖరుఁడుగారి తండ్రి దారపుత్రులను సహితముగా వెంటఁబెట్టుకొని వచ్చి యిప్పటినుండియు ఈ ధనశాలిగాను ప్రధానముగా నుండి యీచుట్టుపట్టులనే మాన్యములు గొని కొంతకాలమునకు మరణము నొందెను. భాగ్యహీనుఁడగుటను దామోదరయ్య రాజశేఖరుఁడుగారి యింటనే యుండి, ఆయన పేరుచెప్పి ధనము నితరులవద్ద తెచ్చి తా నపహరించుచుఁ బయికిఁ జాలిమాలినయట్లు దాచుకొనుచుండెను. తరువాత అప్పులవారు వచ్చి తొందరపెట్టి నప్పుడు రాజశేఖరుఁడుగారే సొమ్మిచ్చుకొనుచుండిరి. తోడఁబుట్టిన పడుచు పోయినతరువాత దామోదరయ్య చేయు నక్రమములను సహింపలేక యొకనాఁడు రాజశేఖరుఁడుగా రాతనిని కఠినముగా మందలించిరి. అందుమీఁదఁ గోపము వచ్చి దామోదరయ్య తన్ను బావమఱఁది కట్టుబట్టలతో నిల్లు వెడలఁగొట్టినాఁడని యూరివా రందరిముందఱఁ జాటుచు దేశాంతరమునకు లేచిపోయి, యాఱు నెలలకు గడ్డమును తలయును బెంచుకొని మరల వచ్చి, భూత

వైద్యుఁడ నని వేషము వేసికొని నుదుట పెద్దకుంకుమబొట్టు పెట్టుకొని వీథులవెంబడి తిరుగుచుండెను. ఆవరకే దామోదరయ్య తా నార్జించుకొన్న ధనమును నేఱుజాగ్రత్త చేసికొన్నందున అప్పు డాధనముతో నొక యిల్లుగట్టి ఆ గ్రామములోనే ప్రత్యేకముగా నొక చోఁట గాపురముండెను. అతని భూతవైద్యము నానాఁటికి బలపడినందున ఊర నెవ్వరికైన కాలిలో ముల్లుగుచ్చుకొన్న నాతనిచేత విభూతి పెట్టించుచుందురు. ఈవిధముగా దామోదరయ్య భాగ్యవంతుడగుటయేగాక, జనులచేత మిక్కిలి గౌరవమునుసహితము పొందుచుండెను.

రెండవయాతఁడైన నారాయణమూర్తి మొదట సద్వంశమునఁ బుట్టినవాఁడేకాని దుర్మార్గులతో సాహవాసముచేసి తనకుఁగల కాసువీసములను వ్యయము జేసికొని బీదవాఁడయ్యును పయికి ధనికునివలె నటించుచుండెను. అతనికి భాగ్యము పోయినను దాని ననుసరించియుండిన చిహ్నములుమాత్రము పోనందున, నారాయణమూర్తి తఱుచుగా రాజశేఖరుఁడుగారి యింటికి వచ్చుచు రహస్యమని చెప్పి రాజశేఖరుఁడుగారిని లోపలికిఁ బిలుచుకొనిపోయి తన యక్కఱను దెలిపి సొమ్ము బదులడుగుచుండును. ఆఋణము మరల తీరునది కాదని దృఢముగా నెఱిఁగియు, రాజశేఖరుఁడుగారు మానవతుల గౌరవమును కాపాడుచుండుటయందు మిక్కిలి యభిలాష కలవారు గనుకను, అతఁడు చిన్నతనములో తనసహపాఠిగనుకను, అడిగినమొత్తమును రెండవవాఁ రెఱుఁగకుండ చేతిలోఁ బెట్టి పంపుచుందురు. ఆతఁ డాధనముతో సరిగవస్త్రములు సుగంధద్రవ్యములు మొదలగువానిని గొనుచు మిత్రులకు షడ్రసోపేతముగా విందులు చేయుచుండును. ఇదిగాక యాతఁడితరస్థలములలోఁ జేసిన ఋణములకయి ఋణప్రదా

లు కొందరపెట్టినందున, రాజశేఖరుఁడుగారు తన సొంతసొమ్ములో
నుండి యప్పుడప్పుడు మూఁడువేల రూపాయలవఱకు నిచ్చి యాతనిని
ఋణబాధనుండి విముక్తునిజేసిరి. రెండుసంవత్సరములక్రిందట నారా
యణమూర్తియొక్క పెత్తండ్రిభార్య సంతులేకుండ మృతినొందినం
దున, ఆ సొత్తు పదివేలరూపాయలు అతనికిఁజేరెను. ఆసంగతి విని
నంతనే రాజశేఖరుఁడుగారు పరమానందభరితులై నారాయణ
మూర్తియింటికిఁబోయి యాతని నాలింగనము చేసికొని తనకీయ
వలసిన యప్పును దీర్పవలసినపని లేదనియు యింక స్వధనముతోను గౌర
వముతో సుఖజీవనము చేయవలసిన దనియు జెప్పి యాదరించిరి. రాజ
శేఖరుఁడుగారి కృపకు బదులు చేయవలసిన యావశ్యకమంతగా కా
న్పింపనందునను, ధనము విశేషముగ నున్నందునను నారాయణమూర్తి
కావలసినయెడల తనధనమును వాడుకోవచ్చునని రాజశేఖరుఁడుగారితో
బలుమారు పూర్వము చెప్పుచు వచ్చెను.

ఒకనాఁడు నాలుగుగడియల ప్రొద్దెక్కినతరువాత రాజశేఖరుఁడు
గారు కచేరీచావడిలోఁ బలువురతోఁ గూరుచుండియున్న సమయ
మున రుక్మిణి నూతివద్దకువచ్చి యక్కడనుండి పెరటిగుమ్మముదగ్గఱకు
పోయి లోపలనే నిలుచుండి, తరిగిన గుమ్మడికాయ పెచ్చులను వీధిలోఁ
బాఱవేయ వచ్చిన పొరిగింటివారి దాసీపడుచుతో మాటాడుచుం
డెను. అప్పుడు చేతిలో తాటాకుగిలకగుత్తుల నాడించుచు నెత్తి
మీఁద నొకబుట్ట పెట్టుకొని యొక్క యెఱుకత యామార్గమునఁ
బోవుచు రుక్మిణి మొగమువంక నిదానించి చూచి నిలువఁబడి
"అమ్మా! నీకు శీఘ్రముగానే మేలు కలుగుచున్నది; భాగ్యము కలుగు
చున్నది. నీమనసులో నొక విచారము పెట్టుకొని కృశించుచున్నావు.
ఎఱుక యడిగితే నీమనసులో నున్నది నూటిగాఁ జెప్పెద" నని చెప్పెను.

ఆమాటలు విని యాప్రబోధికను దొడ్డిలోనికిఁ బిలుచుకొని పోయి కొట్లచాటునఁ గూరుచుండఁబెట్టి తానులోపలికిఁబోయి చేటలో బియ్యము పోసి తెచ్చి యాబియ్యమును దనచేతిలో నుంచుకొని ముమ్మాఱు తనచేయి ఫాలమున మోపి మ్రొక్కి కార్యమును తలఁచుకొని రుక్మిణి తన చేతిలోనిబియ్యమును చేటలో విడిచిపెట్టెను. అప్పు డామె యుక్తత తాను వర్ణించినరీతిగా నిష్టదేవతలఁ దలఁచుకొని వాకీయుఁడని వేఁడుకొని యామెచేయి పట్టుకొని "భాగ్యము కల చెయ్యి, ప్రాప్తి గల చెయ్యి" యని పలికి, "నీ వొక్క తలఁపు తలంచినావు; ఒక్కకోరిక కోరినావు; ఒక్క మే లడిగినావు; అది కాయో పండో కల్లో నిజమో చేకూఱునో చేకూఱదో యని తొందరపడుచున్నావు; అది కాయకాదు పండు; కల్ల కాదు నిజము. శీఘ్రముగానే చేకూరనున్నది. ఆఁడువారివంక తలంపా మగవారివంక తలఁపా యందు వేమో మగవారంటే గిడ్డము ఆఁడువా రంటే లక్కా" అని రుక్మిణి ముఖలక్షణములను చక్కగా కనిపెట్టి 'మగ వారివంక తలం' పన్నప్పు డామె మొగ మొకవిధముగా నుండుట చూచి సంగతి నూహించి "నీది మగవారివంక తలంపు; శీఘ్రము గానే కార్యము గట్టెక్కనున్నది; నీరొట్టె నేతఁ బడనున్న" దని చెప్పి తక్కిన ప్రసంగమువలన రుక్మిణి మనసులోని సంగతి నంతను దెలిసి కొని, రుక్మిణిమగఁడు దేశాంతరగతుఁ డయినవార్త నావఱకే విని యున్నదికాన "నీమగఁడు చెడుసావాసము చేత దేశాలపా లయి తిరుగుచున్నాఁడు; నీమీఁదిమోహముచేత నెలదినములలో నిన్ను వెదకుకొనుచు రాఁగలఁడు" అని చెప్పి సంచిలోని వేరు నొకదానిని తీసి పసపుదారముతో జేతికి కట్టి ప్రాఁతబట్టయు రవికయుఁ బుచ్చు కొని, మగనితోఁ గలిసి కాపురము చేయుచున్నతరువాత క్రొత్తచీర

పెట్టుమని చెప్పి తనదారిని బోయెను. రుక్మిణియుఁ బరమానంద భరితురా లయి అంత సూటిగాఁ దన మనోగతమును దెలిపి నందునకై యెఱుకతయొక్క మహత్త్వమును మెచ్చుకొని యబ్బుర పడుచు లోపలకిఁ బోయెను.

ఐదవ ప్రకరణము.

సీతయొక్క వివాహప్రయత్నము—బైరాగియొక్క ప్రసిద్ధి—అతఁడు వైద్యమునకుఁ గుదురుట—జనార్దనస్వామి యుత్సవము—రుక్మిణి యొక్క కాసులుపేరు పోవుట.

ఒకనాఁటి యుదయమున రాజశేఖరుఁడుగారు సభ తీర్చి చావడిలోఁ గూర్చుండి యుండఁగా సిద్ధాంతి వచ్చి తాటాకులత్రాట నల్లిన యొగలోనుండి సులోచనములజోడును దీసి ముక్కునకుఁ దగిలించుకొని దాని దారమును నొసటనుండి జుట్టుమీఁదుగా వెనుకకు వేసికొని కూరుచుండి తాటాకుపుస్తకమునకుఁ గట్టిన దారములో గ్రుచ్చిన చిన్నతాటాకుముక్కలను నాలు గయిదింటిని పయికిఁ దీసి ముందుకు వెనుకకును ద్రిప్పుచు వానివంకఁ జూడసాగెను.

రాజ—సిద్ధాంతిగారూ! సీత కేసంబంధము బాగున్నది?

సిద్ధాం—చక్కఁగా నాలోచించి చూడఁగా మంత్రిప్రగడ బాపిరాజుగారి కుమారునిజాతకము సర్వవిధముల ననుకూలముగాఁ గనఁబడుచున్నది.

మంత్రిప్రగడ బాపిరాజు తన కొమారున కేలాగున నైన సీతను జేసికొని రాజశేఖరుఁడుగారితోడి బాంధవ్యమువలన బాగుపడ వలెనని చిరకాలమునుండి కోరియున్నవాఁడు కాన, ఈనడుమఁ దన యింట జరిగిన సీతాకళ్యాణసమయమున సిద్ధాంతికి మంచి నోవతుల చాపు కట్టఁబెట్టుటయే కాక సీత నిప్పించినయెడల నింతకంటె మంచి బహుమానము చేసెద నని యాశపెట్టెను.

రాజ—బాపిరాజుకొమారుఁడు నల్లనివాఁడు. చదువులోను తెలివిలేదని వినుచున్నాను. వా డిప్పుడే దుస్సహవాసముచేత చెడు

తిరుగఁజొల్లు తిరుగ నారంభించినాఁడఁట! వానికి సీత నియ్యను. మన శంకరయ్య జాతక మెట్లున్నది?

సిద్ధాంతి—మీ మేనల్లునిజాతకము చూచినాను. సమస్త విధములచేతను దివ్యజాతకమే కాని జన్మనక్షత్రము కృత్తిక. మన సీతదికూడ కృత్తికానక్షత్రమే—శ్లో. అజైకపాచ్ఛనిష్ఠాచ పుంర్వ స్వధకృత్తికా । మృగశీర్షంచ విత్తాచ సవితోత్తరఫల్గునీ । జ్యేష్ఠాంచ విశ్వతోయంచ నక్షత్రైర్నిక్యే నినస్యతి । ఏకారాశౌపృథగ్ధిష్ణ్యాచోత్తమ మ్ప్రాణిపీడనం॥—అని శాస్త్రములో పయి నక్షత్రముల యైక్యము వంను కన్యావరులకు నాశనము సంభవించునని చెప్పఁబడి యున్నది. బాపిరాజు కొమారుని జాతకము సర్వోత్తమముగా నున్నది—అందులో కేంద్రాధిపతికి త్రికోనాధిపతి సంబంధము కలిగియున్నది; ఇతరు లయిన తృతీయ, షష్ఠ, ఏకాదశ, అష్టమాధిపతులతోడి సంబంధము లేదు—శ్లో. కేంద్రత్రికోణపతయ స్సంబంధేన పరస్పరం ఇతరైరప్రసక్తాశ్చే ద్విశేషశుభదాయకాః॥ అని శాస్త్రప్రకారమతఁడు మిక్కిలి యదృష్టవంతుఁడు. తక్కిన చిల్లరచేష్టలను రూపమునకును నేమి? మఱినాలుగేండ్లు పైఁబడిన యెంతబుద్ధివంతుఁ డగునో యెవ రెఱుఁగుదురు? నామాట విని చిన్నదాని నాతని కిండి.

రాజ—నేను బాపిరాజుకొడుకునకు పిల్ల నియ్యను. నాచెల్లెలు పోవునప్పుడు తన కొడుకునకు సీత నిచ్చునట్లు నాచేత చేతిలో చేయి వేయించుకొన్నది. దామోదరయ్యయు సీతనిచ్చి శంకరయ్యను మీయొద్దనే యుంచుకొమ్మని నిత్యమును పొంగమోటపెట్టుచున్నాఁడు. ఇప్పుడు నేను పిల్లదానిని మఱియొకరి కిచ్చిన యెడల నాచెల్లెలు పోఁబట్టి యట్లుచేసితివని కలకాలము చెప్పుచుండును. అదిగాక మా శంకరయ్య బహుబుద్ధిమంతుఁడు; స్ఫురద్రూపి; విద్యావినయసంప

న్నాఁడు. పిల్లనాతనికే యిచ్చెదను. జాతకమును మీరు మఱియొక సారి శ్రద్ధతోఁ జూడవలెను.

అప్పుడు సిద్ధాంతి తాను మఱియొకవిధముగాఁ జెప్పిన కార్యము లేదని తెలిసికొని కొంచెముసే పాకాశమువంకఁ జూచి యనుమానించి "సీతజననము కృత్తికానక్షత్రమురియొక్క యేపాదము?" అని ప్రశ్న వేసెను.

రాజ—ద్వితీయ పాదము.

సిద్ధాం—శంకరయ్యది ప్రథమపాదము. అవును. అనుకూలముగానే యున్నది—శ్లో॥ ఏకర్క్షే చైకపాదేతు వివాహః ప్రాణహానిదః। సంపత్యోరేక నక్షత్రే భిన్నపాదేశు భావహః॥—అనుశాస్త్రముచుబట్టి దోషము లేకపోఁగా శుభావహముగా కూడనున్నది. తప్పక సీత నీతని కిచ్చి వివాహము చేయుండి.

రాజ—ఈసంవత్సరములో పెండ్లి కనుకూలమయిన ముహూర్త మెప్పుడున్నది?

సిద్ధాంతి—"శ్లో॥ మాఘ ఫాల్గున వైశాఖ జ్యేష్ఠమాసా శ్శుభప్రదాః" అనుటచే మాఘమాస మనుకూలముగ నున్నది. బహుళ పంచమీమంగళవారమునాఁడు రవి కుంభలగ్నమం దున్నాఁడు. ఆముహూర్తము దివ్యమయినది—శ్లో॥ అజ గో యుగ కుంభాళి మృగరాశి గతేరవౌ। ముఖ్యః కర్మ గ్రహా స్త్వన్యరాసికేన కదాచన॥ అని ప్రమాణవచనము.

రాజ—మీకొమార్తె జబ్బు నిమ్మళముగా నున్నదా?

సిద్ధాం—తమ కటాక్షమువలన నిమ్మళముగానే యున్నది. నాఁడు మీరుచెప్పిన బైరాగి బహుసమర్థుఁడు. అతఁడు మాయింట గ్రహమును నిమిషములో వెళ్ళఁగొట్టినాఁడు. భూతవైద్య లంద

అను మాచిన్నదానికిఁ బట్టినగ్రహమును వదలించుట యసాధ్యమని విడిచిపెట్టినారు. అతఁడు మూఁడుదినములు జల మభిమంత్రించి లోపలికిచ్చి రక్షరేకు కట్టినాఁడు. నాఁటినుండియు పిల్లది సుఖముగా నున్నది.

రాజ—మాచెల్లెలు సుబ్బమ్మకు దేహ మస్వస్థముగానున్నది. మనగ్రామములో నెవ్వరును మంచివైద్యులు కనఁబడరు. నాకేమి చేయుటకును తోఁచకున్నది.

రాఘ—బైరాగిచేత మం దిప్పించరాదా! అతఁడు మీరు సొమ్మిచ్చినమాత్రము పుచ్చుకోఁడు ; ఈయూర నెందఱికో ధర్మార్థముగానే యౌషధములిచ్చి దీర్ఘవ్యాధులను సహితము కుదిర్చినాఁడు.

రాజ—గట్టివాఁ డయినయెడల నీ వాతని నొక్కపర్యాయము మధ్యాహ్నము మాయింటికి వెంటబెట్టుకొనివచ్చి సుబ్బమ్మను చూపెదవా ? నాలుగుదినములనుండి దానిశరీరములో రుగ్మతగా నున్నందున వంటకు మిక్కిలి యిబ్బందిపడుచున్నాము.

రాఘ—అవశ్యముగా దీసికొనివచ్చెదను. అతని కాభేషజములు లేవు. ఎవరుపిలిచినను వచ్చును.

సిద్ధాంతి—ఆతనికడ స్వర్ణముఖివిద్య కలదని చెప్పుచున్నారు. మహానుభావులు గోసాయీలలో నెటువంటివారైనను నుందురు.

రాఘ—ఆతఁడు ప్రతిదినమును దమ్మిడియెత్తు రాగి కరఁగి బంగారముచేయునఁట ! ఆతఁ డప్పుడప్పుడు బ్రాహ్మణులకు దానధర్మములు చేయుచున్నాఁడు. ఈవిద్యయే లేకపోయిన నాతనికి ధనమెక్కడనుండి వచ్చును ?

రాజ—రాఘవాచారీ ! దేవున కధ్యయనోత్సవములు క్రమముగా జరుగుచున్నవా ?

రాఘు—తమయనుగ్రహముండఁగా ఉత్సవముల కేమిలోపము ? నిరుడు పుష్యమాసములో సంక్రాంతినాఁటి యుత్సవము ప్రత్యేకముగా తమ ద్రవ్యముతో జరిగినది. నిన్ననో మొన్ననోలాగున కనఁబడుచున్నది ; అప్పుడే సంవత్సర మయినది. రేపే సంక్రాంతి— ఈసంగతి తమతో మనవిచేయుటకే వచ్చి సుబ్బమ్మగారికి జబ్బుగా నున్నందున సమయముకాదని యూరకున్నాను.

రాజ—క్రిందటి సంవత్సరము నూటయేఁబది రూపాయల నిచ్చినాను. ఈసంవత్సరము మాలోపల వివాహములు తటస్థమయినవి గనుక నూఱురూపాయలనుమాత్రమే యిచ్చెదను. ఏలాగున నయిన దానితో సరిపెట్టవలెను.

రాఘు—చిత్తము. దానికేమి ? అలాగుననే చేసెదను.

రాజ—రాఘవాచార్యులూ ! బైరాగి నవస్యముగా నేఁడే మాయింటికి తీసికొనివచ్చి నీవు మఱియొకపనిని చేసుకోవలెనుజుమీ ? ప్రొద్దెక్కుచున్నది. శీఘ్రముగా వెళ్ళు—సిద్ధాంతిగారూ ! మీకు సందేహముగా నున్నపక్షమున శంకరయ్యజాతకము మఱియొకసారి చూడుండి ; ఎవరితోనైనా నాలోచించవలసి యున్నయెడల, లచ్చయ్యశాస్త్రిగారికి కూడ ఆజాతకము చూపవచ్చును.

సిద్ధాంతి—చిత్తము. నా కటువంటి సందేహము లేదు.

రాజ—అట్లయిన, ఇప్పుడు బసకు పోయి తరువాత దర్శనమిండి.

అని చెప్పి పంపినతరువాత సభవారందఱును తమయిండ్లకు బోయిరి. రాజశేఖరుఁడుగారు భోజనము చేసి చేయి కడుగుకొను నప్పటికి రాఘవాచార్యులా బైరాగిని వెంటఁ బెట్టుకొనివచ్చి యింటఁ బ్రవేశపెట్టెను. నిత్యమును రాజశేఖరుఁడుగా రాతనికి సకలోప

చారములును చేయుచు భక్తితో ననుసరించుచు నుండెను. సుబ్బమ్మకు వ్యాధి వెంటనే నిమ్మళించినను స్వర్ణము చేయువిద్యను నేర్చుకొనవలె ననునాసక్తితో రాజశేఖరుఁడుగా రాతని విడిచిపెట్టక, యింటనే యుంచుకొని నిత్యమును పాలును పంచదారయు వేళకు సమర్పించుచు ని నెగళ్ళకు వలయు పుల్లలను సమకూర్చుచు బహువిధముల భక్తి సేయుచు నాతని యనుగ్రహసంపాదనకుఁ దగిన ప్రయత్నములు చేయుచుండెను. ఈప్రకారముగాఁ గొన్నిదినములు జరగఁగా సింహాలో జనార్దనస్వామివారికిఁ గళ్యాణోత్సవముసమీపించినది. ఆయుత్సవమును జూచుటకై చుట్టుప్రక్కలగ్రామముల నుండి వేలకొలఁది జనులు వచ్చి ప్రతిగృహమునను క్రిక్కిఱిసినట్లు దిగియుండిరి.

మాఘశుద్ధమున నేకాదశినాఁడు రథోత్సవమునకు వలయు ప్రయత్నము లన్నియు జరుగుచుండెను. నాలుగుదినముల నుండి రథమునంతను నలంకరించి దాని పొడుగునను వన్నెవన్నెల గుడ్డలను చిత్రవర్ణము గల కాగితములను అంటించి, వెదురుకఱ్ఱల కొనలకు హనుమద్విగ్రహమును గరుడవిగ్రహమును గల ధ్వజపటములను గట్టి రథమునకుఁ దగిలించిరి. దేవుఁడుకూర్చుండు పైవైపున గిలక్కలో నున్న కదళికాస్తంభములను నిలిపి వానికి మామిడి మండలతోను వివిధపుష్పములతోను తోరణములను గట్టిరి. ఆ యరటికంబములకు నడుమను తెల్లని లక్కగుఱ్ఱములు రెండు రథము నీడ్చుచున్నట్లు ముంగాళ్ళు మీఁదికెత్తుకొని మోరలు సారించి వీధివంకఁ జూచు చుండెను. ఆ రథమునకుఁ బదియడుగుల దూరమున వెదురు వేళ్లతో నల్లబడి పయిని గుడ్డ మూయబడి వికృతాకారముతో నున్న యాంజనేయ విగ్రహములోను గరుడ విగ్రహములోను మనుష్యులు దూరి చూడవచ్చిన పల్లెలవాండ్రను పిల్లలను జడిపికొనులాగున

నెగిరెగిరిపడుచు లక్కతలకాయలఁ ద్రిప్పుచుండిరి. అప్పుడు పూజారులు పల్లకిలో నుత్సవ విగ్రహముల నెక్కించుకొని వాద్యములతోఁ గొండదిగివచ్చి రథమునకు మూఁడు ప్రదక్షిణములను జేయించి స్వామి నందు వేంచేయింపఁజేసిరి. చెంతలనున్నవా రందఱును క్రిందనుండి యరఁటిపండ్లతో స్వామిని గొట్టుచుండఁగా రథముమీఁద, గూర్చున్న యర్చకులును తదితరులును చేతులతో దెబ్బలు తగులకుండఁ గాచుకొనుచు నడుమనడుమ జేగంటలు వాయించుచు గోవిందా యని కేకలు వేయుచుండిరి. ఆ కేకలతో రథమునకుఁ గట్టియున్న మోకులను వందలకొలఁది మనుష్యులు పట్టుకొని యిండ్ల కప్పులును వీధి యరుగులును కూలునట్టుగా రథము నీడ్చుచుండిరి. అంతట భోగము మేళ మొకటి రథమునకుముందు దూరముగా నిలువఁబడ, మద్దెల మీఁదఁ జేయివైచుకొని యొకతె యాడసాగెను. మద్దెలమీఁద దెబ్బ వినఁబడినతోడనే దేవునితో నున్న పెద్దమనుష్యు లందఱును మూఁకలను ద్రోచుకొనుచు వెళ్లి యాటకత్తియలముందు మున్నున్న వారిని వెనుకకుఁ బంపి తాము పెద్ద లయి యుత్సవమునందు గాన వినోదమునకు కొఱత రాకుండ సమర్థించుచుండిరి.

అప్పుడు రుక్మిణి సమస్తాభరణభూషితురా లయి, ఉమ్మెత్తపువ్వువలె నందమై బెడబెడలాడుచున్న కుచ్చిళ్ళు మీఁగాళ్లపై నొఱయ, ఎడమభుజము మీఁదినుండి వచ్చి జరీచెట్లుగల సరిగంచు పయ్యెదకొంగు వీఁపున జీరాడ కట్టుకొన్న గువ్వకన్నుదిన నల్లచీర యామె యందమున కొక వింతయందమును గలిగింప, కాళ్ల యందియలును, పాంజేబులును, గళ్ళుగళ్ళున శ్రావ్యనాదము చేయ, కుడిచేయి తప్పఁ గడమభాగ మంతయుఁ బయిటలోఁ డాఁగి కనఁబడక యున్న వంగపండుచాయగల గుత్తపుపట్టురెక నీరెంఢలో ద్విగుణ

ముగాఁ బ్రకాశింప, కొప్పులోని కమ్మపూవులతావి కడలకుఁ బరిమళము లెసంగుచు గంధవహుని సార్థకనామునిఁ జేయ, నడచి వచ్చి వీధిలో నొక యరుగుచెంత నిలుచుండి రథమువంక జూచు చుండెను. ఈదేశములో సాధారణముగా స్త్రీలు తమభర్తలు గ్రామమున లేనప్పుడు విలువచీరలు కట్టుకొని యలంకరించుకొనుట దూష్యముగా నెంచువా రయినను, ఇతరులయింట జరుగు శుభ కార్యములయందు పేరంటమునకు వెళ్ళునప్పుడు గాని గ్రామములో జరగెడి స్వామికళ్యాణమహోత్సవమును గ్రామదేవతల తీర్థములును జూడఁబోవునప్పుడు గాని మెరుగుతెచ్చుకొనినైన మంచిబట్టలను మంచినగలను ధరించుకొనక మానరు. అప్పటి యామె సౌందర్యము నేమని చెప్పుదును! నిడుదలై సోగలైనకన్నులకుఁ గాటుకరేఖ లొకసొగసు నింప, లేనవ్వు మిషమున నర్ధచంద్రునిఁ బరిహసించు నెన్నుదురున బాలచంద్రుని యాకృతినున్న కుంకుమబొట్టు రంగు లీన, శృంగారరస మొలికెడి యా ముద్దుమొగముయొక్క యప్పటి యొప్పిదము కన్నులకఱవు తీఱఁ జూచి తీఱవలసినదే కాని చెప్పి తీఱదు. రథ మామె దృష్టిపథమును దాఁటి పోయినతోడనే ద్వాదశోర్ధ్వపుండ్రములను దిట్టముగా ధరియించి దాసరులు ఇనుప దీపస్తంభములలో దీపములు వెలిగించుకొని నడుమునకుఁ బట్టు వస్త్రములను బిగించుకొని యొకచేతిలో నెమలికుంచె యాడించుచు రెండవచేతిలోని గుడ్డముట్టలు చమురులో ముంచి వెలిగించి సెగ సోకకుండ నేర్పుతో దేహమునిండ నంటించుకొనుచు ప్రజ లిచ్చు డబ్బులను దీపస్తంభముల మట్లలో వేయుచు నడిచిరి. ఆసందడి యడఁగినతోడనే రుక్మిణితల్లియు మఱికొందఱును తోడనడువ బయ లుదేఱి, ఉత్సవమునిమిత్తమయి పొరుగూళ్లనుండివచ్చిగుడారములలోఁ

బెట్టిన కంచరికుకాణములను పండ్లయంగళ్లను దాఁటి, మెట్లుపొడుగు నను ప్రక్కలయందు బట్టలు పఱుచుకొని యఱచుచు కూరుచున్న వికలాంగులకు సెనగపప్పును గవ్వలును విసరివైచుచు, కాశీకావళ్ళు ముందుబెట్టుకొని పుణ్యాత్ములను పాపాత్ములను స్వర్గమును నరక మును జూపెదమని పటములు చేతఁబెట్టుకొని వచ్చెడివారిని పోయెడి వారిని నష్టగించెడు కపటయాత్రికులకు తొలఁగుచు, కొంపయెక్కి దేవతాసందర్శనార్థము వెళ్లెను. అక్కడ నిసుకచల్లిన రాలకుండు మూఁకలలోనుండి బలముగలవారు దేవునకుఁ బండ్లియ్యవలె నను నపేక్షతోదూఱి సందడిలోఁ బడి దేవతాదర్శన మటుండఁగా మంది లోనుండి యీవలంబడినఁజాలునని నడుమనుండియే మరలి యీవలకు వచ్చి సంతోషించుచుండిరి. వారికంటె బలవంతు లయినవారు గర్భా లయమువఱకును బోయి పండ్లను డబ్బును పూజారి చేతిలోఁ బెట్టి యీవలఁ బడుచుండిరి. అర్చకులును ఒకరు విడిచి యొకరు వెలుపలికి వచ్చి చెమటచేఁ దడిసిన బట్టలను పిండుకొని వెలుపలగాలిలో కొంతసేపు హాయిగానుండి మరల గర్భాలయములలోఁ బ్రవేశించి యాయుక్కలో బాధపడుచుండిరి. ఈప్రకారముగా వచ్చిన యర్చకు లలో నొకఁడు మాణిక్యాంబను జూచి యామెచేతిలోని పండ్లను బుచ్చుకొని లోపలికిఁ బోయి స్వామికి నివేదనచేసి వానిలోఁ గొన్ని పండ్లను తులసిదళములను మరలఁ దెచ్చియిచ్చి యందఱ శిరస్సుల మీఁదను శఠగోపము నుంచెను. అంతట మాణిక్యాంబ వెనుకతిరిగి యాలయద్వారమును దాఁటుచుండెను. రుక్మిణి యామె చెఱఁగు పట్టు కొని వెనుక నిలుచుండెను. ఒకప్రక్క సీతయు మఱియొకప్రక్క నొక ముత్తైదువయు నిలువఁబడిరి. ఆసమయములో నెవ్వఁడో వెనుక నుండి రుక్మిణి మెడలోనికి చేయి పోనిచ్చి కాసులపేరును పుటుక్కున

త్రెంచెను. రుక్మిణి వెనుక మరలి చూచునప్పటికి చేయియుఁ గాసుల పేరునుగూడ నదృశ్యములాయెను. రుక్మిణి కేకకు పదిమందియు వచ్చి దొంగను పట్టుకొనుటకయి ప్రయత్నము చేసిరికాని యాదొంగ సహితము వారిలోనేయుండి తానును దొంగనే వెదకుచుండెను. అప్పుడు రుక్మిణి మొదలగువారు ప్రదోషసమయమున నగపోయినందునకయి మఱింత విచారించుచు నింటికిఁ బోయిరి.

ఆఱవ ప్రకరణము

సొమ్ము పోయినందుకు మంత్రజ్ఞులు చేసిన తంతు-రుక్మిణి మగఁడు పోయిన వార్త నొకఁడు చెప్పుట - రుక్మిణికి రుగ్ణత వచ్చుట-సోదె యడుగుట-మగడుఁ పట్టుట-భూతవైద్యము - సువర్ణవిద్య - బైరాగి సొమ్ముతో నదృశ్యుఁ డగుట.

మఱునాఁడు ప్రాతఃకాలమున రాజశేఖరుఁడుగారు దంతధావనము చేసికొనుచు వీధియరుగుమీఁదఁ గూరుచుండియుండఁగా సిద్ధాంతి తనతోఁగూడ మఱియొకబ్రాహ్మణునిఁ దీసికొనివచ్చి యరుగుమీఁద నొకప్రక్కను చతికిలఁబడెను. చేతిలో వెండిపొన్ను వేసిన పేపబెత్తమును పట్టుకొని, తలయును గడ్డమును గోళ్ళును బెంచుకొని కనుబొమలసందున గొప్ప కుంకుమబొట్టు పెట్టుకొని గంభీరముగాఁ గూరుచున్న యీవిగ్రహమును నఖశిఖపర్యంతమును తేఱిపాఱఁజూచి యాయన యెవరని రాజశేఖరుఁడుగారు సిద్ధాంతి నడిగిరి. "వీరు మహామంత్రవేత్తలు; మళయాళమునందుఁ గొంతకాలముండి మంత్రరహస్యముల నామూలాగ్రముగా గ్రహించినారు; వీరు కృష్ణాతీరముననుండి యాత్రార్థమయి విజయంచేసినారు; వీరిపేరు హరిశాస్త్రిలవారు; వీరీవఱకు బహుస్థలములలో పోయినవస్తువుల నిమిషములో దెప్పించి యిచ్చినారు; వీరు నాలుగు సంవత్సరముల నుండి వానప్రస్థాశ్రమమును స్వీకరించి యున్నారు." అని తా నాతనిని రెండుదినములనుండియే యెఱిగినవాఁ డయినను జన్మదినమునుండియు నెఱిఁగియున్నవానివలె నాతనిచరిత్రమును చెప్పి, 'నఖరోమైర్వానాశ్రమీ' యను దక్షస్మృతి వచనమును జదివి గోళ్ళను వెంట్రుకలును బెంచుకొనుటచే వానప్రస్థుఁ డగు నని తల్లక్షణమును జెప్పెను. అప్పుడు హరిశాస్త్రిలు తనమంత్రసామర్థ్యమును గొంతసేపు పొగడుకొని

తా నావఱకు పోయినవస్తువులు తెప్పించినావానన్న స్థలములపట్టిక నొకఁ దానిని బహుదినములు ప్రయాసపడి వల్లించినవానివలె తనవుకో కుండఁ జదివెను. అప్పుడు సిద్ధాంతి రుక్మిణివస్తువు పోయినసంగతి జెప్పి దానిజాడ చెప్పవలయునని ప్రార్థించెను. తోడనే హరిశాస్త్రిలు తన ముక్కుపుటములయొద్ద వ్రేలుపెట్టుకొనిచూచి, ఆకాశము వంకఁ జూచ్చి నిగిడించి వ్రేళ్లుమణఁచి యేమో లెక్కించి నిమిష మాలోచించి 'పోయినవస్తువు ఇక్కడకువచ్చుచుఁ బోవుచు నుండు వారిచేతనే చిక్కినదికాని యిల్లు దాఁటిపోలే' దని చెప్పెను. ఇంతలో రాజశేఖరుఁడుగారి ముఖప్రక్షాళన మయినందున నందఱుఁ గలిసి లోపలికిఁ బోయిరి. నడవలో నిలుచుండి హరిశాస్త్రిలు వస్తువును దెప్పించి యిచ్చుటకు తనదే భార మనియు, మధ్యాహ్నము వచ్చి యంత్రము వేసెదనుకాఁబట్టి యాసమయమున కింట నున్న సేవకు లందఱును సిద్ధముగా నుంచవలయు ననియుఁ జెప్పి, 'లోపలి నుండి కొంచెముబియ్య మిప్పుడు తెప్పింపుఁడు' అని కోరెను. సిద్ధాంతియే లోపలికిఁ బోయి యొక పళ్లెముతో బియ్యమును దీసికొనివచ్చి శాస్త్రిల కోరికప్రకారము గృహమునఁ గనఁబడ్డ భృత్యవర్గమును బిలుచుకొనివచ్చెను. ఆమీఁదట శాస్త్రిలు తన మంత్రప్రభావమును గొంచెము చిత్తగింపవలయు నని మనవిచేసి, అక్కడ నున్నవారిలో నెవ్వరైన నొనవస్తువును దీసి రహస్యముగా దాచినయెడల వారి పేరును జెప్పెద నని చెప్పి, తాను వీధిలోనికిఁ బోయెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు తన యుంగరము లొకనిచేతి కిచ్చి పదిలముగా దాపించి, యాతఁడు వచ్చి కూరుచున్నతరువాత శాస్త్రిలనులోపలికిఁ బిలిచి యుంగరమును దాచినవానిని జూపు మని యడిగిరి. శాస్త్రిలు తోడనేయక్కడ నున్న పదిమంది చేతులలో బియ్యమును బెట్టి యొక రొకరే వచ్చి బియ్యమును పళ్లెములో బోయవలె నని చెప్పి

తో నేమో మంత్రమును జపించుచుండెను. అప్పు డందఱును వరుసగా వచ్చి బియ్యము పళ్లెములోఁ బోసిరి. వెంటనే యతఁ డుంగరమును దీసినవాఁ డీతఁడని చూపెను. అప్పు డక్కడనున్నవా రందఱును నద్భుతరసాక్రాంతు లయిరి. రాజశేఖరుఁడుగారును అతఁడు మహామంత్రవేత్త యని యొప్పుకొని నమస్కారము చేసి, పోయిన నగ యాతని మంత్రశక్తిచేత వచ్చునను నమ్మకముతో మధ్యాహ్నమునఁ దప్పక రావలయు నని పలుమారు ప్రార్థించి తీసుకొని రమ్మని సిద్ధాంతితోను జెప్పెను. సిద్ధాంతియు శాస్త్రులును ముఖవిలాసముతో సల్లాపసుఖము ననుభవించుకొనుచు నింటికి నడచిరి. ఇక్కడకు వచ్చునప్పుడే సిద్ధాంతియు శాస్త్రియు రహస్యముగా నన్ని సంగతులను మాటాడుకొని రాజశేఖరుఁడుగా రిచ్చుబహుమతిలో చెఱిసగమును బుచ్చుకొనునట్లు సమాధానపడిరి. కాఁబట్టి రాజశేఖరుఁడుగారికి నమ్మకము పుట్టించుట కయి ముందుగా చేయవలసిన తంతును కూడఁబలుకుకొన్న తరువాత, వస్తువును దాచినవాఁడు పళ్ళెములో బియ్యము పోయఁగానే వెనుకఁ దాను బోసెదననియు వాఁడే దానిని తీసి దాచినాఁడని చెప్పవలసిన దనియు సిద్ధాంతి యింటివద్దనే నిర్ణయము చేసినందున శాస్త్రి లాతనిసాహాయ్యము చేత నిమిషములో నుంగరమును దీసినవానిని చూపఁగలిగెను. మధ్యాహ్నభోజనము చేసి బయలుదేఱి కావలసిన పరికరములతో సిద్ధాంతియు హరిశాస్త్రులును వచ్చి రాజశేఖరుఁడుగారి యిల్లు చేరిరి. అంతకుమునుపే యింటఁగల పరిచారకులును తక్కినవారును రావింపఁ బడిరి. హరిశాస్త్రులకు వినఁబడునట్లుగా సిద్ధాంతి రథోత్సవసమయమున రుక్మిణితో నెవరువెళ్లిరో కాసులపేరు పోయినప్పు డెవ్వరెవ్వ రెచట నుండిరో యాసంగతులు వెంట వెళ్ళినవారి నడిగి తెలుసుకొను చుండెను. అంత సిద్ధాంతివచ్చి రహస్యముగా శాస్త్రులచెవులో నొక

మాట చెప్పి మరల వెళ్ళి నేమేమో సంగతులను మాటాడు చుండెను. ఇంతలో రాజశేఖరుఁడుగారు వచ్చి వారినందఱిని లోపలికి రం డని పిలిచిరి. హరిశాస్త్రులు అమ్మవారిపెట్టెను. తీసికొని యిప్పుడే వచ్చెద నని చెప్పిపోయి గడియసేపు తాళి యిత్తడిపెట్టెను పట్టుకొని కుడిచేతి కొక రాగికడియమును దొడుగుకొని మరల వచ్చి, అలికి దిగవిడచియున్న చావడిలో నల్లని వచ్చని ముగ్గులతో నొక్క విగ్రహమును వేసి, దాని నాభిస్థానమునం దాను తెచ్చిన యిత్తడిపెట్టెను బెట్టి మూత తీసి 'జయజననీ' యని కేక వేసి కొంతసే పేమోకన్నులు మూసికొని జపముచేసి, రాజశేఖరుఁడుగారివంక జూచి యొక తెల్ల కాగితము తెమ్మని యడిగెను. ఆ కాలములో కొండపల్లి కాగితములు తప్ప మఱియొకరీతి కాగితములు లేవు. రాజశేఖరుఁడుగారికుమారుఁడు లోపలికిఁ బోయి యొక తెల్లకాగితము దీసికొని వచ్చి యిచ్చెను. అప్పుడా కాగితము నందఱును జూచుచుండఁగాఁ సమానము లైన యెనిమిది ముక్కలుగాఁ జించి యం దొక్కముక్కను దనయొద్ద నుంచుకొని తక్కిన యేడుముక్కలను వారికిచ్చివేసి, తా నుపాసించు దేవతయొక్క శక్తిచేత ఆ కాగితపు ముక్కమీఁదికి వస్తువును దొంగి లించినవారి పేరు వచ్చునని చెప్పి, యాముక్కను ఇత్తడిపెట్టెలోఁ బెట్టి నిమిష మందుంచి యొక మంత్రమును జదివి యాముక్కను మరలఁ బయికిఁ దీసి తనచేతులోనే పట్టుకొని యందఱకును జూపి, దానిని క్రింద నుంచి మూలలను కుంకుమ రాచి. హారతికర్పూరపు తునకతో దానిమీఁద బీజాక్షరములును యంత్రమును వేసి క్రింద నునిచి, యొకరొకరేవచ్చి దానిమీఁద జేయివైచి పొండని యాజ్ఞా పించెను. స్పష్టముగా గనబడుచున్న యా తెల్లకాగితము మీఁద నెల్లవారును చేతులువేసి పోయియేమిజరుగునో చూత మన్నట్టుండుక

చేతఁ దమస్థానముల గూరుచుండి చూచుచుండిరి. అందఱును ముట్టుకొని పోయినతరువాత హరిశాస్త్రి లాముక్కనుదీసి సాంబ్రాణి ధూపము వేసి, హారతికర్పూరము వెలిగించి దానిమీఁద ఆముక్కను నాలుగయిదుసారులు మోపి రాజశేఖరుఁడుగారి చేతికిచ్చెను. ఆయన చేతిలోఁ బుచ్చుకొని చూచునప్పటికి దానిమీఁద పెద్దయక్షరములతో 'చాకలసరడు' అని వ్రాసియుండెను. ఆకాగితము పయికెత్తగానే యెల్లవారికిని స్పష్టముగా వంకరయక్షరములు కనఁబడుచుండెను. దగ్గరనున్నవారిలో నొకరుదానిని పుచ్చుకొని చదువునప్పటికి చాకలి సర్వఁడొకఁడుతప్ప మిగిలినవా రందఱును నద్భుతప్రమోదమగ్న మానసు లయి చప్పటలుగొట్టి శాస్త్రులశక్తిని ఉపాసనాబలమును వేయినోళ్ళం గొనియాడఁజొచ్చిరి. కొంద అక్కడ నున్నవారిలో 'వీఁడె నగదీసినదొంగ; అప్పుడు వెనుక నిలుచున్నాఁ డని' వానిని నిందింపసాగిరి. సీత వచ్చి కాసులపేరు పోయినప్పుడు సర్విగాఁడు పండ్లుచేతిలోఁ బట్టుకొని మా వెనుక నిలువఁబడినాఁ డని చెప్పెను. అందుమీఁద నందఱును నగ హరించినవాఁడు చాకలి సర్విగాఁడుతప్ప మఱియొకఁడు కాఁడని నిశ్చయించిరి. ఇంటనున్నవారును రాజశేఖరుఁడుగారుసుకూడ ఆప్రకారముగానే నమ్మిరి. ఆవస్తువును శీఘ్రముగాఁ దెచ్చియిమ్మని యడిగినప్పుడు, ఆచాకలివాఁడు కంటికి నేలకు నేకధారగా రోదనముచేయుచుఁ దా నేదోషము నెఱుఁగనని బిడ్డల మీఁదను భార్యమీఁదను బట్లు పెట్టుకొనసాగెను. కాని యది యంతయు దొంగయేడుపని యెల్లవారును నిశ్చయముచేసికొనిరి. నయమున భయమున వాని నెన్నివిధముల నడిగినను వాఁడు తాను నిరప రాధి ననియే చెప్పి యేడుచుచు వచ్చినందున, హరిశాస్త్రులు రాజశే ఖరుఁడుగారిని చాటునకు 'మాట' యని పిలుచుకొనిపోయి 'మీసెల

వయినపక్షమున వీనికి ప్రయోగముచేసి పోయినవస్తువును దెప్పించెద నని చెప్పెను. వాఁడు చిన్నతనమునుండియు మిక్కిలి నమ్మకముగా బనిచేసినవాఁ డయినందున వానికేహానియుఁ జేయ నొడఁబడక రాజశేఖరుఁడుగారు వానిని కొలువునుండి మాత్రము తొలగించివేసిరి. వాడు తాను నిరపరాధి ననియేడ్చుచు నింటికిఁ బోయెను. మొదట సిద్ధాంతి శాస్త్రులచెవిలో రహస్యముగాఁ జెప్పినది చాకలి సన్యాసిపేరు వ్రాయుమనియే. అతఁ డమ్మవారిపెట్టెను దెచ్చుమిషమీఁద వెలుపలకుఁబోయి యొకకాగితపుముక్కమీఁద నీరుల్లిపాయలరసముతో "చాకలసరడ' ని యక్షరజ్ఞానము చక్కగా లేకపోవుటచేత (వ) వొత్తు పోఁగొట్టి వ్రాసి యాపెట్టి పెట్టెలోఁ బెట్టుకొనివచ్చెను. రాజశేఖరుఁడుగారి కొమారుఁడు కాగితమును తీసికొనివచ్చినప్పుడు తానాపేరును వ్రాసిన కాగితమంత ముక్కను జింపుకొని తక్కిన దానినిచ్చివేసి, దానిని పెట్టెలోఁ బెట్టినప్పుడు మార్చి మొదటి తనకాగితమును పయికిఁ దీసెను. అదియు మునుపటి కాగితమువలెనే యున్నందున నెవ్వరు ననుమానపడ లేదు. ఆకాగితముమీఁద హారతికర్పూరముతో బీజాక్షరములు వ్రాసినది యుల్లిపాయలకంపు పోవుటకే కాని మఱియొకందునకుఁగాదు; తరువాత సాంబ్రాణిపొగలోను కర్పూరపుదీపముమీఁదను పొగచూరఁబెట్టుట మున్నుకనబడకుండ నున్నయక్షరములు స్ఫుటముగాఁగనఁబడునట్టు చేయుటకయి కావించినతంత్రము. ఈప్రకారముగా తనమంత్రప్రభావముచేత శాస్త్రు లంతటి ఘనకార్యమును జేసినందునకయి వస్తువు దొరకకపోయినను రాజశేఖరుఁడుగా రాతని కొక దోవతులచాపును కట్టబెట్టి నాలుగురూపాయల రొక్కము నిచ్చిరి. ఇంటికిఁబోయినతరువాత హరిశాస్త్రులును సిద్ధాంతియు వానిని సమభాగంబులుగాఁ బంచుకొనిరి.

ఆమఱునాఁడు జాముప్రొద్దెక్కినతరువాత రుక్మిణి యొక్కత్తెయు పడమటింటి పంచపాళిలోఁ గూరుచుండి యెఱుకత చెప్పిన గడువు నిన్నటితోఁ వెళ్ళిపోయెనే యింకను మగఁడు రాఁడాయెనే యని తలపోయుచు వస్తువుపోయినందునకయి విచారించుచుండెను. ఆసమయమున నిరువదిసంవత్సరములవయసు గల యొకచిన్నవాఁడు లోపలికివచ్చి చేతిలోని బట్టలమూఁటను క్రిందఁబడవైచి రుక్మిణిమొగమువంకఁజూచి పెద్దపెట్టున నేడ్చెను. అదిచూచి రుక్మిణి సంగతియేమో తెలిసికొనకయే తానును నేడ్వఁజొచ్చెను. ఆరోదనధ్వని విని యింటనున్నవా రందఱును లోపలినుండి పరుగెత్తుకొనివచ్చి యేమియని నడిగిరి. అప్పు డాచిన్నవాఁడు గ్రుడ్లనీరు గ్రుక్కుకొనుచు గద్గదస్వరముతో రుక్మిణిమగఁడు నృశింహస్వామి కాశీనుండి వచ్చుచు త్రోవలో జగన్నాథమువద్ద పుష్యశుద్ధ నవమినాఁడు గ్రహణిజాడ్యముచేత కాలధర్మము నొందెననియు, దహనాదికృత్యములను తానే నిర్వహించితిననియుఁ జెప్పెను. ఆమాటలు విన్నతోడనే యింటనున్నవా రందఱును నొక్కసారిగ గొల్లుమని యేడ్చిరి. ఆయాక్రందనధ్వని విని చావడిలోనున్న రాజశేఖరుఁడుగారును పొరుగిండ్లవారునువచ్చి కారణంబును దెలిసికొని పలుతెఱంగుల విలపించిరి. అప్పు డక్కడనున్న పెద్దలందఱును వారినోదార్చి వారిచే స్నానములుచేయించి వేదాంతవచనముల నుపదేశింపసాగిరి. ఇట్లు కొన్నిదినములు జరిగినతరువాత బంధువులు మొదలగువారు రుక్మిణికి శిరోజములు తీయించువిషయమయి రాజశేఖరుఁడుగారితోఁ బ్రసంగించిరిగాని, ఆయన తనకొమార్తెమీఁది ప్రేమచేత చిన్నతనములోనే యావని చేయింపనొప్పుకొననందున, నందఱునుగూడ దానివలన నొకబాధకము లేదనిచెప్పి యాయన చెప్పినవిధమే మంచిదని యొప్పుకొనిరి.

మనదేశములో పతిరహితులగు యువతుల దురవస్థను తలఁచు కొన్న మాత్రమున పగవారికయినను మనస్సు కలుక్కుమనకమానదు. పతిశోకమును మఱచునట్లుచేసి యాదరింపవలసిన తలిదండ్రులే జీవితేశ్వరులుపోయి దుఃఖసముద్రములో మునిగియున్న తమకడుపునబుట్టిన కొమార్తెలను కరుణమాలి సమస్తాలంకారములకును దూరురాండ్రను జేసి, తలగొఱిగించి కురూపిణులనుజేసి ముసుగువేసి మూలఁగూర్చుండఁ బెట్టుదురు; రెండుపూటలను కడుపునిండ తిండియయినఁ బెట్టక మాడ్చి యందఱిభోజనములు నయినతరువాత మాఁడుజాముల కిన్ని మెతుకులు వేయుదురు; మనసయినను మంచిబట్ట కట్టుకో నియ్యక, అంచులేని ముతకబట్టనే కట్టుకోనిత్తురు. వేయేల ? మగఁడుపోయిన వారిజీవనములనే దుఃఖభాజనములనుగాఁ జేసి, వారిని జీవచ్ఛవము లనుగా నుంతురు. ఎవ్వరునుపెట్టినవిగాక పుట్టుకతోనే భగవంతుఁ డలంకారముగా దయచేసినట్టియు చిన్నప్పటినుండియు చమురురాసి దువ్వి ప్రాణముతో సమానముగా పెంచుకొనుచున్నట్టియు చక్కని శిరోజములను నిర్దయుఁడైన మంగలివానికత్తి కొప్పగించుటకంటె మానవతులకు ప్రాణత్యాగమే మేలని తోఁచును ; ఇంటఁగల కష్ట మయినట్టియు నీచమయినట్టియు పనులన్నియు వారిమీఁదనే పడును; పుట్టినింటఁ జేరఁగానే, వదినెలు మఱదండ్రును దాసినిగాఁ జూతురు; గారవమనుమాట యుండదు ; శుభకార్యములయందు నలుగురిలోఁ దలయెత్తుకొని తిరుగుటకు నోచుకోకపోఁగా, మొగ మగపడినమాత్రమున మీఁది మిక్కిలి యెల్లవారును దుశ్శకునమని దూషింతురు. ఈ హేతువుచేతనే "విధవ" యనుమాటయే వినుటకు శూలమువలెఁ గర్ణకఠోరముగా నుండును ; యెవ్వనినైన 'విధవా' యనుపేరను బిలిచినమాత్రమున ఘోరమయిన తిట్టుగా నెంచుకొని వాఁడు మండి పడును.

ఈస్థితి యంతయు కన్నులకు గట్టిన ట్లగపడి, ఆవర్తమానము తెలిసినదినము మొదలుకొని రుక్మిణి రాత్రియుఁ బగలును గదిలో నుండి వెలుపలికిరాక నిద్రాహారములు మాని మగనికయి శోకించుచు గృశింపసాగెను. విచారమునకుఁదోడు దేహమున నేదియో వ్యాధి కూడ నాశ్రయించెను. ఆమె లేవలేనంత బలహీనురాలగు వఱకును వ్యాధిసంగతిని నెవ్వరును కనుఁగొన్నవారు కారు. కనుగొన్నతోఁడనే రాజశేఖరుఁడుగారు ఘనవైద్యుఁ డని ప్రసిద్ధికెక్కిన జంగము బసవయ్యను పిలిపించి చేయిచూపించిరి. ఆతఁడు రుక్మిణి పరున్నమంచము మీఁద గూరుచుండి యెడమచేయి పట్టుకొని నాడిని నిదానించి చూచి వాతనాడివిశేషముగా నాడుచున్నదనిచెప్పి, యామెకుఁ బెక్కు దినములనుండి, శీతజ్వరము వచ్చుచున్నదనియు వెంటనే కనుఁగొనక పోవుటచేత జ్వరము దేహములో జీర్ణించిన దనియుఁ జెప్పి, వైద్య గ్రంథమునుండి—శ్లో॥ పారాదార్వి మహాబలాం త్రికటుకా జాజీరసో నాస్తథా । విష్ణుక్రాంతసినాడికా గృహాభవోశ్మూమ స్తులస్యాద్వయం నారంగస్య శిలాటపత్ర మరలు త్వక్పత్ర నిర్గుండికా । భార్గీపక్వ పటచ్ఛదాచ్చ సకలాన్ శీతజ్వరా న్నాశయేత్॥—అను శ్లోకమును జదివి, తెప్పింపవలసిన వస్తువుల నొక కాగితముమీఁద వ్రాయించి యప్పటి కింటికిఁ బోయెను. ఆమధ్యాహ్నమునకే రాజశేఖరుఁడు గారు వస్తువులనన్నింటిని దెప్పించి వైద్యునకు వర్తమానము నంపి నందున, అతఁడువచ్చి వస్తువులను చూర్ణముచేయించి పొట్లములు కట్టి, తేనె యనుపానముచేసి మూడువేళలను మూఁడుపొట్లములిమ్మని చెప్పి, నూనె, గుమ్మడి, బచ్చలి, పులుసు, కంద, పనస మాత్రము తగులఁగూడదని పథ్యమును విధించి, ప్రతిదినమును రెండుపర్యాయ ములువచ్చి చేయిచూచి గుణమును కట్టుకొని పోవుచుండును.

మొదట రుక్మిణికి శరీరము కొంచెము స్వస్థపడ నారంభించినది కాని తరువాత రాత్రులు పలవరింతలు మొదలయినవిపుట్టి జ్వర మధికము కాసాగెను. అప్పుడు వైద్యుని బిలిచి జ్వర మింకను నిమ్మళించదలే దేమని యడుగఁగా, అతఁడు "రేవత్యా మనురాధాయాం జ్వరో బహుదినంభవేత్" అని చదివి యీజ్వరము రేవతీనక్షత్రమున వచ్చినదికాన బహుదినములకుఁ గాని పోదని చెప్పెను. కానియాతని మాటలయం దంతగా నమ్మకము చిక్కక గ్రామములోనున్న మఱి యొకవైద్యునిఁ బిలిపించి, రాజశేఖరుఁడుగారు రుక్మిణిని జూపించిరి. అతఁడు చేయిచూచి పైత్యజ్వర మని చెప్పి, మూఁడుపూఁటలలో రుక్మి ణిది వజ్రశరీరము చేసెద నని ప్రగల్భవచనములు పలికి, అతనియొద్ద మాటలేకాని మందులు విస్తారముగా లేనందున వాఁడుక ప్రకారముగా 'లంఘనమ్ పరమౌషధ' మన్న యొక్క సూత్రమునే శరణముగావిం చుకొని లంకణములు కట్టనారంభించెను. అతఁడు నవజ్వరపక్వము కావలెనని పలుకుచున్నను లక్ష్యముచేయక, దినదినక్రమమున రుక్మిణి శుష్కించి యంతకంతకు మఱింత బలహీనురాలగుచుండుట చూచి యాతని వైద్యమును మానిపించి, మగల మొదటివైద్యునే రావింపఁగా నతఁడు వెంటనే పథ్యము పెట్టించి యౌషధసేవ చేయింప నారంభించెను. ఆయౌషధబలమున వ్యాధి కొంచెము మళ్ళుముఖము పట్టినను, ఒకపట్టున నిశ్శేషమయినదికాదు.

ఈలోపల మాణిక్యాంబ యొకయాదివారమునాఁడు నాలుగు గడియలకుఁ దెల్లవాఱుననఁగా లేచి సుబ్బమ్మను వెంటబెట్టుకొని యెవ్వరును వెళ్ళకముందే ముందుఁగా దామె వెళ్ళవలెనని బయలు దేఱి కామాక్షిమీఁది ప్రేమచేతఁ స్వయముగానే కోరలమ్మ గుడికి పోదె యడుగుటకయి వెళ్ళెను. ఆగుడియొద్ద నున్న మాలది

మాణిక్యాంబ ధూపము వేసినమీఁదట నిష్టదేవత తన కావేశమయి నట్లు కనఁబడి తాను రుక్మిణిపెనిమిటినని బయలుపడి, కానిదేశములో దిక్కుమాలినపక్షినయి చచ్చిపోతినని యేడ్చుటయేగాక తాను రుక్మిణి మీఁదిమోహముచేతఁ వచ్చితిననియు, ఆమెను దనయొద్దకుఁ దీసికొని పోయెదననియుఁ జెప్పెను. ఆసంగతులు చెప్పినప్పుడు మాణిక్యాంబయు సుబ్బమ్మయుఁగూడ నేడువసాగిరి. ఆ యుద్రేకము శాంతి పొందినపిమ్మట వారా మాలదానికి సమర్పింపవలసినదాని సర్పించి యింటికిఁ బోయిరి. రుక్మిణికిని రాత్రులు కలలలోను పగలుసహితము కన్ను మూసికొనునప్పుడును మగఁ డెదుటఁ గనఁ బడుచుండెను. ఒకా నొకప్పుడు మాటాడునట్లుసహిత మామెకు వినఁబడుచు వచ్చెనుగాని యామాటల నామె గ్రహింపఁ గలిగినదికాదు. ఆమె యొకానొకప్పు డెవ్వరో గుండెలమీఁద నెక్కికూరుచున్నట్టు తలఁచి నిద్రలోఁ గేకలు వేయుచుండును.

ఇట్లుండఁగా నొకనాఁడు హారిశాస్త్రులు వికృత వేషముతో మరల వచ్చి రుక్మిణిచేయిచూచి భూతనాడి యాడుచున్నదనిచెప్పెను. బైరాగిచేత విభూతి పెట్టించి లోపలికి తీర్థమిప్పించిరి కాని, అందు వలన రుక్మిణి కేమియు గుణ మగపడలేదు. ఒకనాఁ డొక బుడబుడ క్కలవాఁడు నెత్తి మీఁది తలగుడ్డలోఁ బక్షియీఁకలును బుజము మీఁద పేపబెత్తముల కట్టయు వీఁపున బెత్తములకు వ్రేలాడఁ గట్టిన పెద్దతోలుసంచియు నుండ డక్కి వాయించుచు వచ్చి, మాణిక్యాంబ శకున మడిగినప్పుడు గీతలును బొమ్మలును వేసి యున్న తాటాకుల పుస్తకము చూచి తీర్థమునకు వెళ్ళినదినమున రావిచెట్టుమీఁద నుండి వచ్చి యొకకామినీగ్రహము సోఁకిన దనియు దిగఁదుడుపు పెట్టినఁ బోవుననియుఁ జెప్పి యొక వేరుముక్క యిచ్చి దానిని వెండి

తాయెతులోఁ బెట్టి దండచేతికిఁ గట్టుమని చెప్పి యొక రూపాయ పుచ్చుకొని పోయెను. ఆ ప్రకారముగా మాణిక్యాంబ రుక్మిణికిఁ దిగఁ దుడుపు పెట్టెనుగాని యందువలనను గార్య మగపడలేదు. ఒక దినమున సుబ్బమ్మ కావేశము వచ్చి వేంకటేశ్వరులు బయలఁబడి యది యంతయుఁ దన మహాత్మ్యమే యనియు, కొండకు వచ్చి తనకు నిలువుదోపిచ్చెద నని తల్లి మ్రొక్కుకొన్న పక్షమున సర్వము నివర్తి యగు ననియుఁ జెప్పెను. ఆప్రకారమే చేసెదనని మాణిక్యాంబ మ్రొక్కుకొని తన నగలలో నొకదానిని ముడుపుగట్టెను. గాని దాని వలనను రుక్మిణిదేహస్థితి యనుకూలదశకు రాలేదు. అంతట వారి శాస్త్రులు వచ్చి యీరాత్రి చిన్నదానిచేతఁ బలికించి దయ్యమును వదలఁగొట్టెద నని ప్రతిజ్ఞ చేసి, తాను నాలుగుగడియల ప్రొద్దువేళనే వచ్చి చావడి యలికించి దానినిండ రంగు ముగ్గులతో ధైర్యశాలు లయిన పురుషులు చూచినను భయపడునట్టుగా వికృత మయిన స్త్రీ విగ్రహము నొకదానిని వేసి తాను స్నానము చేసి జుట్టు విరియఁ బోసికొని కుంకుమముతో మొగమంతయు నొకబొట్టు పెట్టుకొని, రుక్మిణిని స్నానము చేయించి తడిబట్టతో నాపట్టునడుమఁ గూరుచుండఁబెట్టి మొగమునకు విభూతి రాచి చుట్టును బిందెనాదములు మ్రోగునట్టు మనుష్యులను నియమించి, కన్నులు మిఱుమిట్లు గొన నెదుర గొప్ప దీపములు పెట్టించి, మంచివారికి సహితము పైత్యోద్రేకము చేయుధూపములు వేయుచు, చుట్టుపట్ల యిండ్లలోని పిల్లలందఱును జడిసికొనులాగున "హ్రాం" "హ్రీం" అని పెద్దగొంతుకతో బీజాక్షరముల నుచ్చరించుచు, గ్రుడ్లెఱ్ఱచేసి బెత్తముపుచ్చుకొని కొట్టఁబోయినట్టుగా రుక్మిణిమీఁదికి వెళ్ళి, "ఉన్నది యున్నట్టుగాఁ జెప్పు" మని కేకవేసెను. అవఱకే దేహస్మృతి తప్పి వికారముగాఁ

జూచుచున్న యారుక్మిణి తల్లి సోదెకు వెళ్లి వచ్చి చెప్పిన ప్రకారముగా తాను నృసింహస్వామియనియు భార్యమీఁది మక్కువ తీఱక వచ్చి యావహించినాఁడ ననియు, తనతోఁగూడ నామెను దీసికొనిపోయెద ననియు పలికెను. అంత నాపైత్యోద్రేకము పోవునట్లుగా రుక్మిణి మొగమున కేమో రాచి యామెకు తెలివివచ్చినమీఁదట లోపలికిఁ గొనిపోయి శైత్యోపచారములు చేయుఁడని దగ్గఱ నున్నవారితోఁ జెప్పి, హరిశాస్త్రులు యింటికిఁబోయెను. రుక్మిణి యాదినమును మఱునాఁడును బలహీనముగాను మత్తుగాను పడియుండెను. మఱునాఁటియుదయమున మరల హరిశాస్త్రులు వచ్చి రుక్మిణిని పట్టినది మొండిగ్రహ మనియు, మహామంత్రముచేతఁ గాని శాబరములచేత సాధ్యము కాదనియు, అయినను తానుజేసిన తపస్సంతయు ధారపోసి వదలఁగొట్టెద ననియుఁ జెప్పి, రాత్రికి తొమ్మిదిమూరల క్రొత్తవస్త్రమును, అఖండమునిమిత్తము మణుగు నేయియు పుష్పములును, ఆఱుమూరల జనపనారత్రాడును, నాలుగుమేకులును, రెండుకుంచముల నీరుపట్టు లోతైన యిత్తడిపళ్లెమును సిద్ధముచేయించి రెండవత్రోవ లేని యొకగదిని గోమయముతో నలికించి యుంచుఁడని రాజశేఖరుఁడుగారితోఁ జెప్పిపోయెను. రాజశేఖరుఁడుగా రాప్రకారము సర్వము జాగ్రత్తపెట్టించి యాతనిరాక కెదురుచూచుచుండిరి. అతఁడు రాత్రి తొమ్మిదిగంట లయినతరువాత వచ్చి గదిలో అఖండదీపమును వెలిఁగించి; అమ్మవారి పెట్టెను దానిసమీపమున నుంచి, బియ్యపు ముగ్గుతో గదికి నడుమ నొక చిన్న పట్టుపెట్టి యందులో రుక్మిణిని గూరుచుండబెట్టి కొంచెముసేపు తనలో నేమో మంత్రమును జపించి దిగ్బంధనము చేసి గది నాలుగు మూలలను మంత్రోదక

మును చల్లి రుక్మిణి నావలకుఁ దీసికొనిపోవచ్చు నని చెప్పి, ఆమెను లోపలికిఁగొనిపోయిన తరువాత గదితలుపు లోపలగడియ వేసికొని గడియసేపుండి వెలుపలికివచ్చి పయిని తాళము వేసి, ఆగ్రహామునకు బ్రతికియున్న కాలములో నృసింహామంత్రము వచ్చియున్నది, కాఁబట్టి యది యేదేవతకును లోఁబడినది కాదనియు, తనయావచ్ఛక్తి వినియోగించి గదిని విడిచి రాకుండునట్లు బంధించిమాత్రము వచ్చితి ననియు, తా నీవలనుండి శరభసాళ్వమును బ్రయోగించినచో ఘోర యుద్ధముచేసి లోఁబడునుగాని మఱియొక విధముగా లోఁబడదనియు చెప్పి— "ఓం-ఖేం-ఖం-ఘ్రుసి-హుం-ఫట్-సర్వశత్రు సంహారిణే-శరభ సాళ్వాయ - పక్షిరాజాయ - హుం-ఫట్-స్వాహా"— అని శరభసాళ్వమును పునశ్చరణ చేయనారంభించెను. రెండుమూఁడులు మంత్రము నుచ్చరించునప్పటికి గదిలోనుండి యొకమనుష్యుని మఱియెవ్వరో కొట్టుచున్నట్టు చిన్నచిన్న దెబ్బలు వినఁబడినవి ; ఆపిమ్మట నొకపెద్ద దెబ్బ వినఁబడెను. ఈప్రకారముగా నరగడియసేపు దెబ్బలు వినఁబడుచువచ్చి సద్దడఁగినతరువాత గ్రహము సులభముగానె దొరికె ననియు దానినిప్పుడే తీసికొనిపోయి గోదావరిలోఁ గలిపెదననియుఁ జెప్పి తా నొక్కఁడును, గదిలోనికిఁబోయి యందలి సమస్తవస్తువులను దీసికొని హరిశాస్త్రిలు వెళ్ళిపోయెను. ఆమఱుచటిదినము మొదలుకొని క్రమక్రమముగా రుక్మిణి జబ్బువదలి యారోగ్యమును బొందసాగెను. తరువాత నాబ్రాహ్మణుఁ డొకదినము రాగిరేకుమీఁద నొకప్రక్కను ఆంజనేయవిగ్రహమును బీజాక్షరములును రెండవ ప్రక్కను ఎటుకూడినను ముప్పదినాలుగు వచ్చునట్లుగాఁ బదునాఱు గదులుగల యీక్రిందనున్న రీతి యంత్రమును వేసి, ఆ రక్షరేకును

౧౦	౫	౧౬	౩
౧౫	౪	౯	౬
౧	౧౪	౭	౧౨
౮	౧౧	౨	౧౩

రుక్మిణిమెడకుఁ గట్టి యదియున్నంతకాలము నేవిధమయిన గాలియు సోఁకదని చెప్పెను. కామాత్రియొక్క గ్రహబాధ నివారణచేసినందున కయి రాజశేఖరుఁడుగారు శాస్త్రులకు దోవతులచాపు కట్టఁబెట్టుటయే కాక నూటపదియాఱురూపాయలను బహుమాన మిచ్చిరి. శాస్త్రి లారాత్రి యమ్మవారి పెట్టెను దెచ్చినప్పు డందులో వేసి కొన్ని బొమ్మరాళ్ళను మాత్రము తెచ్చుకొనెను. ఆవలి కందఱను బంపివేసి తా నొక్కఁడును లోపలఁ గూరుచున్నప్పుడు తలుపు వేసుకొని గది యొక్క మట్టిమిద్దెకు నడుమ మేకులను దిగఁగొట్టి యామేకులకు జనుపనారత్రాడును గట్టి, కొత్తబట్టలోఁ గొంతముక్కను జించి వానికిఁ గొంచెము కొంచెము దూరముగా బొమ్మరాళ్ళను ముడివైచి గుడ్డను దిట్టముగా నేతిలో ముంచి యొకకొనకు జనుపనారత్రాడుకు వ్రేలాడఁగట్టి, దానికి సూటిగా క్రింద భూమిమీఁద పళ్ళెమునిండ నీళ్ళుపోసి నీళ్ళలో పువ్వులను చక్కఁగా బఱచి, ఆగుడ్డకొనకు దీప మంటించి హరిశాస్త్రులు వెలుపలికి వచ్చెను. అతఁ డీవలకు వచ్చిన రెండుమూఁడు నిమిషముల కెల్లను గుడ్డ యంటుకొనఁగా మండుచుం డెడుచమురుబొట్లు నీటిలోఁబడి టప్పుమని మనుష్యునిమీఁద దెబ్బ వేసినట్లు చప్పుడు కాసాగెను. ఆవల బొమ్మరాళ్ళవఱకును కాలినప్పు

డారాయి యూడి నీళ్ళలోఁబడి గొప్పధ్వనిని జేయుచు వచ్చెను గాని పళ్లెములో నడుగునఁ బుర్ర్వలుండుటచేత నిత్తడిపళ్లెముమీఁద వాయించినట్లంతమాత్రము వినఁబడినదికాదు. ఆగుడ్డయంతయు మండి పోయినతరువాత ఆతఁడు లోపలికిఁ బోయి మసి మొదలగువానిని పూర్ణముగా నెత్తుకొని వెడలిపోయెను.

రాజశేఖరుఁడుగారు సువర్ణవిద్యను గ్రహింపవలెనను నపేక్షతో నిత్యమును బైరాగికి సమస్తోపచారములను జరిపించుచు, ఆతని సమయము కనిపెట్టి యనుసరించుచు, అతఁ డొకనాఁడు గంజాయిత్రాగి యుల్లాసముగాఁ గూరుచున్నప్పుడు చేరఁబోయి వినయముతో "బావాజీ! లోకములో సువర్ణముచేయువిద్య యున్నదా?" అని యడిగెను. ఆతఁడు మందహాసము చేసి "ఉన్నది" అని చెప్పెను. ఆపయిని మాటలధోరణిని 'ఆవిద్యయొక్కసంగతి యెటువంటిద' ని రాజశేఖరుఁడుగారు మహాభక్తిశ్రద్ధలతో చేతులు జోడించుకొని యడిగిరి. అందుమీఁద నతఁడు 'ఆసంగతి పరమరహస్య మయినను నీకుఁ జెప్పెద' నని పూర్వయుగములలో స్పర్శవేదివలన నినుము బంగార మగుచు వచ్చెనుగాని యీకలియుగములో స్పర్శవేది లేద నియు, పూర్వము శంకరాచార్యులవా రొక యీఁడిగవానికి సువర్ణ ముఖి యను విద్య నుపదేశింపఁగా వాఁడు చిరకాలము బంగారము ను జేసి కడపట యోగులలోఁ గలసి వారి కుపదేశించి దేహము చాలించె ననియు, తనగురు వా విద్యను తన కుపదేశించెను గాని మంత్రముయొక్క పునశ్చరణము పూర్తికానందునఁ దనకది యింకను ఫలింపలే దనియు, తానిప్పుడు పసరులతోమాత్రమే బంగారమును జేయఁగల ననియు, రాజశేఖరుఁడుగారిమీఁది యనుగ్రహముచేతనే చెప్పినట్లుచెప్పి, ఎల్లవారును దన్ను బంగారము చేయుమని బాధింతురు

గాన ఆసంగతిని మహారహస్యముగా నుంచవలె నని కోరెను. రాజశేఖరుఁడుగారు తా నాప్రకారము గోప్యముగా నుంచెదనని ప్రమాణముచేసి తనకు సువర్ణముచేయు యోగమును జెప్పుఁ డని బహువిధముల వానిని బ్రార్థించిరి. దానిపయిని ఆబైరాగి యది గృహస్థులు చేయఁగూడ దనియు, చేసినయెడల వంశక్షయ మగుననియుఁ జెప్పి తనయెడల విశ్వాసముగలవారికి తానే బంగారమును జేసి యిచ్చెదను గాని యోగమునుమాత్రము చెప్పనని 'చెప్పెను.

అందుమీఁద బంగారమునైనఁ జేయించుకోవలెనను నాశపుట్టి మఱింత శ్రద్ధాభక్తులతో నాతని నాశ్రయించుచు నొకనాఁటి యుదయకాలమున రాజశేఖరుఁడుగారు పాలును శర్కరయుఁ దీసికొనివచ్చి యిచ్చి కూరుచుండియుండఁగా, ఆబైరాగి రాజశేఖరుఁడుగారిమీఁద దనకుఁ బరిపూర్ణానుగ్రహము గలిగినట్టు . ముఖచిహ్నములవలనఁ గనఁబఱచుచు నొకబేడయెత్తు బంగారమును బేడయెత్తువెండినిఁ దెమ్మని యడిగి యాతఁడు తెచ్చియిచ్చినతరువాత వానినిరెంటిని నొకగుడ్డలో కట్టి రాజశేఖరుఁడుగారు చూచుచుండఁగా నిప్పులలో వేసి కొంతసే పుండనిచ్చి యొకపసరును దానిమీఁద పిండి కొంచెముసేపు తాళి పట్టుకారుతోఁ దీసి రెండుబేడలయెత్తు బంగారమును చేతులోఁ బెట్టెను. అందుమీఁద రాజశేఖరుఁడుగారు మఱింత యాశ కలవారయి, తమయింట గల బంగారమును వెండిని గలిపి యేకముగా బంగారమును జేసిపెట్టుఁడని వానిని బహువిధముల వేఁడుకొనిరి. అట్లు వేఁడుకోఁగా వేఁడుకోఁగా గోసాయి యాతని ప్రార్థన నంగీకరించి యింటఁగల బంగారమును వెండినిఁ జేర్చి యొకమూట గట్ట నియమించెను. ఆతని యాజ్ఞానుసారముగా రాజశేఖరుఁడుగారు తమయింటఁ గలవారి నగలును వెండిపాత్రములును ధనమును పోగుచేసి యొకపెద్ద

మూటనుగట్టి యింట నున్నవారుసహిత మెఱుఁగకుండ రహస్యముగ బైరాగియొద్దకుఁ దీసికొని వచ్చిరి. అతఁడు వెంటనే పిడకలదాలి పెట్టించి యీమూటను రాజశేఖరుఁడుగారి చేతులతోనే దానిలోఁ బెట్టించి పుటమువేసి ఆయనను లోపలికిఁ బోయి విసనకఱ్ఱను దెమ్మని పంపెను. రాజశేఖరుఁడుగారు విసనకఱ్ఱను బట్టుకొని మరల వచ్చు నప్పటికి బైరాగి గొట్టముతో నూదుచుండెను; పిడకలసందున నుండి మూటయు కనఁబడుచుండెను. అప్పుడు బైరాగి మఱికొన్ని పిడకలను పైనిబెట్టి మంట చేసి, తాను వేమగిరికొండమీఁద నున్న మూలికలను గొనివచ్చుట కయిఁ వెళ్ళెదననియు, తాను బోయి వానిని గొని వచ్చి పసరు పిండినం గాని యంతయు బంగారము కాదనియు, దాను వచ్చులోపల పిడకలను వేసి మంటచేయుచు జాగ్రత్తతోఁ గసిపెట్టుకొని యుండవలయుననియుఁ జెప్పి, మూలికలనిమిత్తమయి వెళ్లెను. అతఁడు వనమూలికల కయి వెళ్ళి యేవేళకును రానందున, రాజశేఖరుఁడుగారు తామక్కడనేయుండి, బైరాగిని పిలుచుకొనివచ్చుట కయి మనుష్యులనుబంపిరి. వారును గొండయంతయు వెదకి యెక్కడను అతనిజాడను గానక మందుచెట్టు దొరకకపోవుటచేత దూరపుకొండలకుఁ బోయినాఁడేమో యనుకొని మరలవచ్చి యీవార్తనుజెప్పిరి. ఆబైరాగి బంగారముచేయుమూలికలు దొరకనందున గాబోలుమరల రానేలేదు. అతని నిమిత్తమయి యొక దినమువఱకు వేచియుండి రాజశేఖరుఁడుగారు పుటము దీసి చూచునప్పటికి దానియందు బంగారమును వెండియు లేదుగాని తెల్లని భస్మముమాత్ర ముండెను. సులభముగా రజితభస్మమును సువర్ణభస్మమును నయినందున రాజశేఖరుఁడుగారు సంతోషించి పదిలముగా దానిని దాచిరికాని, యేమి కారణముచేతనో యీభస్మమునందు బరువుగాని సువర్ణాదిభస్మముల యందుండు గుణముకాని కనఁబడలేదు.

ఏడవ ప్రకరణము.

రాజశేఖరుఁడుగారి బీదతనము—సుబ్బమ్మ మరణము—బంధుమిత్రుల ప్రవర్తనము—రాజమహేంద్రవర ప్రయాణము—గ్రహణస్నానము.

పూర్వము పుస్తకములయందు— శ్లో॥ ఆధివ్యాధిశతైర్జనస్య వివిధైరారోగ్యమున్మూల్యతే । లక్ష్మీర్యత్ర పతంతితత్ర వివృతద్వారా ఇవ వ్యాపదః॥ ఇత్యాదులకు ధనమే యాపదలకెల్లను మూలమని బోధించు వచనములను జదువునపుడు పురాణవైరాగ్యము గలిగి రాజశేఖరుఁడుగారు దారిద్ర్యమునుగోరుచు వచ్చిరి. లక్ష్మివలెఁ గాక యామెయప్పయైన పెద్దమ్మవారిప్పుడు నాశ్రితసులభురాలు గనుక, ఆతని కోరికప్రకారము దరిద్రదేవత వెంటనే ప్రత్యక్షమయి యాతని యభిమతమును సిద్ధింపఁజేసినది. కాని తాను మునుపను కొన్నరీతిని పేదఱిక మాతని కంత సుఖకరమయినదిగాఁ గనిపించలేదు. ఇప్పుడు మునుపటివలె నిచ్చుటకు ధనము లేకపోయినదిగనుక, ఈవరకు నాతని నింద్రుఁడవు చంద్రుఁడవని పొగడుచు వచ్చిన స్తుతిపాఠకులందఱును మెల్లమెల్లగా నాతనిని విడిచిపెట్టి, అతనివలన ధనికులయి బాగుపడినవారి యొద్దకుఁ బోసాగిరి. అయినను రాజశేఖరుఁడుగారు చేయి చాచి యాచించినవారి నూరక పొమ్మనలేక నోటితో లేదనునది చేతితోనే లేదనుచు, తమ కున్నదానిలోనే వేళకు వచ్చి యడిగినవారికి భోజనము పెట్టుచుండిరి. అందుచేత నతిథి యెంతబీదవాఁడయిన నంత నంతోషించుచుండునే కాని మునుపటి వలె విందులకు విజయంచేయు మిత్రులవంటివారెవ్వరు నిప్పుడు సంతోషపడుచుండలేదు. ఈదానధర్మములకుసహితము కొంతధనము కావలసియున్నది. కాఁబట్టి, ఇంటఁగల యిత్తడిసామానులను కుదువ

జెట్టి రాజశేఖరుఁడుగారు సొమ్ము తెచ్చుచుండిరి. అందుచే నానాఁటికి గృహమునఁ గలసొత్తు తక్కువయి కాపాడవలసిన భారము తగ్గుచుండెను. ఇట్లు కొంతకాలము జరగఁగా నించుమించుగా నింటఁగల జంగమరూప మయిన సొత్తంతయు బుట్టలును తట్టలును కొయ్యలునుగా మాఱఁజొచ్చెను. అప్పుడుసహిత మాతఁడు యాచించినప్పుడు లేదని యెవ్వరిమనస్సులకును నొప్పి కలుగఁజేయ నిష్టము లేనివాఁడయి, మున్నిప్పుడు ననత్య మన్నమాట నెఱుఁగనివాఁ డయినను దరిద్రదేవతయొక్క యుపదేశముచేత ధనదానములకు బదులుగా వాగ్దానములమాత్రమే చేయ నారంభించెను. అహా! మనుష్యుల చేత దుష్కార్యములను జేయించుటలో దారిద్ర్యమును మించినది మఱియొకటి లేదుగదా? అతఁ డీప్రకారముగా సర్వవిధములచేతను బాధపడుచున్నను, ఆసంగతి నొరు లెఱుఁగకుండుట కయి భోజనపదార్థములలో దక్కువచేసియైన మంచిబట్టలను గట్టుకొనుచు అప్పుచేసియైన బీదసాదల కిచ్చుచుఁ బయి కొకరీతి వేషముతోఁ బ్రవర్తించుచుండెను. అది యేమిమాయయెూ కాని లోకములో నెల్లవారును తాము సుఖపడుట కయి వహించుదానికంటెఁ దాము సుఖము ననుభవించుచున్నట్లితరులకుఁ దోఁచుచున్నట్లుచేయుటకయియే విశేషశ్రద్ధను సహితము బీదతనమువలన గలుగు సౌఖ్యములను లాభములను వేదాంతగ్రంథములు వర్ణించిచెప్పుచు ధనము పాపము నకుఁ గుదు రని దూషింపుచున్నను, రాజశేఖరుఁడుగారు మాత్రము మనల నీదారిద్ర్యదేవత యెప్పుడువదలునా యని నిమిష మొక యుగముగాఁ గడపుచుండిరి; కాఁబట్టి యాతఁ డింతవఱకును లక్ష్యముతోఁ జూడని యదృష్టదేవత నిప్పుడు మఱిమఱి ప్రార్థింపసాగెను. దాని నాతఁడెంతయాసపడి వేఁడుచువచ్చెనో యాయదృష్టదేవతయు నంతదూరముగాఁ దొలఁగ నారంభించెను.

అట్టిసమయములోనే సుబ్బమ్మకు రోగము తిరుగఁ బెట్టినది. డబ్బులేక యిబ్బంది పడుచున్న సమయములోనే యుపవాసమును నుప్పిడులును చేసి దినమున కిరువదిస్నానములుచేసి తడిబట్టలు కట్టుకొని రోగపడి యెక్కువ కర్చును దెచ్చి పెట్టినందున కామెమీఁద నెంతో కోపమువచ్చి రాజశేఖరుఁడుగారు విసుగుకొనుచుండఁగా, పనినిమిత్తమయివచ్చి తిరిగిపోవుచున్న యొకబ్రాహ్మణుఁడు దగ్గఱనుండి విని యామెనుదూషించిన లాభములేదని చెప్పి తాను వంటబ్రాహ్మణుఁడనుగాఁ గుదిరెదననియు, ఆమెను మనసు వచ్చినన్నాళ్లు రోగపడనిండనియు- జెప్పుటయేకాక వంటకు నలభీమ పాకములను మించునట్లు చేయ తా నున్నందున నిష్టమున్నచో నామె మృతినొందినను బొందవచ్చునన్న యభిప్రాయమును సహితము సూచనగాఁ గనబఱిచెను. అతని దెట్టిసత్యవాక్కోకాని యాదినము మొదలుకొని తగువైద్యుఁడు లేనందుననో, ఆబ్రాహ్మణుఁడే పథ్యపానములు జరుపుచు వచ్చినందునో వ్యాధి ప్రబలి యొకనాఁ డామెకుఁ బ్రాణముమీఁదికి వచ్చెను. ఆదినము నక్షత్రము మంచిది కాదని పురోహితుఁడు చెప్పినందున, ఆమెను వీధిలోనికిఁ గొనిపోయి గోడప్రక్కను భూశయనము చేసి యొకచాప యడ్డముపెట్టిరి. ఆమెయు రాత్రి జాముప్రొద్దుపోయిన తరువాత లోకాంతరగతురా లయ్యెను. ఆదినము తెల్లవాఱినవఱక నింటనున్న వా రందఱును పీనుఁగుతో జాగరము చేసిరి. మఱునాఁడు ప్రాతఃకాలమునుండియు సమస్తప్రయత్నములు చేసినను, ఊరనున్న బ్రాహ్మణులలో నెవ్వరును సాహాయ్యమునకు వచ్చినవారుకారు ; రాజశేఖరుఁడుగారు తామే వెళ్లి యొకచోట భోగముదానియింట పీనుఁగుల విస్సన్నను పట్టుకొని సంగతిని దెలుపఁగాఁ ఆతఁడు బేరములకారంభించి పదియాఱురూపాయిలకు శవమును మోచుట కొప్పు

గొని లేచివచ్చెను. ఇప్పుడు సహిత మాంధ్రదేశపు బ్రాహ్మణులలో ముఖ్యముగా స్మార్తులలో నెవరియింటనైన నెవ్వరైనను మృతినొంది నప్పుడు బంధువులును కులమువారును తక్కినమతములయందువలెఁ దమంతటవచ్చి సాయముచేయుట లేకపోఁగా వచ్చి ప్రార్థించినను రాక సాకులుచెప్పుటయు మొగము చాటువేయుటయు బ్రాహ్మణజాతి కంతకు నవమానకరముగా నున్నది. సమస్తాపదలలోను ఘోరతర మయిన యీ యాపదకే యెవ్వరును లోఁడుపడనప్పు డేకమతములో నుండుటవలనఁ బ్రయోజనమేమి? ఉండకపోవుటవలన హానియేమి? ఆదినము శవమింటనుండికదలునప్పటికిఁ బగలు రెండుజాములయినది! దహనముచేసి మరల వచ్చునప్పటికిఁ బడమట నాలుగుగడియలప్రొ ద్దున్నది. తరువాత విధ్యుక్తముగా సంచయనము మొదలయిన యపర కర్మ లన్నియు జరగినవి.

మునుపటివలె రాజశేఖరుఁడుగారిని చూచుటకయి బంధువులును మిత్రులును నంతగా వచ్చుట మానివేసిరి; వీధిలో గనఁబడి నపుడుసహితము చూడనట్టు తొలఁగిపోవుటకే ప్రయత్నించుచుఁ విధిలేక కలిసికొని మాటాడునప్పుడు సంగ్రహముగా రెండుమూడు మాటలతోనే సరిపెట్టుచువచ్చిరి! పూర్వ మాయన మాటాడునప్పు డెల్లను ముఖస్తుతులను జేయువారు తరువాత సమ్మతిని గనఁబఱచు శిరఃకంపములనుమాత్రము చేయుచు నాతనిమాటలను మందహాస ముతో వినసాగిరి. కొన్నాళ్ళు కాశిరఃకంపములును మందహాసములును పోయి యూరక యూకొట్టుట క్రింద మారినవి; అటుపిమ్మట నాయూకొట్టుటలు సహితము నడఁగి హితబోధలు బలిసినవి; కాలక్రమమున హితబోధలుసహితమడుగంటి యొకరీతి పరిహాసములుగా బరిణమించినవి. రాజశేఖరుఁడుగారును దారాపుత్రాదులును ధనము

లేనివా రయినను తా మొక దుష్కార్యమునకయి ధనమును దుర్విని యోగము చేయలేదుగదా యని మనసులో నొకవిధ మయిన ధైర్యము నవలంబించి యున్న దానితోనే తృప్తివహించి యుండఁగా, వారి సౌఖ్యమునుగని యోరువలేనివారు కొందఱు మిత్రులని పేరు పెట్టుకొనివచ్చి వారును వీరును మిమ్ము దూషించుచున్నారని చెప్పి వారి నెమ్మదికి భంగము గలిగించుచు వచ్చిరి ; రాజశేఖరుఁడుగారు చేసిన వ్యయమును బూర్వము దాతృత్వ మని వేయినోళ్ళఁ బొగడిన వారే యిప్పుడు దానిని దుర్వినియోగమని నిందింపసాగిరి ; ఆయన వలనఁ బూర్వ మెన్నివిధములనో లాభములను బొందినవారుసహితము రాజశేఖరుఁడుగారు వీధిలోనుండి నడచుచున్నప్పుడు వ్రేలితో జూపి యీయనయే తనధనమునంతను బాడుచేసికొని జోగియైన మహానుభావుఁడని దగ్గఱ నున్నవారితోఁ జెప్పి నవ్వ మొదలు పెట్టిరి. ఈవఱకును సీతను దనకొమారుని కిమ్మని నిర్బంధించుచు వచ్చిన దామోదరయ్య, ఇప్పు డాపిల్లను దన కొడుకునకుఁ జేసికొమని వారివీరిముందఱను బలుకఁజొచ్చెను ; ఆసంగతి కర్ణ పరంపరచే రాజశేఖరుఁడుగారివఱకును వచ్చినందున ఆయన యొకఁ దినము పోయి యడుగఁగా తా నీసంవత్సరము వివాహముచేయ నని చెప్పెను. సుబ్రహ్మణ్యమంతటి యదృష్టవంతుఁడు లోకములో మఱి యెవ్వరును లేరని జాతకమువ్రాసిన సిద్ధాంతియే యాతనికిఁ గన్య నిచ్చెదనన్నవారి యింటికిఁ బోయి యాతనిది తాను జూచినవానిలో నెల్ల జబ్బుజాతక మని చెప్పి పిల్లనీకుండఁ జేసెను. రాజశేఖరుఁడు గారు ధనములేక బాధపడుచుండియు నొరులనడుగుట కిష్టములేనివా రయి యూరకుండఁగా నిజమైనమిత్రుఁ డొకఁడైన నుండకపోవునా యని యెంచి మాణిక్యాంబయు సుబ్రహ్మణ్యమును రాజశేఖరుఁడు గారికడకుఁ బోయి నారాయణమూర్తినిగాని మఱియెవ్వరి నైనను

గాని బదు లడిగి నేమాత్ర మయిన సుబ్బమ్మ మాసికమున కయి తెం దని ప్రార్థించిరి. ఆయన వారిసూటను దీసివేయలేక దామోదరయ్యను, నారాయణమూర్తిని, మిత్రులవలె నటించి తన వలన లాభమును బొందిన మఱికొందఱిని బదు లడిగి చూచెనుగాని, అక్కఱలేనప్పుడు వెనుక మేము బదులిచ్చెదము మేము బదులిచ్చెద మని యడుగనిదే పలుమాఱు సంతోషపూర్వకముగాఁ జెప్పుచు వచ్చినవారు, ఇప్పుడు నిజముగాఁ గావలసి వచ్చినది గనుక పోయి యడిగినను వేయిసాకులు జెప్పి విచారముతో లే దనిరి. పలువురు రాజశేఖరుఁడుగారి యింటికి వచ్చుట మానుకొన్నను, కొంతకాలమువఱకును కొందఱు వచ్చుచుండిరి. కాని తమ్మేమయిన ఋణ మడుగుదు రేమో యని యిప్పు డావచ్చెడువారు సూడ రాకుండిరి. కాఁబట్టి మును పెప్పుడును మనుష్యులతో నిండియుండి రణగుణధ్వని గలిగియుండెడి రాజశేఖరుఁడుగారి గృహ మిప్పుడు త్రొక్కిచూచువారు లేక నిశ్శబ్దముగా నుండెను. అయిన నాస్థితియుం దది చిరకాల ముండినది కాదు; దాని స్తంభముహూర్తబల మెట్టిదో కాని తరువాత మరల సదా మనుష్యులతో నిండి మునుపటి కంటెను సమ్మర్దము గలిగి బహుజనధ్వనులతో మాఱుమ్రోయు చుండెను. మునుపు మనసులో నొకటి యుంచుకొని పయి కొకటి చెప్పుచుఁ గపటముగాఁ బ్రవర్తించువారితోను, బట్ట యిమ్మని కూడు పెట్టుమని యాచించు దరిద్రులతోను నిండి యుండెనుగాని యిప్పుడు మనసులో నున్న దానినే నిర్భయముగా మొగముమీఁద ననెడు ఋజువర్తనము గల వారితోను బట్టలును భోజనపదార్థములు గొన్నందున కయి యీవలసిన సొమ్మిమ్మని యధికారమును జూపు భాగ్యవంతులతోను నిండియుండ నారంభించెను. గృహమునకు మనుష్య సమృద్ధి కలిగినట్టుగానే రాజశేఖరుఁడుగారికి వస్తుసమృద్ధియు నానాఁటి

కధికముగాఁ గలుగనారంభించెను. మునుపటివలెఁ బగటిపూటయందుఁ బదార్థసందర్శన మంతగాఁ గలుగకపోయినను, తదేకధ్యానముతో నున్నందున రాత్రులు కలలయందుమాత్రము తొంటికంటె సహస్ర గుణాధికముగాఁ గలుగుచుండెను. ఆ బాధ లట్లుండఁగా మున్ను రుక్మిణి శిరోజములను తీయించకపోవుట నే బాగుగ నున్నదని శ్లాఘించిన శ్రోత్రియులే యిప్పు డాతనినిఁ బలువిధముల దూషించుటయే కాక సభవారికి నూఱురూపాయ లపరాధము సమర్పించుకొని మొదల శ్రీశంకరాచార్యగురుస్వామికి వ్రాసి జాతిలో నుండి వెలివేయించెద మని బెదరింపఁజొచ్చిరి. ఋణప్రదాతలతో నిండియుండి యిల్లొక యడవిగా నున్నందునను, వీధిలోనికిఁ బోయిన సుగుణములనుసహి తము దుర్గుణములనుగానే పలుకుచు హేళనచేయు మహాత్ములతోను నిండియుండి యూరొకమహాసముద్రముగా నున్నందునను గౌర వముతో బ్రతికినచోటనే మరల లాఘవముతో జీవనము చేయుట కంటె మరణ మయినను మేలుగాఁ గనఁబడినందునను, ఏలాగునైనను ఋణవిముక్తి చేసికొని యూరువిడిచి మఱియొకచోటికిఁ బోవలె నని ఆయన నిశ్చయించుకొనెను. కాఁబట్టి వెంటనే రామశాస్త్రియొద్దకు బోయి యింటి తాకట్టుమీఁద నయిదువందల రూపాయలను బదులు పుచ్చుకొని, సొమ్ము సంవత్సరమునాటికి వడ్డీతోఁగూడ దీర్చునట్టును, గడువునాటికి సొమ్మియ్యలేనిపక్షమున నిల్లాతనికిఁ గ్రయ మగు నట్టును పత్రమును వ్రాసి యిచ్చెను. ఆప్రకారముగా సొమ్ము బదులు తెచ్చి దానిలో నాలుగువందల రూపాయలతో ఋణముల నన్నిటిని దీర్చివేసెను. బదు లిచ్చిన మఱుసటినాటినుండియు నిల్లు వోటుచేసి తన యధీనము చేయవలసిన దని రామశాస్త్రి వర్త మానమును పంపుచుండెను. పూర్వము స్కాందపురాణమును జదివి నప్పటినుండియు రాజశేఖరుఁడుగారి మనసులోఁ గాశీయాత్ర వెళ్ళ

వలె నని యుండెను. ఆకోరిక యిప్పు డీవిధముగా నెఱవేఱనున్నందు నకు సంతోషించి, రాజశేఖరుఁడుగారు సకుటుంబముగా గంగాస్నానము చేసివచ్చుటకు నిశ్చయించి తారాబలమును చంద్రబలమును బాగుగనున్న యొక చరలగ్నమునందుఁ బ్రయాణమునకుఁ ముహూర్తము పెట్టి "ప్రతిపన్నవమిపూర్వే" యని యుండుటచేత శిఖశూల లేకుండఁ జూచుకొని "నపూర్వేశనిసోమేచ" యనుటచేత వారశూల తగులకుండ ఫాల్గునశుద్ధ త్రయోదశీ బుధవారమునాఁడు మధ్యాహ్నము నాలుగుగడియల ప్రొద్దువేళ బయలుదేఱుటకు బండి నొకదానిని కుదిర్చి తెచ్చిరి. వారీవఱకుఁ జేసిన యాత్ర లన్నియు గోదావరియొడ్డున నుండి యింటియొద్దకును, ఇంటియొద్దనుండి గోదావరియొడ్డునకు నేకాని యంతకన్న గొప్పయాత్రలను జేసినవారుకారు.

బండిని తెప్పించి వాకిటఁగట్టిపెట్టించి ప్రయాణముహూర్తము మించిపోకమునుపే బండిలో వేయవలసిన వస్తువులను వేయవలసిన దని రాజశేఖరుఁడుగారు పలుమాఱు తొందరపెట్టినమీఁదట మాణిక్యాంబ తెమలివచ్చి బండినిండను సుద్దతట్టలను బుట్టలను చేఁదలను నింపి మఱియొకబండికిఁ గూడఁ జాలునన్నిటిని వీధిగుమ్మములో నుంచెను; బండిలో నెక్కవలసిన యిత్తడిపాత్రములును బట్టలపెట్టెలును లోపలనే యుండెను; ఇంతలో రాజశేఖరుఁడుగారు వచ్చి యాబుట్టలు మొదలగువానిని బండిలోనుండి దింపించి వారు వెళ్ళిపోవుచున్నారని విని చూడవచ్చిన బీదసాదలకుఁ బంచిపెట్ట నారంభించెను. ఆవఱకు లోపలనుండి కదలి రాకపోయినను రాజశేఖరుఁడుగారు వస్తువులను బంచిపెట్టుచున్నా రన్నమాటను విన్నతోడనే యిరుగుపొరుగుల బ్రాహ్మణోత్తములు వాయువేగమునఁ బరుగెత్తుకొనివచ్చిరి. బండిలో స్థలముచాలక క్రిందనుంచిన తట్టలు మొదలగు

వానిని మాణిక్యాంబయుఁ దన్ననుసరించుచున్న వారికిఁ బంచి పెట్టెను. తరువాతఁ బెట్టెలును నితరడిసామానులును బండిలో నెక్కింపఁబడినవి ; మునుపు నాలుగుబండ్లలో నెక్కించినను సరిపోని సామానులిప్పు డొక్కబండిలోనే చాలక దానిలో నలుగురుగూరుచుండుటకు స్థలముకూడ మిగిలెను. రాజశేఖరుఁడుగారెంత తొందరపెట్టుచున్నను మాణిక్యాంబ తనకాప్తురాండ్రయిన యొకరిద్దఱు పొరుగుస్త్రీలవద్ద సెలవుపుచ్చుకొని వచ్చుటకే ప్రత్యేకముగా నాలుగుగడియలాలస్యము చేసెను. ఈలోపుగా మంచములను బండిగూటిపయిని గట్టించి, పిల్లలను బండిలో నెక్కించి, రాజశేఖరుఁడుగారు కోపపడినందున మాణిక్యాంబ వచ్చి బండిలోఁ గూరుచుండెను. బండివాని యొద్దకు వచ్చినప్పటినుండియుఁ గొంచెము వట్టిగడ్డిపరకలతోను కావలసినంత జలముతోను మితాహారమును గొనుచు పథ్యముచేయుచున్న బక్కయెద్దు మెల్లగా బండిని లాగనారంభించెను. బండివాఁడును వానివెనుక నేనడచుచు మేఁతవేయుటలోఁ బరమలుబ్ధుఁడుగానేయున్నను కొట్టుటలోమాత్రము మిక్కిలి యౌదార్యమును గనఁబఱుపసాగెను. ఊరిబయులవఱకునువచ్చి, రాజశేఖరుఁడుగారివలన బిచ్చములను గొన్న నిరుపేదలయిన తక్కువజాతులవారు పలువిధముల వారిని దీవించి, విచారముతో వెనుకకు మరలిపోయిరి. నల్లమందు వేసికొనుటచేతనో త్రాగుటచేతనో సహజమైన మత్తతచేతనో యీమూడును గూడఁ గలియుటచేతనో త్రోవపొడుగునను తూలుచుఁ గునుకుపాట్లుపడుచు నడుచుచున్న బండివాఁడు మొత్త నెక్కి కూరుచుండి, బండిలోనివారికిఁ గావలసినంత పరిమళమును ఆకాశమునఁ జిన్నమేఘములును గలుగునట్టుగా సగముకాలియున్న ప్రాఁతపొగచుట్టలను నాలిగింటిని గుప్పుగుప్పునఁ గాల్చి బండిలోని పెట్టెకుఁ జేరగిలఁబడి హాయిగా నిద్రపోయెను. బండియు మెల్లగా ప్రాకుచున్నట్టే

కనఁబడుచుండెను ; ఇంతలోఁ జీఁకటియుఁ బడెను. కొంతసేపటికి రాజశేఖరుఁడుగారు క్రిందఁ జూచునప్పటికి బండికదలుచున్న జాడ కనఁబడలేదు. అప్పుడు కుంభకర్ణునివలె నిద్రపోవుచున్న యాబండి వానిని లేవఁబూనుకోఁగా, కేకలేమియుఁ బనిచేసినవికావు కాని వాని కాలిమీఁద కొట్టినదెబ్బలుమాత్రము వానిని కదలి యొక్కమూలుగు మూలిగి మఱియొక్క ప్రక్కఁ బరుండునట్లుచేసినవి. మహాప్రయత్నముమీఁద వానిని లేపి క్రిందదిగి చూచునఱకు బండి త్రోవతప్పివచ్చి యొకపొలములో మోఁకాలిలోతు బురదలో దిగఁబడియుండెను. అప్పుడందఱును దిగి యావచ్ఛక్తి నుపయోగించి రెండుగడియలకు బండిని రొంపిలోనుండి లేవనెత్తి మార్గమునకు లాగుకొనివచ్చిరి. కాని యెద్దుమాత్రము తాము బండిని గొనిపోవుస్థితిలో లేక తమ్మే మఱి యొకరు గొనిపోవలసిన యవస్థయందుండెను. కాఁబట్టి చీఁకటిపడువఱకు బండి శ్రమచేసి వారినిలాఁగుకొని వచ్చినందునకుఁ బ్రత్యుపకారముగా నిప్పుడు చీఁకటిపడ్డందున వారే బండి నీడ్చుకొనిపోవలసిన వంతువచ్చెను. ఇట్టియవస్థ పగలు సంభవింపక రాత్రి సంభవించినందున కెల్లవారును మిక్కిలి సంతోషించిరి. అందఱిబట్టలకును బురదచేతఁ జిన్నవియుఁ బెద్దవియు నైనపలువిధము లైనపుష్పము లద్దఁబడినవి; బండిలో నెక్కివచ్చినవారి కెట్లున్నను చూచువారు లేకపోయిరికాని యున్నయెడల వారి కెంతయైనవినోదము కలిగియుండును. బండివాఁడు భీమునివంటివాఁడు గనుక రాజశేఖరుఁడుగారి సహాయ్యముచేత బండిని సులభముగా నీడ్చుచుండఁగా, సుబ్రహ్మణ్యము వెనుకజేరి యెడ్లను స్త్రీలను నడిపించుకొని వచ్చెను. వారు నడిచియే వెళ్ళినయెడల జాములోపలనె రాజమహేంద్రవరము వెళ్ళిచేరి యుందురు గాని బండినికూడ నీడ్చుకొని పోవలసివచ్చినందున రాత్రి

రెండు యామములకు రాజశేఖరుఁడుగారి పినతండ్రికుమారుఁడగు రామమూర్తిగారియిల్లు చేరిరి. అప్పుడందఱును మంచినిద్రలో నుండిరి కాఁబట్టి బండిచప్పుడు కాఁగానే తలుపు తీయఁగలిగినవారుకారు. కొంతసేపు తలుపువద్ద బొబ్బలుపెట్టినమీఁదట చావడిలోఁబరున్నవారెవ్వరో లేచివచ్చి తలుపుతీసిరి. రాజశేఖరుఁడుగారి మాట వినఁబడినతోడనే లోపలిగదిలోఁ బరుండియున్న రామమూర్తిగారు లేచి వచ్చి, అన్నగారిని కౌఁగిలించుకొని వారావఱకే వత్తురని కనిపెట్టుకొనియుండి జాముప్రొద్దుపోయిన మీఁదటనుగూడ రానందున, ఆదినము బయలుదేఱలేదని నిశ్చయించుకొని భోజనములుచేసి తామింతకుమునుపే పడుకొన్నా మని చెప్పి యింత యాలస్యముగా వచ్చుటకుఁ గారణ మేమని యడిగిరి. తాము చెప్పనక్కఱలేకయే తమబట్టలును మోఁకాలివఱకును బురదలో దిగఁబడినకాళ్లును జెప్పసిద్ధముగా నున్న దానినిమాత్ర మాలస్యకారణముగాఁ జెప్పి బండిని దామోఁచుకొనివచ్చినసంగతినిమాత్రము చెప్పక రాజశేఖరుఁడుగారు దాచిరి. అప్పుడీయవలసిన బండికూలి యిచ్చివేసి బండివానిని పొమ్మనిచెప్పఁగా వాఁడు తాను విశేషముగా శ్రమపడితి ననియు తనబండియెద్దులంతటి మంచివి మఱెక్కడను దొరకవనియుఁ జెప్పి తన్నును తనయెద్దులను గొంతసేపు శ్లాఘించుకొని బహుమతిరావలెనని యడిగిన తడవుగ మాటాడనిచ్చినయెడల మాటవెంబడిని బండిని తాములాగుకొనివచ్చిన మాటను చెప్పునేమోయను భయమున సామానుదిగినతోడనే బహుమతినిసహిత మిచ్చి రాజశేఖరుఁడుగారు వెంటనే వానిని బంపివేసిరి. క్రొత్తగా మగఁడు పోయినవారిని పుణ్యస్త్రీలు భోజనము లయిన తరువాత మొదటిసారి చూడరాదు గనుకను, ఆరాత్రి మంచి దినము కాదుగనుక, సువాసినుల నందఱను గదిలోనికిఁ బోయి

తలుపు వేసికొం డని చెప్పి యొక విధవ ముందుగా రుక్మిణిని లోపలికిఁ దీసికొనివచ్చి మఱియొక గదిలోనికిఁ బంపి తలుపు దగ్గఱగా వేసెను. తరువాత లోపలినుండి యాఁడువారు వచ్చి మాణిక్యాంబ మొదలైనవారిని వడమటింటిలోనికిఁ దీసికొని పోయి రుక్మిణికి దటస్థించిన యవస్థ కయి యేడుపులు మొదలైనవి చల్లారినపిమ్మట, వారినిమిత్త మావఱకు చేసిన వంట మిగిలియున్నది కాన వారికి వడ్డించి రాజశేఖరుఁడుగారినిమిత్త మప్పుడత్తెసరు పెట్టిరి. అందఱును భోజనము లయినతరువాత మూఁడుజాములకు పరుండి సుఖనిద్రచేసిరి.

రాజశేఖరుఁడుగారు కొన్నిదినములు రామమూర్తిగారి లోపలనే యుండిరి. ఒకనాఁడు పడవమీఁద గోవూరునకుఁ బోయి యచటఁ బూర్వము గౌతముఁడు తపస్సు చేసినస్థలమును, మాయ గోవు పడినచోటును జూచి గోపాదక్షేత్రమున స్నానము చేసి రాత్రికి మరల వచ్చిరి; మఱియొకనాఁడు కోటిలింగక్షేత్రమున స్నానమునకుఁ బోయి యచట నొక శాస్త్రులవలనఁ బూర్వ మాంజనేయు లొక లింగము నెత్తుకొని పోయి కాశిలో వేయుటయు అప్పటినుండియు కాశికాపట్టణము ప్రసిద్ధిగనుటయు మొదలుగాఁగల కథను వినిరి. ఇంకొకనాఁడు రాజరాజనరేంద్రుని కోటకుఁ బోయి అందులోఁ బూర్వము చిత్రాంగిమేడయున్న తావును సారంగధరుఁడు పావురముల నెగరవేసిన చోటును జూచి, పూర్వము రాజరాజనరేంద్రున కమ్మవారు ప్రత్యక్షమయి నీ వెంతదూరము వెనుక తిరిగిచూడకుండ నడుతువో యంతదూరము కోట యగునని చెప్పుటయు, అతఁడాప్రకారముగా నడచుచు వెనుక గొప్ప ధ్వని యగుచుండఁగాఁ గొంతసేపటికి మనస్సు పట్టలేక వెనుక తిరిగిచూచుటయు, చుట్టును బంగారుకట్టుతో నించుమించుగా ముగియవచ్చిన కోట యంతటితో

నిలిచిపోవుటయు, మొదలుగాఁగల కథను దగ్గఱనున్న వారివలన విని, రాజశేఖరుఁడుగారు సారంగధరుని కాళ్ళను జేతులను, నఱికిన స్థలమునే జూచిరావలె నని బయలుదేఱి సారంగధరుని మెట్టకుఁ బోయి యక్కడ నొకనిమ్మచెట్టుక్రింద సారంగధరుని కాళ్ళను చేతులను ఖండించిన చాపరాతిని దానిచుట్టును గడ్డిసహితము మొలవక యున్నగా నున్న ప్రదేశమును దాని సమీపముననే సిద్ధుఁడు సారంగధరుని గొనిపోయి స్నానముచేయించిన కొలఁకును జూచి వచ్చిరి. రాజమహేంద్రవరములో నున్న కాలములో రాజశేఖరుఁడుగారు పట్టణములో నుండెడిజనులకును పల్లెలలో నుండెడిజనులకును నడవడియందేమి వ్యత్యాసముండునో చూడవలె నని యెల్లవారియొక్క చర్యలును బరీక్షింపసాగిరి; కాఁబట్టి యిప్పుడిప్పు డాయనకు నిజమయిన ప్రపంచజ్ఞానము కొంతవఱకుఁ గలుగ నారంభించెను. ఆపట్టణములో——ఎరువడిగి తెచ్చుకొనినదైనను జేతికి మురుగులు నుంగరములును వేసికొని, చాకలివానియొద్ద నడిగి తెచ్చుకొనినదైనను విలువబట్టలను గట్టుకొనువారె మిక్కిలి గౌరవమునకుఁ బాత్రులుగా నుండిరి. లోపల సారమేమియు లేకపోయినను జెవులకు మంచి కుండలములను జేయించుకొని తలకు గొప్పశాలువను జుట్టుకొన్నవారు మహాపండితులుగా నుండిరి. ఎల్లవారును ధనికుల యిండ్లకుఁ బోయి జీవితకాలములో నొకప్పుడు దేవాలయము త్రొక్కి చూడకపోయినను భగవన్నామమును కలలోనైనను స్మరింపకపోయినను వారిని పరమభాగవతోత్తము లని భక్తాగ్రేసరు లని పొగడుచుండిరి; నిజమైన విద్వాంసులయొక్కయు కవీశ్వరుల యొక్కయు నోళ్ళను కడుపులును సదా శ్లోకములతోను పద్యములతోను మాత్రమె నిండియుండెనుగాని బాహ్యాదంభము లేకపోవుట

చేత నన్నములో నొకప్పుడును నిండి యుండ లేదు; దినమున కెని మిది దొమ్మరగుడిసెలలో దూఱినను, స్నానము చేసినట్టు జుట్టుచివర ముడి వైచుకొని బొట్లు బెట్టుకొని తిరుగువారు పెద్దమనుష్యులని పొగడ బొందుచుండిరి. వేయేల? చాటున లక్షదుష్కార్యములు చేయుచున్నను, బాహ్యవేషధారణమునందు మాత్రము లోపము లేకుండనున్నచో వారి ప్రవర్తనమును సంపూర్ణముగా నెఱిఁగియు నట్టివారి కందఱకును సభలో సహితము మంచి నడవడి గలవారికిఁ జేయుదానికంటె నెక్కువ మర్యాదను జేయుచుండిరి. నీతివిషయమున వారి ప్రవర్తన మెంత హేయ మయినదిగా నున్నను, మతవిషయము నందుమాత్రము పయికి భక్తులుగానే కనఁబడుచుండిరి. నిలువ నీడ లేక బాధ పడుచుండెడి ప్రాణమిత్రుల కొక కుటీరమును గట్టించి యియ్యలేనివారు సహితము, రాతివిగ్రహములు కాపురముండుట కయి వేలకొలఁది వెచ్చపెట్టి దేవాలయములు కట్టించుచుండిరి; కట్టించినవారు పోయినతరువాత వసతులు లేక పాడుపడిన దేవాలయములను నూట యిరువదిమూటిని లెక్కపెట్టి రాజశేఖరుఁడుగారు కోటిలింగములకుఁగూడ బూర్వమెప్పుడో దేవాలయములు పాడయి నందున నాప్రకారముగా నిసుకదిబ్బలయందుఁ బడియుండిన వై యుండవచ్చు నని సంశయించిరి; అక్కడ వేశ్యలు తప్ప మఱియెవ్వరును స్త్రీలు చదువకుండిరి; అట్టివా రభ్యసించిన విద్యయంతయు వ్యభిచారమును వృద్ధిచేసి పురుషులను దమ వలలలోఁ బడవేసుకొని పట్టణము పాడు చేయుటకొఱకే పనికి వచ్చుచుండెనుగాని జ్ఞానాభివృద్ధికిని సన్మానప్రవర్తనమునకును లేశ మయినను తోడు పడు చుండ లేదు.

అక్కడ సప్తమివఱకు నుండి రాజశేఖరుఁడుగారు కాశికి వెళ్ళుటకు ప్రయాణ మయిరిగాని, సంవత్సరాదివఱకు నుండుఁడని రామ

మూర్తిగారు బలవంతపెట్టినందున నాతనిమాట త్రోసివేయలేక యొప్పుకొనిరి. ఫాల్గుణబహుళ అమావాశ్యనాఁడు పగలు మూఁడుజాముల వేళ సంపూర్ణ సూర్యగ్రహణము పట్టెను. జనులందరును గోదావరిలో పట్టుస్నానము చేసి తమ పితరులకు తర్పణము లిచ్చుచుండిరి; కొందరు పుణ్యముకొఱకు నవగ్రహజపములు చేయుచు బ్రాహ్మణులకు నవధాన్యములును దానము చేయుచుండిరి; కొందఱు ఛాందసులును వృద్ధాంగనలును సూర్యునకు విపత్తువచ్చె నని కన్నుల నీరుపెట్టుకొన సాగిరి; వారిలో దెలిసినవార మనుకొనువారు సూర్యునకుఁ బట్టిన పీడను వదలఁగొట్టుట కయి మంత్రములను జపించుచుండిరి; వారికంటెను దెలివిగలవారు గ్రహణకాలమునందు తమ కడుపులలో జీర్ణముకాని పదార్థము లుండిన దోషమనియెఱిఁగి దానిముందు మూఁడుజాముల నుండియు నుపవాసములు చేయుచుండిరి; ఎల్లవారును భోజనపదార్థము లుంచు పాత్రములలో దర్భగడ్డిని వేయుచుండిరి; కడుపుతో నున్న స్త్రీలు పైకి వచ్చినయెడల అంగహీను లయిన పిల్లలు పుట్టుదు రని యెంచి పెద్దవా రట్టిస్త్రీలను గదులలోఁ బెట్టి తాళము వేసి కదలమెదలవల దని యాజ్ఞాపించిరి; మఱికొందఱు మంత్రవేత్తల మని పేరు పెట్టుకొన్నవారి కేమయిన 'నిచ్చి మంత్రోపదేశమును బొంది శీఘ్రముగా సిద్ధించుట కయి బొమ్మలబంటి నీటిలో జపము చేయుచుండిరి. గ్రహణకాలమున నోషధులయందు విశేషగుణ ముండునని యెంచి కొందఱువూఢులు స్నానము చేసి వెపమొలలతో జుట్టు విరియఁబోసికొని చెట్లకు ధూపదీపములు సమర్పించి వేళ్ళను దీయుచుండిరి; గ్రహణ సమయమున దానము చేసిన మహాపుణ్యము కలుగు నని చెప్పి బ్రాహ్మణప్రభువులు తమ బట్టలు తడియకుండఁ బయి కెగఁగట్టుకొని మోకాలిలోతు నీళ్ళలో

నిలుచుండి సంకల్పమును జెప్పుచు మూఢులయొద్దను స్త్రీలయొద్దను జేరి నీరుకాసులను గ్రహించుచుండిరి. పూర్వాచారమును బట్టి రాజశేఖరుఁడుగారు తాము స్నానము చేసిరిగాని, పయిని చెప్పిన కృత్యమును జేయువారందఱును మూఢులని యెంచి గ్రహణవిషయమయి యచ్చటి పండితులతో వాదములు చేయ నారంభించిరి. అతఁడు జ్యోతిషశాస్త్రమును నమ్మినను పురాణములనుమాత్రము శాస్త్రవిరుద్ధముగా నున్నప్పుడు నమ్మకుండెను. కాఁబట్టి— శ్లో॥ పశ్చాద్భాగా జ్జలదవదధ స్సంస్థితో౽భ్యేత్య చంద్రో । భానోర్బింబం స్ఫురదసితయా ఛాదయత్యాత్మమూర్త్యా ॥ అను సిద్ధాంతశిరోమణి శ్లోకమును, శ్లో॥ ఛాదకో భాస్కరస్యేందు రధస్థో ఘనవద్భవేత్ । భూచ్ఛాయాం ప్రాఙ్ముఖశ్చంద్రో విశత్యస్య భవేదసౌ — అను సూర్య సిద్ధాంతశ్లోకమును జదివి, భూగోళమున కుపరిభాగమున సూర్యుఁ డుండునపుడు చంద్రుఁడు తన గతివిశేషముచేత సూర్యునకును భూమికిని నడుమ సమకళయందు వచ్చునేని సూర్యగ్రహణము కలుగునుగాని రాహువు మ్రింగుటచేతఁ గలుగదనియు పౌరాణికులు చెప్పినదే గ్రహణమునకుఁ గారణ మయినయెడల రాహుకేతువుల మనసులలోని యభిప్రాయములను దెలిసికొనుటకు మనము శక్తులము కాముకాఁబట్టి గ్రహణ మిప్పుడుకలుగు నని ముందుగాఁ దెలిసికోలేక పోయి యుందుమనియు, సూర్యగ్రహణ మమావాస్యనాఁడును చంద్ర గ్రహణము పూర్ణిమనాఁడునుమాత్రమే పట్టుటకుఁ గారణ ముండ దనియు, రాహుకేతువు లాకాశమున నెప్పుడును గనఁబడకపోవుట యెల్లరు నెఱుంగుదుగాన సూర్యచంద్రులను మ్రింగఁగలిగినంత పెద్దవియే యయి యుండినయెడల గ్రహణసమయమున నవేల కనఁ బడకుండుననియు, రాహువే మ్రింగునేని మన పంచాంగరీతిగా నీగ్రహణ మొకదేశమునఁ గనఁబడి మరియొకదేశమునఁ గనఁబడక

పోవుటకు హేతు వుండదనియు, రాజశేఖరుఁడుగారు బహుదూరము వాదించిరి. అక్కడ నున్న పండితులలో నెవ్వరికిని యుక్తులుతోఁచక పోయినను, విశేషముగా కేకలుమాత్రము వేసిరి. అక్కడ నున్నవారికా వాదమేమియుఁ దెలియలేదు. కనుక బిగ్గఱగా నఱచినందున శాస్త్రులవేళ్లవారే గట్టివా రని మెచ్చుకొని రాజశేఖరుఁడుగారి వాదము బౌద్ధవాద మని దూషించిరి. ఒకరిని వెక్కిరించుటవలనఁ గలుగవలసిన సంతోషము తప్ప మఱియొకవిధమైన సంతోషము తమకు లేదుగనుక, విద్యాగంధ మెఱుఁగని మూర్ఖశిరోమణులు రాజశేఖరుఁడుగారిని బహువిధములఁ బరిహసించి పొందఁదగిన యానందము నంతను సంపూర్ణముగా ననుభవించిరి. ఇంతలో గ్రహణమోక్షకాలము సమీపించినందున నెల్లవారును విడుపుస్నానమునకై పోయిరి. శుద్ధమోక్ష మయినతరువాత ముందుగా స్నానము చేసివచ్చి యాఁడువారు వంట చేసినందున దీపములు పెట్టించి యెల్లవారును ప్రథమభోజనములను జేసిరి.

ఎనిమిదవ ప్రకరణము

సంవత్సరాది—రాజశేఖరుడుగారి ప్రయాణము—రాజానగరమునకు సమీపమున నొకరాజు వడగొట్టి పడిపోవుట—నల్లచెఱువు సమీపమున నొకయోగి కనబడుట—దొంగలు కొట్టుట – రుక్మిణి మరణము.

సంవత్సరాదినాఁడు తెల్లవారినతరువాత రామమూర్తిగారు మంగలివానిని పిలిపించి రాజశేఖరుఁడుగారికిని సుబ్రహ్మణ్యమునకును వానిచేత తల యంటించిరి. ఇంటనున్న మగవారియభ్యంజనస్నానము లయినతరువాత, ఆఁడువారందఱును తలలంటుకొని నీళ్ళుపోసికొనిరి. స్నానములయినపిమ్మట వేపపువ్వును క్రొత్తమామిడికాయ ముక్కలును క్రొత్తచింతపండుపులుసుతో నందఱును దేశాచారము ననుసరించి భక్షించి రెండుజాములకు పిండివంటలతో భోజనములు కావించి పండుగుచేసికొనిరి. పండుగదినములలో జనులు మఱింత యెక్కువసుఖపడవలసినదానికి మాఱుగా, ఈదేశములో వేళతప్పించి భోజనములుచేసి యట్టిదినములందు దేహములను మఱింత యాయాసపెట్టుకొందురు. మధ్యాహ్నము చల్లపడినమీఁదట రామమూర్తిగారు రాజశేఖరుఁడుగారిని వెంటఁబెట్టుకొని నూతనపంచాంగశ్రవణమునకయి వేణుగోపాలస్వామివారి యాలయమునకు వెళ్ళిరి. అ వఱకే యొకసిద్ధాంతి పసపుతోఁగలిపినయక్షతలను పళ్ళెముతో ముందు పెట్టుకొని—

శ్లో॥ శ్రీకళ్యాణ గుణావహం రిపుహరం దుస్స్వప్న దోషాపహం।
గంగాస్నానవిశేషపుణ్యఫలదం గోదానతుల్యం నృణాం
ఆయుర్వృద్ధిదముత్తమం శుచికరం సంతాన సంపత్ప్రదం
నానాకర్మ సుసాధనం సముచితం పంచాంగమాకర్ణ్యతాం॥

అను శ్లోకము జదివి, సంక్రాంతి పురుషుని లక్షణమును వివరించి సంవత్సరఫలమునుజెప్పి, ధాన్యాదులయొక్కయు వృశ్చికాదులయొక్కయు వృద్ధిక్షయములను జదివి, జన్మనక్షత్రములను తెలియనియెడల నామ నక్షత్రములను తెలిసికొని యెల్లవారికిని కందాయముల యంకములను ఆదాయవ్యయములను జెప్పెను. అక్కడ నున్నకాపులు మొదలగు వారు సిద్ధాంతిగారి చేతిలో నేమొసఁబెట్టి తమ కేకందాయమునందును సున్నలు రాకుండఁ జేసికొనిరి. పంచాంగశ్రవణ మయిన తరువాత రామ మూర్తిగారు—"సిద్ధాంతిగారూ! కలియుగము ప్రారంభమయి యిప్పటి కెన్నిసంవత్సరము లయినది?"

సిద్ధాంతి—ఇప్పటికి కలియుగాది గతసంవత్సరములు ౪౭౧౯ శాలివాహనశకాబ్దములు ౧౫౪౧, విక్రమార్క శకసంవత్సరములు ౧౬౭౬.

రామ—మనదేశములో మ్లేచ్ఛుల యధికార మింకను ఎంత కాలముండునో కాలమానమునుబట్టి చెప్పఁగలరా?

సిద్ధాంతి—మనదేశములో తురుష్కుల దొరతనము అయిదు వందల సంవత్సరములకు లోపలపోదు. ఆపిమ్మట పూసపాటివారివంశ మున వేపకాయంత తోకఁగలవాఁ డొకఁడు పుట్టి, ఆసేతుహిమాచల మును గల సర్వప్రపంచమును మరల జయించును.

అంత ప్రదోషసమయమయినందున పంచాంగము కట్టిపెట్టి యందఱును తమతమ యిండ్లకు నడచిరి.

రాజశేఖరుఁడుగారు విదియనాఁడు కాశీయాత్రకు బయలుదేఱ నిశ్చయించుకొని యెందరెన్నివిధములఁ జెప్పినను వినక ప్రయాణ ముహూర్తమును పెట్టుటకై గుడిలో పంచాంగమును జదివిన పిడపర్తి శ్రీరామసిద్ధాంతిని పిలిపించిరి. ఆతఁడును తిథివారనక్షత్రములను చక్కఁగా నాలోచించి యారాత్రియే పదియారుఘటికల తొమ్మిది

ఏఘటికలమీఁద యాత్రకు యోగ్యసమయమని ముహూర్తముంచెను. ఆసమయమున కుటుంబముతో బైలుదేరుట క్షేమకరము కాదని యెంచి, రాజశేఖరుఁడుగారు పొరుగింట నొకవస్త్రమును దానిలో చుట్టబెట్టి యొకపుస్తకమును నిర్గమనముంచి యెల్లవారినతరువాతనే బైలుదేరుటకు నిశ్చయించిరి. అప్పుడు రామమూర్తిగారు బండి నిమిత్తము వర్తమానము పంపఁబోఁగా వలదని వారించి బండినెక్కిపోయినయెడల యాత్రాఫలము దక్కదు గాన కాలినడకనే పోయెదనని రాజశేఖరుఁడుగారు చెప్పిరి. ఆరాత్రియే వారికందఱికిని క్రొత్తబట్టలు కట్టఁబెట్టి, రామమూర్తిగారు ప్రాతఃకాలముననే వారి కంటె ముందుగా లేచి వారు ప్రయాణమగునప్పటికి సిద్ధముగా నుండిరి. అప్పుడు రాజశేఖరుఁడుగారు తాము ధవళేశ్వరమునుండి తెచ్చినపాత్రసామగ్రియు, మంచములును, బట్టలపెట్టెలను తాము మరల వచ్చువరకును భద్రముగా జాగ్రత్తచేయవలయునని రామమూర్తిగారికి చెప్పి యొప్పగించి, దారిప్రయాణమునకు ముఖ్యముగా కావలసిన వస్తువులను మాత్రము తమతో నుంచుకొనిరి. మాణిక్యాంబ మొదలగువారు బైలుదేఱునపుడు రామమూర్తిగారిభార్య వీధివరకును వచ్చి వారు దూరదేశయాత్రను జేయఁబూనుటను దలఁచుకొని కంటఁదడిబెట్ట మొదలు పెట్టెను. అప్పుడు వారందఱును గుమ్మములోనున్నవారి యొద్ద సెలవుపుచ్చుకొని, ఒంటిబ్రాహ్మణుఁ డెదురుగా వచ్చుచుండఁగా నతఁడు పోవువరకును నిలిచి యావల నొక పుణ్యస్త్రీ రాఁగా మంచి శకున మయిన దని దారిసాగి నడువనారంభించిరి. రామమూర్తిగారు వారి నూరిబయలవరకును సాగనంపి దూరదేశప్రయాణమును జేయుచున్నారుగాన భద్రముగా వెళ్ళుఁడని బుద్ధులుచెప్పి వెనుకకు మరలి యింటికి వచ్చిరి. రాజశేఖరుఁడుగారు త్రోవపొడుగునను చెట్లు మొదలగువానిని భార్యకును బిడ్డలకును జూపుచు దారినడువసాగిరి.

రాజ—చూచితిరా యీమఱ్ఱిచెట్టు అమూలాగ్రము చిగిరించి, పగడమువలె నున్న, యెఱ్ఱని పండ్లగుత్తులతో నెంత మనోహరముగా నున్నదో !

సుబ్ర—ఔనౌను, దానిచేరువ నున్న మామిడిగున్న చీనాంబరమువలె నున్న లేతచిగుళ్లతో మఱింతవింతగా నున్నది. కొనకొమ్మను జేరి కోయిలయొక్కటి మధురమైన కంఠధ్వనితోఁ జెవుల పండువు సేయుచున్నది.

రుక్మి—నాన్నగారూ ! రామచిలుక కొమ్మమీఁద తలక్రిందుగా నిలుచుండి జామపండు నేప్రకారముగా ముక్కుతో పొడుచుకొని తినుచున్నదో చూడుఁడి.

సీత—అన్నయ్యా! నా కామామిడికాయ కోసియిచ్చెదవా?

సుబ్ర—అమ్మాయీ! చెట్టుక్రింద చిలుకకొట్టిన దోరకాయ లున్నవి తెచ్చుకో. (సీత పరుగెత్తుకొని పోయి నాలుగయిదు కాయలను తెచ్చుకొని కొఱికిచూచి పంచదారవలెనున్నవని చంకలుకొట్టుకొనుచున్నది.)

మాణి—ఎక్కడనుండియో యిప్పుడు గుప్పున మల్లెపువ్వుల వాసన కొట్టినది!

సుబ్ర—అమ్మా! వేగిరము రా. అదిగో పొగడచెట్టుమీఁద నొక యడవిమల్లెతీఁగ అల్లుకొని, గంపలకొలఁది తెల్లని పుష్పములతో నిండియున్నది. మన యింటికడ నెన్నినీళ్ళు పోసినను, మల్లెపువ్వు లీలాగున పూయవుగదా!

మాణి—ఆహా! పొగడపువ్వు లెంతసువాసన గలిగియున్నవి!

సుబ్ర—ఇప్పుడు పదిగడియలప్రొద్దెక్కినను, గాలి యెంత చల్లగా కొట్టుచున్నది! మన యింటివద్ద నెన్నఁడైన వేసవికాలములో గాలి యింతచల్లగా నున్నదా?

రాజ—సర్వేంద్రియములకు సౌఖ్యము కలుగునట్టుగా, మార్గస్థుల సంతోషముకొరకై యిటువంటివాని నన్నిటిని సృజించి నిర్హేతుకజాయమానకటాక్షముచేత స్వేచ్ఛముగా ననుభవింప ప్రసాదించిన యీశ్వరుని మహాత్త్వము నెఱిఁగి కొనియాడ మన మెంతవారము? మన మెన్నఁడును నిల్లుకదలకపోవుటచేత నిటువంటిసౌఖ్యముల నేమియు నెఱుఁగనివారమై యుండియు, మనమే యెల్లవారికంటెను మిక్కిలి సుఖపడుచున్నా మనుకొని గర్వపడుచుంటిమి. ఈ యడవులలోనే సదా కాపుర ముండి, దీనబంధువైన పరమాత్ముని యనుగ్రహము వలనఁ గలిగిన యీసౌఖ్యముల ననుభవించుచుండెడి యీ వనచరులైన కిరాతులు మొదలగువా రెంతటి యదృష్టవంతులు! ఆహా! గ్రామములో నెప్పుడును మనకీ వసంతకాల మింత మనోజ్ఞముగా నుండలేదుగదా?

సీత—అమ్మా! నే నిఁక నడవలేను. న న్నెత్తుకో.

మాణి—ఆ చెట్టుదాఁకా నడచిరా. అక్కడ నెత్తుకొనెదను. రుక్మిణీ! వెనుకపడుచున్నా వేమి? రెం డడుగులు వేగిరము పెట్టు.

రుక్మి—అలవాటు లేకపోవుటచేత కాళ్లు పొక్కు లెక్కినవి. వేగిరము నడవలే కున్నాను.

రాజ—పసులకాపరివాని నడిగినాను. ఊరొకక్రోసున్నదఁట! రెండుజాములు కావచ్చినది. ఏలాగునైనను కొంచెము శ్రమచేసి నాలు గడుగులు వేగిరము నడువవలెను.

మాణి—సీత నెత్తుకొని నడచుచున్నాను. ఆఁకలియగుచున్న దని యిది యేడ్చుచున్నది. మన కుడిచేతి వైపున దూరముననేమో మనుష్యుల మాటలచప్పుడు వినవచ్చుచున్నది. అది యూరేమో మన మీపూఁట దిగుదమా?

రాజ—ఎవ్వరోమనుష్యు లక్కడ తొందర పడి పరుగెత్తుచున్నారు; వారిలో నెవ్వరికైన నొకయాపద వచ్చియుండఁబోలును! శీఘ్రముగా వెళ్ళుదము రండి.

అని వేగముగ నడచి వారు మనుష్యుల కలకలములు వినఁబడుచున్న ప్రదేశమునకు సమీపముగాఁ బోఁగా, మార్గమునకుఁ గొంచెముదూరములో దక్షిణపుదిక్కున మూగియున్న గుంపులో నుండి "శుద్ధిచేయుటకు మజ్జిగ" యని కేకలువేయుచు కొందఱు పరుగెత్తుకొని వచ్చుచుండిరి. రాజశేఖరుఁడుగారు వాండ్రను జూచి యీసందడి యేమని యడుగఁగా, వారిలో నొకగొల్లవాఁడు 'రాచకుమారుఁ డొకఁడు వడగొట్టి యీరావిచెట్టుకింద పడిపోయినాఁ' డని చెప్పెను.

రాజ—మీ రాతనిగొంతుకలోఁ గొంచెము నీళ్లు పోయలేకపోయినారా?

గొల్ల—మొట్టమొదట మేము నీళ్ళియ్యఁబోఁగా, శూద్రులము కాఁబట్టి మాచేతినీళ్లు త్రాగనని యీరాజు పుచ్చుకొన్నాఁడు కాఁడు. తరువాత దాహమునకు తాళలేక మాచేతి నీళ్ళు త్రాగుటకొప్పుకొన్నాఁడు. కాని మావారిలో పెద్దవాఁడు వచ్చి శూద్రుఁడు రాజునోటిలోనీళ్ళుపోసిన పాపమువచ్చునని చెప్పి నీళ్లు శుద్ధిచేయుటకై మజ్జిగనిమిత్తము మమ్ముఁబంపినాఁడు. మాపల్లె యిక్కడికి పావుక్రోసుదూరమున నున్నది. మీరు బ్రాహ్మణులుగాఁ గనఁబడుచున్నారు. మీవద్ద నేమయిన మంచితీర్థ మున్నయెడల, వేగిరము పోయి యీతనిగొంతుకలో నాలుగుచుక్కలు పోసి పుణ్యము కట్టుకొనండి.

ఆమాటలువిని రాజశేఖరుఁడుగారు రుక్మిణిచేతిలోనున్న మంచినీళ్ళచెంబునుపుచ్చుకొని, చెట్టుదగ్గఱకుపరుగెత్తిపోయి గుంపులోనుండి

త్రోవచేసికొని ముందుకునడచి గుంపునడుమను చెట్టునీడను కట్టెకి నేలను పరుండి చేతితో నోరునుజూపి నీళ్ళనిమిత్తము సైగచేయుచున్న యొకమనుష్యునిఁ జూచిరి. ఆమూఁకలో నొకఁడు నీళ్ళనుంతను జేతిలోఁ బట్టుకొని 'ఈరాజు నిష్కారణముగా జచ్చిపోవుచున్నాఁడు; ఏదోషమువచ్చినసరే నీళ్ళుపోసి బ్రతికించెద' నని చేరువకుఁ బోవు చుండెను. అప్పు డొక్కముసలివాఁ డడ్డమువచ్చి వానిచేయిపట్టు కొని నిలిపి, 'ఈవరకు బూర్వజన్మములో మన మెన్నియో పాపము లను జేయుటచేతనే మనకిప్పుడీ శూద్రజన్మము వచ్చినది. ఇప్పు డీరాజును జాతిభ్రష్టునిజేసి యీపాపముసహితము కట్టుకొవలెనా? నామాట విని నీళ్ళు పోయవలద' ని వారించుచుండెను. ఇంతలో రాజు కన్నులు తేలగిలవైచి, చేయి నోటివద్ద కెత్తఁబోయి వడఁకుచుచు క్రిందఁ బడవైచెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు వెంటనేపోయి మంచినీళ్ళతో ముందుగా నెండుకొనిపోవుచున్న పెదవులను దడిపి నోటిలోఁ గొంచెమునీళ్ళు పోయఁగా గొంతసేపటి కాతఁడు మెల్లగాఁ జప్పరింపనారంభించెను. అంతట రాజశేఖరుఁడుగారు తనచేతిలోని యుదకముతో మొగమును దడిపి మఱికొంచెమునీరు లోపలికిఁ బోయఁగా తాగి కన్నులు విప్పిచూచి రెండవప్రక్కకు త్రిగిలి మఱి కొంతసేపునకు నేదతేఱి, ఆరాజు తనజీవములను నిలిపినందులకై రాజశేఖరుఁడుగారికి కృతజ్ఞతతో బహునమస్కారములు చేసి లేచి కూరుచుండెను. ఇంతలో పల్లెకుఁబోయినవారు మజ్జిగయు, కొన్ని పండ్లను దీసికొనివచ్చి యిచ్చిరి. ఆరాజు కొన్నిపండ్లను లోపలికిఁ బుచ్చుకొని మజ్జిగత్రాగి స్వస్థపడెను. అంతట నక్కడనున్నవా రందఱును తమతమత్రోవలను బోయిరి. ఈలోపల మాణిక్యాంబ మొదలగువారొకతరువునీడను గూర్చుండి మార్గాయాసము కొంత

తీర్చుకొనిరి. రాజశేఖరుఁడుగారు మిక్కిలి బడలియున్నవారయ్యును, సమీపములో నెక్కడను ఊరులేదని విన్నందున నేవేళకైనను రాజానగరమునకుఁ బోవ నిశ్చయించుకొని, తమవారినందఱిని లేవ నియమించి యారాజుతో ముచ్చటలాడుచు దారిసాగి నడవనారంభించిరి.

రాజ—రాజుగారూ! మీపేరేమి? మీనివాసస్థల మెక్కడ? మీరిక్కడ కొంటిగా నెందుకువచ్చినారు?

రాజు—నాపేరు రామరాజు; మాది పెద్దాపురమునకు సమీపముననున్న కట్టమూరు వాసస్థలము; మాకక్కడ నాలుగుకాండ్ల వ్యవసాయ మున్నది; రాజమహేంద్రవరములోనున్న మాబంధువులఁ జూచుటకై పది దినముల క్రిందట పోయి, నిన్న తెల్లవారుజామున బయలుదేరి మరల వచ్చుచుండగాఁ నొక పెద్దపులివచ్చి నన్నెదిరించినది; నాపైన నున్న యుత్తరీయమును వేగముగా నెడమచేతికిఁ జుట్టుకొని యాచేయి పులినోటి కందించి రెండవచేతిలోని కత్తితో దాని జొమ్మునఁ బొడిచితిని; ఆపులి మిక్కిలి బలముకలది కాఁబట్టి యాపోటును లక్ష్యముచేయక త్రోవపొడుగునను నెత్తురు గాలువలు గట్ట నన్నడవిలోనికి బహుదూర మీడ్చుకొనిపోయెను; ఈలోపల నేను కత్తితో దానిని పలుచోట్లను బొడిచినందున నడువలేక యొక వృక్షసమీపమునఁ బడియెను. నేను బహుప్రయాసతోఁ జేయి వదల్చుకొనుటకై కుడిచేతిలోని కత్తి వదలిపెట్టి దానినోరు పెగలించి చే యూడఁదీసికొంటిని; ఇంతలో మునుపటిదానికంటెను బలమైన మఱియొక వ్యాఘ్రము చేరువ పొదయందుండి నామీఁదికి దుమికెను; కాని దైవవశముచేతఁ గొంచెము గుఱితప్పి నాప్రక్కనున్న చిన్న గోతిలోఁ బడెను; కత్తిని బుచ్చుకొనుటకు సమయము చిక్కనందున వెంటనే నేను వృక్షము కెగఁబ్రాఁకి అది మరల దూఁకులోపల

పైకొమ్మ జేరి కూర్చుంటిని ; పులియు విడిచిపోవక వృక్షముక్రిందనే కాపుపెట్టుకొని కూరుచుండెను; నేఁడు తెల్లవారినతరువాత పదిగడియల ప్రొద్దెక్కు వఱకును అది యాప్రకారముగానే యుండి చివరకు విసిగి లేచిపోయినది ; నేను నిన్నటి యుదయమునుండియు నిద్రాహారములు లేక వృక్షశాఖయందే యుండి, పులిపోయిన గడియకు మెల్లగా వృక్షము దిగి కత్తిని చేతఁబుచ్చుకొని బయలుదేఱి గతదిన మంతయు నెంతచేత మలమల మాడినందున నాలిక పిడచకట్టి నడచుటకు కాళ్లయందు సత్తువలేక యేరీతినో దేహము నీవృక్షచ్ఛాయకుఁ జేరవైచి పడిపోయితిని. నాకు చేతిమీఁద మాత్ర మిప్పుడో రెండు గాయములైనవి.

అని చెప్పి చేయి చూపి పైకి చేతికఱ్ఱలాగున నగపడుచున్న మొలయందున్న కత్తినిదీసి చూపెను. రాజశేఖరుఁడుగారును దానిని పుచ్చుకొని చూచి యాతఁడుచేసిన సాహసకార్యమునకు మిక్కిలి యాశ్చర్యపడసాగిరి.

రామ—నాకు మీరీదినమున పోయిన ప్రాణములను మరల నిచ్చినారు; మీకు నా ప్రాణము లిచ్చినను, మీరుచేసినయుపకారము యొక్క ఋణము తీఱదు. నాయందు దయచేసి నేను కృతజ్ఞతా సూచకముగాఁ జేయు నమస్కారముల నంగీకరింపుఁడు. అదృష్టదేవత యితరులను ధనదానము మొదలయిన కార్యములచేతఁ దమకృతజ్ఞతను దెలుపునట్టుగాఁ జేసి యిప్పుడు బీదవాఁడనై యున్న నన్ను మాత్రము మీయంతటి మహోపకారికి వట్టిమాటలచేతనే నాకృతజ్ఞతను దెలుపునట్టు చేసినందున కెంతయుఁ జింతిల్లుచున్నాఁడను. అయినను నాచేతనైన యుపకారము మీకేదైన గావలసియున్నచో నాప్రాణములకైన నాశపడక చేయ సిద్ధముగానున్నాఁడను. మీరిప్పు డెక్కడకుఁ బోయెదరు ?

రాజ — కాశీయాత్రకయి బయలుదేఱినాము.

రామ — ఈవేసవికాలము ప్రయాణమున కెంతమాత్రమును మంచిసమయముకాదు. ఈయెండలలో మీరు గాడుపుకొట్టి పడి పోవుదురు. త్రోవపొడుగునను దొంగలభయము విశేషము. మీకు రాజమహేంద్రవరములో నెవ్వరైన బంధువులున్నారా? లేక మీకదే నివాసస్థలమా?

రాజ — గోటేటి రామమూర్తిగారిని మీ రెఱుగుదురా? అతఁడు నాపినతండ్రి కొమారుఁడు. వారియింటనే నేను పదియేను దినములుండి బయలుదేఱినాను. మాస్వస్థలము ధవిళేశ్వరము.

రామ — మీపేరేమి? వీరందఱును మీకేమగుదురు?

రాజ — నాపేరు రాజశేఖరుఁడు; వాఁడు నాకొమారుఁడు; ఆయాఁడుపిల్ల లిద్దఱును నాకొమార్తెలు; అది నాభార్య.

రామ — మీరింత వేసవికాలములో యాత్రకు బయలుదేరుటకు కారణమేమి? మీవైఖరిచూడ మిక్కిలి సుఖము ననుభవించిన వారుగాఁ గనబడుచున్నారు.

రాజ — నేను మొదట ధనికుఁడనే యగుదును. కాని నావద్ద నున్న ధనమునంతను నాకొర్తె వివాహములో నిచ్చిన సంభావనలక్రిందను ముఖస్తుతులనుచేయు మోసగాండ్రకుఁ జేసినదానముల క్రిందను వెచ్చపెట్టి బీదవాఁడ నయి, కడపట యాత్రకు బయలుదేఱినాను. నిత్యమును వారి స్తుతిపాఠములను స్వీకరించి నేను తుష్టిపొందుచుంటిని; నాధనమును స్వీకరించి వారు తృప్తినొందుచుండిరి. తుదకొక బైరాగి బంగారము చేసెదనని నాయొద్దనున్న వెండిబంగారముల నపహరించి వానికి బదులుగా నింతబూడిద నిచ్చిపోయి నన్ను నిజమైన జోగిగాఁ జేసెను.

రామ—ము న్నెప్పుడు మీరు దూరదేశ ప్రయాణములను చేసినవారుకారు. నామాటవిని మీరీ వేసవికాలము వెళ్ళువఱకైన భీమవరములో నుండుఁడు. అది గొప్ప పుణ్యక్షేత్రము; భీమనది సమీపమున భీమేశ్వరస్వామివారి యాలయమున్నది; దానికిని పెద్దాపురమునకును క్రోసెడుదూరముకలదు. పెద్దాపురమును పాలించు చున్న కృష్ణగజపతిమహారాజుగారు మిక్కిలి ధర్మాత్ములు; వారు తమ ప్రజలక్షేమమును విచారించు నిమిత్తమయి మాఱువేషము వేసికొని తిరుగుచుందురు; వారియొద్ద మాబంధువొకఁడు గొప్ప పనిలో నున్నాఁడు. మీరు భీమవరములో నుండెడిపక్షమున మావానితో మాటాడి సమయమువచ్చినప్పుడు మీకొక యుద్యోగమును జెప్పించెదను.

రాజశేఖరుఁడుగారు మంచివారుగనుక పెద్దాపురము వెళ్ళిన మీఁదట నాలోచించెదమని యప్పటికి చెప్పిరిగాని, యారాజుస్థితిని జూచి యాతఁ డుద్యోగము జెప్పించు నన్నయాశనుమాత్రము పెట్టుకొన్నవారుకారు. ఈమాటలు ముగియునప్పటికి వారు గ్రామమును సమీపించిరి.

రాజ—ఆచెట్లకు గ్రామ మెంతదూరము ?

రామ—గ్రామసమీపమునకు వచ్చినాము. ఆచెట్లు చెఱువు గట్టుమీఁదివి. చెఱువున కెదురుగానే సత్ర మున్నది.

రాజ—మీరీపూట మాతో భోజనము చేసెదరా ?

రామ—నాకు గ్రామములో బంధువులున్నారు ; అక్కడకు వెళ్ళి భోజనముచేసి, చల్లపాటువేళ మెల్లఁగా బయలు దేరి వచ్చెదను. మీరు స్త్రీలతో బయలుదేఱినారు. కాఁబట్టి భోజనముచేసినతోడనే ప్రయాణమయి ప్రొద్దుకుంకకముందే వేఁడిమంగలమును దాఁటవలెను.

అక్కడ దొంగలభయము బహువిస్తారము. మీ రీలాగునసయిన శ్రమచేసి చీఁకటిపడకముందే పెద్దాపురము చేరి యొకనాఁ డక్కడ నుండుఁడు. నేను మిక్కిలి డస్సియున్నాను గనుక మీతో నిప్పుడురాలేను. రేపటిదినమువచ్చి మిమ్ము గలిసికొనెదను.

అని రాజశేఖరుఁడుగారికి నమస్కారము చేసి, అందఱివద్దను సెలవుపుచ్చుకొని త్రోవలో భద్రమని పలుమాఱుచెప్పి, రామరాజు తనదారిని పోయెను. వంటలైన తరువాత భోజనములుచేసి వారంద ఱును బయలుదేరి యెండలో దేహములనిండను జెమ్మటపట్ట, అడు గడుగునకు ముంతెఁడునీళ్లు త్రాగుచు నడుమనడుమ వృక్షచ్ఛాయలను నిలుచుచు అడు గొకయామడగా నడచి నాలుగు గడియల ప్రొద్దువేళ నల్లచెరువు చేరిరి. ఆ చెరువుగట్టునకు క్రిందుగానున్న యొక జువ్విచెట్టు మొదలను తాటాకుపందిరిలో దేహమునిండ విభూతిపూసికొని కంఠము నను, చేతులను, శిరస్సునను రుద్రాక్షమాలలను ధరించుకొని కూరు చుండి వారిని చేసైగ చేసి పిలిచి, దగ్గఱనున్న చాపమీఁద కూరు చుండ నియోగించి యొక యోగి కుడిచేతిలోని తులసిపూసల తావళ ము ను ద్రిప్పుచు నోటిలో నేమేమో జపించుకొనుచు నడుమనడుమ నొక్కొక్కప్రశ్న వేయ నారంభించెను.

యోగి—మార్గస్థులారా! మీరు మిక్కిలి యెండబడి మార్గా యాసముచే బడలియున్నారు. కొంచెముసే పిక్కడ విశ్రమించి పొండి. సకుటుంబముగా బయలుదేఱిన ట్లున్నది. మీ రెక్కడకుఁ బోయెదరు?

రాజ—కాశీయాత్ర పోవుచున్నాము.

యోగి—అట్టి దూరదేశయాత్ర ధనవంతులకు కాని లభింపదు. త్రోవపొడుగునను సత్రములు లేవు. మీ రేమైన ధనమును సేకరించు కొని మఱి బయలుదేఱినారు కారా?

రాజ—మావంటి బీదవారికి విశేషధన మెక్కడనుండి వచ్చును? అయినను మేము నూరు రూపాయల సొమ్ము తెచ్చుకొన్నాము. నేలాగునైనను వానితోనే గంగాయాత్ర చేసికొని రావలెనని యున్నది.

యోగి—మీరు బహుజాగ్రత్తగా నుండవలెను. ఇక్కడకు రెండుక్రోసుల దూరములో నున్న వేడిమంగలమువద్ద బాటసారులను దొంగలు కొట్టుచుందురు. గడియసేపు తాళుదులేని మాశిష్యులను తోడిచ్చి పంపెదము.

అని చెప్పి యాయోగి తావళమును ద్రిప్పుచు మరల జపము చేయ నారంభించెను. ఏవేళకును నాతని శిష్యులు రానందున, రాజశేఖరుఁడుగారు మనసులో తొందరపడుచుండిరి. ప్రొద్దును అంతకంతకు వాలుచుండెను.

రాజ—స్వామీ! మీశిష్యు లీవఱకును రాలేదు. రెండు గడియల ప్రొద్దున్నది. వేగిరము వర్తమానము పంపెదరా?

యోగి—అవశ్యముగా బంపెదము.

అని చివాలున లేచి జువ్విచెట్టునకు నూఱుబారల దూరములో నున్న యొక గుడిసెయొద్దకుఁబోయి 'గోపాలిగా' యని యొకపిలుపు పిలిచెను. లోపలినుండి చినిగినగుడ్డను కట్టుకొని బొగ్గువంటి శరీరముతో బుఱ్ఱముక్కును, మిట్టనొసలును, తుప్పతలయు, గోగ్గికళ్లును గల యొక కిరాతుఁడు బయలవచ్చెను. వానితో నేమేమో మాటాడుచు పందిరి వఱకును దీసికొనివచ్చి, రాజశేఖరుఁడుగారు వినుచుండగా 'వీరికి సహాయముగా బంపుటకయి మనవాండ్రను బిలుచుకొని యిక్కడ నున్నట్టుగా రమ్మ'ని పంపెను.

రాజ—స్వామీ! మీశిష్యు లేవేళకు వత్తురో చీకఁటి పడకముందే వేఁడిమంగలము దాఁటవలెను. మేము నడచుచుందుమా?

యోగి—అవును. మీరు చెప్పినమాట నిజమే. మీరు నడచు చుండుండి. వాండ్రు వచ్చి మి మ్మిప్పుడే కలసికొందురు.

అప్పుడు రాజశేఖరుఁడుగారు పెండ్లముతోను బిడ్డలతోను బయలుదేఱి దొంగలపేరు జ్ఞప్తికి వచ్చినప్పుడెల్ల గుండెలు తటతటఁ గొట్టుకొన, బుజమువీఁది మూటను పలుమాఱు తడవి చూచు కొనుచు, చీమ చిటుక్కుమన్న వెనుకఁదిరిగి చూచుచు, కొంచె మెక్కడ నయినను పొద కదలిన నులికిపడుచు నడుచుచుండిరి. ఆయోగిచేఁ బంపఁబడినకిరాతుఁడును వేగముగా నడచిపోయి త్రోవలో నొకచోట దిట్టముగా కల్లునీళ్ళు త్రాగి తూలుచు తల వణికించుచు చింతనిప్పులవలె నున్న గ్రుడ్లు త్రిప్పుచు సంకేతస్థలమును జేరి, అక్కడ నొక పాకలో నిదురించుచున్న మనుష్యుని చేతితో గొట్టిలేపి, "ఓరీ! ఒక బ్రాహ్మణుఁడును కొడుకును భార్యయు యిద్దరు కొమార్తెలును నూఱురూపాయలతో వెళ్ళుచున్నారు. కాఁబట్టి మీరు చీమలచింత దగ్గఱకు వేగిరము వెళ్ళవలె నని మన గురువుగారు చెప్పినారు" అని చెప్పి పోయెను. అతఁ డామాటలు విన్నతోడనే కొంతసే పేమో యాలోచించి సంతోషపూర్వకముగా లేచి, ఆత్రోవలను సంకేత స్థలములను నెఱిఁగియున్నవాఁడు కావున మాఱుమాటాడక కత్తిని చేతఁ బట్టుకొని పాకవెడలి బయలుదేఱెను. ఆకిరాతుఁడును అడ్డు త్రోవను బోయి దారిలోఁ గనఁబడ్డ మఱియొకనితోఁగూడఁ జెప్పి తిరిగి యోగిని గలిసికొని యాతని యుత్తరువుప్రకారము విల్లును నమ్ములునుధరించి వారిని మార్గము తప్పించి చీమలచింతయొద్దకుఁ దీసికొనిపోవుట కయి వగెత్తుకొని పోయి సంజచీఁకటివేళ వారిని గలిసికొనెను.

కిరా—అయ్యా! శిష్యులు రానందున మా గురువుగారు మీ కాపుదల కయి నన్నుఁ బంపినారు. మంచిసమయములో వచ్చి

మిమ్ముఁ గూడుకొన్నాను. దొంగలుకొట్టు స్థలమునకు సమీపములో నున్నాము. అయినను మీ కేదియు భయము లేదు. మనమీమార్గమును విడిచి కాలిమార్గమునఁ బోయి భయపడవలసిన స్థలమును దాఁటినతరువాత పెద్దబాటలో వెళ్ళి చేరుదము.

రాజ—ఁ ఇలాగు నయినను మిమ్ము సుఖముగాఁ దీసికొని వెళ్ళవలసినభారము నీది. నీ వేత్రోవనురమ్మన్న నాత్రోవనే వచ్చెదము.

అప్పు డాకిరాతుఁడు వారిని పెద్దత్రోవ నుండి మరలించి యిరుకుదారిని వెంటఁ బెట్టుకొని పోవుచుండెను. ఇంతలో మబ్బుపట్టి దారి కానరాక గాఢాంధకారబంధురముగా నుండెను. చెట్లమీఁది పక్షుల కలకలము లుడిగెనుగాని గ్రుడ్లగూబ మొదలగు కొన్ని పక్షులుమాత్రము మేఁత కయి సంచరించుచుండెను; చిమ్మటలు కీచు మని దశదిశలయందును ధ్వనిఁ జేయఁజొచ్చెను; అడవిమృగములయొక్క కూఁతలును పాములయొక్క భూత్కారములును కర్ణకఠోరములుగా వినఁబడుచుండెను. నడుమనడుమ మేఘములలోనుండి తళుక్కని మెఱుపు పొక్కటి మెఱసి కొంచెము త్రోవ కనఁబడుచుండెను. ఈరీతిని కొంచెముదూరము నడచినతరువాత దూరమున వెలుతురు కగపడెను; ఆ వెలుతురు సమీపించినకొలఁదిని గొప్ప మంటగా నేర్పడుచు, ఒకగొప్ప చింతచెట్టునకు సమీపముగా నుండెను. చీఁకటిలో నీ ప్రకారముగా నడచునప్పుడు రాజశేఖరుఁడుగారి ప్రాణము లాయనదేహములో లేవు; తక్కినవారును అఱచేతిలో ప్రాణములు పెట్టుకొని కాళ్ళీడ్చుచు నడచుచుండిరి. ఆ రాత్రి యాపద నుండి తప్పించుకొని యేదైన నొకయూరు చేరితిమా యిఁక నెప్పుడును దారి ప్రయాణము చేయ మని యెల్లవారును నిశ్చయము చేసికొనిరి. ఊరు చేరినతరువాత గ్రామదేవతకు మేఁకపోతును

బలి యిప్పించెద నని మాణిక్యాంబ మ్రొక్కుకొనెను. ఈప్రకారముగా వ్యాకులపడుచు వారు నడచి యొక విశాలస్థలమును జేరునప్పటికి, చింతచెట్టుక్రింద మంటముందఱఁ గూరుచుండి యున్న రెండువిగ్రహములు లేచి, దేహమునిండ కంబళ్ళు కప్పుకొని నోటిలో చుట్టలంటించి బుజములమీఁద దుడ్డుకఱ్ఱలతో వారివంక నడచి రానారంభించెను. వాండ్రను జూచినతోడనే వారి కందఱకును పయిప్రాణములు పయిని పోయినవి; వెనుక నున్న కిరాతుఁడు దొంగ లని కేకవేసి వెనుకవాఁడు వెనుకనే పాఱిపోయెను. ఇంతలో నాదొంగలలో నొకఁడు ముందునకు వచ్చి రెండు చేతులతోను కఱ్ఱను పూనిపట్టి, మాటాడక ముందున్న రుక్మిణి నెత్తిమీఁద సత్తువకొలఁది నొకపెట్టు పెట్టెను. ఆపెట్టుతో మొదలునఱికిన యరఁటిచెట్టువలె రుక్మిణి నేల కొఱిగి నిశ్చేష్టురాలయి పడియుండెను. ఇంతలో నెవ్వఁడో కత్తిదూసికొని 'ఆగు' 'ఆగు' మని కేకలువేయుచు, మెఱుఁపు మెఱసినట్టు మీఁదఁబడి దొంగలలో నొకనిని మెడమీఁద ఖడ్గముతో వేసెను. ఆవేటుతో శిరస్సు పుచ్చకాయవలె మీఁది కెగిరి దూరముగా బడఁగా మొండెము భూమి మీఁద బడి చిమ్మనగొట్టములతోఁ గొట్టినట్లు రక్తధారలు ప్రవహింప కాళ్లతోను చేతులతోను విలవిలఁ గొట్టుకొనుచుండెను. శత్రు వాయుధపాణియయి యుండుటయు, తానొంటిగాఁ డగుటయు, బాటసారులలో మఱియిద్దఱు మగవాండ్రుండుటయు చూచి కిరాతునితో గూడికొని రెండవ దొంగవాఁడు కాలికొలఁదిని దూఁటెను. ఖడ్గపాణియైన యాపుణ్యాత్ముఁడు వాండ్రను కొంతదూరము వెంబడించెను గాని వాండ్రు నిమిషములోఁ జూపుమేర దూరము దాఁటి యదృశ్యులయినందున వెనుకకు మరలి వచ్చి రాజశేఖరుఁడుగారిని కలిసికొనెను.

రామ—రాజశేఖరుఁడుగారూ! ప్రొద్దుండగానే యీస్థలమును దాఁటవలసినదని నేను మధ్యాహ్నముననే బహువిధముల బోధించితిని

గదా ? మీరు నామాటలను లక్ష్యముచేయక యీయాపదను దెచ్చి పెట్టుకొంటిరి.

రాజ.—ఓహోహో! రామరాజుగారా? మీరు మాపాలిటి దైవమువలె సమయమునకు వచ్చి మా యందఱిప్రాణములను నిలువఁబెట్టిరి. మీ రింకొకనిమిషము రాకుండిన మే మందఱము నాదుర్మార్గులచేతులలోఁ బడిపోయి యుందుము. మీ రీవేళ నిక్కడ కెట్లు రాఁ గలిగితిరి?

రామ.—మీతోవచ్చిన కిరాతుఁడు యోగిచే దొంగలను బిలుచుకొని వచ్చుట కయి పంపఁబడి యెండలో నడువలేక యొక పాకలోఁ బరుండియున్న నన్నుఁ దనవారిలో నొకనిగా భ్రమించి తనగురువు కొందఱుఁ బ్రాహ్మణులను దోఁచుకొనుట కయి యీ చింతచెట్టువద్దకి వెళ్ళుచున్నాఁ డని చెప్పెను. ఆమాటలు విన్నతోడనే యాబ్రాహ్మణులు మీరే యని యూహించి నాకచట గాలు నిలువక దొంగలను వారింపవలె నను నుద్దేశముతో యోగియున్న తావునకు బోతిని. అక్కడ నావరకే దొంగలు వచ్చి యోగితో మాటాడి పోయినారన్నవార్త విని గుండెలు పగిలి నేను వచ్చులోపల మీ కేమి యుపద్రవమువచ్చునో యని మార్గాయాసము నేమియు లక్ష్యముచేయక యొక్కపరుగున వచ్చి యుక్తసమయమున మీకుఁ దోడు పడఁగాంచి నాజన్మము కృతార్థత గనెనుగదా యని సంతోషించుచున్నాఁడను.

అనునప్పుడు మాణిక్యాంబ రుక్మిణిని నఖశిఖపర్యంతము తడవిచూచి గొంతెత్తి యేడ్వఁజొచ్చెను. రామరాజును రాజశేఖరుఁడుగారును గూడ దగ్గఱకు బోయి చూచి కడుపుపట్టి చూచి ముక్కుదగ్గఱ వ్రేళ్ళుపెట్టి యూపిరి గానక దెబ్బచేతను భయముచేతను

మరణమునొందె నని నిశ్చయించుకొనిరి. రామరాజును నాడి నిదానించి చూచి యామె చచ్చినదనియే స్థిరపఱచెను. అప్పు డంద ఱును శవముచుట్టును జేరివిలపించుచుండిరి. ఆసమయమున సమీపము నుండి వ్యాఘ్రముయొక్క కూఁత యొకటి వినఁబడెను. అంత యాపదలోసహిత మాధ్వని కందఱును బెదరి వడఁకుచుండఁగా, రామరాజు వారికిధైర్యము చెప్పి క్రూరమృగములతో నిండియున్న యరణ్యమధ్య మగుటచేత నచ్చట నిలువఁగూడ దనియు తెల్లవారిన మీఁదట మరల వచ్చి శవమునకు దహనాదిసంస్కారములు చేయ వచ్చు ననియు బోధింపజొచ్చెను. కన్నకూఁతును కారడవిలో విడిచి పెట్టివెళ్లుటకు మనసు రాక వారాతనిమాటలను చెవిబెట్టక రుక్మిణి సుగుణములను దలఁచుకొని యేడుచుచుండిరి. ఇంతలో మఱింత సమీపమున గాండ్రు మని పులి మఱలనఱచెను. ఆ రెండవ కూఁతతో సూర్యకిరణములకు మంచు కరఁగునట్టుగా వారిధైర్య సారము కరఁగిపోయెను. అప్పుడారామరాజు హితబోధ నంగీకరించి, యెంతో కష్టముతో రుక్మిణిని విడచిపెట్టి, నడవకాళ్లురాక ముందుకు నాలు గడుగులుపెట్టి మరల వెనుకతిరిగి చూచుచు, తుదకు విధిలేక రామరాజువెంట వా రందఱును పెద్దాపురమునకుఁ బోయిరి. తమ ప్రాణములమీఁదికి వచ్చునప్పుడు లోకములో నెల్లవారును తామావఱకు ప్రాణాధికులనుగాఁ జూచుకొనువారి యాపదలనయి నను మఱచిపోయి తమ యాపదను తప్పించుకొనుటకే ప్రయత్నిం తురు గదా?

తొమ్మిదవ ప్రకరణము

రాజశేఖరుఁడుగారు పెద్దాపురము చేరుట—రుక్మిణిదేహమును వెదకి వచ్చి కానక దుఃఖించుట—పెద్దాపురములోని వార్తలు—భీమవరము నకుఁబోవుట—అక్కడి విశేషములు—సుబ్రహ్మణ్యమును పిఠాపురము పంపుట.

రామరాజు నాఁటిరాత్రి మెల్లగా రాజశేఖరుఁడుగారిని కుటుంబసహితముగాఁ గొనిపోయి పెద్దాపురము చేర్చి, తిరుపతిరాజు చెఱువునకు సమీపముగనున్న సత్రములోదింపి, కాశీప్రయాణము మాని భీమవరములో నుండుఁడని బహువిధములఁ జెప్పి, యొప్పించి తన దారిని బోయెను. ఒక్కనాఁటిప్రయాణములోనే కూఁతురుపోవుటయు నొక్కనవారు ప్రాణములు దప్పించుకొని బయలఁబడినను కాళ్ళున్నియు వాచి యడుగుతీసి యడుగు పెట్టలేనంత స్థితిలోనుండుటయుఁ దలఁచుకొని యాత్రపేరన్న భయపడి రాజశేఖరుఁడుగారు కొన్ని దినములలో భీమవరముచేరి యందుండి సమయమయినప్పుడు రాజుగారిని జూచుటకు నిశ్చయించుకొనిరి. రుక్మిణిపోయినదన్న విచారముచేతను మార్గాయాసమున బడలియుండుటచేతను వారారాత్రి వంటలు చేసికొని భోజనముచేసినవారుకారు. వారికెవ్వరికిని కంటికినిద్రయును పట్టలేదు. ఆరాత్రి నొకయుగముగా వేగించి రాజశేఖరుఁడుగారు కోడి కూసినతోడనే లేచి తామొక్కరును బయలుదేఱి రుక్మిణిని వెదకుటకయి వేఁడిమంగలపు మార్గమున నడిచిరి.

అట్లు కొంతదూరము నడిచి రాజశేఖరుఁడుగారు పసులకాపరి బాలుర నడిగి మార్గమును గనుఁగొనుచు అటవిఁజొరఁ బ్రవేశించి, నాలుగుగడియల ప్రొద్దెక్కువఱకు దొంగలుకొట్టిన స్థలముచేరి యక్కడ రుక్మిణిదేహమును గానక యిసుకలో నెత్తురుచుక్కలను మాత్రము

చూచి దుఃఖముతో నలుప్రక్కలను రుక్మిణిని వెదకికొనుచుఁ దిరిగి యెందు నేమియుఁగానక మరల నెప్పటిచోటునకు వచ్చి, అచ్చటఁ గొంతసేపు పచ్చికబయలను గూరుచుండి యాపచ్చికను తన కన్నిటితోఁ దడిపి రుక్మిణిదేహము నేమృగములో యీడ్చుకొనిపోయి యుండునని నిశ్చయము చేసుకొని యీదుర్వార్తను గొనిపోయి యెట్లు భార్యతోను బిడ్డలతోను జెప్పుదునా యని కొంతసేపు దుఃఖించి మెల్లఁగాలేచి కాళ్లు తడఁబడ నడచుచు త్రోవ పొడుగునను రుక్మిణి యొక్క సౌందర్యమును సుగుణసంపదలను దలఁచుకొని కన్నులనీరు నించుచు మధ్యాహ్నము రెండుజాముల కేలాగుననో యింటికి దేహమునుచేర్చి నడవలో చాపమీఁద చతికిలఁబడి యేమో చెప్పఁబోయి మాటరాక పెదవులు నాలుకతో తడుపుకొనుచు నూరకుండిరి. అప్పుడు మాణిక్యాంబ తొందరపడి లోపలికి పరుగెత్తుకొనిపోయి కంచుచెంబుతో మంచితీర్థము తెచ్చి నోటి కందిచ్చి పయిటచెఱఁగుతో మొగముమీఁది జెమ్మటతుడిచి విసనకఱ్ఱతో విసరుచు మగని మార్గాయాసమును కొంతవఱకు పోఁగొట్టెను. అంత నతఁడును కొంతధైర్యము నవలంబించి, కన్నుకొలుకులనుండి నీరు కాలువలు కట్ట గడియకొకమాటచొప్పున దుఃఖమును మ్రింగుకొనుచు రుక్మిణి వార్తను జెప్పెను. అప్పు డందఱును పెద్దపెట్టున గొల్లుమని రోదనము చేయనారంభించిరి. అది విని సత్రపుబ్రాహ్మణుఁడును చుట్టుపట్ల వారువచ్చి, వారికివచ్చిన యాపదను దెలిసికొని బహువిధముల వారి నూరార్చి భోజనమునకు లేవఁదీసిరి. వారును విస్తళ్లయొద్ద కూరుచుండి తినఁబోయిన మెతుకులు లోపలికిపోక కొంతసేపు కూరుచుండి విచారముతో విస్తళ్లను వదలిపెట్టి లేచిరి. అప్పుడు నూతి పెరటిలోనికిఁ బోయి వారు చేతులు కడుగుకొనుచుండఁగా కేకలు

వేయుచు వీధిలోనుండి పరుగులెత్తుచున్న మనుష్యులయొక్క కలకల ములు వినవచ్చెను. ఆసందడి యేమో చూతమని వీధిలోనికి వచ్చు నప్పటికి తూర్పువయిపున దూరముగా మంటయును మిన్నుముట్టు పొగయును గనఁబడెను. ఇంతలో సత్రపు బ్రాహ్మణుఁడు వచ్చి కుమ్మరివీధి తగులఁబడుచున్నది. చూచి వత్తము రమ్మని రాజశేఖరుఁడు గారిని పిలిచెను. కాని యాతఁ డెంతదయార్ద్రహృదయుం డయినను కొండంత దుఃఖములో మునిగియున్నవాఁడు గనుక, నిల్లు కదలుటకు మనసు గొలుపక యూరకుండెను. సుబ్రహ్మణ్య మాత్ర మెన్నఁడు నాపదల ననుభవించి యెఱుఁగని పసివాఁ డగుటచేత పరుల కాపద వచ్చినదన్నమాట వినినతోడనే తనయాపద నుఱచిపోయి చేతనయిన యెడల వారికి సహాయ్యము చేయవలెనను నుద్దేశముతో తా నా బ్రాహ్మణునితోఁగూడ బయలుదేఱి పోయెను. వా రక్కడకుఁబోయి చేరునప్పటికి వేలకొలది జనులువచ్చి వేడుక చూచుచుండిరి; కాని వారిలో నొక్కరయినను ఆర్పుటకు ప్రయత్నపడుచుండలేదు. ఇండ్లకు వేసిన వెదురుబొంగులు కణుపులయొద్ద పగిలి పెటపెటధ్వనులతో తుపాకులుమ్రోగినట్టు మ్రోగుచుండెను. ప్రాతతాటాకులు పయికి లేచి గాలిలో తారాచువ్వలను తలఁపించుచుండెను. ఎండలవేడిమి చేత సమీపముననున్న చెఱువు యెండిపోయినందునను ఇంకిపోఁగా మిగిలిన నూతులలోనినీళ్ళు చేదముంచుటకయిన వీలులేక పాతాళ లోకమునకు సమీపముగా నున్నందునను, నీళ్లను తెచ్చుకోలేక అంటు కొన్న యిండ్లవాండ్రు పెణకలను లాగుటకు ప్రయత్నపడుచుండిరి; ఆచేరువ యిండ్లవారు తమ యింటిమీఁది తాటాకుల నయినఁ దీసిన మరల వేసికొనుట కయి శ్రమ పడవలసివచ్చునని వానిని ముట్టుకోక, కాలుచున్న యిండ్లవారు వేఁడుకొన్నను ఇయ్యక దాచిపెట్టుకొన్న

కడివెడు నీళ్ళను బట్టుకొని నడికప్పులమీఁదికెక్కి తమయిల్లంటుకొను వఱకును నుండి నీళ్ళుకుండ నక్కడనే దిగవిడచి గోదనముచేయుచు దిగుచుండిరి. మఱికొందరు తమయిండ్లలోని సామానులు కాలి పోవునను భయముచేత వెలుపలికిఁ దెచ్చి వీధిలోఁ బెట్టుచుండిరి. వారొకవస్తువును దెచ్చి రెండవవస్తువుకొరకు వెళ్ళునప్పటికి పరోప కారపారీణు లయిన మహాత్ములు కొందఱు చూచువారు లేక వీధిలో పడియున్న వస్తువులను దీసి తమయింట జాగ్రత్త చేసికొనుచుండిరి.

ఇట్లు కుమ్మరపేట పరశురామప్రీతి యగుచుండఁ సత్రపు బ్రాహ్మణుఁడు సుబ్రహ్మణ్యమును దూరముగా నున్నయొక చెట్టు నీడకుఁ దీసికొని వచ్చి యిండ్లు కాలుటనుగుఱించి ప్రసంగింప నారంభించెను.

సత్ర—ఈప్రకారముగా రెండుజాములవేళ ఇండ్లెందుకు కాలినవో కారణము మీకుఁ దెలిసినదా ?

సుబ్ర—కుమ్మరావములు కాల్చునప్పుడు ప్రమాదవశమున నిప్పంటుకొని తాటాకులయిండ్లుగనుక కాలియుండవచ్చును. లేదా యెవ్వ రయినను పోట్లాడి యిండ్లకు నిప్పు పెట్టియుందురు.

సత్ర—మీరుచెప్పిన రెండుకారణములును సరి యయినవి కావు. ఈగ్రామమున కేదో క్రొత్తగా నొకగ్రహము వచ్చి యీ ప్రకారముగా తగులబెట్టినదికాని వేఱుకాదు.

సుబ్ర—నీవు నాతోనే యిప్పు డిక్కడకు వచ్చితివిగదా? ఎవ్వరిని అడిగి తెలిసికొనకుండ గ్రహమే యిండ్లుతగులబెట్టిన దని నీవెట్లు రూఢిగా జెప్పఁగలవు?

సత్ర—మా గ్రామముసంగతి నాకుఁ దెలియదా? ఈ గ్రామ మేటేట వేసవికాలములో నాలుగుసారులు తగులుపడును. ప్రతి పర్యా

యమును గ్రహమునకు జాతరచేసి యూరివారు దానిని సాగనంపు చుందురు. ఇది గ్రహముచేతనే కాకపోయినపక్షమున, వర్షకాలములో నేల తగులపడకూడదు ?

సుబ్ర—యిండ్లుకాలుట గ్రహముచేతనే యయినయెడల, ఒక సారి జాతరచేసిబంపిన గ్రహము మరలవచ్చుటకుఁ గారణమేమి? వర్షకాలములో ఇండ్లకప్పులు వానతో నానియుండును కనుక—

సత్ర—కారణములు గీరణములును నాకుఁ దెలియవు. నాకెప్పుడును యుక్తయుక్తులన్నఁ దలనొప్పి; కాబట్టి నేను జెప్పినమాటల కడ్డమాడక సత్యమని నమ్ము. ఇప్పుడు నమ్మకపోయినను రేపు జాతరగుచుండఁగా కన్నులారా చూచినప్పు డయినను నమ్మెదవు.

ఈప్రకారముగా సంభాషణ జరుగుచుండఁగా అగ్నిహోత్రుడు తన చెలికాఁడగు వాయుదేవుని సాయముచే కుమ్మరపేటను సంపూర్ణముగా దహనము చేసి తృప్తిపొంది ప్రశాంతి నొందెను. ఇండ్లు కాలినవారును సొత్తు పోయినవారును విచారించుచుండఁగాఁ గొందఱు చుట్ట కాల్చుకొనుటకు కావలసినంత నిప్పు దొరకినదనియు రేపు బొగ్గులు చవుకగా దొరకగలవనియు సంతోషించుచుఁ బోయిరి. వారి వెనుకనే సుబ్రహ్మణ్యమును సత్రపుబ్రాహ్మణునితోఁ గూడ బయలుదేఱి సత్రమును జేరెను. ఈలోపల నెవ్వరో రుక్మిణి యత్త వారియూరికిఁ బోవుచున్న బ్రాహ్మణుఁడొకడు సత్రములోనికి భోజనమునకు రాఁగా, ఆమె దుర్మరణకథను జాబు వ్రాసి యుత్తరక్రియలను వేగిరము జరిగించుటకయి యాజాబునతనిచేతి కిచ్చి రాజశేఖరుఁడుగారు వియ్యంకునకుఁ బంపిరి.

ఆమఱునాఁడు పగలు రెండుజాములవేళ రాజశేఖరుఁడుగారు భోజనము చేసి వీధియరుగుమీఁద గూరుచుండియుండఁగా, ఆదారిని

తుడుములు డప్పులు మ్రోగుచుండఁగా కొందఱు బండిమీఁద కుంభమును బెట్టుకొని త్రాగి కేకలు వేయుచు నడచుచుండిరి; వారి వెనుకను జనసంఘము మూఁకలుకట్టి తమ చేతులలోని కఱ్ఱలతో త్రోవప్రొడుగునను ఇండ్లమీఁద కొట్టుచుఁబోవుచుండిరి. ఆమూఁకలలో నుండి సత్రపుఁ బ్రాహ్మణుఁడు నడుమునకు బట్ట బిగించుకొని చేతిలో పెద్దకఱ్ఱ పెట్టుకొని దేహ మంతటను జెమ్మట కాలువలు గట్ట వచ్చి సుబ్రహ్మణ్యము చేయిపట్టుకొని, "నిన్న నేను జెప్పినప్పు డబద్ధమంటివే, ఇప్పు డయిన నామాట నమ్మెదవా ?" యని క్రిందికి లాగెను.

సుబ్ర—ఉండు ; నేను వచ్చెదను. ఈయుత్సవ మెవ్వరిది ?

సత్ర—నిన్న చెప్పలేదా ? ఇండ్లు కాల్చు గ్రహము గ్రామము నకు వచ్చినప్పుడు ఈప్రకారముగా చేయుదురు. ఒకచేతిలో వేప మండయు రెండవచేతితో వేపబెత్తమును పట్టుకొని ముందు నడచు చున్న యతనిని జూచినావా ?

సుబ్ర—పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొన్నతఁడు కాఁడా ? చూచి నాను. అతఁ డెవరు ?

సత్ర—అతఁడే యీతంతు నడిపించుచున్న మంత్రజ్ఞుఁడు ; క్రొత్తగా వచ్చి యిండ్లు కాల్చుచున్న దేవతను కొంచెము సేపటికి వెళ్ళ గొట్టును. అతని పేరు వీరదాసు.

సుబ్ర—ఈవఱ కేమితంతు చేసినారు ?

సత్ర—ఇంటి కొకటిరెండేసి చేరల బియ్యము చొప్పున ఏడిం డ్లలో అడిగి పుచ్చుకొని, క్రొత్తకుండ తెప్పించి గ్రామము నడుమ వీధిలో పొయ్యిపెట్టి ఆకుండతో అడిగిపుచ్చుకొన్న బియ్యము, మునుగ కూర, తెలగపిండి కలిపి జాముపరకు వంటచేసి, ఆకుండను దిగువ దించియుంచి నడివీధి నలికి యెఱ్ఱముగ్గు, తెల్లముగ్గు, నల్లముగ్గు,

పచ్చముగ్గు, ఆకుపసరు ముగ్గుతెచ్చి వానితో భేతాళుని స్వరూపము వ్రాసి భేతాళ యంత్రమువేసి పూజచేసి ధూపదీప ఫలనైవేద్యములు సమర్పించి ఏడేసి రావియాకులతో కట్టిన యేడు విస్తళ్ళలో వండిన కుంభమును వడ్డించి, నడివీధిలో నొక కొయ్యనుపాతి దానికి భేతాళ యంత్రమునకు గ్రహమును వ్రాసిన యాజ్ఞనుగట్టి, ఈయన జరిగించ వలసినపని యంతయు జరిపినాఁడు. తరువాత మేము కుంభమును బండిలో నెత్తించుకొని యీకట్టలతో గృహములమీఁద కొట్టుచు ఊరేగుచున్నాము. ఇఁక గ్రామదేవత గుడివద్దకు వెళ్ళినతరువాత చిత్రము జరుగును.

సుబ్ర—ఆలాగయిన నేనును వచ్చెదను.

అని సుబ్రహ్మణ్యము వారివెంటఁ బయలుదేఱెను. అందఱును గ్రామదేవత గుడి చేరినతరువాత యంత్రజ్ఞుఁడు బిగ్గరగా గ్రామదేవత పేర వ్రాసిన యాజ్ఞను ఈప్రకారముగా జదివెను.

యంత్రజ్ఞుఁడైన వీరదాసుగారు పెద్దాపురము గ్రామదేవత అయిన మరిడీమహాలక్ష్మికి చేసినయాజ్ఞ—ఈగ్రామములో ఏదో గ్రహముచేరి యిండ్లు కాల్చుచుండఁగా ఈగ్రామమునకు దేవత వయి యుండియు నీ వూరికే చూచుచుండుటకు నిమిత్తము లేదు. ఆగ్రహమునకు నీతరఫున కుంభము కట్టుబడి చేయించినాము. ఆకుంభము ఆగ్రహమునకిచ్చి మాఱుమన్యమయిన కొండలమీఁదికి దానిని పంపి వేయవలసినది. ఆలాగున పంపించని పక్షమున, శ్రీభేతాళునిచేతఁగాని శ్రీహనుమానులచేతగాని కఠినమయిన శాక్షను పొందఁగలవు.

"శ్లో॥ యక్షరాక్షస దుష్టానాం మూషగా శ్శలభాశ్శుకాః
క్రిమికీట పతంగానా మాజ్ఞాసిద్ధి ర్విభీషణ."

అని చదివిన తరువాత, యంత్రజ్ఞుఁడు పదు విస్తళ్ళను పదుచోట్ల వేయించి ఆ పదింటిలోను కుంభము పోయించి, బండితోలుకొనివచ్చిన వానిచేత నల్లకోడి నొకదానిని కోయించి దానిరక్తమును కుంభము మీఁద పోయించి, "శీఘ్రగహామా! నీకుంభము పుచ్చుకొని కొండల మీఁదికి పో" అని యాజ్ఞాపించెను. అక్కడకు వెళ్ళినవారందఱును చెఱువులో స్నానముచేసి యిండ్లకు వెళ్ళిరి. సుబ్రహ్మణ్యమును బ్రాహ్మణునితో సత్రమునకు వచ్చెను.

ఇంటికివచ్చి సుబ్రహ్మణ్య మాసంగతి యంతయుఁ జెప్పినతరువాత రాజశేఖరుఁడుగారు కొంతసేపు జనుల మూఢత్వమును గుఱించి యాలోచించి, ఇంతలో రుక్మిణి తలపునబాఱిన దుఃఖమువచ్చి ధైర్యము తెచ్చుకొనవలెనని యెంతసేపు ప్రయత్నము చేసినను చేతఁగాక ఎక్కడకయిన వెళ్ళిన దుఃఖము మఱచిపోవచ్చునని తలంచి పట్టణమును జూచుటకు బయలుదేఱిరి. ఆతఁడు సత్రమునుదాఁటి నాలుగడుగులు నడచినతోడనే యొక యింటివద్ద దంపతులిద్దఱు వాక్కలహమున కారంభించిరి; అంతకంత కాకలహము ముదిరి యొకరీతి యుద్ధము క్రింద మాఱినది. భార్య తిట్లెక్కువ చేసినకొలఁదిని భర్త దెబ్బ లెక్కువ చేయుచుండెను. మగని కేకలును భార్య యేడుపును విని వీధివారందఱును గుంపులు గుంపులుగా చూడవచ్చిరి. అంతమంది వచ్చినను వారిలో నొకరును వారిని వారింపవలెనని తలఁచుకొని వచ్చినవారు లేరు గనుక, అందఱును వేడుక చూచుచు మాత్రము నిలుచుండిరి. అంత రాజశేఖరుఁడుగా రాస్థలమును విడిచిపెట్టి ముందుకు సాగిరి. ఆవల మఱి నూరుబారల దూరము వెళ్ళఁగా ఒకచోట వీధియరుగు మీఁద పదిమంది పెద్దమనుష్యులుచేరి సభతీఱికూరుచుండిరి. వారు నాగరికులు గనుక వారిప్రసంగ మెంతమనోహరముగా నుండునో విని

యఁగానందింపవలెనని తలఁచి రాజశేఖరుఁడుగారు వీధిలోనే నిలువఁబడి వినుచుండిరి. ఆసభికులందఱును తామైనను పొగడుకొనుచుండిరి; లేదా స్నేహితులు పొగడుటకు సంతోషమైనను బొందుచుండిరి; వారందఱు నట్లానందించుచుండఁగా రాజశేఖరుఁడుగారు తన్నెవరును పొగడు వారును పొగడుకొన్న వినువారునుగూడ లేనందునఁ జిన్నఁబోయి యిఁక నిందు నిలువఁగూడదనుకొని యక్కడినుండి బయలుదేఱిరి. అటుపిమ్మట నాతఁడు త్రోవపొడుగునను నాలుగైదు రమణీయసౌధము లను జూచి లోపలికిఁ బోయి వానిని చూడవలెనని బుద్ధిపుట్టి గుమ్మ మెక్కి తాను పండితుఁడననియు మేడనుచూడ వేడుకపడి వచ్చితి ననియుఁ జెప్పి చూచెనుగాని ఆపట్టణస్థులందఱును ధనికులమీఁద మాత్రమే ప్రేమగలవారు గనుక ఆయన పాండిత్యమేమియు పనికిరాక మేడలయొక్క వెలుపటిభాగములను మాత్రము చూచి సూర్యాస్త మయసమయము కావచ్చినందున వెనుకకుమరలి తిన్నగా సత్రమువద్దకు చేరవలసి వచ్చెను.

అప్పుడు సత్రపుబ్రాహ్మణుఁడు రాత్రివంటలేదు గనుక తీఱు బడిగావచ్చి కూరుచుండి రాజశేఖరుఁడుగారితో ముచ్చటలకు మొదలు పెట్టెను.

రాజ—మీపట్టణములో గొప్పపండితు లున్నారా?

సత్ర—ఉన్నారు. ఆస్థానపండితుఁడయిన హరిపాపయ్యశాస్త్రులు గారు లేరా? ఆయన యెప్పుడు నెవ్వరితోను బ్రసంగింపఁడు గనుక అందఱికంటెను గొప్పపండితుఁడని వాడుక. ఆయన యొకసారి యీ సత్రములో జరిగిన సంతర్పణమునకు భోజనమునకు వచ్చినప్పుడు విశేష ముగా మాటాడకపోయినను విశేషముగా భుజించినందున, ఆయన గొప్ప పండితుఁడనియే నేనును నమ్మినాను.

రాజ—ఆయనగాక మఱియెవ్వ రయిన నున్నారా ?

సత్ర—మాగురువులు భానుమూర్తిగారు వేదాంతశాస్త్రమందు నిరుపమాన మయిన ప్రజ్ఞ గలవాఁడు. నాకు మొన్న రోగము వచ్చి నప్పుడు పుణ్యలోకము వచ్చుటకు తగిన సహాయమునుచేసి పదిరూపాయలను పట్టుకొని పోయినారు. ఆమఱునాఁడే దొంగవస్తు వొకటి ఆయన యధీనములో కనఁబడినందున సన్మార్గులయిన రాజభటు లాయనను నిష్కారణముగా తీసుకొనిపోయి ఠాణాలో పెట్టినారు.

రాజ—గురువు లెప్పుడును శిష్యులకు దమ్మిడీలతో స్వర్గము నకు త్రోవ చూపుచుందురు. కాని తాముమాత్రము స్వర్గమార్గము మాట యటుండఁగా దాముప్ప యీ లోకమునే త్రోవఁగానక గోతిలో పడుచుందురు. తార్కికుఁడును వైయాకరణుఁడును నగుట సులభముకాని యోగ్యుఁ డగుట యంతసులభము కాదు. ఆమాట యటుండనిచ్చి యీపట్టణములోనివారి స్థితిగతులను కొంచెముచెప్పుము.

సత్ర—కష్టపడి పనిచేయువారు తాము తెచ్చుకొన్నది అన్న వస్త్రాదులకు చాలక బాధపడుచుందురు ; పాటుపడని సోమరిపోతులు పూర్వు లార్జించినమాన్యముల ననుభవించుచు విలువబట్టలను పంచ భక్ష్యపరమాన్నములును గలిగి సుఖింపుచుందురు. తాత ముత్తాతల నాటినుండియు పరువుతో బ్రతికినవారు కొందఱు జీవనము జరగక రాజు గారిని చిరకాలమునుండి యాశ్రయించుచున్నారు ; కాని యెంత యనుస రించినను రాజు నిర్దయుఁడై చదువురాదని చెప్పి వారికి కొలువులియ్య కున్నాఁడు.

రాజ—అదృష్టవంతులము కావలెనని చేయు ప్రయత్న మొకటి తప్ప వేఱుప్రయత్నము లేనివా రెప్పుడును భాగ్యవంతులుకారు. భాగ్యదేవత మాఱుపని లేక తనకొఱకే కాచుకొనియున్న వారియొద్ద

నుండి పాఱిపోయి, యింటఁ గూరుచుండి యొడలు వంచి పనిచేయు వారినే చేరును. దాని కేమిగాని మిగిలిన వృత్తాంతమును చెప్పుము.

సత్ర—మా పట్టణమున ననేకులు రాత్రులు పురాణకాలక్షేపమును జేయుదురు. ఇక్కడకు దగ్గఱనే యొక పెద్దమనుష్యుఁ డున్నాడు. ఆయన యెప్పుడును చదువక పోయినను తాటాకుల పుస్తకము నొక దానిని విప్పి సర్వదా ముందు పెట్టుకొని కూరుచుండును. మన పొరుగింట కాపురమున్న సమీతుదారుగారి తల్లికి పురాణమన్న నెంతో యపేక్ష; ఆమెకు నిద్ర రానపుడెల్లను పురాణము చదువ్రమనును; పురాణ మారంభించిన తరువాత మంచి కథపట్టు రాఁగానే గోడను చేరగిలఁబడి హాయిగా నిద్రపోవును.

రాజ—ఇక్కడి వర్తకు లెటువంటివారు ?

సత్ర—వర్తకులు తమ సరకులను మాత్రమే కాదు, మాటలను సహితము విశేషలాభమునకు విక్రయింతురు. అయినను వారి కెంత లాభము వచ్చినను, ఆలాభము మాత్రము వారి యాశకుఁ దగియుండదు. ఈ సంగతి నెఱిఁగి యిక్కడి పెద్దమనుష్యులు కొందఱు మొదట వారి వర్తకశాలకుఁ బోయి యొక వస్తువును గొని వారడిగిన వెల నిచ్చివేయుదురు; ఆపయిన చిన్నవస్తువు నొక దానిని అరవు తెప్పించి, దాని సొమ్మును మఱునాఁడే పంపివేయుదురు; ఆటుపిమ్మట క్రమక్రమముగా పెద్దవస్తువులను దెప్పించి వానివెలలనుగూడ యుక్తసమయముననే యిచ్చివేయుదురు ; ఈప్రకారముగా నమ్మకము కుదిరిన తరువాత పెండ్లిపేరో మఱియొక శుభకార్యముపేరో చెప్పి విలువవస్తువులను విస్తారముగా దెప్పించి కడపటఁ సొమ్మియ్యక యపహరింతురు.

రాజ—ధనము నిమిత్తము ఈప్రకారముగా నక్రమమున కొడిగట్టిన కీర్తిపోదా ?

సత్ర—కీర్తికేమి? దానిని కొనుట కయి ముందుగా ధనము సంపాదించినయెడల తరువాత నిమిషములో కావలసినంత కీర్తిని కొన వచ్చును;

రాజ—మీరాజుగా రెంతో ధర్మాత్ములనియు ప్రజలను న్యాయ మార్గమున నడిపించువారనియు ఎప్పుడును వినుచుందును. వారి రాజ ధానియైన యీపట్టణమునందె యిట్టి ఘోరకృత్యములు జరుపుచుండగా రాజుగారు సహించి యూరకున్నారా?

సత్ర—ఈపట్టణములో నిప్పుడేమి యక్రమములు జరుగు చున్నవి? మహారాజుగారి తండ్రిగారి కాలములో పూర్వము జరుగు చుండెడి ఘోరకృత్యములలో నిప్పుడు గుమ్మడికాయలో నావగింజంత పాలయినను లేవు. ఆకాలములోనే మీరీపట్టణమునకు వచ్చియుండిన యెడల మంచి బట్టలు కట్టుకొని పట్టపగలుప్రకారముగా వీధిలో నిర్భయ ముగా నడవఁగలిగి యుందురా? మారాజుగారు సహస్రముఖముల కను గొని నిత్యమును దుర్మార్గుల ననేకులను శిక్షించుచుండుటచేతనే యిప్పుడు నరహత్యలు మొదలయిన ఘోరపాతకము లేవియు జరగకున్నవి.

రాజ—ఈపట్టణములో వేదవిహిత కర్మానుష్ఠానములు చక్కఁగా జరుగుచుండునా?

సత్ర—త్రికాలములయందు యథావిధిగా జరుగుచుండును.

రాజ—అట్లయిన, నీవిప్పుడు సంధ్యావందనము చేసినావా?

సత్ర—ఎన్నఁడో వడుగునాఁడు నేర్చుకొన్న సంధ్యావందనము మఱచిపోక యిప్పటిదాఁక జ్ఞాపక ముంచుకొన్నా ననుకొన్నారా?

రాజ—పోనీ; అర్ఘ్యమునయిన విడిచినావా?

సత్ర—ఒక్క అర్ఘ్యమును మాత్రమేకాదు. సంధ్యావందన మంతయు విడిచినాను.

ఈ సంభాషణము ముగిసినతరువాత ప్రొద్దుపోయినందున రాజశేఖరుఁడుగారు లేచి వెళ్ళి భోజనముచేసి, తరువాత నొక్కరు నరుండి యాలోచించుకొని మోసములకెల్లను పుట్టినిల్లయిన యీపట్టణమును సాధ్యమయినంత శీఘ్రముగా విడిచిపెట్టవలయునని నిశ్చయించుకొనిరి; కాఁబట్టి మఱునాఁడు ప్రాతఃకాలముననే యొకబండిని కుదుర్చుకొని వచ్చి, కుటుంబసహితముగా దానిమీఁదనెక్కి జాముప్రొద్దెక్కువఱకు భీమవరము చేరిరి. బండిమీఁద నెవ్వరో క్రొత్తవారు వచ్చినారని యూరిలోనెల్లవారును జూడవచ్చి వారి నివాసస్థలమును గుఱించియు, ఆగమనకారణమును గుఱించియు ప్రశ్నలు వేయఁజొచ్చిరి; చెప్పిన దానినే మరల మరల నడిగినవారికెల్లను జెప్పలేక రాజశేఖరుఁడుగారును మాణిక్యాంబయు విసిగిపోయిరి. వారందఱు నట్లు గనిపెట్టుకొని వచ్చి ప్రశ్నలువేయుటకయి ముందడుగిడుచు వచ్చినను, రాజశేఖరుఁడుగారు తమకు బసకావలెనని యడుగఁబోగానే తిన్నగా వినిపించుకోక లేదని వెనుకంజవేయ నారంభించిరి. అంతట రాజశేఖరుఁడుగారు బండిని వీధిలో నిలిపించి, తాము బయలుదేఱి బసనిమిత్తమయి యెల్లవారి యింటికిని బోయి రెండు జాములవఱకును నడుగుచుండిరి. గాని వారిలో నొక్కరును ఆపూఁట వండుకొని తినుటకయినను స్థలము నిచ్చినవారు కారు. క్రొత్తగా వచ్చినవారు గనుక రాజశేఖరుఁడుగారు బసనిమిత్తమయి తిరుగునప్పుడు వీధులలో నిలువచేయఁబడియున్న పెంటకుప్పలను జూచి యసహ్యపడుచు వచ్చిరిగాని యెరువున కుపయోగించుటకయి పొరుగూళ్ళకు సహితము గొనిపోయి యమ్ముకొనెడి యాయూరివారి కవియే కనకమన్న సంగతిని తెలిసికోలేకపోయిరి. అట్లాసుర్గంధమునకు ముక్కుమూసికొని నడచి గ్రామకరణముయొక్క యింటికిఁబోయి వారి యింటిపేరడిగి యేదోయొక ప్రాతబంధుత్వమును తెలుపుకొని మిగ

మోటపెట్టఁగా ఆతఁడాపూఁటకు తమయింట వంటచేసికొనుట కంగీకరించి, పొరుగుననున్న యొక వైదికబ్రాహ్మణుని పిలిపించి రాజశేఖరుఁడుగారు కాపురముండుటకయి వారిప్రాతయిల్లిమ్మని చెప్పెను. అతఁడాయిల్లు బాగుచేయించినం గాని కాపురమున కక్కఱకురాదనియు, తన భార్య సమ్మతిలేక యియ్య వలనుపడ దనియు, పెక్కు ప్రతిబంధములను జెప్పెను; కాని రాజశేఖరుఁడుగా రాతని కూరుచుండఁబెట్టుకొని పరోపకారమునుగూర్చి రెండుగడియలసేపు వుపన్యాసముచేసి యిల్లు బాగుచేయించుటపేరుచెప్పి రెండురూపాయలు చేతిలోఁబెట్టిరి. చెప్పిన వాక్యములన్నిటికన్నను చేతిలోఁబెట్టినసొమ్మాతనిని నిమిషములో సమాధానపఱిచినది. కాఁబట్టి రాజశేఖరుఁడుగారు వెంటనేపోయి బండిని తోలించుకొనివచ్చి యాపూఁట కరణములోపల వంటచేసికొని భోజనముచేసి దీపములవేళ సకుటుంబముగా ఆగ్రామపురోహితులయింటఁ బ్రవేశించిరి. ఆయిల్లు పల్లపునేలయందుఁ గట్టఁబడియున్నది; గవాక్షములు బొత్తిగా లేనేలేవు; వాస్తుశాస్త్రప్రకారముగా దూలములు యజమానునిచేతి కందులాగునఁ గట్టఁబడిన యాయింటిగోడ లేపాటివి గనుక గుమ్మము లంతకన్నను పొట్టివిగానుండెను. కాఁబట్టి యెక్కడను వంగినడవని వారుసహిత మక్కడవంగి నడుచుచుందురు; లోపలి గోడ లెత్తుగా నుండకపోయినను దొంగలభయముచేతఁ గాఁబోలును గాలివచ్చుటకు వలనుపడకుండ దొడ్డిచుట్టును నున్న గోడలుమాత్రము మిక్కిలి యెత్తుగాఁ బెట్టఁబడినవి! కాని యింటివా రాయిల్లు విడిచిపెట్టి వెళ్ళినతరువాత చూచువారులేక కూలి యిప్పుడు మొండిగోడలుగా నున్నందున లోపలికి గాలివచ్చుట కవకాశము కలిగినది. పూర్వమిల్లుగలవా రందున్నప్పు డెవ్వరో యొకరు సదారోగ బాధితులై యుండుచు వచ్చినందునను గృహాధిపతియొక్క కూఁతు రందులోనే

లేక. నేను మాటాడ మొదలుపెట్టినతోడనే మంచము దగ్గఱనున్న కుక్కయొకటి మొఱుగ నారంభించినది. కాఁబట్టి దానితోనే నేను మాటాడినానని కొన్నాను. కాని యది యేమిచెప్పినదో దానిభాష నాకు రానందున గ్రహింపలేక పోయినాను. ఇట్లు దాని యభిప్రాయము తెలియక యనుమానించుచు నిలుచుండ, రాజు తన సేవకుని నొక్కనిఁబిలిచి నాకుఁ దెలిసినభాషతో ఈబ్రాహ్మణు నావలికిఁ బంపివేయు మని యాజ్ఞాపించెను. జరగఁబోవుసంగతిని గ్రహించి వాఁడు త్రోసెడిముందు మృదువుగా నేనే వెనుకకు మరలి తిన్నగా యింటికి వచ్చితిని.

అంతటిసన్మానము జరిపించిన రాజుగారిని మరలవెళ్ళి యాశ్రయింప బుద్ధి పుట్టక రాజశేఖరుఁడుగారు ముందు జీవనోపాధి యెట్లు కలుగునా యని యాలోచించి సుబ్రహ్మణ్యము నెక్కడకైనను బంపవలెనని తలఁచి మాణిక్యాంబతోఁ జెప్పి యామె యనుమతిని కొమారునితో నాసంగతిని జెప్పిరి. అతఁడును పరమసంతోషముతో నొప్పుకొన్నందున, అందఱును నాలోచించుకొని చివరకతనిని పిఠాపురమునకుఁ బంప నిశ్చయించుకొనిరి. ప్రయాణము నిశ్చయించిన దినమున రాజశేఖరుఁడుగారు కుమారుని బిలిచి యనేకవిధముల నీతులు బోధించి బుద్ధులు చెప్పి, న్యాయమార్గమునఁ బ్రవర్తింపవలసిన దని పలుమారులు జెప్పి, నమస్కరించిన కుమారుని నాశీర్వదించి యయిదురూపాయలను కర్చునిమిత్తమిచ్చిరి ; మాణిక్యాంబయు దగ్గరనున్న దానిలో నేమియు లోపముచేయక కావలసినన్ని దీవనలిచ్చెను. సుబ్రహ్మణ్యమును వారినెడబాయవలసి వచ్చినదిగదా యని కంటఁ దడిపెట్టుకొని చెల్లెలిని ముద్దాడి తనకిచ్చిన రూపాయలలో నొకదానిని చేతిలోఁబెట్టి వారివద్ద సెలవు పుచ్చుకొని వెనుకతిరిగి చూచుచు దారినాగి నడచెను.

పదవ ప్రకరణము

శోభనాద్రిరాజుతో మైత్రి—సీత వివాహ ప్రయత్నము—రామమూర్తి గారి మరణవార్త—రామరాజుతో విరోధము—రాజశేఖరుఁడు గారిని చెఱసాలలోఁ బెట్టుట—సీత నెత్తుకొని పోవుట.

ఒక యాదివారమునాఁడు నాలుగుగడియల ప్రొద్దెక్కినతరువాత రాజశేఖరుఁడుగారు పెద్దాపురమునకుఁ బోవుచుండఁగా, శోభనాద్రిరాజు వీధియరుగుమీఁదనున్న యున్నతాసనముపైని గూరుచుండి చూచి లంపతావాని నొక్కని బిలిచి "ఆమార్గమునఁ బోవుచున్న బ్రాహ్మణుని దీసికొని రమ్మ"ని చెప్పెను. వాఁడును మహావేగముగాఁ బోయి "రాజుగారి సెలవయినది రమ్మ"ని పిలిచెను. రాజశేఖరుఁడుగా రెట్లయిన నాతని యనుగ్రహము సంపాదించుకోవలెననియే కోరుచున్నవారు గనుక పిలిచినదే చాలునని వెళ్ళి అతఁడు చూపిన బల్లమీఁద కూరుచుండిరి.

శోభ—ఈనడుమ భీమవరమువచ్చి సోమభట్లుగారిలోపల కాపురమున్నవారు మీరే కారా;

రాజ—అవును. వెనుక నే నొక పర్యాయము దమదర్శనము చేసినాను.

శోభ—జ్ఞాపకమున్నది. మేమప్పుడు మిక్కిలి తొందరపనిలో నుండి మీమీఁద కోపపడినాము. అంతేకాకుండ ఆవచ్చినవారు మీరని మాకప్పుడు తెలియ లేదు. మీపోష్యవర్గములో చేరినవారెంత మంది యున్నారు ? పెండ్లికెదిగిన కొమార్తెకూడ ఉన్నదఁట కాదా?

రాజ—ఇప్పుడున్నది వివాహము కావలసిన యాఁకూఁతు రొక్కతయే. నాపెద్దకుమార్తె మొన్న త్రోవలో దొంగలు కొట్టినప్పుడు చనిపోయినది. ఏదయిన నొక యుద్యోగమును సంపాదించుట

కయి నాకుమారుని ఇక్కడకు వచ్చిన తరువాతనే పిఠాపురము పంపినాను.

ఈప్రకారము సంభాషణము జరుగుచుండఁగా కొంతమంది పెద్ద మనుష్యులు వచ్చి అరుగుమీఁదనున్న బల్లమీఁద గూరుచుండిరి. అప్పుడు రాజుగారు వారితో తాను చేసిన యద్భుతచర్యలను గురించి బహువిధముల ప్రశంసచేసిరి. చెప్పిన మాటలలో నేమియు చమత్కారము లేకపోయినను, అక్కడ నున్నవా రాలోపమును నవ్వులతో మాత్రము పూర్తిచేసిరి; వారందఱు నవ్వినపుడు తామొక్కరు నూరకున్న బాగుండదని నిజముగా నవ్వు రాకపోయినను తెచ్చుకొని వారు నవ్వినప్పుడెల్లను రాజశేఖరుఁడుగారును నవ్వుచు వచ్చిరి. ఆ రాజు తన్ను రాజశేఖరుఁడుగారు తెలిసినవాఁడనుకొనుట కయి ప్రతివిషయములోను గొంచెము కొంచెముగా మాటాడి యన్నియు దెలిసిన వానివలె నటింపసాగెను; తన కేమియుఁ జెప్పుటకు తోఁచనప్పుడు అక్కడ నున్నవారి మొగములవంకఁ జూచి నవ్వుచువచ్చెను. అప్పుడాయన పాండిత్యమును సభవారందఱు నూరక పొగడుచుండిరి! ఇంతలోఁ గొందఱు గాయకులు వచ్చి సంగీతము పాడుట కారంభింపని యెడల, వారిపొగడ్తలు సభ చాలించువఱకు నుండుననుటకు సందేహము లేదు. వారు పాట నారంభింపఁగానే యెల్లవారికిని ఇంష్టమీఁద ధ్యానము పాఱనారంభించినది. అయినను రాజుగారేమనుకొందురో యని యందఱును కొంతసేపు శ్రమచేసి మాటలు చెప్పుకొనుచు నచటనే కూరుచుండిరి. ఆ పాట విసిగిని తాళలేక కడపట నొక పెద్దమనుష్యుఁడు చొరవచేసి, “వారు మంచివారని యదేపనిగా శ్రమయిచ్చుట న్యాయముకాదు. కాఁబట్టి యీపాటికి పాట చాలింప ననుజ్ఞ యియ్యవచ్చు”నని చెప్పెను. సభవారందఱును అది యుక్తమని యేకవాక్యముగాఁ బలికిరి. అంతట సభచాలించి యందఱును సెలవుపుచ్చుకొని

వెళ్ళఁబోవునపుడు రాజుగారు రాజశేఖరుఁడు గారిని 'అప్పుడప్పుడు వచ్చి దర్శన మిచ్చుచుండెదఱుకాదా ?' యని యడిగిరి. 'ముఖ్యముగా వచ్చి దర్శనము చేసికొనుచుండెద' నని చెప్పి, ఆయన నాఁటికి పెద్దాపురము ప్రయాణము మానుకొని పదిగడియల ప్రొద్దెక్కుఁవఱ కిల్లుచేరిరి.

నాఁటు మొదలుకొని ప్రతిదినమును రాజశేఖరుఁడుగారు ప్రాతఃకాలమునను సాయంకాలమునను గూడఁ బోయి శోభనాద్రి రాజుగారి దర్శనము చేయుచుండిరి. ఆరాజుగారును మిక్కిలి దయతో నాతని నాదరించి మంచిమాటలతో సంతోషపెట్టుచుండిరి. ఆయన రాజకార్యవిషయమైన పనిని జూచుచుండునపుడు సహితము రాజశేఖరుఁడుగారువద్దనే యుండి సంగతి కనుఁగొనుచుందురు; గ్రామాదుల లోని ప్రజలు వ్రాసికొన్న విజ్ఞాపన పత్రికలను కొలువుకాండ్రు చదువునపుడు వ్రాసికొన్న మనవి కడపట రెండుమూడు పంక్తులలో మాత్రమే యున్నను బిరుదావళిమాత్రము మొదటి రెండు పత్రముల లోను పూర్ణముగా నిండియుండుట తెలిసికొని రాజుగారికి గ్రామములోని కాపులకన్న బిరుదుపేళ్ళే విశేషముగా నుండుట కానందించుచు వచ్చిరి. రాజకార్యపుఁబని యైనతోడనే రాజుగారు సభవారితో ముచ్చట కారంభింతురు. ఆతఁ డెంతసేపు చెప్పినను తన ప్రతాపమునే చెప్పుచుండును; ఆకథ లన్నియు నావఱకు పదిసారులు విన్నవే అయినను మొదటిసారి నవ్వినట్టే ప్రతిపర్యాయమును సభలోనివారందఱును నవ్వుచుందురు; అందులోఁ గొందఱు స్తోత్రపాఠములను జదివి రాజుగారి మనస్సును సంతోషపెట్టుచుందురు; అందఱును ముఖస్తుతులు చేయుచుండఁగా తా నొక్కరునుమాత్ర మూరకుండుట న్యాయము కాదని యెంచి, రాజశేఖరుఁడుగారు స్తుతివిద్యయందు పాండిత్యము చాలనివారు గావున నసత్యమునకు

భయపడి యాఁతఁడు మఱి స్వేవిషయమునందును స్వోగ్రాహ్యుఁడు కానందున మంచిబట్టలను కట్టుకొనుటకు కొంతశ్లాఘించిరి. ఇట్లు తరుచుగా రాజశేఖరుఁడుగారు రాజస్థానమునందు మెలఁగుచు వచ్చుటచేత వేఱులాభమును పొందకపోయినను సభలో పదిమందిని నవ్వించు మార్గమునుమాత్రము నేర్చుకొనిరి; కాఁబట్టి యప్పటి నుండియుఁ దా నొకమాటను చెప్పుచు ముందుగాఁ దామే నవ్వుచు వచ్చిరి. అదిచూచి యందఱును నవ్వుచుండిరి. రాజుగారప్పుడప్పుడు ధర్మోపన్యాసములసహితము చేయుచుందురు. లోకములో నెవ్వరెన్ని పాట్లుపడినను భోజననిమిత్తమే కాఁబట్టి, ఆవిషయమున నేమిచేసి నను దోషము లేదని వాదించుచుండిరి. ఈసిద్ధాంతము మనస్సున నాఁటి యుండుట చేత నేకాఁబోలును రాజుగారు ప్రతిదినమును లేచినది మొదలుకొని పదిగడియలవఱకు ప్రాతర్భోజనమునకు వలయుసంభారముల నిమిత్తమే ప్రయత్నము చేయుచుందురు; భోజన మయినది మొదలుకొని మధ్యాహ్నము ఫలహార మేమిదొరకునా యని చింతించుచుందురు; ఫలాహారమయినప్పటినుండియు రాత్రిభోజనమునకు వ్యంజనము లేవి కల వని యాలోచించుచుందురు.

ఈరాకపోకలచేత రాజశేఖరుఁడుగారికి రాజుగారివద్ద మిక్కిలి చనువుగలిగెను. ఆసంగతి నెఱిఁగి బ్రాహ్మణులు రాజశేఖరుఁడుగారి యింటికిఁ బోయి పలువిషయములు ముచ్చటించుచు, వారిలోఁ గొందఱు సీత నెవ్వరికిచ్చి వివాహము చేయఁదలఁచినా రని మాట వెంబడి నడుగుచుందురు; ఇప్పుడు చేతిలోడబ్బు లేనందున, ఎవరి కిచ్చి వివాహముచేయుటకు తలపెట్టుకోలేదని యాయన బదులుచెప్పుచుండును. ఒకనాఁడు రాజశేఖరుఁడుగారు భోజనముచేసి కూరుచుండి యుండఁగా బొమ్మగంటిసుబ్బారాయఁ డను సిద్ధాంతి వచ్చి జ్యోతి

శాస్త్రమునందలి తన యఖండపాండిత్యమును దానివలన దనకుఁ గలిగిన గౌరవమును పొగడుకొని ఆంధ్రదేశమునందలి గొప్పవారందఱును జాతకములను తనకుఁ బంపిన ఫలములను దెలిసికొనుచుందురని చెప్పి దానికి నిదర్శనముగాఁ బెక్కు జాతకచక్రములను విజయనగరాది దూరప్రదేశములనుండి ప్రభువులు వ్రాసినట్టున్న జాబులను జూపి, ఫలము జెప్పుటకయి ఆయనయొక్క జన్మనక్షత్రమునుకూడ దెమ్మని యడిగెను.

రాజ—నాకిప్పుడు జ్యోతిషశాస్త్రమునందలి నమ్మకముపోయినది ; నావద్ద కొల్లగా ధనము పుచ్చుకొని వ్రాసిన మాయాంధ్ర జన్మపత్రికలలో ఫలము లేవియు నిజమయినవి కావు ; మేము కాశీయాత్రకు బయలు దేరినప్పుడు మంచి ముహూర్తము పెట్టుకొని యిల్లు బయలుదేరినను త్రోవలో గొప్పయాపదలు వచ్చినవి ; అందుచేత జ్యోతిషముమీఁది నమ్మకము చెడినది. కాఁబట్టియే మొన్న పెద్దాపురమునుండి యిక్కడకు వచ్చునప్పుడు ముహూర్తము చూచుకొనకయే బయలు దేఱినాను.

సుబ్బ—నాది అందఱిజ్యోతిషములవంటిది కాదు ; నేనుచెప్పిన ప్రశ్నకాని పెట్టిన ముహూర్తముకాని యీవఱ కెన్నఁడును తప్పిపోలేదు; నేను జాతకములో నెన్నియక్షరములు వ్రాయుదునో యన్నియక్షరములును జరిగి తీరవలెను.

రాజ—మీరు చెప్పెడు ఫలము నిజమైనను నాకక్కఱలేదు. నాకు ముందు మేలు కలుగుననెడి పక్షమున, వచ్చెడు ననుకొన్నది రాకపోయెనని మిక్కిలి వ్యసనముగా నుండును; నిజముగా వచ్చెనేని, ఆవఱకే దాని నెదురు చూచియుండుటంజేసి వచ్చినప్పు డధికసంతోషము కలుగదు. కీడు గలుగునని చెప్పెడు పక్షమున నిజముగా వచ్చి

నష్టమును దుఃఖపడుట యటుండఁగా ఇప్పటినుండియు విచారపడవలసి వచ్చును; ఒకవేళ రాకపోయెడుపక్షమున వ్యర్థముగా లేనిపోని చింత పడవలసివచ్చును; అట్టి విచారముచేతనే కీడు గలిగినను గలుగ వచ్చునుగాని, సంతోషపడుటచేత మేలుమాత్రము కలుగనేరదు.

సుబ్బ—పండితులై యుండియు మీ రాలాగున సెలవిచ్చుట బాగ్యముకాదు. పెద్దలుచెప్పిన శాస్త్రములయందు మన మెప్పుడు గురియుంచవలెను. ఆమాట పోనిండి; మీకుమార్తెకు పెండ్లి యీడు వచ్చిన ట్టున్నది; ఇంకను వివాహప్రయత్నము చేయక యశ్రద్ధగా నున్నారేమి?

రాజ—ఆవిషయమై యే నేనును విచారించుచున్నాను. అనుకూల మయిన సంబంధము కనఁబడలేదు; చేతిలో సొమ్ము హితము కనఁబడదు. మీ యెఱుక నెక్కడనైనను మంచిసంబంధము లేదుగదా?

సుబ్బ—సం-బం-ధమా? ఉన్నది కాని, వారు గొప్పవారు! మీకు సర్వవిధముల ననుకూలముగా నుండును.

రాజ—వారిదే యూరు? మన మేమిప్రయత్నముచేసిన ఆసంబంధము లభ్యమగును.

సుబ్బ—వారిది పెద్దాపురము. వారియింటిపేరు మంచిరాజు వారు; వారికి సంవత్సరమునకు రెండువేలరూపాయలు వచ్చు మాన్యము లున్నవి; ఇవిగాక వారియొద్ద రొక్కముకూడ విస్తారముగా నున్నదని వాడుక. చిన్నవాఁడు ప్రథమవరుఁడు; స్ఫురద్రూపి; అతనికొక్క యన్నగా రున్నారుగాని, ఆయనకు సంతానములేదు. ముందు సమస్తమునకును ఈచిన్నవాఁడే కర్తయగును. పెండ్లి కొమారునిపేరు పద్మరాజుగారు. ఆసంబంధము మన శోభనాద్రిరాజుగారు ప్రయత్నముచేసినపక్షమున మీయదృష్టబలమువలన రావలెను గాని మఱియొకవిధముగా మీకు లభింపదు.

రాజ—అలా గయినపక్షమున, ఈసంగతిని ముందుగా మీా కొకసారి రాజుగారితో ప్రసంగించి వారియభిప్రాయము తెలిసి కొనెదరా ?

సుబ్బ—నేను ముందు వెళ్ళి కూర్చుండెదను. తరువాత మీారు కూడ రండి. మీారుండఁగానే మాటప్రస్తావనమున మీా కొమార్తె వివాహపుసంగతిని తెచ్చిచూచెదను. దానిమీాఁద మీా రందుకొని రాజుగారితో సాక్షి మంచిచేయవలెను.

అనిచెప్పి సుబ్బరాయుఁడుసిద్ధాంతి బయలుదేఱి తిన్నగా శోభనాద్రిరాజుగారియింటికిఁ బోయికూరుచుండెను. తరువాత మఱినాలుగు నిమిషములకు రాజశేఖరుఁడుగారును వెళ్ళిచేరిరి. అప్పుడు కొంత సేపు పలువిధముల ప్రసంగములుజరిగినమీాఁదట రాజశేఖరుఁడుగారి కొమార్తెసంగతి సిద్ధాంతి మెల్లగాఁ దెచ్చెను.

సుబ్బ—రాజశేఖరుఁడుగారికి పెండ్లి కావలసిన కొమార్తెయున్న సంగతి దేవరవా రెఱుఁగుదురా ?

శోభ—ఎఱుఁగుదుము ; ఈమధ్య విన్నాము. ఆచిన్నదానికిఁ బెండ్లియీడు వచ్చినదా ?

సుబ్బ—ఈమధ్యాహ్నమే నేను చూచినాను. ఇక చిన్నదానిని నిలిపి యుంచరాదు; మొన్న మాబంధువుల గ్రామములో నింతకంటె చిన్నపిల్ల సమర్తాడినది.

శోభ—ఎక్కడనైన సంబంధము విచారించినారా ?

సుబ్బ—పెద్దాపురములో మంచిరాజు పద్మరాజుగా రున్నారు. తమరు ప్రయత్నము చేసెడిపక్షమున, ఆసంబంధ మనుకూల పడ వచ్చును.

శోభ—అవును. అది దివ్యమయిన సంబంధమే కాని, వారీ చిన్నదానిని చేసికొనుట కంగీకరింతురా ?

రాజ—తమ రేలాగునైనను ప్రయత్నముచేసి మాకీమేలు చేయకతప్పదు. తమరు సెలవిచ్చినతరువాత వారు మఱియొక విధముగాఁ దలఁచుకోరు.

శోభ—ఈపూట పద్మరాజుగా రిక్కడకే వచ్చినారు. మీ యెదుటనే వారితో చెప్పెదము. ఓరీ! స్వామిగా! మనబావగారితో మంచిరాజు పద్మరాజుగారు వచ్చి మాటాడుచున్నట్టున్నారు. వెళ్ళఁబోవునప్పు డొక్కసారి యవశ్యముగా దర్శనమిచ్చి మఱి వెళ్లుమన్నా నని మనవిచేసి రా.

లంపటావాఁడు వెళ్లిన కొంతసేపటికి ముప్పదియేండ్లు యీడుగల నల్లని యొక పెద్దమనుష్యుఁడు చలువచేసిన తెల్లబట్టలు కట్టుకొని పదివ్రేళ్ళను ఉంగరములును, చేతులను మురుగులను, మొలను బంగారపు మొలత్రాడును పెట్టుకొని వచ్చెను. శోభనాద్రిరాజుగారు దయచేయుఁడని మర్యాదచేసి యాయనను తమదాపునఁ గూర్చుండబెట్టుకొనిరి.

పద్మ—తమ సెల వయినదని సామిగాడు వర్తమానము చెప్పినందున, వెళ్లుచున్నవాడను మరలి వచ్చినాను. నాతో నేమయిన సెలవియ్యవలసినది యున్నదా?

శోభ—వీరు కొంతకాలమునుండి మనగ్రామములో నివసించి యున్నారు. మిక్కిలి దొడ్డవారు. వీరిపేరు రాజశేఖరుఁడుగారు. మీరు సంబంధముకొరకు విచారించుచున్నారని తెలిసినది. వీరి కొమార్తె యున్నది చేసికోరాదా? పిల్ల మిక్కిలి లక్షణవతి. వీరిది మొదటి నుండియు మంచి సంప్రదాయసిద్ధమైన వంశము.

పద్మ—పలువురు పిల్లనిచ్చెదమని తిరుగుచున్నారు. నాకీవఱకును వివాహము చేసికోవలెనని యిచ్ఛ లేకపోయినది; అలాగే కాని మొదల, నాకు చిన్నతనములోనే వివాహమయి యీపాటి సంతాన

యోగముకూడ కలుగదా ? మీవంటివా రందరును మొదలు విజ్ఞాచుట చేత విధిలేక యొప్పుకోవలసి వచ్చినది. అయినను తమరీలాగున సెలవిచ్చినారని మాఁవాన్నగారితో మనవిచేసి యేమాటయు రేపు వినిపించెదను.

శోభ—ఈసారి నామాట వినకపోయినయెడల, మీస్నేహము నకును మా స్నేహమునకును ఇదే యవసానమని మీయన్నగారితో నేను మనవి చేయుచున్నానని ముఖ్యముగా చెప్పవలెను.

పద్మ—చిత్తము. ఆయన మీయాజ్ఞను మీఁఱి నడవరు. సెలవు పుచ్చుకొనెను.

పద్మరాజు వెళ్ళిపోయినతరువాత సంబంధమును గురించి గట్టి ప్రయత్నము చేయవలయునని రాజశేఖరుఁడుగారు శోభద్రిరాజు గారిని బహువిధములఁ బ్రార్థించిరి. ఆతఁడును తన యావచ్ఛక్తిని వినియోగించి యీసంబంధమును సమకూర్చెదనని వాగ్దానము చేయుటయే గాక, ఆసంబంధము దొరికినయెడల రాజశేఖరుఁడుగారికి మునుపటికంటెను విశేషగౌరవమును బ్రసిద్ధియు గలుగఁ గలదని దృఢముగాఁ జెప్పెను. అంతట బ్రొద్దుక్రుంకినందున రాజుగారు భోజనమునిమిత్తమయి లేచిరి. తక్కినవా రందరును సెలవు పుచ్చుకొని యెవరియిండ్లకు వారు పోయిరి.

మఱునాఁడు నాలుగు గడియలపొద్దెక్కినతరువాత రాజశేఖరుఁడుగారు వెళ్ళినతోడనే, శోభనాద్రిరాజుగారు చిఱునవ్వు నవ్వుచు లోపలినుండి వచ్చి "నిన్న మనముపంపించిన వర్తమానమునకు రాత్రియే ప్రత్యుత్తరము వచ్చినదినుండీ" యని చెప్పెను. "ఏమనివచ్చినది ? ఏమనివచ్చినది ? అని రాజశేఖరుఁడుగా రత్యాతురతతో నడిగిరి. "నే నంతఖండితముగా వర్తమానము పంపిన

తరువాత వారు మఱియొకలాగున జెప్పెదరా? చేసికొనియెదమని జాబువ్రాసి పంపినారు" అని యొక తాటాకుచుట్టను చేతి కిచ్చెను. దానిని చదువుకొని రాజశేఖరుడుగారు పరమానంద భరితు లయిరి. అప్పుడే రాజుగారు సుబ్బారాయుడుసిద్ధాంతిని పిలిపించి వివాహము నకు ముహూర్తము పెట్టుడని నియమించిరి. ఆతడు పంచాంగ మును జూచి పర్యాలోచించి వైశాఖబహుళ సప్తమి గురువారము రాత్రి పదీ ఘడియలు 13 విఘటికలమీదట పునర్వసునక్షత్రయుక్త మేషలగ్న మునను ముహూర్తము నుంచెను. వెంటనే పెండ్లిపనులు చేయుట కారంభింపవలసిన దని చెప్పి మీకు ఖర్చున కిబ్బందిగా నున్నరూకల ప్రస్తుత మీవారు మాపాయలను పుచ్చుకొని మీచేతిలో నున్నప్పుడు నెమ్మదిగా తీర్చవచ్చునని శోభనాద్రిరాజుగారు పెట్టెతీసి రూపాయ లను రాజశేఖరుడుగారిచేతిలో బెట్టి 'సామిగా' అని సేవకునొక్కని బిలిచి "ఇకపై వారముదినములును పంతులుగారితోకూడ నుండి వా రేపని చెప్పినను చేయుచుండుము". అని చెప్పి యొప్పగించెను. రాజ శేఖరుడుగారు వానిని తీసికొని యింటికి బోయిరి.

ఆదినము మొదలుకొని ప్రతిదినమును రాజశేఖరుడుగారు పెద్దాపురమునకు వెళ్లుచు కంచులు మొదలుగా గల వానినెల్ల కొని తెచ్చి ఆదివారపు సంతలో కూరగాయలను దెప్పించిరి. ఈవిధముగా పెండ్లిపనులను సాగించుచు పంచమినాడు సీతను పెండ్లికూతునుగా జేసిరి. ఇంక రేపురాత్రి పెండ్లి యనగా షష్ఠినాడు రాత్రి చేతిలో కఱ్ఱపట్టుకొని గొంగళి ముసుగుపెట్టుకొని యొక కూలివాడు చీకటిలో వచ్చి రాజమహేంద్రవరమునుండి యుత్తరము తెచ్చినా నని యొక తాటాకుచుట్టను సీతచేతికిచ్చెను. ఇంతలో మాణిక్యాంబ లోపలినుండి వచ్చి సీతచేతిలోని యుత్తరమును పుచ్చుకొని రాజ

శేఖరుఁడుగారు పెద్దాపురము వెళ్ళి రాలేదనియు వచ్చెడిసమయమైనదిగనుక వచ్చినదాఁక వీథిలో నిలుచుండవలసిన దనియుఁ జెప్పి లోపలికిఁబోయెను. రాజశేఖరుఁడుగారు వేగిరము రాఁకపోఁగా కూలివాఁడు తొందరపడుచుండుటను జూచి మాణిక్యాంబ వానికి తవ్వెడు బియ్యమును డబ్బును ఇచ్చి పంపివేసెను. ఆవెనుక సీత 'నాన్నగారు వచ్చుచున్నా రేమో చూచివచ్చెద' నని వీథిగుమ్మములోనికి వెళ్ళి ఇప్పుడువచ్చినకూలివాఁడు కట్ట దిగఁబెట్టి పోయినాఁ డని యొక చేతికట్టను దెచ్చి వాఁడు మరల వచ్చి యడిగినప్పు డియ్యవచ్చునని పడకగదిలో మూలను బెట్టెను.

కొంతసేపటికి రాజశేఖరుఁడుగారువచ్చి భార్య రాజమహేంద్రవరమునుండి యుత్తరము వచ్చిన దని చెప్పి చేతికియ్యఁగానే దీపము వెలుతురునకుఁబోయి సగము చదివి చేతులు వడఁకఁగా జాబును క్రిందపడవైచి కన్నుల నీరు పెట్టుకొన నారంభించిరి. జాబులో నేమి విషయములున్నవో వినవలెనని చేరువను నిలువఁబడియున్న మాణిక్యాంబ మగనిచేష్టలు చూచి తొందరపడి యేమియు తోఁచక ఖేదపడియెద 'రేమని యడిగెను. ఆతఁడు గద్గదస్వరముతో మనరామమూర్తి విశూచి జాడ్యముచేత నిన్న మధ్యాహ్నము కాలముచేసినాఁ డని చెప్పెను. అంత వారిద్దరును గొంతసేపు విచారమును పొందిరి.

అనుజునాఁడు ప్రాతఃకాలముననే రాజశేఖరుఁడుగారు బయలుదేఱి శోభనాద్రిగారి యింటికిఁబోయి తన పినతండ్రి కొమారుఁడయిన రామమూర్తిగారి మరణమువలన సంభవించిన దురవస్థను జెప్పి ముహూర్త మశుచిదినములలో వచ్చుటచేత వివాహకార్యమునకు సంభవించిన యాలస్యమునకును నష్టమునకును కొంత చింతపడి పెండ్లికుమారునివారు తరలి రాకుండ వెంటనే వర్తమానము చేయుఁడని

కొనిరి. శోభనాద్రిరాజుగారును ఆయనను గొంచె మూరార్చి తత్క్షణమే పెద్దాపురమునకు మనుష్యుని బంపిరి. పిమ్మట రాజశేఖరుఁడుగారింటికిఁ బోయిరి.

తరువాత వచ్చిన యాదివారమునాఁడు రాజశేఖరుఁడుగారు భోజనముచేసి కూరలకావళ్లను కూలివాండ్రచేత మోపించుకొని వానిని విక్రయించివేయుట కయి పెద్దాపురము సంతకుఁ బోయి యొక యంగడి వానికి బేరమిచ్చి నిలువఁడిరి. ఆసమయమున నొక గృహస్థు తలగుడ్డ చుట్టుకొని నిలువుటంగీ తొడుగుకొని చేరవచ్చి "అన్నయ్యా! యీ మయిలబొట్టెక్కడిది ?" అని యడిగెను. రాజశేఖరుఁడుగా రాయన మొగమువంకఁ జూచి జిచ్చపడి మాటలాడక యూరకుండిరి. మరల నాపెద్దమనుష్యుఁడు "గంధముచుక్క పెట్టెవారు మనకు మైల యెక్కడనుండి వచ్చినది ? అని యడిగెను.

రాజ—మన రుక్మిణి పోయిన వర్తమానము నీకు తెలియఁజేసినాను గదా? మొన్న గురువారమునాఁడు సీతకు వివాహము నిశ్చయించుకొని పెండ్లి పనులన్నియుఁ దీర్చి సిద్ధముగా నుండఁగా బుధవారమునాఁడు రాత్రి యెవ్వఁడో మస్తారుఁడొకఁడు నేను లేనిసమయమున వచ్చి నీవు పోయినట్టు వ్రాసియున్న జాబు నొకదానిని మీవదినె చేతి కిచ్చి పోయినాఁడు.

రామ—ఎవ్వఁడో పెండ్లికార్యమునకు విఘ్నము కలిగింపవలెనని యీకుతంత్రమును చేసియుండును.

రాజ—గిట్టనివాఁడెవఁడో యీపన్నుగడ పన్నినాఁడు. ఇంటికి వచ్చి నీవదినగారిని సీతను చూచివత్తువు గాని రా.

రామ—నాకిప్పుడే రాజుగారితో మాటాడి మరల నిమిషముల మీఁద రాజమహేంద్రవరము వెళ్లవలసిన రాజకార్య మున్నది. సెల

దినములలో మరలవచ్చి మిమ్మందరను జూచి రెండుదినము లుండి పోయెదను.

అని చెప్పి రామమూర్తిగారు తన పనిమీఁద రాజసభకు వెళ్ళిపోయిరి. రాజశేఖరుఁడుగారును తిన్నఁగా భీమవరమునకు వచ్చి భార్యతో రామమూర్తిగారి వార్తను జెప్పి వివాహకార్యమునకు భంగము కలిగించిన దుర్మార్గుని బహువిధముల దూషింపఁజొచ్చిరి. అప్పుడు కూలివాఁడు దిగఁబెట్టి పోయిన కట్టును తీసికొని సీత తండ్రికిఁ జూపెను. దాని నాతఁ డానవాలుపట్టిఁ, చేతఁ బట్టుకొని చూచి, నాడు రామరాజు చూపిన కత్తికట్టు యిదియేనని భార్యతోఁ జెప్పెను. వారిరువురును ఆలోచించుకొని నిశ్చయముగా నీయుత్తరమును తెచ్చినవాఁడు రామరాజేకాని మఱియొకఁడు కాఁడని దృఢపఱుచుకొనిరి.

రాజ—రామరాజు మనవలన నుపకారమును పొందినవాఁడే? యిట్లేలచేసెనో?

మాణి—నాఁటి రాత్రి మన యందరిప్రాణములను గాపాడి మన కెంతో ప్రత్యుపకారమును చూపినాఁడు. ఆతఁ డీయపకారము తలఁచుకొనుటకు నాకేమియు కారణము నూహించుటకు తోఁచకున్నది.

రాజ—మన శత్రువులవద్ద ధనము పుచ్చుకొని యీదుర్మార్గమున కొడికట్టి యుండవచ్చును. సొమ్ము ప్రాణమువంటి మిత్రుల నయినను పగవారినిగాఁ జేయునుగదా?

మాణి—నేఁటి కాలమునకు ధనాశ యాతని కీదుర్బుద్ధిని పుట్టించెనుగాఁబోలును. అదిగో రామరాజును వచ్చుచున్నాఁడు. ఆతని నడిగిన సమస్తమును తేటపడును.

రాజ—ఏమయ్యా! రామరాజుగారూ! మావలన మహోపకారమును పొందియు మాకార్యవిఘాతము చేయుటకు మీకు ధర్మమా?

రాము — మీకు నేనేమి కార్యవిఘాతము చేసినాను ?

రాజ — రామమూర్తి పోయినట్టు జాబు సృష్టించి నాయింట శేషప్పకు మావాండ్ర కిచ్చినావా లేదా ?

రాము — నేను మీయింటి మొగము గూడను చూచి యెఱుఁగను. ఇట్టి వంటి లేనిపోనిమాటల నామీఁద నారోపించిన, మీకుఁగూడ మాటలు చిక్కుగా జరుగనున్నవి.

రాజ — మీరు మాయింటిమొగము చూచి యెఱుఁగకుండిన, మీచేతి కఱ్ఱ యిది యిక్కడ కేలాగు వచ్చినది ?

రాము — అయిదారు దినములనుండి నాచేతికఱ్ఱను గానక దాని నిమిత్తమె సకలప్రయత్నములును జేయుచున్నాను. సరిసరి తెలిసినది. మీరాకఱ్ఱ నెత్తుకొనివచ్చి దానిని తప్పించుకొనుటకయి యెవరు నామీఁదను దోషారోపణము చేయుచున్నారా ? మీరేమో యింతవరకును యోగ్యులనుకొనుచున్నాను.

రాజ — నావద్ద నీవేమి యయోగ్యతను కనిపెట్టినావు ? ఇఁక ముందు నీవెప్పుడును మాయిల్లు త్రొక్కి చూడవద్దు.

రాము — నీవు నీవనఁబోకు నీయింటిత్రోలి యెవరికిఁ గావలెను ?

అని చివాలున లేచి రామరాజు వెళ్ళిపోయెను. అతని వెనుకనే బయలుదేరి రాజశేఖరుఁడుగారు శోభనాద్రిరాజుగారి యింటికిఁ బోయి, జరిగిన యావద్వృత్తాంతమును వినిపించి; మరల ముహూర్తము పెట్టుటకయి సిద్ధాంతిని పిలిపించవలెనని చెప్పిరి.

శోభ — మీలోపల ముహూర్తము పెట్టిననాఁటి రాత్రియే సిద్ధాంతికి జ్వరము తగిలి, వ్యాధి ప్రబలమయి జీవితాశ పోయినందున మంగళవారమునాఁడు మధ్యాహ్నమున ఆయనను భూశయనము చేసినారు. అప్పుడాయన బంధువు లందఱును జేరి చదువుకొన్న బ్రాహ్మ

ణుల కిటువంటిచావు యోగ్యమయినదికాదని యాతురసన్యాస మిప్పించి నారు. ఆరాత్రి నుండియు రోగము తిరిగి యిప్పుడు కొంతవ్యాధి కుదిరియే యున్నాఁడట. మీరిప్పుడే పోయి యీమాసములో వివాహ ముహూర్తి మెప్పుడున్నదో విచారించి రండి.

రాజ—చిత్తము. సెలవు పుచ్చుకొనెదను.

అని లేచి శీఘ్రముగా సుబ్బారాయుడు సిద్ధాంతిగారి యింటికిఁ బోయి చావడిలో పీటలమీఁద గోడకుఁ జేరగిలఁబడి కూరుచుండియున్న యాయనకు నమస్కరించి, దేహము స్వస్థముగా నున్నదాయని రాజ శేఖరుడుగారు కుశలప్రశ్నము చేసిరి.

సుబ్బ—కొంతవఱకు నెమ్మదిగా నున్నది. నారోగము ప్రబల ముగానుండి నేను తెలివితప్పి యున్నయప్పుడు, నాసొత్తు నపహరింప వలెనని నాజ్ఞాతు లందఱును జేరి నాకు సన్యాస మిప్పించినారు. నా రెండవ పెండ్లి భార్య కాపురమునకువచ్చి మూఁడునెల లయినది. దానితో పట్టుమని యొకసంవత్సరమైన సౌఖ్య మనుభవింపలేదు. నా దేహము బలపడఁగానే యింట సహిత ముండనీయక నన్ను తఱిమి వేయుదురు.

రాజ—జరిగిపోయినదానికి విచారించిన ఫలమేమి? మీరిఁక సంసారసుఖములను మఱచి, మీరున్న యాశ్రమమునకు ముఖ్యముగా గావలసిన ప్రణవమును జపించుకొనుచు ముక్తిమార్గమును జూచుకొండి.

సుబ్బ—నేనిప్పుడు సర్వసంగములను విడిచియున్నాను. నేను మీకుఁ జేసిన యపకారమును మఱచి నన్ను మన్నింపవలెను.

రాజ—మీరు నాకేమి యపకారము చేసినారు?

సుబ్బ—చేసినపాపము చెప్పినఁ బోవునని పెద్దలు చెప్పుదురు. మీరు మొన్న సీతనిచ్చి వివాహముచేసి నతఁడు ధనవంతుఁడుకాఁడు.

ఆతఁడు శోభనాద్రి రాజుగారికి ముండలను తార్చువాఁడు. అతఁడు ధరించిన వస్త్రములు, మురుగులు మొదలగునవి రాజుగారివే. రాజుగారీయంత్రమును పన్ని నన్ను మీదగ్గరకు బంపిన నేనువచ్చి కార్యసంఘటనము చేసినాను. ఇంతకును దైవసంకల్ప మట్లున్నది కాఁబట్టి కార్యము జరిగిపోయినది. మీరన్నట్లు జరిగిపోయినదానికి విచారించినఫలము లేదు.

రాజ—శోభనాద్రిరా జంతటి దుర్మార్గుఁడా? అతని సంగతి నేను మొదట దర్శనమునకు వెళ్ళినప్పుడే తెలిసినది. ఈకపటము తెలియక రూపాయలు చేతిలోఁ బెట్టినప్పుడు నామీఁది యనుగ్రహము చేతనే యిచ్చుచున్నాఁ డనుకొన్నాను. రామరాజు ధర్మాత్ముఁ డని వివాహము కాకపోఁబట్టి సరిపోయినది కాని, లేకపోయినయెడల, నిష్కారణముగా పిల్లదానిగొంతుక కోసినవార మగుదుమే.

సుబ్బ—వివాహము కాలేదని మేలువార్త విన్నాను. నిశ్చయమైనకార్య మెట్లు తప్పిపోయినది.

రాజ—మాజ్ఞాతియొకఁడు కాలము చేసినట్లు మయిలవర్తమానము వచ్చినందున మీరు పెట్టిన లగ్నమున శుభకార్యము కాలేదు. మరల క్రొత్తముహూర్తమును పెట్టించుకొని రమ్మనియే యాదుర్మార్గుఁడిప్పుడు నన్ను మీవద్దకుఁ బంపినాఁడు.

సుబ్బ—ఆపాపకర్ముని మాఁట యిఁక నాతోఁ జెప్పకుఁడు. ఆపాపాత్ముని ప్రేరణమువలన మీయింట ముహూర్తము పెట్టిన వాఁడే నాకు రోగ మారంభమైనది. కాఁబట్టి మీయెడలచేసిన మోసమునకు శిక్షగా భగవంతుఁడు నాకీయాపదను దెచ్చిపెట్టినాఁడనుకొని వివాహముకాక మునుపు రోగము కుదిరెనా మీతో నిజముచెప్పి వేసి పాపపరిహారము పొందవలెనని కోటివేల్పులకు మ్రొక్కుకొన్నాను. ఆలాగునను కుదిరినదికాదు. అటుతరువాత "వారిజాక్షులందు! వైవాహిక

ములందుఁ । బ్రాణవిత్తమానభంగమందుఁ । జకితగోకులాగ్రజన్మరక్షణ మందు । బొంకవచ్చు నఘము పొందదధిప." అను శుక్రనీతిని దలఁచుకొని వివాహకార్యమునకై కల్లలాడితిని గదాయని కొంతమనస్సమాధానము చేసికొన్నాను. ఈనీతిని బట్టియే యెవ్వరును మీతోఁ బద్మరాజు విషయమై ప్రస్తావించినవారు కారు.

రాజ——ఇప్పుడేపోయి యీసంగతి శోభనాద్రిరాజు నడిగి యన వలసిన నాలుగు మాటలును మొగముమీఁదనే యనివేసి వచ్చెదను.

అని వెంటనే పోయి శోభనాద్రిరాజు వీధిగుమ్మములో నిలుచుండియుండఁగా జూచి "మీరేమో గొప్పవారనుకొని మీమాటల నమ్మి మోసపోయినాను. మీతో నింతకాలము స్నేహముచేసినందుకు, నాకొమార్తెను నిర్భాగ్యునకిచ్చి వివాహము చేయించు కొఱకా ప్రయత్నము చేసినారు? అని నిర్భయముగాఁ బలికి రాజశేఖరుఁడుగారు వెనుకకు మరలిరి. శోభనాద్రిరాజు మరలఁ బిలిచి "మావద్దఁ బుచ్చుకొన్న రూపాయలనిచ్చి మఱిపొమ్ము" అని నిలువఁ బెట్టెను. మీరిచ్చిన రూపాయలును నాయొద్దనున్న రూపాయలునుకూడఁ గలిపి వానితో వివాహమునకు వలయువస్తువులనెల్ల కొన్నాను. ఇప్పుడు నాయొద్ద రొక్కములేదు; చేతిలోనున్నప్పు డిచ్చెదను." అని వెళ్లిపోవుచుండఁగా, శోభనాద్రిరాజు తనభటులచేత రాజశేఖరుఁడు గారిని పట్టి తెప్పించి చెఱసాలలో బెట్టించెను. ఆసంగతి మాణిక్యాంబకు దెలిసినది మొదలు కొని పెనిమిటికి సంభవించిన యాపదను దలఁచుకొని నిద్రాహారములు మాని సదా యీశ్వరధ్యానము చేయుచు లోలోపల దుఃఖించి కృశించుచుండెను.

ఈసంగతి జరిగిన మూఁడవనాఁడు సూర్యోదయమయిన తరువాత సీత వీధిగుమ్మములో నిలుచుండఁగా నెవ్వరో యిద్దరు మను

ష్యులువచ్చి, “మీయన్నగారు పిఠాపురమునుండివచ్చి యావలివీధిని కరణముగారి యింటిలోఁ గూరుచుండి నిన్నక్కడకు దీసికొని రమ్మన్నాఁడు” అని చెప్పి సీతను దీసికొనిపోయి యూరిబయనుండి యెత్తుకొని పాఱిపోయిరి. ఈదుఃఖవార్త మాణిక్యాంబకుఁ దెలిసినతోడనే యామె భూమిమీఁదపడి మూర్ఛపోయి కొంతసేపటికి తెలిసి పెనిమిటి యొక్క వియోగమునకుఁ బుత్రికాశోకము తోడుపడ నెవ్వరెన్నివిధముల జెప్పినను మానక కన్నీరు కాలువలుగట్ట విలపించుచుండెను.

పదునొకండవ ప్రకరణము

సుబ్రహ్మణ్యము పిఠాపురము ప్రవేశించుట - ఒక మిత్రుఁడు కనఁబడి యింటికిఁ గొనిపోయి యాదరించుట - నీలాద్రిరాజుచర్య - రాజుగారి ధనము పోవుట - అంజనము వేయుట - పోయినధనము నీలాద్రిరాజు దొడ్డిలో మఱికొంత సొమ్ముతోఁ గూడ దొరకుట.

తల్లిదండ్రులను వీడ్కొని బయలుదేఱిననాఁడు సుబ్రహ్మణ్యము త్రోవదప్పి యెచ్చటికోపోయి తుద కసలసంజవేళ పిఠాపురముచేరెను. అప్పుడు కొందఱు కష్టాత్ము లొకచోటఁ గూరుచుండి యాతని వాలకమును జూచి తమలోఁ దామాలోచించుకొని "యీతఁడు పల్లెటూరివాఁడుగా గనఁబడుచున్నాఁడు. ఈతని బెదరించి మన మేమయిన పుచ్చుకొందము" అని నిశ్చయము చేసికొనిరి. వెంటనే యాగుంపులో నుండి రాజభటుఁ డొకఁడు పైకి వచ్చి ముందుకు నడిచి సుబ్రహ్మణ్యము వచ్చు మార్గమున కడ్డముగా నిలిచి గంభీరధ్వనితో "ఆవచ్చెడు వా రెవరు ?" అని అడిగెదను.

సుబ్ర—నేను బ్రాహ్మణుఁడను. భీమవరమునుండి వచ్చుచున్నాను.

భటు—ఇంత చీఁకటి పడిన తరువాత వచ్చుటకు కారణమేమి ?

సుబ్ర—నిన్నఁగా బయలుదేఱినది మొదలుకొని నడచివచ్చిన మొదల ప్రొద్దుండగానే యూరు చేరియుందును గాని, దారితప్పి పెడదారినిపడి వచ్చినందున నింత యాలస్య మయినది.

భటు—ఈగ్రామములో నీకు బంధువు లెవరున్నారు ?

సుబ్ర—ఎవ్వరును బంధువులు లేరు. రాజుగారి నాశ్రయించి పని సంపాదించుకో వలె నని వచ్చినాను.

భటు—నీ భుజము మీఁది మూట యెవరిది ?

సుబ్ర—నాదే. మఱియొకరిమాట నాయొద్ద కెందుకువచ్చును?

భటు—నీది కాదు. నీవనుమానపు మనుష్యుఁడవుగాఁ గనఁబడుచున్నావు. నిన్ను నే నిప్పుడు వదలిపెట్టను. తిన్నఁగా ఠాణాకు నడువు.

సుబ్ర—నేను దొంగనుకాను. చిన్నప్పటినుండియు నింతప్రతిష్ఠతో బ్రతికినవాఁడను. నన్ను విడిచి పెట్టు.

భటు—చీఁకటి పడ్డతరువాత గ్రామమునకు వచ్చిన వారిని విడిచిపెట్టఁగూడదని మారాజుగారి యాజ్ఞ. విడిచిపెట్టెడు పక్షమున నాకేమిచ్చెదవు?

సుబ్ర—నాలు గణా లిచ్చెదను నన్ను విడిచిపెట్టు.

భటు—నాలుగురూపాయలకు తక్కువవల్లపడదు. నీవుచూడఁబోయిన దొంగవుగాఁ గనఁ బడుచున్నావు. మూఁట నక్కడ పెట్టు. పెట్టకపోయిన నిన్నేమి చేసెదనో చూడు.

ఆవరకు బాహ్యభూమికి వెళ్ళి తిరిగివచ్చుచున్న యొకపురుషుఁ డింతలో నామార్గముననే యింటికిఁ బోవుచు, ఆసందడి విని యచట నిలుచుండి "ఏమా మనుష్యుని నల్లుఁ తొందరపెట్టుచున్నారు?" అని యడిగెను.

సుబ్ర—చూచినారా యీమనుష్యుఁడు నాలుగురూపాయ లిచ్చినం గాని నన్ను పోనియ్య నని నిర్బంధపెట్టుచున్నాఁడు.

పురు—సుబ్రహ్మణ్యమా? నీవా! కంఠస్వరమునుబట్టి యానవాలు పట్టినాను. ఇక్కడి కొక్కఁడవును రాత్రివేళ నెందుకు వచ్చినావు? ఇంటికడనుండి చెప్పకుండ పాఱిపోయి రాలేదు గదా? ఇంటికి రా పోదము?

సుబ్ర—ఉమాపతిగారా? మీ రిక్కడ నున్నారేమి? మీ

రింకొక నిమిషము రాకపోయినయెడల, వాఁడు బెదరించి నాయొద్ద నేమైన గాఁజేయునుజుండీ.

ఉమా — ఏఁడీ నిన్ను తొందరపఱిచినవాఁడెవ్వఁడు ?

సుబ — మనము మాటలాడుచుండుట చూచి మెల్లమెల్లఁగా జాఱి దూరమునుండి పారిపోవుచున్నాఁడు.

ఉమా — పోనీ. వానిసంగతి రేపు విచారించి కనుగొందము.

అని మాటలాడుకొనుచు వా రిద్దఱును గలిసి యింటివంక నడచిరి. ఇల్లు చేరులోపల సుబ్రహ్మణ్యము తనతండ్రికిని కుటుంబమునకును నాఁటివఱకు సంభవించిన విపత్తులును ప్రస్తుతపు స్థితియు తా నక్కడకు వచ్చిన కారణము చెప్పెను. అది విని యుమాపతిగారు మిక్కిలి వ్యసనపడి తాను చిన్నతనములో రాజశేఖరుఁడుగారి వద్దఁ జదువుకొన్నప్పు డున్న యైశ్వర్యమంతయు బోయి యింతలో నింత బీదతనము సంభవించి నందున కాశ్చర్యపడి తనకు విద్యాదానముచేసిన గురువు విషయమై శక్తివంచనలేక ప్రయత్నముచేసి చేతనయిన యుపకారమును జేయవలెనని మనసులో నిశ్చయించుకొనెను. కాఁబట్టి సుబ్రహ్మణ్యమును పలువిధముల నాదరించి, తాను పిఠాపురపు రాజుగారియొద్ద నిరువదిరూపాయల యుద్యోగములోనున్న సంగతిని జెప్పి, అతనికింత యనుకూలమైనపని చేయించుటకై రాజుగారియొద్దఁ బ్రయత్నము చేసెదననియు పనిదొరకెనఁదాక తనయింటనే యుండవలసినదనియుఁ జెప్పెను. ఆప్రకారముగా ప్రతిదినమును సుబ్రహ్మణ్యము భోజనముచేసి యుమాపతిగారితోడఁ గూడ రాజసభకుఁ బోవుచుండెను. పీఠికాపురాధీశ్వరుఁడయిన విజయరామరాజుగా రొకనాఁ డాతనిజూచి, యీయన యెవ్వరని యుమాపతిగారి నడుగఁగా, ఆయన వారి స్థితిగతులను మొదటనుండియుఁ జెప్పి 'తమ యాస్థానములో నేదియయిన నొక యుద్యోగ మీతని కిప్పింపవలయు' నని మనవిచేసెను.

ఉమాపతిగారి యింటనుండి రాజుగారికోటకుఁ బోవుమార్గములో నొకగొప్ప మేడయుండెను. ఆమేడ నద్దెకుఁ బుచ్చుకొని నెలదినముల నుండి యందులో నొకరాజుగారు తనసేవకులతోఁ గూడ కాపురముండి రెండుమూడు దినముల క్రిందట బ్రాహ్మణసంతర్పణ మొకటి చేసెను. సొమ్ము లేకుండ వచ్చినప్పుడు పుష్కలముగా భుజించుట యెల్లవారికిని సహజగుణమే కాఁబట్టి, ఆయూరి బ్రాహ్మణోత్తములును నిత్యము నింటికడ ఘృతము సభిఘరించుకొనువారే యయ్యును నాఁడుమాత్రము చేరల కొలఁది నేయి త్రాగిరి. ఆసంతర్పణమువలన రాజుగారికీర్తి గ్రామ మంతటను వ్యాపించెను. కాఁబట్టి ప్రతిదినమును పలువురువచ్చి యాయ నను నాశ్రయించి పోవుచుండిరి. ఆయన పేరు నీలాద్రిరాజుగారు ఒక నాఁడు నీలాద్రిరాజుగారు భోజనముచేసి వీధి యరుగుమీఁద పచారు చేయుచు నిలువఁబడి, ఆత్రోవను రాజసభకుఁ బోవుచున్న సుబ్రహ్మణ్యా మును దూరమునుండిచూచి 'మాట' యని చేసైఁగచేసి పిలిచెను.

నీలా—పూర్వము మిమ్మెక్కడనో చూచినట్టున్నది. మీకాపు రపుగ్రామ మేది?

సుబ్ర—నాజన్మభూమి ధవళేశ్వరము, మాయింటిపేరు గోటేటి వారు; నాపేరు సుబ్రహ్మణ్యము.

నీలా—అవును జ్ఞప్తికి వచ్చినది. మీరు రాజశేఖరుఁడుగారి కొమాళ్ళుకారా? ఇప్పుడాయన యెక్కడ నున్నారు?

సుబ్ర—ఇక్కడనే భీమవరములో నున్నారు. మీరాయన నెక్కడ నెఱుఁగుదురు?

నీలా—ధవళేశ్వరములోనే చూచినాము. మేము సంవత్సరము క్రిందట యాత్రార్థమై బయలుదేఱి పదిదినములు ధవళేశ్వరములోనుండి గౌతమీస్నానమును చేసికొని, కోటిఫలి మొదలగు పుణ్యక్షేత్రములను

సేవించుకొని, మానసముక్రిందట పాదగయను దర్శించుటకయి వచ్చి యప్పటినుండియు నిక్కడనే యున్నాము. మీతండ్రిగారికి మాయెడల గురుభావము. మేమక్కడనున్న దినములలో మీతండ్రిగా రెప్పుడును మాయొద్దనే యుండెడివారు.

సుబ్ర—సంవత్సరము క్రిందట మిమ్ముఁ జూచినట్లు నాకు జ్ఞాపకము లేదు. మీరెక్కడ బసచేసినారు ?

నీలా—మీకు జ్ఞాపకము లేదుగాని మాకు చక్కగా జ్ఞాపకమున్నది. మీకిద్దఱు చెల్లెండ్రుండవలెను వారు బాగున్నారా ?

సుబ్ర—పెద్దచెల్లెలు రుక్మిణి చనిపోయినది. చిన్నచెల్లెలు బాగున్నది.

నీలా—మీరు నాసంగతి బాగుగ నెఱుఁగరు. విజయనగరపు రాజుగారు మా మేనమామకుమాళ్లు మొగలితుఱ్ఱురాజుగారి కిచ్చినది మాసవతి మేనకోడలు.

సుబ్ర—నేనిప్పుడు సభకుఁబోవుచున్నాను. మఱియొకప్పుడు సావకాశముగా దర్శనముచేసికొని మాటాడెదను ఇప్పటికి సెల విచ్చెదరా ?

అని సెలవుపుచ్చుకొని సుబ్రహ్మణ్యము రాజుగారి కొ కూటమునకుఁ బోయెను. అతఁడు ప్రతిదినమును తప్పక సభను బోవుచు, ఉద్యోగస్థులతో నెల్ల స్నేహముచేసి, అన్నివిధముల పనులను నేర్చుకొనెను. అక్కడి కొలువుదుకాండ్రెందఱును ఏకాగితము వ్రాయవలసి వచ్చినను సుబ్రహ్మణ్యమునే పిలిచి వ్రాయించుచుందురు. ఏలెక్క కట్టవలసివచ్చినను సుబ్రహ్మణ్యము చేతనే కట్టించుచుందురు. అందుచేత నతనికిజీతమేమియు లేకపోయినను జీతగాండ్రకంటెపనిమాత్ర మెక్కువ గలిగి యుండెను. ఈప్రకారముగా నంద

కేకని దయవచ్చునట్లుగా నెవ్వరేపని చెప్పినను జేయుచు వచ్చినందున హారండరులను గలసి 'యీచిన్నవాఁడు బహుకాలమునుండి యాశ్రయించి సంస్థానము కనిపెట్టియున్నాఁడ'ని రాజుగారితో మనవి చేసిరి. దానిమీఁద రాజుగారు సమయము వచ్చినప్పు డుద్యోగమును జెప్పించెద మనియు, అందాక దివాణమును కనిపెట్టుకొని యుండవలసిన దనియు సెలవిచ్చిరి. ఈలోపల సుబ్రహ్మణ్యా మొకనాఁడు వెళ్ళి మరల నీలాద్రిరాజుగారి దర్శనము చేసెను.

నీలా—ఏమయ్యా? సుబ్రహ్మణ్యముగారూ! గ్రామములో విశేషము లేమి?

సుబ్ర—వింతలేమియు లేవు. ఉద్యోగమున కయి రాజుగారి ననుసరించు చున్నాను. ఇంకను పని కలిసి రాలేదు.

నీలా—మీకింత యనుసరించుట యెందుకు? దూరదేశము నకు వెళ్ళగలరా? నిముషములో విజయనగరపు మహారాజుగారివద్ద గొప్పపని చెప్పించెదము. ఆయన మాకుఁ బినతల్లి కొమారుఁడు.

ఈకడపటివాక్యము పూర్వము మేనమామ కొమారుఁడని చెప్పినదానికి విరుద్ధముగా నున్నందున, ఆతఁ డబద్ధ మాడుచున్నాఁడని తనలో ననుకొనియు చెప్పినమాట మంచిదిగనుక కొంచెము సంతోషించి సుబ్రహ్మణ్యము మారువలుక కూరకుండెను.

నీలా—అనుమానించుచున్నా రేమి? మీతోడు. మీకుతప్పక గొప్పయుద్యోగము నిప్పించెదము. కాళహస్తి రాజుగారయిన రామవర్మగారికిని మాకును నత్యంతమైత్రి; చిన్నప్పుడు వారును మేమును నొక్కబండిలో నెక్కినాము. ఈసంగతి పరమరహస్యము. ఎవ్వరితోను జెప్పవద్దు.

సుబ్ర—చిత్తము. ఇక్కడ పని కలిసిరానియెడల నవశ్యముగా వెళ్ళెదను.

నీలా—మీకింకొక రహస్యము చెప్పెదను. బాల్యములో మేమును గాళహస్తిరాజుగారునుకలిసి జూదమాడెడివారము. ఆయన సంగతి మన కెందుకుఁగాని, అప్పుడాయన భోగముదాని నుంచుకొన్నాఁడు సుమా.

సుబ్ర—తమరు ప్రొద్దునసే యతితలుధరించినారు. పార్థివము చేయుచున్నారా?

నీలా—పూర్వము పార్థివము చేయుచుంటిమి కాని యిప్పుడు శివపూజమాత్రము చేయుచున్నాము. మీరాజుగారుకూడ శివపూజా ధురంధరులఁట కాదా? అందుచేతనే వారికి విశేషైశ్వర్యము కలిగి యున్నదని విన్నాము.

సుబ్ర—అవును. వారు శ్రీమంతులనియే నేను విన్నాను.

నీలా—మీరాజుగారివద్ద రొక్క మేమాత్ర మున్నదని చెప్పుకొనుచున్నారు.

సుబ్ర—పదిలక్షలకు తక్కువ లేదని వాడుక.

నీలా—అది యంతయుఁ గోటలోనేగదా యుండును?

సుబ్ర—కోటలోనే యుండును. అక్కడ చిరకాలమునుండి నమ్మకముగాఁ బనిచేయుచున్న ముసలిబంట్లు కావలియుందురు.

నీలా—విజయనగరపుమహారాజుగారు క్రొత్తగా నొకకోటను గట్టఁదలఁచి, మేము చూచినపట్టణములలోనున్న కోటలపటములను వ్రాయించి తీసికొని రండని మఱిమఱి చెప్పినారు. మొన్ననే పెద్దాపురపుకోట పటమును దెప్పించినాము. మీరీ కోటపటమును కూడా వ్రాసి యియ్యఁగలరా?

సుబ్ర—చిత్తము కాగితము కలమును దెప్పింపుఁడు; ఇప్పుడే వ్రాసి యిచ్చెదను.

అని, కాగితమును కలమును సిరాబుడ్డియు దెప్పించినమీఁదట తాను జూచినదంతయు జ్ఞాపకమును బట్టి పటమును వ్రాసి నీలాద్రి రాజుగారిచేతి కిచ్చెను. ఆయన దానిని జూచుకొని యాయాస్థలముల యుపయోగములను గుఱించియు పనియొక్క గట్టితనమునుగూర్చియు ప్రశ్నలు వేయఁజొచ్చెను. సుబ్రహ్మణ్యమును దనకుఁ దెలిసినంతవఱకు సదుత్తరములను జెప్పుచు వచ్చెను.

నీలా—ఉత్తరపువైపున వీధిప్రక్క నున్న దేకాదా ధనాగారము?

సుబ్ర—అవును.

నీలా—అంతయు బాగుగనున్నది కాని కోటగోడ యెత్తెంత పెట్టినారు?

సుబ్ర—సుమారు పండ్రెండడుగు లుండవచ్చును.

నీలా—మన మీకోటపటము వ్రాసికొన్న సంగతి యెవ్వరికిని దెలియనీయక రహస్యముగా నుంచవలెను. రాజులకు తమ కోట వంటిది మఱియొకటి యుండుట కిష్టముండదు.

అని చెప్పి, లోపలనుండి తమలపాకులును పోకచెక్కలును పళ్లెముతోఁ దెప్పించి తాంబూల మిచ్చి, కోట కట్టించునప్పు డీపటమువ్రాసియిచ్చినది మీరే యని రాజుగారితోఁ జెప్పెదము సుండీ యని పంపివేసెను. సుబ్రహ్మణ్యమామాటలకు సంతోషించి సెలవు పుచ్చుకొని, తన కొకవేళ గొప్పయుద్యోగ మగునేమోయను నాశతో పరిపరివిధముల నాలోచించుకొనుచు మెల్లగా నింటికి వచ్చెను.

తరువాత నాలుగుదినముల కొకనాఁడు ప్రభాతసమయముననే రాజుగారియింట దొంగలుపడి ధనాలయములోని నగలును రొక్కమును దోచుకొనిపోయినారని యూరనొక కింవదంతి కలిగెను. పిమ్మట

గొంతసేపటికి రాజభటులు సందడి చేయుచు నూర నలుప్రక్కలను దిరిగి, తమకు విరోధులుగా నున్నవారి నందఱిని పట్టుకొని ఠాణా కీడ్చుకొనిపోవ మొదలు పెట్టిరి; అక్కడ నున్నవారు వాండ్రను కొట్లలోఁ బెట్టి నేరము నొప్పుకొండని పలువిధములఁగొట్టి బాధింపఁ జొచ్చిరి; కాని వారు నిరపరాధుల నెందఱిని పట్టుకొని బాధపెట్టినను, నిజమయిన దొంగలను మాత్రము కనిపెట్టలేకపోయిరి. ఉత్తరపు దిక్కున కోటగోడకు నిచ్చెనవేసికొని దొంగలు లోపల బ్రవేశించి నట్లు అడుగులు జాడ కనఁబడుచుండెను; గచ్చుతో కట్టిన ధనమున్న గదియొక్క రాతిగోడ చిన్నతలు పెత్తుటకు తగినంత పాణిద్వారమొకటి కొట్టఁబడియుండెను. ఆ ద్వారమును త్రవ్వుటకు బలమయిన పనివాండ్రు ముగ్గురు పూనుకొన్నచో నర్ధపక్షము రెండుజాముల సేపయినను పట్టును. రాత్రి యంతసేపు మేలుకొని పనిచేయుటకు దొంగలనిద్ర యేమయిపోయినదా యని విచారింపవలసిన యక్కఱలేదు. వారినిద్ర యంతయు ద్విగుణముగా వచ్చి కావలివాండ్ర నాశ్రయించినది. కొట్టు లోపల రూపాయలసంచులు చప్పుడైనప్పుడు ధనలక్ష్మి మూలుగు చున్నదని జడిసికొని కావలియున్నవారు భద్రమైన గదిలో దూఱి తలుపు వేసికొని ప్రాణములను కాపాడుకొనిరనియు గ్రామములో నొక ప్రవాదము పుట్టినది. ఇదెంతనిజమో యీశ్వరునకుఁ దెలియును. ఏది యెట్లయినను ధనలక్ష్మిమాత్ర మారాత్రి నరవాహనారూఢురాలయి నూతనద్వారమున కోటవిడిచి వెళ్ళిపోయిన మాటమాత్రము వాస్తవము. ఎన్నివిధముల ప్రయత్నముచేసినను రాజకీయభటులకు దొంగల జాడ యెక్కడను గానరానందున, విసిగి తుదకు వారు తమ నాయకుని కడకువచ్చి తాముపడ్డ ప్రయాసమునంతను జెప్పుకొనిరి. అందుమీఁద నాతఁడు చేయవలసినపనియేమియు తోఁచక కొంతసేపాలోచించి, దొంగ

లను పట్టుకొని పోయిన సొమ్ము తెప్పింపలేక పోయినయెడల రాజుగారి వలన మాటవచ్చును గాఁబట్టి రాజకీయనియోగులలో నొకరిమీఁద పెట్టనిశ్చయించి, వారినందఱిని వేఱువేఱ పేర్కొని యెవరిమీఁద బెట్టిన నెవరికి కోపమువచ్చునో యని జడిసి, వారిలో లోకువ యైనవారి మీఁదికి త్రోయనెంచి, యీపని తానుచేయుట యుచితముకాదని యింటికిపోయి మాటాడి యంజనము వేయువారి నొకనిని పిలుచుకొని జాములోపల మరల వచ్చెను.

నాయ—ఏమోయి భీమన్నా! రాత్రి రాజుగారియింట ధనము పోయినది. నీ వా ధన మపహరించినవానిని చెప్పఁగలిగిన యెడల, నీకు గొప్ప బహుమతి దొరకఁగలదు.

భీమ—అదెంతసేపు? సొమ్ము తెప్పించుకొఁగలిగినయెడల, అంజనము వేసి నిమిషములో పేరు చెప్పించెదను.

నాయ—అంజన మిప్పుడు నీయొద్ద సిద్ధముగా నున్నదా?

భీమ—ఉన్నది. అది పిల్లికన్నులవానికేగాని పాఱదు. అటు వంటివాని నెవ్వని నైనను పిలిపించవలెను.

నాయకుఁ డామాటలు విని యొక భటుని బిలిచి, "నీవు పోయి చాకలి సామిగానిని తీసుకొనిరా. వానివి పిల్లికన్నులు" అని నియమించెను. వాఁడు వెంటనేపోయి రెండుగడియలసేపునకు సామిగానిని వెంటఁబెట్టుకొని వచ్చెను. ఈలోపల నంజనము వేయువాఁడు దాసిగాని చేత గది నొకదానిని నలికించి, అందొకమూలను నూనెతో గొప్ప దీపమును వెలిఁగించి తాను స్నానముచేసి వచ్చి దీపము ముందట పిండి ముగ్గుతో నొకపట్టు పెట్టి అం దాంజనేయ విగ్రహమును కాటుక కరాటమును ఉంచి పూజ చేయుచుండెను. చాకలివాఁడు వచ్చినతోడనే యాతఁడు తనపూజను చాలించి, పట్టులో వానిని కూరుచుండఁబెట్టి

బరిణలోని కాటుకను వాని కుడిచేతిలో రాచి దానిని నిదానించి చూచి దానిలో నేమికనఁబడునో దానినెల్ల తనకుఁ జెప్పుచుండుమని యుత్తరువు చేసెను.

భీమ—చేయి దీపము దగ్గఱగాఁ బెట్టి దానికేసి ఱెప్పవాల్పక చూడు. నీకిప్పు డేమయినఁ గనఁబడుచున్నదా ?

సామి—లేదు. కాటుకమాత్రము కనఁబడుచున్నది.

భీమ—చూపు చెదరనీయకు. ఇప్పు డేమయినఁ గనఁబడు చున్నదా ?

సామి—కనఁబడుచున్నది. పెద్ద బంగారపురేకువలె నున్నది.

భీమ—ఆ రేకునడుమ నేమయిన నున్నదా ?

సామి—అవిసిచెట్టున్నది.

భీమ—అవిసిచెట్టుకా దశోకవృక్షము. ఆ చెట్టుకొమ్మలలో నెవ రున్నారో చూడు.

సామి—పెద్ద కోఁతియున్నది.

భీమ—కోఁతి యనఁబోకు. ఆంజనేయులవారను. నీమనసులో నమస్కారముచేసి యేమిచెప్పునో తెలిసికో.

సామి—ఏమో పెదవులు కదల్చుచున్నాఁడు ఆమాటలు నాకుఁ దెలియవు.

భీమ—రాజుగారిసొమ్మెవ్వ రెత్తుకొనిపోయినారో యడుగు.

సామి—రాజుగారివద్ద కొలువున్నవారిలోనే యొకరు తీసినా రనుచున్నాఁడు.

భీమ—వారియింటిపే రడుగు.

సామి—గోటివారు.

భీమ—పేరుకూడ చెప్పుమను.

సామి—సుబ్బమ్మ.

భీమ—సుబ్రహ్మణ్యమా ? గోటేటి సుబ్రహ్మణ్యము.

సామి—ఇందాక నీ వాలాగునఁ జెప్పలేదు.

భీమ—నీ వాంజనేయులవారితోనా మాటాడుచున్నావు? ఆంజనేయు లిందాక నాలాగునఁ జెప్పలేదనుచున్నావా? ఆయన యాలాగుననే చెప్పినాఁడు. నీవే పేరు నోటఁబట్టలేక తప్పుపలికినావు చాలు ఈపాటికి లే. ఇంక మాటాడకు.

అని యాతఁడు సామిగానిని తనవెనుకకుఁ దీసికొని, సొమ్ము తీసినవాని పేరు బయలఁబడ్డదని కేకలు వేసి చెప్ప నారంభించెను. భటుల నాయకుఁడును 'ఈదొంగతనము మఱియొకఱివలన జరిగినది కా' దని యీ ప్రక్కనుండి యాప్రక్కకుఁ దిరుగసాగెను. సభలోని యుద్యోగస్థు లందఱును పీం ద్రిద్దఱును గలిసి యామాట చాకలి వానికి నేర్పి పెట్టిరికాని యిందు సత్యమేమియు లేదని తలఁచిరి. సాధారణజను లందఱును నిజముగా దొంగతన మాతఁడు చేయక పోయినయెడల చాకలివాని కాపే రెట్లు తెలిసినదనియు, గట్టిగా సుబ్రహ్మణ్యము యాపని చేసెననియుఁ జెప్పుకొనుచుండిరి. ఊర నెక్కడఁజూచినను సుబ్రహ్మణ్యము సొమ్మును తస్కరించినట్లు అంజనమువేయఁగా బయలపడ్డ దని మూఁకలు గట్టి మాటాడుకొనఁ జొచ్చిరి ; రాజుగా రామాటల నెంతమాత్రము విశ్వసించలేదు.

అప్పుడు సభామందిరమునుండిఁ యింటికిఁ బోవునపుడు త్రోవ పొడుగునను ప్రజలెల్ల 'ఈతఁడే కన్నము వేయించినవాఁడు' అని సుబ్రహ్మణ్యమును వ్రేలుపెట్టిచూప నారంభించిరి. అందుచేత నాతఁడు వట్టి నిరాపనింద వచ్చెగదాయని సిగ్గుపడి రాత్రిభోజన మయిన తరువాత నొక్కఁడును బరుండి తనలోఁ దానిట్లు చింతింప మొదలు పెట్టెను. ఆగోడకు కన్నము వేసినవాఁ డెవ్వఁడయియుండును ? ఒకఁడెంత

సాహసపుబనిని చేయఁజాలఁడు. అటువంటి బలమయిన రాతిగోడకు కన్నము వేసినవా రిద్దఱు ముగ్గురుండక తప్పదు. ఆముగ్గురు నెవ్వరై యుందురు ? కోటసంగతి గుఱ్ఱెఱిఁగినవారే కాని మఱియొకరు కారు. నాలుగుదినముల క్రిందట నీలాద్రిరాజునాచేత కోటపటమును వ్రాయించుకొన్నప్పుడు ధనాగారమును గూర్చి రెండుమూఁడుసారు లడిగెను. అతఁడట్లడుగుటకుఁ గారణమేమి ? ఈదొంగతనమునతో నతని కేదో సంబంధము గలిగియుండవలెను. అతఁడు గోడయెత్తుకూడ నడిగెను. దొంగతనములో సంబంధమే లేనియెడల గోడయెత్తుతో నతని కేమి ప్రయోజనము ? అంతియ కాక యీసంగతి గ్రామములో పొక్కకమునుపే వేకువజామున బహిర్భూమికి వెళ్ళుచుండఁగా నన్నుఁ బిలిచి యతఁడు రాజుగారిలోపల దొంగలు పడ్డారఁట యని యడిగినాఁడు; అతఁడు దొంగలలోఁ జేరియుండని పక్షమున, అంత పెందలకడ నాతని కాసంగతి యెట్లు తెలియును ? నేను సాయంకాల మింటికివచ్చునప్పుడు వీధిలో నిలుచుండఁగా నాతని జూచినాను. అప్పుడాతని చర్య వింతగా నున్నది. ఈయన్ని హేతువులచేతను విచారించి చూడఁగా ఈతఁడు దొంగలగురు వనుటకు సందేహములేదు. రేపు రాజుగారి నడిగి కొందఱు రాజభటులను బుచ్చుకొని యెవ్వరికిని దెలియకుండ నాతని యింటిమీఁద పడి పెట్టెలు మొదలగునవి పరీక్షించెదను. అప్పుడు కొంతసొమ్మయిన దొరకఁగలదు. అందు మీఁద నామీఁది నిందయైనను పోవును. అని యాలోచించి యారాత్రి యెట్లో వేగించి తెల్లవారిన తోడనే రాజుగారి దర్శనముచేసి తనయందు దోషము లేశమయినను లేదని చెప్పుకొని తనవశమునఁ గొందఱు భటులనిచ్చి తనయాజ్ఞాప్రకారముచేయ నుత్తరువిచ్చినచో దొంగలను సొత్తుతోఁ గూడఁ బట్టుకొనెద నని దృఢముగాఁ జెప్పెను. రాజుగా రాతనిమాటయందు గౌరవముంచి,

తత్క్షణమే పదుగురు భటులను రప్పించి, 'మీరందఱు నీయన చెప్పిన ట్లెల్ల చేసి పర్యవసానము మాతో మనవి చేయవలసిన' దని గట్టియుత్తరువు చేసిరి. సుబ్రహ్మణ్యము వారినిదీసికొని తిన్నగా నీలాద్రిరాజున్న యింటికిఁ బోయి వీధితలుపు వేసియుండఁగా వారినందఱిని, ఇంటిచుట్టును కావలి పెట్టి యిద్దఱిని వెంటఁదీసికొని పాణిద్వారమున దొడ్డిలో ప్రవేశించెను. అప్పుడు నీలాద్రిరాజు పెరటిలో నిలుచుండి క్రొత్తమనుష్యులు వచ్చుట చూచి తత్తరపడసాగెను.

నీలా—సుబ్రహ్మణ్యముగారా ? ప్రొద్దుననే మీరిక్కడకు వచ్చినారేమి ?

సుబ్ర—తమదర్శనము నిమిత్తమే. దొడ్డిలో నేమిచేయించు చున్నారు ?

నీలా—విత్తనములు చల్లించుటకయి దొడ్డి త్రవ్వించినాను. ఏమిఁగింజలు చల్లింతునా యని యాలోచించుచున్నాను.

అని యాతొందరలో తనవిషయమయిన బహువచనప్రయోగమును మఱచిపోయి తన నిజమయిన స్థితి కనుగుణముగా మాటాడెను. సుబ్రహ్మణ్యము మాఱుమాటాడక భటులతో లోపలఁజొరబడి పెట్టెలన్నియుఁ దీయించి పరీక్షింపఁగా వానిలో మున్ను తమ లోపల బైరాగి యెత్తుకొనిపోయిన వస్తువులును మఱికొన్ని వస్తువులును గానఁబడెను. గాని రాజుగారి సొత్తేమియుఁ గనబడలేదు. తనసొమ్ము దొరకుటంబట్టి నీలాద్రిరాజే దొంగయని నిశ్చయముచేసి వస్తువులు భూమిలో పాతిపెట్టి త్రవ్విన యానవాలు తెలియకుండ, మఱుగు పఱుచుటకయి దొడ్డియంతయుఁ ద్రవ్వించి విత్తనములు చల్లుటకని మిషపెట్టి బొంకుచున్నాఁడని యూహచేసి యతఁడు భటులచేత దొడ్డి నంతను త్రవ్వించెను; అందొకచోట రాజుగారిలోపలఁ బోయిన సొత్తం

లేయు గవ్వయయినఁబోకుండ మొలలోతు భూమిలో గానఁబడెను. వెంటనే కూలివాండ్రచేత సొమ్మును మోయించుకొని నీలాద్రిరాజును నాతనిభృత్యులను బట్టుకొని తీసికొని వచ్చుటకయి భటుల నియోగించి సుబ్రహ్మణ్యము రాజుగారి యింటికివెళ్ళి నడచిన సర్వవృత్తాంతమును నివేదించి, కావళ్ళతో సొమ్మును ముందుపెట్టి దొంగల నొప్పగించెను; నీలాద్రిరాజును సేవకులును తమనేరమున నొప్పుకొని క్షమింపవేడుకొనిరి. అంతట రాజుగారు మిక్కిలి సంతోషించి సుబ్రహ్మణ్యమునకు గొప్పబహుమానము చేసి, తాను పెద్దాపురము రాజునకుఁ గప్పముగట్టెడి సామంతరాజు గనుక వారిని విమర్శింపఁ దనకధికారములే దని దొంగలను రాజభటులవశమున నొప్పగించి వారికందరకు సుబ్రహ్మణ్యమును నాయకునిగాఁ జేసి విచారణ కయి పెద్దాపురము కృష్ణజగపతి మహారాజుగారికడకుఁ బంపెను. సుబ్రహ్మణ్యమును ఉమాపతిగారియొద్ద సెలవు పుచ్చుకొని పెద్దాపురమునకు ప్రయాణ మయి బయలుదేరి వీధిగుమ్మమువద్దకు వచ్చునప్పటికి పైనుండి మాలబల్లి యొకటి మీఁద పడెను. అప్పుడు ప్రయాణమాపి గౌళిపాటుయొక్క ఫలము కనుఁగొనుటకు పురోహితునకు వర్తమానము పంపఁగా నతఁడు తాటాకులపంచాంగమును పట్టుకొని వచ్చి శిరస్సుమీఁద పడలేదు గనుక మరణభయము లేదనియు స్నానము జేసి దీపము పెట్టుకొని బ్రాహ్మణునకు కొంచెము సువర్ణదానము చేసినపక్షమున బల్లిపాటుయొక్కదోషము పోవు ననియు జెప్పెను. సుబ్రహ్మణ్యము వెంటనే శిరస్స్నానము చేసివచ్చి రాగిలో సువర్ణ ముండునుగనుక నాలుగుడబ్బు లాబ్రాహ్మణుని చేతిలోనే పెట్టి గాయత్రి చేసికొని తరువాత నెంతో దొండయెక్కినను ఆపూటనే పెద్దాపురమునకు వెళ్ళ బయలుదేరెను.

పంద్రెండవ ప్రకరణము

రామరాజుసాయమున సుబ్బరాయఁడు సీతను వెంటఁబెట్టుకొని వచ్చుట-రామరాజు చెఱసాలలో రాజశేఖరుఁడుగారిని చూచుట-రాజశేఖరుఁడుగారి కారాబంధవిమోచనము—శోభనాద్రి రాజును శిక్షించుట - సుబ్బరాయఁడు రుక్మిణియయి తనవృత్తాంతమును చెప్పుట.

పెద్దాపురమునకు అయిదారుక్రోసుల దూరములో జగ్గమపేట యను గ్రామ మొకటికలదు. సీత నెత్తుకొనిపోయిన నాఁడు మధ్యాహ్నము రెండుజాములవేళ గ్రామకరణముయొక్క యింటివద్ద కెవ్వరో వచ్చి తలుపు తీయు మని కేకలువేసిరి. అప్పుడు పదునాలుగు సంవత్సరముల ప్రాయముగలిగి మిక్కిలి యందగాఁడై యేహేతువుచేతనో తలపెంచుకొనియున్న చిన్నవాఁ డొకఁడు లోపలినుండి వచ్చి తలుపు తీసి యెందుకు వచ్చినా రని యడిగెను. అక్కడ నిలుచుండియున్న యిద్దఱు మనుష్యులలో నొకఁడు "బ్రాహ్మణకన్యకకు దబ్బుపుచ్చుకొని యన్నము పెట్టెదరా?" యని యడిగెను. ఆచిన్నవాఁడు వెలుపలికి వచ్చి చూచునప్పటికి, ఎనిమిదేండ్ల యీడు గల యొకచిన్నది యరుగుమీఁదఁ గూరుచుండి క్రిందుచూచుచు వెక్కివెక్కి యేడ్చుచుండెను. ఆమనుష్యులలో నొకఁడు చేరువనిలుచుండి యూరకుండు మని యదలించుచుండెను. ఆచిన్నవాఁ డట్లు వెలుపలికి వచ్చి తమ మొగము వంకఁ దేఱిపాఱ చూచుచుండుటఁ గని ఆమనుష్యు లిద్దఱును మీపే రేమని యడిగిరి. అతఁడు సుబ్బరాయఁడని చెప్పి, యా చిన్నదానిమొగమును నిదానించి కొంచెముసేపుచూచి యిట్లనియెను.

సుబ్బ— ఈచిన్నది యెవరు? మీరెక్కడనుండి తీసికొని వచ్చినారు? ఎక్కడకు తీసికొనిపోయెదరు?

మను—— మాది కాకినాడ. ఈచిన్నది మా గ్రామకరణము కూఁతురు. పేరు సీతమ్మ. అప్పగారి యింటిలో పెద్దాపురమున నుండఁగా, తండ్రియింటికిఁ దీసికొనిపోవుచున్నాము. అక్కడకువచ్చుట కిష్టములేక రాగములుపెట్టుచున్నది.

సీత—— కాదు కాదు. నన్ను వీం డ్రెత్తుకొనిపోవుచున్నారు.

సుబ్బ—— పెద్దాపురమునుండి కాకినాడ కీయూరు త్రోవకాదే. ఆచిన్నది చెప్పినమాటే నిజమని తోఁచుచున్నది.

ఈప్రకారముగా ప్రశ్నోత్తరములు జరుగుచుండఁగా, వెనుక నుండి యెవ్వరో యేమఱుపాటున వచ్చి సీతయొద్ద నిలుచున్న వానిని జుట్టుపట్టుకొని వంగఁదీసి వీఁపుమీఁద వీసెగుద్దులను మణుగుగుద్దులను దబదబ వర్షములాగున కురిపించెను. అదిచూచి రెండవవాఁడు సీతను తనమిత్రుని విడిచిపెట్టి పరుగెత్తుటలోఁ తనకుఁగల సామర్థ్యము నంతనుజూపెను. ఆక్రొత్తగావచ్చిన నాతఁడును "పోనీకు పోనీకు" మని చేతిలోవానిని వదలివేసి పరుగెత్తుచున్న వానివెంటఁబడెను. అదే సమయమని రెండవవాఁడు గూడ రెండవవైపునకుఁ బరుగెత్తి పరుగులో మొదటివానికంటె దిట్టమయినవాఁడని పేరు పొందెను. ఆమనుష్యుని కొంతదూరము వఱకుఁ దఱిమి, క్రొత్తమనుష్యుఁడు మరల సీతయున్న చోటికి వచ్చెను.

సీత—— రామరాజుగారూ! నన్నుదొంగలనుండి విడిపించినారు గదా? ఇఁక మాఅమ్మయొద్దకు తీసికొనిపోయి యొప్పగించరా?

రామ——అమ్మాయీ! ఏడ్వఁబోకు. నేను సాయంకాలములోగా నిన్నుఁ దీసికొనిపోయి మీయింటికడ నొప్పగించెదను.

సుబ్బ——రాజుగారూ! ఈచిన్నదాని తల్లిదండ్రు లెక్కడ నున్నారు? వారుచిరకాలము నన్ను కన్నబిడ్డలవలెఁ జూచినారు.

రాము—అట్లయిన మీరీచిన్నదాని నెఱుఁగుదురా ?

సుబ్బ—ఎఱుఁగుదును. ఈచిన్నది రాజశేఖరుఁడుగారి రెండవ కొమార్తె. ఈచిన్నదియు నేనును నీమె యన్నగారును నన్యోన్యమును సోదరభావమున నుండెడివారము; అందులో ముఖ్యముగా నీచిన్నదాని యన్నగారును నేనును తానే నేనన్నట్లు భేదములేక యుండెడివారము; ఈచిన్నది నన్ను మఱచిపోయినట్లున్నది.

రాము—ఈచిన్నదాని తలిదండ్రులిప్పుడు భీమవరములో నున్నారు. వారివలన మీరంత యుపకారమును పొందియున్నయెడల, ఈచిన్నదానిని గొనిపోయి జననీ జనకులకడఁ జేర్చి వత్తము దారి తోడుగా వచ్చెదరా ?

సుబ్బ—అవశ్యముగా వచ్చెదను. నేను లోపలికిఁబోయి యీసంగతిని మావాండ్రతోఁ జెప్పివచ్చువఱకును నిమిషమిక్కడ నిలువుండి.

అని సుబ్బారాయఁడు లోపలికిఁబోయి యింటివారితో సంగతి యంతయుఁ జెప్పి యాచిన్నదానిని భీమవరములో దిగఁబెట్టి సాధ్యమయినంత శీఘ్రముగానే తిరిగి వచ్చెదనని చెప్పెను. వారు వలదని యనేక విధములఁ జెప్పినను విననందున వారందఱును వీధిగుమ్మమువరకునువచ్చి 'నాయనా! వేగిరమురావలెనుజుమీ' యని మఱిమఱిచెప్పిరి. రామరాజా చిన్నివాని సౌందర్యమున కాశ్చర్యపడుచు, ఇంతటిచక్కఁదనము స్త్రీలయందుండిన నెంతరాణించునని తనలోదాను తలపోయు చుండెను. ఆతఁడు వచ్చినతోడనే రామరాజా చిన్నదానిని బుజము మీఁద నెత్తుకొని సుబ్బరాయనితో మాటాడుచు భీమవరముమార్గము పట్టి నడవ నారంభించెను.

రాము—మీరు బ్రాహ్మణు లయ్యును, ఆప్రకారముగా తల పెంచుకొన్నారేమి ?

సుబ్బ—వెంకటేశ్వరులకు మ్రొక్కున్నది. ఆ మ్రొక్కునుబట్టియే తొడుగుకొన్న యంగీమొదలగు వస్త్రములను భోజనము చేయునప్పుడు సహితము తీయకుందును; బట్టలు మాసినప్పుడు సహితము రెండవవారెఱుఁగకుండ మహారహస్యముగా నొక గదిలో నుతికినబట్టలను కట్టుకొనుచుందును. ఈవ్రతము నేఁటివఱకు దైవానుగ్రహము వలన సాగివచ్చుచున్నది.

రామ—ఈ వ్రతము మిక్కిలి చిత్రముగానున్నది. ఇటువంటి వ్రతము నే నీవఱకు వినియు కనియు నెఱుఁగను.

ఈవిధముగా మాటలు చెప్పుకొనుచు వారు దీపములు పెట్టిన నాలుగు గడియలకు భీమవరమునకు సమీపమున నున్న యొక చిన్న పల్లెను జేరిరి; అక్కడనుండి త్రోవ మంచిది కాక పోవుటచేతను, రెండుదినముల క్రిందట నాయూరిబయటనే పెద్దపులి యొకమనుష్యుని నెత్తుకొనిపోయిన దని వినుటచేతను, చీఁకటిలో వారిని నడిపించుకొని పోవుట యుక్తము గాదని రామరాజు వారి నాగ్రామములో నొక కాపువానియింటఁ బరుండఁ బెట్టెను. ఆపల్లెలో బ్రాహ్మణులు లేరు. గనుక వారారాత్రి భోజనముచేయకపోయినను, రామరాజు కోమటి యింటికి వెళ్ళి యటుకులనుదెచ్చి పరున్న యింటివాండ్రకు పాడియాట చేత చెంబెడు చిక్కనిమజ్జిగ యడిగి పుచ్చుకొని వారి కిద్దఱికిని బెట్టెను. వానితో క్షుత్తునివారణమైనందున వారును బసవాండ్రిచ్చిన తుంగచాపమీఁద పడుకొని హాయిగా నిద్రపోయిరి. రామరాజు జాము రాత్రియుండగానే వారిని లేపి తనతోఁగూడ దీసికొని బయలుదేఱి రెండుగడియలలో భీమవరముచేర్చి, యూరిబయటకు రాఁగానే తా నావరకు మఱచిపోయిన గొప్పసంగతి యేదో తనకప్పు డకస్మాత్తుగా జ్ఞప్తికివచ్చినట్టు నటించి తొందరపడి తనకు వెంటనే వెళ్ళక

లేరనివసియున్న దనిచెప్పి వారికి త్రోవచూపి తాను ప్రక్కదారిని పోయెను. వారిద్దఱును దారియడిగి తెలుసుకొనుచు కొంతదూరము కలిసి వచ్చిరి. సీత తా నెఱిఁగియున్న వీధికి రాఁగానే సుబ్బరాయని వెనుక దిగవిడిచి పరుగెత్తుకొనిపోయి యొకసందులో నుండి మరలి తిన్నఁగా నింటికిఁబోయి చేరెను. సుబ్బరాయఁడు చీఁకటిలో సీతపోయిన సందును కనిపెట్టలేక తిన్నగా వీధిచివరదాఁక నడచి యిల్లుఁగనుగొన లేక గ్రామములో తిరుగుచుండెను. సీత వెళ్ళి వీధిగుమ్మము వద్ద పిలువఁగనే మంచముమీఁద పరుండి నిద్రపట్టక విచారించుచున్న మాణిక్యాంబ త్రుళ్ళిపడిలేచి పరుగెత్తుకొని వచ్చి తలుపుతీసెను. తలుపు తీసినతోడనే సీత తల్లిని కౌఁగిలించుకొని పెద్దపెట్టున నేడ్చెను. మాణిక్యాంబయు దుఃఖము పట్టఁజాలక కొంతసేపు తానుకూడ నేడిచి తనపైఁటచెఱఁగుతో కొమార్తెకన్నుల నీళ్ళుతుడిచి నిన్నఁటినుండియు నెక్కడకుఁ బోయితివనియు నింతచీఁకటిలో నొక్కతెవు నెట్లురాఁగలిగితి వనియు సీతనడిగెను. ఆక్రిందటిదినము ప్రొద్దుననే తన్నిద్దఱుదొంగలెత్తుకొని పోవుటయు, రామరాజను మఱియొక చిన్నవాఁడును తన్ను విడిపించి తీసికొని వచ్చుటయు, రామరా జేదోపనియున్నదని యూరి వెలుపలిదాఁక వచ్చి వెళ్ళిపోవుటయు, సీత చెప్పెను. అప్పుడా రెండవ చిన్నవాఁ డేమయినాఁడని తల్లి యత్యాదరముతో నడిగెను. తనతోఁగూడ పయివీధివఱకును వచ్చినాఁడనియు, అతఁడు పూర్వముతమ్ముందఱి నెఱిఁగినవాఁడే యనియు, కొంచెము సేపటికెల్ల నచ్చటికి వచ్చునని యు కూఁతురు బదులు చెప్పెను. ఈప్రకారముగా మాణిక్యాంబ సీతను తొడమీఁద కూరుచుండఁ బెట్టుకొని మాటాడుచుండఁగానే సూర్యోదయ మాయెను. అప్పుడు వీధిగుమ్మములో నెవ్వరో "రాజశేఖరుఁడుగారి బస యెక్కడ ?" నని యడిగిరి. ఆమాటవిని యది

యక్షిణికంఠమువలె నున్నదని యొడిలోనుండి సీతను దింపి మాణిక్యాంబ వీధిగుమ్మముగోని కొక్కుయుంజెనేసి యెవడురా రని కేక వేసెను. అప్పుడు సుబ్బరాయుఁడు మాణిక్యాంబను జూచి 'అమ్మా! యని కౌఁగిలించుకొని బోరున నేడువ మొదలుపెట్టెను. అంతట వారందఱును గలసి యింటిలోనికిఁ బోయిరి.

చెఱసాలలో పెట్టఁబడిన దినముననే రాజశేఖరుఁడుగారు స్నానసంధ్యాదులు నొకచోటఁ గూరుచుండి యుండఁగా పదిసంవత్సరములు దాఁటినకారాబద్ధుఁ డొకఁ డావలార్ధమున కాపురుసాకెళ్ళతోఁ బోవుచు రాజశేఖరుఁడుగారి మొగమువంక నొంతసేపు చూచి యాయన సమీపమునకు వచ్చి కూరుచుండెను.

రాజ——నీపే రెవరు ?

కారా——నాపేరు పాపయ్య; మాయింటిపేరు మంచిరాజు వారు. నన్నెక్కడనైన జూచినట్టు జ్ఞప్తియున్నదా ?

రాజ——మీమొగ మెక్కడనో చూచినట్టే యున్నది కాని యెప్పుడుచూచినానో మాత్రము స్మరణకు రాలేదు. మంచిరాజు పద్మరాజు మీకేమగును ?

పాప——నన్ను మీరు నల్లచెఱువువద్ద జువ్విచెట్టుక్రిందఁ జూచినారు. నే నప్పుడు బైరాగివేషముతో నున్నందున, నన్నానవాలుపట్ట లేక పోయినారు. పద్మరాజు నాకొమారుఁడు.

రాజ——మునుపటియవస్థ పోయి మీకింతలో నిప్పటి కీ దశ యెట్లు వచ్చినది ?

పాప——నే నీశోభనాద్రిరాజుతో స్నేహము చేసిన దోషము చేత, నాకీతనిమాట వినవలసివచ్చినది. ఈరాజు జారులుకొట్టుటకై నలుగురుని తోఁడితెచ్చి నన్ను వారికి నాథునిగాఁ జేసి నల్లచెరువునకు

పంపెను. వెనుక కోయ రామిరెడ్డియు వానిమనుష్యులును పట్టుకోఁబడి రాజుగారిచే చెట్లకొమ్మలకు ఉరితీయఁబడిన తరువాత మేమేప్రబలుల ముగా నుండి రెండుమాసములు త్రోవలుకొట్టుటలోఁ బ్రసిద్ధిగాంచి తిమి. దోఁచుకొని తెచ్చినసొమ్ములో సగము శోభనాద్రిరాజుపుచ్చు కొనుచుండెను. మిగిలిన సగములోను సగము నావంతునకు వచ్చు చుండెను. మెట్టుసొమ్ములో నాలవపాలును తక్కినవారు నలువురును సమభాగములుగా బంచుకొనుచుండిరి. నేను యోగివలె నటింపు చుందును; నాతోడ నున్నవారు దూరముగా నడవిలోఁ బగలెల్ల నుండి రాత్రులువచ్చి మాటాడి పోవుచుందురు; పగలు వారి కేమ యిన వర్తమానముచేయవలసివచ్చినప్పుడు, గుడిసెలో గాపురమున్న కోయవానిని బంపుచుందును; వానికిఁ బ్రత్యేకముగా నేనే జీత మిచ్చెడివాఁడను.

రాజ—అప్పుడు విల్లును అమ్ములును బుచ్చుకొని నాతో వచ్చినవాఁడు వాఁడేకాఁడా?

పాప—అవు నాబావపొట్టవాఁడే. మీనిమిత్తమె పంపిననాఁటి రాత్రియే యానలుగురిలో నొకఁడు చంపఁబడినాఁడు. రాజుగారి కేలాగునఁ దెలిసెనోకాని మఱునాఁడు తెల్లవారకమునుపే రాజ భటులు కోయవానిని కొట్టినందున వాడు తక్కినవారుండుస్థలములను జూపఁగా వారినిసహితము పట్టుకొని మమ్మందఱను రాజుగారియొద్దకు తీసికొని వచ్చిరి. ఆయన మమ్మందఱను చెఱసాలయందుఁ బెట్టిం చెను; మాకందఱకు శిక్షకలిగినను మేమీరాజుపేరు చెప్పినవారము కాము కాఁబట్టి మమ్మిమాత్రతఁడు చెఱసాలలో స్వేచ్ఛగా తిరుగుట కంగీకరించి మిక్కిలి ప్రేమతో జూచుచున్నాఁడు.

రాజ—అట్లయిన శోభనాద్రిరాజు మీకెంతో యుపకారమే చేయుచున్నాఁడు.

పాప.——ఏమి యుపకారము? ఈదుర్మార్గునిమూలమున చెఱ సాలలోఁ బడి బాధపడుచున్నాను. రాజుగా రెప్పుడో యీతని దుర్మార్గతను దెలిసికొని యీతనినిగూడ మాకుసహాయునిగా నెంచె దెయుందురు. అటువిమ్మట మఱియొక కారాగృహాధికారి వచ్చినప్పుడు మాపాట్లు దైవమునకుఁ దెలియఁగలవు.

రాజ.——మీకోమారునకు పిల్లనియ్యనందునకే సుమీ నన్నితఁ డింటు బెట్టించినాఁడు.

పాప.——అవును నేనెఱుఁగుదును. మీరు రాజుదగ్గఱనుండఁగా పద్మరాజును పిలిపించినప్పుడు వాఁడు నావద్దనే యున్నాఁడు. అది యంతయు నేనును మావాఁడును రాజును సిద్ధాంతియుఁ గలిసి చేసిన యాలోచనయే. అయినను మీదినములు బాగుండి మా యాలోచన కొనసాగినదికాదు. శోభనాద్రిరా జెక్కడికోగాని నాతోఁగూడ నల్ల చెఱువు వద్దనుండిన వాండ్ర నిద్దఱిని, సంకెళ్ళూడదీయించి పంప దలఁచుకొన్నాఁడు.

రాజ.——ఎక్కడకో మీకుఁ దెలియు లేదా ?

పాప.——తెలియ లేదు. ప్రొద్దున నాతో నేమో యాలోచించు టకు వచ్చినప్పుడు రాజుగారి తమ్ముఁ డిక్కడకు వచ్చినందునఁ రాత్రి చెప్పెదనని వెళ్ళిపోయినాఁడు. నేను మీకు పూర్వము గొప్ప యప కారము చేసితిని; దానికి మాఱుగా నిప్పు డుపకారము నొకదానిని జేసెదను. పెద్దాపురపురాజుగారు బహుయోగ్యులు ; శోభనాద్రిరాజు మిమ్మిట్లు నిర్బంధపెట్టుచున్న సంగతి మనవి వ్రాసికొన్నయెడల మిమ్ము తక్షణమే విడుదల చేయుదురు. కాగితము మొదలయినవి నేను తెప్పించి యిచ్చెదను.

అని పాపయ్య కాగితమును కలమును తెప్పించి యిచ్చెను తోడనే రాజశేఖరుఁడుగారు విజ్ఞాపనపత్రిక నొకదానిని వ్రాసి మడఁచి జిగురంటించి పయిని చిరునామా వ్రాసి యియ్యఁగా పాపయ్యయొక్క మనుష్యునిచేత దానిని రాజుగారి కంపెను. కాని యాయనయొద్దనుండి యొకయుత్తరముగాని విమర్శచేసి న్యాయము దయచేయు సూచనలుగాని రెండుమూఁడుదినములు కడచినను రాలేదు. రాజబంధువుమీఁద జేసిన విన్నపము గనుక బదులు రాదని రాజశేఖరుఁడుగా రూరకుండిరి.

సీతనెత్తుకొనిపోయిన మఱునాఁడు ప్రొద్దుననే రాజుగారు చెఱసాలను జూచుటకు వత్తురని యచట నొక వదంతి కలిగెను. తరువాత కొంచెముసేపటికి రామరాజు రాజశేఖరుఁడుగా రున్న తావునకువచ్చెను.

రాజ—రామరాజుగారూ! నాతప్పును క్షమింపవలెను. మీరారాత్రి జాబును తెచ్చియిచ్చుటయే నాకు మహోపకారమయినది. నేను సంగతిని తెలిసికోలేక మిమ్ము నిష్కారణముగా కానిమాటలాడినాఁడను.

రామ—మీకు నేను జేసియున్న యుపకారమునకు నన్నటువంటిమాట లనవలసినదే. ఇఁక నెప్పుడును మేలుచేయకుండ మంచి బుద్ధి చెప్పినారు.

రాజ—నాయందు కరుణించి మీరాసంగతిని మఱచిపోవలెను. మంచిసంబంధము చెడిపోయెఁగదా యని యాసమయమునలో నొడలు తెలియక యేమో యన్నాను. నన్ను మన్నింపుఁడు.

రామ—రాజుగారు చెఱసాలనుజూడ బయలుదేఱినారఁట. నేను వేగిరము పోవలెను.

అని రామరాజు వెళ్ళిపోయెను. తరువాత రెండు గడియలకు వెండిబిళ్ళ బంటొకఁడువచ్చి రాజుగారు కొలువుతీర్చి కూరుచుండి,

రాజశేఖరుఁడుగారేమో విన్నపము వ్రాసినందున కయి పిలుచుకొని రమ్మన్నారని చెప్పి, ఆయనను వెంటఁబెట్టుకొని పోయెను. ఆయన వెళ్ళునప్పటికి సమస్తాభరణభూషితులయి రాజుగారు రత్నసింహాసనము మీఁద గూరుచుండి యుండఁగా, వేత్రహస్తులు పసిఁడిబెత్తములను చేతఁబూని ముందు నిలుచుండిరి. చామరధరు లిద్దఱు ప్రక్కల నిలుచుండి వింజామరలు వీచుచుండిరి; భటు లాయుధపాణులై పార్శ్వములను నిలుచుండిరి; ఒకప్రక్కను శోభనాద్రిరాజు చేతులు జోడించుకొని నిలుచుండెను. రెండవ ప్రక్కను మఱియిద్దఱు మనుష్యులు చేతులు కట్టుకొని నిలువఁబడియుండిరి; రాజశేఖరుఁడుగారు వచ్చి యెదుట నిలువఁబడగానే కృష్ణజగపతిమహారాజుగారు 'మీరీ శోభనాద్రిరాజుగారి మీఁద నేమైన మాపేర మనవిచేసికొన్నారా?' అని యడిగిరి. రాజశేఖరుఁడుగారు తనమీఁది కేమి వచ్చునో యని భయపడుచు, శరీర మంతయు కంపమునొంద నోరు మెదల్పక యూరకుండిరి.

కృష్ణ—శోభనాద్రిరాజా! నీవీ రాజశేఖరుఁడుగారి విషయమయి చేసిన యక్రమపు పనులన్నియు మాకుఁ దెలియవచ్చినవి. నీకు చనవరిగానున్న తుచ్ఛునకు తనకొమార్తె నియ్యనన్న మాత్రమున, నీ వాయననుపట్టి చెఱసాలయందుఁ బెట్టుటయేగాక చెఱసాలలో నున్న వాండ్ర నిద్దఱును విడిచిపుచ్చి యాచిన్నదాని నెత్తుకొనిపోవునట్లు ప్రేరేపించితివి.

శోభ—ఆచిన్నదాని నెవ్వరెత్తుకొని పోయినారో నాకేమియుఁ దెలియదు.

కృష్ణ—నీకుఁ దెలియకపోయినయెడలఁ జెఱసాలలో నున్న పీండ్రిద్దఱును నెట్లు వెలుపలికి వెళ్ళగలిగిరి?

శోభ—వీండ్రిద్దరును నిన్నటియుదయకాలమున గోటదాటి పాఱిపోయినారు.

వేనప్పటినుండియు పింగ్రడను బట్టుకొనుటకు భటులనుబంపి వెద కించుచున్నాను.

కృష్ణ—ఏమిరా ? గురవా! మిమ్మాయన యెక్కడికయిన పంపి నాఁడా ? లేక మీరే గోడదూఁకి పాఱిపోయినారా ?

గుర—మహాప్రభూ ! నిన్న ప్రొద్దున్న మమ్మిద్దఱను పిలిచి యీ రాజుగారు చిన్నదానిని రవణక్కపేట కెత్తుకొనిపోయి, యక్కడ పద్మ రాజున కొప్పగించవలసినదని యాజ్ఞాపించినారు. చిన్నది రాఁగానే దొంగ తనముగా పెండ్లి యాడుటకై పద్మరాజు ముందుగానే పోయి యక్కడ నున్నాఁడు.

శోభ—కాదు కాదు. ఈదొంగలంజకొడుకులు పాఱిపోయి, తప్పించుకొనుటకయి యీలాగున బొంకుచున్నారు.

గుర—ఈరాజు దొంగల గురువు. మునుపు మాచేత దారులు కొట్టించి తిన్నగా మాసొమ్ము మాకియ్యక సకలమయిన చిక్కులు పెట్టి నాఁడు. ఈబ్రాహ్మణుని దోచుకొనుటకు వచ్చి మేమారాత్రి యాయన మూలముగా పడ్డపాట్లు తలఁచుకొన్న నిప్పటికి మాకు దుఃఖము వచ్చు చున్నది.

కృష్ణ—వెనుక నీప్రకారముగా దారులు దోపించినావా ?

శోభ—లేదులేదు. ఈవిధవకొడుకు లబద్ధ మాడుచున్నారు.

గుర—మామాట లబద్ధమేమో పాపయ్యగారిని పిలిపించి విచారింపవచ్చును. ఇప్పు డాయన యీచెఱసాలలోనే యున్నాఁడు.

కృష్ణ—ఓరీ! పాపయ్యను పిలుచుకొనిరా.

కొంతసేపటికి పాపయ్యవచ్చి రాజుగారు నిజము చెప్పిన యెడల శిక్ష తగ్గించెద మని వాగ్దానము చేసినందున మొదటినుండియు నాతని చర్యయంతయు నేకరువు పెట్టెను. అందుమీఁద శోభనాద్రిరాజు మాఱుపలుక నోరురాక క్రిందుచూచుచు మిన్నకుండెను. రాజుగారి

మొగము పోలికయు కంఠస్వరమును రామరాజువానివలె నున్నందున, రాజశేఖరుఁడుగారు దేహమంతయుఁ జెమర్చ దిగ్భ్రమమునొంది యూరక తెల్లపోయి చూచుచుండెను. అప్పుడు రాజుగా రాయన వెల వెలపాటును తత్తరమును గనిపెట్టి సింహాసనమునుండి దిగివచ్చి చేయి పట్టుకొని, వెనుక రామరాజను పేరునఁ బలుమారువచ్చి యోగక్షేమం బుల నారయుచు వచ్చినది తామేయనియు, వెంటనే సహాయము చేయుటకు శక్తిగలిగి యుండియుఁ బ్రవర్తనమును బరీక్షించుటకయి యింతకాల ముపేక్ష చేసితి మనియు, చెప్పి వెంటనే కారాబంధ విమోచనము చేయించిరి. రాజశేఖరుఁడుగారు కొంతసే పేమిపలుకు టకును తోచక కొంతభయము తీఱినవెనుక మెల్లగా వెలుగు తెచ్చుకొని, గద్గద స్వరముతో "దేవరవారిస్థితి తెలియక సామాన్య మానవునిగా నెంచి యగౌరవముతోఁ జూచినందునకును సీత వివాహకార్యమునకు భంగము కలిగె నన్నకోపమున దూషణ వాక్యములు పలికినందునకును క్షమించి రక్షింపవలయునని బహు దీనత్వముతో వేఁడుకొనిరి. ఆవిషయమునఁ దమకెప్పుడును మన సులో మఱియొకలాగున లేదని చెప్పి, రేపు పెద్దాపురమునకు వచ్చి తమ్ముఁ జూడవలసినదని సెలవిచ్చి రాజుగా రాయన నింటికిఁబంపిరి.

ఆయన వెళ్ళిన తరువాత రాజుగారు శోభనాద్రిరాజును బిలిచి యూతఁడు చేసిన నేరమున కెంతగొప్పదండనమునో విధింపవలసి యున్నను దయారసము పెంపున నెలదినములు మాత్రము చెఱసాలలో నుండ శిక్ష విధించి భటులవశమున నొప్పగించిరి. అంతేకాక సీత నెత్తుకొని పోయినవారిని తాను పట్టి తెప్పించినప్పుడు నిజము చెప్పిన యెడల శిక్షలో గొంతభాగము తగ్గింపఁబడునని వాగ్దానముచేసియుండు టంబట్టి వాండ్రశిక్షలో సగము తగ్గించుటయే కాక మంచిరాజు పాపయ్యకు

సహితము సగముశిక్ష తక్కువచేసిరి. ఈకార్యముల సన్నిహితిని జక్కపెట్టుకొని శ్రీకృష్ణజగపతిమహారాజులవారు భద్రగజారోహణులయి, వంది మాగధులు బిరుదుపద్యములు చదివి కొనియాడ, జయజయధ్వానంగాది వాక్యములు జోరుకలుగ, చతురంగబలసమేతులయి తమరాజధానికి విజయం చేసిరి.

రాజశేఖరుడుగారింటికి వెళ్ళునప్పటికి మాణిక్యాంబ మనుమనింటి గోడకుం జేరగిలంబడి గూరుచుండి తిలవంబుమాని సుబ్రహ్మణ్యునితో నేదియో చెప్పుచుండెను. రాజశేఖరుడుగారు గుమ్మములోనికి వెళ్ళి, ఆచిన్నవాని ముఖలక్షణములను పలుకుబడియు రుక్మిణిని పోలియున్నం దున నాశ్చర్యపడి చూచి పురుషుండయి యున్నందున సేవకుని నిశ్చ యించుటకును తోంచక విభ్రాంతితో నాతని మొగమువంకనే తెప్ప వేయక చూచుచు లోపలికి రాక యచ్చటనే నిలుచుండిరి. ఇంతలో సీత గుమ్మములోనుండి తొంగిచూచి, "అమ్మా! నాన్నగారువచ్చినా" రని కేకవేసి వెళ్ళి తండ్రిని కౌంగిలించుకొనెను.

అంతట మాణిక్యాంబ పరమానందభరితురాలయి వెంటనే లేచి వెళ్లి కాళ్ళు కడుగుకొన నీళ్ళు తెచ్చియిచ్చి పాదములతడి తన పయింట చెంగుతో నొత్తి కూరుచుండుటకయి గోడదరిని పీటవేసెను. రాజ శేఖరుడుగారు పీటమీందం గూరుచుండి సీతను ముద్దాడి తొడమీంద కూర్చుండం బెట్టుకొనెను. అప్పుడు మాణిక్యాంబ సీతను దొంగలెత్తు కొనిపోవుటయు, రామరాజు మఱియొకరును వదలించి తెచ్చుటయుం జెప్పెను. రాజశేఖరుడుగారు రామరాజు పెద్దాపురాధినాధులయిన కృష్ణజగపతి మహారాజులనియు, ఆయన ప్రజలక్షేమము కనుంగొనుట కయి యిట్టి మాఱువేషములతో సంచరించుచుందురనియు, రామరాజను పేరున వచ్చి మనకు బహూపకారములనుజేసి తుదకు కారాబంధవిమోచ

చనము జేయించిరనియుఁ జెప్పి, తన్ను విడిపించిన క్రమమును వివరించి కొంతసేపు నృపుని సద్గుణవర్ణనమును జేసెను. మాణిక్యాంబ రామరాజు దేశాధీశుఁ డని విని యాశ్చర్యపడి, ఆయనయొక్క గర్వరాహిత్యమును పరోపకారశీలతను బహుభంగుల మెచ్చుకొనెను.

ఇట్లు మాటాడుచుండఁగానే సుబ్బరాయుఁడు వచ్చి రాజశేఖరుఁడుగారి కాళ్లమీఁదఁబడి "నేను రుక్మిణి" నని చెప్పెను. ఆయన సంతోషముచేత కొంతసేపు మాటాడలేక, తుదకు హృదయము పదిలపఱచుకొని లేచి పెద్దకుమార్తె నాలింగనముచేసికొనెను. అప్పుడు చచ్చిపోయిన దనుకొనుచున్న కూఁతురు లేచి వచ్చుటచేత నాదంపతుల కిరువురకును గలిగినసంతోష మింతింతయనిచెప్పశక్యముకాదు; ఆ సమయమున సీతకుఁ గలిగినసంతోషమును పట్ట శక్యముకాక పోయెను. ఆ యుద్రేకము కొంత నిమ్మళి పడినమీఁదట, ఆ వధూవరులు తమ్మెడఁబాసినది మొదలుకొని నేఁటివఱకును జరిగిన వృత్తాంతమును సవిస్తరముగాఁ జెప్పు మని రుక్మిణి నడిగిరి. రుక్మిణి యీప్రకారముగా వినిపింప నారంభించెను.

మనలను దొంగలు కొట్టిననాఁడురాత్రి పిండి యారఁబోసినట్లు తెల్లగా వెన్నెల కాయుచుండఁగా నాకు మెలఁకువ వచ్చి చూతునుగదా కటికనేలను మహారణ్యమధ్యమునఁ బడియుంటిని; నలుదిక్కుల నెంతవఱకుఁ జూచిన నెందు నెవ్వరును గనఁబడలేదు; ఎక్కడను మనుష్యసంచారము కనఁబడలేదు గాని మృగములయొక్క కూఁతలుమాత్రము చెవిలో వినఁబడసాగెను. ఇంతలో నొక వ్యాఘ్రము నాదగ్గఱనుండియే పోయినది కాని నన్నుఁ జూడక చేరువనున్న యొక మనుష్యుని మొండెము నీడ్చుకొని తొలఁగిపోయెను. దానిని చూచిన తోడనే నా దేహము నాకు స్వాధీనముకాలేదు. కొంత తెలివివచ్చిన

తరువాత మీ రెవ్వరును లేకపోవుట చూచి బ్రతికి యున్న మొదల మీరు నన్నొంటిగా దిగవిడిచిపో రనునమ్మకమున మీ రందఱును దొంగలచేత మరణము నొంది యుందు రనియు ఘాతుకమృగము లేవియో మీదేహముల నీడ్చుకొనిపోయి యుండవచ్చు ననియుఁ దల పోసి, చూడఁ జుట్టమును బ్రోచుటకు దైవమును గానక చావ నిశ్చ యించుకొని, మరల నింతలో నాత్మహత్యదోష మనుబుద్ధి యొకటి పుట్టుటచే కొంత జంకి మీలో నెవ రయినను బ్రతికి యుండవచ్చు ననియు నొకవేళ మి మ్మందఱను మరల జూచుభాగ్యము కలిగినను కలుగవచ్చుననియు నూహచేసి మరణప్రయత్నమును మానుకొని, లేచి నాలుగడుగులు నడచితిని. అక్కడ నెత్తుట దోఁగియున్న శిర స్సొకటియుఁ దానిప్రక్కను బట్టలమూటయుఁ గనఁబడఁగా, అం తటి యాపదలోసహితము దుర్వార మయిన క్షుద్బాధకు సహిం పలేక తినుట కందులో నేమయిన దొరకవచ్చునని యామూటను విప్పి చూచితిని; అందు పురుషులు ధరించుకొనఁదగిన వస్త్రాదులు మాత్ర మున్నవి. వానిని చూచినతోడనే చక్కని స్త్రీలు నిజ వేషములతో నొంటరిగాఁ దిరుగుట క్షేమకరము కాదుకాఁబట్టి పురుషవేషము వేసికొని యేదో యొకగ్రామము చేరవలె నను నాలో చన తోఁచి యావస్త్రములను గట్టుకొని యంగీని తొడిగికొని పురుష వేషమును ధరించి, నాపూర్వపుబట్టలను మిగిలినబట్టలతోఁ జేర్చి మూటగట్టి నాశరీరమున నున్ననగలను తీసి చెంగున ముడి వైచుకొని బయలుదేఱి, యొక కాలిమార్గమున నడచి తెల్లవాఱువఱ కొక గ్రామమును జేరితిని. ఆగ్రామములో అపూట కుండి, నగల నమ్మి వేసి రొక్కమును జేర్చుకొని తలమీఁది దెబ్బచేత బాధ పడుచునే చేరువగ్రామమునకుఁ బోయి యక్కడ కొన్ని దినము

టుండి వైద్యముచేయించుకొని నిమ్మళించిన తరువాత బయలుదేఱి చుట్టుపట్ల గ్రామములోఁదిరుగుచు పూటకూటి యిండ్లలో భోజనము చేయుచు పదియేను దినముల క్రిందట జగ్గంపేటఁ జేరితిని. ఆగ్రామ కరణము ముసలివాఁడును పుత్రసంతానము లేనివాఁడును గనుక నన్నుఁజూచి ముచ్చటపడి తనపనికి నేను సాయముగా నుందునని యెంచి నన్నుఁ దనయొద్దనే యుంచుకొని యాదరించుచు నాప్రవర్తనమునకు మిక్కిలిసంతోషించి తనకున్న యొక్కకుమార్తెను నాకిచ్చి వివాహముచేసి యిల్లరికముంచుకోవలెనను నుద్దేశముతో నాకులగోత్ర నామముల నడిగి తెలిసికొనెను. నే నక్కడ సుబ్బరాయఁ డనుపేరున మిక్కిలి నమ్మకముగానుండి, మీరువిద్యచెప్పించిన మహిమచేత లెక్కలు మొదలైనవి వ్రాయుటలో తోడుపడుచుండి, నాకు వెంకటేశ్వరుల మ్రొక్కుచేత మావారు తలపెంచుకొనునట్టు చేసినారనియు, ఈవ్రత సమాప్తి యగువఱకును తలయంటుకోఁగూడ దనియు, చెప్పి యావ్రతమునకు భంగము కలుగకుండగాపాడెద మని వారిచేత ననిపించుకొని పురుషవేషము బయలఁబడకుండఁ గడుపుకొనుచు వచ్చితిని. అట్లుండఁగా నొకనాఁడు మధ్యాహ్నము సీతనెత్తుకొనివచ్చి యెవ్వరో యిద్దఱుమనుష్యులు భోజనముపెట్టించుటకై నే నున్న యింటికిఁ దీసికొనివచ్చిరి. అప్పుడు మనము దాహముతీర్చి బ్రతికించినరాజు వచ్చి వాండ్రను కొట్టి సాగనంపెను. అంతట నాయింటివారివద్ద సెలవుపుచ్చుకొని నేనును రాజుగారును సీతను దీసికొనివచ్చితిమి. మీ యంతట మీరందఱును నన్నానవాలుపట్టి కనుగొనువఱకును నేను రుక్మిణి నని మీతో నెవ్వరితోను జెప్పకుండ నుండవలె నని మార్గము పొడుగునను తలఁచుకొని వచ్చితిని గాని, అమ్మను జూచినతోడనే మనసుపట్టలేక లోపలినుండి దుఃఖము పొంగివచ్చి కౌఁగిలించుకొని నాసంగతి జెప్పివేసితిని.

అని రుక్మిణి చెప్పినతరువాత రాజశేఖరుఁడుగారు కోమార్తె యొక్కబుద్ధికిని సాహస కార్యమునకును సంతోషించి యామెను కౌఁగలించుకొని మిక్కిలి గారవించెను. రుక్మిణియొక్క యీ చరిత్రమును విన్నవా రెవ్వరైనను, ఉన్నయూరిలో సహితము గడపదాఁటి పొరుగువీధికైన నెప్పుడును పదచలనముచేసి యెఱుఁగనంత సుకుమారిగాఁ బెరిఁగిన పదునాలుగేండ్ల ప్రాయముగల ఒక్క ముగ్ధబాలిక అంతటిధైర్యమును పూని సమయోచితబుద్ధితో మంచియుపాయము నూహించి పరుల కెవ్వరికిని భేద్యముకాని మాఱువేషమును ధరించి లోకానుభవమువలన నాతితేఱిన ప్రౌఢాంగనలకు సయితము కష్టసాధ్య మయినరీతిని ప్రచ్ఛన్నముగా నుండఁగలిగిన దన్నవార్త నమ్మశక్యముకాకున్న దనవచ్చును. ఎవరునమ్మినను ఎవరునమ్మకపోయినను వాస్తవమును మఱుఁగుపఱుచక చెప్పుట చరిత్రకారునికి విధాయకకృత్యము గనుక, జరిగినసంగతినేనేమో జరిగినట్లు చెప్పుచున్నాను. పురాణగాథలయందువలె మనుష్యులు లేడిరూపమును ధరించినారని కాని పురుషులు కేవలస్త్రీలుగానే మాఱినారని కాని అసాధ్యమయిన సంగతి యిందేదియుఁ దెలుపఁబడలేదు. ఆమె కిట్టియద్భుతవిధమున బ్రవర్తింపనేర్పినది యామెనాశ్రయించియున్న సరస్వతియే కాని స్వశక్తి కాదు. విద్యాప్రభావము నెఱిఁగినవా రెవ్వ రిట్టిదొక ఘనకార్యమని యాశ్చర్యపడుదురు ?

పదమూడవ ప్రకరణము.

శంకరయ్య కాసులపేరుతో వచ్చుట—అతఁడు తన తండ్రివృత్తాంతమును వినిపించుట—వైష్ణవగురువుల యూరేగింపు—నృశింహస్వామియొక్క రాక—అతఁడు తన కథను జెప్పుట.

పైని చెప్పినరీతిగా రుక్మిణియు తల్లిదండ్రులును మాటాడుకొనుచుండఁగానే, పదునాలుసంవత్సరముల యీడుగల యొక చిన్నవాఁడు వచ్చి బుజమునిూఁది మూటను క్రిందఁ బడవైచి రాజశేఖరుఁడుగారి కాళ్ళమీఁద బడి 'అయ్యో మామయ్యా' యని యేడువనారంభించెను.

రాజ—ఏమి శంకరయ్యా! ఆఁడుదానివలె నాలాగున నేడ్చుచున్నావు? ఊరుకో.

శంక—మానాయన పదియేను దినములక్రిందట కాలము చేసినాఁడు. నేనప్పుడు గ్రామములోకూడ లేకపోయినాను.

రాజ—ఏమిరోగముచేతపోయినాఁడు? నీవప్పుడు గ్రామములో లేక యెక్కడకు వెళ్ళినావు?

శంక— అతఁ డాత్మరోగముచేత పోలేదు; ఇల్లుకాలి పోయినాఁడు. నేనావఱకుపదిదినములక్రిందటనే నాసవతితల్లిని తీసికొని యేలూరు వెళ్ళియుంటిని. నే నక్కడనుండఁగా నాకీ వర్తమానము తెలిసినది.

రాజ—ఇల్లెందుచేత కాలిపోయెనో యాతఁడేల బయటకు రాకుండెనో నా కాసంగతి వివరముగాఁ జెప్పు.

శంక—మీరు గ్రామములో నుండఁగానే మానాయన భూతవైద్యమునందు ప్రబలుఁడుగా నున్నాఁడుగదా? అటుతరువాత చుట్టు

ప్రక్కల గ్రామములయందుఁగూడ అతనిప్రసిద్ధి వ్యాపించినది. ఎవ్వరియింట నెవ్వరికి కొంచెము జ్వరము వచ్చినను మానాయనను పిలిచి తీర్థ మిప్పించుచుండిరి; ఎవ్వరికి కాలు కాసంతనొచ్చినను మా నాయనచేతనే రక్షరేకు కట్టించుకొనుచుండిరి; ఎవ్వరికి కొంచెము గాలిపోఁకినదన్నను మానాయననే పిలుచుకొని పోవుచుండిరి; ఎవ్వరు కొంచెము జడిసికొన్నను, మా నాయనచేతనే విభూతి పెట్టించు చుండిరి. వేయేల? చుట్టుపట్ల నేగ్రామములో నెవరికేజబ్బువచ్చినను మా నాయనను పిలువని స్థలము లేదు. ఈప్రకారముగా జరుగుచుండుట చేత నెల్లవారును సమస్తవస్తువులను మాయింటికిఁ దెచ్చి భక్తి పూర్వకముగా సమర్పించుచుండిరి; ఎవ్వరియింట నే శుభకార్యము జరిగినను ముందుకట్నము మా నాయనదిగానే యుండెను.

ఈవిధముగాఁ గొంతకాలము జరిగినపిమ్మట నొకనాఁడు ప్రాతః కాలమున మానాయన వీధిలో నడచుచు, ఒక యీడిగవాని వాకిట కాయలగెలలతో నిండియున్న యొక కొబ్బరిచెట్టును జూచి ఆయింటి వానిని పిలిచి తనకు నాలుగు లేఁతబొండములు పంపుమని యడిగెను. వాఁడు కొంచెము పొగరుఁబోతుగనుక సొమ్ము తెచ్చికొన్నచో కాయల నిచ్చెద నని మాఱుపలికెను. అందుమీఁద మానాయన కోప దృష్టితో వానివంక నెఱ్ఱపాఱ చూచి కాయల నియ్యవాయని గద్దించెను. "నేనియ్యను నన్నెఱ్ఱపాఱచూచి యేమిచేసెదవో చూత"మని వాఁడును వెనుకతీయక గట్టిగా జెప్పెను. ఱేపీపాటికి నీచెట్టేమగునో చూచు కొమ్మని తల యూఁచుచు మాతండ్రి యింటికిఁ బోయెను. దయ్యాలు పెట్టి చంపినప్పటిమాట చూచుకొందమని వాఁడును లోపలికి నడచెను.

ఆరాత్రి రెండుజాములవేళ మాతండ్రి గాఢనిద్రలోనున్న నన్ను లేపి నాయుత్తరీయపుఁజెంగున గిద్దెడు బియ్యము మూటగట్టి కడుగు

చెంబు చేతికిచ్చి తనతోఁగూడ రమ్మని చీఁకటిలో నన్నుఁ దీసికొని పోయెను. నేనును కన్నుకన్ను కనఁబడని గాఢాంధకారములో నిశాసమయమున దారి తడవుకొనుచు మాతండ్రితో నీడిగవాని యింటికడకుఁ జేరి నిలిచితిని. అప్పుడు నన్నక్కడ నిలువఁబెట్టి మానాయన కాలికి బందము వేసికొని కొబ్బెరచెట్టున కెగఁబ్రాకి, యొక కఱ్ఱతో దాని మొవ్వును చితుకఁబొడిచి యందు నేను దెచ్చిన బియ్యమును కడుగును బోసి చెట్టు దిగివచ్చి యాయర్ధరాత్రమప్పుడు మరల నన్నుఁ దీసికొని యింటికి వచ్చి యారాత్రి సుఖనిద్రచేసెను. మఱునాఁడతఁడు తన్నుఁ జూడవచ్చినవారితోనెల్ల "యీడిగవాఁడు కొబ్బరికాయ లియ్యకపోయినందున వానిచెట్టునకుఁ బ్రయోగము చేసితి" నని చాట మొదలు పెట్టెను. అందుకు దృష్టాంతముగా నాఁడు మొదలుకొని మొవ్వువాడి క్రమక్రమముగా ఆకు లెండిపోయి నాలుగైదు దినములలో చెట్టు చచ్చెను. "తనకు కొబ్బెరకాయలియ్యనన్న కోపముచేత బాపనవాఁడు నిష్కారణముగా నాకొబ్బరచెట్టును దయ్యాలు పెట్టి చంపినాఁ" డని యూర నెల్లవారితోను జెప్పుకొని యీడిగవాఁ డేడువ నారంభించెను. ఆవార్త శీఘ్రకాలములోనే చేరువ గ్రామములకును బ్రాఁకెను. అందు మీఁద నెల్లవారికిని మానాయన మీఁద నొకవిధమయిన యసూయ కలిగెను.

ఆపిమ్మట గ్రామములో నొకరికి రోగము వచ్చినప్పుడు మానాయన ప్రయోగముచేసినాఁడేమో యని కొందఱి కనుమానము కలిగెను. అందుచేత గ్రామములోనివారు తమయింట రోగాదికము వచ్చినప్పుడు మునుపటంత తఱుచుగా మానాయనను పిలుచుకొని పోవ మానివేసినారు. కాని యాతనిని పిలువకపోయిన నేమిచేసి పోవునో యని మనస్సులలో భయపడుచుండిరి. ఈరీతి నుండఁగా నొక కోమటివాని పిల్లవానికి రోగమువచ్చినప్పుడు, వానితల్లియు

ముత్తవయు వెళ్ళి పోచె యనఁగా పేరంటాలుగుడివద్దనున్న మాలది మాచిన్నవానికి గ్రామములోనివారే యొకరు ప్రయోగము చేసినా రని చెప్పెను. అందుమీఁద వారిద్దఱు నేడ్చుచు నింటికి వచ్చి యావ త్సమాచారమును మగవాండ్రకు వినిపింపఁగా వాండ్రా ప్రయోగము చేసినవాఁడు మాతండ్రి యేయని నిశ్చయించి భూతవైద్యులను పిలి పించి పలువిధముల పాట్లుపడిరి కాని వచ్చినరోగమునకు చికిత్సచేయిం చక పోయినందునను జ్వరబాధితుఁడయి యుండఁగా భూతవైద్యు లాతనిని పలుమాఱు స్నానములు చేయించుచు వచ్చినందునను వాయువుచేసి యాపిల్లవాఁడు కాలధర్మము నొందెను. అది మొదలు కొని మాతండ్రి ప్రయోగములుచేసి యందఱను జంపుచున్నాఁడన్న నమ్మక మొకటి యూర నందఱికిని గలిగెను. ఆనమ్మకమునకుఁ దోడు మును పెప్పుడో గ్రామమున చచ్చినవారు తాము ప్రయోగముచేతనే చచ్చినా మనియు, వీరు నిజమును కనుగొనలేక రోగమని భ్రమపడి తమ్ముఁ బోఁగొట్టుకొన్నా రనియు చెప్పుకొని యేడ్చుచున్నట్టు గ్రామములోని ముసలిముండలిద్దఱుముగ్గురు రోదనముల కారంభించిరి. ఆ కాలములో కామేశ్వరి మొదలైన యిలవేల్పులు గృహములోని విధవల కావేశమై యెవరికైన రోగము వచ్చినప్పుడు ప్రయోగ మని యొకటిరెండుచోట్ల పలుకుచు వచ్చెను. ఈయన్నికారణములచేతను గ్రామములో నెవ్వరి కేవిధమయినజబ్బు కలిగినను, అది యంతయు మా నాయనచేసిన ప్రయోగముచేతనే కలిగినదని జనులు భ్రమపడు చుండిరి. తా నేదోషము నెఱుఁగనని మానాయన యెన్నివిధముల ప్రమాణములుచేసి చెప్పినను, ఎవ్వరు నాతనిమాటలను విశ్వసించినవారు కారు. జనులపిచ్చి యేమందును? గ్రామములో మరణమునొందిన వారందఱును మానాయనచేసిన ప్రయోగముచేతనే పోయిరని దృఢ ముగా నమ్మిరి; వ్యాధిగ్రస్తులైనవారందఱును మా నాయనయొక్క-

మంత్రశక్తిచేతనే బాధపడుచున్నారని తలఁచిరి. కాఁబట్టి యెల్లవారును కొంతకాలమునకు మానాయనను గ్రామమున కొక మృత్యుదేవతనుగాఁ జూచుకొనుచుండిరి. మా నాయనపొడ గనఁబడినప్పుడెల్లను గ్రామములోని యాఁడువారు నెటికలువిఱిచి తిట్టఁజొచ్చిరి. మగవాఁడ్రు కొఱకొఱలాడుచు మునుపటివలె మాటాడక యాతఁడు కనఁబడినపు డెల్లను తప్పించుకొని పెడదారిని త్రొలఁగిపోవుచుండిరి. ఇరుగుపొరుగునున్నవారు నిప్పుసహితము పెట్టనూని వేసిరి; ఏవస్తువు బదులునిమిత్తము వెళ్ళినను లేదనుచుండిరి. పొరుగువారు తమనూతిలో నీళ్ళు త్రోడుకొన వలనుపడదనిరి. అందుచేత నీప్రకారముగా శత్రుమధ్యమున కాపురముచేయుట మానాయన కెంతో భారముగా నుండి, ఇదియంతయుఁ దాను భూతవైద్యుఁడనని వేషము వేసికొనుటవలన గలిగిన పాపఫలముగదా యని తెలుసుకొని పశ్చాత్తాపపడిన కార్యములేక స్వయంకృతాపరాధమునకు నోరెత్తక యనుభవించుచుండెను. ఇట్లున్న సమయములో నొకసారి సవతితల్లికి దేహములో రుగ్ణత వచ్చినది; అప్పుడెందఱిని గాళ్ళుగడుపులు పట్టుకొన్నను ఒక్కరైనను పథ్యపానములుచేసి పెట్టుటకుఁ గాని నిద్రారాకుండ దగ్గఱనుండి మాటలు చెప్పుటకుఁగాని వచ్చినారుకారు; గ్రామములోనివా రెవ్వరును పథ్యపానమునకయి తమనూతిలోనుండి నీళ్ళుసహితము తెచ్చికొనిచ్చినవారు కారు; మీరు గ్రామమునుండి లేచివచ్చిన నాలవ నాఁడే మనగ్రామములో వైద్యుఁడుగా నుండిన నంబి వరదాచార్యులు పోయినాఁడు. నేతి రామయ్య మనయింట వంటబ్రాహ్మణుఁడుగా నుండి కంచుచెంబుల తో డెత్తుకొనిపోయి ముంజ కిచ్చినందునకయి మీరు పని తీసివేసిన తరువాత వాఁడు మఱియొందునకును పనికిరాని వాఁడౌటచేత చదువులబడి పెట్టుకొని జీవనము చేయుచుండెనుగదా!

వరదాచార్యులు పోఁగానే వైద్యముకూడ నారంభించి వాఁడిప్పుడు గ్రామములో ఘనవైద్యుఁడయి యున్నాఁడు. మొదట వైద్యమారంభించినప్పుడు క్రొత్తగనుక రోగముల నామములను ఔషధనామములను మానాయనచేతనే వ్రాయించుకొని, యెఱ్ఱనివియు నల్లనివియు నయిన కుప్పెలుచేసి తీసికొనివచ్చి యేమందేరంగుగలదిగా నుండునో మానాయనవలననే తెలిసికొని వానిమీద "పూర్ణచంద్రోదయము" "వాతరాక్షసము" మొదలయిన పేళ్లనువ్రాసి యంటించినాఁడు. జీలకఱ్ఱ, ఖరియములు, మొదలయినవస్తువులలో సిందూరము వేసి నిమ్మకాయలరసముతో నూరి మాయింటనే మాత్రలుచేసి తీసికొని వెళ్ళుచుండెను. అతఁడేయౌషధమునడిగినను తనయొద్ద లేదనక తులమునకు రూపాయ మొదలుకొని యిరువది రూపాయలవఱకును వెలగట్టి యిచ్చుచుండెను. ఆరంభదశయందు వచ్చినసొమ్ములో మానాయనకుఁగూడ భాగమిచ్చెడివాఁడుగాని తాను పెద్దవైద్యుఁడని పేరుపొందిన తరువాతను మానాయనకు గ్రామములోనివారితో విరోధమువచ్చిన తరువాతను భాగమిచ్చుట మానివేసినాడు. అట్టివాఁడు మానాయన స్వయముగా వెళ్ళి తన భార్యకు జబ్బుగా నున్నదని బతిమాలి పిలిచినను ప్రజలకు వెఱచి యొక్కసారి చేయియైనను చూచి పోయినవాఁడుకాఁడు. వేయేల? ఊరివారు పెట్టవలసిన నిర్బంధముల నన్నిటిని బెట్టిరి; చీకటిపడినమీఁదట ఇంటిమీఁద బెడ్డలువేయ నారంభించిరి. నన్నె భార్యకుఁ గావలిపెట్టి మానాయనయే చెఱువుకుఁబోయి స్నానముచేసి నీళ్ళుతెచ్చుకొని వంటచేసి పగలు రెండు జాములకు పథ్యముపెట్టుచు, మీరయిన గ్రామములోనున్నఁ దనకింత యిబ్బంది రాదుగదా యని మీరుచేసిన యుపకారములను దలఁచుకొనుచు బహువిధముల విచారించెను. బహుప్రయాసముమీఁద కొన్నిదినములకు మాతల్లికి వ్యాధి నిమ్మళించినదిగాని దేహములో

బలముమాత్రముచేరినదికాదు. గ్రామములో విరోధమంతకంతకు ప్రబలినది. తెల్లవార లేచి చూచువఱకు, మావీథిగుమ్మముకడ నశుద్ధ పదార్థములును మనుష్యులపుఱ్ఱెలును పడియుండుచు వచ్చెను. మా తండ్రి వానినన్నిటినిదీసివేసి నిత్యమును రెండుసారు స్నానములు చేయుచు భార్య కుపచారము తిన్నగా జరగనందున నన్నామెవెంట నిచ్చినవారిమీఁద పుట్టినింటికి హేలాపురము పంపి, తానొక్కఁడు నిల్లు కనిపెట్టుకొని యుండెను.

బయలుదేఱిన మఱునాఁడురాత్రి నాలుగు గడియలప్రొద్దు పోయినతరువాత మేము సుఖముగాపోయి యేలూరుచేరితిమి. అక్కడఁ గొన్నాళ్ళున్నమీఁదట పథ్యము వంటఁబట్టుట చేతను తల్లిదండ్రుల యాదరణచేతను నాసవతితల్లి దేహము స్వస్థపడినది. ఒకనాఁడు నేనును నాసవతిమేనమామయు నుదయకాలమున దంతధావనము చేసికొని వీథిలో రావిచెట్టుచుట్టును గుండ్రముగా రెండడుగులయెత్తుగా వేయఁబడియున్న యరుగుమీఁదఁగూరుచుండి యుంటిమి. నాసవతితల్లి తండ్రి రావిచెట్టునకును వేపచెట్టునకును పెండ్లిచేయించి వానిచుట్టును విశాలమయిన యాయరుగు వేయించినాఁడు. ఆయరుగుమీఁద చెట్టునీడను గూరుచుండి గ్రామకరణమెప్పుడును పనిచూచుకొనుచుండును. అప్పుడు ముప్పదిసంవత్సరముల యీడుగల యొకనల్లనిశూద్రుఁడు తెల్లబట్టలు కట్టుకొని చంక మూటనుదగిలించుకొని వచ్చి 'మీరేమయిన కాసుల పేరు గొనియెదరా?' యని యడిగెను. మాసవతి మేనమామ 'ఏదీ చూపు' మని యడిగెను. ఆశూద్రుఁ డరుగుమీఁదఁ గూరుచుండి మూటనువిప్పి కాసులుపేరుతీసి యాతనిచేతి కిచ్చెను. అతఁడు చూచి వెలయడిగి నాచేతికిచ్చి బాగున్నదేమో చూడుమని చెప్పెను. నేను దానిని చేతఁబట్టుకొని నిదానించిచూచి, కొలికిపూసనుబట్టి యాన

వాలుపట్టి రుక్మిణిదని తెలుసుకొని 'నీకీకాసులపేరు నెక్కడనుండివచ్చె?' నని వానిని బ్రశ్నలువేసితిని. వాడు నేను వర్తకుడను కాఁబట్టి మా యూరిలో నొకనిచేత పట్టుతోఁకట్టించినా నని చెప్పెను. అందుమీఁద నేనా పేరు మాబంధువులదనిచెప్పి, 'యీదొంగసొత్తు నీయొద్దఁగనఁబడి నదికాఁబట్టి నిన్ను రాజభటుల కొప్పగించెద' నని బెదరించితిని. వాఁడును జడియక కాసులపేరు మాయొద్దనేదిగవిడిచి, తానాకుఁబోయి మీరుచేసినయక్రమమును జెప్పి 'మిమ్ములను బట్టుకొని శిక్షించుటకు బంట్రోతులను దీసికొనివచ్చెద' నని కేకలు వేయుచుఁబోయి, నేనచట రెండుదినములున్నను మరల రానేలేదు.

మూఁడవనాఁడు ప్రాతఃకాలముననే యొక కూలివాఁడు ధవళే శ్వరమునుండి వచ్చి నారాయణమూర్తిగారు వ్రాసిన జాబు నొకదానిని నాచేతి కిచ్చెను. నేను దానిని పుచ్చుకొని విప్పి చూచుకొనునప్పటికి "మీనాయన నేఁడే గృహము తగులఁబడి కాలముచేసినాఁడు కాఁబట్టి తక్షణము బయలుదేఱి రావలసినది" అని యందు వ్రాసి యుండెను. పిడుగువంటి యీవార్త చూడగానే గుండెలు బద్దలయి లోపలికిఁ బోయి యేడ్చుచు నాసవతితల్లి కాదుర్వార్తను వినిపించితిని ; ఆమాట విన్నతోడనే యామె నేలఁబడి కొప్పువిడిపోవ దొర్లుచు బొమ్మిచరచు కొనుచు నిల్లెగిరిపోవునట్లు రోదనముచేయ నారంభించెను. ఆయేడుపు లును పెడబొబ్బలును కొంచెము చల్లాఱినతరువాత నామెకు ధైర్యము చెప్పి, ఆకూలివానివెంట నాపూటనే బయలుదేఱి కాళ్ళు పొక్కు లెక్కునట్లుగా తెల్లవారినదాక నడచి మఱునాఁడు పగలు రెండు జాములవేళకు మాయిల్లు చేరితిని. అప్పుడాయింటికి గోడలుతప్ప మఱి యేమియులేవు. చుట్టుపట్ల నొకయిల్లయిన కాలక వింతగా మాయొక్క యిల్లు మాత్రము పరశురామప్రీతి యయినది. నేనక్కడ విలపించు

చుండఁగా నిరుగుపొరుగులవారు వచ్చి నన్నోదార్చి, నాలుగుదినముల క్రింద రాత్రి యాకస్మికముగా గృహమునకు నిప్పంటుకొని సాయము వచ్చులోపలనె కాలిపోయినదని చెప్పిరి. నేనంతట నారాయణమూర్తి గారియింటికిఁ బోయితిని. అతఁడావఱకే మాతండ్రికి దహనసంస్కారములు చేయించెను. మీరా గ్రామమునుండి వచ్చినప్పటినుండియు మానాయనయు నారాయణమూర్తిగారును ప్రాణస్నేహము కలవారుగా నుండిరి. మీరు ధవళేశ్వరము విడిచిపెట్టిన నెలదినములకు నారాయణమూర్తిగారి లోపల దొంగలుపడి యొకరాత్రి సర్వస్వము దోఁచుకొనిపోయిరి. అందుచే నతఁడు మరల బీదవాఁడై మాతండ్రి ననుసరింపఁగా భూతవైద్యములో తనకు సహాయుఁడుగా నాతనిని త్రిప్పుచు భోజనమునకేమయిన నిచ్చుచుండెను. మా నాయనకు గ్రామములో నందఱును శత్రువులుగా నేర్పడినప్పుడు, నారాయణమూర్తిగా రొక్కరే పరమమిత్రుఁడుగా నున్నాఁడు. మీరావలమఱం దికి గ్రామములోనివారు తనసొత్తును దోఁచుకొని పోవుదురని భయము తోఁచినప్పుడు, ఒకనాఁటిరాత్రి రహస్యముగా నన్ను తోడుపట్టుమని నగలును రొక్కము నున్న పెట్టెను నారాయణమూర్తిగారి యింటికిఁ గొనిపోయి ఆతని పడకగదిలోఁ బెట్టి లక్కతో ముద్రవేసి పైని కప్పతాళమువేసి తాళపుచెవిని తనదగ్గఱనే యుంచుకొనెను. నారాయణమూర్తి నన్నుఁజూచి మానాయనను తలఁచుకొని యేడ్చునప్పుడు, 'నాయొద్ద దాఁచుకొన్న నగలపెట్టెనుగూడ మరణకాలమునకుఁ దీసికొనిపోతివా' యనియేడ్చెను. నేను పడకగదిలోనికి వెళ్ళినప్పుడు పెట్టెయచటలేదు; ఆయింటమఱియొకచోటను గనఁబడలేదు. తరువాత మాతండ్రి చావునుగురించి యడుగఁగా, నేను హేలాపురమునకు వెళ్ళినది మొదలుకొని వీథిలోనికి వచ్చిన నెవ్వరేమిచేసెదరోయను భీతిచేత మీ

భావముకుంది లోపలతలుపు వేసికొని కూరుచుండుచువచ్చెననియు, అట్లు రెండుమూడుదినములు జరిగినపిమ్మట దామోదరయ్య లోపల తలుపు వేసికొని కూరుచుండి యేమో పాతాళహోమము చేయుచున్నాఁడని గ్రామములో నొకవదంతి కలిగినదనియు, ఆవల గ్రామములోనివా రందఱును నాలోచించి యందఱకును కీడుగలుగుటకై యేదో మహా మంత్రమును పురశ్చరణ చేయుచున్నాఁడుగాని వేఱుకాదని నిశ్చయించి దానికి విఘ్నము కలిగించినఁగాని తమకు బ్రతుకు లేదని గోదావరియొడ్డున సభ చేసినా రనియు, ఆరాత్రియే యిల్లు కాలుట మొదలుగాఁగలపని యంతయు జరగిన దనియు, అతఁడు చెప్పెను. నేనును పదిదినములకర్మయు జరిగినదాఁక వారియింటనే యుండి, పదమూఁడవనాఁడు బయలుదేఱరాను గనుక పదునాలవనాఁడు కాసుల పేరుతో మీరున్న గ్రామమునకు రావలెనని వచ్చుచుండఁగా, త్రోవలో సిద్ధాంతి యగపడి రహస్యముగ నన్ను దూరముగా దీసికొనిపోయి మానగలపెట్టెను నారాయణమూర్తి తమయింట దాఁచుట చెప్పి తనకు నూఱురూపాయలిచ్చెడు పక్షమున పెట్టె నాతనికియ్యక నిలిపి యుంచెద ననియు, మీమామగారిని చూచి వచ్చినతోడనే తగవు పెట్టవలసిన దనియుఁ జెప్పెను. నేనును మంచిదని చెప్పి మీకొఱకు వెదకుకొనుచు వచ్చితిని.

అని శంకరయ్య తనతండ్రి సంగతి యంతయుఁ జెప్పి మూటను విప్పి కాసులపేరును దీసి రాజశేఖరుఁడుగారిచేతి కిచ్చెను. ఆయన దానిని పుచ్చుకొని మేనల్లుని కౌఁగిలించుకొని యూరార్చుచు, దామోదరయ్య పోయినందుకు గొంతతడవు విచారించెను. అప్పు డింట నున్నవారందఱును దామోదరయ్యనిమిత్త మొకసారి రోదనముచేసి భోజనములు చేసిరి. ఆమధ్యాహ్న మంతయు లోకవార్తలతో ప్రొద్దు జరగినది.

దీపములు పెట్టిన కొంతసేపటికి వాద్యములచప్పుడు వినఁబడి నందున రాజశేఖరుఁడుగారు మొదలగు వారందఱును వీధిలోనికి చూడ వచ్చిరి. బలముగా ద్వాదశోర్ధ్వపుండ్రములను ధరించి యొకవైష్ణవ స్వామి పల్లకిలో గూరుచుండి యిరుప్రక్కల నిద్దఱు వింజామరలు వీచుచుండ కరదీపిక లనేకములు వెలుఁగ నూరేగు చుండెను. ఆవెనుక కొందరు తెలగాణ్యులును నొకవైష్ణవుఁడును గంధములు పూసుకొని తాళవృంతములతో విసరుకొనుచు నడుచుచుండిరి. ఆవైష్ణవుని రాజ శేఖరుఁడుగా రెఱుఁగుదురు గనుక దగ్గఱకు పిలిచి యీప్రకారముగా ముచ్చటింప నారంభించిరి.

రాజ——మీరు ధవళేశ్వరములో నున్న గూడూరువారికి గురువులు కారా ?

వైష్ణ——అవును. ఆపల్లకిలో గూరుచున్నవారి కీగ్రామములో నవసరాలవారు శిష్యులు.

రాజ——వెనుక నేను చూచినప్పుడు మీరు గురువులుగాను, మీకాయన శిష్యుఁడుగాను ఉండెడివారు కారా ?

వైష్ణ——మాలో మాకటువంటిభేదము లేదు. నాకు శిష్యులున్న గ్రామములో నతఁడు శిష్యుఁడుగాను, అతనికి శిష్యులున్న గ్రామములో నేనుశిష్యుఁడనుగాను, మాఱుచుందుము. ఆయన తాతయు మాతాతయు సహోదరులు; వారితండ్రి ప్రతివాదిభయంకరము గండభేరుండాచార్యుల వారు జగదేకపండితులు. వారు పరమపదమునకు వేంచేసిన తరువాత వారు సంపాదించిన శిష్యులను మాతాతలును తండ్రులును పాళ్ళువేసి కొని పంచుకొన్నారు. ఈగ్రామములోనివారు మావాని వంతునకును ధవళేశ్వరములోనివారు నావంతునకును వచ్చినారు. మాకాపురపు గ్రామమైన శ్రీకూర్మము విడిచి యీప్రకారముగా సంవత్సరమున కొక సారి శిష్యసంచారము చేయుదుము.

రాజ___వెనుక మీరాయనను చదువు రాదని చెప్పినారే, ఆయన శిష్యుల కేమి యుపదేశము చేయును ?

వైష్ణ___ఆయన కెంతచదువు వచ్చునో నాకు సంతేవచ్చును. శిష్యుల కుపదేశించుట కేమి చదువు రావలెను ? శిష్యుల కష్టాక్షరి చెవిలో నుపదేశించి నిత్యమును నష్టోత్తరశతము జపము చేసికొమ్మని చెప్పి, గురువే దైవమని నమ్మి కొలిచిన వైకుంఠము కరస్థ మని పలికి, బుజములమీఁద తప్తముద్రధారణము చేసి, మా గురుదక్షిణ పుచ్చుకొని మాదారిని మేము పోదుము. మే మెవ్వరితోను ప్రసంగిం చము గనుక మమ్మందఱును పండితు లే యనుకొందురు.

రాజ___మీ రీగ్రామములో పదిదినము లుందురా ?

వైష్ణ___ఉండము. రేపే వెళ్ళిపోయెదము. తరువాత సావకాశ ముగా దర్శనముచేసి మాటాడెదను.

అని యాతఁడు పల్లకీతోఁ గలిసికొనుట కయి పరుగెత్తెను.

వారు వెళ్ళినతరువాత వీధితలుపు వేసివచ్చి మగవారు రాత్రి భోజనమునకుఁ గూరుచున్నతోడనే యెవరో వచ్చి వీధితలుపుకడ "రాజశేఖరుడు మామగారూ" అని పిలువఁజొచ్చిరి. మాణిక్యాంబ నడవలోనికి వెళ్ళి 'యెవరువార' ని యడుగఁగా 'నేను నృసింహస్వామి' నని వెలుపలినుండి యొకరు పలికిరి. ఆమాటయొక్క ధ్వనియు పేరును విన్నతోడనే మాణిక్యాంబ భయపడి తటాలున లోపలికిఁ బరు గెత్తుకొని వచ్చి యా సంగతి భర్తతోఁ జెప్పి 'నృసింహస్వామి పోయి అన్నాళ్ళయినది ; ఎప్పుడును నాకీవఱకు స్వప్నములోనైనను గనఁబడలేదు. ఇప్పు డీవిరుద్ధమే' మని యాశ్చర్యపడఁ జొచ్చెను. ఇంతలో వీధితలుపువద్ద మరల కేకలువినఁబడెను. అప్పుడు రాజశేఖరుఁడు గారు భోజనముచేసి దీపము వెలిగించుకొని పోయి తలుపుతీసిరి. తీయఁగా నిజముగా నృసింహస్వామియే 'మామా' యని పలుకరించి,

ఆయనచేయి పట్టుకొనెను. ఆమె యల్లునిఁ బ్రత్యక్షముగాఁ జూచుచు సమ్మక మరలమరల దేహమును పట్టి చూచి, పాదములు చలము నై యున్నను శరీరియుండక తప్పదుగాన యుండు పలుకులన మాయాకారమని నిశ్చయించి యాతనిని లోపలికిఁ దీసికొనివచ్చి పార్వతితో నృసింహస్వామియే వచ్చినాఁడని చెప్పి కాళ్ళుకడుగ నీళ్ళిమ్మని [illegible] పెట్టెను. ఆమెయు దీపము దగ్గరగా దీసికొనివచ్చి మొగము పాఱఁ జూచి 'నాయనా' యని కౌఁగిలించుకొని కన్నీరునించెను. ఆమెనుజూచి యల్లుఁడును కన్నులనీరు పెట్టుకొనెను. ఆయుద్రేకమంతయు నడఁగిన మీఁదట, నృసింహస్వామి లేచి కాళ్ళు కడుగుకొని భోజనముచేయుచు తాను కాశీయాత్ర వెళ్ళుటయు దారిలో తనమిత్రుఁడు తన్ను విడిచి వచ్చుటయు మొదలుగాఁగల సంగతి నీప్రకారముగా జెప్ప నారంభించెను.

నాకు చిరకాలమునుండి కాశీయాత్ర చేసిరావలెనని మనసులో కోరిక యుండెను గాని తగినతోడు లేకపోవుటచేత నాకది దుర్లభమని యాతలఁపు విడిచిపెట్టితిని. ఇట్లుండఁగా నొకనాఁడు చామర్తివారి చిన్నవాఁడు శేషాచలము నాయొద్దకువచ్చి యెవ్వరితోను జెప్పనని నాచేతఁ దనచేతిలో చేయి వేయించుకొని రహస్యముగా దనకు హిమవత్పర్వతము దగ్గఱ తపస్సుచేసి స్వర్ణవిద్యను గ్రహింపవలెనని కోరిక గలదనియు, నేనుకూడ వచ్చినపక్షమున తనతో దీసికొనివెళ్లి యావిద్య నుపదేశించెదననియు, మనమిద్దఱమును బంగారముచేయు యోగము గ్రహించిన మీఁదట మరల నింటికివచ్చి కావలసినంత బంగారమును జేసికొని కోటీశ్వరులము కావచ్చుననియు చెప్పెను. ఆమాటలమీఁద మనస్సులో నాకును మిక్కిలి యాశపుట్టి, తప్పక బయలుదేఱి సాధ్యమయినయెడల కాశీయాత్రకూడ చేసికొనిరావలెనని నిశ్చయించితిని. తరువాత మేమిద్దర

పదునాల్గవ ప్రకరణము.

సుబ్రహ్మణ్యము పిఠాపురమునుండి వచ్చి తండ్రిని దర్శించుట - శ్రీ శంకరాచార్యులవారి యాగమనము - నీలాద్రిరాజు సభలో తన వృత్తాంతమును జెప్పుట - కృష్ణజగపతిమహారాజులుగారు రాజశేఖరుఁడుగారి మాన్యములను విడిపించి యిచ్చుట.

సుబ్రహ్మణ్యము పిఠాపురమునుండి బయలుదేఱి, సోమన్నతో నీలాద్రిరాజు వెంటవచ్చుచున్న రాజభటులతోఁ గలిసి భీమవరమునకు వచ్చి, అక్కడినుండి వారిని పెద్దాపురము పొమ్మని తా నొక్కఁడును దిన్నగా నింటికిఁ బోయెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు భోజనమునకు లేవఁబోవుచుండిరి. కొమారుఁడు వీధిగుమ్మములోనుండి లోపల నడుగు పెట్టగానే చూచి, అబ్బాయి వచ్చినాఁడని రాజశేఖరుఁడుగారు కేకవేసిరి. ఆ కేకతోనే 'యేఁడీ యేఁడీ' యని లోపలినుండి యందఱును నొక్కసారిగా పరుగెత్తుకొనివచ్చిరి. అందఱికంటెను ముందుగా సీత పరుగెత్తుకొనివచ్చి అన్నగారిని కౌఁగలించుకొనెను. ఇంతలో మాణిక్యాంబ రాఁగా సుబ్రహ్మణ్య మామెను కౌఁగలించుకొని, తరువాత తల్లిదండ్రుల కిద్దఱికిని నమస్కారముచేసి వారిచేత నాశీర్వాదములను బొందెను. ఈనడుమ నృసింహస్వామి వచ్చి సుబ్రహ్మణ్యముయొక్క చేయిపట్టుకొని 'బావా!' యని పిలువగానే యతఁ డాతని మొగమువంక దిరిగిచూచి మాటరాక యద్భుతపడి చూడసాగెను. అట్లొక నిమిషముచూచి మఱఁది నాలింగనముచేసి 'యెప్పుడు వచ్చినా' వని యడిగి, మగఁడు జీవించియున్నాఁడన్న వార్త విని సంతోషించుటకు రుక్మిణికి ఋణము లేకపోయెనుగదా యని కన్నుల నీరు పెట్టుకొనెను. అంతట రుక్మిణి బ్రతికియుండుటయు దొంగలు కొట్టిన రాత్రినుండియు నామెకు సంభవించిన యాపదలును

తెలుపక సుఖముగా నిల్లుచేరుటయుఁ జెప్పి, రాజశేఖరుఁడుగారు కొమారుని నూరార్పఁ జొచ్చిరి. ఆమాటలు ముగియక మునుపే సంతోషము పట్టలేక సుబ్రహ్మణ్యము లోపలికిఁ బోయి రుక్మిణి నాలింగనము చేసికొని యామె తన్నుఁ జూచి కంటఁ దడి పెట్టుకొనఁగా నూరడించెను. ఈవలకు వచ్చిన తరువాత నృసింహస్వామి తనకథను సాంతముగా వినిపించెను. పిమ్మట నందఱును స్నానములుచేసి యుతికిన మడుఁగుదోవతులు కట్టుకొని భోజనములకుఁ గూరుచుండిరి. భోజనసమయమున సుబ్రహ్మణ్యము పిఠాపురములో రాజుగారి లోపల దొంగలు పడుటయు దొంగలను తాను పట్టుకొన్నరీతియు వారికిని సొత్తులో పైరాగి యెత్తుకొని పోయిన తన సొమ్మునకుఁ గనఁబడుటయు విమర్శన నిమిత్తమయి కృష్ణజగపతి మహారాజుగారి యొద్దకుఁ బంపఁబడిన దొంగలతోఁ గూడఁ దన్నిచ్చుటకు బంపుటయు జెప్పి, యిక్కడనుండి వెళ్ళినతోడనే తనకొక నుంచి యుద్యోగము నిచ్చినను పిఠాపురపు రాజుగారు వాగ్దానము చేసియున్నారని చెప్పెను. అప్పుడు రాజశేఖరుఁడుగారు "మన యింటికి రాకపోకలు చేయుచు వచ్చిన రామరాజే కృష్ణజగపతిమహారాజుగా" రని చెప్పి, ఆయన యద్భుతచర్యలను తమకుఁ జేసిన యుపకారమును నామూలాగ్రముగా వినిపించి యాయనను పొగడిరి. ఇంతలో భోజనము లైనందున లేచి చేతులు కడుగుకొని తాంబూలములు వేసికొని తెల్లబట్టలు కట్టుకొని రాజశేఖరుఁడుగారును సుబ్రహ్మణ్యమును బయలుదేఱి నృసింహస్వామిని వెంటఁ బెట్టుకొని పెద్దాపురమునకుఁ బ్రయాణమయి పోయిరి.

వారు పెద్దాపురము చేరి రాజవీధిని ప్రవేశింపఁగానే యావీధినే దూరమున నొక పల్లకియును దానిముందొక యేనుగును రెండు గుఱ్ఱములును బండిమీఁద నొక భేరియును మఱికొన్ని వాద్యములును వెను

కను స్వస్తివాచకబృందములును దృగ్గోచరమయ్యెను. ఆ యాడంబరము చూచి రాజశేఖరుఁడుగా రాదిన మేదో దేవతోత్సవము కాఁబోలు ననుకొని, కుమారునివంకఁ జూచి యీయుత్సవము శివుని దయి యుండునా విష్ణుని దయి యుండునాయని యడిగిరి.

సుబ్ర—అది దేవుని యుత్సవము కాదు. శ్రీశంకరభగవత్పాదులవా రీపట్టణమునకు వేంచేసి యుందురు. వారు నెల దినములనుండి పిఠాపురములో నివాసము చేసియున్నారు. నేను బయలు దేఱినప్పుడే వారును ప్రయాణ మయి యీపట్టణమునకు రావలెనని బండ్లు మొదలగు వానిని వాకిట నిలువఁబెట్టియుండఁగాఁ జూచితిని.

రాజ—అక్కడ భిక్షలు విశేషముగా జరిగినవా ?

సుబ్ర—మిక్కిలి చక్కఁగా జరిగినవి. వారింటింటికిని శ్రీముఖములను వ్రాసి తలకొక రూపాయవంతున పోగుచేసినారు. అదిగాక యనేక వితంతువులును ధనవంతులును పళ్లెరములలో పండ్లును రూపాయలను వేసికొని వెళ్లి పాదపూజ కని సమర్పించుకొనుచు వచ్చిరి. వారు సాష్టాంగనమస్కారము చేసినప్పుడెల్లను స్వాములవారు 'నారాయణ' యనుచు రాఁగా, చేరువనుండు శిష్యులు పళ్లెములోనివానిని జాగ్రత్త చేసి వట్టిపళ్లెములను వారివి వారికి మరల నిచ్చుచుండిరి. గ్రామమునందలి వైదికు లందఱును జేరి రెండు భిక్షలు చేసినారు ; లౌక్యుల యిండ్లలో నాలుగు భిక్షలు జరిగినవి ; తక్కిన దినములలో కోమట్లు బ్రాహ్మణ గృహమున భిక్షలు చేయించుచు వచ్చిరి.

రాజ—నీ వెప్పుడయిన వెళ్ళి పీఠదర్శనము చేసినావా ?

సుబ్ర—రెండుమూడు పర్యాయములు చేసినాను. పీఠము నిలువెడెత్తున నున్నది ; దానినిండను బహువిధములైన విగ్రహములును సాలగ్రామములును నున్నవి. వెండిపువ్వుల పీటమీఁదఁ గూరుచుండి

పట్టుశాటి కట్టుకొని స్వాములవా రెప్పుడును కుంకుమముతో పీఠపూజ చేయుచుందురు. ఆపీఠములో శ్రీ యంత్రముకూడ నున్నదనియు, వారు పూర్వాశ్రమమునందు సహితము శ్రీ విద్యోపాసకులే యనియు విన్నాఁడను. అది సత్యమౌనో కాదో కాని వారిప్పుడు మాత్రము రాత్రులు చీఁకటిలో ముసుఁగు వేసికొని యొక మనుష్యుని వెంటబెట్టు కొని ప్రత్యక్ష మయిన శ్రీయుపాసనము చేయుటకై బయలుదేఱు చుందురని చూచినవారే యొకరు నాతో రహస్యముగాఁ జెప్పినారు. మొన్న నీనడుమ నొక శిష్యుఁ డెత్తుకొని పాఱిపోయినది గాక, యింకను పీఠమునకు రెండువేల రూపాయల వెండిసామగ్రి ఉన్నది.

రాజ—వారు గ్రామములో నున్నకాలములో మతసాంకర్య నివారణముగాని మతవ్యాపనముగాని చేయుట కేమయిన బ్రయత్నము చేసినారా ?

సుబ్ర—అట్టిపను లేమియు చేయ లేదుగాని యొక్క ఘనకార్య మును మాత్రము చేసినారు. ఆగ్రామములో ధనవంతురాలయిన యొక బాలవిధవ యున్నది. ఆమెయేమో భ్రూణహత్య చేసినదని గ్రామము లోని సభాపతులు కొందఱామెను జాతినుండి బహిష్కారముచేసిరి. తరు వాత నామెకు జగన్నాథసంతర్పణము చేసినప్పుడు ధనము కాశపడి కొందఱు బ్రాహ్మణులు భోజనములు చేసిరి. అందుచేత నక్కడకు భోజనములకు వెళ్ళినవారందరు నొకకక్షగాను, వెళ్ళనివారందరు నొక కక్షగాను నేర్పడిరి. లోకమున కెల్లను ధనమె మూలమగుటచేతను, ఆమె లక్షవత్తులనోము మొదలయిన వ్రతములుచేసి యప్పుడప్పుడు బ్రాహ్మణసమారాధనలు చేయుచు వచ్చుచుండుటచేతను, క్రమక్రమ ముగా సంఖ్యయం దామె పక్షమువారే బలపడి మొదట వెలివేసిన వారికే యిప్పుడు వెలిగా నుండెను. తరువాత స్వాములవారు విజయం

చేసి యీరెండు పక్షములవారిని సమాధానపరచి, ఆ నూరియొద్ద తాము రెండువందల రూపాయలను స్వీకరించి యీ వెనుక పుస్తకములకు వెలలు తీసి వేయించి, ఆ కేశఖండన మహోత్సవమయిన మరునాఁడే యిఁక మీఁదట భిక్షచేసి ముందుగా తాము పాదోదకము పుచ్చుకొని తరువాత బ్రాహ్మణుల కంఠశుద్ధి నిష్పించి నాటిన్నాళ్ళ వెలితీర్చి చేసిరి.

రాజ—ఆ స్వాములవారు పూర్వాశ్రమములో నేగ్రామ నివాసులు ?

సుబ్ర—వారి నివాసస్థలము ముంగొండయగ్రహారము. ఆయనకు నలుగురు కొమాళ్ళున్నారు. ఆశ్రమమును స్వీకరించిన తరువాతనే స్వాములవారు మునుపు మాన్యములమీఁద నున్న ఋణములను దీర్చివేసి నలుగురు కొమాళ్ళకును వివాహములు చేసి కోడండ్రకొక్కొక్కరికి రెండేసివందల రూపాయల యాభరణము లుంచినారు. ఇప్పుడీస్వాములవారిపేరు శ్రీ చిదానందశంకర భారతిస్వామి యఁట.

అని మాటాడుకొనుచు వారు రాజసభకుఁ బోవునప్పటికి రాజుగారు కొలువుకూటమునకు విజయంచేసి సింహాసనాధిష్ఠితులై కూరుచుండియుండి మంత్రి తెచ్చియిచ్చిన విజ్ఞాపనపత్రికలను జదివి చూచుకొని పిఠాపురమునుండివచ్చిన దొంగలను తమయెదుటఁ బెట్టుటకు త్వరపుచేసిరి. ఈలోపల రాజశేఖరుఁడుగారును సుబ్రహ్మణ్యమును నృసింహస్వామియు సభ బ్రవేశించి తగినచోటులఁ గూరుచుండిరి; రాజభటులును దొంగలనుగొనివచ్చి ప్రభువునెదుర నిలువఁబెట్టి తాము ప్రక్కలను కత్తులుదూసికొని నిలుచుండిరి. అప్పుడు రాజుగారు సభ కలయఁజూచి 'యీదొంగలను పట్టుకొన్నవా రెవ' రని ప్రశ్న వేసిరి. సుబ్రహ్మణ్యము లేచి నిలువఁబడి 'నేను' అని మనవిచేసెను. తోడనే ప్రభువువారు రాజశేఖరుఁడుగారివంక దృష్టిబరపి "యీతఁడు

మీకొమారుఁడు కాఁడా" అని యడిగి "చిత్తమని" యాయన బదులుచెప్పఁగా విని యెడమప్రక్కను గూరుచున్నవా రెవరని మరల నడిగిరి. రాజశేఖరుఁడుగారు చేతులు కట్టుకొని నిలుచుండి యీతఁడు తమ యల్లుఁడగుటయు గిట్టనివాఁడొకఁడు ఆతఁడు వారణాసీపురమునసున్న కాలములో వచ్చి మృతుఁడయ్యెనని వట్టిప్రవాదము వేయుటయు రుక్మిణి దొంగలచేత దెబ్బతిని మూర్ఛపోయియుండఁగా తన్నందఱును దిగవిడచిపోయిన తరువాత మూర్ఛతేఱి పురుషవేషము వేసికొని సీతనెత్తుకొనిపోయిన గ్రామమునుండి చెల్లెలితోఁ గూడ వచ్చుటయు సమగ్రముగా విన్నవించిరి. రాజుగారు హర్షమును దెలుపుచు శిరఃకంపముచేసి, కొంతసే పూరకుండి యావంకఁదిరిగి "మీరేమి చెప్పుకొనెద" రని యడిగిరి.

నీలా—సర్వమును దెలిసిన దేవరవారికడ మేము వేఱుగ చెప్పుకోవలసిన దేముండును ? మేము నిరపరాధులమని చెప్పఁబోము. దేవరవారు దయాపూర్ణ హృదయులు గనుక ఆదయారసమును మామీఁదఁ బ్రసరింపజేయ దీనత్వముతో వేడుకొనుచున్నాము.

కృష్ణ—నీది యేదేశము ? చిన్నప్పటినుండియు నీ వెక్కడ నున్నావు ? నీచరిత్రమేమి ?

నీలా—నాచరిత్రము మిక్కిలి యద్భుతమయినది. నేను దానిని చెప్పుకొనుటకు సిగ్గుపడవలసియున్నను దేవరయంతటివారడుగుచున్నారు గాన దాఁచక విన్నవించెదను. ఈవఱకు నేను జేసిన దుష్కృత్యము లన్నిటిని తలఁచికొనిన యున్నప్పుడెల్ల నాకు స్మరణకుఁదెచ్చి నామనస్సు పలువిధముల నన్ను బాధించుచున్నది ; రాత్రులు నన్ను నిద్రపోనీయదు ; కలలోసహితము నేను జేసిన ఘోరకృత్యములకు రాజభటులు నన్నుఁగొనిపోయి శిక్షించుచున్నట్టు

కనఁబడి యులికి పడుచుందును. అంతేకాక నాకిప్పుడు వార్ధికమువచ్చి యున్నది. కాఁబట్టి చిరకాలము బ్రతుకఁబోను. ఆ సంగతిని తలఁచుకొను నపుడెల్ల నాకు యమభటులవలన భయముచేత దేహము కంప మెత్తుచున్నది. రాజదండనను పొందినవారికి యమదండనలేదని పెద్దలు చెప్పుదురు. కాఁబట్టి నేను చేసిన పాపమునకు మీవలన శిక్షను బొంది సుఖింపఁగోరుచున్నాను.

కృష్ణ—నీచరిత్రమంత యద్భుతమయిన దయ్యేనేని, సవాకల్యముగా వినిపింపుము. ఇచ్చట నున్నవారందఱును విని యానందించెదరు.

నీలా—నాజన్మస్థానము కాశహస్తి. నా తల్లిదండ్రులంతగా ధనవంతులు కాకపోయినను శూద్రకులములలో మిక్కిలి గౌరవమును కాంచిన వంశమునందుఁ బుట్టినవారు. నాతల్లిదండ్రులకు నేనొక్కఁడనే పుత్రుఁడను గనుక నన్నువారు మిక్కిలిగారాబముతోఁ బెంచుచుండిరి. నేనేదికావలెనన్నను తక్షణము తెచ్చిపెట్టుచుండిరి. అయిదేండ్లు వచ్చినతరువాత నన్నొకనాఁడు చదువవేసి, పంతులకు దోవతుల చాపును గట్టఁబెట్టిరి. ఆపంతులేవిధముననను దనకు జీవనము జరగనందున వీనుగులమోయు వ్యాపారమునఁ బ్రవేశించి ముసలివాఁడయి తాను చిన్నప్పుడైనను చదువుకొన్నవాఁడు కాకపోయినను తుదకు చదువులబడిని జీవనోపాధిగా నేర్పఱచుకొని మాగ్రామమును జేరెను. ఆతఁడుచెప్పెడు చదువొక్కముక్కయైనను లేకపోయినను గొట్టెడిదెబ్బలు మాత్ర మక్షరలక్షగా నుండెను. అయిన నాతఁడు ధనమిచ్చిన వారి యెడ మిక్కిలి ప్రేమ గలవాఁడు గనుక నాతల్లిదండ్రులు చిఱుతిండి నిమిత్తమయి నాకిచ్చెడి సొమ్ములో సగము పంతులకిచ్చి దెబ్బలు తప్పించుకొంటిని. అందుచేత పంతులు నామీఁద నత్యంతప్రేమగల వాఁడై నాకు బడి పెత్తనమిచ్చి, నాతల్లిదండ్రులతో మీకొమారు

సంతతి బుద్ధిమంతుఁడు లేఁడని చెప్పుచుండును. చిన్నప్పటినుండియు నేను నిజముగా సూక్ష్మబుద్ధికలవాఁడను నేర్పుకలవాఁడను అవుదును. నా నేరుపరితనమువలన మావారి కెప్పుడును నష్టమేకాని చిల్లిగవ్వ యైనను లాభముకలుగకపోయినను నాజననీజనకులు నన్ను నేరుపరిని గా నెంచి సంతోషించుచుండిరి. ఏలయనిన, నేను నా నేరుపంతయు నితరులను మోసముచేయుటయందే యుపయోగించుచు వచ్చితిని. నేను మోసములను నేర్చుకొనుటలో నిచ్చినశ్రద్ధలో సగమైనను ఏదో యొకవృత్తిని నేర్చుకొనుటలో నిచ్చియుంటినేని, నేనీపాటి యెంతో భాగ్యవంతుఁడనై యుందును. ఆసంగతి నట్లుండనిండు. నాకు బడి పెత్తనము వచ్చుటచేత పంతులుతో చాడిచెప్పి కొట్టించెద నని పిల్లలను బెదరించి తినుబడి పదార్థములను లంచముపుచ్చుకొనుచుందును. ఇట్లుండఁగా నాదురదృష్టవశమున ఆ పంతులు కాలముచేసెను. ఆకాలములో పంతులెంతవిస్తారముగా దెబ్బలుకొట్టుచున్న నంతగట్టివాఁ డనిపించుకొనుచుండును గనుక చదువుకొన్నపంతు లదివఱకే మాయూర బడి పెట్టుకొనియున్నను, అతఁడు పిల్లలయందు ప్రేమగలవాఁడై నిష్కారణముగా కొట్టుటకు పాలుపడనందున, పిల్లల నెవ్వరు నాతనిబడికిఁ బంపకుండిరి. ఇప్పుడు గ్రామములో రెండవపంతులు లేనందున, మాబడిలోని పిల్లలనందఱను విధిలేక యక్కడకే పంపవలసివచ్చెను. ఈకొత్త పంతులవద్ద మునుపటివలె నాయాట లేమియు సాగినవికావు. ఇంతలో మాతండ్రియు నాకస్మికముగా గుండెలలో నొప్పివచ్చి లోకాంతరగతుఁడయ్యెను. అతఁడు తనధనము నెక్కడనో పాతిపెట్టి మరల కాలమునందెవ్వరితోను చెప్పకయే కాలముచేసినందున పెద్దమ్మ వారు మమ్ము మఱింత శీఘ్రముగా వచ్చి యాశ్రయించెను. ధనికుఁడైన మా పొరుగువారి పిల్లవాఁడొకఁడు మాబడిలోనే చదువుకొను

చుండెను; ఆతఁడు చదువునందు మిక్కిలి యాశక్తి కలవాఁడు; ఆతనితో నేను మైత్రిచేసికొని మిక్కిలి నమ్మకమిచ్చి మెలఁగుచుంటిని. కొందఱు నమ్మకమిచ్చినప్పుడు మనసుకూడ నిచ్చి యూరకుందురు; నేను తెలివిగలవాఁడను గనుక ఆలాగున జేయక వేయినమ్మకము లిచ్చినను మనసుమాత్ర మియ్యక దాఁచుకొంటిని. ఈప్రకారముగా నుండి యతనిని పలువిధముల మోసముచేసి ధనమార్జించు చుంటిని. అది యేమి మాయయోకాని నేనెన్నివిధముల మోసముచేసి ధనము సంపాదించుకొనుచున్నను బీదవాఁడనుగాను, అతఁడు ధనవంతుఁడు గాను ఉంటిమి. అతఁడు విద్యయందు వృద్ధిపొందినకొలఁది, నేను ద్యూతవిద్యయందు పాండిత్యమును పొందనారంభించితిని. చెడుపిల్ల వాండ్రతోడి సాంగత్యమువలనఁ జదువు మానివేసి డబ్బుపెట్టి జూద మాడ మొదలుపెట్టి యీవ్యసనములోఁ బడి యింటఁగల వస్తువులను దొంగతనముగాను బలవంతముగాను దీసికొనిపోయి జూదగాండ్రకు సమర్పించుచుందును. ఇట్లుండియు మాపొరుగు చిన్నవానితోడి చెలిమిని మాత్రము మానలేదు. ఆతనిపేరు భాస్కరుఁడు, నాపేరు పద్మనాభుఁడు. ఇట్లు జరుగుచుండఁగా నాకు పదియాఱుసంవత్సరములు దాఁటినవి; నామిత్రుఁడు పెద్దవాఁడై గృహ యాజమాన్యమును వహించి విద్యాభిరుచి గలవాఁడై సదాపండితులగోష్ఠిని ప్రొద్దుపుచ్చు చుండెను. నేనొకనాఁ డితనియొద్దకు బోయి నాస్థితిగతులను జెప్పుకొని నాతండ్రియు వర్తకుఁడే గనుక నాకు వ్యాపారము చేయ నిష్టముకలదనియు మూలధనము క్రింద నేమైనఁ బెట్టుబడి బెట్టి సాయము చేయవలసినదనియు కోరితిని. అతఁడు తానుగూడ పాలికుండెదనని చెప్పి రెండువందల రూపాయలను నాచేతికిచ్చి నేను పనిచేయుటకును తాను వడ్డి పుచ్చుకొనకుండుటకును వచ్చిన లాభముతో చెఱిసగము

చూచుకొనుటకును నన్నొకడ బఱిచి పంపెను. మాకు వచ్చిన లాభము స్వల్పమే యైనను పనిచేయువాఁడను గనుక నాకెక్కువ లాభము కావలెనని నేను నా మిత్రునితో కలహము పెట్టుకొన జొచ్చితిని. రాజు లనుభవించుటకు రాజ్యములున్నను, ఒకరితో నొకరు పోట్లాడిచత్తురు; సన్యాసులకు కౌపీనము కంటె నధిక మేమియు లేకపోయినను పోరులేక సంతుష్టి పొంది యుందురు. దైవము దయచేసినదానితోఁ దృప్తి పొందియున్న నేకలహములును గలుగవు. తృప్తిలేక యాశా పిశాచముచే నావహింపఁబడినచో నెల్ల కలహములును గలుగును. అయినను నాస్నేహితుఁడు మిక్కిలి మంచివాఁడును ఉదారసాహసము కలవాఁడును గనుక, ఒకనాఁడు నన్ను తనదగ్గఱకుఁ బిలిచి యిట్లనియెను.

"నీవు మొదటినుండియు వర్తకుఁడవుగా నున్నావు గనుక నీకుసొమ్మునందే యిష్టము; నాకు విద్యాధనమునందు మాత్ర మిష్టము. త్యాగభోగముల కక్కఱకు రాకపోయినను ధనమునుజూచు కొనుచున్నను నీకు సంతోషము కలుగును. నాకు గౌరవముతో జరగుట కున్నంజాలును. కాఁబట్టి యీ రెండువందల రూపాయలను నీవు పుచ్చుకొమ్ము".

అనియాతఁడు పెట్టుబడి పెట్టిన సొమ్మును నాకు విడిచిపెట్టెను. ఆసొమ్ము చేతికందిన సంతోషముచేత, మఱింత యుల్లాసముతో దుకాణము కట్టిపెట్టి రాత్రియు పగలునుకూడ జూదమాడ సాగించి కొన్ని మాసములలో సొమ్మంతయుఁ బోఁగొట్టుకొని జోగినైతిని. తరు వాత పశ్చాత్తాపపడి, తిండికిసహితము జరగక యిబ్బందిపడుచు నొక నాఁడు మాసికలువేసిన బట్టలతో స్నేహితునియొద్దకుఁ బోయి యాతఁడు చేసిన యుపకారమును బహువిధములఁ గొనియాడి నాకు

సంభవించిన దురవస్థయంతయుఁ జెప్పుకొంటిని. అతఁడు నాస్థితిని విని మిక్కిలి విచారపడి, సొమ్ము చేతనుంచినయెడల పాడుచేయుదు నని యెఱిఁగి, యొకస్నేహితునకు జాబువ్రాసి నన్నచటికిఁ బంపెను. నేనా యుత్తరమును దీసికొనిపోయి చూచినతోడనే యాతఁడు నన్ను మధ్యాహ్నమున రమ్మనిచెప్పి నాకు నెలకు పదిరూపాల జీతముగలపని నొకదాని నిచ్చెను. నేనాపనిలో రెండుమాసము లుండువరకు నాకది యెంతో భారముగా కనఁబడెను. ఒంటిగానున్నప్పుడు నాకంటఁబడిన వస్తువులనెల్లను హస్తలాఘవమునుజూపి నేను మాయముచేయుచు వచ్చినందున, నాయజమానుఁడు వారిమీఁదనుపెట్టి వీరిమీఁదను పెట్టి నన్ను దిట్టుచుండెను. అంతియకాక యొకరికి లోఁబడియుండి వారు చెప్పినట్లెల్ల పనిపాటలు చేయుట నాస్వభావమునకు సరిపడినదికాదు. నాకు స్వభావముగా మహారాజువలె నుండవలెనని యాశ గనుక, ఆపనిని విడిచిపెట్టివచ్చి యింటివద్ద కాలిమీఁద కాలువేసుకొని కూరుచుండి నన్ను నమ్మినవారికడ నెల్లను ఋణములుచేయుచు, అప్పుపుట్టినంతకాలము సులభముగా జీవనము చేయుచుంటిని. ఈప్రకారముగా నిరుద్యోగముగా జీవనముచేయుచున్న కాలములో నేనితరులు చేయు హితబోధ నెప్పుడును వినకపోయినను, అడుగుటయందు మాత్రము విశేషశ్రద్ధ పుచ్చుకొని విశేషనీతివాక్యములను నేర్చుకొంటిని. అటుతరువాత నానీతివాక్యములు నాకేమియుఁ బనికిరాకపోయినను ఇతరులకైనఁ బనికివచ్చునని యెంచి మూఢులకు హితోపదేశములుచేసి గొప్పవాఁడనని పేరుపడి ధనమార్జింప నారంభించితిని. అప్పుడు సహితము నానడత తిన్నగా నుండనందున నొకనాఁడొక భక్తుఁడువచ్చి 'మీరిన్ని నీతులను జెప్పుచున్నారుగాని మీప్రవర్తనము తిన్నగా నున్నదా ?' యని నన్నుఁ బ్రశ్నచేసెను. 'నాకుఁ బనికి రావనియేకదా యానీతు

లన్నిటిని మీకు వదలివేయుచున్నాను; నాకే పనికివచ్చిన యెడల నొక్క వాక్యమయిన నాకుక్షిలోనుండి పైకి రానిత్తునా?' యని సమయోచితముగా బ్రత్యుత్తరము నిచ్చి, యింక నందు నిలుచుట కార్యము కాదనుకొని శీఘ్రముగా మాగ్రామము వదలివేసి దేశాంతరమునకుఁ బోవలెనని బయలు దేఱితిని. అట్లు బయలుదేఱి గ్రామైకరాత్రముగా శయనించుచు భోజనము చేసినయూరఁ బరుండక నిత్యప్రయాణములు చేయుచు, ఒకనాఁ డొకగ్రామముపఱగడ గొప్పమేఁకలమంద నొకదానిని జూచి ఇన్ని మేఁకలను వాఁడెట్లు కాపాడఁ గలఁడాయని గొల్లవానియందు మిక్కిలి కనికరము తోఁచి కొంతభారము తగ్గించినను తగ్గించుటయే యని రెండు మేఁకపిల్లలను బుజముమీఁద వేసికొని నడవనారంభించితిని; అప్పుడు వానివెంటనే తల్లియు నఱచుచు రాసాగెను; అదిచూచి తల్లిబిడ్డల నెడఁబాపిన పాపము వచ్చునని కొంతభూతదయ గలవాఁడనై యాపిల్లలతల్లినిగూడ దోలుకొని పోవుచుంటిని. ఆసంగతి నేలాగుననో కనిపెట్టి గొల్లవాఁడు నావెనుక 'దొంగా! ఆగు' మని కేకలు వేయుచు నడచివచ్చుచుండెను. అదివరకును పయిగ్రామము నెంతప్రొద్దెక్కి చేరుదునోయని భయపడుచుంటిని గాని, వాని కేకలతో నిమిషములో నూరుచేరి సంతోషించి తిరిగిచూచితిని; వాఁడు నాపరుగు కలిసికోలేక తక్కినమేఁకల నెవ్వరెత్తుకొని పోదురో యని యప్పుడే వెనుక మరలిపోయెను. నేనా మేఁకను పిల్లలను పొరుగూరులో విక్రయించి యాసొమ్ము దారిబత్తెమున కుంచుకొని, కొన్నిదినములలో కొండవీడుచేరి యచటయోగినై యుండి, నాయొద్ద సీతారామయంత్ర మున్నదనియు దానిని జూచిన వానికి సమస్తసంపదలు గలుగుననియుఁ జెప్పి, యొకబొమ్మరాతిని గదిలోనుంచి రహస్యముగా డబ్బుడబ్బుచొప్పునఁ బుచ్చుకొని చూప

నారంభించితిని. ఏపాటివస్తువు నయిననుసరే రహస్యముగా నుంచుట వలన దానియందు గౌరవము హెచ్చును. దివ్యక్షేత్రములయందలి దేవాలయములలోని విగ్రహములను పామరులు పూజారులకు దక్షిణ లిచ్చి స్వామి యెంత బాగుండునో యని చూచులాగుననే యెల్లవారును నాకును కానుకలను సమర్పించి యీబొమ్మరాతిని మూఁకలుగా వచ్చి జనులుచూచి పోవుచుండిరి; చూచినతరువాత చేతకాని పని వానిచేతఁ జెక్కఁబడిన యాకురూపముగల విగ్రహములందువలెనే యీరాతియందును వీధిలోఁ గనఁబడెడి బొమ్మరాయియేయని యెల్ల వారికిని ననాదరము కలుగనారంభించెను. నిజముగా నేను సీతారామ యంత్రమని లోపలఁబెట్టిచూపిన శిలను ఒకదినమున వీధిలోఁబెట్టి చూపినచో మఱునాఁడెవ్వరును దాని మొగమువంకనైనఁ జూడఁ గోరరు. నేనాప్రకారముగా యోగినిగా నున్నకాలములో ప్రయోగ విద్యయందును భూతవైద్యమునందును మిక్కిలి ప్రసిద్ధికెక్కినవాఁడను కాఁబట్టి నామహాత్వము నెల్లవారును చెప్పుకొనుచుందురు. నేను వదలింపఁబూనుకొన్న దయ్యముల కథలనుబోలె నాకథలనుసహితమెల్ల వారును నత్యాదరులై వినుచువచ్చిరి కాని యివియువానివలెనే వినువారిభయమును మఱింత వృద్ధిపఱుచుటకే వినియోగపడుచు వచ్చినందున, గ్రామములో నందఱును నే నేమిప్రయోగము చేసిపోదునేమో యని నాకు జడియుచుండిరి.

పయిమిషచేత ధన మార్జించి యీగ్రామములో సుఖజీవనము చేయుచుండఁగా నన్ను వ్యాధి యాశ్రయించినందున, నే నదివర కెందఱికో మరణమున బ్రహ్మైక్యమే కాఁబట్టి సంతోషింపవలయు నని బోధించుచువచ్చినను చచ్చిపోదునని భయపడఁజొచ్చితిని. మీరే యోగిని బిలిచి మీకు మరణ మన్నభయ మేమైనఁ గలదా యని

యడిగినను తడవుకోకుండ లే దని చెప్పునుగాని యాతనికిఁ గొంచెము రోగము వచ్చినప్పుడుమాత్ర మాతనిచర్యవలన మూఢులకుండు దానికంటె నెక్కువభయము కలిగియుండుటను గనిపెట్టవచ్చును. నేనట్లు యోగివేషము వేసికొనియున్న కాలమున నితరులే యోగిని ప్రశంసించినను, నేనాతఁ డెంతవాఁడని తృణీకరించుచుందును. సాధారణముగా యోగ్యులు తాము కీర్తిని బొందవలెనని కోరుచుండఁగా అయోగ్యులు వారికీర్తిని పాడుచేసి తమకీర్తితో సమానమైనదానినిగాఁ జేయఁ జూచుచుందురుగదా ? నే నిట్లనేకవేషములు వేసి కడపట బైరాగినై వీరినిద్దఱిని శిష్యులనుగాఁ గైకొని చిదానందయోగియను పేర ధవళేశ్వరము ప్రవేశించి, యీ రాజశేఖరుఁడుగారినే స్వర్ణము చేసి యిచ్చెద నని మాయచేసి యిప్పుడుతమయొద్దకుఁదెచ్చిన నగలనే యపహరించుకొని పోతిని. అక్కడనుండి పోయినపిమ్మట గడ్డమును మీసమును గొఱిగించుకొని నీలాద్రిరాజు నయి పిఠాపురము ప్రవేశించి, వీండ్రసాయముచేతనే రాజుగారి ధనాగారములోని ధనమును తరలించితిని. ఈ రెండుచోట్లను నేను జరిగించిన యద్భుతచర్యలును నానటనమును రాజశేఖరుఁడుగారును కొమారుఁడును చక్కఁగాఁ జెప్పఁగలరు. కనుకను, ఆత్మప్రశంస యనుచిత మగుటచేతను, ఇంతటితోఁ జాలించు చున్నాను. అని యూరకుండెను.

కృష్ణజగపతిమహారాజులుగా రాతనిచరిత్రము విన్నతరువాతను నిమిష మాలోచించి, పద్మనాభునివంకఁ దిరిగి నీవిప్పుడు బుద్ధితెచ్చుకొని నిజముగాఁ బశ్చాత్తప్తుఁడ వైనాఁడవు గనుక నిన్నొక్కసంవత్సరము కారాగృహమునందుఁ బెట్టింప నిశ్చయించినా మని చెప్పి, కారాగృహాధికారి కట్టియుత్తరువును వ్రాసి యాతనిని రాజభటుల వెంబడిని చామర్లకోటకుఁ బంపివేసిరి. తరువాత పిఠాపురపువారిధనము

నచ్చుటికి వెంటనే పంపివేయ మంత్రి కాజ్ఞచేసి, దొంగతనమును పట్టు కొన్నందునకు సుబ్రహ్మణ్యమును శ్లాఘించి, రాజశేఖరుడుగారివంకఁ దిరిగి రాజుగా రిట్లు చెప్పిరి :—

మీ రిదివర కెన్నో కష్టముల ననుభవించి యాయాపదల నన్నిటిని గడచి మరల సుఖము ననుభవించుదశకు వచ్చుచున్నారు. కాఁబట్టి మీకు నేను కొన్ని హితవాక్యములను జెప్పబోవుచున్నాను. మీరు నామాటలను సావకాశముగా వినవలెను. పడినతరువాత లేచుట గొప్పతనముగాని యెప్పుడును పడకుండుట గొప్పతనము కాదు. మీ రీనీతిని మనసునం దుంచుకొని వెనుకపడిన కష్టములకై విచారపడకుండవలయును. ఇతరులుచేయు ముఖస్తుతుల కుబ్బి, ఆదాయమునకంటె నధికమైన ధనము దానము చేయకుండవలయును. ఒక్క కుటుంబములోవారు పలువురు పదిమందిగో నత్యంతమైత్రి కలిగియే యున్నను గృహము చేరినతోడనే గర్భశత్రువులుగా నుందురు. కాఁబట్టి మీకుటుంబమునం దట్టికొఱఁత కలుగకుండఁ గాపాడుచు రావలయును. విరోధమును సాధించుటకు మంచియుపాయము శాంతిని వహించుటయే. మన కెవ్వరిమీఁద నైనను పగతీర్చుకోవలె నని బుద్ధి పుట్టి దానిని మరలించుకో లేనియెడల మనము పగతీర్చుకో శక్తి కలిగి యుండియు క్షమింతుమేని, శత్రువులు సహితము మనలను జూచి బుద్ధి తెచ్చుకొని జ్ఞానవంతులగుదురు. కప్ప కఱవవలెనని ప్రయత్నముచేసిన నెంత ప్రయోజనకారియగునో బీదవాఁడు గొప్పవానిని పగసాధింపఁ దలఁపుగొన్న నంతప్రయోజనకారిగానే యుండును. వట్టి బెదరింపులతోనే ముగిసెడుకోపము నెవరు లక్ష్యము చేయుదురు? అట్టికోపమువలన మనకార్యమును సాధించుకో లేకపోవుట యటుండఁగా మీఁదిమిక్కిలి నష్టమునుకూడఁ బొందుదుము. మీరు శోభనాద్రి

రాజుమీఁద తొందరపడి మీకోపమును చూపినందున కేకదా మీకు కారాగృహబంధనము సంభవించినది. కాఁబట్టి యిఁకముం దెప్పుడును మీరు మీకంటె నధికులైన వారిమీఁద మీకోపమును కనఁబఱుపకుండవలయును. కొందఱు మతిహీనులు పూర్వకాలమే మంచిదని పొగడి మీరుచేయుదోషములను కాలమునందారోపించి మిమ్ము నిరుత్సాహులను జేయుదురు ; కాని చక్కఁగా నాలోచించి చూడఁగా బూర్వకాలమునకంటె నిప్పటికాలమే మంచిదని నాకుఁ దోఁచుచున్నది. పుణ్యపాపములు మనుష్యుల ప్రవర్తనములో నున్నవికాని కాలములో నేమియు లేవు. కాఁబట్టి మీరు చేసినదోషములకు కాలమునుదూషింపక మీప్రవర్తనమును తిన్న పఱచుకొనుటకే ప్రయత్నపడవలయును. మీకు గౌరవముతో జీవనము జరుగుటకు చాలినంత సొమ్మున్నచో విశేషముగా లేదని మీరెప్పుడును చింత పడకుండవలయును. ఈరీతిని దెలిపెడి పూర్వకథ నొకదానిని మీకుఁ జెప్పెదను వినుండి. పూర్వమొకధనవంతుఁడు శరీరమునిండ రత్నఖచితములైన స్వర్ణాభరణములను ధరించుకొని వీధినిబడిపోవుచుండఁగా, బీదవాఁడొకఁ డాతనిని వెంబడించి నగలను జూచి మాటిమాటికి నమస్కరింప నారంభించెను. ఆధనికుఁ డాతనిని జూచి 'నానగలలో నేనేదియు నీకియ్యలేదే. ఎందున కట్లు చేయుచున్నా' వని యడిగెను. ఆనగలు నాకక్కఱలేదు ; మీరు నన్ను నగలను చూడనిచ్చినారు గనుక నమస్కారములు చేసినాను ; మీరును చూచుకొని సంతోషించుటయే కాని నగలవలన వేఱొక ప్రయోజనమును పొందఁజాలరు ; మీరు నగలను కాపాడుకొనుటకై యెంతయు శ్రమపడుచున్నారు ; నాకాశ్రమ యక్కఱలేకయే సంతోషము లభించుచున్నది; మీకును నాకును గలవ్యత్యాస మిదియే' యని వాఁడు

బదులుచెప్పి పోయెను. ఈహేతువునుబట్టియే నేను మీకు విశేష ధనము నియ్యఁగలవాఁడ నయ్యును, ఇయ్యక మీమాన్యములను మాత్రము విడిపించి యిచ్చుచున్నాను వానితో మీరు తృప్తిపొంది సుఖజీవనము చేయుచుండుఁడు.

అని చెప్పి కృష్ణజగపతిమహారాజుగారు మీకు మఱియేదియైన గోరికకలదాయని రాజశేఖరుఁడుగారి నడిగిరి. ఆయన ప్రభువువారి సుగుణసంపత్తిని వేయివిధములఁ గొనియాడి, తన కుటుంబమునకుఁ జేసిన మహోపకారమును స్మరించి తాను చెఱసాలలో నున్నకాలములో విజ్ఞానపత్రికను వ్రాసి పంపుట మొదలగు పనులలోఁ దన కత్యంత సహాయుఁడుగా నున్న మంచిరాజు పాపయ్యను చెఱనుండి విడిపింపుఁడని వేడుకొనెను. తన కపకారముచేసిన శత్రువునందుకూడ దయ గలిగి యుండుటను శ్లాఘించి, రాజుగారప్పుడే యాతనిని విడిచిపెట్ట నాజ్ఞా పత్రికను బంపి తాము కొలువు చాలించి యంతఃపురమునకు విజయం చేసిరి. అంత రాజశేఖరుఁడుగారు మొదలగువారు కొలువుకూటమును విడిచి తమతమ యిండ్లకు బోయిరి.

పదునేనవ ప్రకరణము.

రాజశేఖరుఁడుగారు స్వగ్రామమునకుఁ బోవుట—సుబ్రహ్మణ్యము వివాహము—సీత వివాహము—రాజశేఖరుఁడుగారు తానుబడిన కష్టములవలన కృత్యమును నేర్చుకొని సుఖముగా జీవనము చేయుచుండుట.

మఱునాఁడు రాజుగారి యుత్తరువుప్రకారము రాజశేఖరుఁడుగారు సభకు వచ్చినప్పుడు, కృష్ణజగపతిమహారాజుగారు తన సభికులలో నొకరిని బిలిచి రూపాయలసంచులను రెంటిని తెప్పించి ముందుబెట్టి 'మీరీధనమును బట్టుకొని రాజశేఖరుఁడుగారితో ధవళేశ్వరమునకుఁ బోయి గృహమును మాన్యములను విడిపించి యిచ్చి రం'డని యాజ్ఞాపించి, అవిగాక మఱి నాలుగువందలరూపాయలను రాజశేఖరుఁడుగారికిచ్చి 'మీరీసొమ్ముతోనే సీతయొక్కయు సుబ్రహ్మణ్యము యొక్కయు వివాహములనుజేసి వచ్చుబడికి మించినవ్యయ మెన్నఁడును జేయక సుఖజీవనము చేయుచుండుఁ'డని హితబోధచేసి వారికి సెలవిచ్చి పంపిరి. రాజుగారివద్ద సెలవుపుచ్చుకొని రాజశేఖరుఁడుగారు భీమవరమునకు వెళ్ళునప్పటికి, జగ్గంపేటనుండివచ్చి యింటికడ నెవ్వరో బంధువులు కాచియున్నారని సమాచారము తెలిసెను. ఆమాటవిని వేగిరపడి యిల్లుచేరఁగా వీధియరుగుమీఁద నొక ముసలిబ్రాహ్మణుఁడు కూరుచుండి యుండెను. రాజశేఖరుఁడుగారాయనను జూచి మీరెవరని ప్రశ్న వేయఁగా, తమ యింటిపేరు భావరాజుగా రనియు తనపేరు సూర్యనారాయణ యనియుఁ జెప్పి 'రాజశేఖరుఁడుగారు మీరేకారా' యని ప్రశ్న వేసెను.

రాజ—అవును. మీ రే పనిమీఁద వచ్చినారు ;

సూర్య—మీయింటి కీనడుమ సుబ్బరాయఁడను చిన్నవాఁడు వచ్చినాఁడు. అతఁ డెక్కడనున్నాఁడు?

రాజ—ఆ పేరుగలచిన్నవాఁ డెవ్వఁడును మాయింటికి రాలేదు.

సూర్య—మీ కొమార్తెను దొంగ లెత్తుకొనిపోయినప్పుడు మాగ్రామమునుండి తీసికొని వచ్చినాఁడు. అతఁడు వేంకటేశ్వరుల మ్రొక్కును బట్టి తల పెంచుకొన్నాఁడు. మిక్కిలి చక్కనివాఁడు ; ఒక రాజుతోడఁగూడ బయలుదేఱి మీయింటికివచ్చెద నని మాతోఁ జెప్పినాఁడు ; చిన్నతనములో మీవద్ద విద్య నేర్చుకొన్నాఁడట !

రాజ—అతనితో మీ కేమి పనియున్నది ?

సూర్య—మా యింటియొద్దఁ గొన్నిదినములున్నాఁడు; అతని రూపగుణసంపదను జూచి యతనికి నాకొమార్తె నిచ్చి వివాహముచేసి, నాకు పుత్రసంతానము లేదుగనుక అతని నిల్లటిక ముంచుకోవలెనని నిశ్చయించుకొన్నాము.

అని తరువాత రాజశేఖరుఁడుగారు రుక్మిణి సుబ్బరాయఁడను పేరున పురుషవేషము వేసికొని యుండుట లోనుగాఁగల వృత్తాంతము నంతను వినిపించి, యాచిన్నదానిని తనకుమారుఁడైన సుబ్రహ్మణ్య మునకుఁ జేసికొనియెదనని వాగ్దానముచేసిరి. అంతట సూర్యనారాయణగారు పెన్నిధి దొరకిన పేదవానివలె పరమానంద భరితుఁడై, రాజశేఖరుఁడుగారి యొద్ద సెలవుపుచ్చుకొని వెంటనే తన గ్రామమునకుఁబోయి భార్యను కుమార్తెను వెంటబెట్టుకొని మఱునాఁడు మధ్యాహ్నమునకు మరల వచ్చెను. అదినముననే రాజశేఖరుఁడు

గారు చల్లపాటువేళ బండ్లు చేసికొని సకుటుంబముగా బయలుదేరి, రెండుమూడు దినములలో సూర్యనారాయణగారితోఁ గూడ రాజమహేంద్రవరము చేరి, అక్కడ రామమూర్తిగారి లోపల రెండు దినములుండి, వారికడ దాచిన పాత్రసామగ్రిని దీసికొని వారినిగూడ వివాహమునకై వెంటఁ బెట్టుకొని సుఖముగాఁ బోయి ధవళేశ్వరము ప్రవేశించిరి.

పెద్దాపురమునుండి వచ్చిన కృష్ణజగపతి మహారాజుగారి సభికుఁడు రాజశేఖరుఁడుగారికి మాన్యములును గృహమును విడిపించి యిచ్చి, మరలఁ దన ప్రభువారియొద్దకు పోఁగోరఁగా రాజశేఖరుఁడు గారాయనను బహువిధముల బతిమాలుకొని కొమారునియొక్కయు కొమార్తెయొక్కయు వివాహములు జరుగువరకు నిలుచునట్లు డఁబతిచిరి. రాజశేఖరుఁడుగారు మరల గ్రామమునకు వచ్చి మాన్యములు వదలించుకొని ధనికులయి యున్నారన్నవార్త విన్నతోడనే బీదతనము వచ్చినప్పుడు మొగము చాటువేసిన పూర్వస్నేహితు లందఱును పెల్లగిలి రాసాగిరి. మున్ను పిలిచినను పలుకని యాశ్రితకోటిలోనివారందఱును దినమున కారు పర్యాయములింటిచుట్టును దిరుగనారంభించిరి; తొల్లి చూడమనసయినను గనఁబడని భృత్యవర్గము జీతబత్తెములు లేకయే సదా గుమ్మమువద్ద నిలువఁజొచ్చెను. రామశాస్త్రియు సిద్ధాంతియు వచ్చి ముఖస్తుతులయందుఁ గమకుఁగల పాండిత్యప్రకర్షమును మునుపటికంటె ద్విగుణముగా బ్రకటించుచు వచ్చిరిగాని, తమవిద్యా సారస్యమును గ్రహించి యతఁడలతఁలిచ్చెడి మునుపటి యౌదార్యమును రసికత్వమును రాజశేఖరుఁడుగారియం దప్పుడున్నట్లు వారికిఁ కనబడలేదు.

వారిలో సిద్ధాంతి తనమీఁద రాజశేఖరుఁడుగారికి కోపమువచ్చిన దేమో యనుకొని తదనుగ్రహమును మరలఁబడయఁగోరి, నారాయణ మూర్తి తనయొద్ద దాచిపెట్టిన దామోదరయ్యయొక్క నగలపెట్టె నొకకూలివానిచేత మోపించుకొనివచ్చి రాజశేఖరుఁడుగారి కొప్ప గించెను ; మఱియు రాజశేఖరుఁడుగారికిఁ దెలియవలయునని బంధువుల ముందరను మిత్రులముందరను ఆయనను కొనియాడఁ జొచ్చెను ; సుబ్రహ్మణ్యము జాతకమంత జబ్బుది లేదన్న నోటనే యిప్పుడుమరల మారకదశ తొలఁగిపోయినది. కాఁబట్టి దానియంతటి దివ్యజాతకము లోకములో మఱియొకటి లేదని పొగడఁదొడఁగెను. ఆసంగతి తెలిసికొని బీదతనము వచ్చినప్పుడు పిల్లనియ్యమన్నవారే యిప్పుడేలాగునైన, దమకన్యలను సుబ్రహ్మణ్యమునకుఁ జేసికొండనియు నాలుగువందల రూపాయలు వరదక్షిణయిచ్చెదమనియు రాజశేఖరుఁడుగారి చుట్టును దిరిగి యనుసరింప మొదలుపెట్టిరి. వారు భాగ్యవంతులును అల్లునకు కానుకలను కట్నములను పెట్టువారును, అయినను వారిపిల్లల నెవ్వరిని జేసికోక రాజశేఖరుఁడుగారు కొమారునకు సూర్యనారాయణగారి కొమార్తె మహాలక్ష్మినిఁ జేసికొనుటకే నిశ్చయించిరి.

తరువాత నొక సుభముహూర్తమున ముందుగా రాజశేఖ రుఁడుగారు కుమారుని వివాహముచేసిరి ; బోగముమేళము లేకపోయిన యెడల వివాహము శోభగాంచదని యెందఱుచెప్పినను, వారిమాటల నాదరింపక పాతివ్రత్యమును బోధింపఁదగిన యుత్తమదినములలో లంజలతోడిపొత్తు కూడదని భోగస్త్రీలపాటలకై విశేషధనమును వ్యయపెట్టక, యల్పధనముతో గాయకశిఖామణులచేత కర్ణరసాయ ముగా హరికీర్తనలు పాడించిరి. సదస్యమునాడు సంభావనసమయ

మున నపాత్రదానమున కొప్పుకొనక యోగ్యులును పండితులునగు కొందఱిని యథాశక్తిని సత్కరింపనెంచి, వచ్చిన బ్రాహ్మణులకంద ఱికిని సంభావన యియ్యకపోయిన సభవారిలోఁ దలవంపుగా నుండునని చెప్పవచ్చిన బంధువులతో వివాహదినములలోఁ దలయెత్తుకొని తిరిగి యప్పులపాలై తరువాత నెల్లకాలమును దలవంచుకొని తిరుగుట కంటె నీయైదుదినములును తలవంచుకొని యావలఁ దలయెత్తుకొని తిరుగుటయే మంచిదని చెప్పి తమయిష్టప్రకారమే జరిగించిరి ; వీధులు గట్టి సత్రములు వేయుట వృథావ్యయమని బంధువులును మిత్రులు నైనవారినిమాత్రమే భోజనమునకుఁ బిలిచి యాదరించిరి ; ఈప్రకా రముగాఁ జేయుటచేత మొదటనుద్దేశించుకొన్న దానికంటెను వెచ్చము తక్కువ పడినందున, మిగిలిన యాధనముపెట్టి కోడలికాభరణములు చేయించి పెట్టిరి.

కొమారుని వివాహమైన మూఁడవదినముననే సీతను మేనల్లు డైన శంకరయ్యకిచ్చి రాజశేఖరుఁడుగారు పెండ్లిచేసిరి. ఈవివాహమును సమస్తవిషయములయందును ముందుగా జరిగిన వివాహమునే పోలి యున్నది. ఈరెండు వివాహములయందును బూజముబంతులు మొద లగు దురాచారములును మోటుతనముగా నుండు వేడుకలును నాకబలి యైన తరువాత బుక్కాయును వసంతమును చల్లుకొనుచు స్త్రీలుఁ బురుషులు నను భేదమును పాటింపక విచ్చలవిడిగా నల్లరిచేయు చెడు వాడుకయును మాన్పబడినవి ; కుంటితనము గ్రుడ్డితనములోనుగాఁగల యంగవైకల్యముచేతఁ బాటుపడ నసమర్థు లయినవారును స్వదోషము వలనఁగాక దైవకృతమువలననే హీనదశకు వచ్చిన దరిద్రులును సత్ప్ర వర్తనముకలిగి సకలవిద్యావిశారదు లయియున్న పండితులును భగవ ద్భక్తులును మాత్రము ధనసత్కారమును బొందిరి. ఈరెండు వివాహ

ములును విధ్యుక్తముగా జరిగిన పిమ్మట నొకదినమున పెద్దాపురమునుండి వచ్చిన సభికుడు రాజశేఖరుడుగారి కడకువచ్చి తాను శీఘ్రముగా వెళ్లవలసి యున్నది గనుక సెలవిచ్చి పంపవలయునని యడిగెను.

రాజ—నాముద్దు చెల్లించి యీపదిదినములును మీరున్నందుకు సకుటుంబముగా మముగడుపు లయినదాక కూడ నుండి నామనస్సును సంతోషపెట్టి మరి వెళ్లవలయును.

సభి—ఇక నన్ను మన్నించి విడిచిపెట్టవలయును. మనము బయలుదేరి యిచ్చటికి వచ్చుటకునుందు మాయూరికి విచ్చేసియున్న యాచార్య స్వాములవారు శ్రీముఖమును బంపినప్పుడు వెంటనే కూపాయలనియ్యక తిరస్కరించినవాడని మా మేనల్లునకేమో యాంక్షపత్రిక వ్రాసినారనియు, మూడు దినములనుండి మావాని యిల్లెవ్వరును త్రొక్కి చూడకున్నారనియు, మంగలవాడు క్షౌరముచేయుటకుగాని చాకలవాడు బట్ట లుదుకుటకుగాని రాకున్నారనియు, ఇప్పుడే యుత్తరము వచ్చినది. స్వాములవారు వెలివేసినప్పుడు పొరుగువారు నిప్పయినను బెట్టరు; నూతిలో నీళ్ళయినను తోడుకోనియ్యరు.

రాజ—సన్యాసు లెప్పుడును కామక్రోధాదులను వర్జించి పరమ శాంతులై యుండవలసినవారే; ఇంత యల్పదోషమున కంత క్రూర శిక్షను విధింతురా ?

సభి—సన్యాసులన్న పేరేకాని వారికున్నంతకోపము ప్రపంచములో నెవ్వరికి నుండదు. ఇదియేమి చూచినారు ? ఈస్వాములవారే క్రిందటి సంవత్సరము శ్రీకాకుళములో భిక్షకువెళ్ళిన యింటి యజమానుని భార్యతో నేమో సరసమాడగా మగడు విని సన్యాసి నేమైన

నన్ను నపరాధమని యూరకుండి భిక్షానంతరము దక్షిణయియ్యక పోఁగా అతనిని మూఁడు మాసములు వెలివేసి నేఁబది రూపాయలు పుచ్చుకొని ప్రాయశ్చిత్తము చేయించి తరువాత మతములో కలుపుకొన్నారు. నేను వెంటనే వెళ్ళి మావానిచేత నపరాధక్షమార్పణము కోరించినంగాని కార్యము సుష్టుపడదు. కాబట్టి నన్ను బలవంతపెట్టక యీపూటనే పంపివేయవలయును.

రాజ—మీరింతగా సెలవిచ్చుచున్నప్పు మిమ్మింక నిర్బంధపెట్టఁ గూడదు.

అని రాజశేఖరుఁడుగా రాయనను క్రొత్తబట్టలు కట్టబెట్టి సమస్తవిధముల గౌరవించి, కృతజ్ఞతాసూచకముగా ప్రభువువారితో మనవిచేయవలసిన సంగతులను దెలిపి యాయనను బంపివేసిరి. తరువాత వివాహమునిమిత్తము వచ్చిన బంధువు లెవరియూళ్ళకు వారు పోయిరి. ఆసభికుఁడును పెద్దాపురము చేరినతోడనే తన విషయమై రాజశేఖరుఁడుగారుచేసిన యాదరణమును ఆయనయొక్క యుపకారస్మృతియును సాధువర్తనమును కృష్ణజగపతి మహారాజుగారితో మనవిచేసి, తన్నాయన ప్రభువువారితో చెప్పవేఁడుకొనిన మాటలను విన్నవించెను.

రాజశేఖరుఁడుగారు భాగ్యవంతులై మరల గ్రామమునకు వచ్చియున్నారని విన్న కొన్నిదినములకు నారాయణమూర్తి యొకనాఁడువచ్చి రహస్యముగా రాజశేఖరుఁడుగారితో తానును దామోదరయ్యయుఁ బ్రాణమిత్రులుగా నుండుటయు దామోదరయ్యయొక్క మరణానంతరమున తానాతని చెలికాఁడను ద్వేషముచేత జనులు తనయింటఁగల సొత్తంతయు దోఁపించుటయు అందువలనఁ దానిప్పుడు

అన్నవస్త్రములకే యిబ్బందిపడుచుండుటయుఁ జెప్పి సాహాయ్యము చేయఁ వేఁడుకొనెను.

రాజ—కృతఘ్నుఁడును మిత్రద్రోహియు నగు నీవంటివాని కుపకార మెన్నఁడును జేయరాదు. నేను నీకెంతో మేలుచేసినవాఁడనై నను నాకాపద సంభవించినప్పుడు, శక్తిగలవాఁడవై యుండియు నేను వేఁడుకొన్నను లేశమైనను సాయము చేయకపోతివి. దామోదరయ్య ప్రాణమిత్రుఁడుగానున్నను నీయొద్ద నాఁతడు దాఁచుకొన్న పెట్టెను మిత్రుని పుత్రునికీయక యపహరింపఁ దలఁచితివి.

నారా—ఆసొమ్ము పెట్టెను తనయొద్ద దాచవలసినదనియు దాని సులభముగా నపహరించవచ్చుననియు సిద్ధాంతిగారే మొదట నాకాలోచన చెప్పినాఁడు. నేను సొమ్ముపెట్టె నాతనియొద్దఁ బెట్టిన తరువాతఁ దనకందులో సగముభాగము రావలెనని పోరాడి, స్నేహితుని సొమ్ము పరులపాలగుట కిష్టములేక నేనొప్పుకొననందున మీామెప్పునకై పెట్టెను మీాకుఁ దెచ్చియిచ్చినాఁడు.

రాజ—సిద్ధాంతియే నిన్నుఁ బ్రోత్సాహపఱిచినను నీవుసహితము దోషివేకాని నిర్దోషివికానేరవు. స్వయంకృతాపరాధమువలననే నీకిప్పుడీదుర్దశ ప్రాప్తించినది కాఁబట్టి యెఱుఁగక చేసికొన్నదాని ఫలము నీవవశ్యముగా ననుభవింపవలెను.

అని చెప్పి రాజశేఖరుఁడుగా రాతని కేమియుసాయము చేయక పొగనంపిరి. అదిమొదలుకొని రాజశేఖరుఁడుగారు వెనుక సిద్ధాంతి మొదలైనవారి చర్యలవలనఁ దెలివితెచ్చుకొని ముఖస్తుతుల కుబ్బి యెప్పుడును ధనము పాడుచేసికొనకయు, నమీాపమునకువచ్చి మంచి

మాటలు చెప్పువారి నందఱిని మిత్రులని నమ్మకయు మెలఁగఁ జొచ్చిరి. యోగి వెనుకచేసిన కుతంత్రమువలన నాతనికి యోగు లను వారియం దెల్లను కేవల జఠరపూరకు లనునభిప్రాయమును మంత్ర ములయందును సువర్ణకరణాది విద్యలయందును దృఢమైన యవి శ్వాసమును గలిగెను. రుక్మిణికివెనుక పట్టినదయ్యములు భూతవైద్యము శకునములు మొదలగువానివలన నెల్లవారికిని వానియందలి నమ్మకము చెడుటం జేసి మఱియెప్పుడును వారియింట నెవ్వరికిని గ్రహబాధ కాని ప్రయోగలక్షణము కాని దేవత లావహించుటగాని కలుగ లేదు. కుటుంబములోనివారి జాతకములును పెట్టినముహూర్తము లును పలుమాఱు విరుద్ధఫలముల నిచ్చుచు వచ్చినందున, రాజ శేఖరుఁడుగారికిని తత్సంతతివారికిని జ్యోతిషమందు సహిత మప నమ్మకము కలిగెను. రుక్మిణి వివాహకాలమున చేసిన ధర్మములకై చేసిన ఋణములవలని నష్టముల ననుభవించియుండుటం జేసి రాజ శేఖరుఁడుగారిక నెప్పుడును పరులకు ఋణపడకూడ దని నిశ్చ యము చేసికొనిరి. అంతటినుండియు రాజశేఖరుఁడుగారు మితవ్యయ మునే చేయుచు వ్యర్థదంభమునకై ధనము పాడుచేసికొనక, తమ కీశ్వరుఁడు దయచేసినదానితోడనే తృప్తినొందుచు, కలకాలఁదిని బీద సాదలకు దానధర్మము చేయుచు, కలలోసహితము సత్యమును భూత దయయును తప్పక, "ధర్మోజయతి" యను నీతివాక్యమును సదా హృదయమునందుంచుకొని సమస్తకార్యములయందును నీతిపథమును నీఁగకాలంతయు దాటక ఋజువుగాఁ బ్రవర్తించుచు మంచివాఁ డని లోకమునఁ బ్రసిద్ధికెక్కి, పెక్కండ్రు మనుమలను మనుమరాండ్ర నెత్తి సిరియు సంపదయుఁ గలిగి చిరకాలము సుఖింపుచుండిరి. ఆయన

జీవితకాలములోనే సుబ్రహ్మణ్యము పిఠాపురసంస్థానములో గొప్ప యుద్యోగములు చేసి కడపట మంత్రియై రాజకార్యములయందును సన్మార్గప్రవర్తనమునందును నసమానుఁ డని పేరుపొందెను ; అల్లుళ్ళిద్దఱును పెద్దాపురపురాజుగారి యోలగములోఁ గొలువు కుదిరి క్రమక్రమముగా గొప్పదశను బొంది విశేషఖ్యాతిని సంపాదించిరి. రాజశేఖరుఁడుగారి కుటుంబములోనివారే కాక యాయన బంధువర్గములో చేరినవారుకూడ అధర్మవృత్తి కొంతకాల మిహలోకసుఖమునుగలిగించినను సద్ధర్మవృత్తియే శాశ్వతసౌఖ్యమునకు నిదానమని రాజశేఖరుఁడుగారి వర్తనమువలన నెఱిఁగి నిరంతరము ధర్మమార్గప్రవిష్టులై యుండుచు వచ్చిరి. చిన్నప్పు డెప్పుడో చచ్చిపోయిన మగఁడు పట్టుకొని వేధించుచున్నాఁ డన్న సిద్ధాంతి కొమార్తె పెద్దదై బ్రతికియున్న మఱియొక మగఁడు మిక్కిలిమక్కువతో తన్నాశ్రయించి మోహింపఁజేయఁగా నాతనివెంట నింట దొరికినసొత్తు నెత్తుకొని లేచిపోయి చెడి కడపట దాసి యయి తమకన్నుల ముందఱనే గ్రామములోఁ దిరుగుచుండుటయు, బాల్యదశలోనే భర్తలను బోగొట్టుకొన్న భాగ్యహీనురాండ్రైన ముద్దియలు పడుకష్టములును, అట్టివారు దురతిక్రమణీయమైన కామబాధకు తాళఁజాలక యింద్రియచాపల్యముల దుష్టపురుషుల వలలోఁబడి పాడగుచుండుటయు, కొందఱు కులమువారికి వెరచి రహస్యముగా శిశుహత్యలు గర్భపాతములు మొదలైన ఘోరపాతకముల కొడిగట్టుచుండుటయు, ప్రతిదినమును కన్నులారఁ జూచి మనసు కరఁగి యట్టి బాలవితంతువుల దుర్దశను తొలఁగించుట కేమైనఁ జేయవలయునని పలుప్రయత్నములు చేసియు మూఢశిరోమణులయిన జనులలొక్కఁడయు

నాచారపిశాచావేశ సన్యస్తవివేకులై యున్న పండితులయొక్కయు మనస్సులను మళ్లింప శక్తులుగాక విఫలప్రయత్నులై రాజశేఖరుఁడుగారు కొంతకాలమునకు లోకాంతరగతు లయిరి. రాజశేఖరుఁడుగారు కాలము చేసి యిప్పటికి రెండువందల సంవత్సరములైనను ఆయనవలన మేలు పొందినవారి సంతతివా రిప్పటికిని ఆయనను ప్రశంసించుచుందురు. రాజశేఖరుఁడుగారి సంతతివారుకూడ దేశమంతటను వ్యాపించి యిప్పుడు పెక్కుచోట్ల గొప్పస్థితికలవా రయి యున్నారు.

సంపూర్ణము.

సత్యరాజాపూర్వదేశ యాత్రలు.

ప్రథమభాగము

ఆఁడుమళయాళము

By

K. VEERESALINGAM

సత్యరాజా పూర్వదేశ యాత్రలు.

ప్రథమభాగము

ఆసుమళయాళము

మొదటి ప్రకరణము

నేను పరీధావి సంవత్సర చైత్రశుద్ధ నవమి మంగళవారమునాఁడు పుష్యమీనక్షత్రమందు విజయనగరములో పూర్వము శ్రీరాముల వారుపుట్టిన దినముననే జన్మించితిని. మాయింటిపేరు పత్రివారు. నేను వ్యాసరాయాచార్యులవారి పుత్రుఁడను. నాతల్లి లక్ష్మీబాయమ్మ. నేను ముందు మహాసత్యసంధుఁడనయి యీసత్యచరిత్రమును వ్రాయుదునని తెలిసియో, తనకుఁగల సత్యప్రియత్వముచేతనో, మఱి యేహేతువుచేతనో మాతండ్రిగారు నాకు తనతండ్రిపేరుపెట్టక దేశాచారమునుతప్పించి చిన్నతనములోనే నాకుసత్యరాజాచార్యులని పేరుపెట్టిరి. మాతండ్రిగారు జ్యోతిశ్శాస్త్రమునందు మహాపండితులయినందున పుణ్యపురుషాగ్రగణ్యులయిన వారు స్వమహిమచేత నాభవిష్యద్యోగ్యతను ముందుగా తెలిసికొనియే తప్పక నాకిట్లు నామకరణము చేసియుందురు. "సుకృతీగతాయుః" అను న్యాయమునుబట్టి వారు నాపసితనములోనే పుణ్యలోకయాత్రకు విజయంచేసినందున నాపేరును గూర్చి వారి నడిగి తెలిసికొనుట కవకాశము లేకపోయినది. నానిజమయినపేరు సత్యరాజాచార్యు లయినను మాగ్రామములోనున్నవారు నన్ను సత్యరాయాచార్యులని పిలుచుచుండిరి. 'రాజు' ను 'రాయ' లని వ్యవహరించుట కర్ణాటక సంప్రదాయము. అంతేకాక 'జ'

కార 'య' కారముల కభేదము. అందుచేతనే వంగము మొదలయిన యుత్తరదేశములయం దయోధ్యకు అజోధ్యయని యకారమునకు మాఱుగా జకారమును వ్రాయుదురు. ఈశాస్త్రచర్చ నింతటితో విడిచిపెట్టి కార్యాంశమునకు వత్తము. నాపేరుయొక్క యుచ్చారణక్రమ మెట్టిదయినను నాదిసార్థకనామధేయమని నేనువేఱుగ చెప్పనక్కఱ లేకయే నేను వివరింపఁబోయెడి యీసత్యయాత్రాచరిత్రమే లోకము నకు వేయినోళ్ళ ఘోషింపవచ్చును. ఆత్మస్తుతి నింద్యమయినంగున నాసత్యసంధతనుగూర్చి నేనిఁక చెప్పను. నేనవలంబించియున్న సత్య మతముకూడ నాచరిత్రముయొక్క పరమ సత్యత్వమును సాధింప వచ్చును. సత్యప్రియత్వముచేతనేకదా మామతకర్తలయిన శ్రీమధ్వ రాయలవారు మిథ్యాభూతములయిన పూర్వమతసిద్ధాంతములనన్నిటిని తిరస్కరించి, శ్రీమదాంజనేయసహాయముచేతను ముఖ్యప్రాణదేవుని యనుగ్రహముచేతను ఖిలములయిపోయిన యపూర్వశ్రుతిస్మృతి వాక్యరత్నములను బ్రహ్మలోకమునుండి తెప్పించి బ్రహ్మసంప్రదా యానుసారముగా సత్యమయినద్వైతమతసిద్ధాంతమును లోకానుగ్రహా ర్థముస్థాపించియున్నారు! అటువంటి సత్యమతమున జన్మించి సత్యవ్రత మునుపూనియున్న నేను నాగ్రంథమునందు సత్యముకాని వాక్యము నొక్కదానినయినను చొరనిత్తునా? ఓచదువరులారా! నామాటను నమ్మి యిందలిప్రతివాక్యమును వేదవాక్యమునుగా విశ్వసింపుఁడు. నేనిందు తెలుపఁబోయెడు సంగతులీనడుమ మనుష్యుల కెవ్వరికిని తెలి యనిదేవరహస్యములయినను స్వదేశస్థులయిన మీయందు నాకుఁగల భ్రాతృస్నేహముచేత మర్మమువిడిచి చెప్పివేయుచున్నాను.

మాతండ్రిగారు కర్మిష్ఠులయి, బాల్యమునుండియు వైదికమయి పూజ్యమయిన యాచార్యవృత్తియందే కాలముగడపినవారయినను, వారిపుత్రుఁడనయిన నాకుమాత్రము పూర్వకర్మానుభవముచేత శిష్య

పరంపరలు సేవింపఁగా ఆచార్యపదమునొంది పూజింపఁబడెడు భాగ్యము పట్టినది కాదు. మాతల్లి పుట్టినింటివారు మొదటినుండియు లౌకికవ్యవహారములలో ప్రవేశించి పెరిగినవారగుటచేత మా మేనమామగారగు కంచి శేషగిరిరావుపంతులుగారు నన్ను వేదపాఠశాలకు పంపక బడిచదువు కాఁగానే హూణపాఠశాలకుఁ బంపిరి. మాగ్రామములో నొక బ్రాహ్మణ బాలుఁ డింగ్లీషుచదివి క్రైస్తవమతములో కలిసినప్పుడు మాతండ్రిగారు నన్నుమాత్రమే గాక మావంశమునఁబుట్టినవారి నెవ్వరినికూడ హూణపాఠశాలకు పంపమని ప్రతిజ్ఞపట్టిరి. నాకుబుద్ధివచ్చువఱకును జీవించియుండిన పక్షమున వారు తమప్రతిజ్ఞను తప్పక చెల్లించుకొనియుండురు. తానొకటితలఁచిన దైవమొకటి తలఁచునుగదా? నేను చిన్నవాఁడనయినను పూర్వాచారవిరుద్ధమయిన మాలచదువు చదువుట నాకిష్టము లేకపోయెను. దానికితోడు మాతండ్రిగారిప్పుడు జీవించియున్నపక్షమున వారునన్ను హూణపాఠశాలకు పంపుటకిష్టపడియుండరుగదాయన్న విచారమొకటి నామనస్సును బాధింపఁజొచ్చెను. ఈరెండుకారణములచేతను నాకింగ్లీషు చదువెప్పుడును సరిపడినదికాదు. అయినను నాకప్పుడింకొక బాధకూడతటస్థమయ్యెను. నామేనమామ మాటవిని నాతల్లి ప్రతిదినమును హూణపాఠశాలకుపొమ్మని నన్ను నిర్బంధింప మొదలుపెట్టినది. అప్పుడునాకు పరస్పర విరుద్ధములయిన రెండుధర్మములు సంప్రాప్తములయినవి. నేనింగ్లీషు పాఠశాలకుపోవుట నాతండ్రిగారి యభిమతముగాదు; పోకుండుట తల్లిగారి యభిమతము కాదు. ఇందులో నేనెవ్వరి యభిమతమును చెల్లింపను? నామనస్సు తండ్రిగారి యాజ్ఞ నే చెల్లింపవలసినదని బోధించుచున్నను చచ్చిస్వర్గమునందున్న తండ్రిగారి యాజ్ఞనువలెఁ బ్రతికి భూలోకమునందున్న తల్లిగారి యాజ్ఞను మీఱుట నాకసాధ్యముగా కనఁబడలేదు. మన వేదము పితృదేవోభవయని మాత్రమే కాక మాతృదేవోభవయనికూడ

చెప్పుచున్నది. అందుచేత పితృనియోగమును మాతృనియోగమును నాకుసమానముగానే యలంఘ్యములయినవి. నేనిప్పుడు తండ్రియభీష్టమును తీర్చవలెను. తల్లిమనోరథమును తీర్చవలెను. కాఁబట్టి నేను బుద్ధిమంతుఁడనయినందున పితృవాక్య పరిపాలనమును మాతృవాక్యపరిపాలనమును కూడఁజేసి యుభయఋణవిముక్తుఁడనయి కృతార్థతను పొందుటకొక్కయుపాయము నాలోచించితిని. ఆయుపాయమును విన్నపక్షమున నాబుద్ధికుశలతకు మీరును సంతోషింపకపోరు తల్లి యాజ్ఞానుసారముగా నేనింగ్లీషు పాఠశాలకును పోవుచుంటిని; పోవుచున్నను పాఠములను చదువక తండ్రిగారి యిష్టానుసారముగా పోనట్లేయుంటిని. ఈయుపాయముచేత నే నుభయవాక్య పరిపాలన దక్షుండనై ధన్యుఁడనుకాఁగలిగితిని. ఈప్రకారముగా నేను దాదాపుగా పదిసంవత్సరములు పురాణపాఠశాలలో చదివినను, గొప్పపరీక్షలోనేనిలోను కృతార్థుఁడను కాలేదు. కాని యెంతోకష్టముమీఁద నేనుసామాన్యపరీక్షలో మాత్రము తేరినాఁడను. నేనింటికడ పాఠములు చదువకపోయినను, ఉపాధ్యాయుల కృషిచేత నాప్రయత్నములేకయే కొన్ని యింగ్లీషు ముక్కలు నాకుతలలోదూరినవి. అటుతరువాత వానిని నాహృదయము నుండి పాఱఁదోలుటనాకు సాధ్యమయినదికాదు. ఎవ్వానికయినను మొదట చోటిచ్చిన తరువాత వెడలఁగొట్టుట సులభసాధ్యముకానేర్చునా? అయినను నాచేతనయినపని నేను మనవేదశాస్త్రములకు విరుద్ధముగా మాయుపాధ్యాయులు బోధించిన భూగోళవిషయములను చరిత్రములను పురాణశాస్త్రములను సత్యములని నమ్మకుంటిని. ఈచరిత్రమును చదివినకొలఁదిని నామాటలయందలి సత్యము మీకేబోధపడఁగలదు. ఇంగ్లీషుచదువువలన బుద్ధిహీనులైన యిప్పటిబాలురకువలె నాకు మన శాస్త్రములయందును పురాణములయందును నమ్మక మావగింజంతయు తగ్గినదికాదు. ఇంగ్లీషు తిన్నగా చదువకున్నను నేను నిత్యమును

స్నానసంధ్యా ద్యనుష్ఠానములను మాసక జపములను తపములను జేయుచు మంత్రతంత్రములను గురుముఖమున నేర్చుకొని సిద్ధాగరి ష్ఠుఁడనయితిని. నా యాచారవ్యవహారములు చూచి నాతల్లియు మేన మామయుకూడ సంతోషపడుచుండిరి.

నేను నాలవతరగతిలో చదువుకొనుచుండఁగా నాకు వివాహ కార్యము తటస్థమయ్యెను. ఈయాంధ్రదేశములో మాశాఖవారు మిక్కిలి తక్కువగా నున్నందున మాలో కన్యలుదొరుకుట మిక్కిలి కష్టము. అందుచేత సామాన్యస్థితిలో నున్నవారికి వేయిరూపాయలయిన నియ్యక మూఁడేండ్లకన్య యయినను లభింపదు. మామేనమామగారి కృపచేత నిప్పాణి నృసింహాచార్యులుగారు తొమ్మిది సంవత్సరముల ప్రాయముగల తమకొమార్తెను వేయిరూపాయలకే నాకిచ్చి వివాహము చేయుట కంగీకరించినారు. ఇటువంటి తరుణము మరల రాదనియెంచి నా మేనమామగారును తల్లిగారునుజేరి నాటికి మూఁడురూపాయలవడ్డికి మాపిత్రార్జితమయిన మాన్యములమీఁద వేయిరూపాయలు ఋణము చేసి, వివాహవ్యయములకై యిన్నూఱు రూపాయలను మఱియొకరి యొద్ద అప్పుచేసి, శుక్లసంవత్సర వైశాఖమాసములో నొక మంచిము హూర్తమున నాకు వివాహముచేసిరి. నాకప్పటికి పదునెనిమిది సంవ త్సరములు దాటినవి. నాభార్య రూపవంతురాలు కాకపోయినను, గుణ వంతురాలుగా కానఁబడెను. కులకాంతలకు గుణముప్రధానముగాని చక్కఁదనము ప్రధానముకాదు. ఇట్లొకసంవత్సరము గడచిన తరువాత నాభార్యకు స్ఫోటకమువచ్చెను. అప్పుడాచిన్నది జీవించుటయే దుర్ఘట మని యెల్లవారును భావించినను, నేను పునశ్చరణచేసిన వీరహనుమంత మంత్రప్రభావమువలన చిన్నదానికి ప్రాణభయముతప్పి కుడికన్నుమా త్రము పోయెను. మొగమునిండ గోతులుపడి యాచిన్నది మఱింత కురూపిణియయినందున "భార్యారూపవతీశత్రు" వనెడుబాధ నాకు

లేకపోయెను. నేనొక్కపరీక్షయందుఁ దేఱి పాఠశాలను విడుచునప్పటికి నా భార్యయెదిగి కాపురమునకువచ్చెను. మామాన్యములమీఁదవచ్చెడి ఫలదాయము మేముచేసిన ఋణములవడ్డీకే చాలనందున నాకుటుంబ భారముకూడ మామేనమామగారిమీఁదనే పడెను. అందుచేత రెండు కుటుంబములను పోషించుట దుర్భరమయినందున మామేనమామగారు నన్నుచదువుమాన్పించి, విశాఖపట్టణముపోయి యెవ్వరెవ్వరినో యాశ్రయించి విశేషకృషిచేసి దొరతనమువారి కార్యస్థానములో నొకచోట నాకు నెలకు పదునేనురూపాయల జీతముగల యుద్యోగమును చెప్పించిరి. ఆపనిలోనుండఁగానే యప్పులవారు నామీఁద వ్యాజ్యములువేసి ధనద్విగుణమునకు తీర్పులను పొంది నామాన్యముల నమ్మించిరి. నామాన్యముల విక్రయమువలన వచ్చినసొమ్ముతో నాఋణము సగముతీరినది. మిగిలినది తీరుటకు సాధనముకనఁబడలేదు. అప్పులవారు ప్రతిదినమునువచ్చి నాయిల్లుచుట్టుకొని ఋణముతీర్పుమని నను నానా విధముల చిక్కులుపెట్ట మొదలుపెట్టిరి. ఈచిక్కులలో నుండఁగా నాకుగ్రామముల వెంటతిరిగెడి మఱియొకపనియైనది. ఈక్రొత్తపనిలో జీతమిరువది రూపాయలయినను, ఆయెక్కువజీతము ప్రయాణవ్యయములకే చాలకుండెను. ఇప్పుడింకొక విధమయిన క్రొత్తవ్యయముకూడ నామీఁదపడెను. నాకెప్పుడును గుప్తదానము చేయుటయందేయిష్టము. ఇప్పుడట్టిదానములు చేయవలసిన నిర్బంధముకూడ నాకుతటస్థమయ్యెను. అట్టిదానములు చేయకపోయినయెడల నాపనికికూడ భంగమువచ్చునట్లు కానఁబడెను. మామండలమునందప్పు డుద్యోగస్థులలో లంచగొండు లధికముగానుండిరి. అప్పుడు మాపై అధికారులు పూర్వపువారుమాఱి క్రొత్తవారు వచ్చుట తటస్థించెను. అందరికంటెను కష్టపడి యెక్కువ పని చేయుచున్నను నేను పనితిన్నగా చేయుచుండలేదని కోపపడుచు వచ్చినందున నాహితుల యుపదేశముచేత శిరస్తాదారుగారికి మూఁడు

సారులు హిరణ్యదానములు చేసితిని ; ఎన్నిసారులో యిప్పుడు సరిగా జ్ఞప్తికిరాలేదుగాని పెక్కుసారులు వస్త్రదానములు చేసితిని; పిల్లకుపాలు కావలసివచ్చినందున రెండుసారులు సవత్సక గోదానములు సహిత మాయనకే చేసినాఁడను. చేసినదానములు చెప్పకోరాదు. ఇటువంటి గుప్తదానములు మఱియెన్నెన్నో నేను చేసితిని. ఈహేతువుచేత దాన ములు చేయఁగా మిగిలిన సొమ్ము నాకును నాభార్యకును నిత్యైకాదశీ వ్రతములతో భుక్తికయినను చాలకుండెను. ఇట్లుండఁగా నాభార్య జ్వరబాధితురాలై, మాగ్రామములో రెండవ ధన్వంతరియని ప్రసిద్ధి కెక్కిన వైద్యశిఖామణిచేత ఇరువదియొక్క లంకణములు కట్టించఁబడి అకస్మికముగా స్వర్గస్థురా లయ్యెను. ఆ చిన్నదాని చావుతో నాకీలోక ముమీఁద విరక్తి కలిగినది. ఈసమయములోనే ఋణప్రదాతలు కత్తు లై నన్ను తమ యప్పులకై చెఱసాలకు సహితము పంప యత్నించు చుండిరి. ఈయన్ని కారణములచేతను నాకు సంసారము మహారణ్యము వలె తోఁచఁగా నాకప్పుడు సర్వసంగములను పరిత్యజించి ముముక్షుఁ డనై యోగిని కావలెనన్న బుద్ధిపుట్టినది. అందుచేత నేను నాతల్లిని మామేనమామగారి యింటికిపంపివేసి, ముందుగా అప్పులవారి బాధను తప్పించుకొనుటకై దేశత్యాగముచేసి దక్షిణదేశయాత్రలు సేవింపవలె నన్న యుద్దేశముతో విశాఖపట్టణమువచ్చి చేరితిని. అప్పు డాపట్టణ ములోనున్న నాబాల్యమిత్రుఁడొకఁడు నన్నుచూచి నాదురవస్థనిని జాలి పడి నాకు నూరురూపాయలిచ్చెను. మఱునాఁటి యుదయకాలమున నేను సముద్రతీరమునకు పోఁగా ధూమనౌక యొకటి యప్పుడే రేవు నకు వచ్చెను. అదియెక్కడకు పోవునని విచారింపఁగా చెన్నపురికి పోవు నని యక్కడివారొకరు చెప్పినందున శీఘ్రముగా పోవలెనన్న యభి లాషచేతను, దుస్సహమైన ఋణప్రదాతల బాధ తప్పించుకొనవలెనన్న యుద్దేశముచేతను, సముద్రయానము శాస్త్రనిషిద్ధమని తెలిసినవాఁడ

నయినను తరువాత ప్రాయశ్చిత్తము చేయించుకోవచ్చునని పూటకూటి యింటికిపోయి శీఘ్రముగా భోజనము చేసివచ్చి, ౧౮౭౬ వ సంవత్సరము మార్గశిరమాసములో భానువారము నాఁడొక చిన్న పడవలో బోయి పొగయోడలో నెక్కితిని. ఇరువదియేడవ యేట నాకు దేశాంతరయాత్ర నాజాతకములోనే వ్రాయఁబడియున్నది. ఎక్కినజాములో పొగయోడకదలి నాలవనాఁటి ప్రాతఃకాలమున నన్ను చెన్నపురికిఁ గొనిపోయి విడిచినది. పొగయోడలోని యవస్థ యాకాలమునందు సముద్రయాత్రలు చేయువారి కందఱికిని తెలిసినదే యగుటచేత నేనిక్కడ వివరింప నక్కరలేదు. ఒకవేళ సముద్రయాత్రలుచేయని శిష్టుల లాభమునిమిత్తము వివరింతమన్నను, పొగయోడలో నెక్కిన తరువాత మరల దిగువఱకును నాకు దేహస్మృతియే లేదు. నేనెఱిఁగినదంతయు నాకడుపులో నేదో పెట్టి వికారమారంభమయి నాఁటిదినము తిన్న యన్నముమాత్రమేకాక చిన్నప్పటినుండియు కడుపులోనున్న పసరంతయు వాంతులగుటయు, దేహముతూల లేవశక్తుఁడనుగాక కన్నులు మూసుకొని శవమువలె నొకమూల పడియుండుటయు, మాత్రమే. ఇప్పుడింకొకసంగతికూడ స్మరణకు వచ్చుచున్నది. నేను చిన్నతనములో నుయ్యెలలోనంతగానూఁగలేదు. ఓడలోనున్న మూఁడుదినములలోను నాకు యావజ్జీవమును సరిపోవునంత యుయ్యాలలూఁగుటసంభవించినది. ఆసౌఖ్యమనుభవైక వేద్యమేకాని చెప్ప నలవియైనది కాదు. నేను పడవదిగి మెట్టకుపోయిన తరువాతకూడ కొన్నిదినములవఱకును నేనుయ్యాలలో నూఁగుచున్నట్టే భ్రమ పడుచుంటిని. నా కీడోలికాక్రీడ మొదలయిన వైభవములు కలిగించిన వాఁడు మాముఖ్యప్రాణదేవుఁడే. భక్తవత్సలుఁ డగుటచేత వాయుదేవుఁడు భక్తుఁడనయిన నేనొంటిగా పోవుటచూచి సహింపలేక తన మహాబలత్వము సార్థకమగునట్లుగా సముద్రము పొడుగునను నాకుతోడుగా వెంటవచ్చి నాకీ

క్రీడాసౌఖ్యములను ప్రసాదించెను. వాయు మహిమచేతఁ గలిగిన వికారమును వాంతులును నాకసౌఖ్యమును కలిగించినట్లు మీరెంచుకొందురేమోకాని నిజము విచారింపఁగా నాకవి మంచివైద్యులవలె లోని కల్మషమును పోఁగొట్టి యారోగ్యమునే కలిగించి నన్ను మహాబలుని వంటి సత్వసంపన్నునిగాఁ జేసినవి. నేనోడలోనున్న మూఁడు దినములును ఉపవాసవ్రతము పూనియుండిన సంగతి బుద్ధిమంతులైన మీరీవఱకే యూహించి యుందురు. నాభాగ్యము నేమనిచెప్పను? అందులో కడపటిదినము ఏకాదశికూడ నయ్యెను. ఆకడపటినాటి నిరాహారపుణ్యమునకెందైన సాటికలదా? తక్కిన రెండుదినముల యుపవాసఫలమును పొగయోడనెక్కిన పాపమునకు సరిపోయినను హరివాసరమునాటి శుష్కోపవాస పుణ్యఫలము నాకు మిగిలియుండక మానదు. శ్రీహరి కరుణాకటాక్షము గలవారి కెక్కడకు పోయినను పుణ్యమునకు లోపముండదు. అటుతరువాతి చరిత్రము వినుఁడు.

రెండవ ప్రకరణము

నాలవనాఁడు ద్వాదశిపారణమున కనుకూలముగా ప్రాతఃకాలమున నే పొగయోడ చెన్నపురి రేవు చేరెను. ఓడ లంగరు వేసిన తరువాత చిన్నపడవ లనేకము లక్కడకు రాఁగా నేనొకపడవలో నెక్కి యొడ్డునకు పోతిని. ఒడ్డునుండి నూరుగజముల దూరము నడచునప్పటికి గుఱ్ఱపు బండియొకటి కనఁబడెను.

"ప్యాల్లోకి బండి అద్దెకు తీసుకువస్తావా?" అని నే నాబండివాని నడిగితిని. వాఁడేమో అఱవములో మాట్లాడఁగా నేను తెలిసికోలేక "నీకు తెలుఁగు తెలుసునా?" అని వాని నడిగితిని. అప్పుడు మాయిద్దఱికిని యీక్రింది సంభాషణము జరగినది.

బండివాఁడు—యెక్కడికి పోతావు ?

నేను—వంటపూటియింటికి.

బండి—యెక్కడికి ?

నే—వంటపూటియింటికి.

బం—తెలుఁగుతో చెప్పు.

నే—పూటకూటియింటికి.

బం—పూటకూటి ? నీకు తెలుగూరాదా ?

నే—పూటకూటియిల్లంటే డబ్బుపుచ్చుకొని అన్నం పెట్టే యిల్లు. అక్కడికి తీసుకుని పోవలెను.

బం—దుడ్డుతీసి అన్నంవేసే యింటికి నిన్ను యెత్తుకుపోయి విడువవలెనా ?

నే—పోగబండి యెక్కే చోటికి చేరువగావుండే యింటికితీసుకుపో. తెలిసిందా ?

బం—తెలిసింది. ముక్కాలురూపాయి వుక్కారుంగో.

నే—ముక్కాలురూపాయీకాక యింకా వుక్కారుంగోయేమిటి ? తరువాత చిక్కులు పెట్టక బేరం యిప్పుడే తిన్నగా చెప్పు.

బం—అన్నసత్రానికి యెత్తుకుపోయి విడిచి పూడుస్తాను. కూరోచ్చు. ముక్కాలురూపాయి యియ్యి.

అని బండివాఁడు మూఁడువేళ్ళు చూపెను. వానిమాటలు కొన్ని నాకర్థముకాకపోయినను, ఇయ్యవలసిన సొమ్ము స్పష్టముగా తెలిసి నందున బండిలో నెక్కి కూరుచుంటిని. వాఁడు బండిని వీధిలోనుండి తోలుకొని పోవుచుండఁగా వీధి కిరుప్రక్కలను మంచి మేడలను దివ్య భవనములును కన్నుల పండువుగా నుండెను. నడుమనడుమ పలకమీఁద పెద్దయక్షరములతో "—వారి అన్నసత్రం" అని వ్రాయఁబడియుండెను. వాని సంఖ్యనుచూచి ఒక్క వీధిలో నిన్ని యున్నసత్రము లుంచుటకు

చెన్నపురివా రెంతటి ధర్మాత్ములోయని యాశ్చర్యపడఁ జొచ్చితిని. ఇట్లాశ్చర్య పడుచుండఁగానే బండివాఁడు "సుబ్బరామ అయ్యర్ గారి అన్నసత్రం" అని వ్రాసియున్నచోట బండినిలిపి దిగుమని తలుపు తీసెను. అన్నసత్రమునకు కాదు వంటపూటి యింటికని చెప్పుచు నేను దిగక కూరుచుండఁగా బండివాఁడువచ్చి భాషతో నాలుగు కేకలు వేసి నన్ను చేయిపట్టుకొని లాగి నామూటతీసి క్రింద పడవైచెను. పరదేశములో వాఁడు నన్ను కొట్టి పోవునేమోయన్న భయముచేత వెంటనే బండిదిగి మూఁడుపావలాలు చేతిలోఁ బెట్టి వానిని పంపివేసి, పూట కూటి యిల్లెక్కడనో కనుఁగొన వలెనన్న యుద్దేశముతో లోపలికిపోయి "యిది అన్నసత్రమా?" అని వంటచేయుచున్న బ్రాహ్మణు నడిగితిని. "అవును. పూటకు భోజనమునకు కాలుఁరూపాయి. నాలు గణాలు" అని యతఁడు నాలుగువేళ్ళు చూపెను. ఆమాటలతో నా కన్నసత్రముయొక్క అర్థము బోధపడినందున మూటక్రిందదింపి, "నాకు ద్వాదశిపారణకు శుచిగా వంటచేసి పెడుతావా?" అని యడిగితిని. "కావలసినంత శుచిగా చేసిపెడతా" నని యతఁడుబదులు చెప్పెను. అందుమీఁద "నేను బ్రాహ్మడికి పెట్టుకోవడాని కెవరైనా వైష్ణవబ్రాహ్మలు దొరుకుతారా?" అని నేనాతనిని నడుగుచుండఁగా వాకిట కూరుచుండియున్న బ్రాహ్మణుఁ డొకఁడువచ్చి తాను ద్వాదశి బ్రాహ్మణుఁడుగా వచ్చెదనని చెప్పెను. నేనందుకు సంతోషించి స్నానము చేసి వచ్చుటకై లేచి యాతఁడు చూపిన 'కొళాయి' లో శిరస్నానము చేసి, తడిబట్ట యూడవేసి కట్టుకొని శుచినయి, పొగమోడ నెక్కిన పాపము పోవుటకై సహస్ర గాయత్రీ జపముచేసి, ప్రాతజన్నిదములు తీసి క్రొత్తవి వేసికొని, పంచముద్రలును ద్వాదశపుండ్రములును ధరించి గోవిందనామ స్మరణ చేసికొనుచు విస్తరిముందు కూరుచుంటిని. అన్న సత్రాధికారి రెండు విస్తళ్లలో ముందుగా అన్నము వడ్డించెను. అటు

తరువాత పులుసు తెచ్చి నేను ప్రక్కను వడ్డించుమని చెప్పుచుండఁగా నామాటవినక అన్నము మీఁదనే దానిని వడ్డించిపోయెను. అంతట ద్వాదశి పారణమునకు వచ్చెదనన్న బ్రాహ్మణుఁడు విభూతి పెట్టుకొని తానావఱకు కట్టుకొనియున్న బట్టలతోనే వచ్చి రెండవ విస్తరిముందు కూరుచుండెను. "మడికట్టుకొని రావయ్యా" అని నేను చెప్పినను నామాట లక్ష్యముచేయక కొంచెము సేపు కూరుచుండి, లేచి వీధిలోని కల్పశంకకు పోయివచ్చి తనవి మడిబట్టలేయని చెప్పుచు మునుపటి బట్టలతోనే మరలవచ్చి కూరుచుండెను. అప్పుడు నేనతని మొగము వాలఁజూచి విభూతిరేఖలనుబట్టి స్మార్తబ్రాహ్మణుఁడని తెలిసికొని, వ్రతభంగమునకు శంకించి లేచిపొమ్మని చెప్పవలెనన్న మాట నాలుక చివరకు రాఁగా ఆపుకొని, విస్తరిముందు కూరుచున్న బ్రాహ్మణుని లేచిపొమ్మన్నచో దోషము వచ్చునని యెంచి విషణ్ణుఁడనయి యూరక కుంటిని. పాపము! ఆబ్రాహ్మణుఁడు 'ద్వైతి' యని నేనన్నమాట 'అద్వైతి' యని గ్రహించి యిట్లు చేసియుండును.

"ఇతరులకు వడ్డించవలెను వేగిరము పరివేషనముచేయు" మని మాఅన్నప్రదాత తొందరపెట్టుటచేత విధిలేక యాబ్రాహ్మణునకే యాపోశనము వడ్డించితిని. మాసత్రాధికారి మిక్కిలి దొడ్డవాఁడు. నాకు ద్వాదశివ్రతము దక్కునట్లుగా నాఁటిదిన మవిసాకు కూరవండెను. మఱియేదోకూర వండెనుగాని దానిపేరు నాకు తెలిసినదికాదు. ఆవండిన కూరలయినను కలుపుకొనుటకు చాలకుండ మనదేశములో నూరుఁగాయలను వడ్డించినట్లు కొంచముకొంచముగా వడ్డించి మరలనడిగినను మాఱు తెచ్చినవాఁడుకాఁడు. పప్పుకావలెనని యడుగఁగా వండనేలేదన్నాఁడు. నెయ్యి కావలెనని యడుగఁగా అన్నము వడ్డించిన చేతితోనే చిన్న గిన్నెతో తెచ్చి యభిఘరించిపోయినాఁడు. అప్పుడు నాకు దేనితో భోజనముచేయుటకును తోఁచక యావఱకన్నముమీఁద వడ్డించిపోయి

సందున పులుసుతోనే యన్నముకలిపి మిరియాలుకంపుచేత రుచిగా లేకపోయినను కన్నులుమూసికొని నాలుగుముద్దలు మ్రింగితిని. ఇంతలో సంతబ్రాహ్మణుఁడు పులుసుకుండయు, అన్నపుబిందెయు, వాకిటిలోనికి తీసికొనిపోయి యెవ్వరికో శూద్రులకువడ్డించి మాకు వడ్డించుటకయి మరల తెచ్చెను. శూద్రులు చూచినయన్నము తినుటకునాకు మనసొప్పకపోయినను మా ద్వాదశిబ్రాహ్మణుఁడుమాత్రము మరల వడ్డించుకొని యాపులుసుతోనే తవ్వెఁడుబియ్యపన్నముతినెను. బిందెలో అన్నము మిక్కిలితక్కువగానుండుటచూచి, అంతయన్నమును శూద్రులే తినిరాయని యడిగిరి. "లేదు. మీరు స్నానానికిపోయినప్పుడు బ్రాహ్మణులకేపెట్టి వకచిన్నపంక్తిలేవఁదీసి" నని సత్రాధికారి చెప్పెను. ఆమాటలతో నామనసువిఱిగి యేకాదశి నిరాహారఫలమంతయు వ్యర్థమయ్యెనని నాకెంతో విచారము కలిగెను. ఆసంగతినే నేనాలోచించుకొనుచుండఁగా సత్రాధికారి రసముతెచ్చి మిరియాలువేసిన కాగికాగని చింతపండుసీళ్లు విస్తరిలో పోసెను. ఆభోజనసౌఖ్యము చెప్పుటకు శక్యముకాదు. నేనొకవేళ చెప్పినను దూరదేశములోనున్న మీరు పూర్ణముగా గ్రహింపలేకపోవచ్చును. కాఁబట్టి యోచదువరులారా! నా సత్యసంధతను పరీక్షించుటకయినను మీరొక్కసారి చెన్నపట్టణము నకువచ్చి, ౧౮౭ గృహసంఖ్యగల సుబ్బరామయ్యగారి అన్నసత్రములో ఒక్కపూట భోజనముచేసి, అనుభవైకవేద్యమయిన యాసౌఖ్యము నొక్కసారి తప్పక యనుభవించిపొండు. నేనిప్పుడు ముందుగానే చెప్పుచున్నాను. అన్నహితముపోయినదనిమాత్రము నన్ను తరువాత దూషింపఁబోకుఁడు. సత్యమును పరీక్షించువారీలోకములో నెన్ని కష్టములనయినను పడవలెను.

భోజనముకాగానే నాకును మాబ్రాహ్మణునకును భోజనమున కియ్యవలసిన యెనిమిదణాలను నేనే యిచ్చివేసితిని. అదిగాక మాబ్రా

హ్మణునకు రెండణాలు దక్షిణయిచ్చి, అక్కడసంగతుల నడుగ నారంభించితిని. కొంతసేపు సంభాషణము జరిగినతరువాత "మీరెక్కడకు పోవుచున్నారు?" అని నన్నతఁడడిగెను. "ఉడిపి సుబ్రహ్మణ్యము మొదలయిన యాత్రలు సేవింపఁబోవుచున్నాను" అని నేను చెప్పితిని. అప్పుడా బ్రాహ్మణుఁ డెన్నో నీతివాక్యములు చదివి, తన దేశములోని వారినందఱను మోసగాండ్రనియు తోడులేక యొంటిగా ప్రయాణముచేయుట యపాయకరమనియు మళయాళదేశములో చిత్రవిచిత్రము లెన్నియో యున్నవనియు తనతోఁగూడ వచ్చినపక్షమున వానినన్నిటిని నాకుఁజూపి నన్ను సురక్షితముగా మరల తీసికొనివచ్చెదననియు చెప్పి యొప్పించి, నన్ను పొగబండిమీఁద ప్రయాణము చేసెను. పొగయోడఖర్చులు మొదలయినవానిక్రింద నాకీవఱకయిన పదునెనిమిది రూపాయలుపోఁగా నావద్ద ఇప్పుడెనుబదిరెండు రూపాయిలున్నవి. వానిలో నాలుగురూపాయల పదణాలు నాకును మఱినాలుగు రూపాయల పదణాలు బదులుక్రింద తనకును మొత్తము తొమ్మిది రూపాయల రెండణాలు నావద్దపుచ్చుకొని మా బ్రాహ్మణుఁడు తుత్తికూడికి మూఁడవతరగతి టిక్కెట్లు రెండు తెచ్చెను. మఱునాటి యుదయమున ఏడుగంటలపావునకు మేమిద్దరమును జాబులుకొనిపోవు పొగబండిలో నెక్కి యెళంబూరునుండి యినుపదారిమీఁద బయలుదేఱినాము. బయలుదేరునప్పుడు బండిలోకూరుచుండి మాబ్రాహ్మణుఁడు రాహుకాలమెప్పుడని నన్నడిగెను. రాహుకాలమేమో నాకు తెలియదని నేను చెప్పితిని. రాహుకాలములో ప్రయాణము బయలుదేఱరాదని యతఁడనెను. మా దేశములో రాహుకాలమని పట్టింపులేదు వర్జ్యసమయమునమాత్రము బయలుదేఱరని నేనంటిని. మీయుత్తరదేశపువాళ్లేమియు తెలియని మూఢులని యతఁ డనుచుండెను. ఇంతలో మేమెక్కిన పొగబండి కదలి నడువ నారంభించెను. మాబ్రాహ్మణుఁడు

దేశ మెఱిఁగిన యనుభవజ్ఞుఁడగుటచేతను దేశభాష తెలిసినవాఁడగుట చేతను బహుప్రయాణములు చేసినవాఁడగుటచేతను భద్రముగా నుండునని నామూటకూడ నాతనిసంచిలోనే యుంచితిని. నాఁటిమధ్యాహ్నము మూఁడుగంటలవేళ బండి కూడలూరువద్ద పదినిమిషములసేపు నిలువఁగా మేమక్కడ లఘుశంకకు పోవ దిగితిమి. ఈలోపుగా మేమెక్కినబండిలో మాసరసను మఱియెవ్వరో క్రొత్తవారువచ్చి కూరుచుండిరి. మేము మరలవచ్చికూరుచున్న రెండునిమిషములకు బండికదలినది. అప్పుడు మాబ్రాహ్మణుఁడు వారితో అఱవములో ప్రసంగింప నారంభించెను. వారెవ్వరని నేను తెలుఁగుతో నడుగఁగా వారు మాలవాండ్రనియు, పొగబండ్లలో ప్రయాణములు చేయువా రాచారవ్యవహారములను పాటింపరాదనియు, మాబ్రాహ్మణుఁడు నాకు హితబోధ చేసెను. ఈప్రయాణము మూలమున మాలకూడు వచ్చినదని నాలో నేను విసుఁగుకొని, రాత్రి ఆఱుగంటలకు మాయవరము వద్ద బండి యేడునిమిషములు నిలువఁగా దిగి, నేను మఱియొక బండిలోనికి పోయి కూరుచుంటిని. ఏడుగంటల పావుకు బండి మరల కుంభకోణమువద్ద ఇరువదియైదు నిమిషములు నిలిచినప్పుడు మాబ్రాహ్మణుఁడు బండిదిగి నావద్ద కేవో ఫలాహారమును తెచ్చెనుగాని నేనా మాలగుడ్డలతో నేమియు తిననందున నావంతు వచ్చినది కూడ నతఁడేతిని బండిలోనికి పోయెను. ఆరాత్రి మేమిద్దఱమును మరలకలిసికోలేదు. స్థల మిఱుకుగానున్నందున పడుకొన చోటుచాలక నాకు తిన్నఁగా నిద్రపట్టినదికాదు. నాఁటి తెల్లవాఱుజామున అయిదుగంటల పావునకు మేమిద్దఱమును బాహ్యమునకు పోవుటకయి మధురవద్ద దిగినాము. అతఁడే వేళకును మరల రాలేదు. పావుగంట సేపటికి మరల బండికదలుటకు సిద్ధముకాఁగా, అతఁడేబండిలోనో యెక్కియుండునని త్రొందరలో నేనొకబండిలో నెక్కితిని. ఆదినము పదునొక్క గంటవేళ

బండి తుత్తుకూడి చేరినది. బండివద్ద నిలుచుండి యెంత వెదకినను బ్రాహ్మ ణునిజాడ కానరాలేదు. బ్రాహ్మణుఁ డెక్కడ తప్పిపోయినాఁడో, నన్నుఁ గానక యెంత పరితపించుచున్నాఁడో అని రెండుదినముల వఱకును బండివచ్చినప్పుడెల్ల మార్గస్థులను పరీక్షించుచు పొగబండి దిగుచోటికివచ్చి చూచుచుంటిని. బ్రాహ్మణుఁడురాలేదు. ఆబ్రాహ్మ ణుని మధురలో దొంగలుకొట్టిరో ఆలస్యమగుటచేత బండితప్పిపోయెనో, మఱియే ఆపదవచ్చెనో కాని బ్రాహ్మణుఁడు రాకుండెను వాఁడుకాఁడు. ఆతనికి ద్రోహచింతనే యున్నపక్షమున రాత్రియెక్కడనో చీఁకటిలో దిగి పాఱిపోక, తెల్లవాఱి మధురదాఁక ఎందుకు వచ్చును? ఆధనము నాకు ధర్మార్థముగా వచ్చినదే యయినందున పోయినసొమ్ము మరల రాదని నిరాశ కలిగినతరువాత దొంగలచేత పడక బ్రాహ్మణునిచేతిలో పడి సత్పాత్రదానఫలము నాకు లభించెనని సంతోషించితిని.

ఈబ్రాహ్మణుని నిమిత్తము నేను వెదకుచుండఁగా దైవికముగా నాకొక తెలుఁగు బ్రాహ్మణుఁడు కనఁబడి నాసంగతినివిని విచారపడి తన యింటికి తీసికొనిపోయి నాకాదినమున భోజనముపెట్టి, మఱునాఁడు నన్ను తనబండిలో నెక్కించుకొని తీసికొనిపోయి కొన్నిదినములలో దక్షిణ మళయాళమునకు రాజధానియైన తిరువనంతపురమునకు చేర్చెను. ఆపట్టణములో నేను నెలదినము లుంటిని. ఆపట్టణమును చేరినమఱు నాఁడే నాకక్కడ నొక తెలుఁగుదేశపు బ్రాహ్మణయోగితో మైత్రి సం భవించెను. అతఁడు మనపూర్వపుఋషులతో సమానమయిన మహి మయు తపశ్శక్తియు కలవాఁడు. అటువంటి మహానుభావులు లోక ములో అక్కడక్కడ నుందురుగాని వారి మహత్త్వమును తెలిసికొను వారుమాత్ర మంతగా లేరు. చూచిచూడఁగానే నాకాయన మహాను భావత్వము జుట్టువలె పెరిగిన గడ్డముచేతనే పొడగట్టినది. కొన్నిదినము లాయనకు శుశ్రూషచేసి " మనవా రాడమళయాళ మంటారే, అది

యేద"ని నేనాయనను రహస్యముగా నడిగితిని. ఆయన మొట్టమొ
దట మర్మము విడిచి చెప్పక "యిదే ఆడమళయాళ" మని సెల
విచ్చెను. బుద్ధిమంతుఁడను గనుక నే నామాటలంతటితో నమ్మక
"యిదే ఆడమళయాళమయితే యిక్కడ మగవాళ్లెందుకున్నారు? ఆడ
మళయాళంలో మగవాళ్ళక్కర లేకుండా గాలికి బిడ్డలు పుడుతా రని
మా దేశంలో తెలిసిన పెద్దలునాతో నమ్మకంగా చెప్పినారు. అది
యిక్కడ యెక్కడా కనపడడం లేదు. బ్రాహ్మలలో ఆడవాళ్లకు సమర్తా
డిన తరువాత పెళ్లిళ్లు చెయ్యడమూ శూద్రులలో ఆడవాళ్లు పైటవేసు
కోకుండా వుండడమూ స్త్రీలలో చాలామంది పెళ్లిళ్లు లేకుండా తమ మనసు
వచ్చినవాళ్లను వుంచుకొని మనసువచ్చినప్పుడు వదిలిపెడుతూయుం
డడమూ పురుషులకు భాగం లేకుండా కుటుంబపుసొత్తంతా స్త్రీలే
అనుభవిస్తూవుండడమూ కన్న కొడుకులు రాకుండా రాజ్యానికి తోడఁ
బుట్టిన దానికొడుకులు వస్తూవుండడమూ తప్ప మా దేశానికీ యీదేశా
నికీ యేమీ భేదం కనబడడం లేదు. ఇది ఆడమళయాళంకాదు ఆడమళ
యాళం యెక్కడవున్నదో చెప్పక తప్పదు" అని ఆయన కాళ్లమీఁద
పడి లేచినానుకాను. ఈప్రకారముగా నేనాయనకు పరమభక్తితో
మాసముదినములు శుశ్రూష చేయునప్పటికి నాయందాయన కపరి
మితానుగ్రహమువచ్చి, ఒకనాఁడు ప్రాతఃకాలమునందు నన్నాయన
స్త్రీమళయాళమునకు దారిచూపెదను రమ్మని పట్టణమునకు వాయవ్య
దిక్కున రెండుక్రోసుల దూరము కొనిపోయి, ఒకయడవిలో ప్రవే
శించి కొంచెము దూరము నడిచి యొకచిన్న కొండయెక్కించి దానిలో
నున్న గుహయొక్కటిచూపి ఆడుమళయాళమున కిదేదారి భయపడక
పొమ్మని చెప్పెను. ప్రాణాధికు లయిన నాదేశస్థులలో నావలెనే స్త్రీ
మళయాళమునకు పోవనుద్దేశించుకొన్నవా రున్నపక్షమున వా రితరుల
నెవ్వరిని అడిగి తెలిసికోవలసిన పనిలేకుండ వారికి వివరముగా తెలుపుట

కయి నడుచునప్పుడు నేనా దారిని సర్వమును కొలిచి గుఱుతులుపెట్టుకొని తరువాత పుస్తకములో వ్రాసికొన్నాఁడను. ఒక్క యక్షరమయినను హెచ్చుతగ్గులేకుండ నేనప్పుడు వ్రాసికొన్నట్లు మీకది యిప్పుడు చెప్పెదను శ్రద్ధవహించి వినుఁడు. పట్టణము వెలుపలనున్న పెద్దరావిచెట్టు మొదలుకొని యిసుకలో ముక్కుకు సూటిగా వాయవ్యమూలను మూఁడుమూరలు తక్కువగా ముప్పావుక్రోసుదూరము నడిచిన తరువాత వెలగచెట్టువద్ద మోచేతివంపుగా తిరుగవలెను. అక్కడనుండి యెడమచేతిమీఁదుగా పావుక్రోసునడిచి చిన్న మోదుగురుప్ప కనబడ్డ తరువాత కుడివైపునకు తిరిగి క్రోసుమీఁద మూఁడు మూరలదూరము పోవునప్పటికి చిట్టడవి కనఁబడును. ఆ యడవిలో దూరి జువ్విచెట్టున కెదురుగానున్న నడదారిని ఎడమవైపునకును కుడివైపునకును ముందుకును వెనుకకును వంకరటింకరగా దారిపోయి నల్లెల్లను అరక్రోసుమీఁద తొమ్మిదిబారల మూఁడుమూరల రెండడుగుల నాలుగంగుళములు నడవఁగానే యొకకొండ కానఁబడును. ఆకొండ మీఁదికి తిన్నగా పదినిలువుల బారెడుదూరమెక్కి మూలగా మూఁడు నిలువుల మూరెడుదూరము దిగఁగానే చిట్టీతపొదచాటున గుహయొకటి కానఁబడును. మీరీకొలతలు మఱచిపోయిన పక్షమున దారితప్పి చిక్కులు పడవలసివచ్చునుకనుక దీనిని మీరు సంధ్యావందనము వల్లించినట్లు నిత్యమును త్రికాలములయందును వల్లింపుఁడు. నేనాగుహాపదేశమును భగవద్వాక్యముగా నమ్మికొని, అంధకారబంధురముగా నున్న యాగుహలో ప్రవేశించి కొంచెముదూరము నడుచునప్పటికి కాలుజారి క్రిందకిపడ నారంభించితిని. ఆప్రకారముగా యోజనదూరము పడువఱకును వేఁడి యంతకంతకెక్కువయి దుస్సహముగా కనఁబడెనుగాని తరువాత వేఁడి యంతకంతకు చల్లారి యెంతో మనోహరముగా నుండెను. క్రిందికి పోయినకొలఁదిని భూమిలోవేఁడి యంతకంతకు

హెచ్చుచుండుననియు, కొంతదూరము పోయినతరువాత అగ్నిమయ మయి భూమధ్యమున సమస్తము కరఁగి ద్రవరూపముగా నుండుననియు, చిన్నప్పుడు పాఠశాలలో మాయుపాధ్యాయుఁడు చెప్పెనుగాని, ప్రకృతి శాస్త్రవేత్తల మనుకొను హూణపండితులు చెప్పిన యీసంగతి యసత్య మనియు మనపురాణములే నిజములనియు నేనిప్పు డనుభవముచేత కని పెట్టితిని. ఈవిషయమునందు సందేహముగలవారు నన్ను వచ్చి యడిగిన పక్షమున నేను సర్వమును సరహస్యకముగాచెప్పి సంశయ నివృత్తిచేసి పంపెదను. ఇట్లు కొంతదూరము పడినతరువాత నాకాలికప్పుడేదో దూది వలెమెత్తగా తగిలినది. ఆయాసపడి యుండుటచేత నేనప్పుడు దాని మీఁద కాలూని కూరుచుండి వీపుమీఁద వెనుక కొరిగినాను. అప్పుడు నేను పఱుపుమీఁదినుండి మెల్లగా జారుచున్నట్లు తోఁచినది. ఇంతవఱ కును నేను ప్రత్యక్షముగా చూచినది. ప్రత్యక్షప్రమాణము సర్వోత్కృష్ట మయినదని యెల్లమతములవారు నంగీకరించినదేకదా ? అంతట నాకు నిద్రపట్టినది. ఆనిద్ర యెన్నిదినములున్నదో యేయేదారిని జరిగినానో నాకప్పుడు తెలియలేదుగాని నిద్ర తెలిసి నేను కన్నులువిచ్చి చూచు నప్పటికి నేనొక గుహాసమీపమున రాతిమీఁద పరుండి యుంటిని. సూర్యుఁడప్పుడే పశ్చిమమున నుదయించుచుండెను. ఇఁక ముందు చెప్పఁబోవు రీతిగా ఆదేశాచారములు మనదేశాచారములకు విరుద్ధ ములయినట్లే యక్కడి సూర్యుఁడును పడమట నుదయించి తూర్పున న స్తమించుచుండును. అంతవరకును నాకాఁకలికాకుండుటయు, దేహ మున గాయములు తగులకుండుటయు, నిద్రపట్టుటయు, అంతయు మాగురుప్రభావముచేత నయినదేసుండీ! నిద్రలో నున్నంతవఱకును క్షుత్తు లేక లేవఁగానే కలుగుటకు గురుకటాక్షముకాక మఱియేమికారణ ముండును.

మూఁడవ ప్రకరణము

నేను నిద్రనుండి లేచి కన్నులు తెఱచిచూచినప్పటికిఁ బశ్చిమమున సూర్యుఁడుదయించుచుండెనని వెనుకటి ప్రకరణమునందుఁ జెప్పియుంటినికదా ? ఏమియుఁ దెలియని క్రొత్తదేశములో తూర్పేదో పడమరయేదో తక్కిన దిక్కులేవో సూర్యోదయమును బట్టిగాక మఱియెట్లు తెలిసికోఁ గలిగితినని మీలోని కొందరు బుద్ధిమంతులకు సందేహము కలుగవచ్చును. దీనిం జదువువారి కిందలి యేవిషయమునందును సందేహముండరాదు గనుక సహేతుకముగాను తృప్తికరముగాను తగినసమాధానము జెప్పి యిప్పుడే వారిసంశయనివారణము చేసెదను. "సంశయాత్మా వినస్యతి" అనుభగవద్గీతా ప్రమాణము మీ రెఱిఁగినదే యగుటచేత దాని నెప్పుడును మనస్సునందుంచుకొని యాస్తికశిరోమణులయిన మీరు ప్రమాణబుద్ధితో నావాక్యములను వ్యాసవాక్యములేయని మాఱుమాటాడక విశ్వసించి మేలు పొందవలెనుగాని నాస్తికాధములవలె సందేహపడి చెడిపోరాదుసుండీ. నేను మేల్కని కన్నులువిచ్చి చూచునప్పటికి నేను వీపుమీఁద వెల్లవెలికలఁ బరుండి యుంటిని; అప్పుడు కన్నులపండువుగా సూర్యబింబము రత్నకుంభమువలె భూమికి మూరెడెత్తున నాయెడమవైపున దిఙ్మండలమునం దెఱ్ఱగా గానఁబడుచుండెను. అదిచూచి మొట్టమొదట నేను సూర్యుఁ డస్తమించుచున్నాఁడని భ్రమించితినిగాని క్రిందికిపోక సూర్యబింబమంతకంతకు పయికి రా నారంభించుటచేత సూర్యోదయమేకాని యది సూర్యాస్తమానము కాదని కొంచెముసేపటిలోనే భ్రాంతి నివారణము చేసికొంటిని. కర్మభూమియైన భరతఖండమునందు కర్మప్రధానమయిన బ్రాహ్మణవర్ణములో కర్మిష్ఠులయిన వ్యాసరాయాచార్యులవారికి నుపుత్రుఁడనయి కులపవిత్రుఁడ నయిన నేను మఱచియైనను నిద్రలో నహి

తము సదాచారవిరుద్ధముగా శాస్త్రనిషిద్ధమయిన యుత్తరదిక్కు తల యుంపిగా పరుండి యుండననుట నిశ్చయము. పూర్వము త్తరదిక్కునఁ దలపెట్టుకొని నిద్రించిన దోషమును బట్టియేకదా తలకోలుపోయిన విఘ్నేశ్వరుని మొండెమున కతుకుటయి యేనుఁగుతల నతుకఁబడినది ! కాఁబట్టి యిప్పుడు నాతలయున్నదిక్కు తప్పక దక్షిణదిక్కయి యుండ వలెనుగాని యుత్తరదిక్కయి యుండదు. దక్షిణపుతలగా వెల్లవెలికలఁ బరుండియున్నప్పుడు నా కెడమచేతివైపు పశ్చిమమయియుండవలెనుగనుక కర్మశాస్త్రప్రామాణ్యమునుబట్టి. సూర్యుఁడుదయించునది పశ్చిమమే గాని తూర్పుకాదని తత్క్షణమే నిశ్చయించుకొంటిని. ఈప్రకారముగా సృష్టిలోని యొక్కయపూర్వ సత్యమును మహాద్భుతముగా కనిపెట్టఁగలిగినందుకు నాలోనేనానందించుచు, కన్నులుమూసుకొని యాక్రాంత దేశములో నేనొంటిగా నెక్కడకుఁ బోవుదునా భగవంతుఁడాయని యాలోచించుకొను చుండఁగా నింతలో కొంచము మబ్బుపట్టి చల్లగా నున్నందునను మార్గాయాసముచేతను నాకు హాయిగా నిద్రపట్టినది. ఈశ్వరానుగ్రహమువలన నాకానిద్రలో దివ్యమయిన స్వప్నమొక్కటివచ్చినది. ఆకలలో నేనువెనుక పఱుపుమీఁద పోలి నిద్రలో జాఱినది మొదలుకొని యిక్కడకు వచ్చువఱకును జరగిన సర్వవృత్తాంతమును కన్నులార నిదర్శనముగాఁ జూచితిని. ఇది పరమరహస్యమయిన యర్థమేయైనను శ్రద్ధాళువులయిన మీకొక్కరికి మాత్రము చెప్పెదను. మీరీమర్మమును కర్మభ్రష్టులకును వేదబాహ్యులకును నాస్తికులకును విశ్వాసహీనులకును జెప్పకగోప్యముగా నుంచుఁడు. నేను వెన్నువాల్చిన యాపఱుపు భూమ్యంతరాళమున సాయంసమయమువఱకును తిన్నగా నధోముఖముగా దక్షిణమునకుజాఱినది. నావలెనే పాఠశాలలలోని గోడలకు తగిలించియుండు దేశపటములను జూచియుండిన మీకు పైవైపుత్తరమనియు క్రిందవైపు దక్షిణ

మనియుం దెలిసియుండవచ్చును. అటుపిమ్మట చీఁకటిపడినతరువాత రాత్రి రెండుయామములవఱకును భూమిలోపల నడిమిభాగమునందున్న మహావాయుపథములో దేవతావిమానమువలె దశదిశలకును నూఱు యోజనములు పఱచి పిమ్మట మఱియొక గుహాముఖమునందు నేను నాపఱుపుతోఁగూడ వాలితిని. అటుతరువాత నాపఱుపు వెనుకటివలెనే పయికి మెల్లగా జాఱనారంభించినది. ఆపిమ్మట భగవన్మాయచేత పఱుపాకస్మికముగా సదృశ్యమైనది. అప్పుడక్కడనుండి నేను వెనుకటి యట్లే పయికి పడ మొదలుపెట్టితిని. అట్లుకొంతదూరము పడినతరువాత నాశరీరమునకు దుస్సహమయిన వేఁడిసోఁకినది. ఆ వేఁడి యంతకంతకు తక్కువగుచువచ్చి నేను యోజనదూరము పడునప్పటికి నాకాలికి గట్టిగా నేలతగిలినది. ఆ నేలమీఁద కొంచెముదూరమునడిచి నేను గుహాలోనుండి పయికివచ్చి భూమిమీఁద నేనింతకుముందు చెప్పిన రాతి మీఁద పరుండునప్పటికి, తెల్లవాఱి సూర్యోదయమయినది. ఇంతలో నాకాస్వప్నముపోయి మెలఁకువవచ్చినది. ఆకుమళయాళమునకిదియే సరియైనదారి. ఓధీమంతులారా! ఇది కలయని భ్రమపడి దీనిసత్యమునుగుఱించి మీరొకవేళ సంశయపడెదరునుండీ! అట్లు సంశయపడఁ గూడదు. ప్రమాణబద్ధులైన మీరు దీనిని రెండవ వేదవాక్యమునుగా విశ్వసింపవలెను. ఈస్వప్నమును వేదవాక్యమునుగా నేలవిశ్వసింపవలె నందురేమో చెప్పెదనువినుండి. పూర్వకాలమునందు మంత్రద్రష్టలైన మన మహర్షులకు వేదములు ప్రత్యక్షమయిన విధమిట్టిదే. వారీశ్వరధ్యానముచేయుచు కన్నులుమూసుకొని చింతించుచుండినప్పు డీశ్వర ప్రసాదమువలన ఆమహానుభావులకు వేదములు స్వప్నములవలె పొడగట్టి సర్వజనులకును పరమప్రమాణములయినవి. ఈశ్వరకటాక్ష మాకాలపువారి పైని మాత్రముపడి యీకాలపువారికి లేకపోవునని భావింపకూఁడదు. మహానుభావులయిన భక్తులకెప్పుడును భగవంతుని

నిస్వార్థుకజాయమాన కటాక్షము కలుగుచుండును. కాఁబట్టి వెనుకటి వలెనే యీశ్వరానుగ్రహమువలన నాకిప్పుడు దర్శనమిచ్చిన యీకడ పటివాక్యములను మీరందరును పరమప్రమాణముగా నంగీకరించి గౌరవించవలెను. ఇవి భక్తివిశ్వాసములు గలవారికందరికిని తప్పక వేదములవలెనే ప్రత్యక్ష దృష్టములకన్నను అధిక ప్రామాణికములగును. మఱియు నేను మొట్టమొదట భూమిమీఁది గుహలో దిగుటయాదిగా పట్టుపుమీఁదనోఱగి జాఱుటతుదిగా మేలుకొని యున్నంతవరకు నడిచిన దారి ప్రయాణమంతయు నేను కట్టకడపట గుహలోని పట్టును మరల నానుకొనుట మొదలు పయికి భూమిమీఁదికి వచ్చువరకును జరిగిన దారి ప్రయాణముతో సరిగా సరిపోయినందున నాస్వప్న మణుమాత్రమును ప్రత్యక్ష విరుద్ధమయినదియుఁ గాదు. అంతేకాక నాకాకల తెల్లవారు జామునఁ గలిగినదగుటచేత అధిక విశ్వాసార్హమయినది. నేనిప్పుడు చెప్పినదంతయు ఆడమళయాళమునకు సరియైనమార్గము. ఈగురుతులు పట్టుకొని యాదేశమున కెవ్వరేనిమిమమునఁ బోఁదలఁచినను రెండవకంటి వాఁడెరుఁగకుండ తిన్నగా కన్నులుమూసికొని పోవచ్చును. అక్కడి దేశభాష నేర్చుకొని మరి పోఁదలఁచిన పక్షమున ముందుగా నావద్దకు వచ్చి యారునెలలు శుశ్రూషచేయుఁడు. మిమ్మాభాషలో పండితులనుజేసి పంపెదను. గురుదక్షిణ తరువాత మీాయిష్టమువచ్చినంత సమర్పించుకోవచ్చును. గురుదక్షిణలేక యభ్యసించినవిద్య సఫలము కాదని పెద్దలలో మెలఁగనేర్చిన మీాకే విశదమయియుండును. మీరు కాని చీటీమీఁద నాకుత్తరము వ్రాసినపక్షమున నాయిప్పటి వాసస్థానాదులను మీాకు వివరముగాఁ దెలిపెదను. ప్రయాణముకథ నింతటితోఁ జాలించి యిఁక దేశవృత్తాంతమున కారంభించెదను సావధానముగా వినుఁడు.

అప్పుడు నేను లేచి కొంచెము దూరము నడిచి యొక చెట్టునీడను గూర్చుండి యేవంకకుఁ బోదునాయని యాలోచించుకొనుచుండఁగా, తూర్పువైపుననుండి రెండు విగ్రహములు నావంకకు నడిచి వచ్చినవి. ఆవచ్చినవారు పురుషులయి యుందురా స్త్రీలయియుందురాయని నామనస్సున కప్పుడొక గొప్పసందేహము తోఁచినది. వారి మొగములు చూడఁగా నించుమించుగా వారు ముప్పదిసంవత్సరముల ప్రాయము కలవారుగాఁ గానఁబడిరి. వారి మూతులకు గడ్డములుగాని మీసములు గాని లేవు. దీనినిబట్టి వారు క్రొత్తగా క్షురకర్మచేయించుకొనిరని మీరు భావింపఁగూడదు. మన స్త్రీలకువలెనే వారికిని మొగములమీఁద గడ్డములును మీసములును భగవంతుఁడే ప్రసాదించలేదు. వారిద్దఱును చామనచాయగలిగి, పొడవునందు నాకంటె పిడికెడెక్కువగా నుండిరి. వారికాభరణము లేవియు లేవు; మొగమున బొట్లు లేవు; కంటఁ గాటుక లేదు. ఏకరీతిగా వారిరువురును నిడుదలయిన నల్లని లాగులును, ఎఱ్ఱనికుఱుచ చొక్కాయలును, తలలకు గడ్డితోనల్లిన తెల్లకుళ్ళాయలును ధరించిరి; కాళ్లకుచెప్పులు తొడుగుకొనిరి. వారినడుము చుట్టును పట్టుదట్టీలు బిగింపఁబడి యున్నవి. పట్టుదట్టీలకు ముందువైపున నేవో యక్షరములు చెక్కిన యిత్తడిబిళ్లలున్నవి. వారి చేతులలో రెండేసిమూరల పొడవుగల గుండ్రని రెండు విరుగుడుచేవకఱ్ఱలున్నవి. ఈలక్షణముల నన్నిటినిబట్టి వారెవ్వరో రాజభటులనియు, పేడిమూతి వారనియు నేనప్పటికి నిశ్చయించుకొంటిని. వారు మొట్టమొదట నాతో నేమియు మాటాడక, వయస్సులోనున్న క్రొత్తస్త్రీ యెవ్వతెయైనను వీధిలో కనఁబడినప్పుడు మనదేశములో పురుషులు దానిమొగమువంక నెగాదిగ చూచునట్లుగానే వారును నామొగమువంక పదినిమిషముల వఱకును ఱెప్పవేయక చూచి, తమలోనేమో మెల్లగా గుసగుసలాడుకొని తరువాత వారిలో నొకఁడు నాసమీపమునకువచ్చి "తూమీ

భూ ఖే ?" అని యేదో ప్రశ్న వేసినట్లుపలికెను. నాకామాట అర్థ మగునదికాదు. అయినను పెద్దమనుష్యుఁడేదోయడిగినప్పుడు ప్రత్యుత్తరము చెప్పకుండుట ధర్మముకాదని తలఁచి అతఁడు నాపేరెవరని యడిగియుండునని యూహించి, తెలుఁగు భాషతో "నాపేరు సత్యరాజాచార్యులు" అని చెప్పితిని. వాఁడు కొంచెముసేపాలోచించి మరల బిగ్గరగా "తూమిూభూఖే" అని పలికెను. నేనువానికిఁ దెనుఁగు తెలియదనిగ్రహించి, హిందూస్థానిభాష సమస్తదేశముల లోను తెలియునుగదా యని నేను విజయనగరములో మహారాజుగారి వెంట కాశీనగరమునకు వెళ్ళివచ్చిన వారితోడి సహవాసమునుబట్టి మాటాడ నేర్చుకొన్న యాభాషతో "మేరానాం సత్యారాజాచార్" అని చెప్పితిని. వాఁడామాటను సహితము గ్రహింపక "తూమిూ భూఖే" అని మరల మఱింతబిగ్గరగా నఱచెను. అందుమీఁద నేను వానికీభాష తెలియకపోయినను ఈకాలమునందు సర్వత్ర వ్యాపించి యున్న యింగ్లీషయినను దెలిసియుండునని "మై నేమ్ ఈజ్ సత్యరాజాచార్య" అని చెప్పితిని. వాఁడాభాషను సహితము తెలిసికోలేక కోపముతో మరల నెప్పటిప్రశ్ననే వేసెను. ఆపయిని నాకేమి చేయుటకును తోఁచక దేశభాషలు తెలియకపోయినను దేవభాష తెలియు నేమోయని సంస్కృతములో "అహం సత్యరాజాచార్యనామక విప్రః" అని స్పష్టముగాఁ జెప్పితిని. ఆమూర్ఖుఁడదియును తెలిసికో లేక రెండవవానికేసి తిరిగి యేదో భాషతో ననెను. ప్రసిద్ధమయిన నాపేరు వారికిఁ దెలియఁబఱుపకుండుట నాకిష్టములేక యఱవదేశము నకు సమీపముననుండుటచేత ద్రావిడభాషయైనను దెలియునేమోయని "ఎన్ పేర్ సత్యరాజాచారిన్" అని చెప్పితిని. ఈయఱవములోఁ దప్పున్నయెడల దీనింజదివెడి యఱవవారు నన్ను మన్నింపవలెను. నేను వెనుక పొగబండిలో యాత్రచేయునప్పుడు నాలుగఱవ ముక్కలు మాబ్రాహ్మణునివలన నేర్చుకొన్నాను. కాఁబట్టి యీతనిచేతిలోఁబడ

నాసొమ్మతఁడు గురుదక్షిణగా గ్రహించినట్లయినను మీరూహింప వచ్చును. వారి కీయుఅవగోడును దెలిసినదికాదు. నేనప్పుడు నాస్వభాషయైన కన్నడములోఁ జెప్పిచూతమని "నమ్మ—" అని యారంభించునప్పటికి వారిరువురును నావద్దకువచ్చి చేయిపట్టుకొని నన్ను లెమ్మనిలాగిరి. నేనప్పుడు నాభాషాపాండిత్యము చూపుటకది సమయము కాదని మౌనము ధరించి, మీవెంటవచ్చెదను నన్ను లాగవలదనియు మాయూరు విజయనగరమనియు నాపేరు సత్యరాయాచార్యులనియు నేను సద్బ్రాహ్మణుఁడననియు సమస్తమును చేసైగచేసిచెప్పి, చివాలునలేచి వారివెంట నడువనారంభించితిని. ఊరును పేరును వంశమును గూడ నెట్లుసైగచేసితినని మీలోఁదెలియనివారికిఁ గొంచటికి సందేహము కలుగవచ్చును గాని యీసంశయము నేను చేసైగచేయుచుండఁగా శ్రద్ధతోఁ జూచినవారికి నివారణము కావలసినదేకాని చెప్పుటవలన విడిపోదు. ఆరాజభటులలో నొకఁడు ముందునడువఁగా మన దేశములోని గొప్పరాజకీయోద్యోగివలెనే వానివెనుక నేనును తలవంచుకొని నడువఁజొచ్చితిని. రెండవవాఁడు నావెనుక నడుచుచుండెను. ఇట్లు కొంచెముదూరము నడుచునప్పటికి మేమొక పట్టణముయొక్క రాజవీధిలోఁ బ్రవేశించితిమి. అప్పుడు వీధిపొడుగునను మనుష్యులు నాకు కనఁబడఁ జొచ్చిరి. వారు ధరించుకొన్న బట్టలు మొదలయినవి వివిధములుగానున్నను వారిలో నొక్కరికిని గడ్డములును మీసములునులేవు. అట్టి విచిత్రమైన సృష్టివలన నాకప్పుడు గలిగిన యద్భుతానందములకు పరిమితిలేదు. అఘటనాఘటన సామర్థ్యముగల సర్వేశ్వరుఁ డాదేశములో మగవారికి మూతికి మీసములులేకుండ నేల చేసెనాయని త్రోవపొడుగునను నాలోనేను వితర్కించుకొనుచుంటిని. ఆసమయమునందు నాకాకస్మికముగా మఱియొక సంగతి స్మరణకువచ్చినది. ఇది యాఁడుమళయాళము గదా యిందుఁ బురుషులెట్లుందురని నా

మనస్సునకుఁ దగులఁగానే నేను జూచిన వారందఱును స్త్రీలేయనియు, ఈదేశమునందుఁ బురుషులు లేరనియు, గాలికే బిడ్డలు పుట్టుదురనియు, స్త్రీమళయాళమునుగూర్చి మనవారు చెప్పినదంతయు సత్యమేయనియు, నేను నిశ్చయించుకొంటిని. నామనస్సులో నీయాలోచన ముగియునప్పటికి మే మొక్క యిల్లుచేరితిమి. ఆయింటిగుమ్మమువద్దను లోపలనుగూడ నన్నుఁ దీసికొనివచ్చిన వారివంటివేషములు ధరించుకొన్న పేడిమూతి రాజభటు లనేకులుండిరి. మొదటి యిద్దఱు రాజభటులును నన్నులోపలికిఁ గొనిపోఁగా లోపలివారందఱును గుంపులుగుంపులుగా వచ్చి యడవిమృగమును జూచినట్టుగా నన్ను తేఱిపాఱఁజూడసాగిరి. అంతట వారిలోవారేమో యాలోచించుకొని నన్ను దూరముగాఁ దీసికొనిపోయి మూలగానున్న యొకకొట్టులోఁబెట్టి పయిని తలుపువేసిరి. అంతట రాజభటులు కొంద ఱొకరువిడిచి యొకరు తలుపువద్దకువచ్చి దానికి నిలువుగా వేయఁబడిన యినుపకమ్ములసందునుండి బోనులోనున్న యడవి జంతువును జూచినట్లుగా నన్ను తొంగితొంగి చూచుచు నావలకుఁ బోవుచువచ్చిరి. ఇట్లువచ్చుచుఁబోవుచుంటయు వారిలో నేమోయాలోచించుకొనుచుంటయు చూడఁగా మనదేశములోని పోలీసుభటులు సంగతి నాకు జ్ఞప్తికివచ్చి వారికేదో దురుద్దేశముకలిగినట్టు నాకు పొడకట్టినది. కానినేను స్త్రీనిగాక పురుషుఁడనయినందున అట్టియనుమానముతోఁ బనిలేదని మనస్సమాధానము చేసికొంటిని. ఈరీతిగా రాజభటులలో నేదో యాలోచన జరుగుచుండఁగా నింతలో వారి యజమానుఁడక్కడకువచ్చెను. ఆతనిని దూరమునుండిచూచి వారందరును తమతమ యథాస్థానములకుఁ బోయిరి. అటుతరువాత నతఁడు తనపనిని చేసికొని, తాను మొదట వచ్చినప్పుడు నాకొట్టుముందు భటులు గుంపుగూడి పరుగెత్తిపోవుట కనిపెట్టినవాఁ డగుటచేత నందేదోవింతయున్నదని యూహించి, నాకొట్టువద్దకువచ్చి తలుపుతీయించి, రాజభటులు

నామీఁద నేమినేరము మోపుదురోయని భయపడి వజవజ వణఁకుచున్న నన్నుఁజూచి, నన్నేదో ప్రశ్నవేసి నావలన ప్రత్యుత్తరముగానక తన భటులనేమో యడిగి తెలిసికొని, నాయందు నిర్హేతుక జాయమాన కటాక్షము గలవాఁడయి తనవెంట నన్ను తనయింటికిఁ దీసికొనిపోయెను. ఈశ్వరానుగ్రహముచేత నేనిట్లు గారాగృహ విముక్తుఁడనయి మంచి యింటఁ బడఁగలిగితిని. అతఁడు దయారసము గలవాఁడగుటచేత నన్నాదరించి, తనయింటిలో వీధివైపున నాకొకగది యిప్పించి, నాకు పరుండుట కాగదిలో మంచమొకటి వేయించి, తన సేవకునిచేత భోజన పదార్థములు తెప్పించి నాముందు పెట్టించెను. వారేజాతివారో తెలియకపోవుటచేత వారు తాఁకిన పదార్థములను తినుటకు నేను మొట్టమొదట సంకోచించితినిగాని, ఏదైననుసరే తినుమని యాఁకలిదేవత నాకడుపులోదూరి నన్ను బాధించుటచేతను, ఆదేశములో బ్రాహ్మణులున్నారన్న జాడయే లేకపోవుటచేతను, పూర్వకాలమునందాపత్సమయమున విశ్వామిత్రాదులు చండాల గృహమున శ్వమాంసాదులను దొంగిలించి క్షుత్తు తీర్చుకొనుట పురాణములో చదివి యుండుటచేతను ఆత్మరక్షణము పరమధర్మమని మనశాస్త్రములు చెప్పియుండుటచేతను, స్వదేశముచేరిన తరువాత ప్రాయశ్చిత్తము చేయించుకొని బ్రాహ్మణ సంతర్పణముచేసి శుద్ధుఁడను కావచ్చునని నాటికి భోజనము చేసితిని. ఆదినమున నోటికి తిన్నగా మెతుకులు పోయినవి కావుగాని తరువాత క్రమక్రమముగా నలవాటు పడుటచేత మనుగుడుపు పెండ్లికొడుకువలె భోజనప్రియుఁడనై తేరభోజనములు చేయసాగితిని. మా గృహయజమానిపేరు 'భాంఢీభంగీ!' అతఁడు బ్రాహ్మణభక్తిచేతఁ గాకపోయినను మంచిహృదయము గలవాఁడగుటచే నాకు సమస్తోపచారములును జరుగునట్లుచేసి, ఆరంభములో తమభాషను నాకు స్వయముగానే నేర్పుచువచ్చెను. నేను గోడలు, మేడలు, ఉప్పు, పప్పు

అల్లము, బెల్లము, బట్టలు, తట్టలు, ఆవులు, మేకలు మొదలైన వానినిజూపి వానిపేరు లేమని సైగచేయుచురాఁగా నాతఁడు చెప్పుచు వచ్చెను. ఆ పేరులన్నియు నేను వెంటఁగొనిపోయిన తెల్లకాగితముల పుస్తకముమీఁద తెలుఁగుతో వ్రాసికొని వల్లించుచు వచ్చితిని. మొదటి దినమున నేనా మాటలను వ్రాయుచుండఁగా నతఁడు చూచి యత్యాశ్చర్యపడెను. ఆ యాశ్చర్య కారణమును మీకు ముందు చెప్పెదను. నేను వారిభాష నభ్యసించిన క్రమమంతయుఁ జెప్పఁబూనుకొన్న చో మీకు విసుగుదలగా నుండును. అంతేకాకిటువంటి వర్ణనలవలన మీకును నాకును గూడ లాభములేదు. విశేషప్రయాసపడి మూఁడు మాసములలో వారిభాష నొకరీతిగా నేను ధారాళముగా మాటాడుటకు నేర్చుకొన్నాను.

నాల్గవ ప్రకరణము

ఒకనాఁడు సెలవుదినమున భోజనముచేసి కూరుచున్న తరువాత నాయజమానుఁడైన ఫాంఢీభంగీ నన్నుఁజూచి జాలితో నీపత్ని పోయి నది కాదాయని రండీభాషతో నడిగెను. వారిదేశమును మనము స్త్రీ మళయాళమన్నను స్వదేశస్థులు దానిని రండీదేశమని వాడుదురు. అందుచేత వారిభాషయు రండీభాష యనఁబడును. నన్నతఁడా ప్రశ్న యడుగఁగానే యాతని జ్ఞానమునకు నేనత్యాశ్చర్యపడి, అతనికి జ్యోతిశ్శాస్త్రపరిజ్ఞానమువలననే యీసంగతి తెలిసినదని యెంచుకొని, ఆశాస్త్రమును గ్రహింపవలెనను తలంపుతో "అయ్యా! నా భార్య స్వర్గస్థురాలైనసంగతి మీకెట్లు తెలిసినది?" అని యడిగితిని.

ఫాంఢీ— (చిరునవ్వుతో) నీపత్ని పోయినసంగమాత్రమే కాక యామె నీచిన్నతనములోనే పోయినదనికూడ నీరూపముచేతనే నేను గ్రహించినాను.

నేను (ఇదిజ్యోతిశ్శాస్త్రము చేతఁ గాదు సాముద్రిక శాస్త్రము చేత ననిమనస్సులో భావించుకొని) అయ్యా! నారూపములో నేమి వింతయున్నది?

ఫాంఢీ— నీవు గడ్డమును మీసములను గొఱిగించుకొన్నందున నీపత్ని పోయినదని తెలిసికొన్నాను. నీకు ముక్కునందున నీపత్ని నీవు మిక్కిలి బాల్యములో నున్నప్పుడే మృతినొందెనని గ్రహించినాను. ఇంతకంటె నీరూపములో వింత యేమి కావలెను?

మొట్టమొదట నాకీమాటలకర్థమైనది కాదుగాని తరువాత మాయజమానులతో దీర్ఘసంభాషణచేసి వారిదేశముయొక్క స్థితిగతులను జనులయొక్క యాచారవ్యవహారములను కొంత తెలిసికొన్న పిమ్మట నాకామాటల యర్థము బోధపడి వారిదేశముమీఁద నాకెంతో కోపమువచ్చినది. అసమర్థుఁడు తనకోపమును వెలిపుచ్చుటవలన పరులకు హానిచేయుటకు మారుగా తానే హానిని పొందునని యెఱిఁగి నాకోపమును నామనసులోనే యడఁచుకోవలసిన వాఁడనయితిని. నాకప్పుడా దేశమువిడిచి పాఱిపోవలెనన్న బుద్ధిపుట్టినదిగాని పరులకు దాసుఁడనై యున్నందున నాకదియు సాధ్యముగా కనఁబడలేదు. దైవమేకాలమున కెవ్వరినేమి చేయఁదలఁచునో యెఱుఁగుట యెవ్వరికి శక్యమగును?

నేనుజేసిన దీర్ఘసంభాషణవలన నాయజమానుఁ డాకస్మికముగా యజమానురాలయ్యెను; నేను జూచిన రాజభటులు మొదలైన పురుషు లందఱును స్త్రీలై పోయినారు. ఇంతవఱకు నేనూహించినట్లే యైనది కాని యీ దేశములో పురుషులు లేకపోవుటయు గాలికిబిడ్డలు పుట్టుటయుమాత్ర మబద్ధములై పోయినవి. ఆ దేశములోను పురుషు లున్నారుగాని, వారున్నను లేనట్టే భావింపవలసియున్నది. అక్కడ యాజమాన్యమంతయు స్త్రీలది. రాజ్యపరిపాలనము చేయువారు

స్త్రీలు; రాజకీయోద్యోగులు స్త్రీలు; మంత్రులు స్త్రీలు; విద్వాంసులు స్త్రీలు; సైనికులు స్త్రీలు. వేయేల? ఆదేశమంతయు స్త్రీమయము. స్త్రీలే సర్వస్వతంత్రులు; పురుషులు వారిదాసులు. ఆహా! లోకములో నింతకంటె దుర్దశ మఱియొకటియుండునా? ఈసంగతివిన్న పురుషాభిమాని యగువానిదేహము భగ్గున మండదా? పురుషులయందభిమానముగలిగి, పురుషుల యాధిక్యమును నిలుపుటలోఁ బ్రతిష్ఠనపేక్షించి, పౌరుష భూషణులైన యీభరతఖండవాసులారా! మన దేశమునందు పురుషజన్మ మెత్తినవారందఱును ఆయుధహస్తులయి బయలుదేఱి, నేను చెప్పిన గుహామార్గమున ఈదేశమునకు వచ్చి, అన్యాయముగా పురుషులపయి నధికారము చెల్లించుచున్న స్త్రీలనందఱిని ఘోరయుద్ధములో జయించి, ఈపాడుదేశములోఁగూడ పురుషుల స్వాతంత్ర్యమును నిలుపుఁడు. మర్మజ్ఞుఁడనైన నేను మీకు సహాయుఁడనై యుండఁగా మీకపజయ మెప్పుడును గలుగదు. మీరు భయపడఁ బోకుఁడు.

ఇక్కడ స్త్రీలది యాజమాన్య మన్నమాటయే కాని వారిలో నైకమత్యములేదు. వారిలోఁ గొందఱు పురుషులకు విద్యచెప్పించి వారికిఁ గొంతవఱకు స్వాతంత్ర్యము లియ్యవలెననువారు; బహుసంఖ్యాకులైన రెండవతెగవారు పురుషుల కెప్పుడును విద్యచెప్పింపఁగూడదనియు విద్యచెప్పించుటవలన స్వేచ్ఛావిహారులై చెడిపోవుదురనియు భావించి పూర్వాచారమును నిలుపుటకు పాటుపడువారు. ఇది స్వతంత్ర రాష్ట్రము సహితముకాదు. దొరతనమువారికిని ప్రజలకును ఐకమత్యము లేదు. పరిపాలనము చేయువారు స్వదేశస్థులకంటె నెక్కువ నాగరికముగలవారై యీ దేశమునకు దక్షిణముననున్న పర్వతములను దాటి వచ్చి దేశమును జయించిరి. వీరు తమ పురుషులకు విద్యచెప్పించి కొన్ని స్వాతంత్ర్యములనిచ్చి వారినిగౌరవముతోఁజూతురు. వారా

దేశములోని పురుషులనిమిత్తమె పాఠశాలలనుబెట్టి పురుషవిద్య వ్యాపింపఁజేయవలెనని ప్రయత్నించుచున్నారుగాని గౌరవముగల కుటుంబములలోని మగపిల్లలెవ్వరును బడికెక్కనందున వారిమనోరథమంతగా కొనసాగకున్నది. ప్రభుత్వమువారిప్పుడు పురుషుల నుపాధ్యాయులనుగా దిద్దుటకయి రాజధానిలో నొకపాఠశాలను క్రొత్తగాఁ బెట్టియున్నారు. దేశాచారవిరుద్ధములయిన యిటువంటి కార్యములు చేయుచుండుట వలన దొరతనమువారియందు జనసామాన్యమున కనురాగము తక్కువగానున్నది. ఓహిందూమహాజనులారా! ఇవియన్నియు మీావిజయమున కనుకూలసూచనలేకదా! నాయజమానురాలయిన ఫాంఢీభంగీగారు పురుషులకు విద్యచెప్పించి దేశమునకుఁ గ్రొత్తమార్పులను తెప్పింపఁగోరు తెగలోనివారు. తమ దేశములో పురుషులు చదువుటకును వ్రాయుటకును నేరనివారై యుండుటచేత తమభాషలోని పదములను నేను మనభాషలో వ్రాసికొనుచుండుటచూచి యితరదేశములయందు పురుషులు వ్రాయనేర్చియుందురాయని నాయజమానురాలికప్పుడత్యాశ్చర్యము కలిగినది. అప్పుడామె నామొగమువంకఁజూచి నీవు మీాదేశములో భోగపురుషుఁడవాయని యడిగెను. కాను కులపురుషుఁడనని నేనుబదులు చెప్పితిని. ఆమె దొరతనమువారు నూతనముగాఁబెట్టించిన పాఠశాల కెదిగినపురుషుల నెవ్వరినైన సంపాదించవలెనని బహుదినములనుండి కృషిచేయుచు విఫలప్రయత్నయయియుండి విద్యాభ్యాసము చేయుటకాసక్తి గలవాఁడనై యున్న నన్నుఁజూచి సంతోషించి నన్నాపాఠశాలకుఁ బంపవలెనని యుద్దేశించుకొనెను. కొంతవఱకు భాషాభివృద్ధి చేసినవారినిగాని యాపాఠశాలలోఁ జేర్చుకొనరుకనుక నాకింటికడ నిత్యమును రెండుగంటలసేపు విద్యచెప్పుటకై ఛాంగీఫిండీయను పేరుగల యొకవిద్వాంసురాలిని నెల జీతమునకుఁ బెట్టెను. ఫిండీయను పదము మనదేశములోని శాస్త్రిపదముతో సమా

సక్షైమవది. కులపురుషునకు విద్యచెప్పుట వలన కులమువారుతన్ను బహిష్కారము చేయుదురేమో యని యామెకుమనస్సులో భయముకలిగినను, బీదదగుటచేత జీతమున కాశపడియు నాయజమానురాలు గొప్పరాజకీయోద్యోగిని యగుటచేతి నామె యనుగ్రహమునుగోరియు నాకుఁ బత్నీవ్రత ధర్మముల నుపదేశించి తనదేశముయొక్క యాధిక్యమును నాకుబోధపరుప నెంచియు ఆపండితురాలు నాకు విద్యచెప్పుట కొప్పుకొనెను. పత్నీవ్రత శబ్దము వినఁగానే మీామనస్సుల కద్భుతముగా నుండవచ్చును. ఆభాషలో భార్యకు 'పంధీ' యనిపేరు. పంధీశబ్దమునకు యజమానురాలని యర్థము. భర్తను 'భూదా' యందురు. భూదాయనఁగా దాసుఁడనియర్థము. ఈరెండుపేరులఁబట్టియే యక్కడ భార్యాభర్తలకుండు సంబంధమును మీారూహించి తెలిసికోవచ్చును. మనదేశములోస్త్రీలకు పతివ్రతాధర్మము లుపదేశించునట్టే, ఆదేశములో పురుషులకు పత్నీవ్రతధర్మములు నేర్పుదురు మాయుపాధ్యాయిని 'పంధీవేడీభూఢీ' యను గ్రంథములోని నూఱు పద్యములు నాకు నేర్పినది. ఆపుస్తకమును 'పత్నీవ్రత ధర్మబోధిని' యని తెనిఁగింపవచ్చును. వారిభాషలో ఒత్తక్షరము లధికముగా నున్నవి. రెండేసియక్షరముల పదములు విస్తారము; పదములు తఱుచుగా ఆకారాంతములుగాను ఈకారాంతములుగాను ఉండును; ఏకారము ప్రశ్నార్థకము. భాషసంగతి యటుండనిండు, ఫిండీగారు నాకుపదేశించిన పద్యములను మొదట నేనుప్రీతితోవల్లించితినిగాని నాకామెవానియర్థము చెప్పఁగానే నాకెక్కడలేని కోపమునువచ్చి, ఆమెనన్ను విడిచి యింటికిపోఁగానే దొడ్డిలోనికిపోయి యెవ్వరును జూడకుండ నిప్పంటించి యాపుస్తకమును తగులఁబెట్టితిని. కాని యిప్పటికిని నాకోపము తీరినది కాదు. ఆపద్యముల యర్థము విన్నపక్షమున నాకంటెను మీాకెక్కువ కోపమురావచ్చును. ఆకోపములవలన నైనను మీారీదేశమునకు వచ్చి

యిక్కడిపురుషులను దాస్యమునుండి యుద్ధరింతురేమోయను నమ్మకముతో వానిలోఁగొన్నిటి నిప్పుడు తెలిఁగించుచున్నాను. ఇవిరత్నములని చెప్పఁబడుట కర్హములయినవి కాక పోయినను మనదేశసంప్రదాయమునుబట్టి వీనికి నవరత్నములని పేరుపెట్టుచున్నాను.

శ్రీ సత్యరాజాచార్య కృతాంధ్రీకృత నవరత్నమంజరి.

క. పురుషునకిమ్మహిఁబత్నియె
పరమంబగు దైవతంబు పత్నీసేవన్
నిరతముచేసెడి పురుషుఁడె
పరమున నిహమున సుఖంబుఁ బడయుంజుమ్మా. ౧

గీ. ప్రతిదినంబును బురుషుండు పత్నికంటె
ముందుగాలేచి నదిలోనమునిఁగి జలము
కలశమునఁదెచ్చి నిజపత్ని కాళ్ళుకడిగి
తాను శ్రీపాదతీర్థంబు త్రాగవలయు.

క. స్త్రీపాదతీర్థసేవన
మేపురుషుడుచేయు నెన్నియేఁడులు ధరలో
నాపురుషుఁ డన్నియుగములు
పాపములంబాసి మోక్షపదవి సుఖించున్. 3

గీ. కుష్ఠరోగిణియైనను గ్రుడ్డిదైన
భూరివికలాంగియైనను ముసలిదైనఁ
బత్నియెంగిలి భుజియింపవలయుసతము
పుణ్యలోకంబుఁగాంక్షించు పురుషవరుఁడు. ४

క. ఏపురుషుఁ డతివయెంగిలి
పావపుమతి నేవగించి భక్షింపండో

యాపాపాత్ముఁడు నారక
కూపంబునఁ గూలుఁ జూవె కోటియుగంబుల్. ౫

క. దూరమునఁ జూచి పత్నిని
గారవమున లేచి యొంటికాలునఁ బురుషుం
డోరఁగ వంగఁగ వలయును
గూరిమిఁ గూర్చుండ విల్వఁ గూడదుసుమ్మీ. ౬

క. పురుషుఁడును గార్ధభమున్
స్థిరముగ దండనము లేక చెడిపోదురిలన్
గరుణఁ దలంపక నెలకొక
పరియైనన్ గొట్టవలయుఁ బత్ని పురుషునిన్. ౭

గీ. పత్ని గొట్టినఁ దిట్టిన బాధ యిడిన
భోగపురుషులఁ బొందినఁ బొందకీర్ష్య
దరుణి సేయు పురుషునకును దైవమనుచు
భక్తి ననయంబు సేవింపవలయుఁ జుమ్ము. ౮

గీ. అతివలకు స్వేచ్ఛ భూషణమైనయట్లు
పురుషులకు లజ్జయే మహాభూషణంబు
సూర్యచంద్రులు మొగమైనఁ జూడకుండు
పరమపత్నీవ్రతుఁడె పొందుఁ బరమగతులు. ౯

ఫిండీగారు నాకు బహువిషయములనుగూర్చి నీతులను బోధించుచువచ్చినను చదివి చెడిపోదునేమోయను భీతిచేత నాకు ముఖ్యముగా ప్రతిదినమును తప్పకయెంతో శ్రద్ధతో పత్నీవ్రత ధర్మముల నుపదేశించుచుండెను. ఒకనాఁ డావిద్వాంసురాలు నేను తెనిఁగించిన నవరత్నములలో నేడవరత్నమయిన "పురుషుండును గార్ధభమున్ స్థిరముగదండనము లేక చెడిపోదురిలన్" అనుదాని మూలశ్లోకమును నాకుత్సాహముతో బోధించి, ఆదండనము పురుషుల మేలుకొఱకే యని

హేతుకల్పనములతో వ్యాఖ్యానముచేసి పురుషదండనము వలసిలాభములను తెలుపుచుండఁగా, నామనోగతి నామె కెఱుకపఱుప కుండ వలెనని నేనెంతప్రయత్నము చేసినను నామనస్సులో హాలాహలము వలెపుట్టి పయికి పొంగుచున్న కోపాగ్ని యాగక నాకన్నులవెంట వెడలఁజొచ్చినందున అసూయతో మొగ మింకొకవంకకు త్రిప్పుకొంటిని. ఆనీతి నాకు రుచింపకున్నదని బుద్ధిమంతురాలయిన యామె గ్రహించి, పురుషులను స్త్రీలుకొట్టక యాదరింపవలెనని బోధించెడు యాదేశపు నవనాగరికుల మతము నాకు సమ్మతమనుకొని, అప్పుడే విద్యాభ్యాసమువలన మతిమాఱి నేను చెడిపోవుచున్నానని నానిమిత్తమయికొంత వ్యసనపడి, ఈవిషయమున మీదేశములో నేమియాచారమని నన్నామె యడిగెను. "బ్రాహ్మణస్యక్షణంకోప" మన్న నీతినిబట్టి శాంతిజలము చేత నేను కోపాగ్నిని నిమిషములో చల్లార్చుకొని నవ్వుమొగముతో "మాదేశమునందు పురుషులే స్త్రీలను కొట్టుదురు." అని సత్యమును జెప్పితిని. నేను నవ్వులకు సహిత మసత్యము పలుకనని యామె తెలిసికొలేక, నావి పరిహాసోక్తు లనిభావించి నామాటలను నామె నమ్మనదికాదు. ఈరంఢీదేశములో సదాచారసంపన్నలయిన స్త్రీరత్నములు నిత్యమును తమ పురుషులను వేణుదండముతో దండించుచుండురన్నచో ప్రత్యక్షానుభవము లేక పోవుటచే మాఫింఢీగారి వలెనే మీరును నమ్మకపోవచ్చును. కాని నేనక్కడ కన్నులార ప్రత్యక్షముగాఁజూచిన సత్యములను వేదవాక్యములవలె చెప్పుచుండుటచేత పురాణగాథలను నమ్మ నలవాటుపడిన మీరుమాత్ర మట్టి యవిశ్వాస పాపమును గట్టుకొనరని నేను దృఢముగా నమ్ముచున్నాను.

ఆమె నామాటలను నమ్మక యట్టివైపరీత్య మీశ్వరసృష్టిలో సంభవింప నేరదని వాదించుటచేత నాసత్యసంధతనుగూర్చి సంశయపడినందున కెంతయుఁ జింతనొంది, నామాటలనిజ మామెకు తేట

పఱువవలెనని యిచ్చటస్త్రీలు పురుషులను కొట్టుట యెంతసత్యమో మాదేశమునందు పురుషులు స్త్రీలనుకొట్టుట యంతసత్యమేయనియు కావలసినయెడల మీకు నమ్మకముపుట్టునట్లుగా మాశాస్త్రములనుండి కావలసినన్ని ప్రమాణ వచనములను జూపెదననియు, జెప్పి స్మృతు లలోనెల్లను సర్వోత్కృష్టమయిన మనుస్మృతి యెనిమిదవ యధ్యాయ మునుండి యీక్రింది శ్లోకములను జదివితిని.

శ్లో. భార్యా పుత్రశ్చ దాసశ్చ శిష్యో భ్రాతాచ సోదరః
ప్రాప్తాపరాధా స్తాడ్యాః స్యు రజ్జ్వా వేణుదండేనవా.

శ్లో. పృష్ఠతస్తుశరీరస్య నోత్తమాంగే కథంచన
అతోన్యథాతు ప్రహరన్ ప్రాప్తఃస్యా చ్చౌరకిల్బిషమ్.

అప్పుడామె వీనియర్థమేమని నన్నడిగినది. భార్యను, పుత్రుని, సేవ కుని, శిష్యుని, భ్రాతను, సోదరుని, తప్పుచేసినప్పుడు త్రాటితోనై నను వెదురుకఱ్ఱతోనైనను కొట్టవలయునని మొదటిశ్లోకమున కర్థ మనియు, శరీరముయొక్క వెనుకటిభాగ మందేకాని నెత్తిమీఁద కొట్ట రాదు మఱియొకచోట కొట్టినవాఁడు చోరపాపమును పొందునని రెం డవశ్లోకమున కర్థమనియు, చెప్పి యీపయిని "ప్రాప్తాపరాధా" యని మూలములోనున్నను కొట్టుటప్రధానముగాని నేరముచేయుట ప్రధా నము కాకపోవుటచేత మాదేశములో పురుషులు నేరములేకయే భా ర్యలను కొట్టుచుండుట శిష్టాచారమైనదనియు, నెత్తిమీఁద కొట్టఁ గూడదనికూడ మూలములోఁ గానఁబడుచున్నను నెత్తికూడ శరీరము లోని భాగమేయైనందున నెత్తిమీఁదకూడ శాస్త్రార్థము ముందుభాగ మందు బెత్తెడు మేరవదలివేసి వెనుకతట్టున కొట్టవచ్చునని వాక్యసమ న్వయముచేసి సిద్ధాంత మేర్పఱిచి కర్మభూమియైన మాదేశమందలి పెద్దలు భార్యలను శిరస్సుమీఁదనే కొట్టుట సదాచారమయిన దనియు, నేను మనుస్మృతికి వ్యాఖ్యానముచేసి యర్థవివరము చేసితిని. అందు

మీఁద ఫింఢీగారు నాచేత నీశ్లోకములను శ్లోకార్థములను రెండు సారులు విని, కన్నులుమూసికొని కొంతసేపాలోచించి నీమోసమిప్పటికి తెలిసినదని చిటికెవేసి, మొదటిశ్లోకములో "భార్య" యను చోట "భర్త" యనియుండవలె ననియు, "పుత్రుఁడు దాసుఁడు శిష్యుఁడు భ్రాత సోదరుఁడు" అని శ్లోకములో చెప్పఁబడినవా రందఱును పురుషులయి యుండఁగా మొదట "భార్య" యని యొక్క స్త్రీయుండుట సంభవింపదనియు, అందుచేత నిదికూడ "భర్త" యని యుండఁగా నేను పరిహాసార్థముగా "భార్య" యని మార్చి చదివితిననియు, సిద్ధాంతముచేసి యంతటితో నైన నూరకుండక పురుషులకు చదువువచ్చిన యెడల నట్టియనర్థములు సంభవించునని యెఱిఁగియే బుద్ధిమంతులయిన తమపూర్వులు పురుషవిద్యకూడదని సిద్ధాంతముచేసిరని తనయభిప్రాయమును బయలపెట్టినది. అక్కడ నాపక్షమవలంబించి మాటాడువా రెవ్వరును లేకపోయినందున నావాదబలమును నేనెఱిఁగియు వివాదముకూడదని యూరకుండవలసినవాఁడ నయితిని.

అయినను నేనంతటితో నూరకుండక మనదేశములో పురుషులే స్వతంత్రులనియు, స్త్రీలు పురుషులకు లోఁబడియుండురనియు, మనుస్మృతిలోనుండి నే నుదాహరించిన ప్రమాణములు సత్యమయినవనియు, ఆమె కేలాగునైనను మనమునపట్టింపవలెనని నిశ్చయించుకొని పతివ్రతాధర్మములనుగూర్చి మనపురాణాదులలోఁగల విషయము లనేకము లామెకుఁజెప్పితిని. చెప్పినవాని నెల్ల నామె యాదరముతో విన మొదలుపెట్టినందున నాకుఁ గొంతప్రోత్సాహముగలిగి పతివ్రతాధర్మముల నామె మనస్సునకుఁ జక్కఁగా పట్టించనెంచి భర్తయెంగిలి భుజించుట పత్నికి పరమధర్మమని చూపుటకయి నాలాయనికథ నారంభించి యిట్లుచెప్పఁజొచ్చితిని.

“ పూర్వకాలమునందు నాలాయనియైన యింద్రసేన మౌద్గల్యునకు భార్యయయ్యెను. అతఁడు కుష్ఠరోగపీడితుఁడు. ఆమహా పతివ్రత యాతనియుచ్ఛిష్టమును ప్రతిదినమును అమృతతుల్యముగా భక్షించుచుండును. భోజనముచేయుచున్న కాలమునం దొకనాఁ డతని యంగుష్ఠము తునిగి యన్నములోఁబడెను. అట్లుపడినను పతివ్రతా శిరోమణియైన యామె రోఁతపడక యాబొట్టనవ్రేలిని దీసి భక్తితో దూరముగానుంచి యెంగిలియన్నమును పరమాన్నమువలె తినెను. అదిచూచి——”

ఇంతవఱకుఁ జెప్పునప్పటి కామె చెవులుమూసికొని నామాట కడ్డమువచ్చి, పురుషుఁడనైన నేనిన్నికథ లొక్కనిమిషములో కల్పించుట సంభవింపదని యెంచి మనకు శాస్త్రము లున్నవనియు వానిలో భర్తృశుశ్రూషాదులు చెప్పఁబడియున్నవనియు కొంతవఱకు నమ్మినను నన్నొకథను సొంతముగాఁ జెప్పనీక, దురాగ్రహాగ్రస్తురాలయి మన శాస్త్రములు రాక్షసులుచేసిన పాడుకథలని దూషించెను. అప్పుడు నేనును కోపమునుపట్టఁజాలక గురుధిక్కారపాపము వచ్చిననుసరేయని యెదురుకొని మాటకు మాఱుమాటయాడి కొంతసేపు వాక్కలహమునకు డీకొంటిని. నన్ను దూషించినను నేనూరకుందునుగాని శాస్త్రములను దూషించినతరువాత శాస్త్రబద్ధుఁడనైన నేనెట్లూరకుండఁ గలుగుదును? మా వాక్కలహమువలన నాటిసంభాషణ యంతటితో ముగిసినది. అందుమూలమున నేను జెప్పఁదలఁచుకొన్న స్త్రీధర్మముల నామెకుఁ జెప్పలేకపోతినిగదాయని నాకు విచారము గలిగినదిగాని యెంచినదానికి వగచిన ప్రయోజనముండదు. నాకు పాఠముచెప్పక కోపముతో నాఁటిదినమామె తనయింటికి పోయినది. అంతటితో నాచదువునకు విఘ్నమువచ్చునట్లు కానఁబడెనుగాని యామె దీర్ఘక్రోధురాలు కానందునను, నేనుపోయి యామెకు క్షమార్పణముచేసి

ప్రార్థించినందునను నాలుగుదినము లయినతరువాత యథాప్రకార ముగా వచ్చి నాకామె మరల విద్యచెప్పనారంభించినది. ఆదినము మొదలుకొని యింక నేనామెతో మన దేశమునుగూర్చి మాటాడకూడ దని యొట్టుపెట్టుకొంటిని. అటుతరువాత జరగిన వృత్తాంతమును మీకు ముందు ప్రకరణములయందుఁ జెప్పెదను.

ఐదవ ప్రకరణము

వెనుకఁజెప్పినట్లు మాకలహాముతీఱి మేమిద్దఱమును సమాధాన పడిన తరువాత మా ఫిండీగారికి నామీఁద అపరిమితానుగ్రహము వచ్చినది. ఆయనుగ్రహము వచ్చుటకు కారణము నేనామెకు పరమ భక్తుఁడనయి మనదేశములో శిష్యులు గురువులకు శుశ్రూష చేయు నట్లుగా సమస్తోపచారములను చేయుచు అనువర్తనముసలిగి మెలఁగు టయేకాని మఱియొకటికాదు. స్త్రీలయినను పురుషులయినను విద్య చెప్పినవారు దైవసమానులుగనుక నేను స్త్రీకి దాస్యము చేయుచుంటి నని మీరు నన్ను నిందింపక నాగురుభక్తికి మెచ్చుకొనవలెను. అదిపో నిండు. అటుతరువాత శిష్యవత్సలురాలైన యామె తమ దేశజనుల యాచారవ్యవహారములు మొదలయిన వన్నియు నాకు మర్మమువిడిచి చెప్పమొదలుపెట్టెను. ఆమె యొకనాఁడు భోజనముచేసి కూరుచుండి యుత్సాహముతో తాంబూలచర్వణముచేయుచు కూరుచున్నప్పుడు నేనుపోయి గురువందనముచేసి చేతులుజోడించుకొని యెదుట నిలుచుండి భక్తిపూర్వకముగా నిట్లడిగితిని.

అమ్మా! మీరు సర్వమును తెలిసినవారు. స్వభావముచేత పురుషులే యెక్కువ బలముగలవారో స్త్రీలే యెక్కువబలముగలవారో మీ శిష్యునకు సెలవియ్యవలెను.

పురుషులే యధికబలముగలవారని యామె సెలవిచ్చినది. అప్పుడు మాయిద్దఱికిని సంభాషణ మిట్లుజరిగినది.

అమ్మా! స్త్రీపురుషులలో పురుషులే అధికబలవంతులని మీరు సెలవిచ్చుచున్నారుగదా? అట్లయినపక్షమున, ఈదేశములో బలాధికులయిన పురుషులు బలహీనురాండ్రయిన స్త్రీలకులోఁబడుట యెట్లు సంభవించినది? నా యీసంశయము తీర్పవలెను.

ఓయివెఱ్ఱివాఁడా! నీవేమియుతెలియని మూఢుఁడవుగదా? పురుషులు స్త్రీలకు లోఁబడవలెననుట యీశ్వరోద్దేశము—(ఈశ్వరుఁడని పుంలింగప్రయోగము చేసినందుకు చదువరులు నన్ను మన్నింపవలెను. ఆదేశమునందు దేవుఁడాఁడువాఁడనియే ప్రసిద్ధము. ఆమె యీశ్వరియని యర్థమిచ్చునట్లుగా స్త్రీలింగమునే ప్రయోగించినను మీకు తెలియుటకై నేనే యీశ్వరుఁడనుచున్నాను.)—బలవంతులు గనుక పురుషులు పాటుపడి పనిచేయుటకును, పత్నీసేవచేయుటకును, తగినవారు. అంతేకాని వారుస్త్రీలవలె ఆలోచనతో చేరిన పనులు చేయుటకుఁగాని గ్రంథరచన చేయుటకుఁగాని స్వభావముచేతనే తగరు. పురుషులు బలాధికులే కానిపక్షమున—

మాదేశములో పురుషులు ఆలోచనతో చేరిన పనులు చేయుచు కవిత్వము చెప్పుచున్నారే—

మధ్య నామాటలకడ్డమురాక నేను చెప్పెడిది పూంతముగావిని నీసంశయము పోఁగొట్టుకో. మీది కేవల రాక్షససృష్టి. అందుచేతనే (నీమాటలునమ్మెడు పక్షమున) మీదేశములో సర్వమును దేవతాసృష్టియైన మాదేశమునకు విపరీతముగా నున్నది. ఆసంగతి పోనిమ్ము. పురుషులు బలాధికులే కానిపక్షమున వారుపత్నులకు వంటచేయుటకును ఉపచారములు చేయుటకును, బరువులు మోయుటకును, ఎట్లు సమర్థులగుదురు?

మా దేశములోఁగూడ నలుఁడు భీముఁడు మొదలయినవారు పాకము చేయుటలో పూర్వకాలమునందు బహు సమర్థులు.

అట్లయిన పక్షమున మా దేశమువలెనే మీ దేశము పూర్వకాలమునందు మంచిదయియుండి యిప్పుడు చెడిపోయియుండును. స్త్రీలు బలహీనులగుటచే దేవుఁడు వారు—

అందుకు సందేహము లేదు. పూర్వకాలమందువలెఁగాక మా దేశ మిప్పుడుతప్పక చెడిపోయినది.

స్త్రీలు బలహీనులగుటచే దేవుఁడు వారు పనిపాటులు చేయ నక్కఱలేక సుఖముగాకూర్చుండి యాలోచనచేయుచు ప్రభుత్వము చేయవలయునని యుద్దేశించెననుటకు నీకు నిదర్శనముగాఁ గనఁబడుచుండలేదా? ఇంతమాత్రము తెలిసికోలేని పక్షమున నీవు చదివిన చదువులో నేమి ప్రయోజనము? ఇందుచేతనే పురుషు లొకవేళ చదివినను బుద్ధిసంపదలో స్త్రీలతో సమానులు కాఁజాలరని మా పెద్దలు సెలవిచ్చియున్నారు. ఇటువంటి మందబుద్ధివగుటచేతనే బలవంతులయిన పురుషులు బలహీనలయిన స్త్రీల కేల యడఁగియున్నారని నీకు సందేహము కలిగినది.

అవును. ఆ సందేహమును మీరు ముందుగాతీర్చి నన్ను ధన్యుని చేయవలెను.

స్త్రీలు బుద్ధిబలముగలవారు. దేహబల మెంతయున్నను బుద్ధిబలమునకుచాలదు. అందుచేతనే పురుషులు స్త్రీలకులోఁబడుట సంభవించినది. కేవల శరీరబలము గలవారయిన పురుషులు బుద్ధిబలము గలవారయిన స్త్రీలకు లోఁబడుట స్వభావముకాదా? ఈమాత్రపు స్వల్పాంశము నీకు తెలిసినదికాదు. ఇదే స్త్రీబుద్ధికిని పురుషబుద్ధికిని గల తారతమ్యము. పురుషులు స్త్రీలకు లోఁబడియుండుట కింకొక రహస్యముకూడనున్నది.

ఆరహస్యముకూడ నాకు సెలవిచ్చి మూఢుఁడనయిన నన్ను కృతార్థుని చేయవలెను. మీశిష్యుఁడ నయినతరువాత నాకు తెలి యనివిషయ ముండఁగూడదు.

అది పరమరహస్యమే యయినను భక్తిశ్రద్ధలు కలవాఁడవగుట చేత నీకుమర్మమువిడిచి చెప్పెదను. స్త్రీలు పురుషులమీఁద నధికా రము చెల్లించఁ గలుగుటకు ప్రధానకారణము మంత్రబలము. ఎంత బలవంతునినైనను లోఁబఱచుకొని దాసునిజేసికుక్కవలె ఆడింపఁగల శక్తి మావద్దనున్నది.

అదిసత్యము. ఆశక్తి స్త్రీలవద్ద తప్పక యున్నది. సర్వస్వతం త్రులమని చెప్పుకొనుచున్న మాదేశమునందు సహితము పురుషులు స్త్రీలకు దాసులయి వారు చెప్పినట్లే నడుచుచున్నారు. సంస్కార కర్తలమని పేరుపెట్టుకొని సభలలో పులులవలె నఱచెడు మాదేశము నందలి నవనాగరిక పురుషులు కూడ పౌరుషహీనులయి యింటివద్ద భార్యలముందు నోరెత్తలేక పిల్లులవలె నొదిగియుండి తాముచెప్పినట్లు భార్యలను నడపింపలేక భార్యలు చెప్పినట్లే తాము నడుచుకొను చున్నారు.

ఆలాగుననా ? ఈమాట యింతకుముం దెప్పుడును చెప్పినావు కావేమి ? మీదేశమునందు పురుషులు స్వతంత్రులన్న నేనేమోయను కొన్నాను. ఇప్పుడు నిజము తెలిసిపోయినది. మొదటినుండియు నీమా టలయందు నాకెప్పుడును నమ్మకములేదు. మాదేశమునందువలెనే మీదేశమునందున పురుషులే స్త్రీలకు లోఁబడియున్నారు. మేమే స్వతంత్రులమని పయి కెవరెన్నివేషములు వేసినను, ఈశ్వరసంకల్పమున కెన్నఁడయిన వికల్పము కలుగునా ? ఈనవనాగరికుల మూలమున మాదేశ మిప్పుడు కొంతకొంత చెడిపోవుచున్నది. ఇప్పటి పురుషులకు

పూర్వపు పతిభక్తి తగ్గుచున్నది. స్త్రీలిప్పుడు పురుషుల మాటలే విన మొదలుపెట్టినారు.

ఈకపట చెప్పిన వాక్యములచేత నాకు కొంతసంతోషము కలిగినది. ఇక్కడకూడ స్త్రీలిప్పుడు పురుషుల మాటలనే వినుచున్నారు గదా? వినుటయే స్వభావసిద్ధము; విననుండుటయే స్వభావవిరుద్ధము. ఈయాలోచనలన్నియు నామనస్సులో పుట్టినను, ఆమె మనస్సు నొచ్చునని నేను పలుకలేను. ఈప్రసంగ మయిన తరువాత నేనామెకు భక్తితో నమస్కరించి నాకామంత్రముల నుపదేశింపక తప్పదని పాదములమీఁదపడి లేచినాఁడనుగాను. అప్పు డుపదేశించుటకు సమయము కానందున మఱియొకప్పు డుపదేశించెదనని చెప్పి, కొన్ని దినము లయిన తరువాత నేను మూఁడుపవాసముచేసి స్నానముచేసి శుచినయి యమావాస్యనాఁడు ప్రాతఃకాలమునపోయి సందర్శనము చేసికొని పాదప్రణామము చేయఁగా నాకామె వశీకరణ మంత్రము మొదలైన మహామంత్రములను పెక్కింటిని ఉపదేశించినది. ఆమె నాతో చెప్పకపోయినను నేనీమంత్రములను మనదేశపు స్త్రీలకు చెప్పుదునను భ్రమతో నాకామె మఱింత ప్రీతి పూర్వకముగా నుపదేశించినట్లు నేను కనిపెట్టినాను. కాని నేనట్టిపని యెన్నఁడైనను చేయుదునా? ఈమంత్రముల నిందు ప్రకటించి మీకుపదేశించి యుందునుగాని, ప్రచురపఱిచిన పక్షమున స్త్రీలుకూడ గ్రహించి యీదేశమునందువలెనే మనదేశము నందుఁగూడ వారు పురుషులను తమకు దాసులనుగాఁ జేసికొందురేమోయను భయముచేత నేనిందు ప్రకటింప సాహసింపకున్నాను. ఓహిందూమహాజనులారా! దీనినిబట్టి నాకు మీయందనురాగము తక్కువ పడినదని మీరెంచఁబోకుఁడు. నాదగ్గఱకువచ్చిన పక్షమున స్త్రీలకు చెప్పమని మీచేత ప్రమాణములు చేయించుకొని మంత్రసిద్ధికొఱకు మీవలన గురుదక్షిణలను స్వీకరించి మీకొక్కరికే సర్వ

మంత్రములను ప్రయోగోపసంహారములతోను అంగన్యాస కరన్యాసములతోను రహస్యముగా నుపదేశించెదను.

అటుతరువాత మంచి పాండిత్యము సంపాదించి మాయజమానురాలిగారి కోరికప్రకారముగా నేను పాఠశాలయందు ప్రవేశించినాను. మఱియొక పురుషుఁడు కూడ పాఠశాలయందుచేరి నాకు సహపాఠియయి మిత్రుఁడయినాఁడు. మేమిద్దఱమును రహస్యముగా నాలోచించుకొని యాదేశమునందలి పురుషుల కేలాగునైనను స్వాతంత్ర్యము కలుగఁజేయుటకు సర్వవిధముల ప్రయత్నము చేయవలెనని యెవ్వరికిని దెలియకుండ మాలోమేము ప్రమాణములు చేసికొన్నాము. స్త్రీలను లోఁబఱుచుకొనెడు సులభోపాయము నాకు తెలియును గనుక, మన కొక్కోకమునందుఁ జెప్పఁబడిన "ఓం—కృష్ణాంగి—కృష్ణముఖి—పుష్పంబాస్యామి—వశ్యమానయాది — నభవతి—బ్రహ్మరుద్రాభవతి—స్వాహా" అను వశీకరణ మంత్రము నేనాతనికి గురుదక్షిణలేకుండ నుపదేశించి, దీనిని పదిలక్షలు జపించి పురశ్చరణచేసి తెల్లని పువ్వులు మంత్రించి స్త్రీలమీఁదఁ జల్లవలెనని చెప్పినాను. గురుదక్షిణ లేకపోవుటచేత కాఁబోలును! ఈమంత్ర మంతగా పనిచేసినదికాదు. ఎట్లయినను మనమంత్రము లాదేశపు మంత్రములకు చాలవు. అందుచేతనే మనవారు మళయాళమంత్రములని గొప్పగా చెప్పుదురు. నేను పాఠశాలలో ప్రవేశించినది మొదలుకొని జరిగిన విశేషములను తెలుపుటకు ముందుగా దేశస్థుల యాచార వ్యవహారములను గూర్చి కొంత చెప్పుట యుక్తమని తలఁచు చున్నాను.

ఆదేశమునందు స్త్రీలే సర్వస్వతంత్రురాండ్రనియు, పురుషులు వారి కాజ్ఞానువర్తులయి మెలఁగవలసిన వారనియు, నేనీవఱకే చెప్పియున్నాను. మన దేశమునందాఁడువారికి వలెనే యాదేశమునందు మగవారికి విద్య చెప్పింపరు. మనదేశమునందలి భోగస్త్రీలవలె నాదే

శమునందు భోగపురుషులుమాత్ర మల్లవిద్య నభ్యసింతురుగాని యిది వారివృత్తి కనుకూలమయినదిగా నుండును. మగవారిని చపుకగాంచి చెప్పినచో గొప్ప తప్పిదముగా నెంచి వారు కోపపడి ఘోరపాపమును జేయుఁడన్న వానిని తిట్టునట్లు తిట్టుదురు. విద్య లేకపోవుటచేతనో మఱి యే హేతువుచేతనో యాదేశమునందు మగవారికి నగలయందాసక్తి మన స్త్రీలకంటెను విశేషముగా నుండును. అక్కడి స్త్రీలకు నగలంతగా నుండవు. నగలనిమిత్తమే కాకపోయిన పక్షమున పురుషులకు మీసములను గడ్డములను భగవంతుఁ డేలకలిగించెనని యచ్చటి వారడుగుదురు. దీనినిబట్టి యక్కడి పురుషులు తలయందుమాత్రమేకాక చక్కగా దువ్వుకొని మీసములకును గడ్డములకునుగూడ నగలు తగిలించుకొందురని నేను చెప్పనక్కఱలేకయే మీరు గ్రహించియుందురు. పత్నీవియోగము సంభవించిన పురుషుల కక్కడివారు గడ్డములను మీసములను మాత్రము గొఱిగింతురు. అంతేకాని మనము పితృవ్రులవిషయమున జరుపునట్లుగా శిరోముండనమును జేయరు. పితురులకు గడ్డము గొఱిగించి తల యేలగొఱిగింపరని నేనొకనాఁడు నామిత్రుని నడుగఁగా, అతఁడు పురుషు లెప్పుడును స్త్రీలకు లోఁబడి వారిచే దండింపఁబడవలసినవారు గనుక జుట్టు వంగఁదీసి గుద్దుట కనుకూలముగా నుండుటకై తల గొఱిగింపరని యాతఁడు చెప్పెను. ఆ దేశమునం దింకొక విచిత్రమయిన యాచారము గలదు. ఇరువది సంవత్సరములు దాటిన తరువాత భార్యలను పోఁగొట్టుకొన్న భర్తల కందఱకును పండ్రెండవ నాఁడు ముక్కుయొక్క ముందటిభాగమును కత్తిరింతురు. ఈయాచారమును బట్టియే వెనుక నాయజమానురాలయిన ఫాంఢీభంగీగారు నాభార్య నాచిన్నతనములోనే పోయినదని గ్రహించినారు. ముక్కుకత్తెరలు ప్రతి గృహమునందును ఒక్కొకటి యుండును. మనదేశమునందీసదాచారమును నెలకొల్పవలెనని యొక కత్తెర సంపాదించి నాతో

తెచ్చినాను. విధూపు లగుటచేతనో యేమోకాని యీముక్కడి పురుషులయం దక్కడ వ్యభిచార మొంతమాత్రమును గానఁబడదు. అట్లు లేకపోవుట కీనాసికాచ్ఛేదనమే కారణ మగుటకు సందేహము లేదు. పురుషులకు చేయుటచేత నిది దురాచారమయినను స్త్రీల విషయమయి జరిగించినపక్షమున తప్పక సదాచారమే యగును. మన వితంతువుల కిట్లు ముక్కుకోసిన పక్షమున వారిలో వ్యభిచారము సమూలముగా నశించుననుటకు సందేహముండదు. ఇటువంటి సదాచారము మనస్మృతులలో నెక్కడ నైనను జెప్పఁబడి యుండకపోదు కాఁబట్టి యీయాచారమును మనము మనదేశమునందు తప్పక నెలకొల్పవలయును. నేను ధర్మశాస్త్రములను వెదకి దీని కాధారముగా కారిక నెందయినను కనిపెట్టెదను. ఇప్పుడున్న స్మృతులలో దీని కాధార మొకవేళ దొరకకపోయినను ఖిలస్మృతులయందయినను తప్పక యుండును గాని యుండకపోదు. ధర్మజ్ఞసమయముకూడ ప్రమాణమేగనుక మన పండితులందఱును వెంటనే సభచేసి శీఘ్రముగా నిట్టినిబంధన మొకదాని నేర్పఱుపవలయును.

ఆదేశమునందు సహితము మనదేశమునందువలెనే పత్నులు వయస్సున చిన్నవారుగాను, భర్తలు పెద్దవారుగాను ఉందురు. ఇష్టమున్నయెడల స్త్రీ యనేక భర్తలను చేసికొనవచ్చునుగాని సంస్థానాధీశ్వరులలోఁ దక్క సాధారణముగా స్త్రీలొక్కొక్క భర్తతోనే తృప్తి పొందియుందురు. భర్తలు పుట్టినిండ్లకు వెళ్ళినప్పుడును, రోగాదికముచేత నశక్తులయి యుండినప్పుడును, స్త్రీలు కామాతురలయియున్నవారు భోగపురుషులయొద్దకు పోదురు. పయికారణములు రెండును లేకపోయినను ధనవంతురాండ్రయిన స్త్రీలు భోగపురుషుల నుంచుకొందురు. ఈభోగపురుషు లుగ్గుపాలనాటినుండియు స్త్రీలను వలపించి తమవలలలోఁ బడవేయఁ దగినవిద్యల నభ్యసింతురు. హృదయరంజకమ

యిన సంగీతము వారికడనే యుండుటచేత సంగీతము పాడనేర్చిన కుల పురుషునిగాని స్త్రీనిగాని మిక్కిలి నీచముగాఁజూతురు. సంగీతము వృత్తిగాఁగల కుల స్త్రీలను పంక్తిభోజనములకు రానియ్యరు. కామోద్రేకమును గలిగించెడు శ్రావ్యములయిన పాటలను, సరసోక్తులను, వశ్యౌషధములను, వశీకరణమంత్రములను, హావభావాదులను దెలిపెడు నేత్రహస్తాద్యభినయములను, నేర్చుకొని భోగపురుషులు గడ్డములను మీసములను తలను దువ్వుకొని నానా విధములయిన యాభరణములతోను పుష్పములతోను శరీరము నలంకరించుకొని, చిత్రవర్ణములుగల వస్త్రములను ధరించి, మొగములకు తళుకుతళుకు మనెడు వర్ణమేదో వేసికొని, దానిమీఁద సువాసనగల బంగారువర్ణముగల పొడుమేదో చల్లుకొని, అత్తరు మొదలైన సుగంధద్రవ్యములను పూసికొని, తమ మేపితావులు వీధుల గుబులుకొనఁగా దీపములు పెట్టిన తరువాత రూపమునుధరించిన గృహదేవత లనునట్లుగా దీపములవెలుతురున తళుకుతళుక్కునమెఱయుచు, దారినిపోవు యువతుల హృదయములు సంచలించునట్లుగా ప్రతిదినమును తమగుమ్మములో నిలుచుండి స్త్రీలుతారసించినప్పుడెల్లను సిగ్గుపడి లోపలికిపోయి తలుపుచాటునుండి మొగమీవలికిఁబెట్టి తొంగితొంగి చూచుచుందురు. అటువంటి సౌందర్యముగల పురుషులు మనదేశమునందు లేరు. మణులుచెక్కిన బంగరు బొమ్మలవలె నిలువఁబడి భూమికి దిగిన మెఱుపుతీఁగవలె వారు దీపములవెలుతురున మెఱయుచున్నప్పుడు నావంటి పురుషులకు సహితము పోయి పయినిబడి కౌఁగిలింపవలెనని బుద్ధిపుట్టుచున్నప్పుడు యువతులు వారినిమోహించి వారివలలోఁబడుట యేమియాశ్చర్యము ? ఏఁబది యేండ్లుదాటినవారు సహితము తెల్లపడిన వెండ్రుకలకు నల్లరంగువేసికొని యలంకరించుకొని పదునాఱేండ్ల బాలకుమారులవలెఁ గానఁబడుదురు. అయినను మనదేశమునందు వివాహములు మొదలయిన శుభ

కార్యములలో వేశ్యలను పాటలకు పిలుచునట్లుగా వీరిని శుభకార్యములకు పిలువరు; మన దేవదాసులవలె వీరు దేవాలయములయందును గానరారు. గృహదేవతలవలె నుండెడు వీరికి గృహములే దేవాలయములు; వీరే యందుండెడు దేవతలు. ఈదేవతాసందర్శనము నిమిత్తమయియే ధనవంతురాండ్రయిన స్త్రీలు వారి యాలయములకుఁ బోయి తమదేహములను విత్తములను వారికి సమర్పించి వారి ప్రసాదమును వేఁడుచుందురు. దేవతాభక్తిగలవారు ధనాదులయందు వైరాగ్యముగలవారగునట్లే యీదేవతలను సదా సేవించువారును నిస్పృహత్వముచేత ధనముకొల్లపెట్టి తాము జోగులగుదురు. మనదేవతలకువలెనే యీభోగదేవతలకును పరభార్యలయందే సంతానప్రాప్తి. అయినను మనదేవతలకువలె అమృతత్వములేనివీరికి వంశాభివృద్ధి యెట్లో నాకు తెలిసినదికాదు. విశేషవిత్తమిచ్చి బీదల చక్కని బిడ్డలను గొని వీరు వారిని చిన్నప్పటినుండియు భ్రమరకీట న్యాయముచేత మర్త్యత్వమునుండి దేవతాత్వమునకు లేవఁదీయుదురఁట!

అక్కడ సహితము వివాహములకు కన్యావరులయిష్ట మక్కఱలేదు. తల్లిదండ్రులే ముఖ్యముగా తల్లులే కన్యావరణము చేయుదురు. పురుషులు యుక్తవయస్సు వచ్చినతరువాత వివాహముచేసెడు పక్షమున కురూపిణులయిన పత్నులను చేసికొనుటకంగీకరింపక తల్లిదండ్రులు చెప్పినమాటవినక తిరిస్కరింతురుగనుక పురుషులకు గురుధిక్కారదోషము కలుగకుండఁ జేయుటకయి చిన్నతనములోనే వివాహములు చేయు సదాచారమును వారిధర్మశాస్త్రములు విధించుచున్నవని చెప్పుదురు. వారిధర్మశాస్త్రములనుబట్టి స్త్రీకి పదునాలు సంవత్సరములకు లోపల గర్భాధానము చేయఁగూడదు. పదునెనిమిదవ సంవత్సరమునందు చేయుట శ్రేష్ఠము. గర్భాధానమునాఁటికి పురుషున కిరువది సంవత్సరముల వయస్సుండవలెను. పదునాలేండ్ల ప్రాయముననే స్త్రీకి

గర్భాధానము చేసినను పురుషునకప్పటి కిరువది సంవత్సరముల యీడుండవలెను గనుక, సాధారణముగా పత్నికంటె భర్త నాలుగుసంవత్సరములు పెద్దవాఁడుగానుండవలెను. రెండవపెండ్లి స్త్రీ కీనియమము లేదు. అప్పుడు భర్త యెంతచిన్నవాఁడుగానయిన నుండవచ్చును. అయినను పురుషునకు నిరువదిసంవత్సరములు వచ్చువఱకును మాత్రము పునస్సంధానము చేయఁగూడదు. అందుచేత పురుషులెదిగి కాపురమునకు వచ్చువఱకును స్త్రీలిష్టమున్నయెడల భోగపురుషుల నుంచుకోవచ్చును. పురుషునకు పదునెండవ యేఁడు మొదలుకొని పదునాఱవయేఁడువచ్చులోపల వివాహముచేయుదురు. భార్యలకన్న భర్తలు పెద్దవారుగా నుండవలసినందుకు వారనేకకారణములు చెప్పుదురు. అందొకకారణము పురుషులకంటె ముందుగా స్త్రీలకు యుక్తవయస్సువచ్చుట. స్త్రీలకు యుక్తవయస్సు వేగిరముగావచ్చుటయే పురుషులకంటె స్త్రీలుశ్రేష్ఠురాండ్రగుటకు గొప్పనిదర్శనమనివారు చెప్పుదురు. భర్తలు భార్యలకంటె పెద్దవారుగా నుండవలెననుట కింకొకకారణము పత్నులెదిగిన తరువాత కనిపెట్టుకొని యుండకుండుటకును, పురుషులు పత్నీసేవ చేయుటకు సమర్థులుగా నుండుటకు అని యీవఱకే చెప్పఁబడినది ; అక్కడ వంటచేయవలసినవారు పురుషులేయనియు నీవఱకే చెప్పఁబడినది. మన దేశమునందువలె స్త్రీలు వంటచేసెడుపక్షమున, వారు గర్భిణులయి ప్రసవించిన సమయములు మొదలయినవానియందు విఘ్నముకలిగి చిక్కులు కలుగునుగనుక, అటువంటి యాటంకములు కలుగకుండుటకయి భగవంతుఁడే పురుషులను పాకముచేయువారినిగా నిర్మించెనని వారువాదింతురు.

మనదేశమునందు స్త్రీలకు రాణివాసమున్నట్లే యాదేశమునందు పురుషులకును గలదు. మనదేశమునం దట్టియాచారము లేకపోవుటచేత దానికేమని పేరు పెట్టవలయునో నాకు తెలియకున్నది. రంఘీభాష

యందు దానికి "ఘోఢా" యని పేరు. అది మనదేశమునందలి ఘోషాపదముతో సమానమయినది. ఒకవేళ నది ఘోషాశబ్దభవమై యుండును. వర్ణవ్యత్యయవిధినిబట్టి తద్భవమునందు "షా" కు "ఢా" రావచ్చును. దానిని నేను రాణివాసమునకు ప్రతిగా రాజవాసమని పిలిచెదను. మనదేశమునందలి స్త్రీలకువలె రాణివాసము పన్నెండవ యేట నారంభముగాక యీదేశమునందు పురుషులకు రాజవాసము పదునాఱవయేట నారంభమగును. అక్కడి రాజవాసము మనరాణివాసమువలెఁ గాక మిక్కిలి విచిత్రమయినదిగా నుండును. సంస్థానాధీశ్వరులును ధనికురాండ్రును మనమిక్కడ ధనమునిమిత్తము చేయించినట్టుగా పెద్దయినుపపెట్టెలను చేయింతురు. ఒక్కొక్క పెట్టెయెత్తు ఏడడుగుల ఆఱంగుళములు; నిడివి యేడడుగుల మూఁడంగుళములు; వెడల్పు నాలుగడుగుల రెండంగుళములు. చుట్టునుఅమర్చిన యినుపరేకుదళసరి ముప్పాతిక అంగుళము. దానితలుపు రెండడుగుల వెడల్పును నాలుగడుగులయెత్తునుకలదిగానుండును. దానితాళము మాఱుచెవికిరాక బ్రహ్మభేద్యమయినదిగానుండును. ఈపెట్టెకు గాలివచ్చుటకును వెలుతురువచ్చుటకును రెండువైపులను గోడలకు అడుగు చతురముగల రెండుగవాక్షములుండి వానికడ్డముగా ఇనుపకమ్ములు వేయఁబడియుండును. ఈరాజవాసమునందు పదునాఱు సంవత్సరములు వచ్చినది మొదలుకొని భాగ్యవంతులపురుషులు పగలెల్లను నిర్బంధింపఁ బడుదురు. ప్రాతఃకాలమున స్త్రీలభోజనము లగునప్పటికి తొమ్మిదిగంటలగును. తరువాత పదిగంటలకు లోపలభర్తలభోజనములగును. భర్తలభోజనములుకాఁగానే పత్నులు తమపురుషులను పయినివర్ణింపఁబడిన రాజగృహములయందుఁ బెట్టితాళమువేసి తాళముచెవి తమయొద్దనుంచుకొని రాజకీయ కార్యస్థానములు మొదలయినవానికిఁ బోవుదురు. వారు మరల సాయంకాల మయిదుగంటల కింటికివచ్చి తాళముతీయఁగా

పురుషు లీవలకువచ్చి వంట మొదలయినపనులు చేయుదురు. దీనిని బట్టి యిటువంటిదేశములలో పురుషులు పగలెల్లను సోమరులయి హాయిగా మహారాజులవలె నిద్రపోదురని మీరనుకొందురేమో మీయూహ సరియైనదికాదు. పరుండుట కాగదిలో రెండగుగుల వెడల్పును అయిదడుగుల పొడుగునుగల మంచమొకటియున్నను, అందులోనే పిండి మొదలగునవి విసరుటకు తిరుగండ్లును కూరలుతిరుగుటకు కత్తిపీటలును తక్కిన పనులుచేయుటకుతగిన సాధన సామగ్రియు నుండును గనుక వారందులోనే పనిపాటులుచేసి కావలసినప్పుడు మంచముమీఁద వెన్నువాల్తురు. ఈయాచారముచేత రంఢీ దేశమునందు కులపురుషులలో వ్యభిచారమన్నమాట లేదు. స్త్రీలకెప్పుడును పురుషులమీఁద అనుమానము విస్తారమగుటచేత ఈపురుషులమీఁదకూడ దోషారోపణములు చేయుదురుగాని నేను చూచినంతవఱకు పురుషులకొక్కరికిని గర్భములురాక పోవుటచేత నేను వారిమాటలు నమ్మను. ఈపెట్టెలనుచేయు స్త్రీలు మాఱుతాళము చెవులను చేసి తమయొద్దనుంచుకొని విశేషధనమును స్వీకరించి ధనికురాండ్రయిన యితరస్త్రీల కమ్ముదురనియు, అందుమూలమున వ్యభిచారము జరుగుననియు, అసూయగలవారు లేనిపిందలు కట్టుదురు. ఇనుపపెట్టెలను కొనుటకు శక్తిలేనివారీరీతిగా కఱ్ఱపెట్టెలను చేయింతురు. అందుకును సమర్థులుకానివారు తమపతులను గదులలోనేపెట్టి తాళముచేసి దానితోనే తృప్తిపొందియుందురు. ఈ యాచారమును మనముతప్పక మనదేశములోకూడ స్థాపింపవలెను. అనుభవజ్ఞుఁడనైన నామాటవిని మీరీ పెట్టెలపద్ధతిని మనదేశములో వ్యాపింపఁజేసి స్త్రీలనందుంచి తాళమువేయుచు వచ్చినపక్షమున, అత్యల్పకాలములోనే మనభరతఖండమునందు జారత్వము రూపుమాసి పోయి మనదేశము మహాపవిత్రమయినదగును. ఉత్తరప్రత్యుత్తరములు జరుపుటకువీలుగలుగునుగనుక మనపెట్టెలకు మాత్రము గవాక్షములుం

డనియ్యఁగూడదు. మనదేశమునందు పెండ్లిలుచేయువారు పురుషులగుట చేత తాళము చెవులవిషయమయి యీదేశములో స్త్రీలుజరుపుచు రను మోసపుపనులు మనదేశములో నుండవు. అంతేకాక యీపేటికానిర్మాణమువలన స్త్రీలకు మానరక్షణము కలుగుటయే కాక కమ్మరులకును వడ్రంగులకును క్రొత్తజీవనాధారము కలిగి దేశము భాగ్యసంపన్నమగును. కాఁబట్టి నాహితోపదేశమును మీరశ్రద్ధ చేయఁబోకుఁడు. నాదేశాటనమువలనఁగదా భరతఖండమున కీమహోపకారము కలుగుచున్నది! దేశాటనము బహులాభప్రదమని పెద్దలన్నమాట వ్యర్థమగునా?

పురుషులకు నలువది సంవత్సరములు దాటఁగానే రాజవాసబంధవిమోచనమగును. ఈనిర్బంధము వితంతుపురుషులకు సహితముండను. అందుచేత పురుషులు స్వేచ్ఛగానుండుటకయి పత్నులకు విషప్రయోగములు చేసియుందురుగాని, వితంతువులు కాఁగానే ముక్కుకోయుదురన్న భయముచేత నట్టిపనికి సాహసింపక వారు పత్నీభక్తికలవారయి యుందురు.

ఆఱవ ప్రకరణము

నాయజమానురాలైన ఫాంఙీభంగీగారు విద్వాంసురాలైన భాంగీఫిండీగారిని నియమించి నాకింట విద్యచెప్పించుటయు, రంఙీభాషలో నేను తగినంత పాండిత్యమును సంపాదించినతరువాత దొరతనమువారు క్రొత్తగాస్థాపించిన పురుష పాఠశాలకు నన్ను పంపుటయు అక్కడ సహపాఠియగు మఱియొక పురుషునితో నాకు మైత్రికలుగుటయు మీకీవఱకే తెలిపియున్నానుగదా? మేమిరువురమును తప్ప మఱియెవ్వరును పురుషు లాపాఠశాలలో చేరలేదు. మా కుపాధ్యాయుఁడుగా నియమింపఁబడిన జాతిపురుషునిపేరు చామర్జి. అతఁడు

ంగ్లీభాషయందు విశేషపాండిత్యము కలవాఁడు కాకపోయినను స్వభాషయందు మహావిద్వాంసుఁడయి సంగీతమునందును చిత్రలేఖనమునందును శిల్పములయందును ప్రకృతిశాస్త్రములయందును నిరుపమానసామర్థ్యముగల నాగరికాగ్రగణ్యుఁడు. అతఁడు మాకిరువురకును విద్య చెప్పుటయేకాక పురుషులు పొందఁదగిన స్వాతంత్ర్యములనుగూర్చియు విద్యాభ్యాసమువలనఁ గలుగు లాభములనుగూర్చియు కూడ పలుమాఱు బోధించుచుండెను. పురుషవిద్యాస్వాతంత్ర్యములు నాకు క్రొత్తవిగా గానఁబడకపోయినను దేశాచారమునుబట్టి స్త్రీలకు దాస్యము చేయ నలవాటుపడిన నాసహాధ్యాయునికి మాత్రమవి వింతగాఁ గనఁబడి యుత్సాహమును గలిగించుచు వచ్చెను. మాయుపాధ్యాయుఁడుపదేశించిన బోధనలవలనను చేసిన యుపన్యాసములవలనను గాకపోయినను స్త్రీలయధికారమును రూపుమాపి యీదేశమునందు పురుషస్వాతంత్ర్యమును నెలకొల్పవలెనన్న యభిలాషచేత సహజముగానే వారిరువురకన్నను నాకెక్కువ యుత్సాహముండెను. నా సహాధ్యాయుఁ డించుమించుగా నిరువది సంవత్సరముల ప్రాయముగలవాఁడు; అపత్నీకుఁడు; నవనాగరికురాలయిన యప్పగారి ప్రోద్బలమువలన చిన్నప్పటినుండియు కొంచెము విద్యనేర్చినవాఁడు. పూర్వము లక్ష్మణస్వామివారు శూర్పణఖ ముక్కుకోసినట్లుగా, గురువులవారపత్నీకుఁడయిన యీతని ముక్కు నీవఱకే మొదలంటఁ గోసియుందురుగాని, జాతిభాషచదివి నవనాగరికురాలయి రాజకీయోద్యోగమునందున్న యీతని యప్పగా రాపని సాగనిచ్చినదిగాదు. బంధుజనులకు విరోధముగా నిప్పుడాతనిని రాజకీయపాఠశాలకు పంపినదియు ఆయప్పగారె. సహపాఠియైన నామిత్రుని పేరు భ్రాష్టి ఫోడ్. నేను క్రమముగా ప్రతిదినమును పాఠశాలకు పోయి పాఠమును చదువుచున్నను, నామిత్రుఁడు మాత్రము నోములు మొదలయినవాని నిమిత్తము వారమునకు మూఁడు నాలుఁగు దినములు బడి మానుచు

వచ్చెను. మనదేశమునందు స్త్రీల కెన్నినోములున్నవో యాదేశమ
నందు పురుషుల కంతకంటె రెట్టింపునోములున్నవి. వారాదివారమ
నాఁడు ప్రాతఃకాలమునందు కందపిలకను పూజింతురు; సాయంకాలమ
నందు పెండలపుదుంపను పూజచేయుదురు; సోమవారమునాఁడ
మధ్యాహ్నము సన్నికంటెని పూజింతురు; సాయంకాలమునంద
రుబ్బురోటిని పూజచేయుదురు. సదుమనసునువచ్చు విశేషవ్రతములు
గాక యీప్రకారముగా దినమునకు రెండేసిచొప్పున పురుషులు సంవ
త్సరమునకేడువందల ముప్పదినోములు నోతురు. సామాన్యపురుష
లన్నినోములను నోచరుగాని యుపత్నీకులును విత్తవంతులును విశేష
ముగా నోములను నోచి వానిచేఁ గాలక్షేపము చేయుచు, తమవిత్త
మును గురుతస్కరాచార్యులకు సమర్పించుచుందురు. మాయుపాధ్యాయు
డిన్ని నోములు నోచుచుండుట యప్పగారి కిష్టములేకపోయినను, అప్ప
గారికి తెలియకుండ నతఁడు బడిమాని యామె కొలువునకు పోయి
తరువాత రహస్యముగా ముసలిదయిన తల్లియొక్కయు ఇంటనున్న
యితరపురుషులయొక్కయు ప్రోత్సాహముచేత నోములు నోచుచు
ండును. ఈనోములు నిష్ఫలములని నేనును మా యుపాధ్యాయుఁడయిన
చానుర్జిగారును కూడ పలుమాఱు నామిత్రుఁడయిన భాష్కిఘోడ్‌కి
బోధించుచువచ్చితిమిగాని యాతఁడు మావద్ద నాలాగున సేయని తలయు
ఊంచి నోములు మానివేసెదనని యొట్టుపెట్టుకొనుచువచ్చినను మమ్ము
విడిచి యింటికిపోఁగానే యామాటలుమఱచి యథాప్రకారముగా
ప్రవర్తించుచుండెను. ఎంత చదువుకొన్నను చిరకాలమునుండి వచ్చు
చున్న యాచారము నొక్కసారిగా మానుట యెంతటివారికిని కష్టసాధ
ముగా నుండును. అందుచేత నేనాతనిని ప్రతిదినమును పాఠశాలకు
తోడితెచ్చుటకయి యాతని యింటిమార్గమున నే పోయి యాతని
నాతోపిలుచుకొనిపోవుచుంటిని.

ఇట్లు కొంతకాలము నడిచినపిమ్మట మేమిద్దఱమును గలిసి యొకనాఁడు పాఠశాలకుఁ బోవుచుండఁగా మార్గములో నాకొకచిత్రమును జూపెదను రమ్మని నామిత్రుఁడు నన్నూరిబయటికిఁ దీసికొని పోయెను. ఆవఱకే వేడుకచూచుటకై స్త్రీలచ్చటికి తీర్థప్రజలవలె వచ్చియుండిరి. ఆగుంపులో నడుమనడుమ పత్నీవియోగము పొందని పుణ్యపురుషులును కొందఱుండిరి. ఆపట్టణములో గతదినమురాత్రి ధనికురాలయిన యొకవృద్ధవణిజస్త్రీ మృతినొందెను. ఆముసలిదాని భర్త మృతురాలయిన తనపత్నితోఁగూడ సహగమనముచేయుటకు నిశ్చయించి శ్మశానవాటికకు పోయినందున వినోదముచూచుటకును పుణ్యమును సంపాదించుకొనుటకును వేలకొలఁదిజను లక్కడఁ గూడిరి. మేము వెళ్లునప్పటికే చేయవలసిన కర్మయంతయు జరిగినది. మేమువెళ్లిన తరువాత ముసలిదానిశవమును నలుగురు మోసికొని పోయి యావఱకు త్రవ్వియుంచినగోతిలో నిలువుగా బోరగిల పరుండఁబెట్టిరి. అంతట పురోహితస్త్రీలు మంత్రములుచదువుచు భర్తనుచేయి పట్టుకొని యాగోతివద్దకుఁగొనిపోఁగా, అఱువదియేండ్ల ప్రాయముగల యాముసలివాఁడు తనశరీరమున నున్న రెండుమూఁడునగలను దీసి చెంతనున్నపురుషులకు దానముచేసి సంతోషపూర్వకముగా సమాధిలోనికిదిగి పత్నియొక్క కుడిప్రక్కను తానును బోరగిల పరుండెను. అప్పుడు పురోహితస్త్రీలుమనదేశములో వేదఘోషచేసినట్లుగా గడియసేపేవో మంత్రములుచదివి యేవోకర్మలు చేయుచుండిరి. ఈలోపలపన్నిద్దఱుస్త్రీలు పెద్దగంపలనిండ మన్నుపట్టుకొని గోతిచుట్టును నిలుచుండిరి. అప్పుడు మహాధ్వనితో వాద్యములు మ్రోగుచుండెను. ఆసందడిలో ముఖ్యురాలయిన యాజకస్త్రీ యేదోమంత్రము చదివి చేయివిసరఁగానే యొక్కసారిగా పన్నిద్దఱు స్త్రీలును తమగంపలలోని మన్ను మీఁదపోసిరి. అటు తరువాత పుణ్యపురుషులొక్క రొక్కరేవచ్చి తట్టెడుతట్టెడుమన్ను

మీఁదవేసి మొక్కిపోవుచువచ్చిరి. పాఠశాలకు పోవ వేళమించుచున్న దని యాస్థలమునువిడిచి నామిత్రుఁడును నేనును దారిపొడుగునను సహగమనవిషయమై మాటాడుకొనుచు వేగముగా నంతట పాఠశాలకుఁబోయితిమి. ఆదేశములో నేఁబదియేండ్లు దాటినతరువాతఁగాని పురుషుఁడు సహగమనము చేయరాదఁట. ఏఁబదియేండ్ల ప్రాయమువఱకును పత్నితోఁగాపురముచేసిన పురుషుఁ డాదేశములో పుణ్యపురుషుఁ డనఁబడును. అట్టి పుణ్యపురుషుఁడు పత్నీమరణసమయమునందు సహగమనము చేసినపక్షమున ముప్పదిమూఁడు తరములవఱకును తనతల్లివంక వారిని తండ్రివంకవారిని మాత్రమేకాక తనపత్నియొక్క తల్లివంక వారిని తండ్రివంకవారినిగూడ తరింపఁజేసి మహాపాపులను సహితము పుణ్యలోకమునకుఁ బంపునఁట. ఆదేశమునందు శవములను పాతిపెట్టుటయేకాని దహనము చేయుటలేదు. సమాధియందు దంపతులను బోరగిల పరుండఁబెట్టుటకు కారణ మేమయియుండునని నామిత్రుని నడిగినాను. పుణ్యలోకములు క్రిందితట్టున నుండునుగనుక వారియాత్మలు తిన్నగా నడుగువంక పోవుటకయి యట్లు చేయుదురని యాతఁ డుత్తరముచెప్పెను. పుణ్యలోకములు పయినుండుటచే నూర్ధ్వలోకము లనఁబడుననియు, పాపలోకములు క్రిందనుండుటచే నధోలోకము లనఁబడుననియు మనశాస్త్రములు చెప్పుచున్నవి. ఆదేశమువారు శాస్త్రవిరుద్ధముగా పుణ్యలోకములే క్రిందనుండు ననుచున్నారు. పుణ్యపాపశబ్దముల ప్రయోగమెట్లున్నను వారిప్రకారముగా సమస్తవిషయములలోను పురుషుల నన్యాయము చేయుటచేత వా రధోలోకములకేగుట నిశ్చయమని నేననుకొన్నాను. ఈసహగమనమును వారిభాషలో భూతీర్ఘాటీయందురు. స్వర్గయాత్రయని దానికర్థము. ఈసంభాషణ ముగియునప్పటికి మేముపాఠశాల చేరినాము. మాయుపాధ్యాయుఁడు చాలసేపటినుండి మానిమిత్తము వేచియుండి మేముపోఁ

గానే యింతయాలస్య మేలచేసితిరని యడిగెను. ఆలస్య కారణమును మేము "స్వర్గయాత్ర" ను జూడఁబోవుటగాఁ జెప్పితిమి. అందు మీఁద నతఁ డాదినము పాఠములుకట్టిపెట్టి నిజముగా నది నరకయాత్ర కాని స్వర్గయాత్రకాదనియు, అటువంటి క్రూరకృత్యమును జనులు వివేకముకలిగి తమంత మానకపోయినను దొరతనమువారు బలవంతము గానైనను మాన్పవలెననియు బహుదూరము చెప్పెను. ఈప్రసంగ ములో మనదేశాచారము సంగతికూడవచ్చినది. పురుషుల విషయ మయి యిట్లుచేయుట దారుణ కృత్యమయినను భర్తృమరణము సంభ వించినప్పు డనుగమనముచేయుట పతివ్రతలైన భార్యలకు పరమధర్మ మనియు, ఈదేశమునందువలె ముసలివాండ్రు మాత్రమేకాక యేఁడెని మిది సంవత్సరముల బాలికలు సహితము భర్తలుపోయినప్పుడు పూర్వ కాలమునందు మాదేశములో సహగమనము చేయుచుండిరనియు, మాదేశమున కన్యదేశీయులు ప్రభువులగుటచేత వారీ సదాచారమును మాన్పించి పాపము కట్టుకొనిరనియు చెప్పి సహగమన మాహాత్మ్య మును బోధించితిని. భర్తలు మృతినొందినప్పుడు భార్యలు భర్తలచితి మీఁదనెక్కి నిమిషములో నగ్నిహోత్రజ్వాలల కాహుతులగుదురని నేనుజెప్పినప్పు డతఁడది క్రూరకృత్య మనియు, దొరతనమువారు దానినిమాన్పుట శ్లాఘ్యకార్యమే యనియు, తన దేశమునందు ప్రభు త్వమువారి కట్టిసాహసము లేకయున్నదనియు, మహావ్యసనముతోఁ బలి కెను. పురుషులను ప్రాణములతోఁ బూడ్చిపెట్టెడు దురాచారమును మాన్పుటయవశ్య కర్తవ్యమని నేనాతనితో నేకీభవించినను, మనదేశపు సంగతినిమాత్ర మతఁడు తిన్నఁగా నాలోచించలేదనియు శాస్త్రము లున్నసంగతి యతఁ డెఱుఁగఁడనియు భావించి మాది కేవలాచారము కాదనియు, ప్రత్యక్షశాస్త్రసిద్ధమనియు, ఈకలియుగములో పరమ ప్రమాణమయిన పరాశరస్మృతియందు

శ్లో. తిస్రఃకోట్యర్ధకోటీచ యానిలోమాని మానుషే
తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి.

అని భర్తతోడ సహగమనము చేసినపుణ్యస్త్రీ మనుష్యదేహమున నెన్ని రోమములుండునో యంతకాలమనఁగా మూడుకోట్ల యేఁబదిలక్షల వేలయేండ్లు స్వర్గసుఖమును పొందునని చెప్పఁబడినదనియు, "యాని లోమానుమానుషే తావంత్యబ్దసహస్రాణి" యని హారీతుఁడుకూడ స్పష్టముగాఁ జెప్పినాఁడనియు ఆంగీరస స్మృతియందు

శ్లో. బ్రహ్మఘ్నోవా కృతఘ్నోవా మిత్రఘ్నోవాపి మానవః
తంవై పునాతి సానారీ ఇత్యంగిరసభాషితమ్.

అని సహగమనముచేసిన స్త్రీ భర్త బ్రహ్మఘ్నుఁడయినను కృతఘ్నుఁడయినను మిత్రఘ్నుఁడయినను కూడ నతనిని పవిత్రుని జేయునని చెప్పఁబడినదనియు, అందుచేత శాస్త్రవిహితమైన యీ యాచారమును నిషిద్ధముని చెప్పఁగూడదనియు, ఆస్తికులయిన వారందఱును శాస్త్ర ప్రమాణమును శిరసావహించి యల్పమైన మనుష్యబుద్ధికి క్రూరముగా కానఁబడినను తప్పక యనుష్ఠింపవలసినదనియు, నింద్యమైన యాచారమును శిష్టులయిన మావా రంగీకరించియుండరుగనుక తప్పక యిది సదాచారమే యనియు నేను నొక్కి చెప్పినాను. అందుమీఁద నతఁడు కొంచెమునే పాలోచించి స్వప్రయోజనపరులైన మనుష్యులెవ్వరో యేవోకారణములచేత నట్టి శ్లోకములను కల్పించియుందురని పలికెను. నేనామాటల కొడఁబడక యావిమనుష్య కల్పితములగుట సాధ్యముకాదనియు, మనుష్య కల్పితములైన పక్షమున,

"నమోద్యాముకే మాసి అముకేపక్షే౽ముకతిథౌ అముకగోత్రా శ్రీమతీ అముకీదేవీ అరుంధతీసమాచారత్వపూర్వక స్వర్గలోక మహీయమానత్వ మానవాధి కరణక లోమసమ సంఖ్యాబ్దావచ్ఛిన్న స్వర్గవాస భర్తృసహిత మోదమానత్వ మాతృపితృ

శ్వాశురకులత్రయపూతత్వ చతుర్దశేంద్రావచ్ఛిన్న కాలాధికగణకా
ప్సరోగణస్తూయమానత్వ పతిసహిత క్రీడమానత్వ బ్రహ్మఘ్న
కృతఘ్న మిత్రఘ్న పతిపూతత్వ కామా భర్తృజ్వాలచ్ఛితారో
హణ మహం కరిష్యే"

అని సంకల్పమేల పుట్టెననియు, మొట్టమొదట దీనికొక్కదానికి నాకు సమాధానము చెప్పవలసిన దనియు, నేను కోరితిని ఆసంకల్పమున కర్థమేమని యతఁడు నన్నడిగెను. "నమస్కారము. నేఁడు ఈమాసమున ఈపక్షమున ఈతిథియందు ఈగోత్రముగలట్టియు ఈపేరుగలట్టియు శ్రీమతినైన నేను అరుంధతివలె నడుచుకొనుటవలనఁ గలిగెడు స్వర్గలోకమహిమను పొందుటకును, మనుష్యశరీరమునం దెన్నిరోమము లుండునో యన్ని సంవత్సరములు భర్తతోఁగూడ స్వర్గవాససుఖ మనుభవించుటకును, తల్లియొక్కయు తండ్రియొక్కయు మామగారియొక్కయు మూఁడువంశములను పవిత్రము చేయుటకును, పదునలుగు రింద్రులకాలమువఱకును అప్సరోగణముల స్తుతిని పొందుచు పతి సహితముగా క్రీడించుటకును, బ్రహ్మహత్య చేసినవాఁడయినను కృతఘ్నుఁడయినను, మిత్రద్రోహియయినను భర్తను పవిత్రుని చేయుటకును, కోరి, మండుచున్న భర్తయొక్క చితినెక్కెదను" అని పైసంకల్పమున కర్థమని నేను వివరముగా బోధించినాను. అర్థము విన్నతరువాత సహితము మాయుపాధ్యాయుఁడు సహగమనము మంచికార్యమని యొప్పుకొనక యిట్టిసంకల్పమును కొంచెము సంస్కృతము చదువుకొన్నవా రెవ్వరైనను కల్పించ వచ్చునని సమాధానము చెప్పెను. ఇది కల్పన కాదనియు, ధర్మశాస్త్రములలో

"శ్లో. మృతేభర్తరి యానారీ సమారోహేద్ధుతాశనమ్
సారుంధతీ సమాచార స్వర్గలోకే మహీయత."

అనియు,

"శ్లో. యాచ భర్తృపరా నిత్యం స్తూయమానాప్సరోగణైః
క్రీడతే పతినాసార్థం యావదింద్రాశ్చతుర్దశ."

అనియు, ప్రమాణములున్నవనియు, ప్రమాణబద్ధులమయిన మనము శాస్త్రతిరస్కారము చేయఁగూడదనియు, నే నెంత వాదించినను నామాటలయందు గౌరవముంచక మూర్ఖుఁడయి యతఁడు సర్వకారుణ్యుఁడయిన యీశ్వరుఁ డిట్టి క్రూరకృత్యమును విధించి యుండఁడనియు, ఇది యాతయు పితంతువుల ధన మపహరింపఁ గోరియో మఱియెందుచేతనో స్వప్రయోజన పరులయినవారు చేసిన మోసమనియు, యుక్తికిని నీతికిని విరుద్ధముగానున్న శాస్త్రములను నమ్మరాదనియు, అతఁడే వేవో కుయుక్తులను పన్నుట కారంభించెను. ఆమాటలకు నేను చెవులుమూసికొని హరినామస్మరణ చేసికొని శాస్త్ర విశ్వాసములేని నాస్తికులతో సంభాషించినచో దోషము వచ్చునని యెంచి యాప్రసంగము నంతటితో చాలించితిని.

అతఁడుమాత్రము సహగమన విషయము నంతటితో విడువక నాకనిష్టముగా నుండునని దానిని దూషించుటమాత్రము మానివేసి "సహగమనమును దొరతనమువారు మాన్పుటకు పూర్వము మీదేశములో సంవత్సరమున కెన్ని యనుగమనములు జరగుచువచ్చె" ననియు, "ఇప్పుడు మీదేశములో నెందఱువితంతువు లున్నారు" అనియు, నానావిధములయిన ప్రశ్నలువేయ మొదలుపెట్టెను. నాకు విద్యాగురువుగానున్న పెద్దమనుష్యుఁ డడిగినదానికి ప్రత్యుత్తరము చెప్పకుండుట మూర్ఖతగా నుండునని యెంచి నాకు తెలిసినంతవఱకు కాతఁడడిగిన ప్రశ్నల కన్నిటికిని నే నీట్లుత్తరములను చెప్పితిని:—

"మాదేశములో సహగమన సదాచారమును మాన్పుటకయి మొట్టమొదట మతాంతరులయిన క్రైస్తవమతాచార్యులు క్రీస్తుశకము ౧౮౦౩ వ సంవత్సరమున కలకత్తానగరమునందు కొంతప్రయత్నము

చేసిరి. వారాసంవత్సరమునందు పనుగురు మనుష్యులను నియమించి కలకత్తానగరముచుట్టును మూఁడామడల దూరములోఁగల గ్రామముల యందు సహగమనముచేసిన పుణ్యసతుల సంఖ్యను లెక్క వేయిం పఁగా, ఆఱుమాసములలోపల మున్నూఱుగురు పతివ్రతలు భర్తల చితులనెక్కి స్వర్గలోక నివాససుఖమును చూఱగొన్నట్టు తెలిసినది. ఆ సంవత్సరము మొదలుకొని సహగమనమును మాన్పఁ గలిగినవారు పాపము కట్టుకొనువఱకునుగల యిరువదియైదు సంవత్సరములలోను డెబ్బదివేల విధవలు మా దేశములో భర్తృసహగమనముచేసి పుణ్య లోకములకుఁ బోయినట్లు దొరతనమువారి లెక్కలవలననే తెలియవచ్చు చున్నది. ఆ లెక్కలలో తగులని యిల్లాండ్రెందఱున్నారో! దీనినిబట్టి మా దేశము దేశములలోనెల్లఁ బవిత్రమైనదనియు పతివ్రతామయమైన దనియు పుణ్యసతీ భరితమయినదనియు మీకు బోధపడియుండవచ్చును. ఆ సంగతి పోనిండు. మతాంతరులైన క్రైస్తవాచార్యుల యుల్పకృషి యీశ్వరుఁడు మాయందుండుటవలన నప్పుడేమియు కొనసాగినది కాదు. అటుతరువాత రామమోహనరాయలను పతితుఁడొకఁడు మాలోనే బయలుదేఱి క్రీస్తుశకము ౧౮౧౮ వ సంవత్సరము మొదలుకొని సహ గమనమును మాపుమాపుటకయి మహాకృషి చేయనారంభించెను. ఒక్క కలకత్తా నగరమునందు ౧౮౧౫ వ సంవత్సరములో ౨౫౩ రును, ౧౮౧౬ వ సంవత్సరమునందు ౨౮౯ గురును, ౧౮౧౭ వ సంవత్సరము నందు ౪౪౨ గురును, ౧౮౧౮ వ సంవత్సరమునందు ౫౪౪ గురును, ౧౮౧౯ వ సంవత్సరమున ౪౨౧ గురును, ౧౮౨౦ వ సంవత్సరమున ౩౭౦ గురును, ౧౮౨౧ వ సంవత్సరమున ౩౭౨ గురును, ౧౮౨౨ వ సంవత్సరమున ౩౨౮ గురును, ౧౮౨౩ వ సంవత్సరమున ౩౪౦ రును, ౧౮౨౪ వ సంవత్సరమున ౩౭౩ గురును, ౧౮౨౫ వ సంవత్సరమున ౩౯౮ గురును, ౧౮౨౬ వ సంవత్సరమున ౩౨౪ గురును, ౧౮౨౭ వ

సంవత్సరమున ౩౩౭ గురును, ౧౮౨౮ వ సంవత్సరమున ౩౦౯ గురును, మహాపతివ్రతలు చిత్యారోహణముచేసి పదునలుగురింద్రుల కాలమువఱకును భర్తలతోఁగలిసి స్వర్గలోకసుఖ మనుభవించుటకుఁ బోయిరి. 'దైవము దోసకారులకె తోడయివచ్చు' నన్న సన్నుత్తోక్తిప్రకారముగా మతభ్రష్టుల కృషిననుసరించి ౧౮౨౯ వ సంవత్సరమునం దప్పటి పరిపాలకులయిన బెంటింకు ప్రభువుగారు సహగమనమును మాన్పి ప్రతిసంవత్సరమును అంతమంది పతివ్రతలు పుణ్యలోకములకు పోకుండ నిరోధించిన పుణ్యమును కట్టుకొనెను.

"మా దేశములో ౧౮౮౧ వ సంవత్సరమునందు ప్రభుత్వమువారు వేయించిన జనపరిగణనప్రకారముగా స్వదేశప్రభువుల సంస్థానములలోఁ గాక యింగ్లీషు రాష్ట్రములో ౨౦౯౩౮౭౭౬ గురు వితంతువులున్నారు. ఈసంఖ్యవలన మొత్తముమీఁద మాదేశములో నయిదుగురేసి స్త్రీల కొక్కొక్క వితంతువున్నట్టు కాఁబడుచున్నది. ఇఁక బ్రాహ్మణులలోనన్ననో ముగ్గురేసివారిలో నొక్కతె విధవగానున్నది."

ఈవిధముగా నేను చెప్పినసంగతి విన్నతరువాత ౧౮౭౯ వ సంవత్సరములోనే భరతఖండమును విడిచిపోయిననాకు ౧౮౮౧ వ సంవత్సరములో హిందూదేశమునందు దొరతనమువారు వేయించిన జనసంఖ్యను గూర్చి యెట్లు తెలిసెనని నాసత్యచరిత్రమును జదివెడివారిలో గొందఱికి సందేహము కలుగవచ్చును. దానికి సర్వజన సమాదరణీయమయిన సమాధానమును చెప్పెదనువినుఁడు. నేను ౧౮౮౧ వ సంవత్సరమునందు రంఢీదేశములో నున్నమాట వాస్తవమే. అయినను ౧౮౭౯ వ సంవత్సరమునందు భరతఖండములో మొట్టమొదట బొంబయినగరములో దివ్యజ్ఞాన సమాజము స్థాపింపఁబడుటయు, అప్పటినుండియు కూటుహామిూ మొదలైన మహాత్ములు దూరదేశవార్తలను తెచ్చుచుండుటయు, మీరందఱు నెఱిఁగియే యున్నారుగదా? అట్టిసంగతిలో బుద్ధి

నుంతులైన మీకు వేఱుగఁ దెలుపవలసిన దేమున్నది? మీకిప్పుడు పేరుచు జెప్పనుగాని దివ్యజ్ఞాన సమాజమువారి మహాత్ములలో నివాఁడే యొక మహానుభావుఁడు నేఁటివఱకును మన భరతఖండములో జరుగు చున్న సువార్తల నెప్పటికప్పుడు తెచ్చి నాకనుగ్రహించుచున్నాఁడని మాత్రము మీసంశయ నివారణార్థము చెప్పుచున్నాను. ఈసంభాషణ మయిన తరువాత మేము పాఠశాలను విడిచి ఇంటికిఁ బోతిమి.

అటు తరువాత రంఢీనగరములో పూర్వమెప్పుడును లేని పురుష విద్యాభ్యాసమును క్రొత్తగా నెలకొల్పుచున్న విషయమును విద్వాంసు లాంద్రఁడందఱునుజేరి సభలు చేయుట కారంభించిరి. ఆసభలలో పూర్వా చార విరుద్ధముగా పురుషులకు విద్య చెప్పించువారిని, అటువంటివారికి తోడ్పడువారిని, అందఱిని వెలివేసి మతగురువులకు వ్రాసి బహిష్కార పత్రికలు తెప్పించుటకు నిశ్చయింపఁబడినది. ఈసంక్షోభమునకు భయ పడి నామిత్రుఁడయిన భాఢీఫోడ్ అప్పగారతనిని బడి మాన్పించినందున మాపాఠశాలకెల్ల నేనొక్కఁడనే విద్యార్థినైనాను. నాయజమానురా లయిన ఫాంఢీభంగీగారు మాత్రము జడియక ధైర్యము వహించి నన్ను పాఠశాలకు పంపుట మాననందున, సభాపత్నులును పౌరమహాకాంత లునుజేరి సభవారామెను బహిష్కారముచేసిరి. అటు తరువాత జరిగిన చర్యను మఱియొక ప్రకరణమునందు వివరించెదను.

ఏడవ ప్రకరణము

బహిష్కారపత్రిక వచ్చినతరువాత ఫాంఢీభంగీగారు తమప్రయ త్నమును విడువక తమ మిత్రురాండ్రను రాజకీయ పాఠశాలలోని పయి తరగతులయందుఁ జదువుకొను బాలికలను పోగుచేసి పురుషవిద్యా భ్యాసముయొక్క యావశ్యకమును గూర్చి యుపన్యాసములు చేయుట

ప్రారంభించెను. ఆయుపన్యాసములవలనను రాజభాషాగ్రంథపఠన మహాత్త్వమువలన మనసు కరఁగినవారయి కొందఱు బాలిక లెన్నికష్టముల కయిన నోర్చి పురుషవిద్యాభివృద్ధిని జేయుటకు నిశ్చయించుకొని నాయాజమానురాలికి సర్వవిధముల తోడ్పడుచు, వెలివేయఁబడిన వారామెతోఁ గలిసి రహస్యముగా భోజనములు చేయుటకారంభించిరి. అందుచేత రంఢీనగరములో మఱింత సంక్షోభము కలిగెను. రాజభాషవలన పిల్లలు చెడిపోవుచున్నారనియు, వారినందఱిని రాజకీయపాఠశాలకు బోకుండ మాన్పించి వారికి రంఢీమతమును బోధించి వారిని పూర్వసదాచార నిష్ఠురాండ్రను జేయవలయుననియు, విద్వాంసురాండ్రచేత వారమునకు రెండుసారులు బాలికలకు మతబోధ చేయింపవలయుననియు, లౌక్యాధికారములలోనున్న పురములోని ప్రముఖురాండ్రు నిశ్చయము చేసి సభలు చేయించుటయేకాక, తమగ్రామమున కొక్కసారి విజయముచేసి జీర్ణమతోద్ధారణము చేయవలెనని పీఠాధిపత్నియైన మతాచార్యురాలికి విజ్ఞాపనము పంపిరి. నవనాగరికురాండ్రకు మాయజమానురాలు నాయకురాలయినట్టే పూర్వాచార పరాయణలయిన పూర్వనాగరిక పక్షమువారికి దుంఢీలంఢీగారు నాయకురాలయి, తన యావచ్ఛక్తిని వినియోగించి సంస్కారపక్షమువారిని ముఖ్యముగాఁ దత్పక్షానుసారిణు లయిన బాలికలను బాధించి పూర్వాచారస్థాపనము చేయ మొదలుపెట్టెను. దుంఢీలంఢీగా రాపట్టణమునకుఁ బ్రాడ్వివాకురాలు. రాజకీయోద్యోగమునం దుండుటవలన నవనాగరికపక్షావలంబకు లయిన దొరతనమువారికి విరోధముగాఁ బనిచేయుట కిష్టములేనిదై, తానుచాటున కపటనాటకమునకు సూత్రధారురాలుగానుండి యామె యాగ్రామములో మిక్కిలి కర్మిష్ఠురాలని ప్రసిద్ధిచెందిన గంభీదంభీగారిని నాయకురాలినిగాఁ జేసెను. ఈగంభీదంభీగారు లోకములోని కర్మిష్ఠురాండ్రలో నగ్రగణ్యురాలు; ప్రాతఃకాలముననే స్నానముచేసి ముక్కు-

మూసుకొని కూరుచుండి ప్రతిదినమును పగలు రెండు యామములవఱకును రేగుగింజల జపమాలిక త్రిప్పుచు జపముచేయుచుండును. మన దేశములో రుద్రాక్షలవలెనే యీదేశములో బదరీ బీజములు మిక్కిలి పవిత్రమయినవి. ఇక్కడవలె నక్కడ దేహమున విభూతిధరింపరు. మన దేశమునందువలె మూడు రేఖలుగాగాక యొక్కటేరేఖగా లలాటమునం దంతటను భూరేణువు పూసికొందురు. అందులో శోణమృత్తిక పరమపావనమైనది. తదభావమునందు నదులలోనిదిగాని, తదభావము నందు చెఱువులలోనిదిగాని, తదభావమునందు నూతులలోనిదిగాని ఏమృత్తికయైనను ధరింపవచ్చును. మన గంభీదంభీగా కొక్కలలాటము నందు మాత్రమేకాక దేహమునందంతటను జేగురుమట్టినే పూసికొని పూచిన మోదుగువలె కన్నులపండువుగాఁ గానఁబడుదురు. ఆమెకుఁ గల భక్తియు నింతంతయని చెప్పనలవిగాదు. ఆమె దేవతార్పణముగాఁ గాని యేపనియుఁ జేయదు. ఆమె దేవతానివేదనము చేయక కల్లయినను త్రాగదు; మాంసమయినను తినదు; దేవతార్పణము చేయక చౌర్యమునయినను జేయదు. వేయేల? ఆమె తనదేహమును దేవతాసమర్పణము చేసియే వ్యభిచరించును; తనజిహ్వను దేవతాసమర్పణము చేసియే కల్లలాడును. ఆత్మకర్తృత్వముంచుకొనక కర్మనిష్ఠులు మన దేశమునందు "తత్సత్ బ్రహ్మార్పణమస్తు" అని కర్మలనన్నిటిని బ్రహ్మార్పణము చేసినట్లే యీమెయు తనకర్మలనన్నిటిని స్వదేవతకు ధారబోయును. కాఁబట్టి యీమె యీపనియు తన యిష్టదేవతాప్రీతికొఱకే చేయ దీక్షవహించినందున, అభీష్టసిద్ధికయి ప్రతిపక్షులవిషయమున నేదారుణకృత్యమును జేయుటకును పాపభయ మీమెకు లేదు. కాని దొరతనమువారి భయముండుటచేత లోలోపల నెన్నికానిపనులు చేసినను తత్పక్షమువారు ప్రత్యక్షముగా ప్రతిపక్షుల తలలు బద్దలు కొట్టి దౌర్జన్యము చేయుటకు మాత్రము సాహసింపకుండిరి. రాజకీయోద్యో

గినులయిన రంఢీ దేశవాసినులకు పలువుర కింకొక కష్టముకూడ వచ్చి నది. వారావల సత్యప్రియులైన నవనాగరికాగ్రగణ్యులయినట్టుగా నటించి తమ పయియధికారిణుల మెప్పుపొందవలయును; ఈవల పూర్వమతా చారాభిమాననీయ లయినట్లు నటించి మూఢప్రజలను సంతోషపెట్టవల యును; మధ్యను తమ హృదయములన్నియు నవనాగరిక పక్షముననే యుండుటచేత సంస్కారములను మెల్లగా నెలకొల్పుట నిమిత్తమే పైకి పూర్వ నాగరికపక్ష మవలంబించినట్లు మెలఁగవలసి వచ్చినదని నవ నాగరికురాండ్రను సమాధానపఱుపవలయును. కాఁబట్టి వీరు నాటక ములయందలి నటులవలె మూఁడు చోట్ల మూఁడు విధములయిన వేష ములు వేసి పరస్పర విరుద్ధములయిన మూఁడు కథలను వినిపింపవలసిన సామర్థ్యమును వహించినవా రయినారు. వీరు దేనియందును నమ్మక ములేనివారయి దురభిమానదేవుని దుశ్చింతాదేవిని మాత్రమే భక్తితో కొలుచువారగుటచేత తత్ప్రీతికరముగా వారు శ్రద్ధతో చేయునది యంతయు సాధుసంతాపప్రయత్నము తప్ప మఱియొక్కటి కానరాదు.

ఇంట తల్లిదండ్రులు బాలికలను బాధింపుచు పురుష విద్యాభ్యా సము మంచిదన్న పక్షమునను మంచిదన్న పక్షమువారితో చేరిన పక్ష మునను గృహములనుండి వెడలఁగొట్టెదమని బెదరించినందున వారిలో పలువురు వాదము చేయుటకును నవనాగరికలతో మాటాడుటకును మానుకొనిరి. కొందఱుతల్లు లంతటితోనైన నూరకుండక పాఠములు మాసివేసి పంచకాలములయందును "మిధా" చేయవలసినని బాలికలను నిర్బంధపఱుప నారంభించిరి. మిధాయనఁగా మనదేశములోని సంధ్యా వందనమువంటి నిత్యకర్మ. ఈనిత్యకర్మను ప్రతిస్త్రీయును ప్రాతఃకాలము, పూర్వాహ్నము, మధ్యాహ్నము, అపరాహ్నము, సాయంకాలము అను పంచకాలములయందును తప్పక చేయవలయును. అది చేయని వారికి గతులు లేవు. అయినను పట్టణములయందలివారు మిధాచేయునట్లు

కొందఱు నటించినను నిజముగా చేయువారు మాత్రము లేరు. జననీ జనకుల నిర్బంధ మెక్కువయినప్పుడు బాలికలు తమకు విద్య చెప్పవలసినదని వారినడుగ మొదలుపెట్టఁగా వారు తమగుట్టు బయలుపడకుండ మొట్టమొదట కోపపడియు తరువాత తమకు తీరిక లేదనియు నుపేక్షచేసి, చేయకపోయినను విద్య చేయుచున్నామని చెప్పి శోణస్మృతికాధారణమును మాత్రము చేసిన చాలునని చెప్పిరి. మఱికొందఱు జనులు తాము విద్య నేర్చుకొనవలెనని పురోహితురాలిని పిలిపించి యడిగిరి. పురోహితురాలును కొంచెమునే పాలోచించి తన సమీపమె పల్లెయందున్న తనచెల్లెలు విద్య చేయుచున్నందున పట్టణములయందు వాడుకలో లేనిదానిని తాను నేర్చుకోవలసిన యావశ్యకము లేకపోయిన దనియు, పట్టణములయం దుపయుక్తమయిన యర్థశాస్త్రమును మాత్రమే తా నభ్యసించితి ననియు, తగినంతధన మిచ్చెదమను పక్షమున పల్లెనుండి తనచెల్లెలిని పిలిపించెదననియు చెప్పెను. సూర్యకరతాపముచేత చెఱువులోని నీరింకినట్లే ధనముపేరు చెప్పఁగానే వారిమనో సరస్సునం దూరిన విద్యాభ్యాసాభిలాష ప్రవాహ మింకిపోయెను. అర్థశాస్త్ర మనఁగా నేమో మీలోఁ గొందఱికి తెలియకపోవచ్చును. అపత్నీకులు మొదలయిన వారిచేత నోములు వ్రతములు మొదలయినవి చేయించి వారివలన ధనమును గ్రహించెడిశాస్త్రమే యర్థశాస్త్రము.

పురుష విద్యాభ్యాసమున కాధారముగా గాథాయని చెప్పఁబడెడు వారి వేదములయందు ప్రమాణ మున్నదని నవనాగరికురాండ్రొక్కఁడిదో యొక వచనమును దీసికొనివచ్చిరి. విద్యాకువలెనే గాథా కర్థమే లేదనియు, ఉన్నను వేదము దేవభాషయగుటవలన దానియర్థము దేవతలకే కాని మనుష్యులకు తెలియదనియు, అందుచేత పూర్వము పురుషవిద్య గలదని వేదప్రమాణమును జూపినవారిమాట యంగీకార్యము కాదనియు, పుణ్యముకొఱకు వేదమంత్రముల నూరక కర్మలు

మొదలైన వానియందుఁ బఠింపవలసినదే కాని వాని యర్థముతో పని లేదనియు, విద్వాంసురాండ్రు వాదింపసాగిరి. ఆవాదములో పండితు రాండ్రలో పండితురాండ్రకు వేదమున కర్థమున్నదా లేదాయన్న మీమాంస యొకటి యవాంతరముగా వచ్చినది. అప్పుడు పండితురాం డ్రలో మూఁడువంతులు వేదమున కర్థమే లేదనియు, అర్థమున్నట్టు తామెప్పుడును పెద్దలవలన వినలేదనియు, అర్థమే యున్నపక్షమున జను లొక్కరైన నేల యభ్యసింపరనియు, అర్థము లేకపోవుటచేతనే వాని కాపూజ్యత వచ్చినదనియు, వాదించి యర్థములేనట్టే సిద్ధాంతముచేసిరి; ఒకవంతుమాత్ర మాకాలమునందు మనుష్యుల కెవ్వరికిని తెలియక పోయినను వేదముల కర్థమున్నదనియు, వేదముల కర్థమున్నదని తమ తాతముత్తాతలు తమతో చెప్పినట్టు తమ తాతలవలన చిన్నప్పుడు విన్నామనియు, వేదార్థములే శాస్త్రములని శాస్త్రములలో జెప్పఁబడి యున్నదనియు, వాదించిరి కాని యధికసంఖ్య గలవారిచేత వారివాదము పూర్వపక్షము చేయఁబడినది. ఆసభలో నవనాగరికులైన యొకతె లేచి నిలిచి దొరతనమువారు మనపూర్వగ్రంథములను సంపాదించుటకు ప్రయత్నము చేయుచున్నారనియు, ఒకపురాతన దేవాలయములో మూలఁబడియున్న జీర్ణతాళపత్ర పుస్తకముల కట్టను విప్పి శోధింపఁగా నందులో వేదమునకు వ్యాఖ్యానమొకటి కనఁబడినదనియు, వారు దానిని పరిశీలించి ముద్రింపించు చున్నారనియు, వేదమునకర్థము కలదనియు చెప్పెను. ఆమె మాటలు విద్వాంసురాండ్రెవ్వరును నమ్మక స్వదేశస్థుల కెవ్వరికిని దొరకనిపుస్తకము వారికి దొరకియుండదనియు, దొరకినను విద్వాంసురాండ్రకు కాని యర్థము వారికగునని నమ్మఁగూడదనియు దేవాలయములోని ప్రాఁతపుస్తకములలోనిదని చెప్పి యేదో యర్థమును కల్పించి ముద్రించు చున్నారనియు, ముద్రితగ్రంథమును ముట్టినను పాపము వచ్చునుగాన దానిని కొన్నవారిని చదివినవారిని బహిష్కారము

చేయుటకు శీఘ్రకాలములోనే గ్రామమునకు విజయము చేయఁబోయెడు జగద్గురువులను ప్రార్థింప వలయుననియు, ఐకకంఠ్యముగా నిశ్చయము చేసికొనిరి.

ఇట్లు సభలు జరుగుచుండఁగానే జగద్గురువులవారు తాము విచ్చేయుచున్నట్లు సభాపత్నులకు శ్రీముఖమును బంపిరి. శ్రీముఖము వెనుకనే శ్రీవారును గుఱ్ఱములతోను ఏనుఁగులతోను వాద్యములతోను విజయంచేసిరి. అప్పుడింటింటను భిక్షలు జరుగుట కారంభించినవి. ఉద్యోగములో నున్నవా రొక్కరొక్కరు మూఁడేసి నెలల జీతము పాదపూజ సమర్పించుకోవలసి వచ్చినది. అప్పుడింటింటను నాసికామహోత్సవములు జరగ మొదలు పెట్టెను. ఆ నాసికోత్సవములో మొట్టమొదట నాసహాధ్యాయుఁడైన భాఢీఫోడ్ యొక్క ముక్కు ముక్కలయ్యెను. ఇతర సమయములయందు పట్టుదల లేకపోయినను స్వాములవారు వచ్చినప్పుడు మన దేశమునందు బాల వితంతువుల శిరోజములు సహితము తీయించి వేయునట్లుగానే యా దేశమునందు జగద్గురువులు వచ్చినప్పుడు పత్నీకుల ముక్కులన్నియు కోసివేయుదురు. జగద్గురువులవా రక్కడనున్న కాలములో నొక సభచేసి యా సభకు నా యజమానురాలయిన ఫాంఢీభంగీగారినికూడ పిలిపించిరి. అప్పుడు పురుషవిద్యాభ్యాసముకూడదని యే శాస్త్రములలోఁ జెప్పఁబడియున్నదని ఫాంఢీభంగీగారు జగద్గురువులను ప్రశ్న వేసిరి. నిత్యమును భిక్ష లధికముగాఁ జేయుచుండుటవలన జగద్గురువులవారికి పిండివంటల నామము లేకాని పుస్తకముల నామములు రానందున, ఆ ప్రశ్న కుత్తరము చెప్పవలసినదని వారాస్థాన విద్వాంసురాండ్రయిన శిష్యురాండ్ర కాజ్ఞాపించిరి. ఆ మహావిద్వాంసురాండ్రును కొంచెముసేపాలోచించి తాము స్వస్థానమునకు పోయిన తరువాత మూలపీఠమువద్దనున్న యనాదిగ్రంథమును దీసి పుస్తకముల నామములను వెనుకనుండి పంపెదమని చెప్పి తప్పించుకొనిరి. త్రాగుఁబోతులకును,

మాంసభక్షకులకును, వ్యభిచారులకును వెలిలేక లోకాభివృద్ధి నిమిత్త మయి యత్నించుచున్న తమకు నిష్కారణముగా బహిష్కారము వేయుట యేమిన్యాయమని నాయజమానురాలు భయపడక జగద్గురువులవారి నడిగెను. అప్పుడు తత్స్థానపండితురాండ్రలో నొకవృద్ధాంగన యంగుకొని శాస్త్రోక్తప్రకారముగా నడచుకొనువారి నేల బహిష్కరింప వలయుననియు,

"మాఖే మాఘే మాఠే మాఢే
మాథే మామే మిమే మిమే "

అను శాస్త్రప్రమాణమునుబట్టి పయిపనులు చేసినవారు దోషులు కారనియు, సమాధానము చెప్పెను. ఆప్రమాణవచనమున కర్థమేమో సెలవియ్య వలసినదని నేను వేడుకొనఁగా, ఆమహాపండితురాలు నాయం దనుగ్రహించి, "మద్యము, మాంసము, మత్స్యము, ముద్ర, మైథునము, అను మకారములు మహాపాపనిరాకరములు" అని చెప్పెను. ఈయొక్క వచనముతోనే

"శ్లో. మద్యం మాంసంచ మత్స్యంచ ముద్రా మైథున మేవచ
మకారపంచకంచైవ మహాపాతక నాశనం "

అను ప్రాణితోషిణి గ్రంథములోని శ్లోకము నాకు స్మరణకువచ్చి రండీ శాస్త్రములన్నియు హిందూశాస్త్రములలోనుండియే తీసికొనఁబడినవనియు వారి వేదమును మనవేదశాఖయే యనియు నేను నిశ్చయము చేసితిని. అప్పుడు నీతికి విరుద్ధమయిన శాస్త్రమెట్లు ప్రమాణమగునని నాయజమానురా లావిద్వాంసురాలిని నిశ్శంకముగా నడిగెను. అందు మీఁద నామె యత్యాగ్రహావేశము కలదయి శాస్త్రతిరస్కారమును జేసినందునకయి మఱియొక బహిష్కారపత్రికను బంపెదనని భయపెట్టి, అట్టి నాస్తికురాలి ముఖముచూచిన పాపమువచ్చునని కోపపడి, ఈయనర్థమంతయు రాజకీయపాఠశాలలోఁ జదువుటవలన వచ్చి

నదిగనుక దొరతనమువారి బడికి పిల్లలను బంపువారికందఱికిని శిక్ష విధిం పవలయునని శ్రీజగద్గురువులవారితో మనవిచేసి, తత్క్షణము నాయజమానురాలిని గురుసాన్నిధ్యమునుండి గెంటించివేసెను. జగద్గురువులవారును ధనలక్ష్మిప్రియురాలగుటచేత శిష్యురాలి మాటనుబట్టి దొరతనమువారి పాఠశాలకు పిల్లలనుబంపువారందఱును బదిసువర్ణము లపరాధము చెల్లింపవలయుననియు, చెల్లించువఱకును గ్రామములోనివారెవ్వరును వారియిండ్లకు శుభాశుభకార్యములకు పోఁగూడదనియు, వెంటనే సభాపత్నులపేర శ్రీముఖములనుబంపిరి. అయినను సభాపత్నుల బాలికలు సహితము కొందఱు రాజభాషను చదువుకొనుచున్నవారగుటవలన వారాశ్రీముఖములనంతగా నాదరించినవారుకారు. ఇంతకును రంఢీనగరములో నాజగద్గురువులవారి శిష్యకుటుంబములన్నియు నూఱుమాత్రమే యున్నవి. అయినను తన్మతావలంబులుమాత్రమేమిక్కిలి చదువుకొన్నవారుగాను, ధనికులుగాను, పెల్లుబడికలవారుగాను వున్నారు. ఈజగద్గురుపీఠ స్థాపకురాలయిన శ్రీశ్రీశ్రీ ఆది జంఘాముంఘారంభాదేవిగారు పూర్వకాలమునం దెప్పుడో పదునాఱు మతములనుద్ధరించినందున తత్పీఠమునకు వచ్చిన వారికందఱికిని షోడశమతోద్ధారిణీబిరుదము పారంపర్యముగా వచ్చుచున్నది. అందుచేతనే యాపీఠమువారు జగద్గురువులమనియు తక్కిన సర్వమతములవారును తమకు శిష్యప్రాయులేయనియు చెప్పుకొందురు. ఆమతములపేరుల నన్నిటిని దెలుపుటవలన నాకు వృథాయాసమేకాని దానివలన మీకేమియు లాభముగలుగదు. ఇటువంటి బిరుదములా దేవివారికి మూఁడువేల మున్నూట ముప్పదిమూఁడు గలవు. ఆదేవిగారు షోడశమతముల నుద్ధరించినను, వానిలోనెల్లను జంఘామతమునుసర్వోత్తమమయినదని స్థాపించినారు. ఆమతసిద్ధాంతము లించుమించుగా మనదేశమునందలి శాక్తేయ మతసిద్ధాంతములను బోలియున్నవి. భేదమంతయు మనలోనున్న స్త్రీనిదీసివేసి వారు దానిస్థానమునఁ

బురుషుని బెట్టుకొన్నారు. అందులోను మద్యపానముగలదు; మాంసభక్షణము గలదు; సంభోగముగలదు; ముద్రలుగలవు. వీనినన్నిటిని బట్టి చూడఁగా వారు తమశాస్త్రమును మనయాగమతంత్రములనుండి దొంగిలించుకొన్నట్టు తోఁచుచున్నది. మనముద్రలలో నెల్లనుబ్రధానమైన "హ" అనుప్రాసాద ముద్రను శ్రీచక్రమునువారుతీసికొన్నందున వారుతమమతమునంతను మనపంచమామ్నాయమయిన తంత్రమునుండియే తస్కరించిరనుట నిశ్చయము. అప్పుడువచ్చిన యాజగద్గురువులవారికి ముప్పదిసంవత్సరముల వయస్సుగలదు; ఆదేవిగారు రూపముచేతను చక్కనివారనియే చెప్పవచ్చును; అమెప్రతిదినమును జంఘాపూజచేయుదురు. ఈయుపాసనముస్త్రీకి బదులుగా బురుషునిబెట్టినయెడల, సమస్త విషయములలోను మనదేశములో వీరు లనఁబడెడు మహాభక్తాగ్రేసరులు చేసెడి యుపాసనముతో సరిపోలునుగనుక మీకు తేటగా తెలియుటకయి మన దానినిక్కడ ప్రమాణవచనపూర్వకముగా కొంచెమువివరించెదను. శాక్తేయాచారములలోనిదయిన యిది వామాచారము; దీనినాచరించువారు కౌలికు లనఁబడుదురు. కౌలికులనగా నుత్తమకులీనులనియర్థము. ఈపదముచేతనే వీరిశ్రేష్ఠత్వము వెల్లడియగుచున్నను ప్రమాణవాదులయిన మీతృప్తికొఱకు పరమప్రమాణమయినశ్యామారహస్య తంత్రమునుండి వామాచారముయొక్కయు కౌలసిద్ధాంతముయొక్కయు సర్వోత్కృష్టతము స్థాపించు ప్రమాణముల నిందుదాహరించెదను:—

శ్లో. సర్వేభ్యశ్చోత్తమావేదా వేదేభ్యోవైష్ణవంపరం
వైష్ణవాదుత్తమంశైవం శైవాద్దక్షిణముత్తమం
దక్షిణాదుత్తమం వామంవామాత్సిద్ధాంతముత్తమం
సిద్ధాంతాదుత్తమంకౌలం కౌలాత్పరతరంనహి.

"అన్నిటిలోను వేదములుత్తమములు; వేదములకన్న వైష్ణవముత్తమము; వైష్ణవముకన్న శైవముత్తమము; శైవమునకన్న దక్షి

క్షాచారము త్తమము; దక్షిణాచారముకంటె వామాచారము త్తమము; వామాచారముకంటె సిద్ధాంతము త్తమము; సిద్ధాంతమునకంటె కౌలము త్తమము; కౌలమునకంటె శ్రేష్ఠతరమయినదిలేదు" అను ప్రమాణ వచనముల కర్థము. ఇప్పటి కౌలముయొక్క శ్రేష్ఠత్వము స్థాపనమయి యుండుట, కౌలాచారమును సప్రమాణముగా శక్తిశోధనతంత్రమునందుఁ జెప్పఁబడిన రీతిగాఁ గొంత వివరించెదను :—

శ్లో. నటీ కాపాలినీ వేశ్యా రజకీ నాపితాంగనా
బ్రాహ్మణీ శూద్రకన్యాచ తథాగోపాల కన్యకా
మాలాకారస్య కన్యాపి నవకన్యాః ప్రకీర్తితాః
ఏతాసుకాంచిదానీయ పూజయేచ్ఛక్తి కౌలికః.

*　　*　　*　　*

మహావిశాయా మానీయ నవకన్యాశ్చ భైరవాన్

*　　*　　*　　*

తదీయం మంత్రమాలిఖ్య తస్మిన్నామేవ పూజయేత్
శ్రీచక్రేస్థాపయేద్వామే కన్యాంభైరవవల్లభామ్.
ముక్తకేశాం వీతలజ్జాం సర్వాభరణభూషితామ్
ఆనందలీనహృదయాం సౌందర్యాతిమనోహరామ్
శోధయేచ్ఛుద్ధిమంత్రేణ సురానందామృతాంబుభిః.

*　　*　　*　　*

ఆనందతర్పితాం కాంతాం వీరః స్వానందవిగ్రహః
రతేన తర్పయేత్తత్ర శ్రీచక్రే వీరసంసది

*　　*　　*　　*

పీత్వా పీత్వా పునఃపీత్వా యావల్లుఠతిభూతలే
ఉత్థాయచ పునఃపీత్వా పునర్జన్మ నవిద్యతే.

మఱికొంత పచ్చిబూతుగా నుండునని కొన్ని ప్రమాణవచనములను వదలివేసినందుకు చదువరులు నన్ను మన్నింపవలెను. "నటియు, కాపాలినియు, వేశ్యయు, చాకలిదియు, మంగలిదియు, బ్రాహ్మణియు, శూద్రయు, గొల్లదియు, పూలుగూర్చునదియు, నవకన్యలనఁబడుదురు.

వీరిలో నొకతెను దీసికొనివచ్చి కౌలికుఁడు శక్తిపూజచేయవలెను. అర్థ రాత్రమునందు నవకన్యలను తెచ్చి........తత్సంబంధమైన మంత్రమును లిఖించి దానిని పూజింపవలెను. శ్రీచక్రమున వామభాగమునందు తలవిరియఁబోసికొన్నదియు దిసమొలదియు సర్వాభరణభూషితయు ఆనందలీనహృదయయు సౌందర్యాతిమనోహరయు అయిన యొకభైరవి కన్యను నిలువఁబెట్టి సురానందామృత జలముతో శుద్ధిమంత్రముచేత శుద్ధురాలిని చేయవలెను. ఆనందవిగ్రహుఁడయిన వీరుఁడు ఆనంద తర్పితురాలయిన యాకాంతను శ్రీచక్రమునందు రతిచేత తృప్తినొందించ వలెను. త్రాగి త్రాగి భూమిమీదపడువఱకును మరల త్రాగి లేచిమరల త్రాగి పునర్జన్మము లేనివాఁడగును” అని పయి ప్రమాణవచనముల తాత్పర్యము. ఈప్రకారముగానే యచ్చటి జగద్గురువులవారు నిశీథసమయమునందు శ్రీచక్రమునందు ప్రాసాదముద్రనుపూని యీశ్వరాత్మకముగా నొక యౌవనపురుషుని పూజించి సంభోగించి సురాపానముచేసి యానందపరవశు లగుచుండురఁట! మనదేశమునందువలెనే యాదేశమునందును శాస్త్రవిశ్వాసమును మతధర్మాచరణమును తక్కువగుటవలన జగద్గురువు లీమతధర్మమును స్వాచరణమువలనఁ జూపువఱకును దాసని జనులు మఱచిపోయినట్టే యున్నదిగాన, నేనున్న కాలములో రంఢీనగరమునం దీయాచారము కనఁబడనే లేదు. ఇది కలిమహిమయని గురువుల యభిప్రాయము.

ప్రాసాదమంత్ర మహిమయు మంత్రవిశ్వాసము లేని నవనాగరికులకుఁ దెలియక పోవచ్చునుగాన వారి యుపయోగము నిమిత్తమిందు సప్రమాణముగా కులార్ణవ తంత్రమునుండి తెలిపెదను. దీనిని బట్టియే నాది యప్రామాణికవాదము కాదనియు, సర్వజన సమాదరణీయమనియు, బుద్ధిమంతులు గ్రహింపవచ్చును.

శ్లో. శ్రీప్రాసాద పరామంత్ర మూర్ధ్వామ్నాయ ప్రతిష్ఠితమ్
ఆవయోః పరమాకారం యోవేత్తి సః శివః స్వయమ్.

శివాదిక్రిమిపర్యంతం ప్రాణినాం ప్రాణవర్తనాం
విశ్వాసోచ్ఛ్వాసరూపేణ మంత్రోయం వర్తతేప్రియే.

అని కేవల సదాశివుఁడే శ్రీమహాదేవికి "మనయిద్దఱ పరమాకార మయినట్టియు ఊర్ధ్వామ్నాయ (తంత్ర) ప్రతిష్ఠితమయినట్టియు శ్రీ ప్రాసాద పరామంత్రము నెవ్వఁ డెఱుఁగునో వాఁడు తానేశివుఁడు. ఓప్రియురాలా! శివాది క్రిమిపర్యంతమునుగల జీవజంతువులలో విశ్వాసోచ్ఛ్వాసరూపముచేత నీమంత్రము వర్తించుచున్నది" అని యుపదేశించియున్నాఁడు. "హ్సౌ" అనుప్రాసాద మంత్రములో హాకారము నిశ్వాస రూపమనియు, సకార ముచ్ఛ్వాస రూపమనియు తెలియవలెను. శాస్త్రప్రమాణము కలిగి యుండుటచేత మన పురుషులలో నిది సదాచారమేయయినను స్త్రీలలోమాత్ర మిదిదురాచారమని నేనుభావించెదను ; ఆ దేశమునం దేలాగుననో స్త్రీలు స్వతంత్రురాండ్రయి తమ కనుకూలముగా శాస్త్రములను తాఱుమాఱు చేసినందున, ఈయనర్థమంతయుపుట్టినది. ఆసంగతి పోనిచ్చి కథాంశమును వినుఁడు.

సభాపత్నులు శ్రీజగద్గురువులవారి యాజ్ఞ నంతగా మన్నించక పోవుటయు, అందుచేత మతధర్మము లాచరణములేక చెడిపోవలసినగతి సంభవించుటయు చూచి ఖేదపడి గంభీరంభీగారు జీర్ణమతోద్ధారణమునకును గురుభక్తి నిలుపుటకును సభచేసి పూర్వాచార శాస్త్రమహిమలను భూషించుచు, నవనాగరికురాండ్రను దూషించుచు, గొప్ప యుపన్యాసము చేసిరి. అది మిక్కిలి పెద్దదగుటవలన దానికడపటిభాగమునుమాత్ర మిందు తెలిఁగించెదను :—

"ఓమహాకాంతలారా! నాయుపన్యాసము విన్నారుగదా! ప్రజలెట్లు చెడిపోవుచున్నారో కన్నారుగదా! నవనాగరికురాండ్రవలన దేశమునకుఁ గలుగుచున్న యనర్థములను గనిపెట్టినారుగదా! వారిప్పుడు పురుషులకు విద్యకావలె ననుచున్నారు ; రేపు అపత్నీకుల

ముక్కులు కోయఁగూడ దందురు ; ఆపయిని పుణ్యపురుషుల నినుపపెట్టెలలో పెట్టి తాళము వేయఁగూడ దందురు ; అటుపిమ్మట వృద్ధపురుషులు పత్నులతో సహగమనము చేయఁగూడ దందురు ; కట్టకడపట అపత్నీకులయిన పురుషులు మరల వివాహమే చేసికొనవచ్చు నందురు. ఇంతకువచ్చినది మఱియెంతకైనను రాకమానదు. ఆదుష్టురాంద్ర ప్రయత్నాంకురములను వికసింపనియ్యక మనము మొగ్గలలోనే త్రుంచి వేయవలెను. దేశాచారము సంరక్షింపవలయును. శాస్త్రధర్మములను నిలుపవలెను. దేశమతాభిమానములను వహింపవలెను. ఆమూఢు రాంద్రుు శాస్త్రజ్ఞానము లేనివారయి బుద్ధివాదములు చేయుచున్నారు. శాస్త్రబద్ధులమయిన మనకు మనుష్యబుద్ధి ప్రమాణముకాదు. పయి మతసత్యములు శాస్త్రముచేతఁగాక మఱి యేబుద్ధివలనఁ దెలియును ? పాపాత్మురాంద్రయిన నవనాగరికురాంద్రు శాస్త్రప్రసిద్ధమై ద్వాదశ మహాపాతకములలోను ఘోరతమమైన పెండలపు దుంపకూరను రహస్యముగా నెవ్వరు నెఱుఁగకుండ తినుచున్నారఁట ! ఎంతఘోరకృత్యము చేయుచున్నారో చూచినారా ? చూచినట్లొక్కరును పలుక రేమి ? స్వపక్షస్థాపనము కొఱకును పరపక్ష నిరాకరణము కొఱకును కల్లలాడ వచ్చును. మతవిషయమున అసత్యదోషము లేదు. ఇదిసూక్ష్మధర్మము. నామాట నమ్ముఁడు. చూడకపోయినను మీరిప్పుడు చూచినట్లు చెప్పుచున్నారు. నాకిప్పుడు పరమసంతోషముగా నున్నది. మీరు నవనాగరిక బోధను నిర్మూలము చేయుటకును శ్రీజగద్గురువులవారి యధికారమును వ్యాపింపఁజేయుటకును దేశ మతాభిమానములు గలవారయి ప్రాణముల కాశపడక పోరాడుఁడు."

ఈయుపన్యాసమువలన జనుల మనస్సులన్నియు పూర్వాచార పక్షమున తిరిగిపోయినట్టు కానఁబడినవి. మఱుసటిదినము మొదలుకొని ప్రజలు నవనాగరికుల విషయమున ననేకాసత్యములను జెప్పుచు, అనేక

దోషారోపణములు చేయుచు, అనేకాపవాదములను వేయుచు, వారిని మూర్ఖమహాజనుల దృష్టియందు హాస్యాస్పదులనుగాఁ జేయనారంభించిరి. ఈపామర మహాజనాభిప్రాయ ప్రవాహము నరికట్టి మరలించుటకయి నాయజమానురాలును నేనునుగూడ పురుష స్వాతంత్ర్య విషయమున నుపన్యసింప నారంభించితిమి. నాయుపన్యాసముయొక్క పర్యవసానమును మీకు పయి ప్రకరణమునందుఁ జెప్పెదను.

ఎనిమిదవ ప్రకరణము

గంభీదంభీగారి యుపన్యాసమయిన మూఁడవనాఁడు "పురుష స్వాతంత్ర్యములనుగూర్చి సత్యరాజాచార్యు డుపన్యసించును గనుక పౌరస్త్రీ మహాజనులందఱును రాజకీయ పాఠశాలామందిరమునకు భానువారమునాఁడు ప్రాతఃకాలమున విజయం చేయఁ బ్రార్థింపఁ బడుచున్నారు" అని యొక ప్రకటన పత్రికను నా యజమానురాలయిన ఘాంఢీభంగీగారు పురజనుల కందరికిని బంపిరి. కాల వైపరీత్యమువలనఁ గలిగిన యీవిడ్డూరమును జూడవలయునని నాఁటి ప్రాతఃకాలమున పురమునందలి సుందరీ బృందమంతయు పాఠశాలామందిరమునకు దయచేసి సభ తీర్చియుండెను. ఆవచ్చినవారిలో దంఢీలంఢీగారును, గంభీదంభీగారును, వారి పరివారమును ముందుగా వేంచేసి యగ్రపీఠముల నలంకరించిరి. అల్లరిజరగకుండ కాపాడుటకయి మాయజమానురాలిగారి కోరికప్రకారముగాఁ గొందఱు రక్షక భటురాండ్రును వేత్రహస్తలై వచ్చిరి. ఉపన్యాసమయము సమీపించునప్పుడు నాయజమానురాలితోఁ గలిసి నేనచ్చటికిఁ బోవునప్పటికి పౌరస్త్రీమహాజనులు "వంటయింట మూలనడఁగి యుండక పురుషభూషణమైన లజ్జనువిడిచి మగవాఁడొకఁడు నేడు సభకువచ్చునఁట!" అని యొకతెయు, "ఊరక

సభకు వచ్చుట మాత్రమే కాదు సిగ్గువిడిచి యచ్చట స్త్రీలముందు తగుదునని ముచ్చటింపఁ బూనునఁట!" అని యింకొకతెయు, "కాలమహిమవలన నెట్టి వైపరీత్యములయినను పుట్టుచున్నవి!" అని మఱియొకతెయు, "తెగఁబడి పురుషుఁడు సభలో ప్రసంగింప వెడలుట దేశారిష్టము!" అని వేరొకతెయు, "ఇట్లు పురుషుల మాటలు సాగనిచ్చుట యవమానకరము!" అని యొండొకతెయు, తమలోఁ దాము ముక్కులమీఁద వ్రేళ్లు వేసికొని యద్భుతపడుచు చెప్పుకొను మాటలు మా చెవులఁ బడినవి. అంతట నుపన్యాససమయము సమీపించినందున సభవారిచే దుంఫీలంఫీగారగ్రాసనాసీనురాలుగాఁ జేయఁబడిరి. తరువాత నే నుపన్యసింప మొదలు పెట్టితిని:—

"ఓపుణ్యసతులారా! స్త్రీలకు వలెనే పురుషులకును భగవంతుఁడు బుద్ధినిదయచేసి యున్నాఁడు—"

పౌరమహాస్త్రీలు—లేదు లేదు. ఇది సర్వాబద్ధము స్వభావవిరుద్ధము. పురుషులకు బుద్ధి లేనే లేదు. స్త్రీలకు సేవచేసి బ్రదుకవలసిన పురుషులకు దేవుఁడు బుద్ధియిచ్చినాఁడనుట దైవదూషణము; శాస్త్రదూషణము.

"అమ్మలారా! నా మాటలు కొంచెము వినినతరువాత మీ యభిప్రాయమును జెప్పవచ్చును. కొంచెము శాంతివహింపుఁడు. ఈ దేశమునందు చదువు లేకపోవుటవలన పురుషులలో బుద్ధివికాసము కానరాకున్నను—"

పౌరమహిళాకాంతలు—(చెవులుమూసికొని) కటకటా! నేఁడెట్టి పాపపు మాటలు వినుచుంటిమి! పురుషులకఁట! చదువఁట! ఏమి యీ కలియుగప్రభావము! ఏమి యీ దుష్కాలమహిమ! చదివిన పురుషుని జూచినచో సచేలస్నానము చేయువలెనని శాస్త్రములు చెప్పు

చున్నవి. ఉన్నదుర్గుణములు చాలక పురుషులకు చదువుకూడ చెప్పించి మఱింతమతి చెఱుపవలెనుగా!

"అమ్మలారా! నావాక్యమును కడతేఱవినుఁడు. ఈదేశము నందు విద్య లేకపోవుట వలన పురుషులలో బుద్ధివికాసము కానరాకున్నను, ఈదేశమునందలి స్త్రీలకువలెనే మాదేశమునందు పురుషులకు విద్య చెప్పించుటచేత వారక్కడ బుద్ధిశాలులయి—"

పౌరమహాంగనలు—మీాది పాడుదేశము; పిశాచదేశము; రాక్షసదేశము; మీాపాపిష్ఠిదేశముమాట మాకుచెప్పకు; మీాదిపాపాత్ములుండెడు నరకభూమి.

"మీారు నన్ను దూషించినను దూషింపుఁడు. పరమపావనమైన మాదేశమును మాత్రము దూషింపకుఁడు, మాది మహర్షులుండిన పుణ్యభూమి; యజ్ఞాదులకు జన్మస్థానమయిన కర్మభూమి; మాదేశ మనంతములయిన మహిమల కాస్పదమయినది—కుండలోనుండి పుట్టిన యొక మహాపురుషుఁడు సముద్రమును పుడిసిటఁబట్టి త్రాగివేసినాఁడు; గాలికిపుట్టిన యొక మహాపురుషుఁడు సూర్యబింబమును పండని మ్రింగినాఁడు. రెల్లులోఁబుట్టిన యొక మహాపురుషుఁడు క్రౌంచ మహాపర్వతమునకు తూటుచేసినాఁడు—"

పౌరమహానారులు—చాలు; నోరుమూసికో. నీవసత్యవాదివి; నీవుదొంగవు; నీవు కల్లఱివి. దైవసృష్టిలో స్త్రీలకుండునుగాని పురుషుల కిట్టిమహిమ లెక్కడను నుండవు. నీవు శుంఠవు; త్రాగుబోతువు; ఉన్మత్తుఁడవు.

"ఓయగ్రాసనాసీనురాలా! వీరు నన్నిట్లు దూషించుచున్నారో చిత్తగించుచున్నారా?"

అగ్రాసనాసీనురాలు — ఓపౌరనారీమణులారా! ఒక్కనిమిష

మూరకుండుఁడు. ఓయుపన్యాసకా! నీవుపనికిమాలిన మీదేశవర్ణన మునుమాని చెప్పవలసినసంగతి చెప్పు.

"స్త్రీలకువలెనే పురుషులకును కొన్ని స్వాతంత్ర్యములు గలవు."

ఒకతె—ఏమియు లేవు.

ఇంకొకతె—వారికున్న స్వాతంత్ర్యమంతయు స్త్రీలకు దాస్యము చేయుట.

మఱియొకతె—పత్నీశుశ్రూష చేయుట.

వేఱొకతె—స్త్రీసేవ చేసికొనుచు మూలనడఁగియుండుట.

"నేనిచ్చటిపురుషులకు స్త్రీపరిచర్య ధర్మముకాదనను. శాకపాకములు జిహ్వాకింపుగాఁ జేయుటకు సహితము పురుషుఁడు చదువునేర్చి పాకశాస్త్రము నభ్యసింపవలయును గదా?"

పౌరమహాకామినులు—అక్కఱలేదు. అభ్యాసముచేతనే పాకముచేయు నేర్పుకలుగును. పురుషులకు స్వప్నములోను చదువన్నపేరు చెప్పఁగూడదు.

" అట్లనఁగూడదు. చదువుకొనకపోయినయెడల పురుషులు జ్ఞానహీనులయి పశుసమాను లగుదురుగదా?"

పౌర—పురుషులు చదువులేనప్పుడే పశువులు. కోతికి కొబ్బరికాయవలె వారికి చదువుగూడ నబ్బినపక్షమున, స్వభావదుష్టులయిన పురుషులు పశువులకన్నను తక్కువవారగుదురు. పురుషులకు జ్ఞానముతో పనిలేదు. పురుషులకు సమస్తధర్మములును సమస్తకర్మములునుసమస్తపుణ్యములును సమస్తవ్రతములును పత్నీసేవలోనే యిమిడియున్నవి. పత్నులయుచ్ఛిష్టభోజనమే పురుషులకు మోక్షసాధనము; పత్నుల పాదోదకపానమే పురుషులకు పాపవిమోచనము; పత్నుల చరణరజోధారణమే పురుషులకు సర్వసుఖదాయకము. పురుషులకు పత్నియొక్కతెయే

పరమదైవతము. పురుషులకు పత్నీసేవయొక్కటియే శాస్త్రవిహిత మయిన సనాతనధర్మము.

"ఓకాంతామతల్లులారా! తల్లులారా! న్యాయముకూడ నాలో చెప్పుడు. శాస్త్రము న్యాయవిరుద్ధముగా నున్నప్పుడు——"

గంభీదంభీ——అదిగో శాస్త్రదూషణ వచ్చుచున్నది. ఈపాపాత్ముడు శాస్త్రతిరస్కారము చేయుచున్నాడు. శాస్త్రములో నున్నదేదియు న్యాయవిరుద్ధముగాదు. నిత్యమును నూఱుకల్లలాడుమన్నను, వేయిహత్యలు చేయుమన్నను, లక్ష దొంగతనము లాచరించుమన్నను, శాస్త్రములో జెప్పియున్నయెడల నవియన్నియు పరమధర్మములగును. స్త్రీపుట్టువులారా! ఇట్లు కొఱగాని మగపుట్టువు పుట్టిన వ్యర్థుడొకడు శాస్త్రనింద చేయుచుండగా చెవులుపెట్టుకొని వినుచు నూరకున్నారేమి? మీశాస్త్రాభిమానము చచ్చిపోయినదా? మీరు స్త్రీ జన్మమెత్తలేదా?

ఒకతె——ఈపురుషకీటకమును జావగొట్టుండి.

ఇంకొకతె——శాస్త్రదూషణచేసిన వీనినాలుకను కోయుండి.

మఱియొకతె——సిగ్గులేక సభకు నడిచివచ్చిన వీనికాళ్లు విఱుగగొట్టుండి.

వేఱొకతె——పురుషవిద్యయని కాఱులఱచిన వీనిగొంతు పిసుకుండి.

ఈప్రకారముగా పలువురు పలువిధములుగానన్ను దూషించుచు పరిహాసించుచు నామీదపడి నాయజమానురాలు వారించుచున్నను నిలువక కొందఱు నెత్తిమీదను కొందఱు వీపుమీదను కొందఱు మొగముమీదను చేతులతోను మోచేతులతోను కాళ్ళతోను చరచియు పొడిచియు తన్నియు నన్ను ప్రాణావశిష్టుని జేసి విడిచిరి. రక్షకభటులారాండ్రాసందడిలో దండపాణులయి యమభటులవలె నన్ను రక్షింపవచ్చినట్లు నాచాపునకు వచ్చిరికాని వారిగుఱి యపూర్వమైన దగుట

చేతనో మఱియే హేతువు చేతనో వారివేత్రప్రహారము లన్నియు నా మీఁదనేకాని యల్లరిమూఁకమీఁద నొక్కటియు పడలేదు. కొంతసేపటికి నేను మూర్ఛిల్లితిని. రక్షకభటురాండ్రు నాకు శైత్యోపచారములు జేసి మూర్ఛ తెలిసిన తరువాతనన్ను ధర్మవైద్యశాలకు బండిమీఁదఁ గొనిపోయి యచ్చటి రాజకీయవైద్యురాండ్ర కొప్పగించిరి. నే నిరువది దినములు వారిచికిత్సలో నున్న తరువాత నేనులేచి భూమిమీఁద నడుగుపెట్టి కొంచెము తిరుగుట కారంభించితిని. రాజకీయోద్యోగిను లీదొమ్మిచేసిన వారిని పట్టుకొనవలసిన దని రక్షకభటురాండ్ర కాజ్ఞాపించినను, వారాదొమ్మిసమయమునం దచ్చటనుండి భయముచేత కన్నులు మిరుమిట్లుగొని చూడలేనివారై యందున నొక్కరినైనను పట్టుకోలేకపోయిరి. నేనువైద్యశాలలోనున్న దినములలో ప్రతిదినమును తప్పక ఫాంఢీభంగీగారువచ్చి నన్ను చూచిపోవుచుండిరి. వైద్యశాలాధికారిణియు నాయందు పుత్రవాత్సల్యము కలదై నాపథ్యపానములు స్వయముగా విచారించుచు మంచిమందుల నిచ్చుచువచ్చెను. ఆకాలములో ఫాంఢీభంగీగారి తల్లిగారును రెండుమూఁడు పర్యాయములు వైద్యశాలకువచ్చి నాక్షేమమును విచారించుచు, ఒకనాఁడు నన్నుఁజూచి "నీవిట్లు కానిదేశములో దిక్కుమాలిన పక్షివయి చచ్చుటకంటె సుఖముగా స్వదేశమునకుఁ బోయి హాయిగా నుండరాదా?" అని ప్రశ్న వేసెను. అప్పుడు మాయిరువురకు నిట్లు కొంతసంభాషణ జరిగినది :—

"అమ్మా నాకును స్వదేశమునకుఁ బోవలెననియే యున్నది."

"ఉన్నయెడల శీఘ్రముగాఁ బోరాదా?"

"పోవుటకు నాకు శక్తి లేదు. మాదేశమార్గము నేనెఱుఁగను."

"దారియెఱుఁగకుండ మీదేశమునుండి మాదేశమున కెట్లు వచ్చితివి?"

"గురుప్రభావముచేత."

"ఇప్పుడును మరలగురుప్రభావముచేతనే పొమ్ము."

"ఇప్పుడు దారిచూపుటకు మాగురువిక్కడ లేడు."

"గురువునై దారిచూపుటకు నేనిక్కడనున్నాను. నాయుపదేశము గైకొమ్ము. నీవుశీఘ్రముగా పోనియెడల, నిన్నిచ్చటివారు తప్పక చంపివేయుదురు."

అని నాకామె యొకమంత్ర ముపదేశించి యామంత్రమును మూడులక్షలు జపముచేసిన యెడల సిద్ధియగుననియు, అప్పుడామంత్ర ప్రభావముచేత కోరినదేశమునకుపోయి పాలవచ్చుననియు, చెప్పెను. కలదినములకు నేనుపూర్ణముగా స్వస్థుడనయి మరల నెప్పటియట్ల వీధిలో తిరుగ సాగితిని. తరువాత వైద్యశాలవారు నాకుబలమైన ఘాతకలిగినట్లు విముక్తిపత్రము నిచ్చిపంపివేసిరి. నేను మరలవచ్చి ఘాంఢీభంగిగారిలోపలఁ బ్రవేశించితిని. నేను వీధిలోనికి బయలువెడలునప్పు డెల్లను స్త్రీలు నన్ను వ్రేలితోఁజూపి యెగతాళిఁ జేయుచు, వీని నీసారిప్రాణములతో విడువగూడదని తమలోననుకొనుచు, నన్నుఁజూచి నవ్వసాగిరి. స్త్రీలకు స్వాతంత్ర్యమున్నయెడల నెట్టికీడులువచ్చునో కనిపెట్టితిరా? "నస్త్రీస్వాతంత్ర్యమర్హతి" యని చెప్పిన మనశాస్త్రకారుఁడు వెఱ్ఱివాఁడుకాఁడు. సామాన్యులు కనిపెట్టలేరుగాని సర్వజ్ఞులైన మనపూర్వులెంతటిబుద్ధిమంతులైన నౌదురు. మనదేశమునందు మాత్రము మనమెన్నఁడును పురుషనామము భూమిమీఁద నున్నంతవరకు స్త్రీలకు స్వాతంత్ర్య మణుమాత్రము రానియ్యఁగూడదు.

అప్పుడు నా కాదేశమువిడిచి శీఘ్రముగా పోవలెనన్న బుద్ధి పుట్టినది. ఇట్లుచెప్పఁగానే మీరు నన్నా దేశమునందలి యాఁడువారికి వెఱచి పాఱిపోవుచున్న భీరునిగా భావింతురేమో! మీరట్లెంతమాత్రమును తలఁపఁగూడదు. మహాభారత యోధుల జన్మభూమియైన భరత

ఖండమునందుఁ బుట్టి, యందులోను ముఖ్యముగా పితికికళంకలేని బ్రాహ్మణకులమునం దుద్భవించిన నాకు పౌరుషము కొఱఁతపడునా? మువ్వాటికిని పడదు. సమయమువచ్చినయెడల నేను ప్రాణములను తృణప్రాయముగా విడువఁగలను. అయినను నేనాదేశములో మృతుఁడ నయ్యెడుపక్షమున నాకు వీరస్వర్గము సిద్ధమేయయినను, మీకీవార్తలు చెప్పి మిమ్మానందింపఁజేయువారు మఱియొకరు దొరకరని మీమీఁది యవ్యాజానుగ్రహముచేతనే నేను కరస్థమైన యింద్రుని యర్ధాసనమును రంభాసంభోగమును మానుకొన్నానుగాని మఱియొక కారణముచేతఁ గాదు. నానిమిత్తమయి కష్టపడుచున్న ఫాంఢీభంగీగారిని విడిచి కృతఘ్నుఁడనయి స్వార్థపరత్వముచేత పోవుచున్నాఁడననియు మీరనుకొనఁ గూడదు. నామూలమున ఫాంఢీభంగీగారికి విపత్తులువచ్చినమాట సత్యమే. ఆయాపదలను దలఁచియే నేను తమదేశమునుండి వెడలిపోయినయెడల తనపుత్రికకు కష్టములు తొలఁగునని ఫాంఢీభంగీగారి మాత నాకామంత్రము నుపదేశించినదిగాని నాయందలి మీయొక్కనిర్వ్యాజానుగ్రహముచేతనే కాదు. ఆమాటపోనిండు. నే నాదేశమును విడువ యత్నించుట కింకొక ముఖ్యకారణముకూడఁ గలదు. హిందువులు దేశాటనముచేసి క్రొత్తదేశములను కనిపెట్టువారు కారనియు, నూతనముగా శోధించి చరిత్రములను వ్రాయ సమర్థులు కారనియు, పశ్చిమఖండవాసులు మనమీఁద రెండునిందలు మోపియున్నారు. ఈరెండు నిందలను కల్లచేసి మనదేశమునకు ఖ్యాతి తెప్పించవలెనన్న సచ్చింతతో నాయమూల్యములైన ప్రాణముల నాపాడుదేశమునకు బలిపెట్టక లేచిపోయినాఁడను. నేను గనిపెట్టిన యీదేశములను, నేనువ్రాసిన యీచరిత్రమును, విన్నవారును కన్నవారును హిందువులయం దీకముందీ రెండునిందల నారోపింప నవకాశము లేనివారయి హిందువు లెంతటికైన సమర్థులేయని యొప్పుకొని మనలను వేయినోళ్ళ శ్లాఘించి

పూజింపవలసినవా రగుదురుగదా ? ఓచదువరులారా ! మన దేశమునకు నేను సంపాదించిన యీకీర్తితో మీరు కొంతకాలమువఱకును తృప్తి పొందియుందురు.

పరదేశయాత్ర త్వరితముగా నెరవేర్చవలెనన్న బుద్ధితో నే నొంటిగా రంఢీనగర ప్రాంతమునందలి యరణ్యమునకుం బోయి నాయజమానురాలితల్లి యుపదేశించిన మంత్రమును పునశ్చరణము చేయుచుండఁగా, ఒక సిద్ధుఁడాకస్మికముగా నాకాశమునుండిదిగి నాయెదుట నిలిచెను. నేనామహాత్మునకు భక్తిపూర్వకముగా నమస్కారముచేసి చేతులుజోడించుకొని నిలువఁబడితిని. ఆసిద్ధాగ్రగణ్యుఁడు నాయందు కారణకరుణ గలవాఁడయి, పూర్వము ప్రవరాఖ్యునికాలికి పసరు రాచిన సిద్ధేంద్రుఁడను తానేయనియు, మంత్రసిద్ధి చిరకాలమునకుఁగాని కాదని దివ్యజ్ఞానముచే నెఱిఁగి నాకాపసరియ్యవచ్చితిననియు, చెప్పి యామూలికపేరుకూడ నాకనుగ్రహించి యదృశ్యుఁడయ్యెను. ఆయోషధిపేరు దుత్తూరవర్ణి. దానియాకులు నల్లయుమ్మెత్తాకులవలె నుండును. పువ్వులు కొండతంగేడు పువ్వులవలెనుండును. కాడలు కలువకాడలువలె నుండును. ఆచెట్టు సమూలముగాఁ దెచ్చినూఱి పసరుదీసి కాలికి రాచుకొన్నయెడల మనము కోరినచోటికెల్లను మనోవేగమునఁ బోవచ్చును. ఈచెట్లు విశాఖపట్టణములోని యల్లికొండమీఁదఁ గావలసినన్నియున్నవి. నేనాచెట్టుపసరుకాలికిపూసికొని లంకాద్వీపమునకుఁ బోవలెనని మనస్సులో సంకల్పించుకొనఁగానే క్షణకాలములో నేనా లంకను జేరితిని. ఈప్రయాణకథ మొదలగు వానినిగూర్చి మీకు ముందు తెలిపెదను. నేను బయలుదేఱిన దినముతో రంఢీదేశమునందు మూఁడుసంవత్సరముల రెండుమాసముల పందొమ్మిదిదినములుంటిని.

ప్రథమభాగము సంపూర్ణము.

సత్యరాజాపూర్వదేశ యాత్రలు.

ద్వితీయ భాగము

లంకాద్వీపము

By

K. VEERESALINGAM

సత్యరాజా పూర్వదేశయాత్రలు.

ద్వితీయభాగము

లంకాద్వీపము.

మొదటి ప్రకరణము.

ఆఁడుమళయాళములో నాకు సిద్ధుఁ డనుగ్రహించిన పసరు యొక్క మహిమచేత నడవవలసిన ప్రయాసములేక మనోవేగమున గగనమార్గమునఁ బోయి క్షణకాలములో నేను లంకాద్వీపమున వాలితినని చెప్పియున్నానుగదా! హనుమద్దేవుని తరువాత నీకలికాలములో మన పెద్దలెవ్వరును పురాణములలోఁదక్క దర్శింపనోచుకోని లంకాద్వీపమును వాయుపథమునఁ బోయి చేరఁ గలుగుటకు మన భరతఖండవాసులలో నెల్ల నేనే ప్రథముఁడ నగుటచేత, ఇంతటి ఘన కార్యమును నిర్వహించిన యీయుత్తమోత్తమదినమును మహాపుణ్య దినమును గా భావించి యేఁటేట మీ రుత్సవముచేసికోక మానరన్న దృఢవిశ్వాసమునుబట్టి నేనక్కడ నడుగిడినదినమును మీకు సరిగా త్రుటిలవలతో చెప్పుచున్నాను. సావధానచిత్తులరై గ్రహింపుఁడు. నే నాదేశములో కుడికాలు మోపినపుణ్యకాలము హూణశకము ౧౮౮౩ వ సంవత్సరము మార్చినెల ౨౩ వ తేదీ మధ్యాహ్నము మూఁడుగంటల రెండుమినిట్లు నాలుగుసెకనుల ముప్పాతికమీఁద మోఁడువీసములకాలము. నేనాదేశమునందు వాలెడునప్పుడు సహితము మనదేశమందలి కాలజ్ఞులు తప్పుపట్టుట కవకాశములేకుండ

త్రోవలోనే మొదమకాలుముడుచుకొని కుడికాలొక్కటియే భూమి మీఁదఁ బెట్టినాను. హూణపంచాంగములు లేని యీ దేశములో సంవత్సరమును మాసమును తిథియు సరిగా నెట్లు తెలిసికోఁ గలిగితి వని సూక్ష్మబుద్ధి లేనివారు కొంద రడుగవచ్చును. ఆఁడుమళయాళ దేశములో మూఁడు సంవత్సరముల రెండుమాసముల పందొమ్మిది దినము లుండుటచేత దానినిబట్టి లెక్కవేసి చూడఁగా, నేనక్కడ ప్రవేశించినదినము సరిగా నేనిప్పుడు చెప్పినదే యయినట్లు తేలినది. అంతేకాక లంకానగరమునందు జ్యోతిశ్శాస్త్ర విద్వాంసు లనేకు లున్నందున వారి నాశ్రయించి తరువాత కొంతకాలమునకు వారిచేత చేయించిన లెక్కను బట్టికూడ రెండుమూఁడుదినము లెక్కువ తక్కు వగా నేను జెప్పిన తిథి సరియైనట్టు సిద్ధాంతమయినది. ఆ రెండుమూఁడు దినముల వ్యత్యాసమును లంకాద్వీపమునకును మనదేశమునకును గల కాలవ్యత్యాసమువలనను జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంత భేదములవలనను వచ్చినదగుటచేత మీ రాయల్ప భేదమును పాటింపక కర్మానుష్ఠాన మునకు నేను చెప్పిన దినమే సిద్ధాంతము చేసికొనుఁడు. శాలివాహన శకాది హిందూశకముల నన్నింటిని విడిచిపెట్టి హూణశకప్రకార ముగా సంవత్సర పరిగణన మేలచేసితివని కొందఱుబుద్ధిమంతులు శంక చేయవచ్చును. దానికిని సమాధానమువినుఁడు. ఇప్పుడు మన భరత ఖండమునం దంతటను వ్యాపించియున్న యింగ్లీషుపాఠశాలల మహా త్త్వమువలన ముఖ్య పట్టణములయం దెల్లవారును తెలుఁగు సంవత్సర ములును తెలుఁగు తిథులును మఱచి యున్నారనియు, ఇప్పు డించు మించుగా కలినిషిద్ధముగా నంగీకరింపఁబడుచున్న సంధ్యావందనమును జేయుచుండను లక్కడక్కడఁ గొందఱున్నను వారుసహితము " అస్మిన్ వర్తమాన వ్యావహారిక హూణమానేన ౧౮౮౩ సంవత్సరే, మార్చిమాసే ౨౩ తిథౌ " అని సంధ్యావందనములో నింగ్లీషుతిథు

లనే వాడుచున్నారనియు, నేనక్కడి జ్యోతిష్కులవలననే యెఱిఁగిన వాఁడ నగుటచేత మీకు సుబోధము కాఁటకయి యింగ్లీషు తిథులను వాడితినేకాని నాకు తెలియకకాదు. ఈకలికాలమునందు సహితము జ్యోతిషమిట్లు ప్రత్యక్ష నిదర్శనముగా నున్నదికదా! లంకాద్వీపము నందు జ్యోతిశ్శాస్త్రమే ప్రబలియుండని పక్షమున ద్వీపాంతరమునం దేకాకినయియున్న నేను దూరదేశమునందలి మిత్రస్థితిగతుల నెఱుఁగక తిథి మాస సంవత్సరాదులను మీకు దురవగాహము లగునట్లు వ్రా స్తున్యమాన ప్రకారముగా తెలిపియుందును. నాకింతటి దివ్యజ్ఞానము ప్రసాదించిన యోజ్యోతిశ్శాస్త్రరాజమా! నీకు పదివేల నమస్కార ములు. పశ్చిమ ఖండమునుండి హూణులు తెచ్చి విడుచుటచేత నిప్పుడు భరతఖండమునం దెల్ల యెడలను పిశాచములవలె సంచరించుచున్న ప్రకృతిశాస్త్రములకు భయపడక నీవ మాదేశము నెప్పుడును విడు వక మావారి హృదయపీఠముల నధిష్ఠించి రాజ్యము చేయుచుండుము. సంధ్యావందన విసర్జనకథనముచేత శాస్త్రోల్లంఘనము చేసినట్లు పాఠ కులు భావింతురన్న భీతిచేత జ్యోతిశ్శాస్త్రమునుబట్టి నేనెఱిఁగిన ఈసత్యమును మనవారు కొందఱు పయికొప్పుకోక పోయినను, మన స్సులలో నయిన సత్యమును గ్రహించి జ్యోతిషమును మునుపటికంటె నెక్కువగా గౌరవింతురని నమ్ముచున్నాను.

నేను లంకాద్వీపమును జేరినతరువాత నెటుపోదునాయని యాలోచించుచు క్షణకాల మొక మఱ్ఱిచెట్టు నీడను గూర్చున్నాను. మఱ్ఱిచెట్టని చెప్పఁగానే యది మనదేశపుమఱ్ఱిచెట్టు వంటిదే యని మీరనుకోవచ్చును. కాని యది యాకారమునందు మన మఱ్ఱిచె ట్లనే పోలినను పరిమాణమునందు మాత్రము శతగుణము లధికమైన దిగా నున్నది. దాని యాకులు మనదేశమునందలి తామరాకు లంత లేసి యున్నవి; దానిపండ్లు పెద్దతాటికాయలంతలేసి యున్నవి; చిన్న

యాకులు నాకౌఁగిటి కడగినవికావు; కొమ్మలారంభమైన మ్రానిప్రకాండముయొక్క యెత్తినూఱుఅడుగుల కంటె హెచ్చుగానున్నది; మ్రానియొక్క కైవారము సరిగా కొలవలేదుగాని నూఱుఅడుగులకంటె నెక్కువగానే యున్నట్టు తోఁచినది; కొమ్మలు రెండుమూఁడు యోజనములదూరము వ్యాపించియున్నవి. చెట్టెంతయెత్తుండునోయని యాకాశమువంకఁ జూచితినిగాని నాదృష్టి వ్యాపించినతవఱకుఁ కొన కనఁబడలేదు. పయివంకఁ జూచుచుండఁగా నొకకాకి కొమ్మలలోఁ గూరుమండి కావుమని కూసినది. ఉరుమువలెనున్న దానికూత వినఁబడఁగానే నాగుండెలు పగిలిపోయినవి; దాని రూపమును జూచినను నాభయము తక్కువకాలేదు. అది రూపమునందు గేదెదూడంత యున్నది. దానినిజూచి యేపక్షినన్నెగ నెత్తుకొనిపోవునోయని భయపడి ప్రాణరక్షణార్థమయి యొక యూడచాటునకుఁ బోయితిని. ఆవంక చూడఁగానే యూడమీఁదఁ బ్రాఁకుచు రెండు కండచీమలు నాకంటఁబడినవి. అవి మనదేశమునందలి యెలుకలంతలేసి యున్నవి. అవి కుట్టినపక్షమున యేనుఁగువంటి దృఢకాయుఁడు సహితము నిమిషములో పీనుఁగగుటకు సందేహముండదు. శివునాజ్ఞలేనిది చీమకుట్టదన్న లోకోక్తి యథార్థముగా నేను సమీపమునకుఁ బోయినను నన్నొక చీమయు కుట్టలేదు. అయినను వానిదర్శనమువలన నైనభీతిచేతనే నాదేహమంతయు గాలిలోపెట్టిన దీపమువలె కంపింప మొదలుపెట్టినది. అప్పటి నాదురవస్థ నేమని చెప్పుకోను! దుత్తూరపర్ణి పసరు కొంచె మక్కడ దొరకినపక్షమున మరల కాలికి రాచుకొని శీఘ్రముగా స్వదేశముచేరి ప్రాణరక్షణము చేసికోవలెనన్న బుద్ధి పుట్టినది. నే నేవైపునఁ జూడ్కినిగిడ్చినను దుత్తూరపర్ణి యొక్కమొక్కయినను చుట్టుపట్ల నెక్కడను చూపుమేర దూరములో నాదృష్టికి గోచరముగాలేదు. అప్పుడు మనపూర్వులు మహాబుద్ధిమంతులయి దూర

దేశయాత్రలు నిషేధించిన దూరదృష్టియొక్క మహిమ నామనస్సు నకు బోధపడి వారిసర్వజ్ఞత స్పష్టపడినది. ఆహా! మనపూర్వులను బోలిన ధీమంతు లిప్పుడున్న వారిలోను ముందు పుట్టఁబోవువారిలోను కూడ నుండరు. అప్పుడు మనపెద్దలబుద్ధిని మెచ్చుకొనుచు వారి యందు ప్రాజ్ఞతాబుద్ధి కలవాఁడనయి నాభాగ్యమింతేయని యెంచు కొని పెద్దలు నిషేధించిన ద్వీపాంతరయానమునకు పూనినపాపఫల మనుభవింపక తీఱదని నిశ్చయము చేసికొని, వడవడ వడఁకుచు ప్రాణ ములమీఁది యాశ వదలుకొని ఈశ్వరనామస్మరణము చేసికొనుచు చెట్టుక్రింద నిలువఁబడి యుంటిని. ఇట్లుండఁగా గాలిచేత మఱ్ఱిపండొ కటి నాకాలిసమీపమున రాలి కుండపగిలినట్లు బళ్ళున పగిలినది. ఈశ్వరకటాక్షముచేత పండు కొంచెము దూరముగా పడినదికాని నానెత్తిమీఁదనే పడినపక్షమున తల రెండు వ్రక్కలయి మీఁకీవృత్తాం తమును చెప్పువారు లేక నేనీపాటికి స్వర్గలోకమున ప్రాఁతికాపునయి యుండియుందును. ఈనాయాపదల కన్నిటికిని హూణులు చేసిన భూగోళశాస్త్రము మూలము. వారిశాస్త్రములను వేనిని నమ్మనివాఁ డనయినను వారు దేశములను తిరిగి చూచివచ్చి సత్యము వ్రాసినా రన్న విశ్వాసముచేత లంక యనఁగా నాకుచెప్పినట్లు సింహళద్వీపము నియు, అక్కడ మనవంటి మనుష్యులే యున్నారనియు, వారు వ్రాసిన వ్రాఁతలు నమ్మి భ్రమపడి మోసపోయి యీయాపదలను తెచ్చుకొ న్నాను. కాని సత్యమునకు లంకయనఁగా సింహళద్వీపముకాదు సుండీ. అదివేఱు; ఇదివేఱు. ఈరెంటికినిగల భేదమునుగూర్చి మీకు ముందు ప్రకరణమునందుఁ దెలిపెదను. మహారణ్యమధ్యమున నేనిట్లు భయభ్రాంతుఁడనయి యున్న సమయములో గోరుచుట్టుమీఁద రోకటి పోటు పడ్డట్లు మఱియొకవిపత్తుకూడ సంప్రాప్తమైనది. దిగ్భ్రమనొంది నేను దిక్కులు చూచుచుండగా నిరువదిముప్పది యడుగుల యెత్తు

గల నల్లని దిగంబరపురుషవిగ్రహ మొకటి నావంక నడిచి రా నారంభించెను. ఆ ఘోరరూపము నాకంటఁబడఁగానే పురాణములలో వర్ణింపబడిన రాక్షసుల రూపములును కథలును స్మరణకువచ్చి యది తప్పక రాక్షసదేశమని ఆక్రూర రాక్షసుని నాఁటిసాయంకాల భోజనమునకు నేనే ప్రథమకబళము నగుదుననియు తోఁచి నామనస్సులో నానావిధములైన యూహలుత్పన్నములు కానారంభించినవి. నేను కన్నులెత్తియా వికృతవిగ్రహమువంకఁజూచునప్పటికి ముందుగా పెద్దగోడుగంతయున్న యాభీకరముఖమునందు నిప్పుబంతులవలెనున్న వెలగపండ్లంతలేసి మిడిగ్రుడ్లు రెండు నిప్పులుగ్రక్కుచుఁ గానఁబడినవి ; అటుతరువాత మొసలినోరంత నోటిలో పులిగోళ్ళను మించియున్న తెల్లని వ్రేలెడేసిమునిపండ్లు భయంకరముగా గానఁబడి నాదృష్టిని మిఱుమిట్లు కొల్పినవి. అంతట నే నాఘోరాకారమును జూడలేక కన్నులు మూసికొన్నాను. కాటుక కొండవలె నడచివచ్చుచున్న యావిగ్రహము సమీపింపఁగానే నాదేహము నిలువునచెమర్చి కంపమెత్తినది ; నాలుకతడఁబడి నోట మాట రాకపోయినది ; భయపడి ప్రాణములెక్కడకు లేచిపోయినవోకాని దేహస్మృతి సహితము తప్పిపోయినది. ఆ క్షణముననే నేను మూర్ఛలోమునిఁగి శవమువలెనయి మొదలునఱికిన వృక్షమువలె క్రిందపడిపోయినాను. అటుపిమ్మట నక్కడ నేమిజరగినదో నాకు తెలియదు.

నాప్రాణము లెంతసేపటికి మరల వచ్చి నాబొందిలో చేరికొన్నవో నేను నిశ్చయముగా చెప్పలేనుగాని యవి చేరినపిమ్మట నేను కన్నులువిచ్చి చూచునప్పటికి నేను మునుపున్నచోట లేక భూమి కిరువదియడుగుల యెత్తున చెట్టుక్రింద నాకగపడిన రాక్షసునియొక్క యొకయఱచేతిలో నున్నాను. వానియొక్క రెండవచేతి వ్రేళ్ళు రెండు నానడుమును చుట్టుకొనియున్నవి. నాతొడలకంటెను నెక్కువలావుగా

మున్న యావ్రేళ్ళనడుమ నడకొత్తులోని పోకలాగున నిఱుకుకొని బాధపడుచు నయివంకఁ జూచునప్పటికి వానిముఖముప్రక్క సమీపమున నాకు మఱింత స్పష్టముగాఁ గానఁబడినది. తెఱచియున్న వాని నోరు పర్వతగుహావలె నున్నది; నాలుక గుహాలోనుండి పయికివెడలుచున్న కొండచిలువవలెనున్నది; దంతములు కొండ చిలువను పట్టుకొనుటకయి చాలుపుగావచ్చి ముక్కులుచాచి క్రిందను మీఁదను గుహాముఖమున నిలుచున్న గరుడపక్షులవలె నున్నవి. ఆస్థితిచూచి నన్ను నా రాక్షసుఁడు గుటుక్కున మ్రింగుటకయి నోర వేసికొనఁ బోవుచున్నా' డని భావించి, ఆక్రూరకృత్యమును చూడలేక మొగము వెనుక ప్రక్కకు త్రిప్పుకొన్నాను. అట్లు మొగము త్రిప్పు కొనఁగానే ముల్లుపుచ్చి కొఱ్ఱుడచినట్లు మొంటికంటెను ఘోరతరమైన వికృతరూపమొకటి నాకన్నులను వెఱపుగొలుపుచు నావెనుకతట్టున నిలువఁబడియున్నది. ఈక్రొత్తవిగ్రహము నాకంటఁబడఁగానే నన్ను చేతిలోఁ బెట్టుకొనియున్న యారాక్షసవిగ్రహము దానిముందు కేవలశిశుప్రాయమయినది. మొదటి రాక్షసవిగ్రహ మీనూతన రాక్షసవిగ్రహము మొలవద్దకయినను రాలేదు. మొదటి విగ్రహముకంటె మూఁడంతలున్న యీవిగ్రహ మెంతపెద్దదిగా నుండునో దీనిని చదివెడివారే యూహించుకోవచ్చును. సమస్తావయవములును మొదటివిగ్రహమునకున్న దానికంటె మూఁడేసిరెట్లున్నవి. ఆవిగ్రహముయొక్క మొగము చూడవలెనని నేను తలయెత్తితినిగాని దేవాలయములోని గాలిగోపురముయొక్క శిఖరమువలె నున్న యాతనిశిరస్సు తిన్నగా కంటికి కనఁబడినదిగాదు. అడవిపందియొక్క వెన్నుమీఁది నిడుదవెంట్రుకలవలె నున్న యాతని కడుపుమీఁద నూగారు నడుమ నాదృష్టి కడ్డమువచ్చి బెదరింపఁగా క్షణకాలము తొలఁగిపోయిన భయదేవత మరలవచ్చి నాహృదయములోఁ బ్రవేశించి నాకన్నులను మూఁతవేసినది; అంగ

ముల నల్లలనాడించినది ; మొగమును వెలవెలఁ బాఱించినది; ప్రాణము
లను బాఱఁద్రోలి శరీరమునంతను మరల వివశముచేసినది. ఇట్లు
కొంతసేపు మరలమూర్ఛపోయి రెండవసారి తెలివి తెచ్చుకొని కన్నులు
విచ్చి చూచునప్పటికి నేను మొదట ననుకొన్నట్లుగా పయికి పిన్న
రాక్షసుని నోటిలోనికిఁబోక క్రిందికి భూమిమీఁదికి వచ్చియున్నాను.
అప్పుడు భూమిమీఁదనున్న నన్నాయిరువురు రాక్షసులును మోకాళ్ళ
మీఁద గూరుచుండి వంగి నాయవయవములను శోధించి చూచుచు
న్నారు. ఆసమయమునందు నేను కదలి భూమిమీఁద నడువనారంభిం
పఁగా వారు సంతోషించి తమలోతామేమో చెప్పుకొని నన్ను మరల
చేతులతోఁబట్టి మనదేశమునందు పిల్లలు పక్షిపిల్లలను బుట్టలలోఁ
బెట్టుకొని తీసికొనిపోవునట్లు నన్ను తమ బుట్టలలోఁ బెట్టుకొని మఱి
యొక యింటికిఁ గొనిపోయి వాకిట బల్లమీఁదఁ గూరుచుండి చదువు
కొనుచున్న మఱియొక రాక్షసుని జూచి నమస్కరించి యాతనితో
నేమేమోచెప్పి మెల్లగా నన్నాతని బల్లమీఁదఁ బెట్టిరి. ఆతఁడును
నన్ను మొట్టమొదట తన చేతిలోనున్న పుస్తకముతో మెల్లగా కద
ల్చిచూచి, కొంతసేపు నా మొగమువంకను చేతులవంకను వంగిచూచి
యాశ్చర్యపడి, పురుగును కఱచిపోవునేమోయని భయపడి మనము
నేర్పుతో పట్టుకొనునట్లు మెల్లగా తనచేయి నా వెనుకకుఁ బోనిచ్చి
సాహసించి చటుక్కున ముందఱి వ్రేళ్ళతో నానడుము పట్టుకొని
పయికెత్తి, వెల్లవెలికిలఁబట్టి మొగముచేరువను బెట్టుకొని కొంత
సేపు నన్ను నిదానించిచూచి చిఱునవ్వునవ్వి, నన్ను మెల్లగా మరల
బల్లమీఁదఁ బెట్టెను. కఱుతునో కుట్టుదునో యన్న భయముచేత
నన్నతఁడు గట్టిగా పట్టుకొన్నందున వ్రేళ్ళయొత్తుడుచేత నానడుము
నలిగి తరువాత మూఁడు దినములవఱకును నా నడుమునొప్పి పోయి
నదికాదు.

నన్ను మొట్టమొదట మఱ్ఱిచెట్టుక్రిందచూచినవాఁడు నాలుగేండ్ల ప్రాయముగల బాలుఁడు. బాలుఁడైన హేతువుచేతనే యాపిల్లవాఁడు దిగంబరుఁడుగా నున్నాఁడుగాని యీలంకలోని కాఁపురులందఱును దేశ మొలవారు కారు. అక్కడ పెద్దవాండ్రందఱును మనవలెనే తమకు తగిన వస్త్రములను ధరించుకొందురు. ఆబాలుఁడాడుకొనుటకయి యూరివెలుపలనున్న మఱ్ఱిచెట్టువద్దకువచ్చి నన్నుచూచి మూర్ఛపోయి యున్నప్పుడు పసివాఁడగుటచేత నన్ను నిర్భయముగా పిల్లికూనవలె తన యింటికిఁ బట్టుకొనిపోయి నేను మూర్ఛతేఱునప్పటికి నన్ను తన తండ్రికి చూపుచుండెను. అతఁడును నన్నాశ్చర్యపడిచూచి మనుష్య రూపమున నంతచిన్న జంతువున్నవార్త యెప్పుడును విననందున, ఇటువంటి యద్భుతవస్తువును గొనిపోయి తన యజమానునికి కానుకిచ్చుట యుక్తమనిభావించి తక్షణమేకొనిపోయి యాతనికి సమర్పించెను. అతఁడును నారూపమును జూచి వింతపడి, అంతచిన్నదిగా నున్నను మనుష్యరూపమగుటకు సందేహము లేదని నిశ్చయించి అయినను లంకాద్వీపము జ్యోతిష భూమియగుట చేత జ్యోతిష్కుల నడిగి మఱి సిద్ధాంతముచేయుట మంచిదని యెంచి, జ్యోస్యుల నిమిత్తము సేవకులను బంపెను. ముహూర్తగ్రంథములను జాతక గ్రంథములను, సాముద్రిక గ్రంథములను చేతఁబట్టుకొని కొంచెము సేపటికి నలుగురు సిద్ధాంతు లక్కడకువచ్చిరి. అప్పు డతఁడు నన్నా కాలజ్ఞులకు చూపఁగా వారు నేనేజాతి జంతువునో నిర్ధారణము చేయుటకై గ్రహగతులను విచారించియు శ్వాసలు పరీక్షించియు శకునములను జూచియు గణనచేయుట కారంభించిరి. ఆజ్యోతిష్కులలో నిద్దఱు మంచి పురాణవేత్తలు. మనదేశము నందువలెనే యాదేశమునందును పురాణములున్నవి. వారిలోనొకపురాణ వేత్త కొంచెముసేపాలోచించి యొకచోట కలియుగములో నేల ము

లగ చెట్లకు నిచ్చెనలు వేయునంతటి హ్రస్వాంగులు పుట్టుదురని చెప్పియు న్నందున నట్టివారిలో నేను ప్రథముఁడనని చెప్పెను. ఇంకొక పురాణ వేత్త తన వ్రేలితో నన్ను కొలిచి వాలఖిల్యాదు లని యొగ తెగ మహర్షు లంగుష్ఠమాత్రశరీరు లుందురని పురాణములలోఁ జెప్పియున్నం దున నేను వాలఖిల్యాదులసంతతివాఁడ నని చెప్పెను. అట్లు పురాణ మార్గమున మాత్రమేకాక తరువాత నలుగురు సిద్ధాంతులును జ్యోతిష మార్గమునకూడ నాలోచించి నేను మనుష్యుఁడనని యేకవాక్యముగాఁ బలికిరి. క్రొత్తగాఁ బోయినవానికి నీకువారిసిద్ధాంతములన్నియు నెట్లు తెలిసినవని కొందఱు ప్రశ్న వేయవచ్చును. నాకప్పుడా సంగతు లేవియు తెలియనే లేదు. తరువాత. కొంతికాలము వారిదేశములోనుండి నేను వారిభాష నేర్చుకొన్న తరువాత నాకీసంగతు లన్నియు వారు చెప్పఁగా బోధపడినవి. వారిభాష కొన్ని దేశ్యపదములతోఁ గలిసియున్నను విశేషభాగము సంస్కృతపదములతో నిండియున్నది. అందుచేత మన భరతఖండవాసులకు వారిభాష నేర్చుకొనుట మిక్కిలి సుల భము. నేను వారిభాష నేర్చుకొన్న క్రమము చెప్పబూనుకొన్నచో మీకింపుగా నుండకపోవచ్చునని యెంచి మీకావివరములు చెప్పక నే ను మూఁడుమాసములలో వారిభాష నొకవిధముగా మాటాడుటకు నేర్చుకొన్నానని మాత్రము విన్నవించుచున్నాను. ఇట్టి స్వల్పాంశముల నుగూర్చికూడ వివరములు వినవలెనని వేడుకపడువారు కొందఱున్న పక్షమున, వారు శ్రద్ధాళువులయి నాయొద్దకు వత్తురేని నేను మర్మము విడిచి వారికి సమస్తమును తనివిదీఱ వినిపించెదను.

రెండవ ప్రకరణము.

మొదటి ప్రకరణములో నేను జెప్పిన సత్యములను విన్నవారు నా సత్యసంధతనుగూర్చి సంశయపడక పోయినను మనుష్యాశనుల దేశమునకుంబోయి వారిచేత భక్షింపఁబడక యొక్కమనుష్యుఁ డెట్లు మనకీ కథలను జెప్పుటకు జీవింపఁ గలిగినాఁడని యాశ్చర్యపడకపోరు. నేను రాక్షసులచే భక్షింపఁబడక పోవుటకుఁ గారణము లనేకములు కలవు. అందు ప్రధానమయినది నే నాఁడు మహాపాఠశాలలో నేర్చుకొన్న మంత్రమహిమ. రెండవది యీకాలమునందు రాక్షసులు మనుష్య భక్షణమును మానుకొనుట. "వ్యాఘ్రము తెప్పుడయిన మాంసాశనము మానివేయునా ? స్వభావముచేత మర్త్యాశనులయిన దనుజులు మనుజ భోజనముత్యజించుట యెట్లుసంభవించును ? ఈవార్త నమ్మదగియుండ లేదు." అని మనకర్మజ్యేష్ఠులయిన శ్రోత్రియులొకవేళ నామాటలు పూర్వపక్షముచేయఁ జూడవచ్చును. అయినను సత్యమెప్పుడును సత్యమే యగును. సూర్యచంద్రాదుల గతులు తప్పినతప్పవచ్చును. గాని నానోటినుండి మాత్ర మసత్య మెప్పుడును రాదు. నేను సూర్యుఁడు పశ్చిమమున నుదయించి దక్షిణమున నస్తమించునన్నను నామాట సత్యముకావలసినదే. నాయథార్థమును పరీక్షించుటకయి మీలో నెవ్వరయిన నీదేశమున కొక్కసారి నావెంట వచ్చినపక్షమున మీకు నాసత్యవాక్య ధురీణత బట్టబయలగును. దానవులు మానవాశనతను మానుటకును కారణము లేకపోలేదు. దానికిని రెండు కారణములున్నవి. అందొకటి మనుష్యులు క్రమక్రమముగా హ్రస్వశరీరులగుచు వచ్చుట చేత నెందఱినిభక్షించినను నొక్క ముద్దకయినను చాలకపోవుట. రెండవది విభీషణుఁడు లంకాధిపత్యము వహించి రాక్షసరాజయిన

తరువాత శ్రీరాములవారి మీఁదఁగల భక్తిచేత నిక్కముగను రాక్షసు లెవ్వరును మనుష్యభక్షణము చేయఁగూడదని శాసనముచేయుట. ఇప్పటి కిని లంకారాజ్యమును విభీషణుఁడే యేలుచుండుటచేత రాజశాసనమునుబట్టి రాక్షసులు మనుష్యాశనత్వమును విడిచిపెట్టి సౌమ్యప్రవృత్తైనను మనుష్యసంచారముగల దేశములకు బోవుట మాత్రిగా మానుకొన్నారు. నామాటయొక్క సత్యమును సిద్ధాంతపఱుచుటకయి మన దేశమునకిప్పుడు రాక్షసులు రాకుండుటయే ప్రత్యక్షనిదర్శనముకదా ? విభీషణుఁ డిప్పుడు లంకారాజ్యము చేయుచున్నాఁడన్న మాట విన్నప్పుడు "త్రేతాయుగమునందు రాముని పరిజనుఁడైన విభీషణుని కాలమెక్కడ? ఈకలికాలమెక్కడ? అతఁడిప్పుడు లంకనేలుచుండుట యెక్కడ?" అని తెలియనివారు సందేహపడుదురేమో! తెలియనివారు తమ మనస్సులలో నేమనుకొన్నను తెలిసినవారు మాత్రము విభీషణుఁడు చిరకాలజీవులలో నగ్రగణ్యుఁడని పురాణములవలన నెఱిఁగి యుండుటచేత నేచి చూచివచ్చి చెప్పిన యీసంగతిని గూర్చి యణుమాత్రమును సందేహపడరు. ఈవిభీషణుఁడు రాజయియున్న హేతువును బట్టియే లంకాద్వీపము సింహళము కాదని వెనుకటి ప్రకరణమునందు వాగ్దానము చేసియున్న ప్రకారముగా నేనిప్పుడు సిద్ధాంతము చేయఁబోవుచున్నాను. పట్టాభిషేక కాలమందు శ్రీరాములవారే యాచంద్రతారార్కముగా లంకనేలుమని విభీషణునితో నానతిచ్చినసంగున, కిప్పుడింగ్లీషువారేలుచున్న సింహళద్వీప మెప్పుడును లంకాద్వీపము కాఁజాలదు. అంతే కాక యీరెండు ద్వీపములకునుగల వైశాల్యాది భేదములనుగూడ విచారింపుఁడు. శ్రీమద్రామాయణములో వాల్మీకులవారు కిష్కింధాకాండములో

" కో వీరో యోజనశతం లంఘయేచ్చ ప్లవంగమః "

అని యేవానరవీరుఁడు లంకకు నూఱుయోజనముల సముద్రమును

దాటునని యంగదుఁ డడిగినట్లు చెప్పియున్నారు. శ్రీవాల్మీకులవారే యుద్ధకాండమునందు

శ్లో. "దశయోజన విస్తీర్ణం శతయోజన మాయతం
దదృశు ర్దేవగంధర్వా నలసేతుం సుదుష్కరం."

అని నలుఁడు నూఱుయోజనముల పొడుగును పదియోజనముల వెడల్పుగల సేతువును కట్టినట్లు సెలవిచ్చియున్నారు. సింహళమే లంక యైనపక్షమున, రామేశ్వరమునకును లంకకును మధ్యనున్న సముద్రము నూఱుయోజనముల వెడల్పు గలదయియుండవలెనుగదా? నూఱుయోజనములనగా వేయిమైళ్ళు; వేయిమైళ్ళమాటయటుండఁగా నూఱుమైళ్ళయినను లేక రామేశ్వరమునకును సింహళద్వీపమునకును మధ్యనున్న సముద్ర మింగ్లీషువారి లెక్కప్రకారమే అఱువదిమైళ్ళున్నది. రామేశ్వరమున కఱువది మైళ్ళదూరములోనుండి మిక్కిలి పొడుపైనచోట ౨౭౦ మైళ్ళును, మిక్కిలి వెడల్పయినచోట ౧౩౦ మైళ్ళును గల చిన్న సింహళద్వీప మెన్నఁడయిన లంకాద్వీపము కానేర్చునా? సింహళమునకును రామేశ్వరమునకును నడుమనున్న యిసుకతిన్నెలే సేతువయినపక్షమున, పూర్వ మాంజనేయాదివానరవీరులు హిమవత్పర్వతాదులనుండి విఱిచి తెచ్చి పడవేసిన పర్వత శిఖరములన్నియు నేమయిపోయినవి? సింహళమే లంకయైన పక్షమున అందు మహాసత్త్వులయిన రాక్షస సత్త్వములుండక దుర్బలులైన యఱవవాండ్రును సింగాలీవాండ్రును కాపురమేలయుందురు? కాఁబట్టి యిట్టిహేతులను చక్కఁగా పరిశీలించి హూణులు వ్రాసిన గ్రంథములను విశ్వసింపక, సింహళద్వీపము లంక కాదనియు నేనిప్పుడుపోయి చూచినదియే రావణలంకయనియు మీరు దృఢముగా నమ్ముఁడు.

మనమింక భూగోళశాస్త్రప్రసంగమును కొంచెముసేపు చాలించి ప్రస్తుతకార్యాంశమునకు వత్తము. నాక్రొత్త యజమానుని పేరు

నాయకుఁడు. ఆనామధేయముచేతనే యతఁడు రాజబంధువుఁ డయినట్లు మీరూహింపవచ్చును. అతఁడు నాయందు పుత్రవాత్సల్యము కలవాఁడయి నాయన్నపానాదులను గూర్చి ప్రతిదినమును తానే విచారించుచు, మూషికమార్జాలాది జంతువులవలన నాకేవిధమయిన యపాయమును గలుగకుండ రక్షించుచుండుటకయి యెనిమిదేండ్ల ప్రాయముగల తనపుత్రికకు నన్నొప్పగించెను. మూషికమార్జాలాదుల వలన మనుష్యునకు భయమేమని మీరనుకొనఁగూడదు. అక్కడి యెలుకలు మనదేశపు కుక్కలంత లేసియుండును. ఇఁక పిల్లులన్నచో మన యావులకంటె కొంచెముపెద్దవి. కాఁబట్టి యిట్టి పెద్దజంతువులవలన నావంటి యల్పశరీరికపాయము సంభవించుట యేమియాశ్చర్యము? నే నక్కడకుపోయిన మూఁడవనాఁడే నాకొక్క గొప్పగండము తప్పిపోయినది. మీరాకథవిన్నచో నాసమయోచిత బుద్ధికిని నిరుపమానధైర్య సాహసములకును మహాశ్చర్యనిమగ్నమానసులు కాకమానరు. నేనిప్పుడు పేర్కొన్న చిన్నదాని వేడుకకొఱకయి యింటివారు రెండు కుంచిమేఁకలను పెంచినారు. అందొకటి వారముదినములక్రిందట రెండు పిల్లలను పెట్టినది. వానినొకటితల్లి పాలుత్రాగి యాటలకయి చెంగుచెంగున గంతులువేయుచు నేను నిలుచున్న వైపునకు పరుగెత్తుకొని రా మొదలుపెట్టెను. అటువంటి మహాజంతువు మృత్యుదేవతవలె నామీఁదికిపరుగెత్తుకొనివచ్చుచున్నప్పుడు బ్రాహ్మణుఁడ నయ్యును నేనణుమాత్రమును జంకక వెనుకంజవేయక, వ్యాఘ్రములు మొదలయిన క్రూరజంతువులు సహితముప్రతిఘటించి నిలువఁబడినవారిమీఁదికి వచ్చుటకుభయపడునని వేటకాండ్రవలన మనదేశమునందు విన్నమాటనుబట్టి వీరభటునివలె ధైర్యముతో దానికెదురుగా నిలువఁబడితిని. అయినను మనదేశపు పులులకంటెను నధికసాహసము గలదయి యామేకపిల్ల నాశూరగుణమును ప్రత్యక్షముగాఁజూచియు వెఱచి వెనుకదీయక తలవంచుకొని నా

మీఁది కొక్కుదుమకు దుమికెను. నేనప్పుడు సమయోచితబుద్ధిగల వాఁడనయి ప్రక్కకు తొలఁగి తప్పించుకొని యమపాశములవంటి నా బాహుపాశములను దానిమెడకు తగిలించియుండినపక్షమున, వజ్రాయుధములవంటి దానిముందటికాళ్ళగోళ్లు రెండును నాఱొమ్మమీఁ, దఁబడి ప్రాణాపాయము చేయలేక పోయినను బలమయినగాయమునైనఁ జేసియుండును. అది మెడపట్టు వదల్చుకొనవలెనని పెనఁగులాడఁగా, పట్టువదలినపక్షమున నన్నది కాళ్ళక్రింద నలగద్రొక్కునని నేను భల్లూకపుపట్టుపట్టి వదలకపోఁగా, అంతటమాయిరువురకును భారతయోధులకువలె ఘోరమయిన ద్వంద్వయుద్ధ మారంభమయినది. బాహాబాహిని దంతాదంతిని నఖానఖిని నేనుజేసిన యామహాయుద్ధములో నేన క్షతశరీరుఁడనయి నాశత్రువును రెండుమూఁడుచోట్ల గాయపఱచి విజయోన్ముఖుఁడనయి యుండఁగా, ఆమేఁకపిల్ల ప్రాణరక్షణార్థమయి కడపటిప్రయత్నముచేసి పర్వతగుహలు మాఱు మ్రోయునట్లు మావుమని యొక్కసింహనాదముచేసి తనబలమంతను జూపి నన్ను బీరపాదు మొదటికీడ్చెను. నాబలశౌర్యము లేమనిచెప్పను! అంతచేసినను నా పట్టు నేను విడువలేదు. అది రాక్షసభూమి యగుటచేత దేవతలు రావెఱచిరిగాని ఆరణరంగమే మనపుణ్యభూమియైనపక్షమున నాశౌర్యవీర్యధైర్యములకు నామీఁద తప్పక దివినుండి సురలు విరులవాన కురిసి యుందురు. నాశౌర్యకీర్తులను విద్యాధరకాంతలు దిగంతములయందు తమ నూతనగీతములతో గానముచేసియున్న పక్షమున, బ్రాహ్మణులు రణభీరువులని లోకములో నీవఱకు క్రమముగా వ్యాపించియున్న యపవాద మొక్కనిమిషములో పటాపంచలయి పోయియుండును. అయినను నాకంటెముందు భారతయుద్ధమునందు ద్రోణకృపాశ్వత్థామాది బ్రాహ్మణోత్తములుచూపిన శౌర్యమువలననే యీ యపనింద కొంతవఱకు తొలఁగిపోయినది. ఆసంగతి యటుండ

నిండు. ఇట్లు యోధానుయోధుల మయి మేమిరువురమును బీరపాదు మొదలు చేరునప్పటికిమా కాలు నేలమీఁదనిలువక జారఁగా పట్టు వదలి మే ముభయపేరులమును చుట్టచుట్టుకొని క్రొత్తగా సేవకులు పేరుపోయుటచే మహార్ణవమువలె నిండియున్న యాపాదులోఁ బడితిమి. దైవికముగా నింతలో లోపలినుండి నాయజమానునికూఁతు రేదో పనిమీఁద మాయుద్ధభూమికి వచ్చి మమ్మిద్దఱను పయికిఁదీసి విడిపించెను. ఈశ్వరానుగ్రహమువలన నాకిప్పుడు స్థలగండమొకటియు జలగండమొకటియు రెండు గండములు తొలఁగిపోయినవి. "మనిషి కాటుకు మందులేదు." అని మన దేశమునందు పామరు లూరక పలుకుదురు గాని నేను దయాగుణప్రధానులగు బ్రాహ్మణకోటిలోఁ జేరినవాఁడనగుటచేతనో మఱి యేహేతువుచేతనో నాకాట్లా ఛాగశిశువున కేవిధమయిన యపాయమును జేయలేదు; తుదకు దానిచర్మము నైనను ఛేదించలేదు. ఛాగశాబక బ్రాహ్మణకుమారసమరోపాఖ్యానం బను నీపుణ్యకథను విన్నవారును భక్తితోఁ జదివినవారును స్థల జలగండములనుండి విముక్తులయి సర్వకార్యములయందును విజయము నొందుదురు. దీనికి సందేహించినవా రథోగతులగుదురు.

ఈప్రథమయుద్ధ మయినతరువాత నొకనాఁడు నాయీచతుష్పాద శత్రువు మరల నామీఁదికి రాఁజూచినదిగాని, నేను ముందుగానే జాగరూకతపడి పూర్వానుభవమువలన ద్వంద్వయుద్ధముమాని దూరమునుండియే శిలాయుద్ధముచేసి దానిని తఱిమివేసి శత్రువిజయము పొందినాను. ఇటువంటి యపాయములు మరలమరల వచ్చుచుండునని భయపడి యాచిన్నది తనతండ్రిగారితోఁ జెప్పి తనబొమ్మరింట నొక మూలను చిలుకపంజరము నొకదానిని బెట్టించి నాకు నిరపాయము యినగది నమర్చుటయేకాక, ఒకగిన్నెలో నీరుపోసి నన్నందుఁ బడవేసి మునిగిపోకుండ తనచేతులతోఁ బట్టుకొని దినమునకు రెండేసి మా

లులుచోప్పున నా కీతనేర్పి కొన్ని దినములలో జలమునకు భయపడ వలసిన యావశ్యకము లేకుండఁ జేసెను. ఇట్లు సుభోపాయములుచేసి నాప్రాణరక్షణముచేసిన పుణ్యాత్మురాలయిన యాబాలికపేరు మందోదరి. ఆదేశమునందు నడచిన నాయద్భుతచర్య లిట్టి వనంతములు గలవుగాని, నేనే వాని నన్నిటిని బ్రశంసింపఁ బూనినచో నాత్మస్తుతి గానుండునని యావర్ణనమును మాని వేయుచున్నాను. దివ్యజ్ఞాన మానసీయులయిన మహాత్ము లెవ్వరైనఁ బనిపూని యీయమానుష చర్యలు పరిశీలనసేసి లోకోపకారార్థముగా మహావాయువులో ముద్రితమయియున్న లిపిని జూచి ప్రచురింతురుగాక!

మందోదరియొద్ద నొక నాఁటిప్రాతఃకాలమున నే నొంటిగాఁ గూరుచుండి మనదేశవిశేషములనుగూర్చి ముచ్చటించుచుండఁగా లోపలినుండి యొకక్రొత్తపురుషుఁడు వచ్చి నన్ను "సత్యా!" అని పిలిచి పలుకరించెను. సత్యరాజాచార్యులని నాపేరంతయు నుచ్చరించుట కష్టముగా నున్నందున, ఇంటివారు నన్ను సత్యుఁడన్న సంగ్రహనామముతో పిలుచుచుండిరి. నా మొగమెన్నఁడును జూడని యీక్రొత్తవాఁడు నాపేరెట్లుతెలియఁగఁ గలిగెనని నాలో నే నాశ్చర్యపడుచు మాఱుమాట చెప్పక తెల్లపోయి చూచుచుండఁగా, ఆపురుషుఁడంతలో తన రూపమును మార్చి నాయజమానుఁడయిన మహాకాయుఁడయి "యిప్పుడయిన నన్నెఱుఁగుదువా?" అని మరల నడిగెను. ఇది యేమో యింద్రజాలమయి యుండునని నాయద్భుతమప్పుడు మఱింత యెక్కువకాఁగా నానోటినుండి బొత్తిగానే మాటవచ్చినదికాదు. వినోదముకొఱకు కామరూపమును జూపిన నన్నుఁజూచి యిట్లేల యింత యాశ్చర్య పడుచున్నావని నాయజమానుఁ డడుగఁగా నేనప్పుడు మన పురాణములలోని రాక్షసమాయలును కామరూపములును స్మరణకుఁ దెచ్చుకొని, పూర్వము మారీచుఁడు మాయలేడి యగుటయు

వాతాపి మేఁకయగుటయు శూర్పణఖ మనుష్యస్త్రీ యగుటయుఁ దలఁచుకొని మనస్సు సమాధాన పఱచుకొని, ఇప్పుడు తెలిసినదని గద్గదస్వరముతో నుత్తరము చెప్పితినిగాని నామాట యాతనికి వినఁబడినదికాదు. ఆ దేశమునందు మాసంభాషణములో నాకొక్క పెద్ద కష్టమువచ్చినది. నేనెంత బిగ్గరగా నఱచినను వారిరాకాసిచెవులకు నామాటలు గుసగుసలకంటె నెక్కువ స్పష్టముగా వినఁబడకుండెను. వారెంతమెల్లగా నేకాంతమాడినను వారి మాటలు నాసూక్ష్మ శ్రవణములకు పిడుగులవలె కర్ణకఠోరములుగా వినఁబడుచుండెను. అందుచేత నచ్చటి నిరంతరశబ్దములచేత నాచెవులు చెవుడుపడకుండ నేను కర్ణరంధ్రములలో గుడ్డలు క్రుక్కుకోవలసివచ్చినది. వారు నాతో మాటాడవలసినప్పుడెల్ల నన్ను చేతులతోఁ బయికెత్తి చెవులచెంతఁ బెట్టుకొని గట్టిగా మాటాడుమనుచుండిరి. దీనినిబట్టి మనుష్యులమయిన మన కున్న శ్రవణేంద్రియపటుత్వమును సూక్ష్మశబ్దగ్రహణశక్తియు రాక్షసులకు లేవనుట స్పష్టమే కదా! అయినను మనకంటె వారియొద్ద కామరూపమొకటి విశేషముగా నున్నది. సర్వసముఁడయిన యీశ్వరుఁ డొక్కొక్కసృష్టి యం దొక్కొక్క విశేషమును బెట్టుచుండును. కామరూపు లగుటచేత రాక్షసులు తామేరూపమును పొందఁగోరినను సంకల్పమాత్రమునఁ దా మారూపము ననాయాసముగా పొందఁగలుగుదురు. అయినను వారు సూక్ష్మరూపములను ధరింపఁ గోరినప్పుడు చీమలవలెను దోమలవలెను కాఁజాలుదురేగాని నావంటి సూక్ష్మమనుష్య రూపమును ధరింపవలెనన్న యనాయాసముగా నీవఱకెన్నఁడును వారిలో నెవ్వరికిని కలుగలేదు. అందుచేతనే నారూపమును జూచుటచేత నా దేశమునం దెల్లవారికిని నత్యాశ్చర్యము కలిగెను.

ఆదినము నాయజమానుఁడు మనస్సులో నిక్కిలి యుల్లాసముగా నున్నందున నానావిషయములనుగూర్చి నాతో సల్లాపించుచు తన పెద్దల ప్రసంగము చెప్పెను. అప్పుడు నేనందుకొని పూర్వచరిత్రమును తెలిసికొనవలెనన్న యభిలాషతో రామాయణమునందు వర్ణింపఁబడిన రావణుని మంత్రియైన మహాకాయుఁడు మీకేమికావలెనని యడిగితిని. అతఁడు వయివంకఁజూచి వ్రేళ్ళుమడిచి లెక్కవేసి యాతఁడు తన వంశమునకు మూలపురుషుఁడగుటయు, తానాతనికి పదియవ పురుషుఁడగుటయు, చెప్పి వెచ్చనూర్చెను. నేనును వ్రేళ్ళు మడచి యుగప్రమాణమునుబట్టి రామరావణయుద్ధము జరిగిన త్రేతాయుగమునుండి లెక్కవేసి, ద్వాపరయుగ ప్రమాణ సౌరసంవత్సరములు ౮౬౪౦౦౦ ల తోను కలియుగమునం దిప్పటికి భుక్తమయిన ౫౦౨౭ సంవత్సరములను జేర్చి ౮౬౯౦౨౭ మొత్తము చేర్చి, దానిని పదింటిచేత భాగించి యొక్కొక్క తరమువారి జీవితకాలము ౮౬౯౦౨ సంవత్సరముల రెండుమాసములని రాక్షసుల యాయుఃప్రమాణమును నిర్ణయముచేసి, మీరు వెచ్చనూర్చిన కారణమేమని నాయజమాను నడిగితిని.

మహాకాయుఁడు—మాపెద్దలస్థితిని దలఁచుకొని యిప్పటివారి యల్పాయుష్కతయు నల్పశక్తియు నల్పకాయత్వమును విచారింపఁగా దేశాభిమానము గలవారి మనస్సులో దుఃఖమెట్లు కలుగకుండును?

సత్య—మీమాటలు నాకు వింతగానున్నవి.

మహా—ఏమివింత? మాపూర్వుఁ డొకఁడు భూమిని చాపగా చుట్టి చంకక్రింద పెట్టుకొని పరుగెత్తెనుగదా! ఆతని శక్తిముందర నిప్పటివారిశక్తియెంత? ఏదీ యిప్పుడొక్కరిని భూమిని కాదుగదా, యీద్వీపమును చాపగాచుట్టుమను చూతము. పూర్వమొకమహాపురుషుఁడు సముద్రము మోకాలిబంటిగా నీఁదుచుండఁగానాతని మీద

స్సుత్రోఁగదా యీభూమిచేయఁబడినది ! ఇప్పుడు భూమండలమంత కాదుగదా శిరస్సులో మాద్వీపమంత మెదడున్నవాని నొక్కని జూపుము. జనులంతకంత కల్పకాయులగుచున్నందున కీయొక్క నిద ర్శనము చాలదా? అల్పకాయులు నల్పశక్తులు నగుటచేతనే మావా రంతకంత కల్పాయుష్కులుకూడ నగుచున్నారు.

సత్య—త్రేతాయుగమునుండి నేఁటివఱ కొక్క పురుషుఁడే మీలంకను రాజ్యము చేయుచుండఁగా మీవా రల్పాయుష్కు లనెద రేమి ?

మహా—చిరకాలజీవి గనుక విభీషణుఁ డొక్కఁడు మాత్ర మింతకాలము రాజ్యము చేసినాఁడు. అప్పుడే రెండు యుగములలో నాతని రాజ్యకాలములోనే పంద్రెండు తరములు చెల్లిపోయినవి. ఆతని కిప్పుడు పంద్రెండవతరమువారు మంత్రులయినారు. తానొక్కఁడు బ్రతికియున్నను భార్యాపుత్రాదులు మృతులగుటచేతనే కదా విర క్తుఁడయి విభీషణుఁ డిప్పుడురాజ్యము మంత్రులకొప్పగించి సువేలా ద్రియందు తపస్సుచేయుచున్నాఁడు ! ఇట్టిదుష్కాలమును జూచి నేనెట్లు చింతిల్లకుందును ?

సత్య—ఓమహాకాయా ! మాదేశస్థితిని దలఁచుకొనఁగా మీకు కలుగుచున్న విచారమే నాకును కలుగుచున్నది. మావారంతకంత కల్పాయుష్కు లగుచున్నారు. పూర్వము దశరథుఁ డఱువది వేల యేండ్లు రాజ్యముచేసినాఁడు. ఇప్పుడాఱునూఱేండ్లు బ్రతికినవాఁడయి నను లేఁడు. అగస్త్యుఁడు సముద్రోదకమునంతను పానముచేసెను. ఇప్పు డొక్క చెఱువెడు నీళ్ళు త్రాగువాఁడయినను లేఁడు.

మహా—పూర్వము మీవా రంతటి స్థూలకాయులుగానుండి నందుననే మాపెద్దలు మనుష్యాశనులయి కడుపునిండ తృప్తిగా భోజ నము చేయుచుండెడివారు. సిన్నుఁబట్టిచూడఁగా మీమనుష్యులిప్పుడు

మాంసాహారమును ముఖ్యముగా నుపయోగించుచున్నారు. అయినను పూర్వాచారము విడిచిపెట్టరాదు. శిష్టాచారమును మీఱుటకంటె లోకములో పాపము మఱియొకటి లేదు. కలిమహిమచేత చండశాసనుఁడైన మహావిభీషణమహారాజు మనుష్యభక్షణము నిషేధించి పాపము కట్టుకొన్నాఁడు గాని రాక్షసుల కులధర్మమయిన మనుష్యాశనతను మాన్పించి శిష్టాచారము చెడఁగొట్టుట నీతికాదు. నేనీసంగతి శిష్టాచారము మీఱరాదని చెప్పుచున్నానుగాని యల్పాంశులయిన మనుష్యకీటకములను తినుటచేత మాకెక్కువపుణ్యము వచ్చునని చెప్పుచుండ లేదు.

ఓ భరతఖండ నివాసులారా! ఈతఁడు విభీషణునిపరిపాలనలో నున్నను మనస్సులో తన రాక్షసస్వభావము నెట్లు విడువకున్నాఁడో చూచినారా? నే నధికముగా మాటాడినచో నాపాపాత్ముఁడు నన్నెక్కడ నోరవేసుకొనునో యన్న భీతిచేత మఱేమియు మాటాడక, జీవహింసయు నందులో నరవధయు నంతకంటెను ముఖ్యముగా బ్రహ్మహత్యయు పాపములని చెప్పవలెనని నాలుక చివరకు వచ్చినను బలవంతముగా నాపుకొని యూరకున్నాను. ఇప్పుడు లంకలోఁగూడ రాజభక్తులనఁబడెడు విభీషణ పక్షమువారైన నవనాగరికులు కొందఱు బయలు దేరుచున్నను, మహాకాయుఁడు పూర్వాచార పరాయణులయిన శిష్టాగ్రగణ్యులలోనివాఁడు. ఈకథ సాగినకొలఁదిని లంకలోనున్న యిరుతెగలవారి చరిత్రములును గొంతకొంత వచ్చును గనుక ప్రస్తుతమావిషయమును విడిచిపెట్టుచున్నాను.

మూఁడవ ప్రకరణము.

కొందఱక్కడక్కడ శాస్త్రవిశ్వాసములేని నాస్తికవాదు లిప్పుడిప్పుడుద్భవిల్లుచున్నను మనదేశమునందువలెనే లంకాద్వీపమునందును సాధారణముగా జనులు శాస్త్రబద్ధులయి పూర్వాచారపరాయణులయిన శిష్టులుగానే యున్నారు. అందులోను వారికి పరమప్రామాణికమయిన జ్యోతిషశాస్త్రమునందు విశ్వాసమత్యధికము. ఒక్క జ్యోతిశ్శాస్త్రమే లేకయుండినయెడల ఆదేశమునందు దేవ్యవహారమునందును సత్యము గనుఁగొనుటయే దుర్లభముగానుండి యుండును. అక్కడి జనులందఱును కామరూపులగుటనుబట్టి తమ తమ యిచ్చవచ్చిన రూపములను ధరించి చౌర్యము మొదలయిన నేరములను జేయ సమర్థులగుటచేత సాక్షులను విమర్శించి వారినిదండించుట సాధ్యముకాదు. వృశ్చికరోముఁడు సర్పరోమునిరూపమును ధరించి వచ్చి దొంగతనము చేసినప్పుడును, సర్పరోముఁడు వృశ్చికరోమునిరూపమును ధరించి వచ్చివాని భార్యతో వ్యభిచరించినప్పుడును, దీర్ఘనాసుఁడు హ్రస్వనాసుని రూపము ధరించివచ్చి హత్యచేసినప్పుడును, హ్రస్వనాసుఁడు దీర్ఘనాసుని రూపమునుధరించివచ్చి యొరునియింటికి నిప్పంటించినప్పుడును, చూచినవారిని పరీక్షచేసి యపరాధులను శిక్షింపఁబూనినచో దోషులు తప్పించుకొనిపోవుటయు నిష్కారణముగా నిర్దోషులకు శిక్షలగుటయు తటస్థించునుగదా! కాఁబట్టియే యక్కడివారు నేరములను విమర్శించుటకయి సాక్ష్యమును మానివేసి న్యాయసభలలోనెల్ల సత్యమును గనుఁగొనుటకై యయినుగురేసి చొప్పున జ్యోతిషపండితులనుబెట్టి యున్నారు. వారు సత్యమును గనిపెట్టుటలో తఱుచుగా భిన్నాభిప్రాయులుగా నున్నను వారిలో నధికసంఖ్యాకుల యభిప్రాయము ననుసరించి ధర్మాధికారి దోషులకు దండనము విధించు

చుండును. అక్కడి వారికి దివ్యజ్ఞానమువాత్రము లేదు. భగవంతుడు వారికి దివ్యజ్ఞానమనుగ్రహించకపోయినందుకు కారణములేకపోలేదు. కామరూపమును ప్రసాదించిన దేశమునందు దివ్యజ్ఞానమునుకూడ ప్రసాదించినపక్షమున, దివ్యజ్ఞానముచేత మాయ బట్టబయలయి కామరూపములవలని ప్రయోజనమే లేకపోవునని యోచించియే యపరిమితబుద్ధిమంతుడయిన యీశ్వరుడు వారికి లోకోపకారార్థముగా దివ్యజ్ఞానము లేకుండ జేసినాడు. వారికి యెంతకాలమునుండి కామరూపమును వహించు శక్తియున్నను వారేదైన సూక్ష్మరూపమును బొందవలెనన్న బుద్ధిపుట్టినప్పుడు చీమగానో దోమగానో పిల్లిగానో బల్లిగానో మారుచుండుటయేకాని నావంటి యంగుష్ఠమాత్రశరీరముగల పురుషుడు కావలెనన్న బుద్ధి నేటివఱకును వారిలో నొక్కనికి నుదయించకపోవుటచేత నారూపముచూడగానే యెల్లవారికి నద్భుతమును గౌరవమును గలిగెనని చెప్పితినిగదా! నన్ను శోధించిచూచి నాలక్షణ్యము హార్దినిగా నిశ్చయించిన పౌరాణికులును జ్యోతిశ్శాస్త్రవేత్తలు నారాకను గ్రామమునందంతటను ప్రకటించినందున జనులు తీర్థప్రజవలె వచ్చి నన్నుదర్శించిపోవ మొదలుపెట్టిరి. అక్కడి వారు నాస్తికులుగాక యవతారములను మహామహిమలను నమ్మెడు ప్రమాణబుద్ధిగలభక్తిపరులగుటంజేసి నన్ను దర్శింపవచ్చువారందఱును నాయందు భక్తిగలవారయి ఫలములను కానుకలను దెచ్చుచు వచ్చుటచేత మాయింట ప్రతిదినమును ఫలరాసులు పర్వతోపమానములగుచు వచ్చెను. నాయజమానుడు వానినన్నిటి నంగడికిబంపి యమ్మించుచు వచ్చుటచేత తద్విక్రయము కొంతవఱకాతనికిని లాభకరముగానే యుండెను. నాముూలమున తనయప్పులుకూడ తీఱుమార్గమేర్పడినందున నాయజమానుడు తనహృదయములో సంతోషించి కొంతకాలమయిన తరువాత దక్షిణలుకూడ నేర్పఱిచి యాత్రాపరులను ప్రోత్సాహపఱుచుచు

వచ్చెను. ఈప్రకారముగా నేనా దేశమునం దల్పకాలములోనే చిఱుదేవతనయిపోయినాను. నామహిమలు శీఘ్రకాలములోనే చుట్టుపట్ల గ్రామములోను దూరదేశములోనుగూడ వ్యాపించినందున యాత్రాపరులు రేయింబగళ్ళు విరామములేక దూరదేశములనుండి సహితము మహోపహారములను సువర్ణమంత్రపుష్పములను ధరించి యిసుకచల్లిన రాలకుండునట్లు తీర్థప్రజలవలె రాఁదొడఁగిరి. నేను జంగమదేవతను గాఁగానే నాయజమానుఁడు తన మందిరమునందుఁగల యొక విశాలమయినగదిని దేవాలయమునుగా మార్చి యొకసనాలఁ పీఠమమర్చి మూలవిగ్రహమువలె నందు నన్నెత్తుగాఁ గూరుచుండఁబెట్టి జనులు తెచ్చుకానుకలు మొదలయినవానిని గ్రహించుటకయి నాపై నొకయర్చకుని నేర్పఱిచి తాను ధర్మకర్తయయి వచ్చిన ధనమునంతను యథేచ్ఛముగా తననిమిత్త ముపయోగించుకొనుచుండెను. నాయందు జనుల కింతపూజ్యతాబుద్ధి కలిగినందున కింకొక కారణము చెప్ప మఱచిపోయినాను. మన్నించి వినుఁడు. నేనక్కడకుఁ బోయిన నాలవనాఁ డొకవృద్ధకాంత నావద్దకు వచ్చి, వాలఖిల్యాది మహాఋషులకు దివ్యజ్ఞానమును మహిమలును గలవని పురాణశ్రవణాదులవలనఁ దెలిసికొన్నదగుటచేత భక్తిపూర్వకముగా నాకు నమస్కరించి, ప్రసవవేదనపడుచున్న తన కోడలికి కొడుకుపుట్టునో కూఁతురుపుట్టునో చెప్పవలసినదని ప్రార్థించెను.

ఆమె ప్రశ్నయడిగిన కాలమునందులగ్నమురవి; గురుచంద్రులు విషమరాశి నవాంశములయందుండుటచేత.

శ్లో. ఓజర్క్షే పురుషాంశకేషు బలిభిర్లగ్నార్క గుర్వీందుభిః
పుంజన్మప్రవదేత్సమాంశకగతైర్యుగ్మేషు తైర్యోషితః
గుర్వర్కౌ విషమేనరం శశిసితౌ వక్రశ్చయుగ్మేస్త్రియం
ద్వ్యంగస్థా బుధవీక్షణాచ్చయమళౌ కుర్వంతి పక్షే స్వకే.

అను బృహజ్జాతకవచనమునుబట్టి కుమారుఁడు కలుగునని చెప్పినారు. శాస్త్రము లెప్పుడు నబద్ధములు కావు గనుక వృద్ధాంగన యింటికిఁబోయిన జాములోపల కోడలికి నేను జెప్పినట్లు పురుషశిశువు కలిగెను. అక్కడి జ్యోతిష్కులు మాత్రము లెక్కవేసి తమ శాస్త్ర ప్రకారముగా తప్పక స్త్రీశిశువు కలుగునని చెప్పిరఁట! చూచినారా? వారి శాస్త్రములకంటె మనశాస్త్రములయం దెంత యాధిక్యమున్నదో ఆవృద్ధాంగన నేను జెప్పిన సంగతి జ్యోతిష్కులకుఁ జెప్పఁగానే వారందఱు నావద్దకు మహాకోపముతో పరుగెత్తుకొని వచ్చి నీవేశాస్త్ర ప్రకారముగా కొడుకుపుట్టునని చెప్పినావో చెప్పుమని పట్టుకొనిరి. వారిశాస్త్రములకు విరుద్ధముగానున్నందున శాస్త్ర ప్రమాణమును జెప్పిన స్వదేశాభిమానముచేత శాస్త్రబద్ధులయినవారు నాకేమి హాని చేయుదురోయని జడిసియు సత్యము పలుకుట కిష్టములేనివాఁడనయి వారిప్రశ్నల కుత్తరముచెప్పక మౌనముధరించి యూరకుంటిని. అందుచేత వారు నే నాఫలములను జ్యోతిశ్శాస్త్రముచేతఁ గాక మునులకుఁగల యాంతరదృష్టిచేతనే చెప్పితినని తమలోఁ దాము సిద్ధాంతము చేసికొని యాసిద్ధాంతులు గ్రామములో నాదివ్యజ్ఞానమునుగూర్చి గొప్పవారితో నెల్లఁ బ్రశంసించిరి. అందుమీఁదనన్ను ప్రశ్నలడుగుటకయి గొప్పవారందఱును రా మొదలుపెట్టిరి. బుద్ధిమంతుఁడను గనుక నాలో నే నాలోచించుకొని జ్యోతిషభూమియైన యాదేశములో నేమియుత్తరము చెప్పిన జ్యోతిష్కులవలన నేమి చిక్కువచ్చునోయని భయపడి నేమియు నుత్తరముచెప్పక యెవ్వరేప్రశ్న వేసినను తలయూచి యూరకుండుచు వచ్చితిని. తరువాత నావద్దఁజేరిన జ్యోతిష్కులు తమ శాస్త్రములనుబట్టి నాశిరఃకంపమున కర్థముచేసి యడిగిన ప్రశ్నల కన్నిటికి నుత్తరములు చెప్పి భక్తులను సమాధానపఱిచి పంపుచువచ్చిరి.

నాయొద్ద నుంచఁబడిన యర్చకులు మన దేశములోని పూజారు

లవలెనే ధనార్జనోపాయములయందు మహాబుద్ధిమంతులు లగుటచేత నాప్రసాదము సర్వాభీష్టప్రదమని ప్రశ్నలడుగవచ్చిన వారికెల్లఁ జెప్పి యరఁటిపండ్లు మొదలయినవి విద్యచేత చెడిపోని భక్తులచేతులలోఁ బెట్టి ధనాకర్షణము చేయసాగిరి. ఇట్లుండఁగా నొకనాఁడు చేరువ పల్లెనుండి చాకలివాఁ డొకఁడువచ్చి నాకు సాష్టాంగనమస్కారము చేసి తప్పిపోయిన క్రొత్తగాకొన్న తనగాడిద కనఁబడునట్లనుగ్రహించ వలసినదని ప్రార్థించి దక్షిణయును పండ్లను పళ్ళెములోఁ బెట్టి యర్చకులకు సమర్పించెను. ఆయర్చకులాదక్షిణను స్వీకరించి తిన్నగానుండని యరటిపండొకటి వానిచేతిలోఁ బెట్టి యీదేవతా ప్రసాదమును దేవతా సన్నిధానమునందే పరిగ్రహించి మ్రొక్కిపొమ్మని వానికాజ్ఞయిచ్చిరి. వాఁడాప్రకారముగా ప్రసాదము స్వీకరించి భక్షించి తన యూరికి పోవుచుండఁగా త్రోవలోనే యీప్రసాదము వరదానముగాను, భక్తి పరిశోధనార్థమయి వానికడుపులో శూలనుపుట్టించి విరేచన నిమిషాఁద వానిని చెఱువు గట్టుమీఁదికి పరుగెత్తించి యక్కడ తుమ్మ చెట్టుక్రింద మేయుచున్న వాని గాడిదను జూపెను. వాఁడు నాప్రసాద మహిమ కత్యద్భుతపడి తన గాడిదను తిన్నగా తన యింటికిఁ దోలుకొనిపోయి తన బంధువులకెల్లను జూపి నామహిమలను గాథలుగా పొగడెను. ఇట్లు నామహత్త్వములు దేశమంతటను వ్యాపించినందున, గాడిదలు, గేదెలు, ఆవులు మొదలయినవి తప్పిపోయినవారందఱును, చుట్టుపట్ల గ్రామములనుండి ప్రసాద స్వీకారార్థముయి నాదర్శనమునకు రాఁదొడఁగిరి. ఆమఱునాఁడే యీచాకలివాని గ్రామమునుండి తనగాడిద తప్పిపోయినదని వాని చుట్టమొకఁడును, తనదొడ్డు తప్పిపోయినదని కాపువాఁ డొకఁడును రాఁగా, మాయర్చకులు వారివలన విధ్యుక్తములయిన దక్షిణలను గ్రహించి యరఁటిపండ్ల ప్రసాదమును వారిచేతిలోఁ బెట్టి నాయెదుటనే వారిచేతఁ దినిపించి పంపివేసిరి. అయి

నను చాకలివానిగాడిదగాని, కాఁపువాని యెద్దుగాని త్రోవలో వారికి కనఁబడలేదఁట! గాడిదమాత్రము మఱియెప్పుడును కనఁబడనేలేదఁట గాని తరువాత గొన్నిదినముల కెద్దు పొరుగూరి బందెలదొడ్డిలో నుండఁగా కాపువాఁడు బందెయిచ్చి దానివదల్చి తెచ్చుకొనెనఁట! ఈవార్త నా చెవినిబడఁగానే యొకరి విషయమున వెంటనే ఫలించిన నాప్రసాద మింకొకరివిషయములో నేల ఫలింపక పోవలెనని నాలో నేనాలోచించుకొన మొదలుపెట్టితిని. తరువాత వచ్చినవారికి నాయెడల నిజమయిన భక్తి దేమోయని సంశయించి లేభక్తియే లేకపోయి నయెడల వారంతదూరము శ్రమపడివచ్చి భూరిదక్షిణలు సమర్పించుట తటస్థింపదుగాన వారికార్యవైఫల్యమునకు భక్తిహీనత కారణము కాదని నిశ్చయించి యీవిషయమున వారిని నిర్దోషులనుగా నిర్ణయించినాను. భక్తిహీనత కారణము కాకపోయి పక్షమున నాయమోఘప్రసాదము విఫలమగుట కేమికారణమై యుండునని నాలో నేను తలపోయుచు కన్నులు మూసికొని యీశ్వరధ్యానము చేయుచుండగా మంత్రద్రష్టలైన మహర్షులకు వేదమంత్రములు ప్రత్యక్షమయి నట్టే నాకును స్వప్నములోఁ గొన్నియూహలు సాక్షాత్కారముకాఁగా, శాస్త్రజన్మముయొక్క క్రమమిట్టిదే కదా యని తెలిసికొని తోడనే నే నొకయభినవశాస్త్రనిర్మాణమున కారంభించినాను. మేలుకొన్నప్పుడును నిద్రపోవుచున్న ఇప్పుడును స్వప్నరూపమున నీశ్వరాదేశముచేత సన్నిధి చేసినయూహలను బట్టియు నాయనుదిన ప్రత్యక్షానుభవమును బట్టియు మూఁడుమాసములలో మహత్తరమయిన ప్రసాద జ్యోతిశ్శాస్త్రము నొకదానిని సాంగోపాంగముగా సాంతముచేసితిని. ఆశాస్త్రమంతయు వినిపించినచో గురూపదేశము లేనివారికి దురవగాహ మగుట యాలోచించి పూర్వోత్తరహాస్యకథనమును బట్టి మీరు గ్రహింపఁ గలిగిన మూఁల సూత్రములను ముఖ్యముగా నిందుదాహరించుచున్నాను:—

గీ. క్రొత్తగాడిదఁ బోఁగొట్టుకొన్నవాఁడు
వాలఖిల్యప్రసాదంబు వచ్చియరఁటి
పండ్లు దక్షిణ యిచ్చి పొందియె నేని,
దొరకు గార్దభంబది యింటిత్రోవలోనె. ౧

గీ. గోవృషంబులఁ బోఁగొట్టుకొన్నవాఁడు
వచ్చి కదళీఫలంబుల వాలఖిల్య
సన్నిధినిబుచ్చుకొన్నఁ బశుంబులోన
దొరకు గోవది బందెలదొడ్డిలోన. ౨

గీ. తనదుగాడిదఁ బోఁగొట్టుకొనినవాఁడు
వచ్చి రాహుకాలంబున భక్తితోడ
వాలఖిల్యప్రసాదంబుఁ బడసెనేని,
కంటఁబడ దెప్పుడును వానిగార్దభంబు. 3

మూలసూత్రములు దేవభాషయందే యున్నను స్త్రీశూద్రులు వానిని పఠింప రాదని సర్వజనోపయోగార్థముగా వానినిట్లు తెనిఁగించినాను. ఈయభినవ మహాశాస్త్రమునకు ప్రసాదజ్యోతిశ్శాస్త్రమన్న పేరెట్లు సార్థక మగునో మీరేయూహించి తెలిసికోవచ్చును. వాలఖిల్య ప్రసాదమువలనఁ గలుగు ఫలములను దెలుపుశాస్త్రమగుటచేత ప్రసాదశాస్త్రమును, ఆ యీఫలములకు జ్యోతిశ్శాస్త్ర సంబంధమునుగల్పించుటచేతఁ గొంతవఱకు జ్యోతిశ్శాస్త్రమును అయి యీపేరీయపూర్వశాస్త్రమున కన్వర్థమయినది. ప్రసాదమును స్వీకరించుకాలమునుబట్టి వారదోషములు, తిథిదోషములు, నక్షత్రదోషములు, రాహుకాలదోషములు, మొదలయిన కాలదోషములన్నియు నీయపూర్వశాస్త్రమునందు జొప్పింపఁబడియున్నవి. మొట్టమొదటవచ్చినచాకలివాఁడుతనగాడిద తప్పిపోయినందునకయి ప్రశ్న యడుగుటకు శుక్రవారమునాఁడు పదిగడియల ప్రొద్దెక్కి వచ్చి ప్రసాదస్వీకారము చేసినందున, నాఁడు

రాహుకాలము ౧౧ గడియల కగుటచేత వానికార్యము సఫలమయినది. మఱునాఁడు శనివారమునాఁడు వచ్చిన చాకలివాఁడును పదిగడియల ప్రాద్దెక్కియేవచ్చి ప్రసాదస్వీకారము చేసినను వాఁడు రాహుకాలము ౭½ గడియలకే వచ్చినందున వాని కార్యము విఫలమయినది.

"సూ॥ విధు సౌరీ భృగుసుతజ జీవభౌమార్క॥ త్రిపాద త్రిణి వృద్ధి॥" అను ముహూర్తదీపికా సిద్ధాంతమునుబట్టి రాహుకాలము సోమవారము ౩¾ గడియలకును, శనివారము ౭½ గడియలకును శుక్రవారము ౧౧¼ గడియలకును, బుధవారము ౧౫ గడియలకును, గురువారము ౧౮¾ గడియలకును, మంగళవారము ౨౨½ గడియల కును, ఆదివారము ౨౬¼ గడియలకును, మూఁడుగడియల ముప్పావు వృద్ధినొప్పునవచ్చుచుండును. ఈప్రసాదజ్యోతిశ్శాస్త్రములోని జ్యోతి శ్శాస్త్రమున్న యంతిమ శబ్దసారస్యమువలన, అభినవ వాలఖిల్య మహ ర్షియయిన నాసిద్ధాంతమునుసరించియే పూర్వమహర్షులును మన దేశము లోని జాతక ముహూర్త భాగముల నేర్పఱిచిరన్న పరమరహస్యమును గూడ బుద్ధిమంతులూహించి తెలిసికోవచ్చును. ఈప్రసాదజ్యోతి శ్శాస్త్రము బహుఫల ప్రదమయినదగుటచేత శాస్త్రవిశ్వాస మహనీయు లయిన మన దేశపు పెద్దలు దీనిని గురుముఖమున నుపదేశము నొంది భరతఖండమునందు వ్యాపింపఁజేసి యాసేతు హిమాచలమున సర్వజనులకును దానివలని యనంతములైన ఫలములను శీఘ్రకాలము లోనే కలిగింతురనుటకు సందేహము లేదు. అయినను వాలఖిల్య మూర్తి ప్రస్తుతమున మనదేశమునందు లేకపోవుటయొక ప్రతిబంధకము గాఁగనఁబడి దూరాలోచన లేనివారికి వాలఖిల్య ప్రసాదశాస్త్రము వ్యాపింపఁజేయుట దుస్సాధ్యమని తోఁచవచ్చును ; గాని, రామకృష్ణా దుల విగ్రహములను ప్రతిగ్రామమునందును నెలకొల్పి పూజింపఁగలిగిన మహాపురుషులకు వాలఖిల్యమూర్తిని ప్రతిగ్రామమునందును ప్రతి

క్షించి యనంత ఫలప్రదమయిన తత్ప్రసాదశాస్త్రమును వ్యాపింపఁ జేయుట పరమసాధ్యమే యని స్ఫురించకపోదు. నేను వ్రాయుటకుఁ దగిన పూఁకులు గాని గంటములు గాని యీదేశములో లేనందున నా ప్రసాదశాస్త్రమున కధిక గౌరవము కలుగుటకయి నేను దానిని వ్రాయకయే ముద్రాపకముగానే యుంచి మన మహర్షులు వేదమును కాపాడినట్లు కాపాడుచున్నాను. ఈ దేశమునందలి గంటములు మన గునపముల కంటె మూఁడురెట్లు పొడుగును రెండురెట్లు లావును గలిగియుండుటచేత వాని నెత్తుటకే నాకు సాధ్యముకాదు. ఇఁకనక్కడి తాటాకన్ననో మనపెద్ద పరుపులంతచేసి వెడల్పుకలవయి వానికంటె దశగుణములు నిడివి కలవిగా నుండును.

నాధర్మకర్తయైన మహాకాయుఁడొకనాఁడు నావద్ద నియమింపఁబడిన యర్చకులు నాకు మ్రొక్కుకొనువారు చెల్లించు ముడుపులు కానుకలు దక్షిణలు నిలువుదోపులు మొదలయిన వానినిగూర్చి క్రమమయినలెక్కలుంచి వచ్చినసొమ్మంతయు ప్రతిదినమును సరిగా ధర్మకర్తకుఁ బంపుచున్నారో లేదో విచారించుటకయి నన్నుంచిన యీాలయమునకువచ్చి నాయాదాయవ్యయములను విమర్శించి వారినిండ్లకుఁ బంపివేసి తరువాత వారు స్వామిసొమ్ము నేమయిన నపహరించుచున్నారాయని నన్నడిగెను. నేను చిఱునవ్వునవ్వి యడిగినదానికి తగిన సమాధానమియ్యక జ్యోతిషభూమిలోఁ దమకు విశదముగాని దేమున్నదని పలికి, జ్యోతిశ్శాస్త్ర ప్రశంసచేసి మొదటిసంగతి మఱపించి మెల్లగా నతనిని శాస్త్రచర్చకు దింపితిని. తిరుమల మొదలయిన దివ్యస్థలములలో భక్తులు సమర్పించు దేవుని సొమ్ములో పూజారులు మొదలయినవారు నిత్యకృత్యముగా చేసెడు కైంకర్యరహస్యములు మీాకు తెలియకపోయినను నేమిపోయెను మీాకా దేవరహస్యములను తెలపవలసిన యావశ్యకము మొదలే లేదుగదా ? నేను శాస్త్రచర్యకు దింపినతరువాత మహాకాయుఁడు జ్యోతిశ్శాస్త్రమునందు మహాభిమానమును సంపూ

ర్ణవిశ్వాసమును గలవాఁడయ్యును, తమదేశమునందిప్పుడు గ్రహగతి యనుకూలముగా లేనందునకుఁ గొంత సంతాపపడి యిట్లు సంభాషణ కారంభించెను:—

మహా—పూర్వమునందు మా రావణమహారాజుకాలములో గ్రహములన్నియు సదా మంచి స్థలములయందుండి యెల్లవారికిని సత్ఫలములనే యిచ్చుచుండెను. ఆమహారాజుపోయి విభీషణుఁడు రాజ్యమునకు వచ్చినతరువాత గ్రహములు రాంటిభయమువిడిచి యథేష్టముగా సంచరించుచు తమ యిచ్చవచ్చిన ఫలములనే యిచ్చుచున్నవి. అయినను జ్యోతిశ్శాస్త్రమునం దఖండపాండిత్యముగల మహానుభావుల యనుగ్రహమువలన గ్రహగతులవలని ఫలాఫలములుమాత్రము మాకిప్పుడు తెలియుచున్నవి.

సత్య—గ్రహముల గతిదోషములను తప్పించుకొనుటకయి యీదేశమునందు సాధనములున్నవా?

మహా—ప్రయాణాదులయందు మంచి ముహూర్తములు పెట్టించుకొని పని యారంభించుట యొక్కటి సాధనము గనఁబడుచున్నది. అంతకంటె వేఱుగతిలేదు.

సత్య—ఈదేశస్థులు ప్రయాణాది సమస్తకార్యములయందును మంచి ముహూర్తములు పెట్టించుకొని శుభలగ్నమునందే కార్యారంభము చేయుచున్నారా?

మహా—సాధ్యమయినంతవఱకు చేయుచునేయున్నారు. మఱి మీదేశమునందో?

సత్య—మాదేశమునందును జనులు శాస్త్రబద్ధులయి నడుచుకొనుచున్నారు కాని—

మహా—ఏమో "కాని" యనుచున్నావు. మీవారు శాస్త్రవి

శ్యాపము లేనివారయి కొందఱు విహితధర్మములను మీాఱి నడుచుచున్నారా?

సత్య—మావా రెప్పుడును బుద్ధిపూర్వకముగా శాస్త్రమర్యాదలను మీాఱువారుకారు. అయినను మాదేశమునం దిప్పుడు ప్రభుత్వము చేయుచున్న హూణులు క్రొత్తగానావిరియంత్రములను కల్పించి, సెటి యావిరియొక్క బలముచేత సినుపదారులమీాఁద తిథి వార నక్షత్రహోరాత్రనియమమును పాటింపక నిర్ణీత సమయమునందు ప్రతి దినమునుపొగబండ్లను వాయువేగమున నడిపించుచు జనులశాస్త్ర చోదితాచారములకు భంగము చేయుచున్నారు. అందుచేత జనులిప్పుడు శాస్త్ర మర్యాదల నంతగా పాటింపక ప్రయాణసౌలభ్యమునుబట్టి పొగబండ్లలో నెక్కి జ్యోతిష్కులు పెట్టినముహూర్తములనుమాని జాతివా రేర్పఱిచిన వేళలలోనే యాత్రలుచేయ మొదలు పెట్టినారు.

మహా—ప్రయాణసౌలభ్యమును బట్టి శాస్త్రవిధుల నతిక్రమించుట మహాదోషము. అందులోను జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతములను మీాఱిన పాపమును మించిన మహాపాతకము లోకములో మఱియొకటి యుండదు. మఱియేపాపమునకై నను నిష్కృతికలదుగాని యీాపాపమునకు నిష్కృతి లేదు. దేశాభిమానులందఱును జేరి పొగబండ్లలో పోయినవారిని జాతినుండి బహిష్కారము చేసెదమని దోషజ్ఞసమయము చేయరాదా?

సత్య—శిష్టాచార సంపన్నులయిన శ్రోత్రియశిఖామణు లనేకులు పొగబండ్లలో ప్రయాణము చేయుట పాపమని బోధించినారుగాని జనుల యనాదరమువలనను ధర్మ సంస్థాపకులయిన ప్రభువులు లేని లోపమువలనను వారి యుపదేశములన్నియు నరణ్య రోదనము లయిపోయినవి. ప్రయాణములకు ముహూర్తములు పెట్టించువారు

లేక విధినిహితమయిన తమ వృత్తికే భంగమురా నారంభించినందున జ్యోతిష్కులందఱును జేరి ముహూర్తములు పెట్టించుకొనకుండ యాత్రలుచేయుట పాతకములలో నెల్ల ఘోరపాతకమనియు కాలజ్ఞలయిన విప్రోత్తముల జీవనాధారమును మూలచ్ఛేదము చేయుట దోషములలోనెల్ల మహాదోషమనియు ఘోషపెట్టిరి. రాజావలంబము లేకపోవుటచే వారిఘోషము లన్నియు చెవిటివానిముందఱి శంఖఘోషములే యయినవి.

మహా—ఆహాహా! మీదేశమున కిప్పుడెంత కష్టమువచ్చినది! అయ్యో! శాస్త్రము న్యాయముగా చెడిపోవుచున్నదే! జనులను సన్మార్గమునసడిపించుటకు మీదేశములో మతగురువులు లేరా? పీఠాధిపతులు లేరా? ఎవ్వరును లేకపోయినను మతాభిమానులందఱును జేరి పొగబండ్లను ప్రతిస్థలమునుండియు రాహుకాలములను వర్జ్యములను వారశూలలను గ్రహవేధలను నక్షత్రదోషములను తారాబలములను చంద్రబలములను విచారించి మఱి బయలుదేఱదీయునట్లు శాసన మేర్పఱుప వలసినదని ప్రభుత్వమువారికి సంఘవిజ్ఞాపనములు పంపుకొనరాదా?

సత్య—ఈ యాలోచన సర్వోత్తమముగానున్నది. ఇటువంటి మంచి యాలోచన యీవఱకు మావారలబుద్ధులకు గోచరము కాలేదు. మా దేశము చేరఁగానే యీసంఘవిజ్ఞాపనల విషయమయి నేను కృషిచేసి దొరతనమువా రొకవేళ నా మొఱ్ఱ వినకపోయినను నాదేశాభిమానమాననీయతను గనఁబఱిచి దేశమునకు మహోపకారము చేసెదను.

మహా—అట్లుచేయుము. అక్కడ మీకేగాని మీప్రభుత్వము వారికి జ్యోతిశ్శాస్త్రవిశ్వాసము లేనట్టున్నది.

సత్య—లేదు. వారికి ముహూర్తములు లేవు; జాతకములు లేవు; ఏమియు లేవు.

మహా—గ్రహములు వారిని బాధించవా ?

సత్య—బాధించవు. అమావాస్యనాఁడు బయలుదేఱినను వారికి కార్యసిద్ధి యగుచున్నది. శూన్యమాసములో శనివారమునాఁడు దుర్ముహూర్తపువేళ లగ్నముపెట్టి వివాహము చేసికొన్నను దంపతులు సంతానవంతులయి వర్ధిల్లుచున్నారు. గ్రహములుకూడ వారికి భయపడి నట్లు తోఁచుచున్నది.

మహా—నీకు తోఁచుచున్నది సత్యమే. పంచభూతములను లోఁబఱుచుకొని నిప్పుచేతను నీళ్ళచేతను బండ్లులాగించువారికి గ్రహములు భయపడి లోఁబడుట యాశ్చర్యముకాదు. ఏమియు భయము చేత కార్యసిద్ధిచేసినట్లు భక్తిచేత చేయవు. వెనుక మారావణునికిని భయముచేతనే కదా సూర్యచంద్రాది గ్రహములును వాయువైశ్వానరాది భూతములును చెప్పినచోట్లనుండి సేవచేయుచు వచ్చినవి.

సత్య—అది సత్యము. ఆహా! ఏమి మీబుద్ధివిశేషము ! మీకుఁ గల వర్ణనీయమయిన శాస్త్రాభిమానము మీబుద్ధివిశేషము నకు వన్నె తెచ్చుచున్నది !

మహా—దేనిని విడిచినను శాస్త్రాభిమానమును మాత్రము విడువరాదు. శాస్త్రవిశ్వాసముచేత నేను విధ్యుక్తముగా వివాహము చేసికొన్న ధర్మపత్నిని సహితము తృణప్రాయముగా విడిచిపెట్టినాను.

సత్య—ఓహో! మీరు త్రిలోకపూజ్యులుగా కనఁబడుచున్నారు. మీచిత్రచరిత్రమును నాశ్రోత్రపేయముచేసి నన్ను చరితార్థుని జేయుఁడు.

మహా—నాప్రథమభార్య వృషభలగ్నమున లగ్నమందు చంద్రుఁడును సింహమందు సూర్యుఁడును వృశ్చికమందు గురుఁడును కుంభమందు శనైశ్చరుఁడును ఉండఁగా ప్రథమకుమారుని గన్నది. ఇట్టి లగ్నమందుఁ బుట్టినవాఁడు జారజాతుఁడని శాస్త్రదృష్టిచేతఁ జూచినవాఁడనయి గుణవతియైన యాభార్యను తత్క్షణము త్యజించినాను.

సత్య—"వృషస్థేందౌలగ్నే సవితృగురుతీక్ష్ణాంశుతనయై స్సుహృద్వాఖస్థైర్భవతినియమాన్మానవపతి" అను వరాహమిహిరవాక్యమునుబట్టి మీరుచెప్పిన రాజయోగమునందుఁ బుట్టినవాఁడు జారజుఁడు గాక మానవపతికావలెను...

మహా—ఆవిషయమయి చర్చ యక్కఱలేదు. జారజుఁడు మానవపతియైనను వివర్జింపవలసినదే.

సత్య—మీ భార్యయందు జారత్వదోష మున్నట్టు మీ రావఱ కెన్నఁడయిన విన్నారా?

మహా—పుత్రజన్మముచేత శాస్త్రము చెప్పువఱకును నాభార్యయట్టిదని నేను స్వప్నావస్థయందును ననుకోలేదు. అది మహాపతివ్రతయనియే యెల్లవారును నేఁటివఱకును విశ్వసించి, నేను దానిని నిష్కారణుఁడనయి నిష్కారణముగా పరిత్యజించితినని నన్నూరక నిందించుచున్నారు. జారత్వ మెప్పుడును గూఢముగా జరుగునదిగాని యొకరికిఁ దెలియునదికాదు. సర్వజ్ఞకృతమయిన శాస్త్రము చెప్పుదానికంటె జనుల కెక్కువ తెలియునాయని శాస్త్రవిశ్వాసము గలవాఁడనయి, జనులనిందలను లక్ష్యముచేయక ప్రత్యక్షసాక్షియైన శాస్త్రమును బట్టి భార్యాపరిత్యాగముచేసి నేను మావంశపరిశుద్ధతను నిలుపుకొన్నాను.

సత్య—పాపము! ఆ మెగతి యేమయినది?

మహా—దాని కేమిలోపము? దానికితగిన భరణ మేర్పఱిచి నేను మఱియొక కన్యను పాణిగ్రహణము చేసికొన్నాను. నాద్వితీయ భార్యకు నిర్దోషమయిన సుముహూర్తమునందు ప్రథమపుత్రజననమయినది. ఆశిశుజన్మమైనది యెంత మంచిలగ్నమో యెఱుఁగుదువా? వాని జననసమయమునందు బృహస్పతి యేకరాశిగతులయిన సూర్యచంద్రులను చూడక చక్కగానున్నాఁడు.

సత్య—ఆహా! ఏమి మీశాస్త్రవిశ్వాసము!

మహా—ఏమి? నాశాస్త్రవిశ్వాసమున కంత యాశ్చర్య పడుచున్నావు! మీదేశమునందు శాస్త్రవిశ్వాసములేదా?

సత్య—కావలసినంత యున్నది. మాతుల మరణ యోగము వంకు శిశువులు పుట్టినపక్షమున తమగండములను తప్పించుకొనుటకయి మేనమామలు మొదలయినవారు శాస్త్రవిశ్వాసముచేతనే మంత్రసానులకు లంచమిచ్చి శిశువులను చంపించివేయుదురు. అయినను మాదేశమునం దింగ్లీషు చదువుచేత నట్టి సత్యములనునమ్మని నాస్తికులు కొందఱిప్పుడు బయలుదేఱుచున్నారు.

మహా—కలికాలమహిమచేత నట్టిబౌద్ధులు మాద్వీపమునందును గొందఱు వెలసి జ్యోతిష మబద్ధమని కుత్సితబుద్ధివాదములుచేయుచున్నారు. ఈసారి నిన్ను వారిసభలకుఁ దీసికొనిపోయెదనులే.

సత్య—ఆనాస్తికాథముల సభలకు నన్నుఁ గొనిపోవుటకంటె ముందుగా మీరీవఱకు వాగ్దానముచేసియున్న ప్రకారముగా నన్నొకసారి శాస్త్రవిశ్వాసము గల పండితసభకుఁ దీసికొనిపోయి జ్యోతిష్కులు న్యాయముతీర్చు విధమును జూపుఁడు.

మహా—మంచిది. ఈమాటలసందడిలో నీకు శివపూజాసమయము మించిపోయినట్లున్నది. ఆఁకలిచేత నీకన్నులు గుంటలు పడిపోయినవి. నేను లోపలికిఁ బోయి మందోదరిచేత నీకు నైవేద్యము పంపెదను. భక్తులు దేవతాదర్శనమునకు వచ్చుచువేళకూడ నగుచున్నది. (అని లోపలికిఁ బోయెను.)

ఆమహాకాయుఁడు చెప్పినదానినిబట్టి యాతని రెండవభార్యకు పుట్టినకొడుకు జారజాతుఁడని యెంచఁగినవాఁడనయి,

శ్లో॥ స్వలగ్నమిందుంచగురుర్నిరీక్షతే నవా శశాంకంరవిణాసమాగతమ్
 సపాపకోర్కేణ యుతోథవాశశీ పరేణజాతంప్రవదంతి నిశ్చయాత్.

అని యేకరాశి గతులయిన సూర్యచంద్రులను బృహస్పతి చూడకున్న కాలమునఁ బుట్టినవాఁడు నిశ్చయముగా జారజుఁడన్న బృహజ్జాతక వచనమునకు ప్రత్యక్ష విరుద్ధముగానున్న వారిశాస్త్రము సత్యము కాదని నాలో నేననుకొని, అతనికిఁ గోపము వచ్చునన్న భయముచేత నతనితో నేతద్విషయమును గూర్చి ప్రస్తావింపక వారిది రాక్షస శాస్త్రమగుటచేత నట్లు వ్యత్యస్తముగా నున్నదని నిశ్చయము చేసికొని యప్పటి కూరకుంటిని.

నాలవ ప్రకరణము.

వెనుకటి ప్రకరణమునందుఁ జెప్పిన ప్రసంగము నడిచిన నాలుగు దినముల కొకనాఁటి మధ్యాహ్న సమయమునందు నా యజమానుఁ డయిన మహాకాయుఁడుగారు నాయొద్దకువచ్చి, నేఁడు రాజసభ జరగఁబోవుచున్నది గనుక జ్యోతిషవిద్వాంసులు చెప్పు తీర్పులయొక్క రీతిని జూచి యానందించుటకయి నీకోరిక ప్రకారముగా నిన్నక్కడకుఁ గొనిపోవ వచ్చినానని సెలవిచ్చెను. నే నాయన యాజ్ఞను శిరసావహించి తత్క్షణమే యుచిత వస్త్రాదులను ధరించి యరగడియ లోపలనే ప్రయాణమునకు సంసిద్ధుఁడను కాఁగా నాయజమానుఁడు నా యాలయముయొక్క తలుపులు మూయించి నన్నుఁ గొనిపోయి తన గుఱ్ఱపుబండిలో తానుఁ గూరుచున్న మెత్తమీఁద నన్ను తన కుడివైపునఁ గూర్చుండఁబెట్టుకొనెను. నేనెక్కిన బండి రాక్షసిబండి యనియు, దానికిఁ గట్టఁబడిన గుఱ్ఱములు రాక్షసి గుఱ్ఱములనియు, నేనిప్పుడు వేఱుగఁ జెప్పనక్కఱలేదుగదా ! ఆబండి ధవళశైలపు కొండంతయున్నది ; దానికిఁ గట్టఁబడిన గుఱ్ఱములును ఒక్కొక్కటి పదియేనుఁగు

లంత లేసియుండి నాదృష్టికి నడగొండలవలెఁ గానఁబడినవి. ఉత్సవ విగ్రహములను దేవాలయములలోని యర్చకులు మోసికొని పోవునట్లుగా నాయజమానుని సేవకులు నన్ను తమచేతులలోఁ గొనిపోయి యాశకటమునందుఁ గూరుచుండఁ బెట్టఁగా, భయముచేత నిశ్చేష్టుఁడనయి దేవాలయములోని పీఠముమీఁద దేవుఁడు కూర్చున్నట్లుగా భూదేవుఁడనైన నేనును కదలమెదలక యందలి మెత్తమీఁద గూరుచున్నాను. కొంతసేపటికి తెలివి తెచ్చుకొని నేను ముందు చూచునప్పటికి గుఱ్ఱములు బండి నీడ్చుకొని వాయువేగమున బరుగెత్తుచుండినవి; బండిచక్రముల చప్పుడు మేఘగర్జనమువలె చెవులు చిల్లులు వోవునట్లు కర్ణకఠోరముగా వినఁబడఁ జొచ్చినది. ఈయవస్థలో గాలిలోఁబెట్టిన దీపమువలె వెనుకకును ముందునకును బండికుదుపుచేత నూఁగులాడుచు ప్రాణములు బిగఁబట్టుకొని మెత్తకుఁ గుట్టిన పగ్గములవంటి దారములను రెండుచేతులతోను గట్టిగాఁ బట్టుకొని యరగంటసేపు గూరుచుండునప్పటికి సభామందిరము సమీపించినందున బండినిలిచినది. అప్పుడు మహాకాయుఁడుగారు బండిదిగి సభాగృహద్వారమువద్దకి నడవఁగా వెనుకనుండి భృత్యులు తదాజ్ఞానుసారముగా నన్నుఁ గొని వచ్చి యాయనచేతి కందిచ్చిరి. నావంటి యల్పుఁడు దమవంటి ఘనులు మోచుట ధర్మముకాదని నేనాయనతో నా వినయవిధేయతలు తేటపడునట్లుగా మనవిచేసి నన్ను మఱియొకరి చేతికియ్యవలసినదని ప్రార్థించినను, ఆయన నాప్రార్థన నంగీకరింపక నీచసేవకులు సభాభవనములోనికిఁ బోఁగూడదను హేతువుచేతఁ గాఁబోలును నన్ను స్వయముగానే చేతులలో నెత్తుకొనిపోయి ధర్మాధికారిగారు చూపిన పీఠముమీఁదఁ దాను గూరుచుండి నన్ను తన ప్రక్కను గూరుచుండఁ బెట్టుకొనెను. మేమక్కడకుఁ బోవునప్పటికే సభాస్తారులందఱును వచ్చి తమ కర్హములయిన పీఠములమీఁద నాసీనులయి యుండఁగా,

సభయంతయు వ్యవహారమును జూడవచ్చిన మహాజనులతో నిండిపోయి నది. వారిలో ధర్మాధికారియగు ఖరుఁడు దక్షిణముఖముగా నొక్క యున్నతాసనముమీఁదఁ గూరుచుండి యుండెను. ఆయనకు కుడి ప్రక్కను రెండుమూఁడు బారల దూరములో వరుసగా వేసియున్న పీఠములపయిని పంచామరతరువులవలె జ్యోతిషవిద్వాంసు లయిదు గురు తలలకు శాలువులు చుట్టుకొని చెవులను కుండలము లల్లలనాడ గంభీరముగాఁ గూరుచుండి యుండిరి. వారి నామములు వరు సగా వృశ్చికరోముఁడు, సర్పరోముఁడు, ఖడ్గరోముఁడు అగ్నిరోముఁడు, కంటకరోముఁడు అని తరువాత నేను మాయజ మానునివలనఁ దెలిసికొన్నాను. రోమకసిద్ధాంతము నభ్యసించుట చేతనో మఱియే హేతువుచేతనో కాని యాదేశమునందు సామాన్య ముగా జ్యోతిషసిద్ధాంతులు నామముల చివరను రోమశబ్దము చేర్పఁ బడుచున్నది. ఆమహావిద్వాంసులకును ధర్మాధికారికిని నడుమగా లేఖ నోద్యోగి యొకఁడు నిలువఁబడియుండెను. అప్పుడు నిలువఁబడియున్న యాలేఖకుని పేరు రతికాయుఁడు. రాజభటులు చేతు లాడించుచు మాట్లాడుచున్నవారి నూరకుండుఁడని కేకలు వేయుచుండఁగా, ధర్మాధికారి తలయెత్తి చూచి లేఖకుని వైపునకుఁ దిరిగి వ్యభిచార వ్యవహారమును విమర్శించుటకు ముందుగా నందలి వాది ప్రతివాదుల నెదుటఁ బెట్టింపుమని యుత్తరువు చేసెను. అతఁడు రాజభటులను జూచి ప్రహ స్తుని వజ్రహస్తుని కైకసిని దీసికొనిరండుని చెప్పెను. వారు వెంటనే పోయి యుద్దఱు ప్రహస్తులను కైకసిని దీసికొనివచ్చి యెదుట నిలిపిరి.

లేఖ—భటులారా! మీరిద్దఱు ప్రహస్తులను దెచ్చినారేమి? వీరిలో వజ్రహస్తుఁడెవరు? ప్రహస్తుఁడెవరు ?

భటు—మేము వాదిప్రతివాదులను గొనిపోయి యొకగదిలోఁ బెట్టి యీవలఁ గూరుచుండఁగా ప్రభువువారు పిలిచెడిలోపల వారిలో.

వజ్రహస్తుఁడు తన కామరూప ప్రభావముచేత ప్రహస్తుఁడుగా మాఱి పోయినాఁడు

ఇట్లేకరూపమును బొందినవారిరువురిలో నెవ్వఁడు ప్రహస్తుఁడో యెవ్వఁడు వజ్రహస్తుఁడో నిర్ణయించుటకు శక్యముకానందున వారిలో నొకనిని మొదటి ప్రహస్తుఁడనియు నింకొకనిని రెండవప్రహస్తుఁడనియు నిజము తెలియువఱకును జెప్పవలసి యున్నది.

ధర్మా—నిష్కారణముగా మాకు శ్రమకలుగఁజేయక మీలో నిజమైన ప్రహస్తుఁ డెవఁడో శీఘ్రముగాఁ జెప్పుఁడు.

మొ—ప్రహ—నేనే నిజమయిన ప్రహస్తుఁడను. ఇతఁడు మాయప్రహస్తుఁడు.

రెం—ప్రహ—నేను నిజమయిన ప్రహస్తుఁడను. ఇతఁడుమాయ ప్రహస్తుఁడు.

ధర్మా—మీరబద్ధము లాడఁగూడదు. మీలో వజ్రహస్తుఁ డెవఁడు ?

మొ-ప్రహ—అతఁడు వజ్రహస్తుఁడు.

రెం-ప్రహ—అతఁడు వజ్రహస్తుఁడు.

లేఖ—ఈ వ్యవహారము చక్కఁగానే యున్నది. సత్యము నుకను గాని శిక్షించువఱకును వీరిలో నొక్కరును నిజముచెప్పరు. ఈసత్యా సత్యముల నిప్పుడీవిద్వాంసులే నిర్ణయము చేయవలెను.

ధర్మా—ఆసంగతి తరువాత చూచుకొందము గాని ముందుగా మీయభియోగమేదో వాది సభవారితో మనవిచేయవలెను.

మొ-ప్రహ—కైకసియను నీకామిని నాభార్య. నేనింట లేనప్పుడీ వజ్రహస్తుఁడు నావేషము వేసికొనివచ్చి—

రెం-ప్రహ—చీ ! చీ ! అబద్ధములాడకు—ప్రహస్తుఁడవు నీవా? నేనా ?—ఓ మహాప్రభూ ! న్యాయప్రభువులు నామొఱ్ఱ యాలకింప

పలెను. కైకసియును నీ కామిని నాభార్య. నేనింట లేనప్పుడీ ప్రహస్తుఁడు నా వేషము వేసికొనివచ్చి——

ధర్మా——ఇంక వీరివలన సత్యము బయలుపడదు.——ఓకైకసీ! వీరిలో నీభర్త యెవ్వఁడో నీవు చెప్పుము.

కైక——(ఇరువురి మొగములవంకఁ జూచి) ఓమహాప్రభూ! నేను గదిలోనున్నప్పుడు నాభర్తకు కుడివైపునఁ గూరుచున్నాను. అప్పుడు కూరుచున్నట్లు కూర్చుండఁబెట్టినపక్షమున నాభర్త యెవ్వరో నేను జెప్పఁగలను. రాజభటులు వారి నిక్కడకుఁ దీసికొనివచ్చినప్పుడు తమతమ స్థానములను వదలి వారిద్దఱును గలసి పోయినారు. ఇప్పుడు నేనెవ్వరివంకఁజూచిన నతఁడే నాభర్తగాఁ గనబడుచున్నాఁడు.

మొ.ప్రహ——ఓప్రాణేశ్వరీ! నావంక తిన్నఁగా జూడు. నేను నీభర్తను కానా?

రెం-ప్రహ——ఓప్రాణేశ్వరీ! అతనివంకఁ జూడక నావంకఁ జూడు. నేనే నీకుభర్తనుకానా?——ఓక్రి వంచకుఁడా? నీవు మాయ చేసినంతమాత్రమున పెండ్లినాఁటినుండియు నన్నెఱిఁగిన నాధర్మపత్ని నిన్ను భర్తయనుకొను ననుకొన్నావురా?——ఓప్రాణేశ్వరీ! నిజము చెప్పవేమి?

కైక——మీరారే నాప్రాణవల్లభులలాగున నున్నారు.

మొ-ప్రహ——ఓప్రాణేశ్వరీ! యీమోసగాని మాయమాటలను నమ్మి మోసపోకు, నీవిందాక నాకుడిప్రక్కను గూరుచుండలేదా? యింతలోనే నన్ను గుఱుతుపట్టలేక పోయినావా? నేనే నీకు నిజమయిన భర్తనగుదునో, కానో నా మొగముచూచి చెప్పుము.

కైక——మీరారును నాప్రాణవల్లభులలాగుననే యున్నారు.

ధర్మా——ఈయంశమిూలాగున తేలదు. నీభర్త యెవ్వరో యీమాట యటుండనిచ్చి నేరముజరిగినదో లేదో నిజముచెప్పుము.

కైక—నాభర్తనుదప్ప నేను పరపురుషుని కన్నెత్తి చూడ లేను.

ధర్మా—అదికాదు. ఈయభియోగ పత్రికలోఁ జెప్పఁబడిన కాలమున నొకపురుషుఁడు శయనగృహమున నీయొద్దనున్నాఁడా?

కైక—నాభర్త నాయొద్దనున్నాఁడు

మొ-ప్రహా—అక్కడున్నవాఁడు నీభర్తగాఁడు. నీభర్తయొక్క రూపమును ధరించివచ్చిన వజ్రహస్తుఁడు.

రెం-ప్రహా—ఆమాట పరమసత్యము. ఆవేషము వేసికొని వచ్చి స్త్రీతో నున్నవాఁడు వంచకుఁడయిన వజ్రహస్తుఁడే.

ధర్మా—ఇటువంటి వ్యవహారములలో పెద్దమనుష్యులు సభల కెక్కరాదు. ఎక్కినపక్షమున నుభయుల గౌరవమును బోవుటయే కాక యిల్లాండ్రకుఁగూడ నపఖ్యాతివచ్చును. ఈవిషయములో వాది ప్రతివాదు లిద్దఱును సఖ్యపడి సమాధాన పడవలెను.

మొ-ప్రహా—సభ కెక్కిన యీవ్యవహారములో నిఁక సఖ్యము కుదురదు. ధర్మాధికారులు సత్యము కనిపెట్టి దోషిని క్రూరముగా శిక్షింపవలెను.

రెం-ప్రహా—ఈ వజ్రహస్తుఁడు చెప్పినమాట సర్వజనశ్లాఘా పాత్రముగా నున్నది. ఏలినవారు దోషికి క్రూరదండనము విధింప వలెను.

మొ-ప్రహా—ఓరీ ద్రోహీ! వజ్రహస్తుఁడవు నీవా! నేనా?

రెం-ప్రహా—ఓరి వంచకుఁడా! నీవు వజ్రహస్తుఁడవుగాక మఱి యెవ్వఁడవురా? నీవు లోకమును వంచింపఁదలఁచుకొన్నను శ్రీమహేశ్వరుని పంచముఖములవలెఁ గూరుచున్న యీ పండితపంచకమైనను నీమోసము తెలిసికోలేదనుకొన్నావురా? ఓరిపాపాత్ముఁడా! ఓరి క్రూర—

ధర్మా—మీలో మీరు పోట్లాడక యూరకుండుఁడు.—ఓ విద్వదగ్రగణ్యులారా! మీరే యిప్పుడు శాస్త్రసిద్ధాంతానుసారముగా ధర్మనిర్ణయము చేయవలెను. నిజముచెప్పక యింతసేపు మాకు నిష్కారణముగా నాయాసము కలుగఁజేసినందునకయి యీసారి యపరాధికి మే మతిఘోరశిక్ష విధింపఁదలఁచుకొన్నాము. మీరిప్పుడు సిద్ధాంతీకరింపవలసిన యంశములు—౧. వీరిలో వజ్రహస్తుఁడెవఁడు; ౨. వజ్రహస్తుఁడు నేరము చేసినాఁడా, లేదా? ౩. ఈమె నిజమయిన కైకసి యగునా! కాదా?—ముఖ్యముగా నీమూఁడంశములను మీరు శాస్త్రపద్ధతిని నిర్ధారణము చేయవలెను.

అని ఖరాసురుఁడు సెలవియ్యఁగానే సిద్ధాంతులాకాశమువంకఁ జూచియు వ్రేళ్ళు మడచియు నేలమీఁద నంకెలు వేసియు ముకుపుటముల వ్రేళ్ళు చొనిపియు నొండొరులతో గుసగుసలాడియు లెక్కలువేసి తలపోఁతలకుఁ జొచ్చిరి. ఈలోపల ధర్మాధికారి పీఠముమీఁద వెనుక కొఱిగి యొక్క కునుకు కునికెను. సభలో నిలిచియున్న యుభయవాదుల పక్షములవారును విద్వాంసు లేమి సెలవిత్తురో యని విననుత్సుకులై వేచియుండిరి. చూడవచ్చినవారందఱును వివిధవిషయములనుగూర్చి తమలోఁదాము సంభాషించుకొనుచుండిరి. ఈప్రకారముగా రెండుగడియలసేపు నడచునప్పటికి సిద్ధాంతులలో నొకరు లేఖకునిఁ బిలిచి తమయభిప్రాయములను వ్రాయవలసినదని చెప్పెను. మనదేశమునందు వలెనే యీదేశమునందును విద్వాంసులకు శాస్త్రజ్ఞానమేకాని యక్షరజ్ఞాన ముండదు. అందుచేతనే యీదేశమునందు వైయాకరణుఁడు తన చుట్టముల కుత్తరము వ్రాయవలసివచ్చినను లౌకికుల నొద్దకుఁబోయి వ్రాయించుకోవలసినవాఁడే కాని స్వయముగా వ్రాసికోనేర్చినవాఁడు కాఁడు. ఆసంగతి యటుండనిచ్చి కార్యాంశమును చిత్తగింపుఁడు. లేఖకుఁడు ధర్మా

ధికారిని లేపినపిమ్మట జ్యోతిష్కులు తమ సిద్ధాంతములను దెలిపిరి. వారిలో వృశ్చికరోముఁడును కంటకరోముఁడును రెండవ ప్రహస్తుఁడే వజ్రహస్తుఁడనిచెప్పిరి. తక్కిన ముగ్గురును మొదటిప్రహస్తుఁడే వజ్రహస్తుఁడనిరి. ఇఁక రెండవసారాంశములో వృశ్చికరోముఁడునుకంటకరోముఁడునువజ్రహస్తుఁడు నేరముచేసినాఁడనిరి. అగ్నిరోముఁడును, సర్పరోముఁడును వజ్రహస్తుఁడు నేరము చేయలేదనియు నతనియందలి ద్వేషముచేత భార్యాభర్తలకు లేకమయి యీదోషారోపణముచేసినారనియు పలికిరి. మూఁడవసారాంశమును గూర్చి యేవురుసిద్ధాంతులును నైకకంఠ్యముతో నామె నిజమయినకైకసి యనియే సిద్ధాతము చేసిరి. అప్పుడు వాదిబంధువు లగ్నిరోమ సర్పరోములు వజ్రహస్తునివలన లంచముగొనిరని కేకలు వేయఁజొచ్చిరి; ప్రతివాదిబంధువులు వృశ్చికరోమాదులు ప్రహస్తునివలన లంచములు గైకొనిరని కేకలువేయ నారంభించిరి. ధర్మాధికారి వారికలకలములువారించి సిద్ధాంతులలో నధికసంఖ్యగలవారి యభిప్రాయాను సారముగా వజ్రహస్తునికి రెండుసంవత్సరములు గారాగృహవాసశిక్ష విధించినట్లు తీర్పు వ్రాసి వినిపించెను. సిద్ధాంతుల యభిప్రాయము ననుసరించి తనకు శిక్షయగునని మొదటిప్రహస్తుఁడు వడవడ వడఁకుచు భూమిమీఁదఁబడి మూర్ఛపోయెను. అందఱును మూఁగి చన్నీళ్ళు చల్లి యాతనిని మూర్ఛ తేర్చునప్పటికా సందడిలో రెండవ ప్రహస్తుఁడు కనఁబడక యదృశ్యుఁడయ్యెను. అప్పుడా యంతర్ధానము నొందినవాఁడే నిజమయిన వజ్రహస్తుఁడని యెల్లవారికిని బోధపడెను. ధర్మాధికారి రాజభటులను జూచి యీఁగయయి యతఁ డెగిరిపోయి యుండును. పట్టుకొండని రాజభటుల కాజ్ఞాపించెను. వారు నానాముఖముల నరచుచు పరుగెత్తిరికాని వారికంటి కెవ్వరును నక్షత్రమండలము లోపలఁ గాన బడలేదు. ఈప్రకారముగా మొదటి వ్యవహారము

తీర్పఁబడిన తరువాత దొంగతనపు వ్యవహారమును తీర్చుటకయి నేరము మోపినవానిని మోపఁబడినవానిని పిలిపింపుమని మరల ధర్మాధికారి లేఖకుని కుత్తరువు చేసెను.

అంతట లేఖకుని యొక్క యాజ్ఞానుసారముగా రాజభటులు దూషణుని ఘాత్రమాత్రుని గొనివచ్చి ధర్మాధికారియెదుట నిలువఁబెట్టిరి.

ధర్మా—ఓ దూషణా! నీవు తెచ్చిన యభియోగమేమి?

దూష—ఈ ఘాత్రమాత్రుఁడు మాబంధువర్గములోనివాఁడు. దుస్సహవాసము చేత నితఁడు చిన్ననాఁటినుండియు దుష్టవర్తనుఁడయి జూదములాడుచు పూర్వు లార్జించియుంచిన ధనమునంతను పాడుచేసి విచ్చలవిడిగాఁ దిరుగుచున్నాఁడు. ఇతఁడు తన తల్లిదండ్రులు విధ్యుక్తముగా వివాహము చేసిన భార్యను విడనాడి జారవృత్తి నవలంబించి యొక వేశ్య నుంచుకొని యున్నాఁడు. విత్తములేనిదే వేశ్యచిత్తమును గొనుట యెవ్వఁడును సంభవింపనేరదు గనుక, విత్తహీనుఁడయినప్పుడు జారత్వమును చోరత్వ మనుసరించి యుండకమానదు. ఇతఁడు కొంతకాలము క్రిందట మాయింటికి చుట్టపుఁజూపుగావచ్చి చావడిలో నాడుకొనుచున్న మాచిన్నదానినగయొకటి త్రెంపుకొనిపోయి వేశ్య కిచ్చినాఁడు. రక్తస్పర్శ గలవాఁడగుటచేత మేమప్పుడీతనిని రచ్చకీడ్వక చీవాట్లుపెట్టి క్షమించి యూరకున్నాము. నిన్నటిదినము మాయింటికి మరల వచ్చి నా భార్యనగలపెట్టె యెత్తుకొని పాఱిపోయినాఁడు. పిల్లది చూచి యఱవఁగానే మేము వెంటఁబడితిమిగాని యితఁడు వీధిఁబడి యేదో సందులోదూఱి యదృశ్యుఁడయినాఁడు.

ధర్మా—తరువాత నగలపెట్టె దొరకినదా?

దూష—దొరకలేదు. నేను వెంటనే రాజభటులను గొని

యితనియింటికిఁ బోయినాము. అప్పుడితఁడింటలేఁడు. ఇల్లు శోధించినాము గాని పెట్టె దొరకలేదు.

ధర్మా—ఇతఁడింటికే రానప్పుడు పెట్టె యెట్లు దొరకును? మీరు మొట్టమొదట వేశ్యయింటికిఁ బోవలసినది.

ధూమ—ఆపనియుఁ జేసినాము. పెట్టె కాని యితఁడు కాని యింట దొరకకపోఁగా మేమక్కడనుండి తిన్నగా వేశ్యయింటికిఁబోయి దాని యిల్లు శోధింపఁగా నొక మూలగదిలో నితఁడు దొరకెనుగాని పెట్టె మాత్రము దొరకలేదు. రాజభటులీతనిఁ బట్టుకొని దేవగసన్నిధికిఁ దెచ్చినారు. ఇతఁడు నగలపెట్టెను చంకక్రిందఁ బెట్టుకొని పరుగెత్తుచుండఁగా మేమందఱమును గన్నులారఁ జూచినాము.

ధర్మా—ధూమ్రమాతా! నీవేమి చెప్పకొనెదవు? నీవు రాజబంధుఁడవయ్యును నీదుష్ప్రవర్తనముచేత బంధులమైయున మాకందఱి కిని తలవంపులు తెచ్చుచున్నావు.

ధూమ్రా—నావెనుకటి నడతనుబట్టి నేనేమి చెప్పినను నా మాట యెవ్వరును నమ్మరు. మొదట చిన్నదాని నగయెత్తుకొని పోయి నమాట వాస్తవమేకాని యీసారిమాత్రము నగలపెట్టెను నేను దొంగిలింపలేదు. నగలపెట్టె పోయినదన్న సమయమున నేను వేశ్య యింటనే యున్నాను.

ధర్మా—జారచోరులమాట నమ్మరాదు.—ఓవిద్వద్బ్రాహ్మణులారా! నగలపెట్టె పోయినదో లేదో, ఆపెట్టె నితఁడపహరించినాఁడో లేదో, ఆపెట్టె యిప్పుడెక్కడనున్నదో, మీరే శాస్త్రదృష్టిచేతఁ జూచి సత్యము చెప్పుఁడు.

న్యాయస్థానమునకు వచ్చిన ప్రత్యభియోగమునందును మూఁడు సారాంశముల నేర్పఱుచుట యచ్చటి శాస్త్రమర్యాద. ధర్మాధికారి యీప్రకారముగా సారాంశముల నేర్పఱిచి వ్యవహారనిర్ణయ

ము చేయఁ గోరఁగా వెనుకఁ చెప్పినప్రకారముగానే సిద్ధాంతులు యథావిధిగా చేయవలసిన తంతునంతను నడపి యాలోచించి యీసారి యభిప్రాయభేదము లేకుండ పాఠాంతరముల మూఁటిని శాస్త్రదృష్టితో సావధానముగాఁ జూచి యేకవాక్యముగా సిద్ధాంతీకరించి సత్యమును జెప్పిరి. నగలపెట్టె పోవుట సత్యమేయనియు, దానిని తస్కరించినవాఁడీ ధూమ్రమాక్షుఁడేయనియు, ఇతఁడాపెట్టెను తానుంచుకొన్న వేశ్యకీయ్యగా నావేశ్య యాపెట్టెను తానుంచుకొన్న విటపురుషుని చేతికిచ్చి యిల్లు దాటించె ననియు, వారేర్పఱచిన నిష్కృష్టాశయమును లేఖకుఁడు వ్రాసి ధర్మాధికారి చేతికిచ్చెను. అది చూచుకొని ధర్మాధికారి యాకాగితమువంకఁ జూచి కొంతసే పాలోచించి, రాజబంధుని నీచతస్కరునివలె చెఱసాలకుఁ బంపుట యుచితము కాదని నిశ్చయించి, ధూమ్రమాక్షునకు నూఱు సువర్ణములు ధనదండనమును విధించి, ఆ మొత్తమును నెలదినములలోపల చెల్లించునట్లు తీర్పు చెప్పెను. ఆతీర్పు వినిపింపఁగానే సభలోనుండి త్రిశిరుఁడను రాజకుమారుఁడు ధర్మాధికారివద్దకు నడిచివచ్చి దొంగిలింపఁబడిన నగలపెట్టెను దెచ్చి యాతని పీఠముమీఁదఁ బెట్టి, ఆపెట్టెను ధూమ్రమాక్షురూపముతో తానే దొంగిలించితినని చెప్పి, శిక్షగా విధించిన నూఱుసువర్ణములును జెల్లించి ధూమ్రమాక్షుని విడిపించెను. అంతట ధర్మాధికారి మఱియొక్క వ్యవహారమును పరిష్కరించుటకయి వాది ప్రతివాదులను పిలిపింపుమని లేఖకుని కుత్తరు విచ్చెను. అప్పటికి నాపూజాసమయమును భక్తులు నాయాలయమునకు వచ్చు సమయమును సమీపించినందున, మహాకాయుఁడుగారు సభ ముగియువఱకు నుండక నన్ను వెంటఁబెట్టుకొని బండియెక్కి యింటికివచ్చిరి.

బండికుదుపుచేతఁగలిగిన యాయాసముకొంత శాంతిపొందినపిమ్మట నేను నాయజమానునితో నాఁటి సభావ్యవహారములను గూర్చి

ము జ్యోతిష్కుల సిద్ధాంతనిర్ణయమునుగూర్చియుమాటాడ నారంభించి రిని. నాయజమానుఁడు కొంతసేపు తానావిషయమయి నాతో మాటా డుట కిష్టములేని వానివలెఁ గనబడినను నేను విడిచిపెట్టక వేసిన ప్రశ్ననే మరలవేయుచు వచ్చుటచేత తుదకిష్టములేకయే నాప్రశ్నల కుత్తరము చెప్పవలసినవాఁడయినందున మాయిరువురకు నీక్రిందిరీతి సంభాషణముజరిగినది—

సత్య—మహాప్రభూ! ఈజ్యోతిష్కుల వ్యవహారనిర్ణయ మెల్ల ప్పుడు నీప్రకారముగానే యుండునా? వేఱువిధముగా నుండునా?

మహా—ఎప్పుడు నిదేప్రకారముగా నుండును.

సత్య—ఏకశాస్త్రమువలననే సిద్ధాంతనిర్ణయము చేయవలసి నప్పుడు వీరిలోవీరి కభిప్రాయభేదము లేలకలుగును?

మహా—శాస్త్ర మొక్కటికాదు; శాస్త్రములనంతములు.

సత్య—శాస్త్రము లనంతములయినను, అన్నియు నే కవిధముగా ఫలమును జెప్పకపోయిన పక్షమున వానిలో కొన్ని యసత్యములు కావలసివచ్చును.

మహా—శాస్త్రము లసత్యము లెన్నటికినిగావు. ఈభేదమునకుఁ గారణము శాస్త్రార్థముచేయువారి బుద్ధివిశేషములో నుండును. ఫలము లను జెప్పువారు తమతమ బుద్ధ్యనుసారముగా నూహించి చెప్పుట వలన నిట్టి భిన్నాభిప్రాయములుకలుగుచుండును.

సత్య—నియమములేక యెవరిబుద్ధికి తోఁచినట్టు వా రర్థము చేయుచువచ్చినచో శాస్త్రములవలన ప్రయోజనమేమి?

మహా—శాస్త్రము లెవరిబుద్ధికి తోఁచినట్లు వారి కర్థమిచ్చు నవికావు. అవి యందఱికి నేకార్థమునే యిచ్చును. అయినను శాస్త్రార్థ నిర్ణయముచేయువారు ముహూర్తము తిన్నగా కట్టలేక పోవుటవలనను గణన తిన్నగా చేయలేకపోవుటవలనను ఫలములలోఁ గొన్ని వ్యత్యాస ములుకలుగుచుండును.

సత్య—జనుల ధనప్రాణములతో సంబంధించిన వ్యవహారములలో సత్యనిర్ణయముచేయుట కేర్పాటుపఁబడిన పండితోత్తములైనను చక్కఁగా కాలము కట్టఁగలవారిని, సరిగా, లెక్కవేయఁగలవారిని విచారించి యేర్పాటుకదా ?

మహా—పండితోద్యోగమునకు దేశములోఁ గల జ్యోతిష విద్వాంసులలో శ్రేష్ఠతములనే యేరి యేర్పాటుచేతురుగాని యిది గుప్తశాస్త్రమగుటచేత నెవ్వరు గట్టివారో యెవ్వరు కారో నిర్ణయించుట యసాధ్యము. ఇటువంటి శాస్త్రములు రహస్యముగా నుంచఁబడినంత కాలమే తమమహిమలను గలిగి యుండును గాని యందఱికిని వెల్లడించినచో మహిమలను గోల్పోయి పాటితప్పిపోవును. కాఁబట్టి శాస్త్రమన్నది యెవరికిని దెలియకుండ సదా గోప్యముగా నుండవలెను.

సత్య—తమరు సెలవిచ్చినది కొంతవఱకు సత్యమేకాని—

మహా—కాని యని నీవేమో సంశయపడుచున్నావేమి ? నేను చెప్పినది సత్యముగునా ? కాదా ?

సత్య—తమరు సెలవిచ్చినది నిస్సందేహముగా సత్యము. అసత్యమణుమాత్రమును లేదు. నాకు వేదవాక్యమునకంటెను తమవాక్యమునం దెక్కువ గౌరవము. సూర్యచంద్రులు గతులుతప్పినను తమ నోటినుండి యసత్యవాక్కు బయలువెడలునా ? శాస్త్రమర్మము లెప్పుడును సర్వజనులకును వెల్లడిచేయఁగూడదు. అందులో ముఖ్యముగా మూడుశాస్త్రములు పరమగుహ్యములు. అందుచేతనే మాదేశమునందుగూడ చదువెఱుఁగనివారు సహితము జ్యోతిశ్శాస్త్రములోను, వైద్యశాస్త్రములోను, మంత్రశాస్త్రములోను, మహావిద్వాంసులయి జనసమ్మానముపొంది కోటీశ్వరు లగుచున్నారు.

మహా—ఈసంభాషణమునుబట్టి నీవు రహస్యోపదేశమునకు పాత్రుఁడవయినట్టు నాబుద్ధికి పొడకట్టినది కాఁబట్టి నేనిప్పుడు మర్మము

రెండింటి సిద్ధాంతములు చెప్పు ఫలములలో వ్యత్యాసము కలుగుటకుఁగల నిజమయిన కారణమును తెలిపెదను. నీవిది విశ్వాసహీనులతోఁ జెప్పక మహారహస్యముగా నుంచవలెను. ఇట్టి జ్ఞానదానమునకెల్ల వారును సర్వులుకారుసుమా !

సత్య—తమరు సెలవిచ్చినది పరమసత్యము. జ్ఞానోపదేశమున కందఱును యోగ్యులుకారు. నేను యోగ్యుఁడనని తమచిత్తమునకు తోఁచిన పక్షమున—

మహా—నీయోగ్యతావిషయమై మాకణుమాత్రమును సందేహములేదు. జ్యోతిషము తప్పిపోవుటకు నిజమైన కారణము పరమేశ్వర శాపము. నీవు భక్తాగ్రేసరుఁడవగుటచేత పరమరహస్యమైనను దాచక నీకిది నేను సమర్మకముగా నుపదేశించినాను. నీ విది భక్తిహీనుల కెప్పుడును చెవిని వేయఁగూడదు. ఇప్పుడు నీకు తృప్తికలిగినదా ?

సత్య—నిజమైనకారణమును గ్రహించుటచేత నేనిప్పుడు పరమ సంతుష్టాంతరంగుఁడ నయినాను. ఇది యత్యంతగుహ్యమైన పరమ రహస్య మనుటకు సందేహము లేదు. ఇది దేవరహస్యమే కాకపోయిన పక్షమున, పురాణములనురచించిన మాదేశములోని సర్వజ్ఞులయిన మహా ర్షులకొక్కరికైన దెలిసియుండకపోవునా ? నేను మాదేశము చేరిన తోడనే దీఁని పద్మపురాణముయొక్క యుత్తరభాగములోని యష్టోత్తర శతసహస్రాధ్యాయమునందుఁ జేర్చి వ్యాసప్రోక్తము చేయించెదను. తమరీ శాపకారణము నామూలాగ్రముగా సెలవియ్యవలెను.

మహా—పూర్వకాలమునందు శ్రీసాంబమూర్తి వారు త్రిపు రాసుర సంహారము చేయఁబూని యుద్ధసన్నద్ధులయియున్న ప్పుడు ముందుగా శుక్రాచార్యులవారా వృత్తాంతమును తమ జ్యోతిశ్శాస్త్ర మహిమచేఁ దెలిసికొని శిష్యులకు తెలుపగా, వారు శివుఁడు వచ్చులోపల తమ పురములతో పాతాళలోకము

నకు యాత్రవెడలిరి. తరువాత సమస్తసన్నాహములతోను శివుడు వచ్చి త్రిపురములను గానక తనదివ్యదృష్టిచేత నిది యంతయు శుక్రాచార్యుల కృత్యమని తెలిసికొని జ్యోతిషమెల్లప్పుడును యథార్థము కాకపోవును గాకయని శపించెను. దీనిమర్మ మిది.

సత్య — నేను ధన్యుడనయినాను. తమరు మర్మమువిడిచి యీ రహస్యమును నాకానతిచ్చినందున, సెలవయినయెడల నాకు తెలిసిన రహస్యము నొకదానిని దేవర వారితో మనవిచేసెదను. జ్యోతిషమునకు పార్వతీశాపమున్నమాట మీరాపురాణములయం దెచ్చటనైనం జూచియున్నారా ?

మహా — లేదు. జ్యోతిశ్శాస్త్రమున కొక్క యీశ్వరశాపమే గాక పార్వతీశాపము కూడ నున్నదా ? ఏమి యీవింత !

సత్య — జ్యోతిశ్శాస్త్రము సందిగ్ధఫలముల నిచ్చుటకు ముఖ్యకారణము పార్వతీశాపమే. పూర్వము సాంబశివులవారు సభలో గూరుచుండి జ్యోతిశ్శాస్త్రముయొక్క సత్యమును పరీక్షింపవలెనని యెంచి బృహస్పతినిజూచి యిప్పుడు పార్వతీదేవి యేమి చేయుచున్నదో చెప్పుమనియడిగెను. అతడు శాస్త్రదృష్టిచేతజూచి పార్వతీదేవి వస్త్రహీనయై యభ్యంజనస్నానము చేయుచున్నదని చెప్పెను. ఆవాక్యముయొక్క యథార్థతను కన్నులార చూడవలెనని శివుడు తత్క్షణమే కొలువు విడిచి లేచి తిన్నగా నంతఃపురమునకుబోయి. నలుగుపిండితో జేసి ప్రాణప్రతిష్ఠ చేసి కావలియుంచిన విఘ్నేశ్వరుడు లోపలికి పోనీకపోగా నతనిశిరస్సు ఖండించి పోయి చూచి జ్యోతిశ్శాస్త్రముయొక్క సత్యమున కత్యాశ్చర్యపడెను. జ్యోతిశ్శాస్త్రమువలన స్త్రీలగుట్టు మగవారికి తెలిసిపోవుచున్నదిగదా యని పార్వతీదేవి యాగ్రహముతో జ్యోతిశ్శాస్త్రము ఫలింపక పోవునుగాక యని ఘోరశాపమిచ్చెను. జ్యోతిష్కులు చెప్పినఫలము తప్పిపోవుట కీశాపములే కారణములుగాని శాస్త్రమెంతమాత్రము నబద్ధముకాదు.

మహా — దేవతలంతయును మహాదుర్మార్గులు. అందులోను దేవగురువైన బృహస్పతి పరమదుర్మార్గుడు. కాకపోయినపక్షమున సమూలార్థమైన జ్యోతిశ్శాస్త్రమునకు నిష్కారణముగా శాపము తెచ్చి పెట్టునా? ఇటువంటి దుష్కార్యమును జేసినందుకు మా రావణ మహారాజుగారు శేకపోఁబట్టి బ్రతికిపోయినాఁడు. పాపీ చిరాయు వనుట చేత నెల్లకాలము నాతనినే బ్రతుకనిమ్ము. సత్యమిప్పుడు నాకు పూర్ణముగా బోధపడినది. జగత్తునకు తల్లిదండ్రులయిన పార్వతీ పరమేశ్వరులిద్దఱును శాపములు పెట్టిన తరువాత సిద్ధాంతులు చెప్పినఫలము తప్పిపోవుటలో నాశ్చర్య మేమున్నది? సిద్ధాంతులు లంచములు పుచ్చుకొని తప్పుఫలములను చెప్పుదురు. రంకురుగాని చెప్పినఫలములు తప్పిపోవుటకు లంచము లక్కఱలేక యీశాపములే చాలును.

ఇంతవఱకు సంభాషణ జరుగునప్పటికి నాపూజాసమయమును భక్తులు దర్శింపవచ్చు సమయమును సమీపించినందున నాయర్చకులు రాఁగా మహాకాయుఁడుగారు నన్ను విడిచి లోపలికిఁ బోయిరి. అంతట నేనిదివఱకు వర్ణించినప్రకారముగా నానిత్యకృత్యములు యథావిధిగా జరుగ నారంభించెను.

అయిదవ ప్రకరణము.

సభాసందర్శనము చేసి వచ్చిన తరువాత మూఁడవనాఁడు మధ్యాహ్నము మూఁడు గంటలవేళ మహాకాయుఁడుగారువచ్చి, నేఁడు జ్యోతిశ్శాస్త్రమునుగూర్చి సభ జరుగఁబోవుచున్నది గనుక తనవెంటఁ జూడ రమ్మని నన్ను పిలిచిరి. మొన్న బండిలో తగిలిన కుదుపువలన గలిగిననొప్పి యింకను తిన్నగా పోకపోయినను, ఆయనమాటకు మాఱు

పలుక వెలువడి ప్రమాణమై యాయనవెంట బయలుదేరితిని. బండిలో నెక్కినపిడి కొలుపుకొని సభామందిరము చేరువఱకును జరిగినకథ యంతయు నిదివఱకు నే నెనుక వర్ణించినరీతిగానే యున్నది; కాని బండీ దిగినతరువాత వెనుకటివలె మాయజమానుఁడు గాక సేవకుఁడే నన్ను లోపలికిఁ దీసికొనిపోయి యొక యున్నతాసనముమీఁదఁ గూరుచుండఁబెట్టిరి. మేము వీథిగుమ్మముచేరఁగానే నాఁటిదినము సభలో తాను ధూమ్రమూర్తివేషముతో నగలుపెట్టెను పొంగిపొంచిపిలిచిన తెచ్చియిచ్చిన త్రిశిరుఁడు మాకెదురుగా వచ్చి ప్రత్యుత్థానముచేసి నన్ను లోపలికిఁ గొనిపోయి యుచితాసనముమీఁదఁ గూరుచుండఁ బెట్టెను. మేము పోవునప్పటికే సభాభవనము మహాజనులతో నిండి యుండెను. అందులోఁ గొందఱు ప్రాక్కేశశాస్త్రము బద్ధమని వాదించుటకయి యక్కడకువచ్చిరి; మఱికొందఱు వారివాదమును ఖండించి పూర్వసిద్ధాంతమును స్థాపించుటకయి వచ్చిరి; తక్కినవా రుభయవాదములను విని వేడుక చూచుటకొఱకును నవనాగరికులను గేలిచేయుటకొఱకును వచ్చిరి. అప్పు డుపన్యాససమయ మయినందున పూర్వపక్షులలో నొకరు లేచి త్రిశిరుఁడుగారి నగ్రాసనాసీనునిగా నేర్పఱుపఁ గోరెను; వెంటనే సిద్ధాంతులలో నొకరు లేచి నవనాగరికాగ్రగణ్యుఁ డయిన యాయన నాపనికి నియమించుట కాక్షేపించి మహాకాయుఁడు గారి నగ్రాసనాసీనునిగా నేర్పఱుపఁగోరెను. అట్టి పూర్వనాగరికాగ్రగణ్యుఁ డగ్రపీఠమున కనర్హుఁడని మఱియొకఁడు లేచి నిషేధించెను. ఈ ప్రకారముగా వీరు నియమించినవారిని వారు పనికిరారనియు, వారు నియమించినవారిని వీరు పనికిరారనియు, ఉభయపక్షములవారును రెండుగడియలు తగవులాడినపిమ్మట నుభయపక్షములవారు నంగీకరించినవా రొక్కరును దొరకకపోవుటచేత నాఁటికి సభ ముగియునట్లు కనఁబడెను. ఇంతలో నొక బుద్ధిమంతుఁడు లేచి లంకానగరవాసులందఱు

నేకో యొకపక్షములోఁ జేరినవారగుటచేత వారిని విడిచి విదేశీయుఁడయి నిష్పక్షపాతబుద్ధి గలవాఁడనయిన వాలఖిల్యమహర్షిని అగ్రాసనాసీనునిజేసి సభసాగింపవచ్చునని యాలోచన చెప్పెను. ముల్లోకములను గ్రుంగఁజాలిన దేవాంతక నరాంతకులవంటి మహాసమర్థులంతమంది స్వదేశస్థులుండఁగా వ్రేలికణుపెత్తు లేని యంగుష్ఠమాత్రశరీరుని పరదేశస్థుని కగ్రపీఠమిచ్చుట యవమానకరమని దేశాభిమానులు కొందఱాక్షేపించినను అర్హతరులు మఱియెవ్వరును దొరకనందున పరస్పరజయకాంక్షులయియున్న యుభయపక్షములవారిలో ప్రధానపురుషులు నాఁడే తమవిజయమును లోకవిశ్రుతము చేయవలెనన్న యపేక్షచేత నన్నగ్రాసనాసీనునిగా నంగీకరించిరి. నేను సూక్ష్మకాయుఁడనగుటచేత కుర్చీలోఁ గూర్చున్నపక్షమున నన్ను సభికులు చూడఁజాలరని యుపన్యాసకుని ముందుంచిన బల్లమీఁద నన్నుఁ గూరుచుండఁబెట్టిరి. ఉపన్యాసకునిపేరు దీర్ఘరోముఁడని సభవారిలో నొకరు నాతోఁజెప్పిరి. అతఁడు వచ్చి బల్లముందు నిలువఁబడినప్పుడు మనదేశపునరపరిమాణమునుబట్టి నీలిపగ్గములవలె మూఁడునాలుగు నిలువుల పొడవుగలిగి నేను గూరుచున్న బల్లనంటుచున్న యాతని గడ్డపువెండ్రుకల దీర్ఘత్వమునుబట్టి దీర్ఘరోముఁడన్నది సార్థకనామధేయమని నేను భావించితిని. ఉపన్యాసవిషయమును నేను సభవారికి విన్నవించినపిమ్మట నుపన్యాసకుఁడు తనయుపన్యాసము నుపక్రమించెను. మనవారు గ్రంథములలో మేఘగంభీరభాషణము లని వర్ణింపఁగా వినుటయేకాని పిడుగులుపడినట్లు కర్ణకఠోరముగా నాఁడాతనిమాటలు చెవినిబడువఱకును మేఘగంభీరభాషణముల యర్థము నా కనుభవమునకు రాలేదు. ఆదుస్సహమయిన శ్రవణవిదారణదారుణశబ్దములకు తాళలేక నేను నాచెవులలో గుడ్డలు దూనుకొంటి

ని ఆయుపాయముచేత సద్దణఁగినందునను బండికుదుపుచేతఁ గలిగిన యాయాసముచేత నిద్రవచ్చినందునను నావెనుకనుంచిన దిండునకుఁ జేరగిలఁబడి నేను హాయిగా నిద్రపోయినాను. సభికులుమాత్రము నాగుట్టు తెలిసికోలేక నేను యోగముపట్టి యోగనిద్ర నవలంబించి దివ్యదృష్టిచేతను దివ్యజ్ఞానముచేతను నాఁటియుపన్యాసమును మాత్రమే గాక జ్యోతిశ్శాస్త్రముయొక్క సత్యమునుగూడ గ్రహించుచున్నా నని తలఁచిరి. అందుచేత నుపన్యాసముయొక్క ప్రథమభాగమును మీకుఁ దెలుపకపోయిన తప్పిదమును దీనిని జదువువారు మన్నింతురని నమ్మెదను. ఆవిషయమును తరువాత నితరులనడిగి తెలిసికొని మీకు తెలిపియుందునుగాని అట్లుచేసినచో నాయోగమహిమకే భంగముకలిగి జనులలో శాస్త్రమునం దవిశ్వాసము కలుగునన్న భీతిచేత నేనితరుల నడుగక శాస్త్రమర్యాదను కాపాడుటకు కంకణము కట్టుకొన్న మీరు నాసమయోచితబుద్ధిని శ్లాఘింతురన్న పూర్ణ విశ్వాసముచేత శాస్త్రగౌరవమును నిలువఁబెట్టినాను. నేను గాఢ నిద్రలోనుండగా నుపన్యాసకుఁ డేదో ముఖ్యాంశమును జెప్పుచు బల్లమీఁద నొక దుద్దుగుద్దెను. ఆగుద్దుతో నన్నావఱకాశ్రయించి యున్న నిద్రాదేవి భయపడి నన్ను ముందుకుఁ బడద్రోచి క్షణకాలములో నన్నువిడిచి పాఱిపోయెను. నేనును కన్నులు తెఱచిచూచి మెల్లగాలేచి మరల యథాస్థానముచేరి దిండునానుకొని సావధానచిత్తుండనై కూరుచుంటిని. అప్పుడు నన్నుఁజూచిన సభాస్తారు లీమహా మునియొక్క యోగనిష్ఠకు నడుమ భంగమువచ్చినదని కొందఱును; ఈమహార్షి తనంత తానే లేచినాఁడుకాని సమాధి చెడలేదని కొందఱును, సమాధి చేసినపక్షమున మౌనముద్రవూని ప్రాణాయామము పట్టి మరల యోగనిద్ర వహించునని కొందఱును, నానావిధములఁ జెప్పుకొనసాగిరి. ఇంతలో నుపన్యాసకుఁ డితరులమాటలు చెవిచొర

కుండ తానే యుచ్చైస్స్వరముతో మాటాడఁజొచ్చినందున వారిమాటలు పూర్ణముగా వినుటకు నాకవకాశము లేకపోయినది.

ఉపన్యాసకుఁడు—ఈపాడుజ్యోతిశ్శాస్త్రము వివేకమును పాఱఁద్రోసి బుద్ధిని మ్రింగివేసి యాలోచన నడఁగఁద్రొక్కి తెలివిగల వారిని సహితము సమస్త విషయములయందును వంచకులయినమూఢులకు దాసులను జేయుచున్నది. శాస్త్రనామము ధరించిన యీపిశాచముయొక్క సమ్మోహనయంత్రములోఁ జిక్కి భ్రమపడి మనుష్యప్రకృతి కలంకారమయిన స్వాతంత్ర్యమును పోఁగొట్టుకొని మన మందఱమును నిష్కారణముగా బుద్ధిపూర్వకముగాఁ దెచ్చుకొన్న కష్టములపాలయి బాధపడుచున్నాము. మన మొకయిల్లు కట్టుకోవలెనన్నచో మనకిష్టమయిన తావునను సమయమునను కట్టుకొనక మూర్ఖసిద్ధాంతిచెప్పిన తావునను ముహూర్తమునను కట్టుకొనవలసినవారమగుచున్నాము ; నుయ్యి త్రవ్వించుకోఁ దలఁచుకొన్నచో మన మనస్సునవచ్చిన యనుకూలమైన తావున త్రవ్వించుకొనక మూర్ఖసిద్ధాంతి చూపిన మూలను త్రవ్వించుకొనవలసినవార మగుచున్నాము ; మన బిడ్డకు పెండ్లిచేయఁదలఁచుకొన్నచో మనకనుకూలుఁడుగా కనఁబడు వరుని నిర్ణయించి వీలయినకాలమునందు వివాహముచేయక మూర్ఖసిద్ధాంతి పెట్టిన నిశాముహూర్తమునందో యెప్పుడో ప్రవర్తనచేతఁ గాకపోయినను జన్మపత్రముచేత నతఁడు మంచివాఁడన్న వరుని కిచ్చి పెండ్లిచేయ వలసినవార మగుచున్నాము. మన మొక యూరికి పోఁదలఁచుకొన్నచో మనకు తీటికయైన సమయమున బయలుదేఱక మూర్ఖసిద్ధాంతిచెప్పిన దినమునందును వారమునందును కాలమునందును ప్రయాణము కావలసిన వారమగుచున్నాము ; మనము క్షౌరము చేయించుకోఁ దలఁచుకొన్నచో మన కవకాశముగా నున్ననాఁడు చేయించుకొనక మూర్ఖసిద్ధాంతి చెప్పిన తిథివారముల

యందే తల గొఱిగించుకోవలసిన వార మగుచున్నాము. మనము క్రొత్తబట్టను కట్టుకోఁదలఁచినచో కావలసినప్పుడు కట్టుకొనక మూర్ఖసిద్ధాంతి తెలిపిన దినమును వారమును వచ్చువఱకును వేచియుండ వలసినవార మగుచున్నాము. వేయేల? మనము క్రొత్తగా భార్య వద్ద పరుండఁ దలఁచుకొన్నను, గృహమునఁ బ్రవేశింపఁ దలఁచుకొన్నను, రోగమునకు మందు పుచ్చుకోఁదలఁచుకొన్నను, మూర్ఖసిద్ధాంతియే మనకు కాలనిర్ణయము చేయవలెను. ఇట్టి నిత్యకృత్యములలోనే మనకు స్వాతంత్ర్యము లేనిచో లోకములో నింతకంటె క్రూరదాస్యము మఱియేముండును? మూర్ఖసిద్ధాంతి—;

వృశ్చికరోముఁడు—మీరు మూర్ఖసిద్ధాంతియని లోకోపకారులయి మహావిద్వాంసులయిన జ్యోతిష్కులను నిర్హేతుకముగా దూషించి మహాదోషము కట్టుకొనుచున్నారు. ఈసిద్ధాంతులే యుండి వివాహాదికార్యములయందు మంచిముహూర్తములు పెట్టి లోకమునకుపకారము చేయనిచో లోకమెట్టి దురవస్థల పాలగునో—

ఉప—మీరుపన్యాసమధ్యమున మాటాడరాదు—

మహాకాయుఁడు—మీరు సిద్ధాంతులను మూర్ఖులని దూషింపరాదు.

త్రిశిరుఁడు—మీరింకముందు సిద్ధాంతికిముందు మూర్ఖశబ్దము పెట్టక మాటాడుఁడు.

ఉప—సిద్ధాంతులు లోకమునకుఁ జేయుచున్న యుపకారము చెప్పనక్కఱలేదు. లోకములోనున్న జాతకపత్రికలలో నెల్ల నుత్తమమైనదని చెప్పి యొకవరుని నిర్ణయించి మంచిముహూర్తము పెట్టి వివాహముచేయించి యీసిద్ధాంతి మంచిదోవతులచాపు కట్టుకొని పోయిన మూఁడుమాసముల పదిదినములలో జాతకపత్రికలలోని నూరేండ్లను ముహూర్తబలముచేత నూఱుదినములుగా మాఱఁగా

స్త్రీలు వైధవ్యదుఃఖ మనుభవింపవలసినదైనది. ఈ సిద్ధాంతి చెప్పిన ముహూర్తమునందు కట్టించి, పెట్టిన సుముహూర్తమునందు గృహప్రవేశమయిన మాపొరుగువారు నెలదినములలోపల గృహయజమానుఁడు స్వర్గస్థుఁడు కాఁగా తామారుమాసము లిల్లుపాడుపెట్టి పొరుగువారియింటను జేరవలసినవారైరి. నామిత్రుని తండ్రి యెన్నిదో డిని మంచిదాగి యీ సిద్ధాంతిచెప్పిన ముహూర్తమునందు గ్రామాంతరమునకు బయలుదేఱినను త్రోవలో దొంగలు కొట్టఁగా బండి విఱుఁగబడి కాలువిఱుగఁగొట్టుకొని యర్ధరాత్రమునందు మరల స్వగృహమును జేరవలసినవాఁ డయినాఁడు.

పృచ్ఛ—అయ్యలారా! చిత్తగించినారా? ఈయన నన్నెట్లు దూషించుచున్నాఁడో! మూర్ఖపదము ప్రయోగించినప్పటికన్నను, ఈదూషణభాషణము లధికకర్ణకఠోరములుగా నున్నవి. పెద్దమనుష్యు లింతమందియుండి పండితదూషణ జరుగుచుండఁగా చూచి యూరకుండుట మీకు ధర్మమా! వారిగ్రహచారము చాలక యాపదలు తటస్థమయినప్పుడు నేనేమిచేయగలను? ముహూర్తములు పెట్టుట నాపనికాని యాపదలు తప్పించుట నాపనికాదుకదా?

శ్రోత—మీరు మంచిముహూర్తములు పెట్టుటచేత విపత్తులు తొలఁగనిపక్షమున మీముహూర్తములతో నేమిప్రయోజనము?

మహో—మధ్య మీరు మాటాడుట యుక్తముకాదు. సామాన్యముగాఁ జెప్పక వకాల్తాణించి యొక్కరినిగూర్చి చెప్పుట యుపన్యాసకునికి మంచిపనికాదు. జ్యోతిషమువలన లాభమే లేకపోయినపక్షమున నింతకాలమునుండి సర్వజ్ఞులయిన మనపెద్దలందఱును జన్మపత్రములు వ్రాయించుకొని సమస్తకార్యములకును శుభముహూర్తములు పెట్టించికొనుచుందురా? వ్యవహారదక్షులయిన ప్రభుత్వమువారు వ్యవహారనిమిత్తము జ్యోతిషవిద్వాంసులను నియమించుచుందురా?

త్రిశి.—వీరి వ్యవహార నిర్ణయమునందలి సత్యము మొన్ననే కదా సభలో బయలఁబడినది? కల్పవృక్షములవలె పండితు లయిదు గురుచేరి సభలోఁగూరుచుండి నేను గోనిపోయిన నగలపెట్టెను ధూమ్రాక్షుఁడు దొంగిలినట్లు సిద్ధాంతముచేసినారు.

మహా.—అదియంతయు మోసము. నిజమైన వ్యవహారములో నిజము తెలియును గాని పరీక్షింపవలెనని మోసముచేసిన వ్యవహారములో సత్యమెట్లు బయలఁబడును?

ఉప.—నాయుపన్యాసము ముగియనియ్యరా?

మహా.—కానిండి.

ఉప.—లోకమునకుఁ గలిగెడియుపకారము లోకములోనివారైన యీసిద్ధాంతులకేకాని యితరలోకమున కణుమాత్రము గలుగదు. మనయింట కన్య రజస్వలయైనదో శాంతికావలెనో లేదో తెలిసికొనుటకయి ముందుగా సిద్ధాంతిగారికి దక్షిణముట్టవలెను; మనయింట నెవ్వరయిన పుట్టినపక్షమున పితృగండమున్నదో లేదో తెలిసికొనుటకయి ముందుగా సిద్ధాంతిగారికి దక్షిణముట్టవలెను; మనయింట నెవ్వరయిన చచ్చిరేని యిల్లు విడిచిపెట్టి లేచిపోవలయునో లేదో తెలిసికొనుటకయి ముందుగా సిద్ధాంతిగారికి దక్షిణముట్టవలెను. ఈప్రకారముగా పుట్టినది మొదలుకొని చచ్చువఱకును చెవులు కుట్టినను, పుట్టువెండ్రుకలు తీయించినను, అన్నము ముట్టించినను, చదువవేసినను, మఱియేపనిచేసినను సిద్ధాంతిగారిచేత ముహూర్తము పెట్టించుకొని యాయనకు ముట్టవలసినముడుపు నెప్పుడో యొకప్పుడు చెల్లింపక తప్పదు.

మహా.—మీరు సిద్ధాంతులను వారివృత్తిని నిందిపఁగూడదు. వారు జనులకు ఫలములు చెప్పియు ముహూర్తములు పెట్టియు పడిన ప్రయాసమునకు ప్రతిఫలముగా ధనస్వీకారము చేయుచున్నారు. కాని

యూరక చిల్లిగవ్వయైనను గ్రహించుచుండలేదు. చేతనైన పక్ష మున మీరు జ్యోతిశ్శాస్త్రము బద్ధమనుటకు చాలిన యుక్తులను చెప్పుఁడు అప్పుడు మీ హేత్వాభాసములను ఖండించుటకు మేము పూను కొందుము.

ఉప—ముహూర్తజాతకభాగము లసత్యమనుట కణుమాత్ర మును సందేహము లేదు. ఈగ్రామమునం దిద్దఱు రాజపుత్రు లొక స్త్రీనిమిత్తమున గర్భశత్రువులయి యొకరి నొకరు చంపవలెనని నిశ్చ యించుకొని యిద్దఱును చెఱియొక జ్యోతిష్కునియొద్దకుఁబోయి యుద్ధ విజయమునకు ముహూర్తము పెట్టుమని యడిగిరి. ఇద్దఱు జ్యోస్యు లును శాస్త్రవిచారము చేసి నాఁటిసాయంకాలము నాలుగు గడియల ప్రొద్దుండఁగా శత్రువిజయమునకు మంచి సమయమని ముహూర్తము పెట్టిరి. తనకే విజయము కలుగునని మొదటివాఁడును తనకే గెలుపు కలుగునని రెండవవాఁడును మనస్సులలో నమ్మి తాము జ్యోతిష్కుల నాలోచించిన మాట రెండవొరులకు తెలియనీయక రహస్యముగానుంచి యుద్ధాహ్వానములు మాత్రము చేసి కొని యిద్దఱును బయలుదేఱి ముహూర్తసమయమున కూరిబైలికి పోయి ఘటికాయంత్రములు ముందుంచుకొని సరిగా యుక్తసమయ మున దుడ్డుకఱ్ఱలతో యుద్ధమారంభించిరి. ఇద్దఱును పరస్పర జయకాం క్షచేత చావమోఁదుకొనఁగా నందొకఁ డప్పుడే దెబ్బలచేత కాలధర్మ మునొందెను. రెండవవాఁడు కంటికి దెబ్బతగిలించుకొని చావుతప్పి కన్నులొట్టబడి యొంటికంటితో బ్రతికెను. ఆమహాశూరులెవ్వరో, వారికి ముహూర్తము పెట్టిన మహాసూరు లెవ్వరో మీరందఱు నెఱు గుదురు. శాస్త్రమే యసత్యము కానిపక్షమున, ఏకముహూర్త మునందే యుద్ధ మారంభించినయొక్కరికి కపజయమును నొక్కరికి జయ మును నేల కలుగవలెను? ఇంకొక్క నిదర్శనము చూడుఁడు.

మా పెద్దతమ్ముఁడును మా పాలికాఁపువాని పెద్దకొడుకును త్రుటికాలమైనను భేదములేక సరిగా నేకముహూర్తమునందే జనన మొందిరి. జనన సమయమునం దిరువురకును గ్రహము లేకస్థానమునందే యున్నందున సమాన ఫలమునే యియ్యవలసినను, మావాఁడు చదువుకొని పరీక్షల నిచ్చి గొప్ప యుద్యోగము చేయుచుండఁగా మా పాలికాపుకొడుకు చదు వెఱుఁగక పొలము దున్నుచు నీచదశయందే యున్నాఁడు. శాస్త్రమబద్ధము కానిపక్షమున, ఏకసమయముననే జనన మొందిన యిరువురకును గ్రహములు విరుద్ధఫలముల నేల కలుగఁజేయవలెను? సిద్ధాంతులు చెప్పిన ఫలములు కొందఱికి సరిగా కలుగ వచ్చును. అప్పుడు సహిత మాఫలములు దైవికముగా కలిగినవే కాని సిద్ధాంతి యెఱిఁగి చెప్పుటవలనఁగలిగినవి కావు. ఏఁబది యేండ్లు బ్రతుకుదురని జన్మపత్రములలో వ్రాయఁబడియున్నవారు కొందఱంతకాలము జీవించినను, పలువు రంతకు లోపలను ముగ్గురు నలుగు రటు తరువాతనుగూడ మృతులగుదురు. ఈప్రకారముగానే కష్టములును సుఖములును దైవికముగా కొందఱికి చెప్పినట్లు కలిగినను పలువురకు కలుగవు. కార్యసాఫల్య మెప్పుడును యుక్తసమయమున తగినపని చేయుటవలనఁ గలుగునుగాని ముహూర్తమువలనఁ గలుగదు. ఇల్లు కాలుచున్నప్పుడు వెంటనే నీరు పోసినచల్లాఱును గాని ముహూర్తము నిమిత్తము వేచియుండినచో చల్లాఱదు. పాముకఱచినప్పుడు తత్క్షణమే విషవైద్యునికొఱకు పరుగెత్తి చికిత్స చేయించిన విషము దిగునుగాని ముహూర్తము నిమిత్తము వేచియుండినచో విషభాధ తగ్గదు. ఈవిధముగానే వ్యవసాయమునం దైనను, వాణిజ్యమునం దైనను, మఱియేయితరవ్యాపారమునం దైనను ముహూర్తముల నిమిత్తము వేచియుండక యుక్తసమయమునందు కృషిచేసినప్పుడు మాత్రమే కార్యసాఫల్యమగును. మంచిముహూర్తమును నిరీక్షించుచు పనిచేయక యోగ్యసమయమును వ్యర్థపుచ్చి

నచో మేలు కలుగుటకు మాఱుగా కార్యవిఘాతము గలిగి కీడు మూడును.

మహా—మీరు చెప్పెడు మాటలు యుక్తికిని లోకానుభవమునకును శాస్త్రమునకు విరుద్ధముగా నున్నవి. మంచిసిద్ధాంతి శాస్త్రముచూచి యాలోచించి చెప్పినప్పు డొక్కయక్షర మైనను హెచ్చుతగ్గులు లేక ఫలములు సరిగా కలుగును. నాతమ్ముని జన్మపత్రమును మొన్న నే నొక సిద్ధాంతికి చూపఁగా వెనుక జరిగిన దంతయు వ్రాస గ్రుచ్చినట్లు సరిగా నతఁ డేకరువు పెట్టినాఁడు. శనిమహాదశలో నాకు ప్రాణాంతకరమైన రోగము వచ్చునని ముందుగానే యొకసిద్ధాంతి చెప్పి తప్పించుకొనుటకు ప్రతిక్రియ చేసికొమ్మని యుపదేశింపఁగా, నేను మెలఁకువపడి యుక్తసమయములో శనిగ్రహజపముచేయించి గ్రహశాంతినిమిత్తము సంతర్పణము చేయించునప్పటికి నాకు రోగము రానేలేదు. జ్యోతిశ్శాస్త్రము నిజమనుట కింతకంటెను ప్రబల నిదర్శనములు మఱేమి కావలెను?

ఉప—మీరు సెలవిచ్చినవానిలో నొక్కటియు నిదర్శన మని చెప్పుటకు వీలుపడదు. గతము చెప్పుట యొకగొప్పకాదు. అట్లు చెప్పిన దంతయు శాస్త్రజ్ఞానము వలననే చెప్పఁబడిన దనుటకును వలనుపడదు. ఈజ్యోతిష్కులవద్ద సాధారణముగా లోకులసంగతులను తెలిసికొనివచ్చి గ్రహములకంటె సూటిగా రహస్యముగా గురువులకు తెలుపఁగలశిష్యు లుందురు. అంతేకాక వారు తఱుచుగా మాయోపాయముల చేతను కొన్ని సమయములయందు ధనదానముచేతను కుటుంబములయందలి పరమ రహస్యములను సహిత మాకుటుంబములోని స్త్రీలవలనను పిల్లలవలనను సేవకులవలనను గ్రహించి యవి తమకు ప్రాణములేని గ్రహములు చెప్పినట్టుగా చెప్పి విమర్శ లేనివారి కాశ్చర్యము కలిగింతురు. గ్రహపూజవలన మీకు రావలసినరోగమేమో

రాక తప్పిపోయినట్టు మీరు సెలవిచ్చుచున్నారు. శాస్త్రమే నిజమయి దానివలన తప్పక రోగము రావలసియుండినపక్షమున రోగము వచ్చి తీఱవలెనుగదా? గ్రహశాంతికయి సంతర్పణములు సమారాధనములు చేయుటవలన రావలసినయపాయము తప్పుననుట జ్యోతిష్కులును పురోహితులును చేరి జీవోదరపూరణార్థమయి పన్నిన మహోపాయము. నిజముగా రోగము వచ్చినపక్షమున, గ్రహచారము తిన్నగాలేక శాస్త్ర ప్రకారము వచ్చినదందురు. రోగము రాక పోయినపక్షమున, నవగ్రహజపాదులవలనను సంతర్పణములవలనను తప్పిపోయిన దందురు. ఈకపటోపాయమువలన జ్యోతిష్కులు చెప్పిన ఫలము తప్పిపోయినయెడల తమమీఁద నిందలేకుండ తప్పించుకొనుటకును, పురోహితులు మొదలయినవారి కందఱికి నుదరపోషణము జరుగుటకును మార్గము కలుగుచున్నది. అంతేకాక యాకాశమందలి యచేతనములైన గ్రహము లెక్కడ? సచేతనులైన జీవులకు ఫలములిచ్చు టెక్కడ?

మహా—మీరు చెప్పిన యుక్తు లెంతమాత్రమును విశ్వాసార్హమయినవి కావు. గ్రహములు జీవకోట్లకు తప్పక ఫలములిచ్చును. గ్రహములకును మనకును సంబంధము కలదనుటకు మీకు నేను కొన్ని ప్రత్యక్ష నిదర్శనములు చూపెదను. చంద్రోదయాస్తమానములను బట్టి సముద్రమునకు పోటును పాటును వచ్చుచుండుట మనకు ప్రత్యక్షమేకదా? దీనికి మీరేమి చెప్పఁగలరు? అదిగాక పూర్ణిమ మొదలయిన పర్వదినములయందు వెఱ్ఱి మొదలయినరోగములు ప్రబలుచుండుట యనుభవసిద్ధము. గ్రహములకే మనరోగాదికమునువృద్ధి చేయుట మొదలైన శక్తులు లేకపోయిన పక్షమున, అట్లేల జరగును. దుర్ముహూర్తమునం దారంభించిన పనులు చెడుట నేను స్వానుభవముచేత నెఱుఁగుదును. నేను కొన్ని దినములక్రిందట బృహస్పతికాల

మునందు బయలుదేఱి దేవతాదర్శనమునకు వెళ్ళి పూజారులు దేవాలయముయొక్క తలుపులు తీయకపోఁగా దేవతాదర్శనము చేయకనే యెండలో మరల నింటికి రావలసినవాఁడనయినాను.

బృహస్పతికాలమనఁగా నేమో మనభరతఖండవాసులకు తెలియకపోవచ్చును. లంకలోఁ బుట్టినవారెల్లరును రాక్షసులగుటచేత రాక్షసుఁడైన రాహుగ్రహము వారికి శుభగ్రహము; దేవతా గురువగుటచేత బృహస్పతి వారికి పాపగ్రహము. ఈదేశమునందు మనము రాహుకాల మశుభసూచకమని యెట్లెంతుమో యట్లె యీదేశమునందు వారు ప్రతిదినమును త్రొమ్మిదిగడియలకాలమును బృహస్పతికాలమని చెప్పి యాకాల మశుభసూచకముగా పరిగణించి యేకార్యమును జేయక విడుతురు.

ఉప——వేఁడియెండ కాచినప్పుడు తీక్ష్ణములయిన సూర్యకిరణములచేత నేయి మొదలయినవి కరఁగునట్లును మనదేహములకు తాపమెక్కునట్లును మొత్తముమీఁద చంద్రాదిగ్రహములు పదార్థములకు కొన్నిమార్పులను గలుగఁజేయఁ గలుగును; గాని యొకపదార్థమున కొకవిధముగాను మఱియొకపదార్థమునకు మఱియొకవిధముగాను మార్పులను గలుగఁజేయఁజాలవు. ఎండలోఁబెట్టినప్పు డన్ని గిన్నెలలోని నేయి కరఁగవలసినదే కాని యొకగిన్నెలోనినేయి కరఁగుటయు, నొకగిన్నెలోనినేయి కరగక పోవుటయు తటస్థింపదు. చంద్రోదయాదులనుబట్టి పోటో పాటో సమస్త సముద్రములకును నేకరీతిగా కలుగునే కాని చంద్రోదయముచేతనొక సముద్రమునకు పోటును మఱియొకసముద్రమునకు పాటును గలుగవు. ఆవిధముగానే గ్రహగతులవలనను గ్రహస్థితులవలనను ఫలము గలిగెడుపక్షమున సమస్తజనులకు నేకఫలము కలుగవలెనే కాని వివిధజనులకు వివిధఫలములు కలుగుట యెన్నఁడును తటస్థింప నేరదు. కాఁబట్టి వివిధజనులకు వివిధ

ఫలముల నిచ్చునని చెప్పెడు జ్యోతిశ్శాస్త్రము విశ్వాసార్హ మయినది కాదు. బృహస్పతికాలమునందు వెళ్ళువారికి కొందఱికి దైవికముగా కొన్ని సమయములయందు కార్యవిఘాతము కలిగినను కొందఱికి కొన్ని సమయములయందు కార్యసిద్ధి యగుటయుఁ గలదు. నే ననేక పర్యాయములు బృహస్పతికాలములో బనులు చేసినను నాకు కార్య సిద్ధి యగుచునే వచ్చినది కాఁబట్టి కార్యసాఫల్యమునకుఁగాని కార్య వైఫల్యమునకుఁగాని, బృహస్పతికాలాదులు కారణములు కావు. కొన్ని కాలములు మంచివని కొన్ని కాలములు మంచివికావని భావించి యుక్తకాలమునఁ బనికిఁబూనక వృథా కాలహరణమును జేసెడు మౌఢ్యమునుబట్టి పెక్కు కార్యములు చెడుచున్నవి. ప్రతిసంవత్సర మును శూన్యమాసములని కొన్ని మాసములు వ్యర్థపఱుపఁబడు చున్నవి; మిగిలినమాసములలో శుభదినములు కావని కొన్ని దిన ములు వ్యర్థపఱుపఁ బడుచున్నవి. శేషించిన తిథులలో మంచివార ములు కావని కొన్నివారములు వ్యర్థపఱుపఁబడుచున్నవి; ఆ యు న్న కొన్ని వారములలో సహితము దుర్ముహూర్తమని, వర్జసమయ మని, బృహస్పతికాలమని, నక్షత్రము మంచిదికాదని, విశేషకాలము వ్యర్థపఱుపఁబడు చున్నది. ఈప్రకారముగా మూఢవిశ్వాసము చేత మంచి కాలమును వృథాగా పోఁగొట్టక యనుకూలకాలము నందెల్లను పనులు చేయుచు వచ్చినచో దేశమున కెంతక్షేమము కలుగును ?

వృశ్చి—ఇది యంతయు శాస్త్రదూషణము శాస్త్రనిందచేత నెంతయైనపాపమున్నది. ఏమయ్యా? వాలఖిల్యా! అగ్రాసనాధిప త్యము వహించి శాస్త్రతిరస్కారము జరుగుచుండఁగా చూచుచు నూరకున్నావేమి ?

మహా—అగ్రాసనాసీనుఁడు తనయభిప్రాయమును జెప్పి దూషణ మాస్పవలెను. ఇప్పుడు నాకు గొప్పచిక్కు తటస్థమయినది ఇఁక మాటాడక యూరకుండుటకు వలనుపడదు. మాటాడినచో నెవ్వరి పక్షమున నేమిచెప్పినను క్రోధావేశముచేత మూర్ఖరాక్షసు లెవ్వ రేమిచేయుదురో! అయినను నేను బుద్ధిమంతుఁడ నగుటచేతను, పరమ ప్రమాణములైన మనశాస్త్రములు వచ్చి సమయములో నాకు తోడుపడుటచేతను, ధైర్యము తెచ్చికొని యెవ్వరిమనస్సును నొవ్వ కుండ సమయోచితముగా నిట్లంటిని—

"ఓ సజ్జనాగ్రగణ్యులారా! దూషణ యెవ్వరికిని కూడదు. అందులోను ముఖ్యముగా జ్యోతిశ్శాస్త్ర దూషణ కూడదని మాశాస్త్ర ములుమాత్రమేకాక మాశాస్త్రములును భేరీధ్వనితో ఘోషించు చున్నవి. జ్యోతిష్కులమాటలను గాని జ్యోతిశాస్త్రమునుగాని పరిహ సించినవారు తామిస్రనరకములో పడుదురని వరాహ మిహిరుల వారు బృహత్సంహిత రెండవ యధ్యాయములో సెలవిచ్చియు న్నారు. అయినను దీర్ఘరోములవా రిప్పుడు చెప్పుచున్నది పరిహా సముకానందున శాస్త్రదూషణమని చెప్పుటకు వలనుపడదు. చెప్పెడి దంతయు పూర్ణముగావినక యిది యిట్టిదని నిర్ధారణము చేయు టయు మంచిదికాదు. కాఁబట్టి సభవారు దయచేసి వారు చెప్పెడి దంతయు పూర్ణముగా విని తరువాత వారివాదమును ఖండించి తమ పక్షమును సిద్ధాంతము చేయఁబూనవలెను."

వృశ్చి—ఇవి తప్పక దూషణ వాక్యములే. ఇటువంటి మాటలు మనము విననుకూడదు; ఇతరులను చెప్పనియ్యనుకూడదు.

మహా—ఈవలఁను కొంత విన్నాముగనుక కడముట్టవిని యీ యుక్త్యాభాసములను ఖండించి యెల్లవారికిని భ్రాంతినివారణముచేయు దము. జ్యోతిశ్శాస్త్ర మబద్ధమని యిటువంటివారు లక్షమంది లక్ష

యుపన్యాసము లిచ్చినను, ఎవ్వరును నమ్మరు. జ్యోతిశ్శాస్త్రములో చెప్పినట్టు సంతానము కలుగుచుండ లేదా? కలిగిన సంతానమునకు విద్యాబుద్ధులు వచ్చుచుండ లేదా ?

ఉక—వీరారు సంతానమునుచున్నారుగనుక చెప్పెదనువినుఁడి. మాపెద్దన్నగారి జన్మనక్షత్రములో నాతని కాలుగురు పుత్రులు కలుగునట్లున్నది ; ఆయనభార్య జన్మనక్షత్రములో బిడ్డలు కొడుకులును ముగ్గురు కూతులును కలుగునట్లున్నది. ఆయన వృద్ధుఁడయినను భార్యకు ముట్లుడిగినను వారి కివఱకును సంతానయోగ్యత కలుగు చిహ్నములేవియుఁ గానరాకున్నవి. ఈప్రకారముగానే నామిత్రుల జన్మనక్షత్రముల ననేకములను శోధించి చూడఁగా సంతానవిషయమున వానిలోఁ జెప్పఁబడినదానికిని సరిగా జరిగినదానికిని మిక్కిలి వ్యత్యాసము కనఁబడుచున్నది. ఇఁక విద్యావిషయ మన్ననో యంతకంటెను తాఱుమాఱుగా నున్నది. ఈవఱకు నేను జెప్పినప్రకారముగా నాచిన్నన్నగారికుమారుఁడును పాలికాఁపువాని కుమారుఁడును సరిగా నేక లగ్నమందును, ఏకముహూర్తమునందును, ఏతారయందును, పుట్టిన వారయినను మాయన్నగారి కుమారుఁడు పండితుఁ డగుటయు పాలికాఁపువాని కుమారుఁడు నిరక్షరకుక్షి యగుటయు మీరందఱు నెఱుఁగుదురు. దీనికి మీరేమి సమాధానము చెప్పఁగలరు? ఇదంతయు నేల ? మనకు సమీపమునందే హిరణ్యాక్షద్వీప మున్నదిగదా ? అక్కడ వసించువారందఱును మూఢులయి మనుష్యభక్షకులయి యనాగరికులుగా నున్నారు. అక్కడివా రనేకులు విద్వాంసులు కావల సినముహూర్తములలోఁ బుట్టినను వారిలో నొక్కరికిని విద్యయన్న వాసనయే లేక యందఱును జ్ఞానశూన్యులుగా నున్నారు. నేనీపని నిమిత్తమయి యక్కడకుఁ బోయి యనేకులజన్మనక్షత్రములను వ్రాసికొని వచ్చి చూచినాను. చేతనైనపక్షమున నీవై పరీక్షమునకు కారణ మేమో జ్యోతిష్కులను చెప్పుమనుఁడు.

వృశ్చి—జ్యోతిశ్శాస్త్ర మాద్వీపమునకు చెల్లదు.

మహా—విశ్వాసహీనులకును నిరక్షరకుక్షులకును గ్రహములు సహితము ఫలములను కలిగింపవు.

ఉప—ప్రత్యక్షవిరోధము చూపినను చూడనొల్లక కన్నులు మూసికొని జ్యోతిశ్శాస్త్రము సత్యమని చెప్ప నిశ్చయించుకొని వచ్చిన వారిముందఱ యుక్తివాదమువలన కంఠశోషణము కలుగుటతప్ప వేఱు ప్రయోజనము కలుగదు. ఈపాడు జ్యోతిశ్శాస్త్రము మనదేశమున కెంతహానినైనను జేయుచున్నది. కొందఱు సిద్ధాంతులు చెప్పినయాయుఃపరిమాణమును నమ్మి తమకు చావుసమీపించినదనుకొని బెంగపెట్టుకొని నిష్కారణముగా దీర్ఘవిచారమును కొన్నిసమయములందు మరణమునుకూడ పొందుచున్నారు. కొందఱు సిద్ధాంతులు రోగాదికము వచ్చునని చెప్పినమాటలునమ్మి రోగములు వచ్చినప్పుడు బాధపడుటకు మాఱుగా రానిరోగములనిమిత్తము మనోవ్యథ చెంది వానిని తప్పించుకొనుటకయి తమవిత్తమును వంచకులపాలు చేయుచున్నారు. శిశువులు పుట్టిననక్షత్రములనుబట్టి సిద్ధాంతులు చెప్పిన మాతృగండములను పితృగండములను మాతులగండములను భ్రాతృగండములను విశ్వసించి శిశుహత్యలను గూడఁ జేయించుచున్నారు. అనేకులు సిద్ధాంతులు చెప్పినయోగములు నమ్మికొని దుర్భ్రమలు పడి కాలము వ్యర్థపుచ్చి తుద కాశాభంగము పొంది వ్యాకులపడుచున్నారు. ఒకజ్యోతిష్కుఁడు మనయూరిలో నొక కాపువానివద్ద ధనము స్వీకరించి వానికి తోఁటలో చెట్టుమొదట పాఁతు దొరకునని చెప్పఁగా వాఁ డొకటితరువాత నొకటిగా చెట్లమొదళ్ళెల్లను త్రవ్వి యెంతను ధననిక్షేపమును గానక చెట్లు చచ్చుటచేత దరిద్రుఁడయి మున్నున్నది సహితము పోఁగొట్టుకొని కలకాలము దుఃఖపడవలసినవాఁ డయ్యెను. ఇట్లనేకనిదర్శనములు కనఁబడుచున్నను

జనులు తమమూఢ విశ్వాసమును విడువఁజాలక సూర్యచంద్రాదిజడ పదార్థములవలనఁ దెలిసికొని ఫలములను జెప్పెదుమన్న మహాత్ములకు దాసులయి బుద్ధిపూర్వకముగా కష్టములకు తలయొగ్గుచున్నారు. మనమనసువచ్చినప్పుడు కన్నబిడ్డకు పేరుపెట్టుకొనుటకును, క్రొత్త తలగుడ్డ ధరించుకొనుటకును, క్రొత్తనగ పెట్టుకొనుటకును పొలమును దున్నుకొనుటకును విత్తనములు చల్లుకొనుటకును, పండిన పంట కోసికొనుటకును, గుఱ్ఱమునో గొఱ్ఱనో కొనుటకును, మందు పుచ్చుకొనుటకును, ప్రభుదర్శనము చేయుటకును విజ్ఞాపనపత్రికను పంపుకొనుటకును, ఇటువంటి మఱియేయల్పకార్యమును చేయుటకును కూడ స్వతంత్రులముకాక మనము సమస్తమునకును, మింటనుండు గోళాకారము గల నోరులేని జడపదార్థములు చెప్పినట్లే నడుచుకోవలసినయెడల లోకములో నింతకంటె దాసితనము మఱియేముండును? ఓయగ్రాసనాసీనా! ఇది మనము కోరి తెచ్చుకొన్న దాసితన మగునో కాదో నీవు చెప్పుము. దురభిమానముచేత మావారు తెలిసియు తెలియనట్లు నటించినను పక్షపాతమును దురభిమానమును లేని నీవైన సత్యముచెప్పుము. ఈపాడునమ్మకము మనుష్యులహృదయములలో ననావశ్యకము లయినభయములను, విచారములను, బాధలను తెచ్చిపెట్టుచుండలేదా? ఇది పలుమాఱు దురాశలను కలిగించి క్రమమైనప్రయత్నమును మాన్పుచుండలేదా? ఇది ప్రజలయొక్క పండువంటి బుద్ధిని మంటఁగలిపి వారిని జడవస్తువులను నమ్మి పొట్టపోసికొనువారికి దాసులనుగాఁ జేయుచుండలేదా? ఓమహర్షీ! నీమౌనము చాలించి యీప్రశ్నలకు సదుత్తరము చెప్పుము.

వెనుక సభవారు నన్ను హెచ్చరించినప్పుడు నేను తనకనుకూలముగాఁ జెప్పుట చూచి యీదీర్ఘరోముఁడు నేను శాస్త్రప్రమాణబద్ధుఁడనై నశిష్టాచారపరాయణుఁడ నన్నసత్యము తెలిసికోక నేనేమో

తన కనుకూలముగా నుత్తరము లిత్తునని భ్రమపడి యిప్పుడీప్రశ్నలు వేసెను. అప్పు డీదీర్ఘరోముఁడు చెప్పినదానిలో శాస్త్రదూషణ మంతగా లేదని చెప్పినదానిని బట్టియే ప్రాచీనాచారపరాయణు లయిన సభవారందఱును మనసులో నామీఁద కొఱకొఱగా నుండుట బుద్ధి మదగ్రగణ్యుఁడ నగుటచేత నేనావఱకే కనిపెట్టి యున్నవాఁడను గాన మహాజనుల యనుగ్రహమునకు మరల పాత్రుఁడ నగునట్లుగా— "ఓయి దీర్ఘరోమా ! త్రికాలవేదినైన నేను సత్యము పలికెదను వినుము. నేనిప్పుడు డాంతరదృష్టిచేతఁ జూచి యథార్థమును కరతలామలకముగా గనిపెట్టినాను. శాస్త్రమెప్పుడును లవలేశమైన నబద్ధము కాదు. జ్యోతిశ్శాస్త్రము పరమసత్యము. సత్యమునం దాదరముగల శాస్త్రబద్ధులయిన యాస్తికులందఱును శాస్త్రవిశ్వాసముచేత నీవిప్పుడు చెప్పినవిగాక యింక వేయిరెట్లునష్టములు వచ్చినను వానికన్నిటికి సహింపవలెను. మనకు శాస్త్రము ప్రమాణము గాని బుద్ధి ప్రమాణముకాదు. ఈ సత్యమును శిష్టులందఱు—" అని చెప్పుచుండఁగా దీర్ఘరోముఁడు నావంక కన్ను లెఱ్ఱచేసి చూచి నానోటనున్న వాక్యమైనను ముగియకమునుపే తనముందు బల్లమీఁదనున్న నన్ను కుడిచేతితోఁ బట్టుకొని పయికెత్తి నోట వేసికొని గుటుక్కున మ్రింగెను. చూచితిరా ? ఆక్రూరరాక్షసుఁ డెంతపనిచేసినాఁడో ! ఎంతచదువుకొన్నను రాక్షసులకు మనుష్యభక్షణముచేయు స్వభావగుణము విడువదుగదా ? మహోపాయసంపన్నుఁడ నగుటచేత నాతనినోటఁబడి నేనుకాఁబట్టి బ్రతికి బయలఁబడితిని గాని సామాన్యమానవుఁ డైనపక్షమున నంగుష్ఠ ప్రమాణముగల వాని జఠరాగ్ని కాహుతి కావలసినవాఁడే. నేను సూక్ష్మబుద్ధి నగుటచేత వాఁడు నన్ను తనగొంతుక్రోవి చొప్పింపఁగానే తిన్నగా లోపలికి పోవక యందుండి యేమిచేయుదునా యని యాలోచింపఁ జొచ్చితిని

అప్పుడు నాకు గరుత్మంతుడు మ్రింగిన కిరాతకాంతనుంచుకొన్న బ్రాహ్మణోత్తమునివలె గొంతుకలోనుండి మండి పయికి వత్తునాయని యొకయాలోచన కలిగినది. రామరావణయుద్ధమునందు కుంభకర్ణుడు కపులను మ్రింగినప్పుడు వారు నవరంధ్రములలోనుండియు వెడలి వచ్చినట్లు వెడలి వత్తునాయని యొకయాలోచన కలిగినది. కంఠనాళమునుండి గర్భములో ప్రవేశించి యక్కడ జరుగుచుండు విశేషముల నెల్లను కన్నులార చూచివచ్చి జీవించియున్న పురుషుని యుదరములో నేమేమి విచిత్రములు నడుచుచుండునో తెలిసి సత్యము తెలియక చిక్కులు పడుచున్న యిప్పటి శారీరశాస్త్రజ్ఞులకు జ్ఞానోపదేశము చేయుదునా యని యొకయాలోచన కలిగినది. ఇట్లు నాకప్పు డనేకములైన యూహ లుత్పన్నములు కాగా దీర్ఘవిచారముచేయక వేగిరపడి కార్యనిశ్చయము చేయుట బుద్ధిమంతుల లక్షణము కాదని యెఱిగినవాడనయి దీర్ఘముగా నాలోచించి, గర్భకుహరము ప్రవేశించిన పక్షమున నపవిత్రమైన మలద్వారమున పయికి వెడలవలసి యుండునుగాన బ్రాహ్మణుడనైన నాకది తగదని శారీరశాస్త్రజ్ఞుల కుపకారము చేయుటనిని విడిచిపెట్టి, శ్వాసకోశములనుశోధించి వైద్య శాస్త్రజ్ఞుల కుపకారముచేయవలెనని నిశ్చయించి గొంతుక్రోవిలో నున్న వాణిద్వారమునఁబోయి తిన్నగా నూపిరితిత్తులలోఁ బ్రవేశించితిని. అక్కడ నాయిష్టదైవమైన ముఖ్యప్రాణదేవుఁడు నాకు దర్శన మిచ్చి తనభక్తుని నిట్లు చేసినందుకయి కోపముచేతనో యన నన్ను తత్క్షణమే తనబలముకొలఁదిని బయికిఁ బంపివేసెను. వాయుబలముచేత నేనప్పు డాకాశబాణమువలె పయికెగసి బయలఁబడి యేప్రకారముగానో క్షణకాలములో నాతని శ్మశ్రువుల నడుమఁ జిక్కుకొని యక్కడనుండి యుట్టిచేరులలోనుండి యెలుక క్రిందికి ప్రాకినట్లుగా నీలిపగ్గములవంటి గడ్డపువెండ్రుకలు పట్టుకొని మెల్లగా క్రిందికి

డిగజాఱి బల్లమీఁద నాయథాస్థానముచేరి మరల నగ్రాసనాసీనత్వము వహించి కూరుచుంటిని. నేనప్పు డారాక్షసుని నోటినుండి పయికి వెడలితినో ముక్కునుండి పయికి వెడలితినో చెప్పలేనుగాని మఱి యే యితర మార్గమునుండియు వెలువడ లేదని మాత్రము దృఢముగాఁ జెప్పఁగలను. నేను పయికి వచ్చునప్పటి కాదుష్టరాక్షసుఁడు మెతుకు గొంతుకఁబడి పలకఁ బాఱినప్పుడు మన కగునట్లుగా క్రిందిగ్రుడ్డు మీఁదికిని మీఁదిగ్రుడ్డు క్రిందికిని వచ్చినవాఁ డయి యుక్కిరిబిక్కిరి యయి దగ్గుచు నెంతో సేపాయాసపడెను. నిష్కారణముగా సజ్జన సంతాపము చేసినవారి కాపదలు ఘటింపక యీశ్వరుఁడు సహించి యూరకుండునా? నేను సురక్షితముగా పయికి వెడలివచ్చుట చూచి సభాస్తారు లందఱును నామహిమ కత్యద్భుతపడి నేను నిజమయిన మహర్షినని నమ్మిరి. సూక్ష్మరూపుఁడనయిన నేను హనుమానునివలె తపోమహిమచేత స్థూలరూపము నొంది యాదుష్టరాక్షసుని పొట్ట చీల్చుకొని పయికి రానందునకయి సభవారిలో ననేకులు నాదయాగుణమును వేయినోళ్ళ శ్లాఘించిరి. నాయజమానుఁడు నావద్దకు పరుగెత్తుకొనివచ్చి వాత్సల్యముతో నా దేహము తడియొత్తి నాతడిబట్టలు తీసివేసెను. నామహత్త్వముచేత నాద్వీపమునందు నాఁటినుండియు జ్యోతిశ్శాస్త్రము నిరపాయముగా స్థిరపడినది. జ్యోతిశ్శాస్త్రమే సత్యము కానిపక్షమున, కాదన్న వానిగర్భములోఁ జొచ్చి వానిని ప్రాణావశిష్టునిజేసి నిరపాయముగా పయికి రాఁగలుగుట మనుష్యమాత్రునకు సాధ్యమగునా యని యెల్లవారును సంతుష్టులయిరి. మాపక్షమువారు తమవాదము గెలిచినదని జయజయధ్వనులతో బయలు వెడలఁగా నాఁటికి సభ ముగిసినది. ఇప్పటివలె గుటుక్కున మ్రింగక యే క్రూరరాక్షసుఁడయినను నన్ను పండ్లసందునఁ బెట్టుకొని నమలివేయు నేమోయన్న భయముచేత మహాకాయుఁడుగా రటు

తరువాత నెప్పుడును నన్నే సభకును దీసికొని పోలేదు. ఓ హిందూ మహాజనులారా! మీరావాడ్లోకేడకు బయలుదేరి దేశదేశములవెంటం బోయి యిక్కడ మీ కాక్షప్రియతమమైన జ్యోతిశ్శాస్త్రమును స్థిరప్రతిష్ఠ యావచ్చంద్రార్కమైన శాశ్వతకీర్తిని పొందవలెనందుకు మీరును నమందానందము పొందుడు.

ఆఱవ ప్రకరణము.

ఆనటినాఁటినుండియు నాకీర్తి లంకాద్వీపమునందు దిగంత విశ్రాంతముగా వ్యాపించినది. పడిపోవుచున్న జ్యోతిశ్శాస్త్రమును నిలువఁ బెట్టితినని విద్వాంసులు వేయినోళ్ళ శ్లాఘింపఁ జొచ్చిరి. జ్యోతిషమును పునరుద్ధారణముచేసి దేశమునకు మహోపకారము చేసినకతమునకయి కవీశ్వరులు నామీఁద పాటలను పద్యములను జేసి ఈశ్వరుని యపరావతారమునని నన్ను స్తుతింపఁ జొచ్చిరి. ఇఁక నామహిమలను విని యానందించి యింటింటను నాచిత్రచరిత్రమును కథగాఁ జెప్పుకొనుచు పామరులు చేసిన స్తోత్రపాఠములకు పరిమితియే లేదు. పామరుల నోళ్ళనుండి స్త్రీల చెవులలోఁకి నూతులవద్దను నీళ్ళ రేవులవద్దను జరగు మహా సభలలో చిత్రవిచిత్రముగా పెరిఁగి స్త్రీలనోళ్ళలోనుండి శాఖోపశాఖలుగా వ్యాపించి యంతఃపురములు చేరునప్పటికి నామహిమలు నిజముగా కోటిగుణితము లయినవి. కొందఱు నేను సింహికగర్భములోఁ జొచ్చి కాయముపెంచిన హనుమద్దేవునివలె నాకాయమును పెంచితినని చెప్పుకొనఁ జొచ్చిరి కొందఱు నేను సురసగర్భములోఁ జొచ్చి యంగుష్ఠమాత్రశరీరుఁడై బయలువెడలిన హనుమద్దేవునివలె సూక్ష్మాతిసూక్ష్మమగు రూపమును

ధరించితినని చెప్పుకొనఁ జొచ్చిరి; కొందఱు నేను శుక్రాచార్యుల గర్భమును చీల్చుకొని వెలువడిన కచునివలె దీర్ఘరోముని గర్భగోళ మును భేదించుకొని వచ్చి యాతని మృతసంజీవనీవిద్యచేత మరల బ్రతికించితినని చెప్పుకొనజొచ్చిరి; కొందఱు నేను దీర్ఘరోముని పాదములు మొదలుకొని శిరస్సువఱకును నడిమికి రెండు చీలికలుగా చీల్చి తరువాత జర యనురాక్షసి జరాసంధునియర్ధదేహముల నొక టిగా సంధించినట్లుగా రెండు ఖండములను మరల నతికించి మంత్ర ప్రభావముచేత పునర్జీవితుని జేసితినని చెప్పుకొనఁ జొచ్చిరి. ఇట్టి కథల నన్నిటిని పూర్ణముగా వివరించినచో నొక్క పెద్దపురాణము కావచ్చునుగాని స్వోత్కర్షమును జెప్పుకొనుట యిష్టము లేనివాఁడ నగుటచే వానిని నే నభివర్ణించుట మాని నాయపూర్వమహిమలను లోకోపకారార్థముగా పురాణరూపమున రచియించి యాచంద్రార్క ముగా లోకమున వ్యాపింపఁజేసి మనమహాత్ములవలె శాశ్వత కీర్తిని సంపాదించుకొనెడు పుణ్యమును భక్తాగ్రేసరులకు విడిచి పెట్టు చున్నాను. నాఁటినుండియు నన్ను దర్శింపవచ్చు భక్తులయొక్కయు భక్తురాండ్రయొక్కయు సంఖ్య దినదినాభివృద్ధియగుచువచ్చినదన్న సత్య మును బుద్ధిమదగ్రగణ్యులయిన మీతో నేను విన్నవింపవలసినయావశ్యక మేలేదుగదా? అయినను మీకింకొక సత్యమును మాత్ర మిప్పుడు వినిపింపవలసి యున్నది. లోకములో మనుష్యుఁడు గొప్పవాఁడయిన కొలఁదిని గొప్పతనముతోడఁ గూడ కష్టములును పెరుఁగుచుండును. భక్తులయిన వారు స్వప్రయోజనపరు లయి స్వలాభముకొఱ కాశ్ర యించి పీడించుచుందురు; అసూయాపరులయినవారు పరోత్కర్ష మును సహింపలేక యుపవాదములను వేసి బాధించుచుందురు.

లంకాద్వీపమునందు ప్రాచీనాచారనిష్ఠాగరిష్ఠులయిన శిష్టులం దఱును నన్ను సనాతన సదాచారములను స్థాపింప నవతరించిన

ఈశ్వరాంశ సంభూతునిగా భావించి బహూకరింపఁ జొచ్చినను, జ్యోతిశ్శాస్త్రమును రూపుమాప దీక్ష వహించి బద్ధకంకణులయివిఫల మనోరథులయిన నవనాగరికులు నన్ను ద్వేషించి నాయశస్సునకు భంగముకలిగించుటకును నాకపాయము కలిగించుటకును నానావిధములఁ బ్రయత్నించుచుండిరి. ఆరాక్షసులక్రౌర్యము నెఱిఁగి నాయజమానుఁడఁయిన మహాకాయుఁడుగారు నాఁటినుండియు నన్ను సభలకుఁ దీసికొని పోవుట మానివేసిరని యీవఱకే చెప్పియున్నాను గదా! ఆపదలు రానున్నకాలమునం దంతఃపురములలో దాఁచి సహస్రభటులను కావలియుంచినను రాకమానవు. ఆపదలు రారానికాలమునందు సముద్రమధ్యమునందుఁ బడవైచినను రావు. నాయజమానుఁడు తన యింట నన్నింత సురక్షితముగా నుంచి కాపాడుచుండినను, ఒక నాఁటిరాత్రి నాకొక్క ఘోరవిపత్తు సంప్రాప్తమయినది. ఓచదువరులారా! విధివిధాన మప్రతివిధానముగుట తెలిసికొని నావిషయమయి మీరు చింతిలఁబోకుఁడు.

ఒకనాఁటియర్ధరాత్రమునందు నేను నాపాన్పుమీఁద సుఖనిద్ర చేయుచుండఁగా నానడుమెవ్వరో పట్టుకొని నొక్కుచున్నట్లయి యులికిపడి లేచితిని. లేచి కన్నులు తెఱచి చూచునప్పటి కేదోజంతువు నన్ను నడుము మొదలుకొని మెడవఱకును నోటఁ గఱచుకొని పోవుచున్నట్లు దీపమువెలుతురున కనఁబడినది కాని యాజంతు వేదో యానవాలు తెలిసినదికాదు. ఆభయములో నన్ను వ్యాఘ్రము మీడ్చుకొని పోవుచున్నదని భ్రమకలిగినదికాని ప్రక్కలనుండి దాని కాళ్ళు నల్లగా కనఁబడినందున వెంటనే యాభ్రమ నివారణమయినది. అటు తరువాత నది భల్లూకమో వరాహమోయని తలఁచి యరణ్యములో నుండఁదగిన యాజంతువులు నట్టింటి కెట్లువచ్చునాయని వితర్కింప నారంభింపఁగా నింతలో నీటెతో పొడిచి నట్లుగా వీపునకు కోఱయొకటి

గ్రుచ్చుకొని తీవ్రవేదనను కలిగించినది. ఆవేదనకు భయము తోడ్పడి నన్ను కొంతసేపు మూర్ఛలో ముంచినందున నావల నేమి జరగి నదో నేను చెప్పలేను. మూర్ఛతేఱి నేను మరల కన్నులువిచ్చి చూచునప్పటికి చుట్టును నంధకారబంధురముగా నుండెను; ఏప్రక్కఁ జూచినను నాకంటి కేదియు కనఁబడ లేదుగాని నా ముక్కునకు మ్రాత్రము మురికికాల్వలలోనుండి వచ్చునట్టి దుర్గంధము గుప్పున కొట్టుచుండెను. దానినిబట్టి నన్నాజంతువు మాయింటిదారితూము కాల్వలోనుండి యీడ్చుకొని పోవుచున్నదని నేనూహించినాను. ఇట్లను కొనుచుండఁగానే నాకాదుర్గంధవిముక్తి కలిగినదికాని యాసౌఖ్య ముసు చిరకాలముండినదికాదు. జంతువు నన్ను నోటఁగఱచుకొని మాయింటివారి తూముకాల్వలోనుండి వీధిలోని కీడ్చికొనివచ్చి కొంత దూరము నడచినతరువాత మరల నధికదుర్వాసన గల మఱియొకరి తూము కాల్వలోనుండి మఱియొకరియింటిలోనికిఁ గొనిపోయి దీపము వెలుఁగున్న యొకగదిలో నన్ను క్రింద దింపినది. ఇదియంతయుఁ జూచి యీకపటకృత్యమంతయు నాకు శత్రువులుగానున్న కామరూ పులయిన యానవనాగరికులపని యని నేను మనస్సులో నిశ్చయించు కొన్నాను. దీపము వెలుఁగున నన్నీడ్చుకొని వచ్చిన జంతువును నల్లగా నాకంటికి స్పష్టముగాఁ గనఁబడినది. దానిని జూచునప్పటికి నా మేను నిలువునను జెమిర్చి కంపమొందఁ జొచ్చినది. అది మనదేశ మందలి యెలుఁగుబంటియంత యున్నది; ఎలుఁగుగొడ్డునకువలె దాని శరీరమందంతటను బొచ్చులేదు గాని వరాహమునకున్నట్లుగా మెడ మీఁదమాత్రము దబ్బనములవలెఁ బయికి నిక్కఁబొడుచుకొనియున్న దీర్ఘరోమములున్నవి. మీరయిన పక్షమున దానిని పెద్ద నుడవి పందియని భ్రమించియుందురుగాని యాదేశపుజంతువుల పరిమాణ ములనెఱిఁగియున్న నేనప్పుడొక్క నిమిషములో నది పందికొక్కని

యది మాంసభక్షకజంతువు కాదని యంతరంగమునఁ గొంత సంతోషించినాను. అప్పుడొక్క మూలుగు మూలిగి నన్నుఁ గొనవచ్చినజంతువు నన్ను నట్టింట దిగవిడిచి తానొక కన్నములోనుండి యావలికిఁ బోయెను. అంతట సమస్తాభరణభూషితురా లయియున్న యొక కాంత మంచముమీఁదినుండి దిగి వచ్చి మునిపిల్లలు చందనపు బొమ్మను పయికెత్తినట్లుగా నన్ను తనకుడిచేతితో పయికెత్తి రెండవ చేతిలోని యంగవస్త్రముతో నాశరీరమంతయు తుడిచి నన్ను తన మంచముమీఁదఁ గూరుచుండఁబెట్టి తానును నా యెదురుగాఁ గూరుచుండెను. కాళికాశక్తివలె నెదురఁ గూరుచున్న యామె మొగమును జూడఁగానే నామనస్సులో పరిపరిలాగుల నాలోచనలు పుట్టఁ జొచ్చినవి. నాశత్రువు లెవ్వరైన నన్ను బాధించి చంపుటకయి యిట్లు తెప్పించి యుందురని మొట్టమొదట తోఁచినది. తరువాత నొకటి తరువాత నొకటిగా ననేకాలోచనలు కలిగిన పిమ్మట కట్టకడపట రాక్షసాంగనయైనయామె నన్ను మోహించి బాణాసురుని కూఁతురైన యుషాకన్య యనిరుద్ధుని చిత్రలేఖచేతఁ దెప్పించుకొన్నట్లుగా నన్ని మూషకరాజుచేతఁ దనయొద్దకు రప్పించుకొని యుండునాయని సంశయము తోఁచినది. తరువాత మాయిరువురకును నడిచిన సంభాషణమును బట్టి నాయీకడపటియూహయే సిద్ధాంతమయినట్టు మీరిప్పుడే తెలిసికొనఁగలరు. ఆకాంత యద్భుతపడి చూచుచున్న నాకు తన్ను తెలుపుకొని, తనపేరు త్రిజటయగుట చెప్పి యిట్లనియెను—

త్రిజ—ఓరుషివర్యా! నావంక వెఱఁగుపడిచూడకు. ముల్లోకములను జయించిన సార్వభౌముని వంశములోని రాజకన్యకు జీవితేశ్వరుని గావించి ధన్యుని చేయుతలంపున నిన్నిటకు రావించితిగాని హానిచేయుతలంపున రప్పింపలేదు. ఇంద్రుని జయించి యింద్రజిత్తని పేరొందిన మేఘనాదుఁడను రావణపుత్రునకు నేను మునిమనుమరాలను.

సత్య—అమ్మా! నీకు నామీఁదఁగల యనుగ్రహముచేత నేను నిజముగానే ధన్యుఁడనయితిని. నాపేరు సత్యరాజాచార్యులు. నేను ఋషివర్యుఁడను పేరునకర్హుఁడనుగాను.

త్రిజ—నీపేరేదియైనను గానిమ్ము; నీవొక్క ఋషివరివిమాత్రమే కాక యంగుష్ఠమాత్ర శరీరులయి నిరంతరమును సూర్యునిరథముచుట్టును తిరుగుచుండెడు క్రతుపుత్రులైన యఱువదివేల వాలఖిల్యులలో నొక్కఁడవనికూడ నేనెఱుఁగుదును. ఇఁకనావద్ద నేమియు దాఁచఁబోకు.

సత్య—మీరట్లన్న నేనేమి చెప్పఁగలను?

త్రిజ—ఏమియుఁ జెప్పనక్కఱలేదు. ఇఁక రాత్రియెంతో లేదు. మాటలతో వృథాకాలహరణము చేయక కార్యాంశమును వినుము. నీయొక్క మహామహిమలను నాచెలికత్తెలవలన విని నీకు వలచి చిక్కినదానను. గాంధర్వవిధిని వరించి యిప్పుడే నన్ను చరితార్థురాలిని జేయుము.

సత్య—అటువంటిమాటలు మీరు సెలవియ్యకూడదు.

త్రిజ—దీనురాలనయి ప్రార్థించుచున్న నాకోరిక వృథపుచ్చుట మీకు ధర్మముకాదు. మీఋషులయొక్కయు దేవతలయొక్కయు గుట్టంతయు నేనెఱుఁగుదును. రాక్షసస్త్రీలమాట యటుండఁగా తిర్యగ్జంతువులతో సంభోగించుటకు సహితము సంశయింపలేదు.

సత్య—సంశయింపనివారెవ్వరు? మహాత్ములా?

త్రిజ—ఒక్క మహాత్ములుమాత్రమేకాక వారి దేవతలును సంశయపడలేదు. మందపాల మహర్షి లావుకపిట్టతో సంభోగించి సంతానము కనెను. విభండకమహర్షి లేడిని పొంది ఋశ్యశృంగుడను కొడుకును గనెను. మీవాయుదేవుఁడు కేసరియను వానరుని భార్యవలన హనుమంతుని గనెను. సూర్యుఁ డశ్వమునుజేర యశ్వినులను

గనెను, శ్రీకృష్ణుఁడు జాంబవంతుఁడను భల్లూకరాజుయొక్క పుత్రికను వరించెను. దేవేంద్రుఁడును సూర్యుఁడును ఋక్షవిరజుఁడను మర్కటమును కామించి వాలిసుగ్రీవులను గనిరి. మీవారికిట్టు నాకు తెలియదనుకొన్నావా ?

ఈమాట లనునప్పటి కారాక్షసియొక్క పురాణపరిజ్ఞానమునకు నాకత్యాశ్చర్యము కలిగినది. మన పురాణములలోని రహస్యములిన్ని ఈయాఁడుదాని కెట్లు తెలిసినవో ! శ్రీరాములవారికి తరువాత నేనొక్కఁడను దక్క భరతఖండవాసులు మఱియెవ్వరును లంకాద్వీపమునకు వచ్చియున్నట్లు నేను వినియుండలేదు. ఇఁక నెవ్వరీమెకీగాథను జెప్పియుందురు ? ప్రపంచమునం దంతటను లోకానుగ్రహార్థముగా తిరుగుచుండెడు హిమాలయభ్రాత లయిన మహాత్ములెవ్వరో యీమెను శిష్యురాలినిగా నంగీకరించి గుప్తవిద్య నీమె కుపదేశించి యుందురు. ఇది నిశ్చయము కాకపోయినయెడల లంకాద్వీపములో నంతఃపురములయం దుండెడు రాజకన్య కిట్టి శాస్త్రమర్మము లెట్లు తెలియును ? ఎటువంటి మహాత్ములు చెప్పినను పరదేశస్థులకు మనవారి మహిమలు సవిస్తరముగాఁ దెలియవు. ఈమెచెప్పిన విషయములలో నెన్నో ప్రమాదవచనము లున్నవి. ఊర్వశిని జూచుటచేత స్నానము చేయుచున్న విభాండకమహర్షికి జలములో వీర్యపతనమగుటయు లేఁడి యానీరు ద్రాగి గర్భముధరించి ఋశ్యశృంగుని కనుటయు తెలిసికొనలేక విభాండకుఁడు లేఁడిని పొందినట్లు చెప్పినది. ఋక్షవిరజుఁడు నీటిలో మునిఁగి వానరస్త్రీయైనప్పు డింద్రసూర్యులు కామించినకథ తెలియక వారు పురుషరూపముతో నున్న ఋక్షవిరజునినే కామించినట్లు చెప్పినది. ఇట్టి వ్యత్యాసములనుగూర్చి నాలో నే నాలోచించుకొనుచుండఁగా నారాక్షసాంగన కొంతసేపూరకుండి మరల ప్రశ్నలువేయుట కారంభించినది.

త్రిజ—ఓమునీంద్రా ! నేనడిగినదానికి ప్రత్యుత్తరము చెప్పక మౌనముధరించి యూరకున్నావేమి ? శీఘ్రముగా సమ్మతిని తెలుపు ప్రత్యుత్తరమును జెప్పుము.

సత్య—నేనేమని యుత్తరము చెప్పగలను ? వారు మహాత్ములును దేవతలునయినందున వారికెట్టి పనికయినను సామర్థ్యము కలిగినది. మనుష్యమాత్రుఁడ నయిన నాకెట్లుకలుగును ?

త్రిజ—నీవు నిజముగా మనుష్యుఁడవయినను సందేహింప వలసినపని లేదు. రాక్షసస్త్రీలను వివాహము చేసికొన్న మనుష్యులును మీలో ననేకులున్నారు. భీముఁడు హిడింబ యనురాక్షసితో సంభోగించి ఘటోత్కచుని గనెను. ప్రద్యుమ్నుఁడు వజ్రనాభదైత్యుని కూఁతురైన ప్రభావతిని బొంది పుత్రునిగనెను. అనిరుద్ధుఁడు బాణాసురపుత్రియైన యుషాకన్యను వరించెను. ఇఁక మాటుమాటాడక స్థూలరూపమును ధరించి నన్ను కృతార్థురాలిని జేయుము. కామరూపములను ధరించి యిష్టకామోపభోగములను బొందిన మీఋషుల మహిమలు నాకపారముగాఁ దెలియును.

సత్య—పూర్వకాలపు మహర్షులవద్దనేకాని యిప్పటివారి కటువంటి శక్తులులేవు. కామరూపమును వహించు సామర్థ్యము నావద్ద లేదు.

త్రిజ—నీమాట నేను నమ్మను; ఆలస్యముచేసి స్త్రీహత్య కొడిగట్టక స్థూలరూపమును బొందుము. తెల్లవాఱఁబోవుచున్నది. మంచిమాటలచేత నాప్రార్థనను వినవిపక్షమున బలాత్కారముగానైన నామనోరథము తీర్చుకొనెదను కొన్నిదినములక్రిందట నీవు దీర్ఘరోముని గర్భములోఁ జొచ్చి వెకటసముగా పెరిగి పొట్టచీల్చుకొని వయికి వచ్చినకథ నేను వినలేదనుకొన్నావా ? ఇఁక నావద్ద నీమాయమాటలు మాని నీకామరూపమహిమచేత స్థూలాకారమును ధరింపుము.

అపుడు నాకేమిచేయుటకును తోఁచలేదు. బ్రాహ్మణులకు రాక్షసస్త్రీని గాంధర్వవివాహమున కలియుగమునందు స్వీకరింప వచ్చునా యన్నధర్మసందేహ మొక్కటి నామనస్సును బాధింపఁజొచ్చినది; రాక్షస స్త్రీలను వరించినభీమాదులు క్షత్రియులు; అది ద్వాపరయుగము. ఈధర్మసందేహమును విడిచి లంకాద్వీపమునందు మనధర్మశాస్త్రముతో పనిలేదని యంగీకరించి యొప్పుకొన్నను, మనదేశము నందలి గ్రామదేవతలను సహితము పొత్తుల లోని చంటిపిల్లలనుగా గణింపఁదగినంత మహాకాయము గల యీ రాక్షసికి వరుఁడు కాఁదగినంత పొడుగు నేనెట్లెదుగఁగలను? ఆచిన్నది యిది గాంధర్వవివాహమని చెప్పుచున్నను నాదృష్టికిది కేవలరాక్షస వివాహముగాఁ బొడకట్టుచున్నది. మనదేశములో కన్యను వరుఁడెత్తుకొని పోవుటధర్మము; ఈ రాక్షసవివాహమున కన్యయే వరుడెత్తుకొని వచ్చుట తటస్థించినది. హా! దైవమా! నేనేమి చేయుదును? కామదేవుఁడు కల్పించిన యీయాపద నెట్లు తప్పించుకొందును? ఎంతచదువుకొన్నను స్త్రీలబుద్ధి యెప్పుడును పెడదారినే పోవునుగదా? మహావిద్వాంసులారా! ఈచిన్నదానికి నన్ను తనంత స్థూలరూపము వహించుమని నిర్బంధించుటయే కాని తాను నాకుఁదగిన సూక్ష్మరూపమును ధరింపవలెనన్న యాలోచన తోఁచినది కాదు. ఇక్కడ నింకొక ధర్మసూక్ష్మత యున్నది. రతిసమయమునందు స్త్రీలు నిజరూపమున పొందుదురని పెద్దలు చెప్పుదురు. అది యాలోచించియే యీమె నన్ను స్థూలరూపము పొందుమని నిర్బంధించుచున్నదేమో! రాక్షసవిగ్రహములుగల హిడింబాదులను పొందునప్పుడు భీమాదు లేమిచేసిరో! ఓభరతఖండవాసులారా! మనుష్యులైన భీమాదులే పెరిగి రాక్షసరూపమును ధరించిరో, రాక్షసులైన హిడింబాదులే చిక్కి మనుష్యరూపమును ధరించిరో, పురాణములను శోధించి నాకు తెలుపుఁడు;

నేసీమాట లనుకొనుచుండఁగా త్రిజట నామీఁద చేయివేసి వేగిరము స్థూలరూపము పొందుమని నన్ను నొక్కెను. అప్పుడు నాబ్రతుకు సింహాపుపెండ్లికొడుకు కాలిక్రిందఁ బడి నలిగిన యెలుక పెండ్లికూతురుబ్రతుకు కాఁగా, ఆనఖక్షతమునకు సహింపలేక నేను బావురని పెద్దపెట్టున నేడ్చితిని. ఆకూఁత విని వెలుపలినుండి యెవ్వరో "అమ్మాయీ! ఆపిల్లికూఁత యెక్కడిది ?" అనియడిగిరి. ఏమియు లేదని చెప్పి త్రిజట యెవ్వరైనను వచ్చిచూచిపోదు రన్నభయముచేతఁ గాఁబోలును నన్ను మంచముమీఁదినుండి దింపి గోడమూలనున్న మందసము తాళముతీసి నన్నందులోఁబెట్టి మరల తాళమువేసెను. ఆమందసము చిన్నగదియంత యున్నది. తాళముచెవి పెట్టు రంధ్రము గవాక్షమంత యున్నందున లోపలికి తగినగాలి వచ్చు చుండుటచేత నే నాయాసపడక యొకబట్టమడతమీఁద నొరిగి కొంచెముచేపు నిద్రపోయినాను. ఆనిద్రలో మహాకాయముగల వానరమొకటివచ్చి నన్నెత్తుకొని పోవుచున్నట్లు కలగని యులికిపడిలేచితిని. స్వప్నములో కోఁతినిగాని వరాహమునుగాని చూచినపక్షమున భయముకలుగునని స్వప్నశాస్త్రాభిజ్ఞులగు పెద్దలు చెప్పుదురు గదా! ఈ కల వేకువజామున వచ్చినదగుటచే నెలదినములలోనే దానిఫలము కలుగునని నేను మఱింత భయపడఁ జొచ్చితిని. "దుస్స్వప్నే దుర్జనస్పర్శే స్నానమేవ విధీయతే" యన్న శాస్త్రప్రకారముగా స్నానము చేయవలెనన్నను పెట్టెలో మూయఁబడి యుండుటచే నాకదియు సాధ్యమైనదికాదు.

శ్లో. రామం స్కందం హనూమంతం వైనతేయం వృకోదరం
శయనే యః స్మరేన్నిత్యం దుస్స్వప్నం తస్య నశ్యతి.

అన్నశ్లోకమును నేను రాత్రి పరుండఁబోవునప్పుడు పఠింప మఱచిపోయిన దోషముచేత నాకీదుస్స్వప్నము సంప్రాప్తమయినది. కామరూపులయిన రాక్షసులయొక్క యీదేశమునందు దీనికేమి ప్రతిక్రియ

చేయవలెనో తెలియకున్నది; ఈపెట్టెలోనుండి ముందుగా నీవలఁ బడినఁగదా తరువాత ప్రతిక్రియమాట యాలోచింపవలెను ? నాశత్రువు లెవ్వో రూపమును ధరించివచ్చి నా కేయపాయమును సేయుదురోయని నాయుల్లము తల్లడిల్లుచున్నది. హా ! దైవమా ! ఏమిచేయుదును ? కామరూపమునుపొందు శక్తిని మాభరతఖండవాసుల కెవ్వడును ప్రసాదింపకుము. ఈకామరూపధారణము దుష్టులకు మాయవేషములు వేసికొనివచ్చి సాధువులకు హానిచేయుట కొఱకేకాని మంచివారి కేసత్కార్యములు చేయుటకొఱకును నావశ్యకమైనది కాదని నాకిప్పు డనుభవము వలనఁ దెలియుచున్నది.

ఏడవ ప్రకరణము.

ఆపెట్టెలో నే నొకబట్టమడతమీఁదఁ గూరుచుండి పైని చెప్పినట్లు నాలో నే నాలోచించుకొనుచుండఁగా నేదో తేలుకుట్టినట్లు నా నడ్డిమీఁద నొకపోటుపొడిచినది. ఆపోటుతో నాధ్యానమంతయు చెడినందున నిప్పుత్రొక్కిన క్రోఁతివలె నొక్క యెగురెగిరి యులికిపడి లేచి నాలుగుమూలలను గంతులువైచుచు నిది యాదుస్స్వప్నఫలమని భయపడుచు ముందుకు తిరిగిచూచునప్పటికి నాకన్నులయెదుట మన మూషకమంత జంతువొకటి మహాభయంకరముగా కానఁబడెను. అది యెలుకవలెనున్నను దానికి తోఁకగాని వెనుకవైపునకాళ్ళుగాని యేమియు లేవు, అవయవరహితమై తోలుకప్పిన యెముకలులేని నల్లనిమాంసపుముద్దవలె నున్న యాచరమకాయమే దానిశరీరములో నాలుగింట మూఁడువంతులున్నది ; ద్రాక్షసారాయము పోసిన తోలుతిత్తివలె

నుబ్బి మెత్తగానున్న, యీచరమకాయమునకంటె దానిలో చతురాంశమంతయున్న పూర్వకాయమున్నది ; ఆపూర్వకాయమునకు ప్రక్కకు మూఁడేసి చొప్పున రావణాసురుని భుజములవలె నాలుకాళ్ళున్నవి ; దక్షప్రజాపతిమెడ కతికించిన మేషశిరస్సువలె చిన్నదిగా నున్న దానిశిరస్సున కిరుపార్శ్వములయందును పట్టుకారులవలె రెండుడెక్కలున్నవి; దాని దేహచ్ఛాయ యమవాహనమైన మహిషచ్ఛాయను బోలి నామనస్సున కప్పు డంధకాసురుని స్మరణకు తెచ్చినది. నాకన్నులయెదుట నట్లు నిర్భయముగా నిలువఁబడిన యీజంతువు పయికి మత్కుణమువలె కానఁబడినను అది కామరూపప్రభావముచేత నట్టి రూపమును వహించిన ఘోరరాక్షసుఁ డయినందునకు సందేహము లేదు. విద్వన్మహాసభలో నేనట్లు ప్రతిపక్షుల నోడించి జ్యోతిశ్శాస్త్రము నాచంద్రార్కముగా నిలువఁబెట్టిన నాఁటినుండియు పరాజితులయిన క్రూరరాక్షసులు నామీఁద పగపట్టి నానావిధమాయావేషములచేత నాకపాయముచేయఁ జూచుచున్నారు. ఆదేశమునందలి జ్యోతిశ్శాస్త్రమహిమచేత నేఁటిరాత్రి నేనీపెట్టెలోనుందునని ముందుగాఁ దెలిసికొని నాకు హానిచేయవలెనన్న ద్రోహబుద్ధితో వచ్చి యెవ్వఁడో యొక రాక్షసుఁడు నాకంటె ముందుగానే పెట్టెచొచ్చి దాఁగియున్నాఁడు. అట్లు కానియెడల తాళము వేసిన పెట్టెలోని కాజంతు వెట్లు వచ్చును ? వచ్చినను మత్కుణరూపము నేల ధరించును ? ధరించినను నేనువచ్చినదాఁక దాఁగియుండి దొంగవలె నేమఱుపాటున మీఁదఁబడి నన్నేల కఱచును ? ఇన్ని హేతువులనుబట్టి యీజంతువు రాక్షసుఁడగుట నిశ్చయము. అయినను నాకిప్పు డీరాక్షసునిపేరు తెలియనందున నిజమైనపేరు బయలఁబడువఱకును మన కథాంశము నిమిత్తము నేనాతని మత్కుణాసురుఁడని పిలిచెదను. నేను భూదేవుఁడ నన్నయంశము మీకు తెలిసినదే కదా. దేవతలు రాక్షసులను తారసిల్లి నప్పుడు

మహాయుద్ధము సంభవించుననియు మీరెఱుఁగుదురు. మనుష్యాశనుఁ డగుటచేత నన్ను మ్రింగవలెనని యారాక్షసుఁడే మొట్టమొదట నా మీఁదఁ బడెనో దుష్టశిక్షణము చేయవలెనని నేనే మొట్టమొదట రాక్షస సంహారమునకు పూనితినో వీరావేశపరవశుఁడ నయి యుండుటచేత నేను నిశ్చయముగాఁ జెప్పలేనుగాని మాయిరువురకును జరిగిన యుద్ధము దేవాసురయుద్ధమును మించినదనిమాత్రము దృఢముగాఁ జెప్పఁగలను. ఆరంభదశలో కొంతసేపు మాయిరువురకును బాహాబాహిని నఖానఖిని దంతాదంతిని ఘోరయుద్ధము జరగినది. నాగకుమారుని మీఁదికి దుముకు గరుత్మంతునివలె నే నారాక్షసునిమీఁదికి కుప్పించి యుఱికి నా రెండు బాహువులతోను వానిబాహు వొకటి యొడిసిపట్టి శ్రీకృష్ణులవారు గోవర్ధనగిరి యెత్తినట్టు పయికెత్తి గిరగిర త్రిప్పి నేల మీఁద వేసి కొట్టఁబోయితిని. కాని యారాక్షసుఁడు క్రిందఁబడక మాయచేసి తనబాహులతో నాచేయిఁ గట్టిగాపట్టుకొని వదలక కత్తుల వంటి తన ఱెక్కలతో నాకుత్తుక కత్తిరించ వలెననియో యమపాశములవంటి తనబాహుపాశముల నాజంటిని నామెడ కొక్కసారిగా చుట్టి బిగించి యూపిరివెడలనీయక ప్రాణములు గొనవలెననియో దక్షిణ భుజముమీఁదుగా నాకంఠసమీపమునకు ప్రాకఁ జొచ్చెను గాని నేనింతలో మెలఁకువపడి మోచేతివద్దికి పరుగెత్తునప్పటికే యెడమచేతిత్తో నే వారాక్షసుని కాలుపట్టుకొని నేలమీఁదమోఁపి సింహనాదము చేసితిని. నాసింహనాదముయొక్క దారుణధ్వనిచేత దిగ్గజముల చెవులకు చెవుడు పట్టియుండును; ఆకాశమునుండి గవ్వలవలె నక్షత్రములన్నియు నేలమీఁద రాలియుండును. నేనప్పుడు పెట్టెలో నిర్బంధింపఁబడి యుండుటచేత పయికివచ్చి చూడలేకపోయితినిగాని లేని యెడల క్రిందరాలిన నక్షత్రములను కొన్నిటి నేఁటి మూటకట్టి తెచ్చి నామాటకు నిదర్శనముగాను నాపౌరుషప్రకటన మగునట్లుగాను మీ

కూడాపి మీకు కష్టకము కలిగించియుందును. నేను విసరివైచినప్పు డా రాక్షసుఁడు పర్వతమువలె నేలఁగూలియు చావక బట్టమడత మీఁదపడి మరలలేచి మహావేగముతో నావంక పరుగెత్తుకొని రాఁజొచ్చెను. నే నెదురుగాఁ బోయి కుంజరముమీఁదికి కుప్పించు సింహమువలె రాక్షసునిమీఁదికి లంఘించి కాలఁదిని నొక్కతన్ను తన్నితిని. ఆతన్ను తగిలియున్నయెడల వాఁడు పొట్ట పగిలి చావవలసినవాఁడే కాని యారాక్షసుఁడు తన మాయాబలముచేత నాపాదఘాతమును తప్పించుకొని ప్రక్కకు తొలఁగెను. ఆపదతలాఘాతముచేత పెట్టెయంతయు నదిరి పర్వతగుహవలె మాఱుమ్రోసెను. నాకాలితాఁకున పెట్టె క్రిందికిదిగి పెట్టెతోఁగూడ భూమి పాతాళమంట క్రుంగుటచేత నాఁడు శేషునితలల కెంతో నొప్పికలిగి యుండును. అతఁడా దుర్భర వేదనచేత శిరసు కదల్చినప్పుడు భూకంపము కలుగక మానదు. ఓభరతఖండ వాసులారా! హూణశకము ౧౮౮౬ వ సంవత్సరము మార్చి నెల ఏడవ తేదినిగాని దానికి కొన్నిదినము లీవలావలనుగాని భూకంపము కలిగినదేమో స్మరణకుఁ దెచ్చుకొనుఁడు. ఆకాలమునం దెక్కడనైనను భూకంపము కలిగినట్లు మీకు జ్ఞప్తికి వచ్చినను వార్తాపత్రికలయందు చదివినను పెద్దలవలన వినినను స్వప్నములయందు జూచినను, అది నాపాదతాడనముచేతనే యైనదని గ్రహింపుఁడు. ఎన్నివిధములచేత విచారించినను మీకాభూకంపవార్త గోచరము కానిపక్షమున, మీరు మన పంచాంగములను జదివి వానియందైనను జూచి జ్యోతిషశాస్త్ర మహిమకు సంతోషింపుఁడు. ప్రక్కకు తొలఁగిన యారాక్షసుఁడు బట్టమడత చివరవఱకును పరుగెత్తి యక్కడనుండి మరలి మరల నావంకకు నడువ నారంభింపఁగా నేను వెనుకకుఁబోయి పార్శ్వభాగమునకువచ్చి యొక్క కాలూడిసిపట్టి ద్వంద్వయుద్ధము కారంభించితిని. భీమదుర్యోధనులకు జరిగిన ద్వంద్వయుద్ధమువలె మాపోరాట

ము మహాఘోరముగాఁ రాక్షసుఁడు ధర్మయుద్ధమునఁ నన్ను గెలువ లేక యధర్మయుద్ధమునఁ బ్రారంభించి నా కాళ్లు పట్టుకొనియెను. నేనా కాలునకు భయపడక ధైర్యము విడువక [illegible] గదలక విష్ణుమూర్తివలెనే [illegible] జీల్చి వాని వజ్రకాయమును ఛేదింపలేక కుపితుఁడ [illegible] మార్గమునే యవలంబించి దంతములు ప్రయోగించి తన [illegible] ఘేమునకు సుయోధనుని [illegible] విరుగఁగొట్టినట్లు [illegible] నాముని పంక్తితో [illegible] కాలొక్కటి [illegible] పెక్కు ఖండములు చేసి తిని. ఈప్రకారముగా యుద్ధమునంతను వర్ణించిన పక్షమున భారత రామాయణములంత గ్రంథము పెరుగునని భయపడి యీపనిని పు రాణకర్తలకు విడిచి నేనిక్కడ మాసమరపర్యవసానమును మాత్రము చెప్పెదను. శ్రీరాములవారు రావణాసురుని వింశతిబాహువులను నఱికినట్లును శ్రీకృష్ణులవారు బాణాసురుని సహస్రబాహువులను నఱికి నట్లును నేనామత్కుణాసురుని యారుబాహువులను దంతాదంతిని నఖానఖని యుద్ధముచేసి నఱికి నాయసహాయ శూరత్వమును జూపితిని. అప్పుడు రాక్షసుఁడు దేవేంద్రుని వజ్రాయుధముచేత ఱెక్కలు తెగి పడిన పర్వతమువలె కదల మెదల నేరక కూలఁబడెను. ఈలోపల ప్రభాతసమయ మగుచుండెను. అది రాక్షసులకు మంచి సమయముఁ కాదని యెఱిఁగినవాఁడనయి వెంటనే మీఁదబడి కాలితోఁదని పొట్ట మీఁద త్రొక్కితిని. ఆ దెబ్బతో మనుష్యరక్తపానముచేసి బలిసియున్న వాఁపొట్ట పగిలి చిమ్మనగొట్టములతోఁ గొట్టినట్లు బుస్సుమని రక్త ధారలు పయికెగసి నా మొగమునఁబడెను. పరశురామునివలె క్షాత్రి మును పూని శత్రుసంహారముచేసి పెట్టెలో నెత్తురుమడుగులు చేసి నను, ఆరక్తము కంటఁబడఁగానే బ్రాహ్మణధర్మమైన దయాగుణము మరలవచ్చి నన్ను క్షణకాలము మూర్ఛలో ముంచెనుగాని నేనంతలో

తెలిసి చెప్పుకొని మరల శత్రువునంకెఁ జూపితిని. శత్రువప్పటికిని జావక తన రెక్కల నాడించుచుండెను. అగ్నిశేషమును ఋణశేషమును శత్రుశేషమును నుంచఁగూడదని రాజనీతివేత్తలు చెప్పుట స్మరణకుఁ దెచ్చుకొని నేనప్పుడు నా రెండు చేతులతోను రాక్షసుని రెండు రెక్కలను బట్టుకొని శ్రీకృష్ణులవారు బకాసురుని చీల్చినట్లు నిలువునఁ జీలఁజూచితిని గాని యాలోపలనే నాభుజబలాతిశయముచేత వాని రెక్కలు నడిమికి విఱిగిపోయినవి. అంతట రాక్షసుఁడు విగతాసుఁడయినాఁడు. అప్పుడు దేవతలు నామీఁద పుష్పవర్షము కురిసియుందురుగాని పెట్టెలోనుండుటచే దానిని జూచి యనుభవించు భాగ్యము నాకన్నులకు కలిగినది కాదు. మహాపుణ్యప్రదమైన యీమత్కుణాసురవిజయకథను శ్రద్ధతోఁ జదివినవారును భక్తితో విన్నవారును పద్యకావ్యమునుగా రచించి లోకమున బ్రసిద్ధిపఱిచినవారును మూఁడులోకములయందును మత్కుణబాధనుండి విముక్తులగుదురు.

శ్లో. మవర్ణాది మకారాంతమ్ నతమ్ కవర్ణ సంయుతమ్
అదంతణకారోపేతమ్ ఏతన్మంత్రం విదుర్బుధాః.

పరమగోప్యమైన యీమత్కుణమహామంత్రమును పరమవిశ్వాసముతో నిత్యమును జపించువారికి సమస్తవిషబాధలును తొలఁగును.

మత్కుణాసురవధానంతర మారాక్షసునిదేహమునుండి యొకవిధమయిన దుర్గంధము బయలువెడలి నాఘ్రాణేంద్రియమున కుదుస్సహము కాఁజొచ్చెను. ఆదుర్గంధసముద్రమునుండి వెలువడు సాధనమెట్లాయని నాలో నేనాలోచించుచుండఁగా నింతలో మారణకోలాహలముచేత మేలుకవచ్చిరో పెట్టెలోని బట్టను దేనినైన తీసికొనవలసివచ్చిరో మఱి యేహేతువుచేతనో త్రిజట మంచము దిగివచ్చి పెట్టెతాళముతీసి మూఁతపయి కెత్తెను. అందువలన పయినున్న వాయుదే

ప్రేమ లోపలికివచ్చి దుర్వాసనను కొంత తొలఁగించి భక్తుఁడనైన నాక పరిమితసుఖప్రదాయకుఁ డయ్యెను. ఇంతలో త్రిజట పెట్టెవద్దఁ గూరుచుండి లోపల తొంగిచూచి బట్టమునపమీఁద మసుగు కట్టియున్న రాక్షసుచిరక్తప్రవాహమును గని యీయెఱ్ఱమఱక యెట్లయినదని వాసన చూచి యీవల్లిపోతుదని పలుకుచు మత్కుణాసురుని కళేబరముతీసి దూరముగా విసరివైచెను. ఆనువిగ్రహమును జూచి భయపడి యొక మూల నొదిగియున్న నన్ను చేతితో బట్టుకొని కొంచెము పయికెత్తి “బాలఖిల్యా! ఇంతటనైనను నీవు స్థూలరూపమును ధరించి నామనోరథమును సఫలముచేయుము. రాక్షసాంగనాపరిగ్రహము వలన నీకు పాపములేదు. పూర్వము మీభూలోకములో చంద్రవంశపురాజయిన యయాతి వృషపర్వుఁడను రాక్షసరాజుకూఁతురైన శర్మిష్ఠను వరించి వంశకర్తయైన పూరుఁడులోనుగాఁగల కొడుకులను గన్న వార్త మీపురాణములయందువినలేదా? మాఱుపలుకవేమి?” అని తనవ్రేళ్ళతో నాప్రక్కలు నొక్కెను. నే నాబాధకు తాళలేక యింతకుముందే మత్కుణాసురునితోడి సంగరమునందు నఖానఖి దంతాదంతిని పోరాడి గడిదేఱియున్న రసికుఁడ నగుటచేత నాకన్యయొక్క పాణిగ్రహణముచేసి యామృదుహస్తముమీఁద నఖక్షతి దంతక్షతములనుజేసితిని. నవోఢయగుటచే నాసుందరినారసికత్వమును గ్రహింపలేక కెవ్వునకేక వేసి చేతిలోనున్న నన్ను క్రిందవిడిచి పెట్టెను. భాగ్యముచేత నేను బట్టమీఁదపడఁబట్టిగాని యంతయెత్తునుండి పెట్టె కొయ్యమీఁదనేపడుట తటస్థించినపక్షమున నాతల రెండువ్రక్కలయి యుండును. ఆ చిన్నది కెవ్వున కేక వేయఁగానే లోపలనుండి యెవ్వరో “అమ్మాయీ! అట్లు కేక వేసితివేమి?” అని యడిగిరి. “మఱేమి యులేదు ఎలుక” అని త్రిజట యుత్తరమిచ్చెను. “ఎలుక నిన్ను కఱచినదా యేమి? ఎలుకకాటువలన విష మెక్కును. ఎక్కడ కఱ

చేసెది?" అని యెలుకను నొక్కుచుండగన లోపలికివచ్చెను. ఆమె వచ్చుటచూచి వెంటనే పెట్టెమూఁత వైచి తాళమువేసి త్రిజట "అమ్మా! యెలుక నన్ను కఱువలేదు. నాచీరనిలుత్తము పెట్టె మూతతీయఁగా పెట్టెమీఁదనున్న యెలుక నాచేతిమీఁదినుండి ప్రాఁకి యీ పెట్టెలో దుమికినది. నేను భయపడి కేక వేసి పెట్టెమూఁతవేసినాను." అని చెప్పెను. "మంచిపని చేసినావు. ఎలుకలబాధ మనయింటవిస్తారముగా నున్నది. ఎక్కడనుండో యీ యెలుక యొకటి మనగదిలో ప్రవేశించి పండెముమీఁది బట్టలన్నియు కొట్టివేయుచున్నది. నేఁటికి దానికాయువు మూఁడి పెట్టెలో దూకినది. పాఱిపోవునేమో పెట్టెతలుపుతీయకు. పెట్టె నెత్తిమీఁదపెట్టి మన తాటకచేత నావలికిఁబంపెదను." అని యా కెంపవనసుందరి చెప్పెను. వారిసంభాషణమువలన నేనా కాంత త్రిజటతల్లియని గ్రహించితిని. అప్పుడు తల్లిబిడ్డలకు మఱియు నీ క్రిందికీతిని ప్రసంగముజరిగెను.

బిడ్డ—అమ్మా! ఈపెట్టె తాటకచేత పంపరాదు. అది యిందులోని యెలుకను చంపివేయును.

తల్లి—అమ్మాయీ! నీకిష్టములేనియెడల చంపక దీనిని దూరముగాఁగొనిపోయి యూరిబైట విడిచిరమ్మని నేను తాటకతో గట్టిగా చెప్పెదనులే.

బిడ్డ—నీవెన్ని చెప్పినను తాటక దీనిని చంపకమానదు. అది క్రూరురాలు. దానిమాట నేను నమ్మను. నాసఖియైనహిడింబిని కూడ వెంటఁబంపి దూరముగా వదలిపెట్టించెదను—ఓహిడింబీ! ఓహిడింబీ! వేగిరమురా.

తల్లి—ఇష్టమున్నయెడల హిడింబినికూడఁ బంపవచ్చును—ఓతాటకా! నీ చీపురుగట్టవిడిచి యిటురా. వీధియరుగులు తరువాత తుడువవచ్చునులే.

"అమ్మా! వచ్చుచున్నాను" అని దూరమునుండి యొకధ్వని వినవచ్చినది.

"ముందుగా నీవిటురా. నీపని తరువాత చేసికొవచ్చునులే." అని మరల త్రిజటతల్లి దాసిని పిలిచెను. "పని కావచ్చినది. చేసికొని వచ్చెదను." అని దూరమునుండి మరల ధ్వని వినవచ్చెను. "అది యెంతసేపటికిని రాకున్నది. నేను పోయి తీసికొనివచ్చెదను." అని త్రిజట తల్లి నడిచెను. ఆమె కాలిచప్పుడు వినఁబడఁగానే నాకు భయ మధికము కాఁజొచ్చినది. ఇంతలో నెవ్వరో లోపలికి వచ్చుచున్నట్లు మరల కాళ్ల చప్పుడయినది. ఆయడుగులచప్పుడు చెవినిబడఁగానే నాపాలిటికి మృత్యుదేవత్యయైన తాటకయే వచ్చుచున్నదని నాగుండెలు తటతట కొట్టుకొన నారంభించినవి. అప్పుడెవ్వరో యిద్దఱు గుసగుస లాడుచున్నట్టు మాటలు వినఁబడఁజొచ్చినవి. అది రాక్షసుల కేకాంత మైనను వారి గుసగుసలు సూక్ష్మశబ్దగ్రహణశక్తిగల మనుష్యుల శ్రవ ణేంద్రియములకు స్పష్టముగా వినఁబడుచునే యుండును. అందుచేత చెవియొగ్గి వారిమాటల నాలకింప మొదలుపెట్టితిని.

"ఓహిడింబీ! రాత్రి నీవుతెచ్చిన వాలఖిల్యుఁడీపెట్టెలో నున్నాఁడు. అమ్మతో నిందున్నది యెలుకయని నేను బొంకినాను."

"ఇప్పుడు నేనేమి చేయవలెను?"

"ఇతని కపాయము కలుగకుండ కాపాడి యేలాగుననైనను నీవీతనిని నాకడ మరలఁ జేర్పవలెను. నాఁటి రాత్రితెచ్చుట తెచ్చుట గాదు. నేఁటిపగలు తెచ్చి నీప్రాణసఖియైన త్రిజట ప్రాణములు నిలుప వలెను.

"ఓత్రిజటా! నీనిమిత్తమయి నాప్రాణములయిన నిచ్చెదను. ఆరాక్షసిముండ కన్నులు గప్పి మరలతెచ్చి నీప్రియవల్లభుని నీకెట్లు సమర్పింపఁగలుగుదునో నాకు తోఁచకున్నది."

"అమ్మ తాటకను తీసికొనివచ్చుచున్నది. ఇఁకమాటల కవకాశము లేదు. ఇదిగో పెట్టె తాళముచెవి. ఇది నీవు దానిచేతి కియ్యక వదిలముగా నీయొద్ద నుంచుకొని యేదో మాయోపాయముచేత దానిని దూరముగా పంపివేసి పెట్టెతీసి యీవాలఖిల్యుని నీయొడిలో వేసికొని తీసికొనిరా."

"త్రోవలో నేదో యుపాయ మాలోచించెదను."

అనుచుండఁగానే మరల పాదముల చప్పుడు వినఁబడినది. ఇఁక నాకు ప్రాణభయము లేదని నాగుండెలు కొంత కుదుటపడినవి. "ఈపెట్టె దీనినెత్తిమీఁదికెత్తు" అను శబ్దముతోనే పెట్టె కదల నారంభించెను. ఆపెట్టెలో నాకప్పుడు కలిగిన యనుభవైకవేద్యమయిన సౌఖ్యము మనదేశమునందలి మోటుబండ్లలో నెక్కి యెత్తుమెత్తుల పల్లములు గల దారులలో ప్రయాణములుచేసి మోకాళ్ళకును మోచేతులకును శిరస్సులకును దెబ్బలు తగిలించుకొన్నవారికిఁ దక్క మఱియెవ్వరికిని దెలియదు. హృదయైకవేద్యమయిన యాభోగమును గొంతసేపనుభవించిన తరువాత పెట్టె భూమిమీఁద మోపినట్టయి యాకాంతలసంభాషణ మారంభమయ్యెను.

"ఓహిడింబీ! ఈమెలుక నేమిచేయుదము?"

"ఓతాటకా! చేయుటకేమున్నది? ఈపొదలచేరువను విడిచి పెట్టుదము. దీనిని చంపవలదని త్రిజట చెప్పినమాట నీవు వినలేదా?"

త్రిజటమాటల కేమిలే. మనము దీనినిచంపక విడువరాదు. మొన్న నాయలుకగుడ్డకన్నములోనికీడ్చుకొనిపోయినది యీయెలుకే."

"మంచిది. అలాగుననే చేయుదము. నీవాశ్మశానమువద్దకిఁబోయి యొకకఱ్ఱ తీసికొనిరా. నేను పెట్టెమూఁతతీయఁగానే కఱ్ఱతో నీవీ యెలుకను చావమోఁదుదువుగానిలే."

"ఈయాలోచన దివ్యముగా నున్నది. కాలుచున్న కాష్ఠములో నుండి యొకకట్టెనుగొని యిక్కడ నున్నట్టె వచ్చెదను."

ఈమాటలు చెవినిబడఁగానే నేనావఱకను పెట్టెకుదుపువలనఁ గలిగిన గాయములబాధను మఱచిపోయి ప్రాణభీతిచేత మానసికమైన మరణవేదనను పొంద నారంభించినాను. ఈమనోవేదనముందఱ నాశరీర వేదన పర్వతములో పరమాణువంతగానైనను తోఁచలేదు. ఏమియు పాలుపోక యిట్లారాటపడుచున్న సమయములో హిడింబి పెట్టెమూఁత తీసి నన్ను పైకితీసినది. ఇంతలో నెవ్వరో దూరమునుండి "హిడింబీ! హిడింబీ!" అని పిలువఁజొచ్చిరి. "అయ్యో! ఈవాలఖిల్యుని నాయొడి లోఁ బెట్టుకొని నాబట్ట సవరించుకొనుటకైన నవకాశము లేకపోయినది! కానీ! ఇతని నిప్పటి కీపొదలో దాఁచి వారిని సాగనంపి మరలవచ్చి యొడిలోఁ బెట్టుకొనిపోయి నాచెలికి సమర్పించెదను. ఈలోపల తాటక వచ్చి యడిగినయెడల పెట్టెతీయఁగానే యెలుక పాఱిపోయి యేదో కలుఁగులోదూఱినదనిబొంకెదను." అని తానను కొనుచు నన్ను చేరువ పొదలోఁబెట్టి తానా వచ్చెడివారి కెదురుగాఁ బోయెను. నేను దూర ముగానున్నను వారిమాటలు నాకు వినఁబడుచునే యుండెను.

ఆవచ్చినపురుషులలో నొక్కఁడు—ఓహిడింబీ! రాత్రి వాల ఖిల్యమహర్షి నెవ్వరో యెత్తుకొనిపోయినారఁట! ఆతనిని వెదకుట కయి మహాకాయుఁడుగారు మమ్ముబంపినారు. అతనిజాడ నీ కేమియు తెలియ లేదుగదా?

హిడిం—తెలియలేదుగాని నేనొక్కమాటవిన్నాను. ఎవ్వఁడో యంగుష్ఠమాత్ర శరీరుఁడైన పురుషుఁ డొక్కఁడు జ్యోతిశ్శాస్త్ర ప్రతి పక్షులైన నవనాగరికులసభలో నున్నాఁడని విన్నాను.

పురు—ఆసభ యెక్కడనో మాకు కొంచె మానవాలు చెప్పఁ గలవా?

హిడిం.—ఇక్కడకు నాలుగుయోజనముల దూరములోనున్న తోటలోనున్నది. దారిచూపెదను రండి.

అని వారిని తీసికొని హిడింబి ప్రక్కనుండుటకు తిరిగి యదృశ్యమైనది "మీరనుకొన్న నాలుబిల్వులఁజను నేనె! నాపేరు సత్యరాజాచార్యులు." అని నేనుమహారాయుని భృత్యులను పేరులుపెట్టిపిలిచి గొంతుపగులునట్లుగా నఱచితినిగాని నామాట వారు వినిపించుకొన్నవారుకారు. పొదనుండివెడలి వారివెంట పరుగెత్తుటకు తాటక కత్తి గొనివచ్చి యెక్కడచావమోదునో యన్నభీతిచేత నాకు సాహసము లేకపోయినది.

ఎనిమిదవ ప్రకరణము.

హిడింబి నన్ను పొదలోఁగూరుచుండఁబెట్టి పోయినతరువాత మనస్సులో పరిపరివిధముల నాలోచనలు కలుగఁజొచ్చినవి. తాటక కత్తి గొనివచ్చి చావఁగొట్టునేమోయన్న భయము మొట్టమొదట పుట్టినది. గాని యారక్కసి పెట్టెలోనున్నది యెలుక యనుకొని యెలుకను చావమోదునిమిత్తము కఱ్ఱకొఱకు వెళ్ళినదన్నమాట స్మరణకువచ్చిన తరువాత భయనివారణమయినది. ఇంతలో హిడింబివచ్చి నన్ను పట్టుకొని యేమిచేయునో యన్నభయము మఱియొకటివచ్చి నామనస్సును మఱింత బాధింపఁజొచ్చినది. హిడింబి చేతిలో మరలఁ జిక్కుకొన్నపక్షమున నాకు మరణవేదనకన్నను క్రూరతరమయినబాధ సంభవించును. అది నన్నొడిలోఁ బెట్టుకొనిపోయి తనచెలియైన త్రిజటకు మరల సమర్పించినపక్షమున, త్రిజట నన్నేమి బాములఁబెట్టునో!

మరల నేపెట్టెలోనో పఱుపుక్రిందనో పెట్టి త్రిజట నన్ను దాఁచినపక్ష
మున నేనీసారి యూపిరివెడలక యజ్ఞపశువువలె చావవలసి వచ్చును.
అని యాలోచించుకొని హిడింబివచ్చులోపలనే పొదవిడిచి పాఱిపో
వలెనని నిశ్చయించుకొని నేను మెల్లగా బయికివెడలివచ్చి యొక చెట్టు
చాటునకు నడిచితిని. ఇట్లొక చెట్టుమొదలుచేరి నలుదిక్కులకును
చూడ్కి నిగిడించునప్పటి కొకదిక్కునుండి తాటక చేతఖడ్గధరించి
మృత్యుదేవతవలె నావంకకే వచ్చుచుండెను. మఱియొకదిక్కునుండి
శ్మశానములుదాటి పెద్దవానరమొకటి నావంకకే వచ్చుచుండెను.
ఇంకొక దిక్కునుండి యాపురుషులను విడిచి హిడింబి యొక్కతెయు
నావంకకే పరుగెత్తుకొని వచ్చుచుండెను. త్రేతాగ్నులవలె మూఁడు
రూపములును నాకంటఁబడఁగానే నాకప్పుడు ముగ్గురు మృత్యుదేవత
లాసన్నమయినంత భయము వేసినది. చెట్టున కెగఁబ్రాకుఁదమన్న దాని
ప్రకాండము నాకౌఁగిటి కొదఁగదు. తొఱ్ఱలో దూఱుదమన్న నెందు
వెదకినను తొఱ్ఱ గానరాలేదు. ఏమిచేయుటకును దోఁచక నేనుదిగ్భ్రమ
నొంది దిక్కులు చూచుచుండఁగా ముందుగా హిడింబి వచ్చి పొదచేరి
నన్నే కాఁబోలును వెదక నారంభించెను. ఇంతలో తాటకవచ్చి పెట్టె
చేరి మూఁత తెఱచి యాశ్చర్యపడ నారంభించెను. అప్పుడు తాటక
హిడింబిని జూచి నీవాపొదలో నేమి వెదకుచున్నావని యడిగెను. నీవు
కట్టెకొఱకు పోయిన తరువాత నెలుక యెంతయున్నదో చూడవలెనన్న
చపలత్వముచేత పెట్టెమూఁత యెట్టితీయఁగా నొక్క యెగురెగిరి
యావలబడి యెలుక యీపొదలో దూరినందున దానిని వెదకుచున్నా
నని హిడింబి యుత్తరము చెప్పెను. నేనామాట లాలకించుచు నేమఱి
యున్నసమయమునందు మెల్లగా వానరము నావద్దకువచ్చి నన్ను చంకఁ
బెట్టుకొని చెట్టుమీఁది కెగఁబ్రాకెను. నాదుస్స్వప్న ఫలమిప్పుడు
నాకు పూర్ణముగా ననుభవమునకు వచ్చినది. నాకు కలలోఁ

గడఁబడిన కోతియే యిప్పుడు ప్రత్యక్షమయి నన్ను వృక్షాగ్రమునఁ బెట్టినది. అక్కడనుండి క్రిందికి జారిపడితినా చట్రాతిమీఁదఁబడిన గాజుకాయవలె నాతల వేయిప్రక్కలు కాకమానదు. ఏకొమ్మనైన నను గట్టిగా కౌఁగిటఁబట్టుకొనవలెనన్నను పట్టుకోనీయక యీపాడుకోతి యెడమచేతితో భల్లూకపు పట్టుపట్టి నన్నొడిలోఁ బెట్టుకొని కదల నియ్యకున్నది. చెట్టుపయిని నేనిట్టియవస్థలోనుండఁగా క్రింద హిడింబియు తాటకయు నన్ను వెదకుచు నేనున్న చెట్టుమొదటికి వచ్చిరి.

తాట—అయ్యో! చేతఁజిక్కిన యెలుకను నిష్కారణముగాఁ బోఁగొట్టితివిగదా!

హిడిం—నీవు కట్టెనిమిత్తమయిపోయి యెంతసేపటికిని రాక పోఁగా నెంతపెద్ద యెలుకో చూడవలెనని మూతకొంచెము తీయఁగానే యెలుక పైకుఱికి పాఱిపోయినది.

తాట—మహాకాయునియింటనున్న వాలఖిల్యమహర్షి నెవ్వరో యెత్తుకొని పోయినారని చెప్పుచుండగా వినుచు నిలుచుండుటచేత కట్టెతెచ్చుటకు కొంచె మాలస్యమయినది. ఎలుక పైకిరాఁగానే తఱుముకొనిపోయి పట్టుకోలేక పోయినావా?

హిడిం—ఇంతలో మహాకాయుని భృత్యులిద్ద ఱిక్కడకు వచ్చి యుండనియెడల దానిని నేను పోనిత్తునా? వాలఖిల్యమహర్షి రాత్రి యంతర్ధానమయినమాట చెప్పుచు వారు నన్ను కొంతదూరము తమ వెంటఁ గొనిపోయినారు.

తాట—ఇక్కడ కలుగులు లేవు. ఎలుక యీచెట్టుపైకి ప్రాఁక లేదుగదా?

హిడిం—ఎలుకలు చెట్లెక్కునా?

తాట—చూచితివా చెట్టుమీఁద నెంతపెద్ద వానరమున్నదో?

హిడిం—ఏది? అదా? అవునవును. దానియొడిలో నేమో యున్నట్లున్నది.

తాట—అదృశ్యుఁడయిన వాలఖిల్యుఁడీ వలెకనబడుచున్నాఁడు. అవునవును. అతఁడే. మా కోడిపిల్ల పోయినప్పుడు ప్రశ్నయడుగఁబోయిన వాలఖిల్యుఁడితఁడే.

హిడిం—ఈ వాలఖిల్యుఁడు మహోదరునికీవ బాగుండును. మన త్రిజట వాలఖిల్యుని జూడవలెనని యెన్నోసారులు నాతోఁ జెప్పినది. మనమితని దీసికొని పోయి యామెచేతికిచ్చి రెండుమూఁడు దినములు మనయింట నుంచుకొందము.

తాట—నీవన్నయాలోచన బాగున్నది. ఈకోఁతిని బెదరించి మన మావాలఖిల్యుని పట్టుకొంటిమా వేయిసువర్ణములు సంపాదించి మనము ధనికురాండ్రము కావచ్చును. మహాకాయుఁడెంత సొమ్మిచ్చియైన నీతనిని వదల్చుకొని పోకమానఁడు.

హిండి—అట్లయిన మన మీవాలఖిల్యుని పట్టుకొందము. నీవు చెట్టెక్కఁగలవా ?

తాట—ఎలుకను బట్టుకొనుటకయి దుమికెడుపిల్లివలె నేనీ చెట్టుమీఁదికొక్క గంతువేసి వాలఖిల్యుని బట్టుకొనెదను. నీవీకట్టె చేతఁ బట్టుకొని క్రోఁతి క్రిందకుఱికి పాఱిపోకుండ జాగరూకతతో కాచి చూచుచుండుము.

ఆమాటలు వినునప్పుడు నాబ్రతుకు ముందఱికివచ్చిన నోయి యి వెనుకకుఁబోయిన నూయియు వలెనుండెను. ఈముగ్గురిలో నెవ్వరిచేతిలోఁ బడినను నాకు ప్రాణసంశయస్థితియే సంభవించును. ఆముగ్గురును త్రేతాగ్నులనుగా నేనీవఱకే పోల్చియున్నానుగదా! నన్నుఁగొనిపోయి దక్షిణస్వీకరించి విడువఁదలఁచినందున తాటకను దక్షిణాగ్నియనవచ్చును. నన్నుఁగొనిపోయి తనచెలికత్తె కర్పించి నన్ను గృహపతినిగాఁ జేయఁదలఁచినందున హిడింబిని గార్హపత్యాగ్ని యన వచ్చును. నానోటిలోనేదో క్రుక్కియో తోఁక నామెడకుఁ జుట్టఁ

క్షత్రియో హోమము నిమిత్తమై బ్రాహ్మణులు పశువును బట్టి కట్టినట్టుగా నూడిచి వెడలనియ్యక నాప్రాణములు గొనఁదలఁచినందున మర్కటము నాహవనీయాగ్నియని చెప్పవచ్చును. ఈ మూఁడగ్నులలో నాకష్టము దక్షిణాగ్ని మేలుగఁ దోఁచినందున నా యజమానుఁడైన మహాకాయునిదగ్గఁజేరి సుఖింపవచ్చునన్న యాశచేత నేను తాటకచేతిలోఁ జిక్కఁదలఁచుకొని వానరముయొక్క యొడిలోనుండి దుమికి యా రాక్షసిని కౌఁగిలించుకొనుటకయి చేతులు చాఁచుకొని సంసిద్ధుఁడనయి కూరుచుండియుంటిని. తానొకటి తలఁచిన దైవమొకటి తలఁచునుగదా! తాటక వృక్షమారోహించుట చూచి యా దుష్టవానరము నన్ను విడిచి పాఱిపోక తన తోఁకను నేను మొదట ననుకొన్నట్టుగా నామెడకుఁగాక నాపొట్టకు చుట్టఁబెట్టి నన్ను తనవీపుమీఁద కదిమిపెట్టి యా చెట్టుమీఁదినుండి మఱియొక చెట్టుమీఁదికి దుమికెను. అంతట తాటక చెట్టు దిగివచ్చి హిడింబితో నేమో యాలోచించి వానరమును రాళ్ళతో విసరనారంభించెను. దానికి సహాయురాలయి హిడింబియు మామీఁద శిలలు రువ్వసాగెను. ఆ శిలాయుద్ధమునకు తాళఁజాలక వానరరాజు చెట్టుమీఁదినుండి యుఱికి నన్ను వీపుమీఁద వేసికొని పాఱిపోవఁజొచ్చెను. వెనుకనుండి యఱచుచు నారాక్షసాంగన లిరువురును మమ్ము తఱుముకొని వచ్చిరి. ఇట్లు కొంత దూరము పరుగెత్తునప్పటికి వెనుకఁ జెప్పిన మహాకాయుని భృత్యులిద్దఱును ప్రక్కదారినివచ్చి వారిని గలిసికొని మేలపరుగెత్తుచున్నారని యడిగిరి. ఆ చెడుకోఁతి వాలఖిల్యుని నెత్తుకొని పాఱిపోవుచుండఁగా విడిపించుటకయి పరుగెత్తుచున్నామని వారు త్తరము చెప్పిరి. ఇట్లు నలుగురును నొక్కచోటఁ జేరునప్పటికి పూర్వము నన్ను మందోదరి యప్పుడప్పుడు తీసికొని వచ్చెడి యుద్యానవనముకడకు మేము వచ్చితిమి. అంట నలుగురును గలిసి తన వెంటఁబడు మర్కటరాజునుమాత్ర

మును భయపడక నన్ను విడువక యక్కడనుండి యొక్కయంగ వేసి యెగిరి సువేలాద్రిమీఁదికి దుమికెను. ఆవానరుఁడు గంతువేసినస్థలమునకు సువేలాద్రి నాలుగు యోజనములదూరములో నున్నదని నేనంతకుముందే మందోదరివలన నెఱిఁగియున్నాను. మర్కటము నన్ను వెన్నునఁ బెట్టుకొని కుప్పించి యెగురఁబోవునప్పుడు దైవమాయచేత నాకొక్కసారావులింతవచ్చినది. పూర్వాచారపరాయణుఁడ నగుటచేత పెద్దలయాచారమును మీఱరాదని నేనప్పుడు కొండంత యాపదలో నున్నను నాయావులింత పోవుటకును చిటికెలు వేయుచుంటిని ఆకోఁతితో నేను సువేలాద్రిశిఖరమున వాలునప్పటికి లెక్కవేయఁగా నాచిటికెలు సరిగా పదియైనవి. ఆలెక్కనుబట్టి పదిచిటికెల కాలములో వానరము నాలుగు యోజనముల దూరము దుముకునని నేను తెలిసికొంటిని. అప్పుడు నేను ముందువంకఁ జూచునప్పటికి నాయెదుట లవణసముద్రము మేఘమండలములనంటు తరంగములతోను మేఘనాదములతో వియ్యమందు సంతతధ్వనితోను భయంకరముగాఁ గానఁబడెను. వానరమింక ముందువంకకు దాఁటిపోవుటకవకాశము లేనందున నలుగురువచ్చి చుట్టువేసి నన్నుదక్కించుకొని మహాశాయున కియ్యవచ్చునని నాలోనేను సంతోషపడుచుంటిని. ఇట్లు నేను మనోరథసామ్రాజ్యానందము నొందుచుండఁగానే వానరము కుప్పించి ముందువంక దుముకుట కున్ముఖమయి యున్నట్లు కనఁబడెను. అందుచేత నే నీసారి యెంతదూరము దుముకునో చూడవలెనన్న యుత్సాహముచేత ముందు సముద్రమున్నమాట మఱచిపోయి చిటికెలు వేయుటకు మొదలుపెట్టితిని. ఇన్నూటయేఁబది చిటికెలు లెక్కపెట్టునప్పటికి వానరము నన్నుగొని సముద్రమున కావలి యొడ్డుననున్న యొక విశాలమయిన యిసుకతిప్పలో వ్రాలినది. అప్పుడు నేను గణితశాస్త్రప్రకారముగా లెక్కవేసి యిన్నూటయేఁబదింటిని పదింటిచేత

ఘాటింపఁగా వచ్చినట్లు నిరువదియైదుకాఁగా, పదిచిటికల కాలములో సముకొఁగలదూరము నాలుగుయోజనములగుటచేత నిరువదియైదును నాలుగుచేత గుణించి సముద్రముయొక్క వెడలుపు సరిగా నూఱుయోజనములని తెలిసికొని నేనత్యాశ్చర్యపడితిని. ఆహా! మనపూర్వులసామర్థ్యము నేమని శ్లాఘింతును! వారునిజముగా సర్వజ్ఞులేసుండీ. అణుమాత్రమయినను హెచ్చుతగ్గులు లేక నూఱుయోజనములని రామాయణములోఁ జెప్పఁబడినది నేను కన్నులారా కొలిచి లెక్కచేసినదానికిని సరిగా సరిపోయినది. లంకకును మనదేశమునకును నడుమనున్న సముద్రమిదియేకదా? నేను సముద్రమును దాఁటునప్పుడు శ్రీరాములవారు కట్టిన వారావధిని స్పష్టముగా జూచినాను. మనుష్యులు లంకకుఁ బోవకుండుటకయి మరలివచ్చునప్పుడు శ్రీరాములవారు కట్టను నడుమనడుమ తెగఁగొట్టిన సందులును నాకంటికి కరతలామలకముగాఁ గనఁబడినవి. మన పూర్వులను గురించి యాలోచించుచు నేనుకొంచె మేమఱియుండఁగా వానరమునన్ను వెన్నుమీఁదినుండి త్రోఁకతో పైకెత్తి మఱియొక్కసుముకు దుమికినది. ఈసారి నేను వీపుమీఁదనానుకొని దృఢముగా నుండక వాలమున వ్రేలుచు భయభ్రాంతుఁడయిన యుండుటచేత చిటికలువేసి దూరమును కనుఁగొనలేకపోయినాను. నేనిట్లు దిగ్భ్రమ నొందియుండఁగానే యావానరము నన్ను నట్టడవిలో విడిచి యదృశ్యమయినది. అప్పటికి సూర్యగతినిబట్టి నాలుగయిన గడియల ప్రొద్దెక్కినట్టు తోఁచినది. కన్నులువిచ్చి చూడఁగా నక్కడిచెట్లు మొదలయినవి లంకలోనివానివలె నత్యున్నతములు గాక మనదేశములోని సామాన్యవస్తుజాలమువలెనే యున్నవి. ఆవానరముయొక్క వీపునానుకొని సముద్రమును దాఁటునప్పుడు నాకు తోఁచలేదు గాని నన్నిక్కడకుఁ గొనివచ్చి విడిచిన యీ మహానుభావుఁడెవ్వఁడో యన్నయాలోచన నా మనస్సునకిప్పుడు కలిగినది. అతఁడు వాయు

పుత్రుఁడైన హనుమంతుఁడయినందుకు సందేహము లేదు. అతఁడు హనుమంతుఁడే కాకపోయినచో శతయోజనాయామమయిన సముద్రము నొక్కయంగను దాఁటుటకు మఱియొక్కనికి సాధ్యమగునా? కాదు మనపెద్దలు చెప్పినట్లుగా నతఁడు రావణాసురుని కాష్ఠమారిపోకుండు నట్లుగా ప్రతిదినమును తాను దంతధావనము చేసికొన్న పుడకల నందు వేయుటకయి పోవుచుండును గాన నేఁటి యుదయమున నన్నుఁజూచి జాలి దలచి పాపలేశము లేని నేను రాక్షసుల దేశమునుండి రాలేనని యిక్కడ తెచ్చి విడిచినాఁడు. నేనీ యడవిలోని ఘాతుకమృగముల వాఁతబడక బ్రతికి యిచ్చటివారి యండఁజేరఁ గలిగినపక్షమున, రెండుమూఁడు మాసములలో వారిభాష నేర్చుకొని తరువాత నా కథను మీకు మహాత్ములచేతఁ బంపెదను.

సంపూర్ణము.

శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచననైషధము.

By

K. VEERESALINGAM

శ్రీ

శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచన నైషధము.

ప్రథమాశ్వాసము.

క. సిరియెదఁగలదొరజేజే
దొరయు నెలఁతనోర నుండుదొర జేజేలె
ల్లరుఁగొలుచుఱేఁడ త్రాచుల
సరులుగలుగు జక్కులదొరసంగడికాఁడా.

క. కడఁకఁదెనుఁగున నొనరుతుఁ
గడుకొని నలుఁడను నొడయనికతయెల్లను నే
నుడుగక నానేర్చుకొలఁది
నెడద న్నిన్నునిచి కొలిచియెంతయునిచ్చల్. 2

క. దుడుకున నింతకుఁగయితె
న్నుడునెఱుఁగని కుఱ్ఱఁగాన నచ్చతెనుంగన్
గడలినినొంటిఁగచేఁదఁగ
గడఁగితి నీయండఁజూచి కదలనికడఁకన్. 3

గీ. తాతఁగొనియాడి తెరిగట్టుదారిఁగొలిచి
గట్టురాకన్నెనగ్గించి దిట్టయైన
తెల్లచానకు జోహారులల్ల జేసి
లగ్గులొసఁగ నెలుకరౌతు నగ్గడించి. 4

క. నన్నయఁదలంచి యెదన
ఱ్ఱన్ననుసారెకునునెంచి యలతిక్కన్నం
జెన్నగలొనిడుకొనిసూ
రన్నఁగొలిచియగ్గడింతు నాశ్రీనాథున్. 5

సీ. నేర్చుకొలఁదిని నేఁజేయదొరఁకొన్న
యీసలుకతతెఱం గొట్టినవినఁ
ప్రొల్లి కానలలోన నెల్లెడఁదిరుగుచు
నోగి గొంత్రెతొలికొడు కొక్కనాఁడు
నైదోఁడులనుఁగూడి చక్కఁగాఁగూర్చుండి
జడదారియొక్కండు సరసకరుగు
దెంచినఁ గనిలేచి యించుకయొకు రేగి
కొని తెచ్చిజోహారులొసరఁజేసి
యొకకసాసగద్దియఁగూరుచుండననిచి
తనకుఁగూళలా దాయలు కినుకతోడ
నెఱఁగిచేసిన కడగండ్ల నెల్ల నోలి
నెఱుఁగఁజేయుచు నాతని కిట్టులనియె. 6

ఉ. ఓజడదారిరాయ యొరుఁడొక్కఁడు నాసరిగాఁగఁగానలోఁ
దేజుతొఅంగి యంగదలఁదేలుచు లచ్చిని నేలఁజుట్టలం
దాజతకూడు నెయ్యునిని దద్దయుఁగూడుట లేకనిచ్చలీ
యోజనుదూలి హెచ్చుడిగియుండఁగఁ జూచితె తొల్లియొచ్చటన్. 7

గీ. అనుచుఁగన్నులనీరొల్కనాడియూర
కున్న జడదారియూరార్చి చెన్నుదలిగి
సరసఁగూర్చుండియున్న యాదొరనుగూర్చి
యెట్టకేలకు నల్లనిట్టులనియె. 8

గీ. నేలజేజేలఁగూడి జేజేలకుద్ది
యైన నైదోడులును దేరులలరఁగాన
నుండనరుగుదెంచితిగాదెయూరకిచట
కెక్కుడైనయట్టియొఱుక యొడఁదఁదనర 9

సీ. తొల్లి జూదానసలుఁ ద్రోఁడితూలియకట
తనకుఁగలసిరులన్నియు దాయగొనఁగ
నొక్కరుఁడెచేటులొందఁడే యుక్కడక్కి
కానలోనఁజిక్కనితనచానఁదొఱఁగి. 10

సీ. అనినఁగట్టియున్నయాకతయెఱుఁగంగఁ
గోరుటయునుగోర్కికొనలుసాఁగఁ
జదురుగులుకనిట్లు జడదారిరాయండు
తెలియఁజేయఁదొడఁగె దేటగాఁగ. 11

సీ. ఎసఁగునలుఁడను ఱేఁడొక్కఁడెన్నరాని
దండులెచ్చుటఁగనుఁగొన్ననిండియుండ
నేలునతఁడునిషధయనునేలఁదనదు
చేతలోరులెల్లనగ్గించి చెలఁగుచుండ. 12

క. ఇంతయుఁగొదలేకుండఁగ
నెంతయుఁదాజన్నిగట్లకిచ్చునునిచ్చల్
కొంతయుజాలిగొనక తన
చెంతఁదిఱుగునతనినైనఁ జెడుగుంద్రుంచున్. 13

క. ఓలిన్నలుఁగొనియాడఁగఁ
దేలికఁ దాతయును గాలితిండుల ఱేఁడుం
జాలుదురే యొకరొకరికి
నాలుగుజంటయిదునూళ్లునోదలలున్నన్. 14

గీ. అట్టిచక్కనయ్యకునుద్దియైనరాచ
యేనుఁగులగొంగయొక్కనాఁడేగుదెంచి
తోఁటలోనికొలఁకుచెంతఁదోడులేక
యొక్కరుఁడెయిట్టటుతిరుగుచున్నతఱిని. 15

క. అంచలరాయఁడొక్కఁడు
గొంచక తనయునికిఁ జెలులుగొండఱ తోనే
తెంచి యెదుటనేలకుడిగి
యించుకనడయాడఁ జూచి యిచ్చనలరుచున్. 16

క. ఒకయెడ నంతటనంచల
నడల తెఱంగెల్లఁ గాంచి నగుచుఁ గడంకన్
గడుకొని యొకరాయంచను
దడయక చిక్కించుకొనియెఁ దనక్రేఁగేలన్. 17

ఉ. దానిఁ దొలంగి యేగుటకుఁ దాళక యంచలు గొంతచెంగటన్
జానుగ నుండి కన్గొనుచుఁ జయ్యన నేగుచు జాలిఁదూలుచుం
గానఁగ నేగుదెంచుచును గ్రక్కున నాతని నిక్కి చూచుచున్
దానిని జీరుచుం దుదకుఁ దద్దయు డస్సి తొలంగె నచ్చటన్. 18

గీ. అట్లు చిక్కియంచ యారాచరేఁడు
తనకుఁ గీడు నేయునని తలంచి
యేలికకుడిచేత నాలుకతడియాఱ
నిలిచి కన్నుఁగొనల నీరుగ్రాలంగ. 19

గీ. అలుకుకదిరి యొడలు దడదడలాడంగ
నోరురాక కొంతయూరకుండి
యెట్టకేలకింత యెదగట్టి చేసికొం
చెలుఁగు సన్నగిలఁగ నిట్టులనియె. 20

క. ఏటికి నరుదెంచితి నీ
తోఁటకు నిందేలచెలుల తోడ దిగితి న
న్నేటికి నేలికలోఁగొన
నేఁటికి నేగితలఁగ నయ్యాదితెఱఁగో. 21

క. అనితనలో ననుకొనికడు
నెనరుగలుగు నట్టుగాఁగ నెట్టనవలునిం
గనుఁగొనుచునీరెలుంగున
ననియెం దన తెల్ల తెక్కలార్చుచుఁగణఁకణ. 22

సీ. ఎల్లచోనారాక కెదురుచు చూచున్నండు
నెలంతుకయెదనెంత తలఁకెనొక్కొ
యేకేయినన్నింటి నిలుదాఁటనీకుండు
కన్నతల్లియదెంత కలఁగెనొక్కొ
తోడునీడలలాగు తొలఁగనిచెలికాండ్రు
సోలినన్ గన కెంతసూలిరొక్కొ
నేఁజేరుటయెఱింగి నెనరునఁజనుదెంచు
కొడుకులుతారెంతొ కుందిరొక్కొ
కూడియెల్లరిది తెలిసికొన్నయంత
గటకటా తాతనీచేతఁ గడకునేఁడు
చిక్కఁగాఁజేసె నేనెద్ది సేయుదింకఁ
హాళినన్నెలు తేఁడనేననదనైతి. 23

మ. అనినందద్దయు జాలినొందుచునతండాయంచఁ జుట్టాలతోఁ
జనఁగా నానతియిచ్చె దాననళుకుం జాలించిరాయంచయుం
దనకాతేఁడొనరించు లగ్గునకుఁగాఁ దానొండు సేయంగలో
ననయెత్తంగడునంతసిల్లి దొరచెంతంజేరి తానిట్లనుణ. 24

గీ. ఆయనీయట్టిచాగికి నగునటంచు
నేనుజేసెడు లగ్గించుకైనఁగలదె
యైననానేర్చు నట్లుగనేనునొక్క
లగ్గుసేయంగ నెడఁదఁదలంచినాఁడ. 25

క. ఆమడిచేకోఁడగుసని
యీయెడ నేలికకుఁ దోఁచెనేనియు నింకన్
నాయెడ కెనకోలయఁగసి
కాయాలించెదరుగాక గొనకొనియనుచున్. 26

గీ. కత్తినెచ్చెలి తొలియాలిఁగన్నతండ్రి
చేలియుంటను సిరులచేనెసఁగినట్టి
యూరుచెన్నారు సరిసాటియొకటిలేక
తఱచుకోటల నెఱయగ త్తలఁజెలంగి 27

గీ. అట్టియూరేలు నెంతయు దిట్టయైన
యట్టి క్రథకైశికుం డనునట్టిజెట్టి
కడఁగియాతండు కన్నులఁగనుట లేక
కొన్నినాళులు రాయిడిఁగుందికుంది. 28

*గీ. దాకుఁగుడితట్టునఁ గుఱుచయాకదిసిన
యయిదయిదులనాల్గు తెనుఁగక్కరానఁ
దనరుదనుఁడను నొకజడదారిచేని
నాలుదానును నిచ్చలుఁజాలఁగొలిచి. 29

♦గీ. ఒనరఁగానేడునాల్గులయొక్కటగుచుఁ
దనరు తెనుఁగచ్చరానమదయులసందు
కూడినదయంతియనఁజెల్లుకూఁతునోర్తుఁ
దనరుకొడుకులనిద్దఱగనియెనతఁడు 30

*గీ. వేలఁగలయూళ్ళనేళ్ళుమనెఱివిదిరిగి । యెందుగోర్కియాదేరకకుందికడకు
దమనుఁడనియెడు నొకజడదారిచేవి । నాలుఁదానునువిచ్చలుఁజాలఁగొలిచి.

♦గీ. అతనినెనరింతగడియించియలరుకతన।గోరిదమయంతియనఁజెల్లుకూతుఁనోర్తు
దమునుదమదాంతుఁడునవఁదవరునట్టి।యనఁగుగొడుకులనిద్దఱగనియెతేఁడు.

గీ. అంచుఁగన్నియ తనరారుఁజందురల్లు
నలరుచిలుకన జక్కుల చెలులునచ్చ
రలునఁగాలికూడు ద్రొరలకలుకలునుద
లంచిచూడదానికెనయె యించుకైన. 31

సీ. కలికినెన్నడకోడి కలయుంగనంచలు
కొలఁకులకడనుండెఁ గోర్కెదక్క
చెలియమొగులకోడి చెండ్రొగల్ దలలోతు
నీటిలోదిగజాఱె నీటుదక్క
నెలతకౌనునకోడి నెఱహత్తి సూడులు
కాననుండఁగఁజొచ్చెఁగడఁకదక్క
కన్నెయొడలికోడిక్రొన్ననలెల్లెడ
నలిగి యెండఁగఁజొచ్చెనాసదక్క
యాఁరయాఁచాన సొగసెల్ల నాలకించఁ
గలిగినను గానఁదిరుగుచు గాలినీరు
నాకులునుగుడిచెమజోగులై నఁదాళ
లేకతొగలతే నల్లునికాఁకగొనరె. 32

క. కన్నులుజిగితొగతేకులు
సన్నినూగారుతేటి చాల్తొడలరఁటుల్
నెన్నఁడలేమఁగునడకలు
నెన్నుదురరచందురుండు నెఱులెన్నిరుల్. 33

సీ. చిగురులఁగఅకుగాఁ జేసినయాఁబోడి
తేఁటులఁ జెల్లఁజెందించురట్టు
జిగితొగలేతులఁజేరఁజేసిననేగి
యంచలఁ గొలకులనుంచునగడు

క్రొన్ననగుత్తులఁ గూడఁ జేయుకొ నంత
యనఁటులఁ జొదతోడ నొనరుచునడి
నేఁడుఁ గొంగలఁ గాననుం జినయొగ్గు
తరఁగలఁ గ్రుంగంగ దార్చుకీడు
కలికిచేతులఁ గురులను గన్నుదోయి
నకలహాగను నుజనుకట్టుఁ దోడలుఁ గానఁ
దలలు నొనరించి కాదె తాఁ దాత తోడరి
చేసికొనె లేక యుండంగఁ జెలఁగి తనకు. 34

గీ. అట్టిసాగసులగనిమైన యానెలంత
దండకే నేగి తటిమైనె దండి నగుచు
సరగసీ చేత లెల్లను సారెకచట
నోటికోలఁదిని నగ్గింతు నోట లేక. 35

గీ. అట్లుకొని యాడి నినుఁ గోరునట్లుగాఁ గఁ
గలికి సేకొన నొనరించి గడియలోన
నిన్నుఁ జెలిత్రోడఁ గూర్చెద నేనకడఁగి
యానతియొ యన్న నాఁగాక యని యతండు 36

క. తలయూఁచె నంత నంచయు
నలుఁ డుండినచోటు దాటి నడచి చదలునన్
నిలక యెగసి చని దిగ్గున
నలతోయ్యలి యారు నేరి యందొక చోటన్. 37

గీ. చెలులసందున దోఁటలోఁ జెలఁగి తిరుగు
నంచయానను గాంచి యాయంచ తటియు
నరిగి క్రాల్గంటి చేఁ జిక్కె నళుకు దక్క
రొడఁద నెంతయుఁ గోర్కులుగడలుకొనఁగ 38

గీ. అట్లుచేరియుంచ యూయెలనాగకై
యుంచుకంతఁజూచి యిట్టులనియె
నోనెలంతనలుని యొద్దనుండియరుగు
దెంచితినిటకేను దెలియనరయ. 39

క. రిక్కలరాయనిఁగందుని
జక్కులుదొరయనుఁగుఁగొడుకుఁ జక్కఁదనానం
జిక్కఁగఁజేసెడునేలిక
నొక్కింతయు నెన్నఁగలఁడె యొకఁడీనేలన్. 40

క. ఒడలెఱుఁగని సిరికొడుకుం
గడునడలుచు నుండునట్టి కడలియుసరియే
యొడయనికిన్ సొగసునన
మిక్కడులోఁతున నెంచి చూడఁగులుకులదొంతీ. 41

గీ. చందురనిసాటియగా రాచచందురోడ
నల్లరోహిణికిని నెనయైననీకుఁ
గోర్కులిగురొత్తఁగూడుటకూడదేని
నీమసొగసెల్ల రిత్తయగా నెంచి చూడ. 42

మ. అనుచుందొయ్యలి దానికై తిరిగి యోయంచాతలింజూచియా
యననాదగ్గర నెట్లుగాఁ దెలియనొయ్యంజాటి తాలాగునే
చని యాయేలికయొద్దనున్నదగం జాటించినీనేర్పున
ట్లననుంగోరఁగఁ జేసియిద్దఱను జుల్కంగూర్చియేలంగదే 43

క. నాచదురు సొగసునుంజని
చూచినదెలిఁగించినన్ను నూడిచయిడినఁ
నీచేసినలగ్గెన్నఁడు
నాచకయెదఁదలంచుకొందు నంచాయనుడున్. 44

ఉ. అంచయునచ్చటుంగదలి యంతయునొంటిగ జేనితోనెజిం
గించితనంతటంజనియె నిచ్చట నంతనలుండులోంగిరొ
క్కించుక చిల్కతేజదార హెచ్చువాళ్ళాహాళికిన్నిలంగ లే
కంచయెఱుంగఁజేసిన యొయారినిలోనఁదలంచి యిట్లనున్. 45

ఉ. ఎన్నఁడుచూడఁగల్గునొకొ యింతిని జెన్నసలారఁజూచినే
నెన్నఁడు సంపుకౌఁగిటను హెచ్చుగఁజేరుతునొక్కొ చేసియిం
కెన్నఁడుదాని సైజ్జనిడియించుక కూడుదు నొక్కొ కూడియా
కన్నియకోర్కితోనగుట కన్నులనెన్నఁడు చూడఁగందునో. 46

క. చెలినటుతలఁచుచునలరుం
జిలుకుల సెగలంగలంగుఁజిలుకలకులుకుం
జలిగాలికలయుఁగోయిల
కొలకొలరొదలకు నెదఁదలఁకును గడునళుకున్. 47

ఉ. నాయనుఁగున్నెలంత తగునాయను నన్నదనుంచి యేలు చా
నాయను నింకఁదాళఁగలనాయనుఁ జక్కని క్రొత్తహత్తిగు
న్నాయను జాలియేదనగునాయను రంగులుగుల్కు నంచయా
నాయను నగఁగలంచనదనాయను నేఁచఁగదాయ నాయనున్. 48

క. అచ్చటఁజందురునల్లుని
చిచ్చునఁగ్రాఁగుచునుదూలి చెలులుతలంకన్
నిచ్చలు నలుఁదలఁచుచుఁజెలి
హెచ్చుగనిద్దురయుఁగూడు నెఱుఁగకయుండెన్. 49

చ. చిలుకలఁగొట్టు నచ్చెలులఁజీటికిదిట్టుఁ గలంచుఁ దేఁటులం
దలఁకఁగఁ జేయుఁగోయిలలఁ దద్దయుఁ జందురునల్లుదూఱుఁ జా
క్కలదార కాయు నెండనగుకాఁకకుఁ దాళఁగలేక చొక్కునం
చలవలఁచుం దలంకునెదఁ జల్లనిగాలికిఁ జూచునల్ దెసల్. 50

చ. చిలుకలు దాయలయ్యె నగుచిన్నెలు చూడవహాళికేళియయ్యె నె
చ్చెలులసణుంగుటయ్యెఁ గడుఁజీఁదఱ కన్గొనసయ్యె నెల్లచో
నలజడిచూడనయ్యె నలయంచలఁ దిట్టఁగనయ్యెఁ గ్రొన్ననల్
తలనుగడంగి తాలుచుటలాయరుజయ్యె నెలంతకయ్యెడన్. 51

క. ఒడలెల్లఁ దెల్లనయ్యెను
సడలెనునిద్దురయుఁ దిండిచాయ యడంగెన్
దొడరెంగాలికినడలఁగఁ
గడురోఁతగఁదోచెనగలు కదలనికాఁకన్. 52

గీ. తల్లచునాటుచు దరిగట్టుదారికొడుకు
చెలియయిఱుకుజన్నులసందుచిరుగురుగోల
లొక్కటగురిచేసిచికాకునొందజేయఁ
దాళలేకసెజ్జనొఱగి సోలుటయును. 53

గీ. చెలులుచాలఁదలఁకి చిగురులుఁగోనుగాఁ
గలుగుకొన్ని తెచ్చికడఁగిసేద
తేర్చితండ్రికి నదితెలియఁజేయ దలంచి
యేగియతనిఁగాంచి యిట్టులనిరి. 54

క. ఎచ్చటినుండియొ యోగడ
నిచ్చటికొక యించసరగ నేతెంచినలుం
జెచ్చెరసగ్గించిచనియె
నిచ్చందనచోటుఁజేర నెంతయుఁగోర్కెన్. 55

గీ. నాఁటనుండియు నలుఁగోరినాతిసీరు
ద్రాగదునిదురయునుగూడు తలచదయ్యె
యెట్టులాతనిఁదోడ్కొని యేగుదేర
ననిచెనో తగుజాణల నతనికడకు. 56

గీ. అనుచు నచ్చెలు లెల్ల ననరుగు డెంచి
కలికి యునికిట్లు తద్దయు నఘకుత్తోడఁ
గని సదంత్రయుఁ దనత్తోడఁ గనులనీరు
గాఱ నెఱిఁగించి చనఁ గ్రథకైశికుండు. 57

శా. హాతల్లీ యని ఝోఁ గలంగి తుషశాయాయాళ్ళ యందెల్లరుం
జేతుల్ తోఁచుగఁ జేర్చి యెన్నఁగఁ గడుం జెన్నారు రాహాత్తులం
గూతుం గ్రొంగొను నట్టి యాస తెడలం గొంకంతగాఁ జేసి తా
నేత్రేరం గనొనర్చె జేనిఁ జెలితానే కోరుచన్ సాకునన్. 55

క. ఎచ్చటఁ జూచిన నేనుఁగు
లెచ్చటఁ గనుఁగొన్న దేరు లెచ్చటఁ గన్నం
జిచ్చునకోడని శాలరు
లెచ్చట కేగినను దేజు లెల్ల డనూరన్. 59

క. నేలయదరం గదిక్కులు
రాలఁగ నలుఁ జేగుదెంచె గ్రక్కున నటకున్
నాలుగు తెఱఁగుల దండులు
గ్రాలఁగ నెదలోన నాతిఁ గ్రైకొను నిచ్చన్. 60

క. ఆరయఁగ నేలయంతయుఁ
గోరికతోఁ దిరిగి తిరిగి గొనకొని యచ్చో
నారదుఁడును నింకొకజడ
దారియు జేజేలయూరు దతియఁగఁ జనుడున్. 61

క. కనుఁగొని యొంతయు నెదురుగ
జనికాళుల కెఱఁగి గద్దెఁ జయ్యన నిడి నే
లనుగల కత లెల్ల నడిగి
యని యొం జేజేల తేఁడు నాజోగులతోన్. 62

మ. అనిగోఁద్రెళ్ళిన రాచహొత్తులిట కయ్యా చాలనాళుల్ చనెం
జనుదేరంగన నాఁటనుండియునవిం జూకుండిరే తేండ్లు చ
య్యనవాకంతయు నానతిం డనుడు నోయ్యన్ గట్లదాయందగం
గనిరాకన్నియసుద్దియెల్ల నెఱుఁగంగాఁజేసియూయ్యలున్. 63

గీ. తిరిగియిట్టులనిరి తెఱగంటిదొరతోడఁ
దనదుకూఁతుఁ గొనఁగఁదగినతేడ్లఁ
గదలిరాగననిచెఁ బ్రగ్ధకై శికుఁడునిన్నఁ
గోరుకొను నెలఁతయొకొరుని నెల్లి. 64

క. అందున నేలంగలదొర
లందఱులోఁగలనుత్రాఱఁగి యాదటనటకున్
దండడి నేగిరిమొదలం
గ్రందుగనాయంచయానఁ గ్రైకొనునిచ్చన్. 65

క. చన్నులుకొండలసీయనుఁ
గన్నులు నెన్నంగ తేళ్ళఁగలకలనగునా
కన్నియకున్నరిజేజే
యన్నులయందైనఁగలరె యారసిచూడన్. 66

గీ. అనుచుజడదారు లెత్తిఁగించునంతనచటి
గట్లసూడును లోనుగాఁగలుగునట్టి
దెసలయేలికలొకకొందఱెసఁగుకోర్కి
తెదలనెంతయునిగురొత్తనింతిజూడ. 67

గీ. తేరులెక్కితరలి తిన్నగాఁనేలకు
నింగినుండిడిగ్గి నిక్కిచూచి
చుక్కతెగలలోన సొగసగు నెలలాగు
నలరుచున్నయట్టి వలునిఁగాంచి. 68

క. చదలునఁ దేఱలుఁ జిలిఁగఁ
గదలిరి ఱాలలోనఁ దేజకడుచలరంగాఁ
గుకురుఁగఁ గూర్చుండినచోఁ
దొడుటకుఁ జరుదెంచి యెల్లరిట్లనిరోకటా. 69

ఉ. ఓవారకల్లలన్నఁ గననొల్లరు విన్నదలందుగట్టిగా
గాదిలి చెయ్యిఁగాఁ దలఁచి కన్నొసఁగాఁ జనుదెంచిరిట్లు జే
జేవారలెల్లఁ గోరికలు చేకుఱఁ దీరిచెదంచుఁ దీర్చి దే
నాదటనీకతల్లులు సరానన నెన్నికగాంచు నెల్లెడన్. 70

సీ. అనినఁ గన్నుల నగుచు ననునియొకలుఁడు
నట్లచేసెద నీరుచన్నడుగుదాని
నీ తెఱంగద్ది యెతఁడెందు నిలుచు నతని
కద్దిచోటుతక్కిన యాతఁడేఁడు తెలియఁ
జేయఁదగునన్నఁ దెఱఁగంటిరాయఁడనియె. 71

క. నేజేజేవొడయంతను
దేజెసఁగునితఁడితఁడితఁడుదెసయేలికలే
రాజనుదీర్చెదొయందఱ
జేజేలకడిందికోర్కి చెదరనికడఁకన్. 72

సీ. అనుటకెదలోనఁగడువలుఁడలరియనియె
నింతకంటెనొండున్న దేయెందుఁజూడ
దెలియఁజేయుఁడుకోర్కులు తేటగాను
నున్న[illegible]లై నను నిచ్చెదనోడకింక. 73

క. అడిగెదునాతఁడు జేజే
యొడయుండఁట చేకుఱంగనొనరుచు నాతం
డడుగక యొయొసఁగునలుఁడఁట
తడయక కడతేర్చు నెంతదానినినైనన్. 74

క. నీయానతికలుగుటచేఁ
జేయుదునెట్టిదానినైనఁ జెప్పర జేజే
రాయఁడనే నింక సరకు
సేయుదునే నింగియొఱిగి సికఁగూలినయేన్. 75

గీ. అనినఁ దిట్టిట్టుచూచి తా నాడఁగియకాదె
యోరునినోకనినఁడుగ నొల్లకిటకు
నిట్లునిన్ను గోర నింపలు జేజేలు
నరుగుదెంచియుంట యరసిచూడ. 76

గీ. సరగనీయూరిరాకన్నె సరసకరిగి
యచటనీవలుగురఁ గొనియాడి నేర్చి
నట్లునోరోడకన్నయు ననఁగఁదగిన
యట్లయాడియొక్కనిఁ గోరునట్లు సేయు. 77

మ. అనిజేజేదొరయన్న నన్నలుఁడు నాహాయింతజేజేలకుం
జనునే కాదన కేనకోరికను చానంగూర్చియేత్తెరఁ జ
క్కననన్నేచన నానతిచ్చుట యెదంగ్రాల్గంటినేఁగోరియుం
టనునేనెట్లు చనంగనేర్తునిఁకఁ గట్టా కల్లకెట్లోర్చెదన్. 78

క. అనిజేజేరాయనిగనుఁ
గొనియెదయుఁరి యాడుచుండఁ గుందుచునయ్యా
ననుసేఁగోరిన చెలికడ
కనుచుటనీయట్టిదిట్ట కగునేయనినన్. 78

గీ. తొలుతఁ జేసెదననియాడి తుదకుఁ జేయ
నంచుఁగల్లలాడఁగ నానెయకటనీకు
లెస్సగాదెజేజేలకు లెస్సచేయు
టాడిప్రాఁటిన నేరికినానెలగ్గు. 80

గీ. కత్తులనుదూసి దండులుకలికినగరు
కాచికొనియుండఁ జొరనెట్లుకలుగునటు
కదియఁజనసాను నాయానకతననీకు
నడ్డుకొనలేరు నిన్నెరునచటఁజేఁడ. 81

గీ. అనినఁదోఁచినయుల్లల నతఁడుఁగడఁగి
యెన్నియడిగిన నన్నిటికన్నియాడి
తనదుచదురెల్లఁ గానరాదగినకరణిఁ
దిరిగజేజేలరాయండు తెలియఁజేసె. 82

గీ. అంతనెసరాడజాలక యతఁడుకదలి
యచ్చటచ్చటి సొగసులనిచ్చఁగనుచు
దండలనుదాఁటి నట్టిల్లుదఱియఁజొచ్చి
యింతియున్నట్టి నెలతాలయిల్లుచేరి. 83

సీ. అంచయొఱంగించి నంతటికన్నను
నెక్కుడుసొగసున నెసఁగుదానిఁ
చెఱగంటియన్నులఁ దెగడెడు చెలికత్తె
లొక్కటఁ జుట్టునునొరుదాని
నెడలోననిచ్చలు నెంతయుఁగోర్కితో
నలునింతయుడుగక తలంచుదాని
సిరిచెల్లకడఁజల్లు చిక్కనిచూడ్కుల
సొగసుగా నిటునటుఁజూచుదానిఁ
జెన్నుగులుకంగగద్దియనున్నదాని
హలయలుగాఁగుచ్చెలుల్కాళ్ళనొరయుదాని
నందియలుగజ్జెలును గ్రాలనలరుదాని
నచటఁగన్గొనెఁగనులార్చియంచరయాన 84

అట్లునాతిఁగన్న యంతటనాతండు
ఱిచ్చఁజెందికోర్కె హెచ్చఁజెంద
నొడలు తెలియలేక యొక్కింతతఱిసోలి
యలరుఁగోలలకును గలుగుచుండ. 85

ఉ. అద్దిర యీఁతఁడీడఁ దనయాఱనితేజున నెల్లచోటులం
దద్దయుఁగ్రాలఁజేసెను నితండలచందురుఁడో యాతనల్లుఁడో
సుద్దులికేల యెల్లరును జూడుఁడు కన్నులనంచునానతో
గద్దియలొక్కటండిగిరి గ్రక్కుననంప నెలంత నెచ్చెలుల్. 86

ఉ. కనియెనెలంతయు న్నలునిఁ గంతునిఁగేరఁగఁజాలునట్టి చ
క్కనినెఱనీటుగాని నటుకాంచి యెదంగల నానయంతయుం
జననొనరించి కోర్కులెదసందడిసేయఁగ నానహెచ్చఁగాఁ
దనదుచెఱంగుదిద్దుచును దద్దయుఁదేనియలొల్క నిట్లనున్. 87

ఉ. ఎచ్చటనుండిరాకయొకో యెట్టులుదండులఁ దాఁటఁగల్గెనో
యెచ్చటనున్కియో యిటకు నీకరణింజనుదేర నేలయో
హెచ్చినకోర్కినీదు తెఱఁగెల్లను దాఁచకయున్న యట్లుగా
నిచ్చట నానతీయఁదగు నించుకనాకయి సైఁచి క్రన్ననన్. 88

క. నిన్నుఁగనినంతనుండియు
నన్నెంతయు నేచఁనొడఁగె నలనెలయల్లుం
డెన్నఁడు నినుఁగనియెఱుఁగను
జెన్నగునీతెఱఁగెఱుంగఁజేయంగఁగదే. 89

చ. అనుటయు నీటిమేలికయు నగ్గియఁ జెల్లనిహాత్రి నెక్కుకా
తును నెఱదున్నయెక్కుడును దొయ్యలిరో యిటకేగుదెంచి యె
య్యన నినుఁగ్రై కొనందలఁచి యయ్యది నీకెఱుఁగంగఁజేయ న
న్ననిచిరికానఁ గోరుకొను నాతిరొ నల్గురిలోన నొక్కనిన్. 90

క. దంతులనెల్ల నగడచితి
నింతగు జేజేలయాన నేనిచ్చటికిన్
దండిగ నేతెంచుటలా
నొండొకఁడింతయు నెఱుంగకుండఁగఁగలికీ. 91

గీ. అనినఁ జాననీ తెఱఁగేది యనుచు నడుగ
నిచట నెద్దియొ యెఱిఁగించితింతదనుక
నింకనైన నను నీజాడ యింతె నాకుఁ
దెలియఁజేయంగఁదగునన్నఁ గలికితఁడు. 92

గీ. నెలఁత నేను నలుండను నేలఱేఁడ
నట్టులైనను జేజేల గట్టిగాను
నెడఁదఁగోరునట్లేను నిన్నడుగుకొనఁగ
నేగుదెంచినాఁడను నాతియట్లు చేయు. 93

క. నెనరున జేజేలఁగొనుట
నను నేలుటగానఁ గల్కి నాయెడలం గ
ల్గినగాదిలితో నొక్కనిఁ
గనుఁగొన్ననుజాలు గట్టిగా నలుగురిలోన్. 94

గీ. చేడె నాచేతలను రిత్త సేయనగునె
యనినసిగ్గునఁ దలకుంచి యంచచేత
నతని నెఱిఁగియున్నదికాన నలరియిచ్చె
నెట్టకేలకు నల్లననిట్టులనియె. 95

సీ. జేజేలతనుజాత నేయంగఁదగుఁగాక
కోరంగఁజనునయ్య కొంకలేక
కోర నేర్చునె లేడి కొండంత యేనుఁగుఁ
జెల్లునే నాకు జేజేలఁగోరఁ

వగునయ్యయి త్తిసి నగఁగోరదారలకు
జేజేలుననుఁగోరఁ జెల్లునయ్య
నీకై గదాయెల్ల నేలకేఁడ్లనిటకుఁ
జనుదేర నాతండ్రి చాటననిచె
నంచనీచేతఁ లెజీఁగించి నంతనుండి
చేరినాయెదనీయంద చిక్కుకొనియె
నిదిగొ చేతులుజోడింతు నెల్లినేఁట
నేలికొనునన్ను రాచ జేజేలఱేఁడ. 96

గీ. ఇందునాయానయొండాడ నింకఁదగదు
నీకునన్నుఁగైకొన నిచ్చలేకయున్న
నురినినీటఁజేఁదున నగ్నుఱికియైనఁ
దొడరియెట్లును నునురులుతొఱఁగుదాన.

క. అనినంజిలుకలకొలికిఁ
దనయెడలం గలిగినట్టి తగునెనరునకుం
దనలోనలరియుఁగలికిం
గనికోరిక లేని యట్టుగానిట్లనియెన్. 98

ఉ. అయ్యరొయిద్దల యుల్లెఱుక యంతయుఁ దూలి కలంకఁజెంద నా
యయ్యలకాలిగోరుఁ గయినంటను జాలనినన్నుఁ గోరఁగాఁ
దొయ్యలిచన్నెనీకు నెదఁదూలకయొక్కని నందుఁగోరు తే
నయ్యకు లచ్చికల్గినను నాతలకించుగ పొఁగనిచ్చునే. 99

గీ. చెలియజేజేలకునుగీడు సేయఁజనదు
చేసిననుగోర్కులెల్లను జెడునుగాన
నెనరుతోనందొకనిఁగోరుకొనుటలెస్స
సిరులనందెదు నానుడిచేసితేని. 100

సీ. అనిశనాతనిఁజూచి నెనరునఁగ్రాల్గంటి
కన్నుఁగొనలనీరు గడలుకొనఁగఁ
దద్దయునెదలోన నద్దియుఁదోఁచక
యొకకొంత తఱియచ్చె యూరకుండి
యోజేఁదకంటి నేనొక్కటిచేయంగఁ
దగినట్టి తెఱఁగది తలఁచిచూడ
జేజేలులోనుగాఁ జేరినన్నుఁగొనంగఁ
జనుదెంచినందఱుఁ గనుచునుండ
నిన్నెకోరుదునట్లయిన నీకులెస్స
యగునని నెలంతయాడిన నతఁడుకదలి
కనియెఱింగించెనంతయుఁగడలదొరల
కోరిఁజెలియంతదొరగోరనున్నవాఁడు 101

క. నలుగురుజేజేలునొగి
నలుని తెఱఁగె సరిగఁదాల్చినగుచచటచటం
గలయఁగఁగూర్చుండిరియా
కలికినలునినెఱుఁగకుండఁగాఁచేయుటకున్. 102

చ. అలరులదండ చేతఁగొని యాయెలనాగయు నేగుదేరఁగా
నలుని తెఱంగుదాల్చి యటనల్గురరక్కసిసూండ్లు నుండ లోఁ
దలఁకక కేలుదోయి నెఱితగ్గక జోడుగఁజేర్చిజాణయై
యలత్రాలితీరులందఁ గొనియాడిన నట్లొనరించిరందఱున్. 103

గీ. అంతనాయింతిగ్రక్కున నలరుబెత్తు
కాచుకొనియెల్లరునుదన్నె చూచుచుండ
నలునికుత్తుకఁ దగిలించెనలరియంత
నేలజేజేలవొదలును నిండెదెసల. 104

క. అలరులు జేజేల్ కురిసిరి
చెలఁగిరి మొదజన్నిగట్లు: చెచ్చెర నచ్చో
నొలసెను జల్లనిగాలియు
నలరారిరి తల్లిదండ్రులందలి చుట్టల్. 105

క. ఆరఁగ జేజేలందఱుఁ
గోరికలొకకొన్ని దొరకుఁ గూర్చి చదలునన్
దేరుల నెక్కి చనుచు నడు
దారిం గనుఁగొనిరి కలిని దద్దయుఁ గలఁకన్. 106

చ. కనుఁగొని గట్లనూడతని గ్రక్కున నెచ్చటికింతతొందరం
జనియెదు నేఁడనంగఁగలి చయ్యన నాతనిఁ జూచి యెందు నీ
డనఁ జనరాని చెన్నుగల యాక్రథకైశికు కన్నకూఁతుఁ గై
కొనఁ జనుచుంటి నిన్నుఁ గనుఁగొంటిని జేకుఱె నెల్లకోరికల్. 107

క. అనతియొనఁగం దగునీ
లోనన యానాతుక నొరులు గొనకయుండం
గానే గంజను ననుడున్
లోనగి జేజేలఱేఁడు లోఁగకయనియెన్. 108

క. నలుఁడనియెదు నొడయని నా
మెలనాగ మెకోరుకొనియె నెల్లరుఁ జూడం
దొలఁగి తిరిగి చనఁ దగునీ
యిలు సేరఁగ సరగ ననుఁడు నిట్లనెఁ గినుకన్. 109

ఉ. చేరి నలున్నలంత నెడచేసెదఁ గూల్చెద లచ్చి యంతయున్
గోరినకోర్కెలెల్లఁ జెడఁగొట్టెదఁ గానలఁ గుందఁ జేసెదన్
సారెకు నేను గోరికొనుచానను జేకొనఁ జెల్లునే యొకం
డారయనంచుఁ గట్టలుక నచ్చటికేగెఁ గడిందియానునన్. 110

గీ. అంతలోన నలుండునునింతఁగొనుచుఁ
దగినచుట్టలఁదోడ్కొని తనదునగరు
కొన్నినాళులకెల్లరఁగూడిచొచ్చి
యెన్నరానితేజున నేలయేలుచుండె. 111

సీ. కలియునుజనుదెంచి కడఁకతోనలునకుఁ
గీడుసేయనదను గూడుకొఱకు
దద్దయురోయుచు నద్దియుఁగానక
యెదలోనఁగుందుచు నెడరుసేయఁ
దఱిగాకనిచ్చలుఁ దఱిఁజేరియాతండు
చేసెడునీగిని జేరకుండి
యొకనాఁడెఱుంగక యొడయుండు నీరుతాఁ
కఁగఁగడకేగి తాఁగాళ్ళుకడుగ
నెఱుఁగకుండినతఱిఁజొచ్చి యుచ్చవలరి
యొక్కదాయుచక్కటికేగి యుక్కగలిగి
నలునిసిరియెల్లజూదాన నళుకుడక్కి
యొదుచుకొననీకుఁ దోడౌదుఁ దడయకనుచు. 112

ఉ. తానొకజన్నిగట్టగుచు దారినిదోడయి యేగుదెంచి న
న్నానినగోర్కి నేలుదొరయుక్కున నేఁడరుదెంచె నిన్నుఁజూ
దానఁగడంగిగెల్చి సిరిదద్దయుఁగైగొన నంచునాడినన్
లోనరుదందియంతట నలుండుకలింగని యల్లనిట్లనున్. 113

క. జూదఱికెగ్గగునైనం
గాదనఁదగునయ్యనాకుఁ గడుకొనియాడం
గాఁదలఁచినన్నుఁగన్గొన
నీదార యుటకేగుదెంచి నిన్ననిచినచోఁ. 114

చ. అనుచుఁ గడంగి పాడికొఱి యంతయు నొక్కచు నోడి పోడి యు
క్కునఁ దన నేలనుం బొరలఁ గొంకక మోదుచునుండె నంతయున్
జననిచుట్టలుం బొరలు సంగడికాండ్రను గుయ్యిడంగఁ గై
కొనక తెఁడక్కలిం జెనకఁ గూడక యూరక కిన్క హెచ్చఁగన్. 115

గీ. ఇట్లు కొన్ని నెలలు హెచ్చుగ నాడుచు
నున్న తజ్జని నేగి జన్నిగట్లు
చేరి యతని నుడుగఁ జేయలేక చసిరి
కలికడంగి రేచుఁ కతన నంత. 116

ఉ. ఇంతియు దీనఁ దద్దయును నెగ్గగునంచుఁ దలంచి తేవి నొ
క్కింతయు నాఁచు దారి గన కెంతయు లోనెగులొందుచుండి తా
నంతటఁ దొల్లి నేలదొరయానతిఁ గైకొనియున్కి నంచెలోఁ
గొంత చెలంగి కూఁతుఁ గొడుకుం దగు తేరునఁ దండ్రియూరికిన్. 117

గీ. ఇట్లు క్రాల్గొంటి తేరున నింద్రసేనుఁ
డను కొడుకు నింద్రసేన నాఁజ నెడు కూఁతు
నెయ్యురును జుట్టలును నానతియ్య సరగఁ
దండ్రికడకంచి లోలోనఁ దలఁకుచుండె. 118

క. పారెలు దోర్లఁగ నేయుచు
సారెకు నలుఁ డాడి నేలచౌకగ నోడెఁ
దీరు నగ్గైకొనకుండఁగ
నేరికి నిందాతగీత యిందు ననందున్. 119

గీ. అనిన నంతయు నాలించి యరుదుగాంచి
చెంతజడదారిఁ బిలకించి గొంతి కొడుకు
నతఁడు జూదాన నోడిన యంత నద్ది
జరగ నెఱిఁగించు మెనరుంచి సరగ ననుడు 120

క. కానుననల్లనితోలుం
జానగుజింకగలకేలుఁ జక్కనియాలుం
గానసితలజాలున్ జిగు
లీనెఱతలకాయచాలు నేసఁగెడుదంటా. 121

మాలిని. తిగకొటికలదాయా తెల్లయేఱున్నరాయా
సెగకనుగలడంటా చేదుఁగొన్నట్టిజంటా
సొగసులతలకట్టా సూడులంగొట్టుదిట్టా
జిగియరచెలికాఁడా చిల్కరాకాతు సూడా. 122

గద్య.

ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర కందుకూరివంశపయః
పారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్యపుత్ర
సుజనవిధేయ వీరేశలింగ నామధేయ ప్రణీతంబైన
శుద్ధాంధ్ర నిరోష్ఠ్యనిర్వచన నైషధంబు
నందుఁ బ్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము.

క. చుక్కలజేనిని దాలిచి
యెక్కుడుగన్నునను నగ్గియెగయఁగఁగోటికల్
చక్కడఁచి సిరులఁజెలఁగెడు
జక్కులరాయని యనుంగు సంగడికాఁడా. 1

గీ. అల్లజడదారి యాక్రీడియన్నతోడ
నిట్టులనెనట్టు దొరనేలయెల్లనోడి
కట్టుగుడ్డలతోలేచి కదలినంత
జరిగినదియెల్ల నెఱిఁగింతు జాలిగదుర. 2

ఉ. అంతనలుండునాగడియ నచ్చటనుండక యూరుదాఁటియే
క్కంతయునక్కలేక నగరెల్లఁగనందిగ నాళులుండి యా
చెంతకునేరునుండఱియఁ జేరకయుండుట చూచి కానకా
యింతిని దోడుకొంచుఁ జనియెంగల చుట్టలు గుంకుచుండఁగన్. 3

గీ. ఊరిదరికాననింతితో నుండియతఁడు
తాళఁగారాని యాకటఁ దలఁకుచుండి
కనుఁగొనెఁగడానిడాలు ఱెక్కలజెలంగు
ఱెక్కదారుల రెంటిని నొక్కచోట. 4

గీ. అట్లుగనియాతఁడెదలోన నాసఁజెంది
కలిక తననెలుకఁదొరంగికట్టుచీర
ఱెక్కదారులుతనచేతఁ జిక్కననుచు
నెగరవేసిన నదిగొంచునెగసెఁ జదల. 5

క. కోరిక నింగినిజనుచుం
దారేనేలయును సిరియుఁ దరలనఁడచి యా
తీరుననిటకేతెంచిన
సారెలగుట తెలియఁజేసి చయ్యనసరిగెన్. 6

చ. ఇటుతనచీరయెత్తుకొని యేగనలుండును లోఁదలంకియుం
తటనెదలోనఁ దేటి చెలిదాల్చినచీరచెఱంగుతానునుం
దటుకుననట్టి చుట్టుకొని తద్దయుఁగుందుచు నుండికొంతచెం
గట నలుతెన్నులున్నఁగని కల్కిరొ చూచితె యంచునిట్లనున్. 7

క. అరుగుగుదెదారిదెసకిది
యరుగున్నితండ్రి యూరికల్లదికలికీ
యరుగునదియునుజ్జయునికి
నరుగుంగోసలకు నద్దియన్నిటిలోనన్. 8

ఉ. ఎద్దియుతెన్నునాకుఁ జనసిత్తఱిఁ జానలుకారుకానలం
దద్దయునంగడల్ గుడిచితాళఁగఁ జాలరుకాననింటిలో
నొద్దికఁజుట్టలంగలసియుండుట లెస్సగఁదోఁచె నాకునేఁ
డెద్దియునడ్డుగానకయేఁగఁదగుం దలిదండ్రులొద్దకున్. 9

మ. అనినంగన్నుల నీరుగాఱఁజెలియొయ్యన్ తేనికై చూచియ
ల్లనఁదానిట్లనుఁ గానకీరణి నేలాకుందఁగాఁగోరికల్
దనరన్నాదగుతండ్రి సంతసిల నాతండేలు నన్నేలకుం
జనియుండుండఁగఁ జెల్లదేకలిసియిచ్చన్నీకునున్నాకునున్. 10

సీ. అనిననలుండును నాదలయొక్కింత
యొరగించియించుక యూరకుండి
నీయాడినట్టుల నీదినాదియుఁగాదె
నీతండ్రియేలెడు నేలయెల్ల
నేఁదొల్లిసిరులచే నెసఁగుచునటకేగి
యీలాగునేలాగు నేగనేర్తు
నేలయులచ్చియు నెఱిఁదూలియటఁజేర
నాతిరోనముఁజూచి నగరెయొర్గులు

ఉసురులైనను దొఱఁగంగనోర్తుఁగాని
యిట్టిపడినొండఁగలనైన నింతిచాలఁ
గాననిదితక్క నొక్కటికలిగెనేని
చేయఁదగునన్న సతనితోఁ జెడియనియె. 11

గీ. ఎన్నికడగండ్లు తొడరియు నెల్లకతను
నన్నుఁటినిదోలి కాచెడి దాలుగాదె
యాలుతోఁ గూడియుండెకు నాతఁడెన్ని
యిక్కటుల్ గుడిచియును దానెఱుఁగకుండు. 12

క. అలయునెడల దగయునునాఁ
కలియునునగుతతిని నాలుగాదేనేగుల్
తొలఁచునుదననెయ్యునికిం
గలఁగుచునిక్కరణి జాలిఁగై కొననేలా. 13

గీ. ఎట్టులైనను నన్నునునెచటికేగఁ
దలఁచితటకును నీతోడఁ దనరఁగొంచు
నేగఁదగుఁగాక నన్నొంటి నిచటడించి
యటుకఁదలఁచిన నుసులులు తొఱఁగుదాన. 14

చ. అనిననలుండు చానఁగనియల్లన నిట్లనునొంటినిన్నుఁగా
ననునెనరేదిడించి మెలనాగరొ యేగుదునేకడిందికిఁ
జెనయఁగనీడ నిన్ను నిచియేఁగఁ దలంచినఁ దొల్లి నిన్నుఁనేఁ
గొనిచనుదెంతునేయిటకుఁ గుందకు నీమెదనించుకేనియున్. 15

క. అనియూరార్చుచునొక్కటఁ
జనిఁయాతఁడుకానను నడుచక్కనినొకచోఁ
దనరెడిలోఁగిలి రొక్కటి
కనుఁగొనిచేరంగఁజనియెఁ గలికియుఁదానున్. 16

గీ. చేరఁజనియందు నిద్దురఁజెందఁదలఁచి
కటికి నేలను నొడలల్లఁగదియఁజేర్చి
కన్నుదోయికి నిద్దురసున్నయైన
లేచినలు కెలంకులు నట్టెచూచియంత. 17

క. కాలిదరినిదురఁ జెందిన
యాలింగని కన్నుఁగొనల నటసీరొలుకన్.
జాలఁ దలంకుచుఁ దనలో
జాలిగొని యతండు సారెసారెకు ననియెఁ. 18

ఉ. ఓడితి నేలయంతయును నోడితి లచ్చిని గీడులొందితిం
జేడెలు కాళులొత్తఁగను జెన్నగు జెందలి రాకు సెజ్జనీ
చేడియ యుండఁదొల్లి కని చిక్కని నల్లని జాలనుండఁగాఁ
జూడఁగఁ జాలనొండెడకు స్రుక్కక యేగెద నింకఁ జెచ్చెరన్. 19

గీ. నన్నుఁగైకొనికాదె యిన్నాతి యిట్టి
యెడరులకు నెల్లలోనయ్యె నింక నిచట
దీనిదిగ నాడి యెందేని నేనుఁజనినఁ
దనదుచుట్టాలకడఁజేరి తనరుచుండు. 20

గీ. అనుచుఁజెలి చీర నడుచక్కి కల్లజించి
కట్టుకొని లేచి చయ్యనఁ గదలి కొంత
దారినడయాడి చెలిడించి తరలలేక
తిరిగి యరుదెంచి యొద్దియుఁ దెలియలేక. 21

ఉ. అయ్యెలనాగ డించిచన నక్కలి రేచఁగ లేచు లేచి యా
త్రొయ్యలి నొంటిఁజేసి చనఁదోచక క్రన్ననఁ గూరుచుండుఁ దా
నుయ్యెలతీరుగా నెడఁదయూఁగఁగ నాఁగక యెట్టకేలకుం
జయ్యనఁగానడించి చనెఁ జావనులోనరేది యొక్కెతెన్. 22

గీ. ఇట్టులతఁడేగఁ గ్రాల్గంటి గట్టినిదుర
తెలిసి లేచి నలుఁగడలుకలయఁజూచి
తేనిఁగానంగ నేరక లోనఁగలఁగి
చించియుండిన తనచీర చెఱఁగుఁజూచి. 23

క. గుండెను బాయిడినట్లయి
దండనునున్నట్టి చెట్లతట్టున బాలం
గొండలనారసికనకా
యండను నెలుఁగెత్తి యిట్టులడలం దొడఁగెన్. 24

గీ. తేఁడతగునయ్యొత్తొల్లి నాతోడనోడ
కనుచునటులాడి నెనకేది యక్కటకట
కల్లలాడంగ నేనొంటిఁ గానలోన
నెట్లులుండును నిన్ను నే నెచటఁ గందు. 25

గీ. ఉసురులూడిన నిక్కటులొందుచున్నఁ
జుట్టలెల్లను నొక్కటగిట్టుచున్న
దోసఁగులడరిన నాఁకటఁదూఁగుచున్నఁ
గల్లలాడకయుండుటగాదె లెస్స. 26

క. అలయుచుఁ గాకులకూఁతల
కులుకుచుఁ గడునెండ సెగల సుడుకుచు బాలం
దలఁకుచుఁ జెట్లనీడల
నిలుచుచు నెలుఁగులకదరుచు నెలఁతుక యడలెన్. 27

క. ఇట్టులు తూలుచుఁ ద్రెళ్లుచు
నట్టనలేచుచునుగాన నెఱిఁదిరుగంగాఁ
గట్టలుకతోడఁ ద్రాఁచుల
దిట్టయొకఁడు నెలఁత కాలుదిగ్గనఁగఱచెన్. 28

క. కాలూఁదఁ దీసికొనఁగాఁ
జాలక యిఁక నైన నిచటఁ జయ్యన దీనిం
గూలిచి రోఁజెడయఁడ నను
నేలఁగదయ్యా యని కలికి చేష్టనుండెన్. 29

క. అక్కరణిఁ గుయ్యిడ నెఱు
కొక్కం డాలించి దానినక్కనరియుం
జక్కఁడఁచికాయలనాఁగి
యక్కలికిని సేదదేర్చి యంతట నరిగెన్. 30

క. ఏటికి నొంటిఁగ నేఁడీ
కాటికి నరుదెంచితిచటఁ గడునడలంగా
నేటికి నీ తెఱఁగెల్లను
జోటిరో యెఱుఁగంగఁ జేయు సూటిగ నాకున్. 31

గీ. అనిన నల్లత్తోడఁ గానల కరుగుదెంచి
నెడ తెఱఁగక నిదురించి యుండుటయును
నచట దనుడించి యేలిక యరుగుటయును
నిచట రోయుచుంటయు నింతి యెఱుఁగఁజేయ. 32

క. నెలయుల్లుఁడు కడుఁ గ్రొన్నన
చిలుకు లెదం గాఁడ నేసి చిక్కించిన లోఁ
గలఁగక తనకోరిక యా
కలికికి నెఱిఁగించె నెఱుకకట్టెఁడియగుచున్. 33

గీ. కనలయందుక కయ్యింతికన్నఁ గొనల
నగ్గియురులంగఁ జూచిన యంతలోనఁ
గూలె నాతండు నీఱయి నేలనార
తలఁచి చూడ నరిది యె క్రొత్తదుల తెఱఁగు. 34

చ. ఎలుఁగులు జేఁచుతేదుఁగులు సేకలుఁ గోఁతులుఁ గారుమన్నులున్
సలుగులు నక్కలుం గలిసి సారెకుఁ జాయఁగ దానికానలోఁ
గలయఁగ నెల్లెడం దిరిగి గాసిలి మాఱ్చుచు దప్పిగొంచు మం
దలఁ కనుచుం జెనిం జేరుచును దాళఁగలేక నెలంతయుట్టినన్. ౩౫

సీ. కానరేయీరలు జేసి నెచ్చటనైన
నంచలార కడింది క్రొంచలార
కనుఁగొనరేయీరు కానలో నోడయని
జింకలార యులరుఁ డొంకలార
చూడరేయీరలు సొగసుకానిని నెందుఁ
గోలఁకులార తుటారిచిలుకలార
తిలకించరేయీరు నలుని నెందును జెంచు
చేడెలార చిఱుతయాఁడెలార
తిన్నెలార యోగేదఁగిగున్నలార
తేఁటులార యోజపదారిజోటులార
మాత్తులార యోక్రొన్ననగుత్తులార
చెట్టులార యోచదలంటుగట్టులార. ౩౬

గీ. అనుచుఁ జెట్టుచెట్టు కరుగుచరిగియెండ
నడుగుదోయికాల నపలునపలి
నీడనీడనిలుచు నిలిచి నూతులుగాంచి
త్రొంగిత్రొంగిచూచుఁ దొడరినాతి. ౩౭

గీ. ఇట్టులెచ్చటనలుఁ గాన కింతియొంటిఁ
గాననరుగుచు నొకమేటి కడను గాంచె
గాలినీరునాకులుఁ దిండిగాఁ గొనుచు
నుండుకొండఱు జడదారులుండుచోటు. ౩౮

గీ. కాంచి సంతసించి గ్రక్కునఁ గదియంగ
నేగి జోతచేసి యిట్టులనియెఁ
గనులనిండఁజూ నిటుఁగంటినో జడదారు
లార నేను నలుని యాలి నతఁడు. 39

క. నన్నొడసి చనిన నాతనిఁ
గన్నారం గానలేక కలఁగుచు నిటకుఁ
గన్నారో యని యడుగఁగ
నెన్నుచు నేతెంచి తతని నిచ్చట నైనన్. 40

గీ. కనిన నెఱుఁగంగఁ జేయుఁడింక నునతండు
కానరాకున్నఁ గొన్నాళ్ళలోన నొడల
నుసురులెడలింతు ననియేడ్చుచున్నఁ గనిక
రించి దానికా జడదారు లిట్టులనిరి. 41

క. తలఁకకు నీయేలిక నలుఁ
గలసెదు కొన్నాళ్ళలోన గలికిరో మాతం
డలరుచుఁ దొల్లిఁటియట్టుల
కలనేలయు నేలు నిన్నుఁ గలసి నెలంతా. 42

చ. అనిజడదారులాడుచుచె యందఱుఁ గానఁగ రాక యేగఁగాఁ
గనుఁగొని కల్లయో కలయొ కాకని లోనఁ దలంచు చేగిచ
య్యనవము కానదారిఁ జనునట్టిరిఁ గొందఱఁ గాంచి నేను గ్ర
క్కున నగరంబు చేరెదను గోరిక నీజత తోడనొక్కటన్. 43

చ. అనుచుఁ దలంచుచున్న తటి నందలి యయ్యలు కాంచి రెంతయుం
దనరుచు తేని లోఁదలఁచు దానిని గూడును నీరులేక కా
ననుఁ దొరగా నకూరకయె నల్గడలారయుచున్న దానిఁ దాఁ
జినిఁగిన గుడ్డ కట్టుకొని చీటికి నేడ్చెడు దానిఁ జేడియన్. 44

క. కనుఁగొని కాఁపలఁ గొంకక
లెనయుటకుంగాయగసుఱు తేఱుఁగొనితగఁ
డనియెడి జడదారికలికి
యనుచుఁదలఁచి కొక్కు కొండఱుందఱిడిప్పల్. 45

ఉ. కొందఱుగాలిగాఁదలఁచి కుందిరి నక్కిరిచెట్టుచెట్టునం
గొందఱు తద్దయున్న గిరి కొందఱుకేకనగొట్టి కొక్కటం
గొందఱు రోసెదెద్దయని కొందఱుచేరిరి చెంతకొయ్యనం
గొందఱు కన్నతల్లియని కూడి జొహారులొనర్చిరింతికిన్. 46

గీ. అట్టియెడనాతికదియంగ నరుగుదెంచి
యన్నలార నన్నిటుచూచియళుకనేల
నిలిచిచూడుఁడు రాచకన్నియనుగాని
నేనుజడియంగ గాలినిగానుజుండు. 47

క. పనలునాలిని నతనిం
గానకనీతీరుగాఁగఁ గడు నలసటతో
నేనడయాడెద నిచ్చటఁ
గానరెయొండైన నలునిఁగానలలోనన్. 48

క. అనియడిగిననాసాతున
కునువొరయైనట్టి శుచియు గునగునఁదఱియుం
జనుదెంచి కాంచియిట్లని
యె నెలఁతతోఁ గన్నుఁగొనల నించుకనగుచున్. 49

క. నలుఁగననెచ్చటనిందుల
నెలుఁగులమన్నల నలుగులనేనుఁగులను ని
చ్చలుఁగనుఁగొందునుదూఱదు
చెలియరొయొండయునునిందుఁజెట్లతఱచునన్. 50

క. ఈసాతు నాకుఁదోఁచఁగ
నేసేగియు లేకయుందు నెలనాగరో నే
గాసిలకరిక్కఁ ద్రాచుల
కోసరిలుచు నేఁడు చైద్యునారికిసరగన్. 51

సీ. నాకోఁడనచ్చుటకేతెంచెదేనియు
నేనిన్నుఁదోడ్కొని యేఁగుదు నన
నింతియూఁకొనెనంత నెంతయు నెనరునఁ
దోడిసెట్టులతోడ జేడెఁగొనుచు
నేగుచు నాయయ్యలెండనుగడుడస్సి
యొకచోటఁగూర్చుండి యున్నతఱిని
జీఁకటికదిసినఁ జెంగటికొల నల్లఁ
జేరి యోర నిసురఁ గూరియుండ
నచటికొక్కటనడఁగొండలట్లతనరు
కొన్ని యేనుఁగుల్ దగఁదీర్చుకొనఁదలంచి
యరుగుదెంచెనునడిరేయియళుకులేక
సాతు నిదురించుకడఁజెట్లు చదిసిసూల. 52

గీ. కటికిచీఁకటిలోఁ జెన్నుగానలేక
చచ్చిరరుగంగ నేరక చదిసికొంద
ఱొడలెఱుంగక నిదురించుచున్న కతన
గొందఱడఁగిరెఱుంగక కొలనుదరని. 53

ఉ. కొందఱు కాలిత్రొక్కుడులఁ గొందఱు కోఱలొడళ్ళుగాఁడుటన్
గొందఱుచేతియేటులను గూలినఁదొయ్యలి చూచియక్కటా
యిందఱు కాన నేఁడుసుఱులిట్లు తొలంగిరి కీడులంగడుం
గుందుచునుండు నేఁజదిసికూలక యుండితి నెద్దిసేయుదున్. 54

క. ఈపాతుపై వ్యామాదిక౯
దీసుక పోవను నన్ను దిన్నఁగ ననుచో
నీసునవందఱఁ గూలిచి
గాసిలఁగాఁజేసెఁదాత కడుకట్టిఁడియై. 55

క. లోఁగడజేజేలను నే
ఱాఁగనగుచు నొల్లకనికి ఋట్టిసినేయ౯
సేగులొనర్చికినుక నీ
లాగున నన్నింటి నిటఁ గలంచెనొజేజేల్. 56

క. అనిపాతొక్కటఁ గెడయుట
కునుగన్నులనీరునించుఁ గోరికఁ గ్రెంచున్
దనయెదలో నలునుంచు౯
గనలునఁదిలకించు నాల్గుకడలనుగాంచు౯. 57

క. అడలుచుఁదక్కినరాతిరి
కడచి తొగలదాయ కానఁగా నైనయెడ౯
దడయకచని త్రొయ్యలి య
య్యెడఁజై ద్యునియూరుసొచ్చి నల్లరుఁజూడ౯ 58

శా. ఆయూరేలెడు తేనితల్లి నలునొయ్యారిందగంగాంచినే
నీయింతిం గనుఁగొన్ననుండియెదలో హెచ్చెంగడు౯ వాళి దా
దీ యంచొక్కతెఁ జేరఁజీరి యదిగో నీదారిసింగారి యో
ర్తాయోరం జనుదెంచుచున్నయది యొయ్యంజేరి యక్క న్నియ౯.

క. కొనినాకడ కొకయించుక
యునునెడసేయక యిచటనె యున్నట్లేతెం
చునదియని యానతిచ్చినఁ
జనిదాదియు నట్లచేసెఁ జయ్యనవా కె౯. 60

గీ. ఇట్లుత్రోచ్చి చెలినాకెయెదురనడిన
దానిసొగసున కొక్కింత తల గదల్చి
యల్లనల్లన నిట్లనియానతిచ్చె
దనరియెదలోనఁ గోర్కులు కొనలుసాగ. 61

చ. చిఱిఁగినచీరఁగట్టుకొని చెక్కులుకన్నుల కాటుకంటెడాల్
తఱిగిచెడంగ నెండ కడుఁదాఁకి యొడల్ కసుగంద నొంటిఁ జి
న్నఱిచెరలాడనేల నినునాదట నేలెడునాతఁడేఁడు నీ
తెఱఁగుఁగొఱంత యుంచకిఁకఁ దేటగనంతయు నానతీఁదగున్. 62

క. అని కడునెనరొలయంగా
ననిననెలంతంగని నలునాలునుజాలిం
గొననికఱకుగుండెయతఁడుఁ
గనినఁ గనికరించునట్లుగా నిట్లనియెన్. 63

క. నేనొకరియొడయునియాలను
దానొకఁడొకఁడేగుదెంచి తక్కినఱేఁడుల్
కానుకలిచ్చినఁ గైకొను
చేనునునాతండు నేలయేలుచునుండన్. 64

క. కల్లరిదాయయొకఁడతనిఁ
దల్లిరోజూదాన నోడిచి తగుసిరియెల్లన్
గొల్లఁగొననతఁడు నేనును
నిల్లునుగొడుకులనుడించి యెల్లరుఁజూడన్. 65

ఉ. కానలకేగి యాకులును గాయలుగడ్డలు నారగించి క్రొం
దేనెలె కొన్నినాళ్ళుచటఁ దిండిగనుండఁగ నంతనంచ త్రే
జీనెఱిరొతు కిన్కనెడచేసెను తేనిని నన్నుఁగూళ్ళయై
యేనిటకేగుదెంచి తెటకేగనొ తేఁడెఱుఁగన్నులంతుకా. 66

గీ. కానననుడించి యతఁడొండుకడకు నేగ
నతనిఁగానక యడలుచు నరసికొనుచు
గడ్డలాకులుఁ గుడుచుచుఁ గానలోనఁ
జీఁకటిగదుర నిదురింతుఁ జెట్లక్రింద. 67

గీ. ఇట్టులాతనిఁగానలో నెల్లయెడల
నరసికానక కట్టెఁడినగుచుఁదల్లి
యిచటికే తెంచితి నటంచు నెఱుఁగనాడి
యేడ్చె నెలుఁగెత్తి కోయిల లేగుదేర. 68

క. అనికన్నీరొలుకఁగఁ నే
డ్చినఁగని యాజేనితల్లి చెలిజేరంగాఁ
జనియోదార్చుచుఁ దాని
ట్లనియె నెదందిగులు కొంతయడఁగఁగ నొయ్యన్ 69

క. నాకడనిటనుండం దగు
నీ శోకకాంతయును లేదు నీకే కీడున్
లేకుండఁగఁ దగఁగాచెద
నాకాంతులతో డసరిగ నరసెద నిన్నున్ 70

క. నీయేలిక నెల్లెడలను
రోయననుతుజన్నిగట్ల స్రుక్కులలోనన్
నీయిచ్ఛయయినతీరున
నాయొద్దనె నిలిచియుండు నాతుకయనినన్. 71

గీ. త్రొంటికంటె నెనరు తోఁచునట్లుగఁ జూడ్కి
జేనితల్లియుండె యానఁ జేసి
హాళియళుకుఁగదుర నన్నెలంతుకయట్టె
మొలుఁగుసన్నగించి యిట్టులనియె. 72

గీ. తల్లినీయొద్ద నన్నుంచఁ దలఁచితేని
కడఁగినా సేర్చునట్లు రాకన్నెయలకు
ననలుగై సేయు నింతినై నగళులందు
నుండుదాననొండైన సేయుండనిచట. 73

క. ఒడయనికోయంగాఁ జనఁ
దొడఁగిన యాజన్నిగల్లతోఁ దక్కఁగనీ
యడుగాన లాఁతులంగని
నుడియొక్కటియైన నాడనొల్లనుదల్లీ. 74

గీ. కాళ్ళుగడుగ నెంగిలియంటఁగాదు నాకు
నట్టులైనను నీయొద్ద గుట్టుచెడక
యుందుననిననీకొని తనయొద్దికూఁతు
రగుసునందచెంగట నుండనానతిచ్చె. 75

క. నిచ్చలునలు నెదఁ దలఁచుచు
నిచ్చటనెలనాఁగయుండ నెడసిచని నలుఁ
డచ్చటఁగానలఁ దిరుగుచుఁ
జెచ్చెరఁదిలకించె నొక్కచెంతనుగానన్. 76

మత్తకోకిల. కొండదాఁకుచుఁ జెట్లఁగాల్చుచుఁ గూడిత్రద్దయుఁగారుచి
చ్చొండగాయుచు నుండఁగాఁగను హెచ్చిచుట్టుకొనంగలో
నుండునాగుల జేఁడొకండిదె యోనలుండ యొకింతనే
గండడంగకయుండ గ్రక్కునఁ గాచితేలఁగదేయనన్. 77

చ. ఒనరఁగనాలకించి యతఁడొయ్యన డాయఁగ నేగి యందులోఁ
గనుఁగొనెఁజుట్టుచుట్టుకొని కన్నులనీ రొలుకంగ నేడ్చుచున్
నెనరుసఁజిచ్చులోనడఁగి నీల్గకయుండఁగ నన్నుఁదీయ గ్ర
క్కననిటురాఁగదయ్య యనిశుయ్యడుత్రాఁచులతేని నొక్కనిన్. 78

గీ. అతఁడును నలునకు శ్రోహరోనర్చ్రియనియె
నేనొక జడదారికెగ్గుచేసి
కదలనేరకుంటిఁ గర్కోటకుండఁ బ్రాము
నన్ను నగ్గిగదిసె నాల్గుదెసల. 79

క. ఇంపుమీఱి కెడయజాలను
సందిట నన్నెత్తికొనుచు సాఁగిచసికోలం
కెందున్నచటనూఱట
చెందఁగ నన్నుంచ లగ్గు సేయుదునీకున్. 80

గీ. అనిననింతంతయనరాని నెనరుత్రోఁడఁ
దన్నుఁగొనియేఁగఁగనొసలతండుకంచి
చులకనై యుండఁ దఱిఁజేరి యళుకులేక
యెత్తుకొనికారుకానలోఁ జేగి వేఁగి. 81

సీ. కొంతకుఱంగటఁ గోలఁ గొండుగనిదాని
గట్టునడించంగఁ గడఁగఁ జూచి
యింతలోందర యేల యింకనన్నో జేఁడ
యీరై దడుగులు గొంచేగియచట
డిం బినసీకుఁగడిందిలగ్గొనరింతు
ననుచునడుగులెన్ని కొనుచునరుగఁ
గర్కోటకుఁడు జేనిఁ గఱచియిట్లనెనన్ను
నిన్నెనుగఱచుట యెన్నరాని
కీడుగఁదలంచి యొదలోననొడకింకఁ
దొంటిసిరిచెడికొన నిట్లుంటనిన్ను
నొరులెఱింగిన నగ్గునోయటంచు
నీసొగసుదూలఁగఱచితి నీసులేక. 82

క. నాకోఱలచేఁ దెన్నా
ళ్ళకానిసీరెయిఁడలనుండు నిఁకనన్నాళ్ళన్
నీకేకడ సేచేఁదును
దాఁకదనినుఁ జెనక లేరు దాయలునింకన్ 83

గీ. కొన్నినాళ్ళకుఁ దొల్లింటిచెన్ను గలిగి
యాలుతోఁగూడుకొనిసిరుల్ చాలఁగుడుతు
తొంటిసొగసూని తిరుగనీకుంటయిచ్చ
యైననన్నుఁ దలఁచునదియంతలోన. 84

గీ. చీరయొకటినిన్నుఁ జెచ్చెరఁ జేరును
దానిఁగట్టఁ జక్కనౌనునోడలు
తగునయోధ్య యనఁగఁ దనరునూరొక్కటి
యెంచిచూడ నెందు నీడు లేక. 85

*క. తగునైదైదులరెండయి
సొగసగుతెనుఁగచ్చరాన నూటియొసంగక
దగియెడుతుర్ణలసందు గ
లిగిన ఋతుర్ణుఁడను ఱేఁడు లెస్సగనచటన్. 86

గీ. అతనిఁగొలిచియుండి యతనికిగుఱ్ఱాల
దోలుజాడయెల్లఁ దొలుతనొసఁగఁ
జెట్లయాకులలరుఁ జేరక లెక్కించు
తెఱఁగునీకతండు తెలియఁజేయు. 87

---

*క. ఓయవనౌదయండొక్కఁడు । నేయెడలమదనకులాఁతియేలికలేరున్
రోయఁగవరిదాతుండఁగ । వాయూరేలు ఋతుపర్ణుఁడనఁగమనచటన్.

♦గీ. నాఁగుగాజులవాలుగైఁ గ్రాలిఁదుద
యానుగలయచ్చతెలుఁగచ్చరానఁబోలుత
నలరియుండినబాహుకుఁడనఁదనియొద్ద
నుండునదియనియానతియొసఁగిచనిన. 88

చ. నలుఁడునయోధ్యకేగియట నల్గడలుం దిలకించియొక్కచోఁ
దళతళలాడురాచయిలు దగ్గఱఁగన్గొని చొచ్చి జేనితోఁ
గలయది యంతయుం దెలియఁగాఁ బరికించి కలంకఁదేఱి జ
క్కులనఁ బోలిఁదిద్దఁగను గూరలుఁగూడును జక్కఁజేయఁగాన్. 89

క. తానేర్చు పెల్లనెఱుఁగం
గావాడి నిదఁగడునచ్చెరం గొలుచుటకై
నేనరుదెంచితి ననుడున్
లోనంగడుసంతసిల్లి లోఁగకదారయున్. 90

క. నాయొద్దనుండఁగాఁదను । నీయిచ్చకుఁదగినయట్లు నెఱిగుత్రాలం
జేయిడి వెనరునఁజక్కం । జేయుచు నీకోర్కులెల్లఁ జేకుఱునిచ్చల్. 91

మ. అనినం గూరలుఁగాయలెల్లరుచులౌనౌనననంజేయుచా
తనిచెంతంగలయట్టి త్రుళ్ళుగల యందారైన తేజీలఁ జ
క్కనఁగా దిద్దుచు దానియొద్దఁ దనరంగానుండి లోనొక్కనాఁ
డనుఁగుందొయ్యలిఁగాంచెడింది యిటుతానంబుండియే తెంచుటల్. 92

క. తలఁచుకొనిచాలఁ దలఁకుచుఁ
గలఁగుండై గుండెలదరఁ గనుదోయి న్నీ
రొలుకఁగఁ దుడిచికొనుచున
య్యెలనాఁగంగూర్చియిట్టు లెలుఁగెత్తియనెన్. 93

♦గీ. తెరిగుజ్జాల వడకలఁదిద్దుచందఁ । జక్కఁగాఁగూడొనర్చుచు సాటిలేక
యలరుచునుబాహుకుండనఁదనియొద్ద । నుండునదియనియానతియొసఁగిచనిన.

శా. ఎచ్చోట న్ననుఁగాన కారయుచు నేనేతేరఁగాఁ గానలో
నచ్చోనొంటిఁగనుండి యెంతలుకుత్తో నానాఁడెదంగుందితో
నిచ్చ ల్నన్నుఁదలంచి కానలఁగడుంజ్జీకాకుతోనుండితో
హెచ్చౌరాయిడి నొందఁజాల కకటా యెండైననందీల్గితో. 94

క. తలిదండ్రులఁజేరితో లే
కెలనాగరో కానలేక యెండైనం జి
క్కులుగుడుచుచుంటొ యెట్లో
యలజడినేనిఁగగందు నక్కట నెలఁతా. 95

గీ. ఇరులఁగనుఁగొన్న నీసోగకురులతీరుఁ
దొగలఁజూచిన నీకనుదోయిడాలు
నింగిఁగాంచిన నీకౌనునిండుహొయలు
నదకుఁదోఁచెడు నింకనేనెట్టులోర్తు. 96

చ. అనుచుఁ దలంచు చున్నతఱి నందలి లెంకయొకండు కొంత చెం
తనిలిచియాలకించి నలుఁదారసిలం జనుదెంచి చూచి యీ
చినిఁగినగుడ్డలుం గుఱుచచేతులు గూనును పొట్ట కాళ్లుఁ గ
ల్గినయితనాలు నీతనిని గెల్చినచక్కన దంచుఁ దద్దయున్. 97

గీ. గేలిసేయుచు నగుచుఁ జాల్చాలునితనిఁ
గనులనేరైన నొకసారి కనిరయేని
రేయికలలోననే తెంచు నీయనసాగ
సట్టులయ్యెనునింతికై యడలఁదోడఁగె. 98

సీ. అనియెదననుకొని యరుదెంచియాతనిఁ
గనుఁగొనియిట్లనె నెనరుతోడ
నీతలంచినయట్టి నెలతకునీకును
నెడయాట కటకటా యేలకలిగె.

నన సిగ్గుపోలఁగాక నాలోనఁ గొండొక
క్రొత్తయాకత యల్లుకొనికడంగి
నాతుక నాకేల నాతుక కేసల
నన్నుఁ గన్గొనినేని నగరె చెలులు
తొల్లి యొకతెక తనయింతిఁ బోలఁగియుండి
తల్లడిల్లిన తెఱఁగేనుదలఁచుకొంటి
నంతనేకాక చేసేడయింతియొక
యనుచుఁ దనగుట్టు లోలోన నడఁచెనతఁడు. 99

క. అక్కరణి న్నలుఁడుండఁగ
నిక్కడ నల్లుఁడునుగూఁతు రెందులఁ జనిరో
యక్కటయనియెదఁ దలకుఁచు
గ్రక్కునఁ గ్రథకైశికుండు కసునెనవసన్. 100

సీ. సరగనిద్దఱరోయంగ జన్నిగట్ల
నద్రైళలకంచెఁ దెచ్చిన నగలునూర్ఫ్ళ;
గొల్లగానొసంగుడు నంచు నెల్లరకును
దెలియఁగాఁ జేసి యాసలు చెలఁగఁ జేసి. 101

క. నేలంగల యూళ్ళన్నియుఁ
జాలంగాఁ రోసియొందుఁ జానసపలునిం
గాలించికొందఱు కనం
జాలక యరుదెంచి రిండ్లఁ జక్కికిఁ దిరుగన్. 102

క. తక్కటికొందఱు నలుఁజెలి
నెక్కడనుంగానకూర కిండ్లకురా లో
నొక్కింతయునొల్లక కడు
నక్కఱతోఁ దిరుగుచుండి రందందుఁ దగన్. 103

ఉ. అంచొక జక్కిగట్టరిగి యల్లననాతుక యున్నయూరికిం
గొందఱుతోడఁగూడిచని కొల్లగ నీగియొసంగురాచయిల్
సందడిఁగోనఁ జొచ్చి యొకచక్కనిగాంచె సునందలోనుగా
నందులనున్న రాచయెలనాగలలోన నొయారి నచ్చటన్. 104

గీ. నీటుగదిసియున్న నెఱచిచ్చునచ్చున
గూటనున్న చిలుక జోటిసాటిఁ
జెన్నుదజిగియున్న యన్నుఁగనుంగొని
తొలుతఁగల తెఱంగు తెలియలేక. 105

చ. నుదటనుగానవయ్యెను గనుంగొనఁగూడని నల్లచుక్క యొం
డెదుటను జూచిసంతసిలి యింతిని నన్నలు క్రాలుగంటిఁగా
నెదను నెఱింగి యాకరణి నింకినయేటితెఱంగునం గడుం
జెదరినచెన్ను నందనరెఁ జేడె నలుండెడయైననంచులోన్. 106

క. కడునసలుచుఁ జేరంజని
జడిగొని కన్గొనలనీరు జాఱఁగఁదల్లీ
కడఁకన్నిన్నరయఁగ ని
య్యెడనేసరుదెంచినాఁడ నెక్కటినిటకున్. 107

క. నీతల్లియునైదోడులు
నీతండ్రియుఁ గుఱ్ఱలచట నెఱితోనున్నా
రోఱొయ్యలి సన్నును తేఁ
డై తగునలు నరసికాంచి యరుదేరంగన్. 108

గీ. నన్నునీతండ్రియనిచిన నిన్నునిటకు
నరుగుదెంచి యీయూరెల్ల నరసియరసి
నిన్నుఁగనఁగంటినిచ్చట నేఁడునాదు
గోర్కెలెల్లఁగొనసాగెఁగొదలుడాఁగె. 109

క. ఎన్నఁడు చెలులం గలసెదొ
యెన్నఁడు త్రొల్లింటియట్టు లెనలేనిసిరుల్
చెన్నుగ నందెదొ యెన్నం
డన్నలుత్రోఁగూడఁదండ్రియలరుచుఁగనునో 110

క. నీయెదలో నించుకయును
నాయానకలకయుఁడుఁగ నన్నెఱుఁగుదె త
ల్లీ యేనుజన్నిగట్టను
జేయెడయని నీకుతండ్రి చెలికాఁడనఁగన్. 111

క. తనకొడుకుఁగూతుఁదలఁచుక
కనుదోయిన్నీరునించి కలచుట్టల నె
ల్లనడిగిమెచ్చుచునున్నం
గనుంగొనిసునందలోనుగాఁగలకలుకల్. 112

ఉ. ఏలొకొ యింతియిక్కరణి నేడ్చుచునున్నది చూచిరాఁదగున్
జేడియలార రండనుచుఁ జెచ్చెర డగ్గఱఁజేరి రంపులో
జాలిని దల్లిచెంగటికిఁ జయ్యననేగి సునందచక్కఁగాఁ
జేలనుజేర్చుచుం దెలియఁజేసిన నాయెలనాగక్రచ్చఱన్. 113

క. చనుదెంచి తద్దయును నెన
రెనయంగాఁ గూరుచుండి యొద్దియె చెలితో
ననుచుండు నేలజేజేఁ
గనియరుదంది కడుతియ్యఁగా నిట్లనియెన్. 114

ఉ. తొంటితెఱంగ దెట్టియది త్రొయ్యలితండ్రియు నెందునుండు నే
యింటనుజొచ్చె నిక్కరణి నిచ్చటకుంజనుదెంచి యొంటిఁగా
నుంటకునెద్దికీలెచటనుందురు చుట్టలు తల్లిదండ్రులు ల
న్నింటను జాలియుండుదురె నెట్టనదాఁచక యానతీయరే. 115

క. అనియంతయుఁ దెలిసికొనం
దనయెడఁ గోరికలు క్రేస్సు దాఁటంగా నా
తనినన్నెలంతయడిగిన
నొనరఁగ నెఱిఁగించె నిట్టులున్న తెఱంగున్. 116

క. ఇది క్రథకైశికసుతురు
చదురుండగు నలుని రాణి సరిజాదానన్
జదురడఁగి నేలయెల్లను
దుదకాయన యోడియాలుతోఁ గానలకున్. 117

చ. చని నను టాలకించి యెదజల్లని యా క్రథకైశికుండు న
ల్లునిఁ దనకూఁతుఁ జయ్యన నలుంగడ లారసి యెందునున్నఁ గై
కొని చనుదేరఁగా ననిచెఁ గొండఱ సాదుల జన్నిగట్ల నే
నును నరుదెంచి చేడియఁ గనుంగొనియుం దొలుతం దటాలునన్. 118

గీ. గుఱుతిడంగలేక కొంతనిలిచి తాత
సిరులుదొరకుకొఱకు చేసినట్టి
చిన్ననుదుటఁ గాంచి చెలరేఁగి తుద కేను
నిన్నెలంతయౌటయెఱిఁగికొంటి. 119

మ. అనినన్నీళ్లులు తేరఁగా ననిచి యొయ్యన్నెన్నొసల్ తానిలో
నెనరారం దనచేతులం గడిగి చిన్నింగాంచి రాకన్నియల్
కని యెంతో యరుదందఁ గౌఁగిటను జక్కంజేర్చి యాత్రొయ్యలిం
దనయోరం జెయిసాఁచి రాఁదిగిచి కన్నీరొల్కఁగా నిట్లనున్ 120

సీ. ననుగన్నతల్లి నేనునునీకుతల్లియుఁ
జేదిదశార్ణుని చెలికిఁ గలిగి
నేనెతానుగనుండ నానెలంతయుఁ దొల్లి
యలక్రథకైశికు నాలియయ్యె

చేసునీచినతండ్రి కిక్కడనాలనై
యెన్నండు నినుఁజూడకున్న దాన
నాకుఁగూఁతురుగుదు నాకడనింకనుఁ
గొన్నినాళ్ళుండఁటఁగూడియుండి
తల్లిదండ్రులఁజూడంగఁ దల్లి నీకుఁ
గోర్కెయటాతటి నేగెదుకూడియంత
దనుకనిచ్చటనే యుండఁదగునునీకు
నడ్డులాడిననింక నాయడుగులాన. 121

సీ. అనినఁదల్లి కిజోహారులొనరఁజేసి
దరిసువందనెత్తుకొని యాతల్లి యనిన
దాని కీకొనికొన్నాళ్ళు దండనుండి
యింతియల్లనవొక్కనాఁ డిట్టులనియె. 122

క. ఈయిల్లునునారయఁగా
నాయిలునాకొక్క సరియె యైననుదల్లీ
నాయనుఁగుఁగుట్టలంగన
నీయెడనెంతయునుగోర్కె యొసఁగెడు నాకున్. 123

శా. కానన్నెనటకేగనానతియొసంగం జెల్లునా నాకియున్
లోనింతంతనరాని జాలిగదురన్ దొత్తుల్ తగందోడరా
పానందీర్చినయీాడు లేనిరతనాల్ చాలంగఁజెక్కంగఁ జె
న్నై నీటొందుసరుల్ కడానినగలొయ్యన్నొక్కగానింతికిన్. 124

గీ. ఒసఁగియద్దలయందలొనసకినుంచి
తల్లిదండ్రులయొద్దకుఁ దగినయట్లు
త్రోలఁజెలిరాక యూరనందొఱునెఱింగి
చూడనేత్తెరఁ దనయిల్లు చొచ్చెఁగలికి. 125

తే. అనినసంతయు నాలించియరుదుగాంచి
చెంతజడదారిఁదిలకించి గొంతికొడుకు
నింతితనయిల్లుచేరినయంతనద్ది
జరగినానతిఁ జనునీక సరగవనుడు. 126

క. రక్కసులును జేజేలును
జక్కఁగఁగడలితరచు తతిజాలయిరయొడళుల్
చెక్కలుచేసినచేఁదును
గ్రుక్కంగొన్నట్టిఱేఁడకొట్టికసూడా. 127

పంచచామరము. కలంగితోఁ డిరక్కసీంద్రుకాలికొల్దిదాటఁగాఁ
జెలంగుచుం దిగంచుకత్తిచేతఁ దళ్కులీనఁగాఁ
గొలందిలేనికిన్కతోఁ దగ్రుడ్డులెఱ్ఱఁజేసియా
తొలంగుహత్తిసోఁకుఁజేనిఁగ్రుంచినట్టిరాయఁడా. 128

గద్య.

ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర కందుకూరివంశపయః పారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్యపుత్ర సుజనవిధేయ వీరేశలింగనామధేయ ప్రణీతంబైన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధంబునందు ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము.

క. నేలయొ తేరుగఁ జాతమె
తోలునతఁడుగాఁగ నెలయుఁ బోగడాయుయుఁగం
జ్ఞాలలిసిరిబారచిలుకుగఁ
గ్రాలుచుఁదిగకొట్టికలను గాల్చినదిట్టా. 1

గీ. అల్లజపదారి యాక్రీడియన్నతోడ
నిట్టులనె నట్టు తెలనాగయిల్లుచేరి
తల్లిదండ్రులయొద్దను దనరినంత
జరిగినదియెల్ల నెఱిఁగింతుజాలిగదుర. 2

చ. చిలుకలకొల్కి యక్కరణిఁజెన్నుగఁ జుట్టలయొద్దనుండియుఁ
నలు నెదలోఁదలంచుచు నసల్ దలఁదాల్చక నేలసెజ్జగా
నలయురచీరతోనొడల నంటికొఱంగని దూళిత్రోఁ గనుం
గొలుకులనీటితో నెసఁగెఁ గూరుకు చెందనికన్నదోయితోన్. 3

క. అటులుండినాతియొక నాఁ
డటునిటుఁ గలయంగఁజూచి యంతటఁదల్లిం
దటుకునఁగనుఁగొని యిట్లనెఁ
జిటుకునఁ గన్నీరుజాఱ చెక్కులుకడుగన్. 4

క. నలునారసిచనఁ దేరఁగ
సిలుగులెడలఁగొట్టు నేల జేజేలనిఁకన్
నెలఁతరాయని చినవిచ్చట
నిలిచెదనదిలేనినాఁడు నెట్టనసుఖల్. 5

ఆ. తొఱఁగుదానననుచుఁదొయ్యలియదియెల్ల
దండ్రికెఱుఁగఁజేయఁదగినయట్టి
జన్నిగట్లనలునిఁ జయ్యనరోయంగఁ
గట్టడలొనరించి కడలకనిచె. 6

గీ. అట్లునలురోయఁ జనుజన్నిగట్లతోడ । నల్లనల్లననిట్లన నన్నెలంత
యెన్నిరోకీడులందుచునున్నకతన నలుఁడుతాఁనొంటితీరువనలరకుండు

గీ. కానఁగోరికలీడేర్పఁగాఁగడంగి
చనుచున్నట్టి యారలుసరగనేగి
కనుగలిగియెల్లచోటులఁ గలయనరసి
తగఁగనిట్టులనుఁడు రాచనగరులందు. 8

సీ. కల్లలెన్నఁడునాడఁ గడఁగనినీయట్టి దిట్టయుఁగానలో దిగులులేక
యాలుకట్టినచీర యరచించికట్టుక యింతి నొంటిగడించి యేగనగునె
యాలునుదనలోన నరయన్నకట్టడ యరిగనే యెందైన నాసలేక
యిఁకనైననించుక యింతికయ్యాలించి నెనరడరంగఁ జేకొనఁగఁదగనె
యనినసిగ్గునలోఁగుంది యంతనిలక
తగిననుడులను దిరుగంగఁదళ్ళిగియాడు
నతఁడెనలుఁడని యెదలోననరసి తెలిసి
నన్ను నాతని కెఱిఁగించినచ్చికడర. 9

క. కైకొనిరండది చులకఁగఁ
జేకుఱకున్నను నెఱింగి చెచ్చెరరండీ
నాకడకని యనిచిననాఁ
గాకనిచనియెల్లయూళ్ళఁ గలయఁదిరుగుచున్. 10

ఉ. అందఱునింతిచే నెఱిఁగినన్నియు నల్లెడనాడియాడి తా
రెందును జేనిఁగన్గొనఁగ నించుకయేనియు నేరకూరకే
యందులనిందులందిరిగి యాసలురిత్తయి చన్ననిండ్లకున్
గ్రందుగనేగుదెంచి రెదనానలఁ జేతులనూఁచుకొంచొగిన్. 11

ఉ. అందొకజన్నిగట్టు చెలియంగని యిట్లను నేనయోధ్యకుం
గొందఱితోడనేగి యటఁగొంకక యేలికరచ్చపాలలో

సంపడిగాఁగనున్నయొకఁ జానుగఁజొచ్చితలంక కన్నియున్
సందయిరూడ నొక్కరుఁడు చక్కఁగనక్కడనుండి దండియై. 12

గీ. చెంతకరుదెంచి చేసైఁగచేసినన్నుఁ
జెనసిచాటునకల్లనఁ జేరఁజీరి
కుఱుచచేతులతఁడు జేనిఁగొలుచునతఁడు
నల్లనతఁడుక్షేరులఁబోలునాతఁడనియె. 13

గీ. త్రాడుకట్టినయాతనితటినొకింత । నేఁగియైనతటినిగానిచేఁతలైనఁ
జూచిసైరించునింతియె చులకగాను। నియమంబును సిరులందు సీఁకులేక.

క. అనియింకనెద్దియునసక । చనియొందవదారినతఁడు చక్కంగాఁ గూ
డొనరించునంటనిచ్చలుఁ। గనుఁగొనియెదలోన జేఁడుగడుసంతసిలన్.

మ. అనినందద్దయులోన నారసినలుండా నాతఁడొండొక్కఁడై
ననునేలాతిరుగంగనిట్టికరణిం దానాడు నేఁడింకనుం
జనిజాడల్ తగఁదీసి తీసికొనిరాఁ జక్కంగ నాయూరికే
ననుతుండొల్లిటి జన్నిగట్టునె యటంచాయింతి యల్లంతటన్. 16

క. చనితలిదండ్రులనిద్దఱఁ । గనుఁగొనియొతేఁగించి తొంటికరణినిదన్నుం
గనియుటకుందోడ్కొని తె । చ్చినయన్నెఱజాణ నేల జేజేతేనిన్. 17

క. క్రచ్చుఱనలునారసిరా । నచ్చుగనిత్రతి నయోధ్యకనుచుటలెస్సాఁ
జెచ్చెరనాతనిఁదోడ్కొనిఁ । తెచ్చునదియటన్న నట్లతేనానతిడన్.

గీ. అంతసరగఁ గొందఱులెంక లరిగియతనిఁ
దోడుకొనితెచ్చి మొలనాగత్రోడ నొయ్య
నెఱుకచేయనతనిఁ జేరియిట్టులనియెఁ
గేలుజోడించి కోర్కులు క్రేళ్లుదాఁట. 19

శా. నన్నెట్లచ్చటకేగి తోడుకొని యన్నా తెచ్చి తల్లన్నలుం
జెన్నారంగ నయోధ్యకుంజని యటంజేకూఱఁగా రోసి యెం

దున్నన్న నెఱనీటుసూటిగన నియ్యాఱింకఁ దోడ్తేఁగదే
కన్నారంగనుఁగొందుఁ గోరిక లెసంగన్నేలజేజేదొరా. 20

సీ. సరగన యోధ్యకుఁ జనితేనిఁ గనుఁగొని యందఱు నాలించునట్లుగాఁగ
నచ్చట నోరోడకాయనరచ్చలో నుదిరిగద్దియఁ గూరుచున్నతఱిని
గ్రథకైశికుఁడు జన్నిగట్ల నొక్కటనంచి నలురోసియెందుఁ గానంగలేక
తనకూఁతునకు నొక్క తగిన యేలికఁగట్ట దిరుగఁజాటించినఁ దేరులెక్కి
నేలఁగలయట్టిదొరలెల్ల నెలఁతఁగొనఁగ
నేగుదెంచుచునున్నారు నేఁటికింకఁ
గనఁగనానాఁడు నెడలేదుగాన సరగఁ
జనఁగఁజెల్లునని దొరత్తోననఁగదయ్యా. 21

గీ. నలుఁడుదక్కంగ నొండొక్కఁడలసినిలక
యొక్కనాటికె యిక్కడ కుక్కుత్తోడఁ
దేరుదోలుక యరుదేర నేరఁడగుట
నందెనలుఁడున్న దొరత్తోడ నరుగుదెంచు. 22

క. అనియానతిచ్చియనిచినఁ
జనియటఁ గ్రథకైశికుండు చయ్యనఁదిరుగం
దనకూఁతునొసఁగు నొకనికిఁ
గనుఁగొననెల్లిచను దేరఁ గాఁదగుననియెన్. 23

ఉ. అంతనయోధ్యఱేఁడు నలుఁడచ్చటనుండఁగ జూచియెల్లి నే
గంతునఁజేరఁజెల్లుఁ గ్రథకైశికునూరటుగాన నొక్కనాఁ
డెంతయుఁదేరుఁదోలుకొని యేఁగఁగల్గుదెనా సతండు నేఁ
డింతటిలోనఁజేరుసని యాకొని కన్నుల నీరునించుచున్. 24

గీ. నేలతెఱగంటి దంటయానేలికకడ
నిట్టులంటకు నరుదంది యెదఁగలంగి

తిరుగఁగడిదేఱినలుఁగకల్ తెలియఁజూచి
యెట్టకేలకుఁ దనలోననిట్లనియె. 25

ఆ. కానఁదన్నుడించి కడచన్నకతనఁగా
కలికియిట్లుచేయుఁ గడఁగెనేఁడు
గోతియెంతయు నెదఁగూర్చునాకంచు
నచ్చియుండునతఁడె హెచ్చుచెనఁటి. 26

ఆ. గోలనాకుఁగూర్చుఁ గోడుకులుగలయది
యిట్టులేలచేయు నింతిరైన
నెత్తిఁగియరుగుచెంతు నీతేనితోఁగూడి
యేగియచటికంచు నెదఁదలంచి. 27

గీ. తొల్లి తనకత్తలానులఁ దోలునతఁడు
తెచ్చియిచ్చుటనుంచిన తెల్లజిగిని
దవరుచుఱుకైన తనతేరి తత్తడులను
రెంటిఁగొని తెచ్చితద్దయుదంటయగుచు. 28

ఉ. తేరికిఁగట్టుచోనొఱఁగి తేజులుతూలుటఁగాంచి తేఁకుఁగో
దారినిపోల కీయసదుతత్తడు లెట్టుగ నేగనేర్చు నీ
కోరికదీఱ నొందుజతఁ గూరిచికట్టుట లెస్సయన్న లో
నీరికలెత్తుహెచ్చరిక నిట్లనియెన్నలుఁడోరఁ జూచుచున్. 29

క. ఈతేజీలించుకలో । నీతేరీడ్చుకొని యలుఁగు నింకెఱనరుగుం
జాతల్లలి యయోధ్యకునేఁ । డేతొగదాయ కడలితటి కేగెడుతటికిన్.

గీ. అనిననిటులైనఁ గడులెస్స యరిగిసరగ
నూరుచేరిన యంతటనొక్కపారి
కోరికలుదీఱునని తేరుసేరియెక్కి
నలుఁడునింకొక్కఁడునుదోడనరుగుదేర. 31

క. చను నెడఁ దేరికిఁ రుసునడ
కనుఁగొని యాతండు నలుఁడుగాఁ దగుఁగాక
న్నను లాఁతియొక్కఁడీలా
గునఁ దత్తడుల తెఱఁగు లెఱుఁగునె యనియెంచెన్ ౩౨

క. కను దెఱచి చూచునంతకుఁ
జెనయుచు నెత్తియునగట్ల చెట్లకొనలెడన్
గనుఁగొననై తఱిసితిరుగఁ
గనుఁగొనఁగా రాక యెదుటి కడనడఁగుఁగడున్ ౩౩

సీ. ఈడుజాడలుసూడ నీతండు నలుసాటిగాఁగ నించుకయంతకానవయ్యె
నీలాటియొడలేల తాలిచెనో లెస్సఁ దెలియనగునె కలతెఱఁగునాకు
నట్టియయ్యలు చాలనంగదలౌ తఱి దాఁగియుందురుగాదె తగినచోట్ల
నితఁడెనలుండైన నెట్లుండు నిచ్చటఁ దొల్లియెకానలఁ దూఱెఁగాదె
యనుచుఁ జనుచున్న తఱిఁ జీరయించుతాఁకి
జాఱి నేలఁ గూలిన నలు చక్కఁ జూచి
యితఁడు దిగి చీరగైకొని యేగుదెంచు
నంతకును దేరు కదుఁ దోలక నిననతఁడు ౩౪

క. ఏలికయా చోటి చటికి । నాలుగుకోనులయియుండు నడుచునెయితఁడా
నేలకుఁ దే నేరండిదె । తోలెద దేరంచు నాడి తొల్లిటికంటెన్. ౩౫

క. తొందరగాఁ జననిచ్చుచు
నందందుల యూళ్ళుదాఁటి యరుగుచునుండన్
నందున నయోధ్య యేలిక
చెందొగకొలఁకుకడఁ దాడిచెట్టును గనియెన్. ౩౬

చ. కని నలుఁ జూచి యిట్లనియెఁ గన్గొనికాని యెఱుంగరెల్లరున్
దనరఁగ నన్ని యెన్నికయొనర్చు తెఱంగది యే నెఱుంగుదుం

జని తెలియంగఁ జూచు చెయిచాయను జెన్నగు నల్లతామ్రక్రొ
న్ననలునుఁ గాయలాకులును నాకవికస్త్రిఖుఁగాంగఁ జేసెనా. 37

సీ. నూఱునూర్లఱొయికంపు నూర్ల్కానికొనలందు
నలరులుఁగాయలునలరుచుంపు
నీకేనుకొఱంతగా నేను నన్నూఱులు
కాయలాకులుగ్రింపఁగ్రాలుమించు
ననుచునాడిననుడు లాలించియటకేగి
యన్నింటిఁజక్కఁగా నెన్నికాని
యున్నియని తెలియనెఱుఁ గంగరాదని
యెదలోనగట్టిగా నెంచినల్లుఁడు
తత్తడులత్రాడు లొక్కటఁదనదుచేతఁ
దిగిచినొగల నొయ్యనఁగట్టి తేరుడిగ్గి
చీరయొక్కింత చక్కఁగా జేర్చికొనుచుఁ
జెట్టుకడకేగి నెట్టనట్టెయెక్కి 38

క. ఎన్నికరొయినర్చియాతం
డన్నట్టుల హెచ్చుతగ్గులన్న నుతేకా
క్రొన్ననలుఁగాయలాకులు
నున్నఁగనుఁగొనియరుదందిరొయియ్యనఁదిరుగన్ 39

క. చనుదెంచినాకుదీనిని । నెనరున నీతేఁడొసంగ నీకొనసేలా
గునసై నను నేఁజేసెద । ననితనయెదలోఁదలంచి యాదొరతోడన్. 40

క. నినునేనీనాఁడేతగఁ । గొనిచేర్చెదనాతి యూరుకోరికదీఱం
గనునిది నాకిడికోరిక । కొనసాగించినను నేలికొనఁగదె యిచటన్. 41

క. అనియడిగికొన్నదొర గై । కొనునీకిచ్చెదనుదీనిఁ గోరికతీఱం
గననిరొయిసంగిననింతం । తనరాని నెనరునకునెవ నలరుచునల్లుఁడున్. 42

క. నాకిచ్చితిదియుఁగానక । నీకిచ్చెదనయ్య నేను నేర్చినదీనిం
గైకొనఁదగునొండాడక । చేకొనితత్తఱులఁదోలఁ జేయుచుదురున్. 43

చ. అనియొనఁగంగరానతఁడు నల్లనలోనగుకొంచుఁ జెచ్చెరం
గొనియెదనయ్యనాకెదను గోరికయాతఱి నంతదాఁక యొం
డెనయనరానిదీని నెఱిఁగించుటకంటెను నీదుచెంతనే
యునుచుటలెస్సయానుఁడు నొయ్యననియ్యకొ నెన్నలుండటన్. 44

ఉ. అంతటఁదొంటినుండియొడలందుననుండి నలుంగడంగితా
నెంతయునేఁచుచున్న కలియెచ్చుగ నోరనుజేఁదుగ్రక్కుచుం
గొంతకుఱాఁగటన్నిలిచి కూర్చినల్లనికేలుదోయితోఁ
జెంతనుదిట్టఁగానలుక చేసెడునన్నలుఁజూచి యిట్లనున్. 45

క. కరోత్కటకుచేఁదొడలం
గారోత్కనిదరికొంచుఁ గ్రాఁచెఁగావఁగినుకెదం
దారోత్కనఁజేయకతిట్టక
కోత్కలుచేకూఱనేలు కొనఁగదెనన్నున్. 46

ఉ. ఇంతటినుండియేనుచటికేగక యీనెఱతాడిఁజేరెదన్
జెంతలనైననింతయెదనిన్నుఁ దలంచినయట్టి యయ్యలం
జెంతలఁజేరియుంగదలు చేయకయే చక యుండుఁగాననేఁ
డంతయునోర్చి నేనిడినయంగదసైరణనేయఁగాఁదగున్. 47

క. అనఁగనతఁడంచెనలుఁడును
గనుఁగొనఁగాఁదాడిఁజేరెఁగలియునునలుఁడుం
దనతేరికిఁ దిరుగనరిగి
చనుదెంచెన్నరగ నూఱుచక్కికిదొరతోన్. 48

గీ. ఒడలుచక్కనై యుండుటయొకటితక్కఁ
దక్కఁగలచేటులెల్ల నుజక్కచేసి

సంజయాత్మజకోట్టిక సరసకట్లు
తేరికప్రోడవాలుగు వెసలునించె. 49

గీ. అరిగి కృష్ణకై శికుండెదురరుగుదెంచి
తోడుకొనియేగు నలికత్తోడనేగి
యోడయుఁడచ్చటఁగట్టించియునిచినట్టి
యిల్లొసఁగసంబుదిగియుండెనల్ల నలుఁడు 50

సీ. ఆ తేరియలు కుడునాలించినలుఁడ డెయురు వెంచఁగాఁజాలునసుచు నెలఁత
యెంతటిదానవో యిన్నినాళ్ళకు జేనిఁ జూడంగఁగంటిని నేఁడు కనుల
నిండనంచు నలరి నే నాతనిని నిండు నొక్కటఁగనఁజాలకుంటి నేని
కనియుడయుని నిండు కౌగిటఁ జక్కఁగా నుంచుటకించుక నోచనేని
యుసులులంటఁజూడంగనొక్కసారి
త్రాఁగుదానననితలంచి త్రొయ్యలియును
దేరినిన మోధ్యతేనినిఁ దేఱిచూచి
కోరికలుడించి యెదలోనఁగుందుచుండె. 51

క. ఆదారయనూర నెచ్చట
జోదులయినదారలరాకఁ జూడకయెదలో
నేదియుఁదోఁచక త్రొయ్యలి
యాదటనొక్కనిఁ గయికొనుననదియెందుక 52

సీ. ఆలించుటయె లేక యక్కట యేలిక యొక్కఁడైన నీనెలంతుకఁగొనంగ
నే తెరఁగాఁగాన నేనుదక్కంగను నరుదయ్యె నెంతయు వరసిమాడ
నాకల్కి యొరు నేల గై కొనఁగాఁగోరు నలుసఁగాదని రిత్తయలిగి నేఁడు
కొడుకులుగలయది యెడఁద నెల్ల తలచినలుని నేడుగడఁగఁదలఁచుచుండు
వెంత యేయుంత యొరుని వైచేకొనంగ
ననుచునాననొదిగియుండెనంతనలుఁడు

తత్తడుల సాలలోఁ గట్టిరయిఁ ద్రిగిల్లి
తేఁడఁజినొక్కచో నేడ దేఱినొఱఁగె. 53

క. ఆయేలికత్రోనుండిన । యాయయ్యలఁజూచి తెల్లనై యంతటితో
నాయింతియునాసనుడెగఁ । గోయంగాలేకయానగొనుచుందిరుగన్. 54

క. తనచెలికత్తియ కేశిని । యనుదానిం జేరఁజీరి యాయిద్దలోఁ
గనుగొనియెఱిగిత్రినొక్కని । నసుఁగుగొనలుఁ దేరుతోలునాతనిఁగాగన్.

క. తక్కినయాతని సుద్దియు । నక్కరొనీచదురు నేఁడ యారసిచూతుం
జక్కఁగ నెఱింగిరాఁగదె । యిక్కడనున్నట్టియేగియించుకలోనన్.

ఆ. ఇతనియందుఁజిక్కె నెదనాకుఁజూడంగ । నల్లనాఁడయోధ్యకరిగినట్టి
జన్నిగట్టుతోడఁజెన్నుగఁనాడిన । దిట్టయాతఁడొక్కొ తెలిసిసరగ. 57

సీ. చనుదెంచునదియునియనిచినఁ గేశియుగదలిచెచ్చెరనలుఁగాంచియనియె
నన్ను నీచెంతకునలురాణియనిచె నెయ్యుఁడునీరులెస్సగాఁనున్న తెఱఁగు
కనుఁగొనిరాఁదగునఁగా ననడిగెదఁ దెలియనొక్కటియానతీయఁగదగు
నెందునకై యారతే తెంచితిరిచటి కేయూరఁదగనుందురింతదనుక
దాఁచకన్నియుజానుగల్ తనియునట్లు
సరగనెఱిఁగించిమెలనాగసరసకనిచి
యెలగాదగునన్నఁదానెడఁదలోన
నింతయుంకించి దానితో నిట్టులనియె. 58

క. నీయేలికసానికినో । ధీయ్యారినో యెల్లినేఁట నారునొక్కరునిన్
రోయకకట్టుదురనుచును । నీయేలికయేగుదేర నేనునుదోడన్. 59

క. చనుదెంచితినాతుకఁజే । కొనఁగాదే నేలయె త్రిక్కొనదారలెల్లం
జనుదెంచిరన్నిదెసలను । దనరుచునాలుగు తెఱఁగులదండులతోడన్.

గీ. సకియయోధ్యకే తెంచినజన్నిగట్టు । తఱలియిచ్చటికెల్లి రాఁదగునటన్న
నొకటననూఱుకోసులనొక్కనాఁట । దేరుదోలుచుఁదోడనే తెంచినాఁడ.

గీ. అనినఁ గేశియు నెడలోన నళుకు లేక
యంతకంతకుఁ గోరికలల్లుకొనఁగ
దిరిగి కూర్చున్న జతకాని దెసను జూచి
యితని తెఱఁగెద్దియన నల్లుఁడిట్టు లనియె. 62

క. కలికిరొ తొల్లి యితండా । నలుతేరును బోలునట్టి నాసంగడికాఁ
డలయక యియ్యెడ నాతోఁ । గలసి పొరకు దాన్త్రోఁకుగా నరుదెంచెన్.

క. అనఁ దొయ్యలి యితఁడన్నలుఁ । డౌనకంగా నేఁగి యొందునన్నాఁ డౌ నెఱ్ఱిం
గిననడుగం దగునను దుం । గను గోనలన్న గుచుజాడగా నిట్లనియెన్. 64

క. నలు నింగిలుని నెఱుంగఁడు । నలు కొఱ్ఱలనిద్దఱుం గొనినాఁడిచ్చుటకుం
దలఁకుచు నే తెంచితి రుగ । నలు నూరికి నేగి యచట నలుగురిచేతన్. 65

క. నెత్తానవోడి కాసల । కత్తఱి నేగుటయె ఱొంగి యడలుచుఁ దుదకుం
దత్తడులఁ గొంచు నెడలో । నెత్తివకుం బెల్లఁ బేఱ్ఱి యూపొరఁ జేరెన్. 66

క. నలుని తెఱంగెంతయునా
నలుఁడె యెఱుంగునొకయింత నచ్చికగాఁదా
నలుతోడఁ గూడి యరిగిన
యెలనాగయె యెఱుఁగుఁగాక యెఱుఁగుదురెయొరుల్. 67

సీ. అనఁ గేశియిట్లనె నన్నయూయింతికి నూరకకొలఁదె యొకటికట్టఁ
గాఁకలుదూఱని కాఱుకానలలోన నెనలేదిదొరయట్లు నెలఁతనొంటి
డించి యేగిననాఁటి చించిన చీరయె నేఁడును దాల్చుచు నెగడుచుండు
నోడలనంటిన యసల్ కడుగదించుకయైన నిచ్చలు నేలనె నిదురఁ జెందుఁ
గనులనీరెల్ల తఱిజడి గొనుచునుండు
సొగదిద్దదు చెదరిన సోగకురుల
నెందునలు రాక యేమొకొ నెంచుచుండు
నెల్లదెంత చక్కని కొమ్మనొక్కనాఁడు 68

చ. అసియెఱఁగించుచున్నతఱి నంతకునంతకు జాలుకొంచుఁగ
న్గొనలను జాఱునీరడఁచికొంచుఁ డెఱంగెఱుఁగంగనీక క్ర .
న్ననఁదలయించికుంచి యెద నాఁటినజాలిని నేలఁజూచుచుం
గనుఁగొనకూరకున్నఁగని నాతుకచెంగటికేఁగి కేశియున్ 69

క. ఆతండాడినతెఱఁగును । జేతలఁదాఁగన్న తెఱఁగుఁజెచ్చెరనొంటి
న్నాతుకకెఱిఁగించిననెడ । నాతనినలుఁగాఁదలంచి యనియెంజెలితోన్.

ఉ. ఇంకనునొక్కసారి యటకేఁచని యాతఁడయోధ్యజేనికిం
డెంకినిఁగూడఁనొసర్చ్చఁట చెక్కఁగఁజూచి యసడ్డలేక లో
జంకకయంతయుందెలిసి చయ్యనరాఁదగునన్న గ్రక్కనం
గొంకకయేఁగికన్గొనియెఁ గోరికలీరిక లెత్తనంతయున్. 71

క. కనుఁగొనియరుదందుచుది । గ్గనఁజనుదెంచి యెలనాగగోరినకరణిం
దన కన్నదియెల్లను ని । ట్లనియెఱిఁగించె నెదలోని యడలడఁగంగన్.72

ఉ. ఆయనజాడలెల్లఁ దగనారయ నేలకు డిగ్గినట్టిజే
జేయనఁదోఁచె నట్టి నెఱచేతలుతొల్లియు నెన్నఁడైన నే
నేయెడనాలకించియును నెంచుకకాంచియుఁ గ్రాలుగంటిరో
నీయెడుగాన కాన నలునిం గనినట్టులయయ్యెనాయెదన్. 73

సీ. కట్టెయొక్కటిగొని నట్టింటరాచినఁ
జిచ్చందుఁగలుగును జిటికెలోనఁ
గూడుడికెడునంతకును గట్టెలిడకయె
యంటుక సురసురలాడుచుండు
నంజుళ్ళుకడుగుకొనఁగ నీరుకోరుడుఁ
గ్రాఁగులు నిండంగఁగలుగుచుండుఁ
గైతాఁకియలరులు కందియుఁదొల్లింటి
చెన్నెకించుకయును జెనకయుండుఁ

గూరగాయలనుడికించి కూర్చుతఱిని
గడలనెల్లను బియ్యనిగాఁ బైపొలసి
పెండలెఱుంగనియట్లయ్యె నొక్కయింత
యతనికిఱుదులుతఱుచేలయరుకులయ్యె 74

గీ. సారెసారెకుఁ జెలినంచి చక్కఁగాను
జిన్నెలన్నియు నెఱిఁగియుఁ జేరికేళి
తెచ్చియిచ్చిననంజుళ్ళు తినియునతనిఁ
జేడెనలుసిఁగా నెదగట్టి చేసికొనియె. 75

గీ. అట్టులెఱిఁగియు నూరడకరసిచూడఁ
గొడుకుఁగూఁతును గేశితోఁగూడనిచ్చి
యతనిదగ్గఱకనిచినసల్లఁజూచి
చుట్టలందఱుఁచూచిన యట్టులైన. 76

గీ. చెక్కలొయ్యననంటుచుఁ జేరఁదీసి
క్రొత్తసనరునసద్దఱ నెత్తుకొంచు
డించిగ్రుచ్చికౌఁగిటఁ జేర్చినించుచుండెఁ
దొడలనిడుకొనికన్నీరుతోడుత్రోడ 77

చ. ఒడయఁడు నంతనింతిఁగని యోచెలిహెచ్చును దగ్గులేక నా
యెడఁదను నేలయోయెఱుఁగ నిద్దఱు నీచిటికుఱ్ఱలల్ల నా
కొడుకునుగూఁతు నచ్చునను గుద్దినయట్లుగనున్నవిట్టునే
నడలితిఁజాలఁజూచితిఁగదాయనియొండు తెఱంగుగా ననెన్. 78

క. నాతిరోతఱుచుగనిచ్చుటి । కే తెంచుచునరుగుచుంట యించుకకనినన్
లాఁతి తెఱంగున నెదలం । జూతురు చనదిందు రాఁగఁ జులకఁగనింకన్. 79

గీ. ఏనులాఁతిచోటుననుండి యేగుదెంచి
నాఁడ నీకునిచ్చోటు నాతోడిపెద్ది

కలమతలము త్రిచూడకత్రకస్సనఁజను
నదియటన్న నుఁజిన్న నై యదియుసరిగి 80

క. చనియదియంతయు నెఱిఁగిం । చిన నెంతయు సంతసించి చేడియ సరగన్
దనతల్లి యండకుంజని । కనికాళ్ళ కెఱఁగి నెనరొలుకఁగనియిట్లనియెన్.

చ. తలుచుదిఁ కేల యల్ల దొరదగ్గఱఁ గూడొనరించు నాతఁడం
దలు నెఱుఁగంగ నేరరిట దాఁచఁగనేలనలుండు గేశిచే
నెఱిఁగితి జాడగా నతని నిచ్చటి కాయనఁ దోడితెచ్చెదో
తెఱి గని నన్ను యచ్చటికిఁ దల్లి కొ యేగఁగనానతిచ్చెదో. 82

క. అనఁదండ్రియానతింగై । కొని యొంటరినొకని నేగికొని త్వరంగా
ననిచిననాతఁడు తోడ్కొని। చనుదెంచెను నింతికొంత సంతసిలంగన్ 83

క. కొతుకుచుసళుకొందుచునొ। క్క తెకంటఁదడిమెసంగఁగడునడలంగా
జతక త్రియ లేనియెడను । నతఁడచ్చటఁ గాంచెనోలి నాలిన్ జాలిన్.

గీ. కనులనొకసారి యొంటిగాఁగాంచెనేని
రేయికలలోన నే తెంచుచాయనున్న
తేనిఁ జూచియు నొండుగా లోననెంచ
కింతిజాణగాన నతనికిట్టులనియె. 85

సీ. ఏఁనాడు నేరును నేగు దెంచనికాన
సోలినిద్దురఁజెందు గోలనొంటి
నట్లుడించిచనంగ నెట్లుకాళ్ళాడెనో
నలునకుజాలి యన్నదియె లేక
తెఱగంటిదంటల దెనఁజూడనొల్లక
తన్నుదొరఁగఁగోరుకొన్న దానిఁ
గొడుకులతల్లినిఁ గొఱగానిచోడించఁ
జేడియమొగ్గెది చేసెనొక్క

విన్నుడించి నేనెట కేగుదున్న యట్టి
సుదుగులెల్లను నట్టేటఁ గలసెనో కో-
యనుచు నెదచిల్లు లగునట్టులాడుచున్న
యింతిఁ జూచి దగ్గుత్తిక నిట్టులనియె. 86

మ. కలిసన్నంటి చెనంటి యక్కరణిఁ దాఁ గాసిల్లఁ గాఁ జేయుటం
దెలియంజాలక యట్లొనర్చితిని సంతే దాని నా తెప్పచె
ప్పులచే గల్చితి నింక నా కోడలికం దొక్కింతుదక్కంగఁ గా
య్యాలిరో యొండుకలంకు లేదదియు నొయ్యందీయుఁ గొన్నాళ్ళకున్. 87

సీ. నీకొఱకునుగాదె నేనునిచ్చోటికిఁ
దిరిగితిరిగి యరుదెంచినాఁడ
నదియెల్లనట్లుండె నక్కటగరితకుఁ
గూడు నెయ్యొరునిట్లు గోరుకొనఁగ
నొంకులకై గాదె క్రిందుగ దొరలెల్ల
నరుదెంచుచుండ నీయనయుఁ గలి
యొక్కనాఁటనె తనయుక్కున నే తెంచె
ననిన నెంతయు నెదనళుకుఁ జెంది
కలికిచేదోయిఁ జోడించి కలఁతనొంది
మొలుఁగుకుత్తుక దగులంగ నిట్టులనియెఁ
దొల్లి జన్నిగట్టులరిగి దొరలరచ్చ
సాలలం దెల్ల నెంతయు జాలిగుచు. 88

క. నాచేగలిచినలాగున
నేచెచ్చెరనాడిచూడి యీదొరచెంతన్
నీచేరికయె ఋక్కఁగ నాకం
డాచక్కి నినీను సుదులయందలిజాడన్. 89

ఆ. ఆతఁడేఁగుదెంచి యాతయు నెఱిఁగించి
చనినయంతనతని సకియ నెల్లి
చేకొనన రుదేరఁ జెల్లునంచాడంగఁ
దడయకటకనిచిన దాన జేఁడ. 90

క. నలుఁడొక్కఁడుఁ దక్కఁగఁ జె
న్నొలయఁగ నన్నాఱుకోసులొక నాఁటనరాఁ
గలఁడేయొరుఁడని యెడఁగోఁ
దలంచిదీసి నొనరిచిన దాననుగంటే. 91

క. కొంకక యీదారయొద్దకె
యంకిలెడలి జన్నిగట్టునంచితి నింతే
యింకొక్కఁడైన నిక్కడ
కింకొక్కఁడె రాఁడె తేఁడు లిందఱిలోనన్. 92

ఉ. అందఱుఁ జూడ నీయడుగులంటెద నాయెడ నొక్కకీడునుం
జెందదటంచు నొండొకటి చేసెదఁ గుఱ్ఱల నెత్తికొట్టెదన్
దందనలేక యీత్రోగల దాయయు నీనెఱిఁగింక రాతు నీ
చందురుఁ డీల్గఁజేయుదురు జానుచెడం జెడుచేఁతలుండినన్. 93

క. అనుచున్న తఱినిజదలునఁ
గనుఁగొనఁగారాకయుండి గాలియనియె ది
గ్గున నందఱునూఁకొనఁగా
నెనలేనిగులుకు టెలుఁగున నేలికతోడన్. 94

క. ఇటులనఁదగు నేగరితను
గటగటతో గచూడు నేనుఁ గడలికొడుకు నొ
క్కటనొక్కక యేఁడొగిఁగా
చుటరొఱుఁగకయున్కినంటి చులకనినుడులన్. 95

గీ. అన్నకై కానుకదియని యూసయిడిన
నంతఁగురిసె జేజేచప్పట్లయలరుసోన
లలరి చల్లనిచిఱుగాలి యొలసె దెసల
నీఁడ తెల్లగంటి యమునంత నెమటనిలిచె. 96

సీ. ఎల్లరకునుదన్న నెఱిఁగించి యొల నాగ
క్రొత్తడిసుద్దులుఁ గొఱతలేక
నలునియందున్న గాదిలియు నెఱింగించి
కొనియాడ నాలించి తనరినలుఁడు
కర్కోటకుఁదలంచి కోర్కులుచేకూర్చ
నాతఁడిచ్చినచేలఁ జేతనంది
తాల్చినయంతనె తనతొంటిసొగసూనఁ
జక్కనైనక డాని చాయగలిగి
నూఱురాచిల్కకౌతుల నోంచుసొగసుఁ
దనుచుసీరాజు చీకటిదాయలనగు
తేజుఁడులకించునలుఁగాంచి తెలిసికలికి
సంతసిల్లెను నెయ్యురుసంతసిలిరి. 97

ఆ. ఇట్లుకూడునలుఁడింతికి నెలయల్లు
కాఁకతోడ నేగఁ గసటునోడల
నగల తెగలతోడ ననలెత్తఁ గోర్కులు
తొంటియునికితోడ దోసఁగులడఁగె. 98

ఉ. అంతయునాలకించి నెనరారఁగ నాక్రథకై శికుండు తా
నెంతయుఁ జీకటింగడచి నిండగుచందురుఁ గూడియున్న కే
యింతి తెఱంగునందవరు నింతినిగన్నుల నిండఁగాంచిలో
నెంతయుసంతసిల్లి నగరెల్లెడలం గయిసేయ జేసెవన్. 99

క. గొజ్జంగినీటనలికిరి
యజ్జగతుల కస్తురియిడి యందఱియిండ్లన్
గుజ్జనంటులు,గట్టిరి
ఱెజ్జలుసేసలొగి జల్లిరొక్కటఁదలలన్. 100

క. ఉల్లెడలెల్లెడఁగట్టిరి
చల్లిరినెలకాలదారి చక్కని తెలిరా
తెల్లనియిసుకలుగుండెలు
తల్లడిలన్ డక్కలడరెఁదఱచుగఁగాణల్. 101

క. క్రొందలొనరించిరియన్నియుఁ
జదలంటిననాలకించి చయ్యననలునిం
గదియఁగనేతెంచియయో
ధ్యాదొరయుఁదఱియైనఁగాంచి తద్దయునానన్. 102

క. నిన్నెఱుఁగక యున్నాళ్ళను
గొన్ని చలకచేతలేనుగొంటిని నీచే
నన్నియు నెదఁజొరనీయక
క్రన్ననసైఁచుమదియంచుఁ గడునడుగుకొనక. 103

గీ. అట్లుచేసెదనని దొరయానతీయ
నలరినలుచేతఁ దుదయంటునట్లుగాఁగఁ
దత్తడులఁదోలునెఱగట్టుఁదానెఱింగి
యతఁడయోధ్యదారిజనియెనంతనిచట. 104

క. నలుఁడొకనెలనాళ్ళోగిఁదోలు
దోలుతందానచటనుండి తొయ్యలినఁగుం
దలిదండ్రులయొద్దనునిచి
కలఁగని నెఱగట్టిగుండె కలుగుటకతనన్. 105

క. అత్తఱినాకక్షేరునుకెఱ
హత్తులుతగఁ గవిసివచ్చి యలయుని సొగసా
త్తతనులీలనైదులు
కత్తులుగలయాఱునూఱు కాలరులొకటన్. 106

గీ. తనకుఁదోడయిచనుదేరఁదలఁచియతఁడు
నిషధకేతంచితనదాయనెరయఁగాంచి
యంచవారకౌతుక్రాల్గంటియంతవారల
నెనయుగులుకుబలుంగుననిట్టులనియె. 107

క. నాయిల్లాలినిరోయిగ
నీయెడఁజూదాన నిడుదునేలెడునేలన్
రోయిగనీకుంచఁగఁదగు
నీయెదకదిలెస్సయైననెఱిచిగురొత్తన్. 108

క. అరయంగానీకయ్యది
సరిగాదవిత్రోఁచనేని చక్కంగా జె
చ్చెరఁగలనంగెలిచెద ని
న్నరుదగు తేరెక్కి నిలిచి యనికింజోరరా. 109

ఆ. గంటుగలయతనిదికాదె యెందును నేల
కలననేఁడు నిన్నుఁగండడంచి
నేలయెల్ల నేనెయేలెద నీకేది
తెఱఁగొయిందుసరగఁదెలియఁజేయు. 110

చ. కలనికిడాయరాదెయనఁగా నతఁడించుక యూరకుండి యా
నలునని లోన గెల్తుననుచ్చిక నాకిఁక లేదు లేదు నేఁ
దొలుతటియట్ల యీయెడను దొయ్యలిఁగెల్చెద నష్టసాధ్యచే
నఘుఁడిక నేలయంచు దరనారసి యాయనతోడ నిట్లనున్. 111

క. సేనోడితి నేనింకగ
నీనేలయొయిత్తునీకునిదియట్టిద ఱేఁ
డా నీకోడుటగల్గిన
యేనిన్నీరాణివాకు నీఁజనునెట్టులున్. 112

క. అనియొకరొంటరిచే సా
ళ్యనుఁగాయలుఁదేనొనర్చి లోడలోడ నెదలోఁ
దనచదురున నెలఁతనోరకె
ననుకొంచును నాడియోడె నందఱుఁజూడన్. 113

గీ. తిరుగఁజూడాననందఱుఁదెలియఁ జూడ
గెలిచితననేలయంతయునలుఁడుగొనియెఁ
దనదు తేజెల్ల కడలనుదసిరినిండ
సాదులెదలందుఁ దద్దయుసంతసిల్ల. 114

ఆ. అల్లుదాయనోడిచి యాతనిఁదనజెంత
కల్లఁజేరియుట్టులసియెనలుఁడు
చేరినిన్ను నాడు చినతండ్రికోడుకంచుఁ
గాచినాఁడనొండుకడకునేగు. 115

క. కలియుల్లోఁచినకతనం
గలంగియోడితివిగాక కన్నెత్రికనం
గలరే నన్నెరులయ్యాది
తొలుతటి నీగండటంచుఁ ద్రుళ్ళంజనునే. 116

క. అనియునిచిన నతఁడిచ్చం
జనియెనలుండు నిటనేలసరి జూడానం
గొనియుండుటదెసలెల్లను
దనియంగదిసిననలరుచుఁదటుకొననిచటిన్. 117

సీ. తల్లిదండ్రులయానతి నల్లఁగాంచి
యచటిచుట్టాలనందఱ నలరఁజేసి
లెక్కలేనట్టిక్రొత్తులు లెంకదంపు
తోడనరుదేరజిగిచాయదొలఁకుచుండ. 118

క. కొడుకును గూతుం దోడ్కొని
యుడుగరలిల్లాం డ్రొసంగనొకచేఁగొంచుం
గడుచక్కని తేరుననలు
కడకేతెంచె నెలనాగ కలకల నగుచున్. 119

ఉ. ఆకరణి న్నలుండు తనయాలును గుజ్జలఁగూడి హాయిగా
నేకడఁజూచె నేనిఁదన యేత్తెఱయెల్లరు నూఱునోళ్ళతోఁ
గైకొనికోర్కి క్రేళ్ళుఱుకఁగాఁగొనియాడఁగ నేంస్తు చాలఁ దా
నీకొని నేలయేలె నొకఁడేనియు జేఁడెనగాకయుండగన్. 120

క. అనినలుకత యాత్రెఱుగున
నొనరంగొంతి తొలిచూలి కొయ్యనవెఱఁగిం
చినలునియట్టులెయతఁడును
జెనసినకడగండ్లకోర్చి సిరులొందంగన్. 121

గీ. ఆడి జడదారితనదారి నరిగినంత
నిచట గుడెదారికొడుకును నెషదలోన
నదియొతలఁచుచుఁదలయూచియరయనుచు
సారెగొనియాడితద్దయుసంతసించె 122

క. ఈవలుకతయుడుగునతఁడు
దానాలించెడునతండుఁదగఁగనునతఁడున్
జానగు కొడుకులఁగూఁతుల
తోను సిరులఁ గొల్లలాడుదురు లగ్గనయన్. 123

క. నునుగుత్తుకఁ జేఁదిడుకొని
తనరుచునున్న తెఱగంటి తలకట్టా లోఁ
గనలెనయహా త్రిరక్కసు
ననిఁగోసంగూల్చిచ్రక్చ్చులందినదిట్టా. ! 124

మణిగణనికరము. నెలతల నలరుగ నెలకొనునతఁడా
త్రొలికడదొరకలు దొరకుతుకదొరా
కొలిచెడుసిరిదొరకొలలడఁచులీ
కలననెదిరి యెదఁగలఁచు నొడయఁడా ! 125

గద్య.

ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర కందుకూరివంశపయః
పారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్యపుత్ర సుజన
విధేయ వీరేశలింగనామధేయ ప్రణీతంబైన శుద్ధాంధ్ర
నిరోష్ఠ్య నిర్వచన నైషధంబునందు సర్వంబును
దృతీయాశ్వాసము.

సంపూర్ణము.

రసికజనమనోరంజనము.



BY

K. VEERESALINGAM

రసికజనమనోరంజనము.

ప్రథమాశ్వాసము.

చ. సిరివిరిబోడిఁగూడి యొకచేతను నాతుకచేతులూఁతగా
గరుడిని నెక్కుచోఁ గలికి కమ్మనికేల్జడ సంచుఁగాంచి య
గ్గరుడియు నల్లత్రాఁచనుచు గ్రక్కున ముక్కున నొక్కనెక్కఁ దాఁ
జురచురఁజూచి కేలుఁగవఁ జుల్కనదల్చెడు వెన్ను నెన్నెదన్. 1

సీ. పక్కిగుఱ్ఱపురౌతుఁ బక్కిగుఱ్ఱపురౌతు
దాయయుఁగొడుకునై తళుకుఁగులుక
కొండకానుపుఁ బ్రోడ కొండకానుపుఁబ్రోడ
బావయునాలునై బలసివెలుఁగ
కడలిపుట్టువయును గడలిపుట్టువయును
మేఁతయునగయునై మెఱపునెఱప
కందునితండ్రియుఁ గందునితండ్రియుఁ
దాపునుగన్నునై యేపుమాప
పత్తిజవరాలుకూళ్ల మొత్తుకేలు
హత్తిత్రోలును దోరంపుమిత్తిఁదోలు
క్రొత్తవాలును నల్లనికత్తుకయును
గలుగు గిత్తతత్తడిరౌతుఁ గొలుతునెపుడు. 2

చ. పలుకులచానవేనలిని బాఱఁగనుంగొని నల్లమబ్బుగాఁ
దలఁచికలంగి పాఱఁ జనుదానిని జెల్వపుటంచఁగాంచి నే
ర్పులవడఁ జేయి దామరలనల్లన చేరఁగఁబిల్చి మవ్వన
మ్మలుపయొసంగుఁగాత విడనాడక నాకుఁగడింది కోరికల్. 3

క. కొబ్బరికాయల నొక్కుచు
నిబ్బరముగఁ గొల్చువారి నెఱిఁ బ్రోచెడియా
గిబ్బవజీరుకొమారుఁడు
గొబ్బున నొడఁగూర్చుఁగాతఁ గోరికలెలమిన్. 4

చ. కలుములచేడెకోడలు నిగారపుఁ బెల్లనిమేనిచాన క
ల్కులసిరికాటపట్టు బలుకోరికఁ బెన్మిటిమోముదమ్ములం
దలరెడుకొమ్మ సోయగపు టంచపయిన్నడయాడుచాను యా
నలువవెలంది నిచ్చలును నాలుకఁగాపురముంచుఁ గావుతన్. 5

వ. అని వేల్పులనెల్లం గొనియాడి. 6

గీ. నన్నయఁ దలంచి తిక్కననెన్ని పిదప
నెఱ్ఱప్రగ్గడఁ గొనియాడి యెల్ల తెలుఁగు
కబ్బపుంగూర్పరుల మదిగౌరవించి
యొక్కటను బెద్దలను నెల్ల మ్రొక్కిడుదు. 7

గీ. నిందునెమ్మేను విషనాడి పుండులకును
నిక్కునీఁగలవగమాని నీరువిడిచి
పాలుగొనునంచ తెఱఁగూని వఱలుమీరు
తప్పులఁ దొలంగి నెనరుంచి మెప్పుగొనుఁడు. 8

వ. ఇట్లు వేల్పులం దొల్లింటి తెనుంగు కబ్బంపుఁగూర్పరుల వేర్వేరఁ బేర్కొని నానేర్పుకొలంది నొక్కయబ్బురంపుఁ దెలుంగుకబ్బం బొనఁగూర్పం దలంచి మొదలనాకొలఁబు తెఱంగించుక వక్కాణించెద. 9

సీ. జగములఁ గలిగింప నెగడింపఁ బొలియింపఁ
గల వెన్నుఁడే వేల్పు కన్నతండ్రి
యెలమి నెల్లరకును గలుములు కలిగించు
సిరిచెలియే వేల్పు చెలఁగుతల్లి

చెలరేఁగియుండఁజఱ వలపించి ప్రుక్కించు
ననపల్లిఁడే వేల్పు ననుఁగుఁదోడు
చదువులకెల్లను గుదురగుచు వెలుఁగు
వెలిచానఁజే వేల్పు వెలఁదిమిన్న
యట్టినలువ వంగడమున నమరఁబుట్టి
రాజలింగమనంగను రహిఁ దనర్చి
యతఁడు చేసికన్నులవేల్పు నందుఁగలుగు
బత్తికలిమిని సరిలేకవన్నె మీఱె. 10

సీ. ఊళ్లఁబల్లెలు నేలుచు నుండియాతఁ
డెల్లవారలఁ దనుపుచు నీగిచేత
వాసిగనిగాంచెను గోలంబువన్నెకెక్కఁ
జంద్రమౌళియను కొమారు సాటిమీఱ. 11

క. అక్కమయను నెలనాగన్
మక్కువతోఁ బెండ్లియాడె మఱియాతఁడు మున్
ముక్కంటి గట్టుకన్నియ
నక్కజత్తోఁ దాను బెండ్లియాడినకరణిన్ 12

క. వీరేశలింగమను కొడు
కారయఁగాఁ జంద్రమౌళి కరుదుగఁబుట్టెన్
జేరి మనుపాలకడలికి
గారాబపుఁజందురుండు కలిగినమాడ్కిన్. 13

ఉ. ఆతఁడు విద్దెలంగరము నందఱచేతను మెప్పుపొందె మే
ల్నేతల నెందునున్నవతు లేక చెలంగి కరంబు మేటియై
ప్రాతిగ నేల తేండ్లకఁడఁ బ్రగ్గడయై కడుఁ బేరుపొంది తా
నేతఱి మేటిదేవరని యెంచుచు లింగనిమానెఁ గొల్వఁగన్. 14

గీ. కొమరులను గాంచె నా కందుకూరి కొలఁపుఁ
పెద్ద వేంకటరత్నమన్ పెద్దకొడుకు
వెనుకఁ జిన్నిసుబ్రహ్మణ్యమను కొమారు
నలరుశనచానయైన కామమ్మయందు. 15

క. అందల సుబ్రహ్మణ్యుఁడు
పొందుగ నెల్లరును దన్నుఁ బొగడఁగ సిరులం
జెంది వెలిఁగెఁ దనసరివా
రందఱిలో మిగుల నన్నయానకులోనై. 16

గీ. మున్ను కడలి రాకన్నియఁ జెన్నుమీఱ
వలచి వెన్నుండుగైకొన్న చెలువునోపఁ
బున్నమయనంగఁ దనరారు పొలతిమిన్న
నబ్బురంబుగఁ బెండిలియాడెనతఁడు. 17

క. అయ్యిరువురకును సంతస
మొయ్యనఁ జేకూఱ నేను నొదవితి మదిలో
నెయ్యమున న్నిలుపుము మరు
నయ్యను వీరేశలింగమనఁ జనుచుందున్. 18

సీ. ఏమేటియముగుఁ బొందామరల్ తొలివేల్పు
మొదలగువారలు పొందఁజాల
రేవేలుపుల వేల్పు నెవయందుఁ బాయక
కలుములకొమ్మ నిచ్చలునునుండు
నేదిట్టబొజ్జలో నెల్లజగంబులు
నొకమూలఁ బొందుగా నొదిగియుండు
నేపెనుదంటపేళ్ళై దురపుటోరెంపుఁ
దపసిలోనగువారు తలఁతు రెవ్వని

నట్టివెన్నుండు కనికరముట్టిపడఁగ
నాదు డెందంపుఁ దమ్మిలోఁ బాదుకొలిపి
నాదుకబ్బంబుఁ దనకప్పనంబు సేయు
తలఁపు పెఱవేలుపుల సేరిఁదఱియకుండ. 19

క. అట్టి కనికరపుగనికిన్
గట్టిగ వేలుపుల నెల్లఁ గాచుచు మదిలోఁ
బుట్టినకినుకన్ రక్కసి
జెట్టులఁదునుమాడు సిరుల చేడెమగనికిన్. 20

క. నెట్టనగొల్ల పడంతుల
బట్టలుదొంగిలిన చుట్టువాల్దాల్పునకున్
బొట్టెలఁ జంపఁగడంగిన
కట్టిఁడిముద్దియఁ దునిమిన కత్తివేల్పునకున్. 21

క. క్రాలెడునాలున్ బంగరు
సాలున్నఱచుట్టువాలుఁ జాలఁగ నలుపో
డాలుం బాలకడలినడి
ప్రోఁలుకన్ సరిమాలు మేలుఁబొసఁగెడు దొరకున్. 22

క. మేటికిసిరియెద తామర
తేఁటికిగరువంపుఁ బొలసుదిండుల దళవుం
గాటవుఁ దెమ్మెర నెచ్చెలి
నీటికిఁ దెఱగంటి పక్కినెఱగూటికొఁగిన్. 23

క. ఎన్నికగను కవ్వడియా
లన్నకుఁ దోత్వేల్పు పొగరుటావుల మెకపుం
గున్నకుఁ జెన్నగు జేజే
మిన్నకు బలుగొల్లకొలపుఁ బిన్నకు నెమ్మిన్. 24

తే. గీ. అప్పనంబుగ నానేర్చునట్లు నర్పఁ
బూను చిత్రాంగదయసంగఁ బొలుచునట్టి
మెలఁత పెండ్లి తెఱఁగు జనమేజయుండు
వినెడు వేడుక మదిలోనఁ గొనలుసాఁగ. 25

వ. వైశంపాయనుం డనుంగొని. 26

తే. గీ. పెద్దయును మాకొలంబునఁ జేరువడిన
క్రీడియెట్లు చిత్రాంగద కేలువట్టె
వేడుకలుమీఱ నాలింతు వీనులలర
దాఁచకానతీవయ్య యోతబిసిరాయ. 27

క. అనజడదారియు జెనిం
గనుఁగొని సందియముతీఱ గారవమారన్
వినిపింపదొడఁగెఁ గవ్వడి
మునుముద్దియఁ బెండ్లియైన ముచ్చటయెల్లన్. 28

సీ. మగఱాల జిగితూల నగఁజాలు వగఁగ్రాలు
తెలిడాలుగలమేలుతిన్నెలమరఁ
జెనుగట్టులనరట్టులనుబెట్టునునుగట్టుఁ
గొనితిట్టఁ గనుపట్టు కోటలడర
సలరమ్ముచెలువమ్ము లలిఁగ్రమ్మువెలిఁగుమ్ము
మురిపెమ్మునెరనమ్ముముగుదలలర
నెనలేనిగొనబూని పెనుకోనలనుదేనె
తెరలానుదారలేని తేఁటులోలయ
నెచటఁగనుఁగొన్న నేనుంగులేపుచూప
నెల్లచోటులగుజ్జంబు లెసక మెసఁగ
ముజ్జగంబులఁగలప్రోళ్ళ మురువునవ్వి
యలరుచుండు నింద్రప్రస్థమనెడువీడు. 29

తే.గీ. ప్రోలిపాలంబట్టు టెక్కెంపుగాలియడరి
ప్రాగ్దుతేజీలనవ్వాలఁ బోవకుండ
నాపఁగాఁగాదె తనత్రేరికతఁడుకట్టెఁ
బాముగుంపులఁ జెలువంపుఁ బగ్గములుగ. ౩౦

ఉ. చొక్కపుఁబైడిమేడలను సొంపగు పచ్చలచూరుపట్టెలం
జెక్కినకప్పుటాలపని చిత్తరువ్రాఁతల పారువంబులన్
దక్కెనటంచుఁ బట్టుకొన దగ్గరప్రాఁకుల నుండుడేగచాల్
నిక్కుచు నంతదవ్వగయు నేరక క్రమ్మఱివచ్చు నిచ్చలున్. 31

ఉ. ప్రోలికడాని మేడగమిఁ బొందుగఁ జెక్కినయట్టి పుల్గురా
టాలమెఱుంగు రంగులతెఱంగుఁ గనుంగొని త్రోవకడ్డుగాఁ
జాలెడుపచ్చికంచు నదఁ జందురుఁడెంచియె దానిమేయఁగాఁ
దాలిచెనిఱ్ఱిఁగానియెడఁ దాల్పఁగ నాతనికిఱ్ఱియేటికిన్. 32

చ. నెలయరుదెంచి యుప్పరిగ నిద్దపుసోరణగండ్లు సొచ్చినన్
వెలఁదులు లేచిచూచి కడు వేడ్కమెయిం దమకేలుదమ్ములం
దలుపులుమూయఁగట్టువడి తద్దయునేపట నేలనుండఁగాఁ
గలుగుటఁజుమ్ము పొల్చె నెలకట్టులసంగను నేలలెంతయున్. 33

గీ. తద్దయును వేలుపులతేని దాడికోడి
గుంపులనుగూడి పఱతెంచి కోర్కెలలరఁ
గడలిడాగవచ్చిన కొండగమియసంగఁ
గదిసితిరుగు నేనుంగులగత్తెయందు. 34

క. వీటనుగలగుఱ్ఱంబుల
గాటపువడికోడిగడ్డి కఱచెను లేడుల్
మాటికివడఁకుచు గాలియుఁ
బోటరితనముడిగి యొక్కమూలంబడియెన్. 35

క. ఎప్పుడుఁబూవుందోఁటల
నొప్పగుతావులకుఁ జిక్కియొగిఁ జలిగాడ్పుల్
తప్పక కాపురముండఁగ
మెప్పొదవఁగఁ జలువలచట మేకొనియుండున్. 36

చ. వలపులుమీఱునీఱములఁ బ్రాఁకుచుఁ దమ్ముల మొత్తపున్నిఱుల్
తొలుతను వెచ్చపెట్టి పువుఁదోఁటను మోవులుతావులాని పె
క్కులు గిలిగింతలందనరి కొమ్మలనిమ్ములఁ గూడివీటికిం
దెలదెలవాఱువేళఁ జనుదెంచును దెమ్మెరదంటయల్లనన్. 37

ఉ. వేలుపుమ్రాని క్రొవ్విరుల పెన్వలపుల్ గొని విన్ను వాఁకపైఁ
దేలుచు దానిచల్వయును దెమ్మెర తెచ్చియొసంగి చెమ్మటల్
దూలఁగఁజేయునిద్దురను దోఁగిమగల్ జవరాండ్రువేకువన్
హాళినిమేలుకాంతురట నచ్చరబోటుల వీణెపాటలన్. 38

చ. అలమొలదోఁట మొత్తముల యందలిమ్రాఁకుల పూవుఁదేనియల్
వెలువడి చేలకాలువల వెంబడిఁబాఱుచు నూరిపైరులం
బలువిడిఁ బండఁజేయఁగని మబ్బులుసిబ్బితి డాఁగనిచ్చలుం
బొలుపగుతావిత్రో నగళునున్ బాగ లాడఁగఁజేయునెమ్ములన్. 39

చ. ఎనమటిలేక ప్రాఁజదువులెల్లను నేర్చుచెకాని లాఁతిచే
తను దలకొట్లనొందెనని తామరచూలిని దూఱి వేయునో
ళ్ళను దుదముట్టఁగాఁ జదువులంగనుటొక్కటె రెండు నాల్కలం
చొనరఁగఁబాపతేని నగియుందురు ప్రోలిని నేలవేలుపుల్. 40

సీ. చెవులెకన్నులుగాక దవునేలదాల్చరుల్
పలునాలుకలులేని పజదొరలొక
పగవానిఁగనిపాఱి బలుకొండకలుగున
డాఁగనిపసిఁడిపుట్టంపుదాల్పు

లోఁగిఁబగల్ సేయని జగముదట్టంబులు
సడకఁదప్పనియట్టి పుష్పమిదాల్పు
లోక్కనిఁజేరని రోక్కంపుటోడయుండ్లు
స్రుక్కిమైమఱవని చక్కనయ్య
లారయని యెల్లవారును నలరుచుండ
నలరుచుందురు తద్దయు బలిమికలిమి
నాడితప్పక సరిలేనిపాడిగలిగి
కొమరుపాయంపు నెఱరాచకొమరులచట. 41

ఉ. కలచెలి బిచ్చమెత్తుకొనఁగాఁగని యోరిచియున్నయూరునుం
గులికెడు దాయపాల్వఱిచి కొంపలపాలయి మూలఁబడ్డ జ
క్కుల దొరదూఱి వీటఁగల కోమటులొప్పుదు రెల్లనెప్పుడుల్
కలుములనొప్ప నిల్లుకదలంబనిలేక కడిందివేడుకన్. 42

ఉ. తెలతెలవోయి కట్టుకొనఁ జెల్లనిబట్టయెలేక మంచుకోఁ
వలఁ దగుత్రాసుఁ బోతనుచుఁ బల్మఱువెన్నునియున్న నవ్వెమై
చెలువము జీరలున్ సిరులుఁ జెన్నెసఁగన్మరిమూడకల్గియ
గ్గలమగు వేడ్కఁబొల్తురటఁ గాపుకొమారులు పాఁడిపంటలన్. 43

తే. గీ. మేలిమి పసిండి నిద్దంపు మేడకొనల
నలరుఁబోఁడులు నిచ్చలు నాటలాడఁ
జూడనడ్డని నెత్తమ్మిచూలి చెప్ప
పాటు పెట్టఁడయ్యోను వేల్పుకూటువులకు. 44

ఉ. క్రొన్నెలతాలయుప్పరిగ కొప్పులనొవ్వలు గుల్కుపాయపుం
గన్నెలముద్దుమోములను గ్రాలెడుమేడల దారినేగునా
వెన్నెలతేని నేర్పుఱుప వేఱొకనేరుపు తోఁచమింగ దా
వెన్నెలతేసలోనలుపు వేలుపుపెద్దయొనర్చె గుట్టుగన్. 45

సీ. పసుఁగుత్తలలఁ బాలిండ్లసొంపుగఁజేసి
యానల్లు కొప్పులనలవరించి
చిందమ్ములనుగొంతు లందమ్ముగాఁజేసి
యాతెల్లు నవ్వులయందుఁబెట్టి
మల్లెమొగ్గలచాలు మఱిపల్వరుసచేసి
యామె త్తన పెదవులందిమిడ్చి
మత్రీపండులఁ జిన్నిమడిమలు కావించి
యాయెఱ్ఱ పసుగులయందమర్చి
నలువ యవ్వీటిబోటుల నలువుమీఱఁ
జేయఁబోలుఁగాకున్న నాసోయగంబు
వీసమంత్రైనఁగలుగదే వెతకిచూడ
ముజ్జగములందుఁగల పువ్వుబోండ్లయందు. 46

వ. మఱియు నవ్వీడు నేడ నీడులేని వేడుకలగూడిమాడి ప్రోడలయి జేనిఁగాన నేతెంచిన లాఁతివిలాతుల యొడయండ్ల కడవన్నె బెడంగు బంగరు మగజానగల తెగలు జాపిడిందగిలి నొగిలి నిగనిగ జిగ మిగుల దిగువఁబోడియైకడుఁ బుడమింబడి యదరు కడిందియినుక లెసక మెసఁగు తెరువులును నింతంతనరాని సంతసంబున బంతులుగట్టి రంతులుసేయుచు నెంతయువింతగాఁ బంతంబునఁ జేమంతిపూబంతుల పొంతకు గంతులిడు మేటితేఁటిదాఁటుల తేటపాటలనాటంబయి యిరఁగెలంకుల బింకంపు గొఱవంక తెగలుగల కొలంకులును నీలిడాలు చేలలంగ్రాలు మేలిజెండాలచాలు గాలింగదలంబాదలు తగులున మొగిలు తెగలని నిగిడి మిగుల పొగరున మగిడి నెట్టనఁ గట్టిఁడి పుట్టనట్టులం జుట్టుముట్టి కిట్టి పట్టిబెట్టుగ నిట్టూర్పులెడలం గట్టిగఁగొట్టి పట్టరాని కట్టలుకంబొట్టలు పగులంగొట్టు బెట్టిదంపుఁ బని కట్టిపెట్టి నట్టువంబుసలుపుదిట్టనెమ్మిపిట్టల నొప్పియొప్పులుగుల్కు

రాచిల్కపల్కులం జెలువుగులుకు సింగారంపుఁ దోఁటలును పెంపుగ నిచ్చలు మెచ్చులుగుల్క నచ్చంపుఁ బచ్చలతిన్నెలఁ జెన్నుగు నెన్నరాని తిన్నని పగడంపుఁ గంబంబు గుంపుల సొంపులునింపు పెంపగు కొలువుకూటంబులునుం గలిగి మావులుం దావులుం గలిగి యెలదోఁట సాటిని ముత్తెసరులు బంగారుతీగెలునుం గలిగి వరిచేలపోలిక సిరికాటపట్టయి పాల్కడలివడువునఁ దగవుకలిగియుం దగవులేక గోత్రులచే నొప్పియు గోత్రులులేకయొప్పి కొల్లలండియుఁ గొల్లలేక కరంబు డంబుమీఱు. 47

అప్పుడు యుధిష్ఠిరుఁడను
పువ్విలుతునిఁ బోలుఱేఁడు పొందుగ నేలున్
జవ్వనము బలిమికలిమిని
దవ్వులవోరలెల్లఁ దన్నుఁ దద్దయుఁగొలుపన్. 48

కడునొప్పుతనదు చాగపుసిటిసేటికిఁ
గడలికొండొక పిల్లకాల్వగాఁగ
గ్రాలుతనయసంపుఁ బాలవెల్లికి ముజ్జ
గంబులు దీవులందంబునూపఁ
దనదుమార్తురకును దట్టంపుటవిచా
లిఱుకైనచాలని యిండ్లుగాఁగఁ
దనదునిండారైన తలవాకిలియెచూడ
నేతెంచుదొరలకు నిమ్ముగాఁగ
నొప్పుఁ గాఁపులకెల్లను నోముపంట
పాఱులకు సాదులకు గొప్పపట్టుకొమ్మ
బీదసాదలపాలిటి వేల్పుచెట్టు
జగములం దెల్ల మేటి యజ్ఞమునికొడుకు. 49

గీ. అడుగుపెట్టిన మాఱుతుం డడుగుపట్టు
నైమఱువిడినఁ బగతుండు నై మఱువిడుఁ
గోమరు దళుకొత్తు నారాచకోమరుఁబోలు
జేఁయుగలఁడె యెందును వలజేఁడుదక్క. 50

ఉ. వాడియుఁ బైడియుం బుడమివేల్పుల కెన్నికమీఱఁ దెచ్చి కై
కొండని జేఁడొసంగఁగని కుందుమది న్వాలికొండ వేలుపుం
గొండలుగట్టువిల్తుఁ గడుఁగొల్చిన విల్లును విల్లుఁగాఁగొనె
మెంతుగఁగొల్చిరే సతఁడు మేకొనియేలఁడె యెట్టివారలన్. 51

చ. జగమునఁబుట్టి పుట్టకయె సారెకనుంగొన నెజ్జివాఱుచుం
బగ లోనరించుచుఙ్ బయలుబ్రాఁకుచు నిల్కడలేక యెప్పుడుం
దగఁ జెరలాడుచుంబుడమిఁదద్దయు వేఁడిమిచూపి త్రాగనీ
రగపడకుండఁజేయు జమునయ్య యహో సరియౌనె తేజునన్. 52

చ. అతనియసంబు ముజ్జగములందును దానయి యెల్లవారలఙ్
జతనము మీఱ లిబ్బిదొరసంగడికాంఁడ్రను వెన్నునన్నలం
గొతుకక చేయమాఱ్పుడుటకుం గుఱుతుల్ తగనజ్జిన న్మొలన్
సతమును వారుదాల్చిరి వినంబును వల్వయునన్ని పంబునన్. 53

క. కలిమియు నడఁకువ పెంపును
బలిమియు నోరిమియుఁగల్గి వఱలెడు దిట్టల్
నలుగురతనికిం దమ్ములు
గలరు వడముడియును గ్రీడి కవలు ననంగఙ్ 54

తే.గీ. అన్నయానతి జవదాఁట కనుఁగుఁదమ్ము
లనువుపఱుపఁ దమ్ములతలం పన్న నెఱపఁ
బాలునీరునుఁ గలసినబాతి వార
లొకరొకరిముద్దు చెల్లింపుచుందురందు. 55

చల్లఁదనంబును జెల్లివిగల్గుట
జాబిల్లి కోలమసాట సాటుచుండఁ
చక్కఁదనంబును మిక్కిలి పరువంబు
వేఁగంటికోడుకోల వెల్లడింప
నక్కటికంబును ననదలఁగాచుట
వెన్నుని చెలిమాట విన్నవింప
ననమునువడిఁగల్గి యలరుటమిన్నేటి
ముమ్మనుమండౌట పూని తెలుప
నన్నమాటయన్న నమగుదాఁటక పిన్న
పెద్దయంతరువుల పెంపుదెలియు
మేటి క్రీడికెవరు సాటి ముజ్జగముల
నతనికతఁడె సాటియగునుగాక. 56

ఆతనిసోయగంబు చెవులార వినంగనుఁ బట్టి ముద్దియల్
చేఁతలఁదోఁట్రుపాటెనయఁ జెల్వునిచాతనిగాఁగ నెమ్మదిన్
భ్రాంతిగనెంచి కూడుదురు బాపురె నిచ్చలుచూచి కేని యా
నాతుల చేఁతలంగలుగు నానలుకందుఁడు కొల్లవెట్టఁడే. 57

ఆతండొక్కఁడు ప్రొద్దువోక యొకనాఁడందంపుఁ బూఁదోఁటలోఁ
జేతుల్ చేతులు సేర్చికొందఱుచెలుల్ సేమంబున న్వెంటరా
లాఁతుల్బారులుగట్టి చెంగలువ కేళాకూళి లోద్రోవలన్
వాతోడై చనుదేరఁ గ్రుమ్మరితగన్ జాబిల్లిఱాతిన్నెపై. 58

కలయంగఁబన్నీరు చిలికినకురువేళ్ళ
వీవనయొక్కండు వీచుచుండఁ
బచ్చకప్రపుఁదావి మెచ్చుగుబుల్కాను
పండాకుమడుపు లొక్కండొసంగ

ముత్యాలకుచ్చులఁ బొదలుచిత్తరువ్రాఁత
కెంబట్టుగొడుగొక్కఁ డెమ్మెఁ బట్ట
జిలుగుజరీచెట్ల తలగడత్రోడక్రిందఁ
బదిలంబుగనొకండు కుదురుపఱుప
వలపుగాలిపెడు చిఱుగాడ్పు లొలయుచుండఁ
గెలనికొలఁకుల తేఁటులు వలుకుచుండఁ
జెలులతో ముచ్చటల్ సల్పు చెలిమితోడఁ
జెన్నుమీఱంగఁ గూర్చుండి యున్నయెడను. 59

సీ. వేల్పురాయఁడు తనబిడ్డయొద్దికిఁ బంపు
పాలుపొందు పచ్చలబొమ్మలనఁగఁ
బ్రోలిపెక్కుపుఁ జేలగాలిని నేలపైఁ
గూలు జేజేచెట్లకొమ్మలనఁగఁ
బ్రొద్దుమావులు మేయఁబోజాతి పుడమిపైఁ
బడు పచ్చిగడ్డిజొంపంబులనఁగఁ
బుప్పొడోఁటగవ్వడిఁ బొడఁగాంచి మరుఁడంచుఁ
జేరుపూవిల్తు తేజీలనంగఁ
జిలుకలొకరెండు ముద్దులుచిలుకుచుండ
దిన్నెపై నున్న యెకిమీని కన్నుదోయి
విందుచెందంగ ముందఱ నందమొందు
పొన్నగున్నకు మిన్నునఁ దిన్నడిగియె. 60

క. ఆకై వడిడిగి కొండొక
ప్రమోఁకునఁ గూర్చుండిలేచి మగుడని మదితో
నాకవ్వడికన సొగసుల
ప్రోకలనం జిల్కలల్లఁ బుడమికి డిగుచున్. 61

చ. ఉడుగని పేర్కుతోడ మనమోహిని యింతకుముందు త్రోవలో
నెడసనుకొన్న దాని కితఁ డేతఱిఁ గన్గొని ముచ్చటాడి తే
వెడలుట మంచిమేలుగ దవేయని యాఁడొకచిల్క పంతగం
బడరఁగఁ బల్కెఁ గవ్వడికి నల్లవిసంబడఁ దోడిచిల్కతోన్. 62

సీ. అట్లు నేలకుడిగ్గి యాతండుగన్గొన
మురువుఁజూపుచుఁ గొంతపొంతనెలఁగి
ప్రోలసంపఁగిచెట్టు వాలుగొమ్మనుప్రాలి
చూడ్కికింపును సొంపుఁజూపుచుండె
నంతవివ్వచ్చుండు చెంతఁజిల్కలఁగాంచి
రాచిల్కలార మీరలనుకొన్న
దెయ్యదిత్రోవలో నెవ్వనితో ముచ్చ
టింపఁగావలెనిందు నెందులకును
మీర లేపని కరుగుచున్నా రలిపుడు
పయనమొకయింత గుదియించి పలుకరైన
నదియుమాకుఁ జెప్పఁగవచ్చు నదియొయైన
నించుకంతనిలిచి వినిపింపవలయు. 63

క. ఇందఱుముందఱ నిందది
పొందుగఁ జెప్పంగమీకుఁ బోలనిదైనన్
సందడిడిందఁగ నాతని
నెందైనఁ గొనిచని ముచ్చటింపఁగఁ జెల్లున్. 64

క. మీయందము చందము కం
దోయికి విందు గొలుపుచును దొందరనొందం
జేయుచున్నది మీపొం
దేయొడ నెడఁ బాయఁజాలఁడురే యెవరైనన్. 65

గీ. తనయ మీకనియ్యమైనఁ జెడునోయనుచు
నిపుడు మిమ్మింతగా వేగిరింపవలసెఁ
గాని మీచెల్వ కన్నారఁగాంచుచున్న
నెంతసేపైనఁ జూడనే యిచ్ఛవొడము. 66

చ. అనవిని చిల్కపల్కు నిటకారయ మేమరుదెంచుటెవ్వరిం
గనుఁగొని మాటలాడనయ! గట్టిగ దేవరవారితోడనే
మనవియొనర్ప వచ్చితిమిమామదిఁగల్గినదెల్లఁ బైనముఁ
జనుటయె కర్జమైనఁ జనఁజాలము నీకొలువింతసేయఁగన్. 67

క. ననుమీరడిగిన దంతయు
వినుఁడిఁక వినుపింతుమీకు వేడుకమీఱం
గను మంజువాణియందురు
నను నాచెలియె మృదువాణినాఁబడు నిదియున్. 68

సీ. చిత్రవాహనుఁడనఁ జెలఁగుచుండెడుతేని
వినియుందురాతని వీటినుండి
పలుకుచేడియఁజూడఁ దొలివేల్పు జగమున
కేగుచున్నార మెలమితోడ
రెక్కలునిమురుచు మక్కువవెలిచాన
చక్కెరతినిపించు చక్కఁజేర్చి
తనబిడ్డలుగనెత్తి తడవుగనిన తల్లి
వలెఁ బెంచుచుఁదనంతవారిఁగాఁగ
నొద్దఁగూర్చుండఁబెట్టుక ముద్దుచేతఁ
జనువుమీఱంగ నామెయె చదువుచెప్పి
చక్కఁ దిద్దుకొనియెఁగానఁ జదువులెల్ల
నొనర నఱచేతిలోనివై యుండుమాకు. 69

గీ. అదియటుండనిండిఁక వేగనరిగి యచటఁ
బల్కుపూబోఁడిఁబొడగాంచి పల్కులాడి
మరలిరావలెఁగావున మాకునివుడ
సెలవొసంగుము పోయివచ్చెదమటన్న. 70

వ. ఆవలంతి చిలుక మేలుబంతుల కాతండిట్లనియె. 71

గీ. తొలుతనేలకుడిగ్గుచుఁ ద్రోవలోన
దవ్వులను మనమనుకొన్న దానికితఁడె
తగును జెలియరో యంటివి దారిలోన
నేమిచెప్పకొంటిరి దేని కేనతగుదు. 72

గీ. అయ్యదిటువంటిదనిచెప్ప ననువుపడినఁ
గొఱఁతవెట్టక యానతీఁగూడుననిన
నలువలంకులుఁ దిలకించి చిలుకకలికి
కలికిపలుకుల వలపులు చిలుకఁబలికె. 73

గీ. మంతనంబున మాటాడు మాటయదియుఁ
బలుకవచ్చునె యోనుగా మంచితఱియు
నెవరుపెఱవారు లేరుగా యిందులోన
నన్నమనవారలెగద యీయున్నవారు. 74

వ. అనిన నతండు. 75

గీ. కలికిచూపునఁ గొలువెల్ల గలయఁజూచ
నేకతముగోరు నన్నగా నెల్లరెఱిఁగి
చూపుతోడన వడిలేచి చుట్టుచున్న
తోడివారలు దవ్వులఁ దొలఁగిచనిరి. 76

వ. అంత మఱింత చెంతకుంజరగి తేనిమోగంబునన చూపునిలిపి ముద్దులు
గులుకు కలికిపలుకులు వీనులకు విందుగొలుప నాచిలుక యల్లన నిట్లు
చెప్పందొడంగె.

మ. త్రొలుతం జెప్పితిఁ జిత్రవాహనుని నీతోఁ నేనిటన్ వానికిన్
గలదో చేఁడె కొమార్తె యొక్కరితె యాక్రాల్గంటి నీనేలలో
పలఁ జిత్రాంగదయండ్రు దానిచెలువాపల్కంబుపుబోఁడియుం
బలుకం జాలదనంగ నేటికిచటన్ మాబోంట్లవాక్రువ్వఁగన్. 78

గీ. కలువకంటి సింగారంపు గడలియందుఁ
గ్రాలుతాబేళ్ళఁ జందంబుమీలు మొసలి
కవయు ననఁగ నొప్పారిమీఁగాళ్ళు గొంతుఁ
గన్నుఁగవయును బిక్కలుఁ గరము వెలయు. 79

గీ. వెలఁది కమ్మవిల్తు విరివిల్లు కాఁబోలుఁ
గాకయున్న నేలగలుగు నడుము
ముత్తెములను వేర ముద్దులుగుల్కెడు
వ్రేళ్ళసందియానవాళ్ళు మూఁడు. 80

చ. నిలుకడగన్న క్రొమ్మెఱుఁగు నిక్కపుఁజేతలు పూఁసియెల్లెడన్
మెలఁగుకడానిబొమ్మ నునుమేనున గమ్మనితావులీను పు
వ్విలుతుని పూవుముల్కి తెలివిష్పుచొకాటపుఁ గన్నుదోయికిన్
బెళుకిడు తప్పపాటుగల వేలుపు ముద్దులగుమ్మ యారయన్. 81

సీ. వెండికొండదొరయా వెలఁదుక చనుదోయి
వలమురిమేటి యాకలికిగొంతు
రాయంచపయిదిట్ట యాయింతి నెన్నడ
తమ్ములచుట్టంబు కొమ్మకేలు
వలపులజేఁడు లాసెలఁతుక పెన్నెరుల్
చందురుమామ యీచానమోము
పాములమొకిమీఁదు పడఁతుకనూగారు
తేఁటిగంటిదంట లాతెఱవకన్ను

చిటులువేల్పుల ప్రోతియై యొప్పఁగుచున్న
కొమరుఁబాయంపు ముక్తియుఁగూడఁగల్గు
మేలుసమకూడెనేని యోనేలచేఁత
కోరు కోరికలెల్లఁ జేకూఱుటరుదె. ౮౨

గీ. తలిరుబొంతియొడలి మెత్తతనముకోడి
యొడలు లేనట్టివానికే యూఁచలయ్యెఁ
దొడరి మేనుంగు తెలనాగ నడకకోడి
నడకతప్పిన కొండలకడను జేరె. ౮౩

సీ. వాలుమించును మించువాలును వదలించు
మెల్లఁతుకకన్దోయి మెఱుఁగుటారు
వింటిజెళ్కును జెళ్కువింటినివదలించు
నాతుకకన్బొమల్ నడుముతీరు
తమ్మికెంపును గెంపుఁదమ్మినివదలించుఁ
బడఁతుకవాతెఱ యడుగుదోయి
మెఱుఁగుబంతిని బంతిమెఱుఁగునువదలించుఁ
గన్నియ నెమ్మెనుఁజన్నుదోయి
వెలఁది సోయంగ మేమని విన్నవింతు
నచ్చరలయందు జక్కులమచ్చెకంటు
లందుఁజలువరాకన్నియలందు నెందు
గనియు వినియు నెఱుంగ నీకలికికీడు. ౮౪

ఉ. చందురుమామ తమ్ములును జామమొగంబును బోల ముంపఁగాఁ
గందును మోమ్ముఁబాపుకొన గాల్కొనితామరసాటివచ్చె నె
మ్మిం దగవేఁడివేల్పు నెఱమెప్పుల నిల్కడలేకయుందు నా
చందురుఁడీసువచ్చుటకుఁ జాలక మారుతుఁడయ్యె దాసికిన్. ౮౫

క. ఎలనాగ వాలుగన్నులు
కలువలనుచుఁ జేరు తేఁటిగములనదల్పన్
దెలిచాన నడుమనుంచిన
యలరెడు సంపంగిమొగ్గయన ముక్కమరున్. 86

శా. నేలంగల్గు పులుంగులెల్ల నెపుడున్ జెల్వారఁబల్కంగ నే
నేలా పల్కఁగ నేరనైతినని యెంతేఁ గెంపుకన్నుల్గుతా
లోలోనందలపోసి నేర్చె నవలాలోఁ జేరి కాదంటిరే
నేలా కోయిలపల్కులంద్రు వినువారెల్లం బువ్వుంబోఁడికిన్ 87

చ. కలువలు తేళ్ళు వాలుగలుఁ గాటుకపిట్టలుఁ దేఁటిచాలుఁ దూ
పులుఁ దెలిదమ్మి రేకులును ముత్తెపుఁజిప్పలు మంచుగ్రోలు పు
ల్గులుననొప్పు తొమ్మిదియు గుబ్బెతకన్నులకోడెనంచుఁ గ్రే
వలఁ జెలువారఁ దొమ్మిదుల వ్రాసిరనంగను వీనులొప్పగున్. 88

గీ. అతివచనుఁ బూవుగుత్తుల యుండఁ జేరఁ
జానకెమ్మోవి దొండపండనుచు దుమ్మె
దలును జిల్కలుఁగా నల్కదడవునిలిచి
యారును బలుకులును నయ్యె నతీవ కెలమి. 89

ఉ. తుమ్మెదదిమ్ముసంపెగయుఁ దోరపుఁజీఁకటి చందమామయున్
దమ్ములు రిక్కచాలు మదిఁదాలిచి నెయ్యముఁ దొంటికంటుఁదా
మిమ్ములఁబాసి కూడెనన నింపగుఁ జూపులు ముక్కు చెక్కునున్
గ్రొమ్ముడి మోము గోము జిగిగుల్కెడు కేల్గవ యింతిగోరులున్ 90

గీ. చానసిద్ధంపు జిగిమేని చక్కఁదనము
వెలసితద్దయుఁ దెఱగంటి చెలువెదూఱు
కన్నియతళుకుఁ దెలివాలుఁ గన్నుదోయి
చెలఁగి మిక్కిలి తెఱగంటి చెలువెదూఱు. 91

మ. కనుచేఁపల్ బిగిఁ గుబ్బచక్కవల కేఁకంజూచి లోఁ జంకి వే
డ్కను జేరంజని మోముదమ్మురుచి యందంబేర్పడంగాఁ దా
మనికింబొక్కి-త్రి పుట్టువేవెదలి డాయంగాంచి వేఁడంగ వ
చ్చిన జాబిల్లియనుంగుకొమ్మలన మించెన్ ముత్తియంపుఁ బన్నరుల్. 92

గీ. మల్లెమొగ్గలజిగిఁ బోలుఁ బలుమెఱుంగు
బలుమెఱుంగునుబోలుఁ గమ్మమెయితేట
బోలిమెయిఁ దేటులనుబోలు వాలునెఱులు
వాలునెఱులనుబోలు నప్పడఁతి యూరు. 93

చ. మెలఁతుక చన్నుఁగొండలకు మీఁదను జందపుదిట్టనెంతయున్
జెలువుగఁ గొల్చి గొంతువెసఁ జందపు దిట్టతనంబు వూఁగఁగాఁ
గొలువుగఁ జుట్టువాలు దొరఁ బొందెఁ బిఱుందులు సైపలేక నే
ర్పలవడ వెన్నుఁజేరె నలపై దలికిల్జడ వింతదోఁపఁగన్. 94

చ. మఱుఁడనువేఁటకాఁ డతివబల్ చనుఁగొండలయందు ముత్యపుఁ
న్నరులను బియ్యమూసలఁ బెనంగఁగ మచ్చిడి యాడఁగాంద్ర య
బ్బురమగు డెందపుంబులుగు ముత్తెముఁబట్టుచు నీరుద్రావఁ ద
గ్గరఁ జనుబొడ్డుడిగ్గియుఁ గట్టినబంగరుచెట్టు లత్తుకల్. 95

గీ. జవ్వనపుదతిఁ గన్నియచన్నదోయి
కౌనుకలిమిదోఁచుకొనియొఁ గాకయున్న
నింతలోఁగుబ్బలకుఁ గల్మియెట్టులబ్బె
నేమికతమున నడుముకు లేమికలిగె. 96

గీ. జవ్వనపుఁదతిఁ గన్నియచన్నదోయి
కౌనుకలిమిదోఁచుకొనియొఁ గాకయున్న
నింతలోఁగుబ్బలకుఁ గల్మియెట్టులబ్బె
నేమికతమున నడుమును లేమిగలిగె. 97

సీ. చెలఁగి పలుచాలుఁగేలు మైజిగులఁబోలు
నాసదానిమ్మయు సిగుర్లు నలరు మొదలు
నఖముఁ దుదిలేని వేలుపుఁ గడఁగికొలిచి
తామునల్లె చనులఁ గొప్పఁ దఱులఁ బోలె. 98

ఉ. పోలఁగవెన్నుచూపె వరిపొట్టలు సేనుఁగుకేలుమోడ్చెఁ దా
మేలును బొట్టలోన దలపెట్టుకొనెం దలవంచెనంటులుల్
దూలుచు లేళ్ళుగడ్డితినెఁ దొయ్యలి పిక్కలఁ జన్నుదోయి మీఁ
గాళుల నిద్దపుందొడలఁ గన్నులఁబోలఁగ జాలమింజుమీ. 99

క. నెలయూమొగంబుజిగి వె
న్నెలయూ తెలినవ్వజవ్వ నెఱబంగరు గి
న్నెలయూ చన్నుంగవతి
న్నెలమూరె పిఱుందుదోయి నెలఁతకుఁదలఁపన్ 100

గీ. కాలియందెలక్ పాదులఁగలయఁ బెరుగు
నరఁటికంబంబు లెన్నంగ నతివతొడలు
దాసియూకువీపు చలువదలఁచిపాదు
కదిసినట్టి తాబేళ్ళు మీఁగాళ్ళుతలఁప. 101

గీ. చెలువ నెమ్మోము చందురుగెలువఁజూచి
యుడుగుఁదమ్ములిదియె మంచియదనటంచు
నతని కొమ్మల నీడ్చితెచ్చి తమలెంక
లుగ నొనర్చికొనెనన గోళ్ళొగిఁ జెలంగు. 102

చ. చిలుకలకొల్కి నెన్నడుము సింగపుఁ జెల్వముఁ జూపుఁ జూపు రూ
పులపవమించు మించులకుఁ బోఁడిమిమై జిగినించు నించుమి
క్కిలినగుఁబల్కు పల్కుదురు కెంపులసొంపులు మాపు మాపు వె
న్నెలఁగని నవ్వునవ్వు జిగివిద్దమెఱుంగు మెఱుంగుఁ జెక్కుళుల్. 103

గీ. మీలసేలఁజాలు వాలుఁగన్నులజాలు
మిన్ను చెన్నుఁ దన్నుఁ గన్నెకాను
మించుమించుమించు నంచయాన యొసలు
పొగరు మీఱు చిగురు ముకుడకేలు. 104

సీ. వెన్నెలగువ్వల వెలయించుఁజెలిచన్నుఁ
జన్నులనికువాలుఁ గన్నుదోయి
పుట్టుతావులమీఱుఁ బోలుఁదుకపొక్కిలి
మేనునుజెలువారు మెఱుఁగుటారు
పసిఁడితిప్పలసేలుఁ బసఁదుకమైపగి
పిఱుఁదులుసిబ్బెంపు బిగువుఁజనులు
కెంపుఁదమ్ములసిరిగెల్చుఁ గన్నియమోవి
కన్నులునునుపారు కలికియడుగు
తార మారాముద్దరాలి రూపమరఁగన్న
నడవిలోఁ గాయగసరుల నారగించి
చెట్టునీడలఁ బవళించునట్టి తపసు
లైనఁ జేరికొల్వరె యింతియడుగుదోయి. 105

చ. చెలువమె మావిగున్న యలచెల్వపుఁగొమ్మలె చేతు లంటపుం
జలిరులె కేలుదోయి నెఱతావులపూవులె గోళ్ళుతేనియల్
గోలఁకెమ్మపండ్లె గుబ్బగవ లోఁతగుతోఁట్రయె ప్రొద్దు పండ్లకై
చెలువుగఁదోఁచువెల్వడిన చీమలబారులె యారు కన్గొనన్. 106

ఉ. తమ్ములుకన్నదోయి బలితమ్ములు మేలిపిఱుందు లెంచఁగు
త్తమ్ములు గుబ్బ లేనుఁగులతమ్ములు నెన్నడలెన్న మించు మొ
త్తమ్ములుమేను కెంపుసయితమ్ములు చేతులు కమ్మవిల్తు చే
తమ్ములు మాపు వీచులకితమ్ములు పల్కులు ముద్దుగుమ్మకున్. 107

ఉ. అనఘమోము చక్కఁదనమాతళుకుంజిగి చెక్కుదోయి యొ
ప్పా నిరుపేదకౌను సొగసౌ వెలిత్రక్కు విసాళిచూపుసం
బానిసవాలుగన్బెళుకు లాజిగినిద్దపు మేనిసోయగం
బానునసోగపెన్నెరుల యందమయారె యొయారికే తగున్. 108

క. అమ్మచ్చెకంటి చక్కఁద
నమ్మంతయుఁ జెప్పఁదరమె నాకిపుడుఁదు నం
దమ్మెన్నఁగ నొకనాఁడౌ
నెమ్మొగమెన్నంగ నొక్క నెలయౌఁజుమ్మా. 109

గీ. అనుచువెండియు నేమివోయనఁగఁడంగు
చిలుక నరచేతనేమొన్ని చెలువమీఱఁ
బలికెనాతండు తాళుమోచిలుకరాయ
వలదు నీమాటకడ్డంబు వత్తునిపుడు. 110

గీ. నన్నుసైరించి నేనిపుడెన్నఁ జోవు
పలుకువిని దానికిని మాఱు పలుకవలయు
నింతదోఁపంగ నాత్రోడ నింతదనుక
తేటగానీవు పలికినమాటలందు. 111

క. "వెలిచాన నడుమనుంచిన
యలరెడు సంపంగిమొగ్గ" యని చెప్పితివా
చెలువను నామెఱయొనర్చెనో
కలుగునో వేఱొండు తెఱఁగు కలయది చెప్పుమా. 112

గీ. అనినఁ జిలుక పలుకు నా చెలిచానయె
చేసె నానెలంతఁ జెప్ప కింత
వఱకు నున్కిసైపవలయును బయనంపుఁ
దొందర మును చెప్పఁదోఁచదయ్యె. 113

నలువరాణియుఁ దానుఁగొలువుండఁ జిరొక్కనాఁ
డచ్చరల్ చనుదెంచి పాడిచనిఁ
పిమ్మటఁ గొంతసేపమ్ముద్దుగుమ్మల
చక్కఁదనంబులు చాలఁబొగడి
మాటవెంబడి వారిసాటివారలఁజేయఁ
దనకెగా కొరులకుఁదరముగామి
మాటికిఁజెప్పిన మగఁడుఁ దానునుజేయ
రాక వచ్చునెడవాదుసల్పి
వారిమీఱువారి నిచేయవచ్చునెడు
మాటపట్టింపుఁబట్టి యమ్మచ్చెకంటి
యీచెలినొనర్చి పంతునెగ్గించుకొనియె
నలువగరువంబుదిగజాఱెవాఁటినుండి. 114

ఈయతివఁబోల నలువకుఁ
జేయంగాఁదగిన నేర్పు చేకఱుమినిజం
బోయేలిక చేకుజానే
నాయన యొందైనఁ జేయఁడామున్నెపుడున్. 115

దారినేతెంచుచుఁ దడవాండ్రొరులతోడ
వెలఁదిచక్కఁదనంబె వేయినోళ్ళఁ
బొగడిమెచ్చుచు నామెసొగసున కెవ్వండొ
తగుమగండనియింతతడవు మేము
పరికించుచున్కి నిప్పట్టున మిముఁగాంచి
మీచెల్వొకనులారఁ జూచిచాల
మదినచ్చెరువుఁబూని మాలోననేఁడుగా
కలికికీడగువానిఁ గంటిమనుచు

సంతసము పట్టఁజాలక సరగడిగుచు
నంటిమీఁతండ్రి తగునని వింటివిగద
గడియయును మాకునిచ్చుటఁ దడయఁదీఱ
దేగివత్తుము మఱచిపోయెదవుసుమ్ము. 116

క. అనివీడ్కొని రాచిల్కలు
వినుత్రోవను మీఁదికెగసి వెసఁజూపునకున్
గనఁబడక సాగిపోయెను
గనుచుండెడి ఱేనిచూడ్కి కళవళపడఁగన్. 117

వ. అనిన తరువాతికత చెప్పుమని జనమేజయుం డడుగుటయు. 118

సుగంధివృత్తము.

పొన్నగున్న నెక్కి గొల్లపువ్వుబోండ్ల తోఁకుతర్క
వన్నెమీఱఁ జేతులెత్తి పల్వురొక్క చెల్వునన్
జెన్నుమీఱ మ్రొక్కుకున్నఁ జేలలియ్యనందు నాఁ
డన్నపంతు గెల్చుకొన్న యట్టిదిట్టవేలుపా. 119

కందము. గోమూత్రికాబంధము.

దరివిసమిడఁ జనుకొమ్మం
బొరిగొని తెలివొందు పైఁడిపుట్టమురాయా
పొరిఁగసవొడలను గ్రమ్మం
చెరిపిని జెలినందుఁగూడి దిట్టగురాగా. 120

గద్యము.

ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధమహాకావ్య రచనాచాతురీధురంధర సద్యశోబంధుర కందుకూరివంశపయఃపారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్య పుత్ర సుజనవిధేయ వీరేశలింగ నామధేయప్రణీతంబయిన రసికజనమనోరంజనంబను ప్రబంధరత్నంబునఁ బ్రథమాశ్వాసము.

రసికజనమనోరంజనము.

ద్వితీయాశ్వాసము.

క. సిరి యెడవాయక యొమ్మున
సిరవుకొనంగొలుచువారి నెల్లరనెమ్మిం
జిరముగ నేలుచు గడలిన్
బఱగన్నెలకొన్న వేల్పు వలమురిదాల్పు. 1

వ. అంత వైశంపాయనుఁ డమ్మీఁద నడచినకత జనమేజయున కిట్లని చెప్పందొడంగె. 2

ఉ. వలపులమేలుకొల్పు తెరువర్ల తలంకని కీడుపల్లగా
దమ్ములకును మన్కిపట్టు మరువ్రాఁకకు వేఁడనితోడుపాటుఁ గా
చిలుకలమేలు జాజికిని జెప్పఁగరాని విసంబు గంటఁగన్
యిలలకు నోముపంట చెలువేమని నామనివచ్చె మెచ్చఁగన్. 3

గీ. వీఁకవచ్చునామనిజేని రాకకలరి
తొంటిపసపుఁజీరలువిప్పి కోఁపుచీర
లెలమిఁదీఁగె చెల్వాలుదాల్చి యొసఁకమొసఁగు
పగిదిఁ బండుటాకులురాలి చిగురులొదవె. 4

సీ. చెట్లకన్నిటికిని జెడిమున్నె పోయిన
పరిలేనితావులు మరలఁగలిగె
జాజికొమ్మకు మున్ను జనగని మరితూవు
లరసిన నొకటియునంటకుండెఁ
గోయిలగమికెల్ల గ్రుడ్డప్పటియునుండి
గల కాకిమూఁకల చెలిమివదలెఁ

బెనుమావికొమ్మకుఁ బెద్దతడవు లేని
కోయిలపల్కుల కొమరుగలిగె
నింతకెన్నఁడు నిలుకడ నెఱుఁగనట్టి
గాలికిమ్మాయి నెమ్మది చాలఁగలిగెఁ
జెప్పనొప్పును యామనియొప్పిదంబు
చిలువయెకిమీసికైనను నలువకైన. 5

సీ. పొంకమగుచుఁజను పూవుగుత్తులనొప్పి
కోయిలపల్కుల కొమరుమిగిలి
ముగ్దలుగులకేఁడు మొగలిరేకులమించి
చెలువంపుఁబాపటఁ జెన్నుమీఱి
వింతవింతలతీఁగె దొంతులసొగసూని
పలుమల్లెమొగ్గల చెలువుదాల్చి
బొట్టుగలకడింది పొలుపున నలరారి
మోవిచిగురుల బలిమిఁ బడసి
యామునేనుఁగు నడకల నల్లదనరి
కన్నులకుఁ బండువొనరించెఁగాన లచ్చి
యెల్లవారికి సంతస మెదలలోన
వెల్లిగొలిపి యయ్యామని నెల్లతఱిని. 6

గీ. పురుడులేకుండ నక్కానపువ్వుబోఁడి
యలరు కొమరుఁగనిన వల్కులాలకించి
యీడులేకుండ నత్తఱినెల్లపులుఁగు
గములుఁబిల్లలఁ బెట్టంగఁగడఁగెఁ గడఁక. 7

చ. కొలఁకులనాడుచుం బొగడగున్నల డాఁగురుమూఁతలాడుచుం
దొలఁగక చల్లులాడి పువ్వుదుమ్మెగఁ జిమ్ముచుఁ దీవెతూఁగుటు

య్యెలలనునూఁగి పువ్వుపొదరింట్లను దూఁటికడచ్చి తోఁటలో
నలరులు రాల్చుచుండిరి నామనిఁ జెన్నార పిన్నతెమ్మెరల్. 5

చ. వలిపుఁబుప్పొడి కాలువల పజ్జలఁ గూని యొయ్యలాడి మే
ల్చలువలఁ దాల్చి గామ్ముఁ జెలువారఁగ మల్లెఁబూవుఁదోఁటలో
నలరుల కొమ్మఁజేరి చిగురాకు మునుంగుఁ దొలంగఁజేసి యా
వ్వైల విరిగుబ్బగుత్తులను వ్రాలుచుఁ గైకొని తావులంటెడున్. 9

క. అలరులతేనె వానగను హాయిగ మ్రోయుచు నేగుతేఁటిబా
ళులు ఝుమ్ముల జెలఁగు మొయిలుఁగఁగాఁగఁ జెలంగిపాయు కో
యిల రొదనెమ్మికాఁ తగను నెల్లెడఁ గ్రొజ్జఁగఁ బూచెరువం
కలగమిగాఁగ నొప్పి వనకారు చెలంగెను వానకారనన్. 10

సీ. వాతెఱముఱుఁగైన పలుచాలు చూపుచుఁ
చిగురాకులో లేఁత మొగడలమర
గబ్బిగుబ్బలనొప్పు కప్పుటానరులునాఁ
బూలగుత్తులఁ దేఁటిచాలుదనరఁ
గైదోయినలఁదిన గందంపుఁబూఁతనాఁ
గొమ్మలఁబుప్పొడి కొమరుమీఱఁ
జెమ్మటఁ బోవించు చిఱువీవెనయనంగఁ
బండాకుగాలిచేఁ బ్రక్కఁగదలఁ
బాదలు వేడుక ముద్దులు మూటగట్టఁ
జాలుసింగారములు వెదచల్లుచున్న
పూవుఁదోఁటను గైసేసి తావి తియ్య
కన్నెమామిడి యొక్కటి చెన్నుమీఱె. 11

చ. చిగురుఁ గటారినాటి వెనకింగిని కేలనమర్చి మారెలం
దగినొఱవంక పొంజుగడు దాడిగ రావడి నారిదీటుచుం

బాగరుసఁ జిల్కుతేజిమళుపుల్ దమికింపుచుఁ దేఁటులార్వఁగా
జగములమీఁదికిన్వెడలెఁ జక్కెరవిల్తుఁడు మచ్చరంబునన్. 12

వ. అట్టియామనియందు. 13

ఉ. పన్నగనన్ను మిన్న చెలువమ్మటు వీనులవిందుగాఁగ ము
న్నన్నదివిన్నవించి చిలుకల్దగమిన్నునఁ జన్ననుండియున్
గన్నియరూపు కన్నుఁగవఁ గట్టినయట్టుగ బిట్టుతోఁపఁగాఁ
గన్నులవింటిదంట తనకై వడి చూపెను క్రీఁడిపై వశిన్. 14

సీ. కనఁబట్టయెదుర నిల్చినవారలనునైనఁ
గనియేనియు నఱగంటఁజూచుఁ
జెవిఁజొనుపఁ డొరులుచెప్పెడుమాటలఁ
జొనిపెనేనియు నేమిటనుచునడుగుఁ
బలుకరించఁడు తనచెలికాండ్రనైనను
బలుకరించిన వెడపలుకుపలుకుఁ
బిలిపించుకొనునుదాఁ బలుమాఱుఁదిండికి
నెంతసేపటికిని నేగకుండు
మిన్నుమన్నునుగానక మెలఁతమీఁది
కూర్మిఁ బలువింత వలవంతఁ గుందుచుండె
నడుమునసిరియెత్తుకొన్నచో మిడిసిపడెడు
ములుచమాపసిఁబోలి యప్పుడమిఱేఁడు. 15

సీ. గట్టువిల్కాని నెక్కటి నోర్చినగండు
చెఱకువిల్తునిమీఁదఁ జెల్లదయ్యె
మింటిమీనును గూలమీటినయుదుటింతి
కనుమీలమీఁదను గదియదయ్యె
వింటివారలనెల్ల వెఱపించులావన్ను
బొమవిండ్లపైఁ జూపఁ బొసఁగదయ్యె

జగములెల్ల నుగ్గాల్పు పొగరుగ్గనిపించు
దీవులమీఁదను దివురఁజయ్యోఁ
డాల్లి ద్రోపది పెండ్లిముందల్లమీఁను
నొక్కయేటునఁ జడసేసియున్న నాఁటి
మగతనం బేమియు నిచటమఱచి మీఁను
నెదుటసాగింపలేఁడయ్యో నిపుడు క్రీడి. 16

క. చాలమునుచిల్క చెప్పఁగ
నాలించిన చెలిపిలుందు నందపుఁజూపున్
నేలకుఁగోలకుఁ దెచ్చెను
వాలాయము జేసి మేనుఁ బలుడెందంబుల్. 17

సీ. ఎన్ని తీసినఁ గ్రమ్మఱ నెప్పటట్ల
యూరుచుండెను జల్ తూపులున్నవాని
రెండుమూఁడమ్ములున్న మరుండె గెలిచె
నహహా నలువచెయువుల నేమనఁగవచ్చు. 18

ఉ. ఆమనిఁగోయిలల్ చిలుక లామని సేయఁగఁ దాళ లేక లోఁ
దామరకంటి నెన్నుచును దామరలింపఁగరాని కోర్కితో
వేమఱుఁ బుంటవిల్లుగాని వేమరుఁ జేయఁగ నొచ్చికుందు నా
లేమనుజూడ కిప్పుడెటు లేమనువాఁడ నటంచు నిచ్చలున్. 19

గీ. ఏకంతబున ననబోఁడి నెదనుదలఁప
నేకతంబున ననవిల్తుఁ డేయకుండు
నలరువింటను నన దూపులల్లఁ దోడిగి
యలరువింటను నడయాడు నరదమెక్కి. 20

వ. ఇట్లు చెఱకువిలుకాఁడు పఱపు కలుకుటంపలు నెఱకులు దూఱ
నోరువలేక యాకవ్వడి పంతుక తనకన్నులం గట్టినట్టులయినఁ
దనలోఁదానిట్లని పలవింపఁదొడంగె. 21

చ. కలికిరో యిప్పుడేమి యలుకాయలుకా పలుకాడవిట్లు న
న్నలమటఁబెట్ట నాయమగునా తగునా తెగునాయిఁకింతటన్
వలపిది యేలుకొమ్ము మగువా తగువా పగవానియట్ల నన్
దలఁపఁగ జాలిచూపవలదా వలదావలఁదాళనేర్తువే. 22

ఉ. నాయనుఁగున్వొలంది తగునాయను నీవెతసైఁ చువాఁడ నే
నాయను మీఁదఁ దాళఁగలనాయను నన్నిటులేఁచనాయమా
నాయనుఁ గూర్మిఁదప్ప నగునాయనుఁ జక్కనిగుజ్జుమోవి గ
న్నాయనుఁ గిన్కఁజూప నదనాయను నేఁబగవాఁడనాయనున్. 23

వ. అనిమఱియుం దనలోన. 24

ఉ. దాని మెఱుంగు జెక్కులును దాని చవుల్దులకించు మోవియున్
దాని నిగారపుందొడలు దానికనుంగవ దానిగుబ్బలున్
దాని యొయారపున్నడలు దాని చొకారపుమేని చెల్వముల్
దాని మొగంబునందమును దాని హొయల్లనఁగాంచు టెన్నఁడో. 25

వ. అని యిట్లు. 26

గీ. పుడమియంతయుఁ గలిగియుఁ బొడవుమలల
వంటి పసిఁడిగుట్టలుగల్గి పడఁతిపిఱుఁదు
దీవులను జన్నుహొన్ను బిందియలఁగోరు
ననయమాతఁడు దొరలకుఁ దనివిగలదె. 27

సీ. నెలఁతుకమోవి శ్రేనియలానఁగాఁగోర
నేచవియును నాల్కకెక్కదయ్యెఁ
బడఁతుకమైతావి పసరొఱుంగఁగఁగోర
ముక్కునకేతావి సోక్కదయ్యెఁ
జిలుకలకొల్కి నవ్వులుకులువినఁగోర
వీనులకేపాట వెలయదయ్యెఁ

క్రాల్గంటి నెఱసోయగముఁ జూచి, కాఁగోర
నొంచెడికన్నులకొప్పుదయ్యెఁ
చిలుకబోఁడి నెమ్మోవి మెత్తఁదనముఁ గోర
నొడలికిని బడదయ్యెఁ వేఁజూఁకటిసోఁక
కేమిచెప్పుదుఁ గప్పురయింటికొక్క
దానిఁ దక్కంగ మఱి యున్న వాసిమఱచె. 28

గీ. ఇట్లు నెలఁతమోఁది యెడఁద్రిప్పుకొనలేక
యలరుఁదోటకేగనన్ని యచటఁ
జక్కఁబడునటంచుఁ జనియెఁ బూఁదోఁటకుఁ
జెలులుకొందఱవలఁ జేరిరాఁగ. 29

సీ. బలుమల్లెమొగ్గలు పలుచాలువలఁపించుఁ
దుమ్మెదల్ కురులచెల్వమ్ముఁజూపుఁ
జిగురుటాకులు కేలిచెలువంబు వెలయించు
నేనుఁగుల్నెన్నడ నెన్నఁజేయు
దొండపండులుమోవి నిండుచెల్వముఁజెప్పు
సంపంగిననముక్కు పెంపునుడువు
నరఁటిచెట్లు తొడలయందమ్ముఁగాన్పించు
జిలుకలుపలుకుల చెలువుఁదెలుపుఁ
జానరూపును మఱపంగఁ గావకేగఁ
దెఱవరూపుఁ దక్కఁగ నన్ని మఱచిపోయెఁ
దప్పనే తానొకతెఱంగుఁ దలఁచుకొనఁగ
దయ్యె మొండొకతెఱఁగుఁ దాఁదలఁచునటుట. 30

ఉ. కమ్మని తెమ్మఁదెమ్మెరలు గ్రమ్మఁగఁ గమ్మనివింటిపంట పూ
వమ్ములు చిమ్మ జుమ్ముమని యామునఁ దుమ్మెదదిమ్ముదిమ్మరన్

గొమ్మలనెమ్మొలిమ్మొలను గూయఁగఁ జెమ్మట గ్రమ్మితమ్మిలోఁ
గ్కమ్మడి దొమ్మిసేయ దొర యుమ్మలికం బువుఁదోటఁ గ్రుమ్మెఁబోఁ.

సీ. అదెకొమ్మకాఁబోలుననిడాయుఁగాకున్నఁ
జెట్టుకొమ్మయటంచుఁజెప్పఁదివురుఁ
గలికి కప్రంపుఁ బల్కులనిచేరుఁ గనక
ముద్దుగంబూరంపుముక్కలనును
మోవిచివురటంచుఁ బోవునుగాకున్న
మోవిచెట్టులయాకు మొలకలనును
విరిగుబ్బలవెయంచు నరుగునుగాకున్నఁ
బూగుత్తులంచును బోసఁగఁబల్కుఁ
గానలోపల నెల్లెడఁ గానిపించు
నలరుఁదీవెలఁ గోయిలపలుకుగములఁ
బొన్నకాయల మంకెనపూలఁజూచి
చెలిమికాండ్రకుఁ దనగుట్టు తెలియకుండ. ౩౨

వ. అప్పుడొక్క చెలికాఁడు విశారదుండనువాఁ డదియెల్ల నల్లన
నల్లంబునం దెల్లంబుగాఁ దెలిసి మెల్లనఁ దనప్రోడతనంబు వెల్లడిగాఁ
గప్పుడి యొడలు నెవ్వడిందడవి యాతనితోడ జాడగా నిట్లనియె. ౩౩

ఉ. దేవరమేనికాఁక చలిదేఱదు తావులఁగుల్కు కొమ్మలం
దావలి మేలికొమ్మఁగని యారసి యావిరిగుబ్బగుత్తులన్
బ్రోవగుకప్రపుంబలుకు మొత్తములుం బలుమల్లెమొగ్గలున్
మోవిచొకాటపుం జిగురుఁబూనికఁగూర్చినఁ గాకమానునే. ౩౪

గీ. ఇపుడు కాఁకదీఱ నెందైన నారసి
గొబ్బుననుగడంగి కూర్మిచిలుక

వెఱయు పంచదార పలుకులు నీకబ్బఁ
జేయవలయు నేమి చెప్పుమయ్య. 35

వ. అనినం గూరిమిచెలికాని నేరుపు మాటలచేత నాతండు చిలుకతం
దనకు నడచిన నుడువులచందంబును దనచెందం బొక్కచక్కెర
బొమ్మయయిందగిలి మక్కువం జిక్కియున్న తెఱంగును నెఱింగించి
తలపోసి తెంపుచేసి యింక నెయ్యునికడం దన యుల్లంబులోని
కోరిక చెప్పక కప్పిపుచ్చుట కర్జంబుకాదని యెంచి వెంటవచ్చినవారి
నెల్లర నాయాపనులు చెప్పి పొగనంపి మంతనంబున సంగడికానితో
రాచిలుకలు వచ్చినది మొదలుకొని నేటిదనుకం జరిగినదంతయుం
బూసగ్రుచ్చినట్లుగాఁ దెలిపి యిట్లనియె. ౩౬

ఉ. ఇట్టుగనుండె నాచెలిమియెల్ల నిఁకేమని తిట్టుకొందు నాఁ
డట్టులు ప్రేముడిం జిలుక యాచెలినుద్దులె తెల్పెనోఁ జెవిం
బెట్టక యూరకుంటి నిటుమించినదానిని త్రవ్వుకొంచు నేఁ
డిట్టులు కన్నువిల్తు విరితూఁపులు నాఁటఁగనుంటి నక్కటా! 37

ఉ. గుట్టునఁ జేడె వీడుగఁ గోరిక లీరికలెత్తి నోరికిం
దొట్టినయంతఁ బంతమున దోసపుసిగ్గొక టడ్డువచ్చినన్
గట్టిగ నోరునొక్కఁ దమిగన్పడనీయక కట్టిపెట్టి యా
పట్టున రాచనీటు గనుపట్టఁగ వట్టిమెఱుంగు వెట్టితిన్. ౩౮

ఉ. ఏనపుడంతయున్విని యిట్టటు పల్కక యూరకుంట యే
మో నగుఁబాటుగాఁ దలఁచి ముందఱ నెద్దియుఁ బల్కఁగొంకి నా
యానతిఁ బొంది చిల్కచని యవ్వల నెల్లిదమైతినంచయో
తానిదఁ జిన్నవోయెనొకదా యిఁక దానికి నేమిసేయుదున్. 39

క. అనిమిగుల వగలఁ బొగిలెడు
నతఁగుం జెలికానిలోని యలజడి వోవన్

జనువున మాటలు చెప్పుచుఁ
గొనిచనియె విశారదుండు కొండొకయెడకున్. 40

క. అటు నెయ్యునిఁగొని చనుచుఁ
దటుకునఁ జెలికాండ్రకెల్ల దగుపను లెలమిన్
దిటవుగనుజెప్పి వారల
నటునిటువడిఁ బంపివేసి యాకుఱ్ఱఁడొఁపన్. 41

వ. ఇంతంతనరాని సంగడికాని వలవంతం దలంచి తల పంకించి మరుని మీఁదఁగినుక నొడమి. 42

గీ. మూఁడు కన్నులవానితో మొనసిమున్ను
చచ్చిబ్రతికియు వలతేఁడ చలముతోడ
వేయికన్నులదేవర బిడ్డమీఁది
కే మొగంబునవచ్చితివిపుడుమరల. 43

గీ. అనుచు మరుదూఱిముందుచేయుంగ వలయు
కర్జమెదలోనఁ దలపోసి కాంచియొకటి
మదికి సరిపడ్డపిమ్మటఁ బొదలు వేడ్క
సరగఁ గ్రీడికిట్లనియె విశారదుండు. 44

సీ. ప్రముచ్చులచేనల్ల పుడమివేలువునిన్న
నావునుగోల్పోయి యారటమునఁ
దనయావు విడిపింపుమనుచు నీయొద్దకుఁ
బరువెత్తుకొనివచ్చి పలుఁదెఱఁగుల
వేఁడిన నాతనివిన్నపంబాలించి
కనికరంబున మదికరఁగఁబాఱి
విల్లుదెచ్చుటకును వెడలి పరాకున
నన్నద్రోవదితోడనున్నతఱిని

బడకయిలునీవు వడిఁ జొరఁ బాఱుకతన
మున్ను మీలోన మీరు చేకొన్నయట్టి
కట్టుఁబాటున నొక్కయేఁడ కట్టైనీవు
పుడమివలగొని తిరుగఁగఁ బూనఁజేసె. 45

క. ఈపండ్రెండు నెలలు నే
నోపిక నీతోడఁదిరిగి యొక్కటవినుమే
నాపడఁతుక యూరారసి
యేపగిదినైన నీకు నింతినిఁగూర్తుఁగా. 46

గీ. ప్రతినకడచను నందాఁకఁ బదిగనీవు
తమకపడకుండ నెట్లైనఁ దాళుకొమ్ము
పిదప నీకోర్కి పండింతు మదినినమ్ము
మనుచు నొడఁబడఁగాఁ జెప్పి యతనిఁగొనుచు. 47

గీ. చనియె రాచనగరికి విశారదుండు
క్రీడి పయనంపు వేడుక క్రేళ్ళుదాఁట
నెప్పు డెపుడంచు నిముసంబె యేఁడుగాఁగ
నుండెఁ జిత్రాంగదయుఁ దనయూరియందు. 48

ఉ. ద్రోవదిపెండ్లియప్డు డొకతూపున మచ్చెపు జంత్రమేసె నం
చావలవీరువారు నటనాడికొనం జెవులార విన్న నాఁ
గావున నాఁటనుండి మదికవ్వడియందునె నిల్పియుంట సం
దై విరివింటికంట యలరమ్ములు చిమ్మెను గొమ్మకొమ్మనన్. 49

గీ. ఇంతితెల్లఁగంటి దొరపట్టి నెదను నిలుపఁ
దనకుఁ దెల్లగంటితనమబ్బెననఁగ నపుడు
విడిచెనిద్దుర తిండియు నుడిగిపోయెఁ
బ్రొద్దులెంతయుఁ బడఁతికిఁ బొడవులయ్యె. 50

గీ. నిమర లేకుంటఁ జెమ్మట నిండుటయును
వెసను వేల్పుఁదనమును మానిసితనంబు
నెపుడు నెమ్మనఁ గాన్పింప నెల్లతఱిని
గాంచె నరమోడ్పు క్రాల్గంటి కన్నుదోయి. 51

సీ. పువ్వులుముడువదు పూబోఁడియయ్యువి
తోవవిందునల్లుని తూపులనియొ
యద్దంబుఁజూడదుముద్దియ దానఁ గ
న్పడుమోము మున్నీటిపాపయనియొ
కఁరులుచేముట్టదు విరిబోఁడియయ్యువి
క్రొవ్వారుతుమ్మెదగుంపులనియొ
చెలులపల్కులు వినచెలనాగయవియెల్లఁ
జిల్కమొత్తంబుల పల్కులనియొ
యంతకంతకు వలవంతవింతదోఁప
మరుఁడు పూముల్కులడరించి కరము నేఁప
నెడఁదఁ గవ్వడిపయిఁగోర్కి యేపుచూప
సన్నగాలియు నెమ్మని చెన్నుచూప. 52

చ. చెలులను మాటికింగదుమఁ జిల్కలఁ బల్కుటఁ పీసడించు నం
చలఁదఱుముఁ నెమళ్ళనోగిసా రెకుఁ బాఱఁగఁదోలు గండుఁగో
యిలపలుకుల్ వినందలకు నేఁచికలంచును గోరువంకలన్
గలికి మదింగడింది వెతగల్గిన రోఁతలుగావె యన్నియున్. 53

గీ. బోటినెమ్మను బంగారపకాటనపుడు
కమ్మవిల్కానిచిచ్చునఁ గరఁగుచున్న
దోయనంగ మైఁజెమ్మట యొప్పుమీఱఁ
వెల్లువగుచును బాఱెను బెల్లుదవరి. 54

సీ. ఆవెల్లత త్రపడి యతఁడోడ శ్వేర్పక
వెలను వెం(డుకఁ బెల్లఁ బులక నగునె
యల్లమానిపిసింగ మకుఁటకంజేర్పక
యుంచుపిల్లుని జెడరింపనగునె
మాపజడారచక్కఁ జామోము దార్పక
కొంపము దాయించవలోఁ గారఁగనగునె
యల్లజగముచుట్టు మలరించి వేలక
తుమ్మెదమిమ్ముపైఁ గ్రమ్మనగునె
యనుచు నయ్యింతి సగము నంతికంత
కొనిలిచినచోట నిలువకుండుఁ జెల్ల
దనముపూను వెన్నెలకును దలముడుంపుఁ
బలిరుపిల్కుని కాఁకకుఁ దాళలేక. 55

గీ. చిగురుబోఁడికిఁ గోయిలల్ పగవియయ్యెఁ
గొమ్మ కెంతయుఁ దెమ్మెరకూళయయ్యె
నలరుఁబోఁడికిఁ గిట్టనివయ్యెఁ దేఁటులుఁ
దమ్మికంటికి రేఱేఁడు దాయయయ్యె. 56

చ. మరునకుఁ దూపు నేనరయ మామవు నీవును గానవట్టిచో
నిరువురకిట్టి వట్టిపగయేటికిఁ బాటియె యంచుఁ దెల్పి చం
దురునది దేర్ప నాతని నెదుర్కొనఁ దామరచేరెనో యనన్
దరియెఁగఁ జేర్చెఁ జామ చెయి దామరచెక్కున వెచ్చనూర్చుచున్. 57

ఉ. కన్నులకాటుకం గలిసి కల్కిచనుంగవమీఁద జిందు వా
ల్గన్నుల నీటితుంపరల గౌరవమొప్పఁగనయ్యె నయ్యెడన్
జెన్నసలారు తామరల చెల్వపుఁదేనియలాని యంతటన్
గ్రొన్ననగుత్తులం గదియు కోరికనేగెడు తేఁటులో యనన్. 58

ఉ. పుత్తడిచాయ మోమునకు ముక్కున కత్తికిఁ జెక్కుదోయికిన్
బొత్తుగ వెల్లదమ్మి నువుఁబువ్వును జిందము నిగ్గుటద్దమున్
గుత్తగఁ బోల్చి కబ్బముల కూర్పరులాడినమాట చెల్లెనా
నిత్తఱిఁ జానమేను తెలుపెక్కెను బువ్విలుకాని కాఁకలన్ 59

ఉ. అప్పుడు ముద్దురాలివిత్రమారసి సందియమొంది నెచ్చెలుల్
మెప్పొదవంగఁ జేరఁజని మేనొనిమించుక పట్టిచూచి కే
ల్నిప్పులమీఁదఁ బెట్టినటు నెట్టనఁదోఁచిన నుల్కుచెంది యా
రొప్పులకుప్పతోడఁ జెలులొక్కట నిట్లనిరమ్మలంబునన్. 60

సీ. వీనుదోయికిఁ జాల విందుసేయుచు వీణె
మెల్లన కొనగోట మీటనేమి
ముద్దుఁబల్కుల నింపుపుట్టంగ నెప్పుడుఁ
బెంపుడుఁజిల్కలఁ బిలువవేమి
యఱచేతఁజప్పటల్ చఱచి హెచ్చరికతో
నింటి నెమ్మళ్ళ నాడింపవేమి
చవితిచందురుదాఱు చక్కనినుదుటిపైఁ
దేటకస్తురిబొట్టు దీర్పవేమి
కలికిరాయంచబోదల గారవించి
తీరుగా నెన్నడల్ తగదిద్దవేమి
మేలిమిపసిండి క్రొంజాయమీఱుఁజాలు
మేన నాడెంపుఁ దొడవులుపూనవేమి. 61

గీ. మగువ నీతెఱఁగేమియో మాకుఁజూడ
వింతగాఁదోఁచుచును గడువెఱపు గొలుపు
చున్నదిదె వేడుకొనెదము నిన్ను మేము
చెచ్చెరను నీదుమదివంత చెప్పవమ్మ. 62

సీ. ఎంతవేఁడిన మదివంత నిగురుబోఁడి
సిగ్గుపెంపునఁ జప్పనఁ జెప్పలేక
యుల్లమల్లాడఁ దలవంచి యూరకున్న
మఱియు నిల్లని రప్పుడా మగువలెల్ల. ౬౩

సీ. ఎట్టికెట్టును మాటాడనిట్టిదనుచుఁ
బెలిచి చెప్పుకొంచిన నేమి పెద్దయొట్ట
పెంచు బాసఁజేసియు నిప్పుడకట మఱుఁగు
వెట్టఁదలఁచుట మిక్కిలి వింతయమ్మ. ౬౪

క. మనలో నిట్టివిగలవా
యని మఱిమఱి మెదలువిఱువ ననుఁగుంజెలితో
మనమనుకొన్నది యిచటని
కనికరమొనయంగ మఱువఁగావలెననుచున్. ౬౫

సీ. అల్లద్రోవది పెండిలియప్పుడు క్రీడి
చేసిన కడిందిపనులును వాసిగన్న
యతనిచెలువంబుఁ జెవులార నాలకించు
కతనఁ దనడెంద మొక్కట నతనిమీఁద. ౬౬

క. తగులు బెఱిఁగించి యప్పటి
దగు తనచెల్లెలిఁ దెలిపి యనుఁగుం జెలియం
దగ మణిరేఖంగనుఁగొని
తగులుపడంగను నెలుంగు దానిట్లనియెన్. 67

చ. కలుగునొ లేదొ కన్గవకుఁ గన్నులవిల్తుని నేలఁజాలు నా
ల్పులదొరపట్టి చక్కఁదనముంగని పొంగెడునట్టి భాగ్యము లోఁ
దలఁపఁగ నావనెన్నగులఁ దక్కువనోములు నోచినట్టి క
న్నెలకది పైపయింగలుగునే యతియాసలుగాక [illegible]. 68

క. ఎక్కడిదిసె నెక్కడి జేఁ
దక్కున ననుగారవించు నతఁడనుకొనియుం
ఱెక్కడ యీవలపుఁగడలి
నెక్కటి నేనీఁదుటెడ యీవేసటతోన్. 69

ఉ. ఎవ్వరిఁబంపుదానఁ జనియిప్పుడు చెల్వునితోడ నావెతల్
నెవ్వడివిన్నవించి తననేరుపుచూసి మదింగరంచఁగా
నివ్వలవంత నెక్కరణి నీఁగుదునక్కట చిల్కలైననుం
దవ్వులకేగ కియ్యెడను దాపుననుండిన నన్నుఁగావఁగా. 70

క. అనుచుండఁ దలఁపులోనని
చనుదెంచెను జిలుకకవయుఁ జదలుననటకున్
విని తెక్కచప్పుడొక్కట
ననుఁగుం జెలులెల్ల తెప్పలార్పకచూడన్. 71

సీ. చేరవచ్చి చిత్రాంగద చేతిమీఁద
వాలి ముద్దిడి సేమంబువరుసనడిగి
పలుకు వెలఁదుక తమ్మియ్యఁబంచినట్టి
యాగ్రమూఁకుల క్రొవ్విరులెలమినిచ్చి. 72

చ. నలువ జగంబునందలి వినందగువింతలు కొన్ని తెల్పి యా
వలఁ దమ కూర్మినెచ్చెలిని బాఁతిగనుంగొని యామె మేను మి
క్కిలి వసివాడియుండుటయుఁ గీడ్వడిమోమునఁ దొంటితెల్వి యి
మ్ములఁ దిలకింపరామియును మున్గల సంతసపాటులేమియున్. 73

క. కనిపెట్టి డెందమందున
వనటం దిగులొంది తోడివారలనెలమిన్
వనజోఁడి యట్లు చిక్కుట
కును గతమడుగంగ వారు కూరిమిమీఱన్ 74

ఉ. మున్నులమింటిమీను నొకముక్కున నిక్కఁగనొంచి క్రీడి ద్రోవదిన్
గొన్నఁ గెలంకు జవ్వనులకుం గనునాసలు గొల్పునాపునుం
గన్నదివేయునోళ్ళ ముకుకల్గొనియూడకఁగ నాలకించి యీ
యన్నులమిన్న పొంగి మొదమూతన్పై నెలకొల్పె నవ్వఁగన్. 75

క. కందుచు నెవ్వారిత్రోఁదన
డెందంబునఁగోర్కి వెల్లడింపక లోలో
వందూరి యంతంతకు మెయి
యందముచెడ సన్నగిల్లి యలసఁగమైనన్. 76

ఉ. తత్తఱమొందిదీనికిఁ గతంబెఱిఁగింపఁగదమ్మయంచు మే
మిత్తఱి వేయిచందముల నిమ్మెను వేఁడిన నెట్టకేలకున్
బిత్తరి యంతయుం దెలిపి జాలతనంబునఁ బల్కులాడి తా
ను తలవాటుతోడ మోము నొక్కటఁ జేర్కొని యూరకుండినన్. 77

క. తనకిమ్మైడఁ గడుఁదోడయి
పనిపూనికడిందికోర్కి పండింత్రుగదా
యని వేచియున్నదిదె మ
న్ననమీ చెలి నప్పగించినారము మీకున్. 78

ఉ. మా బరువంతయుం దొలఁగె మాచెలియన్నిముఁ గూర్చినార మిం
కీబలితంపుఁ గర్జమెటు లీరలుదీర్చెదరో సుకీ యనన్
జాబిలి చల్వచూపులను జామునుగన్గొని మంజువాణి గా
రాబము మీఱ నిట్లనెఁ గరమ్మును దేనియలొల్కు పల్కులన్. 79

సీ. మేమిద్దఱము మున్ను మీయొద్ద సెలవొంది
నలువజగమ్మున కలరు వేడ్క
మింటను జనుచుండి మిట్టలుపల్లముల్
చదును నేలలయట్లు మనికిఁ దోఁపఁ

గుప్పముల్ షల్లెలుఁ గుప్పవోసినయట్లు
కనుపింపఁగాఁగను గానఁబడఁగఁ
జెలువులుమడువులుఁ జిన్న యద్దపుబిళ్ళ
లట్లుచూడ్కికిఁ జాలనందగింప
వేడ్కపడుచును నెడనెడ వింతలెల్ల
నాంటోరులతోడఁ జెప్పుకొం చొక్కచోట
నారిపటగడ సింగార మొలుకుచున్న
పూవుఁదోఁటలో నొక్క క్రొమ్మావిక్రింద. 80

సీ. బవరిగడ్డమువాని బవడంబుఁ గ్రొత్త చెం
దొవడంబుఁ దెగడు కేంద్దోయివాని
తలిరుఁబొయమువాని వలతేనినిండుక
ల్వలతేని నగియొడు చెలువువాని
తళుకుఁజెక్కులవాని తమ్ములమిాలమొ
త్తమ్ములనగు కన్నుదంటవాని
తేనెమాటలవాని తేఁటులఁగవ్వఁజా
తేటలనగుసిగతీరువాని
చెలులతోడను ముచ్చటల్సలుపువాని
కవ్వడినిజూచి యాపోయగంబునకును
నెచ్చెరువుహొందుచును గ్రిందికల్లడిగ్గి
కంటిమాతనిఁ గన్నులకఱవుతీఱ. 81

సీ. దొరలేనిదొరమోవి దొండపండెన్న నే
చిలుకలకొల్కిలోఁ దలఁపకుండు
వుడమియేలికమేని బుజము తూడులఁ జెప్ప
వేయంచయూన కన్నిడకయుండు

నలకేశిమోము వెన్నెలకేనిఁ గానియాస
నేకల్వకంటి లోనెంచకుండు
నొడయనిపొక్కిలి మసువుకెక్కన్న నే
జక్కవచంటిలో స్రుక్కకుండు
నట్టిజగజెట్టిఁ జేపట్టునట్టిమేలు
పొదలు నిమ్ముద్దరాలికి నొదవెనేని
బదిలముగఁ బదియార్వన్నె పసిఁడితోడ
మంచి కెంపును గూర్చిన మాడ్కి యనుచు. ౮౨

క. తలపోసి యతనిఁ గన్గొని
వెలయన్మముఁ దెల్పికొంచు వెలఁదుకనచ్చోఁ
బలుకుల వెంబడిఁ జేర్కొని
చెలువెల్లను బొగడి మున్ను చెప్పినదానన్. ౮౩

క. చెప్పినదంతయు నూఁకొని
యప్పట్టున నాతఁడిట్టునట్టును ననకా
చొప్పు మఱపించి నేరుపు
చొప్పడ వేఱొక్కకతకుఁ జొన్పనువన్నన్. ౮౪

ఉ. అంతియచాలునంచుఁ దఱుచాడక యత్తఱినూరకుండి నా
యంతను బోయితింబయనమై సెలవాయనయొద్దఁబొంది వి
న్పొంతల నల్పపీటికిని ముద్దియ నీమది గొంతిపట్టిపై
నింతగనిల్పియుంట యొక యింతయు నవ్వడు నేనెఱుంగమిన్. ౮౫

క. అనిమఱియు నేమొచెప్పఁగఁ
జనుచిలుకం జెప్పనీక సడలినతాల్మిన్
గనుఁగొనల నీరు గాఱఁగ
ననిమొఁ జిత్రాంగద గడు వెసలుపొంగన్. ౮౬

క. అక్కటిక యించుకయు లే
క కక్కటికిలిసంబుఁ బూన నగునా యుల్లం
బక్కట క్రీడికి నదియును
నిక్కము నేఁ జేసికొన్న నెఱదోసమొకా. 87

చ. పసితనమేగి జవ్వనము వచ్చినయంతటినుండి నెమ్మదిన్
విసువక కోరుచెల్వుఁడుఁట వేనను నొల్లకయుంట యిద్దియున్
బసదఱుగంగ వీనులవినంబడియుం దెగలేక మేదిలో
నుసురులు దాల్చెదన్వతలకోరిచి యెంతటిదోసకారినో. 88

క. వానిం గలయంగ నగునని
యేనెంతో యాసపొంది యిన్నాళ్ళుండం
గా నేఁటికి నిటులాయెను
వానిఁ గలయలేని దొక బ్రతుకే తలఁపన్ 89

ఉ. ఆసను ద్రెంపలేక యిటులందని మ్రాఁకుల పండ్లకూరకే
వేసరగొంతుపాఁచినను వీసమువాసియుఁ గూడివచ్చునే
మీసరివారు మెచ్చుకొన మేనుతొఱంగెదనమ్మలార నా
యాసలు నేఁటితో విడువుఁడందఱుఁ గేల్గవమోడ్చి మ్రొక్కెదన్. 90

వ. అనునంత నబ్బిత్తఱి చెలికత్తెలు తత్తరపడి యింతంతనరాని యుత్త
లంబున రంతులుసేయుచుఁ బలువురు పలుమాటలాడి యాబోటి
న్మాదలింపఁ జొచ్చిన నచ్చెలుకకలికియుఁ దనలోన. 91

ఉ. కైకొనకుండరాదు మనకన్నులముందఱ నేఁడెపుట్టి తే
పేకడతేఱువారి మనమెందఱఁ జూడము చావనంగ వే
తే కొనితేరఁగావలెను యేనిఁక నొప్పరికించి లోని యీ
వీఁకనడంపకుండినను వేయెటుపోనెటువచ్చునోకదా. 92

వ. అని తలంచి యామించుబోఁడిం దిలకించి. 93

గీ. వల యీలాగు నిండిన యింటిలోనఁ
గుడిచి యేగార్చుండి పని లేని గొడ్డువయ్యోకటి
పైనివేసుక పొగలెదు పడఁతి యున్న
చాలుఁబడివేలువచ్చె సిచలము సిమన్న. 94

గీ. తానుబోయిన పిమ్మట దేనితోడ
నైనఁ బనియేమి తెంపుచేయంగవలదు
తలఁపఁ జనునమ్మ నీయంతదానికిట్టి
వెడఁగుఁ బనులక్కటా యెంతవెఱ్ఱి పేవు. 95

ఉ. చానరో పోలుపాం చెఱుఁగఁజాలక యూరక పందవేల నె
ద్దీని ననంగఁగొట్టమున నీవలిగుంజను గట్టుమన్న చే
మైనను జెప్పఁగాఁదరమె యాతఁడు నాఁడటు మూడుసల్ల కే
మానినదానికింగతము మన్నన విన్నను నాక నాకుఁ గా. 96

గీ. అనుడు నాచిలుకలకొల్కి యవలఁ జిలుక
చెప్పఁబోయెడు సుద్దిని జివరదనుక
వినెడువేడ్క యుప్పొంగ్ర వెచ్చనూర్చి
యీవలావలి చెలులతో నిట్టులనియె. 97

గీ. మదికలంకఁజేసి యిది యనంగాఁదగు
నిదియనఁదగదనెడి యెఱుకలేక
యేమిరోపలికితి నింతేకా కుసురులు
విడువఁదలఁప నంత వెఱ్ఱినమ్మ. 98

గీ. అకట నవ్వుటాలకూరకే యున్నమాట
నిజముగాఁబట్టి యిపుడింత నెలఁతలార
పట్టిపల్లార్చి నామీఁద వట్టి లేని
పోని వాదువేయఁగఁ బాడియౌనె మీకు. 99

గీ. రవ్వపెట్టక యుండ నైన రమణిమీఁద
జాలిమెయిఁ జిల్కఁ జేఁదియో మేలిపలుకు
చెవిఁ వేయంగ నుంకించెఁ జెలియలార
వినఁగ నీరమ్యముక్కోడ వీనులలర. 100

వ. అనుచు నప్పుడప్పడంతులెల్ల జప్పుడు సేయక యొప్పులకుప్పయగు నప్పులుకుఁజెలువ యొప్పిదంబుగాఁ జెప్పఁబోవు మెప్పుమాటల కొఱకుఁ బ్రకంప నుల్లంబు లుప్పొంగ్యార నూరకున్న నాచిలుకకలికి కలికి పలుకుల నాచెలువల చెవులకుఁ జవులు గొలుపుచు గిలుకుపలుంగున నిట్లని చెప్పందొడంగె. 101

సీ. అలప్రావుఁదోఁటలో బలుకువెంబడి మున్న
 పోలఁతి నీరూపు నేఁ బొగడినపుడు
వలపు తొందములోనఁ గలిగియుఁ గొండంత
 యొక్కంతయును వెలికుబ్బనీక
యగ్గలంబుగఁ దొట్టు సిగ్గుకతంబున
 దానినంతయు మదిలోనె యడఁచి
కల్లగుట్టకయింత కాన్పింపఁబైటికి
 నౌనుగాదనుమాట యనకయుండె
నువిదరో యంతెకాని వేఱొండుగాదు
వినుము వినుపింతుఁ దరువాత వెఱ్ఱియగుచు
వలపుతలకెక్క నాతఁడు మెలఁగినట్టి
నడత చందమించుక తేటపడఁగ నీకు. 102

ఉ. నిన్నను నల్వపేడుకొని నేనరుదెంచుచుఁ గంటిఁ ద్రోవలోఁ
బెన్నకుఁ జేరువం గనులవిందుగఁ జెన్నగు నొక్కకోనయం
దున్న గుడారముం దటిసి యొప్పెడు మామిడి గున్నక్రింద వే
గన్నులవేల్పుపట్టి చెలికాఁడొకఁ డూఁతగఁ గూరుచుండఁగన్. 103

క. కని వారేమనుకొందురొ
వినవలెనని వేడ్కఁబొడమి వెననాలేమ్రాఁ
కునకుండిగి యొకకొమ్మను
బనివడి నేఁగూరుచుంటి బడలికవాయన్. 104

వ. అయ్యెడ నాకవ్వడి వెడవిలుకానియలజడిం దెలివిచెడి యిదితగు
నిదితగదనియెడి యెఱుకలేక యెదుటఁ గనఁబడు వానినెల్లం దడవి
యిట్లని పలవింపఁదొడంగె. 105

సీ. అలలార యంచ తొయ్యలులార మీరైనఁ
జిత్రాంగదకు నన్నుఁ జెప్పఁగలరె
తొగలార మేలిసంపఁగులార మీరైనఁ
జిత్రాంగదకు నన్నుఁ జెప్పఁగలరె
పొదలార గండుతుమ్మెదలార మీరైనఁ
జిత్రాంగదకు నన్నుఁ జెప్పఁగలరె
విరులార చలువతెమ్మెరలార మీరైనఁ
జిత్రాంగదకు నన్నుఁ జెప్పఁగలరె
యెంతవేఁడిన నొకరైన నించుకంత
పలుకరైనను నాతోడఁ బలుకరేమి
నేనుజేసిన తప్పిదమేదియైనఁ
గలదె యెల్లరు నన్నిట్లు చులకసేయ. 106

గీ. నేమమున నేను బండ్రెండు నెలలబట్టి
యిన్నియేళ్ళకుఁజని గ్రుంకులిడినయట్టి
పున్నెముననైన నాకు నాపువ్వుబోఁడిఁ
గాంచుమేలైన నొకసారి గలుగరాదె. 107

క. అని పెక్కువగలఁదలఁకెడు
ననుఁగుం జెలికాని లోని యలజడితగ్గన్

మనమిడెచని చిత్రాంగదఁ
గనుఁగొందము సుమ్మియెల్లి కన్నులుతనియన్. 108

క. అందాఁక నోర్చుకొమ్మని
కందువమాటలను జెల్మికాఁడొకఁడచ్చో
చెందముసండలి కుందున్
డిందింపుచునుండ నప్పుడ నేనును గడఁకన్. 109

క. నీయెడ యాతనిపయి నిటు
లోయింతిరో తగిలియుంట యొక్కింతయు నే
నాయెడ నెఱుఁగమిచే నీ
చాయలవచ్చితిని నంతెచాలు నటంచున్. 110

క. నమ్మమిది నేఁట తేపటఁ
గొమ్మా నిన్వెదకిఁగొంచు గొబ్బునతేఁడీ
యిమ్మునకే తెంచి నినున్
నెమ్మింజేపట్టు నీదునెచ్చెలు లలరన్. 111

సీ. కాన నూఱడియుండుము నేనుబోయి
యిప్పుడ మీతల్లిదండ్రుల కెలమిమ్రొక్కి
వారినేమంబు లారసి వత్తుమరల
ననుచుదిగ్గున రాచిల్క లరిగెఁజదల. 112

క. చిలుకలటుచన్నపిమ్మటఁ
జెలికత్తియలంతిపురికిఁ జెచ్చెర్ఁజెలువన్
బిలుచుకొనిపోయి రూఱడఁ
బలుఁదెఱఁగుల దిటవుగఱపి పాయనికూర్మిన్. 113

వ. అటుతరువాతి నడచినకత చెప్పుమని జనమేజయుండడుగుటయును. 114

మాలినీవృత్తము.

జగము లరయువాఁడా సాధులం బ్రోచువాఁడా
ఖగవరుఁ బనులఁగొండా ప్రాభవశ్రీప్రకాండా
ఖగమెఱుఁగనివేల్పా పైఁడిపుట్టంబువాల్పా
వగలుఁ దొలఁచుమిన్నా వాసిగఁ గొల్లపిన్నా. 115

కందగర్భిత మణిగణనికరము.

చిలువపొరకపుఱఖు జెలువునఁ జెలఁగన్
సిలుగుల నడఁచెడు సిరిచెలిమగఁడా
నలువయుఁ గొడుకై నలువుగ వెలయన్
బెలుకుఱఁబగతుర బిగిచెఱుచుదొరా. 116

గద్యము.

ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర శుద్ధాంధ్ర విప్రోత్తమ విద్వావన
నైషధమహాకావ్య రచనాచాతురీధురంధర సద్యశోబంధుర కందు
కూరివంశపయఃపారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్య
పుత్ర సుజనవిధేయ వీరేశలింగ నామధేయప్రణీతంబయిన
రసికజనమనోరంజనంబను ప్రబంధరత్నంబునఁ
ద్వితీయాశ్వాసము.

రసికజనమనోరంజనము.

తృతీయాశ్వాసము.

క. సిరియుం బలిమియు సేమముఁ
దిరముగ మదినమ్మికొలుచు దిట్టల కెల్లన్
గరము సన్నరుస నిచ్చుచు
నరయుచు సాధులనుబ్రోచు నలకరివేల్పా. 1

వ. వైశంపాయనుం డటమీఁద నడచినకత జనమేజయున కిట్లని చెప్పందొడంగె. నట్లు చెలికత్తియలు పొత్తుగ నత్తెఱవం గొనిచని మనికిపట్టుచేర్చినఁ జేర్చిన మరుచిచ్చునకుఁ దాళఁజాలక చాల జాలిం దూలుచు వారల నేమఱించి. 2

సీ. అలమోవి దొండపండనవచ్చు చిల్కల
జవ్వాజివలపులు నసలఁద్రోయు
బుజముత్రాడులఁజూచి పొరివచ్చునంచలఁ
దుఱుముక్రొమ్మొగిలింతత్రోలఁగఁద్రోల
చనుపూవుబంతులఁ గనివాలుత్రేఁటుల
ముక్కుసంపఁగిమొగ్గ మొనసితఱును
కయికొమ్మల నదల్పఁగావచ్చు తెమ్మెర
నొకట నూగారు పామొదుగఁజేయు
కలికిమాపును గనిచేరు కమ్మవిల్తు
బలఁగముల నాకలికిరూపె పాఱఁజేయ
బోటివెడలెను బూవులతోఁట కపుడు
చెలుల దిగనాడి యొకఁబాటు చెలువఁగూడి. 3

గీ. అంత నింతులెల్ల నంతయుఁ దలఁకొంచి
యింటఁ జెలినిగాన కెల్లచోట్ల
వెదకి తత్తరించి వెలఁదులు తలముస
నలరుఁదోఁటఁ జేర నరుగుదెంచి. 4

మ. కనికెలదోఁటలో వలపుఁగ్రమ్మెడు తమ్మికొలంకువంకఁ జ
క్కని సనదేని పోటిచెఱుకాలువ చావలిమావిక్రేవఁ బ
న్నిన నెలకాలమేడపసి సిద్ధపుముద్దుటరుంగు చెంగటన్
బొనరిన కమ్మచెంగలువ పుష్పవతి న్నిజయోద్ధ ముద్దియన్. 5

వ. కని యిట్లనిరి. 6

చ. ఎటువలెనమ్మఁ బాసి యిపుడిచ్చటికింటికి వచ్చితమ్మ నీ
వెటువలెఁ బూవుసేటి పెనువెల్లువ లీఁదితివమ్మ నీదు కా
ళ్ళెటువలె నోర్చెనమ్మ వెలఁదీయిటు పుష్పవతిత్వ లెక్క నేఁ
డెటువలెఁ దూఁటితమ్మ పొదరిండ్ల నయోతపనమ్మ యిప్పుడుల్. 7

ఉ. నీచెయివోయి కెంజిగురు నీనునువాతెఱ దొండపండునున్
నీచనుబూవుగుత్తులును నీచెలువారు బుజంపుఁగొమ్మలున్
జూచినఁ గోయిలల్ చిలుకజోటులుఁ దుమ్మెదచాలుఁ దెమ్మెరల్
హా చెలి యించుకైన నిను నాఁడిపెట్టక నిల్వనిచ్చునే. 8

సీ. ఒడలెఱుంగక మరుఁదుండి మంచిపడును
గూడిత్రేఁటులు కాఱుకూఁతలఱచు
వదరుచుఁ జిల్కలు వడిఁబండ్లుకొఱుకును
పరువెఱుంగక యంచబారసాఁచు
కదిసికోయిలపిండు కన్నులెఱ్ఱగఁజేయుఁ
బొగరున గోర్వంక తెగిరిపడును
మొయిజల్లుమనగాలి మీఁదిమీఁదికివచ్చుఁ
గన్నుగానక నెమ్మిగంతులిడును

గోలతనమున బలుముద్దురాలవగుట
వచ్చితివిగాక యొరులిట్లు వత్తురమ్మ
యించువిలుకాని దడములకిక్కయైన
కారుకోనకు నొంటిమైఁ గలువకంటి. 9

సీ. సారెసారెకువీచు చలువతెమ్మెరకాదు
తియ్యవిల్గలవాని తేరుగాని
యలచెట్లసలరించు నామనిదొరగాఁడు
పచ్చవిల్తుని దళవాయిగాని
పరువులెత్తెడు గొఱవంకగుంపులుగావు
తలిరాకువిలుకాని దండుకాని
తావి గుబులొక్కను తమ్మిమొగ్గలుగావు
కమ్మవిల్తుని తూపుగములుగాని
తేనెలానివెడలు తేఁటిపాటలుగావు
మొనయుమరుని నారిమ్రోఁతగాని
కెలనవిరియు కన్నెగేదంగి పువ్వుగాదు
పూలవిల్తు చేతివాలుగాని. 10

వ. అని చెప్పునప్పు డప్పడంతుక కంతకంతకు వలవంత వింతయయి
చూపట్ట నప్పట్టునఁగల వింతలుచూపి వంత మఱపింతమని యెంచి
మించుబోండ్లమ్ముద్దరాలిం బూలుగోయుదము రమ్మని త్రోడుకొని
చనుచు నిట్లనిరి. 11

చ. చిలుకలకొల్కి కన్గొనుము చెన్నగుతీవియఁ జిల్కకొట్లచే
నలరుచు దొండపండు దనరారెడు డెందమువొంగఁ జెల్వునిం
గలసిన పంటినొక్కులను గందియు ముద్దులుగుల్కుచున్నయు
గ్మలి చెలువంపుఁ గెంబెదవికై వడిఁ గ్రాలుచునున్న దెంతయుఁ 12

చ. కనుఁగొను ముద్దుగుమ్మ తరగఁ గనుఁగల్వలు విచ్చి ముందటన్
జనిచని నెమ్మిఁ గొండ్లి యటఁ దల్పఁగఁ జాలను బుబ్బఁ జేసి చాల్
గొని పొగ రెక్కి తుమ్మెదలు గుంపులు గూడి చరించ పువ్వులన్
గనుఁగొని నల్లమబ్బు నను గ్రక్కున తోఁచెడుఁ దంగఁ బోల్చెనా. 13

ఉ. అక్కడఁ గోయిలొక్కటి రవంతయుఁ బల్కకుమాని శాఖపై
మెక్కుచుఁ జెక్కునొక్క కొఱుమీఱఁగఁ గావున నిచ్చ మెక్కుచు
న్నిక్కపు మావిలేఁజిగురు నిష్ఠను నొప్పుచు దమ్మికంటి తాఁ
జక్కఁగఁ గ్రొన్నెనం దబిసి చందము చీనుడి మెచ్చుచొప్పడంగన్. 14

చ. కరువలి పిన్న మెల్లఁ జని కమ్మనితావులు గ్రుమ్మరించు న
బ్బురపుఁ గొలంకుఁ జేరు తన పోకకు నడ్డయి నిల్చియున్న యా
దరి బలురక్కసుల్ తలఁకఁ దద్దఁ దలద్దును మాడి వేల్మిడిన్
విరుల నుద్రుంచి కొమ్మకును వేఁగు తొలంచెను గంటివే చెలీ. 15

గీ. అలరుకొమ్మలు చెలువుల నల్లఁ బొంది
కొమరుపూపలఁ గాంచెనో కొమ్మ చూడు
మలరుకొమ్మలు చెలువుల నల్ల బొంది
కొమరుపూపలఁ గాంచుట గొప్పయగునె. 16

వ. అని మఱియును. 17

సీ. ఏమన వలతేఁడు ప్రేముడి పుట్టంగఁ
గలసి డెందంబులో మెలఁగునమ్మ
చలువల తేఁడు నిచ్చలు వేలుపుల త్రోవ
విడిచి యావంతయు నడువఁడమ్మ
మెలదోఁటలోని కోయిల మొత్త మేతలే
నోరెత్తి మాటాడ నోడునమ్మ
జింక తత్తడి రౌతు చెలఁగి యొకప్పుడు
నొకరికంటఁబడక యుండునమ్మ

తెల్లవాఱతపవ ముంచలెల్ల విడువ
కెంతదవ్వైన వినువాకెఁ కేగునమ్మ
యట్టివారలచే నెగ్గుపుట్టుటెట్లు
వలదువలవంత యొకింత యింతి వారివలన. 18

చ. మొగిళులఁ జూచి సంతసముఁ బూను నెమళ్ళను సంచపిండు, సం
పఁగిపువుతావులంగొనెడి షట్పద తుమ్మెదదిమ్ము తెమ్మెలం
డగిలికలంచుజాబిలియుఁ దామరచాలుఁ బొసంగిమన్కి యో
ముగుదరో! సాగదేరిఁగొని ముంకుమరుండదరు పెంచు నీపయిన్. 19

సీ. నీకంటఁబడినేలనిలుచునే మరుడాలు
నిలువుగ్రుడ్లుపడి తానీరుచూరక
నీమాటవిన్నఁ దాసిలుచునే మరుతేజి
తోఁకత్రెంచుక కానఁదోలఁగిచనక
నీమోముగన్నఁ దాసిలుచునే మరుమామ
దిగఁజిక్కిబయలునఁ దిరిగిచెడక
నీచేతఁబడ్డ దానిలుచునేమరుబాకు
వసఁకిమ్రాఁకులనంటిపట్టుకొనక
మిట్టిపాటును నెగరిపాటట్టులంవుఁ
ద్రిమ్మరితనంబుఁ గఱకుఁదనమ్ముమాని
మునిఁగి డాఁగి పఱచి కూలి చనియెనేని
యెంతమండిపడిన మరుఁడేమిసేయు. 20

చ. దరిచెడి కానపాల్పడియె దండులు, తూపులువిచ్చిపోయెఁ దే
రరుదుగ మూలఁబట్టెఁ, జెలువారుసిడంబులు నీటిపాల్పడెన్
విరివిరిపోయె నారియును విన్నగదాలుపు కంటి మంటలన్
మరుఁడునుసీగ్గె, గొందలమువూనుము ప్రావిలుకాని డాడికిన్. 21

వ. ఇట్లు నెచ్చెలులెచ్చరించుచుఁ దోడుకొని చనుచు. 22

వృషగతిరగడ.

కలికి కలికి మొగంబులం గనుఁగన్నుఁ గన్నుఁదప్పందమనమానము
పలుకుపలుకులుగాఁ జనకెంపువంకవంకరగఁ జనదేము
పొదలుపొదలు పాయఁబోక వనుఁబోటిబోటిగమిఁ వెన్కనడువ
మెదలమెదల వెఱపుదోఁపఁట మేల మేల కను పెద్దమడువ
కానకానవ వేఁటుఁజక్కియక కన్నె కన్నెఱఁ జేసిచూడక
మానుమానును గుట్టుచెప్పెఁజ మాటిమాటికి మన్నువిడక
కొమ్మకొమ్మలపంచుతెల్లను గోయఁగోయని కూయుఁజిల్కలు
నెమ్మినెమ్మినిజూడు మల్లదె నీడనీడను దానికుల్కులు
చెలువచెలువగు పువ్వుసరిగఁ జిలుకఁజిలుకరాలిచేఁ బూలను
నలరు నలరులురాలెఁ గన్గొను మన్నమన్ననసేయువేలను
దనరఁదనరవణములూడ నెఱతావి తావిదిరమ్మనిచెలికి
ననుచు ననుచుచేమంతిపొదకు నల్లనల్లనఁ జని నొకకలికి
మంచిమంచిసుమంత కప్పిన మావి మావిడిచి మున్నెప్పుడు
మించుమించులఁబోఁడి పోదమె మీఁదమీఁదడయుడఁగ నిప్పుడు
తెఱవతెరువది తిన్నగాఁజని తేనితేనియవాఁకతాకదు
నెఱయు నెఱయుప్పరిగవేడుక నించునించుక కాఁకసోఁకదు
పొగడపొగడఁదగి తావులవనబోఁడి పోడిమిమీఱఁగ్రాలెను
పగలుపగలు మొగముతోనెఱపి వాడివాఁడిమి దమ్మితూలెను
నెన్నునెన్నుఁడు గొజ్జఁగులపూవింత వింతగలేదు డాయుము
కన్నెకన్నె గేదఁగి క్రొన్ననఁ గడఁకఁగడకన్నెత్తి కోయుము
కొనక కొనకటుశేల చూచెదు గోరగోరఁట పూలుద్రుంపవె
మొనయు మొనయురియాడు సంపెఁగమొగ్గమొగ్గకఁ గేలనింపవె
యోలయోలకిపొదవిరి మొత్త మెల్లమెల్లన రాల్పఁజాలవు
గోలగోలనుగొంచు నాకలిగొట్టుఁగొట్టుము నేలపాలవు

జాలజాలగు కాల్వదరిఁ జనఁజాగి జాగిటుచేయ నేటికి
నాడ నాడుకోయిల యిపు డేమఱచెమఱచె నీనుడి నేటికి
జానజానగు తావితావెదఁ జల్లజల్లని బావిఁగందమె
పూనిపూనికలెల్ల దీఱఁగ మొల్లమొల్లపుఁ దావిగొందమె
యలసియలసిగ పూలురులఁజఱియందయందఱుఁగూరుచుందురె
వెలయవెలయనరాని కోలంకు వేఁడివేడిఁదోలంచుకొందురె. 23

సీ. అడఁగులకెంజాయ లలముప ట్టులుచూచి
తలిరాకుపడెనంచుఁ దలఁచివంగి
తనచూపుచాలు పర్వినపూలఁ దేంట్లని
చాఁచినకెంగేలు సరగఁదీసి
తగఁబల్వరుసతెల్పు జిగిపర్వఁతీఁగెల
మల్లెమొగ్గలటంచు గిల్లబోయి
యొడలిబంగరునిగ్గు లడరుమ్రాఁకులఁజూచి
సంపెంగననలంచు సరసఁజేరి
యొండొరుల నవ్వుకొంచు నయ్యువిదలెల్ల
విరులుకోయుంగఁ జొచ్చిరి వింతమీఱఁ
గలికిపడకల నంచల గరువమడఁచి
యందియలు కాళ్ళ గళుగళ్ళు మనుచుమ్రోయ. 24

గీ. చిగురుటాకులు వడిఁద్రుంచెఁ జెలువయొకతె
యపుడ చేతులకసిదీఱునట్లుగాఁగ
మల్లెమొగ్గల వెసఁద్రుంచె మగువయొకతె
యలుకమెయిఁబంటఁ బగపట్టినట్టుగాఁగ. 25

సీ. వడిఁబొన్న విరిగోసి మొడిఁబెట్టెనొక్కతె
పొక్కిలితో సరిపోల్చుకరణి

వెసఁగోసిసంపంగి విరినిమూర్కొనెనొకర్తు
ముక్కుతోడను సరిపోల్చు కరణి
చిగురుజొంపముఁద్రుంచి చేతఁదాల్చెనొకర్తు
పాణిఁగేలితో సరిపోల్చు కరణి
మొగలిరేకులుగోట ముట్టిగిల్లెనొకర్తు
మొగిగోళ్ళతో సరిపోల్చుకరణి
దొండపండునుగోటికె వాతుకయొకర్తు
పాసఁగఁ గెమ్మోవితో సరిపోల్చుకరణి
తీవెమొయినంటఁ జే యెత్తితిగిచెనొకతె
పూని నెమ్మేనితో సరిపోల్చుకరణి. 26

గీ. వెలఁదులమ్మాడ్కిఁ జిగురులు విరులుఁగోయఁ
దూలి నెవ్వగఁగొంచుచుఁ దోఁటబోటి
యొకటఁ గన్నీరు నించెడు నోయనంగఁ
దొడిమలను నీరుకాఱంగ దొడఁగెనపుడు. 27

వ. ఇట్లు పూలుగోసి యలసి సొలసి యమ్మగువలెల్లం జెమ్మటలఁ
దొప్పదోఁగి నెత్తమ్మికొలంకున నీరాడఁగోరుటయు నచ్చిత్రాంగద.

గీ. మేలిమగరాలపట్టుల మెల్లనడచి
మెఱుఁగులీనెడు రతనంపు మెట్లుడిగ్గి
వలపుగొలిపెడు తామరకొలనుఁజేరె
నొక్కనెచ్చెలి కేల్దమ్మి యూఁతగొనుచు. 29

క. క్రొవ్వెదనించుకకనుఁగొని
క్రొవ్వెదనించుకయు విడిచి గుంపుగ నంచల్
దవ్వులమొయిలని పాఱెను
నవ్వులపాలయి కొలఁకుదరి నవ్వలివలనన్. 30

చ. చెలువలు సొమ్ములున్నిలువచీరలు నొడ్డునఁ బెట్టిపావడల్
బలుచనుకట్లుఁగట్టి సరివారలఁజీరుచు నీరుచొచ్చి రా
పొలఁతులకొప్పు ముక్కు మొగముంగని యంచలుఁ దేంట్లుజక్కవల్
జళుకున నల్లమబ్బు జిగిసంపెఁగ చందురుఁడంచుఁ దూలఁగన్. 31

సీ. చిలుకలకొల్కుల చేతులునడుగులు
నెఱ్ఱదామరగుంపు సినుమడింప
ముద్దులగుమ్మల మోములుఁజన్నులుఁ
బొందామరలగుంపుఁ బుట్టఁజేయ
కలువకంటుల వాలుఁగన్నులచెన్నులు
నాలుగన్నగమి నిబ్బడిగఁజేయ
క్రొవ్విరిబోఁడుల కురుల మొత్తంబులు
నాఁచుతీవెలపెంపునలువరింప
నెలఁత తెల్లను గుములుగానీరు చేరి
యింపుదళుకొత్తఁ బెల్లుగా నీఁదునపుడు
చెలువుమీఱిన నెత్తమ్మి కొలఁకునకును
గరమువింతగఁ గ్రొత్తసింగార మొదవె. 32

చ. చెలువయొకర్తు కెంజిగురుఁ జిమ్మనగ్రోవి యనూర్చి పూవుఁదే
నెలు చెలిమోముదమ్మిపయి నెమ్మినిజిమ్మనఁ గేలుదామరల్
తళుకుమొగంబుచేరవకఁ దారుచుటొప్పగుఁ బూవునీటికిం
దలఁకకు మేముగల్గనని తమ్ములుబాసట వచ్చు నచ్చునన్. 33

గీ. ఒండొరుల కేలుఁదమ్ముల నొక్క మొగిని
నెమ్మొగంబుల పయినీరుచిమ్ముటొప్పెఁ
దమ్మిపూఁదేనియను జూవుఁదుమ్మెదలకు
మించుతమి నోగిరంబుగఁ బంచునట్లు. 34

క. కుంకుమ సోఁకఁగ నెఱుపయి
యింకొకయెడఁ బసపుసోఁక నెలపచ్చనయై
పొంకపుఁ గాటుకసోఁకిన
వంక నలుపయి కొలఁకు పలువన్నెల నమరెన్. 35

సీ. కస్తూరికొప్పులనుండి కాఱుచుండెను నీరు
చిఱుతమబ్బుల వానచినుకులట్లు
గబ్బిగుబ్బలనుండి కాఱుచుండెను నీరు
జలితంపుమలల పెన్వాఁకలట్లు
కమ్మమోములనుండి కాఱుచుండెను నీరు
సోగసుచందురు మంచుసోనయట్లు
కలికికన్నులనుండి కాఱుచుండెను నీరు
నెత్తమ్మిపూవుఁదేనియలయట్లు
వాతెఱలనుండి తగ జాలువాఱెనీరు
పలుచనగు దొండపండులపాలయట్లు
వింతవింతలఁ దనరెఁ గన్విందుగాఁగ
లేమలట నీటిలో మున్గి లేచునపుడు. 36

గీ. పడఁతిమిన్నలు కొలఁకు వెల్వడెడునప్పు
డొడలనంటిన నీటిబొట్లొప్పుమీఱె
నేవళంబుగఁ బెరుగు క్రొందీవగములు
మొగ్గతొడిగిననైవడి ముద్దుగులుక. 37

చ. తనతలచెక్కలం జొనిపి దాపుననొడ్డున నంచ పవ్వళిం
చినఁ గని కట్టుపుట్టమని చేడియ యొక్కతె కేలవంటము
క్కునవది కేల్వడిం బాడువ గుబ్బెతగొబ్బున నుల్కిపాటునన్
వెనుకకువచ్చె దానిఁగని నివ్వడినవ్విరి తోడిచేడియల్. 38

గీ. ఇట్లు కొలఁకువెల్వడివచ్చి యింతులెల్లఁ
జమ రవణములు వల్వలుఁదాల్చి పిదపఁ
బువ్వుబోఁడిని గై సేసి పూలుదుఱిమి
పొసఁగ మొగమునఁ గస్తురిబొట్టువెట్టి. 39

గీ. మెల్లమెల్లనె యుపరంజిమేడపొంతఁ
బూవుఁదోఁటను గుజ్జుక్రొమ్మావి నీడఁ
జెన్నుమీఱెడు నెలతాలతిన్నెమీఁదఁ
బోలఁతిఁ గూర్చుండఁబెట్టి యాపువ్వుబోండ్లు. 40

క. జాణతనపుమాటల వి
న్నాణముచూపి చెలియమదినాటిన కుందుం
బోనడఁచి ప్రొద్దువోవఁగ
వీణియఁ గొనివచ్చి ముందుపెట్టిన వేడ్కన్. 41

గీ. తీగెలుబిగించి సుతి కడుఁదిన్నపఱచి
పూని వీణియను బుజంబుపై నిమోపి
కేలుసవరించి సారెల వ్రేలునిలిపి
మెలమిమీఱఁ జిత్రాంగద యింపుపుట్ట. 42

సీ. క్రొవ్వాఁడికొనగోళ్ళ గ్రుచ్చితంతులుమీటు
నందంబు మదిజల్లుమనికలంప
మురిపెంబుగాఁబల్కు ముద్దుటెలుంగున
కల్లనఁగోయిల లరుగుదేర
సారములుకలిపించి సొగసుగాఁబలికించు
వింతకుఁజాలెల్ల వెసఁగరంగ
హాయలుగాఁబాడెడు నోఱపై నపాటకుఁ
చేరువమ్రాఁకులుం జిగురుపట్ట

తానునెవ్వఁడో గవ్వడిపై విముఖ్యు
నూరిచిన తేటపాటను నూర్మిమీఱ
వీణెమీఁదను హాయిగా నెలఁదిమిన్న
వింతగాఁ బాడఁజొచ్చెను విసులలర. 43

ఉ. అయ్యెడఁ గ్రీడి చేష్టమెయి నచ్చటికిం జనుదెంచి నిలిచి యా
త్రియ్యలిఁ గాంచుజాడ మదిఁ దోఁచక యారయు చింతలోఁ గలన్
నెయ్యపుఁ గూడి యయ్యెడవి విల్చి మొకంబుల వేఁటలాడఁగా
జయ్యన నెంచి కొంతవడి పల్చి మొగంబుల వేఁట వింతగన్. 44

క. ప్రోలిచేరువ కానలోఁ బ్రొద్దుగడపఁ
గొంతవేటాడి మొగములఁ గుప్పగూల్చి
మేటుపడి పాటిపోయిన యెలుఁగువెంట
నంటిచనుదెంచి యాపాట యాలకించి. 45

ఉ. చెంగటఁ బాటపాడుచును జెల్వలతోఁ పను పోటలోనఁ బ
త్రాంగదయుంట జాడమెయి దవ్వులవారలచే నెఱింగి యు
ప్పొంగుచుఁ జెల్మికానిఁగని పొందొదఁగూర్పఁగ నందివందిదే
ముంగలఁజేసి జెన్వడిగఁ బూవిక నల్పునుటంచు నట్లనన్. 46

చ. ఎటువలె నేకతంబచని యింతికడన్నను గానిపించెదో
యెటువలెఁ బల్కరించెదవో యెట్టుగ మన్నన లందిమించెదో
యెటువలె నేర్పుచూపెదవో యెట్లుగ నూటిగ మాటలాడెదో
యెటువలెనమ్ముఁ గూర్చెదవొ యీయది నీయదిసమ్మి నిచ్చెలీ.

చ. వెలఁదులుచుట్టుచున్నపుడు వేళ్లొకపందడి నున్నయప్పుడున్
వెలయఁగనా తెలుంగు కడువేగిరపాటున ముచ్చటించి యా
చెలువకు నన్ను విన్నపము సేయకు మన్నట బాణిపు నే
నెలమిని వేఱచెప్పవలె నే తగునట్టులె చేయఁగాఁదగున్. 48

71

క. ఒప్పుల కప్పయనంజను
నప్పడఁతికి నామదిఁగల యలజడియెల్లం
జెప్పికరంచక యేమో
చెప్పితినని నీవసడ్డచేసెదుసుమ్మీ. 49

వ. అనిన నవ్విశారదుండు నవ్వి కప్పడిత్తోడ. 50

గీ. ఎంత దేవర పనియన్న నింతలోనఁ
బూని పండించుకొనివత్తుఁ బొసఁగఁబలికి
యాకతియొయన్న నెయ్యంబుగానిపించు
నెలనగవునవ్వి తలయట్టి యెగరవైవ. 51

చ. అలయది సన్నగానెఱిఁగి యాతఁడుసామి హొసాదటంచు రెం
డడుగులు ముందుసాఁగి మొగమల్లన జేనిదెపన్నకల్పి చే
తులువడిమోడ్చి సంతసముదోఁపఁగ నిచ్చుట నున్న యట్టి లే
తలఁపుము పోయివత్తునని దారినిసాఁగెను వేగనేఁగఁగన్. 52

సీ. నెలజాల నేల పజ్జలఁగ్రాలుగొజ్జంగి
పువ్వుసీటియేటి వెల్లువలుదాఁటి
కపురంపు టంటికంబపుగుంపునంటిన
తుదిదారిగోరింట పొదలుదాటి
యల్లిబిల్లిగ నల్లు మల్లెతీవెలనల్ల
మెలత్రేఁటిమేటి ఘాటలకునలరి
సురపొన్నగున్నల దరినున్నతిన్నల
పయిపోలి మేలిత్తేనియలుగ్రోలి
తావిచెంగల్వబావుల క్రేవనడిచి
కన్నెగేదంగిపొదరిండ్లు గాంచిమెచ్చి
క్రొత్తజవ్వాజివలపులు గుత్తగాంచి
గుజ్జులేమావినీడల పజ్జచరిగి. 53

మ. కనియెం బాలుఁడు కోటలోపలను ప్రాగ్రాజిత్సురాగాంప్రుఁ ద్రో
ష్ణకబోఁడీక లతకానగుణ్ణయులమిన్నన్ చిత్రజీవన్నుత్తమున్
వనపిలాపి కకించిపుష్పామువిలిఁ జానన్ జాటుపుష్పాటతి గం
చిన మేల్వన్ని వసించితామ్మఁ కెలియన్నింగాం తేజన్నవిన్. 54

సీ. తనయుండవిూకేలఁ దనకొండఁ జాలుమాటు
గట్టురాకన్న యాకలికిమిన్న
తనమించుచున్నోలుచుఁ దనమించుకొత్తగాంచు
కలుములచేడయూరాలికిఁ గాడి
మురుగారువగవిూటు మొయిసారుగలముద్ద
సలుకలకొమ్మయైనాకడిచాము
తనయొప్పిదము యెప్పకుమ నొప్పుడగుగొన
ములతమ్మికొమ్మయైనామద్దుగుమ్మ
రుప్పుఁజని నేనాయలరుపలుకాని
మిత్రినాతమ్మికంటి నామేలికొలఁపు
టిదిపాము నాజగముచుట్టంబునిటఁకుఁ
దెచ్చెదను దీపసాగస్సెల్లఁ దెల్పియనుచు. 55

వ. చనుచున్న తటి నచ్చేరువ నడయాడుచున్న యొక్క నమలింప్రాచి
చిత్రాంగద నెచ్చెలులతోడ, 56

చ. అడుగులు మెల్లఁబెట్టుచును నచ్చటనిచ్చట నిల్చిచూచుచున్
వడిఁబోదరింక్ల చక్కికిఁ జివాలువనేగుచు నెమ్మిజుట్టు బి
ట్టడరఁగవచ్చెఁసుంగనుఁ డాయూరులు మీరలు పాటుఁడల్లదే
యొసపక వేడ్క మీఱ నెదురేగుఁడు కైకొనిరండు సేర్పనన్. 57

చ. అనని దె సంచటంచుఁ దటియుంజని పాటుఁదుకొమ్మఁగూర్చి యొ
య్యనవను 'వచ్చెఁసుంగనుఁ డాయూరులు మీరలు పాటుఁపల్లదే'

యని చెలిపింపుత్రోవ మమునవ్వలఁ జూడకమున్నె యిట్లు నీ
వనవిని నంతనుండి మదికచ్చెరువయ్యెడు మూకుఁదోయ్యలీ. 58

క. దవ్వులనాతనిఁ గన్గొని
పువ్వారుంబోఁడి యొక్క పొలఁతిఁబిలిచి యీ
విప్వచ్చు బాపనికినిడ
నెవ్వడినోక గద్దెఁగొంచు నెచ్చెలిరమ్మా. 59

క. అని తనయునుఁగును గనుఁగొని
గొనబునఁ బనివినఁబనిచినఁ గొనకొనిచని చ
య్యన సిగనిగమునుగద్దియుఁ
గొని చనువును నెనరునుబెనఁగొన నటనునిచెన్. 60

వ. అప్పుడతండు. 61

గీ. అదిగో 'విప్వచ్చు బాపఁడంచ' నెడునార
యీ మెయోటఁగి నన్నానవాలిడియెనే మొ
పల్కనటులు నీవీవచ్చుబాపఁడంచు
నువిదమదినెంచి యిట్లని యుండఁబోలు. 62

క. అని సందియంబుదొలఁకఁగఁ
జనియాతఁడు చెంతఁజేరి పరగనడఁకువన్
ననబోఁడి చేయిచూపఁగఁ
గనుసన్నలఁ గూరుచుండె గద్దియమీఁదన్. 63

వ. అంతనప్పుడు. 64

ఉ. తోరపుఁబేరులూడ నసదుంగవునల్లలనాడ ముంగురుల్
పారెడువీడఁ గ్రొంజెమట చక్కని చెక్కులమీఁదఁగూడ బం
గారపు గిల్కుటందియులు కమ్మనిపాటలు పాడ నెంతయుం
గూరిమి నేలవేల్పు నడుగుంగవకుం జెలిమ్రొక్కెఁగ్రక్కునన్. 65

సీ. ద్రొక్కి నిలిచినఁ జిఱునవ్వు మొలకలెత్తఁ
బెండ్లికూఁతురవగు మీవు నెలఁడియనుచుఁ
బుడమివేలుపు దీవించి పుష్పకంబు
చేతిలోనుంచెఁ గూర్మితోఁ జెలువకపుడు. 66

ఉ. కన్నులఁ బిన్నవాలుగులఁ గ్రక్కొనికన్నులవొత్తి మన్ననన్
గ్రొన్ననయున్న మిన్న నెఱిగొప్పున నప్పున నేలవేల్పు న
న్నన్నలఁ దాల్చి కొంకపోరు చందముఁ బొందఁగఁ జాలు కేల్గవం
దిన్నఁగ మోడ్చి లోఁ దలిపతీఱని కూరిమి మేరమీఱఁగన్. 67

ఉ. మెండగు వేడ్క దండమున మీఱఁగఁ దమ్ముల కన్నదమ్ములై
దండిగనున్న మీయడుగుఁదమ్ముల కిమ్ముల మ్రొక్కెఁగంటి మీ
యండను జేరి మిమ్ముఁ గొనియాడఁగఁగాంచిని మంటి నేఁడుగా
పండువు మాకు మాకొదలు వాసెను మీదగు కార్తి వేరెలన్. 68

సీ. అనిమిషియు నేమియో యపుడు మొగఁదలఁచి
సిగ్గుచేఁ బల్కఁజాలక చెలులవంకఁ
జూడఁగా నామెయుల్లంబు చొప్పెఱింగి
వారిలోపల మణిరేఖ పలికెనిట్లు. 69

గీ. పెల్లుగా చెడు వేరెండఁ బెంపుతఱిగి
కుందనమువంటి నెమ్మేను కందిపోవ
నెచ్చెలుచ్చటఁ ద్రిప్పంగ నిచ్చయిడెనో
కటికితనమూని మీయుల్లమిటులు మిమ్ము. 70

క. బడలిక యుడుగఁగఁగొండొక
వడిమీరి చోట నిలిచి పలుకుండోగి మీ
రొడయండెవ్వఁడో మీరి
య్యెడకు న్వచ్చెపియుంట కెయ్యది కతమో. 71

వ. అనియమ్మగుమ్మం గొండొకవడి చిమ్మముసిపాటున నెడఁదంపలపోసి
యతం డప్పడంతుల కిట్లని చెప్పం దొడంగె. 72

ఉ. మావారి యొప్పుఁ జెప్పఁదరమా మనకవ్వడి యాతఁడారయం
బైదలివేఁటమీఱ విను మానిక ముందలఁదాల్చుదిట్టదా
గాదిలివేఁటకై యెఱుకకైవడి నిప్పుడువచ్చెఁగానకే
మావట వెంటవచ్చితిమి యాయనచూడ్కికి విందుసేయుచున్. 73

చ. తపసులనుండి మేము ముదితా యతఁడెచ్చటికేగుచుండు వెం
బడిఁబడి వచ్చుటచ్చటికి వానయు నెండయు నొకవేడ్కతో
నడుచుచుఁగొల్చుచున్న కతనం గడునెయ్యముచూపి నిచ్చలా
తఁడె యొసఁగుంజుమీ తనకుఁదానె మదిన్మము మెచ్చి యన్నియున్. 74

సీ. చెలియరో విను మేను జెప్పెదనంతయు
మొదల మాదొర యొకపూనికె నెఱపఁ
దనమున్కి వెలువడి తద్దయుఁగోరిక
నందందుఁ గలవాఁక లరసి యరసి
యలతుమ్మెదలపాట లాలించియాలించి
సొలయక వింతలు చూచిచూచి
చెలువంపుఁగోనలు తిలకించితిలకించి
కన్నారఁగొండలు కాంచికాంచి
నెలలుపండ్రెండు పొలుపుగ నేలఁదిరిగి
తనదుపూనిక నెఱవేర్చి చనఁదలంచి
వెండియిచ్చోట నొకపూఁటయుండ మదిని
దలఁపుపుట్టిన నాఁగి నేఁ డెలమిఁ ద్రోడ. 75

సీ. పరిమాలుమావుల దరిఁగ్రాలుబావుల
విరిచాలుతావుల వేడ్కనొంది

నవరేటి గోటులఁ జనుపేటికేఁటుల
నునుఁజేలుపాటలకును కెలఁకి
యెనలేనివానలఁ జెనుఁబ్రామికోనల
వనశైలసోనలఁ బరఁగినాఁచి
వెలినున్న మెట్టలఁ గలుసున్న చెట్టులఁ
బలువన్నెపిట్టల పొలుపుమాఁచి
యొయ్యనొయ్యన నడచేరు నయ్యెరలకు
దెంకమునఁ బొంగి యిపట నందుఁడుఁ గొంత
తడవుమాసామియును మేము వెడలలేక
వింతలెల్లను గనుచుంటి మింతదాఁక. 76

గీ. అటులుమాచిన పిమ్మట నడవిలోన
వేఁటలాడఁగ నించుక వేడుకైన
నలిబియ్యాచేరువను వేఁట నలుప నిడఁగ
విల్లుఁదమ్ములు చేనల్లఁజిల్ల నవ్వాలి. 77

శా. సింగంబుల్పడిపాఱమట్టి ములుకుల్సింగాణికిందార్చి వే
ద్రుంగంజేయుచు బెట్టిదంపుఁ బులులం దూలించిచానేయుచుఁ
బెంగంజెట్లకుఁ బ్రాఁకుచో నెలుఁగులన్ బిట్టేయుచున్ లాఁగలం
గ్రుంగంజూచెను పందిగుంపులతలల్ గూలంగఁ జెల్లేయుచున్. 78

క. ఇక్కరణి నాతఁడింతకుఁ
బెక్కు మెకంబులనుబట్టి పెంపఱఁజేయన్
జిక్కక యొలుఁగొక్కటి యా
చక్కఁబఱచెఁ గోర్కులెదల సందడిసేయన్. 79

వ. దానింగానక కొంతతడవు వెదకి వేసరి. 80

ఉ. చాటుననున్నచో నెలుఁగుజాడ గనుంగొనలేని వచ్చి మీ
బోటి వలంతు లచ్చెరువు పొందఁగలోఁగొను నిచ్చమిమ్ముని

-చ్చోటికిముందుగాఁ బనిచెఁ జొప్పుగనుంగొని రమ్మటంచు న
న్నేమిటియు వచ్చెఁగర్జమిట మేలగుపల్కెఁక వీనుసోఁకినన్. 81

క. ఇచ్చట కొమ్మలచెలువున
కిచ్చను గడుసంతసిల్లి యీకోకసునే
మచ్చగవచ్చితిమీఁదగు
మచ్చిక నీయలరుఁగొమ్మ మాదొరకనుచున్. 82

వ. అని చేతిలో నొక పూఁగొమ్మ పట్టుకొని. 83

క. ఇక్కొమ్మపైఁ దలంపెద
నెక్కువగాఁ గల్గియుండు నింతిరొకనిసన్
ముక్కంటి యబ్బరంపడు
నిక్కముదాఁచంగనేల నీమానసుమీ. 84

క. అని తెల్పివారి వెండియుఁ
గనుఁగొని యోకన్నెలార గారవమునమీ
ననఁబోడిఁ గన్నునుండియు
నెవరును వేడుకయు వెఱఁగు నెలకొనెమాకున్. 85

ఉ. ఈమురిపెంపుఁ బల్కులును నీనునుఁబాటల యొప్పిదంబు నీ
మోము చొకాటపుంగనిన ముద్దియలారవినుండు వేయునిం
కేమిటికీవెలంది మదినెంచఁగఁ దామర చూలి రాణియో
యామె యొనర్చినట్టిజవరాలో యనంగను మాకుఁదోఁచెడున్. 86

క. తొయ్యలి ప్రోలెయ్యది పే
రెయ్యది యీచెలువఁదాల్ప నెన్నికఁగనెనో
యియ్యెలనాగం గడుపున
నెయ్యెకిమీఁదుగనెనొ యెతిఁగింపుమమాకున్. 87

వ. అనిన నతని జాణతనంబునకును నేరుపుమాటల పొంకంబునకును
డెందంబున నివ్వెఱపడి. 88

చ. పొసఁగఁగఁగ శ్రేణులొండొరులఁ బ్రేమములుం గొని కాశిహాప్తులన్
ముసిముసినవ్వుఁబ్రాఁక నొకముద్దియ చేర్చినఁ జల్లఁగయన్న యా
కైసలను నామిచాఁపులకుఁ దెప్పదమంచును యానెలంతె యుఁ
బెసఁగఁగఁ గల్పవల్లికలు కొంచెము కన్నెయదేమొ నేఁడు నీ. 89

ఉ. అడిగినఁగాక చిన్నపిప్పుఁ దెచ్చియు మారొక్కపాని కన్నకన్
జడిగముగా నెఱుంగుదురు మావలనన్నియుఁ గ్నూ చేయుటయు
న్నది యటులైన మాయొకల నుబ్బఁగఁ జూచి మెచ్చెంచఁగా
నది తుదముట్ట మావలన నే విశేషకరైయొనె దెల్పుమా. 90

సీ. పుడమి పువుబోఁడి కపరంజిముద్దు తోఁడవు
పాలమున్నీటిపట్టికిఁ బట్టుకొమ్మ
పెట్టుపోఁతలకెంతయుఁ బుట్టినిల్లు
నెలయు మణలూరసంగను వీడొకండు. 91

క. సిరికిం బుట్టినయిల్లయి
కరముల కెడు మానికంపుగమికిం డావై
యిరవై ముత్యమ్ములకును
బురుడించును బాలసంద్రమును బ్రోలెపుడున్. 92

శా. అవ్వీడే లెడు చిత్రవాహనుఁడు నెయ్యంబొప్ప నెవ్వారల
న్నెవ్వం జేయక కప్పముల్గొనుచునుండున్నేలవిల్లందఁబో
నవ్వేనిత్తురు మాపులున్నిరులుఁ బెక్కేనుంగులుం దేరులున్
జివ్వల్మానితమంతనే పెఱదొరల్ చేదోయి జోడింపుచున్. 93

క. దండము వెట్టుచు నవయుచు
దండిమగండ లేనిపోని దండుగ వేతే
దండేలమాకనీవే
దండని పెఱరాచపిండతనిఁ దగఁగొలుచున్. 94

గీ. మేరయొక్కింత చెప్పి మెప్పింతు ననుకొన్న
నెల జెనియసప్పుఁ బాలవెల్లి
పలుకుఁ జెలికి మిగులఁ దలమునక్కలయినచో
నోరులు దాని నరయ నోపువారె. 95

గీ. అట్టియొకమీనికి ననుంగుఁబట్టియీమె
కనులయెదుర నె కాన్పించు కతన వేఱ
యీమె చెలువంబు పొగడంగ నేలమాకుఁ
బలుకు వెలఁదుక మెప్పునఁ గలిగె నీమె. 96

ఉ. సడను మీ తెరుంగనివి యేవియు లేవటుగాన మీఁదనే
జాడల నెప్పుడెవ్వనిని జవ్వనినెట్టనఁ జెట్టవట్టునో
వేఁడెద నిక్కువంబు వినిపింపుఁడు కల్లలుపల్కరేని నా
తోడుసుఁడీ యటంచు మదిఁ గొట్రిలఁబల్కిన నవ్వి యిట్లనున్. 97

క. మేమరయఁగ మీవారము
కామే మమ్మింత వేఁడఁగా లాఁతులమే
లేమా లెస్సగఁజూచిన
మీమెలఁతుక యొక్కటియును మేమొకటియునే. 98

మ. చెలియా సందియమేల నీపడఁతుకం జేపట్టు వివ్వాచ్చుఁ డి
మ్ముల నామాటలు నమ్మియుండు మిటుపైఁ బూబోఁడియుంగ్రీడి తా
మలరుందావియుఁ బోలెనొక్కటియ యొయ్యారంబుగా నుండఁ గ
న్నులనిండం గనువేడ్కయీచెలులకు న్గొన్నాళ్ళకే కల్గెడున్. 99

క. కన్నుల విల్గలవాఁడిం
కన్నులలో మేలుబంతియగు నీనవలా
కన్నుల తూపులుగా వే
గన్నులదొరపట్టి గెలువఁగలవాఁడుసుమీ. 100

క. నిలువెల్లఁ గనులుగలవా
చెలువొప్పఁ గొమారుఁ డల్లఁ జెప్పెను చుఁ దా
నిలువెల్లఁగనులుగల విలు
బలువిడిఁ జేపట్టెరనఁ బఱతెంచెఁ గాన్పుఁ గన్. 101

వ. ఇంక మీకలికియు మీరును నాబుద్ధియుం దలఁచిన నుద్యోగం
యిట్టిదియె. 102

ఉ. ఈరీతిఁ బల్కఁ గల్గినయది న్యాయమె పేమి యిట్టి మీ
వారముగాము యందజము వారలపోలెనట్లు మమ్మునట్ల
వేఱుగఁ జేయ మీకుఁ దగునే యిది యిల్లును చెల్లు మాకునౌ
గూరిమికల్గు నై వడియె నూఱును మీకడ నింక నేటికిన్. 103

ఉ. జాలిని కేల మాచెలి జనంబులిపోవకచూడ్కి చేర్చి యా
వాలికి చెలువన్నిటికి మాకిటు మిమ్ము దై వమాపిపోరు వసా
చాలము తెల్లఁ దిజె నిజవ్వాఁ జెండ్లికొమారుఁ జేసి యా
మేలొనఁ గూర్పఁ జెట్టితిమి మీపయి నెట్టును దప్పదింతయున్. 104

గీ. కొమ్మనాక్రీడశోభను గూర్పుమాకు
నిపుడు మీకంటెఁ జుట్టంబు లెవరు లేరు
కావునను మీరలెన్నఁ గాక కోలకు
వేల్పు దొరపట్టి కడకేగి వెరవు మీఱ. 105

చ. కనికరమూని మాదొరకుఁ గన్పడి యీచెలియందు మున్నుగాఁ
గనిన కొమారు నీబలుకఁ గాఁదగుగట్టిగ నింక మీర లి
ప్పనిఁ బయివేసికొందుమని పల్కక యుంచక యన్నఁ జాలు మా
మనవి నిజంబు చేకుఱిన మాడ్కిన నెమ్మదినమ్మియుందుమా. 106

గీ. పదిగఁ గానిమాడ నేపాటివారమేము
మఱుఁగుఁ జొచ్చితి మెట్లైన మగువ నింకఁ

దప్పులెన్నక మన్నింపఁదగదెయిట్టి
చేతిపసితీర్పఁ దమకెంతసేవపట్టు. 107

సీ. పఁజేయువిన్నపం బీడేర్చుననుగదా
యేకీడుమాట నాలింపఁదప్పు
నీకఁగ్రీడిఁ దనపట్టినియ్యా నీకొల్పినఁ
గద మెండు నాగుండెకుదిరియుండు
నామేలిమాట నాయుమచెవివేయఁ గ
ల్గినఁగదా నెమ్మదివనటమానుఁ
బడఁతియాతని చెట్టఁబట్టఁ గాంచఁగనబ్బు
నాఁడుగాపండువు నాకుమిగుల
ననుచు మణిరేఖమఱియు నెయ్యమునఁబలుకఁ
బడఁతి జేనినెప్పుడు చెట్టవట్టునోయను
తమకమునఁ బల్కితినిగాని తమరుపలుకు
మాట ముంగొంగుబంగారు మూటమాకు. 108

గీ. అనిన నన్నెలవేలుపు కనఁలుమూసి
యపుడు లోనిచూపునఁదో యరయునట్లు
మదినిదలపోసి కనువిచ్చి మగువలార
మేముదపసులమయ్యును మీకుఁగాను. 109

క. తడయక కవ్వడికడకున్
వడిఁబోవఁగ నొప్పుకొన్న వారమువల మా
యొడయఁడును వేచియుండును
బడఁతీపోదుమని సెలవువడయుచునరిగెన్. 110

వ. అంత నక్కడఁ గవ్వడియును. 111

గీ. ఇచటనున్నట్టులేతన్ను నెంచుమనుచుఁ
జెప్పి సంగడికాఁడెంత సేపాయయ్యెఁ

బోయినాఁడాయె నిదె చాలఁబ్రొద్దువోయె
నచటఁబోయిన పనియేమొ యక్కఁగోలు. 112

గీ. అనుచుఁ దలఁచుచు నవ్వులవనుగఁ బెంచు
నెచ్చెలిమికాని దవ్వుల నెవ్వఁగాంచి
యెదురుచని చెప్పుమంత కోర్వదను లేక
చనినపని కాయెనో పండో యనుచు నడుగ. 113

గీ. ఏనుబోయినపని గాయమేలయగును
బనిని పండించుకొనిరె నేవచ్చినాఁడ
నిన్ను మున్నట్లు వీడ్కొని నేనుగదలి
తోలుతఁ గారుకోనలు దాఁటి తోఁటఁజొచ్చి. 114

క. ఎలజవ్వనముం దోలఁకఁగఁ
దోలుకారుమెఱుంగులట్టి తోడవులుగల యా
బలు సింగారంపు నెలం
తలలోపలఁ గూరుచున్న నాతుకఁ గంటిన్. 115

వ. ఆచక్కెరబొమ్మ చక్కదనమ్ముక్కించుక వక్కాణించెదఁ జక్కఁగా
వినుము. 116

సీ. బయలరిక్కలచాలు పాఱవైచినయెగ్గు
మలలనెల్లను బట్టువఱచునేగి
పవడంబులను బ్రమానుపడఁగఁ జేసినకీడు
సింగంబునడవిపాల్సేయురవ్వ
చందురులోఁగందు పొందించునారడి
చిగురులఁగ అకుగాఁ జేయుకొదవ
నెత్తమ్ములను లోఁతునీటవైచినరట్టు
బసిఁడికిఁ దావిఁగూర్పనికొఱంత

కలికిగోరులు సిబ్బెంపుగబ్బిగుబ్బ
లలఁతి మోవియు నసముఁగో నలరుమోము
నొనబుచేతులు తెలిగన్ను లొనరుమేను
జేసినత్తమ్మిచూలి పోఁజేసికొనియె. 117

గీ. ఈమ కలిగించియును బువ్వుబోఁడికీడు
కలుగకుండఁగ నొనరించె నలువయార
తలఁచిచూచిన నేదియో తమ్మిచూలి
బక్కగావింపఁగాఁబోలు నిక్కముగను. 118

గీ. నలువ తమ్ములఁ గల్వలఁజెలువుమీఱఁ
జేసి యవి రేయుఁబవలును జెన్నులేని
వాటపాడగాంచి యీరెంటి నేటఁగలిపి
కలికికన్నుల ననయంబు వెలుఁగఁజేసె. 119

గీ. నేలపై నంటులుంట యేమేలివింత
యనుచు మదినెంచి వింతసేయఁగఁదలంచి
నలువ యనఁటులపై నేలకలుగఁజేసె
నెలఁత తొడలును మొలయునన్ నెపమువెట్టి. 120

ఉ. మించులఁ గెంపుల న్నెలను మేలియనంటులఁగూర్చి నల్వమై
మించును వాతెఱ న్మొగము మేల్తొడలుం దగఁజేసి వానిలో
నించినతళ్కునన్ బిగియు నీలియు నాకును దీసిచూపులున్
బించపుఁ గుబ్బలుం దుఱుము వీపు నొనర్పఁగఁబోలునింతికిన్. 121

చ. అలతలకట్టు లింతితఱు లన్న కనుల్నిడుదల్పెలంది చె
న్నలరెడు బొడ్డువట్రుసుడి నాతుకనై కపుఁగొనునున్న బం
తులు ననబోఁడి చన్నుఁగవ దొంతిగవిద్దెలు రూపుపూని యీ
వెలఁత నెపంబునం బుడమిమీఁదను గ్రుమ్మరుచున్న వారయన్. 122

గీ. నేరనేఁటి యసట మిాఁదు న్నిఁమర్చి
నాతిచెలువంబుఁ జేయుచోఁ దాతకాఁక
మగువనెన్నుదు మొదరింప మఱచిపోయె
ముదిమివచ్చినతతి నెల్లు మదులుపలుదు. 123

క. చన్నుఁగవ యొందముఁగను
చన్నుఁగవయుం గలఁగు వటకివృన్నగ
నెన్నడుముఁను గనితలఁచతి
నెన్నఁడు మనుగనియెఱుంగ మిాయుపదనుమగా. 124

గీ. కలిమి కొంకంతకన్నను గరముఁగలిగి
జాయిగానుండె బిగిగుబ్బ దోయిమాడ
మొంపు నెత్తమ్మిమొగ్గల నిండియుండి
గొప్ప మొసలిచేసిన మేటికొలఁకుఁబోలి. 125

క. పలువరుసలల్ల మల్లెల
పలువరుసలనంగవచ్చుఁ బైదలి చెలిక
న్నైల వగచూపు తెగలు క
ల్వలవగచూపు తెగలనఁగవచ్చును జేఁడా. 126

గీ. అనిమతిఁయుఁ జెప్పఁబోవఁగ నతఁడు చెప్ప
మాటకడ్డంబువచ్చి యమ్మేటితేఁడు
నిట్టలంబగు తమకంబుపట్టలేక
తనదు సంగడికానితో ననియెనిట్లు 127

చ. పొదలెడు వేడ్క నీవిపుడుపోయిన కర్జముమాటమాని నీ
కొదుఁగనిచేతఁగాని పనియొక్కటి పైనిడుకొంచు నేమిరో
చదివితివింతసేపు నీకఁజాలుఁబొగ త్తలు కట్టిపెట్టి యిం
పొదవఁగఁ దొత్తఁడెల్పు ననుమగ్నలికై కొన నిచ్చగించుటల్. 128

చ. అను చెలికానితత్తరము నంతయుఁ గన్గొనితాను జేని పీ
డ్కొని యటుపోవుటల్ మొదలుగుఁ బ్రైతలుండిన పూవుఁదోఁటకుం
జని పలుకాడుటల్తుదిగఁ జక్కఁగనంతయు విన్నవించియొ
య్యన జెలికత్తియల్ పలికినట్టి తెఱంగెఱిఁగించి యిట్లనున్. 129

గీ. నిన్ను వేఁడెద మన్నించి నన్నొకింత
పలుకుచెవిఁబెట్టి యాకన్నెవలన నీవు
మున్ను గన్నకొమారుని వన్నెమీఱ
నెలమి మామకుఁ బెంపుగ నియ్యవలయు. 130

గీ. ఇంతవట్టును జనవిప్పుడిత్తువేని
కొమ్మ తప్పకిప్పుడు నీదుసొమ్మెసుమ్మి
నేనుజెప్పితిఁ గని వెన్క నేరమిడక
యిపుడ ముందుగఁ జక్కఁగ నెంచుకొమ్ము. 131

ఉ. ఏలతలంప వేపలుకు లించుక దేవరయానతిచ్చినం
జాలును నేలజేని సరసం దగ నేలినవారికర్జమున్
పీలుగ మాటవెంబడిని విన్నపమానఁజేసి వ్రేల్మిడిన్
మేలొనఁగూర్చి వత్తునను మెచ్చఁగ నిప్పుడ పోయివచ్చెదన్. 132

వ. అనిన గారవంబున విశారదున కానేల తేఁడిట్లనియె. 133

క. సతమును గోరికలూరఁగ
నతివఁగవయ నెప్పుడెప్పు డనుచుండఁగ నిం
తతడవు జెప్పఁగ నేటికి
బతిమాలఁగ నేఁడు క్రొత్తవాఁడనె నీకున్. 134

చ. పలుకులిఁకేల నీపనువుపన్నఁగఁ జేసెద నెన్నఁడైన నీ
పలుకున కడ్డమాడుదునె పట్టినొపంగద తేపెపోయి యా
పొలఁతుక కన్నతండ్రికడ ముచ్చటలాడుము మేలునెంచి నీ
కెలమి నిఁకేఁఘియిచ్చినను నించుకయేనియు నప్పుదీఱునె. 135

గీ. అనుచుఁ గొనియాడి చెలికానిఁ జనువుమీఱ
మగువపలికిన పలుకులు మఱియుమఱియు
నడిగి విన్న వేవించు నెయ్యంబుమిగుల
వేడ్కపడుచుండెఁ గవ్వడి విసుగులేక. 136

వ. అనినఁ దరువాతికత చెప్పుమని జనమేజయుం డడుగుటయు. 137

నిరోష్ఠ్యకందము. రక్కసితేండ్లఁగలనన్
జక్కడఁచి యలతెఱగంట్ల సాఁకెడిదిట్టా
చక్కఁగ నెల్లరసేగిం
జిక్కఁగనియ్యక యరసెడిజేజేరాయా. 138

ఉత్సాహ. చుట్టువాలు కేలఁబూని చూడువిన్నఁ జంపి చే
పట్టువాఁడఁ గ్రీడినంచుఁ బన్ని తేరుడిగ్గి వే
పట్టుపట్టి విన్నువాఁకపట్టిమీఁది కేగుచోఁ
జట్టిక్రీడి వెన్కకీడ్వ బాగుమీఱువేలుపా. 139

గద్యము.

ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధమహాకావ్య రచనాచాతురీధురంధర సద్యశ్శోబంధుర కందుకూరి వంశ పయఃపారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్య పుత్ర సుజనవిధేయ వీరేశలింగ నామధేయప్రణీతంబయిన రసిక జనమనోరంజనం బను ప్రబంధరత్నము నందుఁ దృతీయాశ్వాసము.

రసికజనమనోరంజనము

చతుర్థాశ్వాసము

క. సిరిపడఁతి యెడఁదనెప్పుడుఁ
గరమలరఁగ గొల్చువారిఁ గడుఁగూరిమితో
నరయుచు నెల్ల జగమ్ముల
వెరవారఁగ బ్రోచుచుండు వేల్పులవేల్పా. 1

వ. వైశంపాయనుం డటమీఁద నడచినకత జనమేజయున కిట్లని చెప్పం
దొడంగె నట్లా బూటకంపు నేలవేలుపు నూటిగామాటలాడి యనా
చేడియలన్వీడ్కొని క్రీడికడకు న్వేడుకమెయిం జనిన వెనుక నన్నెచ్చె
కంటి తమకంబు హెచ్చిపెచ్చుపెరిగెడి మరుచిచ్చున వేఁగంబొచ్చిన
నెచ్చెలులెల్ల బెల్లుగఁ దల్లడిల్లి యుల్లంబులోని యూరటంబు దీఱ
నూఱడింపుచుండ. 2

క. పడమటిమల కలుగులలో
నడఁగిన యిరులను గడంక నవలికిఁ దఱుమన్
వెడలెడి వడువున నడిచెను
బడమటికొండకును బ్రొద్దువడఁగెం బడరన్. 3

చ. అదనదితప్పి వేఁడివెలుఁగత్తమిలన్ దడమెత్తుపాముగా
ముదొరవినంపుమంటలనఁ బొల్పగుఁ బడ్మరసంజకావి, పైఁ
గుదిరిన సందెచీఁకటి తగుంబొగయట్లు, చెలంగు నల్లత్రాఁ
చుదడములట్ల చీఁకటులు, చుక్కలొగిం దలమానికంబులౌ. 4

గీ. గొండ్లిసలిపెడి యురవడి గుబ్బలల్లు
జడలగుంపులువీడి యీపుడమి నెల్ల
నలముకొనియె ననంగను నలుపుమిగిలి
కటికిచీఁకటి యెల్లెడఁ గ్రమ్ముకొనియె. 5

చ. అలరెడు రేవెలంది చెలువారఁగఁదాల్చిన కావిరంగుదు
వ్వలువవదల్చి చందురని వావిరిఁబొంకఁగఁగోరి మల్లెమొ
గ్గలుగల నీలిచీర మెయిఁ గట్టెననంగనుజూడఁగొప్పెఁ జు
క్కలగమితోడఁ జీఁకటులు కన్నులపండువుగాఁగ నయ్యెడన్. 6

ఉ. గొంగలుదూఱుచున్వడలి గోడలుదూఁకుచుఁ బొంచిపొంచి బల్
సందడిగాకయుండఁ జిఱుసందులవెంబడిఁ దావుఁజేరుచున్
పందియమంద కాఱడికి సైఁచుచు సాముల మోసపుచ్చుచుం
జెందిరి కోరుకోరికలఁ జేరిబొజుంగులు దొంగలుందగన్. 7

సీ. తమ్ములకు దాయయౌటేఁడు తాజగమ్ము
నంచుఁ జొచ్చియుంటకుఁగాను ముందుపంపి
నట్టి తెలిగుడారమనంగ నమరెఁ దూర్పు
దెసను దెలివన్నె కలువలు తెల్వినొంద. 8

ఉ. చుక్కలటేఁడు చీఁకటులసూడు వెలుంగులటేని ఱేఁడు బల్
జక్కనపుల్గుమొత్తముల సారెకునేచెడువాఁడు చక్కనౌ
మిక్కిలి కంటిదేవరకు మేల్నగయై తగువాఁడు కల్వలన్
మక్కువఁ బ్రోచుటేఁడు మరుమామ కనంబడెఁ దూర్పుకొండపైన్. 9

చ. తఱియను వేటకాఁ డిరులదండను కోయిలగుంపుఁబట్టఁగాఁ
బఱచి వలన్నిగిడ్చె ననఁ బర్వెను దూర్పునఁదెల్పు, ఱోఁజగు
ళ్ళెఱకయి పెట్టినట్లు నెలయింపగుఁ, బడ్డ పులుంగనంగళం
కొఱపగుఁ, గాంచి పర్విడెడు నోయనఁగోయిల లేగుఁజీఁకటుల్. 10

చ. కొమరువెలుంగు రేవెలఁది కొప్పునఁజీఁకటి, కొప్పుపూలునా
నమరును జిక్కఁచాల్, నెలయొయ్యారపు రాగిడిబిళ్ళయట్లగున్,
సమకొనుకందు లోనిడిన నల్లనిఱాయన నొప్పు, రాగిడిన్
జమలిగఁ జుట్టుమల్లెలనఁ జందురుచుట్టును దెల్పుగన్పడెన్. 11

గీ. తమినిరేవెలంది యిడుగందంబు మేనఁ
దాఁజలువల తేఁడప్పుడు తాల్చెనఁగఁ
దెల్లనయ్యెను జందురుండల్లనల్ల
నెల్లకడలను వెన్నెల లల్లుకొనియె. 12

సీ. నెఱతావులుచెలంగ నిండారవిరిసిన
మల్లెపూవులతోడ వెల్లివిరిసి
కప్పురపుటనంటి విప్పుఁబోరలరాలు
కప్రంపుఁబోడితోడఁ గలసిమెలసి
కమ్మవిల్తునిదాయ కాపురంబై తగు
వెలిమలజిగితోడ వియ్యమంది
కలివేల్పునిల్లాలిఁ గసిపెంపుగాంచిన
పాలమున్నీటితో మేలమాడి
మెండికొనియుండె బువినిండ వెండికొండ
కొండపిండులఁ జెండెడు దండిహత్తి
పిండికలకండ వెలిఁదమ్మి దండఁదెగడి
పండు రేయెండదండులు నిండుజిగిని. 13

వ. అత్తఱి నాబిత్తరి చెలికత్తెలతోడ నత్తోఁటలోనుండి నిండుకొన్న పండు
వెన్నెలతెగల సెగలకుం దాళంజాలక. 14

ఉ. చెందొవవిందు దండడినిఁ జిందఱవందఱ చెందికుందఁగాఁ
జిందురుచిందఁ, గొందలముచెందఁగ డెందము కందుఁడందపుం
గెందలిరుం దగందొడుగఁ, గ్రిందుపడందగు పొందికందొగల్
సందడిచిందఁ దుందుడుకు చందముఁబొంది వెలందివందురున్. 15

ఉ. నెయ్యపుటొజ్జలోఁగఱపి నిచ్చలునూల్కొలుపంగ నోరె మొ
మ్మొయ్యన సన్నగించి మదినొంటిగనల్ల జగంబుచుట్టమున్

నెయ్యమునం దలంపుచును నిల్చినవన్నియు మానఁగా నతం
డయ్యెడఁ బ్రోలఁగన్నడె నొయారియుఁ బ్రాలెను గన్నుమాయుచుక్. 16

వ. ఇట్లాతండు తనకన్నులఁ బ్రోలఁగిలిచినట్లయిన మదికలంగి యచ్చెలువ
యొక్క నెచ్చెలితో నిట్లనియె. 17

ఉ. వీఁడుగదమ్మ నావలపు వీడఁడిచేసినవాఁడు, పొన్నపూ
వీడుగదమ్మ లోఁతయిన యీతనిపొక్కిలి కింకనావెతల్
వీడుఁగదమ్మ నన్నిపుడు వేయిదఁజేర్చిన నీతఁడున్నయా
వీడుగదమ్మ నేలఁగల వీడులఁ గోపల మేటి బోటిరో. 18

వ. అని పచ్చవిల్తుని నెఱచిచ్చునం గ్రాఁగుచు మఱియుం బలవింపం
జొచ్చిన నెచ్చెలులు చలువపనులు సేయందలంచి. 19

సీ. చేడియయడుగులఁ జిగురాకులుంచిరి
యింతిచన్నులఁబూవుబంతులిడిరి
పొలఁతితొడల నంటిపొరలనంటించిరి
ముగుదపొక్కిటఁ బొన్నపూవులిడిరి
యువిదవాల్గన్నులఁ దొవరేకులద్దిరి
చానకెమ్మోవిఁ బూఁదేనె యిడిరి
తొయ్యలిచేదోయిఁ దూండ్లను బెనఁచిరి
కొమ్మకేల్గవ విరిదమ్మిలిడిరి
యతివ యడుగులోనగు వానికవ్విసాటి
కావొ సరియౌనొయని చూచుకరణిఁజెలువ
చెలులు కావించిరొక్కటఁ జలువపనులు
వానివానిని బోలినవానిగూర్చి. 20

వ. అంత నొక్క ప్రోడచేడియ వారలంజూచి 21

సీ. మరుచిచ్చుదరికొని మండెడు నెమ్మేన
వీవనల్ బూని విసరవలదు

కంటికాటుక నీటఁగందైన చెక్కుట
ద్దంబుల గందంబుదార్పవలదు
వలపుచీఁకటిబెంపువాసిన తుఱుముతేఁ
టులసంపెగల్చుట్టఁ దలఁపవలదు
బలువిరాళ్ళంపుఁగాఁకలఁ గందు చనునిమ్మ
పండులఁ గప్పురం బలఁదవలదు
దెసల నల్లను బర్వుచు దిటముచెంది
పిక్కటిల్లుచు వెలుఁగొందు చుక్కలదొర
కాయు వేఁడివెన్నెలలంకుఁ గలుకులార
పెట్టవలదు తామరకంటిఁ బెంపుమీఱ. 22

వ. అని యాచిత్రాంగదవంకం దిరిగి. 23

సీ. కైదమ్మి మోముచుక్కలరేని సెగఁగందం
జెక్కునఁజెయ్యేలఁ జేర్చెదమ్మ
జారొప్పుచీఁకటిఁ జనుజక్కవలుగుందఁ
జానరో కురులేల జార్చెదమ్మ
నునుముక్కు సంపెఁగ నూగారుతుమ్మెదల్
బడలంగ మోమేల వాంచెదమ్మ
మినుకుకాటుకనీట నునుఁజెక్కుటద్దముల్
మాయఁగన్నీ రేల పఱపెదమ్మ
చేయి దామరచెక్కునఁ దీయవమ్మ
ముంగురుల్ జాఱనీకమ్మ మోము మీఁది
కెత్తవమ్మ కన్నుఁగవ నీరొత్తవమ్మ
పలుకువినవమ్మ లేవమ్మ పసిఁడిబొమ్మ. 24

గీ. గట్టువిలుకానినైన నను గడియలోన। క్రిందుపఱుపంగఁజాలిన క్రీడియంత
వానికిని దుంటవిలుకాని బారిపడఁగ।నీకనినుఁగాచుటొకబరువే నెలంత.

గీ. నేటరేవట నీకమున నేలవేల్పు
మన్ననను జక్కఁబడునన్ని మానువెతల
ననుచు ననబోఁడిఁ గనుఁగొని యంచవలన
నూఱట యొకింతగాన కయువిదమిన్న. 26

వ. తోడి చేడియలతోడ. 27

క. మునుకొని మరుఁడ్కై వడి
నవబోఁడి మెఱుంగుఁ జనుల నడుమున మెఱుఁగుం
జనకుండ గుఱిగనేయుట
గనవింటికె కన్నులుంపఁ గాఁబోలుఁజుఁడీ. 28

ఉ. చేతులు తమ్మిపూఁజెలసుచుఁ జేరినయంచలు కొప్పుజూచి వే
ణీతున నల్లమబ్బనుచు వెన్జనఁ, బంపిన గాలినారు పా
మే తఱుమంగఁ బువ్విలుతుఁజేమిటఁ జామనుగెల్వలేమిఁ ద
ర్వాత నెమళ్ళఁగూర్చెఁ బగవానికొమారుని వారువంబులన్. 29

వ. అనిచెప్పి యప్పుడు చెవులుచిల్లులువడఁ గముఁగూయు కోయిలలు
మొదలయిన వానిఁగూర్చి పేర్చిన కినుక పెంపున నిట్లనియె. 30

సీ. ఒరులపంచలఁజేరి యున్నట్టికోయిలా
యెందుకునీకింత యెరిగ్గిపాటు
నిలువఁజోటునులేక నింగిఁ బ్రేలెడు చంద
మామ నీకేల ద్రిమ్మరితనంబు
చచ్చిచావనివాని చాటునునున్నట్టి
మరుఁడనీకేటి కీమండిపాటు
కదిసికొమ్మలపాల బ్రదుకఁగాంచిన తుమ్మె
దా యేల నీకింతయదరిపాటు
మోహమునుబోలె నిపుడు మా మెలతతోడఁ
రొక్కమాటనుంటయును మోమోటమియును

లోని చుట్టఱికంబును జానుమీఁకు
చూపుచెలికారమును గొంతచూడవలదె. 31

క. కలువలదొర యల్లుఁడవై
కలువలె పూపులుగఁదాల్చి కరమలరెడు నీ
కలుకమెయి నక్కటకటా
యళుకొందిన కలువకంటి నలఁచుటతగునే. 32

వ. అని మంచిపూటల నెంతవిన్నవించిన సంచువిల్కాఁడవలవ నించు
కంతయు నక్కటికంబుగానక కటకటంబడి పడంతియూ వెసవిల్తునిట్లు
దూఱందొడంగె. 33

ఉ. ఒజ్జలకాపురంబు మొదలూడఁగద్రొబ్బిన రేయిద్రిమ్మరిన్
బజ్జను జేర్చికొంటివఁట ప్రగ్గడగాఁగను గన్నతల్లులన్
విజ్జనవీడనాడిచెడి వేఁబలుగాకులఁ గూడుపుట్టు గు
డ్లిజ్జగమందు నీకుడడమేయఁట యింతులదోస మెట్టిదో. 34

గీ. చేతఁ జెఱకువిల్లొక్కటి చిక్కఁబట్టి
కంటఁబడకుండఁ బూఁదూపుగములు నాకె
దేల నికమీఁదఁ దూపులు నేలఁగలియఁ
బీల్చినీవిల్లు వేళ్ళెడిఁ బిప్పియినుదు. 35

గీ. తోడఁబుట్టినదనియైనఁ జూడకేపుడు
నీకు తల్లియిల్సిరిగూల్చి నీదుపగతు
కడనుదలమానికంబయి గరువపడెడు
నెలను జెలిఁజేసికొంటచేఁ దులువవీవు. 36

గీ. అని మరు మఱియుదూఱఁగ నతివయొకతె
కంటఁబడకుండు మరునేలకఱకులాడ
మింటఁగడుమండు నెల చానమేనుగాఁడ
వనుచుమరలింపఁ జందురుఁగనుచుఁ బలికె. 37

గీ. ఒకటి రెండువాఁడులు చెల్లియున్నవాఁడె
చూడరాదని నినుఁ బెద్దలాడుచుండ
పెద్దవాఁడవై మిన్నంది మెలఁగునిన్ను
జానలకుఁ జూడవచ్చునే చందమామ. ౩౮

గీ. తమ్మికంటియటంచు మాతల్లి బోఁడి
పలుకమెయినలంచెద వేమొ యట్లుకాదు
కలువకంటియెసుమ్ము మాకలికిమిన్న
కనికరముచూపి కావుమో కలువఱేఁడ. 39

చ. సిరికిసిదోడఁబుట్టువయి చెన్నుగ వెన్నునకున్ మఱందివై
యరపదిమోములున్నదొర కౌదలసందపు మానికంబవై
మరునకు మేనమామవయి మన్నన నత్రికి ముద్దుపట్టివై
కరమలరారు నీకిటులు కల్కులనేఁచి కలంచఁబాడియే. 40

చ. ఒరులకుఁ జేరదవ్వగుచు నొజ్జలకొంపనుదీసి తమ్ములం
గరము బడల్పడంబఱపి కాంచినతండ్రికిఁ బోటు తెచ్చి వం
కరతనమల్ల చిన్నపుడె కాంచి కరంబునునీవు రేయిత్రి
మ్మరివసి పేరుపొంది యిఁక మన్ననఁ జూతువె యాఁడువారలన్. 41

మ. కడలివ్వార్వపు టగ్గితోఁబొడమి వీఁకన్మీఱి వేవెల్గు నె
క్కుడుకాఁకంగడువాఁడిమిన్నిలనెలం గూడందగంజాలి యె
ప్పుడుఁ బెన్నిప్పు గాముకోఱల విసంపుంజిచ్చుకున్ పైఁచి యా
పుడమిన్నిన్నులుముట్టు నీకుఁ జలువల్ పుట్టంగ నెట్లబ్బెడున్. 42

సీ. నీదువెలుంగులు నెఱకాఁకలోటను
జాలనీరగు నెఱజోలె తెలుపు
నీవడతకరంబు నీతంబు తప్పాట
నువిదఁగోల్పడిన నీయొజ్జ తెలుపు

నీదువెన్నెలగముల్ నెఱవాఁడులౌటను
దలవాల్పు తమ్మిమొత్తములె తెలుపు
నీరూపు చూపఱకోరువరాకుంటఁ
గవవిడియేగు జక్కవలె తెలుపు
పిట్టినీవలనను మేల్మి యెట్లుగలుగు
పరగనీరూపు నానాఁట సన్నగించి
పిదపఁ బదియాఱువ్రయ్యలై పెద్దపాము
నిన్నుమ్రింగిన నెలఁతల నెగులుదీఱు. 43

వ. అని చందురుం దూఱి యుల్లంబు జల్లన మెల్లన మేనెల్లఁ జల్లులువోవఁ
బెల్లువీచు చల్లగాడ్పుఁగూర్చి యుల్లన నిట్లనియె. 44

గీ. లేడికన్నులుగలది యీ లేమమిన్న
లేడినెక్కుచుఁ దిరిగెడువాఁడవీవు
నిట్టి చుట్టఱికంబుండ నింతిసేచఁ
దగునె తనకీవె యుసురని తలఁచియుండ. 45

చ. జగమునకీవుకీడు గడుసల్పెదువంచును దమ్మిచూలి నె
వ్వగనిను నొక్కమూలఁ బడవైచెను దానవడంగకున్న నిన్
దగమెసవంగఁ బాములకు నాల్కలు రెండొనరించి వానికిన్
జగమున వేయియేఁడులుమనన్ బ్రదుకిచ్చెనుగాదె పయ్యెరా. 46

వ. అని యెల్లయెడలఁ బిక్కటిల్లి మిక్కుటంబుగాఁ బెక్కువగలఁ జెవులు
వగుల నఱచుచుండు గండుఁ గోయిలలు లోనగువానింగూర్చి
యిట్లనియె. 47

సీ. కొమ్మలనదలించు కూళపయ్యెరపిన్న
చలపట్టినిన్నుఁ బాములుమెసంగ
కాకిమూఁకలలోనఁ గలసిమెలంగుచు
గేరుకోవెల నీదు నోరుపడను

పంజ్లకొఱుకుచు నిల్వక యెగసిపడెను
చిలుకనీ బ్రతుకెల్లఁ జెల్లఁగలయ
పురుటింటిబూచులపోల్కి నివ్వెఱగొల్పు
తుమ్మెదానీ త్రుళ్ళు తుప్పలెక్క
గంతులిడుచును దెరువర్లఁ గలఁచుచుండు
నెమ్మి నీయాటలెల్లను నేలఁబడను
నీళ్ళు నములుచు మగువల నెగులుపఱచి
నిక్కరాయంచ నీతిండినీరుగాను. 48

వ. ఇట్లు దూఱుచుండ. 49

ఉ. పిట్టలుగూసెఁ జీఁకటుల పెంపెడఁబాసె మెఱుంగు రిక్కచాల్
బిట్టుగమాసె జక్కవలు వేడుకనొందొరుడాసెఁ గల్వతె
ప్పట్టునఁ దెల్వివాసె వెతవాసిన తమ్ములుపొంగి తేంట్లకున్
నెట్టనవిందుచేసె విలునేర్పునమాసె మరుండువేఁకువన్. 50

గీ. వెచ్చకాండ్రమదుల వేడుకడిందంగ
పాఱులలరి పగటిపనులకడర
వడిగఁగాఁపువారు పనిపాటలకుఁబోవ
తూర్పు కొండమీఁదఁ దోఁచెఁ బ్రొద్దు. 51

ఉ. క్రిందటిరాఁడె యట్లరిగి క్రీడిపయింగడువాలుఁగంటికిన్
డెందము చిక్కియుంటయును డీల్పడి పెన్వలవంతనింతిదాఁ
గుందుచునుంటఁ గ్రీడి యిటకుం బనిమీఁదను వచ్చియుంటయున్
గుందునఁ జిత్రవాహనునకుం దగఁ దెల్పెను జిల్కలర్మిలిన్. 52

చ. తెలిపినఁగొంతసేపు మదిఁ దేఁకువదూలియుఁ దెల్విఁగాంచుచున్
మెలపునఁ గ్రీడియల్లుఁడగు మేలిపుడే యొడఁగూడఁ జేసికో
వలెననియెంచి ప్రగ్గడలఁబంచెను గవ్వడిపాలి కప్పుడే
వలసిన మాటలంగఱపి వారిని వీటికిఁదోడితేరఁగన్. 53

క. తగువారల వెంటంగొని
ప్రగడలుచని క్రీడిఁగాంచి వరుసగఁ బలుకం
దగుపలుకులాడి విందుగ
నగరికి విచ్చేయవేఁడ నగుచునతండున్. 54

క. గారవమునఁ దమ్మిందొర
వారటుప్రగ్గడలఁబంచి వాసిగఁ బిలువం
గారాకుండుట తగదని
కూరిమి నేనుంగునెక్కి గొబ్బునఁగదలెన్. 55

గీ. ఆముసేనుఁగుపై నెక్కి యర్జునుండు
రాచనగరికిఁ బోవుచోఁ జూచువారు
వేయికన్నులవేలుపు బిడ్డఁజూడ
వేయికన్నులెవలెనంచు వింతపడిరి. 56

గీ. పొడుపుఁగొండమీఁదఁ బ్రొద్దువెల్గెడునట్లు
వెలుఁగుచతఁడు వీట వెడలునపుడు
మెలఁతుక లపరంజి మేడలపయినుండి
యలరువానగురిసి రతనిమీఁద. 57

గీ. క్రీడివేంచేయుచున్నట్టి జాడ తెలిసి
వడిగఁ దగువారితోఁ జిత్రవాహనుండు
గారుపై నెక్కి యెదురేగి గారవమునఁ
దోడుకొనితెచ్చి విడిదిలోఁ దొరనుఁనిలిపె. 58

గీ. విడిదిచేరినపిమ్మట వేడ్కమీఱ
నేకతపుటిల్లుచొచ్చి వారిరువురింత
మంతనంబున నేమేమొమాటలాడి
యేగుదెంచిరి సభ్యకోం చివలకపుడు. 59

వ. అంతనంతసంబునఁ జిత్రవాహనుండు తగుపోఁడిమిఁ గ్రీడినివీడుకొని తనయింటికిన్వచ్చి పెద్దలంజెచ్చెరరావించి పెండ్లికిదగిన మంచిముహూర్తంబు పెట్టఁడని కట్టడయిడి యూరుగై సేయఁ జాటంబంచిన. 60

సీ. కస్తురిపన్నీటఁ గలయంపిచల్లించి
గోడలుజవ్వాజి తోడనలికి
ముగ్గులుకట్టాణి ముత్తియంబులఁబెట్టి
నెలతాలతోడఁ దిన్నియలువైచి
డంబైన పగడంపుఁ గంబముల్నాటించి
తెల్లక్రొవ్విరులఁ బందిళ్ళువేసి
తోరంపుఁబచ్చలఁ దోరణంబులుగట్టి
రతనంపుదివ్వెలు జతనుపఱచి
కలయబంగరుపని మేలుకట్లుకట్టి
వాడవాడల హొంబట్టు పడగలెత్తి
తావులమెఱుంగుఁ గురువేళ్ళ దడులుకట్టి
వీడుకై సేసి రెలమినవ్వీటివారు. 61

గీ. పెండ్లిపనులెల్లఁజేయించి పేర్మితోడఁ
జుట్టములనెల్ల రావించిసొబగుమీఱ
విడిదిలోవలసినవన్ని వెసనమర్చి
లగనమిదెడాసెనని ఱేఁడు తగఁగఁబలుక.

క. తలయంటుకొనఁగఁ దఱియని 62
చెలియొక్కతె క్రీడితోడఁ జిలుకమెఱుంగుం
గలకలమనినగు జిలిబిలి
పలుకుల వలపొలయ విన్నపంబొనరింపన్. 63

క. ఇదెవత్తు మీవుపదమని। కదలి యనుఁగుఁ జెలిమికాని కైదండం బెం
పొదవఁగఁగొని వివ్వచ్చుఁడు। కదిసెంజలకంబులాడు గరుడలచవికెన్.

వ. అట్లు కదిసియచ్చట నెచ్చెలిమికానితో ముచ్చటలాడుచుండ. 65

చ. పలుకులలాగు నెమ్మొగము బాగును మీసము నూగు నొక్కపై
యలరుటకోర్తె యబ్బపడి యప్పటి పాటునఁగా నెఱింగి న
చ్చెలిగమిఁజీరిచెప్పె మనచెంగటముక్ బుపుదోఁట నేగిమిం
బలికినయల్ల బూటకపు మాటలమూట యితండెయంచటన్. 66

క. తనగుట్టు బయలఁబెట్టక। పనిచేయఁగ నోడయుఁడెంత వడిగలవాఁడే
ననబోఁడి గుట్టరయ నీ। యన సింగారించి పంచెనని నగిరిచెలుల్. 67

ఉ. ఆయెడ నింతియోర్తు మదినాఁగకకోర్కులు క్రేళ్ళుదాఁట నే
మోాయనఁబోవు నెచ్చెలిని మోవిపయిం జిఱునవ్వు మొల్కలే
పై యిగురొత్త గన్నయిగ నల్లనమానిచి జాఱుపైఁటఁజం
దోయికిఁ దార్చుచుంబలికెఁ దొంగలిఱెప్పల నొప్పులీనఁగన్. 68

గీ. మేలుగూర్చినవారికి మేలెకలుగుఁ
గావునను మనమీాజన్నిగట్టు నిపుడు
తోడఁబెండ్లికొడుకుఁజేయఁ దొడరవలయు
మనువుకూర్చినపనికిఁగా మగువలార. 69

గీ. అనిన ముసిముసినగవుల నల్లఁబూని
యొండొరుల మోములనుజూచి యొక్కరొకరు
కన్నుసైగల నేమేమొ యెన్నుకొనిరి
క్రీడియనుగూర్మి సంగడికాఁడునంత. 70

గీ. తేటరతనంపుముక్కలిపీట తెచ్చి। వింతకపురంపుఁ బొడులతోఁ బెట్టినట్టి
ముగ్గులోపల వేయంగ బుడమితేఁడు।వచ్చికూర్చుండెనద్దానిపై నినవుడు

సీ. కురులు చిక్కులుతీసి క్రొత్తసంపెఁగనూనెఁ
దలయంటెఁ జిలుకలకొలికియోర్తు
పచ్చకప్రము చాయ పనవున మేదించి
నలుగిడెనెమ్మేను నాతియోర్తు

మంచిగంధపుఁదావి మించిగుబుల్కొన
నటకలితలనిడె నతివయొర్తు
బంగారుబిందెలఁ బన్నీరుగొనివచ్చి
జలకంబులాడించెఁ జెలువయొర్తు
నీరుముమ్మాఱు తలచుట్టు నెఱయఁద్రిప్పి
తడవుమనుమని దీవించెఁ బడఁతియొర్తు
రతనములపీట దొరదిగి రాఁగ నెదుట
నిలిపె బంగరు పావలు నెలఁతయొర్తు. 72

సీ. జిలుఁగుజెంద్రిక వన్నె చేలచెఱంగునఁ
బెన్నరు ల్తడియొత్తెఁ గన్నెయొకతె
గమగమవలపులు కషలుముంచుకొనంగఁ
జూసరుల్ సిగఁజుట్టె బోటియొకతె
పెళపెళలాడు దువ్వలువపింజెలుపెట్టి
వెసఁజేతికందిచ్చె వెలఁదియొకతె
రతనాలపనిమేలి రవణంపుగుంపులు
నెమ్మేనఁగీలించెఁ గొమ్మయొకతె
పొలఁతియొక్కతె జవ్వాజిపూసెమేనఁ
జెలువయొక్కతె పన్నీరుచిలికెఁబయిని
పూసురటివీచెఁ దలిరాకుబోఁడియొకతె
నిలువుటద్ద మొక నెలంత నిలిపెమ్రోల. 73

గీ. ముద్దుకస్తురినామంబు దిద్దెనొసటఁ
బెండ్లి పల్లకిలో నెక్కి విడిదివెడలి
యరిగె వియ్యపువారింటి కచటమున్నె
మించుబోండ్లు చిత్రాంగదఁ గొంచుఁబోయి. 74

సీ. చలువవెలఁజాలు జలకంపుసాలలోన। మేలిమిపసిండిపీటపై మెలఁతనునిచి
తేటపళ్ళెరమునఁ గెంపుదివ్వెపెట్టి। జవ్వనులు పాటపాడినివాళియియ్య.

ఉ. పయ్యెదజాఱఁ జెక్కుఁగవపై జిఱుచెమ్మటలూరఁ బూనరుల్
కయ్యముగోర లేఁగవును గబ్బిచనుంగవ దూఱ జాఱు కొ
ప్పొయ్యన వీపుఁజేర వెసనూర్పులు పైపయిఁ గ్రమ్మ దేరఁ దా
నయ్యెడ నింతియోర్తు తలయంటఁదొడంగెను వాలుఁగంటికిన్. 76

ఉ. పాయనివేడ్కఁ దావి వెలిఁబర్వఁగ సంపఁగినూనెయంటి క
ప్పైప యిరిగుంపు పెంపుగెలువంగల నిద్దపు సోగపెన్నెరుల్
పాయలుతీసిదువ్వి చెలువమ్మగఁ జిక్కులువాపె నింతియో
ర్తాయెడ లేఁత కెంజిగురుటాకులఁగేరెడు కేలుఁదమ్మిలన్. 77

గీ. పునుఁగుజవ్వాది మేదించి పెనఁచినట్టి। తావికుంకుమపొళ్లతోఁ దలిరుఁబోఁడి
మేననలుగులు వెట్టెను మెలఁత యోర్తు। గబ్బిగుబ్బల వ్రేఁగునఁ గొనువడఁక.

గీ. సోలి సంపఁగినూనెచే సొమ్మసిలిన। పెన్నెరుల నెడుతుమ్మెదపిండునకును
వెసనుసేద తేఱఁగ ముందు వేయుకరణి। గురులకటకలియిడెలతకూనయోర్తు

గీ. పసిఁడిబిందెలఁ బన్నీరు పరుసనించి
చెలులు రతనంపుగిండ్లతో జలకమార్ప
నెఱులవెంబడి దిగజాఱు నీరుపొలిచెఁ
గ్రొమ్మొయిలు జోరునను వానగురియునట్లు. 80

చ. తలతడియొత్తె నొక్కచెలి తాబెడఁగుం దెలిపట్టుబట్టచేఁ
గలపము మైసలందె నొకకన్నియ కస్తురిబొట్టువెట్టెఁ దా
వెలఁదుకయోర్తు నెన్నొసట వేసలిఁ బూవులుచేర్చె నింతియో
ర్తెలమి నెలంత యొక్కరితె యింపుగఁ గాటుకతీర్చెఁ గన్నులన్. 81

గీ. విలువరతనంపుఁ దొడవులు వెట్టిమేన
జిలుఁగుబంగరు కెంబట్టుచేలఁగట్టి

చెలులు గైసేయ నెలమిత్రాక్షిఁ జెలువనపుడు
పెండ్లికూఁతును జేసిరి పేరటాండ్రు. 82

వ. అంతఁ బెండ్లిచావడియందు. 83

క. లగనమిదె పెండ్లికూఁతును । నగుఁ దేనని యొజ్జబాపనయ్యలు చెలులన్
మిగులం దొందరపఱుపఁగ । ముగుదలు పరుగెత్తి రంతిపురికి నిసొటకన్.

చ. అడుగుల కెంపుడాల్పుడమి యత్తఱినొత్తకయుండ నెజ్జనో
మడుఁగులు కాళ్ళకుంబఱుచు మాడ్కినిబర్వఁగ నిల్వుటద్దముల్
బడిబడిఁ జెల్మికత్తియలఁ బ్రక్కలనిబ్బడిఁ జేయ సిగ్గుతోఁ
బడఁతుక పెండ్లితిన్నెకడ వచ్చెను నెచ్చెలిపిండు తేరఁగన్. 85

గీ. కలికినెమ్మోము జేసికిఁ గానిపించ
కుండ ముత్తైదువ తెరయొండు పట్ట
వెలసె నయ్యెది నిండు రేవెల్గునకును
మిగులమాటగు మేటిక్రొమ్మొగిలు కరణి. 86

క. వలుఁగడల వాయిదమ్ములు । చెలఁగంగాఁ బేరటాండ్రు సేసలు చల్లన్.
బలుదీవనలిడఁ బాఱులు । పొలుపుగఁ జనె బెండ్లి యరుగుపొంతకు జేఁడున్.

క. కొమరాలినప్పుడట నే । మముతో నానేల తేఁడిమాంకన్యాం తు
భ్యమహం సంప్రదదే యని । యమరంగా ధారవోసె నల్లున కెలమిన్.

క. తెఱవలటు మీఁద మెల్లన తెరను వంప
మిగుల సిగ్గున ముగుదయు మొగము వంచె
మగువ చెలువంబుఁ గనఁ గ్రీడి మొగము నెత్తెఁ
బచ్చవింటిని మఱఁదును బైకి నెత్తె. 89

గీ. పడఁతిమిన్నలు తెరనల్లవంచినపుడు
కనులు మిఱుమిట్లుగొనఁ దళ్కుమనియెఁ జెలువ
బయలఁ గాఱుక్రమ్మిన గొప్పమొయిలునుండి
మించివెలువడు క్రొక్కారు మెఱుముకరణి. 90

గీ. తొయ్యలి పిసాళి చూపులన్ తూపుగముల
నోంగానాటియుల్ల ముఱ్ఱూఁతలూఁచి
క్రీడిపయిని వ్రేల్మిడి నిండు గెలుపుగాంచి
విరులవిల్తుఁడు కోయని పేర్చియార్చె. 91

చ. సరగునఁ గొమ్మనెమ్మొగము చాయలకుంజని నేదతేటి ని
బ్బరమగు తేనిచూపుగవ పైకొనచోటికి పాఁగఁజూచియుఁ
గురులనుచిమ్మచీఁకటిఁ దగుల్కొనియాడకె దారితప్పి బల్
మురిపెపు నవ్వువెన్నెలవెలుంగున వచ్చుచునుండుఁ గ్రమ్మఱన్. 92

ఉ. వేఱొకచోటికిం గదల వేమఱువెల్వడి యొందుఁబోవఁగా
నేరక క్రమ్మఱన్మొగమునే వడిఁజేరెను చూపుమొత్త ము
య్యారపుఁ జన్నుఁగొండలను నవ్వలఁ దవ్వులఁగాంచి వాసిఁ బొం
గారఁగ నానవాలుగొని గంతిడి పాయక నిల్చె నచ్చటన్. 93

వ. అటుపిమ్మట. 94

చ. మురుగులుజాఱఁ జెమ్మటలు ముద్దుమొగంబునఁగాఱ ముత్యపు
న్సరు లొకయోరఁజేరఁ జిఱునవ్వులు మొల్కలుదేర నంటుజో
ళ్ళిరుదెసలందుఁ జెక్కులపయి న్వడిఁదూఁగుచు డాలువాఱ నా
దొర తలఁబ్రాలువోసె నలతొయ్యలి యాఁదలమీఁద దోయిటన్.

ఉ. కౌనసియాడ ముంగురులు గ్రక్కునఁ జెక్కులమీఁదఁగూడఁ బెం
పూనిన గుబ్బదోయి పయినొక్కట పేరులు త్రొక్కులాడఁ బై
పైని బయింటయాడ నునుబంగరుగాజులు పట్టువీడ నా
చానయుఁగ్రీడిమీఁదను వెసం దలఁబ్రాలనుబోసె దోయిటన్. 96

క. మదిలోపలఁ గలకూరిమి
నిదె నేఁబయిచేయియగుదు నిదెమోసగుదున్
వదలక కనుఁడనుక్రియ వా
రొడుగక తలఁబ్రాలుపోసి రొండొరులపయిన్. 97

గీ. ఒండొరుల మేనుసోఁకుట నొక్కసారి
కన్నెకును రేనికిని మేను గగురుపొడువఁ
దాళిఁగట్టె నాతఁడు జవరాలిమెడను
నేలవేల్పుల దీవనల్నింగిముట్ట. 98

గీ. అగ్గినలకొల్పి మఱి వారలందులోన
నేయివ్రేల్చిరి పిమ్మట నేలఱేఁడు
పట్టి సన్నికల్ ద్రొక్కించెఁ బడఁతిచేత
నంతఁ బేలాలువ్రేల్చె నయ్యింతిమిన్న. 99

సీ. ఎలుఁగెత్తిపాడెడి యింపైనపాటలు
గండుఁగోయిలపింఛు గరువమణఁప
పలుకునప్పుడుతోఁచు పల్వరుసలడాలు
నలువలంకులను వెన్నెలలనింప
పల్లెమందలిదివ్వె బటువైనమగరాల
మెఱ పేరులకుఁ గెంపుబెడఁగుగూర్ప
మేనిబంగరునిగ్గు మేలిమిబంగారు
పళ్ళెరంబునకును బసిమిరొనఁగ
వారిమోముల కెనరామిఁబట్టి నెలను
దిగఁదుడుపుపెట్టుకైవడి మొగములకును
జెలికిఁ జెలువునకైదువ లలరువేడ్కఁ
గప్పురపుటారటులనిచ్చి రొప్పమీఱ. 100

గీ. మొదటినాఁటితంతు ముగిసినపిమ్మట
బాకెనయును నాగవల్లిమఱియు
వేఱ జరగవలయు వేడుకలెల్లను
వరుసజరిగె నెల్లవారు చెలఁగ. 101

గీ. నాగవల్లియు లోనుగా నడచినంతఁ
జెంక్లీనాఁడులు గడువంగఁ బేర్మితోడ
నాలుమగలను గలుపంగ నపుడుతలఁచి
మేటివేడుక నాలవనాఁటిరేయి. 102

సీ. కమ్మతావులుగ్రమ్ము కపురంపువిడెములు
పఁసిడిపళ్ళెరములఁ బొసగనుంచి
కస్తురి జవ్వాజి గందంబుఁ బన్నీరు
రతనంపుగిండుల రమణనుంచి
పటికంపుగోడల పజ్జనిర్వంకల
నిలువుటద్దంబులు నెలవుకొలిపి
పగడంపునునుఁగోళ్ళ పచ్చలపీటపై
వట్టివేళ్ళసురటి పెట్టియుంచి
వెండితబుకులఁబండ్లు వేర్వేరపెట్టి
గొప్పరతనంపుదివ్వెలు గుదురుపఱిచి
మేలిచొక్కపు బంగారుమేడలోని
వింతగదిని సింగారించి రింతులంత. 103

గీ. పడకగదిలోని రతనంపుఁ బసిఁడికోళ్ళ
దోమతెర పట్టెమంచంబు పై మెఱుంగు
టంచ దూదిపాన్పునఁ బవ్వళించియుండె
నతివరాకను మదిఁగోరియల్లఱేఁడు. 104

వ. అంతకమున్న. 105

చ. కలపములంది నెన్నొసటఁ గస్తురిబొట్టమరించి చేరలన్
గొలువఁగజాలు కన్నుఁ గవకుందగఁగాటుక వెట్టి క్రొవ్వెదన్
వలపుగ్రమ్ము పూసరులు వావిరిఁజుట్టి పసిండిపుట్టముం
జెలువుగ గట్టి చెల్వఁగయిసేసిరి సొమ్ములువెట్టి నెచ్చెలుల్. 106

గీ. చెలులు కయిచేసి తరసింప సిగ్గుకతనఁ
బడఁతినెమ్మోమువంచి తాననువకున్న
బుద్ధులనుజెప్పి మఱిమఱి బుజ్జగించి
ప్రాపుబోఁడులు బలిమిమైఁ బొదిగిపట్టి. 107

క. ననబోఁడి నొకటలాగుచుఁ
జెలిమిటికడఁ జేర్పఁదివురవింతగనాజ
వ్వలి తాఁబోక పెనఁగినఁ
గనుఁగొని యొకచెల్వ యనియెఁ గన్నులనగుచున్. 108

గీ. ఇచట మాతోడఁ బెనఁగిన నెవ్వరిందుఁ
జూచిమెచ్చెదు రాతండుచూచిమెచ్చ
బులుపుతీఱంగఁ బడకింటిపొంతఁజేరి
వెనుకతీయక మగనితోఁ బెనఁగరాదె. 109

క. అనుటయు సిగ్గును జెలిపై
గినుకయుఁ జిఱునవ్వునొకట గిరికొన నపుడ
న్ననబోఁడి నట్టివైచెను
గనుదోయిం గెంపుదోఁపఁ గై విరిదండన్. 110

గీ. చెలిమికత్తెలు ముందుకు సిగ్గొకింత
వెనుకకున్రోయ మెల్లన వెలఁదినడిచి
పడకయిలుచేరుతఱి మొలబంటిసిగ్గు
ముంచి జాలువాఱుచుఁ దలమునుకయయ్యె. 111

క. మిక్కిలి సిగ్గుననునిఁగిన
యక్కలికింబాన్పుచేర్చి యాచెలువల్దా
మొక్కొక సాకుననడిచిన
నక్కొమ్మయు మోమువంచి యళుకుచు నిలిచెన్. 112

గీ. అంతటను గ్రీడి ముద్దియ నల్లఁజేరి
మేనుచెమరింపఁ గెంగేలు మెల్లఁబట్టి
ముగుద విరిపాన్పుపయికి రాఁదిగిచికొనుచు
వంచుకొనియున్న నెమ్మోము పయికెత్తె. 113

క. వలపుబయల్పడముద్దిడి
వెలదుఁకతోఁగూడిరేయి వేఁకువనుండన్
బెలుచనఁ గొక్కొరొకోయని
వెలుపలఁ దగఁగోళ్ళుకూసె వేఁకువ తెలియన్. 114

గీ. తడవు రేతేనితోఁజను దనరియుండి
వెడలఁబోయెడుతఱిని రేవెలఁదివిప్పు
కొప్పునందుండి దిగజాఱి కూలినట్టి
విరులబంతి నాఁ దోఁతెంచె వేఁగుఁజుక్క. 115

చ. పగలొనరించుపాటిదొరవచ్చి దెసల్ వెసఁ గ్రమ్మనంచు ని
వ్వగఁదనతేజుగోలుపడి పాఱెడు చుక్కల తేనిఁజూచి లో
దిగులునఁ దెల్విఁబాసెనఁ దెల్లపడెం గడురిక్కగుంపులున్
సొగసగునింటిదివ్వెలును జుక్కలతోడనె తెల్విగోల్పడెన్. 116

గీ. జగముచుట్టంబు రాకకుఁ జాలనలరి
పుడమివేల్పులు దీవించునుడువులనఁగఁ
జెవులపండువుసేయుచుఁ జెలఁగఁజొచ్చెఁ
గరముఁ బులుఁగులరొద నెల్ల కడలయందు. 117

గీ. ఇరుల వేఁటాడఁ దొలుదొల్త నేసినట్టి
చిచ్చుఅమ్మనఁదూర్పునఁజెలఁగెఁ గెంపు
మలలకలుఁగుల దూఱెడు నెలుఁగులట్లు
చీఁకటులు కొండబొఱియలు చేరఁబాఱె. 118

గీ. తమ్మిచెలికాఁడు చీఁకట్లదఱుమువాఁడు
కలువగుంపులసూడు రేవెలుఁగుజోఁడు
గాములకు నెకిమీఁడు జక్కవలతేఁడు
పొడుపుఁగొండను జూపట్టెఁ బ్రొద్దుపొడవ. 119

గీ. అంతకంతకు వింతయైయయ్యారమమర
నరమరలు లేని వలపుల ననఁగిపెనఁగి
చెల్వుఁడును జెల్వయును గూర్మిచెన్నుమీఱ
హాయిగానుండిరచ్చోట నాఱునెలలు. 120

క. ఈలోపల నాతొయ్యాలి
చూలాలయ్యెను మగండుఁ జుట్టములునెదన్
హాళింబొందఁగఁదండ్రియుఁ
జాలఁగొలమునిల్పునంకు సంతసపడఁగన్. 121

చ. చనుమొనలు నల్లపడియెను
జనఁజనవేవిళ్ళు హెచ్చెఁ జవిమంటిపయిన్
గనసయ్యె నెలలునిండినఁ
గనియెనుముద్దుల కొమారుఁ గన్నియయొలమిన్. 122

గీ. పుడమివేల్పులిడిన మంచిముహూర్తమందు
బభ్రువాహనుండనుచును బాగుమీఱఁ
బేరువెట్టిరి యాపసిబిడ్డకెలమిఁ
బెరుగుచుండె నతఁడు తాతయిరవునందె. 123

క. అనివైశంపాయనుఁడిటు
జనమేజయునకుఁ గరంబు సంతసమొదవన్
వినయముఁగ జిత్రాంగదకత
వినిపించిన వినియతండు వేడుకఁ బొదలెన్. 124

కందము. ముక్తపదగ్రస్తము.

సిరిఁగ్రొమ్మునఁ దాల్చినదొర
దొరలేనిబలిమిఁ బగతురఁదునుము వెరవరీ
వెరవఱినవారిఁ బ్రోచెడు
గరువా, గరువంబులేని కఱకులవేల్పా. 125

తోటకవృత్తము.

పొలుపొందిన బీరముపూనిజగం
బులనెల్లను నేఁచుచు ముద్దియలా
ర్వలలిం జెఱఁబెట్టిన రావణు నా
దలలెల్లనుద్రుంచిన దండిదొరా. 126

గద్యము.

ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధమహాకావ్య రచనాచాతురీధురంధర సద్యశ్శోబంధుర కందుకూరి వంశ పయఃపారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్య పుత్ర సుజనవిధేయ వీరేశలింగ నామధేయప్రణీతంబయిన రసిక జనమనోరంజనం బను ప్రబంధరత్నంబు నందుఁ సర్వంబును జతుర్థాశ్వాసము

సంపూర్ణము.

శుద్ధాంధ్రభారతసంగ్రహము.

By

K. VEERESALINGAM

శ్రీపరబ్రహ్మణేనమః

పీఠిక.

చ. సిరియొక యింత చేకుఱుటచేతనె మత్తిలి ముందు కీడు మే
ళ్ళరసెడివాఁ డొకండు గలఁడంచుఁ దలంపక పెక్కుదోసముల్
జరపెడి వారినేన్ దగుదొసంగిడి పిమ్మటఁ బ్రోచువేల్పు దా
సరగున నేలుఁగాత గురుసామిని వేంకట సుబ్బ రాయనిన్.

సీ. ఏవాఁడు జగముల నెల్లను నొక్కటఁ దలఁపులోననె తాను గలుగఁజేయు
నెవ్వాఁడుకనఁబడ కల్లచోటులనుండి యన్నింటిననయంబు నరసిప్రోచు
నెవ్వాని యిచ్ఛమై నెల్లమైతాల్పులు దివికినేగుదురు బొందిగమిఁ బాసి
యెవ్వఁడు నెఱిఁదప్ప కెపుడునుండెడివారికెన్నఁడుఁదఱుఁగనియెలమిఁగూర్చు
నట్టివేలుపువాకొన నలవిగాని కనికరంబున నెనలేని కలిమి యొసఁగి
రమణఁ గొల్ల వేంకట సుబ్బరాయసెట్టి నతనితమ్మునిగురుసామినరయు గాత.

క. బటువు జగమ్ములఁ గలయ, న్నిటికిని దొరయైన యట్టి నెఱవేలుపు వేం
కటసుబ్బ రాయసెట్టిని, దిటవుగ గురుసామిసెట్టిఁ దిరముగమనుచున్.

సీ ఏవారియింటి పేరిజ్జగంబునఁదొల్లి గుఱ్ఱము వారని కుదిరియుండి
కొల్లగా రోయీవిఁగోరు వారలఁదన్ప గడను గొల్లావారుగాఁగ మాఱె
నెవ్వారి కొలమునకెల్ల సింగనసెట్టి మొదటివాఁడయి పేరు మోచియుండె
నెవ్వారి తాత పేరెన్నికకును నెక్కి సుబ్బరాయలుసెట్టి సొబగుమీఱె
మివుల సరివారిలోన గారవముఁగాంచి. యెసఁగినట్టి వేంకయసెట్టి యెవరితండ్రి
యట్టివేంకట సుబ్బరాయలునుదమ్ముఁ, డై నగురుసామిసెట్టియునలరుచుండ్రు.

చ. అడవిమెగంబు లందమగునట్టి పులుంగులు నున్నతోఁటయె
క్కడఁ గనువారివేడ్కకయి కన్నులపండువు గాఁగనుండునె
కడఁ బలువింతలెల్లఁ జనికాంచెడివారికిఁ గాఁగఁగూరుపం
బడిన వెడందసాల చెలువంబగుఁ జూపఱకన్ను విందుగాన్.

ఉ. ఎక్కడఁ గూడి నాయములనేవరు తీర్చెడుగొప్పకొల్వు వే
ఱెక్కడనీడులేక తగు నెక్కడఁ బిల్లలకన్ని విద్దెలుం
జక్కఁగ నేర్పి తెలుపఁగఁ జాలిన విద్దెలసాలయొప్పుఁ దా
నెక్కడ గొప్పకోట యొకఁడింపగు దండుల నిండియుండఁగన్.

సీ. ఏపీటితూర్పున నెసఁగును సంద్రంబు దాయరాని యగడ్తయో యనంగ
నేప్రోలినుండి తామింతలోఁ బొగబండు లెల్లెడలకు నిచ్చ లేగివచ్చు
సేనేలఁ బొగయోడ లింటికలో దీవి వారినైనను గొనివచ్చునిలుచు
నెచ్చోట నాణెము లచ్చొత్తుచుండెడు జానుమీఱెడు టంకసాలయుండె
రాణిగారికి మాఱుగా రాచఱికము, వెలయఁ జెల్లించు దొర తనకొలువువారి
తోడనెచ్చట నెప్పుడుఁ గూడియుండు, నట్టి చెన్నపట్టణమున కలరువేడ్క.
సీ. ఏనొకపనిమీఁద నేగియున్నపుడు నాకూరిమి నెయ్యుఁడౌ కారుమంచి
సుబ్బరాయలు నాయఁ డబ్బురమగు వాని నెల్లనా కావీట నెలమిమీఱఁ
జూపుచు నొకనాఁడు సుబ్బరాయలుసెట్టి గారియింటికి నన్ను గారవమునఁ
గొనిపోవదవ్వగ గురుసామి సెట్టియు నన్నయు నెదురుగా నరుగుదెంచి
మేడమీఁదికిఁ గూరిమి మీఱనన్నుఁ, నెలమిఁ గొనిపోయితమ్ములమ్ములనొసంగి
కరముమరియాదయొనరించిసరసనొక్క. కుర్చిమీఁదఁగూర్చుండనొనర్చియవల
తే. సేమమారసి మఱికొంతసేపు వేడ్క
ముచ్చటలతోడ నచ్చటఁ బ్రొద్దుపుచ్చి
మాటవెంబడిపాండుకొమాళ్ళకతను
గొలఁదిగాఁదెమఁగునఁ జేయఁగోరుటయు.

క. కొల్లావారలు పెల్లగ, నెల్లెడలను బేరువడుట నెన్నెన్నియొ చా
వళ్ళను బలుసత్తరువులుఁ, గొల్లగ విలుపుటయు నెంచి కొంకని మదితోన్.
తే. నేను నీకొని యిమ్మాడిక్క దీని వ్రాయఁ
బూనినాఁడను దెలుఁగునఁ బొలుపుమీఱ
వారికెప్పుడు మేలునుగోరునట్టి
కందుకూరి వీరేశలింగమనువాఁడ.

శుద్ధాంధ్రభారతసంగ్రహము.

(అచ్చతెనుఁగు భారతము)

ప్ర థ మా శ్వా స ము

చ. సిరులను గూర్మితో నొసఁగి సేగి యొకించుకయైనఁ జేర నీ
కరయుచు మంచివారి ననయంబును బ్రోచుచుఁ జెడ్డవారలన్
సెరఁగులపాలు సేయుచును సేమము మీఱ జగమ్ము లేలుచుం
దిరముగ నుండినట్టి యలదేవరఁ గొల్చెద నెల్లయప్పుడున్. 1

వ. ఇట్లు జగమ్ములనెల్లం దల్లియుఁ దండ్రియు చేలికయునయి యెల్ల
యెడల నిండియుండు నాదండివేలుపు నుల్లంబున నెల్లవిరియ నింతం
తనరాని సంతసంబున మంతనంబున నెంతయుం గొనియాడి వేఁడికొని
యీమేటిదేవరకు నాపయింగల వెలలేని కూరిమి పేరిమిని నేనొన
రింపఁబూనిన యీక్రొత్తపొత్తంబునకు మొదలెట్టెదనిన. 2

తే. మున్ను నైమిశ మనుకాన నున్నయట్టి
తపసు లోకవాఁడు సూతుని తఱిని జేరి
భరతుకోలమునఁ గల రాచవారి కతలఁ
జెప్పుమని వేఁడ నతఁడిట్లు చెప్పఁ దొడఁగె. 3

సీ. సొగసుఁగోటలమీఁది పగడాలసింగముల్
చౌదంతి నిచ్చలు జంకువఱుప
మేటియగడ్తలు వీటిబోటులకును
జిలువచెల్వలతోడి చెలిమి నొసఁగఁ
బసిఁడిమేడలమీఁద నెసఁగుక్రొగ్గంటుల
చెలువ మచ్చరబోంట్లఁ జిన్నపుచ్చఁ
బూవుఁదోఁటలలోని తావులతేనియల్
చిఱుగాలువల వొటఁ జేలఁదడపఁ

సీ. తానువడుగుందన మూనంగ నట నెల్ల
వారును వినుచుండఁ బ్రతినవట్టి
జాలరిదొరతోడఁ జాల నమ్మికపుట్టఁ
బలుదెఱంగులఁ జెప్పి పదిలపఱిచి
సత్యవతినిదెచ్చి సరగునఁ దండ్రికిఁ
బెండిలిగావించి పెంపుమెఱసి
తనచేతిబలిమిని ననిలోనతేఁడుల
నందఱనోడించి యదిమి వారి
వలనఁ గప్పముల్గొని తండ్రినలరఁజేయ,
సత్యవతితోడికూటమిశంతనుండు
చెలఁగి చిత్రాంగదుండు విచిత్రవీర్యుఁ,
డనఁగనలరారుకొమరులఁగనియెనంత. 15

ఆ. వారు జవ్వనమును బడయకముందఱ,
శంతనుండు మేను జాఱవిడిచెఁ
దండ్రిచావఁ బెద్దతమ్ముని భీష్ముండు,
పుడమి కొడయుఁడుగను బూనిచేసె. 16

సుగంధి. పొంగి యేరిఁ బూరికైనఁ బోల్పరుష్కు మీఱఁ జి
త్రాంగదుండు పోరి కెల్ల దండివారిఁ జీరఁ జి
త్రాంగదుండు వేల్పుదిట్ట తాఁకి కయ్యమిచ్చి యా
పొంగడంచి మించి త్రుంచిపోయె వేయు నేటికిన్ 17

తే. అన్న పోయినపిమ్మట నతనితమ్ము,
నావిచిత్రవీర్యుని భీష్ముఁడపుడ తెచ్చి
దొరతనంబిచ్చి వెలయించిపరువ మొదవి,
వెలయునతనికిఁ బెండ్లి గావింపనెంచి. 18

ఆ. కాశిఱేఁడు తనదు కన్నియలకుఁ బెండ్లి,
సేయ నెంచి యుంట చెప్పనరిగి
ముగురు కన్నియలను ముంగలనరదంబు,
పయినిఁ బెట్టుకొంచుఁబయికిఁబోవ. 19

క. ఎకిమీలెల్లను దాఁకుడు,
నొకఁడు న్మగఁటిమి నెదిర్చి యుక్కటివారల్
గకవికలు గాఁగనమ్ముల,
సెక లన్మలమలను మాడ్చి చెదరఁగఁజేసెన్. 20

వ. మఱియును. 21

ఆ. చుట్టుముట్టినట్టి దిట్టలనందఱి,
నిలిచిపాఱఁదోలి గెలుపుఁగాంచి
త్రోవలోన సాళ్వుఁ దూలించి మరలించి,
వెలఁదుకలనుగొంచు భీష్ముఁడరిగె. 22

తే. అరిగి యంబ యంబాలిక యంబికయును,
ననెడుమూఁవురలోఁ బెద్దదైనయంబ
తనదు డెందంబుసాళ్వునిఁదవిలియుంటఁ,
దెలుపనాయింతినటకంపి తెరువువట్టె. 23

క. తక్కిన యిరువురఁ దమ్మున,
కొక్కటఁ బెండిలియొనర్ప నొప్పుగ నతఁడా
చక్కెరబొమ్మల తోడనె,
మక్కువతో నెపుడు నుండి మడిసెన్వేగన్. 24

సీ. సంతులేకుండంగఁ జచ్చిన కొడుకును
గని సత్యవతి భీష్ముఁగదియఁబిలిచి
యిల్లాలిఁగైకొని యిల్లువిల్వఁగఁబెట్టి
నేలయేలుమటంచుఁ జాలువఱుకు

బతిమాలి చెప్పిన నతఁడించుకయు నొప్ప
కప్పుడవ్యాసుని నొప్పుగులుక
నెదలోనఁ దలఁచిన నేతెంచి యాతఁడు
తల్లికి మ్రొక్కిడిదండసలిచి
యామెపంపున నంబికయందుఁబుట్టు
గ్రుడ్డిధృతరాష్ట్రు రెండవకొమ్మయందు
బొల్లివానిని బాండుని బోనకత్తె,
యందు విదురునిఁ గలిగించె హాళిమీఱ. 25

వ. అంత. 26

సీ. పెద్దవాఁడైన ధృతరాష్ట్రు బెంపుమెఱయఁ
బుడమిఁ బూన్చిన సరితేండ్ల నడఁగఁదొక్కి
విదురుమదిబల్మి భీష్ముని వింటిబలిమి
తనకు సాయంబుగా దొరతనము చేసె. 27

తే. అంత గాంధారమనునేల నమరనేలు,
సుబలుఁడనుతేనికూఁతునుసోయగమున
నచ్చరలమించు గాంధారి యనెడుదాని,
భీష్ముఁడాయెకిమీనికిఁ బెండ్లిచేసె. 28

మ. మఱియు న్వ్రేలుపుటేటిపట్టి కరమున్మన్నించి పూఁబోండ్లఁబ
ల్మఱుఁదేరన్ ధృతరాష్ట్రుఁడాంధ్రుమగను గేల్వట్టొందగన్నార్వరన్
జుఱుకుంజందముమీఱఁ బాండుఁడును మిన్కుల్సాములున్నేర్చి యం
దఱిలోఁ బేరిమిఁగాంచి మించుటయు నంతంబెండ్లి గావింపఁగన్. 29

క. తలపోసియు వసుదేవుని,
చెలియలి శూరుఁడనువాని చెలువపుఁగూఁతున్
వెలయఁగఁ బెండ్లిచేసెను,
వెలఁదుకఁ గుంతి యనుదాని భీష్ముఁడు వేడ్కన్. 30

సీ. అదిమును దనతండ్రి యానతి దుర్వాసుఁ
డనుతపసికి నోరె మమరఁబెట్టి
మెప్పించి యతనిచే నెప్పుడు తలఁచిన
నప్పుడ వేలుపు లరుగుదెంచి
బిడ్డలనిచ్చెడు పెనుమెప్పుఁగైకొని
యొకనాఁడు సంద్రంపు టొడ్డునందుఁ
దమ్ములవిందును దలఁచి యాతనివల్లఁ
బుట్టుజోడును జెవిపోఁగులున్న
కొడుకుఁగని వానిఁ బెట్టెతోఁ గడలినిడియెఁ
గొట్టుకొనిపోయి యాబొట్టె గట్టుఁజేరఁ
గాఁపొకఁడు వానిఁ గొనిపోయి కర్ణుఁడంచు
గహిని బేరుంచి తనచాన రాధకిచ్చె. 31

తే. మాద్రియనుదానినావెన్కమఱియుఁబాండుఁ,
డాలుగాఁగొనియిద్దఱనలరఁజేసి
దెసలనెల్లను దనవాఁడిమొనఁగగెల్చి,
యన్నచేనెన్నొ చేయించెజన్నములను. 32

సీ. అటులుండి యొక్కనాఁడాంద్రనుదనతోడఁ
గొనివేఁటతమిమీఱఁగొంతదవ్వు
కానలోపలనేగి కానక మెకములఁ
గూడిపొందెడునట్టి లేడి నిఱ్ఱి
నొకకోల నేలపై నొఱగింప మగజింక
జడదారిరూపును సరగఁదాల్చి
యీవు నీయాలితో నెవ్వఁడుకలసెదో
యప్పుడ మావలె నయ్యెదంచుఁ

దిట్టి చచ్చిన దిగులొంది దిటముపూని,
యింటివంకకు మరలక యెఱుక మెఱసి
తపసితనమూని కొన్నాళ్ళు తాళియుండి
సంతు లేమికి నెంతయు వంతనొంది. 33

ఆ. కుంతిఁ జేరఁబిలిచి గొబ్బునదనకోర్కి,
తేటపఱిచి వేఁడ బోటియొట్ట
కేల కొప్పుకొనియుఁ గెలసి యుధిష్ఠిరుఁ,
డనెడి కొడుకుఁబడసె నజ్జమునికి. 34

శా. ఆచోటన్ ధృతరాష్ట్రుతొయ్యలియు నొయ్యన్వేఁకటిందాల్చి ము
న్నే మూలాలయి కుంతిపట్టిఁగని తానెంతో మదిం బొంగుటల్
చూచాయన్విని యోర్వలేక వగతోఁ జొక్కొంది లోఁగుంది ఆ
మ్మూమచెన్నారు నెలంత గ్రుద్దుకొనెఁ బాడై చూలొగిన్ జాఱఁగన్.

వ. అట్లాకొమ్మ ఆమ్ము కరమ్ము వమ్మగునట్లుఁగా గోరమ్ముగాఁ
గ్రుమ్ముకొన్న నెత్తుచెడి క్రొత్తనెత్తురులం జొత్తిల్లి తుత్తునియలయిపడ్డ
కండముత్తమ్ములనెత్తి క్రొత్తకడవలలోనం బెట్టించి వ్యాసుండు
నూఱువురఁ గొడుకులను నొక్క కూఁతును బుట్టించె. నందుఁ బెద్ద
వాఁడు దుర్యోధనుండును రెండవవాఁడు దుశ్శాసనుండును వారి
చెల్లెలు దుస్సలయు ననంబరఁగి పెరుఁగుచుండిరంతనిచ్చట. 36

క. అట దుర్యోధనుఁ డొదవిన
దిటమగునానాఁడె గాలిదేవరవలనన్
దటుకున భీమునిఁ గనియెను
నిటఁగుంతియు మగఁడు పనుప నెంతయు నెలమిన్. 37

క. ఆపిమ్మట వేలుపుదొర
నాపోవక మగఁడు వేఁడ నానఁతియీఁగా

నాపగిది సర్జునుండను
పాపనిఁగని మించెగొంతి బలియుని మిగులన్. 38

క. పెనిమిటి సెలవొసఁగంగాఁ
దనసవతియు నేర్పినను పదామ్రాద్రియునుం
గనె వేలుపు వెజ్జుల కొ
య్యనకులుండు సహదేవుఁడనియెడి కవలన్. 39

ఆ. ఇట్లు నేలఁతలందు నేవురు కొడుకులఁ
బడసి సంతసమునఁ బ్రబలియుండి
యేకతంబ మాద్రియొక్కఁడు పోయగం
బొక్కనాఁడు చూచి యూర్వ్యరాక. 40

క. వెలుపన్న దాయల నెందఱ
గెలిచియుఁ దనలోని దాయ గెలువఁగలేకా
బలియుఁడు పాండుఁడు మడిసెను
వలపున నిల్లాలితోడ వడిఁ గలయుటచేన్. 41

తే. అంతమాద్రియు మగనితో నగ్నిసొచ్చె
గొంతిపాటులు వెంటరాఁగొండవిడిచి
కొడుకులను వెంటఁగొని బావకడకువచ్చె
నిల్లవారికిఁ దముఁజూచి యుల్లమవియ. 42

ఉ. కుంతియు బిడ్డలం గొనుచుఁ గూరిమి పెన్మిటిఁ బాసివచ్చుచో
వింతగఁ జూడవచ్చి రలవీటను గల్గినవారలెల్లఁదా
మెంతయు వంతతోఁబనివి మేద్చుచు నాధృతరాష్ట్రుఁడాలునుం
గుంతిని వెంటఁబెట్టుకొని కుఱ్ఱలఁదోడ్కొనిపోయి రింటికిన్. 43

వ. అంత ధృతరాష్ట్రుండు. 44

క. తనబిడ్డలు పుటి తన త
మ్ముని బిడ్డలు నంచు వేఱుపూనిక మదిలో

నను బూనక కొడుకులక
న్నను బ్రేముడి మీఱఁ బెంచె నలి నేవురనున్. 45

సీ. దుర్యోధనుండును దోడివారును దమ్ముఁ
గుఱ్ఱలుఁ బాండుని కొడుకు లమియు
నల్లారుముద్దుగా నాటపాటలఁ బ్రొద్దు
పుచ్చెడు తఱిఁగాడ్పు ముద్దు పట్టి
బలిమి నందఱమించి పలుదెఱంగుల నొంచి
పలువుర నొక్కటఁ బట్టికొట్టుఁ
జెట్లనెక్కినవారిఁ జెట్లూఁచి పడవైచు
నిలిచి పొల్చినవారినీటముంచు
నిట్లువడముడి కడగండ్ల నెపుడుఁగుడుప
నీరసంబెత్తి తాళఁగా నేరకపుడు
తనదు మామను శకునిని దగవునడిగి
తొడరిదుర్యోధనుఁడు చేసెదుండగముల. 46

సీ. నిడు తీవియలఁగట్టి నిదురించు తఱినేటఁ
బడఁద్రోయ మేల్కనివెడలివచ్చె
విసముతోడనుజేర్చి వెసఁగూడు వెట్టింప
నారగింపఁదడవ యరిగిపోయెఁ
బండుకొన్నప్పుడు పాములఁ గఱపింపఁ
గీడొకింతయులేక కెడపెవాని
దుర్యోధనుఁడుసేయు దొసఁగులు మఱియును
వడముడిఁ జెందకవమ్ములయ్యె
నంత మనుమలఁ జదివింప నద నటంచు
నెఱిఁగి భీష్ముఁడు కృపునొద్ద నెల్లచదువు

లమరఁజెప్పించె మొదలనాకొమరులకును
బిదపద్రోణుఁడునాఁ జనుచదువులయ్యె. 47

తే. నేలవేలుపు కృపుభావ చాలవలఁతి,
తనకొమారు నశ్వత్థామగొనుచువచ్చి
వీఁడు నేరిన నా నేలవేల్పునొద్ద,
వెనుక విలువిద్దెఁ గఱపించె మనుమలకును. 48

సీ. కవ్వడి తనకొక్కఁ గడువడిఁ దీక్ష్ణవ
నని బాసయిచ్చిన నలరి ద్రోణుఁ
డతని కెక్కువ చెప్పినాయమీఁదనొకనాఁడు
రాకొమారులనేర్పరమణఁగనఁగ
మిన్నేటికొమరుండు మున్నగువారికి
విన్నవించినవారు వేడ్కతోడఁ
గొలువుండి చూడంగ వెలయించి రెల్లరుఁ
దమతమ నేర్పు చందమ్మువెల్ల
నందు దుర్యోధనుఁడు భీముఁడఁ గరితాఁకి
గుదెలఁబోరవారిని ద్రోణుకొమరుఁడుడిపె
నర్జునుండును విజ్ఞాన మమరఁ జూపి
మారు లేకుండ నొక్కఁడు మలయుచుండె. 49

క. అక్కడ కప్పుడు కర్ణుం,
డుక్కునఁ జనుదెంచి క్రీడి నొక్కటఁ దాఁకఁ
బెక్కు తెఱంగులఁ బోరిరి,
యొక్కొకరికి వ్రాటపడక యోరిమిఁ పేర్మిన్. 50

క. పోరెడియప్పుడు కర్ణుని,
బీరంబున కెదను మెచ్చి వే యంగము నాఁ

బేరైన నేల నతనికిఁ,
దోరం బగుకూర్మి నిచ్చి దుర్యోధనుఁడున్. 51

వ. అతనితోడి చెలిమి కలిమి ననిలోనం దన పినతండ్రికొడుకుల నాతండు గెలువఁగలం డను గట్టి నమ్మకమ్మున నాతనిం దనయొద్దఁ బెట్టుకొని సంతసించుచుండెనంత. 52

క. తనవలనఁ జదువుగఱచిన,
యునిసేపెడు రాచవారి నందఱ ద్రోణుం
డును జేరఁ బిలిచి ద్రుపదునిఁ,
దనకడకును బట్టి తెండు తడయక యనుడున్. 53

సీ. అందఱు నరదంబు లాయితంబుగఁ జేసి
వెలువడి ద్రుపదుని వీడు చేరి
కోటలు పడద్రొబ్బి క్రొత్తడంబులుగ్రొచ్చి
యూరెల్ల దల్లడమొందఁ జేయ
ద్రుపదుఁడు విని వచ్చి దుర్యోధనుఁడు లోను
గాఁగల మగలను గదసి తాఁకి
వాలంప గుంపుల వానలు గురియించి
చిందఱ వందఱ జేసి దండు
నెల్లచోటులఁ దానయై యేపు చూప,
వెఱచఱచి పాఱి రందఱు వీఁకచెడుచు
నంత విన్వచ్చుఁ డాతని నడ్డగించి,
తోడ భీముఁడు గుదెఁబూని తోడుసూప. 54

క. తననేర్పు మెఱయఁ దూపులఁ,
గనలునఁ బరఁగించి ద్రుపదుగరువంబడఁగన్
జని పట్టి కట్టి తెచ్చెను,
గనువారలు డెందములను గళవళ పడఁగన్. 55

ఆ. అల్లుఁబట్టి తెచ్చి యాతని నొజ్జల,
కాళ్లమీఁద వేయఁ గనికరమున
నుల్లసంబు లాడి యొడయనిఁ బొమ్మని,
క్రీడి ద్రోణుఁడుఁ గొనియాడి మెచ్చె. 56

చ. ద్రుపదుఁడు దొంటికంటునను ద్రోణుఁడు తన్నటు చిన్నపుచ్చఁగా
దపసితనంబు పూని కడుఁదాలిమి వేల్పులఁ గొల్చి ద్రోణున
చ్చపుబవరంబునం గెడపఁ జాలు కొమారుని దిట్టయైన వే
లుపుదొరపట్టిపాలయి వెలుంగుకొమారితఁ గాంచెఁ జిచ్చునన్. 57

క. కని యిటు దృష్టద్యుమ్నుం
డనుచుఁ గొమారునికిఁ గృష్ణయని కూఁతునకుం
బనరఁగఁ బేళ్లిడి ప్రోలికిఁ
జని ద్రుపదుఁడు వింతసంతసంబున నుండెన్. 58

వ. అంతనిచ్చట. 59

తే. విద్దెచేతను గొనముచేఁ బెద్దయైన
జముని కొమరుని రాచటికమునఁ దనకు
సాయముగఁ జేసికొని తానుసంతసంబు
నొందుచుండెనుధృతరాష్ట్రుఁడుద్దిలేక. 60

ఉ. అప్పుడు తమ్ములెల్ల కడలందును బోరుల గెల్వఁ గాంచుచుం
జెప్పెడి దేమి పేరుగల చిక్కనిఱేఁడుల నోర్చి వారిచేఁ
గప్పము లెంతయుం బలిమిఁ గైకొని యన్నకుఁ దెచ్చియిచ్చుచున్
గొప్పతనంబు వాసియును గూర్పఁగ నోరువలేక యీసునన్. 61

సీ. మంతనంబున మేనమామను శకునిని
దుస్ససేనునిఁ గర్ణుఁదోడితెచ్చి
దుర్యోధనుఁడు వాసితోడను దలపోసి
యాకటపులఁ బట్టి యయ్యెకడకుఁ

జని కన్నులనుసీరు జాఱఁగ నురపిల్లి
యొట్టకేలకు తేనియెఱుక చెఱిచి
పాండునికొడుకుల వారణావత మనుపూర
నుంచెడునట్లు లొప్పుకొనఁగఁ
జేసి వచ్చినవారలఁ జేరఁబిలిచి,
తల్లితోఁగూడి యేవురుఁ దరలునట్లు
నేర్పుతోఁజెప్పి ధృతరాష్ట్రుఁ డేర్పడంగఁ,
బుచ్చెమేలెంచకప్పుడాప్రోలికరుగ. 62

సీ. దుర్యోధనుం డంతఁ దొడరి పురోచనుఁ
డనువాని రావించి యతనితోడ
మంతనంబునఁ గొంత మాటాడి మునుచని
లక్కయి ల్లొక్కటి చక్కఁగాను
వారణావతమున వడిఁగట్టి గొంతియుఁ
గొడుకులు నందుండి కూర్కియుండు
తఱినిప్పుముట్టించి తడయకరమ్మని
చెప్పి పుచ్చినవాఁడుఁ జెలఁగి యరిగి
లక్కయిల్లుకట్టి చక్కఁగఁ గై సేసి
యునుపఁ గుంతిబిడ్డ లుండిరందు
నంత విదురుఁ డిచట నంతయుఁ బరికించి
కీ లెఱింగి సరగఁ గీడుతొలఁగ. 63

ఉ. ఉప్పరవాని నొక్కరుని నొంటి యుధిష్ఠిరు పాలికంప నా
చొప్పెఱిఁగించి వాఁడు కడు సూటిగ నేలసొరంగ మొండు నే
ర్పొప్పఁగఁ ద్రవ్వెచూపుటయు నోయనభీముఁడు తల్లినన్నునుం
దప్పక తమ్ములన్వెలికిఁదార్చి సొరంగముదారి దవ్వుగన్. 64

క. పనిచి పురోచనుఁడును జెం,
తను గొడుకు లయిదుగు రెుకతయు నిద్రింపం
గని లక్కయింటి కగ్గిని,
గసలునఁ దగిలించిపోయెఁ గడుసడు రేయిన్. 65

క. ఆరాతిరి యాయిల్లటు,
నోరముగాఁ గాలిపోవఁ గూరిన వగతో
నూరను గలవారెల్లను,
జేరువఁ జనుదెంచి కాంచి చిడిముడిపడుచున్. 66

క. కొంతియుఁ గొడుకులుఁ దెగిరని,
యెంతయు వగఁబొంది యేగిరిండ్లకునచ్చో
నంతయు ధృతరాష్ట్రుఁడు విని,
యింతం తనరాని కస్తి నెదలోఁ బొందెన్. 67

ఆ. గాడ్పుపట్టి యచటఁ గన్నతల్లిని దోడఁ,
బుట్టువులను మీఁదఁ బెట్టుకొంచు
ముందులనక పెద్ద గండులనక యేగెఁ,
గాలుకానలందుఁ గరము దవ్వు. 68

ఆ. రేయి వారు వడెడి రాయిడిఁ బొపంగ,
నెంచియపుడు వెలుఁగుఁబంచెదయ్య
మనఁగఁ బ్రొద్దుపొడిచె నావల నాఱ్వురు,
నెండ యెక్కుదాఁక నేగి యేగి. 69

క. కడుబడలి యెండ తాఁకున,
వడగొట్టిన బిట్టుసోలి వారలుపడఁగా
వడముడి నీళులకొఱకుం
గడుదవ్వుగఁ బోయి మరలి కదిసెనులోనన్. 70

తే. ప్రొద్దువాలినఁ గెంజాయ పొదలిపిదపఁ
గాఱుచీఁకట్లు మింటను గ్రమ్ముకొనియె
రేవెలందుక దాల్చిన కావిక్రోక
విడిచి నల్లని చీరను దొడిగె ననఁగ. 71

క. ఆచీఁకటిలో నీళుల
మోచుకొనుచు వచ్చి చెట్టు మొదటనుగూర్కం
జూచియు వారల లేపక
కాచుకొని యతఁడు నిలిచెఁ గడుఁ గడిమిమెయిన్. 72

సీ. అప్పు డక్కానలో నెప్పుడునుండు హి
డింబుఁడన్ రక్కసుఁ డిమ్మునుండి
వారలఁ గని పొంగి వడివడిఁ జెలియలిఁ
బనిచె హిడింబను వారిఁ బట్టి
వంటకుఁ దేనాపె వడముడిఁ దిలకించి
వలపున మోమోటపడుచు నిలువ
నేజామునకుఁ జెల్లెలీతేరమికి నల్గి
పయనమై మఱి తానె వచ్చినిగుడ
భీముఁ డాతని దవ్వుగాఁబిఱిఁది కీడ్చి,
దొమ్మికయ్యమ్ములో వానిఁ గ్రుమ్మిచంపి
యున్నపనుపఁగఁ దల్లియు నవ్వనంగఁ,
పెండ్లియాడె హిడింబను బేర్మితోడ. 73

తే. దానితోఁ గూడి కొన్నాళ్ళు కానలందుఁ
బగలు వలరాచపనులను మిగులఁ బెనఁగఁ
బుట్టెఁదగ ఘటోత్కచుఁ డనుపట్టియొకఁడు
వాఁడితనమును జిత్తులు బలిమిఁగలిగి. 74

చ. తలఁచినయప్పుడెల్ల నిముదాకొని వచ్చెదనంచుఁ జెప్పి యా
జలెయుఁసు తల్లిఁదోడుకొని వారల వీడ్కొని యేగనిచ్చమై
వెలువడి యేకచక్రమను పేరిట యూరికిఁ బోయి రన్నయన్
నలువురుతమ్ములు స్వారపునం దమతల్లిసి గొంచుఁగాల్నడన్. 75
వ. అట్లుపోయి. 76
తే. నేలవెల్వుల వేసంబు లోలిఁ దాల్చి,
యొక్కబాఁపనియింటనునుండియూరఁ
దిరిప మెత్తుచుఁ బ్రామిన్కు లరసికఱచు,
చుండిరేవురు సైదోడులొజ్జలొద్ద. 77
సీ. ఆకుప్పమున బకుఁ డనురక్కసుఁడొకండు
కాఁపురంబుండి యక్కడనున్న
వారి నేప్రొద్దు నిల్వారుసను నొక్కని
బండెఁడు కూటినిఁ బసుల రెంటిఁ
దడవులనుండి సాపడుచుండు నట్లుండ
నొకనాఁడు పొలదిండికోరెముగను
బోవలసిన వంతు పొందుగా వారున్న
పుడమివేలుపుపాలఁ బడిన నతఁడు
మిన్నువిఱిగి పడిన చెన్నున నేమియుఁ
దోఁపకాలుఁ దానుఁ దోడివారుఁ
గూడి యొక్కపెట్ట గొంతెత్తి యేడ్వంగఁ
జొచ్చె గొప్పముప్పు వచ్చెననుచు. 78
క. అయేడుపు విని గొంతియు
డాయంగాఁ బోయి యడిగి దగ్గుత్తికతో
నాయింటి పాఱుఁ డెఱుఁగం
జేయుడు వడి భీముఁ జీరి చెప్పిన నతఁడున్. 79

క. ఒడ లుప్పొంగఁగ రక్కసుఁ
గడ తేర్చెద నంచుఁ బలుకఁగా నాపాఱుల్
కుడువంగఁ బెట్టిరోరెము
వడముడికిన్మంచి పిండివంటలతోడన్. 80

చ. అటువలె నారగించి కఱవాఱఁగ సత్తువపట్టి లేచి మి
క్కుటముగఁ దొంటి వంటకమెకూర్చినబండిని నెక్కిరక్కసుం
దటుకునఁ జేరి మాఱుకొని తన్నియుఁ గ్రుమ్మియు నెట్టకేలకుం
బెటపెట నెమ్ముకల్విఱిచి పీఁచమడంచెను నొక్కవేల్మిడిన్. 81

సీ. అమ్మాడ్కి బకుఁ జంపి యందఱు నలరించి
నెమ్మదినుండంగ నెమ్మి మీఱ
బసచేసి యున్నట్టి పాఱునియింటికి
జన్నిగ ట్టొక్కఁడు సరగవచ్చి
ద్రుపదుండు తనకూఁతు ద్రోవదిఁ గొనఁగోరు
రాచకోమాళ్ళెల్ల రావలెనని
చాటింప నాలించి జగములోఁ గలరాచ
వారెల్ల నచటికి వరుసగాను
బోవుచున్నారు నేనును బోదునటకు,
నీవి మిక్కిలి బాఁపల కిత్తురంచు
విన్నవాఁడను గావున వేడ్కతోడ,
ననుచుఁ జెప్పిన నలరారి యవుడకదలి. 82

చ. బసదిగియున్న పాఱుతను బాఱుని వీడ్కొని గొంతి బిడ్డలున్
వెసఁ జని యొక్కటన్ ద్రుపదువీటికిఁ బోయెడుదారి వ్యాసుతోఁ
బొసఁగఁగ మాటలాడి వడిఁ బోవుచు వేలుపుటేటి చెంతనా
నిసితతిఁ గ్రీడి చేకొఱవి నెయ్యమునం గొనిత్రోవ చూపఁగన్. 83

ఆ. ఏఁగుచున్నయప్పు డింతితో నంగార,
పర్ణుఁ డనెడు వేల్పుపాటకాఁడు
తిరుగులాడుచుండి దిటవుగ నర్జునుఁ,
దాఁకి తూపు లోడలు దవ్వులనేసె. 84

క. ఏసినఁ గవ్వడి వడివడి,
నీసుమెయిం జిచ్చుటమ్ము నేర్తెఱ వైవన్
గాసిలి యరదముఁ గోల్పడి,
యోసరి యంగారపర్ణుఁ డుడిగిన కడిమిన్. 85

తే. కదలివచ్చి యుధిష్ఠిరుకాళ్ళ వ్రాలి
ధౌమ్యుఁ డనునొజ్జ నోడఁగూర్చి తగవునెఱపి
చిచ్చుటమ్మును గవ్వడిచేతఁ బడసి
యింతిఁ దోడ్కొని తనయిచ్చ నేఁగనంత. 86

సీ. పాండుని కొమరులు నిండువేడుకతోడ
ద్రుపదువీటను జేరి యుపముమెయిని
గుమ్మరవానింట నిమ్ముగా దిగియుండి
యెకిమీఁడ్లు గుమిగొన నేగియున్న
రచ్చతావునకేగి రచ్చట జేఁడులు
మిన్నంటఁ గట్టిన మీనునీడ
క్రింది నీళులఁజూచి ముందఱ మోపెట్టి
యున్నవింటిని జేత నొనరఁ దాల్చి
నింగి మచ్చెంబు నేయంగ నేర్పుమెఱసి
యెత్త లేరైరి యొకకొంద ఱత్తియేయఁ
జాలకుండిరి కొందఱు చాలువఱకు
నేసికొట్ట నోపక విడి రాస లెదల. 87

క. అప్పుడు కవ్వడి పాటుని,
యొప్పునఁ జనుదెంచి నిలిచి యొకచే వింటిం
జప్పున మోపిడి యేసెను,
నప్పుడ మచ్చియపుజంత్ర మరతెగి పడఁగన్. 88

తే. దానిఁ గన్గొని దొరలెల్ల నాన వూని
ద్రుపదు నడఁగింపఁ దొడరినఁదోడుచూపి
కర్ణు నర్జునుఁ డోడించెఁ గడిమి మెఱసి
భీముఁడోడించి శల్యుని బెగడువఱిచె. 89

తే. అంత సిగ్గున దొరలెల్ల నరిగి రిండ్ల,
కవల ద్రోవది నర్జునుఁ డరదమునను
బెట్టుకొనివచ్చి తల్లితోఁబిచ్చ మొకటి,
తెచ్చితినటన్నఁగలహూపు దెలియకామె. 90

క. ఏవురునుం గైకొనుఁ డని,
యావల ద్రోవదిని జూచి యలజడిపడఁగా
నావడి వ్యాసుం డచటికి,
వేవచ్చి తెఱంగు చెప్పి వెంటనె వారిన్. 91

క. ద్రుపదునికడకుం గొనిచని
యపురూపపుఁ గతలుచెప్పి యైదుగురకు నొ
క్కపడఁతి ద్రోవది నియ్యఁగ,
నపుడె యొడంబఱిచి యేగెనతఁడుతనంతన్ 92

ఉ. అంతట మంచి మూర్తమున నందఱు నెయ్యురఁ జుట్టపక్కముల్
వింతగఁ జూడ రాఁగఁ గనువింపుగ నాద్రుపదుండు కూఁతునున్
సంతస మారఁదెచ్చి వరుసం జముపట్టికి గాప్పుపట్టికిన్
వంతునఁ గ్రీడికి న్గవలవారికిఁ బెండిలిచేసె వేడుకన్. 93

సీ. పెండ్లి నడచిన వెనుకను గొన్నాళ్ళు
పాండుని కొడుకులు పదిలముగను
ద్రుపదుని ప్రోలన కొండొకపడియుండ
నాలించి ధృతరాష్ట్రుఁ డలరి మదిని
గొడుకులు మఱఁదియుఁ గూడిచెప్పినయట్టి
చెనఁటిమాటలఁ జెవచెవులఁబెట్టి
విదురుండు ద్రోణుండు భీష్ముండుఁ గఱపిన
హితవును విని చాల నెఱుకమీఱ
విదురు నెలమిని ద్రుపదుని వీటి కంచి,
పాండుకొమరుల రప్పించి వారికపుడ
సగము నేలకు దొరతన మొసఁగి నొసంగి,
ఖాండవప్రస్థమున నుండఁగాను బనిచె. 94

ఉ. అప్పుడు కృష్ణుఁ డాఖికను నచ్చటికిం జని వేల్పు జేనితోఁ
జెప్పుడు విశ్వకర్మః బనిచె నృగరొక్కటిఁ గట్ట నాతఁ డా
చొప్పునఁ బంపఁగాఁబసుట సూటి యెలర్పఁగ విశ్వకర్మ తా
నొప్పుల కెల్ల మిక్కటయయి యుండెను వీటినిగట్టి దానికిన్. 95

వ. ఇంద్రప్రస్థం బను పేరువెట్టి నెట్టన గాడ్పుపట్టియన్న కిచ్చిన నచ్చోలు
వున కచ్చెరువడి యాతండు తమ్ములుం దానును నొక్క మంచివాఁ
డుండుఁజొచ్చి తక్కుంగల నేల యేలికలెల్లఁ దన కరిగాఁపులుగా
నుండ నిండువేడుకతోడ నేల యేలుచుండె నంత నొక్కనాఁడు. 96

క. వేలుపుఁ దపసియుఁ దగ నా,
ప్రోలికిఁజనుదెంచి కాంచి ద్రోవదితోడం
బోలఁగ నొకయెఁ డొకఁడుగ,
నోలిని నుండంగఁ బనిచి యొండొకకడకున్ 97

సీ. ఎగిన నొనని యేఁపురు నొక్కొక్క
యేఁటను గూడుట కియ్యకొనుచు
నొకరితో నుండ నేఱొకరు చూచిన నేల
నొకయేఁడు వలగొన నొక్కకట్టు
చేకొనియుండంగ వేసవ నొకనాఁడు
పుడమివేల్పొక్కఁడు వడిగ వచ్చి
తనయావు నొకదొంగ కొనిపోవుచున్నాఁడు
విడిపింప రమ్మని విన్నవింప
విల్లునమ్ములుఁ గైకొన నల్ల బోయి
యన్నతో నున్న ద్రోవది నప్పుడుచూచి
పుడమిఁ దిరుగంగ విప్వచ్చు డెడముసేయఁ
కపుడె వెల్వడెనెవ్వరేమన్న వినక. 98

ఆ. నేలవేల్పు మొదవు నిముసంబులోఁ దెచ్చి,
యిచ్చి పుడమిలోని యేళ్ళఁ గ్రుంక
వెడలియొక్కనాఁడువిన్నెటిలో మున్గి,
యొద్దుతఱిని వేల్ప నున్నతఱిని. 99

క. వలపున నాతనిఁ గొని చని,
చిలువ వెలందుక యులూచి చెచ్చెరఁ దనదా
నలపునఁ జేరిచి క్రీడిం,
గలయ నిరావంతుఁ డనెడు కందువు పుట్టెన్. 100

క. ఆవెనుక న్మణలూరిని,
జేవమెయిం జేరి క్రీడి చిత్రాంగదనున్
వావిరిఁ బెండ్లాడి పడసె,
నోవక మఱి బభ్రువాహనుం దనుకొడుకున్. 101

సీ. అచ్చోటఁ గొన్నాళ్ళు విచ్చలవిడినుండి
మాయను సన్యాసి సేఁగుముఁగను
ద్వారకకుఁ జోయి దగ్గఱ రైవత
కంబనుకొండను గడిసి యచట
నుంతంగఁ గృష్ణుఁడు నిండువేడుకతోడ
నచ్చటి కరిగి విన్వాచ్చుతోడ
మాటాడి యేఁగి యామునాఁడు తనవీటి
వాని బంధుగు పేరుపెట్టి
తోడుకొనివచ్చి యటమున్న దొంగకావి,
తాల్పు వేసంబు నచ్చోటఁదాల్చియున్న
క్రీడి కందఱ మ్రొక్కించి వేడుకలర
నతని నింటికిఁ గొనిపోయి యవల నునిచి. 102

క. తన చెలియ లగు సుభద్రను
బనిచెను సన్యాసియొద్దఁ బనిసేయంగా
నెనరున నర్జునుమది యా,
ననఁబోఁడిం దగులు చెలఁగి నగరున నొకచోన్. 103

తే. కోరికలుజాతిపోలఁతుల కూర్మితీఱి,
జగములోఁబోడలగు చెందుసాజనురయఁ
గోరికలుమీఁజాతిపోలఁతులకూర్మిఁగోరి,
యక్కజంబుగఁదాఁబోషయయ్యెఁగ్రీడి. 104

సీ. ఉవిదపై దవిలిన యుల్లంబుతోఁ గ్రీడి
కనువిందుగాఁ బనుల్ గొనుచునుండ
మాతనంబునఁగృష్ణుఁడంతయుఁదలిదండ్రు
లకుజెప్పియొప్పించియొకటఁబెండ్లి

పనులెల్లసాగించి పండువు పేర్వెట్టి
బలరాము నొకదీవి పజ్జకంపి
పెండిలిగావించి వెలఁదిని మఱఁదిని
నడురేయితన తేరువడిగనిచ్చి
యంపవారును దేరెక్కి యరుగుచుండ,
నూరి కావలివారెల్ల నొకటఁ దాఁకి
యార్చి పేర్చినఁ గవ్వడి యోర్చి వారిఁ,
బెరలఁగాఁ జేసెనుసుభద్ర తేరుగడప. 105

చ. అటువలెఁ గ్రీడి మాఱుకొని యాపటిఁరూపఱఁజేసి చేడియం
దటుకున వెంటఁబెట్టుకొని దారిని సాగి యనంబు పర్వఁగా
దిటమున నూరుచేరి తన దిట్టతనంబును నెల్లవారు మి
క్కుటముగఁ జెప్పుకొనఁగఁ బెనుకూరిమిఁ దొయ్యలితోడ నుండఁగన్.

క. కొడుకభిమన్యుండనఁగను,
బొడమె సుభద్రకును దండ్రిఁ బోలెడురూపుం
గడిమియుఁ బ్రోడతనంబును,
వడియును బీరంబుగలిగి బలువిలుకాఁడై. 107

వ. మఱియు నప్పాండుని కొమాళ్ళకేవురకు న్వరుసగాఁ గొడుకులేవురు.

క. ప్రతివింధ్యుఁడుశ్రుతసోముఁడు,
శ్రుతకీర్తియు ననఁగ మొదలసారిదినివెనుకన్
జతగ శతానీకుండును,
శ్రుతసేనుఁడుఁ బుట్టిరపుడు ద్రోవదియందున్. 109

సీ. కవ్వడియొకనాఁడు దవ్వులయడవికి
వెన్నునితోఁగూడి వేఁటకరిగి
నేలవేలుపురూపుఁ దాలిచియచ్చోట
వెసమెలంగెడి వేఁడివేల్పుఁజూచి

మున్నొక్కరెకమీఁకు జన్నంబుగావించి
మిగుల నేతిని వేల్పఁ బెగులువొడమి
తన్నుఁ గాఱించుట విన్నవించినవిని
తగుమందు ఖాండవమగుట తెలిసి
యగ్గివేల్పుచే గాండీవ మనెడువిల్లు,
పడసివేల్పురాయనితోఁట వడిగఁజొచ్చి
కాల్పనాతనిఁ బురికొల్పఁగడఁగిచిచ్చు
తోఁటలోఁజొచ్చి మంటలు తోరముగను. 110

క. కాలువఁ దోడరినఁ గనలున
వేలుపుదొర యడ్డుసొచ్చి వెనమబ్బులచేఁ
జాలఁగ వానలు గురిసినఁ
దూలక యవ్వానిఁ గ్రీడి దొలఁగఁగఁజేసెన్. 111

క. దానికిఁగాజేజేదొర
పూనికొని దురంబొనర్ప ములుకులు పెక్కుల్
మేనన్నాటించి కలఁచి
జానుచెడంజేసి క్రీడిసరగం బఱపెన్. 112

చ. మయుఁడనువాని నయ్యెడను మంటలుబిట్టుగఁ జుట్టుముట్టినన్
మొయివడఁకంగ వచ్చివగమీఱఁగఁ గ్రీడి మఱుంగుసొచ్చినన్
గుయివిసిజాలిపుట్టి యెదఁగూరిమి మీఱఁగఁ గాచెనాతనిన్
మయుఁడును దానికల్లమున మల్లడినొందెడు సంతసంబునన్. 113

క. సెలవుంగొని చనియెను న
వ్వలఁదగ నావేడివేల్పు వడిఁదనియంగా
నలరుందోఁటను గాలిచి
యెలమిని దెవులెల్లఁబాసి యిచ్చ్వాజనిరోన్. 114

వ. అంత నొక్కనాఁడు. 115

క. పాండుని పెద్దకొమారుని
యండను గఱివేల్పుతోడ నచ్చోటను గూ
ర్చుండినకవ్వడి కిట్లను
దండముగావించి మయుఁడు తద్దయు నెమ్మిన్. 116

క. నెనరున నునుఱులు నిలిపిన
కనికరపుంగనికి నొకటి కైకొనిచేయం
గను నేర్తు నె యైనను నే
నొనరఁగ నాచేతనై నదొక్కటి నీకున్. 117

తే. చేయనిచ్చగించినవాఁడఁజెలఁగినన్నుఁ
బనుపుఁ డెద్దియైనను నొక్కపనియొనర్ప
నేను రేద్రిమ్మరులలోన నెక్కుడైన
నేర్పుగలవాఁడనింపుపొందికగఁగట్ట. 118

వ. అనవుడు నతండు. 119

క. అపురూపమైనయోలగ
మిపు డొనరింపంగవలయు నీవని వేడ్కం
గపురంపువీడియం బిడి
యపుడంపిన సంతసించి యాతేఁడు వేగన్. 120

చ. బలుపగడంపుఁ గంబములు బంగరుదూలములందమైన చ
ల్వల దొరతాయరంగులును బచ్చల యచ్చపుఁ దోరనంబులున్
వలుద సుపాణి ముత్తెపు వన్నెల సోరణగండ్లు మంచి కెం
పుల నెలకట్టులుం గలిగి పొల్పగునట్టుగఁజేసెఁ గొల్వొగిన్. 121

క. మఱియుం గేళాకూళులుఁ
దఱుచగు క్రొవ్విరులఁ బండ్లఁదగు పూఁదోఁటల్
వఱలెడు డిగ్గియలుం బలు
దెఱఁగులుగల యాటపట్లు తేటగనొప్పన్. 122

తే. అట్లు కొలువుగట్టి రాజముపట్టికి
నోనఁగనేల వేల్పు లొక్కెమొగని
దీవెనలనొసంగ దేవేరితోఁగూడి
కొలువుసొచ్చి జముపికొమరుఁడుండ. 123

ఉ. హొత్తులఁగత్తలానులను నందపురోవిరిఁబోండ్ల జాఘవా
మొత్తముదెచ్చియిచ్చి సతమున్మది మెచ్చుచుఁ గొల్చుచుండు మఱ్
క్రొత్తగ నాల్గుసంద్రములకున్ నడుమంగల రాచసింగముల్
మొత్తములై యుబంగొలువులోపల నొప్పెడు నేలదాలుపున్. 124

వ. అట్లుండ నొక్కనాఁడు. 125

శా. ఏలా వేఁడివెలుంగు నేలకును నిల్లేతెంచుచున్నాఁడు నేఁ
డోలేఁబాయవు బిడ్డలారకనుఁగం జొక్కక్కచో మానుసుల్
గేలుందోయి తెమల్చిగుంపులయి యోలింజూడరా నింగియుం
గ్రాలన్నారదుఁ డేగుదెంచెఁ గడువేక్కం గప్పడింజూడఁగన్. 126

తే. వచ్చి రాచపాడినిగూర్చి పలుకులాడి;
చనఁగ సమకట్టియున్నచో జమునిపట్టి
కొలువునకుఁ దోడుకొనిపోయి కూర్మిఁజూప!
నారివేరంపుఁ దపసియునని యె నిట్లు: 127

క. వినుమిట్టిది మున్నెన్నఁడుఁ
గనుగొనలేదెందు నీజగమ్మున నెపుడున్
వినియు నెఱుఁగ మానుసులం
దును నిది యపురూపమనుచుఁ దోఁచెడునాకున్. 128

ఆ. అనుచుఁజాల దానినందంబు గొనియాడి,
పుడమిఱేండ్ల నెల్లఁ బోరగెల్చి
కూర్చుసొమ్ములన్ని యొనర్చెడుజన్నంబు,
వడిగనీవు చేయవలయునంచు. 129

క. పాండుఁడు నీతోఁ జెప్పఁగ,
నిండుమది న్నన్నుఁ బుచ్చె నీకడకనుచున్
దండిగఁ జెప్పి యొడఁబఱిచి,
యొండుకడకుఁబోయెఁ దపసియొయ్యననింగిన్. 130

క. అంతయుధిష్ఠిరుఁడప్పుడె,
మంతనమున, గృష్ణుతోడ మాటాడి వెసం
జెంతకు నర్జును భీముని,
నంతసమునఁ బిల్చి యిపుడచని వెన్నునితోన్. 131

క. ఆలమున జరాసంధునిఁ,
గూలిచి రండనుచుఁ బనుపగొబ్బునఁ జని యా
ప్రోలికి వాసిన్మార్కొని,
యోలింబరిమార్చె భీముఁడొక్కఁడుఁ గడిమిన్. 132

తే. అట్లుకలన జరాసంధునమరఁ ద్రుంచి,
యతనికొడుకైన సహదేవునందు దొరత
నమ్మఁబూనిచి ముగ్గురు నెమ్మివచ్చి,
గొంతితొలిపట్టికిని జెప్పిరంతవట్టు. 133

క. నలువురుతమ్ములు వడిఁజని,
నలుగడలుంగెల్చి మేలినగలును గుఱ్ఱ
ములు నేనుంగులు రొక్కము,
వలువలునుందెచ్చి యొసఁగ వలనుగతేఁడున్. 134

ఉ. జన్నమొనర్చి వెన్నునకుఁ జక్కఁగఁ దమ్ముల మియ్యఁ బోవఁగాఁ
గన్నుల నిప్పులొల్కఁ గని కాఱులు ప్రేలుచు నెల్లవారలుం
బన్నమునొందఁ గృష్ణు శిశుపాలుఁడు తిట్టిననల్గియప్పుడే
వెన్నుఁడు చుట్టుకైదువున ప్రేల్మిడి ద్రుంచెనుఁ వానికుత్తుకన్. 135

క. అంతయుఁ గని దుర్యోధనుఁ,
డెంతయు మది వనటఁగొంది యీసునవారిన్
వంతలఁదగిలించి సిరిఁగొన,
మంతనమున మామతోడ మఱిమఱిచెప్పెన్. 136

క. అతఁడు నునల్లునిఁ గొనిచని,
ధృతరాష్ట్రున కెఱుకపఱిచితిన్నఁ గదౌరస మా
నతిఁగొని జూదంబునకున్,
గొతుకక పిలిపించె నటకు గొంతికొమాళ్ళన్. 137

తే. పిలుచుకొనివచ్చినట్టియావిదురువలన,
నంతయు నెఱింగియును భీమునన్న కడఁగి
శకునితో నాడిపుడమినిసరకుగములఁ,
దమ్ములనుదన్ను వరుసగాఁదవిలియొడ్డి. 138

తే. ఓడిపిమ్మట ద్రోవదినొడ్డియోటు,
వడెయుధిష్ఠిరుఁ డప్పుడు వగపుతోడఁ
బ్రాతిగామిని ధృతరాష్ట్రిపట్టిపంచి,
కొలువునకుఁగృష్ణ రప్పించెఁగూళగాన. 139

సీ. అపుడు దుశ్శాసనుఁడాయింతిఁ గొల్వులో
దలపట్టియీడ్చి తులువయగుచు
నన్నపంపుఁ గట్టుకొన్నబట్టయు విప్పఁ
గని భీముఁడెంతయుఁగనలునోకమి
చివ్వనాతనిపొట్టఁ జీలిచి నెత్తురు
ద్రావెదనంచును బ్రతినపట్టి
తొడమీఁదఁ గూర్చుండఁ దొయ్యలిఁ జేసన్నఁ
బిలిచిన గాంధారిపెద్దకొడుకుఁ

బెనఁకువను రోఁకటను దొడల్ విఱుగఁగొట్టి
యెసమకాలను దల్కఁదన్ని యెలమిఁ గాంతు
ననుచుఁ బెనుబాసచేసిన నంతయు విని
ద్రోవదినిబిల్చి ధృతరాష్ట్రుఁడీవి నెఱపి. 140

క. దొరతనమెల్లను మరలం,
గరమక్కటికమునవిచ్చి కలుపుకొని యుధి
ష్ఠిరు నంచినఁ దనవీటికి,
నరిగెందమ్ములను వాలి నాతఁడు గొనుచున్. 141

క. అదిగని సుర్యోధనుఁడపు,
డెదలోనంగుంది మామ నేకతమునకుం
గదియించి కొన్నినాళ్ళకు,
నదనారసిచెప్పి తండ్రి యానతిగొనుచున్. 142

ఆ. ప్రాతిగామినంచి పాండుకొమాళ్ళను,
నటకు మరలవచ్చునట్లుచేసి
కత్తిపెద్దయన్నఁ గడువడిఁ బురికొల్పి,
నెత్తమాడునట్లు మెత్తపఱిచి. 143

సీ. జూదాన నోడినచో దొరతనమెల్ల
విడిచి పండ్రెండేఁడు లడవినుండి
యామీఁద నొక్కయేఁడమరంగ నెవరికిఁ
గానరాకుండంగఁ గడపవలయు
నీలోన నవ్వారి కేనియుఁ గనిపింప
మరల నెప్పటియట్ల జరపవలయు
ననిచెప్పి యొప్పించి యాడినొకని యు
ధిష్ఠిరునోడించె దిట్టయగుచు

నంతనాతఁడు తమ్ములఁ బిలువఁగొనుచు,
నూఱువారంబులును జేరి యొకటఁ గుండఁ
జిన్నవోయిన మోముల వన్నెదఱఁగి,
కట్టుబట్టలతోడనే కానకేఁగె. 144

క. కొడుకులఁగనియు సుభద్రయు
వెడలిరి ద్వారకకు నిచట వీరలతివతో
నడవులఁ గాయలుఁ గసురులుఁ
గుడుచుచుఁ గ్రుమ్మరుచునుండఁ గొంకక యొకనాఁ. 145

ఆ. తెరువు నడ్డగించి తెగువను బోనీక,
బకుసి తమ్ముఁడైన బల్లిదుండు
కినుక మీఱవచ్చి కిమ్మీరుఁడనువాఁడు,
నిక్క వానిభీముఁడుక్కడంచె. 146

వ. అంత నా పాండునికొమాళ్ళు. 147

సీ. కడుఁ దపసులు చెప్పుకతలనాలించుచుఁ
గామ్యకంబనియెడి కాననుండఁ
గృష్ణుఁడేతెంచి యేగినవెన్క వ్యాసుని
బంపునఁగవ్వడి పట్టువోక
నింద్రకీలంబన నెసఁగెడి మలచుండి
యెఱుకురూపునఁ బందినేసినట్టి
ముక్కంటితోఁ బోరి మిక్కిలి మెప్పించి
పాశుపతంబనఁ బరఁగునమ్మ
గట్టువిల్తునిచేఁ బొంది క్రాలుచుండ
వేల్పుదొరవచ్చి విన్వచ్చు వెంటఁ గొనుచుఁ
దనదు వీటికిఁ జనియుండుఁ దనివిదీఱఁ
గొడుకుతోఁ గొన్నియేఁడులు కూడియుండి. 148

క. పౌలోమకాలకేయులఁ,
బోలనివాతకవచులను బోలదిండ్లననిన్
వాలమ్ములఁ జంపించెను,
వేలకొలఁది మండగీల విప్వచ్చువిచేన్. 149

వ. ఆలోన నొక్కనాఁడు. 150

తే. ఊర్వసి యనంగ నచ్చరయొర్తు క్రీడి,
చక్కఁదనమును గన్గొనిచాలవలచి
క్రూడ వేఁడుడు నతఁడొప్పుకొనక కసరఁ,
బేడిగానుండఁ దిట్టెనా క్రీడినాపె. 151

వ. అంతనిచ్చట. 152

ఉత్సాహ. కడమ పాండుకొమరు లచటుఁ గదలి ద్వైతమనెడికా
అడవిఁజేరి కొన్నినాళ్లు లందునుండి పిమ్మటన్
వెడలిగంధమాదనంబు పేర, బరఁగుకొండకున్
నడచియందు నెమ్మినుండి నాతి కృష్ణపంపునన్. 153

వ. భీముండుచని. 154

క. జక్కులరక్కసులందల,
లొక్కుమ్మడి డొల్లనేసియుగ్గలి మదికి
న్మక్కువ గలిగిన పూవుల,
నక్కఱకోఁ దెచ్చియిచ్చె నక్కజమొదవన్. 155

తరువోజ. పాఱునివేసంబు బాగుగాఁదాల్చి పాండునికొమరుల పజ్జనుండి
వీఁకడితనమున వెలయుజటుఁడను పేరిటిపొలదిండి భీముఁడువేఁడ్క
మీఱఁగ వేఁటతమినిఁబోయియుండ వెల్లననందఱ మీఁదవైచుకొని
పాఱినవడముడి పఱతెంచివానిఁ బరిమార్చియందఱి బన్నమువాపె,

సీ. అంతటదివినుండి యర్జునుండరుదెంచి
యన్నకునంతయు విన్నవించి

సుకముగానుండంగ నొకనాఁడు ద్రోవది
పూలుగావలెనంచుఁ జాలవేఁడ
మరల భీముఁడుపోయి మణిమంతుఁ గడతేర్చి
యలరులఁ గొనివచ్చియతివకిచ్చె
నామీఁద నొక్కనాఁడడవిని దిరుగుచు
వడముడి యొక్కచోఁ బాముగాఁగ
దారిఁబడియున్న నహుషునినోరఁజిక్కి,
వెడలలేకున్నఁబాండుని పెద్దకొడుకు
పాముకడకేగి యడిగినవానికెల్ల,
బదులుచెప్పఁగనది భీమువదలిపెట్టె. 157

సీ. అట్లుండఁ జూపోపక చట దుర్యోధనుఁ
డేకతంబునఁ గర్ణుఁడెచ్చరింప
మామ యౌనని పలుమాఱును బలుకంగఁ
బసులఁ గాపాడు నెపంబువెట్టి
మొనలడంబముతోడఁ జనుదెంచి పాండుని
కొడుకులుదిగియున్న నెళవునకును
బజ్జగుడారంబు పన్నించి వారిని
వెక్కిరింపఁగ విఱ్ఱవీఁగుచుండఁ
జిత్రసేనుఁడనెడి జేజేలదిట్టఁడు,
వచ్చితాఁకి కర్ణుఁబాఱఁద్రోలి
దారనుబట్టి త్రాళ్ళతోఁగట్టికొనిపోవఁ,
జెదరి వెఱచిపఱచి సిగ్గుదోఁప. 158

వ. అతనిమూఁకలు. 159

ఉ. పోలియుధిష్ఠిరు న్మఱువుసొచ్చినఁ దమ్ములఁ బంపవారునుం
జాలమునేయకేగి నిముసంబునఁ గూడఁగ ముట్టి తూపులం

గూలఁగనేయు మూఁకలనుగోయని యాఁతిచినిల్వలేక యా
వేలుపుఁబోఁడ నింగికిని వేచనఁ జూచుచుఁ గ్రీడిప్రోడయై. 160

క. అమ్ములగూఁ డొనరించియు,
నెమ్ములుపడఁ జిత్రసేను నేసిన వెఱచే
నిమ్ముల దుర్యోధనుఁడై,
ళమ్మునఁ గవ్వడికినిచ్చి లలిఁబఃవినియెన్. 161

ఆ. కట్టుత్రోడనపుడు గాంధారిపట్టిని,
గాడ్పుపట్టి యన్నకడకుఁ దేఁగఁ
గనికరమున మేని కట్లెల్లవిప్పించి,
వడిగహితవుచెప్పి విడిచిపుచ్చె. 162

ఆ. ధౌమ్యునింట నునిచి తగనన్నదమ్ములు,
పంట్లు దేరనడవి పట్లకరుగఁ
గ్రొత్తపెండ్లి చేసికొనుచు నాదారిని
సైంధవుండు చనుచు సరగవ్రాల. 163

చ. నిలుకడఁగన్న క్రొమ్మెఱుఁగు నీటున మేనునుదాల్చి యిచ్చమై
మెలఁగెడు గుజ్జమావివలె మేలిమిచేఁతలుపూని మెత్తనై
చెలఁగు పసిండి బొమ్మవలెఁ జేరువ గుమ్మరుచున్న ద్రోవదిం
గలయఁగఁజూచి పూవిలుతు కమ్మనిములుకులనొచ్చి క్రచ్చఱన్. 164

క. కదియంజని మిక్కిలి ద్రో,
వది బతిమాలియును దెన్నువడయక బలిమిం
దుద కౌఁగిలిని దేరను
బదిలముగాఁ బెట్టుకొంచుఁ బఱచెంగానన్. 165

కే. ధౌమ్యుఁడఱచుచు వెంటను దవిలివానిఁ
దిట్టుచును బోవనంతలో దిట్టయగుచు

భీముఁడరుదెంచి సైంధవు వేగముట్టి
గడియలోఁబట్టి తలపట్టి గాసిపెట్టి. 166

క. అన్నకడకీడ్చి తెచ్చినఁ,
జెన్నఱితల కేవ్రలుగను జెడగొఱుగంగా
విన్ననయి యున్న సైంధవుఁ
గ్రన్నన విడిపించిపుచ్చెఁగాంచి యతండున్. 167

తే. అవల నొకనాఁడు తమ్ములుఁగవలు సేగి
విషపుపేటివివలదన్న వినక త్రావి
పడినఁల్వురగుదెదారిపలుకులకును
నొప్పమార్వల్కి బ్రతికించి మెప్పులొందె. 168

వ. అట్లుండలం బడలియు వానలం దడిసియు వెడిదంబులగు నిడుములు కొడరియు జడియక యడవిలోనుండఁ బన్నెండేండ్లు నిండిన నాదండిమగలు తమతోడఁ గూడనున్నవారి నందఱ నాయాయెడలకుం బంచి మించినవేడుక నించుకయుఁ దమజాడలెవ్వరు నెఱుంగకుండ దండితనంబునఁ గాఱడవులంబడి నడచి నడచి కడకొక్కయెడ నేకతంబు నందగిన వేసంబులు వేసికొని బయలుదేఱి విరటునూరుచేరి యూచేరువం దమకత్తుల మొత్తమ్ములను నమ్ములను విండులను నొక్క కట్టగాఁగట్టి వానిచుట్టును బీనుంగుత్రో లొకటిఁజుట్టఁబెట్టి యప్పట్టుననున్న జమ్మిచెట్టుపయింబెట్టి. 169

సీ. కంకుఁడు నాఁగను గతలుసెప్పంగ యు
ధిష్ఠిరుఁడాతేసి దెసనునిలిచె
వలలుండనంగను వంటలవాఁడయి
వడముడియచ్చోటఁ బనికినమరె
నచట బృహన్నలయనుపేరఁ గవ్వడి
నెలఁతల కాటలునేర్పఁజేరె

సందెదామగ్రంథి యనఁగను నకులుండు
గుఱ్ఱాలఁ బరికింపఁ గొలువుకుదిరె
నాలఁగానఁ దంత్రీపాలుఁడనెడు పేర
నక్కడనె సహదేవుఁడు నమరియుండె
మాలినియనంగ ద్రోవదిపూలుముడువ
నోడయనివెలందుక సుధేష్ణయొద్దనుండె. 170

ఆ. జెట్టిపట్టుపట్టి సింగంబుతో నైనఁ
బులులతోడనైనఁ బోరిగెలిచి
దొరకు నతనియనుఁగుఁ దొయ్యలులకు వేడ్క
సలుపుచుండు నోకఁడు వలలుఁడెపుడు. 171

సీ. అట్లు కొన్నాళ్లేగ నప్పుసుధేష్ణను
గన సింహాబలుఁడట కొనరవచ్చి
మాలినిఁ దిలకించి మదినామె సొగసెంచి
మాటికెదఁదలంచి మరులుమించి
యక్కకునెఱిఁగించి యిక్కకుఁ జనుదెంచి
పాన్పున మేనుంచి వనరుచుండ
మాలిచేఁ దమ్మునికిఁ గల్లును
రాణిగారంపిన రమణఁగొనుచుఁ
కృష్ణయేగిననాతఁడు కెరలిపడుచుఁ
దన్నుఁ బట్టంగ వచ్చినఁ దలిరుఁబోఁడి
కొలువుకూటంబు దెసఁబాఱఁగూడవచ్చి
సింహాబలుఁ డింతికొప్పును జేతఁబట్టి. 172

క. ఈడిచి యొకరక్కసుచే
నీడిగిలం ద్రోయఁబడుచు నింటికిఁ జనియెం

జేసి యుచే సంతయు నెయి
వాఁడిమగఁడు భీముఁడెఱిఁగి పాయనికిమకన్. 173

మత్తకోకిల. ఆఁడురూపున వచ్చి ద్రోవదియట్లు చీఁకటిఁ గన్నియల్
గూడి పాటలు నేర్చు గీముఁగఁగోరి పూరయుచుండఁగా
నాఁడు సింహబలుండువచ్చి, తనంతగేలని జాఁప మా
టాడ కుక్కిన వానిసం పినుమాడిచేసెను మద్దిగాన్. 174

సీ. అల్లుముద్దగఁజేసి యుటు వైచిపోయిన
దమ్ములు నూర్వురుఁ దరలివచ్చి
చచ్చినయన్నకై చాలసేపేడిచి
పీనుంగుపైఁ గృష్ణఁ బెట్టికట్టి
కొనిపోవుచుండఁగఁ గూయి దెమాలిని
బానసంబున గాచ్చుపట్టి వినఁగ
వారును గాటికి వచ్చెడునంతకు
వడమడి యటకేగి బడలువడఁగ
నందఱను ద్రుంచి ద్రోవదినల్లఁబంచి
మాఱుత్రోవనువంటిల్లు మరలఁజొచ్చె
నేటికేతెంచుమాలిని వెలయఁజూచి
ప్రోలివారెల్ల వెఱచిరి బూతమనుచు. 175

ఉ. అంతయునాలకించి యట నాధృతరాష్ట్రినిపట్టి యిచ్చటం
గొంతికొమాళ్ళు నిల్తురని కొంతతలంచి సుశర్మనంచి యా
వంతయు జాగుసేయ కట నావులఁబట్టఁగఁబంచి తానునున్
మంతురులాలమంచెదిరి మార్కొనఁగల్గినవారిఁ గాన వడిన్. 176

క. మఱునాఁడు వెడలి విరటుని,
పఱగడ మొదవులను బట్టవడచక్కికిఁగ్ర

చ్చుటఁ బఱతెంచెను గొల్లలు,
వెఱపెల్లనఁబఱచి విరటువీడు సొరంగన్ 177

క. అంతకుమున్న సుశర్ముఁడు,
పంతము లాడుచునువచ్చి పలకడఁబసులన్
వింతగఁబట్టిన విరటుఁడు,
చెంతలనున్నట్టి తనదు చేరువతోడన్. 178

క. చనితాఁకి యోడిపోయిన,
నెనరేది సుశర్మయపుడు నెఱమగఁటిమినా
తనిఁ దనతేరికిఁగట్టిన,
వనట న్వొడిపించె రేయి వడముడి యతనిన్. 179

సీ. విరటుండు నెయ్యురు వీటనులేనప్పు
డిచట దుర్యోధనుఁ డేగుదెంచి
పసులఁ బట్టెనటంచుఁ బసులవారలు చెప్ప
విని పిన్నగావున విరటుకొమరుఁ
డు త్తరుండింటను నువిదలముందఱ
బీరముల్ వల్కుచు వెడలి కృష్ణ
పంపునఁబేడి వార్వములఁ దోలఁగొనుచు
వడివచ్చి మొంగలఁ బగఱఁజూచి
వెఱచి దిగఁలొంది యరదంబు వెనుకవంక,
త్రిప్పుమన్ననుగ వ్వాడిత్రిప్పుకున్న
బెగ్గలంబునఁ దేరిని డిగ్గనుఱికి,
పాఱఁజొచ్చినఁగ్రీడియుఁ బఱుగువాఱి. 180

తే. అతనిఁ గొనివచ్చి యరదంబు నందుఁ బెట్టి
తాను గ్రీడియౌ బెత్తిఁగించి తాల్మిగొలిసి

యతని నరదంబు నడపంగ నానతిచ్చి
యమ్ముఁలను వింట్లు పెట్టిన జమ్మికడకు 181

క. చని వలసినవానిఁ గై,
కొని తక్కటివాని నందె గట్టుగనిడి చ
య్యనఁ జని గాండీవంబున;
గొనయము నెక్కించి మించి ఘోరముగాఁగన్. 182

క. ములుకులు వఱపిన మూఁకలు,
నలుదెసలం బాయవిచ్చి నానునుబఱవన్
బలుమానును లోఁగిఁ దాఁకిరి,
చిలుకుల వానలు గురియుచుఁ జేవయెలర్పన్. 183

క. తఱిఁదాటకుండఁగవ్వడి,
యొఱిఁగించుకొనియెను దన్నునిచ్చట ననిక్రొం
దఱు పలికినఁ దఱికడచుట,
యొఱిగించెను భీష్ముఁడప్పు డెల్లరువినఁగన్. 184

వ. అంత నర్జునుండు. 185

తే. పసుల మరలించి కావలిపరినిర్క్రమించి,
వెనుకఁ జనుచున్న తేనిని వెంబడించి
కదిసి యోడించి పెఱవారిఁ గండడంచి,
పొలికలనన్నెత్తురేఱులు వెలువరించి. 186

సీ. తమ్మునితలద్రుంచి తత్తడులనునొంచి
బలియునిఁగర్ణునిఁ బరవఁజేసె
ద్రోణుని నొప్పించి ద్రోణుకొమారునిఁ
జేరాడకుండంగఁ జిక్కువఱిచెఁ
గృపుని నమ్ములముంచి కినుకమై భీష్ముని
యరదంబుపై సోలి యొఱగఁజేసె

ద్వారను గేరడమాడి దురమున దడములఁ
బీనుఁగు పెంటలుగానొనర్చి
మఱియునందఱ సోలించి మఱచిపోక,
తెచ్చెను త్తరబొమ్మపా త్తికలకొఱకుఁ
జేరుగలవారి తలచీర లారఁగోసి,
తనివిదీఱంగ నని చేసి వెనుకమరలె. 187

గీ. అంతఁదెలిసి యుస్సురనుచు దుర్యోధనుఁ,
డపుడెభీష్ముపలుకులాలకించి
సిగ్గుఁబాటుతోడఁ జేరువతోఁగూడి,
యింటికడకు నడచె నెఱుకగలిగి. 188

క. అప్పుడు కవ్వడి జమ్మిని,
నెప్పటివలె విల్లునమ్ము లిడి యుత్తరునిన్
మెప్పుగఁ దేరను నిడి తా,
నొప్పుగ నొగలెక్కి చనియె నూరికి నెలమిన్. 189

క. ఈలోన నట యుధిష్ఠిరుఁ,
డాలములో గెలుపుగొన్న యుల విరటునితోఁ
బోలఁగ జూదం బాడుచు,
నాలములోఁ బేడిగెలిచె నని వ్రేటుపడెన్. 190

క. అమ్మఱునాఁ డందఱు నొక,
యిమ్మునఁ దగఁగూడి తొంటి యేపుననుండన్
నెమ్మిని విరటున కుత్తరుఁ,
డిమ్ముల నెఱిఁగించె వారి నెల్లను వరుసన్. 191

క. ఎఱిఁగింప యుధిష్ఠిరునకు,
నెఱఁగి విరాటుండు లేచి యెల్లఁ దప్పుల్

మఱవంగ వేఁడుకొనియెం,
దెఱఁగుపడం బలికి కూర్మి తెల్లము గాఁగన్. 192

తే. చుట్టముల నెల్ల రావించి జోటిమిన్న,
నుత్తరయనెడి తనకూఁతునొసఁగి పెండ్లి
చేసె నభిమన్యునకు వేడ్క చెన్నుమీఱ,
నెంతయును జూచువారలు సంతసిల్ల. 193

వ. అనిన విని తరువాతి కత నెఱిఁగింపు మనుటయు. 194

క. కలువలవిందును బ్రొద్దును,
మలల న్సంద్రముల నేళ్ళు మఱి యీపుడమిన్
వెలుఁగును జీఁకటిఁ జుక్కల,
నెలమినిఁ గలిగించి ప్రోచి యేలెడి సామీ. 195

మాలిని. జగముల మొకిమీఁడా సాదులం బ్రోచుతేఁడా
పగ యెఱుఁగనివాఁడా పల్వాలం బ్రుంచు ప్రోడా
వగ లోదవనివాఁడా వంతసంద్రంపుటోడా
నెగు లడఁచెడివాఁడా నేలకు న్సంగడీఁడా. 196

గద్య. ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర శుద్ధాంధ్రనిరోష్ఠ్య
నిర్వచననైషధ కావ్యరచనాచాతురీధురంధర సద్యశోబంధుర
కందుకూరివంశ పయఃపారావారరాకాకైరవమిత్రసుబ్రహ్మణ్యా
మాత్యపుత్రసకలసుజనవిధేయ వీరేశలింగనామధేయ ప్రణీతం
బైన యచ్చతెనుఁగు భారతమునందుఁ బ్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము

క. మొదలుం దుదియు నెఱుంగక,
పదిలముగా నెపుడు నుండి పాడుగొనంబుల్
వెదకినను లేక మేలే,
యొదవించుచు జగము తేలుచుండెడి వేల్పా. 1
వ. శౌనకుండు లోనుగాఁగల జడదారిఱేండ్లకా సూతుం డిట్లనియె. 2
క. విరటుఁడు కృష్ణుఁడు మొదలగు,
వారలెల్లను గూడి యుండి దుర్యోధను తుం
టరితనము నగ్గడించుచు,
నరుమగ నొకరాయబారి నచటికిఁ బంపన్. 3
తే. అందఱును నెంచి యచ్చోటి కరిగి యతఁడు
తెలుపవలసినపలుకులఁ దెలియఁ గఱపి
ద్రుపదు నొజ్జను బంపిరి తోడరి సగము
పుడమి జముపట్టికిని నియ్య నడుగుకొఱకు. 4
తే. అంత నిటఁ గ్రీడి వెన్నునియింటికరిగి
పోరఁ దన తేరు నడపంగఁ గోరుకొనియె
నాఁడె దుర్యోధనుఁడు వచ్చి నాఁడెమైన
బంట్లఁ బదివేవురను దానుఁ బడసి చనియె. 5
క. నేలఁ గలవారలలోపలఁ
జాలఁగ దుర్యోధనునకు సాయము చూపం
బాలుపడిరి పెక్కువారలు
పోలఁగ జముపట్టిఁ జేరి పొలిచిరి కడిమిన్. 6
చ. ద్రుపదునియొజ్జ యేగియటఁ ద్రోవకురా ధృతరాష్ట్రితోడఁ గొం
త పోసఁగ మాటలాడి తనదారిని వచ్చిన గ్రుడ్డిఱేఁడును

న్నిపము త్రొలంగఁ బంపెఁ దననేరిమి గన్పడ నూరిపోసి నీ
విపుడ యుధిష్ఠిరుం గదిసి యీయనిమానుపు మంచుసంజయున్. 7

సీ. ఆతండు చనుదెంచి యందఱకును మ్రొక్కి
కొల్వులోపలనున్నగొంతికొడుకుఁ
గదిసియందఱు వినఁ గరముఁదీపులుగాఁగఁ
బెనఁకువ మానఁగఁబెక్కువగలఁ
దేనెమాటలఁ దెల్పి తిన్నని తెన్నున
నడవంగ జముపట్టిఁ దడవు వేఁడి
చదురెల్ల గాన్పించి చక్కని బదులుమా
టలఁ బాండుకొమరుని వలనఁబడసి
వారి వీడ్కొని ధృతరాష్ట్రు పజ్జకేగి,
యెల్లచందమ్ము లాతని కెఱుకపఱిచి
యలుకపుట్టించితగవు మైఁబలుకవలయు,
నుడువులెల్ల నుదిటముగానుడివిచనియె 8

సీ. అంత యుధిష్ఠిరుఁ డరసి యిచ్చటనుండి
వెన్నని ధృతరాష్ట్రు వీటికంప
నాతని రావించి యనియె నిక్కొవడి
నీవేగి సగపాలు నేలలోన
మాకియ్య జేసిత్రో మఱిమఱిచెప్పుము
వినఁ జేని యామీఁద వినుము తెలియ
నేపురకును మాకు నేను ప్రోక్షైనను
గడ కిచ్చునట్లుగఁ గడఁకఁ బలుకు
మట్లు చేసిననైనఁ బోరనెడుమాటఁ
దక్క కూడి బ్రదుకుదుము తఱుచు లేల

యనిన విన్నఁట భీముండు నతనితమ్ము
లవల ద్రోవది మదిఁ జెప్పిర తనితోడ. 9

ఉ. ఆవలఁ గృష్ణుఁ డేగి మరియాదమెయిన్ ధృతరాష్ట్రుఁ జూచి యా
క్రేవల ద్రోణునిం గృపునిఁ గేల్గవ మోడిచి పల్కరించి య
త్తావున నున్న భీష్మునిని దద్దయుఁ గూరిమి గారవించి య
చ్చో వెరవారఁ గొల్వునను జూపఱ డెందములుం గరంగఁగన్. 10

చ. చనువును బల్మిఁ జూపి పలుచందములం దగఁ జెప్పి యంతతోఁ
దనియక యొద్దనున్న జడదారులచేతను జేతనైన లా
గునఁ బలికించి యెందునను గోరిక చేకుఱకున్న నోలగం
బున ధృతరాష్ట్రపట్టిపయిఁ బూనినకిన్కను బల్కు లాడినన్. 11

క. వడిఁ గర్ణుని దుశ్శాసను
చెడుగఱపులు నమ్మి కృష్ణుఁ జేప్పడఁ గట్టం
గడఁగిన దుర్యోధనుఁ డెద
జడియఁగఁ దనరూపు చూపి చనెఁ గృష్ణుండున్. 12

ఆ. అట్లు కొలువు విడుచునప్పుడు వెన్నుండు
బవరమరుగు దెంచెఁ బదిలమనుచుఁ
బలికి వచ్చి కుంతి బసకేగి మాటాడి
విదురు నింటఁ గుడిచి వెడలెవీడు. 13

వ. అట్లు బయల్వెడలి కొన్నినాళ్లకు. 14

చ. విరటుని యూరుచేరి యట వేవురముందర గొంతిపట్టితో
సరగున నంతయుం దెలిపి జాగొనరింపక గొప్పదండుతో
దురమున కాయితం బగుట తొల్తటి కర్జముగాఁగఁ జెప్పి యు
బ్బురముగ వాఁడిసూదిమొన మోపినయంతయు నేలనీయఁగన్. 15

క. ధృతరాష్ట్రుని కొడు కొప్పమి
కతలుగ నెఱిఁగించి మిగులఁ గయ్యంబునకున్

హితవుగఁ బురికొల్పినఁ బగ
నతఁ డప్పుడె ప్రమదమునఁబట్టి నందఱుఁ జూడన్. 16

క. పడవాలుగాఁగ నొసరిచి
వెడలి కురుక్షేత్రమునెడ పేరిటి చోటన్
విడియించి మూఁక నెల్లను
గను సంతోసమున నుండెఁ గల నొసరింపన్. 17

సీ. వెన్నుండు నడచిన వెంటనె యచ్చట
దుర్యోధనుండును దోసు నూప
వచ్చిన జేఁడుల హెచ్చరికను జేసి
గమికి నెల్లను మొనగానిఁ గాఁగ
భీష్ముని నొసరించి ప్రేరేఁచి మొనలను
దమ్ములు నెయ్యురుఁ జవిలి రాఁగఁ
గదలి కురుక్షేత్ర మదనుతప్పక చేరి
విడియించె దళముల వేఱుచోటఁ
గర్ణుఁ డంతకుమున్నె పెక్కుఱంకు వినఁగ,
భీష్ముఁడుసుఱులువిడిచినపిదపఁగాని
తాను బోరికి రానని తగని బాస,
చేసికొనె మాటపట్టింపు చేత వీట. 18

క. దళవాయి యైనభీష్ముఁడు,
కలనికిఁ బురికొల్పి మొనలఁ గడుబీరమునన్
దలపడఁ బంచెను జోదుల,
కెలమియుమగఁటిమి చలంబునెసకంబెసఁగన్. 19

ఉ. అయ్యెడఁ బాండుపెద్దకొడు కందఱు నం దరుదంద్రఁ గాల్నడన్
జయ్యన భీష్ముపాలికిఁ గనం జని వేలుపుటేటిపట్టిచే

గయ్యముసేయ నానతిని గై కొని దీవెన లంది ద్రోణుని
నెయ్యపు మామశల్యుఁ గృపుఁ గని వీడ్కొనివచ్చెఁ గ్రమ్మఱన్.

క. చిందమ్ముల మ్రోఁతలు మి,
న్నంది యొసఁగ భీష్ముదండు లాలపు వేడ్కం
గ్రందుగ నడచెను బయిపయి,
ముందఱఁ బాండునికొమాళ్ళమూఁకలమీఁదన్. 21

సీ. నొగలెక్కి కృష్ణుండు తగుమాడ్కి నిగుడంగఁ
దెల్లనివార్వముల్ తేజరిల్ల
జేజే లొసంగిన చిందంబు నొత్తుచు
నరదంబుపైఁ గ్రీడి యరుగుదెంచి
యిరువాఁగుఁ జూచి తానెంతయు మదిలోన
నక్కటికము పుట్టియయినవారి
వేయఁ జేతులురాక విల్లునునమ్ములుఁ
దేరనుబడవైచి దిగులుత్రోఁపఁ
గూలఁబడినఁ జూచి గొబ్బున వెన్నుండు,
పాడిఁగఱపి పోరఁబగఱనోంచి
గెలుపుఁగొంట యేలికలకెల్లఁ దగవని,
మదికినాటఁ జెప్పి మఱఁదినపుడు. 22

క. దురమునకుంబురికొల్పినఁ,
బరువడి సందియము వాసివాసి యొసంగం
గురిసెను నమ్ములవానల,
గరువంబఱి పగఱపౌఁజు గలఁగంబడఁగన్. 23

సీ. మార్తురమొత్తముల్ మార్కొనిపోరిన
సందడికయ్యంబు జరగెనపుడు

ద్రోవదికొడుకులు తోడుగ నభిమన్యుఁ
డసరి యొప్పనివారి కడఁకఁ జెఱిచెఁ
గృపుఁడు నశ్వత్థామ కేడించి మూఁకల
పైఁబడి తమలావు బయలుపఱిచి
రుత్తరుండేగి శల్యునిమీఁదఁ బోటొగ్గి
చూపఱె నాతనిచూపుగముల
నంతభీష్ముండుగవిసివాలంపగములఁ,
దెలుచఁబరఁగించిమూఁకల బెగడుపఱిచి
యెల్లెడలఁ దానయైపొల్చి యేపుచూప,
విరిగిసురిఁగిరిపగవారిబిరుదుమగలు. 24

క. ఆలోనఁ బ్రొద్దుగ్రుంకిన,
నాలముసాలించి నాఁటి కందఱు పేళ్ళన్
జాలమునేయక చేరిరి,
చాలఁగ విన్నటికొడుకు సారెఁ బొగడుచున్. 25

ఉ. రెండవఁనాటిపోరునను రెండవ ప్రొద్దుకొమారు పోలికన్
నండిమగండు క్రీడి తన త్రాణనుజూపెఁ గరంబుఁ బుచ్చె భీ
ముండును భానుమంతు జముప్రోలికి ద్రోవదితోడఁబుట్టువుం
గండునఁదాఁకి ద్రోణుఁడును గ్రచ్చఱఁ బాఱఁగఁజేసె నీసునన్. 26

సీ. మూఁడవనాఁడును మొగ్గరంబులుకన్ని
యిరువాఁగు నొండొంటిబెరసితాఁక
దుర్యోధనుఁడు భీమునితోఁ దలపడిపోరి
మే నెఱుంగక తేరిమీఁద సోలె
మూఁడుజాములయప్డు డీడఁబోవక భీష్ముఁ
డుక్కునఁ బెక్కురఁజక్కడంచి

యొక్కఁడఁజూచిన నెమ్ములదిమ్ములుఁ
గండలకొండలు నిండియుండ
నెత్రుటేరులు పఱపింప నిలువ లేక,
బెండువడి క్రీడిజుణిఁగిన వెన్నుఁడదరి
చుట్టువాలునుజేఁబూని దిట్టయగుచు,
నరదమును డిగ్గి భీష్ముపై నరుగుచుండ. 27

క. కవ్వడియువచ్చి వెన్నుని,
నెవ్వడిఁ గౌఁగిటను బట్టినిలిపి వెనుకకున్
దవ్వులఁ గొనిచని భీష్ముని,
గ్రొవ్వడఁగించెను గడంగి కూటువచెదరన్. 28

క. నాలవనాఁటి పెనంకువ,
వాలుమగఁడు శల్యుకొడుకు పలుకయు వాలుం
గ్రాలఁగ ధృష్టద్యుమ్నుని,
పైలలిఁగవిసి తెగటాఱెఁబరి పడలువడన్. 29

పంచచామరము. ఘటోత్కచుండు జిత్తు లెల్లగానిపించి మూఁకపైఁ
దటాలునన్మొఱుంగు లీను తళ్కుటంప గుంపులన్
దిటంబు మీఱ నేసియేసి దిట్టలైన వారినిన్
హుటాహుటిం గలంగి పాఱినూకె నుక్కడంగఁగన్.

ఉ. ఏనవనాఁటి కయ్యమున నెంతయు వాఁడిమి చూపెద్రోణుఁడా
పూనికిఁజూచి మాఱుకొని పోరెను భీముఁడు చేవయేర్పడన్
మానకలక్ష్మణుండు నభిమన్యుఁడునుంజలమగ్గలింపఁగా
నేనుఁగు నేనుఁగుం బెనఁగు నేపునఁబోరిరి చూపటెన్నఁగన్. 31

క. ఆఱవనాఁడల వడముడి,
మాఱుకొని గుదియవిసరుచు మావంతులతో

నీఱుగఁగారులఁ గెడపెను,
బీఱువడుచు దాయలెల్ల బెదరం జెదరన్. 3

క. అని ద్రోణుఁడు ధృష్టద్యు
మ్నునిఁ గనలునఁ దారసించి మొనలుతలంకన్
దనసింగిణి వాలమ్ములు,
ననువులు నాటంగ సేయ నాతఁడువఱచెన్. 3

తే. ద్రుపదకొమరుఁడు రారాజుదోఁడరితేరు,
నుగ్గుచేసిన వెన్నిచ్చి సిగ్గువిడిచి
చేకితానుఁడుఁ గృపుఁడును జేవమీఱఁ,
బోరి రేడవనాఁడాలపోతులట్లు. 3

సీ. వసలెత్తువేడ్క సునాభుండు మొదలగు
గాంధారికొడుకులఁ గపిసిభీముఁ
డుద్దవిడినివారిఁ బెద్దనిద్దురఁబుచ్చి
మేనుంగులనుజేసెఁ బీనుఁగులను
మఱి యలంబుసుఁడను దానిసిదిండియి
రావంతు మార్కొని లావుచూపి
పెద్దతడవునకుఁ బిద్దించె నాతనిఁ
గవ్వడియెంతయుఁ గస్తిచెంద
మఱిఘటోత్కచుండుమార్కొనిద్రోణుండు,
మొదలుగలుగువారిమురువడంచి
యలఁతియూఁకనెల్ల నలుఁగులపాల్సేసె,
నవలినాఁడు వేల్పులబ్రపడఁగ. 35

క. ఎనిమిదవనాఁటి రాతిరి,
చనుపున దుర్యోధనుండు చనిభీష్మునితోఁ

దనగోడు మొఱ్ఱవెట్టినఁ,
గనఁబఱచెద నెల్లినాడు గండని నతఁడున్. 36

తే. తొమ్మిదవనాఁటిప్రొద్దునఁ దొంగలించు,
సంతసంబులు మోములఁజౌకళింపఁ
గదలియిరువాఁగునుంబాలికలనఁబొలిచి,
రేత్తికోలునఁబడవాళ్ళు హెచ్చరింప. 37

సీ. అపుడుకోల్తలచేసి యభిమన్యుఁడడరిన
నరిగియలంబసుఁడడ్డపడియె
విప్వచ్చుఁడరుదెంచి పీఁకఁజూపినఁ బాఱు
దొరలకు ద్రోణుండుత్తోడు చూపె
బాసటయగుచు దుశ్శాసనుఁడు శకుని
వెంటరా భీష్ముండువేఁడి చూపి
వాఁడినారసములఁగ్రీడిని నొప్పించి
వెన్నునినంపఱ బెగడుపఱిచి
రావుతులఁగ్రుంచి పొలియించి మావతులను
నరదములవారి నొంచి కాల్వురనడంచి
కడిమిచూపిన దళములు గలఁగఁబాఱె
లేట మొగములుపడి రెల్ల మేటిమగలు. 38

క. చేయునదిలేక కవ్వడి,
యాయమ్ములనాఁటియున్న యమ్ములవెతతోఁ
బాయపడు మొనలఁ బిలుచుచు,
నోయనదూపులను నేయుచుండెనుభీష్మున్. 39

శా. అచ్చొప్పంతయుఁ జూచి కృష్ణుఁడెదలో నారాటముంజెంది వి
వ్వచ్చుండెంతయు నొచ్చియుంట నొగలన్వార్వంపుఁ బగ్గంబులన్

మెచ్చులుల్కఁగఁ గట్టి తేరు డిగి యామిన్నేటిపట్టం బారిం
బుచ్చంగా నడతెంచెఁ గేల బలితంపుం జుట్టువాలొప్పఁగన్. 40

క. త్రోడనెపఱతెంచి వడిం
గ్రీడియునిరుగేలఁ బట్టి కృష్ణుని మరలం
దోడుకొనిపోయి తేరున
వేడుకఁ గూర్చుండఁబెట్టి వేఁడుచుఁబలికెన్. 41

క. తియ్యనిమాటల వెన్నుని
నియ్యకొనంజేసి వెడలి యీరవమెసఁగం
గయ్యమునకు డాసినపుడె
యొయ్యనఁ బ్రొద్దు త్రిమిల్లె నడిగెదురంబుల్. 42

తే. నాఁటిబవరంబుఁగని మదినాటుకొన్న
యుమ్మలమ్మునినింకఁ గయ్యమ్మునాని
కానలకు నేగుదునటంచుఁగెడఁకఁబలుకు
నలయుధిష్ఠిరు నూఱార్చియచ్యుతుండు. 43

క. వెన్నుండారే యాతని
విన్నేటికొమారుడకట విష్వచ్చునితోఁ
దిన్నఁగఁగొని చనియాయన
సన్నగ నడిగించెః జావుచందముఁ దెలుపన్. 44

ఉ. అందున కాతఁడిట్టనియె నాఁడుఁదనంబును దొల్తఁదాల్చి యా
పొందికఁబాసి వెన్కమగపోడిమిఁ దాలిచియున్న వారిపై
నెందును నేయకుందునని నోఁ బ్రతినందగఁ బట్టినాఁడ మీ
యందుశిఖండి యట్టిడను టాతని ముందిడికొంచు నావయిన్. 45

క. నేనేయనితఁడెఁ గవ్వడి
నోనేసినఁ గూలువాఁడ నునుఁదూపులచేఁ
బూనియటుచేయుఁ డంచును
నానతియిడి పంచె మంతనంబున వారిన్. 46

క. మఱునాఁ డెప్పటియట్టుల
యఱిముఱిఁ బఱతెంచి దండులాలముసేయం
దరలుడు శిఖండి మున్నిడి
పఱతెంచెనుగ్రీడి భీష్ముపయికిఁ గడంకన్. 47

తే. అడ్డుపడి దుస్ససేనుఁడు హామికలరఁ
బెక్కుమాఱులు కవ్వడి బెగ్గడిలఁగఁ
బోరిపాఱె శిఖండియుఁ బొంగివేయఁ
జొచ్చెవివ్వచ్చుప్రాపునఁ జొరవమిగుల. 48

క. కొడుకుంబంచెను ద్రోణుఁడు
వడిఁగ్రీడికి నడ్డుపడఁగ బరవసమునఁ గ
వ్వడి తెఱపిఁజేసి యమ్ముల
బడలించె శిఖండివెనుక నదిగొని భీష్మున్. 49

తే. తేరుసమసియు భీష్ముండు దిటవుచెడక
విరటుతమ్ముశతానీకుఁ బిలుకుమార్చె
నంత వివ్వచ్చుఁడలుగులనక్కజముగఁ
బొదివిపడవైచె నాతనిఁ బుడమిమీఁద. 50

తే. నేలఁబడియున్న భీష్మునిపాలికేగి
యంపసెజ్జయుఁ దలగడ యతనికప్డు
క్రీడిసేర్పైమెఁ గలిగించి వాఁడితూపు
నేలలోనాటి దగ మాన్చె నీరుదీసి. 51

క. మనుమలు మొదలగువారలు
తనచుట్టును బలసియుండఁ దనరెడు నాభీ
ష్మునిపాలికిఁ గర్ణుండును
జనుదెంచి కరంబు వేఁడెసైరణ చూపన్. 52

క. వినువాఁకకొడుకు కూలిన,
వనరుచు దుర్యోధనుండు వడి నెలవునకుం
జని యామఱుపటినాఁడొగి
మొనగానిఁగఁ జేసె ద్రోణు మూఁకల కెల్లన్. 53

క. తన్నటువలె దళవాయిఁగ,
మన్నన నొనరింప నలరి మక్కువ ద్రోణుం
డెన్న యుధిష్ఠిరు నని లో
నన్నికొసఁగెదను బట్టి నలువురుఁ జూడన్. 54

క. అని బాసయిచ్చె దుర్యో
ధనునకు నాతండు మదిఁ దద్దయు నుబ్బన్
విని యర్జునుఁ డన్నకుఁ జె
ప్పెను దిటవుగ దానవతఁడు వెరువక యుండన్. 55

తోటకము.

మొనలెల్లను వీఁగఁగ ముల్కులు పె,
ల్లనఁగ్రుచ్చుచు ద్రోణుఁడు సాత్యకిను
క్కునమారొక్కని తూఁపులు గోరముగా,
నని నేసెను ద్రోపది యన్నపయిన్. 56

తే. శల్యుఁడును భీముఁడును దాకి సరకుసేయ
కొండొరుల నొంచిమించుచు నొకరికొకరు
నెత్తుపఱదలు వాఱంగ నెట్టికొంచుఁ,
బూచుమోదుగులట్టులు పొలిచి రపుడు. 57

సీ. కర్ణునికొమరుండు గండున వృషసేనుఁ
డడరి మూఁకల నెల్లఁ బొడవడంపఁ
దొడఁగిన నకులుని కొడుకు శతానీకుఁ
డెడసొచ్చి బలుతూఁపు లొడలనించె

ద్రుపదుఁడు విరటుండుఁ దోడుచూపఁగఁ గొంతి
తొలిపట్టి ద్రోణునితోడఁ బెనఁగి
వ్యాఘ్రదత్తుఁడు మొదలైనవారిని గోలు
పోయి ద్రోణునిచేతఁ బోరఁ దాను
బట్టువడనున్న తఱిని వివ్వచ్చుఁ డడరి,
యంపవానలు గురియించు చరుగుదెంచి
యల్లయొజ్జలవేఁడిమి యెల్లనుడిపెఁ,
బ్రొద్దువాలెనునంతలోఁ బొదలెనిరులు. 58

ఉ. రెండవనాఁటి వేకువను గ్రీడి యుధిష్ఠిరుతోడఁ జెప్పి త
న్నొండెడ నాలమునంజలుప నూరకపిల్చు సుశర్మదండుతో
గండునఁ బోరఁబోయి కడఁకం దనలావును జేవఁజూపిబల్
కొండలపిండు మెండునను గూలిచెఁ బల్వురమేలి జోదులన్. 59

క. మఱియు న్సంశప్తకులును,
బిఱుసనక పెనంగఁజూచి వెఱ్ఱఁగండకయే
త్తెఱ వివ్వచ్చుఁడు తనయం,
పఱపాలుగఁజేసె వేలవంతునవారిన్. 60

సీ. ద్రోణుఁడు మిక్కిలి రోసంబుమీఱంగ
సత్యజిత్తును జముసరసకంచి
దూదితిట్టలమీఁదఁ దొడరుచిచ్చునుబోలె
మొనలపై వడిఁజూపి కనువుగొట్టి
సూర్యదత్తునిఁజంపి సూరెలబారులఁ
బలుచక్కియలకును బాఱఁద్రోలి
మాఱులేకుండంగ మలయుచుండఁగ భీము
డన్నయుఁగవలును మున్నుగాఁగ

సంపులును గూడితాఁకిన నవలఁ గృపుడు
కర్ణుఁడును శల్యుఁడును లోనుఁగాఁగలట్టి
వారలెల్లను సడ్డంబు వచ్చిపోరఁ
జాళికలనెల్లఁ బీనుంగుప్రోవు లయ్యె. 61

మ. భగదత్తుండును సుప్రతీకమను చెల్వంబైన యేనుంగుతోఁ
దగ భీముం దలపడ్డ తిచ్చవడి యాతం డెల్లనూషంగ నా
జగజెట్టి న్మొనలెల్లమాఱుకొని యాసం బోర నాయుండఱుఁ
వెగడొందన్ భగదత్తుఁ డేసె నటుపై విప్వచ్చుఁ డేపారఁగన్. 62

క. చనుదెంచి వాఁడితూపుల
ననువులు వాటించి దొడ్డయమ్మున భగద
త్తునిఁ బుడమింబడ నేసెను
బెనఁగాడి యేనుంగుతోడఁ బీనుంగునుగాఁ. 63

సీ. అది చూచి శకునియు నాత్మబలగంబుఁ
జోరవమై నర్జునుఁ జుట్టుముట్ట
బలునారసంబులఁ బలువురఁ జెరలించి
శకుని నాతఁడు పాఱిచనఁగఁజేసి
యార్పులు సెలఁగంగ నరుదెంచి తాఁకిన
సంశప్తకుల వెఱచఱవ నొంచి
నడుముడితోడుత వచ్చి కర్ణునిఁ దాకిఁ
పొలియించె నతనితమ్ములను మువ్వురఁ
దేరు డిగివచ్చి భీముండు తెల్లపి గాంచి
కర్ణుచుట్టాల వేవురఁగం డడంచె
నింతలో ద్రోణుఁడును తేఁడు నేగుదెంచి
కర్ణుఁగాచిరి కవ్వడి కడఁకనుండి. 64

ఆ. అంతఁ బ్రొద్దుగ్రుంకె నప్పుడ యిరువాఁగు
నెలవుపట్ల కేగి నిదురపోయి
మరల నెప్పటట్ల మఱునాఁడు చనుదెంచి
కలనికాయితమయి నిలిచి రందు. 65

సీ. సంశప్తకులు క్రీడి జగడంబునకుఁ బిల్చి
దవ్వుగఁ గొనిపోయి తడవు పెనఁగి
రీలోన ద్రోణుండు నిచ్చటఁ దమ్మిమొ
గ్గరమును బన్నించి కడిమి మెఱయ
వడముడి లోనైన వారెల్ల దానిని
జింపంగ నేమియుఁ జేతఁగాక
యభిమన్యు వేఁడిన నాతండు గండున
ద్రోణునిఁ దూపులఁ ద్రాణ చెఱచి
మోహరంబును జొచ్చి యమ్మొనలనెల్ల
జిక్కువఱుచుచుఁ బెక్కురనుక్కడంచి
నేలకును గోలకును దెచ్చె నేర్పుమెఱసి
పగఱజోదుల నెల్లను బలియుఁడగుచు. 66

మ. మఱియుం బోవక తాఁకినట్టి కృపునిన్మూర్ఛజేసి దుర్యోధనున్
నెఱఁకల్ దూఱఁగఁగొట్టి ద్రోణకొడుకున్బిట్టేసి దుశ్శాసనుం
బఱవంజేసివెసన్ బృహద్బలుని చేవం బాపి యాకర్ణునిన్
గొఱవోవంగను నేసి శల్యుకడిమిం గోల్పుచ్చె బీరంబునన్. 67

క. ఈలో నభిమన్యునకును
నాలములోఁ దోడుసూప నరిగెడి భీమున్
మేలిమగలఁ బోనీయక
చాలిక నెదిరించి యాఁపె సైంధవుఁ డొకఁడున్. 68

సీ. ఇంతలో నభిమన్యుఁ డేపున వృషసేను
నుక్కున మార్గాని యొల్లఁబోవఁ
జేసినఁ దేజీలు చివ్వకు దవ్వగఁ
దేరీడ్చుకొని పోయెఁ దీవరముగ
బిరుదుమగలు వేనవేలుగఁ జనుదెంచి
మంటలోపలఁ బడి మ్రందునట్టి
మిడుతగుంపులమాడ్కి మీఁదిమీఁదికి వచ్చి
పరగ నాతనిచేత సమసిరొకట
మాట లేటికిఁ బగవారి మేటిమగల
లోన నొకఁడైన లేఁడయ్యెఁ బూని వెదక
సూదిమొన మోఁపదగునంతచోటనయిన
గాయములులేని నెమ్మేనుగలుగువాఁడు. 69

వ. వెండియు నభిమన్యుండు. 70

క. రారాజుకొడుకు లక్ష్మణుఁ
బోరం బరిమార్చి పేర్చి పొరిగొని నొకబల్
నారసమునను బృహద్బలు
దోరించెను వారిబారి దొరలగ్గింపన్. 71

క. నెత్తురులఁ దొప్పఁదోఁగియు
మొత్తములై పాఱు తనదు మొనకాండ్రవెతన్
మెత్తనఁగని దుర్యోధనుఁ
డత్తఱిఁ జెయివీచె నంతటాతనిఁబొదువన్. 72

సీ. వెఱ పెల్లునను బాఱు విరథునఁ గర్ణుండు
వెనుకఁ బ్రక్కకువచ్చి విల్లు తునిమె
ద్రోణుఁడీలోపల దోరించెఁ దేజీలఁ
ద్రుంచెఁ గృపుఁడు క్షేరుదోలువానిఁ

గడఁగి యశ్వత్థామ కరవాలు నుఱుమాడె
నాఁటె శల్యుఁడు మేన నారసముల
మఱిచేయఁగల దండిమగలెల్ల దొమ్మిని
బయిఁబడి యలయింపఁ బాలుపడిరి
యేమిచెప్పఁగ నభిమన్యుఁడేపు చెడక
మేను నెత్తుట జొత్తిల్లి మింటి కెగసి
దుస్ససేనుని కొమరునిఁ దొడరివాని
గీటడంచియు నతనిచేఁ గెడసెఁ దాను. 73

ఆ. అంతఁ బ్రొద్దుగ్రుంక నాలంబు చాలించి
మొనలఁదివిచికొంచు మొగమునందు
విన్నఁదనము తోఁపవెనవీటికిని బోయె
జమునిపట్టి కొందలమున మునిఁగి. 74

క. కవ్వడియు వచ్చి కొమరుఁడు
చివ్వనుగడతేఱు టన్న చెప్పఁగ వినిలో
నెవ్వగఁబొగులుచు నడలెను
నెవ్వారాఁపినను నాఁగ కెలుఁగెత్తివడిన్. 75

ఉ. అంతటఁ గొంతసేపటికి నాతఁడు నెంజలివాసి యిట్లనుం
బంతముచూడుఁ డెల్లిపరిమార్చెద సైంధవు నేరుగాచినన్
బొంతలఁ బ్రొద్దుగ్రుంకుటకు మున్నుగ నందఱుఁ జూచుచుండనే
నంతయుఁ జేయలేనియెడ నగ్గిని చొచ్చెద గాండివంబుతోన్. 76

క. అని ప్రతినపట్టినంతయు
విని మదిలో సైంధవుండు వెఱపైకొనఁగాఁ
జని దుర్యోధనునకుఁ దెలి
పిననాతఁడు దిటము చెప్పి వెఱపుడిగించెన్. 77

వ. అట్లారేయి కడచిన. 78

సీ. బండి మొగ్గరమును బన్నించి మఱునాఁడు
ప్రొద్దున ద్రోణుండు మొగమునందుఁ
దా నిల్చి యవ్వల దవ్వల సైంధవు
జోదులనడుమను జుణుఁగఁ బెట్టి
యాయితంబయి యుండ నర్జునుఁ డన్నను
గాపాడ సాత్యకిఁ గావలిగను
బెట్టి యొడ్డను డాసి బిట్టేసి తాటిపం
డులుఁ బోలెఁ దల లెన్నొ డొల్ల నేసి
దున్నసేను నొంచి ద్రోణుని వడిమించి,
మొగ్గరంబుసొచ్చి మొనలవచ్చి
కినుక యినుమడించి కృతవర్మఁ దూలించి,
చని శ్రుతాయుధునినిఁ జక్కడంచె. 79

క. ఈనడుమ ద్రుపదు కొమరుఁడు,
ద్రోణునితోఁ బోరిపోరి త్రోలఁగిన నలుఁగుల్
మేనన్నించుచు సాత్యకి,
నోనేసెం ద్రోణునపుడు నూర్వ్వరు మెచ్చన్. 80

ఉ. కవ్వడియంత సైంధవునిఁ గానఁగఁ బోవుచునుండ ద్రోవలో
నెవ్వడి నడ్డుసొచ్చి వడి నీల్గిరి విందుఁడు వానితమ్ముఁ డుక్క
జివ్వకుఁ గత్తళంబలఁ జేరి సుయోధనుఁ డాలమిచ్చి మై
నొవ్వఁగఁ బాఱెఁ గ్రీడియును నూల్కొని సైంధవు డాసెనీసునన్. 81

తే. అపుడు కృపుఁడు నశ్వత్థామ యల్ల సైంధ
వుఁడును బ్రొద్దు కొడుకును శల్యుఁడు మొదలగు
పన్నిరువు రొక్కపెట్టను బన్నివచ్చి

ఉ. అందఱు కన్నిరూపులయి యాతఁడు పోరగఁ జుట్టుముట్టి యా
సందునఁ గాలిమూఁకలును జాలఁగ బోరొనరించి రయ్యెడన్
గ్రమందెడు నేనికల్ సమయుమావులుఁ గూలెడు కాలిబంటులున్
గుందెడి మేలిమానిసులుఁ గ్రుంగెడు తేరులు నయ్యె నెయ్యెడన్. 83

క. అదియెల్ల గని యుధిష్ఠిరుఁ,
డెదలోఁ దలఁకొంది యప్పుడే సాత్యకినిం
గదలఁగఁబంచెను గ్రీడికి,
నదనున సాయంబుచేయ నచటికి నెమ్మిన్. 84

తే. ఇంతలో యుధిష్ఠిరుఁ బోజనేగి ద్రోణు,
నొకటమార్కొనిచేవ్రడిరోాడిపాఱె
నపుడలంబసుఁడామునసడరితాఁకి,
గ్రమందెనుఘటోత్కచునిచేతమఱియునచట. 85

సీ. సాత్యకి ద్రోణుని సరకు సేయక దాఁటి
జలసంధుఁడనువానిఁ జక్కడంచి
దారిని సాగిసుదర్శను బొలియించి
దుశ్శాసనునితోడఁ దొడరె రెంతు
తడవలాతనినొంచి తడయక చనుదెంచి
వడిఁ గ్రీడియొద్దకు వచ్చి చేరె
నచ్చట ద్రోణుండు మచ్చరంబున క్షత్ర
వర్మలోనుగఁగలవారిఁద్రుంచె
నన్నపంపున భీముండునరుగుదెంచి,
ద్రోణునిమొఱంగుటమ్మెలఁ దూలఁ బుచ్చి
యడ్డపడువారినెల్లఁగ్రొవ్వరుఁగఁజేసి,
కవ్వడిని జేరఁజనుచుండెఁగడిమిమెఱసి. 86

మ. చనుచున్ భీముఁడు త్రోవలో బలిమిమైఁ జక్కాడె శత్రుంజయుం
డును లోనౌ ధృతరాష్ట్రపుత్రులను నెంతో కిన్కఁ గర్ణుండు భీ
ము నదిన్ లోఁగొని తిండిపోతనుచు నేమో యుల్లసంబాడి పు
చ్చిన వివ్వచ్చుఁడు వచ్చి పోతర మడంచెం గర్ణనాలంబునన్. 87

ఇంద్రవజ్రము.

భూరిశ్రవున్మార్కొని పోరిడయ్యెన్,
గోరంబుగా సాత్యకిఁ గూల్చి నేలన్
దోరింపఁ జేయెత్తుడు దొడ్డయమ్మున్,
సారించి వివ్వచ్చుఁడు జానుమీఱన్. 88

తే. త్రుంచె భూరిశ్రవుని చేయి త్రుళ్ళిపడఁగ,
నంతఁ గృష్ణుని తమ్ముండు నంతసమున
లేచి యడిదంబు పూని చేసాఁచి యతని,
తలను దునుమాడె నిల్లరువలదనంగ. 89

తే. మరలఁ గర్ణుండు సాత్యకి మాఱుకొంచు,
వేలుపులు మెచ్చునట్లుగఁ బెనఁగి తడవు
పోలిచి యాతని దాడికి నిలువలేక,
పాఱిపోయెను బగవారు మీఱినవ్వ. 90

సీ. పదపడి సాత్యకి వడముడియును దోడ
నరుదేర నలుకమై నర్జునుండు
సైంధవు దెసకును జాఁగి వేగముపోవ
రారాజు పంపున రాధకొడుకు
కవ్వడికడ్డంబుగా వచ్చి పోరాడి
యొడలునొచ్చిన సిగ్గువిడిచి పాఱెఁ
గృపుఁడు నశ్వత్థామ వృషసేనుఁడును శల్యుఁ
డడరి పోరిరి క్రీడి యాననంగ

వెన్నుఁడొనరించు చీఁకటి కన్నెఱింగి,
క్రీడి సైంధవు తలద్రుంచి కీడుతలఁగఁ
బాశుపదమున నద్దానిఁ బడఁగవైచెఁ,
దండ్రితొడమీఁద నంతనీరెండవచ్చె. 91

ఉ. అప్పుడె కృష్ణుఁగూడి చని యర్జునుఁడన్నకు మ్రొక్కి సైంధవుం
డొప్పమిచేసి రూపఱుట యుబ్బునఁ జెప్ప నతండుపొంగఁ గాఁ
దప్పను ద్రోణుమీఁద విడితా ధృతరాష్ట్రునిపట్టి యచ్చటం
జెప్పెడిదేమి రేయి యనిసేయఁగఁ బంచెను మేటిజోదులన్. 92

చ. ద్రుపదునివంకవారలను ద్రుంపక మైనఱు వ్రూడ్వనంచు నే
నపసను ద్రోణుఁడుం బ్రబలినవట్టె నటుండఁగఁ జంపె గాలినే
లువు కొమరుండు దుష్ప్రహారుఁడు లోనగు నాధృతరాష్ట్రు బిడ్డలన్
గృపుఁడును గర్ణునిం బదరెఁ గిన్కను రజ్జులువల్కుచుండఁగాన్. 93

క. ఈలోనశ్వత్థామయు,
నాలములో రక్కసి దొర నంజనపర్వుం
గూలిచె నప్పుడె భీముఁడు,
వాలమ్ములు మేనఁగ్రుచ్చి బాహ్లికు ద్రుంచెన్. 94

తే. సాత్యకియుసోమదత్తుండు చలముమీఱ,
నొండొరులతోడఁ బోరాడుచుండ నందు
వెన్నుతమ్ముఁడు మిక్కిలి బీరమునను,
సోమదత్తునితలద్రుంచె సూడు మిగుల. 95

క. అదిగని యందలి ద్రోణుఁడు,
మొదలగువారలు కడంగి ముట్టుకొనంగా
నెదిరించి నిలిచి రిందును,
బొదువంగల జోదులెల్లఁ బొంగెడుమదితోన్. 96

తే. అపుడు కర్ణుండు సహదేవు నదిమిపట్టి,
వింటికొప్పునఁబొడుచుచు విడిచిపుచ్చె
నెక్కడైనట్టి పగవారి నెపుడునీవు,
తలపడకుమంచుఁ దులువ మాటలనుబలికి. 97

సీ. కర్ణునివలె చెడుకఱపుల సాత్యకి
నొంపఁగ దుర్యోధనుండు దలఁచి
పలువురనొక్కటఁ బయిఁబడఁగాఁ బంచెఁ
జేరి మున్నభిమన్యుఁ జేసినట్ల
మఱి ఘటోత్కచుఁ డప్డు మగఁటిమి నెదిరించి
చంపె నలంబుసు జటునికొడుకు
నంత హాలాయుధుఁ డడరి వేఁడిమి చూప
వానినిఁ బొలియించి నాఁడిచూపి
యాహిడింబకొమరుఁ డుదఱఁ గలపంగఁ,
గర్ణుఁ డపుడు వాసిగండడంచె
వేల్పుతేఁడు తనకు వెలయ నిచ్చినయట్టి,
సత్తిచేత నెడఁదజలదరింప. 98

చ. విరటుఁడు వచ్చి తాఁకినను వీసరవోని కడంక ద్రోణుఁడె
ల్లరుఁ గన నాతనిం దునిమి లావునఁ బైఁబడు కాలిమూఁకలన్
బొరిగొనుచొక్కచో ద్రుపదుఁ బోరనరూపడఁగించె నంతటన్
విరియఁగఁ దామరల్ సరిగ వేఁడివెలుంగుచుదోఁచెఁ దూర్పునన్. 99

వ. అప్పుడు. 100

సీ. వచ్చి యుధిష్ఠిరు వంకవారెల్లను
దపుఁదాఁక ద్రోణుండు తాల్మిచెడక
యందఱ నొనేయ నర్జునుఁ డరుదెంచి
చేవమైఁ బోరె జేజేలు మెచ్చ

నప్పుడశ్వత్థామ యనుగజము చచ్చుట
నెపముగా భీముండు నేర్పు మెఱయ
ద్రోణునికడ కేగి ద్రోణ నశ్వత్థామ
యని చెప్పి వినఁడయ్యె నతని పలుకు
లంతఁ జెప్పె యుధిష్ఠిరుఁ డళుకు దక్కి,
పోర నిప్పుడశ్వత్థామ పొలిసె ననుచు
నమ్మి ద్రోణుండు తేరిపై సొమ్మసిల్లి,
విల్లునమ్ములుఁ గ్రిందను విడిచిపడియె. 101

క. పీనుఁగువలెఁ బడి యుండిన
వానిం దలఁద్రుంచి వైచె వాలున నలుకన్
మానక ధృష్టద్యుమ్నుఁడు
తానే యాతనిని జంపఁ దగువాఁడనుచున్. 102

సీ. ఎవరు చెప్పిన విన కేచి ధృష్టద్యుమ్నుఁ
డటు తండ్రిఁ బఱచుట యాలకించి
కినుక నశ్వత్థామ చనుదెంచి యాకూళ
నిప్పుడె కని పొలియింతు ననుచుఁ
బలుకుచు దళముల పైఁ దూపు లడరించి
నారాయణంబను పేరుగలుగు
గోరంపుటమ్మును గొబ్బున విడిచినఁ
బలుఁపుర నది నేలపాలుచేసె
దాని వేఁడిమి కెవ్వరుఁ దాళలేక,
కలఁత నొందంగ వెన్నుండు కనికరమున
వడముడిని దేరుడిగఁ బంచి యుడిపె దాని,
వాఁడియంతయుఁ దన నేర్పువన్నె కెక్క. 103

క. అమ్ములు మఱియుం బఱపుచు
దమ్మాయి యవియెల్లఁ బోవ వగఁగూరినడెం
దమ్మున నశ్వత్థామయుఁ
గ్రమ్మఱఁ జేయునది లేక గరువంబడఁగన్. 104

ఆ. అంతఁ బ్రొద్దుగ్రుంక నాలంబు చాలించి
యలరిగొంతికొడుకు లరిగి రిండ్ల
కలుక ద్రోణుచావుఁ దలఁచి దుర్యోధనుఁ
డడలు చిల్లుసేరెనపుడ వెడలి. 105

క. అమ్మఱుసటినాఁడొక్కటఁ
దమ్ములయు దొరలయు నెదుటదళవాయినిగా
నమ్మిన కర్ణుని నొనరిచి
క్రమ్మఱ దుర్యోధనుండు కలనికి వెడలెన్. 106

క. పదియాఱవనాఁ డటువలెఁ
బొదలుచు నిరువాగుఁ దాఁకి పోరాడంగా
నదమదముచేసె వడముడి
యదనారసి క్షేమధూర్తి యను నెకిమీనిన్. 107

క. వడముడి యశ్వత్థామయుఁ
దడవు పెనఁగి సొమ్మసిలిరి తగ నిరువురు న
ప్పుడ కర్ణుడును నకులునిఁ
గడఁక యుడిపి తేరు చదిపి కాఱులు ప్రేలెన్. 108

తే. దుస్ససేనుండు సహదేవుతోడఁ బెనఁగి
సొమ్మవోయెనుదనవారలుమ్మలింపఁ
గృపునిఁ దాఁకి ధృష్టద్యుమ్నుఁడపుడుపోరి
మోడిపాఱెనునవ్వంగఁదోడివారు. 109

ఆ. తోడరి జమునికొడుకు దుర్యోధనుఁడుఁ దాఁకి
పెద్దతడవుకడిమిఁ బెనఁగనందుఁ
దేరుగోలుపోయి రారాజు మైనొవ్వ
నొల్లఁబోయెఁ జెలులయుల్ల మెరియ. 110

ఉ. కవ్వడి కర్ణునిం దోడరి గాటముగా బడలించి తూపులన్
దర్పుగఁ జూపె నాతనినిఁ దక్కినజోదులు నడ్డుసొచ్చుచుం
గ్రొవ్వడఁగించె వారి నెలగోలున నంతటఁ బ్రొద్దుగ్రుంకుటన్
జివ్వను మాని మానుగను జేరిరి యిర్వురు పీడుపట్టులన్. 111

క. మఱునాఁటిపోర శల్యుని
మఱిమఱిబతిమాలి కడకు మైకొన నతనిన్
గఱువయగు కర్ణునరదము
నెఱిఁ దోలఁగఁ బంచె ఱేఁడు నేరుపుతోడన్. 112

సీ. నోగలెక్క శల్యుండు తగఁ గర్ణుఁ బేర్కొని
మది కలంగఁగ బీనమాటలాడి
కాకిమీఁదనుబెట్టి కాఱు లాతనిఁ బల్కి
కతలు పెక్కులుచెప్పి కడఁకచెఱిచె
నంతటఁ గర్ణుండు కొంతతాలిమిదాల్చి
పొంత యుధిష్ఠిరు పొంగడంచి
ద్రుపదునికొడుకులఁ దోడరి పెక్కండ్రను
వాలమ్ములడరించి నేలఁగలిపెఁ
జొచ్చి భీముఁడు కర్ణుఁడు చూచుచుండ
వానికొడుకును వలసత్యసేనుఁ దాఁకి
దోడ్డ నారసమునఁ దలఁదునిమివైచెఁ
బగఱమూఁకలు గుండియల్ పగిలిపఱవ. 11

క. దురమునఁ గర్ణుండు యుధి
ష్ఠిరు నొప్పించి వెఱ గందుచెడి పాఱెడు నా
దారను వెనుదవిలి పెక్కులు
పరుసంబులు వలికి సిగ్గుపాటొనరించెన్. 114

సీ. అన్నబన్నము చూచి యలుకమైభీముండు
కర్ణుని మార్కొని కడఁకచూపి
క్రొవ్వాఁడితూపెద గుఱిచేసి యేసిన
నరచచ్చి ధరిపై నతఁడు వడియె
నవ్వాడు వడమువడి యతనిమీఁదికిదాఁటి
నాలుకకోయంగ వాలువెఱికి
తగవు గాదనిచెప్పి తనమామ శల్యుఁడు
మరలింప నాపని మానివచ్చె
మఱియు దుర్యోధనునితమ్ము లఱువులడర
వచ్చి శ్రుతవర్మమొదలై నవారుతన్ను
నొక్కపెట్టన తాఁకిన నుక్కుమీఱ
వారినందఱ జమునిల్లుసేరఁబనిచె. 115

స్రగ్విణి. వీఁకపంశ ప్తకు ల్వేనవేల్కవ్వడిన్
దాఁకవాల్దూపులాతండుమైనించుచున్
మూఁకలంజావఁగామోదెడెందబులం
దేఁకువల్వోడియొండేనియుఁబోఱఁగన్. 116

తే. కృపుఁడుచంపె సుకేతునిద్రుపదుకొడుకు
నతనిమూఁకలుమ్రాన్పడివెతపడంగఁ
దివిరి దుర్యోధనునిఁ దాఁకి తేరు చదిపి
మురియడంచెధృష్టద్యుమ్నుఁడురువడించి. 117

ఆ. క్రీడిమీఁదఁ గవిసి కినుక నశ్వత్థామ
పెనఁగెఁ గొంతసేపు బెట్టిదముగ
నేచి క్రీడితునిమె నేనుంగుత్రోఁ గూడ
నపుడు దండధారుఁ డనెడు జేని. 118

సీ. మలయధ్వజుండన నలరారు నెకిమీఁడు
బలిమి నశ్వత్థామ పయిని గవిసి
వేల్పులు పొగడెడు వితమునఁ బోరాడి
రూపుమాసె నతని తూపుగములఁ
గర్ణుండు క్రుపపుని గట్టిమొనలమొట్టి
తల్లడిల్లగఁ జేసి నెల్లవారి
దుర్యోధనుఁడు భీముత్రోడను ననిఁజేసి
వెన్నిచ్చి పాఱెను వెఱపు గదిరి
క్రీడి సంశప్తకుల నోర్చి కెలసియార్చి
యెదురుకొన్న యశ్వత్థామ యేపుమాపి
వచ్చుచుయుధిష్ఠిరుఁడు చాలబన్నమొంది
కవలఁ గొనియింటి కేగినకతనువినియె. 119

క. విని కర్ణుని పూర్కొనఁగాఁ
జనకయెుప్రక్కకుఁ దొలంగిచని వెన్నునితో
మనికికిఁ బోయెను మిగులఁగ
ననినొచ్చిన యన్నసేమ మారయుకొఱకున్. 120

వ. అయ్యుధిష్ఠిరుండును. 121

క. వచ్చినవారిం గనుఁగొని
చచ్చెనుగా కర్ణుఁడంచు సంతోసముతో
ముచ్చటపడి యడిగినవి
వ్వచ్చుఁడు కలహూపు చెప్పె వనట పెరుఁగఁగా. 122

ఆ. దాన నోడలుమండి తమ్ముఁడంచును జూడ
కానరానిమాటలాడెవతనిఁ
గవ్వడియును నలిగి కరవాలు జళిపించెఁ
బట్టి తలనుగోయువాఁడనంచు. 123

వ. అప్పుడు. 124

ఉ. వెన్నుఁడు వారినిద్దఱను వేఁడిమిపోవఁగ బుజ్జగించి లో
నున్న కడింది కిన్కనొక యొప్పున మాన్చి క్రీడి నప్పుడే
యన్నకు మ్రొక్కఁబంచి తనయంజలి తప్పునుసైఁప వేఁడుమం
చన్నను దెల్పి తెచ్చుకొని యన్నను గవ్వడి వేఁడెనెంతయున్. 125

తే. అతని వేఁడికోలున నల్ల మపుడెకరఁగి
చెలఁగి తమ్ముని గౌఁగిటఁజేర్చియెత్తి
యాలమున గెల్వదీవించి యరుగఁబంచెఁ
గర్ణుమీఁదికి జముపట్టి కత్తినపుడ. 126

క. ఈనడుమున భీముండును
మానుగఁ బోరాడిమూఁడి మామను శకునిన్
బీనుఁగువలెఁ బడనేసెను
మేనెఱుఁగక తేరిమీఁద మించినకడిమిన్. 127

సీ. వడముడి లోనగువారలత్తోఁ బోరు
కర్ణునిఁ గవ్వడి కదియ వచ్చి
భీమునకును నన్నసేమ మెఱింగించి
గాంధారికొడుకులఁ గడఁగి తాఁకి
పదువుర నొగి నేలపాలుగఁ గావించి
వృషసేనుమీఁదికి వేగ వెడలి
తండ్రి కర్ణుఁడు చూడఁ దలఁద్రుంచి యాతనిఁ
బట్టపగటిప్రొద్దువలె వెలింగె

దుస్ససేనుని భీముండు తొడరి తాఁకి
నేలఁ బడవైచి ఱొమ్మునఁగాలుమోపి
పయిని గూరుండి పొట్టను వ్రచ్చికినుక
నెత్రు ద్రావెను నెల్లరునిలిచిచూడ.

క్షే. అంత దుర్యోధనునిచెంత కరుగుదెంచి 128
హితవు గఱపె నశ్వత్థామ యెఱుకమెఱయఁ
గర్ణుఁడర్జునుఁ బరిమార్పఁ గలఁడటంట
వెఱ్ఱియని తెల్పియిఁకఁబొందు వేఁడుమనుచు. 129

క. దానికి నాతం డీకొన
కొనని దయా మంచిమాట లాలింపక బల్
పూనికఁ బరిఁ బురికొల్పెను
మానక మార్తురదడంబుమాఱుకొనంగన్. 130

మహాస్రగ్ధర.

ఒగి విశ్వచ్ఛందుఁ గర్ణుం డొకరినొకరి తామోర్చిమించంగనానం
దగఁబోరాటంబు సల్పం దఱుఁగని బలిమిం దద్దయున్మేలుచేయౌ
పగవాని న్వ్రంచిచాలం బడలుపఱచిక్రొవ్వాఁడితూపుల్మొఱుంగుల్
నిగుడంగామేన నెల్లన్నాఱంపలు దవులన్నెర్వుతోఁ గ్రీడినాటెన్.

క. అది గని దుర్యోధనుఁడవు
డెదిరింపఁగఁ జేయివీచె నెల్లరఁ గ్రీడిన్
సదమదము చేసెఁ బలువుర
నెదిరింపఁగఁ జన్నవారి నీసున నతఁడుక్. 132

తే. వేలుపులతేఁడు తనకియ్య వెలయుదానిఁ
బెక్కునాళులనుండియుమిక్కిలిగను
గొలుచుచుండెడుదానిఁ బెంజలువతూపు
నర్జునునిమీఁద నాకర్ణుఁడలుకనేసె. 133

తే. చెడియె నది శల్యుమోసంబుచేత నవలఁ
గృష్ణునేర్పుచేతను నొక్కకీడుక్రీడి
కొదవకుండంగ నేమంకు నదియుఁగ్రీడి
బొమిడికంబునుగూలిచెఁ బుడమిమీఁద. 134

ఆ. అంతఁ దనివినక యప్పాఁపతూపును
నేలనుండిలేచి నిగిడి మగుడఁ
గ్రీడివంక మరల గీటడఁచెను దాని
నెన్నఁ డనుపఁ గ్రీడి వెరవుమీఱ. 135

క. అమ్మాడ్కిఁ బాఁపఱమ్మది
వమ్మయి చనఁ గర్ణుఁడెదను వనటనుబొందెన్
బిమ్మటఁ గవ్వడి యాతని
నమ్ములసోనలను ముంచి యళుకొందించెన్. 136

మ. ఒడలెల్లం గడునెత్తురుల్ దొరుగఁగా నుక్కెక్కి పోరాడుచోఁ
బుడమిం గ్రుంగెను దేరుదానిఁబయికిం బొల్పొందఁగా నెత్తుచోఁ
గడిమిం గర్ణుని కుత్తుకందునిమెఁ గిన్కం గ్రీడి వాల్దూపులన్
గడఁక న్వెన్నుఁడు పంపఁ బాడిఁ దలఁపంగా లేక పెంపేదఁగన్. 137

ఆ. కొడుకుచావుఁ జూచి వెడలిపోయెనో నాఁగఁ
బ్రొద్దుజాఱెనంతఁ బొంగిమదిని
బాండుకొమరు లెల్ల నిండుల కేగిరి
వనట మొదల నెదుటివారు చనఁగ. 138

క. మలుచటినాఁడలశల్యుని
దళవాయినిగాఁగఁ జేసి దండులతోడన్
వెలువడి దుర్యోధనుఁడటఁ
బొలికలనికి నడచెఁ గడఁక పొలుపొందఁగన్. 139

క. ఆరేయి కృపుఁడు హితవుగ
రారాజును జేరి చెప్పి రహి నిపుడైనన్
జేరి యుధిష్ఠిరు పొందును
గోరు మను చతఁ డతని పలుకులు వినఁడయ్యెన్. 140

సీ. శల్యుండు తేరెక్కి చనుదెంచి బీరంబు
చూపుదాల్చిసమాడ్కి నేపుచూపి
యేనుంగులను నెల్లబీనుంగులను జేసి
వారువంబుల నేలపాలొనర్చి
యరదంబులను గరం బఱవఱ లొనరించి
కాలిబంటుల జముప్రోలికంచి
పెక్కుతెఱంగుల నుక్కుచూపుచునుండ
వడముడి వడివడి వచ్చి తాఁకి
గుదియ చేకొని పెద్దయు నుదుటుమీఱఁ
బోరి యాతని గ్రేల్మిడిఁ దేరిమీఁద
నొఱగఁజేసినఁ గృపుఁడప్పు డొద్దనుండి
తనదు తేరిపై నిడుకొని చనియె నతని. 141

తే. కర్ణుకొడుకుల మువ్వుర గండడంచె
నకులుఁ డప్పుడు కుతుకల్ నఱికివైచి
సురథుఁడనువాని మూర్కొవి సొంపుచెఱిచి
తలనుదునిమె నశ్వత్థామ మలికిగముల. 142

ఉ. ఆవల శల్యునిం గవిసి యార్చి యుధిష్ఠిరుఁ జేపుచూపియుం
జేవచెడం బడల్పడియుఁ జెచ్చెరఁ దేరున సోలి యంతలో
నే వడిఁ దెల్వి నొంది తనయేటును బోటును జూపి శల్యునిం
గూవులఁ జంపి తేరు నుఱుమాడి కలంచెను వాఁడిచూపులన్. 143

క. కని యపు డశ్వత్థామయుఁ
దనతేరున శల్యునిచి దవ్వుగఁ గొనిపో
యెను మఱియొక యరదంబును
గొనిశల్యుఁడు మరలివచ్చి ఘోరముగాఁగన్. 144

క. కయ్యంబొనరిచి క్రీడిని
డయ్యంగాఁజేసి భీము డాసి కలంచెన్
జయ్యన యుధిష్ఠిరుఁ డడరి
వెయ్యేటికి సత్తిచేత వెసఁదలఁద్రుంచెన్. 145

తే. శల్యుఁ డీల్గిన నెవ్వగ జాలిఁగనలి
చుట్టు ముట్టిరి యాదిట్ట చుట్ట లెల్ల
వడముడియుఁ గ్రీడి సాత్యకి యడరి వారి
రూపుమాపిరి రారాజు రోసిచూడ. 146

ఆ. దుర్విషుండు మొదలు దుర్యోధనుని తమ్ము
లను గడంకఁదాఁకి లావుమెఱసి
నొక్కఁడైన మిగులకుండంగ నందఱ
భీముఁ డపుడు వెదకి పిలుకుమార్చె. 147

క. శకునికొమారు నులూకుని
మొకమోటము లేక చంపె మొనలు దలంకన్
జికిలి మెఱుఁగు నారసమున
నొకయేటునను సహదేవుఁ డుఱుగని కడిమిన్. 148

ఆ. కొడుకుపడిన శకుని మిడుకుచు నడ తెంచి
వారువములదండు బలసిరాఁగ
నకులుఁ బొదివి వాఁడినారసమ్ములు గ్రుచ్చి
తుదకుఁ దాన పెద్దనిద్దురవోయె. 149

సీ. భీష్ముఁడు లోనైన పేరెన్నికను గన్న
మగఁటిమి గలవారు మ్రందుటయును
గర్ణుఁడు మొదలుగాఁగలుగు సంగడికాండ్రు
పేరులేకుండంగ బిద్దుటయును
దుస్ససేనుఁడు మొదల్ గొడునీజగనుండు
తమ్ములందఱుఁ బోరనమ్మగుటయు
శల్యుఁడు మున్నుగా సాయంబుచూపిన
దొరలెల్లనుసుఱులు తొఱఁగుటయును
జూచిదుర్యోధనుఁడు వెఱసొచ్చి నొచ్చి
బడలిద్వైపాయనంబను మడుఁగుచొచ్చి
యెవ్వరు నెఱుంగకుండంగ నేకతంబ
నీరిలోఁ డాఁగియుండెను నిలువరముగ. 150

క. అప్పుడు పాండునికొడుకులు
తప్పక పగవారినెల్లఁ దలలుదఱిగి తా
మెప్పట్టున దొరఁ గావక
యప్పుడ వెదకంగఁ జొచ్చిరందును నిందున్. 151

తే. ఒకటఁ గృపుఁడు నశ్వత్థామయుఁ గృతవర్మ
తప్పిచనిఱేఁడు మడువులో దాగియుంట
యెఱిఁగి ముప్వురు నచ్చోటి కేగి తమ్ముఁ
దెలిపికొని మాటలాడిరి తెలివిదప్పి. 152

క. వడముడికిని నంజూడు దె
చ్చెడు మెగముల వేఁటకాఱు చెచ్చెర దానిం
బొడగని వచ్చి యుధిష్ఠిరు
కడఁ జెప్పిరి తామువిన్న కన్నవియెల్లన్. 153

సీ. తమ్ములుఁ గృష్ణుండుఁ దక్కటిదొరలును
దెగి వెంటరాఁగ యుధిష్ఠిరుండు
మదువుకడకు వచ్చి మఱిమఱి యెమ్మెలు
చిల్లులువోవంగఁ జెల్లుగాను
రోఁతమాటలు వల్క రోసంబు మదిఁబుట్టి
దుర్యోధనుఁడు తాను దోడులేక
యొంటరియై యుంటయును వారు పలువుర
త్రోడ్పాటుననుబల్మితోడరియుంట
చెప్పియొక్కఁడొక్కఁడెతన్నుఁజేరిపోర
నందఱనురూపుమాపెదనంచుఁబలుకఁ
దగినతేరునువాలును మొగి నొసంగి
యొక్కనినెపోరుసలుపంగనిక్కవముగ. 154

క. పనిచెద ననుచు యుధిష్ఠిరుఁ
డనఁగా నమ్మాటబలిమి నందఱు చూడం
గను మదువు వెడలివచ్చెను
దనచేతను గుదియ యొప్పఁ దగ రారాజున్. 155

క. అప్పుడు వెన్నుఁడు భీముని
నొప్పంగఁ బురికొల్పఁ బోరి కొగి బలరాముం
డప్పుడవచ్చి పెనంగెడి
చొప్పును నిర్వురచలంబుఁ జూడఁగ నిలిచెన్. 156

తే. అప్పుడెల్లరు మదువును నల్లవిడిచి
పొలికలని కేగుదెంచిరి పోలువుమీఱ
గుదియలను గేల నంకించి యునుటుపొదల
గాడ్పుపట్టియు రారాజు గదిసిరంత. 157

చ. వెనుకకుఁ బోవుచు న్మగుడ వీఁకమెయిం బఱతెంచి తాఁకుచుం
గనుఁగవ నిప్పుకల్ సెదరఁ గన్గొనుచుం గుదెలొక్క పెట్టునన్
గసలునఁ ద్రిప్పి యొండొరులఁ గండలు రాలఁగఁ గొట్టుచున్ జలం
బున నడగొండలట్టు కడుఁబోరిరి నెత్తుటఁ దొప్పఁదోఁగియున్. 158

వ. ఇట్లిమ్మొగిమగలు మిగులఁ దెగువ మెయిం బెనంగుచు గుదియలు పూనిమేనులుసించుచు నొంచుచు నొండొరుల మించుచు నాయంబులు పగిలి గాయంబులనుండి పెల్లుగం దొరుంగు క్రొన్నెత్తురుల వెల్లువలు కొండలనుండి వెలువడిన సెలయేళ్ల మొత్తమ్ములఁ బురుడింప నొండొరువులకు వ్రటపడక కడిమి చూపుచుండ దుర్యోధనుండు తన నేరిమి పేరిమిని వడముడి బెడిదంపు గుదియపెట్లం దప్పించుకొనుచుననుచు వేడుకత్తోడఁ దన ప్రోడతనంబు చూపఁ గడంగిన నెఱింగి కఱివేలుపుపంపునం గవ్వడి వడముడికి సైఁగ జేసిన నాసన్న కన్నెఱిఁగినవాఁడై యాతండు కయ్యంపుఁబాడిఁ దొఱంగి. 159

క. బెడిదంబగు గుదెపెట్టునఁ
దొడలు విఱుగఁ గొట్టెక్రిందదొడిఁబడబుడమిం
బడియుండిన దుర్యోధనుఁ
గడఁకందలదన్ని నడమ కాలనలుకత్తోన్. 160

ఆ. అట్లు పాడి విడిచి యాతనిఁ దన్నుట
చూచి యలుకవొడమిచూడ్కులందు
నిప్పులురుల లేచి యప్పుడ బలరాముఁ
డడరి భీముఁ జంపఁగడఁగుటయును. 161

క. వెన్నుం డడ్డముగాఁ జని
యన్నను మరలించి తెచ్చి యాతనికినుకం
దిన్ననిమాటల మానిచి
మున్నతఁడో నన్ననంచె మనికిం జేరన్ 162

క. తొడలు విఱిగి నేలఁ బడియుండి రారాజు
నోరి దురద దీఱఁ జీరి కృష్ణు
నెల్ల వారువినఁగఁ బెల్లుగఁ బెక్కులు
కానిమాట లాడె మేనువడఁక. 163

క. అంతటను వీడుపట్లకు
గొంతికొమాళ్లెల్లఁ గృష్ణుఁ గొని చని రెలమిన్
గంతునవెన్నుఁడు కరిపురి
కెంతయుగాంధారినూఱడింపఁగఁ జనియెన్. 164

క. చని పనిదీఱిచి క్రమ్మఱఁ
జనుదెంచినఁ గృష్ణుఁడపుడ జముష్టిని నా
తనితమ్ముల సాత్యకినిం
గొని మోఘవతియను నేటికుఱఁగటి కరిగెన్. 165

సీ. కృపుఁడు నశ్వత్థామ కృతవర్మయునుగూడి
పడియున్న యొడయనిపాలికరిగి
కన్నీరు మున్నీరుగా మీఁదఁబడి యేడ్చి
యెలుఁగులు రాల్పడ నెట్టకేల
కాతని నూరార్చి రంత నశ్వత్థామ
యెకిమీనిఁగనుఁగొని యిట్టులనియె
నీరేయి యేనేగి యెల్లెనఁ బాండుని
కొడుకులఁ జట్టాలమడియఁజూచి
తలలు గొనివచ్చి యేలిక దగ్గఱకును
దెచ్చి చూపెద నాతండ్రిఁ దెఱఁగుమాలి
తలను గోసిన తులువను దప్పకుండఁ
జంపువాఁడధృష్టద్యుమ్ను జంపుమాని. 166

క. అని వీడ్కొని చని తెరువునఁ
జనువునఁ గృపుఁ డట్లుచేయఁ జనదని చెప్పన్
వినకొక్కఁడుఁ దగు వెరవును
దనలోఁ దలపోయుచుండెఁ దత్త్రమానికడన్. 167

ఆ. అపుడు గూబయొకటి యచ్చటి కరుదెంచి
యాదమఱచి చెట్టుమీఁదఁ గూర్కి
యున్న కాకిగములనొక్కటఁ బొలియించె
మెడలుగొఱికి గోళ్ళనాడలు పెఱికి. 168

క. అదియంతయుఁ గన్నులఁ గని
యిదియేతగు వెర వటంచు నెంచి యడిదముం
గుదురుగఁ గేలం దాలిచి
కదలెను నడిరేయి తనదు కర్జము నడుపన్. 169

చ. చని కృతవర్మనుం గృపునిఁ జక్కఁగ గుమ్మములందుఁ బెట్టి తాఁ
గనికరమేది కైదువయుఁ గ్రాల గుడారము దూఱి లోపలన్
బెనుపఱి మేనులన్మఱచి నిద్దురఁ జెందెడునట్టి జోదులం
గనుఁగొని యద్ది కానిపనిగా మది నెంచక యాసు పెంపునన్. 170

తే. తోడరి నిదురించువారి గొంతుకలుకోయఁ
దోడఁగె బాపఁడయ్యును బచ్చి తురకవోలె
నప్పు డల్ల యశ్వత్థాము యలుక యొకటె
పెద్దగాఁ జూచుకొనిపాడి పేరుమఱచి. 171

క. మొదలనె దృష్టద్యుమ్నునిఁ
దుదముట్టించుటయు కాక త్రోవపుఁ ద్రాటన్
బ్రదికినపుడె మెడఁగోసెను
నెదమీఁదను గూర్చుండి యేమఱి కూర్కన్. 172

సీ. అత్తావు వెల్వడి యుత్త మోజునిఁ బట్టి
యొక్కవ్రేటునవానియుసుఱుగొనియె
గాలిబంట్లను హాత్తిగముల మావులఁ ద్రుంచి
మడువులు గట్టించె నొడలి నల్లఁ
గడచి యుచ్చోటను గని శిఖండిని దాఁకి
ద్రోవది బిడ్డలతోడ నతనిఁ
బొదివి గీటడఁగించి పిదప నేవురఁజంపె
ద్రోవదికొడుకులఁ దూపుగముల
నంతఁ బగవారిపరి జముచెంతకరిగి
వీఁడు సద్దడఁగుటఁ జాల వేడ్క నొంది
కదలి మామను గృతవర్మఁగలసికొంచు
నరిగెఁ గూడియశ్వత్థామదొరనుజూడ. 173

క. కప కుట్టూపిరిత్రోడను
గనులం దేలగిలవైచి కాఱియఁబడు నా
తని చెవులవేసె నంతయు
వనజెల్లనుబాసి మేనువదలెను ఱేఁడున్. 174

సీ. మఱునాఁడు వేకువమానిసియొక్కండు
రోజుఁచుఁ బఱతెంచి బొమ్ముమోఁది
కొనుచు యుధిష్ఠిరుఁ గవి కాళ్ళపయివ్రాలి
యేడ్చుచు నడురేయి నిల్లుచొచ్చి
యొకఁడు నశ్వత్థామ యోర్చి దృష్టద్యుమ్నుఁ
దమ్ములఁబరమార్చియుమ్మలింప
ద్రోవదికొడుకుల నేవురఁ బొలియించి
తక్కటివారలతలలుద్రుంచి

పోయెనని కన్నులను నీరుపొరలఁజెప్ప
సొలసి యాతఁడు డెందంబుగలఁగి వ్రాల
గ్రేవనున్నట్టివారలు లేవ నెత్తి
యూఱడింపఁగఁ దేఱి నిట్టూర్పువిడిచి. 175

క. తనతోఁ గ్రీడిని వెన్నునిఁ
గొని యశ్వత్థామనడఁప గోరి వెడలఁగా
విని యాతఁ డొడల బూడిద
ననువునఁ బూసికొని తపసియ ట్లయ్యె వెఱన్. 176

ఆ. వారలతనిఁ గదియవచ్చిన భీతుఁడై బ్రహ్మశిరము నాఁగఁ బరఁగుతూపు
విడిచిపెట్టనదియె విన్వచ్చుఁడును నేసె నొకటినొకటి రెండు నొనరఁదాఁకి.

క. మింటికెగసి రెండును బెను
మంటలు వెడలంగఁ బేర్చి నుఱిమఱిజగముల్
వెంటనె కాల్పఁగఁ జొచ్చిన
దంటయగుచు వ్యాసుఁడుడిపెఁ దగనా నెగులున్. 178

క. వ్యాసునిపంపున నిరువురు,
నీసులు విడనాడి తూపు లెవరివి వారా
వ్యాసుని యెదురనె యుడిపిరి,
రోసమునం ద్రుపదుకూఁతురున్ వడముడితోన్. 179

క. అలఁతం గొడుకులకొఱకుం,
బలవించుచు ద్రోణుకొడుకుఁ బరిమార్చి మదిం
గలయుమ్మలికము వాపఁగఁ,
బలుదెఱఁగుల వేఁడ నతఁడు పరుగునఁ జనియెన్. 180

క. మఱియూయశ్వత్థామయె,
పఱపిన యామేటితూపు పడఁతుల కడుపుల్

పఱియలుగఁ జేయఁబొచ్చినఁ,
గఱివేల్పుత్తరకడుపును గాచెం బెరిమన్. 181

క. నిసువులు నిద్దురవోవఁగ,
నుసుఱులు గొన్నట్టి కూళ నోడించి తలన్
బసలీను మానికముఁగొని,
యొసఁగిరి భీముఁడును గ్రీడి యొగి ద్రోవదికిన్. 182

తే. దానద్రోవదియెంతయుఁ దనివిసనియె
నట్లు తలదాల్చు మానికమదియుఁ బోవఁ
బెంపుదఱిఁగి యశ్వత్థామజంపు మాని
యపుడె కానలపాలయ్యెఁ దపసియగుచు. 183

వ. అనినవిని యవ్వలి కత నెఱింగింపు మనుటయు. 184

క. ఎన్నికయిడ రాకుండఁగ
నెన్నియొ జగములను జేసి యెంతో నెనరుతో
నన్నింటిని గాపాడుచు
నెన్నండున మఱపులేక యేలెడుదంటా. 185

మణిగణనికరము.

తలఁచుట వలననె తగఁ బలుజగముల్
గలుగఁగ నొనరుచు కడింది యొడయఁడా
మొల పునఁ గొలఁదికి మిగులు జగములన్
నెలవుకొనబయలనిలుపు బలియుఁడా. 186

గద్య. ఇది శ్రీమదాపస్తంబసూత్ర లోహితసగోత్ర శుద్ధాంధ్రనిరోష్ఠ్య నిర్వచన నైషధ కావ్యరచనా చాతురీధురంధర సద్యశోబంధుర కందుకూరివంశపయఃపారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్యపుత్ర సకల సుజనవిధేయ వీరేశలింగనామధేయ ప్రణీతంబైన యచ్చతెనుఁగు. భారతమునందు ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము

క. తలఁపులచేతను మఱియుం
బలుకులచే నందరానివాఁ డయి జగ
మ్ముల నెల్లెడ లోపలను
న్వెలుపలను న్నిండియుండి వెలిఁగెడువేల్పా. 1

వ. శౌనకుండు మొదలుగాఁగల తపసుల కాసూతుం డవ్వలికత నిట్లు
చెప్పందొడంగె. 2

సీ. కొడుకులు చుట్టముల్ పుడమియేలికలును
బ్రెగడలు మొదలుగాఁ బేరుగలుగు
వారెల్లఁగూలిన వగఁగూరి ధృతరాష్ట్రుఁ
డశలుచు సెజ్జపైఁ బడికరంబు
సొమ్మవోయియు లేచి జోటజోటఁ గన్నీరు
వఱ్ఱదలుగట్టంగ వనరుచుండ
విదురుఁడు వ్యాసుండు వెనుక సంజయుఁడును
నెంజిలి దీఱిచి నెమ్మదిగను
బాలికలనిఁజూడరమ్మని పలుకుటయును
గొంతియును నాలుఁగొడంద్రుఁ గూడిరాఁగ
వచ్చెనంత యుధిష్ఠిరుఁ డచ్చెరువుగఁ
దమ్ములను దోడుకొని పెదతండ్రిఁ గదిసె. 3

ఆ. కదిసి తండ్రికెఱఁగి గాంధారికిని మ్రొక్కి
తక్కఁగలుగువారిఁదగఁగఁగాంచి
తియ్యమాటలాడి నెయ్యంబుఁ గడుఁజూపి
కట్టియున్నవారి కవలు మాన్పె. 4

తే. ఆఁపుకొన్నను నాఁగక యంతకంత
కడరి మదిఁబొంగి పొరలెడునలుకకతన
జమునిపట్టినిదిట్టంగఁ జలముపూని
నట్టిగాంధారి నోదార్చె వ్యాసుఁడపుడు. 5

క. వడముడియును గాంధారికిఁ
గడుఁదీపులు పుట్టునట్టుగా మఱుమాటల్
నొడివి యడంకువ నాయము
యెడఁదం గలయట్టి కినుక నెల్లను నుడిపెన్. 6

ఉ. అత్తఱి నామెయానతిని నన్నయుఁ దమ్ములు ద్రోవదింగడుం
బత్తిని వెంటఁబెట్టుకొని పాండుకొమారులు తల్లి పాలికిం
గుత్తుకబంటి నెవ్వగలఁ గూరి చనంగఁ గొమాళ్ళనెల్లఁ దా
నెత్తికవుంగిలించుకొని యేడ్చె నొకించుక సేపు గొంతియున్. 7

క. అటుపిమ్మట నడుగులఁబడి
పొటపొటఁ గన్నీరుజాఱి బుగ్గలుతడియన్
గటకటఁబడు కోడలి మి
క్కుటముగ నూరార్చి యూఁపె కుందుడిగించెన్. 8

సీ. అంతవారందఱు నడలెల్ల విడనాడి
సరగ నెయ్యంపు ముచ్చటలు నెఱపి
చుట్టపక్కంబులు చుట్టును నడఁజేర
వెడలి యందఱు నొక్క పెట్టగాఁగ
ధృతరాష్ట్రు కడఁజేరి తెఱవలు నెయ్యురు
బంటులు వెను వెంటనంటి రాఁగ
నల్లవారును గూడి యల్లన నాలంపు
నేలకు నడిచిరి చాలఁ దాల్మి

నెదురఁ బీనుంగులయియున్న యేనుఁగులను
తఱుచు తప్పించుకొనుచును తఱినిగూలి
తిట్టలయియున్న వార్వంపు టట్టగములఁ
ద్రోచికొంచును జని రందుఁ ద్రోవఁగనక. 9

క. అప్పుడు గాంధారి యనిం
గుప్పలుగాఁ గూలిపడిన కొడుకులు మొదలౌ
గొప్పవలంతులఁ గనుఁగొని
దెప్పరముగ నిట్లుపెక్కు దెఱఁగుల నేడ్చెన్. 10

సీ. పలుమానికపుఁగోళ్ల పసిఁడి మంచము మీఁద
సంచపాన్పునఁ బవ్వళించు నీవు
కటకటా యిటువంటి కటికినేలఁ బరుండ
నోర్చితివెట్లు దుర్యోధనుండ
వేనవేలెప్పుడు వెనుకముందులఁ జేరి
కొలువుసేయుచు నుండ నలరునీవు
దాయలుబ్బఁగ నక్కటా యొంటిఁ బడియుండఁ
జాలితివెట్లు దుశ్శాసనుండ
యెండకన్నను వానకన్నెఱుఁగ కెపుడుఁ
గడమపడకుండు సుకములఁ గాంచువీరు
వానకును నెండకును నెట్లు వరుససైఁచి
యుందకున్నారు నాముద్దు పట్టిలార. 11

క. పలువురు జోదులు పయిఁబడి
కలనం దగవేది మేనఁ గఱకు ములుకులన్
జలముస నడరించి నినుం
బొలియించిరె నానలేక పోరి నభిమన్యా. 12

తరల. పరఁగ నాఁడటు జూదమొక్కటి పన్ని యాడి యుధిష్ఠిరున్
సరగ లోఁగొని యన్నియుం గొనఁజాలి యక్కట యిప్పుడీ
దురపుజూదమునందు నేరుపుత్రోఁచ కూకర మోడి మ
చ్చరము హెచ్చఁగ మాద్రిపట్టి కొసంగితే శకునీ మొఱల్. 13

సీ. దుస్సల సిమ్మాడ్కి దొసఁగులపా ల్సేసి
చనితివే మముఁబాసి సైంధవుండ
నినునమ్మి దుర్యోధనునకుఁగా నునులు
తొఱఁగితే ద్రోణుండ త్రోడువచ్చి
యొజ్జలంచునునైన నొక్కింతమోమోట
మెన్నక కెడపిరే నిన్ను నేఁడు
మఱచెవొకో మేనమామ మనుమాటయు
శల్యుండనినుఁజంపు జమునిపట్టి
తండ్రిపోయిన బిడ్డలఁ దగఁగఁ బెంచి
చదువుసాములు చెప్పించి సాకినట్టి
నిన్నుఁబడసేయఁ జేయాడెనె యకటకట
పాండుని కొమాళ్ళకోయి భీష్ముండయ్యు. 14

వ. మఱియు నప్పాలికలనియందు. 15

సీ. మడిసినమగలపైఁ బడి సొమ్మసిలి లేచి
యార్పులు మినుముట్ట నఱచువారుఁ
బొలిసిన చెలికాండ్రఁ దిలకించి శస్త్రిమోఁ
బుడమిమీఁదను బడి పొరలువారుఁ
గన్నబిడ్డలమేను గాకులు పొడువంగఁ
గనలేక యెద మోఁదుకొనెడువారుఁ
జాఁపకట్టుగఁబడ్డ సైదోడులను గాంచి
యెడఁద వ్రయ్యలువాఱ నేడ్చువారు

నగుచువగచెదు మగువల యెడలు టులివు
పుడమియును నాకసంబును ముంచుకొనియె
నేమి చెప్పఁను నదిగన్న నెట్టిరాతి
గుండెవానికి వగ పుట్టకుండ దపుడు. 16

తే. అప్పుడెంతయుగాంధారియలుకవొడమి
యిట్టికీడులుమూఁడుట కెల్లఁగుదురు
వెన్నుఁ డేయని యాతని తెన్నుదిరిగి
యిట్టులనితిట్టెఁగడుఁబెద్దయెలుఁగుతోడ. 17

క. నేఁటికి ముప్పదియాఱవ । యేఁటను నొండొరులనెదిరి యీతీరున నే
యోటరుడఁరు నీవారలు । గీటడఁగెద వీవు నట్ల కీడ్పడి యొంటిన్.

ఆ. వినులారవినియువెన్నుఁడాపలుకుల । కించుకయుఁ దలంక కిట్టు లనియె
మునుపె తిట్టిరిట్లు కినుకను జడదారు। లిప్పుడిందుఁ గ్రొత్తయేమిగలదు.

క. ఐనను నన్నారక యిటు । కానక తిట్టుటను నీదు గరితతనం బో
చాన కొఱఁతవడుఁ గాకే । మేనియు మేలొదవఁగలదె యిందున నీకున్.

క. అనినంతట ధృతరాష్ట్రుం । డనిలోనం జచ్చినట్టి యలతేండ్లకు నె
ల్లను నగ్గియియ్యజముకొడు । కునుబని చిననాఁతఁడపుడె కొదలేకుండన్.

సీ. సొదలను బేర్పించి సొరిదినందఱ కగ్గి
యిప్పించి యామీఁద నెల్లవారుఁ
దనవెంట వారలై చనుదేర జముపట్టి
వినువాఁక కడకేగి మునిఁగి యందు
దుర్యోధనుండును దుశ్శాసనుండును
లోనైన వారికిఁ దానుఁదండ్రి
నువ్వులు నీళ్ళును నవ్వగ నొకచోట
వదలుచు నుండంగ వచ్చి కుంతి

కన్నుఁగవ నీరుకాఱంగఁ గదిసి యచట
నెల్లరు వినంగఁ గర్ణుండు తొల్లి తనకుఁ
బ్రొద్దువలనను గలుగుట పొసఁగఁ దెలిపి
యతనికిని నీళ్ళు విడువఁగ నతివవేఁడె. 22

ఉ. అప్పుడు గొంతిపెద్దకొడుకు కందఱముందఱ నన్నకై కడుం
దెప్పరమైన నెవ్వగలఁ దేలి వితాకునఁ దల్లిదూఱుచుం
జెప్పెడి దేమి కర్ణునకుఁ జేసెను నూవుల నీళ్ళపోఁతయుం
దప్పక కర్ణునిం దడవి తక్కినవారును గుంది రెంతయున్. 23

తే. పిదప మిన్నేటిగట్టునఁ బెద్దదైన
గుడ్డయిల్లొండు గట్టించి గొంతికొడుకు
బందుగులుఁ జెలుల్ మొదలైనవారితోడ
మూఁడు నెలలందు నిలిచెనుమురిపమెసలి 24

సీ. అచ్చోటి కొక్కనాఁ డయ్యుధిష్ఠిరుఁ జూడఁ
గోరి వ్యాసుండును నారదుండు
కణ్వుండు లోనుగాఁ గలిగిన జడదారు
లరుదేర నెదురుగా నరిగివారిఁ
గొనివచ్చి మరియాద లొనరించి యందఱ
నొగిఁబీఁటలను గూరుచుండఁబెట్టి
యడుగులఁబడి లేచి యందఱసేమంబు
లారసి వేర్వేఱ యపుడు జముని
పట్టిచేదోయి జోడించి యిట్టులనియె,
నేను జచ్చిన వారికి నీళ్ళువదలు
నప్పు డమ్మ కర్ణుండు నా కన్న యంచుఁ,
జెప్పె నప్పటినుండియునొప్పుదలఁగి. 25

క. ఉల్లం బెంతయు నడలెడుఁ
దల్లియె నాకిట్టివెతను దారిచె నకటా
బల్లిదు నన్నను జంపుక
యెల్లర మొగములను నింక నే నెటుచూతున్. 26

తే. బవరమున నాఁడు కర్ణుని బండికల్లు
పుడమిలోపలఁ గ్రుంకుట పోలఁగంటి
దానికిఁ గతంబు నారద యానతీవె
యనుడు వేలుపుఁదపసి యిట్లనుచుఁ జెప్పె. 27

సీ. చిన్ననాఁ డతఁడు తల్లిచే విడువంబడి
యడుగుఁ బుట్టువునింట నలరుచుండి
విలువిద్దె గఱచుచు వింటనమ్ములు గూర్చి
వెరవుమై నొకనాఁడు విడుచుచుండ
వాలుఁదూపొక్కటి నేలవేలుపు దూడ
కునుదాఁకి యది నేలఁ గూలుటయును
నలిగి పాఱుఁడతని యరదంబు పుడమిలో
దిగఁబడుఁగాకని తిట్టి చనియె
మఱియు బాపఁడ నని బొంకిమట్టుమీఱి
భార్గవునియొద్దవిలువిద్దెఁబడసికడకు
గాలు దొలిచిన పురుగుచేఁ గల్ల దెలిసి
తిట్టుఁబడెఁబోరు నెడవిద్దె తెలివిపోవ. 28

క. అని యంతయు వాక్రుచ్చిన
విని మోమున విన్నఁదనము గ్రేలుచునుండన్
గనుఁగవ నీరొలుకఁగఁ గ
ర్ణునిఁ దడవితడవి యుధిష్ఠిరుండును వంతన్. 29

సీ. చెప్పక కర్ణుని చొప్పును దాఁచిన
తనతల్లి నేమియు ననఁగలేక
యిఁక ముందు పుడమిలో నేకతమెప్పుడు
తలిరుఁబోఁడులవద్ద దాఁగకుండుఁ
గాకయంచును నల్క గడలుకొనగ దిట్టి
కాయగూరలు దించుఁ గానలందుఁ
దానుండునని లేవఁ దమ్ములు ద్రోవది
పెక్కువగలఁ దెల్ప బెడచెవులను
బెట్టి పట్టిన పట్టును విడువకుండె
నంత జడదారు లందఱు ననువుమీఱఁ
బలుదెఱంగుల నాయముల్ పలికి మదికి
హత్త నూఱిపోసినఁగొంతమెత్తనయ్యె. 30

క. జడదారిదొరల నుడువుల
నెడఁదం గల కలఁక తొలఁగి యాకొనఁగడకున్
బుడమిం గైకొనియేలఁగ,
నడవుల కేగెడితలంపు లడఁగంటంగన్. 31

చ. తపసులు చుట్టముల్ చెలులుఁ దమ్ములునుం బెదతండ్రి త్రోడ రా
నపుడ యుధిష్ఠిరుండు తగ నచ్చటువెల్వడి వీడుచేర న
చ్చపుఁ దెలివిం జనెం బజలు సంతసమారఁగ భీమునన్న తా
నెపు డరుదెంచు మమ్ము నెపుడేలు నటంచును గాచియుండఁగన్.

వ. మఱియు నంతకుమునుంగలన యయ్యూరివార లంతయువిని యంతం
తనరాని సంతసంబున. 32

సీ. కమ్మకస్తురినీటఁ గలయంపి చల్లించి
ముత్యాలముగ్గులు మొఱిగ నమర్చి
యపరంజికంబాల నరఁటిచెట్లను గట్టి
క్రొమ్మావిదోరణా లిమ్ముపఱిచి

ఉరువేళ్ల పందిళ్లు కొమరొప్ప వేయించి
సరిగంచుచందువాల్ జతనుపఱిచి
నెత్తావిగల పూవుటెత్తులు గట్టించి
యగరువత్తులతావి పొగలువెట్టి
ప్రోలు గైసేసి రంతటఁ బోలుపుమీఱ
వెన్నుడును దమ్ములిల్లాలు వెంటరాఁగఁ
బుడమివేల్పులు దీవెన లిడుచునడువ
వేడ్కతో యుధిష్ఠిరుఁ డల్లవీడు సొచ్చె. 34

క. చివురుంబోఁడులు మేడల
చివరల నందముగ నిల్చి చేతులనిండం
బువులుగురియంగ దొరయును
దవుమాడ్కిని దెరువుదాఁటి దఱిసెం గొలువున్. 35

క. ముత్తైదువలు నివాళుల
నత్తఱిఁ బాటలను బాడి యలరుచు నియ్యం
జొత్తెంచెఁ గొలువుఁ గూటము
తత్తరమునఁ గొంతికొడుకు తద్దయు నెలమిన్. 36

తే. వెదకి యవ్వీటిజోస్యులు వెట్టినట్టి
మంచిమూర్తంబునందును మించు వేడ్క
దొరతనంబును బూనెను సరసనున్న
తపను లొక్కటదీపింపఁదనరి తేఁడు. 37

ఉ. అమ్మెయిఁ బూనఁ దెమ్మెరలు నల్లనఁ బల్మఱు వీచె వేలుపుం
గొమ్మలు క్రమ్మరించి రొగిఁ గ్రొన్ననముత్తము నేలవేల్పులో
క్కమ్మడి నేనఁ బ్రాలు పయి నూరక చల్లిరి కాఁపు లెల్లరున్
నెమ్మదులందు సంతసము నిల్పి రతం డట్లు నేలఁ దాల్చుటన్. 38

క. కాఁపుల కెల్లను నేమము
లేపట్టునఁ గొఱఁతవడక యెలమి యొసంగన్
గాపాడుచు నందఱు నొక
రూపునఁ జూచుచు యుధిష్ఠిరుం డరసెఁబజన్. 39

తే. ఇట్లు కొన్నాళ్లు నేలను నేలుచుండి
డెందమూఱటఁ జెందక కుందుచుండఁ
గలఁకవోఁ గృష్ణుఁగనిపాడిగఱపవేఁడ
నతఁడు గొనిపోయె భీష్ముని యండకతని. 40

ఉ. తమ్ముల వెంటఁగొంచు చని తాతను గన్గొని తేఁడు మ్రొక్కఁగా
నమ్ములపాన్పునందు వెతలందుచు నుండియు వెన్నుమన్ననన్
నెమ్మదిఁ జెంది మన్మలకు నెట్టన దీవెనలిచ్చి యోలిమై
నిమ్ములఁ జెప్పెఁబాఁడికత లిట్లని భీష్ముఁడు భీము నన్నకున్. 41

క. కాఁపుల నొప్పింపక తా
నేపట్టున రవ్వపడక యెల్లరు మెచ్చం
గాఁపులవలనను బన్నుల
నోపికతోఁ గొనఁగ వలయు నొడయం డెపుడున్. 42

క. పుడమిఁ దనకంటె బలియునిఁ
దొడరిన నగ్గును గాన దొరయగువాఁడా
యొడయనితోడను బొందే
యొడఁగూర్పఁగవలయుఁజాల నుపమయొసంగన్. 43

క. దండుల నని లేనపుడును,
మెండుగ నుంచుకొను చెవుడు మెలఁకువతోఁ దా
నుండంగావలె నెకిమీఁ,
డొండు దొరతనంపువింత లొప్పఁగఁగనుచున్. 44

క. ప్రముచ్చులవెత లేకుండఁగ,
నిచ్చలుఁ బరికించి యెందు నెఱి చెడకుండన్
హెచ్చుగఁ, గాఁపుల మేలును,
నచ్చుపడం బుడమియేలి కారయ వలయున్. 45

క. కలిమియుఁ జదువును జాలం,
గలిగినచో మిడిసిపడక కడు నడఁకువతో
మెలఁగం జను నెల్లరకును,
దలకూడును బేరుఁ బెంపుఁ దద్దయు దానన్. 46

క. చాలఁగఁగీ డగునపుడును, దాలిమియే పూనవలయుఁదప్పక దానన్
మేలిమి చెందును మానిసి, నేలంగలవారిలోన నెగులర యడఁగన్

క. నవ్వులకు నైనను దగ, దెవ్వానికిని నొప్పి నించు కేనియుఁ జేయన్
గవ్వలయాటల నైనను, గ్రొవ్వున దబ్బఱలనాడఁ గూడదుసుమ్మీ.

క. కలదానిలోన చాగము,
నలుపుచు నిచ్చలును బీదసాదల నరయన్
వలయును దనచేత నయిన,
కొలఁదిని నొరులకును మేలుగూర్పఁగ వలయున్. 49

క. ఒరు లొనరించినమేలును,
గరువంబున మఱవరాదు కలలో నైనన్
దొరపడి చీటికిమాటికిఁ,
బొరయం దగ దలుక దానఁ బొదువును జేటుల్. 50

క. ఒరులేవి తనకుఁజేయఁగ, నరయన్మదిఁ గోరుచుండు నయ్యవి వెసఁ దా
నొరులకుఁజేయఁగ వలయును, దిరముగఁదా మేలుపొందఁదివిరెడునేనిన్

తే. మఱియుమిగిలినవాయంపుఁదెఱఁగులెల్ల,
మదికినాటంగఁదెలిపెన్నమనుమనికిని
భీష్ముఁ డప్పుడచ్చోటికి వేడ్కమీఱఁ
దపసితేఁడులువచ్చి రాతనిని జూడ. 52

తరల. అచటివారలచేత గారవమొంది యాజకదారులున్
ముచటదీఱఁగ నందు వెన్నసి మోడ్పుఁగన్నులఁ జూచి వేఁ
డుచును దద్దయుఁ బ్రొద్దుపుచ్చి కడుం గడుం జముషట్టితో
నెచటనుం గనరాని నాయము లెల్లఁ జెప్పిరి కూరిమిన్. 53

తే. పిదప భీష్ముండుమనుమనివెరవుమీఱఁ,
బున్నెములజాడలను దెల్పిబుజ్జగించి
ప్రోలికంచెను వ్యాసుపంపునను నంత,
నుండి పదినేను నాళ్లత్రఁ డూరనుండి. 54

ఉ. ఆవలఁ దోడఁబుట్టువులు నందలిపెద్దలు నూరిపాటులున్
బావయుఁ జుట్టముల్ గొలుచువారలునుం బెదతండ్రితల్లియుం
బ్రోవులుగట్టి వెంబడిసి బోరనరాఁగ యుధిష్ఠిరుండు న
త్తావున కేగుదెంచెఁ దనతాతను గ్రమ్మఱఁ జూచువేడుకన్. 55

క. ఏతెంచి జోతచేయుడు
నాతండును మోడ్పుఁగన్ను లరతెఱచి వడిం
జేతుల నిమురుచు మనుమని
నాతఱి దీవించి యిట్టులనె ధృతరాష్ట్రిన్. 56

క. కొడుకులశోకము మది వగ
గుడువకు మించుకయు నీదు కొనవల నెల్లం
గడువడి నుడుపు యుధిష్ఠిరుఁ
డడలక యీతనినె నమ్ముమన్నిటికింకన్. 57

ఆ. అనుచుఁ జెప్పి పిదప నందఱి సేమంబు,
లరసి కనులు మొగిచి యబ్బురముగ
మొదలుఁదుదియులేని మొనవేల్పుమదినిల్పి,
విన్ను వాఁక కొడుకువిడిచెనుసురు. 58

ఆ. కొంతసేపు తాత కొడుకును జముపట్టి, కనుల నీరుసించి కళవళించి
వెనుకఁ బెద్దవారి పనుపున నతనికి, నగ్గిపనులు దీర్చె నడలుతోడ. 59

మ. వెనుకన్ భీమునియన్న తాతకును దావిన్నేటిలో నూవులన్
వనటంబొందుచు నీళ్లతో వదలి యానాఁడేటినిం దాఁటి త్రో
వను నన్నం దనతాతఁ జంపుటకుఁగా వంతం గడుం బొంది కా
ననునుండం జనువాఁడనంచుఁ బలుకన్ వ్యాసుండునుం గృష్ణుఁడున్.

తే. పలుదెఱంగులఁ దాల్మిమాటలనుగఱపి,
యింటికియుధిష్ఠిరుని దెచ్చి రెట్టకేల
కంతవ్యాసుండు జముపట్టె ననువుమీఱ,
వారువపుజన్న మొనరింప నేఱుపఱిచె. 61

క. పోరున దాయల నటువలె, దోరించిన దోసమెల్లఁ దొలఁగును నీకున్
వారువపు బన్నమున నని, ప్రేరేప యుధిష్ఠిరుండు వెత దిగఁద్రావెన్

వనమయూరము. కవ్వడిని గుఱ్ఱమును గావఁగను బంచెన్
నెవ్వడిని జన్నమును నివ్వటిలఁ జేయన్,
నవ్వుచును వెన్నునిని నాయముగ వేఁడెన్
దవ్వుగనుజోపి వగతాలిమిని దాల్చెన్. 63

మత్తకోకిల. అన్నపంపునఁ గ్రీడి విల్లును నమ్ములుం దనరారఁగన్
దిన్నఁగా నల మావుపోయిన తెన్నునం జనుచుండఁగా
మున్నుగా నరుదెంచి జక్కవి మోఁది పట్టు త్రిగర్తలం
జిన్నపోరున గెల్చి చెచ్చెరఁ జేరె నొండు విలాతికిన్.

శా. అంతం దత్తడి పోయిపోయి గరువం బారంగఁ బ్రాగ్జ్యోతిషం
బెంతో వైళమ చేరెఁ జేరుటయు నచ్చే వజ్రదంతుండు దా
సంతోసంబున వచ్చి పట్టుకొనియెం జక్కిం జలం బొప్పఁగాఁ
గొంతం గవ్వడి వచ్చి తాఁకెనతనిం బోటొగ్గి వాల్దాపులన్. 65

క. భగదత్తుని కొమరునితోఁ,
దగఁ బోరాటంబు సల్పి తనదుమగఁటిమిన్
బొగడఁగ జేజేల్ గవ్వడి,
తెగువం గొరును నడంచి తెరలిచె నతనిన్. 66

తే. అపుడు జన్నంబు చూడరానతనిఁ బిలిచి,
వారువము వెంట నచ్చోటువాసిక్రీడి
చేరె లాఁతివిలాతిని సింధువనెడు,
పేరఁ బరఁగెడుదాసినిఁ బెంపుమిగుల. 67

క. అయ్యెడ నచ్చటివారలు,
కయ్యమునకుఁ గ్రీడిఁ గవిసి కడుబీరమునన్
డయ్యఁగఁ బోరి తొలంగిరి,
నెయ్యురతోఁ గూడి కడకు నివ్వెఱ గదురన్. 68

క. తనతండ్రిఁ జంపినాతఁడు
చనుదెంచె ననంగ గుండె జల్లనవినిగ్ర
క్కున నుసురులు విడిచెను నిం
టనె సైంధవునికొమరుఁడు డిటం బెకలంగన్. 69

తే. అతనికొడుకును నెత్తికొంచచటి కపుడు
వచ్చి దున్సల విచ్చ్చు పజ్జ నిలిచి
బుడుత నాతని కాళ్లపైఁ బడఁగవైచి
కన్నులను నీరు కాల్వలుగట్ట ననియె. 70

తే. అన్నయీతఁడు నీమేనయల్లుబిడ్డఁ
డితనిఁ గనికరింపుము నెమ్మయెదఁదలిర్ప
ఏనితండ్రియు నీరాక విని కలంగి
యీఁది యూపిరి వీఁదనె మిడిసి విడిచె. 71

క. అన నక్కటికంబెదలోఁ
బెనఁగొనఁ జెల్లెలిని నెత్తి బిగికవుఁగింటం
బెనఁచి కడుం గారవమునఁ
దనుపుచు నూరార్చి మంచితనమున ననియెన్. 72

క. అమ్మా నీవేమియు డెం। దమ్మున వంతురక వీనిఁ దగఁ గొంచును నీ
విమ్ములనింటికిఁ నరుగుము। కొమ్మా నేఁబోయి వత్తుఁ గొఱఁ తెన్న సుమా.

క. అనివారువంబు వెంటను। జనఁగా నదియు మణలూరు చక్కికి నతనిం
గొనిపోయెఁ గ్రీడిరాకను। విని యెంతయు సంతసించి వేడుకతోడన్.

వ. కవ్వడికిం జిత్రాంగదవలనం గలిగి యెవ్వరుం దనకు సాటి రాకుండ
నింతు మగంటిమి నవ్వీడేలుచుండు బభ్రువాహనుండు. 75

తే. ఎదురుగా వచ్చి కాళ్లకు నెరఁగి లేచి
యోరనిలుచుండ నాతని దారిఁగనక
చిన్నపుచ్చిన నలుకయు సిగ్గు గదురఁ
దండ్రితో నాల మొనరింపఁ దలఁచి పిలిచి. 76

క. పన్నికొనివచ్చి దండుల। నన్నిటితోడను నెదిర్చి యాలము చేసెన్
వెన్నికబభ్రువాహనుఁ। డెన్నియొవాలమ్ములతనిమెద నాఁటంగన్.

సీ. చెచ్చెరఁ దనమీఁదఁ జిచ్చఱమ్మును నేయ
నీటితూపున దాని నోటువఱిచి
చలము డింపక పూని మలయులుఁగును నేయ
మగటాతి వాల్కోలమరలఁజేసి
మానని కినుకతో మబ్బుములుకి నిగుడ్చ
గాలితూపున దానిఁ గ్రమ్మఱించి
చిఱువిసంబును గ్రక్క చిలువకోలను దార్ప
గరుడితూపున దానిగండడంచి

వేలుపులు మెచ్చఁ బోరాడి వెనుకఁ గ్రీడి
బభ్రువాహనునేపునఁ బడియె నేల
నంతఁ జిత్రాంగదయు వచ్చి యడలఁ దొడఁగెఁ
గొడుకు నదూఱుచు మగనిపైఁ బడి కడంగి. 78

తే. క్రన్నన నులూచి పాఁపజగమ్ము నుండి,
మణిఁగొని వచ్చి యిచ్చిన నందముగను
లేచి కూర్చుండెఁ గవ్వడి చూచి యెల్ల
వారు మరలఁ జచ్చినవాఁడు బ్రదికె ననుచు. 79

ఆ. తలఁచి సంతసిల్లిరి తర్వాతఁ గొడుకును । దండ్రికాళ్ళ వ్రాలి తడవుఁ లిచి
తప్పు సైపవేఁడఁ దటుకునఁ నక్కునఁ । గదియఁ జేర్చి పట్టి గారవించె.

చ. అటుపిదపం గొమారు నల రారఁగ వీడ్కొని యొంపుచోడికిం
దటుకునఁ బోయి కానలను దత్తడితోడను జొచ్చి మేటులన్
దిటమున దాఁటి యొండకను దెమ్మెకు నోర్చుచుఁ గ్రీడి కొన్ని నా
ళ్ళటునిటు నూరకే తిరుగులాడుచు గుఱ్ఱము వెంటఁ బిమ్మటన్. 81

క. చొచ్చి జరాసంధుని ప్రో,
లచ్చట నాతని మనుమని నాలములో వి
వ్వచ్చుఁడు లోఁగొని కానుక,
లచ్చపడం బుచ్చుకొనియె నాతని వలనన్. 82

తే. పిదప గాంధార మను నేలఁ జేర్మిత్రోఁపఁ,
గ్రీడి జన్నపుగుఱ్ఱంబుతోడఁ జొచ్చి
గోర మగుపోర నచ్చటివారి నోర్చి,
వారి కడపొమ్ముఁ గొని వెన్కవంక మరలె. 83

ఆ. అంతఁ గ్రీడి రాక నటమున్నె విన్నుండు,
జముని పట్టితోడ సమరఁ దెల్పె

నంతసంబు మీఱఁ జనుదెంచెఁ గ్రీడియు,
నూరుసేరఁజాల నోడమిఁ గొనుచు. 84

ఉ. తమ్మునిరాకకు న్మదిని దద్దయు సంతస మంది యక్కునన్
నెమ్మిని గారవించి తగునేమముతోడను మాపుజన్నముల్
నెమ్మదిఁ జేయఁగాఁ దివిరినేలను గల్గిన జన్ని గట్లకున్
సొమ్మును గొల్లగా నొసఁగి చొచ్చి యుధిష్ఠిరుఁడల్లజన్నమున్ 85

క. ఎల్లరుమెచ్చఁగ నొనరిచి, యుల్లము తల్లడము దీఱ యొజ్జల నీవిం
బెల్లగు మన్ననలఁ దనిపి, యెల్లరఁ దగవీడుకొల్పి యెలమింబొందెన్.

తే. రహిని గాంధారికిని ధృతరాష్ట్రునకును,
బనులు సేయుచువారల బ్రాఁతిఁబడసి
కాఁపులెల్లను దన్నెప్డుఁ గన్నతండ్రి,
వడువుననుజూడజముపట్టి పుడమినేలె. 87

సీ. తెల్లవాఱఁదడవ యల్లనఁ బాండుకొ
మారులు సేమంబులారయంగఁ
గొంతియుఁ గోడండ్రుఁ గూరిమితోవచ్చి
పలుమాఱు నిచ్చలుఁ బనులుసేయఁ
గొలువుకు కాండ్రెల్ల నలసట యెఱుఁగక
కెలనఁగాచుకయుండికొలువుసేయ
నారగించినవెన్క నరుదెంచి పాఱులు
కదలక వేడుకకతలు సెప్పఁ
గొడుకు లెల్లను బోయినకొఱఁత యించు,
కేనిఁగానరాకుండంగ నెసఁగుచుండె
దానుధృతరాష్ట్రుఁడల్లగాంధారిఁగూడి,
జమునికొమరుండుతగినట్లుజరుపుకతన. 88

క. బీదకు సాదకు బాపల, కాదటఁ దామిచ్చుచుండు రాముఁడు సత్కృ
గాదనక కానుపీసము, బ్రోదిగఁ గొడుకియ్యఁ బంధువులఁ బబ్బములన్.

సీ. ఈమాడ్కిఁ గొన్నియేం డ్లేఁటను గొఱంత
లేకుండ నచట మేలిమిగనుండి
యొకనాఁడు ధృతరాష్ట్రుఁ డొంటిగ వచ్చిన
జముపట్టి నొద్దకుఁ జక్కఁబిలిచి
యెవ్వరు వినకుండ నేకతంబునఁ జెప్పె
నాతండ్రి నీవిల్లు నడుపుచుండఁ
గొడుకులు గలనాఁటి వడుపునకంటెను
జాల మేలుగఁ బ్రొద్దు జరుఁగునాకు
నిచటి సుగములనెల్లను సిచ్చుటీఱఁ,
గుడిచినాఁడను నేండ్లును గడచెఁ జాల
నింకఁ బెఱజగమ్మును గోరుటితవు నాకు,
నడవికినిబోయి యుండఁగ నానతిమ్ము. 90

తే. అనిపగుండెలు బ్రద్దలై యతఁడుకొంత,
వడివితాకునఁ బెదవులుదడుపుకొనుచుఁ
బలుకఁగా లేకయెట్టకేనిలుఁగు తెచ్చు,
కొనియుధిష్ఠిరుఁ డలతండ్రికనియెనిట్లు. 91

క. మీరడవులకుం జనఁగా,
నేరను నేనుండ నిచట నేనును మీతో
గారవమున వచ్చెద నిదె,
యీరలు ననుఁ గూడఁ గొంచు నేఁగుఁడు వెంటన్. 92

క. పోవలదని పలుదెఱఁగులు, గా విన్నపమును నొనర్చి కాళులమీఁదన్
లేవక పడఁగా వ్యాసుఁడు, తా వచ్చి యుధిష్ఠిరుఁ గని తగనిట్లనియెన్.

తే. అరయనీతండు పెద్దవాఁడై నవాఁడు,
బలసిపుడమిపైఁ బెక్కేండ్లు బ్రతుకఁబోఁడు
కానలోనుంట యేయింకఁ గరములెస్స,
యితనినంపుమియొండాడకిపుడుతేఁడ. 94

క. అని యెట్లో యొప్పించిన, వినియుందఱు నెఱఁగి వచ్చి వెలవెలవోవన్
జనుదెంచి కుంతి యడవికిఁ బనివడి తా బావవెంటఁబయనంబయ్యెన్

క. మానుసఁ జాలక యామెయు, గానకు గాంధారితోడఁ గలఁగకపంపం
గానోడఁబడిరికొమాళ్ళును, మేనులు వడఁకంగనోరు మెదలుపకోర్మిన్

సీ. అప్పుడు ధృతరాష్ట్రుఁ డనిలోన మున్నట్లు
చచ్చినవారికై చాగములను
జేయంగఁ గోరినఁ జెప్పు నలవిగాని
రొక్కంబును యుధిష్ఠిరుం డొసంగ
విచ్చలవిడి నేలవేల్పులకును నిచ్చి
చెప్పి యెల్లనవద్ద సెలవువడసి
నారచీరలు గట్టి నాతిగాంధారియు
సంజయుండును గొంతి సరస విదురుఁ
డరుగుదేరంగ వెల్వడి యడవి కేగఁ,
జాలదవ్వుగ నాతని సాగ నంపి
తానుఁ దమ్ములు వీడ్కొని తల్లి నచట,
వీడుచేరెను జముపట్టివెనుకవచ్చి. 97

మానిని. తల్లియు నాధృతరాష్ట్రుఁడుఁ గానకుఁ దద్దయు వేడుకతోఁ జనఁగా
నుల్లముపల్లటిలఁగను గుందుచు నొక్కటనుండి యుధిష్ఠిరుఁడున్
బెల్లుగ వారలఁ జూచెడు కోరిక వేగిరపెట్టఁగఁ దమ్ములతో
నిల్లట వెల్వడి వారల రోయుచు నేగెను నందఱు నున్నెడకున్

తే. ఇట్లుజను దారిలోనొక్కయెడనువిదురుఁ,
డుండెవెఱ్ఱివాఁడునుబోలెనొప్పుదఱిగి
యతనిఁ గనియుదెనినుఁజూడనరుగుదెంచి,
నాఁడనంచుయుధిష్ఠిరుఁడాడునంత. 99

తే బదులు పల్కక యొకచెట్టు మొదలఁజేరి
మీఁదు చూచుచు నప్పుడ మేను విడిచె
నతనికొఱకయి కొంతసేపచట నుండి
వనట జముపట్టి చనెఁ దనవారిఁ జూడ. 100

క. చని విదురుని చావెల్లరు,
వినఁగాఁ జెప్పినను వారు వెత హెచ్చంగాఁ
బనవి రతనిని దలంచుచు,
మునుకొని జముపట్టియాత్రముం జెందంగన్. 101

తే. వగపు లుడిగినపిమ్మటఁ దగినకరణిఁ,
దద్దయును వేడ్కతోనాఁటిప్రొద్దుగడపి
రెల్లవారలు జడదారు లేగుదెంచి
పున్నియపుఁగత లోపిక పూని చెప్ప. 102

క. ఈ కరణిని నొకనెలయట, నీకొని జముపట్టి నిలువ నెల్లరు నెలమిం
జేకొని కొఱంత యేమియు, లేకుండఁగ నుండిరంచులియ్యముగాఁగన్.

తే. అట్టులుండంగనొక్కనాఁడరుగుదెంచి,
వ్యాసుఁడొకరేయియచ్చటవారితోడఁ
గడపిమఱునాఁడు ప్రొద్దునఁగదియఁ బిలిచి,
చీకుజేనికిహితవునుజెప్పిచనియె. 104

తే. సాగి వ్యాసుఁడచ్చటినుండిచనకమున్నె,
యతనియానతిఁ దలఁబూనిజతనమునను

అంత ధృతరాష్ట్రుఁ డెంతయు మంతనమునఁ
జెంతకును భీమునన్నను జేరఁ జీరి. 105

ఆ. పోలు తెఱఁగున నొక్కింత బుద్ధిగఱపి,
నేర్పుమాటల నాతని నేలయేల
నొయ్య వీటికిఁ బోవంగ నియ్యకొలిపి,
యంచెఁ దమ్ములతోఁ గూడ నతని మరల. 106

క. వచ్చి యుధిష్ఠిరుఁ డొప్పుగ,
నిచ్చటఁ గొన్నాళ్ళు నేలయేలుచు నుండన్
వచ్చి యొకనాఁడు నారదుఁ,
డచ్చుపడం జెప్పె నంగలార్చుచు నిటులన్. 107

సీ. ఒడయండ నీవట్లు నడతెంచినంతట
నీతండ్రి కుంతిని నెలఁతఁ గొనుచు
వేల్పుకోటికిఁ బొంత వెలయుకానను జేరి
యాకుటింటను నెమ్మియలర నుండి
మఱఁదలుఁ దెఱవయు మఱి వెంటఁబడి రాఁగ
నడవిలో నొకయెడ నడచుచుండఁ
గాఱుచిచ్చు లెడఁ గ్రమ్మి మంటలు నింగి
ముట్టంగ నద్దెస లట్టికవియ
నాఁడు వారును జీకును నయినకతనఁ,
బోవఁగాలేక మువ్వురుఁ బొలిసిరందు
నేను నచ్చటివారిచే దీనివించు,
నరిగి చూచితిఁ బీనుంగులైనవారి. 108

తే. కాలుగలవాఁడు గావునఁ గమరిపోక
సంజయుం డొక్క కొండను సరగ నెక్కి

వేనుఱును ధృతరాష్ట్రుచే వేఁడఁబడుచు
నునుఱులను గాచుకొనియెఁ దానొక్కరుండు. 109

క. అని చెప్పుడు నేలంబడి,
కనుఁగొలుకులనుండి నీరు కాలువపాఱం
గను నేడ్చెఁ దల్లిఁ దండ్రిని,
బెనుగొంతున, దలఁచి వేర్వేఱకడుఁ. 110

తే. వార లిద్దఱికొఱకు గాంధారికొఱకు,
మిక్కిలిగ సుమ్మలించియమ్మేటిఱేఁడు
నారదుం డూఱడించిన గారవమున,
డెందమున నొక్కయించుకకుందువాసె. 111

క. ధృతరాష్ట్రునకును గొంతికి, వెత గాంధారికిని వేఱువేఱుగ నగ్నుల్
జతనుపఱిచి నూవులత్తో, జతనంబున నీళ్ళు విడిచి చాగము లిచ్చెఁ.

సీ. బవరంబు నడచి యిప్పటికిని బదునెన్మి
దేఁడులు గడచె నొక్కింతలోన
మఱి పదియేడేండ్లు మాఱుగ జముపట్టి
పుడమినేలెను వగలెడఁద బలియ
ముప్పదియేనేండ్లు ముగిసిన నొకనాఁడు
వెన్నునిఁ జూచెడు వేడ్కతోడ
ద్వారక కల్లవిశ్వామిత్రుఁడును నార
దుండును గణ్వుఁడుఁ దొడఁగి వచ్చి
యూరిబయలనునడయాడుచుండఁజూచి,
దుడుకుఁదనమున వెన్నునికొడుకులెల్ల
జాంబవతికిని బుట్టిన సాంబునకును,
నాఁడు వేసంబు నమరించి యాగడమున. 113

తే. కడుపుత్తో నున్నలాగునఁగానఁబడఁగఁ,
బుట్టములుచాలఁ బొట్టకుఁజుట్టఁబెట్టి
పలువురును గూడిచుట్టుగుంపులుగనపుడు,
నవ్వుచునువాడవాడలఁ గ్రొవ్వుమీఱి. 114

క. తిరుగుచు నా జడదారుల, సరసకుఁ గొనిపోయి వాని సాగిలఁబడఁగా
వెరవున నొసరిచి కడుఁబోఁ, తరమున నిట్లనిరి కన్నుఁదమ్ముల నగుచున్

మధ్యాక్కర. జడదారులార యీకొమ్మ సరిగాను దొమ్మిదినెలల
కడుపుతోనున్నది దీని కడుపునఁ గూఁతు రౌదవునొ
కొడుకు పుట్టునొ చెప్పుఁడయ్య కోరిక లొదఁగూడ నన్న
నొడలు మిక్కిలిమండి వార లొయ్యన నిట్లని పలుక. 116

తే. మీకొలంబున కెల్లను మిత్తియైన,
పెద్దరా యొక్కఁ డీపెకు వేగఁ బుట్టుఁ
బొందు మామాట తప్పదు పొందనంగ,
వెడలి రింటికి మోములు వెల్లవాఱ. 117

క. వారందఱు వగచుచు నిలు,
సేరం జని పొంబు కట్టుచీరను విప్పం
గా రాయొక టూడిపడెన్,
వారలయుల్లంబు లెల్ల వ్రక్కలుగాఁగన్. 118

క. పొడగని దానింగొని చని,
వడివడిఁ బొడుముగ నొనర్చి వదలక దానిం
గడలిం గలిపిరి యంతటఁ,
బొడవడఁ గెడు నంచు నెంచి పూనికి మీఱన్. 119

సీ. అట్టులు వారలఁ దిట్టినతపసుల
నోరెట్టిదో కాని నునుపుమీఱ

నామఱుసటినాఁడె యాచోటనెల్లను
బెల్లుగాఁ గ్రొవ్వాఁడి జెల్లు మొలిచె
నొకనాఁడు బలరాముఁ డుద్ధవుండును బోయి
కోరిక ల్వీడనాడి చేరి రడవి
వెన్నుండు మిగిలిః వీటివారల నెల్ల
జాతర నేయంగ సంద్రమునకు
వెంటఁ గొనిపోయె వారిలో వేనవేలు,
కల్లుద్రావుట మైకము గప్పి మిగుల
నొడలు తెలియక తూలుచు నొకరి నొకరు,
తిట్టుకొంచునునూరక కొట్టుకొంచు. 120

ఆ. అన్నలనక తమ్ములనకుండ నొండొరుల్,
తప్పఁద్రాగి కాళ్ళఁదాఁచుకొనుచుఁ
జెంత జెల్లు పెఱికి చేతులకొలఁదిని,
గొట్టుకొనఁ దొడఁగిరి కొంద ఱందు. 121

ఉ. వారిని జూచి వారు తెగువం గలయంబడి రెండుపాయలై
నోరికొలంది నొండొరుల నూఱులు కాఱులు ప్రేలుకొంచు నె
వ్వారిని జీకింగొనక వాఁడితనంబునఁ బోరియొడ్డునం
గోరముగాఁగ నేలపయిఁ గూలుచు నీల్గిరి జెల్లుదెబ్బలన్. 122

క. కృతవర్మయు సాత్యకియుం, బ్రతుకుల కేమియును నాసపడ కెప్పటివో
కతలపుడు త్రవ్వుకొంచును, వితగాఁబోరాడియాడివిడిచిరి యసువుల్.

క. నెఱిఁ బ్రద్యుమ్నుఁడు సాంబుఁడు,
మఱియుం గలయట్టిమేటిమగలతెగలునుం
గొఱమాలిన యాలంబునఁ,
మఱిపోయిరి లేనిపోని పట్టింపులచేన్.

క. పోరను జావఁగ మిగిలిన,
వారువముల నేనుఁగులను వరుసను గొనుచున్
ద్వారక కేగెను వెన్నుఁడు,
దోరినవారినిఁ దలంచి క్రొక్కుటపడుచున్. 125

వసంతతిలకము. వెన్నుండు చుట్టములు వేలకొలంది చావన్
గన్నారఁ గాంచి వెతఁ గవ్వడిఁ జూచుకోర్కిన్
బన్నంబు నొందియును బంచెను నాఁడెపోవం
జెన్నార దారకునిఁ జెచ్చెరఁ గ్రీడిఁ దేరన్. 126

ఆ. ఇట్టు లతనిఁ బంపి యేమియుఁ దోఁచక,
కొంతతడవు లోనఁ గుందుచుండి
కడకు నిల్లువెడలి కానల కొక్కట,
నన్నమున్న పోయినట్లు తాను. 127

కమలవిలసితము.

చని యడవులకును సరగను నన్నన్,
గనుఁగొని జరగినఁ కతఁ దెలుపంగన్
విని యతఁడు నపుడె విడిచెను మేనిన్,
వనటను మఱిమఱి పనువుచువారిన్. 128

తే. అన్న పోయినపిమ్మట వెన్నుఁడడవిఁ,
దిరుగుచెందుఁగాల్నిలువక దిగులుతోడఁ
జెట్టుమొదలికిమేనును జేరవైచి
యొడలు వడఁకంగఁ దద్దయునడలుచుండె.

తే. కాలు గదలుట దవ్వులఁ గాంచియొక్క
బోయ యది యొక్కమెకమని బుద్ధిఁదలఁచి
వింటఁ బలుతూపు గూర్చి వేసెనతనిఁ
జెల్లె వెన్నుండు నాదెబ్బచేత నపుడు. 130

సీ. వెన్ను నిచే నన్ను మున్ను పంపఁగఁబడి
ద్వారకుఁ దరుదెంచి తగినయట్లు
సాంబునికొడుకుల దండకుఁ జని వారి
కందఱకును జోత లమరఁ జేసి
ద్వారకలోఁ గృష్ణు బలఁగంబు మడియుట
యెల్లను వగచుచు నెఱుకపఱిచి
వెన్నుండు నరగను నిన్నుఁజూడఁగఁగోరి
నన్నుఁబంచెననీ యర్జునునకుఁ జెప్ప
నపుడ పయనమై విన్వచ్చుఁ డన్నయొద్ద
సెలవు గైకొని ద్వారక చేరియందుఁ
గృష్ణుఁ గానక వందురి కీడుమీఱది
కీడుగా వసుదేవుఁడు కెడయఁ జూచి
యతనికిని నగ్నికర్మంబు లపుడ తీర్చి. 131

క. అడవులఁబడి కవ్వడి వడి,
నడలుచుఁ జెలికానిఁగానఁ డందుచు నిందుణ్
దడఁబడ నడుగులు దడవుచుఁ,
బొడగనెఁ బీనుంగు జెట్టుమొదలనునొకచోన్. 132

తే. అట్లు కని మొదల్నఱికిన యరఁటివోలె,
నేలఁబడి గోలుగోలునఁ జాల నేడ్చి
తన్ను దఱివార లూరార్పఁ దాల్మిపూని,
కడకుఁ బీనుంగుపైఁబడికౌఁగిలించి. 133

తే. లేచివెనుకటి నెయ్యముల్చెప్పికొనుచు
నడుగులొకకొన్ని వారిత్రోనడచిమోలఁ
గాంచి బలరాము పీనుంగుఁ గదిసి దాని
వగపు సంద్రంబులోపల మిగులమునిఁగి. 134

తే. తాలిమియె తెప్పగా దాని దాఁటి యచట
చిగురు లెల్లను నేఱించి సొదలు పేర్చి
పీఁకఁగుల రెంటి నందుంచి పెట్టి చిచ్చు
తిన్నఁగా వారి నిద్దఱ మన్ను నేసె. 135

సీ. చేసి యచ్చటనుండి చెచ్చెర వెల్వడి
మరల ద్వారకఁ జేరి మఱుఁగువెట్ట
కందఱితోఁ గృష్ణుఁ డన్నయు సమయుట
చిన్న మొగముతోడఁ జెప్పివైచి
యావీటఁ గలవారి నందఱఁ దోకొని
మేలిసరకు లెల్లఁ బోలఁగొనుచు
గుఱ్ఱంబులను నేనుఁగుల నావులను వెంట
నడపించుకొని క్రీడి కడలిగట్టు
చేరె నంతట నేమని చెప్పవాఁడ
నప్పు డంగద లొంటిరా వనెడునట్టి
సామెత నిజంబుగా నుప్పు సంద్రమునను,
మునిఁగిపోయెను ద్వారక మొదలుముట్టి. 136

ఉ. అక్కడనుండి క్రీడి తగనందఱిఁ దోడ్కొని వచ్చు దారిలోఁ
దెక్కలికాండ్రు బోయ లొగిఁ దెన్నున కడ్డమువచ్చి కవ్వడిం
జిక్కఁగఁ జేసి కైదువులు చేకొని వెండియుఁ గూడవచ్చువా
చక్కెరబోండ్ల సొమ్ములను జాలఁగ దోఁచుకపోయి రొక్కటన్.

ఆ. మగనిచావు క్రీడి మొగమున రుక్మిణి,
మొదలుగాఁగఁ గలుగు ముద్దరాండ్రు
సొరది నాకించి సొదపేర్చుకొని చొచ్చి,
కాలి చచ్చి రొండు క్రచ్చులుడిగి. 138

తే. సత్య మొదలైన తక్కినచాన లెల్ల
నోరికలఁ గోసి యడవిశాకులను మేసి
యిచటి సుగముల నెడఁబాసియెసఁగఁదలఁచి
యపుడ యడవులపాలైరి యడలుతోడ. 139

క. తక్కినవారలఁ దోడ్కొని,
మిక్కిలి వెసనంబుతోడ మే నదరంగా
నెక్కుడు పయనంబులఁ దన,
యిక్కకు నరుదెంచి చేరె నెల్లరతోడన్. 140

క. అచ్చటికి వ్యాసుఁ డప్పుడు,
వచ్చినఁ గనలేక మొగము వంచుకొనుచు వి
వ్వచ్చుఁడు పలుకం జాలక,
వెచ్చన నూర్చుచును జెమట వెల్లువగట్టన్. 141

తే. కాళ్ళపయి వ్రాలి సోద్చుచుఁగదలకున్న,
లేవఁగా నెత్తిమదిలోనఁజేవవ్రాన
నూఱుతెఱఁగుల నాతని నూఱడించి,
యిప్పగిదిఁగుందఁగతమేమొచెప్పుమనియె 142

మ. అసనం గన్నుల నీరునించుచును నేయంబొప్ప నన్నెప్పుడుం
దనయుల్లో కనుఁగొంచుఁ బోర నసుఁ బెద్దంజేసి తామావులం
జనఁగాఁ దోలుటకైన నోపకొని నన్ పైదోడుకన్నం గడుం
బనిగాఁ బ్రోచిన కృష్ణుఁ డిష్టు మడిసెం బల్కుల్ మఱింకేటికిన్.

క. బలరాముండును దక్కం,
గల వెన్నునివంకవారుఁ గడతేఱిరి మొ
క్కలముగ నొండొరువులతోఁ,
జలమునఁ బోరాడి కల్లు చవిగొని యుంటన్. 144

తే. కడను ద్వారకమునఁ గెనుగడలిలోనఁ,
జొచ్చి నేవెన్ను నిల్లాండ్రఁ దెచ్చుచుండఁ
బోయ లెదిరించి యాపువ్వుఁబోఁడ్ల నగలు
దోచుకొనిపోయి రంతట దొడ్డవెట్టి. 145

తే. అనుచుఁ దెల్పిన వ్యాసుండు ననుపు మీఱ,
నికమీఁద నీజగమున నీర లుంట
తగవు కాదని క్రీడితోఁ దఱిమి చెప్పి,
తానుదనదారిఁ బోయెను దపసిఱేఁడు 146

లయగ్రాహి. అంతనదియంతయునువింతగను నర్జునుఁడు
గొంతికిఁ గొలిపట్టికిని జెంతఁ జని చెప్పన్
వంతమెయి నేలఁబడి కొంతవడి వందురఁగఁ
బొంతఁ దగువారతని నెంతయును దేర్పన్
దొంతరగఁ బైకుబుకు వింతవగ లెల్లనొక
గంతునను బోనుడిపి యింతిఁ గొని వేగన్
సంతసముతోఁ దపసు పంతముగ నేవు రిఁక
రంతువడ కేగుటకు సంతటను నెంచెన్. 147

తే. అనుచుఁ దలపోసి తమ్ములనాలిఁ బిలిచి,
మనము మనువులు చాలింపమంచిదింక
నడవులకు వత్తురే యని యడుగ వారు,
మంచిదని యియ్యకొనిరి యమ్మాటలకును. 148

ఉ. అంతట నూరివారలను నందఱఁ బిల్వఁగ నంపి వారితో
నెంతయు నెమ్మిమీఱఁ దమ యిప్పటిపూనికి యెల్లఁ జెప్పి యా
వంతయు వంతనొంద కెదనాదట నుండఁగ నానతిచ్చి యొ
క్కింతయుఁ గొంకుమాలి చన నెంచిరి యేవురు నన్నదమ్ములున్.

తే. కృపుని రావించి తగఁ బరీక్షితుని నతని,
కొప్పగించి కరమ్మును గొప్పచేసి
పుడమి నేలంగ నభిమన్యుకొడుకు నిలిపి,
జన్నిగట్ల కొనర్చిరి చాగములను. 150

క. బావండొక్కఁడు కవ్వడి, దాపునకు న్వచ్చి విల్లు తడయక నీవీ
తేపకడనే యిడువు మన, నా పగిదిని గాండివంబు నతఁ డిడెఁ గడలిన్.

సీ. రాచతికంబున రహిఁ బరీక్షితుఁ బెట్టి
ప్రోలివారల వీడుకోలు వడసి
చిత్రాంగదను బిడ్డ చెంతకుఁ బంపించి
వడి నులూచిని దండ్రికడకుఁ బంపి
ద్రోవదిఁదమతోడఁ దోడ్కొని పయనమై
పొరిఁబాండుకొమరులేవురునుగదలి
కానలఁ బడి మెల్లఁగాఁ జనుచుండంగ
వేపియొక్కటి వారివెంటఁ బడియె
నంత దగయు నాఁకలి చూడ కరుగ వారు
కాలుకానలలోపలగంట్లుముండ్లు
గాళ్ళఁ దవులంగబడలిక గదిరి మిగుల,
వెనుకఁబడిపోలిద్రోవదివిడిచెమేను. 152

సీ. బడలిక కడలు తోడ్పడ వెన్కరాలేక
సహదేవుఁ డొకచోటఁజచ్చిపడియెఁ
దమ్ముఁడు చావంగఁ దడఁబడి కాళ్ళాడ
కొకచోట నకులుండు నోఱగి కూలి
మూవురపాటును బోవుచుఁ దిలకించి
మొదవ్రయ్యఁ గవ్వడి మొదర నీల్గెఁ

దమ్ముల నాలిని దలఁచుచు దగదొట్టి
భీముండు నొకచోట బిద్ద్రవాలె
నిట్లు తమ్ములు నలువురు నిగుఱుఁబోఁడి
సమసి పడినను దా నేమి సరకుగొనక
పోవుచుండెనుజముపట్టిపోవదయ్యెఁ,
గుక్కయొక్కటియునువెంటఁగూడమట్టి 153

తే. కుక్క వెంబడిఁ జనుదేరఁ గొంతదవ్వు,
వెడల జముపట్టి కెదురను వేల్పుఱేఁడు
తేరి నొకదానిఁ గొనివచ్చి తెరువునందు,
నిలిపి యాతనితోడను బలికె నిట్లు. 154

క. ఎకిమీఁడ యిదిగొ నరదము,
నొకదానిని నీకుఁగాను నోయన నిటకున్
గికురింపక కొనివచ్చితి,
సుకముగ నిదియెక్కి రమ్ము సులువుగనాతోన్. 155

వ. అనిననావేల్పుఱేని కానేలఱేఁడెంతయు నొదుంగుపాటునఁ జేతులు
జోడించి జోతచేసి యిట్లనియె. 156

తే. నన్నుఁ గనిపెట్టుకొని వచ్చుచున్న దిద్ది,
చాల దవ్వులనుండియు జాగిలంబు
దీనిఁ గూడ నాతోడ నీతేరిమీఁదఁ,
దెచ్చుటకు నానతిమ్ము నే వచ్చువాఁడ. 157

ఆ. అనిన వేల్పురాయఁ డల్లన నిట్లనెఁ,
గుక్కయేడ వేల్పుటిక్కయేడ
దీనిఁ దేరిమీఁదఁ దెచ్చుట తగ దన్న,
నింత నవ్వి యొడయఁ డిట్టులనియె. 158

సీ. తమ్ములు నిల్లాలుఁ దారెల్లననుఁ బాయఁ
దానొక్కఁటియు వెంటఁదవిలియుండి
ననునమ్ముకొని వెంటఁ జనుదెంచినట్టియీ
వేషిని నడవిలో విడువఁ జాల
నను నెప్డుఁ గనిపెట్టుకొని యున్న వారిని
నడవుల పాల్సేసి యరిగి నేను
సుగ మొందుచుండుట తగవౌనె నేనును
దప్పక యీకానఁ దపసి నగుచు
నుండి దీనినరయుచుందు నోరెమిడుచుఁ,
బిదప నిన్ను మెప్పించి నే వెనుకవత్తు
వేట్పుటిమ్మన కిప్పుడో వేల్పు తేఁడ,
యరదమునుగొంచుఁ గ్రమ్మఱనరుగుమీవు. 159

క. అని మోమోడక పలికిన,
విస్మయచ్చెరుపడియెఁ గరము వేలుపుతేఁడ
ల్లన నప్పుడె జాగిలమును,
దనరూపును బాసి జమువితంబును దాల్చెన్. 160

తే. జాడ జముపట్టి తగవును జూడఁగోరి,
యట్లుచేసిన గుఱిదాలు పలరె మదిని
వేల్పు తేఁడును నొడయుని వెంటఁగొంచు,
దేరిపై నెక్కియప్పుడెదివికిఁజనియె 161

ఆ. ఇట్టు బొందితోడనే వేల్పుజగమున,
కేగి నారదుండు నల్లవేల్పు
లోలసి తన్నుఁజుట్టి యుండంగనొడయుండు,
పలుకులాడుచుండిపలికెనదుమ. 162

క. నాసైదోడుల బిడ్డల,
వేసాయము చూపవచ్చి బిద్దిన దొరలన్
వాసిం గనుఁగొన నాకిపు,
డాస పొడమెఁ జూపరయ్య నందఱ నిచటన్. 163

చ. అనవుఁడు మంచిదంచు నపుడాతనిఁ దోడ్కొనిపోయి యొక్కచోఁ
బెనుపగు గద్దియన్ సుగము పెల్లుగఁ జెందు సుయోధనుం దగం
గనుఁగొనుమంచుఁ జూపిరది కన్గొని యాతఁడు డెందమందుఁ దాఁ
గినుకయు నీసునుం బడియెఁ గ్రేవను నారదుఁ డుండిచూడఁగన్.164

ఉ. పుట్టిననాఁటఁగోలె నొకపున్నముఁ జేసి యెఱుంగనట్టి యా
కట్టిఁడి యిందు హాయిఁ గనఁగాఁ గతమేమొకొ నాకు నారదా
గట్టిగ దెల్పు మం చడిగి గంతున మాఁకొని పోరిలోపలన్
గిట్టుటయే యసం దనివినిం గనఁడయ్యె నతం డొకింతయున్. 165

తే. అవలఁ దమ్ముల నెయ్యుర నయినవారిఁ
జూప జము పట్టి వేఁడినఁ జూడుమంచుఁ
గరము దవ్వుగఁ గొనిపోయి కానిపించి
రొక్కచోటను నలమట నొందువారి. 166

క. అదిగని యేవయుఁ గనలును,
మదిలోఁ బొదలంగఁ జూచి మఱిమఱి పగవుం
గదురఁగఁ బొగిలెను దమ్ముల,
కదలని బెడఁదఁ దలంచి కలఁతం బడుచున్. 167

సీ. ఇటు కొంతవడిపొక్కి యిట్లని జముపట్టి
యిదియేమి నారద యింతగోర
మిట్టిదే పరికింప నీవేల్పుజగమున
జరపెడు తగవుల చంద మెల్ల

నింతవఱకుఁ జూడ కేనేమి యనుకొంటి
తెలిసిపోయెను మీఁదు తెఱఁగు నేఁడు
పొడగంటి నేఁడు మా పుడమిలో నెన్నఁడు
విని కని యెఱుఁగని వింతలిచట
పున్నె మెట్టిదో యెఱుఁగని ములుచలకును
సుగముల నొసంగి యెప్పుడుఁ దగవ్రుగలిగి
మెలఁగువారికి దొసఁగులు గలుగఁజేయఁ
దగ వగునె యింక నో వేల్పు తపసిఱేఁడ. 168

క. అని వేలుపు టొడయనిపైఁ,
గనలించుక వోడమి యతఁడు కావలసినవా
రిని జూపుటకయి తనతో,
బనిచినవాని మరలంగఁ బంచె వెనుకకున్. 169

తే. వాఁడు వడిఁబోయి జముపట్టి పలుకులెల్ల
వేల్పు ఱేనికిఁ దిన్నఁగా విన్నవించె
నపుడ పరువెత్తుకొనివచ్చి యతనిఁగాంచి
యచటఁ దెఱగంటి సామియిట్లనియె దొరకు. 170

సీ. కొలదిపున్నెము చేసికొన్నవా రదిమున్ను పొందుచుసుగ మొందుచుందురిందుఁ
బదపడి యదిదీఱఁ బలువెతల్ గుడుతురట్లొట దుర్యోధనుం డట్టు లుండెఁ
జెడ్డపనులను గొంచెముగాఁగఁ జేసిన వారు తొల్తను వెతపడుదు రిచటఁ
గావున నీతమ్ము లీవెత లందిరి ముందువీరలు సుక మొందఁ గలరు
కుంద కేమియు దీనికి డెందమందు । నీవు నొక కల్లమాటను నెపముపెట్టి
పలికి యొజ్జల నవిఁ గోలుపడితి కాన । వలసె నీకును నీవారియలఁతఁ జూడ.

ఆ. అనుచుఁ దెలియఁ జెప్పి యాయనఁగని నీవు
మొదల నేటియందు మునుఁగుమనిన
మిన్నువాఁక లోనఁ గ్రన్ననఁ గ్రుంకిడి
తనరి యతఁడు వేల్పుతనము పూనె. 172

తే. అపుడెయాఁకలియునుదప్పియుతని ఉడిగి। వింతగానల్క ప్రేముడివిడిచిపోయె
మఱియుఁగల్గినతొల్లింటికఱత లెడలి । కలఁకలేనట్టియొకవింత తెలివియొదవె.

క. అంతటఁ దోఁ బుట్టువులును। వింతియుఁ దలియునుదండ్రియుయెల్లయనుఁగుల్
చెంతలఁ బొలిచిరి తమతమ । వింతగు గద్దియలమీఁద వేడుకగాఁగన్. 174

తే. వారిఁగనుఁగొంచు సంతసమారనందు । నెన్నినాళులు నెలచక్కలెసఁగుమింట
నన్నినాళ్ళును సుగముల నందుచుండు।జముని కొమరుండు వేలుపుజగమునందు.

క. అని పాండుని కొడుకుల కత । కొనసుట్టఁగ నిటు శౌనకుండును మునుగాఁ
గను గల జడదారులకును । వినిపించిన పిదప ననియె వెస సూతుండున్ 176

తే. దీనివ్రాసినఁ జదివినఁ దెలియవినిన । వారలెల్లను దగు నడవడిని నేర్చి
దానిచేతను సిరులనుదద్దఁదనరి । యిందు నందును బెనుసుగ మొందుచుండ్రు.

క. లెక్కకు వెక్కసమగుచును,
బిక్కటిలు జగమ్ము లెల్లఁ బెల్లుగ నీలో
నొక్కయెడ న్నరసులవలె,
నిక్కగొని వెలుంగ నెప్పుడు నెనఁగెడు వేల్పా. 178

తోదకము. నేలను నింగిని నీట మెకాలన్
మేలిపులుంగుల మీలను వర్సన్
జాల నొనర్చి యొసంగుచు నోరెం
బోలిన గాచుచు నుండెదుదంటా.

గద్య. ఇది శ్రీమదాపస్తంబసూత్రలోహితసగోత్ర శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధకావ్యరచనాచాతురీధురంధర సద్యశోబంధుర కందుకూరివంశపయః పారావార రాకాకైరవమిత్ర సుబ్రహ్మణ్యామాత్యపుత్ర సకలసుజనవిధేయ వీరేశలింగ నామధేయ ప్రణీతంబైన యచ్చతెనుఁగు భారతమునందుఁ సర్వంబును దృతీయాశ్వాసము.

శుద్ధాంధ్రోత్తరరామాయణము.

By

K. VEERESALINGAM

శుద్ధాంధ్రోత్తరరామాయణము.

ప్రథమాశ్వాసము.

క. రక్కసులఁ జేని తలలెల్లఁ జక్కుచేసి
పుడమికూఁతును గైకొని వెడలియిల్లు
గాలికొమరుండు లోనుగాఁ గలుగువారుఁ
దమ్ముఁడును దోడఁ జనుదేర నెమ్మిమీఱ. 1

చ. అరదము లెక్కి యక్కరణి నందఱుఁ గ్రందుగ వెంట నంటఁగా
సరగున నందినాఁ బరఁగుచల్లని పల్లియఁ జేరువారిలో
భరతుఁడు ముందుగా నెదురువచ్చి యడంకువఁగాళ్ళ వ్రాలి తా
నరుదుగ వెంటఁ బెట్టుకొని యన్నను బల్లియకిచ్చుఁ దెచ్చినన్. 2

సీ. నారచీరలువిప్పి నాడెంపువలిపెంపుఁ
బట్టుపుట్టంబులు బిట్టుకట్టి
యడవిక్రొవ్విరులువాడ్చి యందంపుఁ జెందమ్మి
లరుదుఁగానుఱిమినవరులుదాల్చి
వెడవెడముడివడ్డజడలు చిక్కులువాపి
సిరిమీఱునునుజాలుసిగ లమర్చి
యెఱమట్టినిడుపట్టె లెడలెంచి నుదురులఁ
బదనుకస్తురిబొట్లు కుదురుపఱిచి
మేలిరతనంపురవణముల్ గీలుకొల్పి
తారుకైసేసికొని యెల్లవారుఁ బొగడఁ
దమ్ములిల్లాలు బంటులుఁ దాముఁ దరలి
యొప్పుమీఱంగ రాముఁ డయోధ్యకరిగె. 3

ఉ. అంతకుమున్న వారలటు లచ్చటకుంజను దెంచుచున్నలా
గంతయు వేగవేగరుతె యాగక బాగుగ విన్నవించినన్
సంతసమంది ప్రెగ్గడలు సందడిసేయుచు నూరివారలన్
గంతునఁబిల్వనంపి సరగంజని ప్రోల్గయి సేయఁ బంచినన్. 4

సీ. కమ్మకస్తురినీటఁ గలయంపి చల్లించి
జిగితేటపన్నీట జగతులలికి
యాణిముత్యంబుల నమరించి ముగ్గులు
పందిళ్ళు కురువేళ్ళఁ బొందుపఱచి
జాళువాపని మేలిమేలుక ట్లలరించి
పచ్చలతోరణాల్ బలియఁజేసి
పసిఁడికంబముల నబ్రంపుటంటులునిల్పి
కప్రంపుఁబొగ తెల్లకడలనించి
పీడుకై సేసి తామును వేలకొలది
విలువసొమ్ములుదాల్చి చలువవలువ
లందఱునుగట్టియుండఁ బ్రోలందమొంది
కరముకన్నులపండువుగాఁగనుండె. 5

వ. అంత. 6

మ. పదియాఱ్వన్నెకడానిమేడలపయిం బాలిండ్లుపొంగార నె
మ్మదిలోఁ గోరికలూరఁ గ్రొమ్ముడులు పైపై జార లేజవ్వనుల్
కదియవ్వచ్చుచు నున్న రాకొమరువంకం జూడ లోఁదాల్మియుం
జెదరంబాఱఁగ మీఁదఁజల్లి రల్లరుల్ చేసిండఁ గీలింపుచున్. 7

గీ. వేల్పులాతండు తమదాయబింకమడఁప,
వేల్పుమ్రాఁకుల నెత్తావి విరులుగోసి
యలరిపయిఁజల్లుపెల్లునసలరువాన
తెఱవలందందుఁగురియింపఁ దెరువుఁదాఁటి. 8

సీ. తామెల్ల నోచిననోములు పండె నేఁ
టికటంచు వీటివారొకట నుబ్బ
నన్నినాళ్ళకు నిన్ను నిటఁ గంటిరా కన్న
తండ్రీయని యనుంగుఁదల్లి యలర
నేలుమెల్లపుడు నీనేల నీవేయని
వెనదీవనెలు నేలవేల్పులొసఁగఁ
బుత్తడిపళ్ళెరంబులు పూని ముత్తైదు
వలు పాటపాడి సివ్వాళులియ్య
నిల్లుచొత్తెంచి తల్లుల కెల్ల మ్రొక్కి
తక్కుఁగలవారినందఱఁ దగినయట్లు
గారవముచేసి యతఁడెల్లవారు మేలు
మేలని పొగడఁగా నేలయేలుచుండి. 9

వ. ఒక్కనాఁడు. 10

మ. ఒకచోట న్మగఱాలడాలడరి యొంకొ యొండఁ గాయంగ నొ
ఒకచో ముత్యపుఁగ్గు వెన్నెలల చెల్వొందంగ నామీఁద నొం
డొకచోఁ గెంపులచాయతిన్నియలు వేయన్ సంజకెంజాయ పో
లికగా నొక్కెడఁ గప్పుఱాగమి యిరుల్నింపంగ నాకొల్వునన్. 11

సీ. చెలువంబుగా నాడువెలయాండ్రబంగారు
చిఱుగజ్జియలమ్రోఁత చెవులఁ దనుప
విరిబోఁడు లిరుక్రేవ వింజామరులు వేయ
వెడలుచల్లనిగాలి విందుగొలుప
రహిమీఱఁ దాల్చిన రతనంపుపనిసొంపు
తొడవులతళతళల్ కడలనిండఁ
బగడాలకంబాలపజ్జ ముద్దియనుల
కెంబట్టుపఱపులు డంబుసూపఁ

గొలువనేతెంచు వారలెల్ల గుములుగూడి
యదరొదవుదాఁక నందంద యొదిగియుండి
యడుగుదోయికి మ్రొక్కుచు నవలనిలువఁ
బసిఁడిగద్దియఁ గొలువుండె బలియుఁడతఁడు. 12

ఉ. అప్పుడు కుప్పతిప్పలుగ నాతనిఁజూతమటంచు నెంచి వే
యొప్పులకుప్పలౌతపసు లుక్కున నక్కడకేగుదెంచినం
దప్పుకచూచిలేచి తనదండను సజ్జకదారిపిండుకుం
జొప్పడు పెద్దగద్దియలు చుట్టును బెట్టఁగఁబంచి నేపుకన్. 13

గీ. ఎదురుగానేగి తోడ్తెచ్చి యెల్లవారిఁ,
దగినచోటులఁ గూర్చుండఁ దగవుసలిపి
రెండుచేతులు మోడించినింపుమదిని,
నెంతయుఁబొంగడ్తలోనరించియిట్టులనియె. 14

క. నేమమెమీకున్ మీకస,
గోమునఁగలచదువులెల్లఁ గొనువడుగులకున్
నేమమె మెకములాయిడి,
మీమీ నెలవులను లేక మేలొదవెకునే. 15

క. ఎవ్వరుఁ జేయరుగా మీ,
కెవ్వేతలును మంచినీటియెద్దడి యెప్పుడున్
రవ్వంతయు లేదుగదా,
పువ్వులుకలదగవే సతమును గోనలలోన్. 16

గీ. తెరువుగనలేక దొసఁగులఁ దేలుమాకు,
దారిచూపెడుతలఁపున దపసులార
తలవనితలంపుగా వచ్చి పొలుచుకతనఁ,
గంటిమిమ్ముందటఁ గనులకబ్బుదీఱ. 17

గీ. అనినఁ దేనెమాట లానని నొచ్చుచు,
నొండొరుల మొగంబు లొరఁగిచూచి
యొక్కమాటగాఁగ నున్నవారందఱు,
దిట్టతనము మీఱ నిట్టులనిరి. 18

గీ. అడుగవలసి యడిగి తంతియకాక నీ,
వెఱుఁగనిదియుఁ గలదె యెందు నెపుడు
నైన నిప్పుడదియె మానోటఁబలికింప,
వేడుకయ్యె నేని వినుము తెలియ. 19

క. మీకడకంటనె చూచినఁ,
గాకలుగున్ సేమమిజ్జగముల ననమునుం
జేకొని ప్రోచుచు నింతగ,
మాకయ్యది యడుగనేల మఱిమఱిచెపుమా. 20

క. జగములకెల్లం దొందర,
యగురావణుఁ డీల్గెఁగాదె యనిలోనీచే
నిఁక నెవ్వరిచేఁదొందర,
లగుఁదగ మాబోంట్లకెల్ల నష్పటికరణీ. 21

సీ. ఎప్పుడుఁగంటిపై ఱెప్పవాల్చుటలేని
జేజేల కిపుడుగా చేటుదప్పె
నయినవారినిబాసి యడవులఁ గూపెట్టు
తపసుల కిపుడుగా తాల్మిగలిగె
బిచ్చకానిచెలిమి యచ్చుపడ్డట్టి జ
క్కులదొర కిపుడుగా కలిమిగలిగె
గాలిబ్రతుకుఁ జెంది కలుగులఁబడి యుండు
చిలువల కిపుడుగా తెలివిగలిగె

లేచియొకచోట నిలకడలేకతిరుగు,
చలువతెమ్మెర కిపుడుగా బలిమిగలిగె
నిపుడునీపేరు చెప్పుకొంచెల్ల జగము,
లిట్లు మసఁగల్గె రక్కసుఁడీల్గుకతన. 22

ఉ. ఎందఱి వానిచుట్టముల నెందఱి సంగడికాండ్రఁ బోరిలో
నందఱవందఱల్పరపి చెండిశివించుక సేపులోన వా
రందఱ నోర్వఁగాఁదరమె మానవులమోములఁ వేల్పులైన నీ
వందఱుమించి తెవ్వరికి నోహరునీసరి ముజ్జగంబులన్. 23

శా. అవ్వారందఱు నొక్కయెత్తు సరిగా నాయింద్రజిత్తొక్కఁడుం
జివ్వ న్స్వర్లోకమొత్తు చూడ నతనిం జెండాడెనితమ్ముఁడిం
కెవ్వాఁడట్టుగ నోపునమ్మగతనం బెందైన మున్గంటిమే
నవ్వుల్ గావుసుమయ్య మాపలుకులన్నన్నమ్మదిన్నమ్ముమా. 24

వ. అనిన రాకొమరుఁడిట్లనియె. 25

చ. ఎటువలె నింద్రజిత్తునకు నింతగ నెక్కుడుబల్మికల్గెఁదా
నెటువలె వేల్పుఁజేని నని నెక్కటి నోరిచెఁ దండ్రికంటె మి
క్కుటముగ బీర మెట్లొదవెఁ గూరిమిమీఱఁగ నానతీయవే
తటుకున వానిపుట్టువును దండ్రికోలంబు తెఱంగురంగుగన్. 26

గీ. మొదటినుండియు రావణుపుట్టుకయును,
ముజ్జగంబులు నాతండు బ్రోడయగుచు
గెల్చిన తెఱంగుఁదొలి వేల్పుఁగొల్చువలయు,
మెప్పులొందినయొప్పును జెప్పవలయు. 27

గీ. అనినఁ గొలువువారి యానతిఁగైకొని,
కడఁగి వారిలో నగస్త్యుఁడంతఁ
జెలువుగులుకు కలికిపలుకులు చెవులకుఁ,
జవులు పలుమఱు వెదచల్లఁబలికె. 28

సీ. వినవయ్య జడదారి వెలయుఁ బులస్త్యుండు
మొదటివేలుపునకు ముద్దుపట్టి
మచ్చరంబును గెల్చి మరునకులోఁగాక
యీసను దిగనాడియలరువాఁడు
నిక్కంబుతప్పక యెక్కుడు తెలివిని
నీరసంబెఱుఁగక యెసఁగువాఁడు
తొలివేల్పుముక్కంటి వలమురిదాల్పుల
నిచ్చలు మదిలోన నిల్పువాఁడు
వల్లమాలినపూనికతో నిల్లువెడలి,
చలువగొలిపెడు వలిమలకెలన నలరు
చెలువుగులికెడు తృణబిందు నెలవుచేరి,
తపసితన మూనియున్నంతఁదార సిల్లి. 29

చ. అలరులకొమ్మలో మరునియమ్ములో బంగరు కీలుబొమ్మలో
వలపులదీవులో తొవలబావులో చక్కనిగుజ్జుమావులో
తొలకరిమించులోయనఁగఁ దూకొని యచ్చరలేమలచ్చటన్
బెళుకుఁగనుంగవల్ తళుకుఁబెన్నొడలుం దగ సందడింపుచున్. 30

సీ. ఒకచోటనునుఁబాట లొకతేటగాఁ బాడు
దురు నల్లజాలెల్లఁ గరఁగిపాఱ
నొకయోర వగమీఱ మొకమోరగ నొనర్తు
రలమి దట్టంపువెన్నెలలుగాయ
నొకచాయఁ గనుకాయలకు డాయవత్తు రొ
య్యారంపునడకల హావుసునిండ
నొకదండపరిమండ లాడినిండఁగూర్తురు
కమ్మనితావులు గ్రమ్ముకొనఁగఁ

బిలుతురొక చక్కి నెచ్చెలిపిండునిక్కి,
కలికిపలుకులఁ జిలుకలుకలఁగిచూడ
నడుతురొక క్రేవసాలపుగానడిమిత్రోవఁ,
గదియునరుదెంచియంచలుకాళ్ళఁబెనఁగ. 31

సీ. జొనుపుమరుతూపులన వాఁడిచూపులలర
మదికలంగఁగఁ గందువమాట లాడఁ
జూడ్కిమిఱుమిట్లుగొనఁ జెంతఁ జొరవమెలఁగఁ
గలయఁదిలకించి జడదారికళవళించి. 32

చ. అటునిటుప్రోల వేల్పుజవరాండ్రు మెలంగుట లెంచిచూడఁగా
నెటులునుదాను గైకొనిన యిప్పటిపూన్కికి నడ్డువాటుగాఁ
దటుకున నుల్లమం దెఱిఁగి తాళఁగఁజాలక వారినందఱిన్
దిటమునఁ జేరఁజీరి వెనుతియ్యనితియ్యని తేటమాటలన్. 33

శా. ఏలా వేయును గొమ్మలార వినుఁడీ యీమీఁద నీతోఁటలో
వాలారుంగనుదోయివిచ్చి మరియేవాల్గంటి నన్ జూచునో
యీ లేజవ్వని యిప్పుడేయిచటఁ జాలాలొనటం చాడినం
జాలుంజాలునటంచు నాటవలపుల్ పాలించి వారందఱున్. 34

క. వచ్చినదారినె పదరే
యిచ్చటఁ దలలెత్తిచూడ కెచ్చటికైనన్
మెచ్చుఁగవలదా త్రోవనె,
వచ్చినపనియయ్యె నంచుఁ బకబకనగుచున్. 35

క. ఇంతటితో సరిపెట్టెను
గొంతతలలు తపసి చూచుకొంటిమి బళిరే
యెంతటినోములు నోఁచితి
మింతిరో మనతొంటిమేననే యని చనుచున్. 36

చ. వడివడిఁ బాఱుతెంచి యొకపైదలి యూర్పులుపుచ్చి నవ్వినన్
బడఁతుక యొర్తు చాలిపురె నవ్వకు మంతయు తేపెగట్టిగాఁ
గొడుకులతల్లి వోకు వోకకొంచెము నాఁటికి దాఁచుకొమ్మి నా
నుడికి నెలంతయుం గడుపులుబ్బఁగ నవ్విరి కొమ్మలందఱున్. 37

క. ఒక్కతె చనుమొనకస్తురి
నిక్కఁ గనఁగవచ్చుచెలికి నిలుమని మ్రొక్కన్
విక్కుచుఁ గొమరుని గసుమని
చక్కనదీవించె వీపుచఱచుచు దానిన్. 38

గీ. ఇట్లు మేలంబులాడుచు నింతులెల్ల
నెడగలుగఁబోయి రంతట నిచటఁ బూలు
గోయఁ దృణబిందుగారాపుఁగూఁతు రనఁగఁ
జెలియత్తోఁగూడి పూఁదోఁట మెలఁగుచుండి. 39

క. మునుపటు బెట్టిదముగ నా,
యన వాక్రుచ్చుటలు విన్నయదిగాదటుగా
వున వెఱపన్నది యెఱుఁగక,
వెనుకయు ముందుం దెలియక విచ్చలవిడిగన్. 40

సీ. వేసలిసంపంగివిరుల నెత్తావికిఁ
దెమ్మరల్ దరిచేరఁ దేంట్లుపాఱఁ
జక్కనినెమ్మోముజాబిల్లి జిగికిని
నెలతాల్గరంగఁ గల్వలు చెలంగఁ
దనమేనిజవ్వాజితావికిఁ బునుఁగుపి
ల్లులు డాయరా చిల్కలులికికూయ
నలువైనక్రొవ్వాద నల్లమబ్బునకును
నెగసియంచలువీడ నెమ్మిలాడ

విరులుద్రుంచుచుఁ దేవియల్ వెదకికొనుచుఁ
బండ్లు రాల్చుచుఁ గెందమ్మితూండ్లుగొనుచుఁ
జాన సింగారములతోఁటలోనఁ దోడి
చెలియ నెడఁబాసి యొకకొంతసేపుతిరిగె. 41

క. బోటింగానక దూవిరి,
దోఁటం దిరిగితిరిగి యెటుఁదోచక యొంటిన్
మాటికెలుఁగెత్తిచీరుచు,
మేటితపసిఁగాంచె నొక్కమిట్టను నెదురన్. 42

ఉ. చెక్కులు తెల్లవాఱెఁ గడుచిన్నయొయారపుఁగొను మీఱెఁ జ
న్మొక్కల నల్పుసేరె జిగిపూషనిగారపుఁ జన్నుదోయి పెం
పెక్కువతేరె దట్టమయి యంతయు నారలరారె నూరువుల్
మిక్కిలి యూరె నత్తపసిమిన్నఁ గనుంగొనినంత నింతికిన్. 43

గీ. అక్కరణిఁదానుజాలింతరాలితనము,
పూనుటకుఁజాలమదిలోనఁబొగిలిముగుద
దానికిఁ గతంబుపరికించికానలేక,
యచటిమందులనయ్యెఁగాకంచునెంచి. 44

సీ. ఇంక నేమందు నట్టివానింటఁ బుట్టి,
నేఁడు పేరు పెద్దతికంబు నీటఁగలిపి
వట్టినట్టులుపడ నోడికట్టుకొంటిఁ,
గటకటా యిదినావంటిఁ గన్నెకగునె. 45

క. మిక్కిలి కటికితనంబున,
నక్కటికము లేక నుదుట నాకట్టిఁడివే
ల్పిక్కరణి మూడుబంతుల,
నక్కట నావంటిదానికా వ్రాయుట తాన్. 46

క. ఇది విన్నయమ్మలక్కలు,
మొదలంగానిత్తురె యిఁకమీఁదఁటనన్నుఁ
మది నేర మెంచుఁ దండ్రియుఁ,
బదుగురిలో వట్టిరవ్వపాలై తిఁగదా. 47

క. చెలులుఁ బుగ్గలు వొడుతురు,
నలుగురిలో నవ్వఁబొల్లు నాకని మఱియుం
దలిపొంది తండ్రికడకా
చెలువ తుదకు గుండెఱాయి చేసికొని చనెన్. 48

క. అటువంచినతల యెత్తక,
బొటబొటఁ గన్నీరు గాఱ బొటబ్రేళ్లేలం
జిటుకునబ్రాయుచు మేనొ
క్కటగడగడవడఁకఁ దండ్రికడనిలుచున్నన్. 49

గీ. కొంతవడికిని దలయెత్తికూఁతు నెదుటఁ,
జిన్నవోయినమోముతోనున్నదాని
నట్టె తిలకించి యుల్లమిట్టటులూఁగ,
డెందమున నింతసందియం బంది పలికె. 50

క. పువ్వంబోఁడిరొ యెవ్వని,
కవ్వల నే యెగ్గొనర్చి తందఱిలోనన్
రవ్వగ నోర్వం జాలక,
యెవ్వఁడు ని న్నిట్టు తిట్టె నించుకలోనఁ. 51

క. నాముందఱ నీ కీవెఱ,
పేమీ నన్నుఁగన్నతల్లి యిప్పు డిచట నీ
వేమియుఁ గొఱంత వెట్టక,
చామా యిఁకఁ దెల్పవమ్మ జరిగినదెల్లన్. 52

గీ. బ్రతికినంతతడవు పరు వన్నదియె లేక,
దల్లిదండ్రు లెపుడుఁ దలలువంపఁ
బుట్టరానియాఁడుపుట్టుగుఁ బుట్టియుఁ
గానిచేఁత కేల కడఁగితమ్మ. 53

క. మునుపటి తెలివెల్లను జ,
వ్వనరో యిపుడెందుఁ బోయె వగచెదు నిన్నే
మన నెన్నటికిం దలఁగని,
పెనురట్టుకీ మాకుఁ దెచ్చిపెట్టితి వనినన్. 54

చ. వెలవెలవోయి యచ్చెలువ వేమఱు వెల్వడి జాలువాఱుక
న్గలువలవేఁడిపీటఁ గనుకందిన కాళ్ళకు సేదదీర్చుచుం
బలుకులవిన్నఁబా టొదవ మై చెమరింప నెలుంగు రాల్పడం
బలికెఁ దమంత రాచిఱుకబారులు చేరువఁ బాఱుతేరఁగన్. 55

శా. తండ్రీ కొండొకదోస మే నెఱుఁగఁజూ తప్పెన్న మీరాయాన పె
క్కం డ్రీత్రోవను బూలు గోసిగొని యేగం జూచి డొందంబులో
వేండ్రం బౌతమి పెల్లిదం బడఁప కే వే పోయి యాతోఁట ని
ల్లాంద్రం దెల్లను వాసిగన్న చెలితో నందంద నేఁ గుమ్మరన్. 56

గీ. ఏకతంబునఁ జెరలాడ నేకతంబొ,
కాని యట నాకుఁ జెలి చెంత లేనితఱిని
నిట్టిచూ లేర్పడెఁగాని యింతకన్న,
వే తెఱుంగను మీరాయాన వేయు నేల. 57

గీ. అనిన లోపలి చూపున నరసి నిజము,
కన్నుఁగవ మ్రోలఁ గట్టినకరణిఁ దోఁపఁ
జానయెడఁ దప్పులేమికి సంతసించి,
కూఁతుఁ గనిపల్కెఁ గూరిమికోనలుసాఁగ. 58

క. అమ్మా యూరక నీపై,
నిమ్మాడ్కిన్ లేనిపోనియీనేరము నేఁ
జిమ్ముట తప్పుగఁ బట్టక,
యుమ్మలికము మాని యుండు ముల్లములోనన్. 59

క. తనుఁ గనుదానికిఁ గడుపా,
ననుచుఁ బులస్త్యుండు పలికె నది యింత కెఱుం
గనికతమున నీ వాతనిఁ,
గనుఁగొంటివి గానఁ జాలు గలిగె న్నీకున్. 60

క. ఇంతటిపని కేఁ గలుగఁగ,
వంతలఁ దలకంగ నేల వలవదు నీ కా
వంతయుఁ గొఱంత లే దిఁకఁ,
జెంతకు రమ్మంచుఁ గూఁతుఁ జేరఁగఁబిలిచెన్. 61

గీ. పిలిచి తొడమీఁదఁ గూర్చుండఁ బెట్టుకొనియు,
తండు బుగ్గలుముద్దిడినిండుతమిని
గొప్ప దువ్వుచుఁ బయిచీరకొంగు తీసి,
కనులనీ రొత్తి తడవుగఁ గౌఁగిలించి. 62

చ. చనవున లేవ నెత్తి యెలజవ్వని కేలొకచేతఁ బూని గో
బ్బునఁ దనవెంటఁ బెట్టుకొని పోయి పులస్త్యునిఁ గాంచి మ్రొక్కి యా
యనకు వెలందిఁ జూపి తగ నప్పటికట్టిడి నింతి చూలుదా
ల్చిన దగు టేర్పడం బలికి చేతులు రెండునుఁ జేర్చి యిట్లనున్. 63

గీ. తపసినై యున్నముక్కంటి కపుడు కొలువు,
గట్టురాకన్నె చేసినకరణినిపుడు
తపసినై యున్నమిమ్మునీతలిరుఁబోఁడి,
నమ్మికొలుచును బెండిలికమ్ముదీని. 64

క. ఎండల బడలినయప్పుడు,
మెం డాఁకలి గొన్నయపుడు మీకొకప్రాపై
యుండి తనయండ నిడుకొని,
పండు లోసంగులతనూనబడలికలడఁగన్. 65

గీ. అనుచుఁ జేతిలోఁ జెయివెట్టి యప్పగించి,
యతఁడు గైకొన్నపిమ్మటనల్లునొద్ద
సెలవు గైకొని కూఁతునునిలువఁబనిచి,
లేచితనయింటికేగెనా రాచతపసి. 66

క. అది మొదలుగ నాకన్నియ,
పదిలముగా మగనికూర్మి పడయంగఁ దలం
పెదలోఁ బాదలఁగ నాతని,
మదిలోపలమెలఁగుచుండెమఱపెఱుఁగనిదై. 67

సీ. ఎపుడుఁ బ్రొద్దున లేచి యేట మునిఁగి యింటి
కేతెంచునంతలో నెదురువచ్చి
యడుగుఁగెందమ్ములు కడుగుకొనఁ బసిండి
చెంబున నీ రంది చెంతనునిచి
పఱుగునఁ దననునుపైటచెఱంగున
నడుగులతడి యొత్తి యంతలోన
నుతికినతెల్లదోవతులు పింజెలు వెట్టి
చని చేతి కందిచ్చి సరస నొక్క
పీఁట వెట్టి కూర్చున్నచోఁ బెరట నున్న
పువ్వు లొకపళ్ళెరంబునఁ బోసి యొసఁగి
వార్చి యాతండు లోనికి వచ్చునంత
పిండివంటలతోఁగూడ వండి పెట్టు. 68

గీ. ఆరగించెడుతఱి నొకరోరనిలిచి,
విసరు వీవన చేఁబూని వెనుకఁబూల
పాను పొక్కటి సవరించి పవ్వళింపఁ,
దొడలపై నిడుకొని మెల్ల నడుగులొత్తు. 69

క. నడిరేయియైనఁ బలువురు,
బడిబడి నడతెంచి లేని వారికి సరిగాఁ
గుడువంగఁ బెట్టు నప్పుడ,
మడికట్టుచు వంటచేసి మరియూడమెయిన్. 70

గీ. అదనుతప్ప కుండఁగ నోరె మమరుచుటకు
నింటిలేర్పనఁ దను మఱపించుటకును
దపసియంతవాఁడును జొక్కెఁ దలిరుఁబోండ్ల
యుచ్చకంబులఁ బడనివా రెవ్వ రింక. 71

వ. అట్లు. 72

గీ. కూర్మి మగఁడు కన్నులఁ గప్పుకొనఁగనుండి
యంతకంతకు వేవిళ్ళువింతమీఱఁ
జాలఁ గసిగాటులుగఁ దిండిసలుపఁజాగె
నెలలునిండ నీళ్ళాటప్రొద్దులునుడాసె. 73

క. ముగుద యొక మంచినాఁటను
మగవానిం గనియె మగఁడు మదినుప్పొంగన్
మగవానిఁ గన్నతండ్రియు,
మగువం గన్నట్టితల్లి మక్కువపడరే. 74

సీ. ఏలొందరయు లేక యెలమిన్ట్రోఁ జుట్టముల్
నిండువేడుకఁ జెంద రెండుతలలు
కుదురుగా నేర్పడి పదినాఁడులునుజన్న
మఱునాఁడు పురిటినీళ్ళరసిపోసి

యిరువదొక్కటవనాఁ డెదఁ దలపోసి
పెద్దలు పెట్టినయొకమూర్తంబునందు
సరుదెంచి తపసియు విరిబోఁడియును బార
సాలపీఁటలమీఁద సంతసమునఁ.
గూరుచుండఁ దండ్రి కొమరున కప్పుడు,
విశ్రవసుఁ డనంగఁ బేరు వెట్టి
నాఱవనెల నోరె మమరంగ ముట్టించి
వడుగు నేఁడులేడు గడవఁ జేసె. 75

చ. పితరునిమాడ్కి విశ్రవుఁడు పిన్నటనుండియు మెండుదండియై
జతనము హెచ్చ మచ్చరముఁ జంపి వడిం జడదారిదారిఁ దా
నతివల మాని మాని తను నందఱు నందరుదందిచూడఁగా
సతమును గానలోన రెయిసైతము నీతమునిండ నుండఁగన్. 76

క. పుడమి భరద్వాజుం డను
జడదారి యొకండు తనదు చక్కనికూఁతున్
వడి దేవవర్ణి యనియెడు
పడఁతుకఁ దోడుకొని వచ్చిపలికెం బెరిమన్. 77

సీ. చెలువకన్నులడాలు చెంగల్వవిరిచాలు
వినుమడింపఁగఁజాలు నింపునింపుఁ
గొమ్మపొక్కిలి పెంపుకమ్మతావులనింపు
పొన్నక్రొన్ననసొంపు పోలుపుఁదెలుపు
మగువపన్నులతీరు మల్లెమొగ్గలపేరు
లోఁగూర్పఁగను గోరునోరవునెఱవుఁ
జానచక్కనిముక్కు సంపంగిపువ్వుటెక్కు
దాపునఁ జెయిచిక్కు నేవుఁజూపు

నువిదచేతులు పూదండలో సఁగుచుండు
నింతి నెమ్మోము విరిదమ్మి నెలమిగూర్చఁ
బూఁజనల్పెడుతఱియందుఁ బూనిమీఁకు
గట్టిగాననబోఁడిఁ జేపట్టవలయు. 78

మ. అన నెమ్మోమునఁ బిన్ననవ్వొలయ నొయ్యారంబుగా లేచి యా
యన వెంటంగొని తల్లిదండ్రులను డాయంబోయి కాన్పించి వ
చ్చినకర్జంబు కరంబు వీనులలరం జెల్వంబుగా విన్నపం
బొనరింపన్మది నుబ్బి పైకొనిరి వారొండాడఁగా లాఁతులే. 79

ఉ. అంత నొకింత మంతనమునందుఁ గొమారు తలంపెఱింగి వా
రెంతయు సంతసంబడర నింతిఁగొనం దమడెందమందు నొ
క్కింతయు నడ్డులేమి యెఱిఁగించిన మేలనివారు, దారును౯
వింతగ వియ్యమొందఁ గనువిందుగ నందఱు నందుఁ బొందుగన్. 80

సీ. తమ్ములమ్ములనంది తరువాత నిరువురు
బట్టలొండొరులకుఁ గట్టఁబెట్టి
పెండ్లిపనులుచేసి పెద్దలరావించి
తమవారితోఁ గూడి తరలివెళ్ళి
వియ్యపువా రిడ్డవిడిదిలోపల దిగి
నాల్గు నాఁడులతంతు నడపి మఱియు
నలుకపానుపు మొదలైనవేడుకలెల్ల
జరగవలసినట్లు జరగ నలరి
నాగవల్లియైన నాఁటి రేయూరేగి
యొప్పగింతలైన యుప్పుడగవు
తగవు లరణములును దగినయట్లొసంగి
పెండ్లికూఁతువారు బిడ్డనిచ్చి. 81

గీ. అంపకముసేయఁ బైనమైయపుడక దలి
పెండ్లికూఁతుఁతోఁగూడ నాపెండ్లికొమరు
నొక్కపాలకి నెక్కించియుబ్బుమీఱ
నింటికే తెంచెనుబులస్త్యుఁడింపుమెఱసి. 82

క. పిల్లదిపెద్దదియైనం
దల్లియుఁ దండ్రియును వచ్చి తమముచ్చట పెం
పెల్లను దీఱఁగఁగొమరెకుఁ
గొల్లగ సొమ్ములిడి కోర్కె కొనసాఁగంగన్. 83

క. పెనిమిటిపెండ్లాముల మం
తనమున నొకటిగ నొనర్చి తలిదండ్రులు వే
డ్కను దమయింటికిఁ బోయిన
వెనుకంజూలేరుపడియె వెలఁదికినిచటన్. 84

క. అన్ననబోఁడికడుపునం
బున్నమచందురునివంటి బుడుతఁడు వొడమెన్
గ్రొన్నెల దాలుపునాలికి
మున్నలకొమరుండు నెమ్మిఁబుట్టిన పగిదిన్. 85

ఉ. ముద్దులమూటగట్టునలబొట్టియపుట్టుకయప్డు వేలుపుం
బెద్ద పులుంగుతత్తడివి మేడుకమీఱఁగ నెక్కివచ్చి వీఁ
డద్దెసలేలు నేలికలయం దొకఁడై మఱి రొక్కవుందొరా
నద్దిర వీనిపున్నెమని యానతి యిచ్చి చనెం దనంతటన్. 86

చ. వడుగొనరించి యామొదలు ప్రాఁజదువుల్ చదివించి తండ్రి నే
ర్పడరఁ దనంతవానిగను నన్నిట దిద్దిన నాఱితేఱుటన్
విడువనిపూన్కిఁ గాలిబొటవ్రేలొకయించుక నేలమోపి న
ట్టడివిని నొంటిమైఁ దపసియై యతఁడుండెను దండ్రిపోలికన్. 87

క. వేసేఁడులు నీరానియు
వేయేఁడులు గాలిఁ గ్రోలి విడువక యాపై
వేయేండ్లోగిర మొల్లక
యాయడవిని దమ్మిచూలి నతఁడు తలంపన్. 88

ఉ. నిద్దపుఁబండువెన్నెలల నింపెడుసొంపగు ఱెక్కప్రక్కలన్
ముద్దుమెఱుంగుఁదీవియలఁ బోలినబంగరు రంగుచాఱలం
దద్దయుమించునంచపయిఁ దామరచూలి కరంబుడంబుగా
నొద్దకువచ్చి యచ్చెరువునొంది కనుంగొని నింగి సిట్లనున్. 89

క. ఎమ్ములుదక్కఁగ నొక్కటి
నెమ్మేనం గానరాదు నిలువెల్ల జెడల్
గ్రమ్మెను మెచ్చితిఁ దాల్మికిఁ
గొమ్మా యిదె కోర్కులిత్తుఁ గూరిమికుత్రా. 90

క. అని తనకమండలంబున
నునిచిన తెలినీరు మీఁద నొకయించుక చ
ల్లిన నెప్పటిమైజిగిత్రోఁ
గనుపట్టియుచటు వెలువడి కడునర్మిలితోన్. 91

మ. పెనులిబ్బిం గనుఁగొన్న పేదపగిదిం బెల్లుబ్బి కేల్దోయి మో
డ్చినిరాబారి కడానిబొజ్జగల జేజేమిన్న నగ్గించి యి
ట్లనియెం గూరిమిమీఱ నియ్యఁగదవయ్యా వేఁడెదన్నిమ్ముఁ జి
క్కనిబల్మిన్ దెసమేలుమేలుఁ బెనుపొక్కంబుండుబండారమున్. 92

చ. పనిగ సతమ్ము మిమ్మొక నెపమ్మున నెమ్మది నెమ్మి నమ్మినం
గనికరమూని వాని ముడికానిని నైనను గాతురన్న ము
మ్మనుమని నన్ను మిన్నకయ మన్ననఁ దిన్ననఁజేయు టబ్రమే
యనవుడు నన్ని నీవడిగినట్లు లొసంగితినంచు వెండియున్. 93

క. మెండుపరికించి నేర్పున
దండిమగని వల్లెత్రాడు తాల్పరినిజమున్
గొండలపిండులతెక్కలు
చెండంగలవేల్పుతేనిఁ జేవదలిర్పన్. 94

క. పొడమించి వారివరుసగఁ
బడమరదక్కినము తూర్పువై పులకు న్మా
న్నొడయలనుగాఁగఁ జేసియుఁ
గడమకడసిఁ కెవ్వఁడేలఁగలఁడనియుండన్. 95

గీ. తగినవాఁడవు దొరకితి తలఁప నేఁడు
నాదుమదినంత యంతయునడచెసిపుడు
గట్టువిల్కానితోఁ జెల్మికదలకుండు
పుష్పకంబనుత్తేరిది పుచ్చుకొమ్ము. 96

చ. చలువయు వెట్టయున్ వలయుచందముల న్నమకూర్చు ముజ్జగం
బులు దిరుగంగ నింగిపయిఁ బోవఁగవచ్చును దీనినెక్కి యు
క్కొలఁదులు తెల్పఁదెల్ప మఱిక్రొత్త లొసంగితి నీకు నింక జ
క్కులు కొలువంగ నీకొలువుకూటములోఁ గడుఁబేర్మిఁగాంచుమా.

వ. అని యొసంగి మఱియును. 98

క. కనికరమున్ గనికరమును
మనుమని మనుమని యటు పలుమాఱును దీవిం
చినలువ యిచ్చను జనియెం
దనమనికికినార మంచితనమని పొడగన్. 99

ఉ. అంచపొఱుమాయిజోదు చనినంతటఁ దండ్రిని జేరఁబోయి లో
నుంచినకూర్మి మ్రొక్కులిడి యుబ్బుచు లిబ్బులతేఁడు కాంచి దీ
వించినతండ్రిఁజూచి తమరిచ్చిన యానతి నల్వఁ గొల్చి మా
పంచినమెప్పులం బడసివచ్చియు నొక్కటి వేఁడ నోడితిన్. 100

క. పెఱవారెవ్వారలకుం
దఱియంగాఁ దగముకాని తావొక్కటి నే
నెఱి నుండుటకున్ వేఁడఁగఁ
మఱచితిఁ జోటొండుచూపి మన్నింపఁగదే. 101

క. అన ననుఁగుఁబట్టిమొగము
ల్లనఁగని కడుబుజ్జగించి లలినాతఁడెదం
గనికర మిగురొత్తంగా
వినిపించెద నిలువనెలవు వినుమని పలికెన్. 102

గీ. ఉప్పరం బంటుతరఁగలయొప్పుతోడ
విలువరతనంపుగుంపుల పెంపుతోడ
జడుపెఱుంగని గొప్పమొసళ్ళతోడ
నుప్పుసీటిసంద్రము కరంబొప్పునందు. 103

ఉ. జాలులయందు నందములచాలగు వేలుపులేటి దీటువం
గ్రాలెడుతావిప్రోవులను గమ్మనికస్తురి తావికై వడిన్
జేలలలోనఁ జీనిపనిచీర తెఱంగునఁ బూల జాపిపూ
ప్రోలిక లంక పొంకమునఁ బొల్పగుదీవుల మేలుబంతియై. 104

సీ. పలుకోటకొమ్మల మలఁచినసింగముల్
దెసయేనుఁగులనెల్ల దిగులుపఱుప
నగరియుప్పరిగలమగఱాలజగడాలు
విన్నెటిసేటిత్రో వియ్యమంద
వీటనీటుగఁ గ్రాలువెలిడాలుగమిగాలి
వేల్పు జంటలకును వేడ్కలొసఁగ
విరిదోఁట నత్తావి విన్నంటివేల్పు ప్రమా
ఘులకెల్ల గొల్లగా వలపులియ్య

గలిగెపడగంపుసోరణగంబ్లు రేలు
త్రోవలవిందున కేగంగఁ ద్రోవనూప
వీడు తొలివేల్పుగములకై విశ్వకర్మ
లంకయనుపేరజేఁసె నాలంకయందు. 105

క. వెన్నునికి వెఱచి పాఱిరి
మున్నట నున్నట్టివారు మొన్నను నిపుడా
సన్నయఱింగితి గావున
నన్నా నీవేగియుండు మచ్చట నెమ్మిన్. 106

క. క్రిందిజగమ్ముననిలిచిరి
యందలిరేద్రిమ్మరీండ్లు నచ్చట నీ కే
త్రొందరయుఁ గలుగనేరదు
నందడిచూపంగ లేరు జంకక పగరున్. 107

చ. అని సెలవియ్య నప్పలుకు లాదలఁ దాల్చికుబేరుఁ డప్పుడే
చనిచని లంకఁ జేరి పలుచందములం దను గారవంబుతో
ననయము వేల్పుపిండు గొనియాడఁగ నేలుచునుండ పుష్పకం
బొనరఁగ నెక్కివచ్చి కనుచుండును నిచ్చలుఁ దల్లిదండ్రులన్. 108

క. అని రారాజు తెఱంగిటు
వినిపింపఁగ రాముఁడలరి వింతగ మదిఁ దోఁ
చిన నచ్చెరువంది యగ
స్త్యునిఁగని యిట్లనియె వేడ్క దుడుకొనరింపన్. 109

ఉ. ఓజడదారిరాయ యిపుడుల్లము పెల్లుడుకం దొడంగె రా
రాజుకు మున్నులంకను దిరంబుగఁ గైకొని సోఁకుమూఁక లెం
తేజిగిమీఱ నేలునటులీ రిటుపల్కుట విన్ననుండి, నే
నీజగమందు రక్కసులనెల్ల బులస్త్యకొలంబు వారిఁగన్. 110

ఉ. వినుముముందు, వెండి యొకవింతగ రావణుకన్న మున్ను లం
కందగఁ జెక్కరక్కసులు గ్రాలిరంటిరి వారిపేళ్ళు నా
యందఱివంగడంబు మును పాకటివేల్పున కోడి డాఁగుటల్
సందియమాఱఁ దెల్పఁగదె సాఁగిలి మ్రొక్కెదనీకు నావ్రతున్. 111

పంచచామరము.

అగస్త్యుఁడంత జెల్వుగుల్క సందమొల్కు పల్కులం
బొగడ్తఁజేసి వాసి రామునోము గోము మీఱఁగా
జగాపగార పోరచూపు జాలువాఱఁ జూచి డం
బుగా నెలుంగు కంగుమంచు మ్రోఁగ వేగనిట్లనున్. 112

మ. తొలుత న్వెన్నునిబొడ్డుదమ్మి నలమిం దొల్వేల్పు తాఁబుట్టి యు
వ్వల మున్నీరొనరించి దానిఁ గొని కాపాడంగ మేదాల్పులం
గలిగింపం దరువాత వారలతనిన్ సంతోస మారంగ మా
వలనం గల్గినకర్జ మేమి వినిపింపంజెల్లు నా నాతఁడున్. 113

క. మిమ్మొందఱఁ గలిగించితి
నిమ్ముల నిన్నీరుప్రోవ నిప్పుడ చని మీ
నెమ్మనులమమ్ము దలఁపుచు
నెమ్మియిఁ గాచెదరొ చూతమిందఱిబలముల్. 114

క. అనిపనిచిన వల్లేయని
పనివిని మున్నీరు గాచుపని పూని కడుం
గనుకలిగియుండి యాఁకలి
గొనిడప్పికి నిలువలేక క్రోలుద మనుచున్. 115

క. తలపోసి యంతఁబొంతను
నలుమోములవేల్పుఁ గాంచి నక్కుచుఁ దమలో
వెలవెలఁబాఱుచు మిక్కిలి
యలసియు నీరానఁగొంకి యడఁకువతోఁపన్. 116

క. సాకెదమని యొకకొండలు
మైకొని రిక్క మెక్కెడమని మఱికొండలు పె
ల్లాకలి కోర్వక పలికిరి
యూకొని నెత్తమ్మిచూలి యుల్లంబలరన్. 117

క. మెక్కెడమనువారందఱు
జక్కులును బరాకులేక సాకెదమనువా
రక్కజముగ సోఁకుడులును
నిక్కముగా నాదరించు నెట్టనఁబలికెన్. 118

గీ. పెక్కురమ్మాడ్కి జక్కులురక్కసులును
బొడమిపుడమిని బాగడిక నడసిరడరి
వారిలోపల నెంతయు వాసిగనిరి
హేతియుఁబ్రహేతియు ననంగ నిరువురందు. 119

క. నెమ్మదిఁబ్రహేతి ముద్దుల
గుమ్మలకూటములు రోసి కోర్కుల నెల్లం
గ్రమ్మి తెగగోసి మిక్కిలి
ముమ్మర మగునీసు వాసి నోలుపుగనుండెన్.	120

ఉ. రెండవనిబ్బరంపురెయిదిమ్మరి తేఁడల హేతి దాడియై
పెండిలి యయ్యె నొయ్య భయపేరిటిముద్దులగుమ్మఁ గొమ్మరే
యొండను నవ్వు నవ్వు పసనింపగు దానిని నల్వయానతిన్
వెండియు డెందమందు మగబిడ్డలకై గలకూర్మి పేరిమిన్. 121

క. ఆయిరువురకుం బుట్టెను
దీయనివిల్కానితోడ దీటై యని వెన్
దీయని విద్యుత్కేశుఁడు
సోయగమున కింతు లెల్ల, సొగయుచునుండన్. 122

గీ. తల్లిదండ్రులకన్నులు చల్లఁబడఁగ
విద్దెములు చేసె గొన్నాళ్ళు వెనుకవెనుకఁ
దప్పటడుగులు పెట్టుచుఁ దడవు నడచెఁ
బిదప జిగిబిగిఁ బలుకులఁ బిలువనేర్చె. 123

క. అట్లుముద్దులు గురియుచు నలరఁ జిన్ని
తనము మెల్లన జాఱెజవ్వనము మొలిచెఁ
జిన్నవాయంపు మేనికి వన్నెయొసఁగి
కుందనంబును నెత్తావిపొందినట్లు. 124

గీ. వెడఁదఱొమ్మున నొకవింతవీఁకయొదవె
నగుమొగంబున నొకవింతజిగిదొలంకె
మీసకట్టున నొకవింతమిసిమిత్రోఁచె
హేతిపట్టికి జవ్వనమింపు మెఱయ. 125

క. అప్పగిదిముద్దుకొమరుని
యొప్పునకుం దగినయట్టియొయ్యారిని దాఁ
దప్పక పెండిలి సేయఁగ
నప్పుడుతలపోసి హేతియందఱు మెచ్చన్. 126

సీ. కవజక్కవలఁబోలి తొవపెక్కువలనేలి
చన్నులు కన్నులుచెన్నుమీఱ
జిగిపసొన్నువలెమించి తగమిన్నుఁదులకించి
మేనును గౌనును జానుమీఱ
నిరులసొంపునుమీఱి తరగగుంపును దూఱి
కురులును దరులును గొమరుమీఱ
నరఁటాకుఁగని నవ్వి మరుబాకులను రువ్వి
వీపునుజూపును వింతమీఱఁ

జిలుకపలుకులు, జెలువంబు గులుకు చెవులుఁ
నల్లుకుతోడలును నొయ్యార మొలుకునడలు
మొలకనగవును జిగిమోవి గలిగి యలరు
వెలఁది సంధ్యకూఁతును దెచ్చి పెండ్లి చేసె. 127

శా. ఆవాల్గంటియు మున్ను విన్నసిగదయ్యంబు న్మది న్నియ్యముల్
దై వారన్ వినువాఁక పెండ్లియగుచందానందగం బొండిమై
వేవేగం దొలిచూలు దాల్చి కొమరున్ వేడ్కొందుచోఁ గాంచి యా
క్రేవం గవ్వపుఁగొండదండ నిడి యేగెం బెన్మిటిం గూడగన్. 128

గీ. తగుదు రెంతటిపనికైన నఁదగవుఁదలఁప
రించుకయుబొంకఁగొంకరుమంచివాని
దలఁపుపడిరేనియే మైనఁగలయజాతు
రహాహయెంతటిజెంతలియ్యేఁడువారు. 129

క. పసిపాపఁ డేడ్వఁజొచ్చెను
దెస లెల్లనుమాఱుమ్రోయ దిగ్గన మెకముల్
వెసనులికి లేచి వెఱపున
మసలకనలు దెసలఁబాఱ మఱిమఱియుచటన్. 130

వ. అప్పుడు. 131

సీ. మొనలకైదువుత్రోడ మురిపంపుటిరిగుంపు
మఱపింపుకత్తుకయొఱపుత్రోడ
తలవాఁక జిగితోడఁ దెలిమబ్బు వెలిద్రొబ్బు
తెలిగిబ్బత తడిపాలుపుతోడ
పాపపేరులతోడఁ బగడాలజగడాల
నగఁజాలుజడల సోయగముతోడ
పునుకపళ్ళెముత్రోడ మినుముట్టఁ గనుపట్టు
పెనుగట్టు విఁటియొప్పిదముత్రోడ

చిన్నిక్రొన్నెలవెన్నెల చెన్నుతోడఁ
బేసికన్నులచిన్నెలవాసితోడ
గట్టుదొరపట్టితోఁ గూడి గట్టువిల్తుఁ
డపుడు తఱిగట్టుదరికి వయ్యాళి వెడలె. 132

గీ. మింట నిచ్చేసి యచ్చేసికంటివేల్పు
చెంత నొకవింతరొదయింతచెవులుసోఁక
నిలిచి యాలించి గాలించి నిసువు నొకని
ప్రోలఁదిలకించిపరికించిజాలిగాంచి. 133

మ. కదియంబోవుచు నున్నవేళ మలరాగారాబపుంబట్టి ప
య్యెదకొంగించుక యోరజాఱ వలచే నిట్టట్టుగా నొత్తుచున్
మదిలో నక్కటికంబు పిక్కటిలఁ గానన్వచ్చి యాబిడ్డయం
గద మాన్పందగు నంచుఁ బల్కుటయు నాక్రాల్గొంటిపైఁ గూరిమిన్.

క. జవరాలిజాలిమాటలు
జవదాఁటక చావులేక చనుబ్రతుకు దెసల్
బవరముల గెల్చుబలిమియు
దివిఁద్రిమ్మరుపీఁడుఁ దల్లిదిను సగునీడున్. 135

గీ. ఒసఁగి యేనుమోములసామి యూరకున్నఁ
గాంచిరాణియు నెనలేనికనికరమున
జవ్వనంబును బీరంబుఁజక్కఁదనముఁ
గలిగియప్పుడయొప్పఁగ గారవించె. 136

క. దేవరయును దేవేరియుఁ
గావలసినకోర్కులెల్ల గారాబముతో
దీవించి వేఁడలేఁడని
వేవేగ నొసంగబిడ్డ వేడుకఁ జెందెన్. 137

గీ. అడవిఁగని పాఱవైచినదైన బ్రతుకుఁ
దల్లికడుపుచల్లయొకింత తగ్గదేని
యింటబంగరుకొట్టిలో నిడినదైనఁ
జచ్చుఁదల్లికడుపుచల్ల చాలదేని. 138

గీ. అట్లు పసిపాప యప్పుడె యబ్బురముగ
నింపుపరువంబుఁ గైకొని నిలిచి కెలనఁ
జూపనెలదాల్పుఁ గని కూర్మి మ్రొక్కి యతని
చెలువకుఁజోహారు లొనరించి చేరికొలిచి. 139

ఉ. వారలమానసతి న్నిగులవన్నెయు వాసియుఁ గాంచిఁ వారికై
వారము చేసి పీడుకొని వా రొనరించి యొసంగినట్టియా
యూరను రక్కసుండు గనుమక్కువఁ గాపుర ముండి తద్దయుఁ
బీరముతో సుకేశుఁ డనుపేరను గౌరవ మందె నంకిలన్. 140

క. ఆతపసిపోయగముం గని
చేతులగరువంబుఁ జూచి చెలఁగుచు నిటకే
వే తగగ్రామణి యనువే
ల్పే తెంచి సుకేశుఁ గాంచియెంతయు వేడ్కన్. 141

సీ. అందంపునును జెక్కు లద్దంపుమించులు
మించులు నిద్దంపుమేనిజిగులు
కాటుక పెన్నెరుల్ తేఁటిమొత్తమ్ములు
తమ్ములు తెలివాలుతళుకుఁగనులు
నిండైనచిఱునవ్వు పండువెన్నెలనిగ్గు
నెలనిగ్గుచక్కనినెమ్మొగంబు
వన్నెబంగరుగిండ్లు వలిగబ్బిగుబ్బలు
గుబ్బలుల్ పిఱుఁదులగొనబుహొయలు

చెప్పనొప్పని యప్పొల్తియొప్పిదంబు
నట్టితనకూఁతుఁజిన్నపాయంపుదాని
నందములకెల్ల నందమై యలరుదానిఁ
దేవవతినాఁగఁ జనుదానిఁ దెచ్చియిచ్చె. 142

క. అరమరలు లేనికూర్మిలఁ
గరమరదుగఁ గలసి మెలసి కలికియు మగఁడున్
సిరివిరిబోఁడిని వెన్నునిఁ
బురుడింపుచు నరిదినెయ్యమునఁ బెనఁగొనుచున్. 143

గీ. కొన్నియేఁడులు పోఁడిమినున్నపిదప,
మాల్యవంతుఁడును సుమాలిమాలియనఁగ
బలిమిఘనులావు బీరంబుఁగలకొడుకులు
మువ్వురవ్విరిబోఁడికిఁ బుట్టిరెలమి. 144

క. ఆమువ్వురుఁ దండ్రిని లెం
దాముసు బెనుమెప్పులందఁదబు సొనరింపం
గామదిఁదలఁచి యిలువెడలి
యామునగవిసి మంచుకొండయండకుఁ గడిమిన్. 145

చ. చనిదిటమూరఁ జెట్లనునుచాయల డాయక బట్టబైల నె
క్కొనువడగాలిఁ గ్రోలి మదిఁ గొంకక యొంటికాలునం
బనుపడ నిల్చిపొల్చి నలువం దమయాదవు డెందమందు వే
డ్కనుదలపోయుచుందబుసు గాసిలిచేసిరి వారు మువ్వురున్. 146

క. జగములను దబుసువేఁడిమిఁ
బొగలెగసెను మింటమంటమొత్తము పర్వన్
వగలంబొగిలిరి వేల్పులు
బెగడొందెను జాలవేల్పుఁబెద్దయు మదిలోన్. 147

ఉ. దానికిఁ దాళఁజాలక వెతం దెఱఁగంటులు దద్దరిల్లి లో
నూనిననివ్వెఱంగదలి యూఁడనిబాడిరి తమ్మిచూలికిం
బౌనలు దీఱ రక్కసులక్రల్లదనంబులు విన్నవింపఁగాఁ
బూని కవంకదోఁప నటమున్న యతండును నిండువేడుకన్. 148

ఉ. అంచవాలుమాయి నెక్కి తెలియందపు టెక్కలడాలు నల్గడల్
ముంచుకొనంగఁ గెంపుజిగి ముక్కుమెఱుంగులు చౌకళించి మే
ల్గాంచిన జాళువాబొమిడికంబులడంబగు మానికంపుఁగ్రొ
మ్మించులతోడ మాఱ్మలయ మింటనువచ్చెను వారిజజ్ఞున్. 149

క. విచ్చేసి వారిమేనులు
మచ్చికతోఁ గేలనిమిరి మదిఁతాల్మికి లో
నచ్చెరువందుచు దీవన
లిచ్చి కనికరంబు దోఁపనిట్లని పలికెన్. 150

ఉ. రక్కసులార చేరువకు రండిదె వచ్చితి మిమ్ముఁ జేరఁగా
నిక్కరణి న్వెతల్ గుడువ నేటికి మీకిఁక లెండు తాల్మికి
న్నిక్కముగాఁగ డెంపమున నేఁగడుమెచ్చితి మీపయిం గరం
బక్కటికంబు పుట్టె నిపు డారసి కోరుఁడు కోర్కు లిచ్చెదన్. 151

క. అని పలుకుల వెలఁదుక చ
క్కని మేలిమియుం దెరవళిఁ గైకొననియొలుం
గున, దొలివేల్పావతి యి
చ్చిన విని వడి లేచి వచ్చి చిడిముడితోడన్. 152

చ. అలవలకేల నల్వ యొడ లంటినవెంటనె యట్టె త్రొంటియూ
యలసట వాసివాసిగని యారెయిద్రిమ్మరు లొక్కయుమ్మడిం
బలుకులఁ దేనియల్ దొలుకఁబాఱఁగఁ గ్రేల్గవ దోయిలించి యి
చ్చలఁదొలివేలుపుఁ బొగడఁజొఁగిరి కన్నులు విచ్చి యచ్చటన్. 153

క. జగములఁ బుట్టింపను మఱి
నెగడింపను గినుకఁ బూని నీల్గింపను మే
లుగఁ దగునెఱప్రోడపు నీ
వెగ దా నెత్తమ్మిచూలి వేలుపుఁ బెద్దా. 154

క. జత లేనిసిరులఁ దగి నీ
మతకము తెలియంగ లేక మైదాల్పు లోకల్
సతమని నమ్మ కరమ్మును
వెతలం బడి పొరలు చుంద్రు వెఱ్ఱులపగిదిన్. 155

శా. ఎందు న్నీసరి పోల్పఁగాఁ దగినవే ల్పెన్నంగ నొండొక్కఁ డీ
యందంబైనజగంబులోపలఁ గలండా పేర్కొన న్నిమ్మి మి
మ్మం దోరంబుగ నమ్మి వేఁడుకొనుటల్ ముంగొంగుబంగారుగా
ముందు న్వొంకుము నేఁడు మా కది నిజంబుం జేసి తీ వియ్యోర్దకా.

క. మాపైఁ గనికర మొలయఁగ
మాపూన్కికి మెచ్చి మమ్ము మన్నింపంగా
నోపెదవేని న్వేఁడెద
మాపయి మామేలును దమయక్కటికంబున్. 157

క. కడదొరలను బవరంబుల
నొడువం గలబల్మి మాకు నొండొరులపయిన్
విడువనికూర్మియు సిరులును
నెడపక వేలుపులవేల్ప యిప్పింపగదే. 158

గీ. అనుచుఁగొనియాడితను వేఁడఁగనికరమునఁ
గోరికలనిచ్చిలలి మెచ్చికూర్మి పేర్మిఁ

దడవు దీవించి మించినె త్తమ్మిచూలి
కదలివినుదారిఁ దనవారిఁగలసిచనియె. 159

వ. అంత. 160

ఉ. వేలుపుఁబెద్ద తా నిడినవిప్పగు మెప్పులనొప్పుమీఱి త
ద్వేలుపుఁబెద్ద లొక్కమొగి విక్కుచు నిక్కుచుఁ గండక్రొవ్వునన్
వేలుపుఁబెద్దలం గెలిచి వీరిని వారినిబోలె వారలన్
గేలి యొనర్చి పేర్చి పెనుకిన్కనుయిం జెఱఁ బెట్టె రింతులన్. 161

క. పొడిచిరి పెక్కుర జక్కుల,
జడదారులఁ గాళ్ళు రాచి చమరిరి నేలన్
గడతేర్చిరి చిలువల నొక,
కడకుం బెచ్చి పొగ రెచ్చి కలఁచిరి జగముల్.

గీ. వారు పెట్టెడిరట్టడిఁ బడఁగ లేక
యిండ్లు వాంకిండ్లు విడనాడి యెదల నోడి
కన్నకన్నవారల నెల్లఁ గాళ్ళు వట్టి
వట్టియనదలై వేల్పులు కట్టువడిరి. 163

సీ. ఒకవాడ మొకమోడకాక వేల్పుఁ గొట్టింతు
రొకవంకజము లెంకనొడిసిచఱతు
రొకచక్కి పొగరెక్కి యొడయండ్లఁబట్టింతు
రొకచాయఁదొగదాయనొదుగనడఁతు
రొకదారిజడదారి నొఱపులఁబెట్టింతు
రొకచెంతనెలనింతయుక్కడంతు
రొకమేల వినుచూలి నూరక కట్టింతు
రొకదండ జము నుండ నోలిఁ బంతు

నొక్కయిక్కను జక్కుల యుద్బంతు
నొక్కగీమునఁ బాముల నుక్కుమిగులఁ
బెక్కులాగుల నేగులఁ బెట్టుచుండ్రు
రక్కసులు ముప్పురును గ్రొవ్వ పిక్కటిలఁగ. 164

సీ. నీళ్ళమోవఁగలోఁగ నెఱిమాలి నెల దాల్పు
కనుమూయుటుఁడిగె వేగనులవేల్పు
బిచ్చకానిని జేరె వచ్చి జక్కులతేఁడు
పిచ్చుకుంటై పోయె బెగడి జముఁడు
రేలు ద్రిమ్మరుచుండెఁ దూలిరక్కసుఁ డెప్డు
వంటయిండ్ల నడంగెవచ్చిచిచ్చు
వంకల కిరవయ్యె వలగొని నీటితేఁ
డొకమూలఁ బడియుండె నొకఁడు గాలి
తక్కగలవేల్పు లెల్లను దల్లడమున
బయలు వట్టె తురుగునట్ట్బ్రతుకు గనుటె
కాక నోరి కోరె మొకింత లేక మనిరి
యకట చెప్పెడి దేమి యాయాగడంబు. 165

క. ఇక్కరణి న్ముప్పురు వా
రక్కసులుం గండకావరంబున నేరిన్
లెక్క మొనర్పక యుండిరి
యెక్కడఁ గనుఁగొన్నను దమరె యగుచుఁ గడిమిన్. 166

గీ. అంత నొకనాఁడు వేడుక లనఁగి పెనఁగఁ
బెద్దకొలువుండి ముప్పురుఁ బెం పెసంగ
వేల్పుటగసాలిఁ బిలిపించి వెరవునీటి
వలయుమరియాద లొసరించి వాని కనిరి. 167

క. ఓయీ వేల్పుల కందఱు,
కాయాకొలఁదుల నెదఱింగియందపు నెలవుల్
సేయుటవలనను నీవే,
రేయెడలను వన్నెకెక్కి యెంతయు నలమెః. 168

ఉ. కావున మాకునుం బసిఁడిగట్టున నైనను వెండికొండపై
నావల నైన మంచుమల నైనను గవ్వపుఁగొండ నైననున్
నీవెర వంతయు న్నెఱసి నిక్కపుఁజక్కనిమానికంబులఁ
ఠీవి యెలర్పఁ గూర్చి యిపుడే యొడగూర్పుము పైఁడి మేడలన్.

క. అనినఁ జేతులు మోడిచి
యను వొప్పఁగ వారిమోములందునె చూడ్కుల్
పెనఁచి యడంకువతో నిటు
పనితేఱఁ గెఱిఁగించె నతఁడు వారలతోడన్ 170

గీ. జమునికడయందుఁ బాలుపొందునంద్రమందు
నెసఁగునొకదీవి పెనుఠీవియెల్ల మెఱసి
పుడమియందును నెందును బుట్టరాని
మానికమ్ముల నిమ్ముల మలఁచి తెచ్చి. 171

ఉ. వేలుపుఱేనియానతిని వింతగఁ జేసితి నీఁడొకండు ప్రా
ల్వేలుపులార మున్ను గడువేడ్కఁ ద్రికూటముఁ నాఁగఁ బేరునఁ
గ్రాలెడుకొండకొమ్మునను నా తెలివెల్లను వెల్లడింపఁగా
నేలినవారి కయ్యదియె యిమ్మగుసిమ్మని నాకుఁ దోఁచెడుఁ. 172

సీ. ఏవీటికిని నాల్గు కేల్రివలందును జుట్టి
సంద్ర మగడ్డయె చవులు నింపు
నేయూరిపెనుకోటఁ బాయక బురుజుల
నేవున వేల్పులు కాపు గాతు

రేప్రోల వరువాత నెల్లరనిద్దుర
మిన్నేటియలుకుడు మేలుకొలుపు
నెందలిరతనాలు చింది పడఁ గడలి
తావలంబయ్యె రతనములకును
నెచటియెలఁదోఁటగమి తావి యొసఁగి మింట
వేల్పుటాండ్రకు మగలకు వేడ్క లొసఁగు
నెచటిపయ్యెర లడతేరి యెల్లయపుడు
చెల్వలయుఁ జెల్వలయు సెజ్జ చెమటలార్చు 173

వ. అట్టిసింగారంబులకుం బుట్టినిల్లును గలుములకాఁటపట్టును బీదసాదల కుంబసిండి కొటారును బెద్దలకుం బట్టుగొమ్మయు నయి లంక చె న్నలరుచున్నది. 174

ఉ. లంకను జేరి మార్తుర నలంతులఁ బాఱఁగఁదోలి నెయ్యెరం
బొంకముగాఁగఁ గల్మ్ము లిడి బ్రోచుచు మీసరిసాటివారిలో
నంకిలి లేఁ గొప్పతన మందఁగలారని వేల్పువడ్రవాఁ
డింకను గొన్నిపల్కు లెద కింపుగ మంతనమందుఁ బల్కెనన్. 175

ఉ. సంతస మంది ముందఱను సామి హసాదని పెద్దయెల్గునన్
వింతగఁ బల్కుచుం బసిఁడిబెత్తము లెత్తి యదల్చి మూఁక నం
తంతఁ దొలంగఁదోలి పణిహారులు సూరెల దారి చేయఁగాఁ
జెంతలఁ జేరి యొండొరులఁ జీరుచు దండులు వెంబడింపఁగన్. 176

గీ. కదలి పొలదిండ్లయార్పు లాకసము ముట్ట
లంకఁ జేరిరి ముగురుఁ గలంకఁ దేఱి
యంత వారలబీరంబు నలవు బలిమి
యరసి నర్మదయు నెడునచ్చెర నెలంత. 177

క. పువ్విల్తుని వాలారుం
గ్రొవ్విరితూపులొ యనంగఁ గొమరారెడు లే
జవ్వనులం దనకూఁతుల
మువ్వురఁ గొనివచ్చి యిచ్చె ముగురికి నెలమిన్. 178

వ. అందు మాల్యవంతుండు సుందరి యనుతనవెలందియందు వజ్రముష్టియు విరూపాక్షుండును దుర్ముఖుండును సుప్తఘ్నుండును యజ్ఞకోపుండును మత్తుండును మత్తుండును ననునేడుగురుకొడుకులను నిల యనుకూఁతునుం గనియె సుమాలికిఁ గేతుమతి యనుప్రోయాలి యందుఁ బ్రహస్తుండును నకంపనుండును వికటుండును శకటముఖుండును ధూమ్రాక్షుండును దండుండును సుపార్శ్వుండును సంహ్రాదియుఁ బ్రఘనుండును భాసకర్ణుండుననను పదుగురుకొడుకులును బకయుఁ బుష్పోత్కటయుఁ గైకసియుఁ గుంభినసయు నను నలువురు కూఁతులునుం గలిగిరి మాలివసుధ యనుతనవాల్గంటియందు నలుండును హరుండును సంపాతియు నను నలుగురుకొమాళ్ళఁ గాంచె వారె విభీషణునకుం జొగ్గడలై వెగ్గలంపు టగ్గలికలం జెన్నుమీఱిరి.

గీ. ఇట్లు తామరతంపరై యేపుఁ జెంది
జగములం దెందు నెవ్వారి సరకు గొనక
విఱ్ఱవీఁగుచుఁ గొడుకుల వెంటఁ గొనుచు
ముజ్జగంబులుఁ గలఁచి రాపొలసుదిండ్లు. 180

ఉ. వారలరాయిడి న్నొగిలి వాంచినవెల్లలనిమోముఁదమ్ములం
గూరిన నెవ్వగం గదలి కోరిక లీరిక లెత్త వేల్పులె
వ్వారలఁ జేరువార మిఁక వాసిగ నుండఁగ నెద్ది తావిఁకె
వ్వారికి విన్నవింపుదుము వారలయాఁతడి యంచు నెంచుచున్. 181

క. ఆరసి కర్జముఁ గని యి
బ్బారిని నలమలవిలుగలవాఁడడఁపంగా
నేరుచు నని పొంగి వడిం
జేరి రొకట వెండికొండచెంగటి కెలమిన్. 182

వ. అటువలె వెండికొండఁ దఱియం జని మేలిమిగద్దెమీఁదన
చొప్పుటఁ గొలువుండి వేడుకలఁజొక్కెడు మిక్కిలికంటిదేవరం
బొటపొలఁ గన్నులం దొరఁగి ముమ్మరమైచను నీటిజాలుతో
నటమటమారఁ గాంచి మది నళ్ళుచు నెయ్యముచుం బునంగొనన్.

గీ. ఒదుఁగువాటున నిలుచుండి యొక్క పెట్టఁ
జేతులు మొగిడ్చి జోహారుఁ జేసి నిలిచి
వేల్పు లెకిమీఁదు మున్నుగా వేల్పులెల్ల
నెలుఁగు నెత్తుకఁ దగులంగ నిట్టు లనిరి. 184

గీ. ననుమోములవేలుపా యిదె జోహారు
ఇవముగుబ్బలియల్లుఁడ యిదె జోహారు
ఇంచువిలు కానిపగవాఁడ యిదె జోహారు
ఎక్కుడుకనులదేవరా యిదె జోహారు. 185

చ. ఉడుగనికిస్కత్రోఁ గదలి యొక్కట నెక్కడ గన్నఁదామయై
కడఁక సుకేశుబిడ్డలు జగంబుల నేఁపఁగఁ దల్లడిల్లి యి
య్యెడలను ముజ్జగంబులను నేలెడు దేవర వీవటంచు నీ
యడుగులు పట్ట వచ్చితిమి యారసి మా మొఱలాలకింపవే. 186

క. కాల్చిరి జన్నపుసాలలు
కూల్చిరి దేవళము లెల్ల గోడలతోడన్
బీల్చిరి మానిసినెత్తురు
రాల్చిరి యేలికలతలలు రవణంబులతోడన్. 187

ఉ. ఏమనిచెప్పువార మలయార స మప్పొలదిండ్ల బారిచే
నేమును బోవఁగా వెఱతు మెప్పుడు జన్నపుఁబాళ్లు గైకొనం
దామును గుట్టుమీఱి జడదారులు మానిరిముక్కుపట్టఁగన్
బ్రేముడి బొట్టియల్ విడిచిపెట్టిరి యొజ్జలమోము చూడఁగన్. 188

క. మేమే జేజేదొరలము,
మేమే జగములనునెల్ల మిన్నల మనుచున్
బాము లిడం దొరఁకొని రా,
బాములు కడత్తేర్చి మమ్ముబ్రతికింపఁగదే. 189

క. అని మ్రొక్కి తన్ను వేఁడిన
వినుసిగరాయండు వారి విన్నప మెల్లన్
విని కనికర మెదఁ బొదలఁగఁ
గనుఁగొనలం బిన్ననవ్వు గదురఁగఁ బలికెన్. 190

క. మీముందఱ నిజ మాడెద
మోమోటలు కట్టిపెట్టి మొఱకుల వారిన్
నే మడఁపనోప వెన్నని
సేమంబునఁ గానఁబొండుఁ జేకుఱుఁ గోర్కుల్. 191

క. వెన్నుఁడు దక్కఁగ నొండొకఁ
డెన్నఁడు గెడపంగఁజాలఁ డీరక్కసులం
దిన్నఁగ మీ రిపు డాతం
డున్నెడ కరుగుండు నెమ్మి యుల్లము గదురన్. 192

క. ఆకై వడి మలవిలుతుఁడు
మూఁకగఁ దను వేఁడు వేలుపులతో ననఁగా
నేకడఁ గొలిచెడివారలఁ
జేకొని కాపాడ మీకె చెల్లు నటంచున్. 193

క. ముక్కంటి స్నేడ్కాని వా
గొక్కట వెలికొండ వెడలి యొండొరుఁ గనుమన్
మిక్కిలి పొంగి చెలంగెడి
యక్కడిపాల్కడలిఁ గాంచి యం దొకదీవిన్. 194

క. కడలికిఁ బొడవనఁగాఁ గడు
బెడఁగగునొకవీడు చూచి పెంపుగ దానిన్
దడ వబ్బురపడి చూచుచు
నెడ నెడఁ గలవింత లెల్ల నేర్పడఁ దమలోన్. 195

గీ. చెప్పి మెచ్చుచు నొక్కింతసేపు మసలి
యొక్కచక్కని జక్కనిచెక్కడంపుఁ
బనులఁ జెలువొందుపొగడొందుపసిఁడికోటఁ
గనులవిందుగఁ బొడగాంచి కనఁ దలంచి. 196

గీ. చొచ్చి యచ్చంపుఁబచ్చలమెచ్చు హెచ్చు
కట్టడపుఁద్రోవ క్రేవల బిట్టు నడిచి
యవల మగరాలజిగి చాల నలమ నలరు
తళుకు లీనెడువెన్నునినెలవుచేరి. 197

సీ. పొంగారుబంగారురంగుకంబంబులఁ
జలువచప్పరములు చెలువునింప
సరిమించుసిరిగంచు వరిగంచుటందంపుఁ
జందువామిసమిసల్ చొకళింప
వగఁగ్రాలుపగడాల మొగరాలగుంపుల
కెంపులు క్రేవలఁ గ్రేళ్ళుదాఁట
మెఱుఁగూని దొరలేని నెఱమానికపుఁబెద్ద
గద్దెలనిగ్గులు గందుమిగుల

వెన్నుఁ బొడగనుకడఁకను వేడు కార
నిలువఁ దీఱక యూఱక నెట్టికొనుచు
వెంటఁ దనవారిఁ గొని పాఱువేల్పు ఱేఁడు
వేయికన్నులు చాలక వెఱఁగు చెందె. 198

చ. జిగిమగఱాలనేలసయిఁ జెట్టులుఁ బట్టులుఁ దీర్చి కూర్చి సొం
పుగ నమరించినట్టి నునుఁబుత్తడికంబపుగుంపుమీఁదిపెన్
బగడఁపుదూలపుంగములపై దెలిముత్తెపుఁబాలగచ్చుతో
నిగనిగలాడఁ బోఁడిమిని నెట్టనఁగట్టిన మేడలోపలన్. 199

క. వెన్నుం డుండుట విని చని
క్రన్ననఁ జూడఁ దఱియౌనో కాదో యని యం
తన్నిలిచి మొక్క కలికిని
విన్నప మొనరింపు మనుచు వేఁడిరి వేల్పుల్. 200

వ. అదియునుం జని. 201

సీ. మొనపంటఁ గొన యంటికొను మంచు లచ్చికిఁ
దెలియాకుమడుపు లందిచ్చువాని
సిరిగంద మదె చించెఁ జేర రమ్మని నేల
గుబ్బెతచెక్కిలి గొట్టువాని
తనుఁజూచి తఱివేచి చనవొప్పఁ గనుఁగీటు
నీళ్ళతోఁ జిఱునవ్వు నెఱపువాని
నెవరందొ మువురందు హెచ్చుకూరిమి నాకుఁ
జెప్పుకొండని నవ్వి చెలఁగువాని
బచ్చివలపుగ ముచ్చటల్ పలుకువాని
వెన్నుఁ గని మ్రొక్కి వాకిట వేల్పు లెల్ల

సామి నిలుచున్నవా రని చనవుకతన
మనవిచేసిన రమ్మను మనుచుఁ బలికె. 202

క. అరుదెమ్మని సెల విచ్చిన
నరిగి సరగను బణిహారు లావేల్పులతో
దొరవా రిట మిముఁ దోడ్కొని
యరుదేరఁగ మమ్ముఁబుచ్చి రనుచుం దెలుపన్. 203

గీ. వార లాదటఁ జనుదెంచి వరుసతోడ
వెన్నునకుఁ బెక్కు తెఱఁగుల వేఱువేఱ
మ్రొక్కు లిడి పొగడ్తలు దెసల్ మ్రోయఁజేసి
విన్నవించిరి తమపడ్డ వెతల నిట్లు. 204

చ. పొగరున రక్కసీంద్రుఁడు తగమువ్వురుఁ బ్రోవుగఁ గూడి దాడిమై
జగములు గాసిచేసెదరు చావకమానెడు మేను పూనుటన్
మిగులఁగ వంతల న్నొగిలి మీకడ కిట్లరుదేరఁగల్గె మా
యొగు లడఁగించి ప్రోవఁగదవే యిదె వేఁడెద మెల్లవారమున్. 205

సీ. నెఱమగంటిమి మాని నీళ్ళుమోవఁగ లోఁగి
వెలియైనమలవిల్తు బలిమియెంత
మాఱువేసము పూని మఱి సీరుమాఱిన
పచ్చదుప్పటివానిబలిమియెంత
ముదిమదిపోయి ప్రాఁజదువులు గోల్పడి
తలగొట్లఁబడుతాతబలిమియెంత
గోడవలుపడి కోడికూఁతకూసినయట్టి
యలవేల్పురాయని బలిమియెంత
నిదురయన్నది యెన్నఁడు వదలి తిరుగు
లాఁతితెఱగంటిదంటలచేతిబలిమి

యెంచ నఱియెంత మా కని యించుకైన
లెక్కసేయవు మాటలు పెక్కులేల. 206

గీ. ఏమిచెప్పుకొనుదుము మాసామి నీకు
వారు పఱచెడునొప్పుల వనరునప్పు
డెంతొ గోసంబుచేయువా రిట్టివేల్పు
బ్రదుకఁ జెందుదుఁగనియెంతు మొదలలోన. 207

గీ. ఇచ్చ మానుసులను జూడ ముచ్చటగును,
జావుగలిగినవారలచంద మరసి
నేలలోన తాను గలిగింపఁ జాలఁడయ్యెఁ
జావు మాకని నలువపై నేవవొడము. 208

సీ. బెడిదంబుగాఁ గేల నడిదంబు పూనిన
మేటిరక్కసులకుఁ జేటు మూఁడు
బిగివింటి నాగినంటి తెగనిండఁ దీసిన
బిరుదుదండుల కేండ్లు వేయు నిండుఁ
బులుఁగుతత్తడి నెక్కి పొలికలనికి నేగ
నొప్పువారలయుసులు లేగు
నెదలోనఁ గన లూని యించుకచూచినఁ
గానివారలపిండు గం డడంగు
బటువుకైదువు తనరార దిటముమీఱ,
బంటులను గాచుపని పూని వచ్చితేని
తలఁక కెవ్వాఁడు చివ్వకు నిలుచువాఁడు
జాలమేలను గైగొమ్ము సరగమమ్ము. 209

క. అని విన్నఁదనము తోఁపఁగ,
మనవి యొనర్పంగ వారి మన్ననతోడం
గనుఁగొని వెన్నుం డిట్లని,
కనికరమున నానతిచ్చెఁ గరఁగినమదితోన్. 210

చ. ఎఱుఁగుదు రక్కసుల్ నలువయిచ్చిన మెప్పుల నొప్పుమీఱి పల్
తెఱఁగుల మిమ్ము నొంచుటయుఁ దీఱిచియాఱడి కోర్వలేక యం
దఱు మలపిల్తుఁ గొల్చుటయు నన్గన నాతఁడు మిమ్ముఁ బుచ్చు టే
నెఱుఁగుదు వేల్పులార చనుఁ డిండ్లకు వారలరూపు మాపెదన్.

క. అమ్ములవానలు గురియుచు,
నెమ్ములు విఱుగంగ మొత్తియొవ రడ్డయినన్
నమ్మఁడు జముకడ కనిచెద,
నిమ్ములనుండుండు మీర లెల్లరు నింకన్. 212

గీ. అట్టికరమును గనికరముట్టిపడెను,
వెన్నుపలుకులు వీనులవిందుగొలుప
నెదలఁ బొదలెడునుదిలల వదలికదలి,
యిమ్ములకు నేగి రిమ్ముల నెల్లవారు. 213

గీ. అట్లుజేజేలు తమయిండ్లకరిగినంత,
నంతయును వేగరులు తెల్ప నాలకించి
మాల్యవంతుఁడుతమ్ములమంతనమునఁ,
బిలువగానంపియొరులకుఁదెలియకుండ. 214

గీ. తగవుదోఁపంగ నిట్లనెఁదమ్ములార,
వినరుగా నేటిప్రొద్దొక వింతవింటి
వెఱచి మొన్న నీనడుమను వేల్పులేమొ,
గట్టువిల్కానియొద్దకు నట్టెయేగి. 215

క. కని వేనవేల తెఱఁగులఁ,
గనికరం మెసఁబుట్ట నోటికసితీఱంగా
మనయాగడంబు లెల్లను,
మనవి యొనర్చుచు నటుపయి మముమీబంట్లన్. 216

క. నిలువంగనీయ రెందును,
బలియురు రక్కసులు వారిబాఱికి మమ్ముం
దోలఁగించి యేలకుండినఁ,
గలరేయెందైన మాకు గాదిలిచుట్టల్. 217

చ. అని మొఱవెట్టఁ జొచ్చిరట యాపయి నౌదలయూఁచి యాతఁడున్
గనికర ముప్పతిల్ల గడకంటనుగన్గొని వారిఁగూల్పఁగా
వినుఁడిదె యున్నరూపు వినిపించెద నోపను నేను వెన్నునిం
గనుఁడతఁడయ్యె నేసి మిముఁగావఁగ జాలినవాఁడు పోఁడిమిన్. 218

గీ. అనుచు నానతియిడెనఁట యాపలుకులు,
చెవిని వేసికొని పసిండిచేలవానిఁ
గానఁగాఁబోయి మ్రొక్కులు వేనవేలు,
సలిపి విన్నవించిరఁటపై చందమునను. 219

మత్తకోకిల. అంతటం గరివేల్పు వారలయందుఁ బ్రేమడిమీఱఁగా
నేఁతకై నను నేను గల్గఁగ నేల నొవ్వఁగ మీకిఁకన్
బ్రంతు రక్కసిఱేండ్ల ముప్పురదొడ్డదూపుల వ్రేల్మిడిన్
వంతలేటికిఁ బొండు గీములవంక నందఱు నెమ్మితోన్. 220

క. అనివీడుకొల్ప వెల్వడి,
కనుసైగలు చేసికొంచుఁ గైదండలతోఁ
బెనుసందడి సేయుచు వే,
చనిరఁట యావేల్పు లెదల సంతసమారన్. 221

ఉ. వేల్పులపాలివాఁడు కఱివేల్పుతఁ డిచ్చినబాస తప్పునే
తెల్పెదనట్టులైన నసిదీఱుచు వారలఫ్రాన్సికయెల్లఁ దో
ల్వ్యాల్పులమంచు నివ్వరినివిక్కుచు తెక్కయొనర్ప కక్కటా
సల్పితిమట్టివాని కెకసక్కెము క్రొవ్విన జేటుమూఁడదే. 222

క. తనబలిమి యెదిరిబలిమియుఁ
గనుఁగొనఁగాలేక త్రుళ్ళి గావరమున నొ
ప్పనివేరము ఫ్రానితిమిటు,
మనఃపొగరులె యింతచేసె మఱియేమిటికిన్. 223

అభాగ్యోపాఖ్యానము.

హాస్యప్రబంధము



By

K. VEERESALINGAM

అభాగ్యోపాఖ్యానము.

హాస్యప్రబంధము.

క. శ్రీరమణీహృల్లోలా। కారుణ్యాలవాల కాంచనచేలా
ఘోరాహవజయశీలా। శ్రీరాజమహేంద్రవరపురీగోపాలా 1

వ. భవదీయకరుణాకటాక్ష వీక్షాసమాసాదిత సరసకవిత్వ పటుత్వంబు
పెంపున నేఁగల్పింపంబూనిన హాస్యరసప్రధానంబగు నభాగ్యోపా
ఖ్యానంబునకుఁ గథాక్రమంబెట్టిదనిన. 2

క. అడవులలోఁగడునిడుమలు
గుడుచుచుధర్మాత్మజుండు కొందలపడఁగన్
వడిఁ బరిహాసకుఁడొకఁడ
య్యెడకనుజనుదెంచి మ్రొక్కి యీకథచెప్పెన్. 3

గీ. వింధ్యధాత్రీధరప్రాంత వంధ్యభూమి
జలములేనట్టిదొకపాడు కొలనుదరిని
దండకారణ్యమధ్యంబుఁ దనరఁజేయుఁ
బాపసదనంబు వ్యాఘ్రాఖ్యపట్టణంబు. 4

క. ఆపురము లచ్చియప్పకుఁ
గాపురము జగంబులందుఁ గలపురములలోఁ
గాపురము పాపసమితికి
దాపురము మహాపుర మలదానవతతికిన్. 5

క. అన్నగరంబునఁ గరము
భ్యున్నతివహించుకుజనపుంగవకోటి
లోన్నతి కోడుటఁ గాదే
పన్నగకులమెల్లఁజేరెఁ బాతాళంబున్. 6

సీ. కైఁ మాలినింటనె విడియించి దానిఁచేఁ
దిట్లనుదన్నులుఁ దినెడువారు
తల్లిపోయిననాఁడు దానింటనేయుండి
పనియున్నదిదెవత్తు ననెడివారు
కన్నతికముచేయు కార్యంబునకుఁ బూర్వ
లార్జించు మాన్యమ్ములమ్మువారు
భోగకాంతలుగాక పొరుగువారల భార్య
లనుజేరి సౌఖ్యంబుగనెడువారు
విలువసారాయిసీసాలకొలఁదిఁద్రావి
యొడలుదెలియక వీధులఁబడెడువారు
నగుచుమర్యాదలనుగాంతు రనవరతము
బ్రాహ్మణోత్తములాదివ్యపట్టణమున 7

చ. కురుబలముం గనుంగొనుచుఁ గోటితురంగ జవంబుతోడ ను
త్తరుఁ డరదంబుడిగ్గి పురితట్టునఁ బాటియుఁ గ్రీడిప్రేరణన్
మరలఁగఁ బోరికేఁగుటకు నవ్వుచునుందురు పోటుబంటులై
పిఱికితనంబునం బురిని బేరువహించినరాజపుంగవుల్. 8

గీ. బియ్యమున వడ్లు బెడ్డలు పెక్కుగలిపి
నేతిలో నంటిపండ్లను నెరయబిసికి
తప్పుతూనికతూచుచుఁ దక్కువగను
గొలుచుచును గోమటులు సొమ్ముఁగూర్చుకొంద్రు. 9

గీ కూటసాక్ష్యంబు బ్రాహ్మణగురులవలన
బాగుగా నేర్చుకొని పాటుపడుటమఱచి
జూదములదొంగతనముల శూరులగుచు
శోభఁగాంతురు పురిలోనశూద్రజనులు. 10

చ. తనకలుముండ్ల వాఁడిమిని దప్పక వానవువ్రజమున్ జయిం
ప నతిదృఢంపుమట్ల లనుమైమఱునొవ్వఁగనేగి ముండ్లచే
ననిఁ గులిశంబు గెల్చి తనకడ్డగువేల్పులకండలొల్చి తా
నానరెననంగ బ్రహ్మజెము డొప్పగు నెజ్జుసికండ్లగుంపుతోన్ 11

చ. పురిఁ దగుఁ జుట్టునుంగదిసి భూరిభయంకరలీల దట్టమై
పెరిఁగినగచ్చపెక్ బొదలు పెట్టసికోటగ లోసియీాతచాల్
బురుజులుగాఁగ, దాపునను బొల్చినతుమ్మలు పెద్దముండ్లతో
నురియలుదూసి సద్భటులు స్రుక్కక కావలిగాచుతీరుగాక్. 12

సీ. మార్దవం బన్యాయమార్గవాక్కులయంద
సాహసంబాహారసమయమంద
ప్రజ్ఞయంతయును దంభములుకొట్టుట యంద
తాంత బంటుతనము వంటయింటి దుంద
మితభాషణము శ్రోత్రతతులచక్కలయంద
కలిమి పురంధ్రులకొనులంద
నిలుకడ నెలఁతల నేత్రయుగ్మమునంద
ధైర్యంబు పెద్దలతరుముటంద
పడి లతాంగుల వంకరనడలయంద
శాంతియెంతయు దుష్కర్మసహానమంద
కాని మఱియెందు వెదకినఁ గానరాద
నంగఁ దద్దయు నాపట్టణము వెలుంగు. 13

గీ. తివిరి పాపపుంజంబు మూర్తీభవించి
వచ్చిగుమిగూడి ప్రోల్చొరఁ బాఱుకరణిఁ
బందిగున్నలు చెరలాడు సందులందు
దున్నపోతులకై వడిఁ జెన్నుమీాఱి. 14

గీ. చేరినిల్చిన వంటయిల్ చేరినిల్చు
గానవచ్చినఁ బరువెత్తి కానసొచ్చు
డంబుమీఱిన భటసమూహంబుతోడ
సాటియౌదురె మానవకోటినెవరు. 15

గీ. పీటఁగల్గిన ఘోటకకోటితోడ
నిలిచిప్రాఁకంగనేరక నీరుసొచ్చె
వెఱచి తాఁబేటిగుంపులు వేయునేల
పురినిబుట్టిన నుక్కైకొనఁబుచ్చిపోవు. 16

చ. దనుజులు మర్త్యులందునిమిత్త తనుమాంసము మెక్కిపోవఁగా
నెనసి పురంబునన్గలడల నెమ్ములరాసులు భూధరంబుల
ట్లనుపమలీలనుండఁ బ్రమథావళితోడ మనోజవైరి యా
మనికికి వెండికొండయని మాటికివచ్చుఁ బరిభ్రమింపుచున్. 17

ఉ. కొంపలమీఁదితుక్కుఁగరఁగొట్టుకుపోవఁగఁ దూముకాల్వలోఁ
గంపునుగూడి తోఁటలనుగల్గిన కుక్కపొగాకుచెట్లబల్
గుంపులవాసనంగలిగి కుప్పలు నిప్పులు రాల వేఁడితో
ముంపుచు వాయువుల్పొలయు ముక్కునవెంట్రుకలెల్లమాడగన్. 18

ఉ. అంగనలూర మెల్లఁ జనునప్పుడు కూడెదమంచు లేళ్ళుఁ జి
వ్వంగుఁలుజేరి యోటుపడువారినిఁ గెల్చినవారుమ్రింగఁగాఁ
బొంగుచుఁ బన్నిదంబడఁచి పోవఁగఁజాలక లేడులోడఁజి
వ్వంగులు గెల్చెఁ గానియెడ వానికి లేళ్ళను జంపనేటికిన్. 19

ఉ. ఆపురమేలు రాక్షసమహాకులవారధిబాడబుండు, కా
శీపురనాథవిష్ణుసరసీరుహసంభవపాదభక్త సం
తాపకరుండు, పుణ్యవసుధాధర వజ్రధరుండు, ప్రోల్లస
త్పాపధనంజయానిలుఁడు, దానవుఁ డొక్కఁ డభాగ్యనాముఁడై. 20

సీ. వానిముష్కర్తితో వాసిచెందఁగఁ బూని
కుందుచుఁజీఁకట్లు గుహలనడఁగె
వానిమైబిగిత్తోడ వాదులాడఁగఁబూని
ఖడ్గమృగంబులు కానడాగె
వానిచాపలముతోఁ బ్రతిఁబొందఁగాఁ బూని
వానరజాలంబు వనముదూఱె
వానిమాంద్యముతో సమానంబురాఁబూని
దున్నలు బురదలోఁ దొర్లఁదొడఁగె
వానిక్రౌర్యంబుతో దినుసూనఁబూనిఁ
జడసి వ్యాఘ్రంబు లడవిలోనంచరించె
వానికంఠస్వరంబుతో వాదుపూని
పొరలె గార్దభబృందంబు బూదిలోన. 21

క. నిరతము శంభునిపూజలు
కరమొనరుచుచుండు పక్షికంఠుఁడు సరియే
పరమాధమగుణుఁడగునీ
హరదూషణపరున కవని వ్యభిచారమునన్. 22

క. వదలక వారలసమ్మతి
ముదమున దినమొకని బకుఁడుపాలియించెను వీఁ
డదరక బలవంతంబుగఁ
బదుగుర నూర్వ్వరదినంబుఁ బట్టివధించున్. 23

క. ధీరహితుండై తగియు న
ధీరహితుండై ధరిత్రి దీనత నేలెన్
గ్రూరాగ్రేసరుఁ డావిబు
ధారాతి తనదుచరిత్ర మతిచిత్రముగాన్. 24

ఉ. అతనికిఁ బొట్టకోసినను నక్షర మొక్కటిలేదు ; కాగడన్
వెతకినఁ దెల్విలేదు ; దయ వీసమునుం గలనైన లేదు ; ప్రో
న్నతనయవిద్య లేదు పదునాల్గుపుటంబులు వెట్టికాల్చినన్ ;
జతురత వాతపెట్టినను సత్యముజిహ్వకు రాదొకప్పుడున్. 25

వ. అతం డొక్కనాఁడుఁ 26

సీ. ఒకదిక్కుననుగుక్కలొకగుక్కగాఁగూయ
నొకచెంతబలుగుంతలోలసియార్వ
నొకమూలఖరజాల మురుతీలనోండ్రింప
నొకచోట గుడిసేటియువతులడల
నొకదండముదిముండ లొకదండుగాఁగూడ
నొకవంకబలుకుంక లొదిగియుండ
నొకపొంతఁగడముంత లొకదొంతరగనుండ
నొకక్రేవమధుసేవ లొనరఁజేయఁ
బెంటపోగులుఁ జీపుళ్ళుఁ బేడకుప్పఁ
లలుకుగుడ్డలుఁ గోడియాఁకలునుదనర
డంబుమీఱిన శునకాసనంబునందుఁ
గొలువులోఁ జచ్చినట్టులు కూరుచుండె. 27

ఉ. ఆగతిఁ గొల్వులోన దనుజాధముఁడుండి గులామునొక్కనిన్
వేగమపిల్చి వేఁటపయి వేడుకనాకిపుడుద్భవిల్లె వే
వేగము వేఁటకాండ్ర మనవేపులఁ దోడ్కొనిరమ్ము నావుడున్
సాగి యతండు చచ్చిచెడి చాలఁగఁ జెప్పినరీతిఁ జేసినన్ 28

గీ. ముడ్డియెండియున్న మొద్దుగుఱ్ఱముమీఁదఁ
గదలకుండ నెక్కి కాళ్ళు నేలఁ
దగులగూరుచుండి తక్కినవారలు
వెనుకఁజేరితోల వెడలెనతఁడు. 29

వ. అట్లుమిడిమిడియెండం గాళ్ళుగాల నెత్తిమాడఁ బురంబువెడలి. 30

చ. మలమున మూఁగునీఁగలక్రమంబునఁ బీనుఁగుచుట్టుఁ జేరున
క్కలగతిఁ బుల్లెపైఁగవియుకాకులకై వడి వేఁటకాండ్రుఁ గు
క్కలు సరదార్లు నల్గడలఁ గ్రమ్మరయంబున నేగుదేరఁగా
వెడలె నతండు కాకములు వేపులు నక్కలుఁ గూయుచుండఁగన్. 31

వ. అంత 32

చ. దనుజునిఁజూడ నూత్నతర దారుణనేత్ర యొకర్తు ముందుగా
నెనసిన మొండిగోడపయి నెక్కినముద్దియమోర్తువచ్చి తా
వెనుకకుఁద్రోచె నందునను వెన్కకునెమ్ములు రాలఁగూలి మా
నిని వెసమూర్ఛపోయె వడి వెచ్చెలు లేడిచి రొక్కపెట్టునన్. 33

ఉ. పీతశిరోజ యొక్కరిత వే దనుజుంగన గోడయెక్కి యు
ర్వీతలమందు జాఱిపడి రింగున దొర్లుచు దైత్యుఁజేరె ని
ర్భీతమనోజ్ఞయె కలన బీరమునం దనుగెల్వఁ జాలుబం
భ్రాతుల డించి తన్నుఁగొని గ్రక్కునఁ బొమ్మని వేఁడవచ్చెనాన్. 34

ఉ. బాడిదచెట్టు శుష్కకుచభాగ యొకర్తు నరాశనాథమున్
జూడఁగనెక్కఁ దన్మహిజసూనచయం బొగి నెందుకాయలం
గూడి సుపర్వనై రిపయి గుంపులుగాఁ బడుపెంపువోల్చెఁ బె
న్వేఁడిమి మింట దైత్యుపయి వేలువులుల్కలు రాల్చిరోయనన్. 35

చ. అటుచని యూరబైటఁ గలయుంజరియించుచు నొక్కతావునన్
బెటుకున ముందుగాఁ జెవులపిల్లిని గన్గొని కుక్క గుంపులన్
బటుమతి దానిపైఁ గవియఁబంపగ నవ్వియు నేగిక్రమ్మఱన్
దటుకున వచ్చెఁ గాట్లుపడి తత్పురికుక్కల ధైర్యమేమనన్. 36

ఉ. అవ్వల నూరఁబందియొక టడ్డమువచ్చినఁ దద్భటావళుల్
చివ్వకు నీటెలంగొనుచు శీఘ్రము పర్విడఁ బంది వారలన్

దవ్వులఁజూచి లో బెదరి దారుణభంగిని ఘుర్ఘురింపఁగా
నెవ్వడిఁ బాఱిరాభటులు నిల్వక దానికిలోంగ కుర్కునన్. 37

గీ. పందిఁబోడువంగ వచ్చినభటచయంబు
బెండువడిపంద తోడనే బెదరియుఱికె
శశముఁ బట్టంగవచ్చిన సారమేయ
వితతి శశకంబుతోడనే వెనుకఁ దిరిగె. 38

వ. ఇట్లు భటశ్వానంబులు బెదరి చెదరిన రాక్షసాధ్యక్షుండు రూతువీక్ష
ణుండయి కుర్కుర మర్కటమార్జాల శశకాద్య నేకాక్షుద్రమృగ
కులంబులఁ బొలియించి మృగయావినోదంబు సలుపుచుండనొక్కచో
నొకతెరుక్షువు వీక్షించి తురంగంబు భయాకులాంతరంగంబయి యికి
లించుచు నపరాహ్ణసమయంబున సరోవర సమీపంబున బురదనేల
నతనిం గూలవైచి చనిన యనంతరంబ యింతకుమున్న విట్బరం
బుచే దఱుమంబడి యచ్చట డాఁగియున్న భృత్యుండొక్కరుండు
చనుదెంచి లేవనెత్తెన. 39

గీ. బురద తుడిచికొనుచుఁ బొక్కుచుఁ జనుదెంచి
యతని గ్రుచ్చియెత్తి యాదరించి
పందిచేతఁబడక పఱచివచ్చినయట్టి
పౌరుషంబుకొంత ప్రస్తుతించె. 40

వ. అట్లు సేదతేఱి తీరస్థితవటమహీరుహచ్ఛాయం జేరి భృత్యసహితం
బుగా నందు విశ్రమించియున్న యవసరంబున. 41

చ. శునకమురోదనంబుగతి సూకరనాదముభంగి గార్దభ
స్వనమువిధంబునన్ ప్రబలసైరిభరావము పోల్కి దవ్వులన్
వినఁబడె రాక్షసాధమునివీనుల కెంతయు విందుసేయుచున్
ఘనవినదంబు భూమిధరగహ్వరజాలము మాఱుమ్రోయఁగన్. 42

శా. ఆనాదం బతఁడాలకించి మది నాహా యంచు భావించి చి
త్తానందంబున భృత్యునింబిలిచి నీవాచప్పుడే తెంచుసు
స్థానంబారసి వేగ మాధ్వని ప్రభూతంబౌటకుం గారణం
బానందంబునఁ జేరఁబోయి కనిరమ్మా యెవ్వరట్లార్చిరో. 43

క. ఆనాదము విన్నంతనె
మానసమున కెన్నరాని మమతజనించెన్
శ్వాననినాదమొ యొకఖర
యాననినాదంబొ వేగ నారసి చెపుమా. 44

చ. అనవిని భృత్యుఁ డాక్షణమ యానతిగైకొని గట్టుడిగ్గి కా
ళ్ళను బెనుముండ్లు గ్రుచ్చుకొనలాగు మ్రొగ్గుచు వేగ లేచుచున్
జనిచని డొంకముండ్లమెయి సర్వముఁ జీరుకుపోవ నోర్చుచున్
బానుపడుచున్న పాడుగుడిపొంతను మొద్దగుచాపరాతిపైన్. 45

మ. కనియెన్ దానవదూత సూక్ష్మనయనన్ గాలాంతకాకార ని
ర్ధనజీవన్ ఖరవాణిఁ గీశనసువక్త్రిన్ రక్తవర్ణాలకన్
గనదుద్యద్వసుధాధరాంచితవలగ్నన్ భూరినీలాధరన్
ఘనదేహన్ లసదుష్ట్రయాన విలసత్కాంతాకదంబాధమన్. 46

చ. కనుఁగొని దైత్యుచెంగటికిఁ గ్రమ్మఱవచ్చి యతండువల్కె నో
దనుజకులావతంసమ ముదంబున నీవటు నన్నుఁ బంపఁగా
ఘనమగుముండ్లచెట్లనక కంకరరాళ్ళన కెంతదూరమో
చనిచని పాడుదేవళముచక్కిని నేను మహోచ్ఛ్రితంబుగన్. 47

సీ. పొడలుగల్గిన యట్టి భూరిబాహాయుగంబు
జిగికొండచిల్వలయుగముగాఁగ
నేత్రాంతములనుండి నెవ్వడిఁ బఱతెంచు
కన్నీళ్ళు సెలయేటిగములుగాఁగ

గర్ణరంధ్రములు ఘనవక్త్రబిలమును
రమణీయతరగహ్వరములుగాఁగ
గాత్రమంతట నిక్కు ఘనరోమసంఘంబు
ధాత్రీరుహములబృందంబుగాఁగఁ
గుఱుచలౌ యెఱ్ఱవెంద్రుకగుంపులడరి
యడవిదహియించునట్టి దావాగ్నిగాఁగ
గొప్పపర్వతముకరణిఁ గూరుచున్న
పొలఁతిఁగంటిఁ బురాకృతపుణ్యమునను. 48

వ. తదీయరూపాతిశయంబులు వివరించెద నాకర్ణింపుము. 49

చ. చెడుగులనేఱి యొక్కగుమిచేసి విధాతృఁడు గార్దభంబులన్
బుడమి సృజింపవానిమెయి భూరికురూపము వాలమిం బదం
పడి యొనగిలొట్టియల వానికిమిక్కిలి కఃస్వరంబు చే
పడని నొనర్చి నేర్పుమెయిభామను రెండును గల్గియుండఁగన్. 50

చ. పవలునునుండు పెద్దమము పాడుగుణంబులు రూపుదాల్చి యీ
భువనములోనఁ గ్రమ్మరఁగఁబుట్టిన భీకరవిగ్రహంబు బాం
ధవనిచయంబు నేచ వసుధాస్థలిగల్గుపిశాచభామ తా
భువిఁ జరియించుసంపదలముద్దియయక్క నెలంతయొంతయున్. 51

ఉ. చారునగంబులక్, ధనువు, సంపెగపూవును, గెంపుఁగూర్చి, సిం
గారపుఁ జన్నులక్, బొమల, ఘ్రాణము, వాతెఱఁజేసి, బ్రహ్మతా
వారక వానికర్కశత, వంకరఁ, బచ్చన, రక్తకాంతిఁ బెం
పారఁగఁదీసిచేసె, మొయి, యారును గన్నులుఁ, గుంతలంబులున్. 52

చ. ఘనతరమధ్యభారమునఁ గంపమునొందెడు నూచకాళ్ళు పెం
పొనరఁ బిఱుందులుం ఘనతనొందినఁ దాళఁగలేవటంచుఁదా
వనరుహగర్భుఁ డెంతయును వంతమదిం దలపోసి సూక్ష్మలో
చనకుఁ బిఱుందులు న్మిగుల్పపైకముగానొనరించె నేర్పునన్. 53

గీ. కొమ్మగాదది మేటిపెద్దమ్మగాని
బాలగాదది యముచేతికోలగాని
కన్నెగాదది బలిసినదున్నగాని
నారిగాదది జనులకుమారిగాని. 54

గీ. అట్టి కన్నియయును నీవు ననఁగిపెనఁగి
కనరులేనట్టిమమతలఁ గలసిలేని
యెందునీతచెట్టుపయిఁ గోరిందతీఁగె
యల్లుకొనురీతిగాదె యోయమరవైరి. 55

చ. అనిచెలికాఁడు తెల్పుటయు నాక్షణ మారజనీచరేంద్రుఁడున్
మనమున సంతసంబడర మానినిఁజూడఁగ మిత్రువెంటనే
చనియెను త్రోవలోఁగలుగుసర్వమహీం జలతావిశేషముల్
గనుఁగొనుచున్ మృగావళులఁగాంచుచు డొంకలముండ్లఁజూచుచున్

చ. కనుఁగొను సంగడీఁడ యదె గట్టుకఁజేరువ గచ్ఛతీఁగ మిం
చినతమి గట్టిగా ముసిఁడిచెట్టును జుట్టకయుండె మేలుమేల్
దనుజకులాగ్రగణ్య నిను దారుణలీలఁ గవుంగిలించి యా
వనితయు నట్టులే మిగులవంతలఁబెట్టి కలంచు మీఁదటన్. 57

క. చూడుమదె గాద్దభాంగన
తాడనమొనరించెఁ దనదుధవుని వయస్యా
చేడియ నిన్ననుసరసం
బాడెడునపు డిట్లుతన్ను నమరవిరోధీ. 58

క. ఇటు లన్యోన్యంబును ము
చ్చటలాడుచు నేగియేగి చామను గుడిచెం
గటఁ గని మేనువడంకఁగ
నటమటత్రో నిర్జరారి యనియెనుదనలోన్. 59

ఉ. దీనిని నేనువేఁడినను దిట్టునొ కొట్టునొ లోనికేఁగునో
మానినిఁ బల్మిఁబట్టుటయు మంచిదిగాదని యూరకుండి నే
నూనశరార్తి నెక్కరణి స్రుక్కుదు నేవిధినైన నిప్పుడీ
చానను గూడువాఁడనని జప్పుడుసేయక మెల్ల మెల్లఁగాన్. 60

చ. వెనుకకువచ్చి చేయొడిసి వేగనుబట్టిన లేచిదానవున్
గనుఁగొని కొమ్మ తానెడమకాలున ముందరిపండ్లురాలఁ దా
చినఁదగనోర్చి నెచ్చెలియుఛీయన వెండియుగౌఁగిలింపఁజూ
చినఁ జెలి భీతి గర్భగుడిచేరెను దల్పులువైచి గొబ్బునన్. 61

ఉ. అంతట దైత్యుఁడుం దలుపుల్లనగుద్దుచు నిన్నుఁగూడ కొ
క్కింతయుఁ దాళలేననుచు నేడ్చుచులబ్బున మొత్తుకొంచు ని
న్నింతయుఁగూలి పైఁబడినయట్లు వితాకునఁగూరుమండ నా
చెంతకుఁ దార్పకత్తెయొకచేడియ వచ్చె మెలంతనారయన్. 62

గీ. వచ్చి గుడిచెంతఁగూర్చున్న వారిఁగాంచి
మీరు రక్తవర్ణాలక సైరిభాంగి
మర్కటానన పర్వతమధ్యభార
వనితనెందైనఁ గంటిరేయనుచునడుగ. 63

ఉ. దానవభర్తవల్కు వనితా వినుమిచ్చటి కేను వేఁటకై
సేనలఁగూడివచ్చి గుడిచెంగట నేడ్చుచునున్న దాని నీ
వానతియిడ్డలక్షణములన్నియుఁ గల్గినదాని నొక్కకే
శాననఁగాంచి కేలొకటనంటిన నీగుడిమాత్ర నివ్వెఱన్. 64

ఉ. ఆకనుదోయిసూక్ష్మతయు నాచనుతిత్తులమార్దవంబు నా
మైకఠినత్వసంపదయు మానిని నేఁగనుఁగొన్నయంత నే
సూకరగాత్రిపై మనసుసొచ్చెను నిక్కువమెట్టులైన నా
కాకపివక్త్రిఁగూరిచి రయంబున నేలుము నీకుమ్రొక్కెదన్ 65

ఉ. ఎయ్యదియూరు దీనివిభుఁడెవ్వఁడు పుట్టినవంశమెద్ది పే
రెయ్యది యొంటిగా నిచటి కేటికివచ్చె నిటేక్వఁగారణం
బెయ్యది నాకుఁజెప్పఁగదవే కలరూపు కిటీంద్రయాన నీ
వెయ్యదిగోరినన్ సరగనిచ్చెద దానినినన్నుఁగూర్చినన్. 66

చ. అన నదివల్కు నోజనవరా ఖరగామినిరీతిఁ జెప్పెద
న్వినుము సుబుద్ధినాఁబరఁగునీయమభర్తయతండు రూపునన్
మనసిజుఁగెల్చునైనఁ జెలి పల్లవసంగతి మెచ్చుఁగోరు గ్ర
క్కునఁ బొరుగింటిపుల్లనగుకూరయుఁ దారుచిగాదె యేరికిన్. 67

ఉ. నిన్నటిరాత్రి యీమె యొకనీచభుజంగునిఁ గూడుచున్నచోఁ
గ్రన్ననవచ్చి వల్లభుఁడు కన్గొని కోపముతోఁడవీఁడు నేఁ
డిన్నడిరేయి యొంటి మనయిల్లుచొరంగ నిమిత్తమేమొయో
యున్నది యున్నయట్లు చెపుమూరక దాపక యన్నవిన్ననై. 68

గీ. బొంకుటకుఁజేతఁగాక యీయంకులాడి
నోర గుటకలు మ్రింగుచు నూరకున్నఁ
గాంచి కోపించి యొకపెద్దకఱ్ఱఁగొని
వీపుబద్దలుగాఁగొట్టి వెడలఁదినతఁడు. 69

ఉ. కొట్టిన మొత్తుకొంచు వడిగ్రుక్కుల నీరొగిఁగ్రుక్కుకొంచుఁ బెన్
ఱట్టులఁ బెట్టివీధిఁబడి ఱాగతనంబునఁ బాఱివచ్చె నీ
కట్టిఁడిఱంకులాడి తనకాపురమూడుటకోర్చి దేవళం
బిట్టులుదూఱెఁ గన్గొనఁగ నిట్టివెయాఁగద జారిణీగతుల్. 70

వ. అనికురంగగమన సవిస్తరంబుగా నామొఱుంగుబోఁడిశ్లేఱుం గెఱిం
గించి తలుపుచేరి యిట్లని పిలువందొడంగె. 71

ఉ. డాయనుభీతిఁబొంద మగఁడా యనుఁ, దల్పులు తీయరాదె రం
డాయనుఁ, బల్కవేమి చెపుడాయను, సొమ్ములువెట్టు ఱంకుముం

డాయను వేగరావె మొఱడాయను లోవలఁజేరి యేవ్వగా
డాయను సిగ్గుఁబూనుటెపుడాయను నెచ్చెలి మాటిమాటికిన్. 72

తే. గొంతు పగులంగ వినువారి కెంతొ చెవులు
తడకలునుగట్ట నాలుకపిడచవాఱ
నెంతయార్చినఁ జెనిఁజొరనీకయుండె
దున్నపోతుపై వర్షంబు తొరఁగినట్లు. 73

చ. తడిసినవుల్క కిక్కిగతిఁ దామ్రశిరోరుహ యంతకంతకుం
గడుబిగియంగఁజూచి తటకాపడి గుండెనుబాఖ్ఖపడ్డ వే
నడవఁగలేక గోతిదరినక్క తెఱంగునఁ గాచియున్నయా
చెడుదనుజుండు నెత్తికిఁకఁజేతులువచ్చెనటంచు రోఁజుచున్. 74

ఆ. కొంతసేపు పాడుగుడిచెంతఁగూర్చుండి
రోదనంబుచేసి రోసి కూర్కి
తలుపుతీయుజాడఁ గలనైనఁ గానక
విసిగి దూతిఁగొంచు వెడలెగుడిని. 75

చ. అటువలె దేవళంబపుడె యాయమతోడను దానవేంద్రుఁడు
త్కటమగుకిన్కతో వెడలి గార్దభ గామినిమీఁది ప్రేమచేఁ
దటుకునఁ బాయలేక మదిఁదాలిమిఁ దాలిచి పొంతనిల్చి మి
క్కుటమగుదీనభావమునఁ గూర్మిబయల్పడ దూతి కిట్లనున్. 76

క. ఓసీ ననునీవిపుడీ। కాసరనిభగాత్రితోడఁ గలిపెదవేనిన్
గాసులవేరిచ్చెద నీ। యాసకుఁదగినట్టికోర్క మటులుండంగన్ 77

తే. అనిన నదియెంతపనియని యపుడెబయలు
దేఱి దేవాలయంబును జేరఁబోయి
మెల్లగా మిత్రురాలిని మేలమొప్పఁ
బిలిచినంతనె యాజెంత తలుపుతీసె. 78

క. తలుపునుదీసినవెనుకను
బలుకులు చెవిలోనఁ గొన్ని బహురమ్యముగా
నలువొప్పఁగఁజెప్పిన విని
యలఘురవాణియు విచారమంతయుఁదీఱన్. 79

క. చెలికత్తియతో గుసగుసఁ
బలుమాఱునుమాటలాడి బహుధనమును సొ
మ్ములు పలుపలునన్ రాక్షస
కులబాడబుఁ డియ్యనొప్పుకొన్న సువార్తన్. 80

ఉ. తిన్నఁగ విన్నపిమ్మటను దీయనిమాటలు చెప్పి వానితోఁ
గొన్నివికారచేష్టలను గూడుట కుబ్బున సమ్మతించె నా
చెన్నఁటిదూతియు న్మరల శీఘ్రముముగా దనుజాధమాధమున్
దెన్నునఁగాంచి సర్వమును దెల్పి సురాలయబాహ్యభూమికిన్. 81

తే. తోడుకొనివచ్చి గుడిలోన దూఱుమనుచు
సైగచేసిన వాఁడును వేగఁజొచ్చి
తలుపు లోపలబిగియించి తగినయంత
గబ్బిలపుపెంటగమ్మునఁ గంపుకొట్టె. 82

తే. ఉక్కలోనావెతో సౌఖ్యమొందుచుండె
మిగులఁ దనలోనగుటకలు మ్రింగుకొనుచుఁ
జేతు లొండొంటితోఁజేర్చి దూతికయును
గడపముందటఁ గావలికాచుచుండె. 83

తే. ఈకథానాయికయయినయిగురుఁబోడి
మగఁడుకొట్టినపిడుగులుమాఱుమ్రోయఁ
బెద్దపెట్టున నేడ్చుచు వీడువెడలి
పోయి యెందునుగనరాకమాయమయిన. 84

సీ. ఏసూతిలోపల నేగికూలెనొయందు
భయపడి మగఁడును బంధువులును
వీథివీథులవెంట వెదకుచుఁ బఱతెంచి
జాడలఁబట్టి యాపాడుగుడిని
జేరియచ్చోటను జిడుముపొక్కులు గోకు
కొందుచు గడపలోఁ గూరుచున్న
దూతికఁబొడగాంచి దుర్మార్గురాలైన
యీలంజెముదిముండమూలముననె
మనకు నిన్ని పాటులువచ్చెననుచుఁబలికి
యందఱునుజేరి యాదూతినంటఁగట్టి
నెమక సున్నములోనికి నెముకలేక
యుండదంచిరి పిడిగుద్దులొకటఁబఱపి. 85

గీ. అటుపిదప నర్ధచంద్రప్రహారములను
దానియబ్బత్తోడను జెప్పుకోనుబంచి
వెనుక దేవాలయముతల్పు వేసియుంట
కాంచిలోపలనెవ్వరో కలరటంచు. 86

క. ఊహించి తలపులొక్కట
బాహాబలమొప్పగుంజ పగిలినమీఁదట్
సాహసమున లోఁజొరఁబడి
దేహంబంతయుఁజెమర్ప దిగులునమూలన్. 87

గీ. ఒదిగివడఁకుచున్న యుష్ట్రియానను రాకు
సాధమునిని జూచి యలుకతోడ
వీసెగుద్దులొకట వేనవేల్ కురిపించి
కొప్పు జుట్టుఁబట్టి గుంజియాడ్చి. 88

గీ. వెలుపలికీడ్చికొనివచ్చి వీపుమీఁద
ముఖముమీఁదను మెడమీఁదముక్కుమీఁద
మొఱఁగుగుద్దులవానలు మెచ్చుచూపి
పిండిపెట్టె నభాగ్యుని పిండుగాను. 89

సీ. దెబ్బలకుఁదాళఁజాలక దితిజవరుఁడు
తిరుగఁబడి బండతనమునఁ దెగువచేసి
వారితోడను బోరాడ వడిఁగడంగ
వారలందఱు నాగ్రహోదార్యవృత్తి. 90

చ. తటుకునఁ జుట్టుముట్టి పదతాడనకూర్పరఘట్టనంబులన్
జిటిపొటిమొట్టికాయలను జేరలనిండిన చెంపకాయలన్
బటుతరముష్టిఘాతములఁ బల్లఱునున్వదచల్లి దేహమం
తట రుధిరమ్ము గ్రమ్మఁగఁ దైత్యుని నెత్తురువానిఁ జేసినన్. 91

ఉ. తాళఁగలేక సొమ్మసిలి దానవుఁ డల్లనమూర్ఛవోవఁగా
బాలికబంధువుల్లని యభాగ్యుఁడు చచ్చెనటంచు నెంచి యా
భీలతఁ జాపలోపలనుబెట్టి యభాగ్యునిఁజుట్టికట్టి దే
వాలయపూర్వభాగమునయందలిగోతను వైచిపోకటన్. 92

క. వైచి పురంబు తలారులు
చూచిన మోసంబువచ్చుఁ జూడకయుండన్
వేచనవలె ననిగొబ్బున
నాచంచలహృదయుఁ గొంచు నరిగిరిపురికిన్ 93

వ. అంత నిచ్చట. 94

గీ. విట్చురంబుతఱమ వెఱచిపర్విడివచ్చి
గోతియందుదాఁగి కూరుచుండి
పందిగుంపులచట బయలనుదిరుగుచు
సునికిఁజేసి పయికిఁజనఁగనోడి. 95

క. భటులిరువురు గ ర్తమునం
దటునిటువీక్షించుచుండి యదటునఁదమపై
నటు దయ్యమువలె శవమొ
క్కటిపడినమూర్ఛపొంది ఘటికాద్వయికిన్. 96

క. తెలివొంది కనులువిప్పుడు
నలశవముం గదలఁజొచ్చె నాశూరులకున్
గిళవళ మినుమడికాఁగను
బెళపెళయని చాపచుట్టబిట్టుగ ప్రోయన్. 97

ఉ. అంతట నాభటద్వితయ మాత్మఁదలంకుచుఁ బైకిబోయినన్
గంతునవచ్చి ఘుర్ఘురము గ్రక్కునఁజంపునొ క్రిందనుండినన్
సంతసమూఱ దయ్యమిది చంపునొ యక్కట యేమిబుద్ధి యం
చెంతయుఁ జింతనొంది పనియేమియుఁ దోఁచకయుండ నంతలోన్. 98

సీ. చాపలోనుండి "ఘనులార! చావకుండ
బంధములువిప్పినన్నింత బ్రతుకఁజేయుఁ"
డనెడువాక్యంబు వినదైనానావాలు
పట్టి తమరాజుస్వరమాట వడినెఱింగి. 99

గీ. కట్లు విప్పితీయఁ గాయంబునిండను
గాయములు చెలంగఁ గనులువిచ్చి
దైత్యనాథుఁడపుడు తనప్రాణభృత్యుల
యాననములఁజూచె దీనవృత్తి. 100

క. అన్యోన్యముఖాలోకన
ధన్యత్వముఁ జెంది భటులు దనుజేంద్రుండున్
నవ్యస్తభయభ్రాంతత
నన్యోన్యక్షేమవార్త లారసి రల్లన్. 101

క. ఆరసి తమకోదవినయా
ఘోరాపదలెల్లఁ బాసి కుట్టూపిటిత్రో
ధారుణిలోఁగ్రమ్మఱఁదా
మీరీతిన్మెలఁగఁ గనుట కెలమింగనుచున్. 102

గీ. రాజు తమచెంతనున్న ధైర్యంబుకతన
బయలఁ దిరిగెడుకిటులకు భయముపడక
విభునితోఁగూడి యాగోయి వెడలఁజూడ
లేచుటకు రాజుకాలెత్తలేకపోయె. 103

క. ఆసైరిభాస్యబంధులు
చేసినయుపచారమహిమచేతను జరణం
బాసమయంబున దనుజా
గ్రేసరునకు వశముగాక కీలుతొలంగెన్. 104

క. అదిగని సందేహింపక
సదుపాయధురీణులైన సద్భటవర్యుల్
ముదమున బై కెక్కినృపున్
సదమలగతి నీడ్చిరతఁడు శ్రమచేమూల్గన్. 105

శా. ఎంతో కష్టముమీఁద దైత్యవిభుఁ బైకీడ్చి యామీఁదటన్
వంతు ల్వాంబడి మోవనెంచి యదియున్ భారంబుగాఁదోఁచినన్
స్వాంతంబు ల్బలియింపఁ జింతిలి మహోపాయంబుఁ గన్పట్టియ
త్యంతంబు న్మదిసంతసిల్లి గుడిచెంతంజేరి రొట్కమ్మడిన్. 106

క. పందిరిగడలనురెంటిన్
సందిటఁ గొనివచ్చికట్టి సద్వాహనమున్
సుందరగతిఁ జేసి మహా
నందముతో రాజు సందు నయమొప్పారన్ 107

క. శయినింపఁజేసి యిద్దఱు
దయతోడ న్మాపుపై సిఁ దద్వాహనమున్
గయికొని పరమపదంబున
కయి చేర్చుమహానుభావుకరణిని నృపునిన్. 108

వ. వహింయించి మృగయావినోదమహోత్సవంబు నిర్వర్తించి పునఃపుర
ప్రవేశంబుచేయ నవధరించు నవనీధవపుంగవుం బురవీధుల నూరే
గించు మహావైభవంబపూర్వంబై యుండె నాసమయంబున. 109

సీ. అత్యద్భుతంబైన యావాహనంబును
వీక్షించికుర్కురవితతి మొఱుఁగ
వీధివెంటనుబోవు విధంబ్వాగనలుచూచి
శవమని వెనుకను సరగఁజరుగఁ
బయటనుండి బాధచే వడిమూల్గుటాలించి
తమచుట్టమని ఘూకతతులుచేరఁ
గ్రొత్తగా శవవాహకులువచ్చి రెందుండి
యని ప్రాఁతవాహకు లడుగుచుండ
శ్వాననినదంబు మాగధ స్తవముగాఁగ
విధవలభయస్వరములు దీవెనలుగాఁగ
ఘూకఘూంకారములు వాద్యఘోషములుగ
నగరుఁజొత్తెంచెనాతఁడునడిమిరేయి. 110

వ. ఇట్లు పరమరహస్యంబుగా నంతఃపురప్రవేశంబుచేసి. 111

ఉ. మంచముమీఁద దేహమిడి మూల్గుచు మూల్గుచు బాధనొందుచున్
జంచలదృష్టిఁజూచుచును జారుల కెప్పుడునిట్టిపాటులే
మించుగసంభవించునని మించువెతన్మదిలోఁదలంచుచున్
బంచత యింతకంటె బహుభంగుల మేలనుచున్వ్రతంబడెన్. 112

గీ. వైద్యులను బిల్వనంపించి వారిచేత
నౌషధంబులుచేయించి యక్కజముగ
బాధకుసహింపలేక యభాగ్యనృపుఁడు
మందుపట్టింపక శరీరమందొకింత. 113

క. వరుసగ మొలయునుదలయును
శిరమును గరములునువాచి చెప్పంగఁ గవీ
శ్వరులెవ్వారును నొల్లని
మరుదశమావస్థ నతఁడు మానక చెందెన్. 114

క. ధరణి నభాగ్యమహాసుర
చరితము విన్నట్టిపుణ్యచరితుల కెల్లన్
బరవనితారతిచెడునని
పరిహాసకుఁ డానతిచ్చెఁ బాండుసుతునకున్. 115

క. ధరణీజనమందారా
సురమునిగణనుతవిహార సుగుణాధారా
పరిభావితరిపువీరా
దురితనిచయఘనసమీర దుఃఖవిదారా. 116

మాలిని. అనుపమగుణసాంద్రా యాదవాంభోధిచంద్రా
జనఘననుతిపాత్రా సజ్జనాంభోజమిత్రా
వనధికృతవిహారా వల్లవీచిత్తచోరా
దనుజచయవిరామా దర్పితారాతిభీమా.

గద్యము.

ఇది శ్రీమత్సకలసుకవిజనవిధేయ కందుకూరి వీరేశలింగ
నామధేయ కల్పితంబయిన యభాగ్యోపాఖ్యానంబను
హాస్యప్రబంధంబునందు సర్వంబును
నేకాశ్వాసము.

పథికవిలాసము.



By

K. VEERESALINGAM

పథికవిలాసము.

సీ. ఆ ప్రవర్గముఁబాసి, యమితదూరంబున
నతిచింతఁగూరి, మాంద్యంబుమీఱ
నలసయానముచూపు నల 'షెల్డు' దరినుండొఁ
జెరలాడు 'పో' నదిచెంతనుండొ
నామీఁదఁ 'గారింతియా' దేశముప్కర
గ్రామ్యాధముఁడుకృపారహితుఁడగుచు
నిలువనీడయులేని నిఱుపేదపథికునిఁ
జొరనీక యిలు మూయుచోటనుండొ
నరవర్జితంబయి నభమువాలినదాఁక
నొక్కటే బయలుగాఁ బిక్కటిల్లి
యున్న 'కాంపానియా' యూషరక్షేత్రంబు
వినుగుపుట్టించెడు దెసనుండొ
నెచట నేదేశమీక్షింప నేనుదిరుగ
మనసునావెంటరాక, యోయనుజ! యెపుడు
వెడలుకొలఁదిని దీర్ఘమౌప్రేమపాశ
మీడ్చుకొంచతివ్యథనునీయెడకె మరలు. 1

గీ. అట్టియాదిమసఖుఁడై నయట్టిభ్రాతఁ
జేరిశాశ్వతసుఖముకై సేయుఁగాక !
అంగరక్షకులై తద్గృహంబుచుట్టు
నుండి దేవతల్ కాచుచుంద్రుగాక ! 2

చ. పగలొగిఁ బాటుపడ్డశ్రమ పాయఁగ హాయిగ విశ్రమింపఁ, గ్రం
దుగఁ జలిమంటఁగ్రాఁగ, నతిథుల్ మునిమాపున నెందుఁ బోదురో

తగ నిఱుపేద లార్తులును దామెటకేగి సుఖింతురో, యెటన్
డిసిపరదేశి యాదరణఁ దేలునొ, యాయిలు ధన్యమయ్యెడున్. 3

సీ. ఎచ్చోటను గుటుంబమెల్లను సుఖముగాఁ
జుట్టునుజేరి కూర్చుండి తాము
కడు వేడ్క నెప్పుడు నడుచుచునుండెడు
సరసవినోదవాక్సరణి కేని
హాస్యచేష్టల కేని యలరి నవ్వుచునుండె
వ్యసనంబు గలిగించునట్టికథను
వినిజాలిచేతను వెచ్చనూర్పుచునొండె
భుజియింపసిగ్గును బొందునతిథి
నారగింపంగ బ్రార్థించి యందువలనఁ
గడుఁబరోపకారసుఖంబుఁగఱచుచొండె
పుష్కలముగ శుద్ధపదార్థములనువిందు
లిడుదురచ్చటియావిందులెసఁగుఁగాత. 4

క. అటువంటిసుఖంబుల నేఁ
గటగట కననోచనైతిఁ గష్టపువిధిచేన్ ;
బటుతరకష్టంబులఁ ద్రి
ప్పటలంబడిచెల్లె నాదుప్రాయంబెల్లన్. 5

చ. ధరణిసినింగినిన్ గలయఁ దార్చెడుచక్రముభంగి, దవ్వుగా
నిరవుననుండినన్ను నెలయించి చనంజన దూరమేగుచున్
గరమునునన్ను, జూపుననెనవ్వుచుఁ, బర్విడుభాగ్యదేవతన్
బరువడి వెంబడింపనిటు పాల్పడితిన్ గడలేనిత్రిమ్మటన్. 6

క. నాపాలిభాగ్య మిలలో
నేపట్టుననిల్లు నాదియిది యనకుండన్

బాపురే! నన్నే కాకిఁగ
నీపగిదినిఁ ద్రిప్పుచున్న దెల్ల విలాతుల్. 7

ఉ. ఇప్పుడు సైత 'మాల్ప్స' శిఖరీంద్రవివిక్తపదంబుఁ జేరి, యొ
క్కప్పుడు గాలివానలకు నందనియున్నతమైనచోట నే
నొప్పుగఁ గూరుచుండి, వగ పొందుచుఁ గాలము నెట్లొ నెట్టుచున్
దప్పక చూచెదన్ దిగువతట్టున నూర్లకొలంది దేశముల్. 8

క. సరసులుఁ గాంతారంబులుఁ
బురములును బయలుభూదిశలఁ బొలయుచు దృగ్గో
చరమగుని వైభూపాలుర
గురువైభవ మల్పతరపుగోపునిస్థితియున్. 9

ఉ. ఎల్లెడ సృష్టివింత లిటు లీక్షణపర్వ మొనర్చుచుండఁ, జిం
తిల్లఁగ నేనె గర్వితమతిన్ బలువింతలలోఁ గృతఘ్నతన్?
పెల్లుగ నెల్లవారి మదివేడ్కలు నించెడు మేలు నక్కటా!
చెల్లునె వాండితీకుశలచిత్తము పేక్షయొనర్ప? జెప్పుఁడీ. 10

ఉ. విక్కుచుఁ బైకిఁ దార్కికకువిద్య నటించినఁ దానటింప ని,
మ్మిక్కడ మర్త్యకీటమున కీచిలువస్తువులే ఘనంబులౌ;
మిక్కిలి సర్వమానవుల మేలునుఁ జూచి ప్రమోద మొందును
య్యాకటికంపుగుండె కల యట్టిజనుండె మహాత్ముఁ డెంతయున్ 11

సీ. విత్తంబుతోడను విభవంబుతో నొప్పి
కరముఁ బ్రకాశించుపురములార!
అవ్వారిగాఁ బంట లల్ల వసంతుండు
కలిగింప నలరారుపొలములార!
పనిపూనిపవనుండు పడవలనడపంగ
సరసత్వమున మీఱుసరసులార!

పూలు పూచినకొండపూళ్ళను బనిచేయఁ
కరము వంగినయట్టికాపులార!
మేదినీభాగ మెల్లను నాదెగాన
మీర లెల్ల సృష్టికినంశహారి నైన
నానిమిత్తంబ యరియర్పణంబుగాఁగ
మేలివస్తువుల్ కూర్పుఁడు మీరలెల్ల. 21

మ. ఘనలోభాత్మకుఁ డొంటిగాఁ దనధనాగారంబుదర్శించి, యో
లినిగూర్చుండి ధనంబుఁబల్మఱును దా లెక్కించిలెక్కించి, యా
ధనముల్ కుప్పలుకుప్పలై కడుఁ బ్రమోదంబియ్య, నుప్పొంగు; నా
వెనుకన్ గన్గొని వెచ్చనూర్పు మఱియున్ విత్తంబు లేకున్కికిన్. 13

మ. అటు లేపుట్టెడు మన్మనంబునను వ్యత్యస్తంబులౌవృత్తు; లు
త్కటహర్షంబగు దేవుఁడీనరులకున్ గల్గించుమేళ్ళంగనన్;
కట! మర్త్యుండిటుఁబొందఁ గల్గుఘనసౌఖ్యం బింతెగాయంచు, నో
క్కట నిట్టూర్పులుపుట్టుఁ; బల్మఱును శోకంబుల్ కడుంగల్గెడున్.

శా. వేదారుల్ చనువాళలున్ నిఝరకుల్ వేఁజొన్ని, శ్రాంతాస్మదీ
యోదారాత్మ-సమస్తమర్త్యులు సుఖంబొందంగ వీక్షించి-స
మ్మోదంబందఁగఁ గాంచు నిత్యసుఖసంపూర్ణప్రవేశం బొకం
డీదేశంబుల నెందునేనిఁ గనఁగా నే వేమఱున్ గోరుదున్ 15

క. గ్రక్కున నట్టిప్రదేశం
బెక్కడఁగానంగవచ్చు నీభూమిపయిన్ ?
చక్కఁగఁ జూపెడువారెవ
రక్కట! యందఱు నెఱింగినట్లు నటింపన్ ! 16

చ. అనయము శీతమండలమునందు వడంకుచు నుండుమర్త్యుఁడున్
దనదెజగంబులో సుఖపదం బనిచాటును సాహసంబునన్;

ఘనమగు గాలివానలను గంపిలుస్వీయసముద్ర సంపదల్,
తినినగ్రాఁగి త్రుళ్ళుచుతనదీర్ఘనిశల్, స్తుతియించు నెంతయున్. 17

చ. కరము నిరక్షుభూమిని వగర్చు దిగంబరకృష్ణదేహుఁడున్
వరుసగ సంస్తుతించుఁ దనబంగరువాలుకఁ, ద్రాటికల్లునున్ ;
తిరుగుచు వేఁడియెండలను, దేలుచు నుష్ణతరంగమండలిన్,
స్మరణమొనర్చు వేల్పులఁగృతజ్ఞతఁ దానటుగన్న మేళ్ళకున్. 18

క. మనమెటఁదిగిగిన, నిటులుం
డును గద దేశాభిమానినుడువుపొగడ్తల్ ?
తన ప్రథమోత్తరదేశం
బనయంబును స్వస్థలంబునందే యుండున్. 19

సీ. అయినను దేశంబులన్నియు నొకవేళ
నొండొంటితో మనమొకటఁబోల్చి
వానివానికిఁగల్గు భాగ్యవైభవముల
నిపుణంబుగఁ బరిగణింతుమేని
దేశాభిమానులు తివిరిస్తుతించిన
న్యాయంపుబుద్ధితో నరసిచూడ
సర్వమానవులకు సమభాగముగ మేలు
వంచి యీఁబడినట్లె పలుకవలయు ;
కళలచేనొండెనుస్వభావకలననొండె
వివిధముగనియ్యఁబడినవేత్వేఱు మేళ్ళు
వివిధదేశస్థ మానవవితతులకును
సౌఖ్యసంపదలెల్లను సమముజేయు. 20

చ. ప్రకృతియు నెల్లరందు సమభావకృపల్ గలతల్లియయ్యునున్,
సకలసుఖంబులిచ్చుఁ గడుశ్రద్ధ మెయిం బనిచేయువారికిన్ ;

ప్రకటముగాఁగ 'నాగ్రా' నదిప్రక్క శిలాతలమందుఁబోలెఁ గ
ర్షకునకుఁ గ్రాసమీఁబడియెఁ జక్కఁగ 'నైౘ్ర' పురీనగంబులన్. 21

గీ. శిలలతో నిండి పర్వతశిఖరసమితి
కరముఁ గఠినంబుగాఁ బొడకట్టుచున్నఁ
బరఁగ, నీపర్వతముల లవాటుకతన
హంసతూలికాతల్పంబులగు నుజూవె. 22

మ. ధనవాణిజ్యములున్ బ్రతిష్ఠయును, స్వాతంత్ర్యంబు, సంతుష్టియున్-
కన, నానావిధముల్ మనుష్యకృతసత్కారోన్మదితానందముల్,
వినుమష్లైనఁ, బరస్పరంబు నివివిద్వేషించి, యొండొండెత
క్కినవానిన్ బరిమార్పఁగాఁ గడఁగుమాడ్కిన్ దాముచూపట్టెడున్.

మ. ధనముల్ స్వేచ్ఛయురాజ్యమేలుకడ, హృత్సంతుష్టి నష్టంబగుల్;
ఘనవాణిజ్యము చాలనిల్చెడునెడల్, ఖాయున్ బ్రతిష్ఠాప్తి; కా
వున, నొక్కొక్కప్రభుత్వ మొక్కొకసుఖంబుం గాంచ నభ్యాసముం
గని, యద్దానికె జీవనంబలవడంగాఁజేసి, మార్చుందగల్. 24

మ. ప్రతిరాష్ట్రంబున నిష్టసౌఖ్యము లతివ్యాప్తింగడున్ జెంది, త
త్ప్రతిసౌఖ్యంబును వింతయైనయొకబాధం బెచ్చునందాఁక, మూ
ర్ఖతతో నొక్కొకరాజ్య మొకప్రియసౌఖ్యంబే మదిల్ నిల్పి, త
ద్వ్యతిరిక్తాఖిలసౌఖ్యమూలక సుఖోపాయంబులన్ దన్నెడుల్. 25

క. ఈసత్యంబుల నింకను, భాసిల్లెడుసూక్ష్మ దృష్టిఁ బ్రబలపరీక్షల్
చేసి, పరిచూతమిచ్చటి, యీసీమలలోపల నవి యెటువర్తిలునో. 26

ఉ. అందులకై యొకింతతడ వావలనుంచి మదీయచింతలన్,
క్రిందటిలోయ ఛాయఁగలిగించుచు, గాలికినుస్సురంచు, నా
ముందటివంకఁ దానెపడి మొల్చిన దిక్కఱుగుల్మమట్లు, నే
నిందుమనుష్యకోటికయి యించుకకుందుచుఁ గూరుచుండెదన్. 27

క. అదెకుడివైపునదవ్వుల
ముదమొప్పఁగ 'నాల్ప్స్' మిన్ను ముట్టినచోటన్
బొదలెడు 'నిటలీ' దేశం
బదిర! వసంతంబుఁబోలె నతిశయశోభన్. 28

ఉ. తెల్లగ మధ్యమధ్య నొకదేవగృహాగ్రము జీర్ణమౌచు భా
సిల్లి మహత్త్వగౌరవవిశేషముఁ జూపఁగఁ, గొండనెత్తముల్
పెల్లుగ నేటవాలగుట లేచి వనంబుపయిన్ వనంబు రం
జిల్లి నగంబుప్రక్కఁగయినేసెడు, నాటకరంగరమ్యతన్. 29

గీ. బహుళసృష్టివిశేషసౌభాగ్యసమితి
స్వాంతమును దృప్తిఁబొందింపఁజాలునేని
సత్యముగనల్ల 'యిటలి' దేశంబుజనులె
యెల్లవారలలో, ధన్యులెంచిచూడ. 30

సీ. గర్వించిపైని నిక్కఁగఁ గల్గుఁగవిరొండె
నడఁకువనిల వ్రాలునట్టివొండె
నేయేఫలావళు లెల్లవిధంబుల
దేశంబులందును దేజరిలునొ
వంతువెంబడిఁబూచి పలుకాఱులను మాఱు
హాయనం బెల్లఁగ్రై సేయుచుండి
యేయేప్రసూనంబు లీక్షణోత్సవముగ
నష్టదేశంబుల నుద్భవిలునొ
పూచినశింపనే పొడచూపి ననకాఱు
నను మాత్రముండు జీవనముకలిగి
యేయేసువాసన లెలమితో నుత్తర
దిక్కును సేవించి మ్రొక్కుచునునొ

యట్టివెల్లనునిచట వేఁయుంగఁబడుచు
నుండి, యిదె స్వస్థలంబుగ నొప్పుకొనుచుఁ
దోఁటవారలవలనను దోహదంబు
నడుగకయె, తాముపెంపొందియతిశయిల్లు. 31

గీ. కలకలను నవ్వనీభూమి కాంతమీఁద
వింతవలపులు కలయంగ విసరుకొఱకు
నబ్ధిఁబొడము గంధవహవిహంగములు
చల్లనగుతమఱెక్కలఁజూచునెపుడు. 32

ఉ. అయినను, దుచ్ఛ మింద్రియచయంబె యొసంగెడుసౌఖ్య మెన్నఁ; న
క్షయముగ మర్త్యుఁ డింద్రియసుఖంబె యెఱింగినదెల్ల నిచ్చటన్
ప్రియతరసుందరాకృతిని బెంపగు నిచ్చటఁ జేలుఁ దోఁటలున్ ;
క్షయమునుబొందుచుండు నెనుగంగన కొక్కమనుష్యుఁడే యిటన్.

ఉ. నరునిప్రవర్తనంబులఁ గనంబడు నిందు విరుద్ధదోషముల్ —
పరమవిధేయుఁ డయ్యు, గరువంపడు ; నిర్ధనుఁడయ్యు, భోగియౌ ;
నరయ గభీరుఁడయ్యుఁ, గడువ్యర్థుఁడు ; కల్లరి, భక్తుఁడయ్యునున్;
వెరవులు పన్నుఁగ్రొత్తయఘవృద్ధులు చేయఁదపంబులందునున్. 34

మ. మును వేంచేసినభాగ్యదేవత యిటన్ మున్ దాదిగంబెట్టి పో
యినకీడుల్ సకలంబుచేరి చెఱిచెన్ హీనంబుగాఁ జిత్తముల్ ;
ఘనవాణిజ్యము రాజ్యమందచిగమో కాలంబుక్రిందన్ గడున్
బెనుపుంబొందిన యుష్టు వీరివయియెప్పెన్ సర్వభాగ్యంబులున్. 35

మ. వరవాణిజ్యముపంపునన్ వడిగలేవన్ నేర్చె సౌధావళుల్;
చిరజీర్ణస్థితగోపురాళి మరలన్ లేచెన్ నభం బంటఁగా;
సురుచిత్రాకృతులొప్పెసృష్టిఁగలవస్త్రౌఘప్రభల్ మీఱుచున్;
నరరూపంబులు దాలిచెన్ గనులఁబోనన్ బాలరాళ్ళున్నియున్. 36

మ. నడిచెన్, హెచ్చుగ దక్షిణానిలముకన్నం జంచలంబై, వడి
న్వడి వాణిజ్యము వేఱుతీరములకున్ నౌకాళితో నంతటన్;
కడకుం బోరులు లేనియూళ్ళు, భటశూన్య ప్రభూత్తంసముల్,
కడవంగా సిరి తెచ్చిపెట్టినది యెల్లం బోయె నిశ్శేషమై. 37

క. వినియోగింపని నేర్పునఁ
బనిమించినవెనుకఁ దొంటిబలు పదియెల్లన్
ఘనమైనయుబ్బుజబ్బని
జనులావలఁ గనుఁగొనంగఁ జాలిరి తుదకున్. 38

ఉ. ఐనను విత్తలోపము, మహత్తరపూర్వదశా వశిష్టని
ర్మాణములై నశిల్పముల, రమ్యముగా నిటఁ దీర్పఁగాఁబడెన్;
వీనినిబట్టి దుర్బలమనీషయు దీర్ఘవినష్టచిత్తమున్
గ్లానియె లేక సత్ప్రతిఫలంబును గాంచినయట్లు గన్పడున్ 39

ఉ. రాఁగిలిచూడ వచ్చునిట—రక్తము చిందనివై భవంబునన్
ఆగనిచిత్రలేఖనజయంబులు, గుజ్జపుదండు పండువుల్,
బాగగుదేవతా భజనభవ్య వివాహమహోత్సవంబులున్
జోగిరియు యమ్మవారి ప్రతిసూనవనంబున నుండు నిచ్చటన్. 40

ఉ. బాలురయాట లెంతయును బాలురఁ దన్పెడునట్లు, యిట్టియా
లీలలు వీరిఁ దన్పు నవలీలను జింతల నెల్లఁ బాపుచున్;
చాలఁగ దీర్ఘసేవవలనన్ దలయెత్తక గొప్పకోర్కులు
న్మాలములై కరంబిపుడు పుంస్త్వవిహీనముఁ జేసెఁ జిత్తమున్. 41

క. అల్పసుఖోద్దేశంబులు। పొల్పుగ నావెనుక వచ్చి భూరిత్వరతో
బల్పొందిమదిన్ వారల। నల్పానందైకతోషితాత్ములఁ జేసెన్. 42

సీ. మున్ను 'సీజరులు' ప్రభుత్వంబుచేసిన
సుందరసువిశాల మందిరములఁ

గాలంబుచేతను గూలి రూపుమూఱి
బీటలువాఱఁ గంపిల్లు కోటఁ
బాడుగోడలలోన పీడక యుచ్చోటఁ
జచ్చినపూర్వుల సరకుగొనక
నిలువంగనీడను నెమకుకొనె. కా. పు
బీదకుటీరంబు వేయునొకటి
వేసినరుఁడేల మున్నట్టిపెద్దయిల్లు
కట్టవలసెనొ యనుచు నక్కజము పడుచుఁ
దనదుగుడిసెనుమందస్మితంబుతోడఁ
గనుచుఁదానె ఘనుఁడనంచు గర్వపడును. 43

చ. చనుమిటనుండి నీవిఁకను స్వాంతమ! యెచ్చటఁ గర్కశస్థలిన్
ఘనతరమర్త్యు లుద్భవము గాంతురొ, యెచ్చట వెల్లనైన 'స్విస్'
జనులు ప్రభంజనాహతనిశాంతము లొప్పఁగ రూక్షభూమి బ
ల్మిని లఘుభుక్తిఁగాంచఁ బెకలింతురొ యచ్చటుఁ జూత మింకిటన్.

చ. మనుజుని, నుక్కు-సద్భటుని, మంజుకృపాణముఁ-దక్కు, నుగ్రవం
ధ్యనగములియ్యవి య్యొడఁ దదన్యఫలంబుల, గొడ్డుకొండలన్
దనర నలంకరింపవిటఁ దాము వసంతసుమంబు లేవియున్;
ఘనముగ నేఁచు నిందుఁ జలికాలము మాధవమాసమందునున్. 45

క. మలయానిలుఁ డెన్నండును
వలపున వరియింపఁ డిచటి బలుగుబ్బలులన్
బలుమఱు నుల్కులురాలును;
గలుషమహావాతములను గావిరి గప్పున్ 46

ఉ. ఇక్కడఁగూడ భూస్థితికిఁ దృప్తి ప్రతిక్రియఁ జేసి, దానిదై
నిక్కుదురాగ్రహం బుడిపి, స్వీయమహత్త్వముఁ జూపఁ గల్గెడున్;

తక్కువ వయ్యె వేడుకలు, తద్దకుటీరము పేదదయ్యె, నల్
ప్రక్కలఁ గాంచుఁ గాఁపు తనభాగ్యమె యెల్లర భాగ్యమాటిటన్. 47

చ. తనదుకుటీర నైచ్యమును దద్దయు గేలియొనర్పఁ, జెంగటన్
గనుఁగొనఁదొందు సౌధములు గర్వమునందల యెత్తుచుండఁగాఁ;
తనదగు శాకపాకకలితంబగు భోజన మేవగింపఁగాఁ
గనుఁగొనఁదొందు విందు ధనికప్రభులున్నతితోడఁ జేయఁగన్. 48

గీ. మూఢతలఁ గష్టములయందుఁ బుట్టి పెరిఁగి
యతఁడు శాంతస్వభావుఁడై యలరు కతనఁ
గోర్కెలెల్ల నాతనికి సంకుచితఁగాంచి
యతని నద్దేశమునకును నర్హుఁ జేయు. 49

క. వేకువ, నుత్సాహముతోఁ
గైకొని లఘునిద్ర, మేలుకాంచి, సుతీక్ష్ణ
స్తోకసమీరముఁ బీల్చుచుఁ
బ్రాకటగతితోడఁ బాట బాడుచు, నడుచున్. 50

ఉ. గాలమునైన వైచు నుదకంబునఁ జేఁపలఁ బట్ట నోర్పునన్;
జాలఁగ దుర్గమస్థలిని నాగలినైనను నీడ్చుఁ దెంపునన్;
వాలినమంచుజాడలనుబట్టి గుహం గనిపెట్టి, కోపలన్
గ్రాలి పెనంగుకాననమృగంబును నైనను నీడ్చుఁ బైటికిన్ 51

చ. పనులవి యెల్లఁ దీర్చుకొనివచ్చి నిశాందనయిల్లు చేరుచున్
దనదుకుటీర మందిరమునన్ గృహరాజనఁ గూరుచుండి, వే
డ్కను జలిమంటఁ గ్రాఁగుచుఁ దగం జిఱునవ్వును బూని, చుట్టునుం
గనుఁగొను మంటచే మెఱసి క్రాలెడుబిడ్డలతళ్కుఁ జూపులన్. 52

చ. అతని ప్రియాంగనామణి గృహస్థితపాత్ర సమృద్ధి కొందుచుం
గుతుకముఁ బల్లపై శుచిగఁ గూర్చును భోజనభాజనంబులన్;

అతిధియొకండు కూడ నెపుడైన నటం జని పెక్కు లందవుం
గతలను జెప్పి, రాత్రిపడకన్ సమకూర్చినయప్పుఁ దీర్చెడున్. 53

క. తనదేశంబునఁగలిగిన
వనములు తొటల్లోనంగు ప్రతిసౌఖ్యంబున్
ఘనముగ నాతనిహృదయం
బునను స్వదేశాభిమానమును ముద్రించున్. 54

చ. అతనికి నింటిచుట్టు నుదయం బగుచెట్లలు కూడ నింతయున్
వెత యిడకల్పభుక్తి యొదవించుసుఖం బధికం బొనర్చెడున్;
అతనికిఁ బ్రాణతుల్యము నిజార్హ్యమనోహర సత్కుటీరమే;
యతనికిఁ బ్రాణతుల్యము మహాపవనాహతిఁ బ్రోచుకొండయున్. 55

చ. వెఱపును గొల్పుశబ్దమున భీతిలినప్పుడు తల్లిఁ బొమ్మఁ దా
మఱిమఱి యంటి పట్టుకొనుమాణవకుండను బోలెఁ గొండయే
శృఱిముఱి ప్రోయుచున్ వెడలునప్పుడు వాత్యలు వీచు నప్పుడున్
మఱిమఱి పాయకుండుఁ గడుమక్కువతోడ నతండు స్వాప్రభులన్. 56

గీ. ఔరా! యువికావివంధ్యములైనరాష్ట్ర
తతులలోఁగల్గు మోహానత్వంబులెల్ల?
వారికల్పంబులయియుండువలసినవియు
వారియాశలు హెచ్చుగాఁ బొఱకుండు. 57

ఉ. వారలదెంత శ్లాఘనకుఁ బాత్రులొ యంతయె పొందఁగా దగున్;
వారల వాంఛలెల్లొ యటె వారిసుఖంబులుఁ గొంచెమే యగున్;
వారలయుల్లమందుఁ బ్రభవంబయి వర్ధిలు ప్రత్యభీష్టమున్
సారసుఖాస్పదం బగును జక్కఁగఁ జేకుఱినప్పు డెంతయున్. 58

. మొదల నెదలోనఁగాంక్షలు మొలవఁజేసి
పిదపఁదత్కాంక్షితంబులవేగఁదీర్చు

ప్రతిమనోహరవిద్యయుఁ బాఱిపోవు
నట్టిమూర్ఖదేశంబులయందునుండి. 59

మ. వెగటై యింద్రియభోగముల్ ముదమిడన్ వీడ్కొన్నచో, దుస్సహం
బగుశూన్యాత్మను నింపఁగా నెఱుఁగ రత్యంతోచ్చహర్షంబుతోఁ;
మొగినాత్మన్ జ్వలియింపఁజేసి తనువుం బొంగించి హృత్కంప మొ
ప్పఁ గనానందముఁ గూర్చు జ్ఞానమహిమల్ స్వప్నార్థముల్ వారికిన్. 60

క. వారలమాఱనిజీవన । మారయఁగా రాఁజుచుండువగ్నిని బోలున్;
గూరుకుచెందదు లేమిని; । నూరకకడుఁ బ్రజ్వరిల్లు నుత్కటవాంఛన్.

చ. అతిఘనహర్షముల్ గన ననర్హులువారలు; వత్సరంబునం
దతుల మహోత్సవంబొకటి హర్షమువారికిఁ గూర్చునప్పుడున్
గుతుకము మూర్ఖచిత్తమున నూల్కొని భగ్నమునొందుఁ, దోడనే
యతిమధుపానమత్తత నదంతయు బ్రుంగి యడంగునంతకున్. 62

సీ. మఱి వారిసుఖములు మాత్రమె కావు సు
మ్మటు మోటుగాఁ బొలుపట్టివెల్ల.
వారలనీతులు వారిసుఖములట్ల
నీచంబులయి యుండు నిశ్చయముగ
నాగరికతహెచ్చ కాగనకతమునఁ
దండ్రి మొదల్కొని తనయువఱకు,
నాచారములు మార్పునందక యభివృద్ధిఁ
గనకేకరీతినె తనరుచుండుఁ
గామమునఁనొండె మిత్రత్వగరిమనొండె
రమ్యముగఁబర్వునిశితానురాగవిశిఖ
తతులు వారలకఠినచిత్తములమీఁదఁ
దాఁకిపడు మొక్కవోయివ్యర్థంబుగాఁగ. 63

సీ. అయినఁ దీక్ష్ణతరంబులయియుండుయోగ్యతల్
కొన్నియున్వారిహృత్కుధరసీమ
గూటిలోఁగూర్చుండు క్రూరగృధ్రములట్లు
లోఁ డెడఁ గాలూనియుండవచ్చుఁ
గాని చిత్తోన్నతి గలవారిజీవయా
త్రలయందు విహారణంబలరఁ జేసి
దారి స్నిగ్ధంబు హృద్యముఁజేయు మృదువులౌ
ఘనసీతులన్నియుఁ గాలుకొనక
సాధుపక్షులకై వడి జాలదవ్వ
చెదరి, పక్షంబులనువిప్పి బెదరిపఱచుఁ
గరము ననుకూలమగునట్టి గగనసీమ
మించు వేడుకతో విహరించుకొఱకు. 64

క. ఇటనుండి తిరిగెదమహో
త్కటమృదువృత్తానుకూల గగనస్థలికిన్;
పటుభాసురనిజరాజ్యము
నటఁజూపెడు "ఫ్రాన్సు" దేశమదె రమ్యముగన్. 65

క. మిగులన్ సాంఘికసుఖములఁ। దగిలి ప్రమోదించుదేశతల్లజమా! పె
ల్లుగ నీలో నీవలరుట। జగమెల్లను హర్షమియ్యఁజాలును నీకున్. 66

ఉ. మెల్లగఁబ్రోయు 'లోయరు' సమీపమునన్ సురపొన్నసీడలన్
జల్లనిగాలి సీటివలనన్ బరిశుద్ధతఁ గాంచి వీవఁగాఁ
బిల్లనగ్రోవి నేను శ్రుతిపీడినరాగముతోడ నూఁదుచో
నల్లన నెన్నిసార్లు మును పాడరు త్రుళ్ళుచు నీదుగాయకుల్? 67

చ. పలుమఱు నప్డు నాదువెడపాట తడంబడి మేటిరాగముల్
గలయఁగ వెక్కిరించుచును నర్తకునేర్పును గాసి చేసినన్

బలువిడి గ్రామమంతయును నాకుమహాద్భుతశక్తి మెచ్చుచుం
జెలుచ దినార్ధ మాటయును విస్మృతిచెంది యొనర్చె నృత్యముం.

చ. వయసునుబట్టి భేదము లవంబును గల్గక—వృద్ధవారలుం
రయముమెయి న్నిజార్భకుల నాట్యమొనర్పఁగఁ జెచ్చి రుబ్బునన్;
బ్రియమున సంగరాభినయవిద్యను బ్రౌఢిమఁ గన్నతాతయున్
జయజయ యంచు గంతులిడె వష్టివయస్క పటుభ్రాంతమగ్నతన్. 69

ఉ. చింతలులేని ధన్యమగుజీవనముం బ్రకటించు నీక్షితుల్ ;
వింతగ వ్యర్థకృత్యముల వీరిప్రపంచము పోవు నిత్యమున్;
స్వాంతమునందు గౌరవము వాంఛ యొనర్చుట నెల్లవారలుం;
సంతతమానసప్రియము సల్పెడువిద్యలె మెండు వీరికిం. 70

ఉ. పాత్రతఁబట్టి వచ్చుస్తుతిపాఠము లొండె, ననర్హునిన్పుల
స్తోత్రములొండె, గౌరవము నొప్పడ నిచ్చలుఁ జెల్లునిచ్చటం;
చిత్రముగాఁ బరస్పరము చేతికిఁ జేతికి మారుచుండి, స
ర్వత్ర చరించు గౌరవము వర్తకపుస్సరకై యమూల్యతం. 71

చ. జరగు సభాళినుండి యది సైన్యనివేశకుటీర పాళికిం;
స్థిరమతి నభ్యసింతురు స్తుతిప్రియతం గడు నెల్లవారు, న
క్షరసుఖులట్లు కన్పడుచుఁ, గన్పడు నట్లగునంత కెంతయుం
బరులను దన్పుచుం దనిసి, మన్నన నిత్తురు తాము గైకొనం. 72

ఉ. ఈసుకుమారవిద్య ముదమెంతగ వీరికిఁ గల్గ జేసినం
దోసము లుద్భవిల్లుటకుఁ దోరముగా నెడ మిచ్చు వీరిలో;
వేసర కన్యసంస్తుతికై ప్రీతివహించి, సదా తదర్థమే
యాసలుసల్పుచుంటఁగృశమౌచు మనోబల మంతయుం జెడుం. 73

చ. బలమఱి యాత్మయిట్లు సుఖభావముఁ దాఁ దనలోనఁ గానమిన్
జెలిమిని నమ్మియుండుఁ బరచిత్తమునే స్వసుఖార్థ మిందు ని

చ్చులు; నటుగాన వ్యర్థమగు చక్కనిటక్కుల దంభమిచ్చటన్
బలువ లోసంగు తుచ్ఛమగు ప్రస్తుతికే దగఁగాంచు నెంతయున్. 74

ఉ. ఇచ్చట వ్యర్థదంభము రహిన్ ముఖభంగవికారవేషమున్
గ్రచ్చుటఁ బూని, రాగిసరిగం దనగొంగడి కంచుఁ గూర్చెదన్
బిచ్చపుగర్వ మిచ్చటను బేర్పడ నేఁటికి నొక్కవిందుకై
వెచ్చ మొనర్చి, మోస మొదవించుకొనుం దననిత్యభుక్తికిన్. 75

క. చంచలలోకాచారము
పంచినయొక కెల్లఁబోవు స్వాంతం బెపుడున్
గొంచెంబైన గణింపదు
మించుగఁ దనయంతరాత్మ మెచ్చెడువిలునన్. 76

క. పరుగిడెడుబుద్ధియిప్పుడు
మరిభిన్నమనస్కులైన మనుజులపైకిన్;
వరవారధిగర్భమునం
దురవుగ 'హాలండు' దేశమున్నట్టియెడన్. 77

చ. విపులమహార్ణవుం డడరి పృథ్వికిఁ జేరగిలంగఁ బడ్డచోఁ
జపలతఁ బైఁబడన్ నిగుడుసాగరవీచుల నడ్డగింపఁగా
నిపుడు మహోన్నతాసదృశ కృత్రిమదుర్గము లేవఁదీయుచో
ర్పుపసను నిల్చియున్నటులె ప్రమోలను దోఁచెద రద్ధరాప్రజల్. 78

ఉ. ఆపయి నల్లనల్ల ననయంబును రక్షణకుడ్యసంచయం
బేపుగ వృద్ధినొందుచుఁ, గుయింగడుఁ బెట్టుజలంబులోనికిన్
జాఁపుచు దీర్ఘబాహులఁ, వెసంగొని రాజ్యమొకింత, వేలఁ దా
నోపిక నాక్రమించుకొనుచున్నటు లిప్పుడు నాకుఁ దోఁచెడున్. 79

సీ. బలిమి నిర్బంధింపఁబడినయట్టిసముద్రుఁ
డురుకుడ్యపఙ్క్తిపై నుండి నిక్కి,

మెల్లగాఁ బ్రవహించుమేలైన కాల్వలఁ
బచ్చక్రొవ్విరులయుపత్యకలను,
గన్నెరుగున్నలఁ జెన్నగుగట్టుల
వడి తగ్గి చనుయానపాత్రములను,
జనసంకులంబులౌ సంతకూటంబులఁ
గృషికర్మమున నొప్పుక్షేత్రములను,
దనదురాజ్యంబునుండి యుదారలీలఁ
గోరివిడిపింపఁబడినట్టి క్రొత్తసృష్టి
స్థలజలమయప్రపంచంబు-చెలువుమీఱ
దిగువతట్టున నగుచుండఁ దేఱిచూచు. 80

చ. అటువలె నబ్ధిభంగముల కంతట లోఁబడి దేశమెప్పుడున్
దటుకునఁ దన్నివాసులను దద్దయుఁ బాటుపడంగఁ జేసెడున్;
పటుగతిరాజ్యమేలుఁ బ్రతిమానసమందును గర్మశీల మ
చ్చట; మఱి కర్మశీలతయు సంధిలఁజేయు ధనప్రియత్వమున్. 81

ఉ. కావున, నిందఁగానఁబడుఁ గల్మినిగల్గెడి యెల్లమేళ్ళునున్
గేవలవిత్తవృద్ధి కలిగించెడుకీడులతోడఁ బూర్తిగన్;
భావములందు వారలతివాంఛ యొనర్చుధనంబు వారికిన్
వావిరిఁగూర్చు సౌఖ్యమును, వస్తుసమృద్ధియు, శోభయున్, గళల్.

మ. కనినన్ సూక్ష్మముగాఁగ, వారలకడం గాపట్యముల్ వంచనం
బును గానంబడు; విక్రయింపఁబడు నాభూమిన్ స్వతంత్రత్వముల్;
కనకాత్యద్భుతశక్తి ముందుపఱచున్ స్వాతంత్ర్యమెల్లన్ వడిన్;
ధనహీనుండది విక్రయించుఁ గొనునద్దానిన్ ధనాఢ్యుం డొగిన్. 83

చ. ఇదియు మనుష్యపీడకుల కిల్లును దాసుల కాటపట్టునై
పొదలుటచే, నభాగ్యులిటఁ బొల్పరునీచపుఁజావు వేఁడుచున్,

ఉ. ఇంతియకాదు సుమ్ము చెడుగెల్ల; నిసర్గజబంధముల్ చెఱన్,
జింతిలి ధర్మముల్ యశము స్నేహము స్వప్రభుతన్ దొలంగుటన్,
వింతధనవ్యవస్థల జనించినకృత్రిమ బంధజాలముల్
సంతతమున్ బలంపడి బలాత్కృతి నొంచు ననిష్టసత్కృతిన్. 95

క. కావున, సర్వవిధేయత । తావీనికిమాత్ర మెపుడు దాస్యముచేయున్;
ప్రావీణ్యంబడుగంటును; । నేవారికిఁ దెలియకేడ్చునిట యోగ్యతయున్.

సీ. కాలమిూఁకైవడిఁ గడవంగఁ గడవంగఁ
దనమనోజ్ఞతలెల్లఁ దరలవిడిచి,
నిలుపుదు రెచ్చోటఁ గులపతులు త్రముల్
దేశాభిమానాగ్ని తేజమెసఁగ,
శ్రమపడిరెచ్చోట రాజులుకీర్తికై
కవులెందువ్రాసిరి ఖ్యాతికొరకు,
నట్టిపండితులకుఁ బుట్టినయిల్లును
నాయుధపాణుల కాటపట్టు,
నైనయీదేశ మొకటనత్యాశచేత
సర్వదుర్వాసనలకును స్థానమగును;
పండితులు వీరభటులును బార్థివులును
సత్కృతినిబొందకేఁకముందుచత్తురిందు. 97

చ. కొలిచెద నంచునో ఘనులఁ, గోరినృపాళి నుతింతు నంచునో,
తలఁపఁగ బోకుఁడేనిటు స్వతంత్రతచేనగుకీడు లెన్నచో;
తొలఁగఁదోలుఁ డిట్టిదగుతుచ్ఛపువాంఛ మదాత్మనుండి, నా
తలఁపును బాయకుండెడి యథార్థసమర్థతలార! దవ్వుగన్. 98

సీ. ఉరుశోభ నలరారు నోస్వతంత్రత్వమా!
యల్లరిమూఁకల యాగ్రహమునఁ,

గ్రూరమహీపాలకుపితాసి నొక్కట
బాధలుపడ నలవడితివీవు ;
గర్వసంయుత తిరస్కారంబుచేనొండె,
జెలిమిఁ బెంచుకృపార్కచేతనొండె,
సమరీతిఁ జేటొందుక్షణభంగురం బైన
యలరుఁ బోలెడుదాన వైననీవు,
సతతమును మాఱుచుండు దేశంబునందు
నీవికాసముల్ స్థిరముగా నిలుచుఁగాత !
వానిని సురక్షితముగఁ గాపాడుకొఱకె
యొకటనేను నిరోధించుచున్నవాఁడ. 99

క. ఆలోచించెడువారలె, పాలింపఁగ వలయుఁ బాటుపడువారల నం
చీలోకానుభవం బది, వాలాయముఁ దెలుపుసరిగఁ బ్రతిదేశమునన్.

చ. క్షితిని స్వతంత్రతాగరిమ చేయఁగజాలుప్రయత్నమంతయున్
హితముగ నెల్లవారలపయిన్ సమభారముఁ బూన్పలేకదా?
అతిఘనవృద్ధి నొక్కటెగ యందఱిమించి యతిక్రమించినన్,
హతమొనరించు దానిద్విగుణం బగుభారము క్రిందివారలన్. 101

గీ. మించికొందఱు మాత్రమె కాంచునపుడు
దాని స్వాతంత్ర్యమంచును దలఁచువారు
సత్యమర్థించుదానికి సర్వమునకు
నుర్వి నెంతయంధులుగాఁగ నున్నవారు !

సీ. స్వాధికారంబును వ్యాపింపఁజేయంగ 102
రాజాధికారంబు హ్రస్వపఱిచి,
ప్రతిపక్షనాయకుల్ ప్రముఖులై సింహాస
నముఁ జుట్టుకొనఁగఁ బెనఁగునపుడుఁ,

దాము మాత్రంబె స్వతంత్రులై యుండుచో
నొక్కపక్షమువార లోకటఁజేరి,
యదియ స్వాతంత్ర్యతయంచును బిలువంగ
ననుమతించుటఁ గనుంగొనినయపుడు,
వేగ నాసన్నమగుచున్న పెనువిపత్తు,
గురుతరోద్రేకమును బురికొల్పినపుడు,
దక్క నాయాత్మశాంతతఁ దాల్చియుండుఁ;
దగదు పౌరికిత్తులు దాల్చి లేవ. 103

మ. సమకూర్చుం బ్రతిధర్మదాతయు విజేచ్ఛన్ నూత్నశిక్షాస్మృతుల్;
ఘనులన్ బీదలఁజుట్టుముల్; ధనయుతుల్ శాసింత్రుచట్టంబులన్
స్వామిహీన్ దాసులవిల్చుపొంటె శబరుల్ సంచారముల్చేయు దే
శములన్ దాసులనుండి సంపద యథేచ్ఛన్ గొల్లగొట్టంబడున్. 104

మ. భయకారుణ్య నయోగ్రకోపములు పైపైఁబొంగి, గోప్యస్థితిన్
బయలంబెట్టుచు, నుబ్బియున్న మనసుల్ బాహాటమున్ జేయ, ని
ర్దయులౌ నీమనుష్యులన్విడిచి పర్వంజూతు దేశాభిమా
నియు భీరుండును గొంతకొంతయగుచున్ బృథ్వీపతిం జేరఁగన్. 105

చ. ధర నధికారకాంక్ష తొలుతన్ నృపభూతినెదిర్చి, యాగతిన్
సరగున గౌరవంబు జనస్థలమంచెకలంచి, రాజ్యమున్
జరప మనస్సుపై ద్విగుణశక్తిని గల్మికి నిచ్చినట్టియా
పరమనికృష్టకాలమును, భ్రాత శపింపుము నీవునావలెన్. 106

చ. కనమె నిరర్థలోహమునకై యుపయుక్తజనుల్ 'బ్రిటానియా'
జనబహుళాబ్ధితీరముల సత్పరివర్తమొనర్పఁగా బడన్?
అని మొనఁ గల్గుతిజ్జయములన్నియు, దీపములాఱునప్డు భ
గ్గునగడుమండి మిగ్గుగతి, గొబ్బునాశముఁగూర్పఁ గానమే? 107

మ. కనమే సంపద స్వీయవైభవ మహోత్కర్షాభిరత్యుక్షమై
తనభృత్యాళికి నిండ్లుగట్టి విజయత్వంబుం గడుంగూర్చి, రొము
య్యూన వెన్కం జిఱుపల్లియల్ చెదరి యుండంగన్న క్షేత్రంబులన్
జనశూన్యంబగు వంధ్యదంభమున విశ్రాంతింపగం జొచ్చెంగదా! 108

క. కనమే మానమకటా యొక,
ఘనుఁడు వినోదంబుకొఱకుఁగా నిడు నాజ్ఞన్
జనసంచారము సతతముం,
గని మునుకలకలను నవ్వుగ్రామముకూలన్? 109

సీ. ఆజ్ఞానువర్తియై యలరెడుపుత్రుండు
నత్యంతజీర్ణాంగుఁడైనపితయు,
వినయశాలినియాచు వెలసెడుమాతయు
ఘనలజ్జగలయట్టి కన్యకయును,
నడవినిబ్రవహించు 'నాస్విగో' నది యొందు
స్వీయకచ్ఛములవ్యాపింపఁజేయు,
నెట 'నయగ్రా' నది ఘటియించు బధిరతఁ
బిడుగులవంటి చప్పుడులచేత,
నట్టి పశ్చిమజలధికి నవలనున్న,
దేశముల నివాసార్థమై తిరుగఁగనమె
స్వస్థలంబుల విడిచి నిర్బంధమునను,
మెలఁగుశోచనీయకుటుంబములనుమనము? 110

చ. తవిలిమనుష్యుతో మృగముతానెట రాజ్యముపాలుగోరునో,
యెవ్వచునో యెట్టి 'యిండియనుఁ' డెచ్చటఁ జావుగుఱిన్ శరంబు, న
య్యా విరళకాననాంతరములందు భయంకరమైన త్రోవలం
దెవఁడయినన్ సకృత్పథికుఁడిప్పుడుకూడనటం జరించుచోన్. 111

సీ. అచ్చోటనెంతయు నావర్తమయముతో
వాత్యాలోకసమునఁ బర్వుచుండఁ,
దనచుట్టు నెల్లెడఁ ద్రాసకరంబులౌ
మృగముల యార్పులు నిగుడుచుండ,
దీర్ఘ చింతాక్రాంత దేశబహిష్కృతుం
డతిదుఃఖభారంబుకతన వంగి,
నిస్తులభీతిచే నిలువంగ నోర్లక
సత్యహీనుండౌటఁ జనఁగ లేక,
యెచట 'నింగ్లాండు' మహిమలు హెచ్చి వెలుఁగు
నచటికిని దీర్ఘదృష్టుల నల్లఁ బఱపి
తొడరి నాయభిప్రాయంబు త్రోడఁ దనదు
మనసు నేకీభవింపంగఁ జుమ్మ. 112

చ. హృదయమునందెకోన వసియించెడుసౌఖ్యము బైలఁగాంచ, నే
వెదకుటయెల్ల వ్యర్థ మగు వేసట యయ్యె బహుప్రయాసతన్;
వదలి సుఖంబు విశ్రమముఁ, బైఁ బ్రతిరాజ్యము నిచ్చుసౌఖ్యమున్
వెదకఁగ దేశదేశముల వెంబడి నేటికి సంచరించితిన్? 113

ఉ. శాసను లెల్లరాజ్యముల రాజ్యముచేయుచునున్న, దుష్టమా
శాసనజాల మొండెఁ జెడు తీవ్రశతు లొండెను బాధ పెట్టినన్
శాసనముల్ నృపాలురు నొసంగను మాన్పను జాలుభాగ మా
హా! సరిచూడ, నెంతయసదా! జనచేతము లొందునంతలోన్. 114

ఉ. తెల్లముగా ధరిత్రిఁ బ్రతిదేశమునన్ మనమాత్మనమ్ముదం
బుల్లములోనె కన్గొనుచు మొండె సృజింపుదు మొండె నెప్పుడున్;
పెల్లుగ మోహయుక్షోభముల వేదన నొందక గూఢరీతితో
మెల్లఁగఁ బాఱుచుండు: బుడమిన్ గృహసౌఖ్య రసప్రవాహముల్.

ఉ. ఎత్తినగండ్రగొడ్డలియు, హింస రోయనర్చెడు చుట్టువాలునున్,
రిత్తగు 'ల్యూకు' లోహపుఁగిరీటము, 'డామియు' నిన్నపాన్పునన్,
బొత్తిగ నెప్పుడున్ ధనవిభుత్వవిదూరులపొంతఁ బోక, ఒల్
సొత్తుగ వారికి న్విడుచు శుద్ధమనస్కృత బుద్ధిభక్తియున్. 116

ఆ. వె. హూణకవులపోక లోకయింత తెలుపంగఁ
తెలుఁగువారికొఱకుఁ దేటగాను
'గోల్డుస్మిత్తు' ను కవిగూర్చినయట్టి యీ
పథికచరిత మేను వ్రాసినాఁడ.

క. ఒకభాషలోని సరసత
నొకభాషకుఁ దెచ్చు టెంతయును దుస్సాధ్యం
బకటా! నా కది శక్యమె?
సకలకవులు నాయశక్తి క్షమియింపఁదగున్.

జాన్ గిల్పిన్.

By

K. VEERESALINGAM

జాన్ గిల్పిన్

గీ. లండ ననియెడుపట్టణ మొండుగలదు,
దాన, గణ్యతయుఁ బ్రసిద్ధితద్దగలిగి,
యుద్ధవేళనె పనిచేయు యోధవరుఁడు,
జానుగిల్పిను వసియించు సంతతమును. 1

గీ. అతనిప్రియకాంత యొకనాఁడు పలికిననియె :—
"మనవివాహంబు నడచినదినమునుండి
యిరువదేండులు గడచియు, నింతవఱకుఁ
బండు గొక్కటియును జేసి యుండమెపుడు." 2

గీ. "మనదు పెండిలి నడచినదినము ఱేపు;
రెండుగుఱ్ఱాలఁ బూన్చిన బండినెక్కి,
వేగ నెడ్మాంటనున నుండు బెల్లునకును,
నందఱముఁ గూడిపోవుదమందుకొఱకు. 3

గీ. "నాదుసోదరియును, దానినందనుండు,
నేను బిడ్డలుమూవురు, నెమ్మదిగను
బండిలోనుండెదము; మీరు బండివెనుక,
వారువము నెక్కి తగ నేగుదేరవలయు." 4

గీ. ఇంతి కాతఁడు వేగంబ యిట్టులనియె :—
"మెలఁతలం దొక్కతెనె నేను మెచ్చుకొందు
నదియుఁ బ్రాణనాయిక నిన్నెయగునుజుమ్మ:
కనుక, నల్లె కావింతము మనము రేపు" 5

గీ. "గొప్పనారబట్టల వర్తకుండ నంచు,
జగమెఱుంగునుగాదె యోమగువ! నన్ను;
ప్రాణమిత్రుఁడుమనపట్టువర్తకుండు,
తనదుగుఱ్ఱంబు, నెరువిచ్చుఁ బనఁగనాకు." 6

గీ. భార్యయిట్లనె—"బాగుగఁ బలికితీవు;
ద్రాక్షసారాయి ప్రియమౌట దానికొఱకు,
రంగుగలదిగాను, గడుశుభ్రంబుగాను
నున్న మనచెక్కొంపోవుద మొండుదక్క." 7

గీ. దానికపరిమితానందమూని, యాతఁ,
డట్టిసంతోషసమయంబునందుఁగూడఁ,
బ్రియవధూమణి తామితవ్యయమునందె,
పెద్దతివిలియుంటకు ముద్దుపెట్టుకొనియె. 8

గీ. తెల్లవాఱెను, బండియు నల్లవచ్చెఁ,
గాని, యెల్లరు గర్వముఁగలదటంచుఁ
దనుఁదలఁతురంచు, గుమ్మముదరికిదాపఁ,
దీసికొనిరాకయుండంగఁదెఱవపనిచె. 9

గీ. అంతుచే, మూడుగుమ్మములంతదూర,
మున నెయాగెను శకటంబు, పోయియటకు
నొకరినొక్కరుమించఁగనొక్కసారి,
యాఱుగురునందుఁజొచ్చిరియాత్రముగను. 10

గీ. చబుకకదలెను; జక్రముల్ సరగఁదిరిగె;
బండిలోనివారానందభరితులయిరి;
కలగలమటంచు దిగువను శిలలు మొరసె,
నడుగుతట్టునకును వెఱ్ఱిక్రోడరినట్లు. 11

గీ. జానుగిల్పిను గుఱ్ఱపుసరసకరిగి,
వ్రేలుజూలును గరమున వేగ బట్టి,
స్వారిసేయంగఁబైకెక్కె సంభ్రమమున;
కానిశీఘ్రంబదిగి వెనుఁగ్రమ్మఱంగ. 12

గీ. తనదుపయనంబుసాగింపఁదలఁచియతఁడు,
వారువపుఁబల్లమునొకింతచేరతడవ,
వెనుకవంకకు దలద్రిప్పి కనియెనపుడ,
మూవుర, సరకుఁగొనలోనఁబోవువారి. 13

గీ. కాలయాపనమగుటకుఁజాలచింత,
గదిరియును, సొమ్ముచనుటంతకన్నఁదన్నుఁ
జింతనొందించునని తనచిత్తమందు,
నెఱుఁగుఁగావున, దిగివచ్చెనింటికతఁడు. 14

గీ. చాలసేపటిదాఁకను, సరకుఁగొనెడు,
వారిమదికిఁ గుదురదయ్యె బేర మపుడు;
ద్రాక్షసారాయిమఱచియెతరలిరంచు,
నరచుచునుమేడదిగివచ్చెనబలయోర్తు. 15

గీ. "అయ్యయో! యెంతమఱపయ్యె! నయిననేమి ?
లెమ్ము నాకడకది; సాధకమ్ముచేయు
నపుడు కత్తినివేసెడు నట్టినడుము
పటకయున్నదిలే" యని పలికె నతఁడు. 16

గీ. శ్రద్ధ కలదయి యాతనిచాన, తనకుఁ,
బ్రాణపద మైనసారాయి పట్టుటకును
రాతిజాడీల రెంటి జాగ్రత్తచేసి
భద్రముగ దానివానిలోపలనుబోసె. 17

గీ. ఉండె బుడ్డిబుడ్డికి నొక్క యుంగ్రవుఁజెవి,
దానిలోనుండి తనపటకాను దూర్చి,
రెండుప్రక్కలఁ దూఁకంబు నిడియుండఁ
బ్రక్క కొక్కటి వ్రేలాడఁబడఁగఁ గట్టె. 18

గీ. అంతయును గానరాకుండ, నడుగుమొదలు,
శిరసువఱకునువలువఁగ్రై నేసికొనఁగ

నుదికి వెచ్చినపొడుగంగి నొక్కదాని,
నెత్తుదానిఁ జక్కఁగ ధరియించుకొనియె. 19

గీ. అవలఁ జుఱుకై నతఁడపూర్వహయము నెక్కి,
తిరిగి పయనంబు సాఁగించె దిగువనున్న
రాళ్లపై గుఱ్ఱ మధికజాగ్రత్తతోడఁ,
గడుమెలంకువ మెల్లఁగా నడచుచుండ. 20

గీ. బాగుగా నాడకట్టిన పాదములకు
శీఘ్రమే మంచిమార్గంబు చిక్కఁగాన,
హెచ్చు దాఁటులు వేయుచుఁ జొచ్చె హయము
రాపిడిని నాతఁ డెంతయు వంతనొంద. 21

గీ. అందుచే, జానటంచును నఱచె నతఁడు,
స్పష్టముగ మెల్ల నది యెల్ల వ్యర్థమయ్యె
పగ్గమును గళ్లెమును గల్గి పనికిరాక,
యల్లదాఁటులె వడిఁబరుగయ్యెఁగాన. 22

గీ. తిన్నఁగాఁ గూరుచుండ లేకున్నవాఁడు,
గాన, దానిపై నడ్డముగాఁగ వంగి
రెండుచేతులతో నేకరీతిగాను,
బలముకొలఁదిని జూలును బట్టుకొనియె. 23

గీ. తొల్లి యెన్నఁడు నారీతిఁ దురగ మద్ది,
యూఁది పట్టుకోఁబడ్డది కాదుగానఁ
దనదువీపుపై నెద్దియొ క్కానొయటంచు,
జడిసి మతిమతి యద్భుతపడుచునుండె. 24

గీ. దూరముగఁ బోయె గిల్పిను, దూరముగను
బోయె జుట్టును టోపి బోడితలగ;
నతఁడు బయలుదేఱెడియప్పు డాత్మయందు
నింతపని సంభవించునం చెఱుఁగఁడయ్యె. 25

గీ. గాలివీవంగఁ జొచ్చెను, గదలఁ దొడఁగె
నంగియును బెద్దధ్వజపటమట్లు మిగుల;
కొక్కెములును గుండీలును గూడనూడి
తుదకుఁ బైనుండి యంగియుఁ దొలఁగిపోయె. 26

గీ. పయిని జెప్పినరీతిని బ్రక్క కొకటి
వ్రేలునట్టుగఁ గట్టినవింతయైన
బుడ్లు రెండును జనులెల్ల బ్రోవుగూడి
చోద్యపడిచూడఁ దగియుండె సూటిగాను. 27

గీ. కుక్క లఱచెను, వీధిలోఁ గుఱ్ఱవాండ్రు
పెద్దకేకలువైచిరి, పెద్దవారు
తమగవాక్షములనుజేరి తిగినయట్లు,
లయ్యోనంచును గట్టిగా నఱచిరొకట. 28

గీ. ఒక్కవడిఁ బోయె జాన్గిల్పినొక్కరుండ—
"బుడ్లు కట్టుకొనియె! పందెమును వహించె!
లక్షసేయు!" యటంచును దత్క్షణంబ
యతనికీర్తి వ్యాపించెను నన్నిదెసల. 29

గీ. వాయువేగంబుతోఁ జేర వచ్చినపుడు,
వీధికావలివారలు వింతగాను
నిమిషమాత్రంబులోపల గమిడినెట్లు,
తెఱచిరోచూడఁజిత్రంబుమరియుఁగరము. 30

గీ. పొగలువెడలెడుతనతలమిగులఁగుంచి,
బోరగిలఁబండుకొనిక్రిందఁబోవునపుడు
మున్ను వెనుకను గట్టినబుడ్లు రెండు,
నొక్కదెబ్బను బగిలెను బ్రక్కలుగను. 31

గీ. కాంచుటకు నెంతయునుజాలిగదురునట్లు,
తెరువునిండసారాయిదిగువఁగాఱె;

మున్నుకఱ్ఱోఁగడుఁగొట్టియున్నకతన,
హయముప్రక్కలఁబొంగలేచెనందుచేత. 32

గీ. త్రోలునడికట్టుబిగియింపుతోడ, నింక
బరువు మోచునట్టులె కానఁబడియె నతఁడు,
నడుమునను వ్రేలుజాడీలమెడల, నెల్ల
వారునిప్పుడుఁ జూడంగవచ్చుఁ గాన. 33

గీ. అంతబిగిని, నెడ్మాంటనునందు నుండు,
వాషనుప్రదేశమునకును వచ్చుదాఁక,
నాతఁ డైస్లింగుటనుగుండ నాడెనిట్టి,
నాటకంబును సంతతానందమునను. 34

గీ. పథముపొడుగున రస మిరుప్రక్కలందుఁ
గలయఁ గలయంపి చల్లె నక్కడ నతండు;
అలుకుగుడ్డ నొందెను, బాతులాటయందుఁ
బాచికల నొందె, దొరలించుపగిది తోఁప. 35

గీ. అప్పు డెడ్మాంట ననుగ్రామమందు నుండి,
యతనిప్రియభార్యయు వసారయందు నిలిచి
కాంచె హృదయేశ్వరునివంకఁ గన్నులార,
నట్లు స్వారిచేయుట కెంతో యబ్బురపడుచు. 36

గీ. "ఆఁగు మాఁగుము; గృహ మిదె; యరుగ వలను;
భోజనపువేళ యయ్యె; మేము నలసితిమి"
యంచు నందఱు నొకపెట్ట నఱచి రపుడు—
"నేను నట్లైతి" ననియెను జాను నంత. 37

గీ. కాని, గుఱ్ఱంబు రవ్వంతయైన నచట
నిలువ నిష్టంబు పడకుండె; నేలనిలుచు
దానియజమానుఁ డామడదవ్వు నందు
వేరనెడి చోఁ గలిగియుండ వేఱెయిల్లు. 38

గీ. బలముగలయట్టినెఱవింటివానిచేత
విడువఁబడినట్టిబాణంబువిధముగాఁగఁ
బఱచె నశ్వంబు, దానిపైఁ బఱచెనతఁడు—
కథయు సగమయ్యె నాకు నిక్కడకుఁ జూడ. 39

గీ. తనకుమిత్త్రుఁ డౌపట్టువర్తకునియింటి
వెలుపలఁదుదకుఁదురగంబునిలుచుదాఁక
దవ్వుగాఁబోయె గిల్పిను, తనకొకింత
యిష్టమేనియు లేకుండ సింతలోన. 40

గీ. తనకుపొరుగువాఁ డావేషమునను వచ్చి
టద్భుతంపడి చూచి, పొగాకుగొట్ట
ముచటఁ బడవైచి, గుమ్మంబునండ కరిగి
తొలుతనీరీతి నాతనిఁ బలుకరించె 41

గీ. "వార్తలేమిటి? యేమిటి? వడిగఁజెప్పు;
చెప్పు నీవర్తమానంబు శీఘ్రముగను
వట్టితలతోడ నేటికి వచ్చితీవు?
కదలి యిచటకు రానేల మొదల నీవు?" 42

గీ. అవసరోచిత మైనట్టిహాస్యమందు
మిగులఁ బ్రియుఁ డౌటఁ దననేర్పు మెఱసి యతఁడు
ముఖవికాసంబు నటియించి, మురువుదోఁపఁ
బట్టువర్తకుతోడుతఁ బలికె నిట్లు. 43

గీ. "వారువం బిటు రాఁగోర, వచ్చితేను;
చక్కఁగా జ్యోతిషము చెప్పఁజాలితేని
నాకృతకశిఖ కుళ్ళాయినన్నుఁజేరు;
తెన్నునడుమను నవిపడియున్నవిపుడు" 44

గీ. ఆత్మసఖుఁడు కుతూహలాయత్తుఁ డగుచు
నుంట కెంతయు నలరారి, యొక్కమాట

యైన మాఱుగాఁ బల్కక, యపుడ తనదు
భవనమును జొచ్చి యాఁపట్టువర్తకుండు. 45

గీ. కల్లజుట్టు టోపియుఁ గొంచునల్లవచ్చె
మందిరమునుండి ; రెండునునందముగనె
యుండె—జుట్టది వ్రేలాడుచుండె వెనుక
కరముఁ గుళ్ళాయి చెడ్డదికాకయుండె. 46

గీ. వానిరెంటిని బైకెత్తి పట్టిచూపి
తనచమత్కారమును దోఁప ననియెనిట్లు——
'కనఁగ నాతల నీతలకంటె రెట్టి
గాన సరిపెట్టుకొనవలె వీని నీవు.' 47

గీ. నీకు నెమ్మోమునందును నెలవుకొన్న
దుమ్ము నించుక దయచేసితుడువనిమ్ము ;
నిండ నీ వాఁకలిసి గొనియుండవచ్చు ;
నిప్పుడిటనిల్చిభుజియించియేగుమవల.' 48

గీ. అందుమీఁదను జానిట్టు లనియె—"నేఁడు
నావివాహదినము ; వేరునందు నేను,
భార్య యెడ్మాంటనున, విందుఁ బరఁగఁగొన్న
లోకమెల్లను మముఁజూచిలోన నగరె ?" 49

గీ. వాని నాలించి తనతేజివంక మరలి
యనియె——'నే నిష్ట గుడువంగఁ జనఁగవలయు;
నీవు నీయిష్టమునుబట్టి యిటకు వచ్చి
తట్లు నాయిష్టమునుబట్టి యరుగు మరల. " 50

గీ. అహహా ! దురదృష్టవాక్యంబు ! వ్యర్థదంభ !
మంచునకుఁదోడనే తగినట్టులయ్యె——
నంచు ముచ్చటించుచునుండ నఱచెనొక్క—
ఖరము సంగీతసరణిని గట్టిగాను. 51

గీ. అందుపై సింహాగర్జనం బాలకించి
నట్టులికిలించుచును లేచి, యడరి పట్టఁ
బగ్గములు లేక, యొక్కటఁ బరుగువాఱెఁ
దొంటికై వడినేయల్ల తురగమప్పుడు. 52

గీ. దూరముగఁ బోయె గిల్పిను, దూరముగను
బోయె మూయజుట్టుఁ బెనుకుళ్ళాయి మిగుల;
త్రొంటికంటెను నీసారి నొలఁగె వేగ
నవియు, మిక్కిలి పెద్దవియాటకతన. 53

గీ. ఊరువాఁటి పయికిఁ జాలదూరముగను
దనదు వెలిమి పఱగడఁ జనఁగఁ జూచి
నప్పు డాతని భార్యయు నాత్రముగను
బంగరువరాను నొకదాసిఁ బైకిఁ దీసి. 54

గీ. బెల్లునకుఁ దమ్ముఁ గొనివచ్చి విడిచినట్టి
బండికుఱ్ఱనిఁ గన్గొని పలికె నిట్లు—
'సుఖముగా నాదు నాథుని సొంపు చెడక
నిలిపి తెచ్చితేనియు నది నీది సుమ్ము. 55

గీ. వాఁడును దురంగమును నెక్కి వడి వెనుకకుఁ
గ్రమ్మఱఁగ వచ్చు జానును గలిసికొంచుఁ
గళ్ళెమును బట్టుకొంటచేఁ గడలకుండ
నిలుప యత్నించె దానిని నిమిషమునను. 56

గీ. సంతసంబున నాలాగె సలుపుఁ గాని
యైన, నను కొన్నయట్టు చేయంగ లేక,
భీతవాహము మఱింత బెదరఁ గొట్టి
మఱియు వేగంబుగా దానిఁ బఱవఁ జేసె. 57

గీ. దవ్వుగను నేగె గిల్పిను, దవ్వుగాను
జాంఘికుఁడు నేగె వెన్నంటి జానుతోడ ;

బండికుట్టనిగుట్టంబు బండియొక్క–
చక్రములబాధపోకకు సంతసించె. 58

గీ. పథికు లార్గురు, త్రోవలోఁ బరుగువాఱు
జాను, నాతనివెనుకను సత్వరముగఁ
దఱుముకొని పోవుకుఱ్ఱని, దవులఁ గాంచి
దొంగయని యెంచి యార్చి రందఱును నిట్లు—— 59

గీ. 'తస్కరుఁడ ! యాగు మాగుము దారిదొంగ !'
యొక్కరుఁడు నందు నూరక యుండ రైరి
దారిపట్టుక పోయెడువార లెల్లఁ
దప్పకుండఁగఁ జేరి రాతఱుముటందు. 60

గీ. పన్నఁ గొనువారు 'మునుపటివలె నెజాను
పందియము వాఱుచున్నట్టు డెందమందుఁ
దలచుటను, వీధి కడ్డగుతలుపు లపుడ
తీయఁబడియెను జనుటకుఁ దెఱపిగాఁగ. 61

గీ. అట్లుచేని యీపందెము నతఁడె గెల్చెఁ
దానెముందుగఁబురిచొచ్చెఁగాననిపుడు
ఎందునాగఁడయ్యెను బూర్వమెక్కినట్టి
తిన్నెచెంతనె క్రమ్మఱదిగినదాఁక. 62

గీ. నృపుఁడ ! చిరజీవివిగఁగమ్ము నీవు ; జాన!
నీవునక్లైకమ్మంచు వర్ణింతమిపుడు ;
వెండియును నాతఁడిటుస్వారివెడలునపుడు
కనుటకును నేనునచటకుఁ జనుదుగాక ! 63

గీ. కౌప రనియెడియింగ్లీషుకవివరుండు
హాస్యకృతిగాఁగమును చేసినట్టిదీనిఁ
దేటగీతులతోడను దెనుఁగునందుఁ
గందుకూరి వీరేశలింగము రచించె. 64

నీ తి దీ పి క.

By

K. VEERESALINGAM

నీతిదీపిక.

దేవుఁడు.

ఆ. శ్రీలొసంగ నాదుచిత్తంబులోపల
భక్తితోడనిలిపి ప్రస్తుతింతు,
నిఖిలలోకవంద్యు నిత్యునిఁ బరమేశు
నాశ్రితజనశరణ్యు నగ్రగణ్యు. 1

ఆ. తెల్లవారలేచి దినమెల్ల గావించు
పనులలోనఁ గానిపనులు కొన్ని
కలుగుఁ గాన, వానిఁగరుణతోసైరింప
దేవుఁగొలువవలయుదినమునందు. 2

తే. పనులఁజాలించి, నిద్రింపఁజనెడునపుడు
మనసులోనీశ్వరుని వేఁడుకొనఁగవలయు,
నొడలెఱుంగకనిదిరించుచున్నయపుడు
మనకునొకకీడురాకుండమనుచుకొఱకు. 3

తే. మనకుమేలైనయపుడెల్ల, మఱచిపోక
దైవమును జాలభక్తితోఁదలఁపవలయు;
నతనిదయచేతనేకదా యట్టిశుభము
లొదవుమనకని గట్టిగా మదినెఱింగి. 4

తే. కీడుమూఁడినవాఁడును వేఁడుకొనుము
నీవు, భగవంతుదృఢముగా భావమందు
నట్టియాపద నడఁగింప, నతఁడెతక్క-
మఱియొకండుసమర్థుఁడుమహిని లేఁడు.

తనవారు.

తే. తొలుతనెన్నెన్నొవ్రతములుసలిపి, గర్భ
మందు నవమాసములుమోసి, యవలఁగాంచి

పెంచి, పెద్దవానిగఁ జేసి మంచినట్టి
తల్లిఋణమింపుకయుఁ దీర్పఁదరమె మనకు? 6

తే. విద్యయును బుద్ధి చెప్పించి, వెలయఁజేసి
కాయమొక్కింతనొచ్చినఁ గలఁతపడుచుఁ
దగుచికిత్సలఁ జేయించి, తెగులుమాన్పి
మనల నింతవారిగఁ జేసె జనకుఁ డరసి. 7

తే. ఒక్కగర్భవాసంబున నుద్భవించి,
యొక్కతల్లి పాలఁ బెరిగి, యొక్కశయ్యఁ
బండుకొని యుండి, పయిఁ బ్రక్కఁ బడుచు నుండు
సోదరులు పరస్పరమైత్రి నుండవలయు. 8

తే. చేయవలెఁ దల్లిదండ్రులు చెప్పుపనిని
మాఱువల్కక పుత్రుండు, మనినదనుకఁ
జుట్టములనెల్ల బ్రేమతోఁ జూడవలయుఁ
జేతనైనంతసాయంబుఁ జేయు చెపుడు. 9

మ ం చి బా లుఁ డు.

ఆ. ప్రొద్దుపొడువకుండ నిద్దురమేల్కని
సమయకృత్యములను జక్కఁబెట్టి
పుస్తకములఁ గొనుచుఁ బొరుగుపిల్లలఁగూడి,
బడికిఁబోవు మంచిబాలకుండు. 10

తే. భోజనముచేయునప్పుడు బుద్ధిగలిగి
లేనివస్తువులైనమ్మని లేనిపోని
యాగడముచేసి యలఁచక, వేగమునను
గలకొలందినిభుజియించికదలిపోవు. 11

తే. తానుబడియందుజదివినదానినెపుడు
మఱచిపోవక, వల్లించుమరలమరలఁ

బుస్తకంబులఁ జింపక, పొదుపుగాను
వాడుకొనుచుండుఁదనతోడివారు మెచ్చ. 12

తే. తనకుదీక్షికయైనట్టితజీని దినము,
సెలవులిచ్చినదినములఁ జింతనంబు
సేయుచును, నాటపాటల చేతఁ బోక
కరము ప్రాఁత పాఠంబులగట్టిచేయు. 13

తే. చెడ్డబిడ్డలతోఁ జెల్మిఁ జేయఁబోఁడు;
తల్లిదండ్రులమాటల దాఁటకుండు
గురుని దైవంబుగా నెంచి కొలువుసేయుఁ;
జూడమనసైన, నల్లరిజూడ; జనఁడు 14

విద్య.

ఆ. విద్యవలన మిగుల వినయంబు గలుగును;
విద్యచేతఁ దెలివి విస్తరిల్లు;
విద్యచేతఁగరము వెలయును యోగ్యత;
విద్యలేనివాఁడు వింతపశువు. 15

ఆ. ధనముతఱిఁగిపోవు దానంబుచేసిన,
విద్య దానమునను వృద్ధినొందు;
విత్తమరసిచూడ విద్యాధనముతోడ
నీడ నంగఁ దగునె యించుకైన? 16

ఆ. చదువువేళ నీకు సందేహమేదేని
తోఁచెనేని, మదినిదాఁచుకొనక,
గురునియొద్దకరిగి, గొబ్బుననడుగుము;
సిగ్గుపడియె దేని, చెడుదువీవ. 17

ఆ. మురుగులుంగరములు ముత్యంపుసరులును
బురుషుని గయుసేయు భూషణములె?

యరనిమేషమునకు నన్నియునశియించు;
విద్యయొకటె యెప్పుడువిడనిసొమ్మడవు. 18

తే. రాజుతనదేశముననెగౌరవముగాంచుఁ;
బండితుఁడో, యెల్లయెడగౌరవమ్ముఁబడయుఁ;
జనువునకు రాజ్యమైనను జాలదనఁగ,
విద్యతోసాటి మఱియేదివిశ్వమునను ? 19

అ డఁ కు వ.

ఆ. ఎంతకలిమిగలుగు, సంతయడంకువఁ
గలిగియుండవలయు, గర్వపడక ;
యన్నిగుణములుండి, యడఁకువ లేకున్న
నిష్ఫలంబులవియు నిశ్చయముగ. 20

తే. చదువునకుఁదోడువినయంబుగుదిరియుంట
పసిఁడికినివావియబ్బిన భాతియగును
విద్యగలిగియు నడఁకువ వెలయకుంట
యమరతరువునుగచ్చచెట్టులమిక్కొనుట. 21

ఆ. అణఁగిమణఁగియుండునాతనిగుణములు,
కొలఁదివైన, మిగుల గొప్పవగును ;
విఱ్ఱవీఁగుచుండువీఱిఁడిగుణములు,
గొప్పవైన, మిగులఁగొలఁదివగును. 22

తే. క్రిందుమీఁదును గానక కెరలిపడెడు
నరునిసుగుణములెయవగుణంబులగును;
జెప్పనేటికి? వానికిఁ జెడుగుణములె
కలిగియున్న, నిఁకెట్టుగాఁదలఁపఁబడునో. 23

గ ర్వ ము

తే. కలిమి భువిలోన నీకెంతకలిగియున్న,
గర్వపడకుము నేనెకా ఘనుఁడననుచు

నెంతసిరియుండు, నంతకు నేనుమదుఁగు
లడఁగియుండు; నీకయ్య శ్రేయస్కరంబు. 24

తే. తన్నుఁదాగొప్పవానిఁగ, దలచునట్టి
కాని, చెప్పుకొనెడునట్టికాని, నరుని
బరిహాసింతురు, చాటునఁ బ్రజలుమిగులఁ;
గనుక, నాత్మప్రశంసదమోయనుచితంబు. 25

తే. మనకు లేనివిద్యలయు గొప్పతనము, మనకు
గలదటంచునటించినఁ గల్ల తెలిసి
ప్రజలుమనలనవ్వుదురుచప్పటలుగొట్టి
యవిలవము లేనినరుకం బెనలుసుచేసి. 26

తృ ప్తి.

తే. తనకుఁగలమేలుతోడనె తనివిపొంద,
మోద మొదవును; మఱిచాల లేదటంచు
మనసులోపలచింతతో వనరుచున్న,
సౌఖ్యమెడఁబాయు, నిచ్చలుశ్రమముగకురు. 27

తే. సౌఖ్యమబ్బెడునంచు, దేశమ్ములెల్లఁ
దిరుగఁబనిలేదు; మదిలోనఁదృప్తియొకటి
కలిగెనేనియు, నింటనె కలుగుసుఖము;
తుష్టి లేదేని, సౌఖ్యంబు దొరకదెందు. 28

తే. ఇంతచదివితిఁజాలదె? యింక నేల?
యనుచుఁదనకున్న విద్యతో మనుజుఁడెపుడుఁ
దృప్తినొందుచునుండుట, తెలివి లేమి;
బ్రతికినన్నాళ్ళు, విద్యను బడయవలయు. 29

ధై ర్య ము.

తే. ఆపదలువచ్చినపు డధైర్యంబువడిన,
నంతకంతకు మఱిచింత యతిశయిల్లుఁ;

నొంచెమైనను దానిచేఁ గూడిరాదు;
కాన, నట్టిచో ధైర్యంబె పూనవలయు. 30

తే. ఎంతజాగ్రత్తతోనున్న, నెన్నఁడేని
నొక్కసమయంబున విపత్తులొదవకుండ
వట్టిపట్టులఁ, గీడు పోఁగొట్టుకొనెడు
వెరవురోయంగఁజనుఁగాని, వెఱవఁదగదు. 31

స త్య ము.

తే. తండ్రిదండించు, గృహమునఁదల్లితిట్టు
గురుఁడుపాఠశాలకుఁబోవఁగోపపడును,
తోడిబాలురుదూషింత్రు తులువయనుచుఁ,
గానఁగూడదు బొంకుచుకల్లలాడ. 32

ఆ. పాఠశాలలందు బాలురుకొందఱు
తప్పుచేసి, దానిఁ గప్పిపుచ్చ
బొంకుచుందురదియుఁ బూర్వపుదానితోఁ
గలియ, రెండుకావె కానిపనులు? 33

ఆ. ఎప్పుడైనఁగల్ల నించుక పలికిన,
నమ్మరెన్నఁడితరనరులు వానిఁ;
దఱచునీతిపూని, దబ్బఱలాడెడు
చెడుగుమాటవేఱ చెప్పనేల? 34

ఆ. ప్రాణహానియైన, బంధుహానియునైన,
విత్తహానియైన, వినుముకడకు
మానహానియైన మఱియేమియైనను,
బొంకకుండువాఁడె పుణ్యతముఁడు. 35

జీ వ హిం స.

ఆ. చీమమొదలుగలుగుచిన్నజంతువులకు
హింసచేయుచుండ్రుహీనమతులు;

తమ్ముమించువారు తమకట్లుచేసిన,
నెట్టులుండునొక్కొ యెఱుఁగలేరు. 36

ఆ. అల్పజంతువులకు హానిఁజేయుచునున్న;
నంతకంతకదియె స్వాంతమునకు
బట్టువడుచుఁబిదపఁ జెట్టులనరులకుఁ
జేయుబుద్ధిపుట్టఁ జేటుమూఁడు. 37

ఆ. దోమ మొదలుపెద్దసామజంబువఱకుఁ
గలుగుజంతువులకకారణంబ,
బాధసేయకుండవలయును సతతంబు;
హింసకూడదనెడియెఱుకగలిగి. 38

ఆ. ప్రాణికోటియెడలఁ మాయనిదయగల్గు
వారియందు, దైవమారయంగఁ
గరమనుగ్రహంబు గలిగియుండునుఁ గాన,
హింససేయఁగూడ దించుకైన. 39

సర్వ జన సమాదరము.

ఆ. గొప్పవారలైనఁ, గొంచెపువారైన
నన్నదమ్ములగుచు దరసిచూడ
దైవమొకనివలనఁ దారందఱునుగల్గి
యొక్కపుడమియందెయుండుకతన. 40

ఆ. కాన, భేదబుద్ధి గల్పించుకొనిత్రుళ్ళి
పడక, యెపుడు లేనివారిఁ గన్న
నాదరింప వలయు సోదరభావంబు
తోడఁ, జేతనైనతోడునూపి. 41

తే. అవనిలోపల, నధికార మబ్బెనేని
క్రిందివారల నెప్పుడుఁగినియఁదగదు ;

దానిచేఁ, దనదౌష్ట్యంబె కానఁగను;
గాని, వచ్చులాభము లేశమైన లేదు. 42

తే. కొలువుకుదిరినవానిని, గార్మికోడఁ
గనుచునుండినఁజేసెడిపనిని వాఁడు
తనమనఃపూర్తితోఁ జేయు ; దానఁ, బనియు
మేలుగానుండు గసరెసువేళకన్న. 43

ఆ. ప్రేమఁజూడఁబడినభృత్యుండు, సత్యంబు
స్వామిభక్తిగలిగి, పలుకుఁబనులు
ప్రభువుమీఁదిప్రేమఁ, బ్రాణంబులనునిచ్చు
సరకుగొనక, కొన్నిసమయములను. 44

పా టు ప డు ట.

ఆ. ధరణిని సకలంబు దైవంబుసృజియించి,
పాటుపడెడువాని పాలుచేసెఁ ;
బాటు పడినచోట, ఫలియించునన్నియుఁ
బాటువడకయున్న, ఫలముగలదె ? 45

ఆ. తగినపాటుదేహదార్ఢ్యంబు వెలయించుఁ ;
దగినపాటు మేనితెగులు మాన్చుఁ ;
దగినపాటు కలిమిఁ దప్పక కలిగించుఁ ;
బాటుపడుటతోడసాటిగలదె ? 46

ఆ. పాటులేక దేహపాటవం బడఁగును ;
పాటులేకసౌఖ్యపదవి తగ్గుఁ ;
బాటులేకయొడల బహురోగములుచేరుఁ
బాటులేనిసౌఖ్య పాటులేదు. 47

ఆ. ఇట్లుజరిగియుండ, నింతటిసిరు లుండ
భృత్యులింతమంది బెరసియుండ

నేనుబనులఁ జేయ నేల ? యనకొకింత
కాయకష్టమెప్పుడుఁ జేయవలయు. 48

ఆ. కష్టపడుట మంచి కార్యంబటంచును
గానిపనులయందుఁ గష్టపడకు ;
హానికరము కరమునతికాయకష్టంబుఁ
బుడమిలవముఁగష్టపడమిఁబోలె. 49

శ రీ రా రో గ్య ము.

తే. అన్నిటికి ముఖ్య మాత్మదేహంబునందుఁ
గొఱఁతరాకుండఁగా పాడుకొనుచునుంట ;
తాను దిన్నఁగాఁదిరిగెడుతఱినిగాదె
సర్వధర్మములును జేయశక్తుఁడగుట. 50

తే. మానవుండు దేహారోగ్యమూనుకొఱకుఁ
బ్రతిదినంబు నెనిమిదైనఁ, బదియునైన
గంటలవఱకు, మేనికిఁగాని, మదికిఁ
గానితగినంతపనిగల్గి క్రాలవలయు. 51

తే. వ్రాలుమాలక, స్నానంబుఁబ్రత్యహంబుఁ
జేయుచును, మేనిమురికెల్లఁ బాయునట్లు
కాయమంతయు శుభ్రముగాఁగఁదోము
కొనఁగవలయు, నారోగ్యంబుగోరువారు. 52

తే. అట్లుపనిఁజేయుపిమ్మట, ననుదినంబు
కొంతసేపైన, నుత్సాహ మింతగలుగు
వేడుకలఁబ్రొద్దుపుచ్చుచు, వెనుక, రాత్రి
యేడెనిమిదిగంటలునిద్రఁగూడవలయు. 53

తే. ప్రతిదినంబును, దాఁ జల్లపాటువేళ,
బయలఁ దప్పకయొకగంటవఱకునైనఁ

దిరుగవలయును, దేహంబుదృఢతగాంచి
యెపుడుఁదరుగంగసత్వంబునిచ్చుకొరకు. 54

ఆ. కల్మషోదకంబు గలిగించువ్యాధిని;
నిర్మలోదకంబు నిలుపుదానిఁ,
దెలిసివడియఁగట్టుజలమె గ్రోలఁగఁదగు,
సౌఖ్యమందఁదలఁచు జనుఁడువినుఁడు. 55

తే. మితముతప్పిభుజించుట మేరగాదు;
మిగులఁగుడిచిన, నొడలికిఁదెగులుగలుగుఁ
దనకడుపు నిండినను బంచదారనైన,
విషముభంగినిదలపోసి, విడువవలయు. 56

ఆ. రేయిపగలు మంచివాయువు వచ్చెడు
మార్గములనుగలిగి, మందిరంబు,
పజ్జఁదెమ్మలేక, పరిశుభ్రమైయుండ
వలయునిత్యమును నివాసమునకు. 57

స్వతంత్ర జీవనము

తే. అన్నవస్త్రాదులకు నైన, నధికమైన
భోగభాగ్యంబులకునైన భూమిమీఁద
నొరులనేనమ్ముకొనియెప్డునుండరాదు;
తనదుచేతుల నమ్మంగఁజనునుగాని. 58

తే. పెద్దలార్జించి, లోపలఁబెట్టిచన్న
ధనము ధాన్యంబుఁజోరులు తటిమెఱింగి,
తస్కరించినఁ, బోవునుదాఁచుకొన్న;
నవలవ్యర్థుఁడౌనిగతియేమియగునొకనుడు. 59

తే. పూర్వులుగడించిచనుమాన్యములునుమడులు,
పండకుండును; రాజులుపన్నుచాలఁ

గట్టుదురువానిమీఁద; దాకట్టువడున;
నప్పుడురికుని బ్రతుకేమియగునో చెప్పుఁడు. 60

తే. తాతముత్తాత లెంతెంత ధనముకూడఁ
బెట్టి, పెట్టెలు నిండంగఁ బెట్టియున్నఁ
గష్టపడి తాము న్యాయమార్గమునఁ బడయు
స్వార్జితంబౌకగవ్వతోసమముగాదు. 61

తే. కాన, మానవుఁ డెప్పుడు గష్టపడుచు,
వలయువిద్యల గళలను, బాల్యముననె
చక్కఁగా నేర్చియితరులసాయమాస
పడక, తనయొంతజీవింపఁగడఁగవలయు. 62

ధ న ము

తే. న్యాయమార్గంబుతప్పకయర్థమెపుడు
మనుజుఁడార్జించుచుండంగఁజనును; దానఁ
బాత్రులకుదానమొనరింపవలయుఁగొంత,
యనుభవింపంగవలయుఁ దాననవరతము. 63

తే. తానుజేసినధర్మంబెతన్నుఁగాచు
ననుటలెస్సగాహృదయంబునందెఱింగి,
త్యాగమొనరింపవలయుఁ; దానేగుతఱిని
తనదిచిల్లిగవ్వయువెంటఁజనదుగాన. 64

ఆ. దానమియ్యలేక, తానునుదినలేక,
ధనముభూమిలోన దాఁచిపెట్టి,
చెడుగులుబ్ధు, దానిఁ గడకుదొంగలపాలొ
నేలపాలొ, చేయునిజముగాను. 65

తే. ఆయమునకన్న నెన్నఁడునధికమైన
వ్యయముచేయంగఁగూడదు; యాచకునకు

దనకుఁగలదానిలో నెయ్యాఁదగునుగాని,
దాతవై, యప్పుఁగొనియియ్యఁదగవుగాదు. 66

తే. కుంటివారలువృద్ధులు గ్రుడ్డివారు
లోనుగాఁబాటుపడశక్తి లేనివారి
కియ్యవలెఁగాని, యితరులకిచ్చి దాన
మహిని వెలయింపరాదుసోమరితనంబు. 67

తే. మనముగడియించుదానిలో, మఱచిపోక
కొలువచేయంగఁదగుఁగొంత నేర్పుమెరసి
వార్ధకంబున, రోగముల్ వచ్చునపుడు,
గడనఁజేసెడుసామర్థ్యముడుగుఁగాన. 68

ముఖస్తుతి

తే. ఇంద్రుఁడవునీవుచంద్రుఁడవీవటంచు;
దాపునను జేరియొనరించు స్తవమునకును
కాయముప్పొంగివిశ్వంబుఁగానలేక,
చేతిసొమ్మెల్లఁబోవిడిచెదవుసుమ్మి? 69

ఆ. సరసఁ జేరి, నిన్ను సంస్తవమొనరించు
వారలెల్ల సఖులుగారునీకుఁ;
గష్టకాలమందుఁ గాచువాఁడొక్కఁడె,
నిక్కమైనసఖుఁడు నీకుఁదలఁప. 70

తే. ధనముగలిగినయన్నాళ్ళు, దానిలాగ
వెంటఁదిరుగుచునుందురు, విహితులట్లు;
ధనముపోయినమఱునాఁడు దలఁపవారు
తొంగిచూడరునీయిల్లుదూరమునను. 71

ప నిఁ బ ను చు ట

ఆ. ఆజ్ఞ చేసినట్టు లన్యులఁ బనిచినఁ,
జెప్పుపనిని వారు చేయకుంద్రు;
చేసిరేని, దానిఁ జెడఁగొట్టుదురు చాల,
హృదయమందసూయ పొడలుఁగనుక. 72

ఆ. పరులకేఁ జుకట్టు పనిచేయఁ బనిచినఁ
జెప్పఁదడవ దానిఁ జేయుచుంద్రు;
చేయుపనియుఁ జాల శ్రేష్ఠంబుగా నుండు,
మనసు కుదిరి చేయు మహిమ కతన. 73

తే. చెలిమిమైఁ జేఁదు మేపింపఁ జెల్లుఁ గాని,
బలిమిమైఁ బాలు ద్రావింపఁ బాటుగాదు
కాన, మంచితనముననే కార్య మెప్పుడుఁ
దీర్పవలెఁ; గాని పనిగాదు తీవ్రపడిన. 74

చౌ ర్య ము

ఆ. ముచ్చిలఁగ, రాజు మున్మొత్తి దండించు,
దండుగ గొనుఁ దొంటి ధనముఁ గూడ
నిరుగుపొరుగు వార లెప్పుడు నిందింత్రు;
పరమునందుఁ జాల బాధ తొడరు. 75

తే. ఎవ్వరును జూడరని మన మెన్నుకొన్నఁ
బాపమది యెప్పుడైనను బయలఁబడును;
గాని, దొంగతనంబు దాఁగదు నిజంబు;
దీని నెంతయు లెస్సగాఁ దెలియవలయు. 76

ఆ. ఎవరుఁ జూడకున్న, నీశ్వరుఁడైనను
మనము సేయు కాని పనులఁ గనఁడె?

కాన, దొంగతనముఁ గావింపనెందైన
శిక్షతప్పకుంట సిద్ధమరయ. 77

ఆ. ఒరులమాయచేసి సిరిఁగాంతు ననుకొంట
వెఱ్ఱితనముగాని వేఱుగాదు;
దాన, ముప్పుతనకె తప్పకఘటిల్లుఁ;
బరులఁజెఱుచువాఁడు బాగుపడునె? 78

పరోపకారము.

తే. కడుపెకైలాసమనియెంచి గాసిపడక
శ్రమమునకునైననోర్చి, శక్తికొలఁదిఁ
బరులకుపకారమొనరింపఁబాటుపడుడు
రాఁకలియుడప్పిపాటింపకలఘుమతులు 79

వివిధధర్మములు.

తే. భూమిమీఁదను మనమిట్లు పుట్టుటెల్ల
భోజనంబునకేయని, మూఢమతులు
తిండియేలోకమనియుందు రొండుచింతఁ
దక్కి, ధర్మమునందైనఁ దలఁపులేక. 80

ఆ. మంచివాఁడుపుడమి మాటాడుమెల్లగాఁ,
బలువయెపుడుగొంతుపగులనఱచు;
ముఱికికాల్వలెపుడు మ్రోగినలాగున
నదులుసేయుచున్నె రొదలనెందు? 81

తే. భాగ్యహీనులనైన, సేవకులనైనఁ
బరుషవాక్యంబులాడుటపాడిగాదు;
దానఁ, బెట్టినపెట్టెల్లఁ గానఁజేరు;
వదనఁ జేసినమేలును బదటఁ గలియు. 82

తే. ఎక్కటివారిని మర్యాద నెలమిఁజేసి,
తానుమర్యాదబడయంగఁదగునునరుఁడు;
వారి నటులతాను గౌరవ పఱుపకున్నఁ
దనకు గౌరవమబ్బఁదు ; తథ్యమిదియె 83

ఆ. మంచికార్యమునకు, మానక యెప్పుడు
యత్నమాచరించు టర్హమగును ;
మొదలఁగాకయున్న, బెదరకమరిచేయ
వలయుఁ; గానివిడుమ వదలఁదగదు. 84

ఆ. చెడ్డకార్యమునకుఁ జేరరాదెప్పుడు ;
చేరెనేని మేటిచేటు వచ్చు ;
హీనకృత్యమందు నెఱుఁగకచొచ్చినఁ
దెలిసినపుడెవిడిచి తొలఁగవలయు. 85

ఆ. అల్పబుద్ధులెప్పు డన్యులతప్పుల
వెదకుచుండు ; రల్పవిషయములని
గొప్పగాఁగ నెంచి, కోపంబువహియింతు ;
రలుకవిడువకుండు రనవరతము. 86

ఆ. అలఘుబుద్ధులెపుడు నన్యులగుణముల
నభినుతింతురెఱిఁగి ; యవగుణములఁ
దడవకుండు ; రలుకఁదడవుగఁ బూనరు ;
సైరణను వహింత్రుసంతతమును. 87

ఆ. తనకుఁజేయుమేలు మనమునఁగుక్కయు
నెఱిఁగిసతముస్వామియిల్లుగాచు ;
మేలుమఱచునేని, మేదినిమనుజుండు
కుక్కకన్నఁగొంతతక్కువరయ. 88

తే. తప్పుచేసితి వేనియు, నొప్పుకొనుము ;
గురునిముంగలఁగల్పించుకొనుచువచ్చి
మాయమాటలఁజెప్పుట మానుకొమ్ము ;
దానినొజ్జలుసీయెడదయఁదలంచు. 89

ఆ. పిలచియొకరు మనయభిప్రాయ మడిగినఁ
బక్షపాతబుద్ధిఁబొఱదోలి
మనసునందుఁగలదె, మాటుపెట్టక తెల్ప
వలయు, నొకనికెగ్గు గలుగుచున్న. 90

ఆ. సూక్ష్మమంచు నెంచి చులుకసేయఁగ రాదు ;
సూక్ష్మములె, వినుండు, స్థూలమగును
జలకణములు గలిసి, జలరాసికాలేదె ?
చిన్నవాసినేల చేయివిడువ ? 91

ఆ. సుహీనినాఱు నెలలు సహవాస మొనరింప
వారువీరలగుదు రారయంగఁ ;
గాన, జనుఁడుమంచిమానిసితోడనె
చెలిమినెల్లతఱిని జేయవలయు. 92

తే. మున్నె, వాగ్దాన మొనరింపకున్నయపుడె
పదిగఁదలపోసిమఱిచేయవలయుఁజుమ్ము
చేసి చెల్లింప లేకుంటసిగ్గుపాటు
చేయఁ గలిగియుఁ జేయమి హేయమరయ 93

తే. తిన్నగా మాటలాడంగఁ దెలియనట్టి
వాఁడెవండైన, నినుదప్పఁబలికెనేనిఁ
దప్పుగాఁ బట్టుకొనుచును, దాని నీవు
పట్టికల్లార్చి, కోపంబుపడకు మెప్పుడు. 94

ఆ. ఒక్కకాలమందు నొక్కపనిని చేసి
యయ్యదికడముట్టనె నవెనుక

మాఱుపనికిఁ దాను మఱలంగఁదగుఁగాని
పెక్కుపనులకొకట నిక్కరాదు. 95

ఆ. పెద్దవారలైనఁ బిన్నవారైనను
జెప్పునట్టిపలుకుఁ జెవిని జొనిపి,
యుక్తియుక్తమైన, నొయ్యన గ్రహియింపు ;
కానిదైనఁ గొనకపూనుమీవు 96

తే. పలికిపొంకనిజిహ్వయుఁ బాడిగలుగు
వర్తనముఁ బోషమెఱుఁగనిబాహువులును
బురుషునకు నెంచుజారనిభూషణములు
కాని, విలువబట్టలు గావు, కావునగలు. 97

ఆ. తెల్లవార లేచి, దినమెల్ల మనచేయు
కర్మచయములోనఁ గర్మసాక్షి
ప్రతిదినంబు మంచిపనులఁ గొన్నిటిఁ
జూచి, యేగునట్టుగఁ జరియింపవలయు. 98

ఆ. పరులునీకు నెట్లు వాంఛింతువో చేయ
బరుల కట్ల చేయవలయు నీవు ;
సర్వశాస్త్రములను జర్చింపఁ దేలెడు
సారమైనధర్మసరణి యిదియె. 99

తే. మేను క్షణభంగురంబౌట, మానసమున
నుంచి, రేపుచేసెద నని యుంటమాన
వలయుఁ సద్ధర్మములనేఁడె సలుపవలయు
నెల్లి మనముందుమోలేమొ యెఱుఁగరాదు. 100

తే. గీ. ఇందుఁగలపాఠశాలలయందుఁ జదువు
దిగువతరగతిబాలుర తెలివి కొఱకు
నీతిదీపికయను నూఱు గీతములను
కందుకూరి వీరేశలింగము రచించె.

సరస్వతీనారదవిలాపము.

రంగము—దండకారణ్యము

(వీణలుదాల్చి దుఃఖించుచు సరస్వతీ నారదులు వేరువేరుగా ప్రవేశించుచున్నారు)

సర—(నిట్టూర్పువిడిచి తనలో)

క. ఈపాపులకతనమున నా
రూపెల్లను మాఱిపోయెఁ; గ్రూరాత్ములకున్
జేపడితి ; మోసపోయితి ;
నేపగిదిం బ్రతుకుఁ గందు నిఁక నే నకటా ?

క. దాయ లలంకారమిషన్
గాయం బాపాదమస్తకంబును బొడువన్
గాయపడి మామకాంగని
కాయము నొచ్చెడును దేలుకఱచినభంగిన్. (అని విలపించుచున్నది.)

నార—(తనలో)

క. కటకట ! సంగీతంబున
కెటువంటియవస్థ పట్టె నీదేశములో !
పటుతరమోదం బెవరికి
ఘటియింపదు నేఁడు నాదుగానం బుర్విన్.

క. కటువులె యీహారికీర్తన
లటమటమున విటుల కొక్కయరకాసునకున్
దటుకున మానమె యమ్మెడు
కుటిలాలక లఱచుబూతుకూఁతలకంటెన్ ?

(ఆలకించి)

గీ. వినఁబడెడు స్త్రీవిలాప మీవిపినమందు ?
అహాహా ! యెవ్వరి దొక్కొ యీ యార్తరవము
శ్రావ్యతర మయ్యెడును గానరసముకంటె
ఎవ్వరయియుందు రొంటి నిల్లేడ్చువారు ?
(ముందువంకఁజూచి)

ఉ. అక్కట ! యామె మజ్జననియైనసరస్వతియట్ల యున్నదే !
తక్కరు లైన నిమ్మధుర తాగుణ ముందునె రోదనధ్వనుల్ ?
చక్కనిపాటకున్ సొగసి సర్వ మదేమెడచుట్టి యాడెదున్
గ్రక్కునఁ బోయి నే నడిగి కన్గొనువాఁడ విచారహేతువున్.
(చేరువకుఁబోయి)

క. ఓతల్లీ ! యిదె మ్రొక్కెద
నీతనయుఁడ నారదుండ; నిక్కము చెపుమా
చేతోవ్యథతో నీ కిటు
నాతల్లి యరణ్యరోదనం బేమిటికిన్ ?
సర — (తలయెత్తి చూచి)

క. తనయా ! నావలెనే యీ
వనమున కీ విప్పుడేల వచ్చితివయ్యా ?
నిను నిటఁ గనినంతనె నా
మనమునఁ గలకలఁక కొంత మానెం జుమ్మా.

క. నారోదనమునకుం గల, కారణ మడిగితివి గానఁ గలతెఱఁ గెల్లన్
గూరిమిపుత్త్రుఁడ చెప్పెదను, గారవమునఁ జెల్పుదాన ఘనమతివినుమా.

మ. రమణీయోక్తులచేత నర్థగుణసారస్యంబు గల్పించుచుం
దమి నాయంగచయంబునన్ సహజసౌందర్యంబు పెంపొందఁ గొం
చె మలంకారము లుంచి త్రొల్లిటికవుల్ చేష్టాచమత్కారభా
గ్యము హెచ్చించుచు దీర్ఘకాలము ననుం గాపాడి రర్హక్రియన్.

వ. అటు సుఖయింపుచుండఁగ మదాస్యమునందు నిరర్థకంబులై పటపటలాడుశబ్దముల బల్మిని బెట్టి, రసంబు నెట్టి, యు క్కుటికములే కలంకరణాకై తపముం గొని మేను కుట్టి, యి ప్పటిఘను లార్తి పెట్టెదరు ప్రాణము తీసి నను౦ గలంచుచున్.

క. తెలియదు సు న్నిప్పుడు నా
కలుకు లయిరర్థంబు నాకె భావము లేమిన్;
వెలభూషలుగా కివి సం
కెల లయి కడు నాకు మేనికిన్ వెత నిచ్చున్.

నార—క. ఓహో! యెటు చెఱిచిరి నీ
దేహముచెలు వెల్ల జడులు తెక్కలివగలన్!
దేహరుచి గప్పెదరుల
బాహులలఫూసల సుకారిభామలు పోలెన్.

క. సుందరబహురసపుష్టి న, మందానందంబు బుధులమది కిడ దేనిన్
ఛందోబద్ధం బగుపద, బృందాటోపంబు తాఁ గవిత్వం బగునే?

క. రసములె కావే ప్రాణము, లసమానకవిత్వకాంత కవనీస్థలిలో?
రసహీన మైనకవితకుఁ, బొసఁగించునలంకృతి శవమున కిడుతొడవా.

క. విను ఛందోబద్ధం బను,
ఘనకారణముననె బ్రతుకుఁ గన నగు నేసిన్,
తను వది వదలి వెసం జ
క్కనిమృతి నొందుటయె లెస్స కవితాసతికిన్.

క. కవితాసతి జీవకళన్, శ్రవణోత్సవభాషణంబు సలిపెడున ట్లుం
డవలెంగాక యెుకప్పుడు, శవములె నిద్రితవలెఁ జనదుండంగన్.

సర—క. అవు నది నిజమే యైనను,
భువిలోఁ బ్రాణంబులేనిబొందియె యిపు డీ

నవమేధావులచేతఁ,
వివిధంబుగఁ బాగడఁబడెడు ! విధి నేమందున్ ?

సీ. దయమాలి తుదముట్టఁ దలకట్టు నిగిడించి
ధీరుఁడై నన్ను బాధించు నొకఁడు
పాదంబులోపలఁ బాదంబు లిమిడించి
వీరుఁడై నన్ను నొప్పించు నొకఁడు
ప్రాసంబుపై బెక్కుప్రాసంబు లడరించి
పోటుబంటైననన్నుఁబొడుచునొకఁడు
బెండుపల్కులుగూర్చి నిండించి నగలంచు
దిట్టయై చెవులు వేధించు నొకఁడు
ఖడ్గచక్రాదిరూపముల్ గానిపించి,
వర్ణములుమార్చిననుఁ జిక్కుపఱచునొకఁడు
కుమతు లొడలెల్లవిఱిచిప్రాణములుతీయ
నొడలిపసలేకకృశించియున్నదాన.

శా. ప్రాణంబు ల్కడఁ బట్టియుంటఁ దెలియన్ రావెందు మద్వాక్యముల్
త్రాణల్వాయుట మాఱి యెవ్వరికిఁ బోల్పన్రాదు మద్రూపముల్
ప్రాణాపాయము కల్గ కుండ నెటకై నన్ నన్నుఁ గొంపోయి సం
త్రాణం బీవొనరింపు మింతటను బుత్రా! మాతృరక్షార్థివై.

గీ. అన్న నీమోమునను దోఁచె విన్నఁదనము
కారణం బేమి నీదుదుఃఖంబునకును !
పడుచుఁదనమున రాదుగా వార్ధకంబు
నాకుఁ బోలెను నీకును ? శోకుమార !

నార—క. అమ్మా యేమని చెప్పుదు ?
నిమ్మహి నామోము చూడ రిపు డెవ్వారున్,

నమ్ముము వేశ్యలమాటలె
కమ్మలు సుమ్మా రసికులకర్ణంబులకున్.

క. భగవన్నామామృతమే
వెగటయ్యెను భక్తిపరులవీనులకెల్లన్
జగమున నిపు డొకపడుపు
న్నగువపదంబె యమృతోపమానం బయ్యెన్.

గీ. ఇట్టిదురవస్థఁ జూచి యెందేనిఁ బోవఁ
దలఁచి వచ్చితి హృదయఖేదంబుతోడ
జనని! సంగీతసాహిత్యుల్ కనులు నీకు;
భరతఖండంబునను రెంటిఁ బొరలు గ్రమ్మె.

గీ. పాట యెల్లను వెలయాండ్రపాలు చేసి,
జనని! తలమున్కదుఃఖాబ్ధి మునిఁగియున్నఁ,
దల్లివాంఛ దీర్చుట పుత్రధర్మ మగుట
వీపునను మోచి కొనిపోదు వేగ రమ్ము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

స్త్రీ పునర్వివాహ సభా నాటకము

ప్రథమాంకము

ప్రథమరంగము:—రాజమహేంద్రవరము ; వీరభద్రుఁడుగారి గృహము.

(వీరభద్రుఁడుగారు చావడిలోఁ గూర్చుండి దైవప్రార్థనము చేయుచుండఁగా మిత్రుఁడయినజగన్నాథముగారు ప్రవేశించి కూరుచున్నారు.)

వీర:—(చేతులుజోడించి, అర్ధనిమీలిత నేత్రుఁడై)

ద్విపద. శ్రీకరగుణజాల ! శ్రితజనపాల !
శోకాబ్ధివాతూల ! సుజనౌఘలోల !
కారుణ్యమయశీల ! ఘనధీవిశాల !
క్రూరజనాభీల ! సుతుకాలవాల !
సర్వజ్ఞ ! సర్వేశ ! సర్వకారుణ్య !
సర్వశక్త్యాత్మక ! సర్వనియంత !
త్రికరణశుద్ధిగా దేవాదిదేవ !
సకలార్తిహార ! నిన్నుఁజాలఁ బ్రార్థింతు ;
నిది సుఖదాయక మిది దుఃఖబహుళ
మిది పరిత్యాజ్య మియ్యది గ్రాహ్య మనుచు
మానవు లెల్లను మనసులోఁ దెలిసి
పూనికతో సత్యమునె యనుష్ఠింప
వలయునంచును బుద్ధి వారికందఱకుఁ
గలుగునట్లుగ వేగఁ గరుణింపవయ్య !

(ఈశ్వర ప్రార్థనమయిన తరువాత కన్నులు తెఱచి మిత్రుని వంకఁజూచి) నీవు వచ్చి యెంతసే పయినది ?

జగ:—ఇప్పుడే వచ్చినాను.

క. ఓయీ నీవిటు ప్రార్థన, చేయుట చూడంగ నేడు చిత్తంబున నీ
వేయదియోఘనకార్యముఁ, జేయఁగఁ దలపెట్టినట్టిచిహ్నము దోఁచెన్

గీ. నీకుసంకల్ప మించుక నెయ్యునకును,
జెప్పఁదగునేని మఱి నీవు చేయఁ బూను
కార్యము తెఱంగు నద్దానఁ గలుగుమేలు,
వినఁగ వేఁడెదఁజెప్పుము వేగనాకు.

వీర:—సీ. వినవయ్య చెప్పెద విస్పష్టముగ నీకు
మనదేశమందలిమగువలందు
వైధవ్యదశ నొందువారలదురవస్థ
గనుఁగొన్న నెంతటికఠినునకును
హృదయంబు నీరయియెంతయుదుఃఖంబు
పుట్టును వారిలో ముఖ్యముగను
బాల్యకాలమునందె పతిహీన లయినట్టి
యబలలదుర్దశ లాత్మలోన
దలఁచుమాత్రన దేహంబు జలదరించి,
వారియాపదవారింపవలయుననెడు
బుద్ధి పుట్టకపోవదు భూమిలోన,
మానవశరీర మెత్తినవానికెల్ల.

క. అటు లయ్యును వారలగతి,
దటుకున వారించువెరవు దలఁపక పెద్దల్
కటకట యనాథయువతుల,
నటమటఁ బెట్టంగఁ జూచు టాశ్చర్యమకా.

గీ. దీర్ఘకాలమునుండి యీదేశమందు,
స్త్రీలకుఁ బునర్వివాహంబు చేయునట్టి

మంచివాడుక పోయినమహిమచేత,
నకట యాచారమె ప్రధాన మనెడువారు

ఉ. బాలవితంతు సంతతి వివాహములేక యథేష్టలీలలన్
జాలఁగ సంచరించుటను సంభవ మయ్యెడుకీడు లైనఁ దా
మేల యెఱుంగలేరు ? పతిహీనలబాధలఁ జూడ వారికిన్
జాలి యొకింత పుట్టదె ? నిజంబుగ వారివి జాతిగుండెలే ?

జగ:—గీ. భర్తృహీనలకయిరుందఫలముగలదె?,
దైవమీరీతిఁబతిలేనితరుణిమణుల
దుఃఖపడుఁడనిమూడుబంతులనువ్రాయు
దానిఁదప్పింపనెవ్వరితరముచెపుము.

వీర:—గీ. అయ్యయో ! సర్వకారుణ్యుఁ డయినయట్టి
యీశ్వరుఁడు స్త్రీల దుఃఖంబు నెనయుకొఱకె
యవనిమీఁదను సృజియించె నందుమేని
దైవదూషణమగుఁ గాదె తప్పకుండ ?

క. కరుణానిధి యగుదైవము,
ధరణీస్థలి దేనినైనఁ దఱుగనివెతలన్
బొరసెడుకొఱత సృజించునె ?,
దురితం బగు నతనిమీఁద దోషము మోపన్.

జగ:—ఆ. సతుల కట్టిగతులు సంప్రాప్తమగుటకుఁ,
గారణంబతండుగాకయున్న
వేఱుహేతు వేది వివరింతువో నీవు,
వినెదఁ జెప్పవయ్య విశదముగను

వీర:—ఆ. నిఖిలసృష్టియందు సుఖపడఁగోరుట,
సర్వజంతువులకుసహజగుణము;

వరున నీశ్వరుండు ప్రతిజీవికిని నిచ్చె,
సౌఖ్యమునకు వలయుసాధనముల.

సీ. జంతువులకు నెల్ల సకలావయవములు
పటుసౌఖ్య మిడుటకె పనికివచ్చు
విశ్వంబులోఁగల వివిధవస్తువులును
జంతుసౌఖ్యమునకె సాయపడును
దుఃఖంబు వేగంబ తొలఁగుటకు సుఖంబు
చిరకాలముంటకు సృష్టిలోన
నెక్కడఁజూచిన నెన్నికకును మించి
ఘనసాధనమ్ములు గానఁబడెడుఁ
గాన దైవంబు జంతుసంతాన మెపుడు,
సుఖముపొంద నుద్దేశించె సుస్థిరముగ
నేదియో లోపమునఁ దక్క నించుకేని,
బాధ గలుగ దెప్పుడునుస్వభావముగను.

సీ. తక్కినజంతుజాతముఁబోలె నొకతన
సుఖమును మాత్రము చూచుకొక
సామాన్యముగ సర్వజనులసౌఖ్యంబును
మదినుంచి పనిఁజేయు మానవుండు
మనుజసామాన్యంపుమంచిఁ జూడకయున్న
నెవనికి సుఖ మబ్బ దవనియందు
కాఁబట్టి పలువురఘనసౌఖ్యమున గూర్చి
చేయు శాసనములె జెల్లు నెందు
నొకని కైనమనుజబాహుళ్యమునకు,
మేలుగలిగించువిధులెందు మెప్పుఁజెందు

నంతయునుజూడనందఱుననవరతము,
ధరనుసుఖులయియుండుటదైవమతము.

జగ:—క. జనులెల్లవారు సుఖులయి
మనవలయు నటంచు దైవమతమగునేనిన్
మనవారిలోన నిందఱు
వనితలు వెత నొందనేల వైధవ్యముచేఁ.

వీర:—గీ. ఉర్విజనులకుస్వాతంత్ర్యముండుకతన
మనసువచ్చినగతిమంచిపనినిగాని
చెడ్డపనిఁగాని వారలు చేయఁగలరు
దానిచే వచ్చె నిక్కట్టు తరుణులకును.

క. వేదాంతు లేమిచెప్పిన। మేదిని స్వాతంత్ర్య ముండు మిగులఁగ మనకం
చేదేశజనుల నడిగిన। నాదటఁ జెప్పుదురు వార లనుభవగరిమఁ.

జగ:—గీ. నరులకే స్వతంత్రతయున్న ధరణిలోన
గొప్పయుద్యోగమును జేయగోరువారి
కేల యాపని కారాదు తేలికగను ?
మంత్రిపద మొంద నాకును మనసుగలదు.

వీర:—సీ. నీకొక్కనికె గాక నఖిలమానవులకు
స్వాతంత్ర్యమెప్పుడుఁజాలగలదు
నీకు మంత్రిపదంబు నీకుం డుటకుఁగూడఁ
బరమస్వతంత్రుండుధరణిపతియు
నదిగాక నీవలె యత్నంబు చేయువా
రెందఱో యాపనికుఁందురరయ
వారలకును నుండు స్వాతంత్ర్య మిటనీదు
యత్నంబుచెడునట్టులడ్డుపడగ

కావున జనుండు తలపెట్టుకార్య మెల్ల
గాకపోవచ్చు నందుచే గట్టిగాను
మనకు స్వాతంత్ర్య మెందు లే దనఁగఁ దగు నె
మనసె మనము స్వతంత్రుల మనుచుఁ జాట.

జగ:—గీ. భువిని జనులు యుక్తాయుక్తములను దెలిసి
తగవు నడపంగను స్వతంత్రు లగుచునుండ
నాదినుండి పునర్వివాహ మతివలకు
లోకమందెల్ల నేటికి లేకపోయె ?

వీర:—సీ. కూపకూర్మమునూడ్కిఁగూర్చుండియొకచోట
జగమెల్ల హిందుదేశంబె యనుచు
దలఁచియుందువునీవుకలనై ననిప్పటి
భూగోళశాస్త్రంబుముట్టకుంట
నవనీతలం బెల్ల నైదు ఖండములుగ
భాగింపఁబడియుండుఁ బ్రస్తుతమున
నట్టిఖండంబులయందు నొక్కటియైన
యాసియాఖండంబునందు నున్న
దేశములఁబదియాఱింటఁ దెలిసిచూడ
హిందుదేశంబునొక్కటౌనింతెసుమ్మి
స్త్రీలకుఁబునర్వివాహంబుచేయునట్టి
యిట్టియాచారమిటఁదక్క నెందు లేదు

సీ. ఈదేశమునసైత మితరమతస్థులౌ
మహాణ మహమ్మదీయులప్రశంస
యటు లుంచినను గొల్లలాదిగాఁ గలహిందు
జనులలోపలఁగూడ వనితలకును

మాఱు పెండిలి చేయుమంచియాచారంబు
పెంపొంది యున్నది తెంపు లేక
పెద్దపట్టణముల ద్విజు లెక్కువగ నున్న
సంఖ్యయందును హీనజాతివారె
మిగుల హెచ్చుగ నుందురు మెట్టుమీఁద
ద్విజులలోఁ గూడ మనహిందు దేశమందు
యువతులకును బూర్వము పుణ్యయుగములందుఁ
బరిణయము గ్రమ్మఱను జేయబడుచునుండె.

ఓయీ ఈరెూక్క ప్రశ్నమునకు న్యాయమయిన ప్రత్యుత్తరమును జెప్పుము. ప్రపంచములోని సమస్తదేశములయందును సమస్తమతములవారికిని సర్వకాలములయందును మేలు నిచ్చుచున్న యీయాచారము, ఒక్క మనహిందూదేశమునందు మాత్రము కొన్నిజాతుల వారికిఁ గొంతకాలమునుండి కీడును కలుగఁజేయునది యగునా.

జగ:—అవును నీవు చెప్పినదిన్యాయముగానే యగుపడుచున్నది. ఈవిషయమయి వయిశాఖానువారమునాఁడు సభ జరగఁబోవునుగదా ? అప్పుడుపోయి వాది ప్రతివాదుల వాదమును సావధానముగా విందము.

వీర:—ఈలోపల మనము న్యాయపక్షమును గెలిపింపవలయునని యీశ్వరుని ప్రార్థించిపిమ్మట పోదము.

(ఉభయులును.)

ఆనందభైరవిరాగము - రూపకతాళము.

పల్లవి

కరుణింపుము రా-ఓ- దురితాపహారా :

అనుపల్లవి

కరుణాకర ! నీచరణానతులన్.

చ ర ణ ము లు

౧. దురహంకృతి నెవ్వరు బొంకులకున్
జొరకుండఁగ నీవరచాతురిచే—కరుణింపుము

౨. జనసంఘుపు మేలునకై నరు లె
ల్లను దిన్ననిత్రోవను బూనఁగ వే—కరుణింపుము

౩. ఇదిసత్పథ మియ్యదిదుష్పథమం
చెదనెల్లరు నొప్పిదముగొనఁగా—కరుణింపుము

౪. అనుమానము నెల్లను మాని సతం
బును సత్యము నోర్పునఁగై కొనగా—కరుణింపుము

౫. గతిగానక దుస్థితిఁ గుందెడియా
పతిహీనల సంతత వత్సలతన్—కరుణింపుము

జగ:—భోజనమునకు ప్రొద్దెక్కుచున్నది. నే నిప్పుడు సెలవు పుచ్చుకొందునా?

వీర—మంచిది. గౌరీనాథముగారు మిత్రులతోఁగూడ నేటిమధ్యాహ్నము మాయింటికి వచ్చెద మన్నారు. వారియిల్లు మీయింటికి వెళ్ళెడిత్రోవలో నేగనుక, సాధ్యమయినంతశీఘ్రముగా రమ్మని మనవిచేసి మఱివెళ్లుము.

జగ:—మంచిది ముందుగా వెళ్ళునప్పుడే ఆయనతోఁ జెప్పి ముఖ్యముగాఁ బంపెదను. (అని యిద్దఱువెళ్ళుచున్నారు.)

కా మ డీ ఆ ఫ్ ఎ ఱ్ఱ ర్స్.

ప్ర థ మా ం క ము.

---

1. ప్రదేశము—ప్రభు మందిరమునందలి చావడి.

(ప్రభువు, వర్తకుఁడు, కారాగృహాధిపతి ఉద్యోగస్థులు ఇఁ
సేవకులు ప్రవేశించినమీఁదట.

ఏజియన్—నరపాల! యరుదెమ్ము నను శిక్షసేయ,
మరణదండమున మాను నావెతలు.
ప్రభు—వర్తక! మఱియేమిపలుకకుమింక
వార్తలకొఱకుఁగానకట! మాలంక
ధర్మశాస్త్రంబుల తగ వేదఁగాను,
గూర్మిఁ, బాక్షికబుద్ధిఁ గూరను నేను.
వేయేల? మాదీవిబేరులఁ బట్టి,
న్యాయమార్గమునంటె నడచెడునట్టి
వారి, మీచట్టాలఁ బరఁగించుకొన్న
క్రూరశిక్షలకును గుఱిసేయ మొన్న,—
ప్రాణదానమునకు బదులుగానొసఁగఁ
బాణిని బంగారువస లేమిఁ బొసఁగఁ,—
మీరాజు, దయమాలి, మీఱిమావారిఁ,
గ్రూరుఁడై, చంపినకొఱగామి, నోరి!
పుట్టినవైరంబు, గట్టిమచ్చరము:
నెట్టును మీమీఁద నెప్పుడుఁగరము,
జాలిపుట్టఁగ నీవు, జడినిప్పులొలుకు
క్రాలెడుమా వేఁడికఱకుఁ జూపులకు.

ఏల ? యన్నను...మాకు, నెపుడుఁజివ్వకును
జాలఁ గాల్ద్రిప్పనచ్చటివారలకును,
అప్పగిదిని నైన నధికవైరంబు
నప్పటినుండియు, నొప్పసంఘంబు
చేరి, యిచ్చోటమావారలచేత,
మేరమై నచ్చట మీవారిచేత,
ఇఁకముందువాణిజ్య మొకరితోనొకరు,
ఒకరిపట్టణముల నొనరఁగానొకరు,
కావింపకుండంగఁ గట్టుదిట్టములు
వావిరిఁబుట్టింపఁబడె ననేకములు.
వినుమంతయేకాదు; వెలయమీదేశ
మునను జన్మించినజనుఁడు మాదేశ
మందు సంతలఁగాని యంగళ్లఁగాని
కందోయి కొక్కింత కననయ్యెనేని,
మాసీమ మనుజుండు మఱియెవ్వఁడేని,
మీసీమ నెందైన మెలఁగునయేని,
హాయిగానుండుటకు నదనున, నొక్క
వేయివరాల నర్పించినఁదక్క
జీవంబు లప్పుడ చెచ్చెరఁబోను;
ఆవానిసొమ్మెల్ల నధిపుపాలౌను.
ఇక్కడనీయొద్ద నెసఁగుసొమ్మెల్ల
నెక్కువవెలఁగట్టి యిచ్చిన, నల్ల
నూఱువరాలకె న్యూనంబు కానఁ
దీఱదు జీవము తెగక, నీయాన

ఏజి——ఓ! మేలు! నాకిడియ ప్రసాదమరయ;
నీమాటయెల్లను నెఱవేఱునేని,
యీదినమ్మునఁ గ్రుంకునినునితోఁగూడ
నాదుకష్టంబులు నాశంబునొందు.
ప్రభు——అవునోయివర్తక! యడిగెద నొకటిఁ,
జవిబుట్టఁదెల్పుము సంగ్రహంబుగను,
మీదేశమునుబాసి మెలఁగంగనేల
మాదేశమునకేల మఱివచ్చితిపుడు?
ఏజి——వచియింపరాని నాబహుళకుర్దశల
వచియింపుమనుకంటెభారంబునొకటిఁ,
బూనుపఁగారాదు పోనఁగవామీఁద;
ఐననులోకంబు లన్నియునాదు
దురవస్థలెల్ల నాదోషంబువలన
దొరలక, విధిచేతఁ దొడరినవాటఁ
దెలిసికొంటకు, నాదు స్థిరవిచారంబు
సెలవిచ్చెనంతయుఁ జెప్పెదనిపుడు:
సరకాజియాలోన జన్మించినాఁడ;
పరిణయమయినాఁడఁ బడఁతుకనొర్తు;
ననుఁ జేసికొనకున్న, నన్నులమిన్న
జననుత మైనట్టిసౌఖ్యంబుఁ గాంచు;
దైవంబు మాయెడ దయమాలకున్న
నావలినమగాంచు వాతిసౌఖ్యంబు;
ఆనందమునసుంటి నామెతోనేను;
నానాఁటవర్థిల్లె నాకల్మిమిగుల,

పరదేశమున నామపనులను జూచు
మరియాదగల బేరిమరణంబుదాఁక,
ఎపిడామినసునకు నేఁజేసినట్టి
యపరిమిత సముద్రయాత్రలవల్ల.
తెరువుననొకమూల దిగఁబెట్టిచన్న
సరకులనైనను జాగ్రత్తసేయు
ఘనుఁడాతఁడెలనాగ కౌఁగిలినుండి,
నను సమాకర్షించెఁ దనదేశమునకు;
ఆఱుమాసములైన నరుగకమున్న
తీఱనివిరహంపుఁ దీవ్రవేదనను,
చిక్కిసగంబయి చక్కెరబోఁడి
గ్రక్కునఁ బయనంపుఁగార్యముల్నడపి,
నేమంబుతోవచ్చి, చెచ్చెరఁదాను
మే మున్నసీమను మేరమైఁజేరె:
చిరకాలమచట వసింపకమున్న
తరుణియిద్దఱు ముద్దుతనయులఁగాంచె;
చిత్రంబు! చూడ నాచిఱుతవారెంత
మాత్రము భేదమన్మాటయు లేక
పేరులచేఁదక్క వీఁడువాఁడంచు
నారయరాకుండ నలరారిరంత;
అనిమిషముననె యాసత్రమందె
మానినిబీదది మఱియొర్తుకనియె,
నాదారిముగవారి సమడబిడ్డలను
భేదమేమియులేక విలసిల్లువారి :
నే, వారిజనకులు నిరుపేదలౌటఁ,

గావలెననుకొని, కవలపిల్లలను
బెంచితి, నాముద్దుబిడ్డలవద్ద
వంచనలేక సేవలు సేయుకొఱకు.
అట్టిబాలురు కల్గనాత్మనుప్పొంగి,
గట్టిగానింటికిఁ, గాంతాలలామ,
ప్రతిదినంబుననన్నుఁ బయనంబుచేసి,
వెతఁ బెట్టజొచ్చెను వెడలుదమంచు;
ఇష్టంబులేకయే యే నియ్యకొంటిఁ,
గష్టపడవలసి, కటకటా! వేగ.
యానపాత్రంబెక్కి, యామడదూర
మానేలవిడిచి మే మరుగకమున్న,
యెప్పుడుగాలిని నెదరింప నోడ
నుప్పుసంద్రము మానుముప్పును జూపె;
జీవింతుమనునాశ, శీఘ్రంబుగానె,
మావారివిడిపోయె; ముటియేలయన్న,
భగవంతుఁడిచ్చిన ప్రభను మాయింప
నిగిడినమేఘము ల్నిమిషనిమిషము,
బెదరి చెదరిన మాహృదయంబులందు
నుదయింపఁజేసె సద్యోమృత్యుభీతి.
నామట్టునకు నేను సామోదమునను
యీమృతి క్లేశన నీకొంచముఁగాని
ముందువచ్చెడు నట్టిముప్పును దలఁచి
కుందెడునాలినిఁ, గులసతిఁజూచి
వివరంబు తెలియక వేడుకకొఱకుఁ

గవకూడి యేడ్చెడు కవలపిల్లలను,
గాంచిన, మనస్సెల్లఁగరఁగిపాఱుటయు,
వంచనలేకుండవారికి నాకుఁ
దగినరక్షణముగలుగు నుపాయంబు
నొగిరోయవలసెను నౌనరంగ నాకు;
ఇతరమార్గము లప్పుడేవియు లేని
కతమున, నీరీతిఁ గావింపఁబడియె—
పడవవారెల్లరుఁ బ్రాణార్తు లగుచు,
మడిసెడునోడను మా కొప్పగించి,
ప్రక్కఁ గట్టినచిన్న పడవలమీఁదఁ
గ్రక్కునఁ బాఱినఁ, గార్యంబుతప్పి,
గాలివానలు పట్టుకాలంబు కొఱకుఁ
జాలుట కుంచిన చాపకొయ్యకును,
పెద్దవారల నాదుపెండ్లాముకట్టె
నిద్దఱఁ బ్రేమతోనిడి యొక్కచివర:
చిన్నవారల నొక్కచివరను నేను
దిన్నఁగాఁగట్టితిఁ దీఱనికూర్మి :
ఈలీల బాలురనేర్పాటుచేసి,
యాలియు నేనును, హాళిగలట్టి
సుతులమీఁదనుమాదుచూడ్కులునిగుడఁ,
గొతుకక యొక్కొక్క కొనఁగట్టుకొంచుఁ,
దేలి, ప్రవాహంబువాలునుబట్టి
లీలఁబోయితిమి కోరి తునకేసి,
అంతట భాస్కరుఁడక్కైత్తోతెంచి,

వింతగాఁ జీఁకట్లవిరియంగఁజేసె ;
నీరధియంతయు నిశ్చలంబయ్యె,
దూరంబునందుండి కోరింతు ఁవోకటి,
యెపిడారసు ఁవోకటి, యెదురఁగాన్పించె.
నప్పుడునావలు రెండు; అవిరాకముంద—
పలుకంగఁజాల నీపయిని మ తేమి,
తెలియుండు శేషంబు దీనినిబట్టి.

ప్రభు——నడుమఁ దెంపకుమిట్లు ; నుడువు మీ మాఁట :
గడముట్టవృద్ధుండ ! కథయెల్ల నాకు ;
చాలనోరిమి నిన్ను క్షమియింపకున్న,
జాలినై నను బొందఁజాలుదు మేము.

ఏజి——దైవంబెయిటుమమ్ముఁ దాఁజేసినేని
నేవానిననవచ్చు నిర్దయుఁడంచు;
ఎట్టన——నోడలట్లీరేనుక్రోసు
లెట్టయెదురనుండ గట్టొండుతాఁకి,
నడిమికి రెండయ్యెవడి నూఁతకోల;
యెడఁబాసిచెటియొక్క—కడనుబోవలనె.
ఇట్టియక్రమమైనయెడఁబాటునందు;
గుట్టుగానిద్దఱకు, సమంబుగాఁగ,
సంతోషమింతయు, సంతాపమింతయు
వంతుగలయఁగూర్చె భాగ్యదేవతయు
పాపమాయబలయు, భారహీనతను
త్రోవుడుపడనట్టి దుఃఖంబుత్రోడఁ,
బెనుగాలికిని మహావేగంబుగాను

గానిపోవఁబడినను ; కోరింతునీవు
బెస్తలాముఁవ్వర వెలిఁ దార్చినట్లు
వాస్తవంబుగ దృష్టిపథమునఁదోఁచె.
కడకు మేమును నొక్కపడవమీఁదికిని
విడువ కెక్కించుకోఁబడితిమి వేగ,
మమ్మట్లుగాచుట మఱిభాగ్యమంచు
నమ్మి, సహాయంబొనర్చిరి వారు;
దైవికంబుగ వారినావ, కరంబు
నావేళమెల్లఁగాఁ బోవకయున్నఁ,
బట్టినచేపలఁ బాఱవై వంగ
నెట్టునువచ్చు; కాఁబట్టి వారపుడ
యింటికై మరలిరి ; యిట్లునాసుఖము
మంటఁగలియుటెల్ల వింటిరిగాదె ?
నాకష్టకథలెల్ల నలువురిముందు
వాకొనుచుంటకు నాకు దైవంబు,
వేమేల ? యీరీతి విశ్వంబులోన
నాయు వెక్కువపోసె నక్కటా ! యిపుడు.
ప్రభు—వారికై నీవు విచారించెదిపుడు,
వారికినీకు నీవఱకును నేమి
పొసఁగెనోదయచేసి పూర్ణంబుగాఁగ
వెస వినిపింపవే వివరంబుగాను.
ఏజి—నాపిన్నకొమరుండు నాప్రాణసముఁడు
పాపము ! ప్రేమతోఁ బదునెన్మిదేండ్ల
ప్రాయంబునప్పుడు, భ్రాతనువెదక
నోయనమతిపుట్టి, సాయంబుకొఱకు,
(తనరీతినే సోదరునిఁగోలుపోయి

మనమునఁ బేరును మఱువక యున్న)
సేవకుఁదనతోడ శీఘ్రముం బపనుపఁ
దా వేఁడికొనెనన్ను దయపుట్టునట్టు;
అల్లపుత్రునిఁజూడ నభిలాష మెంతో
యుల్లంబులోఁ గల్గియును బ్రేమకతన
నీపుత్రకునిఁగూడ నెడఁబాయ లేక,
యేపగిదినొ కడకేఁగొంటి నేను,
వారలవిరహంబు నోరువ లేక
సారెకుఁ గుందుచు సద్మంబు వెడలి,
గ్రీసు దేశమ్మున, గాసిలియైదు
వేసవికాలము ల్వేసఁ బుచ్చినాఁడ;
ఏసియాఖండంబు నెల్ల నువెదకి,
మానీమ కేగుచు మఱి యెపిసనుకుఁ
జను దెంచినాఁడ, నెందునువారిఁగందు
ననునాశ లేక, యైనను నేస్థలంబు
నారయకుండంగ నావలఁబోవ
నేరక యెల్లెడ నెమకుచువచ్చి
కాని, యిచ్చోట నాకథయిట్లుముగిసె;
నేను జేసినయీ ప్రయాణంబులెల్లఁ
గాయంబుఁగావంగఁ గలిగినవైన,
హాయిగా మరణంబు నంది సుఖంతు.

ప్రభు—మందుమంచును విధి వ్రాయంగనుదుట,
మందభాగ్యుండవై మనువ ర్తకుండ!
హృదయంబునం దెంత యిష్టమైయున్నఁ
దుదిమహీవరులకు దుర్లంఘ్యములగు

మాశాస్త్రములకును, మారాజ్యమునకు,
మాశపథములకు, మాగణ్యతకును
వ్యతిరిక్తమేమియు నయియుండకున్న,
మదిలోననమ్ముము, మఱినీకు మేము
తప్పక యుపకారదానంబు సేయ
నిప్పుడు వలసినదే ; యటానుగాని,
మరణశిక్షనునీకు మాన్పలేకున్న,
జరిగినతీరుపు జార్పరాకున్నఁ,
జేతనయినమేలుఁ జేసెదనీకు
నీతఱిమఱియేది న్యాయమైనఁగాని :
కాఁబట్టి నే నేఁడు గడువిత్తునీకు,
వేఁబోయిసాయంబె వెదకికొంచీవు
ప్రాణంబునెట్లైన రక్షించుకొమ్ము ;
త్రాణమై నిచటిమిత్రచయంబు నొకట
వేఁడిరైనను, బదుల్వేఁడియునైనఁ,
గూడఁబెట్టుముసొమ్ము, నేఁడెట్టులైన,
నటులైన బ్రదుకుదు వట్లుగాకున్నఁ,
బటుగతి జీవము ల్పాయంగ వలయు.
కారాగృహాధ్యక్ష ! కావలినుంచు
ఘోరముగ నితనిఁగొనిపోయినీవు.

కారా—దేవ ! యాలాగునఁగావింతు నేను.
దేవ ! యాలాగునఁ గావింతునేను.

ఏజి—అసహాయుఁడౌచు, నిరాశను జెంది
వెసఁబోయెను బెహారివెతలిన్మడింప.

(అందఱు నిష్క్రమించిరి.)

2. ప్రదేశము.—ఒకబహిరంగస్థలము

(సరకాజియా ఆంటిఫోలసు, డ్రోమియో, ఒకవర్తకుఁడు ప్రవేశింతురు.)

వర్త.—ఎపిడామినమువాఁడనేనని చెప్పకు;
నృపతి, యట్లన్నచోఁ, నీసొత్తుఁగొనును.
సరకాజియానుండి చనుదెంచినట్టి
వరవర్తకుఁ డొకండు పట్టుకోఁబడియె,
నీపురంబున నేఁడె, యిటవచ్చెఁగాన;
పాపమాతఁడు, తనప్రాణముల్గాచి
కొనధనమిఁలేమిఁ, గోల్పోవుఁజుమ్ము
తనదుజీవంబును, తరణియీప్రొద్దు
చరమాద్రిసరసకు జరగకమున్న,
పురిరాజశాసనమునుబట్టి యకట!
ఇదెకొమ్ము నావద్ద నిచ్చినసొమ్ము,
పదిలంబుగా భద్రపఱచికొమ్మీవు.

స. ఆం.—కొనిపొమ్ము, డ్రోమియో! మనముండుసత్ర
మునకునుదీనిని, మోసంబులేక
కనిపట్టియుండు మక్కడనీవు, నేను
జనుదెంచువఱకును జాగ్రత్తగాఁగ.
జాములో భోజనసమయమౌఁ గానఁ
నీమధ్య, నేఁబోయి యీపీటఁగలుగు
వారలనడవళ్ళు వర్తకసరణి,
చారుగృహంబులసొరు, వీక్షించి,
చనుదెంచి నిదురింతు సత్రంబులోన.
వినుము మార్గాయాసమునఁజేసి, నేను

బడలియున్నాఁడను, బలమెల్ల నుడిగెఁ:
కడువడిఁగదలు మిక్కడనుండినీవు.

స. ద్రో—నీమాటలనుబట్టి, నినుబట్టికొందు
రీమంచివేళనె యేగుమువేగ
(నిష్క్రమించెను.)

స. ఆం—చనవుకతంబున, సందేహపడక
యనయంబు హాస్యోక్తులను వచియించి,
నవ్వించి యలరించు, నామదియందు
నెవ్వగలేమైన నెలకొన్నయపుడు,
దయచేసి, యిఁకఁగొంతతడవునాతోడఁ
బ్రియమార నటునిటు వీటనుదిరిగి,
సత్రంబునకువచ్చి, సరసభోజనము
మిత్రుఁడ! నాయింట మీరుచేసెదరె?

వర్త—విందునకునునన్నుఁబిలిచినేఁడొక్క
యిందలివర్తకుఁ డేగకయున్న
నెన్నియో కార్యంబులిటఁ జెడుఁగాన
నన్ను నీవేళను మన్నింపవలయు.
ఐదుగంటలకును నంగడివీధి
కాదరమునవచ్చి, యామీఁద నన్ను,
సాయంతనము నిద్రసమయంబుదాఁకఁ,
బాయకయుండెదఁ, బంపుమునన్ను,

స. ఆం—మంచిది. సెలవిమ్ము! మఱినేనపోయి
యించుక తిరిగెద నిందుమునందు.

వర్త—ఇచ్చవచ్చినయట్లు లెల్లెడఁదిరిగి
ముచ్చటదీఱంగఁ బురమునుజూడు

సం. అం——ఉదకబిందువొకటి, యుదధిలోఁబడిన
యుదరబిందువు నొంటు వెదకిపైఁదీయ
గడలిలోపలఁజొచ్చి, కానక తాను
నడఁగినవడువున, నన్ను నుదల్లి
నరయుదుననివచ్చి యందందతిరిగి,
దురదృష్టమున నేనె తూలుచున్నాఁడ.
(ఎఫి——డ్రోమియో వచ్చుచున్నాడు.)
వడినింతవేగంబ వచ్చితివేమి ?
ఎ. డ్రో——వేగమాయిది: చాలజాగయ్యెనిప్డు.
వడవడి డ్రోమియో వచ్చుచున్నాడు
మాఁగి దింపఁగఁబడె మాంసపుఁగూర :
ఆవల గడియారమడిచెఁ బండ్రెండు,
దేవిగా రొక్కటితీసిరి నన్ను.
అన్నంబు చల్లాఱె ; నందుచేవార
లున్నారు కాఁకగా ; నన్నుమట్లయ్యె
దేవరవారు మందిరము చేరమిని ;
దేవర రాకైరి తినబుద్ధిలేమి ;
తినబుద్ధిలేదయ్యె దిట్టంబుగాను
ఘునులెచ్చుటనో విందుఁ గైకొనఁబోలు.
మీకేమి ? మాకౌఱ కాఁకలిత్రోడఁ
జీకాకుపడి మేము చెడుచుంటి మింట.
స. అం——ఈపాటిచాలించు మీప్రసంగంబు,
నేపట్టునను, నమ్మ యేనునీచేత
నిచ్చినద్రవ్యంబు నిప్పుడు పెట్టి
వచ్చినాఁడవొచెప్పు వాస్తవముగను,

ఎ. ద్రో—గుజ్జుపుష్పలంబు కుట్టినందునకు,
కుజ్జువాని కొసంగు కొఱకిచ్చినట్టి
నాలుగణాలునా ? నావద్ద లేవు ;
ఏల ? వానికపుడె యిచ్చి పుచ్చితిని.

స. ఆ.—ఉల్లాసముగ లేను, నుల్లమందిపుడు;
కొల్లగ ముద్దులుగుడువక, యింక
సొమ్ముక నుని చింతో సమ్మతిఁ జెప్పు :
నమ్మితి వేలాగు నరునినొక్కరుని,
నూరికిఁ గడుక్రొత్తవారమై యుండ,
నారీతిసొమ్ముల్ల నటఁ బెట్టిరాఁగ !

ఎ. ద్రో—హాస్యోక్తులా యిప్పుడాడుచున్నారు ?
హాస్యమూవల భోజనావసరమున,
నాడుకొవచ్చును ; అమ్మగారయ్యఁ
దోడితేఁ బనిచెప్ప నీడవచ్చితిని.
కొనిపోవకున్న, నాపనియౌను నిజము;
ననుగొట్టుఁ, దమ దోషమునఁ జేసియమ్మ.
కడుపె నాకునుబోలె గడియారమౌచు,
కడి కింటికిని, దూత కార్యంబు లేక,
నినుఁగొట్టవలయును, నిక్కంబుగాఁగ,
ననితోఁచుచున్నది యాత్మలోనాకు.

స. అం—రా, ద్రోమియో ! యిటు రా; హాస్యమునకు,
భద్రము : నీకిదవసరంబు గాదు ;
దాఁచుకొమ్మువియెల్లఁ, దఱివచ్చుదాఁక !
నీచేతికిచ్చిన నెఱధనమేది ?

ఎ. ద్రో—నాచేతికా? మీరు నాకెందుకొఱకు,
తోఁచక ధనమియ్యఁదొలుతనువలసె!

స. ఆం.—తస్కరశ్రేష్ఠుఁడ దయచేయుమిటకుఁ;
మస్కరిచేష్టల మతికట్టిపెట్టి,
నీబాధ్యతను నెల్ల, నేఁ డేమిచేసి,
రోబాలిశుఁడ! వచ్చితో చెప్పునాను.

ఎ. డ్రో—నాదు బాధ్యతయెల్ల నడువీధినుండి
యాదటమిము భోజనార్థంబు బసకుఁ
గొనిపోవుటయె; ఆవలనట నీకొఱకుఁ
గని పెట్టియుం దమ్మగారు, సోదరియు.

స. ఆం.—స్థాయిగఁ దెల్పుము దైవంబు నెదుర,
నీయొద్దనుంచిన వేయివరాల
నేసురక్షితమైనయిక్కను బెట్టి
నాసరసకువచ్చినాఁడవో నిజము;
లేకున్న, మది నెమ్మి లేనప్పుడిట్లు,
నాకడ మేలముల్నడపించు చున్న
నీతలప్రక్కలు నేఁ జేయుదిపుడు.
చేతిధనం బేమిచేసితో చెప్పుము.

ఎ. డ్రో—వెదకినను, వరాలు వేయివారొద్ద
నొదవనేరవు; కాని యున్నవి వేయి
దెబ్బలు, తలమీఁద దేవరవారు,
జబ్బలమీఁద నిచ్చులు నమ్మగారు,
కొట్టినవన్నియుఁ గొన్నితక్కువగ;
గట్టిగా నవియెల్లఁ గ్రమ్మఱనేను
నేలినవారి కర్పించుదునేని,
దాళంగలే రేమొ తరువాత మీరు.

స. ఆం—ఆ! యమ్మ దెబ్బలా? యీమొడనీకు
నేయమ్మకలదురా? హీనసేవకుడ!

ఎ.ద్రో—దేవరభార్య; మందిరమునుజేర
నీవువచ్చెడుదాఁక, నిలయంబులోన
నన్నంబుతినక, మిమ్మరసి తెమ్మంచు
నన్నుఁబంచినయట్టినాతి; మాయమ్మ.

స. ఆం—ఎగతాళిచేసెదె? యీరీతినీవు
మొగముముందఱ నన్నుఁ, దగుభీతిలేక;
ఇదిగో కన్గొనుము నిన్నేమిచేసెదనో;
పదరకు నెఱదొంగ! పట్టుముపట్టు.

(అనికొట్టుచున్నాఁడు.)

ఎ. ద్రో.—ఆ! యిదియేమియయ్యా? చాలుఁజాలు;
చేయితీయుము! పాఱిపోయెద నేను.

(నిష్క్రమించును.)

స. ఆం-నాపనికాఁజేసి, నడిపించెధనము
పాపాత్ముఁ డేదో మాయోపాయ మరసి.
విను చుందు మెపుడు నీ వీ డెల్ల కాల
మును మోసములకెల్లఁ బుట్టినిల్లంచు;
అట్టికన్నులుగప్పు నైంద్రజాలికులు,
పట్టిమతులుమార్చుపటుమాంత్రికులును,
నంగవైకల్యంబు లవలీలఁజేయు
పొంగెడుదయ్యాలపోతులు, మఱియుఁ
బలుకులఁబందిళ్ళు వైచిభ్రమింగింపఁ
గలవారు, లోలోనఁగఱ బ్రాముువారు
దురితంబులిట్టివి జరిపించువారు

పురినిండఁగలరఁట పుట్టపుట్టలుగ.
ఇదియెల్ల వాస్తవమే యయ్యేనేని,
దుదిలేనిచేటుపాటొదవెనునాకు.
ఇప్పుడేపోయెద, నీబానిసీనిఁ
జప్పున నెమకంగ, సత్రంబునకును;
నొక్కంబునకు నేఁడు తెక్కులువచ్చు
నొక్కొయంచును భయమొదవెడునాకు.
(నిష్క్రమించును)

ద్వితీయాంకము.

1. ప్రదేశము—బహిరంగస్థలము.

(ఏడ్రియానా, లూసియానా ప్రవేశించుచున్నారు.)

ఏడ్రియానా—పెనిమిటి యొండెను బెనిమిటికొలఁకుఁ
బనిచెప్పిత్వరచేసి పంపినయట్టి
భటుఁడొండె రారైరి, పడఁతి! యీవఱకు:
ఇటుచూడు నిజముగా నిపుడు రెండయ్యె,

లూసియానా—ఒకవేళ నెవఁడైననొక వర్తకుండు
పికవాణి! యాతనివిందుకు నేఁడు
పిలిచియుండఁగవచ్చు; విపణియందుండి
కలిసిమిత్రునివెంటఁ గ్రన్ననబోయె;
భుజియింతమిప్పుడు పుష్కలంబుగను.
త్యజియించియోరెంబు, తడఁబడనేల ?

పురుషులు ధరలోనఁ బరమస్వతంత్రు
లరయంగఁ గాలంబె యధిపతివారి
కదిచూచి, పోవుదు రరుదెంతు రెందు:
మదిలోనవగవగ మఱియోర్పుకొమ్ము.
స్త్రీ—మొగవారికిస్వతంత్రమొగినుండ నేల
మగువలకంటె మఱి హెచ్చుగాను ?
లూసి—వారలపనియెల్ల వాడవాడలనె
యూరిలోనెప్పుడు నుండునుగాన.
స్త్రీ—ఈరీతివిభునెడ నే జేసినపుడు
క్రూరముగానన్నుఁ గోపించుఁజుమ్ము.
లూధ—నీ మనోరయమును నిలిపివేయుటకుఁ
గామిని ! యాతండు కళ్ళెమంచెఱుఁగు
స్త్రీ—చూడఁగనటువంటిసుదతులు లేరు.
గాడిద లోఁబడుఁ గళ్ళెంబునకును.
లూసి—ప్రహారణమ్ములు గల్గు స్వాతంత్ర్యమునకు
బహువుగ నిక్కినపక్షంబునందు
అవనిని, జలమున, నాకాశమందు,
భువనేశ్వరునిచేతఁ బుట్టింపబడిన.

స్త్రీ విద్య.

(1873 వ సంవత్సరమునందు స్త్రీ విద్యావిషయమునఁ బద్యరూపమున మూడుత్తరములు పురుషార్థప్రదాయినీపత్రికకు వ్రాయఁబడి యందుఁ బ్రకటింపఁబడినవి. గ్రంథ నిదర్శనములతోఁ గూడియుండిన మొదటిలేఖ యిప్పుడు దొరకినది కాదు. బ్రహ్మశ్రీ త్రోలేటి సుబ్బారావు గారు ప్రచురించిన కవి చరిత్రములో నుండిన రెండవలేఖలోని కొన్ని పద్యములును, మూడవ లేఖయు నిందు బ్రకటింపఁబడుచున్నవి)

శా. శ్రీమార్తాండమరీచిరోచియనఁగాఁ జెన్నైన దివాంధావళిం
బ్రామంగ్రాల్ పురుషార్థదాయినిపతీ! పద్యాళి సంజీవనిన్
శ్యామాలోకము కెల్ల విద్యవలదం చష్టావధాన్యాహ్వయుల్
తా మీమాంసము వెల్లడించుటలు మోదంబొప్ప వీక్షించితే ?

క. దానిం గనుఁగొని త్రోచినఁ,
వానిం బ్రత్యుత్తరముల వరున నొసఁగెదన్
గాన మనముల ననూయలు,
మానుఁడు మఱికీడుమేళ్ళు మది నారయుచోన్.

క. మొదటనె పూర్వులు చెప్పిన
యది యనుగర్వంబుమానుఁ" డని నేనేమో
పదరి యనినాఁడ నంచును,
జదు రేర్పడఁ బల్కినారు చక్కని నుడులన్.

గీ. సరి ! "పురాణమిత్యేవన సాధుసర్వ"
మనుచుఁ దొల్లి యొమాళవికాగ్నిమిత్ర
మనెడు నాటకరాజంబునందుఁ గాళి
దాసు పల్కుట వినరొకో ధన్యులార.

చ. మునుపటివారు చెప్పినది మొక్కలపున్నది పూనిసర్వముం
గొనఁ జనదంచు నామతముకూడ లవంబును గాదు, కాని యెం
దును మనబుద్ధికూడఁ గదుఁగూరిచి యారయుచుంట ముఖ్యమై
చనును హితాహితంబులపసల్ గని దుష్కృత ముజ్జగింపఁగన్.

క. ప్రతిభావంతులు మిక్కిలి,
మతిమంతులుఁ గలరు మిగుల మనపూర్వులలో
సతతము వాదము సల్పిరి;
యతులితవాగ్గరిమఁ గొన్నియంశంబులలోన్.

* * * *

మ. అయిన న్మద్దియవిద్దియంగుఱిచి యెందైనం దగం దొంటియా
నయవేదుల్ తగదంచు వాదములు పూనం గంటిమే మీవలెన్?
దయమీఱంగను జెప్పుఁ డయ్య! యలసిద్ధాంతంబు లెందైన మీ
నయనానందముచేసెనేమొ వినఁగన్గౌతూహలంబయ్యెడున్.

* * * *

ఉ. "వారణయాన లెల్లరును బాటల నేర్తురు గాని వారిలో
నారయ వానియర్థ మొకరైనను నేర్చినవారె" యంచు మీ
రూరక వాదులాడెద రయో! మనపాటలయర్థ మంగనల్
నేరరె? యిట్లు మీ రనిన, నిక్కములోకము తానెఱుంగదే?

గీ. పాటలాధరల్ పాడెడుపాటలందుఁ
దప్పిదంబులు తప్పులై యొప్పుఁగాన
వానియర్థముఁ దెలియరు వారటంచుఁ
జెప్పనొప్పునె? యొప్పులకుప్పలార.

* * * *

ఉ. వింతగ వాద మేల యవివేకులపోలిక; స్త్రీలవిద్య సి
ద్ధాంతమె చేసినారు మనతజ్ఞులు పూర్వులు; వేద మొక్కటే

యింతులు చూడఁ గూడ దని రింతె; పురాణచయంబు స్త్రీలకై
యెంతయుఁ జేయుటల్ స్మృతులు నెల్లపురాణము లొత్తి చెప్పవే?

* * * *

గీ. భవ్యపురుషార్థదాయినీపత్రికాధి,
నాధులార! యుమారంగనాయకాఖ్యు
లార! ప్రచురింత్రుపత్రికయందుఁదీని
ననుచు వేఁడుమిత్రుండు—శతావధాని.

స్త్రీ వి ద్య.

తే. పరమపురుషార్థదాయినీపత్రికాధి,
నాధులార! సువిద్యాసనాధులార!
సరగ మీపత్రికను నాదుజాబుకింత,
తా వొసంగెదరే మిత్రభావమునను?

మత్తేభవిక్రీడిత కందగర్భసీసము.

సీ. వినయ మొప్పారఁగ విన్నవించెద నిదే
న్యాయంబుగాఁజూచి మీరొదఁ గదు
సదయలీలం దగ సారసాననలవి
ద్యాసంవివాదంబులో సరళిగ
విజయ మెవ్వారికి వీఁకమైఁ గలిగెనో
సామాన్యధీమైసుధీమదేభ
నిచయముల్ మెచ్చఁగ నీతితో నుడువుఁడీ
జల్పాకులై సజ్జను లొప్పెసంగ
వెలఁదులకు విద్య గూడదు కలుగు నఘము
దాన నిజముగా నని యనఁ దా రెలమిని
దలపడినను నార్యులుచెప్పుపలుకులనె వ
లయునుగనబఱుపన్ మాకులక్ష్యములుగ.

గర్వ మత్తేభము.

మ. నయ మొప్పారఁగ విన్నవించెద నిదే న్యాయంబుగాఁజూచి మీ
దయలీలం దగ సారసాననలవిద్యాసంవివాదంబులో
జయ మెవ్వారికి వీఁకమైఁ గలిగెనో సామాన్యధీమైసుధీ
చయముల్ మెచ్చఁగ నీతితో నుడువుఁడీ జల్పాకులై సజ్జనుల్.

గర్వ కందము.

క. వెలఁదులకు విద్య గూడదు,
కలుగు నఘము దాన నిజముగా నని యనఁ దా
రెలమిని దలపడినను నా
ర్యులు చెప్పుపలుకులనెవలయును గనఁబఱపన్.

క. మొదటనె పూర్వులు చెప్పిన,
యది యనుగర్వంబు మానుఁ డని నే ననలే
దది వారే కల్పించిన
యది యని నే నన్నయట్టు లనెదరు కంటే.

తే. వీరియర్థంబుచేసెడివెరవునకును
జాల మెచ్చంగఁ జనుఁ గాని యేల వీరు
నాదుపద్యంబులో నుండునట్టిదానిఁ
“ బదరి ” యనుమాట నడఁచిరో పలుకవలయు.

తే. పద్యములనెందు నేనొక్కపదమునణఁచి,
యర్థమొనరింపఁబూనిననందుఁగలుగు
నర్థమెల్లను జెడి పోయి యంతతోడ,
నాగకమెచట లేనియపార్థమొదవు.

ఆ. ఈమహానుభావుఁ డెఱుఁగనివారికి
“ బొంకవచ్చునఘము పొంద దధిప ”
యనుచువింతయర్థమును జెప్పఁగాఁబోలుఁ
బూర్వపదచయంబుఁబోవనడఁచి.

క. పోలఁగ నా వెనుకటిప
ద్యాళివలన నంతకుమును పటువ్రాసినయా
“వాలాయ” పదమునర్థము
నేలీల నెఱింగినారొ యీనవరసికుల్ ?

క. ఈవాదములో నెందును
నావంతయు వాక్యసంచయార్థవిమర్శల్
కావలె నన్నుంగలిగెనె
కేవలయుక్తిప్రయుక్తికృత్యము దక్కన్.

తే. “ఎంచఁగనహల్యతారయుఁబంచకన్య
లందు నిర్వురు” కారఁట! యల్లదాని
కర్థమునునేఁ “ గటాక్షింప ” నగునఁటసరి
యేఁగటాక్షింపగానేలయిపుడుమరల.

తే. తొంటియష్టావధానులెతొల్లి “ యింక
హల్యతారలు పంచకన్యల నిరువుర
టనుచువినలేదె ” యనినారలర్థమేమొ,
యచటవారెకటాక్షింతురడుగరాదె ?

సీ. ఏనె నామాటలకెఱుఁగనం టర్థంబు
తన్నుఁ దా నెఱిఁగినఁ దలఁపఁ డిట్లు
రామకృష్ణాచార్యరచితపద్యాళిని
దాను వ్రాసినయట్టివానిఁ గాఁగ
నెంచునే తా నొడ లెఱిఁగనే నిందుకు
దృష్టాంతముగఁ జూఁడు డెల్లవారు
నీయన “ నేనె కల్పించుచుఁ జదు రేర్ప
డఁబలికితినఁట ” యంచుఁబొసఁగంగ

" నేను వ్రాసినశ్లోకంబులోనవిద్య,
యనెడుమాటయు వెదుకఁగాఁజనునటంచు
జాలఁ బల్కిరి వెదుకఁగా నేల దాన,
నడఁగియున్నదిచూపెద" ననిరొ లేదొ.

తే. తుదనుగలయట్టియాచార్యపదముఁజూచి,
తానునాచార్యుఁ జేయఁగాఁదలఁచియే మొ
ఱెంచె నీన్నృసింహాచార్యుఁ డెంతవాఁడు,
రామకృష్ణమాచార్యుఁగారమణఁదన్ను.

సుగంధివృత్తము.

వారు మున్నుదాహరించి వ్రాసినట్టి శ్లోకమం
దార చూపివారు విద్య యన్పదంబు వింతగా
నారయంగ నేల నింక నట్లు సందియంబు వో
నేరు పొప్పఁ బూడియున్ననిగ్గు పెల్లగింపఁగాన్.

చిత్రపదవృత్త

కొమ్మలవిద్యకు స్వాతం, త్ర్యంబునకుం దగు సంబం
ధంబు త్రిదండికి సంసా, రంబునకుం గలమాడ్కిన్.

అచ్చతెనుఁగు సీసము.

సీ. ముద్దియవిద్దియ మున్నున్న దంటకుఁ
గబ్బముల్ పెక్కు తార్కాణగాఁగఁ
జూపితిఁ గాదన నోపెద రేనియుఁ
జేతనై నంతయుఁ జేయవలయుఁ
గా కది పోనాడికన్నెలపాటలఁ
దప్పిదంబులు గొప్ప కుప్ప లనుచు
నిప్పటివాఁడున కేమియుఁ బొసగని
చప్పిడిసుద్దులఁ జదువుఁజేల

చదువ కుండినయంతనె చానలెల్ల,
అంకుటాం ద్రౌదురని మున్ను అంతునేసి
యున్నవా రెవ్వరో వారి నడుగవలయు,
నేను విద్దెచే వెలిచవి మానునంటి.

సీ. తెలివలు చదివిన ధీమతు లయ్యెద
రఁట కాని వంటక మారగింప
బల మేపు రాదఁట బాగుబా గోరెంబు
గుడువక యుండినయెడల బలము
తప్పక క్షీణించుఁ దథ్యంబు మామత
మదియె ముమ్మాటికి నార్యులార
చర్చించి చూడ నష్ట + అ + వకారాకార
ధానుల తెలుఁ గేమొ కాని తలఁవ
మఱియుఁదన దేహమే తాను మఱచియుండు
నున్మదాగ్రణికి స్మృగాల మొక్కదీపి
ద్వీపి యొకస్మృగాలంబునై తోఁపకున్న
దానిఁబాటిబట్టుటె వెఱ్ఱితనముగాక.

ఉ. ఏమిటి కీవృథాచలము లీవఱ కన్నియు నయ్యె నింకఁ గా
లామృత మాదిగా మిగిలె నందునుఁ గ్రాదన నేల చూపెదన్
కామిని కక్షరాభ్యసనకార్యము గల్గు దాని గాంచి తా
రీ మఱి పూర్వనాగరికు లేమని యుందురొ చూత మీ పయిన్.

తే. అక్షరాభ్యాసయోగంబు నతివలకును
నల్ల జ్యోతిషమాధవీయంబునందుఁ
గలుగఁగా జెప్పెఁ గావున నెలమిమీఱ
దానినీక్రిందనిదిగో యుదాహరింతు.

జ్యోతిషమాధవీయమునందు వృద్ధవశిష్ఠ వచనము.

"శ్లో. ఉదగ్గతేభాస్వతి పష్ఠమే,బ్దే మాసేచయుగ్మే దివసేతథైవ
పిత్రాక్షరస్వీకరణంచ స్త్రీణాం, సరస్వతీప్రార్థనపూర్వ మాదౌ"

కందము గోమూత్రికా బంధము

క. వారిఁగ వీరిఁగఁ గొని నను
వారలు మఱిఁగూయఁదగదు వాదము పోలన్
గోరిన వీఁకఁ గడు నిలను
గారవ మగుఁ గూడ దసదుగాఁ దలపోయన్.

తే. భవ్యపురుషార్థదాయినీపత్రికాధి
నాథులార! యుమారంగనాయకాఖ్యు
లార! ప్రచురింత్రు పత్రికయందుదీని
ననుచు వేఁడెదుతొంటి-శతావధాని.

చెన్నపురి బ్రహ్మోపాసనామందిర ప్రతిష్ఠాపనము.

(౧౮౮౫వ సం॥ జనవరి ౧. తా॥ గురువారము.)

బ్రాహ్మపద్య చంద్రిక.

ఉ. శ్రీకరుఁ డైనయీశ్వరుఁడు శ్రేయములం దయచేసి కూరిమిం
గై కొని ప్రోచుఁగాత గుణగణ్యులఁ బుణ్యుల సత్యశీలురన్
బ్రాకటభక్తియుక్తులను బ్రాహ్మసమాజమతావలంబులన్
లోకచయోపకారులఁ బ్రలోభవిదూరుల ధర్మచారులన్. 1

చ. మును మనహిందుదేశమున మూఢత మిక్కిలిపర్వి యెల్లెడన్
జనములు విగ్రహంబులనె చాలఁగఁ బూజలు సల్పుచుండఁగాఁ
గని యదిమాన్పఁగోరి బహుకష్టములం బడి తొల్త రామమో
హను లిలమీఁద బ్రహ్మమత మల్లన స్థాపన చేసె దక్షుఁడై. 2

చ. అటువలె నొక్కయీశ్వరుని యర్చన మానసికంబుగా భువిన్
బటుమతిఁ జేయుపద్ధతిని భాసిల నేఁబదియేండ్లక్రిందటన్
ఘటనయొనర్చి దేశమునఁ గల్గుజనంబుల కెల్ల జాటి ధీమా
దట నొనరించె నాతఁడు మతంబున కెల్ల మహోపకారమున్. 3

మ. ఘనుఁ డాతండు దివంబుఁ జేర వెనుకం గాపాడి యద్దానిఁ బెం
దెను సత్కీర్తి మనీషులెల్ల బొగడన్ దేవేంద్రనాథుం డహో
వినుతిం జెందదె యాదిబ్రహ్మమతమన్ పేరన్ జగంబందు నీ
యన స్థాపించినసత్సమాజ మిపుడొయ్య న్సర్వసమ్మాన్యమై. 4

ఉ. ఈయన పండితోత్తముల నేపునఁ బంచెను వారణాసికిన్
బోయి సమస్తవేదచయముం బఠియింపఁగ వారు వచ్చి యా
మ్నాయములం బరీక్షగ విమర్శ యొనర్పఁగ నందు దోషముల్
పాయక కొన్ని కన్పడియెఁ బాసెను వానిప్రమాణభావమున్. 5

చ. వెనుకను బ్రాహ్మధర్మ మనుపేరను గ్రంథ మొకండుచేసె నీ
యనఘుఁడె తా శ్రుతిస్మృతులయందలివాక్యము లేర్చి కూర్చి యీ
యన ఘనకీర్తిఁ గాంచి ముద మారఁగఁ గేశవచంద్రసేనులున్
ఘనతరభక్తి జేరెను ఘనంబుగ బ్రాహ్మసమాజము న్వడిన్. 6

చ. ఇతఁడు ప్రసంగము ల్సలుప నెల్లర రంజిలఁ జేయ దక్షుఁడై
ప్రతిభ మెయిం జగంబునను బ్రాహ్మసమాజము వన్నెకెక్క నం
చితగతిఁ జేసి శ్లాఘ్యతను జెంది సమాజముకార్యదర్శియై
యతులితసాహసంబున సహాయులఁ గూడి త్యజించె వర్ణమున్. 7

ఉ. కేశవచంద్రసేను లిటు కేవలధైర్యముతోడ వర్ణమున్
పాశము ద్రెంచి యాదిమపుబ్రాహ్మసమాజమువారు తన్నుఁ గ్రూ
రాశయులై వడి న్విడువ నంతటవీడియు వారి నెయ్యపుం
బాశము హిందూదేశపుసమాజము స్థాపన చేసె వేఱుగన్. 8

శా. హిందూ దేశపుబ్రాహ్మసంఘమును స్థాపించెంగదా యింతకుం
ముందే కేశవచంద్రసేను డెలమి న్మున్నొక్క-పర్యాయము మొ
ప్పం దా నీపురి కేఁగుదెంచి యుచితం బచ్చప్పవిద్యాలయం
బందుం బ్రాహ్మమతంబుఁ గూరిచి యుపన్యాసంబు చేసెం దగన్. 9

శా. ఈలీలం మృదుమాధురీ మహిమతో నెన్నోయుపన్యాసముల్
లీలం జేసిన నాలకించి మది హాళిం జెంది శ్రీరాజగో
పాలాచార్యులులోనుగాఁ గలఘనుల్ బ్రహ్మంబు సేవింపఁగాఁ
బోల న్వేదసమాజము న్నిలిపి రీప్రోలందు సద్భక్తితోన్. 10

ఉ. ఈతఁడె తత్త్వబోధినిని నిప్పురమందున ద్రావిడంబులో
నాతరువాతఁ బూన్కి-మెయి నాంధ్రమునం బ్రచురించి చాలఁ బ్ర
ఖ్యాతి వహించె ద్రావిడులయందలిమూర్ఖత పోవునట్లు స
ద్హేతువు లిచ్చి పుస్తకము లెన్నియొ తా రచియించె దక్షతన్.

ఉ. ఈయనకు న్సహాయుఁడయి యెంతయు నిశ్చలభక్తితోడ సు
బ్రాయలుసెట్టి పాటుపడి వన్నెకుఁ దెచ్చె సమాజ మెంతయున్
బోయినఁ గొంతకాల మిటు పుణ్యశరీరులు వీర లిర్వురున్
గాయములం దొఱంగిరి యెుకింటసమాజముపెంపు తూలఁగన్. 12

ఉ. ఈగతి వీర లిద్దఱును నీశ్వరుసన్నిధిఁ జేరఁ బిమ్మటన్
వేగమ తాను శ్రీధరులు వేదసమాజముకార్యదర్శియై
బాగుగఁ గార్యనిర్వహణభారముఁ గైకొని బ్రాహ్మధర్మమున్
లోగల ద్రావిడంబునఁ దెలుంగుననున్ రచియించెఁ దేటగన్. 13

ఉ. బ్రహ్మమునే భజింపుచును వచ్చుట దక్షిణహిందుదేశపున్
బ్రాహ్మసమాజ మంచు నవనామము దీనికిఁ బెట్టి యిచ్చుటన్
బ్రహ్మమతంబు శ్రీధరులు వ్యాపన మించుక చేసి యింతలో
బ్రహ్మపదంబుఁ జేరెఁ దరువాత సమాజము చెందె క్షీణతన్. 14

చ. తగినసహాయతం గనక తద్దయు క్షీణత నొందుచుండఁగా
మగుడనిభక్తితోఁ గడఁగి మన్నవబుచ్చ్యయపంతు లెంతయున్
దగుపని చేసి తా నొక విధంబున నిల్పె సమాజ మియ్యెడం
బెగువను దేశముల్ తిరిగి తెచ్చిధనంబును సుస్థిరంబుగన్. 15

చ. నిలిపెను బ్రహ్మమందిరము నిత్యుని సర్మలు నీశుఁ గొల్వఁగా
సలిపెను సాయ మీహనికిఁ జాలఁగఁ దా శివనాథశాస్త్రియున్
వెలయనుగాక చెన్నపురిపేరను జెన్నగునీపురంబునన్
సలలితభక్తి నొక్కఁడగుసామిని గొల్చెడుపుణ్య మీపయిన్. 61

శ్రీ విక్టోరియా జూబిలీ నవరత్నములు

క. శ్రీకరుఁ డగుపరమేశుఁడు
ప్రాకటకరుణాప్రపూర్ణభావముతోడన్
జేకొని ప్రోచుత గుణర
త్నాకర విక్టోరియామహారాజ్ఞి మణిన్. 1

సీ. ఏసాధ్వి తాఁ బదునెన్మిదివందల
పందొమ్మిదవయేటఁ బ్రభవ మొందె
నేరాణి పూజ్యయై తారాజ్యము వహించెఁ
బందొమ్మిదవయేటఁ బ్రజలువొగడ
నేతల్లి గృహిణియై యేవురుకూఁతులఁ
దనయుల నలువురఁ గనియె నెలమి
నేమాత యేఁబదియేండ్లనుండియు భూమిఁ
బాలించుచున్నది ప్రౌఢలీల
నేసతి దశాబ్దములక్రింద హిందుదేశ
చక్రవర్తినిపట్టంబు సంగ్రహించె

నట్టివిక్టోరియారాజ్ఞి నాదిదేవుఁ
డాయురారోగ్యములనిచ్చి యరయుఁగాత. 2

సీ. బాల్యకాలమునందె బహుభాషలనునేర్చి
యతులవిఖ్యాతి యేయమ్మగాంచె
వృక్షశాస్త్రమునందు వివిధప్రకృతిశాస్త్ర
వితతి నేయమ్మ ప్రవీణ యయ్యె
సంగీతసాహిత్యసరసచిత్రవిలేఖ
నానులఁ బ్రౌఢ యేయమ్మ యయ్యె
దేశచరిత్రలఁ బేశలధర్మార్థ
శాస్త్రాళి నేయమ్మ జాణ యయ్యె
కుట్టుపనియందు నేయమ్మ కుశలయగుచుఁ
గొడుకుబిడ్డలకిచ్చెఁ దాఁగుట్టినవియె
యిన్నివిద్యలఁ బాండిత్య మిట్లుపడసి
యున్నయాయమ్మధీబల మెన్నదరమె. 3

ఉ. ఏయమ రాణియయ్యె స్వమహీస్థలి బీదలయాకుటుంబ కుర్
బోయి ధనౌషధంబులును బుట్టములు న్నిఱుపేదవారికిన్
గేయముగాఁగ నిచ్చితగ క్షేమములారసి వచ్చుచుండునో
యాయమసద్గుణాళిఁ గొనియాడఁ గలండె సహస్రవక్త్రుఁడున్. 4

సీ. ఈకుటుంబిని రాజ్యమేలుచు నున్నట్టి
పంచాశదుత్తమాబ్దములలోన
భరతఖండమునకు బహుబాధలు తొలంగి
సకలసౌఖ్యంబులు సంఘటిల్లె
ధూమనౌకలకల్మిఁ దురగయానసమంబె
యయ్యె ద్వీపాంతరయాన మిపుడు

తంత్రీముఖంబున దవ్వులవార్తలు
క్షణములో శ్రవణయోగ్యంబు లయ్యె
ధూమశకటబలంబున దూరదేశ
యాత్ర లత్యల్పకాలసాధ్యంబు లయ్యె
నహహా పొగడంగఁదరమె రాజాధిరాజ్ఞి
యైనవిక్టోరియారాజ్యయాత్రమహిమ. 5

సీ. నదులకాల్వలుపాఱం బెదచౌడిపట్లలు
కలమధాన్యము పండుపొలము లయ్యె
బెబ్బులులకుఁ జోరవితతికిఁ దావులౌ
వనవాటములు పెద్దబాటలయ్యె
దుష్ప్రభుత్వముపోయి తుల్యమౌన్యాయంబె
యెల్లవారికిఁ గల్గె నెల్లయెడల
విద్యాలవములేని వివిధజాతులవారి
కమలవిద్యాప్రభావములు గలిగె
గఱువులకుఁజూడఁగాఁ బెద్దకఱువవచ్చె
నరబలు ల్సహగమనముల్ నాశమయ్యె
స్థానికప్రభుత్వ మొకింతజనుల కొదవె
మేలు! విక్టోరియా రాజ్యకాలమునను. 6

క. మున్నెన్నఁడు లభియింపని
సన్నుతసత్పాలనంబు సమకొనుచుండన్
మిన్నంది యెల్లయెడలను
జెన్నారదె రాజభక్తి సేతువువఱకున్. 7

సీ. సత్రముల్ మీపేర సమకొల్ప నొకచోట
విద్యాలయములుంచ వేఱుచోట

పట్టణభవనముల్ గట్టింప నొకచోట
వృత్తిశాలలు నిల్ప వేఱుచోట
జనమహోద్యానముల్ స్థాపింప నొకచోటఁ
బెనుబావులనుద్రవ్వ వేఱుచోట
నీటియంత్రంబుల నెలకొల్ప నొకచోట
బీదగృహములుంచ వేఱుచోట
పట్టణములందు మీపేరు పాదుకొల్ప
యత్నములు సాగుచున్న వీయవనియందు
నేఁబదేఁడులు రాజ్య మీరేలి రన్న
సంతసమున విక్టోరియాసాధ్వి నేఁడు. 8

సీ. ఏమూలఁ జూచిన నింపైన పందిళ్లు
నేతట్టునను గన్నఁ గేతనములు
నేవంక వీక్షింపఁ బూవులతోరణా
లేపట్టునను గన్న దీపచయము
లేకడఁ దిలకింప నాకాశబాణంబు
లేనట్టునను గన్న గానములును
బట్టణంబులు మొదల్ పల్లెలవరకును
వెల్లిగొనుచు నున్న వెల్లమొదల
నఖిలజనమనోహారిణి వైననిన్ను
స్థిరతరాయురారోగ్యసుస్థితుల నిచ్చి
యీశ్వరుండేలుఁగావుత నెలమితోడ
రాజ్ఞి విక్టోరియాదేవి! ప్రమదమెనఁగ. 9

శ్రీ రిపన్ ప్రభు స్వాగతము

ఉ. శ్రీమహనీయసత్కృపను జీవమొదల్ ద్విరదంబుదాఁకఁ దా
నీమహిఁ గల్గుజంతువుల నెల్ల సతంబు సమానదృష్టితోఁ
బ్రేమను బ్రోచు నీశ్వరుఁడు విశ్వసురుండు రిపన్ప్రభూత్తమున్
క్షేమ చిరాయురున్నతులఁ జెన్నువహింపఁగజేసి ప్రోచుతన్.

సీ. ఎలమిఁగో నెవ్వఁ డీహిందువులకు స్థాని
కస్వపరిపాలన మియ్యఁ గట్టుచేసె
నాంగ్లేయు లపరాధులైనను శిక్షింప
నెవఁడిచ్చె నధికార మిచటిప్రజకు
పరదేశముననుండి సరకులు తెప్పింప
కిచటివృత్తు లెవఁడు వృద్ధిపఱిచె
నుప్పుమీఁదను పన్ను నొకకొంత తగ్గించి
యెవఁడు బీదలకష్ట మింకఁజేసె !
నెవఁడు వృత్తాంతపత్రికకిచ్చె స్వేచ్ఛ
నెవఁడుయత్నించె విద్యాభివృద్ధిగూర్ప
నట్టిఘనుఁడు రిపన్ప్రభు వరుగుదెంచు
నేఁడు మనరాజధానికి నెలఁతలార.

ఉ. కావున నిట్టిగొప్పయుపకారము లెన్నియొ చేసినట్టియా
ధీవిభవున్ నృపప్రతినిధిన్ మన మెల్లను గాంతలార ! సం
భావనచేసి మంగళముపాడి కృతజ్ఞతఁ జూపఁ జెల్లుఁ బ్రేము
న్నావరపాలకున్ మనకు నంపినవారలయందుఁ గూరిమిన్.

నాదనామక్రియ రాగము—చాపుతాళము

పల్లవి—మంగళమ్-మహీపాలచంద్రా! మంగళమ్

అనుపల్లవి—మంగళమ్ కరుణాంత ♦ రంగ దుర్జనభంగ
రంగదఖిలమహా ♦ రాజసంసేవితా. మంగళమ్.

చరణములు-1. శ్రీరిపన్ ప్రభునకు ♦ ధీరునకు నతని
దారకు విమలవి ♦ చారకు ఘనసుకు
మారున కతనికు ♦ మారునకును మిత్ర
వారమునకు బంధు ♦ వర్గంబునకు నిల. మంగళమ్.

2. అవని శ్రీవిక్టోరి ♦ యా మహారాజ్ఞికి
యువరాజున కతని ♦ యువతికి సుతలకు
సువివేకులకు రాణి ♦ సుతులకు సుతలకు
సవినయులగు వారి ♦ సతులకుఁ బతులకు. మంగళమ్.

3. ఈమహాప్రభువరు ♦ నిచటకుఁ బంపిన
ధీమంతులగుమంత్రి ♦ తిలకుల కచ్చటి
శ్రీమహాసభకును ♦ చెలఁగ నీదేశపు
క్షేమముచూచెడు ♦ స్థిరపుణ్యమతులకు. మంగళమ్.

కులాచారసంస్కార పూర్వనాగరిక పంచరత్నములు

సీ. పరులసొమ్ము హరింపఁ బన్నినకర్మలు
వెలయువంచును విలపించునొకఁడు
జనులమూఢులఁజేయ నొనరించుకృషియెల్లఁ
జెడిపోయెడునటంచు నడలునొకఁడు
వలదు విద్యయటంచుఁ బలువుఁజేయఁగనెంచు
వనితచదువునంచు వగచునొకఁడు
తలగొఱిగించి వెతలఁబెట్టఁగఁదలంచు
నింతి సుఖించునంచేడ్చునొకఁడు
పసితనంబుననే పెండ్లి పొసఁగకున్నఁ
గూఁతు నెట్లమ్ముకొనునంచుఁ గుందునొకఁడు

వీరు పూర్వనాగరికులా పెద్దలిపుడు
దుష్కులాచార రక్షణోద్యోగులకట. 1

సీ. మగఁడుపోయిన భామ మరలఁ బెండ్లాడుచో
సొత్తుదక్కదటంచు సోలునొకఁడు
పతిపోయినయువతి పరిణీతయైనచోఁ
బనిక త్తెలేదంచు వనరునొకఁడు
ధవుఁబాయుకాంత యుద్వాహంబునాడుచో
జారత్వమెట్లంచు సణగునొకఁడు
భర్తృహీనాంగన భర్తఁగైకొన్నచో
వ్రతములడఁగునంచుఁ గొతుకునొకఁడు
మృతపతికసాధ్విగా శిశుమేధయాగ
మూలదక్షిణపోనంచు మూల్గునొకఁడు
వీరుపూర్వనాగరికులా పెద్దలిపుడు
దుష్కులాచారరక్షణోద్యోగులకట ! 2

సీ. నీరజాక్షి చదువునేర్చుచో నరమాంస
విక్రయంబెట్లంచు వెఱచు నొకఁడు
మానవతి విదుషియైనచో వ్రేట్రినో
ములు పట్టుటెట్లంచుఁ బొక్కునొకఁడు
కమలాస్య సద్విద్యకఱచుచో ననుదేవు
నిగ్గనెంచుటెట్లంచుఁబొగులునొకఁడు
పికవాణి పాండితి మెరయుచో దెబ్బలు
పడుటయెట్లంచును బనుపునొకఁడు
హంసయానవిద్యావతి యయ్యెనేని
ప్రతిమలనుగొల్చుటెట్లంచుఁ బదరునొకఁడు

వీరు పూర్వనాగరికులౌ పెద్దలిపుడు
దుష్కులాచారరక్షణోద్యోగులకట ! 3

సీ. తరవాణిముందుగాఁ ద్రాగి శ్రాద్ధముపెట్టి
నిష్ఠాపరులమంచు నిక్కువారు
సంధ్యవార్చక చద్దిసాపాటుగావించి
కర్మిష్ఠులమటంచుఁ గవియువారు
కల్లుసంద్రములోది పేళ్లెన్నొవల్లించి
శాస్త్రవేత్తలమంచుఁ జాటువారు
కల్లుకంపడఁగంగఁ బెల్లుచుట్టలుద్రాగి
మాహితాగ్నులమంచు నడరువారు
న్యాయసభలయందుఁ దప్పుసాక్ష్యంబులిచ్చి
శిష్టజనవరిష్ఠులమంచుఁ జెలఁగువారు
వీరు పూర్వనాగరికులౌ పెద్దలిపుడు
దుష్కులాచారరక్షణోద్యోగు లకట ! 4

సీ. బాలరండలకాశపడి చెడి విధవల
పెండ్లిండ్లు వలదంచుఁ బ్రేలువారు
రాళ్లఁగొల్చుచుఁదూలి బ్రహ్మంబుసేవించు
వారె భ్రష్టులటంచు వదరువారు
కన్నకూఁతుల నమ్మఁగాఁగోరి బాల్యవి
వాహముల్ మేలంచు వాగువారు
చాటునఁగలుద్రాగి చనుదెంచి తేయాకు
నీ రానువారి నిందించువారు
స్త్రీలవంచించి మించిబాధింపనెంచి
యబలలకువిద్య కీడంచునఱచువారు
వీరుపూర్వనాగరికులౌ పెద్దలిపుడు
దుష్కులాచారరక్షణోద్యోగు లకట ! 5

దైవప్రార్థన

ఉ. శ్రీకరుఁ డాద్యుఁ డవ్యయుఁ డశేషచరాచరకారణుండు సు
శ్లోకుఁ డతీంద్రియుండు పరిశుద్ధుఁ డనంతుఁడు మోక్షదాత లో
కైక సమర్చనీయుఁ డతఁ డెవ్వఁడొ యాపరమేశ్వరుండు తా
మా కనయంబుఁ బ్రేమమెయి మంగళముల్ సమకూర్చుఁ గావుతన్.

సీ. అక్ష్యాదిబాహ్యేంద్రియాగోచరుండయి
యాత్మస్వరూపుఁడై యలరువాఁడు
నచరాచరంబైనసర్వసృష్టికి నాది
కారణుండయి చాలఁ గ్రాలువాఁడు
దుష్టశిక్షణమును శిష్టరక్షణమును
నాత్మకృత్యములుగ నమరువాఁడు
సర్వజ్ఞుఁడై యుండి జను లెందుఁ గావించు
సుకృతదుష్కృతములఁ జూఁచువాఁడు
నిత్యుఁడీశ్వరుఁ డభవుండు నిర్మలుండు
మాదుపత్రికారత్నంబు నాదరమునఁ
బ్రబలఁగాఁజేసి యెల్లెడవాసికెక్క
నించుకంతదయ ననుగ్రహించుఁగాత.

క. పాపమిది పుణ్యమిదియని
యోపికఁదెలియంగఁగోరు యోగ్యుల కెపుడుం
బ్రాపై చూపెడుదేవర
మాపత్రికఁజదువువారి మనుచుంగృపతోన్.

సీ. ఎవ్వనియిచ్ఛమై నెల్లజగమ్ములుఁ
గలుగుచు వెలయుచుఁ బొలియుచుండు

ఎవ్వనికట్టెడ నేప్రొద్దు నీడువక
విన్ననతికోలు ప్రేలుచుండు
నెవ్వని గోనముల నెంతవలంతులుఁ
గడముట్టఁ దెలియంగఁ గానకుండు
నెవ్వని ధ్యానశ్రీ నించుకైనను మేలి
మీఱక సంద్రముల్ మించినిలుచు
నెవ్వఁడాకసంబున నేల నెల్లనీళ్ళ
మెలఁగుపులుఁగుల మొగములమీలగముల
ఎగసరోవరంబుఁ గలిగించి నెగడఁజేయు
నట్టిదేవర మమ్ముఁ జేపట్టుఁగాత.

పంచచామరము.

తలంచుచుండు మెచ్చు మానుతప్పులెల్ల లోఁగొనన్
జెలంగి తప్పుదారిఁ ద్రొక్క చెడ్డవారిఁ బ్రుంచుచుం
దలంకు లేక మించి మంచివారియందె నిచ్చలున్
మెలంగుచుండువారి మంచుమేటి వేలుపుం దగన్.

మణిగణనికరము.

తుదమొద లోదవనిదొరఁ గొలుతుము మా
మొదలను బాదలెడు నెలమికలిమిమైఁ
గొదవలఁ దడవగ కొడుకులనువలెన్
బదిలముగ నరసి పలుసిరు లొసఁగన్.

ఉ. ఎవ్వఁడు జంతుసంతతుల నెంతయు బ్రేమనుగాచుచుండుఁ దా
నెవ్వఁడు నైజతేజమున నెల్లెడఁ బెల్లుగనిండియుండు దా
నెవ్వఁడు సాధుసంఘముల కెప్పుడు భుక్తిని ముక్తినిచ్చుఁ దా
నెవ్వఁడు నిర్వికల్పుఁ డలయీశ్వరుఁ గొల్చెద మిష్టసిద్ధికిన్.

క. చేసితి మఘంబులెన్నియొ । చేసితి ముద్ధతులతోడి స్నేహము నెన్నన్
దోసములు లేవె మాకడ । గాసిలనీక మము నేలు కారుణ్యనిధీ.

సీ. తనకృపారసవృష్టి దాసులతాపంబు
లణఁగించి నిగడింపు ఘనుఁడె వండు
తనదివ్యతేజంబునకు భక్తజనతమో
నిచయంబు మాయించునినుఁ డెవండు
తనశీతలాలోకమునఁ గువలయమును
వెలయించుచల్లని వేలుపెవఁడు
తనజగద్వ్యాపకత్వంబుమై లోకాళిఁ
బాలించు నలజగత్ప్రాణుఁడెవఁడు
అట్టిపరమేశ్వరుండు దయాసముద్రుఁ
డాదరాయత్తచిత్తుఁడై హార్షమెసఁగ
మాదువిన్నపమాలించి మఱచిపోక
మమ్మునని శమ్మునుభృశమ్మునుచుఁగాత.

హితబోధ

ఉ. కారణయుక్తమ్మానటులు కావ్యవిమర్శ్యమాచరింపఁగా
నోరువలేక కూళకవియొక్కఁడు నోరికివచ్చునట్లు దాఁ
గారణహీనమైనవెడకాఱు లటంచును వానిఁ బ్రేలు ని
ష్కారణ మాత్మదోషములు చాల బయల్పడె నన్నచింతచేఁ.
క. తనపుస్తకమే సత్కృతి। యనుకొని గుణదోషములను నారయువారిన్
వినరానికాఱు లఱచెడి। జనకంటకు మించునట్టిజడుఁ డిలఁగలఁడే ?
చ. కతిపయమిత్రసత్తములఁ గాంచి కడుం బొగడించుకొంటనే
యతులితసత్ప్రబంధ మగు నాచెడుపొత్తక మెన్నఁడేనియున్ ?
నుతు లొకలక్షమానుసులు నోరికి వచ్చినరీతిఁ జేసినన్
శ్రుతికటు శకం బొకప్పుడును సింహము గాఁగలదే గుణప్రథన్ ?

అవంతీ ప్రెస్ - రాజమండ్రి.